శ్రీసరస్వత్యై నమః

శ్రీమజ్జటప్రోలుసంస్థానాధీశ్వర

శ్రీసురభిమాధవరాయప్రణీతంబైన

చంద్రికాపరిణయము

శ్రీవెల్లాల సదాశివశాస్త్రి, అవధానం శేషశాస్త్రులవారి

‘శరదాగమ’ వ్యాఖ్యాసమేతము

(జటప్రోలు సంస్థానాధీశ్వరులు శ్రీరాజా వేంకటలక్ష్మారావు బహద్దరుగారు క్రీ.శ.1904, 1928 సంవత్సరములలో ముద్రింపఁజేసిన సవ్యాఖ్యానప్రతులును, క్రీ.శ.1982లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు ప్రచురించిన మూలప్రతులలోని విషయమును యథాతథముగా గ్రహించి, డా. తిరుమల కృష్ణదేశికాచార్యులచేత అంతర్జాలములో ప్రదర్శన కనువుగా పోతన యూనికోడు లిపిలో మైక్రోసాఫ్టు వర్డులో పునర్లిఖింపబడిన ప్రతి)

ఉపోద్ఘాతము

(శ్రీకేశవపంతుల నరసింహశాస్త్రి“శిరోమణి” గారు 1982లో ఆంధ్రప్రదేశ్ సాహిత్యఅకాడమీ ప్రచురించిన మూలప్రతికి వ్రాసినది)

(సువర్ణాక్షతలు)

కవుల ప్రతిభావ్యుత్పత్త్యభ్యాసములను బట్టియు, వారివారి యభిరుచులు, సంస్కారములు, స్వభావములను బట్టియు కావ్యములు సామాన్యముగాను, ప్రౌఢములుగాను, ప్రౌఢతమములుగాను రూపొందుచుండును. అవి చదువువారి యంతస్తులను బట్టి యర్థమగుటయు, ఆదరపాత్రము లగుటయు జరుగుచుండును. సుమతి, వేమన శతకములు మొదలుకొని ‘ఆముక్తమాల్యద, వసుచరిత్ర’ల వరకుఁగల కావ్యజాత మంతయు నిట్టి సోపానక్రమములోనే సహృదయుల యాదరమును బొందుచు నాంధ్రసరస్వతి కలంకారప్రాయమై యున్నది. అట్టివానిలో ప్రౌఢతమజాతికిఁ జెందినట్టిది యీ చంద్రికాపరిణయము. దీని యంతస్తును గురించి విద్వత్సార్వభౌములు, పండితకవులు నగు బ్ర॥శ్రీ॥ వేదము వేంకటరాయశాస్త్రులవారు ఈక్రిందివిధముగాఁ దమ యభి ప్రాయము నొసఁగినారు.

“శ్రీమత్కొల్లాపురీ సంస్థానాధీశ్వరులలో ప్రాక్తనులైన శ్రీమాధవరాయనివారు రచించిన చంద్రికాపరిణయంబను ప్రాచీన గ్రంథమును ముద్రాక్షరాంకితముగాఁ గనునట్టి భాగ్యము నేఁటికొదవినది. వసుచరిత్రకన్న శ్లేషగాంభీర్యంబు గలిగి రసనిష్యందనంబున విజయవిలాసముం బురణించుచు కల్పనాప్రౌఢియందు ఆముక్తమాల్యదం దలఁపించుచు అటనట న్యాయవైశేషికాది శాస్త్రమర్యాదల ననుసంధించుచు నుండు నీయతిప్రౌఢప్రబంధము వ్రాఁతపుస్తకములలో బహుదోషముల పాలయి యుండినది. దీనియర్థమును భేదించుట సామాన్యపండితులకును అశాస్త్రజ్ఞులకును శక్యముగాదు. అట్టి యీ కఠినగ్రంథమును విద్వత్సార్వభౌములగు శ్రీమద్వెల్లాల సదాశివశాస్త్రి, శేషశాస్త్రులవారలు చేపట్టినందున దీనికి సమంజసమైన వ్యాఖ్య నిష్పన్నంబయి, యిది పండితులకు సుఖముగా నాస్వాదనీయం బయినది. ఇట్టి యీకావ్యమునకు వీరిచే వ్యాఖ్య చేయించి ముద్రింపించిన ప్రభువులకు శాశ్వతకీర్తియు, ఆంధ్రపండితులకు వారింగూర్చి యఖండకృతజ్ఞతయు పృథివియందు నెలకొన్నవి.”

మదరాసు 8-11-04 వేదము వేంకటరాయశాస్త్రి

శ్రీకవిసార్వభౌములగు మ.రా.రాజశ్రీ రావుబహద్దరు కందుకూరి వీరేశలింగం పంతులవారిచ్చిన యభిప్రాయము.

“తాము దయతో నంపిన శ్రీకొల్లాపురాధీశ్వర మాధవరాయకృత చంద్రికాపరిణయమును నే నక్కడక్కడఁ జదివి చూచితిని. మూలము వసుచరిత్రమువలె శ్లేషభూయిష్ఠమయి మృదుపదఘటితమయి యత్యంతప్రౌఢముగా నున్నది. శ్రీమద్వెల్లాల సదాశివశాస్త్రులవారిచేతను, అవధానము శేషశాస్త్రివారిచేతను రచియింపఁబడిన వ్యాఖ్యానము సామాన్యముగఁ బండితులకు సహితము దురవగాహములుగా నుండు మూలభాగముల యర్థతాత్పర్యములను స్పష్టముగా వివరించునది యయి, వారి యసమానపాండిత్యమును వెల్లడించుచు సర్వవిధముల శ్లాఘాపాత్రమయి లోకోపకారార్థముగాఁ జంద్రికాపరిణయమును ముద్రింపింపఁ బూనిన వర్తమాన కొల్లాపురాధీశ్వరులగు సురభి రాజా వేంకటలక్ష్మారావు బహద్దరుగారికిఁ గీర్తిదాయకమయి యున్నది. ఈ సవ్యాఖ్యాన చంద్రికాపరిణయ మాంధ్రమండలమునం దంతట వ్యాపించి శాశ్వతముగా నెలకొనుఁగాక!

ఇట్లు విన్నవించు భవద్విధేయాప్తుఁడు

కందుకూరి వీరేశలింగము

శ్రీకేశవపంతుల నరసింహశాస్త్రిగారి ఉపోద్ఘాతము

పై రెండభిప్రాయములవలన నీకావ్య మెంత ప్రౌఢతమమో స్పష్టమగుచున్నదికదా! కనుకనే కీ.శే. జటప్రోలు (కొల్లాపురం) సంస్థానాధిపతులగు శ్రీశ్రీ సురభి రాజా వేంకటలక్ష్మారావు బహదర్, రాజానవాజ్ వంతుగారు, తమ యాస్థానపండితులగు అవధానం శేషశాస్త్రులు, వెల్లాల సదాశివశాస్త్రులవారిచేత తమయభీష్టానుసారముగా రచింపఁబడిన శరదాగమసమాఖ్యవ్యాఖ్యాసహితముగాఁ జంద్రికాపరిణయమును క్రీ.శ. 1928లో రాజమహేంద్రవరం లలితాప్రెస్సునందు బ్ర.శ్రీ. చదలువాడ సుందరరామశాస్త్రులవారి పర్యవేక్షణమున ముద్రింపించిరి. అట్టి చంద్రికాపరిణయప్రతులు ప్రస్తుత మాసంస్థానమువారియొద్దనే యేకొన్నియో యున్నవి. అందఱికిని అందుబాటులో లేవు.

అందువలన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు ఇట్టి యున్నతస్థాయికి జెందిన మహాకావ్యము బహుళవ్యాప్తినిఁ బొందవలయునన్నచో ప్రతులు మూలమాత్రములైనను సాహిత్యప్రియుల కరకమలములం దుండుట యావశ్యకమని యెంచి విపులమగు పీఠికతోఁ గూడ దీని పునర్ముద్రణమునకుఁ బూనుకున్నారు. మూలమునందలి పద్యములను ఆధునికములగు విరామచిహ్నములతో నందించినచో వ్యాఖ్యానము లేకున్నను విజ్ఞులగువారు పద్యభావములను గ్రహింపఁగలరని యట్లు చేయఁబడినది. ఇంత కఠినకావ్యము నెవ్వ రర్థము చేసికొనఁగల రన్నది సరియైన ప్రశ్న కాదు. ఇంతకఠినమని తోఁచునట్లు పద్యములు వ్రాయఁగల కవి యున్నప్పు డాపద్యముల నర్థము చేసికొని యానందింపఁగల్గువారును లభింపఁగలరు. ఇంతకు ఉత్కృష్ట భాషాపాండిత్యమర్యాదలు గల్గి సాహిత్యమంజూష లనఁదగిన మహాకావ్యములు లుప్తప్రాయములు గాకుండునట్లు వానిని పౌనఃపున్యముద్రణములచేత రసజ్ఞుల కందించుట సాహిత్యసంస్థలు చేయవలసినపని గదా! సరిగా సాహిత్య అకాడమీ అట్టి యపరిహార్యమగు విధినే నిర్వర్తించుచున్నది.

ఆధునికకాలమున వివిధసంస్కృతులతోను వివిధభాషలతోను సంబంధ మేర్పడియున్నప్పటికిని, కవితారచనలోని వివిధప్రక్రియలలో పద్యమున కున్న ప్రాధాన్యము పద్యముదే. దానివలె స్వతంత్రముగా జిహ్వాగ్రమున నిలిచి మానవుని నైతిక ధార్మిక సాంస్కృతికాద్యనుభూతులను నెమరువేయింపఁ గల శక్తి వచనాదిప్రక్రియలకు లేదు. కనుక పద్యమును వదలుట గాని వ్రాయమానుట గాని వాంఛనీయము గాదు. ఈనాటికిని సుమతి వేమన శతకములకును మరికొన్ని చాటువులకును సంస్కృత శ్లోకములకును గల ప్రాచుర్యము తిరస్కరింపరానిదికదా! అయితే పద్య మెట్టిపదజాలము కలిగియుండవలెను? ఎట్టి భావసంపద యుండవలెను? యెట్టిశైలి కావలెను? అన్న ప్రశ్నలు రచయితయొక్కయు, అతనిరచన నర్థముఁజేసికొనఁగలిగిన సహృదయుని యొక్కయు శక్తికిని అభిరుచికిని మాత్రము సంబంధించినట్టివే కాని యెవరంటే వారికి సంబంధించినవి కావు.

కనుక 'ఉత్పత్స్యతే మమతు కోఽపి సమాన ధర్మా, కాలోహ్యయం నిరవధి ర్విపులా చ పృథ్వీ' అను భవభూతిమహాకవి యభియుక్తోక్తిని పురస్కరించుకొని శ్రీ సురభిమాధవరాయ రాజకవి యీచంద్రికాపరిణయప్రబంధమును రచించెను. ఇందున్న పదప్రయోగవిశేషములను, భావపరీమళమును, రసఝరీమాధుర్యమును, శ్లేషయమకచమత్కృతిని, అలంకారశోభను, ఇంకను తత్తద్గుణవిశేషములను దెలిసికొని సహృదయు లానందింతురుగాతమని యకాడమీవారు దీని పునర్ముద్రణమునకుఁ బూనుకున్నారు. యథాశక్తిగా నీకావ్యశోభను దిఙ్మాత్రముగాఁ జూపు పీఠికను రచించుటకై నన్నాదేశించినారు. ఈ బృహత్తర కార్యమున కల్పజ్ఞుఁడ నగు నన్ను బ్రేరేపించుటకు ముఖ్యకారణము శ్రీ సురభి మాధవరాయల వంశీయులగు రాజులకు భారత స్వాతంత్ర్యలబ్ధికిని, సంస్థానవిలీనములకును అతిసన్నిహితమగు కాలమువరకు రాజధానియై, ఇప్పటికిని మహబూబునగర మండలమునఁ దాలూకాకేంద్రమై యున్న కొల్లాపురముతో నాకు సన్నిహితసంబంధ ముండుటయు, నాజన్మస్థాన మా తాలూ

కాయందే యుండుటయు ననుకొందును. కారణ మేది యైనను నేను ధన్యుఁడను. ఈపనికి నియోగించిన సాహిత్య అకాడమీ కార్యదర్శికిని యితరసభ్యులకును గృతజ్ఞుఁడను.

రసజ్ఞశేఖరులారా! చంద్రికాపరిణయదర్శనకౌతూహలమనస్కులారా! సహృదయులారా! రండు, 'కవి-కాలము, కవితావైదుష్యము, కథాసంవిధానము' అన్న విభాగములతో శ్రీమాధవరాయ కవిమూర్ధన్యుఁడు మనకై సిద్ధపరచియుంచిన పద్యపాత్రలయందలి కావ్యామృతమును మనసారఁ గ్రోలి యానందింతము రండు.

కవి-కాలము

భారతదేశస్వాతంత్ర్యలబ్ధికిఁ బూర్వమునఁ బాశ్చాత్యుల పరిపాలనలో నుండిన యాంధ్రప్రాంతమందును, నిజాం పరిపాలనలో నుండిన తెలంగాణమునందును నిలిచియుండిన సంస్థానములు, జమీందారీలును జేసిన కళాపోషణము, సాహిత్యసేవయు మరువఁదగినవి కావు. తెలుఁగునాట వెలసిన దేవతావిగ్రహ, దేవాలయశిల్పములు, సంస్కృతాంధ్రకావ్యములు మొదలగు సంస్కృతిచిహ్నము లన్నియు శాతవాహన, విష్ణుకుండిన, కాకతీయ, చాళుక్యాదివంశములకుఁ జెందిన రాజులచేతను, రాణులచేతను, శ్రీకృష్ణదేవరాయ, అనవేలమహీపాల, సర్వజ్ఞసింగభూపాలాది ప్రభువులచేతను నిర్మింపఁబడి, ఈనాటి మన ఘనతకును, సంస్కృతికిని వన్నెలుదిద్దుచున్న విషయము సర్వజనవిదితము. వారిలో సర్వజ్ఞసింగభూపాలుని వంశమునకుఁ జెందినరాజు శ్రీ సురభి మాధవరాయలు.

చ. వికలిత పంకజాత నవవిభ్రమమై, ఘన గోత్ర తాభిభూ
త కమఠనాథమై, యరుణధామ విభాసితమై, ద్విజోత్తమ
ప్రకటిత హార్దయోగభర భావుకమై, ధరయందుఁ 'బద్మనా
యక కుల' ముద్భవించె నట, నాత్మజనుష్పద తుల్యవైఖరిన్.

అని చంద్రికాపరిణయ పీఠికాభాగమునందలి 18వ పద్యమున వర్ణింపఁబడిన పద్మనాయకకులమున (వెలమవారని ప్రసిద్ధినిఁ గన్న కులమున) వీరికి మూలపురుషుఁడైన పిల్లమఱ్ఱి బేతాళనాయఁ డుద్భవించెను (ఈయన జన్మనామము చెవ్విరెడ్డి). కాకతీయ గణపతిదేవచక్రవర్తివద్ద సేనానాయకుఁడుగా నుండి కాకతీయసామ్రాజ్యమున కెనలేనిసేవఁ జేసిన యీ బేతాళనాయని వారిని, రేచర్లగోత్రమువా రందఱును – అనఁగా వేంకటగిరి, బొబ్బిలి, పిఠాపురం, జటప్రోలు, మైలవరం మొదలగు ముప్పది యాఱు (36) వంశములవారు తమ మూలపురుషునిగా భావించుచున్నారు. నేటికిని జటప్రోలు (కొల్లాపురం) శరన్నవరాత్రోత్సవ సందర్భమున నీ బేతాళనాయనికి బలిని, పూజలను జరిపించుచున్నారు. 'రేచర్ల' యనునది బహుశ చెవ్విరెడ్డి జన్మస్థానమగు గ్రామము. దానినే వీరందఱు గోత్రనామముగా స్వీకరించి యుందురు. పల్నాటియుద్ధమున సుప్రసిద్ధుఁడైన రేచర్ల బ్రహ్మనాయఁడు ఈ బేతాళనాయని మనుమఁడు. బేతాళనాయనికి నల్లగొండ మండలమునందలి రాచకొండ, దేవరకొండ గ్రామములు రాజధానీనగరములై యుండినవి. ఈతని వంశమునందు పదవతరమువాఁడు 'సర్వజ్ఞ' బిరుదభూషితుఁడై, సాహిత్యక్షేత్రమున సుప్రసిద్ధుఁడై, శ్రీనాథాది మహాకవులను సత్కరించిన సింగభూపాలుఁడు. 'రసార్ణవసుధాకరము' (సింగభూపాలీయమను నామాంతరము గల అలంకారశాస్త్రగ్రంథము), సంగీతరత్నాకరవ్యాఖ్య (దీనికి సంగీతసుధాకరము అని పేరు, ఇది నిశ్శంకశార్ఙ్గదేవుని సంగీతరత్నాకరమునకుఁ గల వ్యాఖ్యలలో నుత్తమ మైనదని విద్వాంసులు మెచ్చుకొనిరి), రత్న

పాంచాలిక (ఇది కువలయావలి యను నామాంతరము గల నాలుగంకముల నాటిక) యిప్పటికి లభించిన యితని కృతులు. ఈ రాజేంద్రుని కావ్యలక్షణములను మహామహోపాధ్యాయ మల్లినాథసూరి తన వ్యాఖ్యానములలోఁ బ్రమాణీకరించెను. ఈ సింగభూపాలునిఁ జంద్రికాపరిణయ మిట్లు ప్రశంసించినది.

సీ. అరిపుర భేదనాయత దోర్బల స్ఫూర్తి, నవరాజవర్ధన వితత కీర్తి,
కనదహీనాంగద కలితబాహాలీల, ఖండితాహిత ఘనాఘన విహేల,
సద్గణరక్షణ క్షమ చరణాసక్తిఁ, బటుచంద్రకోటీరభా నిషక్తిఁ,
దత సర్వమంగళాంచిత గాత్ర రుచిపాళి, నచల ధర్మోన్నత ప్రచయకేళిఁ,
తే. బ్రకట దుర్గాధినాయకభావ భూతి, వైరి దర్పకదాంబక వహ్నిహేతి,
నవనిఁ బొగడొందె 'సర్వజ్ఞుఁ' డనఁగ సింగ,ధరణిభృన్మౌళి తీవ్రప్రతాపహేళి.

సింగభూపాలుఁడు విద్యావిశారదుఁడై రసార్ణవసుధాకరాది గ్రంథప్రణేతయై 'సర్వజ్ఞుఁ' డను బిరుదమును గాంచియుండఁగా, అరిపురిభేదన, నతరాజవర్ధన, అహీనాంగదకలనాది శ్లిష్టవిశేషణ రూపణాదులచేత నీశ్వరునిఁబోలిన సర్వజ్ఞుఁడని కవి యీ పద్యమున వర్ణించెను. మరియు,

తే. అర్థి సాత్కృత సురభి, పరాళి సురభి,
సుగుణవల్లీ ప్రకాండైక సురభి, కీర్తి
జిత సురభి, శౌర్యసురభి నా సింగనృపతి
పరగఁ దద్వంశమును గాంచె సురభిసంజ్ఞ.

యాచకాధీనముగాఁ జేయఁబడిన సువర్ణముగలవాఁడును, శత్రువులనెడు తుమ్మెదలకు సంపెంగ యైనవాఁడును, సుగుణములనెడు తీగలకు వసంతుఁడైన వాఁడును, కీర్తిచేత జయింపఁబడిన కామధేనువుగలవాఁడును, శౌర్యపరిమళముగలవాఁడు నగు సింగభూపాలుఁ డుదయించటచేత నతనివంశమునకు 'సురభి' యను పేరు ప్రసిద్ధమై యున్నదని చెప్పెను. వస్తుతః సురభి యను గ్రామమునం దీవంశమువా రుండియుండుటచేత వీరి యింటిపేరు 'సురభివార' ని వచ్చినదని యైతిహాసికులు విశ్వసించుచున్నారు. ఈరాజకవి పెదకోమటి వేమభూపాలునికి సమకాలికుఁడై గ్రంథరచనయందును విద్వత్పోషణమునందును నతనితో స్పర్థ వహించి యుండెనని విమర్శకులు భావించుచుండుటచేత నితఁడు క్రీ.శ. 1403 మొదలు క్రీ.శ. 1430 వరకును, తరువాత మరికొంత కాలమును జీవించియుండె నని మనము భావింపవచ్చును.

ఇట్లు విస్తరించుచు వచ్చిన రేచర్లగోత్రజులగు జటప్రోలు సురభివారికి, బేతాళనాయనికిఁ బదిమూడవ (13) తరములవాఁడగు మాదానాయఁడు శాఖామూలపురుషుఁడు. వీరు నల్లగొండ, దేవరకొండ ప్రాంతములందే యేలుబడిని సాగించుచు నుండి తరువాతి కాలమున జటప్రోలును రాజధానిగా నేర్పరచుకొన్నారు. జటప్రోలుకు సమీపమందున్న చిన్నమరూరు, బెక్కెం, పెంట్లవల్లి, వెల్లూరు గ్రామములలోఁ గోటలు గట్టి, తటాకములు వేయించి, దేవాలయములు కట్టించి, దేవతాప్రతిష్ఠలును జేసి, సుమారు రెండువందల సంవత్సరముల క్రింద ప్రస్తుతము రాజధానీనగరముగా నున్న కొల్లాపురమునకుఁ జేరిరి. అయినను

వీరికి జటప్రోలు సంస్థానమువారన్న వ్యవహారము నైజాం రికార్డులలోను కొంతవరకు ప్రజలలోను నేటికిని నున్నది. పై మూల పురుషుని గురించి యొక పూర్వకవి యిట్లు వ్రాసెను.

ఉ. శ్రీలలరంగఁ బాండ్యగజసింహుఁడుగా నచలంబు పెంపునన్
లాలిత పట్టభూషణ లలాటము సూరనరేంద్రు మాధవుం
డాలములోన నశ్వమున కాదటఁ బెట్టినఁ జెల్లుఁగాక తా
జాలిని బూని యబ్బిరుదు చయ్యన నన్యులు పెట్టఁ జెల్లునే?

ఈమాధవుఁడే మాదానాయఁడు. ఇతని తండ్రిపేరు ఎఱ్ఱసూరానాయఁడని యీపద్యము తెల్పుచున్నది. (వెలుగోటివారి వంశ చరిత్ర. పుట 75)

అతని తరువాత పదునాల్గవ తరము (14) వాఁడైన మల్లానాయఁడు లేదా కుమార మాదానాయఁడు క్రీ.శ.1527లో ఆనెగొంది రామదేవరాయలవలన జటప్రోలు సంస్థానమును పారితోషికముగఁ గొని, విజయనగరసామ్రాజ్యమునకు సామంతరాజై యేలుబడిని సాగించెను. జటప్రోలు నగరమునందు మదనగోపాలస్వామి దేవాలయమును గట్టించి, స్వామిని ప్రతిష్ఠించి, పక్షోత్సవ, బ్రహ్మోత్సవాదుల నేర్పాటు చేసెను. ఆయన తరువాత పెద్దినేఁడు పదునైదవతరము (15)వాఁడు. ఈ పెద్దినేనినే, చంద్రికాపరిణయము 'పెద్దశౌరి, పెద్దవసుమతీకాంతుఁడు, పెద్దనృపతి' యని పేర్కొని, యతఁడు గొప్ప పరాక్రమశాలియగు అశ్వరేవంతుఁడనియు, సర్వజ్ఞసింగభూపాలుని వంశమున నుద్భవించిన సురభివారి మూలపురుషుఁ డనియుఁ జెప్పుచున్నది. ఇచ్చట మాదానాయనిఁగాక పెద్దినేనిని శాఖామూలపురుషునిఁగాఁ బేర్కొనుటకు గారణము చంద్రికాపరిణయరచనాకాలమున లభించిన శాసనాద్యాధారములై యుండునని యూహింపనగును. ఆ పెద్దనృపాలునికి వల్లభాంబ యను పత్నియందు మల్లనాయఁడు జనించెను. ఇతఁడు జటప్రోలువారి పూర్వులలో మొదటి మల్లభూపాలుఁడు. ఇతనికిఁ జెన్నాంబయందుఁ బుట్టిన కుమారునికిఁ బెద్దమల్లానాయఁడని నామధేయము (ఇతఁడు రెండవ మల్లభూపాలుఁడు). ఇతఁడు మహాపరాక్రమశాలియు, దాతయు నై యుండినట్లు చంద్రికాపరిణయము వర్ణించినది. ఈ మల్లానాయని కుమారుఁడును మల్లభూపాలుఁడే (ఇతఁడు ముమ్మడి మల్లానాయఁడు, ఈపేరుగలవారిలో మూఁడవవాఁడు). ఇతనికి చెన్నాంబ, తిరుమలాంబ, మల్లాంబిక, అనంతమాంబిక యను నలుగురు భార్యలు.

ఉ. ఆవామామదనుండు మల్లవసుధాధ్యక్షుండు దచ్చెన్నమాం
బావామేక్షణయందు రామవిభునిన్, మల్లావనీవల్లభున్,
శ్రీవాసేక్షణ! నిన్నుఁ, మల్లమయెడన్ గృష్ణాధిపున్, మేదినీ
రావున్ గాంచె, నచంచలప్రమదసాంద్రా! మాధవక్షోణిపా!

అను చంద్రికాపరిణయ పద్యమువలన ముమ్మడిమల్లభూపాలునికి చెన్నాంబ యను భార్యయందు రామరాజు, మల్లనృపతి, చంద్రికాపరిణయకర్త యగు మాధవరాయలును జన్మించిరనియు, మల్లాంబికయందు కృష్ణభూపాలుఁడు, మేదినీరావు అను నిద్దఱు కుమారులు గల్గిరనియుఁ దెలియుచున్నది. కాఁగా వీరు సోదరపంచకముగా నుండి మాధవరాయల కిద్దరన్నలును,

ఇద్దఱుతమ్ములును నుండిరని విశదమగుచున్నది. వీరిలోని మల్లనృపతిని వర్ణించుపట్టునఁ జెప్పిన 'అనుపమ మల్లికార్జున యశోంచితుఁడైన కుమారమల్లనావనిపతి' యను పద్యభాగమువలన నీవంశమువారికి శ్రీశైల మల్లికార్జునస్వామి యిష్టదైవమై యుండినట్లు తెలియుచున్నది. అందువలననే వీరిలో బెక్కండ్ర నామధేయములు పెదమల్లభూపాలుఁడు, చినమల్లభూపాలుఁడు, లింగభూపాలుఁడు, లింగాంబిక మొదలగు రీతిగా నుండుటకుఁ గారణమైనది. రేచర్లవారందరికినిఁ గూటస్థుఁడుగా భావింపఁబడుచున్న అనపోతమహారాజు శ్రీశైలమునకు సోపానములు గట్టించినట్లు 'యశ్చారు సోపానపథేన చక్రే శ్రీపర్వతం సర్వజనాంఘ్రిగమ్యమ్' అని రసార్ణవసుధాకరమునఁ గల శ్లోకభాగమువలన పైవిషయము దృఢీకృత మగుచున్నది. తరువాతి కాలమున నీరాజులు వైష్ణవభక్తులు నై సర్వమతసామరస్యమును బాటించిరి.

పై ముమ్మడి మల్లభూపాలుఁడే చంద్రికాపరిణయకర్త యగు మాధవరాయలకుఁ దండ్రి. తండ్రియగు మల్లభూపాలునిపై విశేషమైన భక్తి గలిగియుండిన సురభిమాధవరాయలు భర్తృహరి సుభాషితశతకత్రయిని 'మల్లభూపాలీయము' అను పేరున నాంధ్రీకరింపు మని మహోపాధ్యాయ యెలకూచి బాలసరస్వతికవిని ప్రార్థించుటయు, నతఁడు దానిని మల్లభూపాలున కంకితము చేసి 'సురభిమల్లా నీతివాచస్పతీ!', 'సురభిమల్లా మానినీమన్మథా!', 'సురభిమల్లా వైదుషీభూషణా!' యను మకుటత్రయముతో నీతి శృంగార వైరాగ్య శతకముల ననువదించుటయు జరిగినది. బాలసరస్వతీమహోపాధ్యాయుని కనేకసత్కారములు ధనకనకవస్తువాహనములను మాధవరాయలవా రిచ్చియుండినట్లు ఈక్రిందిపద్యము మొదలగు మల్లభూపాలీయరచనలవల్ల స్పష్టపడుచున్నది.

శా. శ్రీమద్బాలసరస్వతీ ప్రకటలక్ష్మీహేతువై, శాంతమై,
ఆమోదావహమై, నిజానుభవవేద్యంబై, అనేహోదిగా
ద్యామేయ ప్రవిబోధ రూపమహితంబై యొప్పు తేజంబు, ప్రా
పై మీకున్ సిరులిచ్చుతన్ సురభిమల్లా! నీతివాచస్పతీ!

అట్లు తనతండ్రి కంకితముగా భర్తృహరిసుభాషితముల ననువదింపఁ జేయుటయే కాక సింగపట్టణక్షేత్రమున 'నృసింహసాగర' మను గొప్ప తటాకమును, మంచాలకట్టగ్రామమున మాధవస్వామి దేవాలయమును, జటప్రోలునగరమున శివాలయమును శ్రీమాధవరాయలవారు కట్టించిరి. శ్రీయెలకూచి బాలసరస్వతీ మహోపాధ్యాయుఁడు బాలసరస్వతీయముయొక్క పీఠికాపద్యములలో 'చంద్రాపరిణయాది సత్కృతిస్రష్టను' అని తననుగుఱించి చెప్పుకొన్నందున, నతఁడే యాచంద్రికాపరిణయకర్త యై యుండునని కొంద ఱనుమానించుచున్నారు. అంతకుఁదప్ప మరియొక ఆధారములేని ఆశంకను చర్చించుట యుక్తము కాదని మానివేసితిని. ఇంతకుఁ బేరులోనే వ్యత్యాస మున్నదికదా!

అన్నలు, తమ్ములు రాజ్యభారమును వహించియున్నందునఁ గాబోలు మాధవరాయలు విద్యావంతుఁడై, తర్కవ్యాకరణాది శాస్త్రముల నభ్యసించి, బహుకావ్యవేదియై, సాహిత్యప్రియుఁడై, విద్వత్కవిగాయకుల సాహచర్యము గల్గియున్నందునఁ గావ్యరచనకుఁ బూనుకొని యతిప్రౌఢప్రబంధమైన ఈ చంద్రికాపరిణయమును రచించెను. తీరుబడితోఁ గూర్చుని, యత్యంతమైన సామర్థ్యముచేత, నీ ప్రబంధమునందలి యొక్కొక్కపద్యమును వ్రాసి తజ్ఞులకు వినిపించుచు, వారు ఆహా! ఔరా! యెంత

బాగున్నది! యని మెచ్చుకొనుచుండఁగా నీకావ్యమును రచించుచుఁ బూర్తిచేసియుండు నని తోఁచును. ఆశ్వాసాంతగద్యలో 'నుభయభాషాకళత్ర' యని వేసికొన్న విశేషణము సర్వథా సత్యమని కావ్యము చాటుచున్నది.

శ్రీమన్మాధవరాయనింగారు విజయనగరసామ్రాజ్యమునకు విధేయులై శ్రీకృష్ణదేవరాయల యనంతర మా సామ్రాజ్యమును బెక్కువత్సరములు గాపాడిన అళియరామరాయలవారికి సమకాలికులు. తన పరిపాలనాకాలమున శ్రీరామరాయల సనదును గ్రొత్తచేయించుకొన్నవారు. రామరాజభూషణబిరుదాంచితుఁడగు బట్టుమూర్తి రచించిన వసుచరిత్రయు నితని చంద్రికాపరిణయమును సమకాలికరచనలని యెన్నియో అంతర్బహిస్సాక్ష్యములు గలవు. కాఁగా నీరాజకవి క్రీ.శ. 1530 నుండి క్రీ.శ. 1600వరకు జీవించియుండె ననియు, విజయనగరసామ్రాజ్యపతనము నెఱిఁగియుండె ననియు చెప్పుటకు వీలున్నది. శ్రీఅళియరామరాయలవలెనే మాధవరాయలును దీర్ఘాయుష్మంతుఁడై యుండినట్లు చంద్రికాపరిణయము సాక్ష్య మొసఁగుచున్నది.

> 'ఆ ధరాధీశు పిమ్మట నఖిలభూమి
> భరము నీవు ధరించితి కిరికులేంద్ర
> కమఠవల్లభ కులశైల కరటిసంస
> దురగనాథులతోడఁ బెన్నుద్ది వగుచు.'

కుమారమల్లభూపాలుని (ఇతని సోదరుఁడు) పిమ్మట మాధవరాయలు రాజ్యభారము వహించియుండినట్లు తెలుపుచున్నది. విజయనగరసామ్రాజ్యము తాళికోటయుద్ధమునందు (క్రీ.శ.1565) పతనమై తదుపరి క్షీణించుచుఁబోయిన కారణమున మాధవరాయల కడపటిదశలోను యనంతరమును జటప్రోలురాజ్యము ఖుతుబ్ షాహీల వశమై గోలకొండసామ్రాజ్యము క్రిందికి వచ్చెను. కనుకనే మాధవరాయని యనంతరమున నతనికుమారులకు 'సుల్తాన్ అబ్దుల్ హసన్ ఖుతుబ్షా' (తానీషా) ఈక్రిందివిధముగా ఫర్మానా యిచ్చెను.

'మీతండ్రి కార్కిర్దున నడుచుచున్న సంస్థానములు కదీము జటప్రోలు, వ పూట్ మొఖాసాగ్రామాలు, వ సూగూరు, కొత్తకోట వ దేహాయ నిడివెన్ను ఇజారతి దేఖీలు యెప్పటివలె మీతండ్రి మాధవరాయని కార్కిర్దున నడిచినట్టు మీకు శాశ్వతముగా నిరాచ్ఛేదముగా మొకరరు చేయ నవధరించినారము కాన ఖాతరుజమాతోటి కమావిసు చేసుకునేది' ఇత్యాదిగా ఫర్మాను ఇయ్యఁబడినది.

ఆతరువాతి తరములవారందఱికిని గోలకొండ నిజాంప్రభువుల సన్నదులు లభిస్తూ వచ్చినవి. వారు, వరుసగా నరసింగరావు, మాధవరావు, బొరిగడపులరావు, పెద్దరామారాయఁడు, జగన్నాథరావు అను నామధేయములు గలవారై యుండిరి. ఇరువదినాలుగవ (24) తరమువాఁడగు నీజగన్నాథరావునకు సంతానము లేకపోఁగా ఓరుగల్లుమండలాంతర్గత పాకాలతాలూకాలోని గురిజాలగ్రామమందుండిన 'రావు' వంశపువారి పిల్లవానిని దత్తు తెచ్చుకొని యతనికి 'వేంకట లక్ష్మారావు' అని నామకరణముఁ జేసిరి (సురభివారు పూర్వకాలమున రావువంశపువారే యైయున్నందున ఆదత్తు సగోత్రదత్తతగా భావింపఁబడియుండును). ఈ వేంకటలక్ష్మారావుగారు ఒక గొప్పవజ్రమును హైదరాబాదు నవాబుకు నజ్రానాగా నిచ్చి జటప్రోలు సంస్థానమును పేష్కష్ ఏర్పాటుతో శాశ్వతకౌలుగా (బిల్మఖ్తాగా) సంపాదించెను. ఈప్రభువునకుఁగూడా సంతానము లేనందున తన

జన్మస్థానమునుండి యొక బాలుని దత్తు తెచ్చుకొని యతనికి వేంకట జగన్నాథరావు అని నామకరణముఁ జేసెను. ఈ వేంకట జగన్నాథరావుగారు గుఱ్ఱపుఁబందెములలో మిక్కిలి నైపుణ్యము గలవారై బెంగుళూరు, మద్రాసు నగరములలో జరుగుచుండిన పందెములలో పలుసార్లు విజయమును బొందియుండిరి. కాంచీనగర వరదరాజస్వామివారికి దైనందినము బిందెసేవ కైంకర్యమున కేర్పాటు చేసిరి. సింగపట్టణం దేవాలయము నభివృద్ధిపరచి ‘లక్ష్మీనృసింహవిలాస’ మను సంస్కృతచంపూగ్రంథమును, ‘జటప్రోలు మదనగోపాల మాహాత్మ్య’ మను సంస్కృతకావ్యమును హొసుదుర్గం కృష్ణమాచార్యులవారిచేత రచింపఁ జేసిరి. ఈ వేంకట జగన్నాథరావుగారికి సంతతి లేనందున వేంకటగిరి ప్రభువులైన శ్రీసర్వజ్ఞ కుమారయాచమనాయుడుగారి చతుర్థ పుత్రులయిన నవనీత కృష్ణయాచేంద్రులను దత్తపుత్రునిగా స్వీకరించిరి. ఈ దత్తపుత్రునికి తమతండ్రి పేరున శ్రీవేంకటలక్ష్మారావు గారని నామకరణము చేసిరి. ఈ దత్తస్వీకారమహోత్సవము శ్రీ తిరుపతి వేంకటేశ్వరస్వామివారి సన్నిధియందు క్రీ.శ. 1879 మార్చినెల 7వ తేదీకి సరియగు నీశ్వర సంవత్సర ఫాల్గున శుద్ధ తదియ గురువారము పగలు పదిగడియల సమయమున జరిగినది. క్రీ.శ. 1865 సంవత్సరమున జన్మించిన శ్రీ వేంకట లక్ష్మారావుగారి వయస్సు ఆ యుత్సవమునాటికి 14 సంవత్సరములై యుండెను. క్రీ.శ. 1884 వ సంవత్సరం మార్చి 6వ తేదీన పట్టాభిషిక్తులై, క్రీ.శ. 1896 మార్చి 3వ తేదీన నైజాం ప్రభువు ఫర్మానా ప్రకారము జటప్రోలు (కొల్లాపురం) రాజ్యముపై నధికారము గల ప్రభువులైరి. అప్పటినుండియు ప్రజాపాలన, ధర్మకార్యనిర్వహణ, సద్గ్రంథముద్రణాది సత్కార్యము లాచరించుచు దాదాపు ముప్పదిరెండు (32) సంవత్సరములు రాజ్యపాలనముఁ జేసి, తమపూర్వుఁడగు సురభిమాధవరాయవిరచితమగు ‘చంద్రికాపరిణయ’ప్రబంధమునకు బ్ర.వే.వెల్లాల సదాశివశాస్త్రి, బ్ర.వే. అవధానం శేషశాస్త్రిగార్లచేత ‘శరదాగమ’ మను పేరుగల విపులమైన వ్యాఖ్యానమును రచింపఁజేసి, ముద్రణము చేయించి, పండితాశీర్వాదమును బొంది, పితౄణమును దీర్చికొని క్రీ.శ. 1928 ఏప్రిల్‌నెల 15వ తేదీన దివంగతులైరి. చక్కఁగా ముద్రింపఁబడిన యా కావ్యప్రతులను జూచి వారి యాత్మ యెంత సంతోషపడియుండెనో చెప్పఁజాలము.

శ్రీ రాజా వేంకట లక్ష్మారావు బహద్దరువారు సప్తసంతానములలో ముఖ్యతమమైన పుత్రరత్నము లేక యిద్దఱు పుత్రికారత్నములుమాత్ర ముండుటచేత తమ వంశోద్ధరణమునకై తమ యన్నగారగు బొబ్బిలి సంస్థానాధీశులు శ్రీ రాజా శ్వేతాచలపతి వేంకట రంగారావు బహద్దర్ వారి పౌత్రులు శ్రీ రాజా రాజగోపాలరావుగారిని దత్తునిగా స్వీకరించి యా బాలునకిఁ దమ జనకుని నామధేయమగు శ్రీ రాజా వేంకట జగన్నాథరావు బహద్దర్ అని నామకరణముఁ జేసిరి. కాని దత్తపుత్రునికి పట్టాభిషేకమును, పరిణయమును గావింపక మునుపే శ్రీ వేంకట లక్ష్మారావుగారు దివంగతు లగుటచేత నాశుభకార్యములు వారి ధర్మపత్ని శ్రీ రాణీ వేంకటరత్నమాంబగారి కరకమలములద్వారా జరిగినవి. వారి రెండవకుమార్తె శ్రీమతి రాణీ సరస్వతీదేవిగారి పుత్రిక యగు శ్రీమతి రాణీ ఇందిరాదేవిగారిని శ్రీ వేంకట జగన్నాథరావు బహద్దరుగారి కిచ్చి వివాహమును జరిపించిరి. శ్రీ రాజా వేంకట జగన్నాథరావు బహద్దరువారు జటప్రోలు రాజ్యపట్టభద్రులై మాతృశ్రీ రాణీ వేంకట రత్నమాంబగారి యండదండలతో భారత స్వాతంత్ర్యలబ్ధియు, సంస్థానముల విలినీకరణము జరుగువరకును జటప్రోలు (కొల్లాపురం) సంస్థానమును బాలించిరి. పిమ్మట రాజ్యభారమునుండి విముక్తులై, విశ్రాంతినిఁ గొనుచుఁ బెక్కండ్రు విద్వాంసులకుఁ దమ తండ్రిగారగు రాజా వేంకట లక్ష్మారావు గారిచే నచ్చువేయింపఁబడిన చంద్రికాపరిణయప్రతులను ఉచితముగా నిచ్చిరి. పండితపోషణ, ధర్మకార్యనిర్వహణములందు శ్రద్ధాళువులై యున్న శ్రీ వేంకట జగన్నాథ బహద్దరువారు గత క్రీ.శ. 1980వ సంవత్సరమున దివంగతులైరి. శ్రీవారికి వంశోద్ధారకుఁడైన కుమారుఁడు చిరంజీవి శ్రీ సురభి వేంకట కుమార కృష్ణబాలాదిత్యలక్ష్మారావు. (శ్రీ బాలాదిత్య లక్ష్మారావును, చిరంజీవి కుమారి శ్రీరత్నసుధాబాల యను పుత్రికయు వర్తమాన జటప్రోలు సురభివారి రాజవంశమున నున్నారు. ఈ చిరంజీవులను

వారి కులదైవములగు మదనగోపాల, లక్ష్మీనృసింహస్వాములును, సురభివంశీయులగు పెద్దల సుకృతవిశేషములును బ్రోచి, రక్షించి యితోఽధిక విద్యాభోగభాగ్యసంపన్ను లగునట్లు వర్ధిల్లఁ జేయుదురుగాత.)

కవితావైదుష్యము

'చంద్రిక' యను నాయికయొక్క పరిణయమును కథావస్తువుగాఁ జెప్పుటచేత నీకావ్యమునకుఁ 'జంద్రికాపరిణయము' అను నామధేయము అన్వర్థమై యొప్పుచున్నది. శృంగారరసప్రధానమైన యీకావ్య మాఱాశ్వాసములతో నమర్పఁబడి యున్నది. కావ్యమందంతటను శ్లేషచమత్కారము, పదప్రయోగచాతుర్యముఁ గల పద్యము లుండుటయేగాక చతుర్థాశ్వాసము మొత్తము యమకాలంకారములతో నిండి యొప్పారుచున్నది. న్యాయ వైశేషిక వేదాంత వ్యాకరణాది తంత్రప్రసిద్ధ కల్పనానల్పంబై మాధవరాయల యశేష విశేష వైదుషీప్రతిభను అడుగడుగునను జాటుచునే యుండును. ఈకావ్యమును శ్రీమహావిష్ణువునకుఁ బ్రతికృతియైన శ్రీజటప్రోలు మదనగోపాలమూర్తి, 'శ్రీవాసజ్జటప్రోలీ, భావుకపత్తన విహార పటుశీలునకున్, గోవర్ధన గోవర్ధన గోవర్ధన వృష్టిహృతికి గోపాలునకున్' అని కవి యంకితము చేసినాడు. ఈమదనగోపాలస్వామి జటప్రోలు (కొల్లాపురం) రాజుల కాదికాలమునుండి నేటివరకును గులదైవమై యిష్టదైవమై సకలసౌభాగ్యములను జేకూర్చుచున్నాడు. శ్రీశైలము జలవిద్యుత్తుజలాశయమునం దీజటప్రోలు నగరము మునిగి పోవనుండఁగా, శ్రీస్వామివారి దేవాలయసహితముగా నా గ్రామమును దరలించి మరియొకచోట నిర్మించు నేర్పాటును ఇటీవలనే స్వర్గస్థులైన శ్రీశ్రీ రాజా సురభి వేంకట జగన్నాథరావు బహద్దరువారు చేసి, వంశప్రతిష్ఠను నిలిపినారు. ఆనగర మిప్పు డంకను నిర్మాణములో నున్నది.

ఈ చంద్రికాపరిణయకావ్యమునకుఁ గథానాయకుఁడు సుచంద్రుఁడు. సూర్యవంశీయుఁడై విశాలానగరమునకుఁ బరిపాలకుఁడై యుండిన యీ భూపాలాగ్రణి పుణ్యశ్లోకుఁడై బహుపురాతనరాజన్యుఁడై యుండెనని శ్రీమద్వాల్మీకి రామాయణ బాలకాండమునందలి యీశ్లోకము సాక్ష్య మొసగును.

శ్లో. విశాలస్య సుతో రామ! హేమచంద్రో మహాబలః।
'సుచంద్ర' ఇతి విఖ్యాతో హేమచంద్రా దనంతరః॥

ఇఁక కథానాయిక 'చంద్రిక'. ఈయువతి 'వసంతుఁడు' అను మునివరుని శాపముచేత మనుష్యజాతియందుఁ బుట్టిన 'చిత్రరేఖ' యనఁబడు దేవాంగన. మానవస్త్రీయై పుట్టిన యీమెకు పాంచాలదేశాధిపతి యగు 'క్షణదోదయ' నరేంద్రుఁడు తండ్రి. 'శ్యామ' యను నామె తల్లి. ఇట్టి లోకోత్తరనాయికానాయకుల ప్రేమను ఇతివృత్తముగా స్వీకరించి వారిపరిణయముతో సుఖాంతముగా నీ కావ్యమును ముగించినాడు శ్రీ సురభిమాధవరాయలు. ఈకవి రామరాజభూషణునికి సమకాలికుఁడనియు, నీచంద్రికాపరిణయము వసుచరిత్రకు సమకాలీన మనియు శ్రీ తిరుమలసెట్టి జగన్నాథకవి ప్రభృతులయిన సాహిత్యవిమర్శకులు నిర్ణయించుటవలన మాధవరాయలు, వసుచరిత్రయొక్క కథానాయకుఁడు 'ఉపరిచరవసు' వనఁబడు పురాణపురుషుఁడై యుండఁగా నంతకేమాత్రము తగ్గని రామాయణమహాకావ్యమునం దుల్లేఖింపఁబడిన 'సుచంద్రుఁ'డను మహాపురుషునిఁ దనకావ్యమునకు నాయకుఁడుగా నేర్పరచినాడని మనము గ్రహింపవలయును. ఇఁక నాయికయగు 'చంద్రిక' వసుచరిత్రనాయిక యగు 'గిరిక'కు ఏ మాత్రమును దీసికట్టుగా లేదు. అనేకఘట్టములలోను, సంఘటనములలోను, వర్ణనములలోను, విశ్రమప్రదేశములందును 'వసుచరిత్ర', 'చంద్రికాపరిణయము' లకు సారూప్యమున్నది. ఇవి సమకాలికకావ్యములే యైనచో మాధవరాయలు వసుచరిత్రము

ననుసరించెనా? లేక భట్టుమూర్తి చంద్రికాపరిణయము ననుసరించెనా? యను సంశయము గలుగక మానదు. కాని యిద్దఱును ఉద్దండులు. ఇద్దఱును మహాకవులు. ఇద్దఱును పదపదైకదేశ స్వారస్యసహితముగా సాహిత్యమర్మము నెఱిఁగినవారు. ఎవరి శైలి వారిదే యైనప్పటికిని రామరాజభూషణుఁడు లోకప్రసిద్ధరూఢిప్రయోగములు చేయుటలో దిట్ట యని తలంచినచో, మాధవ రాయలు యౌగికార్థసంవలితములయి, శాస్త్రనిఘంటువులయందలి యసామాన్య యౌగికార్థములు కల్పించి, పదప్రయోగ ములు చేయుటలో దిట్ట యని తలంపవలసి యున్నది.

ఉ. సురభికులామలాబ్ధిఁ బొడచూపిన 'మాధవరాయ' చంద్రుఁడా
సరసపదార్థరంజనము సత్కవిహృద్యము గాఁగ 'చంద్రికా
పరిణయమున్' రచించె, నది భావ్యము; నీవసుచర్య చూడఁగాఁ
బరగె నిగూఢవృత్తి నటు నీకును వర్తిలె 'మూర్తి' నామమున్.

ఇది యొక విచిత్రమైన చాటువు. కీ.శే.వెల్లాల సదాశివశాస్త్రిగారు రచించిన సురభివారి వంశచరిత్రలో నుదాహరింపఁబడిన పద్యమిది. దీనిని రచించిన కవి యెవరో తెలియదు. కాని, యావిద్వత్కవి మాధవరాయల యాశ్రితుఁడై భట్టుమూర్తిపై ననాద రముగలవాఁడై యుండినట్లు ఈపద్యము సూచించుచున్నది. 'చంద్రికాపరిణయము' సరసపదములచేతను, సరసములైన యర్థములచేతను రంజకముగా నుండి సత్కవులకు హృదయంగమముగా నున్నదనియు, అది భావ్య మనియు, మాధవ రాయల కవిత్వమును బొగడుటయు, వసుచరిత్ర నిగూఢార్థములు గలిగి, భావ్యముగా లేదని తెగడుటయు, నితని యభిప్రాయ మై యున్నది. అంతియేకాక వసుచరిత్రను రచించినందువలన నీకు 'మూర్తి' యనుపేరు సార్థకమైన దనియుఁ, దృణీకారమున బల్కుట చూడఁగాఁ, 'జంద్రికాపరిణయ' మను శ్లేషయమకాది సర్వాలంకారశోభితమగు మహాకావ్య మొకటి యుండఁగా నీ 'వసుచరిత్ర' యెందులకోయి? యన్న యధిక్షేపము సైతము గోచరించుచున్నది. 'మూర్తిః కాఠిన్య కాయయోః' యను నమర వచనమువలన 'మూర్తి' యనఁగా కఠినుఁడు, బండ యను నర్థము వచ్చుటవలన 'నీ వసుచర్య చూడఁగా బరగె నిగూఢ వృత్తి, నటు నీకును వర్తిలె మూర్తినామమున్' అని యనుటలో 'నీ వసుచరిత్ర యెవ్వరికిని అర్థము కాదు, నీవు వట్టి బండవు' అన్న భావ మీపద్యరచయిత హృద్గతమై యున్నట్లు తోచెడిని. ఈపద్యరచయిత భావ మేదయినను, సంస్కృతాంధ్రసాహిత్యమర్యాద లెఱింగినవారు కేవలమూలములను మాత్రము చదివి చూచినచో నితనిపద్యమునందలి యభిప్రాయముయొక్క సత్యాసత్య ములు బోధపడగలవు. వ్యాఖ్యానములను జూచినచోఁ దారతమ్యము తెలియుట కష్టము. ఇంతకు సురభిమాధవరాయలును రామరాజభూషణుఁడును సమకాలికులై యుండిరనుట పరమసత్యము.

పోలికలు

సీ. సుమనోగ సమచూత సుమనోగణపరీత సుమనోగణిత సారశోభితాళి
కలనాద సంతాన కలనాదసమనూన కలనా దలితమాన బలవియోగి
లతికాంతరిత రాగలతికాంత సపరాగ లతికాంత పరియోగ లక్ష్యకాళి
కమలాలయాస్తోక కమలాలయదనేక కమలా లసిత పాక కలితకోకి

తే. జాలక వితానక వితానపాళిభూత
చారు హరిజాత హరిజాత తోరణోల్ల
సద్వ్రితతికా వ్రతతిగావ్రజ క్షయాతి
భాసురము పొల్చె వాసంతవాసరంబు. (చం.ప. ఆ 4, ప 25)

సీ. లలనాజనాపాంగ వలనా వసదనంగ తులనాభికాభంగ దోఃప్రసంగ,
మలసానిల విలోల దళసాసవ రసాలఫల సాదర శుకాలపనవిశాల,
మళినీ గరుదనీక మలినీకృతధునీ కమలినీసుఖిత కోకకులవధూక,
మతికాంత సలతాంత లతికాంతర నితాంత రతికాంతరణ తాంత సుతనుకాంత,
తే. మకృతకామోదకురవకావికల వకుల,ముకుల సకలవనాంతప్రమోదచలిత
కలిత కలకంఠకుల కంఠకాకలీ వి, భాసురము వొల్చు మధుమాస వాసరంబు.(వ.చ. ఆ 1, ప126)

సందర్భము రెండు పద్యములకును మధుమాసవాసరవర్ణనమే. అట్లే కూతురు అత్తవారింటికి వెళ్లునప్పుడు చంద్రికతండ్రియు, గిరికతండ్రియు నోదార్చి పలికిన పలుకులలో సామ్య మీక్రిందివిధముగా నున్నది.

కం. నిచ్చలు పుట్టినయింటికిఁ
జొచ్చినయింటికి నపూర్వశుభకీర్తితతుల్
హెచ్చ మెలంగవె తల్లి! భ
వచ్చరితము భువనపుణ్యవైఖరిఁ బొదలన్. (చం.ప. ఆ 6, ప 98)

కం. నీతమ్ముల శుభవాసన
నీతలిదండ్రుల గభీరనిశ్చలగుణ వి
ఖ్యాతియును దలఁచి మెలగుము
నాతల్లీ! కులవధూజనమత్తలికవై. (వ.చ. ఆ 6, ప 55)

సీ. నిజ కటకాశ్రిత ద్విజపోషణమున నెవ్వని సార్వభౌమత ఘనతఁ గాంచుఁ
బర మహహీన సద్బల విభేదనలీల రమణ నెవ్వని నరేంద్రత్వ మలరు
గంధాంక కైరవకాండ లుంటాక ధామమున నెవ్వని యినత్వము సెలంగు
జాగ్రద్ఘనాఘన సాంద్రమదాపహశక్తి నెవ్వని మహేశ్వరత వొసఁగు

తే. నతఁడు వొగడొందు, జయశాలి, యహితసాల
కీలి, యతిదీప్తినిర్ధూత హేళి, యమర
విసర సన్నుత నయకేళి, యసమ సుగుణ
విజిత భువనాళి, శ్రీసింగవీరమౌళి. (చం.ప. ఆ 1, ప 20)

సీ. వసుమతీభార ధూర్వహత నెవ్వని యుర్వరావరాహాంక మర్థము వహించుఁ
గరగతచక్ర విక్రమశక్తి నెవ్వాని రామానుజత్వంబు రమణకెక్కు
జీర్ణకర్ణాటలక్ష్మీ పునస్సృష్టి నెవ్వాని లోకేశ్వరత్వము పొసంగుఁ
జటులశార్వరమగ్న సర్వవర్ణోద్ధారపటిమ నెవ్వని రాజభావ మెసఁగు
తే. నతఁడు 'వీరప్రతాప, రాజాధిరాజ,
రాజపరమేశ్వ, రాష్ట్రదిగ్రాజకుల మ
నోభయంకర' బిరుద సన్నుత జయాభి
రామగుణహారి, తిరుమలరాయశౌరి. (వ.చ. ఆ 1, ప13)

సీ. తన కలావిభవంబు తన కలావిభవంబు కరణి సుదృగ్జాతి వఱలఁజేయఁ,
దన దానమహిమంబు తన దానమహిమంబుగతిని బ్రత్యర్థిసంఘములఁ బెంపఁ,
దన సుమనోవృత్తి తన సుమనోవృత్తిలీల సదాసవహేలఁ గూర్పఁ,
దన మహామిత్రాళి తన మహామిత్రాళి పగిది నానావనీభరణ మూనఁ,
తే. దనరు విషమాద్రి జిహ్మగ స్తబ్ధరోమ, మత్తమాతంగ కఠినకూర్మప్రసంగ
విరసవసుధావధూ భోగపర విహార,శాలి భుజకేళి మల్లభూపాలమౌళి. (చం.ప. ఆ 1, ప 20)

సీ. తన భవ్యధామంబు తన భవ్యధామంబు కరణి మిత్రోన్మేషకరము గాఁగఁ,
దన ధర్మగుణములు దన ధర్మగుణముల ట్లతులిత శ్రుతిమార్గగతుల నెసఁగఁ,
దన మహాహవదీక్ష దన మహాహవదీక్ష పగిది నానావనీపకులఁ బెంపఁ,
దన యంబకంబులు దన యంబకంబుల లట్ల పరభీరువిముఖతఁ బరిఢవిల్ల,

తే. బరఁగుఁ గఠినాద్రి జడలుఠ జ్జరఠకమఠ, కూటకిటి గూఢచరణ దిక్కోటికరటి
కుటిలతాసహ భూ సౌఖ్యఘటన భూరి, భుజబలవిహారి యార్వీటి బుక్కశౌరి. (వ.చ. ఆ 1, ప28)

చ. అలఘు మనోభవోదయకరాంగయుతిం దగు నా మిళిందకుం
తల, నలమీననేత్ర, నలతామరసానన, నాపికారవో
జ్జ్వల వరమంజులాబ్జగళసంగత, నాబిసబాహ, నాప్రవా
ళలలితపాద, నాచెలిఁ దలంపఁగ నీకె తగున్ నృపాలకా! (చం.ప. ఆ 3, ప 31)

మ. కమనీయాకృతి యోగ్యకీర్తనములం గన్పట్టు నాశ్యామ, యా
సుమబాణాంబక, యాయమూల్యమణి, యాచొక్కంపు పూబంతి, యా
సుమనోవల్లరి, యాసుధాసరసి, యాసొంపొందు డాల్దీవి, యా
కొమరుంబ్రాయపురంధ్ర, యాచిగురుటాకుంబోడి నేకే తగున్. (వ.చ. ఆ 2, ప 52)

సీ. మంజులాహీన హర్మ్యప్రదేశంబున శుచిగరుత్మల్లీలఁ జూచికొనుచుఁ,
గలధౌతమయ శైలకందరాస్థలుల మహానంది హరిలీల లరసికొనుచు,
సుమనోనివాస భాసురనగాగ్రములందు దివ్యసారంగాభఁ దెలిసికొనుచు,
పుష్కరవీథులఁ బొలుపొందు నేకచక్రరథవిస్ఫూర్తినిఁ గాంచికొనుచుఁ,
తే. గమల దైత్యారి, శర్వాణి కమలవైరి
ధారి, పౌలోమి యుర్వరాధరవిదారి,
ఛాయ హరి, యన నలరిరి సకలకాల
సముచితాఖేలనంబుల సతియుఁ బతియు. (చం.ప. ఆ 6,ప 133)

సీ. అభిరామ నవపల్లవారామ కుంజవాటికలఁ గీరముల నాడించికొనుచుఁ,
బద్మాలయోదర ప్రౌఢసారసవీథి నంచలవేడంబు లరసికొనుచు,
గాంగేయధామ శృంగవిటంకముల నీలకంధరోజ్జ్వలగతు ల్గాంచికొనుచు,
విమలసింధుద్వీపవేదిక నరుణాప్తఖగవిహారప్రౌఢిఁ బొగడికొనుచు,
తే. రతియుఁ జేతోభవుండు, భారతియు నజుఁడు,
శచియు నమరాధినాథుండు, జలధిసుతయు
నబ్జనాభుండు, నన మించి యఖిలసమయ
సముచితక్రీడ సల్పిరి సతియుఁ బతియు. (వ.చ. ఆ 6, ప 97)

ఇట్లు చంద్రికాపరిణయ వసుచరిత్రములలోఁ బెక్కుపద్యములు ఆదినుండి యంతమువఱకు నొకదాని నొకటి పోలియున్నవి. నాయకాలంబనములగు వీరశృంగారరసములయందును, నాయికాశ్రయమగు సంగీతకళయందును, మధ్యవర్తులగు నితర పాత్రలు నాయికానాయకులకుఁ బరస్పరానురాగముల నుద్దీపింపఁ జేయుటయందును, విప్రలంభశృంగారమున జరుగు నుద్యానవిహార జలక్రీడాదులయందును, వివాహవిధాన మంగళకార్యములందును, నాయికానాయకసంభోగమునందును బెక్కుపోలిక లుండుటచేత కవులగు సురభిమాధవరాయ రామరాజభూషణులకుఁ బరస్పరసమాగమములు గాని, యొకరి రచనావిశేషముల నొకరు తిలకించియుండుటగాని జరిగియుండునని దృఢముగా విశ్వసించుటకు వీలగుచున్నది. ఇద్దరును శ్రీకృష్ణదేవరాయల మేనల్లుఁడగు నళియరామరాయలతో సన్నిహితసంబంధము గలిగియున్నట్లు చరిత్రకారులు భావించి నందున యిట్లు తలంపవలసి వచ్చినది. అయినప్పటికి వీరిద్దరిలో నొకరు ఎక్కువయనిగాని, యొకరు తక్కువయనిగాని, ఒక్క డుత్తమర్ణుఁడు నొక్కఁ డధమర్ణుఁడనిగాని నిర్ణయించుకొని తారతమ్యమును జెప్పుట సాహసమగును. మాధవరాయలు చాల ఘటికుఁడు. వసుచరిత్ర పోలికలతోఁబాటు పూర్వకవులగు కాళిదాస, కవిత్రయ, కృష్ణదేవరాయ, పెద్దనాదుల రచనలను బోలిన పద్యములు సైత మిందులో నున్నవి. పూర్వాపూర్వభావములు సంస్కారవిశేషములచేతఁ గవియగువాని చిత్తమున నెల కొని మఱల బయల్పడుట సహజము. అతఁడు వలయునని తెచ్చుకొనఁడు. వానియంతట నవియే యట్లు దొరలుచుండును. కనుకఁ జంద్రికాపరిణయకర్త భావదారిద్ర్యముచేతఁ గాని, భాషాదారిద్ర్యముచేతఁగాని అట్లు పోలికలు తెచ్చుకొన్నవాఁడు కాడు. అది యంతయు నతనికిఁ గల సంస్కారబలముచేత కాకతాళీయముగా జరిగినదే. అసలు సమర్థుఁడగు నేకవియు నొకని రచనా పద్ధతి నెరవు తెచ్చుకొనుటకు సిద్ధపడఁడు. అట్టి పరిస్థితిలో నుద్దండకవిప్రకాండుఁడగు మాధవరాయకవీంద్రునిఁగూర్చి సాహితీ విమర్శకులు సంశయింప నవసరము లేదు.

తే.గీ. విబుధశిక్షితుఁడవు, శాస్త్రవిదుఁడ, వఖిల
కావ్యవేదివి, ఘనతార్కికవ్యవహృతి
నెఱుఁగుదువు, నీ కసాధ్యమే యింపుమీఱఁ
గృతి వినిర్మింపు మాధవక్షితిప యనిరి. (1-75)

ఇది సురభిమాధవరాయల యాస్థానమునందున్న పండితమండలి యతనినిఁ జంద్రికాపరిణయరచనకు బ్రోత్సహించిన వాక్యము. 'కావ్యజ్ఞ శిక్షయాభ్యాసః' అను లాక్షణికవచనానుసారముగాఁ గవియగువాఁడు చక్కని విద్యాభ్యాసమును విబుధులవద్దఁ జేయవలయును గనుక యితఁడట్లు చేసినట్టివాఁడు. 'శాస్త్రవిదుఁడవు' అనుపలుకు మాధవరాయని ఛందో వ్యాకరణాలంకారజ్యోతిషసంగీతాది శాస్త్రముల పరిశ్రమను దెలుపుచున్నది. 'అఖిలకావ్యవేదివి' ఇది కవియగువానికి మిక్కిలి యావశ్యకము. 'ఘనతార్కికవ్యవహృతి నెఱుఁగుదువు' తర్కశాస్త్రవ్యవహారము నంతటిని యెరిఁగినవాఁడనుట. 'కాణాదం పాణినీయంచ సర్వశాస్త్రోపకారకమ్' అనియు, 'వాణీ తర్కరసోజ్జ్వలా' అనియు విద్వాంసులచేతఁ గొనియాడఁబడుచున్న తర్కశాస్త్రమునందు సైత మీకవికి బ్రవేశమున్నచో నిఁక యతని రచనాశక్తిని గురించి వేరుగాఁ జెప్ప నక్కరలేదు. ఇట్లు మహాపండితుఁడై, మహాకవియై విరాజిల్లిన విద్వత్కవి శ్రీసురభిమాధవరాయలు కనుక నతఁ డొకరి రచనాపద్ధతి నవలంబించు ననుమాటయే పుట్టదు. పైపద్యమునందుఁ బొందుపరచిన యతనిగుణములలో నొక్కొకదానిని స్థాలీపులాకన్యాయమునఁ జూతముగాక.

ఛందోరీతులు

కావ్యారంభమును శుభఫలప్రదమగు 'మగణము' తోను, సర్వదోషహరమగు శ్రీకారముతోను గూర్చి, శార్దూలవృత్తములో 'శ్రీవక్షోజధరస్ఫురద్వర మురస్సీమన్' అని సాగించుటచేత సత్సంప్రదాయవేత్త యని చెప్పవచ్చును.

కావ్యము పఠితలకును, యర్థముఁ జేసికొనువారికిని సులభపఠనీయమై యుండుటకుఁ గాబోలు – కొన్ని విశేషస్థలములందుఁ దప్ప సర్వత్ర ఉత్పలమాల, చంపకమాల, శార్దూలము, మత్తేభవిక్రీడితము, కందము, గీతము, సీసములనే వాడెను. ఆశ్వాసముల చివర వాడినవి పృథ్వీవృత్తము, ఉత్సాహవృత్తము, కవిరాజవిరాజితము, పంచచామరము, మాలినీవృత్తము అనునవి మాత్రమే. ఇఁక నాయా విశేషస్థలములయందు రసానుకూలముగా, సుచంద్రుఁడు, చంద్రిక యున్న కొండకోనలోని కోలాటమును విని యచ్చటి కుత్సాహమున వెళ్లునప్పుడు లయగ్రాహివృత్తమును, సుచంద్రతమిస్రాసురుల యుద్ధవర్ణనమునందు మహాస్రగ్ధరావృత్తమును, తమిస్రుఁడు సుచంద్రునిపై బాణములను ద్వరితగతితో వేయునప్పుడు త్వరితగతివృత్తమును, ఇంకను వారి యుద్ధవైచిత్రిని వర్ణించుటలో మాలిని, ప్రహరణకలితము, పంచచామరము, శిఖరిణి, భుజంగప్రయాతము, పృథ్వీవృత్తము అను వృత్తవిశేషములను, చంద్రిక చెలికత్తె లుద్యానవనమునఁ బువ్వులు గోయునప్పుడు వారి యుత్సాహమును దెల్పుటకు వృషభగతిరగడను మాత్రము రచించెను. గర్భకవిత్వమునుగాని, బంధకవిత్వమునుగాని స్వీకరింపలేదు. 'ళ' కార 'ల' కారములకు ప్రాసమైత్రి నంగీకరించెనుగాని రేఫ 'ర' కారముల ప్రాసమైత్రి నంగీకరింపలేదు. సీసపద్యముల రచనలో, శ్రీనాథుఁడు పెట్టిన యొరవడిలోనే సమాంతరవాక్యవిన్యాసము గల పెద్దపాదములు నాలుగింటినిఁ బూరించి, పిమ్మట గీతపద్యమును జత పరచు పద్ధతిలోనే కలమును సాగించెను. 'ళ'' ల' ప్రాసమున కుదాహరణమనఁదగిన ఈక్రిందిపద్యమువంటి పద్యము ఆముక్తమాల్యద, అనర్ఘరాఘవమువంటి కావ్యములలో మాత్రము లభించును.

మ. గళదర్కంబుఁ, బనీపతత్కుజము, రింఖద్గోత్రగోత్రంబుఁ, జా
చల దుర్వీవలయంబు, ఫక్కదఖిలాశాకంబు, భిద్యన్నభ
స్థల మేఘౌఘము, భ్రశ్యదృక్షము, రణత్పద్మాసనాండంబునై
యలరెన్- దన్మహిపాలజైత్రగమ బంభారావ మప్పట్టునన్. (1-151)

ఇందులో 'ళ' కార, 'ల' కారములకుఁ బ్రాసము చెల్లినది. పద్యమునందలి 'గళత్', 'పనీపతత్' మొదలగు శబ్దముల వ్యాకరణ విశేషములనుగురించి మరియొక శీర్షికక్రిందఁ జర్చింపఁబడును. యతులను బ్రాచీనులగు భీమన, అనంతుఁడు నిర్ణయించిన వానినే యుపయోగించెనుగాని యాధునికుఁడగు నప్పకవి చూపిన యతివైవిధ్యమును పాటించి ఉపయోగింపలేదు. ఇంతకు నప్పకవి యితనికిఁ దరువాతివాఁడేకదా! ఇఁక వచనరచనయందును తన యసాధారణప్రతిభను జూపుచుఁ గావ్యమునందు మొత్త మిరువది వచనములను, ఒక సంస్కృతదండకమును రచించెను. ఈసంఖ్యలో వచనములను పద్యకావ్యములందుఁ జేర్చిన పూర్వకవులు తక్కువ. 'గద్యపద్యమయం కావ్యం చంపూ రిత్యభిధీయతే' అను లాక్షణికవచనానుసారముగాఁ గద్యములును పద్యములునుగల కావ్యమునకుఁ 'జంపువు' అను పేరుండుట యుక్తము. కాని మన తెలుఁగుకవులు ఆపేరును బెట్టుకొన లేదు. బహుశః తెలుఁగుభాషలో చకారము తాలవ్యము ('చ')గాను, దంత్యము ('చే')గాను ఉండుటచేత ప్రజలవ్యవహారమున 'చంపు' అనుటకు బదులు 'చేంపు' అని యగునను భయముచేత వదలియుందురని భావింతును. కనుక పద్యకావ్యము

నందే యవసరమని తోఁచినప్పుడు వచనములనుగూడఁ జేర్చుచు, తత్ప్రయుక్తమగు నామకరణమును మాత్రము వదలుచు వచ్చిరి. మాధవరాయల వచనరచన విశిష్టమైనట్టిది. అందులో సంసస్కృతపదభూయిష్ఠములగు దీర్ఘసమాసములతో పాటు అచ్చతెలుఁగుపలుకుల కూర్పులును, అలఁతియలఁతి పదము లుభయభాషలయందును, శ్లేషాద్యలంకారములును, విరోధాభాసలు, విశిష్టశాస్త్రమర్యాదలు మొదలగు శబ్దార్థచిత్రములు విచిత్రముగాఁ బ్రకటితములై బాణుని కాదంబరీగద్యశైలిని, దండి దశకుమారచరిత్రవైఖరిని, పెద్దనాదుల వచనరచనావిధానమును స్మృతిపథమున నిలుపును. ఇఁక తన సంస్కృతభాషాప్రావీణ్యమును జూపుచు పార్వతీస్తవముగా రచింపఁబడిన సంస్కృతదండకమునందు విచిత్రశైలితో పాటు విశిష్టతంత్రశాస్త్రమర్యాదలును గోచరింపఁజేయును. పద్యరచనయందువలెనే గద్యరచనయందును సాటిలేని మేటికవి యితఁడనిపించును.

వ్యాకరణవిశేషములు

కం. ఆమల్లనృపతి చెన్నాంబా మానినియందుఁ గాంచె మల్లక్షితిపున్,
వ్యోమగవీ సోమగవీ రామ గవీశాచ్ఛకీర్తి రాజన్మూర్తిన్. (1-33)

ఇది మాధవరాయల వంశీయులలోఁ బూర్వుఁడగు నొక మల్లభూపాలుని కుమారుఁడు రెండవమల్లభూపాలుని వర్ణన. అతని కీర్తి వ్యోమగవీ=కామధేనువు, సోమగవీ=చంద్రకిరణము, రామ=బలరాముఁడు, గవీశ (గో+ఈశ=గవీశ)= సరస్వతీశివుల వలెను, అచ్ఛ=తెల్లనై యున్నది అని దీని యర్థము. గోశబ్దముపై సమాసాంత 'టచ్' ప్రత్యయమును, స్త్రీత్వబోధకమగు జీప్ (ఈ) ప్రత్యమును వచ్చుటచేత 'గవీ' యనునవియు, 'గవీశ' అనునది అవాదేశసంధి వచ్చుటచేతను సిద్ధించిన రూపములు.

సీ. "ధర్మనిర్మథనంబు దాఁజేసి జనకజా 'పాణౌకృతి' క్రీడఁ బ్రబలఁడేని" (1-60)

'పాణౌకృతిక్రీడ' యనఁగా వివాహము. 'నిత్యం హస్తే పాణా వుపయమనే' యను పాణినీయసూత్రముచేత పాణిశబ్దము యొక్క సప్తమీవిభక్తికి లోపము రానందున (అలుక్) 'పాణౌకృతి' యను రూప మేర్పడినది. ఇది యలుక్సమాసము. ఉపయమన మనఁగా వివాహము చేసికొనుట.

మ. "చెల్మికై, కర మేగన్ సురధేను వాస్య మటుగాఁ గావించె మధ్యేసృతిన్" (1-61)

'పారే మధ్యే షష్ఠ్యా వా' యను సూత్రముచేత మధ్యేమార్గమువలె నీ 'మధ్యేసృతి' అనునదియు నలుక్సమాసమే. 'సృ=గతౌ' అను ధాతువుపై వచ్చిన 'క్తిన్' ప్రత్యయాంతరూపమే సృతి. అనఁగా సరణి, మార్గము మొదలగు అర్థములు గలది.

మ. గళదర్కంబుఁ, బనీపతత్కుజము, రిఖద్గోత్రగోత్రంబుఁ, జా
చల దుర్వీవలయంబు, ఫక్కదఖిలాశాకంబు, భిద్యన్నభ
స్థల మేఘౌఘము, భ్రశ్యదృక్షము, రణత్పద్మాసనాండంబునై
యలరెన్- దన్మహిపాల జైత్రగమ బంభారావ మప్పట్టునన్. (1-151)

ఈపద్యమునం దాయా సంస్కృతధాతువులపై శతృప్రత్యయమును (అత్) చేర్చి వర్తమానార్థమున సమాసములయందుఁ గూర్చుట యొక చమత్కారమే కాదు, పాండిత్యవిశేషస్ఫోరకమును నగును. ధాతుజ్ఞానమును, బ్రక్రియావిశేషజ్ఞానమును నిట్టి ప్రయోగములు చేయుట కెంతయు నావశ్యకములు. గళ, పత్ఌ, రింఖ, చల, ఫక్క, ఖిదుర్, భ్రంశు, రణ ధాతువులపై శతృ (అత్) చేర్చి 'గళత్' ఇత్యాదిరూపములను సమాసగతములుగాఁ బ్రయోగించెను. వాటిలోను 'పనీపతత్', 'చాచలత్' అనునవి అతిశయార్థకము లగు యఙ్లుగంతధాతువులపై వచ్చిన రూపములు. 'ఫక్కదఖిలాకాశంబు' అను ప్రయోగమునందు 'ఆశా' శబ్దమునకు హ్రస్వము లేకపోవుటయు నొక వ్యాకరణవిశేషము. ఇది యంతయు నీకవి సంస్కృతవ్యాకరణజ్ఞత కుదాహరణము గా నోపును.

"ఆనృపతి దానెనసె మానసతటీ నివిశమాన ముదమంతన్" (2-21)

'విశ' ధాతువు పరస్మైపదియే యైనను, 'నేర్విశః' అను సూత్రముచేత 'ని' అను నుపసర్గతోఁగూడి నప్పు డాత్మనేపదిగా మారును. అట్టి యాత్మనేపదిత్వమును బొందిన 'విశ' ధాతువునకు, వర్తమానమును బోధించు 'శానచ్' ప్రత్యయమును జేర్పఁగా 'నివిశమాన' అను పదము సిద్ధించును. ప్రవేశించుచున్న యని దాని యర్థము.

మ. వరసామ్యంబు ఘటిల్లెనంచు నృపతుల్ వర్ణింప రాజాధిరా
జు, రవిద్యోతనరూపతేజు, నితనిన్ సోమాస్య! యుద్వాహమై,
నిరతం బొప్పుము సర్వభూప హరిణీనేత్రా శిరోరత్న ది
వ్యరుచుల్ త్వత్పదవీథి యావకరసాన్వాదేశముం బూనఁగన్. (5-88)

ఓచంద్రికా! నీవీకర్ణాటభూపతిని వరించితివేని సర్వభూప ప్రియాంగనాశిరోరత్న కాంతులు నీపాదప్రదేశమునందు 'యావకరసాన్వాదేశమున్' లాక్షారసమునకు పౌనరుక్త్యమును బొందును. మొదట లాక్షారసముఁ బూసిన పాదములపైఁబడి, యా రత్న కాంతులు,మరల నట్టికాంతినే పాదములకుం జేకూర్చునని భావము. 'అన్వాదేశ' శబ్దము వైయాకరణసంకేతము. 'కించిత్కార్యం విధాతుం ఉపాత్తస్య కార్యాంతరవిధానాయ పునరుపాదాన మన్వాదేశః' – ఒకకార్యమును విధించినదానినే మరల గార్యాంతరమును విధించుటకై గ్రహించుట 'అన్వాదేశ' మని దాని వివరణము. అనఁగాఁ బౌనరుక్త్యమని తాత్పర్యము. ఈ ప్రయోగ మీకవియొక్క వైయాకరణసంప్రదాయవేదిత్వమును తెల్పును.

అష్టదిక్పతుల భార్యలను జెప్పునప్పు డుపయోగించిన మఘోని, అగ్నాయి, అంతకీ, తమీచరాబల, వరుణా, మారుతవధూ, ఐలబిలీ, గిరికన్యా శబ్దము లీతనికిఁ గల వ్యాకరణజ్ఞతను జాటును. ఇఁక నాయకుఁడగు సుచంద్రుఁడు పెండ్లికొడుకై పాంచాలభూపాలుని మందిరమును బ్రవేశించు మహోత్సవమున జరుగు తత్తద్విశేషముల యతిశయమును బోధించుటకై, యతిశయార్థద్యోతకములగు నాయా యఙ్లుగంతధాతువులపైఁ గూర్చిన శానచ్ ప్రత్యయాంతములగు జరీజృభ్యమాణ, వరీవృత్యమాన, నానంద్యమాన, చాంచల్యమాన, బంభ్రమ్యమాణ, లాలస్యమాన, దేదీప్యమాన, జాజ్వల్యమాన, టేటిక్యమాన, జంజన్యమాన, పాపట్యమాన, సనీస్రస్యమాన, జేగీయమాన, చరీచర్యమాణ, బనీభ్రశ్యమాన, ఫాఫల్యమాన, పోపుష్యమాణ, రారణ్యమాన, తాతప్యమాన, వావస్యమాన, నరీనృత్యమానాది శబ్దప్రయోగములు చేసి యావవనరచన కసాధారణ శోభను జేకూర్చి తన వ్యాకరణశాస్త్రపరిచయమును వెల్లడించెను. ఈ చూపఁబడిన వ్యాకరణవిశేషములు స్థాలీపులాకన్యాయ

మున జూపఁబడినవే కాని సాకల్యముగాఁ జూపినవి కావు. కావ్యమునందు ప్రతిచోటను శ్రీమాధవరాయల వ్యాకరణశాస్త్రపాండిత్యము తద్జ్ఞులకు సాక్షాత్కరించుచునే యుండును. సంస్కృతవ్యాకరణమునందేకాక తెలుఁగు వ్యాకరణమునందును ఇతనికి విశేషపరిచయముండినట్లు ఈక్రింది ప్రయోగములు సూచించును.

తెలుఁగు వ్యాకరణ పరిచయము

చం. 'అనుపమ ధాతుధూళియుతి ..... గ్రాలెడు పొన్న నృపాల! కాన్పు' (2-9)

'ధాతువుయొక్క కృదంతరూపము 'కాన్పు' చూచుట, కనుట యను నర్థములు గల యా సుబంతమును 'చూడుము' అను నర్థము గల క్రియగాఁ బ్రయోగించుట ఒక విశిష్టప్రయోగము. మరియుఁ 'గాన్పుమో నృపా!" (2-14) అనియు ననెను. 'వింటే...గొంటే యౌముని దెచ్చినాఁడటఁ దపఃకుల్యాధ్వసంచారితన్' – దుష్టవాచకమగు 'కొంటె' శబ్దమునకుఁ 'గొంటే' యనునది రూపాంతరము.

"ఆనారీమణులంత శోభనవితర్ద్యగ్రస్థలిన్ స్యూతర
త్నానీకం బగు పెండ్లిపీట నిడి, యందా భూపకన్యామణి
న్వ్యానమ్రాననచంద్ర నుంచి శిరసంటం జేరి రింపెచ్చ 'శో
భానేశోభనమే' యటంచు విబుధాబ్జాతాననల్ పాడఁగన్" (6-13)

'శిరసంటన్' - శిరసునంటన్ అని యుండవలసిన 'శిరసును' అను ద్వితీయాంతమునకు 'శిరసు' అను ప్రథమాంతమును స్వీకరించి, దానికి శిరసు+అంటన్=శిరసంటన్ అని సంధి చేసినాడు. అవయవవిశేషవాచకమగు 'శిరసు' జడవాచకమగుటచే 'జడవాచకంబుల ద్వితీయకు ప్రథమ యగు' నను బాలవ్యాకరణసూత్రముచేత సాధుత్వము. 'న్వ్యా' అను సంయుక్తాక్షరమునందలి 'న' కారమునకు 'శిరసంటన్' లోని బిందుపూర్వకటకారము (ంట)నకు యతి చెల్లుట మరియొక విశేషము.

"పలుకు వాలు దొరలన్" (1-146)

'శాపరూపవాక్కు లాయుధముగా ప్రభువులు=మునిశ్రేష్ఠులు' అని యర్థము. చక్కని తెలుఁగు కర్మధారయసమాసము.

'తళుకుఁబ్రాఁగెంపుమెట్టులదారి' మెఱయుచున్న ముదురుకెంపులయొక్క సోపానమార్గము. తత్పురుషసమాసము.

"పగడపుఁగంబముల్ -----------నచ్చపు బంగరు పేరరంగునన్" (2-23)

'పేరు+అరంగు=పేరరంగు=విశాలమైన వేదిక. ఇచ్చట కర్మధారయమునం దుత్తున కచ్చు పరంబగు నపుడు రావలసిన 'టు' గాగమము వచ్చి 'పేరుటరంగు' అని యనకపోవుటకుఁ గారణము టుగాగమము వైకల్పిక మగుటయే.

'నలువకు జొహారు గావించి నిలిచె నపుడు' (2-43). 'జొహారు' జోహారునకు రూపాంతరము. 'పడఁతి! యొకమౌని నిల మోహపరచుటెంత!' (2-51). పడ్వాదులు పరంబులగు నపుడు 'ము'వర్ణము లోపించును. 'భయముపడు' ననునది 'భయ

పడు' అయినట్లే, 'మోహము పరచుట' 'మోహపరచుట' యైనది. 'నృపాలు చూపుదొమ్మరి' – రాజుయొక్క చూపులనెడు దొమ్మరి. చక్కని రూపకసమాసము (3-46). 'నృపునేత్రములు' - నృపునియొక్క నేత్రములు (3-47). అచ్చపు తత్సమపద తత్పురుషసమాసము.

'నవలా యేగినదారిఁ గాంచు' (3-96). 'నవలా కలువకంటి నాతి గోతి' యను నిఘంటువువలన స్త్రీపర్యాయముగా 'నవలా' పదము చక్కగాఁ బ్రయోగింపఁబడినది. ఇట్లు తెలుఁగు వ్యాకరణ,నిఘంటుజ్ఞానము పుష్కలముగా నుండుటచే నెన్నియో యచ్చతెలుఁగు పదములను, సంధులను, సమాసములను, చక్కని జాతీయములను జేర్చి తనయచ్చాంధ్రవిజ్ఞానవిశేషములను గోచరింపఁజేసినాఁడు.

తర్కశాస్త్రప్రవీణత

మ. ధరణిన్ మాధవరాయ! తావక బలోద్యద్రేణుపాళి కృతో
ద్ధుర భావత్క మహోగ్ని బుద్ధి ప్రమయై తోఁపంగ, నాన్వీక్షకీ
వరు లవ్యాప్తము ధూళి తద్బలమునన్ బొటిల్లు ధూమధ్వజా
కరధీ యప్రమ యంచు నెంచుట లిఁకన్ గైకొందురే? యెంతయున్. (1-72)

'పర్వతో వహ్నిమాన్ ధూమాత్' (పొగ కనపడుచుండుటవలన ఈపర్వతమునం దగ్ని యున్నది) అను నగ్నిజ్ఞానము, 'యత్ర ధూమ స్తత్రాగ్నిః' (ఎచ్చట పొగ యుండునో అచ్చట నగ్ని యుండును) అను వ్యాప్తిజ్ఞానమువలనఁ గల్గును. ఇది తర్కశాస్త్రమునందలి యనుమానప్రమాణ స్వరూపమును జెప్పుటలో నుపయోగించు పదజాలము. ప్రస్తుతపద్యమునందు బలోద్యద్రేణుపాళిని (సైన్యగమనముచేత రేఁగిన దుమ్మును) ధూమముగా రూపణము చేసి, దాని వ్యాప్తిజ్ఞానముచేత మాధవరాయల ప్రతాపాగ్ని ప్రమయై (యథార్థజ్ఞానమై) తోఁచుచున్నదని నిర్ణయము. 'యత్ర యత్రసైన్యగమనధూళిః తత్రతత్ర మాధవరాయ ప్రతాపాగ్నిః' – సైన్యధూళి యున్నచోట మాధవరాయప్రతాపాగ్ని యుండు నన్న వ్యాప్తిజ్ఞానము, తన్మూలకమగు 'ప్రమ' సిద్ధించుచుండఁగా, అన్వీక్షకీవరు లనఁగా న్యాయశాస్త్రప్రవీణులు, 'ధూళి' అవ్యాప్తము, దానివలనఁ గల్గు 'ధూమధ్వజాకరధీ', అనఁగా వహ్నివిషయకజ్ఞానము 'అప్రమ' యని యెన్నఁడును దలంపరు. అట్లు తలంచువారు అతార్కికులై యుందురని భావము. 'తస్మిన్ తత్ప్రకారజ్ఞానం ప్రమా' (ఉన్నదున్నరీతిని గ్రహించు యథార్థజ్ఞానము ప్రమ). దానికి విరుద్ధమైనది 'అప్రమ' -ఇదియే భ్రమ (అతస్మిన్ తద్వత్తా బుద్ధిః). అవ్యాప్తి యనఁగా (లక్ష్యైకదేశే లక్షణస్యాసత్వం) లక్ష్యములోఁ గొన్నిచోట్ల లక్షణము సరిపోకపోవుట. ఈతెలుఁగుపద్యమునం దీవిధమగు తర్కశాస్త్రవిషయమును, పారిభాషికపదజాలమును గూర్చుట వలన నీకవి కాశాస్త్రమునందు దృఢప్రవేశము గలిగియుండెనని స్పష్టపడుచున్నదికదా!

స్థిరతపనీయసారసన దీప్తిమృషా తపనాతపంబు భా
స్వర కటిహర్మ్యనాభిమిషజాలకవీథికఁ బర్వినన్ దదం
తరమున నక్షిలక్ష్యగతిఁ దాల్చిన సూక్ష్మతరాణు వౌఁ జుమీ
కరికులరాజయాన నునుగౌను మనంబునఁ జింత యూన్పఁగన్' (3-11)

నాయికయగు చంద్రిక 'అణుమధ్య'. ఆమెనడుము అణుప్రమాణమని సామాన్యకవు లందందుఁ జెప్పినట్లుకాక సహేతుకముగా సశాస్త్రీయముగాఁ జెప్పుట. 'జాలసూర్యమరీచిస్థం సూక్ష్మం యద్దృశ్యతే రజః, తస్య షష్ఠతమో భాగః పరమాణుః ప్రకీర్తితః' – గృహముయొక్క గవాక్షమార్గమునఁ బ్రవేశించు సూర్యకిరణములకాంతిలో సూక్ష్మముగాఁ గనపడు రజోరేణు వేదికలదో, దానిలో ఆరవభాగమంత యుండునది పరమాణువు. అట్టి స్థితిగల మధ్యము స్త్రీకెచ్చట నెట్లు గోచరమగుచున్నది? అను ప్రశ్న యుదయించి నప్పు డిదిగో! ఇట్లు, అనుచు నాలంకారికతర్క పరిభాషలతోఁ జెప్పిన పద్యమిది. 'సారసన' మనఁగా నొడ్డాణము, బంగరు నొడ్డాణపుకాంతి యనెడు సూర్యకిరణప్రసారము, కటి యనెడు మేడలోనికి నాభిరంధ్రగవాక్షముద్వారా జరుగుచున్నపు డచ్చట ననుగౌను=సూక్ష్మమగు నడుము అక్షిలక్ష్యగతిని బొందినది. అనఁగా త్రసరేణువై కవిదృష్టికి గోచరించుచున్నదని భావము. పరమాణువు యోగిబుద్ధి సాక్షాత్కారవిషయ మగుటచేత నిచ్చట 'నక్షిలక్ష్యగతిఁ దాల్చిన' అని ప్రయోగించెను. వస్తుప్రమాణవిషయమందు అణుకం, ద్వ్యణుకం, త్ర్యణుకం అనునవి యొకదానికన్న నొక్కటి యెక్కువ. అణుద్వ్యణుకములు మనకుఁ గనబడవు. త్ర్యణుకము మొదలుకొని చక్షుర్గోచరము లగును. కనుక చంద్రికామధ్యము త్రసరేణువై అక్షిలక్ష్యగతిని బొందినదని భావము. ఇదీ అణుమధ్యావ్యవహారము. అట్లే స్వయంవరవర్ణన సందర్భమునందును చంద్రికను 'పారిమాండల్యవన్మధ్య' అని సంబోధించెను. అచ్చటను నిదియే యర్థము. పారిమాండల్యశబ్దమునకు పరమాణువని యర్థము. ఇట్లు తన న్యాయవైశేషికశాస్త్రజ్ఞానవిలసితములగు భావములను కావ్యమునం దచ్చటచ్చటఁ బొదిగియున్నాడు. ఇట్లే జ్యౌతిష, యోగ, సాంఖ్య, వేదాంతాది శాస్త్రపరిభాషలను, తత్తద్విషయ పరిజ్ఞానమును వెల్లడించు పద్యము లాయా సందర్భములందుఁ గలవు.

సంగీతజ్ఞానము

బ్రహ్మదేవుని యాజ్ఞచేత చిత్రరేఖ వచ్చి వసంతమునిని మోహింపఁజేయుటకై చేసిన ప్రయత్నముల సందర్భమున:

ఆయతిలోకమౌళి హృదయంబు బయల్పడ కుక్కి గాంచి యా
తోయజనేత్ర యాళితతితో మునిసన్నిధిఁ జేరి జాళువా
కాయలవీణెఁ గైకొని తగన్ శ్రుతిఁ గూర్చి యొయార మెచ్చఁగా
నాయెడ నేర్పు మించ గమపాదికపుంఖణ మూన్చి వేడుకన్. (2-93)

'గమపాదికపుంఖణ' మనఁగా గాంధార, మధ్యమ, పంచమ స్వరముల మూర్ఛన యని యర్థము.

సీ. ఘనమార్గవిభవంబు వనిత వేణినె కాదు శ్రుతిపర్వరాగసంతతి నెసంగె,
సమతాళవిస్ఫూర్తి సతిగుబ్బలనె కాదు నవ్యగీతప్రతానముల నెనసెఁ,
గలహంసవైఖరి చెలిగతులనె కాదు సరసప్రబంధపుంజమునఁ దోఁచెఁ,
బల్లవంబుల పెంపు పడఁతికేలనె కాదు సొగసైన పదపాళి సొంపు పూనె,
తే. ననుచు వనదేవతాజనం బభినుతింప, రక్తివిధమును దేశీయరాగగతియుఁ,
జిత్రతర మంద్రరాగజశ్రీలు వెలయ, నింతి మునిచెంత వీణె వాయించె నంత. (2-94)

సంగీతశాస్త్రపరిభాషలోని శబ్దములకు చంద్రిక స్తనాద్యవయములతోడి సంబంధము నర్థభేదములచేతఁ గల్పించి చెప్పుట యీ కవి యసాధారణప్రజ్ఞను వెల్లడించుచున్నది. మార్గ,దేశి యని సంగీతము రెండువిధములు. శాస్త్రీయపద్ధతి, సంప్రదాయమును గలది మార్గసంగీతము. దేశభేదమున వైవిధ్యమును బొందునట్టిది దేశిసంగీతము. తాళవిస్ఫూర్తి సతిగుబ్బలకును గీతప్రతాన ములకును సమమట. మొదట తాళఫలప్రమాణము, పిమ్మట ఆదిరూపకాది తాళములు గీతములకు, తానములకును తగి యుండుట. 'కలహంస' రాగము పేరు. అట్లే ప్రబంధము, పల్లవము, పదము, రక్తి, దేశీయరాగగతి, మంద్రాదిశబ్దములు సంగీత శాస్త్రపారిభాషికములు. వాటికి చక్కని యర్థములు గల్పించెను.

చెన్నగు జాళువాయొళవు చిన్నరికెంపులమెట్లు నీలపు
న్వన్నియ నొప్పు కాయలు నవంబగు వజ్రపుకర్వె బచ్చలం
బన్నినయట్టి మేరువును బాగగు తంత్రులు మించ నొప్పు మే
ల్కిన్నర చెంతఁజేరి యొకకిన్నరకంఠి యొసంగ నయ్యెడన్. (2-95)

ఇది వీణాస్వరూపమును బాగుగా నెరిఁగిన పద్యము. కిన్నర వీణకు మరియొక పేరు.

సరసత్వంబునఁ గేలనూని యలయోషామౌళి చక్కన్ 'రిరి
మ్మరిగామారి' యటంచు, 'రిప్పనిమగా మమ్మారి' యంచు న్విభా
స్వర నానా నవరక్తి 'దానతతి' మించన్ 'గౌళ' వాయించి, ని
బ్బరపున్ వేడుకఁజేయు పంతువిధముల్ పల్కించె నప్పట్టునన్. (2-96)

శృంగారోద్దీపకమగు 'గౌళ' రాగమునందు తానమును వాయించి, 'పంతువరాళి' రాగమునఁ గీర్తనలు వాయించె నని శాస్త్రీయముగాఁ జెప్పెను. ఆపై నాచిత్రరేఖ యిట్లు నాట్యము చేసెనట:

బళిరే! మైసిరితీరు, నిల్కడలు సేబా!సయ్యరే! పేరణీ
కలనం, బౌర! పదాళికాభినయవైఖర్యంబు, మజ్జారె! కో
పులవైచిత్రి, యహో! వినిర్మలకరాంభోజాతవిన్యాస, మం
చలివేణుల్ వినుతింప సల్పె నటనం బాకొమ్మ తత్సన్నిధిన్. (2-97)

నాట్యముచేయుటలోగల మెలకువలను, పేరణి మొదలగు నృత్యములను జెప్పి తనభరతనాట్యశాస్త్రపరిచయమును దెలిపెను.

వివిధవర్ణనలు

సీ. సేసకొప్పుల నమర్చిన మొల్లమొగడచాల్ సరిగరుమాలపైఁ జక్కఁ దోఁప,
వలెవాటు వైచిన సుళువుఁజెందిరకావి వలిపముల్ పదపల్లవముల జీర,

నెలవంకరేఖలు నెలకొన్న పేరురములఁ జిల్కతాళులు తళుకుసూపఁ,
జెలువంబు నెగడఁ దీర్చిన క్రొత్తకస్తూరిపట్టెల మేల్తావి మట్టుమీఱఁ,
తే. జెక్కుఁగవ ముత్తియపుటొంట్లజిగి వెలుంగఁ,
బలుకుఁగప్రంపువీడెంబు వలపు నిగుడ,
నలరువేడుక వెనువెంటఁ జెలులు నడవ,
వేడ్కఁ జరియింతు రనిశంబు విటులు వీట. (1-107)

ఇది యానాటి శృంగారపురుషుల వేషము. సరిగరుమాల=జరీయంచుతో నుండి తలకుఁజుట్టుకొను రుమాల. సుళువుఁ జెందిరకావి వలిపముల్=లేఁత చంద్రకావిరంగుగల యుత్తరీయములు. చిల్కతాళులు=తావళములుగా నున్న హారములు. ముత్తియపుటొంట్లు=ముత్యాల చెవులపోగులు.

సీ. కట్టెండ వెడఁదకాఁకఁ గఱంగి ప్రవహించు జవ్వాదిడిగ్గియ చాలలోయఁ
బడుచు జొక్కపుఁ గ్రొత్తపటికంపుఁజఱిపజ్జ బాగైన కెంపురాపణుకువాలు
పొదరుఁ బొన్నలరాలు పుప్పొడియిసుముపైఁ బగిలి యొప్పెడు వేరుపనసపంటి
నీటికాల్వలఁ బ్రోచి పాటించు జేజేల మ్రాఁకుతీవలఁ జుట్టిరాఁగ నలరు
తే. దాకపందిలి క్రింద, నిద్దంపువేడ్క
దవిలి, కోలాటమాడు గంధర్వసతుల
చారుసౌవర్ణకటకసింజానినాద
కుల ఘుమఘుమాయమానమౌ కోనఁ గనియె. (2-20)

నాయకుఁడగు సుచంద్రుఁడు ఎండకాఁకచేఁ గఱంగి ప్రహించుచున్న జవ్వాదిచేత నేర్పడిన యొకదిగుడుబావిని, దానిప్రక్కన స్ఫటికపుదరిపై కెంపులసందులనుండి పుట్టుకవచ్చిన పొన్నచెట్లనుండి రాలిన పుప్పొడియిసుకను, దానిపైఁ బగిలిన పనసపండ్ల రసము కాల్వలుగాఁ బాఱుచుండ వాటి ప్రక్కనున్న కల్పలతలఁ జుట్టఁబడిన ద్రాక్షపందిరి క్రింద, దానిచేత నుత్సాహముతోఁ గోలాటమాడుచున్న గంధర్వయువతుల కాళ్లయందెల చప్పుడుచేతఁ బ్రతిధ్వనించుచున్న హేమకూటపర్వతమునందలి యొక రహస్యప్రదేశమును (కోనను) జూచెనని భావము. తెలుఁగుపదము లెక్కువగా నుండి సమాంతరపాదములు లేని సీసపద్యమిది.

చం. పగడపుఁగంబముల్, తళుకుఁబచ్చల బోదెలు, కెంపుదూలముల్,
జగమఱాల దెంచికలు, చక్కనినీలపుఁ బల్కచాల్, మెఱుం
గగు తెలిమిన్నలోవయును, నచ్చపుబంగరుపేరరంగునన్
దగఁ గనుపట్టు నొక్క వికసన్మణిమండప, మప్డు దోఁపఁగన్. (2-23)

'సమృద్ధిమద్వస్తువర్ణ ముదాత్తః' అను లక్షణముగల ఉదాత్తాలంకారవర్ణనమే యైనను ఇది యాకాలపు గృహనిర్మాణ పద్ధతిని వివరించుచున్నది. లోవ యనఁగా చూరు. కేవలమణిమండపమని చెప్పక దాని యవయవము లెట్టు లాయామణి విశేషనిర్మితములో చెప్పుట చమత్కారము.

మ. అలసత్యాధ్వము డిగ్గి, యప్డు తప మొయ్యన్ దాఁటి, దీవ్యజ్జన
స్థల మాపిమ్మట నొంది, యంతట మహస్థానంబునుం బొంది, వే
ల్పులరావీడట వేడ్క డగ్గఱి, భువర్లోకేంద్ర మవ్వేళఁ జే
రి, లలిం గంజశరుండు దా దొరసె ధాత్రిన్ మేరుమార్గంబునన్. (2-72)

బ్రహ్మదేవుని యాజ్ఞచేత వసంతముని తపోభంగముఁ జేయఁదలఁచిన మన్మథుఁ డాముని తపమాచరించుచున్న భూలోకము నందలి పారిజాతవనమునకు, సత్యలోకమునుండి వచ్చుమార్గము మేరుపర్వతమార్గమే యనియు, నా మార్గమున సత్యలోక, తపోలోక, జనర్లోక, మహర్లోక, స్వర్లోక, భువర్లోకములను గ్రమముగా దిగి, భూమిపైకి వచ్చెనని తెలుపు నీపద్యము మాధవ రాయల పౌరాణికభూగోళవిజ్ఞానమును వెల్లడించుచున్నది. చక్కని ధారగల పద్యము.

సీ. జవరాలి నునుగుబ్బచన్నులఁ జేరుట వసుధాధరస్థలీవసతి గాఁగ
నతివ రత్యంతశ్రమాంబులఁ దోఁగుట నమరాపగావగాహనము గాఁగ
తెఱవ కెమ్మోవిక్రొందేనియ గ్రోలుట నిరుపమామృతపానసరణి గాఁగ
కొమ్మతో రతికూజితమ్ములు నొడువుట సరసాగమాంతాళి చదువు గాఁగఁ

తే. దలఁప బద్మాంబకాభిఖ్యదైవతంబు, మసలక దయారసంబున నొసఁగు సుమ్మ
ఖండితానందగరిమ నిక్కలన మనుము, వట్టి యీఖేదకనివృత్తి గట్టి మౌని. (2-106)

ఇది చిత్రరేఖ వసంతముని తపోభంగమును జేయుటకై చేసిన యుపదేశము. నివృత్తిమార్గమునుండి ప్రవృత్తిమార్గమునకు మార్చుకొని, పద్మబాణుఁడగు మన్మథదైవము నారాధించుటయే నీకు అఖండానందప్రదమగునని బోధ. పర్వతాదులకు బదులు జవరాలిగుబ్బలు మొదలగువానిని సేవించి ధన్యుఁడవు గమ్మన్నది. ఇది వరూథినీప్రవరుల వాదమును స్ఫురింపఁ జేయుచు నంతకన్న విపులముగా వర్ణింపఁబడియున్నది. ఇంతకన్నను శ్లేషచమత్కారముతో మునిని సంబోధించి పలికిన రెండవ యాశ్వాసములోని 104, 105, 106, 107,108 సంఖ్యగల పద్యములలో కవి యసాధారణశక్తిని గనఁబరచినాడు.

తరుణిమొగంబె తానని సుధానిధి విష్ణుపదమ్ము ముట్టి దు
ష్కరకరజాతపాండిమ విగర్హితుఁడై యశుచిం గ్రుశింపఁ, బం
కరుహము తన్ముఖోపమము గానని తా హరిపాదమంటి యిం
దిర దనుఁజేరఁ గీర్తిఁ గని దీపితజీవన మయ్యె నెంతయున్. (3-27)

ఇది చంద్రికాముఖవర్ణనము. చంద్రు(డు, కమలము నను నీరెండు సమానవస్తువులలో(జంద్రు(డు గర్వముచేత నేనే చంద్రిక ముఖము నని విష్ణుపాదమును బట్టి బాస చేసెను. పంకరుహము నేను చంద్రిక మొగమునకు సాటికా(జాలనని హరిపాదము పట్టి వచించెను. చంద్రు(డబద్ధమాడి బాస చేసినందున దుష్కరకరజాతపాండిమవిగర్హితు(డయ్యెను. అన(గా చికిత్సకు లొంగని చేతియందలి పాండురోగముచేత దూషితు(డయ్యెను. కమలము నిజము చెప్పి నిందిర తనను జేర(గా దీపితజీవన మయ్యెను. అన(గా కమలమునందు లక్ష్మి నివసించుటయు, కమలముచేత జీవన మన నీరు ప్రకాశించుటయు మొదలగు కీర్తిని బొంది మేలు(గాంచెను. ఈపద్యమునందలి 'విష్ణుపద, కరజాత, విగర్హిత, అశుచి, హరిపాద, దీపిత, జీవన'పదములు శ్లిష్టములు. నిజము పల్కువా(డు మేలును బొందుననియును, అబద్ధమునకై ప్రమాణములు చేయువా(డు పాపరోగములు గలవా(డగు ననియు వస్తుధ్వని ప్రస్తుతముఖవర్ణనావస్తువుచేత(గలుగుచుండుటచే, నిది, వస్తుకృతవస్తుధ్వని. ఈ చంద్రకమలయుగప్రసక్తి యీ కవికి(గాళిదాసు కుమారసంభవము యొక్రింది శ్లోకభావమువలన గలుగ(గా దానిని కొంచెము మార్చి చెప్పినట్లు దో(చును.

శ్లో. చంద్రంగతా పద్మగుణాన్ న భుంక్తే
పద్మాశ్రితా చాంద్రమసీ మభిఖ్యామ్।
ఉమాముఖంతు ప్రతిపద్య లోలా
ద్విసంశ్రయాం ప్రీతి మవాప లక్ష్మీః॥

చంచలయగు లక్ష్మి యన(గా కాంత్యధిదేవత. చంద్రు నాశ్రయింప(గా పద్మగుణములగు పరిమళాదులు లేకపోవుటయు, అట్లు కాదని పద్మము నాశ్రయింప(గా(జంద్రగుణములగు చల్లదనము, తెల్లదనము లేకపోవుటయు గల్గి, పార్వతీముఖము నాశ్రయించెను. అప్పు డుభయగుణప్రాప్తిచేత ప్రీతినొందె నని భావము. అన(గా పార్వతీముఖము చంద్రారవిందములకన్న నధికమని కాళిదాసు చెప్ప(గా, చంద్రికమొగము సైతము సుధానిధి కమలములకన్న నెక్కువ శోభగలది యని యీకవి చెప్పెను. ఇట్లెన్నియో పూర్వకవుల భావములు భంగ్యంతరమున మాధవరాయల కావ్యమున నచ్చటచ్చట గోచరించుచునే యుండును.

మ. అతిశోణం బతికోమలం బతివిశాలాత్మం బతిశ్లక్ష్ణకం
బతినిమ్నం బతిమేచకం బతిదృఢం బత్యంతపారిప్లవం
బతివక్రం బతిదీర్ఘ మౌర! బళి! యీ యంభోజపత్రాక్షి య
ప్రతిమానావయవ ప్రతానము మనఃపద్యన్ విచారింప(గన్. (3-54)

ఇది నాయికయగు చంద్రికయొక్క సౌందర్యమును నాయకు(డగు సుచంద్రు(డు తనలో(దల(చుకొని వలవంత(గ్రుంగు నప్పటి వర్ణనము. మనఃపద్యన్ అన(గా మనోవీథియందు విచారింప(గా నొకయువతి యవయవములలో(గొన్ని యెఱ్ఱగను, కొన్ని నల్లగను, కొన్ని కోమలముగను, కొన్ని దృఢముగను ఉండుట యాశ్చర్యమని భావించెనట! ఇంతకును విశేషణముల చేత విశేష్యములను స్ఫురింప(జేయు వ్యంగ్యరచనాపద్ధతిచేత నిబంధింప(బడిన అతిశయోక్త్యలంకారమున కిది నిదర్శనము. పాదాది కేశాంతవర్ణనగా నున్న యిందులో అతిశోణంబు=మిక్కిలి యెఱ్ఱగా నున్నది పాదయుగ్మ మనియు, అతికోమలంబు=

మిక్కిలి మృదువుగా నున్నది యూరువులజంట యనియు, అతివిశాలమైనది జఘననితంబప్రదేశమనియు, అతిశ్లక్ష్ణకంబు= మిక్కిలి కృశించినది నడుమనియు, అతినిమ్నమైనది నాభి యనియు, అతిమేచకంబు=మిక్కిలి నల్లనైనది నూగారనియు, అతి దృఢముగా నున్నది స్తనయుగ్మమనియు, అత్యంతపారిప్లవంబు=మిక్కిలి చపలమైనది కనుదోయి యనియు, అతివక్రంబు= ఎక్కువ వంకరలు దీరినవి ముంగురులనియు, అతిదీర్ఘము=మిక్కిలి దీర్ఘముగా నున్నది వేణి యనియుఁ దెలిసికొనవలెనని భావము. నాయకుఁడు విరహభ్రాంతిచే వనమునందలి ప్రకృతివిలాసములను జూచి నాయికకై యువ్విళ్లూరుట యిట్లు వర్ణింపఁ బడినది.

సీ. కమ్మపుప్పొడిగాడ్పు గ్రమ్మ నొప్పగు బండిగురివెంద విరిగుత్తి కొమరుఁ జూచి,
యలరు సంపెఁగతీవ యలమ నింపుగఁ దోఁచు కలికిక్రొమ్మల్లియ చెలువుఁ జూచి,
మగతేఁటి వేడ్కమించఁగ ముద్దుగొనిన చక్కని మెట్టతామరకళుకుఁ జూచి,
సొలపు చక్కెరతిండిపులుఁగు మెక్కెడి బింబికాపక్వఫలము పొంకంబుఁ జూచి,
తే. తరుణి చనుదోయి కెంపుగందవొడిఁ బూసి, చెలువ నెమ్మేను కౌఁగిటఁ జేర్చి, కొమ్మ
మోము ముద్దిడి, పూఁబోణిమోవిఁ గ్రోలి, చెలఁగు టెపు డబ్బునో యంచు దలఁచు నృపతి. (3-94)

పై పెద్దపాదములకును గీతమునందలి పాదములకును, సంబంధమును గల్పించు క్రమాలంకారశోభతో నిది మనోహరముగా నున్నది.

సీ. బాలాంబుజతమాల మాలాభినవజాల జాలామృతోల్లోల షట్పదౌఘ,
రాగాది పరమాగ మాగాంత సుపరాగ రాగావరణభా గరాళపవన,
కేళీగృహ న్మౌళి మౌలిస్థిత పికాలికా లీనరవ లోలితాధ్వగాత్మ,
రాజీవశర వాజివాజీన నిరతాజి తాజీ జనక రాజితామ్రఫలిక,
తే. భవ్య ఋతుకాంత కాంత తాత్పర్య సృష్ట, ఘన విషమబాణ బాణసంఘాత కలిత
తిలక మధుగంధ గంధ సంచులుకితాశ, కనదచిరధామధామ! యివ్వనిక గంటె? (4-53)

ఇది కామజ్వరముచేత బాధపడుచున్న చంద్రికతోఁ జెలికత్తెలు ఉద్యానవనసౌందర్యమును వర్ణించుచుఁ బలుకు ఘట్టము లోనిది. వనిక=చిన్నవనము, ఉద్యానవనమని యర్థము. యమకాలంకారభూయిష్ఠముగా రచింపఁబడిన చతుర్థాశ్వాసములోని పద్యము లన్నియు నిట్టి శబ్దవిన్యాసము గలవియే. ఈపద్యము వాటికి మచ్చుతునుక.

సీ. నటదీశమౌళి దిఙ్నారులు చల్లు మంగళ సితాక్షత జాలకంబు లనఁగ,
నచలావపతనవేళాభ్ర లగ్న తమఃకదంబాపగా జాలకంబు లనఁగ,
వనరాశి రవి మాధవతఁ దోఁప నంబరాగమునఁ బొల్చిన జాలకంబు లనఁగఁ,

దఱి రా శుభము వేల్పుతెఱవచాల్ గన నాకఘనకుడ్యకృత జాలకంబు లనఁగ,

తే. గురుసరశ్శ్రేణి రాజీవకులము నడఁచి, యంబరస్థలి నాఱ దిష్టాఖ్యమైని
కతతి పఱచిన వరజాలకంబు లనఁగఁ, జొక్కమగు మింటఁ గనుపట్టె రిక్క లపుడు. (4-100)

ఇది నక్షత్రవర్ణనము. యమకాలంకారముకొఱకై 'జాలక' శబ్ద మిందులో వరుసగా సమూహము, బిందువులు, మొగ్గలు, గవాక్షములు, క్రొత్తవలలు అను భిన్నార్థములం దయిదు పర్యాయములు ప్రయోగింపఁబడినది. 'మైనికతతి' యనఁగా మీన ఘాతుకుల గుంపు (చేపలను జంపువారలగుంపు). 'పక్షిమత్స్యమృగాన్ హన్తి' అను పాణినీయసూత్రముచేత తద్ధితప్రత్యయ మగు 'ఠక్' అనునదియు, దానికి ఇకాదేశము వచ్చి 'మైనికః' అను శబ్ద మేర్పడును. మీనమును జంపువాఁడని యర్థము. 'మత్స్యపర్యాయేషు మీనస్యైవ' అని భట్టోజీ చెప్పెను. అందువలన 'మాత్స్యికః, మైనికః' అనునవి మాత్రమే సాధువులు. నక్షత్ర ములు, సంధ్యానటుఁడగు శివునితలపై దిగంగనలు చల్లు తెల్లని యక్షతలవలెను, అంధకారమను నది నేలపైకిఁ బ్రవహించుటకు దిగఁగా నాకసమున నంటియున్న జలబిందువులవలెను, సముద్రమున సూర్యుఁడను వసంతుఁడు గన్పట్టగా గగనమను వృక్ష మునకుఁ బూచిన మొగ్గలవలెను, దేవతాస్త్రీలు చూచుటకు గగనకుడ్యమునకు జేయఁబడిన గవాక్షములవలెను, సంధ్యాకాల మున బెస్తవారు సరస్సులయందలి కమలము లనెడు మత్స్యములను బట్టుకొని యాకాశమున నాఱవేసిన వలవలెను గనపడు చున్నవని పద్యభావము.

మ. అనిశంబున్ బుధవర్ణ్య కల్పతరు దీవ్యద్వాసనాలబ్ధిఁ జే
కొని యద్వైతరుచిం గరంబు మను నీక్షోణీస్థలాధీశవ
ర్యుని కీర్తిప్రకరంబు మించ, సకి! యోహో! పూర్వపక్షావలం
బనతన్ రాజిలునట్టి ధ్వాంతపరధామం బెచ్చునే యెచ్చటన్. (5-70)

ఇది స్వయంవరమునకు వచ్చిన రాజులను వర్ణించు సందర్భమునందలి ప్లక్షద్వీపాధిపతి వర్ణనము. ఓ చంద్రికా! ఈరాజుకీర్తిప్రక రము కల్పతరుకాంతితో నేకీభవించిన కాంతి గలదై మించి యుండఁగా, శుక్లపక్షమందుండు చంద్రుని తేజము హెచ్చగునా? అని సామాన్యముగాఁ బద్యభావము. అద్వైతసిద్ధాంతపరులైన విద్వాంసులచేతఁ బ్రశంసింపఁబడుచున్న 'వేదాంతకల్పతరు'గ్రంథ పఠనమననాదులచే నుదయించిన వాసనాబలముచేత బ్రహ్మాత్మైక్యానుసంధానము గల విద్వాంసుఁ డతిశయకీర్తిమంతుఁడై యుండఁగా, పూర్వపక్షమతము నవలంబించిన మాధ్వమత వేదాంతసిద్ధాంతము హెచ్చజాలదని వ్యంగ్యార్థము. పూర్వపక్ష మనఁగా అపసిద్ధాంతము, శుక్లపక్షము నని యర్థద్వయము. 'కీర్తిప్రకర' శబ్దములోని ప్రకరశబ్దము పుంలిగమగుటచేత నొక పురుషుఁడని వ్యంగ్యార్థము. ధ్వాంతపరధామంబు=మధ్వమతసిద్ధాంత మని యర్థము. 'ధ్వ అంతే యస్య సః ధ్వాంతః' అను విగ్రహవాక్యముచేత 'ధ్వ' యను నక్షరము చివరగలది 'మాధ్వ' శబ్ద మగును. తద్వాచ్యులు మాధ్వులు, అనఁగా ద్వైతమతస్థు లని యర్థము. ఈపద్య మీక్రింది వసుచరిత్రలోని చంద్రదూషణపద్యమును బోలియున్నది.

ఉ. ఇంతుల నేచుపాతక మదింతట నంతటఁ బోదు పాంథలో
కాంతక!నిన్ను ఘోరతమమై, ఘనమై, యజహత్కళంకమై

వంతలఁ బెట్టి యాఱుపది వ్రక్కలు సేయక, పూర్వపక్షపుం
గంతుల కేమి? చూచెదవుగా తుది నీ బహుళార్తిఖేదముల్. (వసు: 4-28)

ఈకవి స్వయంవరమునందు నాయికయగు చంద్రిక, నాయకుఁడగు సుచంద్రుని కంఠమున వైచిన స్వయంవరమాలను విశేషముగా నేడు పద్యములలో వర్ణించెను. (పంచమాశ్వాసము, 130, 131, 132, 133, 134, 135, 136 పద్యములు). సుచంద్రుఁడు చంద్రికచే వరింపఁబడుట పార్వతీదేవి ప్రమథగణసాన్నిధ్యమున దక్షిణామూర్తిని వరించినట్లుండెనట. ఆవరమాల సౌగంధ్యము నకై వ్రాలిన తుమ్మెదలు, పూర్వము సుచంద్రుని విరహకాలమున మలినాత్మతో బాధించిన యపరాధమును క్షమింపుమని సుమార్పణముఁ జేసి ప్రార్థించుచున్నట్లుండెనట. చంద్రిక సుచంద్రుని వక్షస్థలమందుంచిన సుమనస్సరవల్లరి, యతని దేహకాంతిచే నెఱ్ఱనయి చంద్రికాకటాక్షజలపుంజములుపర్వఁగా సుచంద్రుని హృదయమందుండు మదనాగ్ని జ్వాల నిలువలేక వెలువడినదో యనునట్లు ప్రకాశించెనట. మఱియు నాపూలదండ సగము ప్రతిఫలించినదై, సుచంద్రుని హృదయమందు కలఁతఁ బెట్టు మదన బాణములను వెలికిఁ దీసికొని రాఁగలనని యతని హృదయమందుఁ జొరఁబడినదా యన్నట్లు ప్రకాశించెనట. సుచంద్రుని కంఠమున నతని దేహకాంతిచే నెఱ్ఱబడిన యాదండ సంపెంగపూలదండ యని భయపడి తుమ్మెదలు పాఱిపోవు చుండఁగా నవి మన్మథుని కింక నీవు సుచంద్రునిఁ బొడువఁ బనిలేదు, అతనిని చంద్రిక వరించినదని చెప్పుటకు వెళ్లుచున్నట్లుండెనట. నాయకుని కంఠమునందు నాయిక వైచినహారము, పద్మరాగమణివ్యాప్తమై యచ్చట చంద్రికారాగలక్ష్మి చేరి యతనిని గౌఁగిలింపఁగా నారాగేందిర బాహులతాయుగ్మమా యనునట్లుండెనట. ఆ వరమాలకాంతి కతఁడు ధరించిన యితరమాలలు నిస్తేజస్కములై యుండెనట. ఇట్లు స్వయంవరమాల నత్యధికముగా నుత్ప్రేక్షించి చెప్పెను.

సుచంద్రునిఁ బెండ్లికొడుకును జేయుటకు ముందభ్యంగనముఁ జేయునప్పు డొకచెలి యతనికిఁ దలయంటెను. ఆ శిర సంటుటలో నాయువతి వంపుసొంపు లెట్లుండెనో కనులకు గట్టినట్లీక్రిందిపద్యమున వర్ణించెను.

సీ. అఱచందమామపై కుఱుకు చీఁకటిపిల్లలన, ఫాలతటిఁ గుంతలాళి జాఱ,
మదిపేరి మరుమేడఁ బొదలు ధూపము పర్వుపోల్కిఁ, గ్రొందావియూర్పులు జనింప,
ననమూఁగువేడ్కఁ జేకొని మ్రోయు తేఁటిచాల్ సరి, నీలవలయముల్ చాల మొరయ,
లవలియాకులఁ గ్రమ్ము నవహైమకణముల గతిఁ, జెక్కుల శ్రమాంబుకణిక లుబ్బ,
తే. సరులు నటియింప, నునుఁగౌను సంచలింప, గుబ్బకవ రాయిడింప, సకుల్ నుతింప,
చూపు నెఱిమించు మించు మేల్సొగసు నింప, నమ్మహీపాలు శిరసంటెఁ గొమ్మ యొకతె. (6-33)

బ్రహ్మ, చట్టుకూఁతు ననఁగా నొక వివేకశూన్యురాలిని సర్వజ్ఞుఁడగు శంకరునికిఁ గూర్చిన తన వక్రరచనను, ఖరపాదుని ననఁగా గాడిదకాళ్లుగలవానిని (ఖరపాదుఁడనఁగా తీక్ష్ణకిరణములు గల్గిన సూర్యుఁడని శ్లేషార్థము) పద్మినితోఁ గూర్చిన విపరీత సృష్టిని, కుముద్వతిని, సంతోషమే యెఱుఁగని యొక స్త్రీని, సత్పతితో, ననఁగా మంచిభర్తతోఁ దార్చిన ప్రదోషసృష్టిని, సర్వాంగములును బంగారపుఛాయతో నున్న లక్ష్మిని చిరపూరుషుని కనఁగా నొక ముదుసలివానికిఁ గూర్చిన యతుల్యసర్గమును, ఈ తనతప్పుల నన్నింటిని లోకము మఱచునట్లు, ధీచాకచక్యము, అసమానరూపము, ఆనుకూల్యము, అనురూపయౌవనము గలిగిన చంద్రికాసుచంద్రదంపతులను జతఁ గూర్చి కీర్తిగాంచె నను వర్ణన గల యీక్రిందిపద్య మత్యంతమనోహరముగా నున్నది.

సీ. చట్టుకూఁతు నొకర్తు సర్వజ్ఞుఁడగు మహేశ్వరునితోఁ దార్చిన వామరచన,
ఖరపాదు రసవదంతర యైన పద్మినితోన గూర్చిన పవలైన చెయ్వు,
లల కుముద్వతి మనోహారియౌ సత్పతితో ఘటించిన యా ప్రదోషసృష్టి,
చిరపూరుషుని వసుస్ఫురితాంగియగు లక్ష్మితో నెనయించు నతుల్యసర్గ,
తే. మన్నియు జగంబు మఱవ నయ్యబ్జజన్ముఁ, డతుల ధీ చాకచక్యబు, నసమరూప,
మానుకూల్యంబు, ననురూపయౌవనంబు, నమర నిద్దంపతులఁ జేసె ననఘశక్తి. (6-108)

ఇట్లు వివిధవర్ణనలలోఁ దన భావకల్పన, పదరచన, సమాసగ్రథన, శ్లేషాద్యలంకారరచనాసామర్థ్యమును, తర్కవ్యాకరణ వేదాంత జ్యోతిషాదిశాస్త్రపరిశ్రమను, సంగీతకామశాస్త్ర నాట్యకళాకోవిదత్వమును, గీర్వాణాంధ్రభాషావైదుష్యమును, వైదికసంప్రదాయములను, లోకమర్యాదలను, యుద్ధరంగవిశేషములను, తత్తదాయుధవిశేషములను దెలుపు నీకావ్యమును మహాకావ్యమనుటయందు సంశయమేమున్నది?

యుద్ధపరికరములు

1. చంద్రహాసము = ఒకవిధమగు ఖడ్గము (దీనితో సుచంద్రుఁడు కుముదుని పూర్వరూపమగు సింహముయొక్క తలను నఱికెను.)
2. నేజ = తోమరమను నాయుధవిశేషము. (పూమొగ్గనేజను మన్మథుఁడు వసంతముని వక్షస్థలమునఁ గుచ్చెను.)
3. బాగుదార = చూరకత్తి (దీనిచే మన్మథుఁడు వసంతముని నఱికెను.)
4. చిక్కటారు = మఱియొక విధమగు చూరకత్తి.
5. గుదియ = గద, పరశువు=గండ్రగొడ్డలి, వంకి=బాకు.
6. ద్రుఘణములు = ముద్గరములు, కుంతములు=బల్లెములు, పరిఘులు=పెద్ద ఖడ్గములు. (వీని నన్నిటిని తమిస్రాసుర యుద్ధమునఁ బేర్కొనెను. ఖడ్గాఖడ్గిలీలలు, శరాశరి యుజ్జృంభణములు, గదాగదివిలాసములు నా యుద్ధమునఁ జూపట్టెను. మరియు పరిఘ పట్టిస ముద్గర గదా భిందివాల తామర శూలాద్యాయుధములతో నా యుద్ధము జరిగెను. రథగజములు, గుఱ్ఱములు, కాలిబంటులు నిలుచు తీరులు, యుద్ధమునఁ బ్రొగ్గొనునప్పటి పద్ధతులు, బాణప్రయోగముల నేర్పులు మొదలయిన యుద్ధవిశేషముల నెన్నింటినో పేర్కొని తన రణవిద్యాకౌశలమును జూపెను.)

స్త్రీసంబోధనములు

పారిజాతాపహరణకావ్యమునందు ముక్కు తిమ్మన్న శ్రీకృష్ణునిచేత సత్యభామను 'ఓ లలితేంద్రనీలశకలోపమకైశిక!' అని పిలిపించెను. ఆపిలుపు సందర్భమునకుఁ దగినట్లున్నది. దానినిఁ జూచి యితరకవులు, విశేషించి యీచంద్రికాపరిణయకర్తయు పెక్కు సంబోధన లట్టి దీర్ఘసమాసయుక్తములైనవాటిని, కొన్ని చిన్నసమాసములతో నున్నవాటినిఁ జేసిరి. వానిలోఁ గొన్ని:

1. విరిగల్వకంటి = వికసించిన కలువలవంటి కన్నులు గలదానా!

2. నిశాకరసోదరదాస్య = చంద్రునికి సోదరునివలె నున్న, అనఁగా చంద్రునివలె నున్న ముఖము గలదానా! ఇచ్చటి 'సోదర' శబ్దము ఇవార్థకము. ('వలె' నను నర్థము గలది). 'దేశీయ దేశ్య రిప్వాభ సోదరాద్యా ఇవార్థకాః' అని కవికల్పలత.
3. జలజాతచ్ఛదదేశ్యనేత్ర = తామరతేకులవంటి కన్నులు గలదానా! ఇందలి దేశ్యశబ్దముసైతము ఇవార్థకము, లేదా ఈషదసమాప్త్యర్థకము.
4. పారిమాండల్యవన్మధ్య = పరమాణు పరిమాణము గల నడుము గలదానా! పారిమాండల్య మనఁగా తర్కశాస్త్రపరిభాషలో పరమాణువు (అణువు) అని యర్థము.
5. సరసీజోపమగంధి = పద్మగంధమువంటి శరీరపరిమళము గలదానా!
6. బంధురనూతన బంధుజీవబాంధవరదనాంశుకామణి = దట్టమై క్రొత్తదై యున్న జపాకుసుమమునకు సరిపోలిన యధరోష్ఠము గల కాంతలలో శ్రేష్ఠురాలా! ఇందలి బాంధవశబ్దము ఇవార్థకము. సగోత్ర, జ్ఞాతి, బంధు శబ్దములును ఇవార్థకములే.
7. సరససితోపమాధర = రసవంతమగు చక్కెరను బోలిన యధరోష్ఠము గలదానా!
8. తరుణచపలాయమానకైతవదశాప్తకబరికాబంధ = క్రొక్కారు మెఱుపువలెఁ గనబడుచున్న మొగలితేకుచేతఁ బొందఁబడిన కొప్పు గలదానా!
9. వలజాలోకలలామ = సౌందర్యవతులలో శ్రేష్ఠురాలా!
10. దృష్ట్యలేహ్యావలగ్నామణి = కంటికిఁ గనఁబడని మధ్యభాగము గల స్త్రీలలో నుత్తమురాలా!
11. బలభిన్నీలసహోదరచ్చికుర = ఇంద్రనీలములకు సమానములగు కురులు గలదానా!
12. సారసజ్ఞాతినయన = కమలములవంటి కన్నులు గలదానా!
13. అంబురుహమ్మన్యముఖీమచర్చిక = తమ ముఖము కమలమువలె నున్నదని తలఁచు స్త్రీలలో నుత్తమురాలా! ' అంబురుహ మాత్మానం మన్యతి ఇతి అంబురహం మన్యం ముఖం యస్యా స్సా అంబురుహమ్మన్యముఖీ' యని విగ్రహము.
14. కుందరదాలలామ = మల్లెమొగ్గలవంటి పలువరుస గలవారిలో శ్రేష్ఠురాలా! రదనము, రదము పర్యాయపదములు.
15. వాసవనీలకుంతలా = ఇంద్రనీలమణులవంటి కురులు గలదానా!
16. పక్ష్మలనేత్రామణి = దట్టమైన ఱెప్పలవెంట్రుకలుగల కన్నులతో నుండువారిలో నుత్తమురాలా!
17. అబ్జపత్రబాంధవన్నేత్ర =కమలదళములతోఁ జుట్టరికము చేయుచున్న కన్నులు గలదానా!
18. బింబవిమతోష్ఠి = దొండపండునకు విరోధి యగు మోవి గలదానా!
19. అమరేశాశ్మవిజేతృకుంతల = ఇంద్రనీలమణులను జయించు ముంగురులు గలది.

సామాన్యముగా నితరకవు లుపయోగించు కమలనయన, పంకజముఖీ, పద్మగంధి మొదలగువానితో పాటు పైవిధములగు సంబోధన లుపయోగించుటలోఁ బ్రాకరణికప్రయోజన మంతగొప్పగా లేకున్నను, పాండిత్యశౌండీర్యము మాత్రము విశేషముగా గోచరించుచున్నది. ఇవార్థకపర్యాయపదముల నన్నింటిని ఉపయోగించెను.

అరుదైన ప్రయోగములు

1. చక్కెరవిల్తుజగడంబు = సంభోగము

2. పూవిలుగలవేల్పురాసివము = మన్మథావేశము

3. తుమ్మెద కమ్మగట్టుమూఁకలు = తుమ్మెదల కమ్మకట్టు సేనలు. కమ్మకట్టుసేన లనఁగా వ్రాసుకొన్న యొడంబడిక ప్రకారము రాజునకు సహాయ్యము చేయునట్టి సేనావిశేషము (కమ్మ+కట్టు=కమ్మగట్టు). సూర్యరాయాంధ్రనిఘంటువు ‘కమ్మకట్టు’ శబ్దముక్రింద నిచ్చిన యుదాహరణములు మూడింటిలో నీచంద్రికాపరిణయమునందలి ‘చెలువగు మైత్రిఁ గోయిలవజీరులఁ దుమ్మెదకమ్మగట్టుమూఁకల, గొరువంకరాదొరల, గాటపుఁజిల్కలకాల్బలంబులన్’ ఇత్యాది ద్వితీయాశ్వాసమునందలి 75వ పద్యమును జేర్చుట గమనింపఁదగినది.

4. నల్లపజ = కోయిలల మూఁక, కిరాతసంఘము (నల్లప్రజ) రూపాంతరము. సూర్యరాయాంధ్రనిఘంటువు ‘కలరవ మూన్చు నల్లపజ కప్పుకరా వెనువెంట రాజమం,డలి నడతేరఁ జైత్రబలనాథునిఁ గూడి’ మొదలగు చంద్రికాపరిణయ చతుర్థాశ్వాసమునందలి 85వ పద్యమును పై యుభయార్థములకు నుదాహరణముగా నిచ్చినది.

5. తాతస్తలోకవాగమృతసంభూతిన్ – తాతస్తత = అక్కడక్కడనుండి వచ్చిన, లోకవాగమృత సంభూతిన్ = జనుల యొక్క అమృతవాక్కులవలన అని యర్థము. ఇచ్చటి ‘తాతస్తత’ శబ్దప్రయోగము పాండిత్యస్ఫోరకము. ‘తత ఆగతః, అని అణ్ ప్రత్యయము, ‘అవ్యయానాం భ మాత్రే టి లోపః’ అనుటవలన టి లోపమువచ్చి యీరూపము సిద్ధించినది.

6. ఖడాఖడి = కఠినముగా (అన్యదేశ్యము)

ఇట్లు జాత్యములును, శాస్త్రీయములును అగు శబ్దప్రయోగములను విరివిగాఁ జేసెను. ఈకవి కవితావైదుష్యము శైలిలోను, పదపదైకదేశశ్లేషలలోను, ఉపమోత్ప్రేక్షాద్యలంకారఘటనములోను, చిత్రవిచిత్రభావ సన్నివేశములలోను, పదబంధముల కూర్పులోను, నూతనపదసృష్టిలోను, అచుంబితకల్పనములలోను బహుముఖముగా నున్నదని చెప్పుట కెంతయో సంత సించుచున్నాను. దీనిని చదివి యానందించుటకుఁ దగిన భాషాజ్ఞానము, విశ్రాంతి, బుద్ధివిశేషము గల చదువరు లదృష్టవంతు లని మనవి చేయుచున్నాను.

కథాసంవిధానము

మన ప్రాచీన పౌరాణికకథలలో పెక్కింటికి ప్రవచనస్థానమైన నైమిశమను పుణ్యారణ్యమునందే సూతపౌరాణికుని సన్నిధిని శౌనకుఁడు మొదలగు మునిశ్రేష్ఠులు వెళ్లి, మహానుభావా! మర్త్యలోకమును పాలించు రాజులలో, పుణ్యశ్లోకావతంసుఁడై, ప్రజలకు ఈతిబాధలు వాటిల్లనీక, చక్కగాఁ బరిపాలనము చేయునట్టి యొకరాజచరితమును దయామతితో మాకుఁ దెల్పవే యని ప్రార్థింపఁగా, పౌరాణికాగ్రేసరుఁడగు సూతుఁడు, చంద్రికాపరిణయప్రాధాన్యము గల సుచంద్రమహారాజు చరిత్రను ఈవిధముగాఁ జెప్పెను. ఓమునులారా! భూమండలమునందు, సకలసంపదలకు నాలవాలమై, సమున్నతప్రాకారాదివైభవముల తోను, సకలవిద్యాపారంగతులైన భూసురులతోను, ఊర్జితతేజోయుతులైన క్షత్రియులతోను, అనంతగుణప్రవృద్ధి గల సిరులచే నలరారు వైశ్యశిఖామణులతోను, తాము పండించిన ధాన్యపుఁదిప్పలు సమున్నతములై చూచువారి కానందమును జేకూర్చు

నట్టి పంటలతో విరాజిల్లు హాలికోత్తములతోను, రమణీయముగా(జూపట్టు మహాపట్టణమైన విశాలానగరము గలదు. ఆనగర మందు శౌర్యధైర్యస్థైర్యగుణోపేతుఁడై సౌందర్యవిజితమదనుఁడైన సుచంద్రుఁడను రాజు గలడు.

ఆరాజు, మయసభవంటి విచిత్రాలంకారపరిశోభితమైన సభామంటపమునం దొకదినమున సకలసామంతదండనాథాది జనములతోఁ గొలువుదీరి యుండెను. అప్పు డచ్చటికి భసితాక్షమాలాజటాధారి యైన సుగుణఖని శాండిల్యమౌని ఇరు ప్రక్కల నున్న జనములు నమస్కరించుచుండఁగా వచ్చెను. అట్లు వచ్చిన శాండిల్యముని కెదురేగి యర్ఘ్యపాద్యాది సత్కార ములు చేసి, యున్నతాసనమునఁ గూర్చుండఁజేసి సుచంద్రుఁడు కుశలప్రశ్నములు చేసెను. శాండిల్యముని రాజా! మీ పరాక్రమ పరిపాలనాది సద్గుణముల ప్రభావముచేత మాయాశ్రమమునందు జపములు, వేదపాఠములు, తపస్సులు, యజ్ఞములు మొద లగు ధర్మానుష్ఠానము లింతకాలమువరకు నిర్విఘ్నముగా సాగుచు వచ్చినవి. కాని యిప్పుడు మాకు మనఃక్లేశమును గల్గించు యజ్ఞవిఘ్నములు దాపురించినవి. అవి యేవి యనఁగా మాయావి, మహాపరాక్రమశాలియై యున్న 'తమిస్రాసురుఁ' డను రాక్ష సుఁడు ఇంద్రాద్యష్టదిక్పాలకులను, సురగణములను లెక్కసేయక, తన చండదోర్దండమండలాగ్రముచేత ధీరుల నడంచుచు, మునులను బాధించుచు, మా సవనక్రియలకు విఘాతముఁ గలిగించుచు, చెలరేగి యున్నాఁడు. అతనిని సంహరించి మా యజ్ఞ ములను గాపాడఁగల నిఖిలాస్త్రవిధానశాలివైన నీవే తగుదువని నిన్నుఁ బ్రార్థింప వచ్చితిని. కనుక మా మునిసత్తముల వాంఛిత మును దీర్చుమని కోరెను. సుచంద్రుఁడు, 'మహామునీ! ఆ రాక్షసుఁడనఁగా నెంత? సకలసైన్యములతో వెంటనే మీవెంట వచ్చి, మీకృపాప్రభావమున నా తమిస్రాసురుని వధించెదను. హరిహరులు వానికి తోడుగా వచ్చినను లెక్కచేయక వాని ప్రాణములు దీసెదను. భూదేవికి రాక్షసభారము లేకుండునట్లును, దేవసంఘము స్వర్గమున నిర్విచారముగా నుండునట్లును, దేవతాసాన్ని ధ్యముచేత భూతలమున నెల్లకాలము యజ్ఞములు సాగునట్లును, మునివర్గగృహములందు నిరంతరయాగములు జరుగు నట్లును, నా నూతనబాణపరంపరలచేత ఆ రాక్షసనాయకుని సంహరించెదను. ఈకార్యమునకు మీరు విచ్చేయవలయునా? ఒక శిష్యునిద్వారా నాకు వార్త నంపియుండరాదా?' అని పలికెను. దానికి సంతసించి, రాజు నాశీర్వదించి, శాండిల్యుఁడు తన తపోవనమునకు వెళ్లెను.

సుచంద్రుఁడు భక్తిపురస్సరముగా శాండిల్యమునిని పంపి, కొలువుఁదీరి ఆప్తమంత్రిజనులతో సమాలోచనము చేసి, సైన్య సమూహములను రప్పించి, జయప్రయాణమును జేసెను. ఆసమయమున సైన్యము కావించిన ప్రయత్నము, మ్రోగించిన భేరీ ఢక్కాదులవలన బయలుదేరిన బంభారవము., బ్రహ్మాండము నిండి, సూర్యబింబము పడిపోవునో! మహావృక్షములు కూలి పోవునో! పర్వతము లెగిరిపోవునో! భూమండలము చలించిపోవునో! దిక్కులు పగిలిపోవునో! మేఘమండలము బ్రద్దలగునో! యను మహాభయమును గల్గించెను. అప్పు డతని కనుసంజ్ఞచేత నొకసారథి, తెల్లని గుఱ్ఱములు గట్టినదియు, వివిధపుష్పమాలా లంకృత మయినదియు, ఉత్తమపతాకలతో గూడినదియు, సకలాయుధసన్నద్ధమైనదియు, సువర్ణపుఱేకులతోఁ బొదుగఁబడిన దియు నగు ఒక రత్నఖచితరథమును దెచ్చి నిలిపెను. సకలభూషణభూషితమైన తన చక్కని శరీరమునకు కుడిప్రక్కన దోపిన వజ్రపుపిడియు, బంగరునొఱయుఁ గల ఖడ్గము మిక్కిలి కాంతినిఁ జేకూర్పఁగా సుచంద్రుఁడు, శుభశకునములను జూచుచు, వివిధసామంతు లిదే సమయమని కొలువుమ్రొక్కులు చేయుచుండఁగా, వేత్రధారులు 'అంగరాజా! పరాకు, కోసలనేతా! పరాకు, కేరళాధిపా! పరాకు' అని మ్రొక్కుచున్న రాజులను హెచ్చరించు పరాకులు పల్కుచుండఁగా, బాలభానుఁడు పూర్వదిక్కున నుదయాద్రిపైన నధిరోహించినట్లు ఆ రత్నరథముపై నెక్కెను. సకలాయుధయుక్తమైన ఆ రథముపై సుచంద్రుఁడు బయలుదేర గా, రాక్షసయుద్ధమునందు ముందుఁజను నింద్రునివెనుక, తారకాసురసంహారత్వర గల కుమారస్వామివంటి శౌర్యధైర్యములు

గల రాజకుమారులు, గుఱ్ఱములపై నెక్కి యతనిని వెంబడించిరి. ఆవెంట నలంకృతము లైన గజములతోను, రథములతోను, అశ్వములతోను, పదాతివర్గములతోను, సకలసైన్యములు బయలుదేరెను. అట్టి సైన్యముల మధ్య నున్న సుచంద్రుఁడు, సర్వ నక్షత్రగణముతో నేలకు దిగిన చంద్రునివలె చూచువారికి నేత్రపర్వముఁ గలిగించెను. అట్లు జైత్రయాత్ర సాగించిన సుచంద్రుఁడు మహారణ్య పర్వత ప్రాంతములు గడచి, కిన్నరీమణివీణానాదములచేతను, వివిధతరులతాపుష్పమకరందపానమత్తము లగు బంభరముల ఝుంకారములచేతను ప్రతిధ్వనించుచున్న హేమకూటపర్వతమును గాంచెను. అట్లు చూచి, తమ విడిదిచేత నొక మహానగరభ్రాంతినిఁ గలిగించుచు, మార్గాయాసముచేత నలసియున్న సైన్యము నంతటిని ఆ హేమకూటపర్వత ప్రాంతారణ్య మందు బసచేయుట కాజ్ఞాపించెను. అట్లు సైన్యమును డించి, బంగరువస్త్రముచేత కుట్టి సిద్ధపరుపఁబడిన పటకుటీరమునందు తాను వాసము చేసి, సంతోషముతో నుండెను. అట్లుండి, తన వయస్యునితో ఆగిరీంద్రతటమునందున్న కాంచనమాలతీలతావల యములనుండి వీచుచున్న మందమారుతము హాయిని గూర్చుచున్నది.ఈపర్వతరాజు తన సమగ్రవైభవమును జూడరమ్మని పవనాంకురములను బంపినట్లుగా నున్నది. అని పల్కి యా ప్రియసఖునిచేతిని కైదండగాఁబూని, చక్కని వజ్రసోపానము లెక్కుచు, పార్శ్వములందున్న మల్లికాలతలు, దాసీజనములవలె మారుతముచే ప్రేరితములై వీవనలు వీవగా నగేంద్రము నెక్కెను. అప్పు డారాజసఖుడు, ప్రభూ! ఈశైలరాజము నీవిచ్చటఁ జేరినమాత్రమున రత్నకటకములతో, స్వర్ణమౌళితో, ఆశ్రిత రాజసింహమై, సంవృతానేకవాహినియై, చందనగంధవాసితమునై నీసారూప్యమును బొందినట్లుగా నున్నది. ఆ వజ్రమయ గండోపలము ఐరావతమును, దానిపైఁ బుష్పించిన పున్నాగవృక్షము దేవేంద్రునిఁ బోలియుండుటచేతఁ గాబోలు నీపర్వతము దేవతల కత్యంతప్రియమై యున్నది. నానావిధమణికూటములతో, మదపుటేనుఁగులతో, వాయువేగమున మ్రోగుచున్న గుహా చయముతో, వాజిసంచయముతో విరాజిల్లు నీహేమకూటము మేరుపర్వతముపైకి యుద్ధప్రయాణము చేయుచున్నట్లు గోచ రించుచున్నది. జనవరేణ్య! ఇచ్చటి చెంచువనితల మృగయావినోదసౌందర్యము, వివిధమృగప్రతిబింబములతో విరాజిల్లు సెల యేటి నీటిసోయగము, గుహాసౌందర్యమును చూడదగియున్నవి. తుమ్మెదల ఝుంకారములు నారీమణుల గానంబులుగాను, మెట్టదామరలపైనుండి వచ్చు పుప్పొడి పసుపువస్త్రముగాను, శిఖరాగ్రమందున్న తెల్లమబ్బు శ్వేతచ్ఛత్రముగాను, అరఁటియా కులు జయపతాకములుగాను, నాగకన్యలు వేశ్యారత్నములుగాను, శార్దూలము లుత్తమరాజశ్రేష్ఠులుగాను గొలుచుచుండఁగా పేరోలగం బున్న రాజరత్నమువలె నీ హేమకూటధరాధరము తేజరిల్లుచున్నదని వయస్యుఁడా పర్వతసౌందర్యమును వర్ణించి చెప్పెను. అట్లు వయస్యునిచే వర్ణింపఁబడుచున్న పర్వతసౌందర్యవైభవమును దిలకించుచు సుచంద్రుఁడు చంద్రకాంతమణి ఖచితమై యిరుప్రక్కల లతాగృహములతో వెలయుచున్న గుహామార్గమున వెళ్లుచు, ఒకద్రాక్షామండపముక్రింద బంగరుటంది యల మ్రోత వినఁబడునట్లు కోలాటమాడుచున్న గంధర్వసతులుగల కోనను జూచెను. అచ్చటికి వెళ్ళి, కోనలోనికి పద్మరాగ ములతోఁ గట్టిన మెట్లదారినుండి యామిత్రసహితముగా దిగి, యొక మణిమంటమును గని, మిత్రమా! ఇచ్చట గొంచము తడవు నిలుతమా? యని యచ్చట నున్న యొక రత్నపీఠముపైఁ గూర్చుండెను.

అప్పుడొక మణిపుత్రిక యొయ్యారముగా వచ్చి కర్పూరతాంబూలము నిచ్చెను. ఒకసాలభంజిక బంగరుపువ్వుల చెంగావివస్త్రము గల వీవనతో వీచెను. ఒకబంగరుబొమ్మ కలాచిని బట్టుకొని నిలిచెను. ఒకచౌకాటపుబొమ్మ పొన్నపూవులు గూర్చిన సురటితో విసరెను. ఇట్టులు ఊడిగములు గొనుచు మిత్రసహితుఁడై సుచంద్రుఁ డానందించుచుండఁగా నొకసింహము, మృగజాతమును బెదరించుచు విశాలమైన ముఖము, వంగినగోళ్లు, శిరస్సుపైకిఁ జేర్పఁబడిన వాలము, ఎఱ్ఱని కేసరములు, వజ్రాయుధములవంటి కోఱలు, ఎఱ్ఱనికన్నులును గలిగి యా ప్రక్కనున్న యొక పొదరింటినుండి వెలుపటికి దూకెను. దూకి,

సుచంద్రాదులను బట్టుకొనుట కుంకించుచుండఁగా సుచంద్రుఁడు తనచంద్రహాసముచేత దానితలను నఱికెను. అట్లు నఱుకఁబడిన దాని శరీరమునుండి వెలువడు రక్తమను సంధ్యారాగమునుండి సూర్యబింబమునుబోలిన కాంతితో నొక పురుషరూపము గోచరించెను. ఆ రూపమును జూచి యాశ్చర్యచకితుఁడై యున్న రాజువద్ద కాపురుషుఁడు ఒకకిన్నరుఁడై వచ్చి, వినయముతో “భానుకులాయ, శత్రుచర్యదమనపండితాయ, భవతే నమోఽస్తు” అని మ్రొక్కెను. అట్లు మ్రొక్కిన యాకిన్నరుని చేతితో నెత్తి చెంతఁ గూరుచుండఁబెట్టుకొని యతనికథ వినఁగోరి రాజిట్లనెను. ఓయీ! లోకోత్తరగుణశాలివి, కిన్నరశ్రేష్ఠుఁడవు నగు నీకు సింహత్వము గలుగుటయు, నది తొలఁగుటయు నెట్లు ఘటించెనో తెల్పుము. వినుటకు వేడుక పడుచున్నా ననఁగా నతఁడు పునఃపునరభివాదమును జేయుచు, తనకథ నిట్లు వివరించెను. ఒకప్పుడు బ్రహ్మదేవుఁడు సకలదేవబృందముతోఁ గొలువుఁదీరి యుండఁగా పారిజాతారణ్యమునందు తపస్సు గావించుచున్న వసంతుఁడను విప్రుని తపోగ్నిజ్వాలలచేతఁ గందిపోయిన మహామనుసువర్ణదేవతలు వచ్చి, బ్రహ్మకుఁ బ్రదక్షిణముఁ జేయుచుండ వానినిఁ జూచి బ్రహ్మ మీకీ దుస్థితి యెట్లు వచ్చెనో తెల్పుడని యడిగెను. వారు ప్రభూ! పారిజాతారణ్యమునందు తన తపశ్శక్తిచేత బ్రహ్మత్వమును సంపాదింపఁ దలచిన వసంతుఁడను నొకడు మా జపవ్యాపారపారంగతుఁడై, సర్వేంద్రియనిగ్రహము గలవాఁడై, నిశ్చలాంతరంగుఁడై, మాయక్షరసంఖ్యను లక్షోపలక్షలుగా జపించుచు, మాకు తాపమును గలిగించుచున్నాఁడు. దీనిని అణగించుటకుఁ బ్రయత్నింపుమని కోరిరి. ఔరా! అతఁడిట్లు చేయునా? యని బ్రహ్మ యాలోచించుచుండఁగా నింద్రుఁడు ప్రభూ! ఆ యతియనఁగా నెంత? వాని జపమెంత? వ్రతమెంత? తపమెంత? మేనక, ధాన్యమాలిని, ఊర్వశి మొదలగు దేవవేశ్యలు, మన్మథుఁడు నుండఁగా మీకు విచార మెందులకు? అనఁగా బ్రహ్మ సంతసించి కంతుని బిల్వఁబంచి వేల్పునవలామిన్నలను జూడఁగా వారందఱు వెలవెలపాటు నొందుచుండ, చిత్రరేఖ నలువకు నమస్కరించి నన్నుఁ బంపుడనెను. మరుని సహాయముతో నా మునితపస్సును భగ్నముఁజేసి మీ ముందునకు దెచ్చి యుంచెద ననెను. అంతలో మన్మథుఁ డచటికి వచ్చెను. బ్రహ్మ యతనిని గౌఁగిలించి, యాసనస్థుని జేసి, యతనికి దనకార్యమును దెలిపి, యా యతిని అబలాపరిచారకునిఁ జేయుమని యంగజుని గోరెను. మన్మథుఁడీ పనికి నన్నుఁ బ్రార్థింపవలెనా? ఈ సురకార్యము నాది కాదా? యని చిత్రరేఖతోను, పికసైన్యములతోను, సకలపరివారముతోను బయలుదేరి మునితపఃప్రదేశమును జేరఁబోవు నప్పు డెన్నియో యపశకునములు గలిగెను. ఆ యపశకునములను లెక్కింపక మన్మథుఁడు చిత్రరేఖతో మేరుపర్వతమార్గమున సత్యలోకమునుండి దిగి, తపోలోకము దాటి, జనర్లోకము చేరి, మహర్లోకము నొంది, స్వర్లోకమును సమీపించి, భువర్లోకమును దాటి, భూలోకమునకుఁ జేరెను. అచ్చట వింధ్యాద్రిసమీపమున నర్మదానదీజలకణములచేతఁ బుష్పించిన పారిజాతవనము కన్నులకింపు గూర్పఁగా నచ్చటి మున్యాశ్రమము నెఱిఁగి యచ్చట మందమారుతమున మార్గాయాసమును దొలఁగించుకొనెను. తనసైన్యము నంతటిని దింపెను. కుసుమశరములు దాల్చి శుకకోకిలభృంగనాదములు చెలరేఁగగా మునిని జుట్టుముట్టెను. అబ్జాస్త్రములు నించి ప్రయోగించెను. పెక్కుబాణములు వేసి యతనిఁ జలింపఁజేయ సమకట్టిన సమయమున చిత్రరేఖ యచ్చటికిఁ జేరి, వివిధభంగిమలతో తన చక్కదనమును ముని చిత్తమున కెక్క జేయుటకుఁ బ్రయత్నించెను. కాని, తాపసుని వైఖరి తఱుగలేదు. అప్పుడు సంగీతపాండితితో చిత్రరేఖ వీణ వాయించెను. విచిత్రగతులతో వాయించిన వీణావాదనము ఫలింపక పోగా, నద్భుతవైఖరులతో నాట్యము చేసెను. అట్లు హాటకకింకిణికాఝుణంఝుణధ్వనులు చెలరేఁగ నాట్యముఁ జేయుచు మునిపాదములకు నమస్కరించి, ‘నియమిచంద్ర! వేల్పుదొరలకు విరాళిని హెచ్చించు చక్కఁదనము గలదానను, చిత్రప్రతిమలకు జీవముఁబోయఁగల పాటను నేర్చినదానను, రంభాదులు మెచ్చు నాట్యము నెఱింగినదానను, హరిహరాదుల సభలలో నెన్నియో బిరుదము లందినదానను, నీవు సరస్వతివే యని బ్రహ్మ మెచ్చుకొను సాహిత్యవిద్యాపాటవము

గలదానను, నాపేరు చిత్రరేఖ, నిన్ను సేవించుటకై వచ్చితి ననుగ్రహింపు' మనెను. ఆపలుకులు విన్న మునిశ్రేష్ఠుఁడగువసంతుఁడు కనుఁగవను సగము విప్పి చిత్రరేఖను జూచి, మరల కన్నులు మోడ్చి, నిరవధిక సమాధిలో నిమగ్నుఁడయ్యెను. అతని చిత్తగతి నెఱుఁగలేని చిత్రరేఖ సఖీజనసహితముగా మునిసమీపమునకుఁ జేరి, యుక్తి చాతుర్యమున 'మునిచంద్రా! నిరుపయోగమగు నీ నివృత్తిమార్గమును గట్టిపెట్టి, జవరాలిగుబ్బలను జేరుట పర్వతసీమల నుండుటగాను, రత్యంతశ్రమజలమునఁ దోఁగుట గంగావగాహనముగాను, యధరపానము నమృతపానముగాను, నారీరతికూజితములు పలుకుట నుపనిషత్పఠనముగాను దలఁచి, కుసుమాయుధదైవత మిచ్చు నఖండానందము ననుభవింపుము'. అని పెక్కు విధముల రత్యుద్దీపక ప్రసంగములు చేసి, మౌన నిమగ్నుఁడై యున్న ముని యంగీకరించినట్లు భావించి, యేమివచ్చిన వచ్చుఁగాక యన్న ధైర్యముతో నతని చేతిని బట్టుకొని తనకళాస్థానముల నుంచుచుఁ జలింపఁజేసెను. ఆచలనమువలనఁ గన్నులు విప్పి క్రోధారుణవీక్షణములతో చిత్రరేఖనుజూచుచు, తోఁకఁ ద్రొక్కినపామువలె బుసకొట్టుచు, 'ఓ నిలింపచాంపేయగంధీ! మన్మథమదాంధకారముచేఁ గన్నుగానక వనములందుఁ దపంబుచే దినములు గడపుచున్న నన్నుఁ దెచ్చుకోలువలపునఁ జేయిబట్టి రతులకు రమ్మని పిలుతువే? ఈయపరాధమునకు ఫలితముగా నీదేవాంగనాభావంబుఁ దొలంగి మానవవనితవై పుట్టి 'సుదోషాకర' సమాఖ్యుఁడగు నొక యిరాపుని బెండ్లియాడి యుండెదవుగాక' యని శపించెను.

అప్పుడు మన్మథుఁడు తన యస్త్రశస్త్రముల నరణ్యమునందే పారవైచి వసంత మలయానిల శుక పికాది పరివారముతో పారిపోయెను. చిత్రరేఖ భయపడి మునిపాదములపైఁ బడి, 'మహాత్మా! మీప్రభావము నెఱుఁగక చేసిన నా యీయపరాధమును క్షమింపుఁడు. మర్త్యకాంతనై పుట్టి దుష్టసమాఖ్యుఁడగువానిఁ జెట్టఁబట్టియుండు దుర్గతిని నాకుఁ దొలఁగింపుఁడు. మీశాపమును మరలింపు' డని ప్రార్థించెను. ఆప్రార్థనముచేతఁ గరుణాయత్తచిత్తుఁడగు ముని 'ఓ నారీమణీ! నాశాపము అమోఘము. ఐనను దాని కన్యథార్థము గల్పించి నీ వనుభవించునట్లు చేయుదును. 'సుదోషాకర' శబ్దమునకు అధికదోషములు చేయువాఁడను అర్థమునకు బదులు రాత్రిని గలిగించు చంద్రుఁడనియు, 'ఇరాపుఁడు' అనుశబ్దమునకు మద్యపానముఁజేయువాఁడను నర్థమునకు బదులు భూపాలుఁడు అను నర్థమును ఉండుటచేత నీవు 'సుచంద్రుఁ' డను పేరుగల రాజును బెండ్లియాడుమని శాపవచనార్థము తేలును. కావున నీవు మర్త్యలోకమునఁ బుట్టినదానవై సుచంద్రమహారాజును బెండ్లియాడి శతసహస్రవత్సరములు సకల రాజభోగము లనుభవించి పిమ్మట స్వస్వరూపమును బొంది స్వర్గమునకు వెళ్ళెదవుగాక' యని శాపమును సడలించెను. చిత్రరేఖ తృప్తిపడి సఖీజనముతోఁ దన కేళికాగృహమునకుఁ జేరెను.

మునిశాపవశమున చిత్రరేఖ భూమండలమున బాంచాలదేశము నేలు 'క్షణదోదయుఁ' డను రాజునకు 'శ్యామ' యను భార్యయందుఁ గన్యయై పుట్టి 'చంద్రిక' యని పిలువఁబడెను. బ్రహ్మదేవుని కీవార్త తెలిసి చింతించి అట్లు మర్త్యస్త్రీయై పుట్టిన యామెకు పెక్కుదివ్యచిహ్నములు గలిగించెను. 'కుముదుఁ' డను నామధేయముగల నన్ను భూలోకమునకు వెళ్ళి 'చంద్రిక' కు వీణావాదనము నేర్పుమని చతుర్ముఖుఁ డాజ్ఞాపింపఁగా నేను వచ్చి పూర్వస్నేహముచేత నామెను వీణావాదనచతురను గావించితిని. ఇతోధికనైపుణ్యము నాచంద్రికకుఁ గలిగింపఁ దలఁచి యొకనాడు శారదాదేవిసన్నిధి కేగి కొన్ని వింతరాగములు విని వాని నామెకు నేర్పఁదలఁచి ఆకసమునుండి భూలోకమునకు వచ్చునపుడు నిండుజవ్వనమున మిసమిసలాడు చక్కని యొక మునికాంతను జూచి యీతలిరుఁబోఁడిని గలియఁజాలని జన్మము జన్మమే? యని కామమోహితుఁడనై యాతాపసాంగన సంచరించు గృహమువద్ద మునులమహాసభలో నేనెఱిఁగిన శాంబరీవిద్యచేత నేనును ఒక మునితల్లజునై కూర్చుంటిని. ఇంతలో నా యువతిభర్త యచ్చటికి వచ్చి నామాయావిత్వము నెఱిఁగి 'ఓరీ కిన్నరాధమా! నీవిట్టి పనికిఁ బూనితివా?' యని

‘సింహరూపముతో నరణ్యమునఁ బడియుండు’ మని శపించెను. భీతిల్లిన నే నామునిపాదములపైఁబడి శాపము నుపహరింపు మని ప్రార్థింపఁగా ‘నావచన మమోఘము గాన నీకు సింహత్వ మైదువత్సరము లుండు’ నని యనుగ్రహించెను. తత్ఫలితముగా నేను సింహమునై యీపొదరింటిలో నుంటిని. ఇప్పుడు నీఖడ్గధారకు గురియై సింహత్వము దొలఁగి నాపూర్వరూపంబును గంటి నని చెప్పఁగా సుచంద్రుఁ డతని నభినందించి యుపలాలించెను. అప్పుడు కుముదుఁడు, సుచంద్రునితో నో రాజా! చంద్రిక యఖండసౌందర్యవిలాసము, దేవతాత్వము విడిచి మానుషీత్వమును బొందిన యామె మంజులాంగకాంతి, మెఱుపుఁదీవను మించు నామె లావణ్యము, మొగ్గలను బోలిన యాకన్యపాదనఖములు, మార్దవారుణ్యములచేతఁ బల్లవకాంతి నోడించిన యా నెలఁత యడుగుల కాంతి, ఆజవరాలి మెఱుఁగుపిక్కలసోయగము, ఏనుఁగుతొండములను యరఁటికంబములను దిరస్కరించు నామెయూరువులు, అణుమధ్యయు, నతనాభియు, లకుచకుచయు, కంబుకంఠియు, చంద్రముఖియు నగు నాచంద్రిక, ఆవామేక్షణ, ఆ వక్రాలక, ఆలేమ సౌందర్యము నుతింపఁదరముగాదు. ఓనృపాల! ఆమిళిందకుంతల, ఆమీననేత్ర, ఆతామరసానన, ఆపికరవోజ్జ్వల, ఆయబ్జగళ, ఆబిసబాహ, ఆప్రవాళలలితపాద, ఆచెలి నీకే తగును. అని తనకథను జెప్పు సందర్భమున చంద్రిక జనన క్రమ సౌందర్యవిలాస విశేషములను జెప్పెను. ఆవృత్తాంతము విన్న సుచంద్రుని కద్భుతాశ్చర్యములు గలిగి చిత్తమునఁ బూర్వ జన్మసంస్కారముచేతనో మన్మథుని శాంబరీమహిమచేతనో చంద్రికపై ననురాగము రేకెత్తెను. ఆమెను జూచుటకు వాంఛ గల్గెను. కుముదునితోఁ దనకుఁ గలిగిన చంద్రికాదర్శనకుతూహలమును వెల్లడించెను. ఆవెంటనే కుముదుఁడు సతసించి తనవిమానమును స్మరింపఁగా నది వచ్చెను. వారిద్దఱు నావిమానము నెక్కి, యక్షుని మాయాప్రభావమున నెవ్వరికిని గనఁబడక, గిరినదీవనములు క్షణకాలమున దాటి క్షణదోదయరాజు పట్టణమును, తదుపరి చంద్రికావిలాసవనవాటినిఁ జేరిరి. కిన్నరశ్రేష్ఠుఁడగు కుముదుఁడదిగో! యటు చూడుము అనఁగా సుచంద్రమహారాజు బంగరుపీటపైఁ గూర్చుని తన గానచాతురికి శిలలు గఱుగఁగా మణిపుత్రికలు తల లూపఁగా, లయశ్రుతులయందు సఖులు పారవశ్యమును జెందియుండఁగా, వృక్షలతాదులానందమునఁ జిగుర్పఁగా విపంచీనాదమునఁ గంఠస్వరమును మేళవించి గానము చేయుచున్న కనకగాత్రి యగు చంద్రికను అద్భుతాశ్చర్యములు నిండిన నిండుమనస్సుతో రాగరంజితములగు వీక్షణములు నిగుడించి చూచెను. ఆ వీక్షణమువలన నతనికి మేను చెమర్చెను. పులకలు రేకెత్తెను. స్తంభోదయ మయ్యెను. చూపులు నూగారుద్వారా స్తనపర్వతములపై నిలిచి దిగకుండెను. ముఖసుధాపానపారవశ్యమున ననిమేషత్వమును బొందెను. అట్లు చంద్రికాయత్తదృక్చకోరుఁడైన సుచంద్రుఁడు, తన మనస్సున ఈ హేమగాత్రి క్రొత్తగా సానదీరిన మన్మథునిఖడ్గము గాబోలు. ఔర! యీ చెలువచెలువము! అయ్యారె! ఈపొలఁతి యొయ్యారము! అని తదేకతానమనస్కుఁడై పొగడెను. అప్పుడు కుముదుఁడు రాజా! చూచితివిగదా! నాపలుకు నిజమేకదా! ఇఁక నేను వెళ్ళి ఈకొమ్మకు త్వదేకమతని గలిగింతు నని సుచంద్రునియాజ్ఞను గైకొని, విమానము డిగి తరులతామార్గములను దాటి, తాను సింహత్వమును బొందకమున్నున్న రూపవైఖరితోఁ జంద్రిక యున్నచోటికిఁ జేరఁగా, సఖులందఱు నబ్బురపడి గురుప్రముఖుఁడు వచ్చెసుమా! యన చంద్రిక సఖీయుక్తముగా నెదురేగి నమస్కరింపఁగా పెండ్లికూఁతురవు గమ్మని యాశీర్వదించి, వారు చేసినపూజలు గైకొని, వారేర్పరచిన రత్నపీఠముపైఁ గూర్చునెను. అప్పుడు చంద్రిక చెలికత్తెయగు చకోరి కుముదునిఁ జూచి “మీరింతకాలము రాకపోవుటచే మేము మిక్కిలి చింత నొందుచు నిదిగో వత్తురు, అదిగో వత్తురని ప్రతీక్షించుచు నుంటిమి. ఏల యింతకాలము రాకపోయితిరి? ఏపురమున నుంటిరి? ఏయే విశేషములను జూచితిరి? ఏరాజుతోఁ జెలిమి చేసితిరి? దయతోఁ దెల్పుఁడు” అని కోరఁగా కుముదుఁడు చకోరిని జూచి మధురోక్తులతో “మహాపరాక్రమవంతుఁడగు సుచంద్రుఁడను నొక రాజచంద్రుఁడు గలఁడు. సరసకలాంచితాస్యుఁడు, చారువిలోచనపద్ముఁడు, కళంకరహితగాత్రుఁడు నగు నానృప

శిఖామణిని నాగకన్యలు, దేవకన్యలు, మానవకన్యలు గోరి పంచశరవేదనను భరింపఁ జాలకుందురు. అట్టి సుగుణఖనియు, సుందరాకారుఁడును, సుక్షత్రియవతంసుఁడునైన యతనిమైత్రి గలిగియుంటిని. ఇప్పు డీ మీచెలిని జూడఁదలఁచి యతనియాజ్ఞను గొని వచ్చితిని. ఈచంద్రికను జూడఁగా నీయమ ఆరాజునకే తగును. ఆనరనాథుఁ డీజలరుహనేత్రకే తగునని నామనస్సునఁ దోచుచున్నది. కనులు వికసిల్లగా నాజనాధీశచంద్రుని జూచినఁగాని నాకోరిక తీరదు. మీరు సైతము త్వరలో నతని జూడఁగలరు" అని పలుకఁగాఁ జకోరి, "సూర్యవంశసంజాతుఁడగు నాయుత్తమనాయకుని గుణములను విని మేము వర్ణింపఁగాఁ జంద్రిక యాపతిని జూచుటకై యువ్విళ్ళూరుచున్నది. మాకును జూడ బుద్ధిపుట్టుచున్నది. ఎట్లా సుందరాకారునిఁ జూడఁగలమో తెల్పుము" అనఁగా కుముదుఁడు మీకు వాంఛ గలిగియున్న చో నాచేతివైపున చూడుడు" – అని యంతవఱ కావహింపఁజేసిన తిరస్కరిణీ విద్యాప్రభావమును దొలఁగింపఁగా, మన్మథుని మించినసౌందర్యరాశియగు సుచంద్రుఁడు విమానమునఁ గూర్చుని దర్శన మీయఁగా మేను పులకలచే నిండ, మనస్సున వలపు నిలువ, చూపున ననిమేషవిస్ఫురణము గలుగ, ప్రమోదము చిందులు ద్రొక్క, మణిపీఠమునుండి దిగి, ఒకచెలిచేతినికైదండబూని ఆచంద్రిక యారాజకుసుమాస్త్రుని ఒకింత సిగ్గుతోఁ జూచెను. ఆ రాజుచూపులు తెల్లనిగంగాప్రవాహమువలెఁ జంద్రికపైఁ బ్రసరింపఁ జంద్రికచూపులు చేపలవలె నెదురెక్కుచుండ వారిద్దఱును పరస్పరప్రేమవీక్షణములు చేయుచు రాగరసనిమగ్నులైరి. సుచంద్రుని యొక్కొక్క యవయవమే యనేక నల నాసత్య స్మరాదులను దలపించుచుండఁగా వారిపోలిక యితనియెదుట చెల్లదని ఆపల్లవాధర భావించుచుండెను. అట్లు మోహ పరవశమై యున్న చంద్రికవద్ది కొకచెలి వచ్చి, "రాజకుమారీ! మీతల్లి నీవీణను వినఁగోరి నిన్ను రమ్మని యాజ్ఞాపించినది" అని చెప్పఁగా నామె గురుని వినయముతోఁ గాంచెను. గురువగు కుముదుఁడు "ఓకిన్నరకంఠి! ఈనృపతికి నీవు సతివౌదువు. నా మాట తప్పదు. వెళ్ళిరమ్ము" అనఁగా గురునియాశీర్వచనమును గొని చంద్రిక తనమాత సన్నిధికి వెళ్ళెను. సుచంద్రుఁడు స్వప్నమువలె జరిగిన యీసంఘటన కుద్భ్రాంతచిత్తమున వియోగచింతాభరభరితహృదయుఁ డయ్యెను. చంద్రికాయత్త మనస్కుఁడై శారికాశుకముల పల్కులను చంద్రికామధురభాషణములుగాను, బండిగురివెంద విరిగుత్తిని చంద్రికచనుదోయి గాను, తదితరములగు ప్రకృతివైభవములను చంద్రికాసౌందర్యవిశేషములుగాను భావించుచు, నామె యేగిన దారినిఁ గాంచుచు, నామె లావణ్యవిశేషములనుఁ దలఁచుచు వలవంతలోఁ జిక్కి బాధపడుచుండఁగాఁ గుముదుఁడు "మహినాయక! యేల చింతించె దవు? నిన్నుఁ బ్రేమతోఁ జూచిన యా వధూమణిని మన్మథుఁడింతకు ముందే తనసూనబాణములచే నీయందు సమగ్రమనోరథను జేసి యున్నాఁడు. ఆమె నిన్ను తప్పక వరించును. చింత యెంతమాత్రము నీకవసరము లేదు" – అని చెప్పఁగా సుచంద్రుఁడు కుదుటపడి, విమానముపై నెక్కి, తనసైన్య మున్నచోటికి వచ్చి, కుముదుని కూర్మిమీరఁగాఁ బంపెను. పిమ్మట ముని కిచ్చిన తనవాక్కును దలఁచుకొని తమిస్రదానవుని వధించుటకైసైన్యసమేతముగాఁ బయలుదేరెను.

రణభేరిని మ్రోగించుచు హిమవత్పర్వతమును జేరిన సుచంద్రుఁడు రాక్షసునినగరమును ముట్టడించి, కరిఘీంకారములు, అశ్వహేషలు, రథనినాదములు, సైనికులవీరాలాపములు చెలరేఁగ రాక్షససైన్యమును దుత్తునియలు చేసెను. వీరాధివీరుఁడగు తమిస్రాసురుఁడు పెక్కు దుర్భాషణము లాడుచు సుచంద్రుని లెక్కింపక రణరంగమున విహరించుచుండఁగాఁ దనధనస్సున నారాయణాస్త్రమును సంధించి వానితల నఱికెను. ఆరాక్షససంహారమును గాంచిన దేవతలు, యక్షులు, కిన్నరులు, మునులు, నరనాథులు, సైనికులును ఆనందించిరి. ఇంద్రాదిదిక్పాలు రానందించి పెక్కుపారితోషికము లిచ్చిరి. సుచంద్రునివైపున యుద్ధ మొనరించి మరణించినవారి నందఱిని ఇంద్రుఁడు అమృతధారలు గురిపించి మరలఁ బ్రతికించెను. మునులు రాజున కభ్యుదయ పరంపరాభివృద్ధి యగునట్టు లాశీర్వదించిరి. సుచంద్రుఁడు ప్రతిజ్ఞ నెరవేరినందులకు సంతసించుచు, తిరుగుప్రయాణమునఁ

గనుపట్టుచున్న ప్రకృతిచిత్రము లన్నిఁటియందును చంద్రికాసౌందర్యము నూహించుచు నాయింతి నెప్పుడు చేపట్టగలనో! యను చింతతో స్వనగరమును జేరి, యేకాంతమున విరహవేదనతోఁ బవ్వళించెను. అనురాగాతిశయముచేతఁ జంద్రికను దలంచుచుండఁగా సుచంద్రునికి దేహమందుఁ బులకలు, లోచనములం దశ్రువులు బొడముచుండెను. ఇఁక నక్కడ సుచంద్రునిపై మోహము బొడమిన చంద్రికకు నవపల్లవాద్యుద్దీపకదర్శనమువలన ఆకులత్వము గలిగెను. శుకకూజిత భ్రమరఝుంకారాదులచేత సంతాపము మిక్కిలి యుప్పొంగెను. పికధ్వనులయం దరతి గలిగెను. కార్శ్యముచేతఁ గరకంకణములు, దైన్యముచేత నయనాశ్రువులు జాఱెను. సఖీవిరచిత సుచంద్రచిత్రవీక్షణమునఁ బ్రత్యక్షప్రియసంగమము నప్పుడప్పు డనుభవించుచుఁ గొంత యూరటఁ జెందుచుండెను. కాని మరల నుద్వేగము, మరలమరల యరతి మొదలగు ననంగదశలకు లోనై విరహవేదనాదోదూయమానచిత్తయగు చంద్రికను, వసంతోదయ మగుటవలన చెలులుకేళికావనమునకుఁ దీసికొనిపోయిరి. కాని యచ్చటను గోకిలాలాపములు, నవపల్లవములు, మందమారుతము, ఆమెను బాధించుచునే యుండఁగా, జలక్రీడ లామె ప్రియవియోగ దుఃఖము నినుమడింపఁజేయఁగా, సఖులు, మన్మథపూజవలన నీవిరహబాధ శమించునని యూహించి, సాంగసపరివారముగ కుసుమాస్త్రునిఁ గల్పించి, ఆవాహనార్ఘ్యమజ్జనాది పూజలు చేయించిరి. అదియు ఫలింపక పోగా మరల కేళికాగృహమునకుఁ దోడ్కొనిపోయిరి. సూర్యాస్తమయముల సౌందర్యము లెంత వర్ణించినను చంద్రిక సుచంద్రునిదక్క మరియొక యుపాయమున యూరటఁ జెందఁజాలదని యెఱిఁగిన సఖులు క్షణదోదయమహారాజున కెఱింగింపఁగా నతఁడు తనకూతురు సుచంద్రనరపతి యెడలఁ బ్రేమ గలిగియుండుట శుభోదర్కమని భావించి, ఆమె యిష్టార్థసంసిద్ధికై చంద్రికాస్వయంవరమహోత్సవమును జాటించుట కాత్మానుచరులను బంచెను. రాజభటులు సకలదిఙ్మండలములందుఁగల రాజధానులయందు చంద్రికాస్వయంవరమును జాటించిరి. ఆయా రాజకుమారులు చంద్రికను వరింపఁదలఁచి బయలుదేరిరి. సుచంద్రుఁడును పురకాంతలు పుష్పాక్షతలు చల్లుచుండఁగా, విప్రులు దీవించుచుండఁగా, భూషణభూషితాంగుఁడై యొకమదగజము నెక్కి బయలుదేరెను. అట్లు స్వయంవరమునకై వచ్చిన రాజులనందఱిని పాంచాలభూపతి యెదుర్కొని రత్నమయనివేశస్థానములందు దించెను. సకలసౌకర్యములు గలిగించెను. మంచాధిష్ఠితుఁడైన సుచంద్రుఁడు తన సౌందర్యాతిశయముచేత నితరరాజకుమారులకుఁ దమను చంద్రిక వరించునో, లేదో, యను సంశయమును బుట్టించుచు నందఱిలో మణి యనఁదగినట్లుగా నుండెను. సర్వాలంకారశోభితమైన స్వయంవరమండపమున నిలిచి, తన తనయను రాజన్యులకు, రాజన్యులను దన తనయకుఁ బరిచయముఁ జేయుటకు జగజ్జనని పార్వతిదక్క మరియొక్కరు సమర్థులుగారని యెంచి, యాతల్లిని పరిశుద్ధమనస్కుఁడై ప్రార్థించెను. శిరమునఁ జంద్రలేఖయు, కనులలో దయారసమును, మందస్మితమును, ఫాలలోచనమును, చనుగవ నొరయు ముత్తెపుసరులును, బంగరు వస్త్రమును, పరిమళించు నంగలతయు గలిగి, యందఱు నాశ్చర్యపడుచుండ నాగట్టురాపట్టి క్షణదోదయుని యెదుట సాక్షాత్కరించెను. రాజులందఱును లేచి నమస్కరించిరి. పాంచాలరాజు పార్వతికి నమస్కరించి సఖులకుఁ జంద్రికను దోడితెండని యానతిచ్చెను. రాజన్యులనెడు వనములకు వసంతమువలెను, నలువ నేర్పుచే నిర్మించిన మణిపుత్రికవలెను, క్షణదోదయుని సుకృతలక్ష్మివలెను ప్రకాశించుచు, దేహకాంతిచే నినుమడించిన మణిభూషణతేజస్సుగల చంద్రిక సఖీమధ్యగతయై స్వయంవరసభాస్థానమునకు వచ్చెను. ఆమెను జూచిన రాజన్యులు ఆమె మెఱుఁగుతీఁగయో, లక్ష్మియో, రతియో, యని భావించుచుండిరి. అట్లు వచ్చిన చంద్రిక తండ్రినిఁ జేరి, యతని యనుజ్ఞచేతఁ బార్వతికి నమస్కరింపఁగా నాహైమవతి "అభీష్టార్థసంసిద్ధిరస్తు" అని దీవించి, కౌఁగిలించుకొని, చంద్రికతలపైఁ గనకమంగళాక్షతల నుంచెను. పిమ్మట పల్లకిపైఁ జంద్రికను గూర్చుండ నియోగించి, తానొక సఖీరూపమును దాల్చి, ప్రక్కన నడచుచు మేరుశృంగములపైఁ గూర్చున్న సింగపుఁగొదమలఁ బోలి

యున్న రాజకుమారులను సువర్ణమంచనికాయములపైఁ జూపి యుల్లేఖించుచు, వారివారి శౌర్యధైర్యగాంభీర్యాదిసద్గుణములను విశదపరచుచు నొక్కరొక్కరినిగా, పుష్కరద్వీపాధిపతిని, శాకద్వీపాధిపతిని, కుశద్వీపభూవరుని, శాల్మలిద్వీపనాయకుని, ప్లక్షద్వీపాధిపతిని, జంబూద్వీపభూపాలలోకంబునందు గౌడదేశాధీశుని, మథురానాయకుని, కాశీరాజును, కర్ణాటభూపతిని, అంగదేశపురాజును, కేరళమహీపతిని, దహాళభూపాలును, భోటరాజును, సింధుదేశాధిపతిని, కుకురుదేశాధిపతిని జూపి వరింపుమనఁగా, జంద్రిక వారియెడ నౌదాసీన్యంబును, నలక్ష్యభావంబును, ననాసక్తిని వెల్లడింపఁగా గౌరి యాకనకగౌరిని ముందునకుఁ దీసికొని వెళ్ళి రాజసభామధ్యమున నక్షత్రనికరాంతర ద్యోతమానుండగు సుధాకరునిఁ బోలియున్న సుచంద్రమనుజేంద్రునిఁ జూపి, తదీయచిత్త మాతనియం దనురక్తమైయుండుట నెఱింగి యిట్లనియె. "లలనా! రవిప్రభావిరాజమానుఁడగు ఈ విశాలారాజధానీప్రభువును సుచంద్రునిఁ జూడుము. నీకరాబ్జములందున్న ప్రసూనమాల యాతనివక్షస్థలముపై విష్ణువక్షమునందు వైజయంతీమాలవలెఁ బ్రకాశించునుగాక. ఈసుచంద్రధరణీపతి శాతశరములచేత రాక్షసరక్తము అర్ఘ్యముగాను, ఆదానవుల యేనుఁగుల తలలోని మణులు సుమాంజలిగాను, వారి యాతపత్రము లారతులుగాను జేయుచు తమిస్రాసురుని రణచండికి బలిగా నొసంగి, మునుల యాశీస్సులను బడసిన మహావీరుఁడు. ఇతఁడు సకలనృత్యకళాశాలి, సౌరవంశమౌళి. బింబోష్ఠీ! విలంబమును మాని యితనిని వరింపు మనఁగా తన్మనోనాయకసంవరణ సముద్వేగ వలమానమానసయై తదనుజ్ఞ చేత నతఁడున్న కాంచనమంచక మెక్కి మంజుల మంగళపుష్పదామమును సుచంద్రునికంఠమున వైచెను. దమయంతి నలుని వరించినతీరున నున్న యా చంద్రికాసుచంద్రులను జూచి సూర్యచంద్రవంశ్యరాజు లందఱును సంతసించిరి. దేవతలు పుష్పవర్షమును గురిపించిరి. తాపసాధిపులు దీవించిరి. దేవాంగనలు నృత్యముఁ జేసిరి. క్షణదోదయుఁ డానందించెను. పార్వతి తన నిజరూపమును ధరించి సుచంద్రునికి భువనేశ్వరీమహామంత్రము నుపదేశించెను. సిద్ధసంకల్పుఁడై సుచంద్రుఁడు తన శిబిరమునకేగెను. పాంచాలవల్లభుఁడగు క్షణదోదయుఁడు సుచంద్రుఁడు చంద్రికను బెండ్లియాడఁ దగిన శుభలగ్నమును నిర్ణయింపఁజేసి ధన్యమ్మనుఁ డాయెను. పురము నలంకరించుటకు శిల్పుల నాదేశించెను. వారు నగరము నంతటిని రమణీయముగా నొనర్చిరి. మంగళవాద్యములు భూనభోంతరాళములందు మ్రోగుట కారంభించెను. ముత్తైదువులు గౌరీకల్యాణములు పాడిరి. చంద్రికకు మంగళస్నానమును రత్నపీఠిపై నుంచి "శోభానేశోభనమే" యని పాడుచు నిర్వర్తించిరి. సుంకులు చల్లిరి.స్నానము చేయించిరి. జడ యల్లి, మొగమున చంద్రరేఖబొట్టును దీర్చి, గంధము పూసి, కంకణాద్యలంకారములు పెట్టి, మకరికాదిపత్రరచనలు చేసి, వజ్రమాలిక వేసి అలంకరించిరి. పెండ్లికూతురును చేయుటలో శచీదేవి, స్వాహాదేవి, యమభార్య, నిరృతిభార్య, వరుణదేవుని భార్య, వాయుపత్ని, కుబేరపత్ని, పార్వతీదేవి మొదలగువారు తమతమ యంతస్తులకుఁ దగిన యాభరణములూన్చి సహకరించిరి. అంతకు ముందే బంధు, వయస్య, దండనాథముఖ్యులు సుచంద్రునిఁ బెండ్లికొడుకును గావించుటకు తరుణులను బంపఁగా వారు మంగళవాద్యనినాదములతో, ముత్తైదువుల పాటలతో స్నానము చేయించి, తల దువ్వి, సకలాలంకారములు గైసేసి పెండ్లికొడుకును చేసిరి. ఇంద్రుఁడు ముత్యాలయంటు జోళ్లను, అగ్ని ముత్యాలహారమును, యముఁడు మణిహంసకమును, నిరృతి రత్నాలపతకమును, వరుణుఁడు ముత్యాలబాసికమును, వాయుదేవుఁడు కెంపులయుంగరమును, కుబేరుఁడు రవ్వలభుజకీర్తిని, ఈశానుఁడు కనకాంబరమును బంపఁగా నా యాభరణములన్నిఁటిని సుచంద్రున కలంకరించిరి. పెండ్లికొడుకై వచ్చు నతని భద్రగజముపై నధిరోహింపఁజేసి వాద్యవిశేషములతోఁ దీసికొని వచ్చుచుండఁగా నగరనారీమణులు తమ తమ మేడలపై నెక్కి యానందముతోఁ గాంచుచు ముత్యాలసేసలు చల్లిరి. అట్లు వచ్చిన సుచంద్రునిఁ గనకపీఠముపైఁ గూర్చుండఁ బెట్టి పాదములు గడిగి, మధుపర్కము నొసంగి, తెరచాటునకు చంద్రికను దెచ్చి, కన్యావరణముఁ జెప్పి, ధవళ

ములు పాడి, క్షణదోదయుఁడు సమంత్రకముగాఁ గన్యాదానముఁ జేసెను. పిమ్మట వధూవరులు జీరకగుడములను లగ్నసమయమున పరస్పరశిరంబులం దుంచుకొనుట, వరుఁడు 'మాగల్యం తంతునానేన' అను మంత్రపూర్వకముగాఁ దాళిబొట్టును గట్టుట, తలంబ్రాలు బోసికొనుట, కాడినిఁ దెచ్చి కపిలావాచనము చేయుట, కంకణధారణముఁ జేయుట, లాజహోమము నెరవేర్చుట, సన్నెకల్లును ద్రొక్కించుట, ఆశీర్వచన మంగళహారతులను గొనుట, దేవతాగృహప్రవేశసమయమున వధూవరుల నామధేయములను జెప్పించుట మొదలయిన వివాహప్రక్రియలను సమంత్రకముగా సంప్రదాయప్రకారముగా నాలుగురోజులు జరుపఁగా చంద్రికాసహితుఁడై సుచంద్రుఁడు మిక్కిలి యానందించెను. ఇట్లు వేదవిధానమును బ్రాహ్మణులు దెలిపి శేషహోమాంతము మంగళాచరణము లన్నియుఁ దీర్చి యాశీర్వదించిరి.

బంధువులు, నానాదేశరాణ్మణులు, హితులు, మంత్రులు నాసుచంద్రునికి రత్నములను, ఆభరణములను, పైఁడివల్వలను కట్నములుగా నొసంగిరి. పాంచాలభర్త యల్లునికి భద్రవారణశతములను, హయకులములను, ఉజ్జ్వలరథములను, దాసదాసీజనములను, వజ్రవైడూర్యాదిమణులను, మణిచాపమును, బాణసముదాయమును, ఖడ్గమును, ముద్గరము మున్నగు నాయుధములను ఇచ్చి, పుత్రికకు పురశతములను పసుపుఁగుంకుమకై యిచ్చెను. రతనాలసొమ్ములు, జల్తారుచీరలు, క్రొత్తకస్తురివీణ, చామీకరపేటికోత్కరములు మొదలయిన వాని నెన్నింటినో యిచ్చెను. బ్రాహ్మణపురంధ్రులు, దిక్పాలవనితలు పెండ్లికూఁతును దీవించిరి. పార్వతి, తనమహిమచేత చంద్రికకు నిత్యాంగరాగము, చేయని సింగారము, వాడనివిరి , పాయని తారుణ్యము, వీడని సొంపుపెంపును గలిగియుండునట్లు దీవించెను. అంతేకాక ప్రేయసీప్రియుల పొలయలుకలను భావికాలమునఁ దీర్పఁగల చిలుకను, సకలఋతువులందును వికసించి పరిమళము గురియు నొక పువ్వును, కోరిక లిచ్చుచు దేవకాంతలను మించు చక్కదనమును గూర్చు నొక రత్నమాలికను సైత మిచ్చి, కౌఁగిలించుకొని యాశీర్వదించి, కైలాసమున కేగెను. పెండ్లికి వచ్చినవా రందఱును బహుమానము లందుకొని వెళ్లిపోయిరి.

క్షణదోదయుఁడు చంద్రిక నత్తవారింటికిఁ బంపువాఁడై కౌఁగిటఁజేర్చి, కన్నీరు గార్చుచు, "తల్లీ! పుట్టినయింటికిని మెట్టిన యింటికిని శుభకీర్తులు వచ్చునట్లు మెలఁగుము. ఈనారి వంశధర్మనిరూఢిని గాపాడినది. ఈశ్యామ గురుతరులకు వన్నెఁ గూర్చినది. ఈపద్మిని యినోదయమున కానందించును. ఈకొమ్మ ద్విజరాజులను బోషించును. అని జగము మెచ్చ నడుచు వనితజీవనమే జీవనమని యెంచుమమ్మ!" అనఁగా, తల్లి చేరఁదీసి కన్నుల నశ్రులు రాల్చుచు "లతాంగీ! చంద్రశేఖరుఁడు శైలేంద్ర తనూజ యంతటి దానిని అర్ధాంగీకారముగా నుంచినాఁడు. కనుక భర్త చిన్నచూపుఁ జూచినను సమయానుకూలముగా వర్తింపుము. భర్త యత్యధికప్రేమను జూపినను నీవు వినయముతోనే యుండుము. భర్తతోఁ గలిసిమెలసి యుండుము" – అని బుజ్జగించి పంపఁగా సుచంద్రుఁడు చంద్రికాయుతముగా సువర్ణమయరథము నెక్కి స్వనగరముఁ జేరఁబోయెను. పౌరాంగనలు సౌధములపై బారులు దీరి కంకణఝణత్కారములు మొరయఁగా వధూవరులపైఁ బుష్పాంజలులు చల్లి యానందించిరి.

పిమ్మట ఇంద్రనీలమణిస్తంభములతోను, రవ్వలబోదెలు, తామరల రత్నాల కుక్షి, పన్నీటియంత్రములు, బంగరు బొమ్మల చేతులలో నుంచబడిన వట్టివేరుల సురటీలు మొదలగు వైభవములు గల క్రీడాగృహమునందు, రతిరహస్యశృంగార కళలకు నిలయమైన కుసుమతల్పమున లజ్జాభరావనతవదనయైన చంద్రికను జేర్చి, చెక్కిలిపై నఖక్షతములు బడనీక, గుబ్బల కధికసమ్మర్దము నీయక, అధరోష్ఠపానమున దంతక్షతముల చిహ్నములు లేకుండునట్లుగ, తనూలత కధికశ్రమము గలుగనీయక, సుమశస్త్రశాస్త్రరహస్యతత్త్వము నెఱిఁగిన సుచంద్రుఁడు చంద్రికకు అతనుశాస్త్రస్వరూపముల నెఱుకపరచుచు, నద్వయ భావనాయత్తవృత్తి యేర్పడునట్లు ప్రియసాయుజ్యసుఖమును గలిగించెను. అట్లు వారు, హర్మ్యప్రదేశములందును,

శైలకంద రాస్థలులందును, ప్రకృతిసౌభాగ్యములఁ గనుచు, లక్ష్మీనారాయణులు, భవానీశంకరులు, శచీపురందరులు, ఛాయా సూర్యులు సకలకాలముల సుఖించినట్లు నిరంతర మిష్టోపభోగములఁ దేలుచు సుఖముండిరి. అట్లు చంద్రికాయుక్తుఁడై దేశప్రజ లను బాలించు సుచంద్రుని రాజ్యమునందు దుర్మార్గులు నశించిరి. దుష్టులసంపదలు నశించెను. దారిద్ర్యము తొలఁగిపోయెను. శత్రుబాధ దూరమయ్యెను. ధర్మము, నీతియు వృద్ధిఁజెందెను. అవినీతి నశించెను. ప్రజలు శుభకార్యములతో సంతోషముతో నాయుర్భాగ్యములతో నుండిరి.

ఇది చంద్రికాపరిణయ కథాసంగ్రహము.

సమాలోకనము

(పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్శిటీవారు 2001లో పునర్ముద్రించిన 1928 సంవత్సరపు వ్యాఖ్యాయుత చంద్రికాపరిణయమునకు డా. శ్రీరంగాచార్యులు వ్రాసిన పీఠిక)

'శ్రీవాసజ్జటప్రోలీ
భావుకపత్తనవిహారపటుశీలునకున్
గోవర్ధనగోవర్ధన
గోవర్ధనవృష్టిహృతికి గోపాలునకున్' 1

భారతదేశ స్వాతంత్ర్యలబ్ధికి పూర్వమున ఏర్పాటై, క్రీ.శ.1949 వరకు అనగా భారతదేశపారతంత్ర్యవిముక్తివరకు వర్ధిల్లిన సంస్థానములయందు ఆంధ్రప్రాంతమునకు చెందినవి పాశ్చాత్యుల పరిపాలనకు లోబడి, తెలంగాణములోనివి నిజాం పరిపాలనకు లోబడి యున్నవి. ఈవిధమైన సంస్థానములలో కొన్ని పెద్దవి – మరికొన్ని చిన్నవి గలవు. ఐనను ఆయా సంస్థానాధిపతులు యథాశక్తి సాహిత్యపోషణము నొనర్చి, దేవాలయప్రతిష్ఠాదులు గావించి, సప్తసంతానప్రతిష్ఠాపనులైనవారు కలరు. వీరియందు రాజకవు లున్నారు. వారు ప్రౌఢప్రబంధకర్తలుగా ప్రసిద్ధులు. ప్రజోపయోగార్థమై ఆనాడు వీరొనర్చిన పనులు – సాహితీక్షేత్రమునకు జరిపిన 'అక్షరపూజ' ఎప్పటికిని మరువరానివి.

ఆనాడు తెలంగాణమున ఏర్పడిన సంస్థానములు నేటి మహబూబ్‌నగరం జిల్లాయందే అధికముగా నుండి, ఈజిల్లాకు సంస్థానముల జిల్లా యను ఖ్యాతిని కల్గించినవి. అట్టి సంస్థానములలో – గద్వాల, వనపర్తి, ఆత్మకూరు, గోపాలపేట, జటప్రోలు, అలంపురం అనునవి ప్రసిద్ధములు. వీని పరిపాలకులు సహృదయులు, వదాన్యులు, రసికతాచక్రవర్తు లైనందున భారత, భాగవత, రామాయణానువాదములే గాక వానికి వ్యాఖ్యలు, కావ్యనాటకములు, ఛందోలంకారశాస్త్రములు, సంస్కృతాంధ్రసాహితీ సంబంధ వివిధరీతుల రచనలు ప్రకాశమానము లైనవి. నాడు ఈసంస్థానములయందు జరిగిన కవిపండితసన్మానములు, ప్రౌఢ పండితవర్యుల శాస్త్రవర్చలు, జగదాశ్చర్యావధానకవితాసంపత్తు లైన తిరుపతి వేంకటేశ్వరుల అష్టశతావధానములు, నానా దేశాగత కవిపండితమండలి కొసంగిన ఆదరణ, జరిపిన సత్కారములు – ఈ సంస్థానాధిపతుల చిరయశస్సునకు ప్రతీకలు.

తమ రాజభవనసభాస్థలికి కవులు పండితులు విచ్చేయు మార్గమున తెల్లనివస్త్రమును పరచి, వారందరు లోపలికి వెళ్లిన తరువాత ఆ వస్త్రమును తీసి అందలి పాదధూళిని ఒకదగ్గరగా చేర్చి, అనునిత్యము రాజులు, రాణులు ధరించు కుంకుమ బరణిలో ఆపాదధూళిని మిశ్రిత మొనర్చి తిలకధారణము చేసికొనుచు తమ జన్మ ధన్యమైనదని భావించిన సంస్థానాధిపతుల వినయవిధేయతలేగాక, కవిపండితులయందు వారెంత బద్ధాదరులై గౌరవించినారో తెలిసికొనుటకు ఈ సన్నివేశమే ప్రబలోదాహరణము.

జటప్రోలు పద్మనాయకులు

జటప్రోలు ఇట్టి సంస్థానములలో నొకటిగా నున్నది. దీని పరిపాలకులు సురభిగృహనామధేయులైన పద్మనాయకులు. సంస్థానము వర్ధిల్లిన కాలము 20-9-1949 వరకు. మహబూబునగరం జిల్లాలోని సంస్థానములయందు కాలానుపూర్విగా మొట్టమొదటిది గద్వాలసంస్థానము, రెండవది ఆత్మకూరు, మూడవది జటప్రోలు. వీని తర్వాతనే వనపర్తి, అలంపురం,

గోపాలుపేట సంస్థానము లేర్పడినవి. ఒక్క జటప్రోలు మాత్రమే పద్మనాయకుల ఏలుబడిలోనిది. మిగిలిన వన్నియు రెడ్లు అధిపతులుగా నున్నట్టివి.

జటప్రోలు సంస్థానము మధ్యయుగమునుండి సంస్థానముల విలీనీకరణ జరుగువరకు (20-9-1949) పద్మనాయకులు పరిపాలకులుగా వర్ధిల్లినది. వీరు కాకతీయులకు, తరువాత గోలకొండ సుల్తానులకు సామంతులైన చిన్న రాజులు. జటప్రోలు వారిలో పదితరములు వంశానుగతప్రభువులు, ఐదుతరములు దత్తప్రభువులున్నారు.

ఆనాడు జటప్రోలు సంస్థానము 357 చదరపుమైళ్ల విస్తీర్ణము కలది. దీనియందు ఒకవంద ఆరు గ్రామము లున్నవి. సంస్థాన ఆదాయం సాలీనా రెండులక్షలు. కృష్ణానదీతీరభూమియందు జటప్రోలు కోట - దాని సమీపముననే వీరి ఆరాధ్యదైవ మైన మదనగోపాలస్వామి ఆలయము వీరిచే నిర్మింపబడినది. సురభి లక్ష్మారావు పరిపాలనాకాలమున, అనగా 1840 క్రీ.శ.లో రాజధాని జటప్రోలునుండి కొల్లాపురమునకు మారినది. అప్పటినుండి వీరు కొల్లాపురప్రభువు లైనారు. రాష్ట్రరాజధాని యైనహైదరాబాదు నగరమునకు 160 కి.మీ. దూరమున కొల్లాపురము కలదు.

పద్మనాయకవంశజు లైన జటప్రోలు సంస్థానమువారు దేవరకొండ, రాచకొండ రాజ్యములు పరిపాలించిన రాజవంశమునకు చెందినవారు. వీరియందరికీ మూలమైన గ్రామము నేటి కర్నూలుజిల్లాలోని 'వెలుగోడు'. వెలుగోటి సర్వజ్ఞసింగభూపాలుడు ప్రసిద్ధుడు. ఇతనిని గూర్చి చంద్రికాపరిణయకృత్యాదియందు వివరముగా నున్నది.

పద్మనాయకు లందరును రేచర్లగోత్రులు ('రేవడు' అనువానికి సంబంధించిన కథవలన వీర కీగోత్రనామ మేర్పడినట్లు గలదు). వీరి మూలపురుషుడు బేతాళనాయకునిగా ప్రసిద్ధుడైన చెవ్విరెడ్డి. ఇతడు కాకతి గణపతిదేవుని సేనానిగా ప్రచండభుజబలవిక్రమాదులచే కాకతిసామ్రాజ్యమునకు ఎనలేని సేవలు చేసినవాడు. ఈయన పౌరుషగాథల గూర్చి కొన్ని కథలు గలవు.

పద్మనాయకుల గోత్రములవారు (76 గోత్రములు) ఇతనిని మూలపురుషునిగా భావింతురు. వేంకటగొరి, బొబ్బిలి, పిఠాపురం, జటప్రోలు, మైలవరము మొదలగు సంస్థానముల వెలమలు బేతాళనాయకుని పేర శరన్నవరాత్రముల సందర్భమందు బలిపూజాదికములు నిర్వర్తింతురు. వీరి గోత్రనామమైన 'రేచర్ల' నల్లగొండ జిల్లాలోని ఒక గ్రామము. ఇది బేతాళనాయని జన్మగ్రామమని ప్రసిద్ధి గాంచినది. రేచర్ల బ్రహ్మనాయడు బేతాళనాయని మనుమడు. రాచకొండ, దేవరకొండ గ్రామములు బేతాళనాయని రాజధానులు. ఇతని వంశములోనే పదవతరమువాడు 'సర్వజ్ఞ' బిరుదాభిరాముడైన సింగభూపాలుడు. పద్మనాయకుల బిరుదములయందు, శాసనములయందు పేర్కొనబడిన ఆమనగల్లు, పిల్లలమఱ్ఱి అను గ్రామములు నల్లగొండ జిల్లాలోనివి. బేతాళనాయనికి – ఈ రెండుగ్రామములకు విడదీయరాని సంబంధము గలదు.

కాకతి గణపతిదేవుడు, రుద్రమదేవి – వీరి పరిపాలనాకాలమున ప్రసిద్ధిలోనికి వచ్చిన పద్మనాయకులలో ప్రసాదిత్యనాయడు, సింగమనీడు, అనపోతానాయకుడు, మాదానేడు, పెదవేదగిరి, సర్వజ్ఞ సింగభూపాలుడు, లింగమనేడు అనువారు కలరు. అనపోతానీడు పద్మనాయకరాజ్యవిస్తృతికి ముఖ్యమైన వ్యక్తి. సురభివంశ పద్మనాయకులకు మూలపురుషుడైన సింగభూపాలుని పరంపరలో జన్మించిన పెద్దమహీపతికి ఐదవతరమున వచ్చిన రాజు- చంద్రికాపరిణయకర్త యైన మాధవరాయలు. ఈయన అళియ రామరాయలనుండి జటప్రోలు సంస్థానమును కానుకగా పొందినాడు. తరువాత ఇతని కుమారులు క్రీ.శ. 1650 లో అబ్దుల్లా కుతుబ్షానుండి 'సనదు' రూపముగా నీ సంస్థానమును పొందిరి.

మాధవరాయల తండ్రియైన మాదానాయకుడు (మల్లభూపాలునిగా ప్రసిద్ధుడు) జటప్రోలు మదనగోపాలదేవాలయ నిర్మాత. మాధవరాయల ప్రోత్సాహమున 'బాలసరస్వతి' యనుకవి భర్తృహరి సుభాషితముల నాంధ్రీకరించి సురభిమల్లభూపాలస్మృత్యర్థము అంకిత మొసంగెను. అందలి ప్రతిపద్యమునకు అంత్యమకుటము 'సురభిమల్లా' యని కలదు.

మొదట నల్లగొండ, దేవరకొండ ప్రాంతములు పాలించిన మాదానాయడు అనంతరము జటప్రోలును రాజధానిగా చేసికొని బెక్కం, పెంట్లవల్లి, చిన్న మరూరు, వెలటూరు అను గ్రామములయందు కోటలను, ఆలయములను నిర్మాణము చేయించెను. వ్యవసాయనిమిత్తము తటాకములు త్రవ్వి ఖ్యాతుడాయెను.

మహాపరాక్రమవంతుడు, అశ్వరేవంతుడైన పెద్దనృపతిని మాధవరాయలు గొప్పగా వర్ణించినాడు (చంద్రికా...1-25-28). నేటి గోదల్ పట్టీలో గల పెద్దాపురమను గ్రామ మితని పేరనే వెలసినదని ప్రతీతి. 17వ తరమున 'బింకోలుగండ' బిరుదఖ్యాతుడైన రెండవమల్లభూపతి లేదా పెదమల్లానాయడు ఇమ్మడి మల్లునిగా ప్రసిద్ధుడు. 18వ తరములోని ముమ్మడి మల్లానాయనికి గలిగిన పుత్రత్రయమునందు తృతీయపుత్రుడు చంద్రికాపరిణయకర్త యైన మాధవరాయలు. ఈవంశమువారు మొదట శైవభక్తులుగా నుండి కాలక్రమమున వేదాంతదేశికులవారి ప్రభావముచే రాచకొండవారితోబాటు వీరును శ్రీవైష్ణవసంప్రదాయమును స్వీకరించినారు. మల్లనృపతి, లింగభూపాలనామములు శైవపద్ధతికి జెందినవి. మాధవరాయలు మొదలైన పేర్లు శ్రీవైష్ణవసంబంధమైనవి. వీరు ఈరెండుమతములను సమానముగా ఆదరించి, ఆయా దేవతల ప్రతిష్ఠించి, దేవాలయములను కట్టించిన హరిహరభక్తులు.

మాధవరాయల యనంతరము ఈసంస్థానము హైదరాబాదు సంస్థాన ఆధిపత్యమునకు లోనైనది. ఐనను తరువాత వచ్చిన వారు పూర్వులవలెనే సంస్థానమును అనుభవింపవచ్చునని అబుల్ హసన్ కుతుబ్షా ఒక ఫర్మానా జారీ చేసినాడు. ఈపద్ధతి తర్వాత వచ్చిన సంస్థానపాలకులకును వర్తించినది. వీరియందు 24వ తరమునకు చెందిన జగన్నాథరావునకు సంతానము లేనందున వరంగల్లు జిల్లాలోని గురిజాల గ్రామమున తమ సమీపబంధువులైన 'రావు' వంశమువారినుండి పిల్లవానిని దత్తుగా పరిగ్రహించి 'వెంకటలక్ష్మారావు' అని ఆబాలునకు నామధేయ మిడినారు. లక్ష్మారావు కాలములోనే జటప్రోలుసంస్థానము పేష్కస్ ఏర్పాటుతో బిల్మఖ్తాగా (శాశ్వతకౌలు) సంపాదితమైనది. ఈయనకూడా నిస్సంతు కావున తన అభిజనస్థలమునుండి ఒకబాలుని తెచ్చుకొని ఆయనకు వెంకట జగన్నాథరాయనామధేయ మిడినారు. ఈయన గుఱ్ఱపుపందెములయందు ప్రఖ్యాతుడు. బెంగుళూరు, మదరాసునగరములయందు జరుగు అశ్వధావనక్రీడలలో నీయన పలుసార్లు విజయమందినాడు. కాంచీనగర వరదరాజస్వామికి శాశ్వతముగా బిందెసేవ కైంకర్యమును ఏర్పాటు చేయించిన భక్తశిఖామణి. సింగపట్టణంలో తన పూర్వులు నిర్మాణ మొనర్చిన నృసింహాలయమును అభివృద్ధి పరచి, ఆస్వామిపేర 'లక్ష్మీనృసింహవిలాస' మను చంపూ గ్రంథమును, జటప్రోలు 'మదనగోపాలమాహాత్మ్యము'ను రచియింపజేసిన సహృదయుడు. ఈయనకు సైతము సంతానము లేనందున వెంకటగిరి ప్రభువులైన సర్వజ్ఞకుమారయాచమనాయని చతుర్థపుత్రులగు నవనీతకృష్ణయాచేంద్రుని దత్తపుత్రునిగా పరిగ్రహించి, తమతండ్రిగారి నామధేయముగా వెంకటలక్ష్మారావని పేరు పెట్టి 7-3-1879 తేదీనాడు తిరుపతి శ్రీవేంకటేశ్వర స్వామివారి సన్నిధానమున దత్తస్వీకారోత్సవమును జరిపినారు (ఇది ఈశ్వర సం. ఫాల్గుణశుద్ధ తదియ గురువారమునాడు). ఈ స్వీకారమునాటికి వెంకటలక్ష్మారావుగారి వయస్సు 14 సంవత్సరములు. వీరు 6-3-1884 సం. నైజాంప్రభువు ఫర్మానాతో కొల్లాపురం (జటప్రోలు) ప్రభువులై ప్రజాపాలనము జరుపుచు, ధర్మ కార్యనిర్వహణబద్ధులై కవిపండితపరిపోషకులై సుమారు 32 సంవత్సరములు పరిపాలించి ఎన్నియో సద్గ్రంథముల ప్రచురణ చేయించిరి. అన్నిటిని మించి వీరి చిరయశస్సునకు మూల

కారణము – మాధవరాయభూపాలప్రణీతచంద్రికాపరిణయమును ‘శరదాగమ’ వ్యాఖ్యతో ముద్రణము చేయించి తమ పితౄణమును తీర్చుకొని 15-4-1928 తేదీన యశఃకాయు లైనారు.

వీరికిద్దరు కూతుర్లుమాత్రమే యుండిరి. వంశోద్ధరణకై బొబ్బిలిసంస్థానాధీశులు - తమ యగ్రజులైన రాజా శ్వేతాచలపతి వెంకటరంగారావుగారి పౌత్రులైన రాజా రాజగోపాలరావుగారిని దత్తపుత్రునిగా పరిగ్రహించి, తండ్రిగారిపేరైన రాజా వెంకట జగన్నాథరావు అని పేరు పెట్టిరి. కాని వీరి పట్టాభిషేకమును పరిణయమును కావింపక పూర్వమే వీరు పరలోకగతు లైనందున ఈ శుభకార్యము లన్నియు వీరి ధర్మపత్ని వెంకటరత్నమాంబగారి ద్వారా నిర్వహింపబడినవి. వెంకటలక్ష్మారావుగారి ద్వితీయ పుత్రికయైన సరస్వతీదేవిగారి కూతురు ఇందిరాదేవిని వెంకటజగన్నాథరాయ బహదూర్‌నకిచ్చి వివాహము జరిపించినారు. జగన్నాథరావుగారు మాతృశ్రీ అదుపాజ్ఞలకు లోబడి రాజ్యాధికార మొనర్చుచు సంస్థానములు భారతదేశ మున విలీనమగు వరకు (1949) పరిపాలించినారు. రాజ్యభారవిముక్తులైన యనంతరము కూడా వీరు వంశానుగతధర్మమైన ధర్మకార్యనిర్వహణము, కవి-పండిత-విద్వద్గాయకపోషణ మొనర్చుచు క్రీ.శ.1980 సం.న స్వర్గలోకవాసు లైనారు. రాజావారికి గల ఏకైకపుత్రులు వెంకటకుమారకృష్ణబాలాదిత్యలక్ష్మారావుగారు. కుమార్తె వెంకటరత్నసుధాబాల యనువారు గలరు. వీరిది 29వ తరము. వెంకట ఆదిత్యలక్ష్మారావుగారి కుమారుడు వెంకట అనిరుద్ధ జగన్నాథరావు. వీరు ప్రస్తుతము సికిందరాబాదులో నివాసముగా నున్నారు. మధ్యమధ్య కొల్లాపురమునకు విచ్చేయుచుందురు (చూ. వంశవృక్షము).

జటప్రోలు రాజపరంపరలో నున్న వెంకటలక్ష్మారావు బహద్దరు ఆఖేటఖేలనమున అమితాసక్తి కలవాడు. తన జీవితకాలమున 31 పులులను వేటాడినాడు. ఒకేవేటలో అయిదుపులులను వేటాడి వేటలో బందీయైన జంతువులను తన రాజప్రాసాదమున బంధించిన ధీరుడు. ఈయన వేటను వంశపారంపర్యము గావించి తన 14సంవత్సరముల కూతురునకు కూడా వేటాడుట నేర్పించిన ఆఖేటవిద్యావైభవుడు. ఇతనికి వేటపై గల అభిలాషకు ప్రతీక వీరి ‘రాజముద్రిక’ (Emblem). దీనియందు రెండు తుపాకుల మధ్యన పులిముఖము చిత్రితమైనది. ‘సత్యమేవ జయతే’ అను అర్థ మొసగు (Truth Is Victory) అను వాక్యము ఈముద్రికలో పొందుపరచిరి. ఐదుపులులను పట్టుకొని దిగిన వీరి ఫోటో కొల్లాపురం కోటలో గలదు.

సంస్థానమునకు చెందిన చివరి నాల్గుతరములవారు లండన్ వంటి పాశ్చాత్యనగరములలో విద్యాభ్యాస మొనర్చుటవలన వీరిపై పాశ్చాత్యసంస్కృతిప్రభావ మధికమైనది. అందుకే వీరి పూర్వులకు లేని రాజముద్రికను వీరు సిద్ధము చేయించినారు. సంస్థానమున వీరి హయాములో నిర్మితమైన భవనములుకూడా బ్రిటిష్ వారి భవననిర్మాణములను పోలియున్నవి. ఇవన్నియు ఈనాటికీ దర్శనీయములు.

కొల్లాపురసంస్థానము రద్దయిన తరువాత – సంస్థానకాలమున వివిధకార్యాలయముల కుపయోగించిన భవనములను, వీరి విమానాశ్రయము - దాని భవనములను ఆంధ్రరాష్ట్రప్రభుత్వమువారికి విరాళముగా నొసంగిన ఏతద్వంశీయుల ఔదార్యము కొనియాడదగినది. నేడు కొల్లాపురమునగల ప్రభుత్వ జూనియర్ కళాశాలభవనములు వీరివే. రాణి ఇందిరాదేవిగారి నామధేయము ఆకళాశాల కుంచినారు. కొల్లాపురమున గల ముఖ్యరాజభవనము మాత్రము వీరి అనుభవములో గలదు.

వీరి పూర్వరాజధానియైన జటప్రోలులోని కోట శ్రీశైలం ప్రాజెక్టు నీటిలో మునిగినది. వీరు నిర్మాణ మొనరించిన తమ యిష్టదైవ సన్నిధి యగు మదనగోపాలస్వామి దేవాలయమును తీసి యథాపూర్వముగా ఎత్తైన ప్రదేశమున నిర్మాణ మొనర్చిన రాష్ట్ర పురావస్తుశాఖవారి నైపుణ్యము ప్రతిశిలయందు ప్రతిబింబించుచున్నది. దేవాలయముతోబాటు జటప్రోలుగ్రామముకూడా దీని

పరిసరములలోనే నిర్మితమైనది. ఇవియేగాక తరలించి తెచ్చి కొల్లాపురమునందు పునర్నిర్మాణ మొనర్చిన కుంతీమాధవ స్వామివారి దేవళము కూడా దర్శింపతగినది.

కొల్లాపురప్రభువులు కట్టించిన అనేకదేవాలయములు, వేయించిన తటాకములు నేటికీ భక్తిభుక్తులకు ఆకరములుగా నున్నవి. పూర్వమునుండి రాణీరత్నమాంబవరకు కొనసాగిన అనేకప్రజోపయోగకార్యములు శాశ్వతమై ఈనాటికిని కొల్లాపురప్రజల అనుభవములో నుండుట విశేషము.

రాజులు కాలగర్భమున లీనమైనారు. వారొనర్చిన ధర్మకార్యములతోబాటు అక్షరస్వరూపిణియైన సాహితీదేవి వీరి చిరయశస్సును 'అక్షర' మొనర్చినది. ఆపరంపరలోనిదే చంద్రికాపరిణయము. ఈగ్రంథవిశేషములు ముందు వివరింపబడును.

గృహనామము

వెలుగోడు, రాచకొండ, దేవరకొండ పరిపాలకులైన పద్మనాయకులు తమ గృహనామ మిదియని ప్రత్యేకముగా తెల్పుకొనలేదు. వీరిని ఆయా గ్రామనామములతో మాత్రమే వ్యవహరించుచున్నాము. కాని వీరినుండి వెలువడి జటప్రోలు రాజ్యమునకు పాలకులైనవారి గృహనామము మాత్రము 'సురభి' యని గ్రంథస్థమై వ్యాప్తి చెందినది. చంద్రికాపరిణయమునందు

'అర్థి సాత్కృత సురభి, పరాళి సురభి,
సుగుణవల్లీ ప్రకాండైక సురభి, కీర్తి
జిత సురభి, శౌర్యసురభి నా సింగనృపతి
పరగఁ దద్వంశమును గాంచె సురభిసంజ్ఞ' (1-23)

ఇది సర్వజ్ఞ సింగభూపతివర్ణనలోని పద్యము. దీనికి పూర్వాపరములందు ఎచ్చటను 'సురభి' ప్రసక్తి లేదు. సింగభూపాల కృతులలోను, ఇతరత్ర గల ఈప్రభుప్రసక్తిలోను 'సురభి' లేదు. వ్యాఖ్యాపండితులు 'సురభి' శబ్దమునకు సువర్ణము, సంపెంగ, వసంతుడు, కామధేనువు, పరిమళము అను నర్థముల తెల్పినారు. పైపద్యమునందలి 'సురభి' పదములకు వరుసగా నీయర్థము లీయబడినవి. ఈపదమును 'సురభీ' యని దీర్ఘాంతముగా చేసి 'దేవతలకు భీతి గొల్పువాడు' అని, ఇదియే హ్రస్వాంతమున 'సురభి' యైనదని వెల్లాలవారు తెల్పిరి.

ఇంతకు 'సురభి' అను గృహనామము వీరి కెట్లు గల్గెనో తెల్పినవారు భిన్నరీతులుగా వివరించినారు. నాగరకర్నూలు తాలూకాలో కారువంగ, తాళ్లపల్లి అను గ్రామముల నడుమ గల 'గోదలు' గ్రామమే ఒకప్పటి సురభిగ్రామ మనియు, కాలాంతరమున నాగ్రామము హరించుకపోగా అచట నేర్పడినవి కారువంగ, పులిజాల, తాళ్లపల్లి, రఘుపతిపేట యను గ్రామములు– ఈప్రాంతమునకు గోదలుపరగణా యని ప్రసిద్ధి. జటప్రోలువారు మొదట సురభిలో నివసించుటవలన అదియే వారి గృహనామమైనదని ప్రచారము గలదు. గ్రామనామములు గృహనామములుగా నుండుట సాధారణవిషయమే యైనను, జటప్రోలువారుగాని వారి పూర్వులుగాని సురభిగ్రామవాసు లైనట్లు ఎచ్చటను తెల్పుకొనలేదు. అటు వెలుగోడు, ఇటు దేవరకొండరాచకొండలతోనే వీరి యనుబంధబాంధవ్యము లున్నవి. సింగభూపాలుడు భేతాళనాయకుని వరుసలో దగ్గరివాడు. విద్యాబలపరాక్రమములచేత ప్రఖ్యాతుడు. ఇట్టివానిచే తమవంశము ప్రఖ్యాతమై యున్న కారణమున అతనిని యాచకవిషయమున సురభిగా

తెల్పి, ఇదే పదమును వివిధార్థములలో ఆయనకు సమన్వయపరచిన చంద్రికాపరిణయకారుని శబ్దచమత్కృతి ప్రశంసింప దగినదే కాని, 'సురభి' గ్రామము వీరి పూర్వనివాస మని 'భావన' మాత్రమే! దీనికి ఆధారము లేదు. సింగభూపాలవిషయకమైన 'సురభి' వీరికి సంతృప్తి కలిగించినది. యుద్ధమున జటప్రోలువారు 'సురభీ' కర పరాక్రములుగా సింగభూపతిని పోలినవారు కావున ఎవ్వరును గ్రహింపని గృహనామమును వీరు 'సురభి' గా నిర్ధారించుకొన్నట్లు భావింప వీలుగలదు. మొదటినుండి ఇదియే వీరి గృహనామ మైనచో పద్మనాయకరాజప్రశంసలోను, వారి గ్రంథములయందును, సమకాలీనకృతులయందును 'సురభి' ప్రసక్తి వచ్చెడిది.

దగ్ధగ్రామమైన (?) 'సురభి' ని వీరి కంటగట్టి అదియే వీరి పూర్వనివాసగ్రామమని, దానివలన వీరు సురభివారైనారని నిర్ధారించుట సంశయమున కాస్కారమే. అందువలన సింగభూపాలుని గూర్చిన వర్ణనలోని ఈపదము (నానార్థములుగా) వీరికి రుచించి దీనిని గృహనామముగా స్థిరపరచుకొనినా రనుకొనుటయే సమంజసముగా నుండును.

సురభిగృహనామముగల వైదికులు, నియోగులు కూడా తెలంగాణమున గలరు. వీరు 'సురభీ' కరులు కాదు గదా! సురభివారి నాటకసమాజము గలదు. అందువలన 'సురభి' గృహనామమును గూర్చి మఱింత పరిశోధన అవసరము.

మాధవరాయల కాలము

జటప్రోలు పద్మనాయకరాజపరంపరలో 18వ తరమునకు చెందిన ముమ్మడి మల్లభూపతికి చెన్నాంబ, తిరుమలాంబ, మల్లాంబ, అనంతాంబిక యను నల్వురు భార్యలు. వీరియందు చెన్నాంబకు వరుసగా రామరాజు, మల్లనృపతి, మాధవ రాయలు జన్మించినారు. మల్లాంబ యను నామెకు కృష్ణభూపాలుడు, మేదినీరావు అను నిరువురు పుత్రులు గలిగిరి. వయస్సులో తన కగ్రజులైన కృష్ణభూపాల మేదినీరావులు రాజ్యపాలన మొనర్చుచుండగా నీయన ఎలకూచి బాలసరస్వతివంటి మహోపాధ్యాయుల సాహచర్యమున సాహిత్యాధ్యయన, కవితారచనల నొనర్చినవాడు.

సురభివారి వంశక్రమమును పరిశీలించి, మాధవరాయలకాలమును చరిత్రపరిశోధకులు, సాహిత్యచరిత్రకారులు కొద్ది భేదముగా నిర్ణయ మొనర్చినారు. 'చంద్రికాపరిణయము – సమగ్రపరిశీలనము' అను సిద్ధాంతవ్యాసమున తత్కర్త మాధవరాయల కాలనిర్ణయవిషయమున పెద్దలు తెల్పిన వానిని గ్రహించి పరిశీలించి, పూర్వాపరపరిశోధన మొనర్చి చంద్రికాపరిణయకర్త కాలము క్రీ.శ. 1620-1700, ప్రబంధరచనాకాలము క్రీ.శ. 1625-1656 మధ్యకాలము అనగా చంద్రికాపరిణయము క్రీ.శ. 1646లో రచితమైనట్లు నిర్ధారించెను. ఇది చర్చాపటువుగా యుక్తియుక్తముగా నొనర్చిన కాల-కావ్యరచనల కాలము. దీనికన్న మఱింత మంచి యుపపత్తులు లభించువరకు ఈనిర్ణయమే సమంజసమైనది.

సంస్థానసాహితి

మహబూబునగరం జిల్లాలోని సంస్థానాధిపతు లొనర్చిన సాహిత్యసేవ అమూల్యమైనది. వీరు కేవలము రాజకీయకార్యకలాపములకే పరిమితులు గాక సాహితీగోష్ఠులయందు పాల్గొనినారు, దీనికి తోడు వీరిలోను కవులు,పండితులు గలరు. జటప్రోలు ప్రభువులు ఈజిల్లాలోని ఇతరసంస్థానములవలెనే గాక ఆంధ్రప్రాంతమందలి పద్మనాయకసంస్థానములగు వెలుగోడు, రాచకొండ సంస్థానములను ఆదర్శముగా గ్రహించి సాహితీసమారాధన మొనర్చినవారు. వేదవేదాంగవేత్తలు, షట్ శాస్త్రవాదనానిపుణులు, ద్వ్యర్థి, చిత్రకవితారచనాధురీణులు – మఱి యింకెందరో కవులు,పండితులు వీరి సంస్థానమున తమ ప్రతిభను వ్యక్త

పరచగలరు. ఈరాజన్యుల సమకాలమందు పరిసరాలలో వెల్వడిన సాహిత్యము వీరి సాహితీపోషణకు గ్రంథరచనకు ప్రోత్సాహకారిగా నుండినది. జటప్రోలువారు ధర్మకార్యములను, సాహితీసమారాధనమును చేసిన చిరయశస్కులు.

వెంకటలక్ష్మారాయప్రభువు వనపర్తివాసులైన హొసదుర్గం కృష్ణమాచార్యులవారిచే సింగపట్టణంస్వామివారినిగూర్చి 'లక్ష్మీనృసింహవిలాస' చంపూకావ్యమును, జటప్రోలుస్వామివారి విషయమై 'మదనగోపాలమాహాత్మ్యము'ను రచింపజేసిరి. ఇవి సంస్కృతకృతులు.

సురభివారి పూర్వుడైన మల్లభూపాల నామాంకితముగా మహామహోపాధ్యాయ ఎలకూచి బాలసరస్వతి చెప్పిన భర్తృహరి అనువాదకృతి మల్లభూపాలీయమును, మాధవరాయకృత చంద్రికాపరిణయమును, సురభివంశచరిత్రమును లక్ష్మారాయల పౌత్రులైన వెంకటలక్ష్మారాయ మహోదయులు ముద్రణ మొనరింపజేసి పరివ్యాప్త మొనర్చిరి. వీరి సమాదరణముననే తదాస్థాన పండితులైన వెల్లాల సదాశివశాస్త్రిగారు, అవధానం శేషశాస్త్రిగారు కలిసి చంద్రికాపరిణయమునకు శరదాగమనామవిపులవ్యాఖ్య రచింపగా దీనిని క్రీ.శ. 1904 సంవత్సరంలోను, 1928లోను రెండు పర్యాయములు ముద్రణ మొనరించి ఎందరో కవిపండితుల కుచితముగా సమర్పణ చేసిన వ్యక్తి ద్వితీయలక్ష్మణరాయలు. వ్యాఖ్యాకారులైన యాపండితద్వయమే వెలుగోటి కృష్ణ యాచేంద్రుల అభీష్టము మేరకు భట్టుమూర్తి కావ్యాలంకారసంగ్రహ ద్వితీయాశ్వాసమునకు వ్యాఖ్య వ్రాసినారు. 'వెలుగోటి వారి వంశచరిత్ర' యను విశేషగ్రంథమును వెల్లాలవారు రచించిరి.

కొల్లాపురమునకు సమీపగ్రామమైన 'అయ్యవారి పల్లె'లో నున్న మహాపండితులు అక్షింతల సుబ్బాశాస్త్రి, సింగరశాస్త్రి, వెల్లాల రాఘవజ్యోస్యులు, శంకరశాస్త్రి, వెంకటరామశాస్త్రి వ్యాకరణాది శాస్త్రములయందు నిష్ణాతులు. వీరందరును జటప్రోలు రాజకుటుంబమువారి గౌరవాదరముల పొంది ఆనాడు ఈప్రాంతమున ఎందరికో సంస్కృతాంధ్రవిద్యల నేర్పినవారు.

జటప్రోలు సంస్థానాధిపతులు తీర్థయాత్రలు చేసి తిరిగి వచ్చునప్పుడు ఆప్రాంతమునుండి కొందరు శ్రీవైష్ణవులను తీసికొని వచ్చి, వారికి అగ్రహారాదుల నొసంగి తమ ఏలుబడిగ్రామములో నుంచినారు. ఆవిధముగా వచ్చినవారిలో కొందరు 'మంచాల కట్ట' యను గ్రామమున గల వడగల వైష్ణవులు. శ్రీవైష్ణవసిద్ధాంతానుసరణులైన సురభివారికి వీరు ఆచార్యులుగానే గాక కవులు-పండితులుగను ఖ్యాతి గాంచినారు. సురభివారికి గురువులు కంచినుండి వచ్చిన కోయిల్ కందాడైవారు - కవితార్కికసింహ గోవిందాచార్యులవారు. ఆనాడు నెల్లూరు సంస్కృతకళాశాలాధ్యక్షులుగా రాణించినవారు. దాదాపు 68 గ్రంథములను వ్రాసి విఖ్యాతి నందిన కవితార్కికసింహ శ్రీనివాసాచార్యులు వీరి ఆస్థానకవిపండితులుగా నుండిరి. కృష్ణకుమారకవిద్వయములో నొకరైన కోయిల్ కందాడై అణ్ణన్ సంపత్కుమారాచార్యులవారు ప్రతిభాగరీయసులు. వైయాకరణగజకంఠీరవులైన యణయవల్లి కృష్ణమాచార్యకవి సంస్థానకవిగా నుండి 'శ్రీకృష్ణచంపువు', 'అష్టప్రాసరామశతకము', 'నిరోష్ఠ్యకృష్ణశతకము', 'రసజ్ఞానందము' అను కృతుల నిర్మాతయే గాక జాతకచంద్రికావ్యాఖ్యాకారుడు. శాకల్యమల్లన తరువాత సంస్కృతమున నిరోష్ఠ్య రామాయణమును వ్రాసిన ఘనత కృష్ణమాచార్యులవారిదే! చినమాధవరాయ ఆస్థానమున విశేషగౌరవము లందిన శేషభట్టర్ సింగరాచార్యులు శూద్రధర్మోత్పలద్యోతిని, స్మృతికౌముదిని రచించినారు.

సుప్రసిద్ధ అధ్యాపకులుగాపేరొందిన పండితులు వనం సీతారామశాస్త్రిగారు 'ఆమావాస్యాసోమవారవ్రతనిర్ణయము', 'దోషాభాసనిరాస'మను గ్రంథములు రచించి తమ వాదనాశక్తిని నిరూపించుకున్నారు. బోరిగడుపుల గ్రామనివాసి యైన ధర్మయామాత్యుడు నృసింహపురాణకర్త. ఎల్లూరు నివాసి నరసింగకవి 'రాచకన్యకాపరిణయ' మనే ప్రబంధమును, భర్తృహరి సుభాషి

తముల అనువాదమును ఒనర్చెను. ఈయన కొల్లాపురం ప్రభువులకేగాక వెల్లాలవారికిని సన్నిహితుడు. మామిళ్ల పల్లి నృసింహ స్వామి భక్తితో వ్రాసినది ఈయన 'చూతపురీవిలాస' యక్షగానప్రబంధము (ముద్రితము).

ఆదిశంకరుల బ్రహ్మసూత్రభాష్యమునకు 'భాష్యార్థరత్నమాల' యను బృహద్వ్యాఖ్యను రచించిన అక్షింతల సుబ్బశాస్త్రి గారు ఆనాడు ఈప్రాంతములో ఎదురులేని పండితులు గావున వీరి ప్రాపుతో మఱికొందరు కవులు, పండితులకు ఈసంస్థానప్రవే శము, ఆదరణలు లభించినవి. సిరివెల్లి వాసుదేవశాస్త్రి, భైరవశాస్త్రి మొదలైన వారొనర్చిన వర్చలు చిన్నగ్రంథములుగా ఆనాడే వెలువడినవి. వనం సీతారామశాస్త్రి, ఓరుగంటి లక్ష్మీనారాయణశాస్త్రి, పల్లా చంద్రశేఖరశాస్త్రి, శ్రీధర కృష్ణశాస్త్రి, అల్లాడి రామశాస్త్రి మొదలైనవారు ఈసంస్థానసమాశ్రితపండితులు. సాహితీలోకసుప్రసిద్ధులైన మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారిని ఈసంస్థా నము ఘనముగా సత్కరించి వార్షికసంభావనను ఏర్పాటు గావించినది. వెంకటలక్ష్మారావు బహద్దరు ఆనాడే కొల్లాపురము నందు ఒక 'ఆంగ్లోవర్నాక్యులర్' స్కూలును స్థాపించి ఆంగ్లముతోబాటు సంస్కృత,ఉర్దూ,పారశీకవిద్యల బోధన చేయించిరి. దీనికొరకు పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరువాసులైన వాజపేయయాజుల రామసుబ్బారాయుడు (రా.సు.రాట్కవి)గారిని రప్పించి, ప్రధానాచార్యులుగా నియమించిరి. రా.సు.రాట్కవి అధ్యాపకుడుగనేగాక 'ప్రసన్న భారతము', 'శ్రీరామకోటీశ్వర తారావళి' మొదలైన గ్రంథములను రచించిన కవివర్యుడు. కొల్లాపురంలోస్నేహలతాకవితాసంఘమును స్థాపించి, దీనిద్వారా 130 గ్రంథములను ప్రచురించిన సాహిత్యకృషీవలుడు. వీరు ప్రచురించిన పుస్తకములలో 'చేబ్రోలు సరస్వతీదేవి', 'సరస్వతీ రామాయణము', కృష్ణకుమారకవుల 'సత్యనారాయణస్తవరాజము', పత్రి విశ్వేశ్వరశాస్త్రి 'రామాయణసంగ్రహము', గంథం వెంకటనరసింహాచార్యుల 'మణిహారము', తోటపల్లి కృష్ణమూర్తి 'తిరుమలదేవశతకము', చౌడూరి గోపాలరావు 'మధుశాల' మొదలైనవి గలవు. కవిగారు సురభివంశసౌరభము, జటప్రోలు రాజవంశావళి, పాళీకథలు అనే గ్రంథములను రచించి ఈసంస్థ ద్వారానే వ్యాప్తమొనర్చినారు. వీరిపైన రాజాగారికి గల గౌరవాదరములు కవితాసంఘము విషయమున కూడా వర్ధిల్లి దాని అభివృద్ధికి దోహద మొనర్చినవి.

సంస్థానమునందు స్థానికులు (ఈప్రాంతమువారు) మాత్రమేగాక ఇతరప్రాంతములనుండి వచ్చిన కవిపండితులు సైతము ప్రభుసత్కార మంది సంతుష్టులైనారు. అట్టివారిలో కవిసార్వభౌమ శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రి, సహస్రావధాని జంధ్యాల సుబ్ర హ్మణ్యశాస్త్రి, బలిజేపల్లి లక్ష్మీకాంతకవి, హరికథాచక్రవర్తి దీక్షితదాసు, ముదిగొండ వెంకటరామశాస్త్రివంటి పెద్దలు గలరు. శ్రీపాదవారు 1116 రూ. సన్మానభాజనులై, చంద్రికాపరిణయనాటకమును రచించినారు. రాజావారు ప్రకాశ మొనర్చిన చంద్రికా పరిణయము శరదాగమవ్యాఖ్యతో రాజమండ్రియందుగల వీరి ముద్రణాలయముననే 1904 సంవత్సరంలో ముద్రణ మొనరింప జేసినారు. వేదం వేంకటరాయశాస్త్రిగారి వ్యాఖ్యానముల ముద్రణకు కొల్లాపురప్రభువులు ఆర్థికముగా తోడ్పడి వారియందలి భక్తిప్రపత్తుల వెల్లడించినారు.

ప్రారంభమునుండి 1980వరకు ఈసంస్థానము సాహితీసేవ చేసి కవులను, పండితులను గౌరవించుటయేగాక ఎందరి గ్రంథ ముల ప్రకాశనమునకో ఆర్థికముగా తోడ్పడినది.వైదుషీభూషణులు, నీతివాచస్పతులైన ఈపద్మనాయకుల సాహితీసేవ శాశ్వతకీర్తిదాయకము.

సురభి మాధవరాయల సమకాలమున ప్రసిద్ధుడై, రాజుగారికి కవిమిత్రమైన ఎలకూచి బాలసరస్వతి (మొదటిపేరు వెంకట కృష్ణయ్య) బహుగ్రంథనిర్మాత. మహామహోపాధ్యాయుడు. ఈయన నల్లగొండ జిల్లాలోని ఎడవల్లి గ్రామవాసి. రాచకొండ ప్రభువుల ప్రాపకము కవితాసంపత్తితో జటప్రోలు సంస్థానమున ప్రవేశించినాడు. బహుభాషాకోవిదుడైన ఈయన షడ్భాషా

వివరణము, మల్లభూపాలీయము, ఆంధ్రశబ్దచింతామణీవ్యాఖ్య, చంద్రికాపరిణయము, రంగకౌముదీనాటకము, రాఘవ యాదవపాండవీయము, కార్తికేయాభ్యుదయము, వామనపురాణము, బాహాటము, భ్రమరగీతలు అను గ్రంథముల రచించెను. వీనిలో చంద్రికాపరిణయమును పరిటాల సంస్థానప్రభువు జూపల్లి వెంకటాద్రి అభీష్టముమేరకు వ్రాసి సరస్వతీసమర్పణము చేసెను.

మాధవరాయల ఆదేశానుసారము భర్తృహరి సుభాషితముల నాంధ్రీకరించి మల్లభూపతి కంకిత మొనర్చినాడు. దీనియందు విద్వత్పద్ధతి యనువాదపద్యములను 'వైదుషీభూషణా' యని, నీతిశతకమున 'నీతివాచస్పతీ' యని, శృంగారశతకమున 'మానినీమన్మథా' యని మల్లభూపాలుని విశేషించుట ఈపద్యములయందలి ప్రత్యేకత. ఈయన ఆంధ్రశబ్దచింతామణివ్యాఖ్య గూర్చి అప్పకవీయమున వివరముగా గలదు.

మాధవరాయలకు కవిమిత్రుడు, వయస్సులోను కవితాపాండిత్యములందును అగ్రేసరుడైన ఎలకూచి బాలసరస్వతి సహాయ సహకారములు చంద్రికాపరిణయకృతిరచనాసమయమునందు మాధవరాయలకు లభించియుండును. శ్రీమద్రామాయణబాల కాండలో

> విశాలస్య సుతో రామ! హేమచంద్రో మహాబలః
> సుచంద్ర ఇతి విఖ్యాతో హేమచంద్రా దనంతరః
> సుచంద్రతనయో నామ ధూమ్రాశ్వ ఇతి విశ్రుతః

అని తెల్పబడిన శ్లోకములయందలి విషయమును గ్రహించి, మాధవరాయలు సుచంద్రుని నాయకునిగా జేసి చంద్రికయను నామెను సృజించి, వీరితో చంద్రికాపరిణయ మను ప్రబంధమును రచించెను.

చంద్రికాపరిణయకృతినిర్మాణము వసుచరిత్రప్రభావమువల్లనే జరిగినది. ఇవి రెండు సమకాలీనరచనలని కొందరు, చంద్రికా పరిణయమే మొదటిదని కొందరు ఇంతవరకే సాహిత్యప్రపంచమునకు తెల్పినారు.

వసుచరిత్రకథకు మూలము మహాభారతాంతర్గతకథ. దీనియందలి నాయకుడు సూర్యశబ్దవాచకుడైన వసురాజు చంద్రవంశ జుడు. వీనికితోడు వసువులయందు ప్రఖ్యాతుడు. మాధవరాయల ప్రబంధనాయకుడు సూర్యవంశజుడు. చంద్రశబ్దస్ఫూర్తిగల సుచంద్రుడు. దీనికి మూలము శ్రీమద్రామాయణము. ఈయిర్వురి కథానాయకులు భిన్నవంశములవారు. చంద్రవంశ్యులకథ మహాభారతమున ముఖ్యమైన విధముగనే శ్రీమద్రామాయణము సూర్యవంశక్షత్రియప్రాధాన్య మైనది. వసుచరిత్రకారునకు ఆధారమైన మూలకథ కొంత విస్తృతముగా నున్నది. దానిని ఆయన ఎన్నిరకముల పెంచుటకైన అవకాశము కలదు. చంద్రికా పరిణయమున కీ యవకాశము లేదు. లభించిన ఒక్క శ్లోకమున తెల్పబడిన సూర్యవంశప్రభువును ఈయన కథానాయకునిగా చేసినాడు. ఎచ్చటకూడా సుచంద్రవృత్తాంతము లేదు. దీనిని రమణీయముగా పెంచి పెద్దచేసి ఒక విచిత్రకథను సాహితీలోకమున కందించి తనకృతిని విశేషశ్లేషాది కవితావిశేషములతో రాణింపజేయవలయునన్నది మాధవరాయల పట్టుదల. అందుకే దీనిని ఫలవంత మొనర్పగలిగినాడు.

వసుచరిత్ర, చంద్రికాపరిణయప్రబంధములు సూర్య-చంద్రకథా విశేషములు. ఇరువురు కవులు భిన్నప్రాంతములవారు. తూర్పు పడమర (సూర్య-చంద్రుల)యందుండు జగత్ప్రాణదేవతలను వీరు గ్రహించిరి. వసుచరిత్రకారుని మించి మాధవ రాయలు ఒక నూతనపద్ధతిని ఈకథాస్వీకరణలోనే వెల్లడిచేయ గలిగినాడు. వసుచరిత్రము నరాంకితము. మాధవరాయకృతి

దైవాంకితము అనగా తమ యిష్టదైవమైన జటప్రోలు మదనగోపాలస్వామికి అంకితము. దీనివలన యీయన నరాంకితవిముఖత్వము వ్యక్తమైనది. వసుచరిత్రకారుడు 'కేవలకల్పనాకథలు...' అను పద్యమునందు ప్రఖ్యాత-ఉత్పాద్య-మిశ్రకథల ప్రాముఖ్యమును తెల్పి, మిశ్రకథకు 'నేర్పు పెంపు' కావలె ననెను. వసుచరిత్రమున 'నేర్పు' ప్రశంసావహముగా నున్నది. దానికి కారణము అతడు గ్రహించిన మూలకథ. చంద్రికాపరిణయకర్తకు ఇట్టి అవకాశము స్వల్పము. అందువలననే సుచంద్రునిచుట్టు కథ తిరిగినది. స్వల్పప్రసక్తి కలవానిని గ్రహించి తన కల్పనలచే అతనిని గొప్పవానిగా చిత్రించుట మాధవరాయల యుద్దేశ్యము.

వసుచరిత్రలోని పర్వతమైన కోలాహలుడు నదియైన శుక్తిమతి వీరి కలయిక సహజదూరమైనదని ఈతని భావన. అందువలననే తాను రామాయణమున తెల్పబడిన ఒక పాత్రను గ్రహించి, శాపవిమోచన మందిన 'స్త్రీ' చంద్రికను నాయికగా కూర్చినాడు. ఒక మానవమాత్రునకు గంధర్వలక్షణయైన దానిని పత్నిగా నొనర్చుట మాధవరాయల ప్రత్యేకత. ఇట్టిభావము కలవాడు కావుననే వసుచరిత్రను గూర్చి వ్యంగ్యముగా,

'చిరపూరుషుని వసుస్ఫురితాంగి యగు లక్ష్మితో నెనయించు నతుల్యసర్గ' (6-108)

యని చంద్రికాసుచంద్రదంపతీవర్ణనమున వసుచరిత్రయందలి పాత్రల అతుల్యసర్గను తెల్పినట్లున్నాడు. ఇట్టి వ్యంగ్యమునే మఱియొకచోట క్రింది విధముగా వ్యక్తీకరించినాడు.

'తానెంతరాజైన దనవసుస్పర్శనాడంబరం బెంచ జడంబు గాదె'

రామరాజభూషణుడు, మాధవరాయలు ఈయిరువురు అళియ రామరాయల సమకాలమువారు. అప్పటికే వసుచరిత్ర ఖ్యాతి నందుచుండ, దానికి ప్రతిగా తానొక ప్రబంధమును వ్రాయవలెనను వాంఛ చంద్రికాపరిణయకారునకు గలిగినది. అందువలననే ఈరెండు గ్రంథముల కనేకవిషయములలో సారూప్యతయే గాక బింబప్రతిబింబభావము లున్నవి. ఐనా ఎవరి రచన నెవరనుకరించిరో! ఉభయులుకూడా సాహితీమర్మ మెరిగిన యుద్దండకవులు. వసుచరిత్రకారుడు లోకప్రసిద్ధరూఢిపదప్రయోగకవితానైపుణి కలవాడు. మాధవరాయలు పదప్రయోగకుశలుడు – శాస్త్రనిఘంటువులలోని పదములకు అద్భుతరీతిగా యౌగికార్థముల నిరూపించినాడు. ఈవిధముగా నుభయులు సమ ఉజ్జీలైనను వసుచరిత్ర ప్రఖ్యాతి, ప్రచారములు చంద్రికాపరిణయమునకు రాలేదు. భూషణుని రచన సంగీతసాహితీవేత్తల నాకర్షించినది. ఆయన పద్యగమకమే ఒకరకమైనది. ఎవ్వరెన్ని చెప్పినను వసుచరిత్రను మించునట్టికవిత అసాధ్యమే! వెల్లాలవారు తమ 'సురభివంశచరిత్ర'లో కర్తృత్వము తెలియని ఈచాటువును తెల్పినారు. దీనియందు 'చంద్రికాపరిణయఘనత'తో పాటు వసుచరిత్ర తక్కువదనము కలదు- ఆపద్యము:

సురభికులామలాబ్ధిఁ బొడచూపిన మాధవరాయచంద్రుఁడా
సరసపదార్థరంజనము సత్కవిహృద్యము గాగ 'చంద్రికా
పరిణయమున్' రచించె, నది భావ్యము; నీవసుచర్య చూడఁగాఁ
బరగె నిగూఢవృత్తి నటు నీకును వర్తిలె 'మూర్తి' నామమున్.

మాధవరాయల ఆశ్రితుడు, భట్టుమూర్తిపై అనాదరము గల కవి ఈపద్యమును చెప్పినాడు. మాధవరాయలకవితను ప్రశంసించి, వసుచరిత్ర నిగూఢార్థములవలన సరసమైనది కాదని ఇతని యభిప్రాయము. వసుచరిత్రకర్తృత్వమున 'మూర్తి' నామమన్వర్థ మనినాడు. 'మూర్తిః కాఠిన్యకాయయోః' - అను అమరకోశపదమువలన 'మూర్తి' శబ్దము కఠినుడు, బండ యని

తెలియును. దీనివలన భూషణుడు బండమైనవాడు, కాని నిగూఢవృత్తిగా నున్న నది, కోలాహలపర్వతము (బండ) వసుచరిత్రలో ముఖ్యము గదా! అందువలన 'మూర్తి' ప్రయోగము చేసెనేమో? ఈపద్యమున చెప్పినట్లు వసుచరిత్ర తక్కువదిగాదు. అభిమానోత్సాహమతిని ఈపద్యము వ్రాయించినట్లున్నది. ఎవరి కవిత వారిది, ఎవరి పద్ధతి వారిది.

మాధవరాయల సమకాలముననే గాక అతనికి ముందు, సమకాలములోను వచ్చిన శ్లేష,ద్వ్యర్థి, త్ర్యర్థి రచనలను ఈప్రాంతమున వెలసి ప్రసిద్ధినందుచున్న అనర్ఘరాఘవ భాస్కరరామాయణ చిత్రకవితారామాయణాదులను చంద్రికాపరిణయకర్త బాగుగా నధ్యయనము చేసినాడు. సమకాలసాహిత్యప్రభావము తప్పించుకొనజాలనిది. సంస్కారవిశేషమువలన పూర్వభావములు మనస్సులో నెలకొని సందర్భానుసారము కవితారూపముగా నవి దొర్లుట సహజము. మాధవరాయలు భాషా-భావ-దారిద్ర్యములు లేనివాడు. శ్లేషకావ్యరచనకు కావలసిన శక్తి గలవాడు. 'కావ్యజ్ఞ శిక్షయాభ్యాసః' అనునది ఈయన యందు పూర్తిగా గలదు. కావుననే తదాస్థానకవిపండితమండలి కృతినిర్మాణవిషయమున మాధవరాయరాజన్యుని గూర్చి యిట్లు పలికినారు:

> విబుధశిక్షితుఁడవు, శాస్త్రవిదుఁడ, వఖిల
> కావ్యవేదివి, ఘనతార్కికవ్యవహృతి
> నెఱుఁగుదువు, నీకసాధ్యమే యింపుమీఱఁ
> గృతి వినిర్మింపు మాధవక్షితిప యనిరి. (1-75)

దీనియందు తెల్పిన లక్షణము లీకవిచంద్రునకు గలవు. తన కవితారూపతపస్సును మాధవరాయమనీషి దీనిలో వ్యక్తీకరించినాడు. ఇది అందాల 'చంద్ర' మహల్. అందరము ఈచంద్రికాపరిణయమును సమాలోకింతము.

కథాసంగ్రహము

ఆరు ఆశ్వాసములతో నొప్పారి, వివిధరీతులైన 905 గద్యపద్యములు గల యీచంద్రికాపరిణయమునందు ముఖ్యకథాపాత్రల సంఖ్య పది. వారు– సుచంద్రుడు (నాయకుడు), చంద్రిక (నాయిక), కుముదుడు, చిత్రరేఖ, వసంతుడు, మన్మథుడు, క్షణదోదయుడు, పార్వతీదేవి, బ్రహ్మ కలరు. వీరి యందరితో మాధవరాయలు ఈప్రబంధకథానిర్వహణ మొనర్చెను. దీనియందలి కథ (సంక్షేపముగా):

నైమిశపుణ్యారణ్యమున వసించు సూతమహర్షివద్దకు శౌనకాదిమహర్షులు విచ్చేసి, మర్త్యలోకమున గల రాజులలో పుణ్యశ్లోకుడైన ఒకని చరిత్రను తెల్పవలసినదని ప్రార్థన చేయగా సూతుడీ కథను చెప్పెను.

మనుష్యలోకమున సర్వసంపదలతో తులతూగుచు సుఖజనావాసమైన మహాపట్టణము విశాలానగరము. దీనిని సౌందర్యరాశి, మహపరాక్రమవంతు డగు సుచంద్రుడు పరిపాలించుచుండెను. ఆప్రభు వొకనాడు సకలసామంతదండనాయకాది జనయుక్తుడై సభదీరి యుండగా, సుగుణవారాశి యైన శాండిల్యముని విచ్చేసి, సుచంద్రుని సత్పరిపాలనను ప్రశంసించి, ఇట్టి మీ రాజ్యమున అస్మాదృశుల జపతపోనుష్ఠానయజనయాజనాది క్రియ లిప్పటివరకు నిరాటంకముగా జరిగినవి. కాని ఈమధ్య మాయావి– మహాబలుడైన తమిస్రనామకరాక్షసునిచే సత్కర్మలకు విఘ్నము కల్గుటయేగాక మునిజనమునకు ముప్పు ఏర్పడి

నది. సకలశస్త్రాస్త్రవిద్యావిశారదుడవైన నీవు ఆదానవుని నిర్మూలించి బలపరాక్రమాదుల సార్థక మొనర్చి, వైదికక్రియలు నిర్విఘ్నముగా జరుగునట్లు చేయవలసినదని విన్నవించిరి.

శాండిల్యుని సుచంద్రు డోదార్చి, అభయ మొసంగి, వెంటనే సేనాయుతుడై వలయు పరివారముతో తమిస్రాసురనిర్మూలన క్రియావణుడై బయలుదేరెను. ఆయన జైత్రయాత్ర చేయుచు నదీనదకాంతారముల దాటి హేమకూటపర్వతమును గాంచెను. అది సిద్ధవిద్యాధరకిన్నరీమణివీణానినాదమనోహరమై, సంగీతప్రతిధ్వానమై యున్నది. ఆప్రాంతమున సైన్యము నుంచి, వయస్యునితో గూడుకొని హేమకూటనగదర్శనోత్సుకుడై బయలువెడలి హేమకుధరవైభవమును గాంచి అచటి సౌందర్యమును (విపులముగా) వర్ణించి, అందలి చంద్రకాంతశిలామణిఖచితపార్శ్వభాగశోభితమైన లతాగృహయుక్త గుహామార్గమున పయనించును. అది గంధర్వసతీనివాసస్థానము. వయస్యాసంయుతుడైన సుచంద్రు డచట విశ్రామార్థము కూర్చొని యుండెను. ఇంతలో నొక మణిపుత్రిక యొయ్యారముగా విచ్చేసి రాజునకు అతిథిమర్యాద లొనర్చి, వ్యజనసేవ చేయుచుండును.

ఇంతలోనే సుదూరప్రాంతమునుండి యొక మృగేంద్రము గర్జించుచు పొదరింటినుండి వెడలి సుచంద్రాదులపైకి దూకయత్నించును. దానిని గమనించి యా రాజన్యుడు తన చంద్రహాసముచే సింహశిరఃఖండన మొనర్ప వెంటనే కంఠీరవ మొక భానుప్రభాభాసమాన కాంతియుక్త పురుషరూపము దాల్చును. దానికి సుచంద్రు డాశ్చర్య మందుచుండ నా మనుష్యుడొక కిన్నరుడై వచ్చి ప్రభువునకు నమస్కరింపగా, నారా జతనిని చేరదీసి తనచెంత నుంచుకొని సింహత్వము, అనంతరము కిన్నరత్వము నీకెట్లు సంప్రాప్తించినవని యడుగును. దాని కాకిన్నరుడు ఒకనాడు బ్రహ్మవద్దకు మహామనువర్ణదేవతలు విచ్చేసి, వసంతుడను విప్రుడు బ్రహ్మత్వముకొరకై జపముచేయుచు మాయక్షరసంఖ్య నసంఖ్యాకముగా జపించుటవలన మాకు తాపము కల్గి భరింపలేకున్నా మని తెల్పిరి. వసంతుని తపోభంగమునకై దేవేంద్రుని సలహా ననుసరించి చిత్రరేఖ యను దేవవేశ్యను అచటికి పంపుటకు పరమేష్ఠి నిశ్చయించి మన్మథపరివారము తోడుగా చిత్రరేఖను వసంతుని తపోభూప్రాంతమున కంపెను. ఆమె యాస్థలమునకు వచ్చేసి తన ప్రయత్నముల నారంభించినది. వానికి ఆముని వశుడు గానందున ఈమె ఆయన పాదముల పై బడి తన విద్యావైదుష్యములు తెల్పి తనను పరిగ్రహింప వేడికొనును గాని మునివర్యుడు నేత్రసంజ్ఞతోనే ఆమె వాంఛను తిరస్కరించును. దాని కంగీకరింపని చిత్రరేఖ బలవంతముగా నామునిహస్తమును బట్టి తన వాంఛాపరిపూర్తికి పరితపించుచుండ నాతపస్వి క్రోధాక్షుడై యామెను నీవు దేవాంగనాభావమును వదలి మానవస్త్రీగా జన్మించి సుచంద్రనామకప్రభువును పరిణయమాడుదువని శపించెను.(కవి యిచ్చట సుచంద్రశబ్దమునకు 'సుదోషాకరు' డని, భూపాలయనుటకు 'ఇరాపు'డు అనెను. అధికదోషనిలయుడు, మద్యపాయి యని వీని యర్థము లున్నవి). ఆమె శాపవశమున క్షణదోదయరాజునకు శ్యామయను పత్నియందు జనించి చంద్రికాభిధ యాయెను. బ్రహ్మ కీవిషయము తెలిసి బాధపడి నన్ను కుముదాహ్వయునిగా భూలోకమునకు వెళ్లి ఆమెకు వీణావాద్యము నేర్పుమనెను. ఒకనాడు నేను నభోమార్గమునుండి భూలోకమునకు అరుదెంచుచు సౌందర్యనిధియైన యొక మునికాంతను గని ఆమెను పొందు వాంఛతో నాకు గల శాంబరీవిద్యామహిమవలన మునివేషధారినై యచటి మునిజనవర్గమును చేరితిని. కాని నామాయావేషమును ఆ యువతిభర్త తెలిసికొని, నన్ను సింహరూపుడవు కమ్మని శపించెను. అనంతరము నేను వేడుకొనగా పంచవర్షానంతర మీశాపము తీరగలదని చెప్పినాడు. అందువలన నేను మృగేంద్రుడనై యుండి నీచంద్రహాసప్రహారమున పూర్వరూపము గనినాను అని తెల్పి సౌందర్యరాశియైన చంద్రికను వర్ణించి రాజున కామెపై మోహము ను పుట్టించెను. రాజును తీసికొని వెళ్లుటకు తనశాంబరీవిద్యచే విమానమును రప్పించి చంద్రికానివాసప్రాంగణమునకు చేర్చి, గానవిద్యాపరతంత్రయగు నామెను కన్పింపజేయును. చంద్రికాదృక్చకోరసుచంద్రుడు ఆమెపైనుండి మనస్సును మరల్చుకొన

జాలడాయెను. గంధర్వు డతనిని చాటుగా నుంచి చంద్రికవద్దకు వెళ్లి పూజాదికము లంది యామెను పెండ్లికూతు రగునట్లు ఆశీర్వదించి, ఇంతకాలము తాను కన్పడకపోవుటకు గల కారణమును తెల్పి సుచంద్రునిగూర్చి చెప్పి వర్ణించును. అనంతరము చంద్రికాసుచంద్రులకు పరస్పరదర్శనభాగ్యమును కలిగించి మీరుభయులు దంపతు లగుదురుగాక యని పల్కెను. సుచంద్రుడు తెప్పరిల్లిసైన్యయుతుడై తమిస్రాసురవధార్థము బయలుదేరును. యుద్ధమున నెందరో యోధులు పంచత్వమందగా, తన పరాక్రమమును గణింపక పోరాడు తమిస్రుని సుచంద్రుడు నారాయణాస్త్రప్రయోగముచే శిరఃఖండన మొనర్చి మునిదేవతాగణములకు ముదము చేకూర్చగా, సుచంద్రుని నష్టసైన్యమును అమృతవృష్టిచే దేవతలు పునర్జీవుల నొనరింపగా, విజయుడై సుచంద్రుడు స్వపురమునకు విచ్చేయును. తరువాత చంద్రికాస్వయంవరము ప్రకటింపబడును. ఆ స్వయంవరమునందు క్షణదోదయుని ప్రార్థనచే పార్వతీదేవి ప్రత్యక్షమై స్వయంవరమునకు వచ్చిన రాజులనందఱిని చంద్రికకు పరిచయము చేయును. స్వయంవరాగత వివిధదేశరాజన్యుల నెల్లరిని వర్ణించి చెప్పినను వారి నెవ్వరి నంగీకరింపక చంద్రిక సుచంద్రునే వరించును. అనంతరము వీరి పరిణయమును, గృహప్రవేశాదులను వర్ణించి ఆసుచంద్రుని పాలనమున దేశము సుభిక్షమైనదని సూతుడు శౌనకాదుల కీకథను తెల్పెను.

కృత్యాది

మాధవరాయలు తనకృత్యాదిని విపులముగా సిద్ధము చేసినాడు. దీనియందు సురభివారి వంశపరంపర (తనవరకు) కలదు. సంప్రదాయానుసార మీగ్రంథము 'శ్రీ' కారముతో 'మదనగోపాలాహ్వయోజ్జృంభితాంభోవాహ' వర్ణనప్రధానము.

అనంతరము లక్ష్మి, బ్రహ్మ, సరస్వతి, శివుడు, కల్పవృక్షము, వైకుంఠము, గణపతి, హనుమంతులను స్తుతించెను. కవిస్తుతియందు వ్యాస, భారవి, మయూర, కాళిదాసులు, ఆంధ్రమహాభారత కవిత్రయము గలరు. కృత్యాదిలో పరంపరగా అనుసరింపబడు కుకవినింద, కవికి స్వప్నమున తమ యిష్టదైవమైన జటప్రోలు మదనగోపాలస్వామి దర్శన మొసంగి కృతినిర్మాణము నొనర్పు మనుట అనంతర మీయనను కవిపండితమిత్రవర్గము గ్రంథరచనకు ప్రోత్సాహపరచుట, శ్రీవైకుంఠవర్ణన – ఇవి ప్రారంభమున గలవు. వీనిలో 1-18 నుండి 1-75 వరకు విపులముగా వంశవర్ణన చేయబడినది.1-77 నుండి 1-82 వరకు షష్ఠ్యంతములు గలవు.

ప్రబంధకవి సంప్రదాయము ననుసరించి ఈవిషయములను తెల్పిన మాధవరాయలు ఏకారణముచేతనో కొన్నిటి ప్రసక్తి చేయలేదు.

రాచకొండ వెలమల పరంపరకు చెందిన వీరు మొదట శైవులు. అందువలననే రాచకొండవారు భైరవప్రతిష్ఠల నొనర్చుటయేగాక శివాలయముల కట్టించినారు. వైష్ణవమతస్వీకారానంతరం రామాలయాదుల నిర్మాణ మొనరింపజేసిన వీరు తమ నామధేయములనుకూడా విష్ణుసంప్రదాయముగా నుంచుకున్నారు.

జటప్రోలువారుకూడా వీరివలెనే మార్పు చెందినారు. ఈవంశమునందు మల్లభూపాల మల్లనాయకపదములు శైవచిహ్నితములు. అనుపమమల్లికార్జునయశోంచిత – అని తెల్పబడిన వ్యక్తు లున్నారు. ఇట్లే లింగభూపాల, లింగాంబికలు గలరు. వీరి పూర్వుడు అనపోతమహారాజు శ్రీపర్వతసోపానస్థాపకుడను విషయము రసార్ణవసుధాకరమున తెల్పబడినది. ఈవిధముగా శివభక్తులైన జటప్రోలువారు రాచకొండప్రభావమున శ్రీవైష్ణవభక్తిగలవారైనా ఉభయమతములను సమానముగా చూచి తత్తద్దేవతా ప్రతిష్ఠల నొనర్చి అగ్రహార-భూదానముల నొనర్చిరి. ఈకావ్యమున శివగణపతిస్తుతులుండుట కవి అవిస్మృతశైవమే యనిపిం

చును. మాధవరాయలు శ్రీవైష్ణవాభినివేశముగలవాడు. ఇతనికాలమువరకే ఈప్రాంతమునకు దాక్షిణాత్యవైష్ణవసంప్రదాయులు వచ్చియున్నందున వారి ప్రభావము ప్రభువులపై పడినట్లున్నది. అందుకే మంచాలకట్టయందు కుంతీమాధవాలయనిర్మాణము. దీనికి పూర్వము సింగపట్టణ నృసింహదేవాలయనిర్మాణాదులు జరిగినవి. కుంతీమాధవాలయము పిఠాపురప్రాంతమున గలదు. దీని ప్రసక్తి శ్రీనాథుని భీమేశ్వరపురాణమున కన్పడును. జటప్రోలువారికి పిఠాపురంవారి బంధుత్వకారణమున ఈ ప్రాంతమున మాధవాలయము వెలసినది. ఇంత విష్ణుసన్నిధులు గల సంస్థానాధీశుడు మాధవరాయలు. ఐనా తన యీగ్రంథమున నృసింహప్రసక్తి చేయలేదు. కనీసము దశావతారములనైనా తెల్పలేదు. శ్రీకృష్ణదేవరాయలు, సంకుసాల నృసింహకవి వంటివారు స్వీకృతవైష్ణవముద్రగలవారైనా దానిలోతు అనగా సంప్రదాయమును తెలిసికొన్నవారు. అందుకే వారిగ్రంథముల యందు ఏతత్సంప్రదాయప్రార్థనాదు లున్నవి.

మాధవరాయలది వైష్ణవమతాభిమానమే. కాని పంచసంస్కారసంపన్నమైన వైష్ణవముమాత్రము కాదనిపించును. అందుకు కారణమేమనగా– ఈయన విష్వక్సేనుని పంచాయుధములను, గరుడాళ్వారును, పన్నిద్దరు సూరులను స్తుతించకపోవుట. రాయల కృత్యాది సంప్రదాయపరిపూర్ణమైనట్లు చంద్రికాపరిణయకర్త ఆపద్ధతిని అవలంబించిన ఇదికూడా పరిపూర్ణసంప్రదాయ కృత్యాది గలదనుటకు సంశయము లేదు.

తెలుగుకవులలో కల్పవృక్షస్తుతి చేసినవారు అరుదు. మాధవరాయలు మాత్రము ఈస్తుతి నొనర్చెను. కృతిస్వామియైన మదనగోపాలస్వామి వెనుకగల పొన్నవృక్షమును కల్పవృక్షముగను, ఆదేవుని విష్ణువుగను భావించి కల్పతరువును చెప్పియున్నాడేమో!

చంద్రికాపరిణయకర్తయొక్క మఱియొక విశేషము– తనవరకుగల వంశవృక్షమును తెల్పుట. దీనివలన వెలుగోడు, రాచకొండ, జటప్రోలువారి పరంపరను తెలిసికొనుటకు పరిశోధనాజిజ్ఞాసువులైన వారికి ఇది మిక్కిలి ఉపయోగపడును.

కవి తనకవిత్వపద్ధతినిగూర్చి ప్రత్యేకముగా తెల్పలేదు. సరస్వతీస్తుతి చేయు పద్యము శ్లేషలో నున్నది. ఇది యొక విధానమున తన కవితాపద్ధతి యని వ్యక్తీకరణ మొనర్చినాడు. ఆపద్యము–

రమణీయతర పదార్థప్రకాశనిదాన,భాస్వత్ప్రసాదసంపద వహించి,
పటుసారసానందఘటకైకచాతుర్య,ఘనకృతాలంకారకలన మెఱసి,
యనుకూలకాలకంఠాకుంఠకలనాద,వలమానమంజులధ్వనుల నలరి,
యతివేల కవిజాల కామోదనాపాద,కారణ రసభావ గరిమ నెనసి,
పరమయతియోగ సంస్థాన పదమనోజ్ఞ
వైభవోన్నతిఁ దగు సరస్వతి మదీయ
మానసాస్థానమందిర మధ్యవీథి
నిండు కొలువుండు గాత నిష్ఖండలీల (1-4)

ఈపద్యముతోబాటు సత్సంప్రదాయుడైన మాధవరాయని కృతినిర్మాణ మొనర్చుమని తెల్పు సందర్భములో (1-75)

విబుధశిక్షితుఁడవు, శాస్త్రవిదుఁడ, వఖిల
కావ్యవేదివి, ఘనతార్కికవ్యవహృతి
నెఱుఁగుదువు, నీ కసాధ్యమే యింపుమీఱఁ
గృతి వినిర్మింపు మాధవక్షితిప యనిరి. (1-75)

ఈపద్యము ఈయన ప్రతిభను, కవితానిర్మాణశక్తిని వ్యక్తమొనర్చును. అందువలననే చంద్రికాపరిణయ మొనర్చుట మాధవ రాయల కసాధ్యముగా ననిపించలేదు. ఎలకూచి బాలసరస్వతివంటి మహామహోపాధ్యాయుల విబుధసన్నిధి శిక్షణ(విద్య) తోడ్పడినది. శాస్త్రవేదులు, కావ్యజ్ఞులు, తర్కశాస్త్రనిపుణు లున్నారు. వారందరివలన ఆయావిద్యలపద్ధతిని తెలిసికొన్న మనీషావంతుడు మాధవరాయలు. అందువలననే విన్న విషయమునకు మెఱుగులు పెట్టి ప్రబంధీకరించి తన కవితాసంపత్తి నిరూపించి, పైన తెల్పిన పద్యములలోని లక్షణములను తన గ్రంథమున ప్రతిఫలింపజేసిన ప్రౌఢకవితావతంసుడు.

చంద్రికాపరిణయము వసుచరిత్రకు ప్రతిస్పర్థిగా రచితమైనది. కవితావిషయమున పలుచోట్ల బింబప్రతిబింబభావమే కన పడును. ఎందుకోగాని ఈగ్రంథకర్త రామరాజభూషణునిగాని, అతనికృతినిగాని ఎచ్చటను పేర్కొనలేదు. వసువనగా సూర్యా ర్థము గలదు. చంద్రిక – వెన్నెల సూర్యచంద్రసమాగమము ఒకే పర్యాయము సంభవింపనట్లు మాధవరాయలు (చంద్రవంశము) 'వసు' ప్రసక్తి చేయకున్నను, గ్రంథమునందు 1-32, 6-108 పద్యములలో వ్యంగ్యముగా 'వసు' ప్రసక్తి చేసినాడని భావింప వీల గును. కవిస్తుతిలో సంస్కృతాంధ్రకవులను కొందరినే పేర్కొనిన ఈ ఉభయభాషాకళత్రుడు కనీసము తన కవిమిత్రుడు ప్రఖ్యా తుడు నైన ఎలకూచి బాలసరస్వతినిగాని, సమకాలీనులైన మఱికొందరు కవులనుగాని పేర్కొనకపోవుట విచిత్ర మనిపించును. దీనికి మఱియొక యూహ కృత్యాదిస్తుతిపద్యములు ముక్తకములు. దీని తరువాత ఈ స్తుతి యను నియమము లేదు. మాధవ రాయకవీశుని కృత్యాదిపద్యములలో మఱికొన్ని ముద్రాకాలమున తప్పిపోయినవేమో? అనికూడా ఒక సంశయము. లేనిచో ఇంత అసమగ్రపద్ధతి ఎట్లుండును?

దీనిలోని షష్ఠ్యంతములు – ఉత్తరార్ధమంతయు అన్ని పద్యములకు ఒకేవిధానము పాటింపబడుటచే విశేషముగా నున్నది.

ప్రబంధపాత్రలు

చంద్రికాపరిణయకథానిర్వహణ దైవమానుషసమ్మిశ్రితము. సుచంద్రుడు, క్షణదోదయుడు, వసంతముని, చంద్రిక – వీరు మానవులు. గంధర్వజాతికి చెందినవాడు కుముదుడు. అప్సరోవంశజ చిత్రరేఖ. జగన్మాతృత్వము గలది పార్వతి. బ్రహ్మ మన్మ థులవిషయము తెల్పవలసిన పని లేదు.

కావ్యనాయకుడైన సుచంద్రుడు అదివ్యుడు. నాయిక యైన చంద్రిక దివ్యాదివ్య. అందువలననే కృతికి నాయికానామము నుంచినాడు ('వసుచరిత్రము' నాయకనామాంకము గలదిగదా!). సుచంద్రుని ఏవిధమైన లోపములేని నాయకునిగా చిత్రించి ఆయన నిగ్రహశక్తి, ప్రజాపాలనాతత్పరత, అద్భుతశౌర్యము మొదలైన వాటికి ప్రతీక యని ప్రత్యక్షీకరించెను. కావ్యప్రధానరస మైన శృంగారము నాయికానాయకాశ్రయముగా చిత్రించి, ఆనుషంగిక వీరరసమునకు నాయకుని పోషించెను. ధర్మార్థకామ సాధనము లీతనిద్వారా దీనియందు సిద్ధించినవి.

చంద్రిక కావ్యనాయిక యైనను ఆమె సుచంద్రుని ప్రేమించి కావ్యకవిసమయానుసారము విరహాదుల ననుభవించుట, స్వయంవరమున సుచంద్రుని పొందుట– ఇవియే ఈమె ముఖ్యకార్యములు. వసుచరిత్రలోని నాయిక చెలికత్తెలవలె ఈమెను, ఈమె చెలికత్తెను కవి పరిపూర్ణపాత్రలుగా చిత్రించలేదనిపించును.

సింహరూపశాపవిముక్తి సుచంద్రునివలన సంభవించిన కుముదుడు చంద్రిక పూర్వజన్మ (చిత్రరేఖ) విషయమును తెల్పి తాను ఆమెకు సంగీతోపాధ్యాయుడనని వివరించి సుచంద్రునకు కృతజ్ఞతగా చంద్రికాసుచంద్రుల వివాహము జరుగునట్లు చేయును. వీరి శాపములు, మోక్షములు ఇతనివలననే తెలియును.

ఈవిధముగనే చిత్రరేఖ, వసంతుడు, క్షణదోదయుడు, పార్వతి, మన్మథ, చతురానన పాత్రలను యథోచితముగ పోషించిన కవి నాటకపాత్రలవలెనే వీరిలో కొందరిని స్వల్పకాలము మాత్రమే కథాభాగమునందు నిల్పుటవలన అనుస్యూతపద్ధతి కొరవడినను సన్నివేశకల్పనములయందు వీరిని ప్రత్యక్షీకరింపజేసినాడు.

పాండితీప్రకర్ష

మాధవరాయకవిచంద్రుడు మహాప్రతిభావంతుడు. కల్పనానైపుణితో బాటు వర్ణనాచమత్కృతి, వివిధవిషయవివేచనాపటుత్వముగల కవితాశక్తి కలవాడు. అందువలననే

> ‘ విబుధశిక్షితుఁడవు, శాస్త్రవిదుఁడ, వఖిల
> కావ్యవేదివి, ఘనతార్కికవ్యవహృతి
> నెఱుఁగుదువు, నీ కసాధ్యమే యింపుమీఱఁ

గృతి వినిర్మింపు...’ అని సభాస్థానమున ప్రశంసితు డైనాడు. ఈయన విబుధసన్నిధియందు విద్యాభ్యాస మొనర్చి, ‘కావ్యజ్ఞశిక్షయాభ్యాసః’ అను లాక్షణికోక్తిని సార్థకము చేసికొనెను. శాస్త్రవేదిత్వ మనునది వ్యాకరణచ్ఛందోలంకారజ్యోతిషసంగీతాది శాస్త్రవిద్యల ప్రావీణ్యమును తెల్పుచున్నది. కవియైన మనీషావంతునకు ‘అఖిలకావ్యవేది’ యగుట ఆవశ్యకము. ‘వాణీ తర్కరసోజ్జ్వలా’ యనుదానికి నిదర్శన మీయన ‘తార్కికవ్యవహృతి’. ఇట్లు ఇన్ని విధములైన శక్తులు కలవాడు కావుననే ‘ఇంపుమీఱ’ ఈప్రబంధమును సిద్ధముచేయ సమర్థుడైనాడు.

చంద్రికాపరిణయకర్త ఛందఃపరిజ్ఞానము విశేషవృత్తివిలసితము. దీనియందు మొత్తము 905 గద్యపద్యములలో, 289 చంపకములు, 187 మత్తేభములు, 157 సీసములు కలవు. ఇక విశేషఛందములయందు పృథ్వి, పంచచామర,మాలినీవృత్తములు రెండేసి కలవు. ఉత్సాహ, సుగంధి, కవిరాజవిరాజిత,లయగ్రాహి,మహాస్రగ్ధర, ప్రహరణకలిత,వృషభగతిరగడ, త్వరితగతి, మందాక్రాంత,శిఖరిణీ,భుజంగప్రయాతములు– ఇవి ఒక్కొక్కటి యున్నవి. స్తుతిసమయమున దండకమును చెప్పుట ఒక సంప్రదాయము. దీని నీ గ్రంథ కారుడు ప్రౌఢసంస్కృతమున చెప్పి తన శక్తిని చాటినాడు. స్వయంవరసమయమున శ్రీనాథుడు సరస్వతీస్తోత్రమును దండక ముగా చెప్పి నైషధానువాదమునకు వన్నె తెచ్చిన విధానమును గమనించిన మాధవరాయలు సంస్కృతమున ‘శక్తి’ని స్తుతించి దండకరచనాఫణితిలో శ్రీనాథునకన్న ముందునకు బోవ యత్నించి నట్లున్నాడు.

దీనియందు ప్రయోగించిన ఛందము సందర్భోచితముగా నున్నది. యుద్ధమున మహాస్రగ్ధర, అతివేగశరసంధానమునందు త్వరితగతి, యుద్ధవైచిత్రిలో పృథ్వి, మాలిని, ప్రహరణకలిత, శిఖరిణి, పంచచామర,భుజంగప్రయాతములను చెప్పి, ఛందో

రీతిలో వేగముగా నుండు (గణరీతి) వీనిని సమరత్వరసమయమున చెప్పుట రసానుకూల సందర్భోచిత పద్యప్రయోగము. అందరి కవులవలెనే పుష్పాపచయసమయమున వృషభగతిరగడ నీయన చెప్పినాడు.

తనది చంద్రికాపరిణయకృతి. చంద్రిక (వెన్నెల) ఆహ్లాదకరమై సొంపుగా నుండునది. అట్లే కావ్యనాయిక యైన చంద్రికను భావించిన కవి ఈమెనుగూర్చి చెప్పునప్పుడేగాక రసానుకూలమార్దవసన్నివేశములయందు 'చంపకములు' (289) చెప్పి కవితారూపమనోహారిత్వమును కల్గించెను. మత్తేభసీసములనుగూడ వర్ణనలు,కల్పనలు, యుద్ధము మొదలైన సమయము లలో రచించినాడు. మధ్యమధ్యనగల వచనములు వివిధరీతులుగా నుండి ప్రబంధకర్త రచనాశైలిని నిరూపించుచున్నవి.

వ్యాకరణశాస్త్రమర్యాదల మిక్కిలి ఆకళింపు చేసికొన్న మాధవరాయలు పదప్రయోగవిధానమున తత్సంప్రదాయమును నిరూపించినాడు. 1-60లో 'ధర్మనిర్మథనంబు దా(జేసి జనకజాపాణౌకృతిక్రీడ...' అనెను. పాణౌకృతిక్రీడ యనగా పాణిగ్రహణము (వివాహము). ఇది యలుక్సమాసము. పాణినీయమున 'నిత్యం హస్తే పాణౌ వుపయమే' అను సూత్రము ద్వారా 'పాణౌకృతి' రూపమగును. వ్యాకరణవిశేషములను చమత్కారముగా కూర్చి ఒక ప్రౌఢత్వమును నిరూపించుట యందు ఈయనకుగల మక్కువ ఎట్టిదో ఈపద్యముద్వారా తెలియును.

గళదర్కంబు(, బనీపతత్కుజము, రింఖద్గోత్రంబు(, జా
చలదుర్వీవలయంబు, ఫక్కదఖిలాశాకంబు, భిద్యన్నభః
స్థలమేఘౌఘము, భ్రశ్యదృక్షము, రణత్పద్మాసనాండంబునై
యలరెన్- దన్మహిపాలజైత్రగమబంభారావ మప్పట్టునన్. (1-151)

ఇందు సంస్కృతధాతువులపై శతృప్రత్యయము (అత్)ను చేర్చి వర్తమానార్థమునందు సమాసగ్రథన మొనర్చుట యొక చమత్కారము. ఈవిధమైన పద్యములు ఆముక్తమాల్యద, అనర్ఘరాఘవము, భాస్కరరామాయణములయందు గలవు. ప్రక్రియా విశేషజ్ఞత, ధాతుజ్ఞానము కల్గియున్ననే కాని ఇట్టి పాండితీస్ఫోరకప్రయోగములు చేయ సమర్థు లగుదురు. 'పనీపతత్కుజము' అని 'పనీపత' చ్ఛబ్దమును యగంతముగా నున్నదాని నిట్లుప్రయోగించెను. గళ,రింఖ,చల మొదలైనవానికి శతృప్రత్యయము చేర్చి వింతరూపములను భావము కల్గించుట దీనిలోని ఒకవిశేషము. ప్రవేశించు అను నర్థమున 'నివిశమాన' అని (2-21) ప్రయోగించినాడు. ఆత్మనేపదిత్వమును పొందిన 'విశ' ధాతువునకు వర్తమానార్థ 'శానచ్' ప్రత్యయమును చేర్చినచో 'నివిశమాన' యగును. ఇట్టి రూపములు వ్యాకరణాంబుధిలోనికి ప్రవేశించినవారికే లభించగలవు.

యావకరసాన్వాదేశము (5-88) – లత్తుకకు అన్వాదేశము – పునరుక్తము – అని దీని యర్థము. వైయాకరణసంకేతమైన ఈ అన్వాదేశశబ్దము 'కించిత్కార్యం విధాతుం ఉపాత్తస్య కార్యాంతర విధానాయ పునరుపాదాన మన్వాదేశః' అని.

అష్టదిక్పతుల పత్నుల నామధేయముల తెల్పునప్పుడు మఘోని, అగ్నాయి, అంతకీ, తమీచరాబల, వరుణా, మారుత వధూ, ఐలబిలీ, గిరికన్యా – అని ప్రయోగించి తన వ్యాకరణపాండితిని నిరూపించుకొనెను.

ఇక యఙ్లుగంతధాతువులపై శానచ్ ప్రత్యయాంతముల గూర్చి అతిశయార్థద్యోతకములుగా వరీవృత్యమాన, జరీజృభ్య మాణ - ఇత్యాదిపదములతో వచనమును రచించి సుచంద్రవివాహసమయమున పాంచాలభూవిభుని మందిరప్రవేశత్వరగతిని తెల్పుట వీని ప్రాముఖ్యము.

ఇట్లే తర్క సంగీతవిషయములు, తెలుగు వ్యాకరణపదవిశేషములు ఈగ్రంథమున విశేషముగా గలవు. ఓపికగా పఠించు పాఠకునకు ఈవిషయము లవగతమగును.

వర్ణనలు

'వర్ణనానిపుణః కవిః' యనునది చంద్రికాపరిణయకర్తవిషయమున సార్థకము గాగలదు. ఒకప్రబంధమునందు ఏయే వర్ణనలుండవలెనో తెల్పిన లాక్షణికపద్ధతిని మాధవరాయలు అధికభాగము పాటించినట్లు ఆయన వర్ణనలే సాక్ష్యము. పూర్వకవుల పద్ధతులను సాకల్యముగా ఆకళింపు చేసికొనిన ఈయన ప్రతి చిన్న విషయమును– చరాచరములను కూడా (జంతు, పర్వతోద్యానాదుల) వర్ణించెను. మఱికొన్నిటిని అధికముగా చెప్పుటవలన కథాకథనమునకు కొరత ఏర్పడినది. ఉదాహరణము– పురవర్ణన మొత్తము 88 పద్యములలో గలదు. మొదటి ఆశ్వాసమున 171 గద్యపద్యములలో ఆవర్ణనయే అధికమై కథను కుంటుపరచినది. దీని తర్వాత విరహవర్ణన– ఇందులోనే మన్మథచంద్రమలయానిలాదులు– వీనికి 56 గద్యపద్యాలు. పరిణయవర్ణన 80 గద్యపద్యాలలో నున్నది. ఇవియేగాక దీనిలో ఇతరవర్ణనలు– వాని గద్యపద్యసంఖ్య యిట్లు గలదు.

నగర-19, ఋతు– 20, సూర్య– 15, శశి– 8, సరస్సు -2, వన -1, రతి -8, యాత్ర -22, యుద్ధము -45, రాజవర్ణన, పాలన – 28. వీనితో బాటు ఉద్యాన, పుష్పాపచయ, జలక్రీడ, ప్రదోష, నక్షత్ర, దేవవేశ్యా, స్వయంవర,వధూవర, క్రీడావేశ్మ, సురత వర్ణనలు గలవు. అలంకారశాస్త్ర పారంగతత్వము గల మాధవరాయలు సూక్ష్మపరిశీలనతో ఈవర్ణనలు చేసినాడు.

> అకళంకాంబుజపాళికాసుఖితభృంగాళీతనూకాంతిదం
> భకళిందప్రభావానుషంగ శిఖిదామాతాండవాపాదనో
> దక భంగోత్కర ఘర్షణక్రమ సముద్గచ్ఛత్పయోబిందు శీ
> తకరీభూత పతంగ గంగ దనరుం దత్ప్రాంతదేశంబునన్. (1-108)

ఇది గంగానదీవర్ణన. కవి దీనియందు ఒక నూతనవిషయమును చెప్పదలచినాడు. అందుకే అభంగ గంగాతరంగిణి భంగ సంయుతమై ఏకధాటిగా ప్రవహించు విధానమున సుదీర్ఘసమాసమున బిందుపూర్వక 'గ' కారముతో తెల్పి, 'పతంగ' 'గంగ' యని ముగించినాడు. దీనిలో తెల్లతామరలయందు సుప్తినందిన భ్రమరములు కళిందజాకాంతిని ఆపాదించుకున్నవి. ప్రాంత సంచారమయూరములను తన అలలచేత ఆడించుచున్న గంగ , అలల తుంపరులు ఉవ్వెత్తుగా నెగసి సూర్యుని కప్పివేయగా వీని తెల్లదనమువలన చంద్రభ్రాంతి భానునియందు కలిగినది.

సహజముగా నుండు తుమ్మెదలను, మయూరములను గంగాసంగమమువలన అవి యెట్లయినవో విశేషముగా తెల్పి, ఉపమభ్రాంత్యలంకారయుత మొనర్చినాడు. జలమునకు గల సహజశీతలత్వము సూర్యపరివ్యాప్తమై వల్లబరచినదని (చంద్రత్వభ్రాంతి) తద్గుణాలంకారమును చెప్పెను. వీనికితోడు పద్యమునగల అంత్యప్రాస– ఇవన్నియు గంగావర్ణనకు శోభాకరము లైనవి. దీనిలో 'దామన్' శబ్దమునకు డాప్రత్యయము వచ్చుటవలన 'దామా' (శిఖిదామా) అని యగును. ఈపద్ధతి తెలిసియే కవి ఈశబ్దమును ప్రయోగించి యుండును.

మాధవరాయలకు గల బహుగ్రంథపరిచయము వివిధవిషయవేదిత్వము దీనియందు అనేకసందర్భములలో ప్రసక్తమైనది. అట్టిదానికి ఒక ఉదాహరణ:

వెలయింపనేరఁ డుజ్జ్వల ‘ చంద్రికా’ రూఢి, రవి ‘ప్రభా’ సంసక్తి ప్రబలుగాని
కనఁడు కావ్యాశయగౌరవం బగభేది, యురుకల్పతరులబ్ధి నొనరుఁ గాని
దఱియనోపఁడు పక్షధరవరోద్ధతి శేషుఁ, డసమలోచనయుక్తి మసలు గాని
ప్రతిఘటింపఁ గలంగుఁ బ్రాభాకరస్ఫూర్తి, కబ్జారి కౌముది నలరుఁ గాని
యనుచుఁ దత్సదినత్వ గవాధిపత్వ, కుండలిత్వ ద్విజేశత్వ గుంఫనములు
పరిహసింతు రెల్లప్పు డప్పురి నధీత, సకలసుగ్రంథతతు లగ్రజన్మపతులు. (1-91)

ఈపద్యము వింతయైన అర్థములు గలది. విశాలాపురియందలి ద్విజుల వర్ణన ఇందలి విషయము. వారెంత విద్వత్తు గలవారో తెల్పుట కవి యుద్దేశము. సూర్యాదులకన్న వీరియందు అధికగుణముల జెప్పి అతిశయోక్త్యలంకారమునేగాక శ్లేషోత్థాపిత వ్యతిరేకాలంకారము నుంచినాడు. పద్యమున రవి ‘ప్రభ’నే వెలయించును. ‘ చంద్రికా’ రూఢి యతనికి లేదు. ఇచట ‘ చంద్రిక’, ‘ప్రభ’ యనునవి గ్రంథములు. కల్పవృక్షవంతుడైన యింద్రుడు శుక్రుని గమనించలేదు. కావ్యనామము శుక్రునకు గలదు. అర్థ శాస్త్రమే ఆఖండలునికి తెలియునుగాని ‘ శుక్రనీతి’ తెలియదు. కావ్యమనగా రఘువంశాదు లనుకొనవచ్చును.

శేషుడు పక్షధరుని (గరుడుని) సమీపించడు. శివునకు (అసమలోచనుడు) శేషుడు ఆభరణము కావున శంభుసాన్నిధ్యమే కలదు. ఇచట ‘పక్షధర’ శబ్దము పక్షధరీయమను తర్కగ్రంథమును, అసమలోచనమన ‘ లోచన’ మను శాస్త్రగ్రంథము (ధ్వన్యాలోకవ్యాఖ్యకు లోచనమని పేరు) తెల్పబడినది. ఇచట ఒక ముఖ్యవిషయమును గమనించవలెను. అభినవకాళిదాసైన వెల్లాల త్ర్యంబకశాస్త్రిగారు భాగవతచంపూరచన మొనర్పగా దానికి వెల్లాల అక్కయశాస్త్రిగారు రత్నావళీవ్యాఖ్యాకారులైనారు. అక్కయశాస్త్రిగారికి పక్షధరీయశాస్త్రిగారని ప్రసిద్ధి. ఈయన మల్లినాథునివంటి వాడనని తెల్పుకొనెను. ఎల్లాజోస్యులవారికి పక్షధరీయశాస్త్రిగారు శిష్యుడు. ఈయనను గూర్చిన కథలుకూడా కొన్ని గలవు (మహబూబునగరం జిల్లా సర్వస్వమున వివరముగా ఈ విషయము లున్నవి). మాధవరాయలు ఈవిషయముల నిట్లు గ్రంథస్థము చేసెను.

చంద్రుడు ప్రభాకర(సూర్య)కాంతిని ప్రతిఘటింపజాలడు. కేవలము ‘ కౌముది(వెన్నెల)’ మాత్రమే కలవాడు. ఇచట ప్రాభాకర మనగా కుమారిలభట్టు శిష్యుడైన ప్రభాకరమిశ్రుడు గురువుగారు జైమినీయ పూర్వమీమాంసకు వ్రాసిన వార్తికవ్యాఖ్యను పెక్కువిషయములలో భేదించి తాను స్థాపించిన మతానికి ప్రాభాకర మను పేరు పెట్టెను. కుమారిలభాట్టమునకు గురుమత మని ప్రసిద్ధి కలిగినట్లే ప్రభాకరుని మతమునకు శిష్యమతమని ప్రఖ్యాతి. ఇక ‘ కౌముది’ యనగా సంస్కృతవ్యాకరణగ్రంథము.

ఇంతటి గొప్ప విద్వాంసులైన ఆపురి భూదేవులు ‘ సదినత్వము’ ను (అనగా సూర్యత్వము , పండితరాజత్వము) గవాధిపత్యము (అనగా స్వర్గాధిపత్యము, వాక్పతిత్వము) కుండలిత్వము (సర్పత్వము, సోమయాజిత్వము) ద్విజేశత్వము (ద్విజరాజత్వము, బ్రాహ్మణోత్తమత) గలిగి సూర్య – సూర్యలోకము, కుండలత్వ – నాగలోకము, ద్విజేశత్వ – చంద్రలోకము – దేహాంతమున జీవు లధివసించు ఈలోకములను తిరస్కరింతురు. అనగా వారు కేవలము ముక్తిని మాత్రమే కోరుదురు.

ఈపద్యము ఇంకెంతయో విశేషార్థము గలది. ప్రథమపాదమున ‘ చంద్రిక’ ఒక వ్యాఖ్య కావచ్చునా? లేక ఇతని ప్రస్తుత చంద్రికాపరిణయమా? ఎందుకనగా ‘ రవి’ - సూర్యుడు. వసువన్నను సూర్యుడే. రవిశబ్దముచే అర్థాంతరమున ‘ వసుచరిత్ర’ చెప్పబడినదా? యని సంశయము. రవిప్రభ – సూర్య(వసు)కాంతి కావచ్చును.

వ్యాఖ్యానమును పరిశీలించవలసిన ఈపద్యమునందు మాధవరాయలు తననాటి (ఆస్థాన)పండితమండలిని తెల్పినాడేమో!

2-62లోని మన్మథవర్ణన సందర్భమునందు గల పద్యములలో 'మనురాజజాతజపవైఖరి' – ఇది అష్టాక్షరీమంత్రసూచనము. దీనికి మంత్రరాజమని పేరు. వ్యాఖ్యాతలు ఎట్లూహించిరో కాని 'ఇది మనుమంత్రరాజ జపవైఖరి' అని యుండవలెను. అప్పుడు అర్థము కుదురును. 'మనురాజజాతజప' అనునప్పుడు అర్థమును ఊహించి వ్రాయవలసినదే!

మాధవరాయకవిచంద్రుని వర్ణనలు గ్రంథపఠనమువలన ఆనందము కల్గించును. ఎన్ని పద్యములను పేర్కొన్నను తక్కువయే. ఈగ్రంథము వర్ణనలతో శ్లేషలతో నిండి యున్నందున బహుపండితజనాదరపాత్ర మైనది.

శ్లేషవైభవము

'శ్లేషః పుష్ణాతి సౌభాగ్యం' అను దానిని అక్షరశః అనుసరించి చూపిన ఈప్రబంధకర్త శబ్దాధికారము అద్భుతమైన దనుటలో సంశయము లేదు. రాఘవపాండవీయకర్త 'రెండర్థంబుల పద్య మొక్కటియు నిర్మింపంగ శక్యంబు గాకుండు' ననెను. ఒక విధముగా ద్వ్యర్థి-శ్లేషలు రెంటికి ఈవాక్యము వర్తించును. ఒకే పదమునకు వివిధార్థములను చెప్పుట (ఒకటిని మించి) శ్లేష. దీనిని లాక్షణికులు ప్రకృత, అప్రకృత, ప్రకృతాప్రకృత, సభంగ, అభంగ శబ్దప్రధాన సందర్భములుగా తెల్పిరి. అందుకే శ్లేషోఽనేకార్థ వాచనమ్. మాధవరాయలు అన్నిరకములైన శ్లేషలను ప్రయోగించి తనది చంద్రికాశ్లేషరచన యనిపించెను. వీనిబలమే ఈగ్రంథమును వసుచరిత్రతో పోల్చుటకు ఒక ముఖ్యకారణము. అంతేగాక చంద్రికాపరిణయమును నిల్పినది శ్లేష, వర్ణనలు మాత్రమే!

> తరుణిమొగంబె తానని సుధానిధి విష్ణుపదమ్ము ముట్టి దు
> ష్కరకరజాతపాండిమ విగర్హితుఁడై యశుచిం గృశింపఁ, బం
> కరుహము తన్ముఖోపమము గానని తా హరిపాదమంటి యిం
> దిర దనుఁజేరఁ గీర్తిఁ గని దీపితజీవన మయ్యె నెంతయున్. (3-27)

ముఖమును చంద్రునితో బోల్చి – చంద్రకాంతిని మించిన ముఖవైభవము కల్గి యున్నట్లు కావ్యనాయికను వర్ణించుట కవిసమయము. ఈపద్యమున చంద్రికాముఖవర్ణన చేయబడినది. చంద్రుడు, కమలము – ఈరెండును ఆమె ముఖవైభవసామ్యమునకు పోటీపడినవి. దీనియందు చంద్రుడు అబద్ధ మాడి ఆమె ముఖతౌల్యమును పొంద యత్నించి హరిపాదము లంటినను ఆయన దుష్కరజాతపాండిమవిగర్హితు డైనాడు (చికిత్సకు సైతము లొంగని చేతియందలి పాండురోగముచే దూషితుడైనాడు – విష్ణుపదము, కర, పాండిమ పదశ్లేష). కమలము మాత్రము సత్యమునే వచించినందున ఇందిర తనను చేర్చుకొనగా దీపితజీవన మైనది.

చంద్రవిషయమున విష్ణుపదము. పద్మవిషయమున అదే పదమునకు 'హరిపాదము' అనెను. కమలము లక్ష్మీవాసస్థానము. ఆమెతో 'హరి' యున్నందున హరిపాదము నంటిన దని కమలమునకు చెప్పి 'దీపితజీవన' మైన దనినాడు. 'దీప్తమైన బ్రతుకు' అనియే గాక జీవనము=నీరు, దీపితము=వృద్ధి, నీటియందు మాత్రమే కమల మభివృద్ధినందునను సహజార్థము. దీనియందు విష్ణుపద, కరజాత, విగర్హిత, అశుచి, హరిపాద, దీపిత, జీవన – ఈ పదములు శ్లిష్టములైనందున పద్యమున కొక శోభ చేకూరినది.

సత్యము పలుకువాడు మేలును బొందును. అసత్యమునకై ప్రమాణము చేయువాడు పాపరోగబాధితు డగునని (దుష్కరకర జాతపాండిమవిగర్హితత్వము) వస్తుకృత వస్తుధ్వనియుతముగా నిట్లు తెల్పినాడు. చంద్రికావదనసామ్యమునకు చంద్రకమల ములు సాటిరావని కవి యభిప్రాయము. వసుచరిత్రలో

'వదనవనజహృతాంశుసర్వస్వుఁ డగుచుఁ,

గుందు నిందుని దరహాసకందళమున

మనుపుమని ....' (2-34)

అను పద్యమున పాదనఖవర్ణన చేయుచు చంద్రుడు గిరికావదనసామ్య మందక కృశించినాడని తెల్పినాడు. దీనిని మించినది మాధవరాయల శ్లేషచమత్కృతి.

అనిశంబున్ బుధవర్ణకల్పతరు దీవ్యద్వాసనాలబ్ధిఁ జే

కొని యద్వైతరుచిం గరంబు మను నీక్షోణీస్థలాధీశవ

ర్యుని కీర్తిప్రకరంబు మించ సకి! యోహో పూర్వపక్షావలం

బనతన్ రాజిలునట్టి ధ్వాంత పరధామం బెచ్చునే యెచ్చటన్? (5-70)

చంద్రికాస్వయంవరసందర్భసమాగత వివిధదేశరాజవర్ణనాసందర్భమున ప్లక్షద్వీపాధిపతివర్ణన గల దీపద్యము. సామా న్యార్థములో ప్లక్షద్వీపాధిపతి కీర్తిసమూహము కల్పతరుకాంతికి సమానమైన కాంతిగలదై హెచ్చగా, శుక్లపక్షపాకరతేజము ఎట్లు హెచ్చును? అని చంద్రాతీత సితకాంతి రాజున కాపాదితము. విశేషార్థమున అద్వైతమతస్థులైన మాధ్వుల గూర్చి – వీరు వేదాంతకల్పతరువను గ్రంథపఠన మొనర్తురు. ఇవి అద్వైతసిద్ధాంతపరులగు బుధవర్గప్రశంసితము. ఏతద్గ్రంథమననాదులచే నుద్బుద్ధమైన వాసనాశక్తివలన బ్రహ్మాత్మైక్యానుసంధానవిజృంభమాణ విద్వద్వరుడని – మాధ్వసిద్ధాంతము.

శంకర,రామానుజ,మాధ్వసిద్ధాంతములు మూడు గలవు. ఇవియె మతత్రయములు. ఈపద్యమున మాధ్వులు ధ్వాంతపద వాచ్యులు. అనగా ' ధ్వః అన్తే యస్య సః ధ్వాన్తః' – 'ధ్వ' యను నక్షరము చివరగల మాధ్వ – అని వీరు ద్వైతులు. పద్యము నందు పూర్వపక్షము అనగా అపసిద్ధాంతము – శుక్లపక్షము, ధ్వాంత=చీకటి. బ్రహ్మాత్మైక్యానుసంధాననిష్ణాతుడైన విద్వాంసు డతిశయించి యుండగా పూర్వపక్షమతావలంబనమైన మాధ్వసిద్ధాంతము హెచ్చజాలదని – ఈ విశేషార్థము. ఈపద్యము నందు కల్పతరు- వాసన -అద్వైత -పూర్వపక్ష -ధ్వాంత శబ్దములు విశిష్టశ్లేషార్థసంయుతములు. దీనియందు కవియొక్క శబ్ద లక్షణవేతృత, సిద్ధాంతత్రయసమాలోకనము తెలియును. సామాన్యపదములచే అసామాన్యార్థప్రతిపాదన ఏతత్పద్యవిశేషము.

చంద్రికాపరిణయమున వివిధశ్లేషలు విశేషముగా గలవు. వ్యాఖ్యాయుతమైన ఈగ్రంథపఠనము తద్విశేషముల వెల్లడి చేసినది. పాఠకులు ఓపికతో వానిని గ్రహించగలరు. పద,పదార్థ అక్షరములను భంగాభంగపద్ధతిని అర్థవంతముగా నిరూపించిన మాధవరాయరాజకవి శేముషీవైభవము ఒహో! యనిపింపకపోదు. అందుకే కాబోలు 'మధుశ్రీకరవాక్పటిమ గల' యక్షశేఖరు నితో

ధీరవరేణ్య నీవిపుడు తెల్పిన నిర్మల చంద్రికోదయో
దారసుధారసంబు మది కప్రమితప్రమదంబు నించి యెం
తే రచియించె (3-36)

ననిపించినాడు. ఇంతవరకు చంద్రికాపరిణయప్రబంధరచన యర్థభాగమైనది. శ్రీకరవాక్పటిమతో నిర్మలచంద్రికావృత్తాంతము ఉదారసుధా'రస' యుక్తమై మనస్సునకు మోదాపాదియైనదని కవి భావన – అని భావింతము.

రాజాస్థానములయందు దాసీజన ముండుట సహజము. వీరికి జన్మతః గల పేరును తొలగించి మరియొక నామ ముంచుట వెలమదొరలు, దేశముఖుల యిండ్లలోను ఒకపద్ధతి. రాచరికవ్యవస్థలో రెడ్లకన్న వెలమవారియందే దాసీజన మధికము (తెలంగాణమున వీరిని ఆడబాప లందురు). మాధవరాయలు 4-75 పద్యమున కొందరి పేర్లను తెల్పెను. ఇవన్నియు శ్లేషార్థముగా నున్నవి. వాసంతి, సారంగి, శశిలేఖ, చక్రాంగి, హరిణి – అని. జలక్రీడావసరమున వీరిని పేర్కొనెను. జలమునకు, ఈనామ ధేయములకు సమీపసంబంధము. ఈపేర్లలో మఱొకవిషయ మేమన రాజు, రాణి తత్పరిజనమే గాక, వీరి బంధువులు, హితులు ఎవ్వరైనను ఆడబాపను పిలిచినప్పుడు ఆపేరు నీచార్థముగానో, చిన్నతనముగానో ఉండరాదు. పూర్తిపేరును ఉచ్చరింపవలసినదే! ఇప్పటికి ఈపద్ధతి తెలంగాణమున – అందులో కరీంనగర్, వరంగల్లు, నల్లగొండ, మహబూబునగరాలలోని వెలమవారి యిండ్లలో గలదు. వనమాలి, మోహిని, మణి, పద్మ మొదలగున వీ పేర్లలో కొన్ని. వీనిలో అధికబాగము విష్ణుసంబంధనామములే యగుట సామాన్యము. మాధవరాయలు 'లోకజ్ఞుడు' – సాంఘికచిత్రణగా దాసీజనవర్గమును పేర్కొనినాడు.

చంద్రికాపరిణయమందు నానావిధములైన శ్లేషలు అర్థ,శబ్దచిత్రములు – వివిధములైన వర్ణనలేగాక బహుశాస్త్రసంబంధవిషయములును ప్రవచితము లైనవి. సంస్కృతాంధ్రపదప్రయోగమేగాక అచ్చతెనుగుపదములు, మాండలికములు దీనియందున్నను ఎచ్చటగూడా తన సమకాలమున రాజవ్యవహారభాష యైన ఉర్దూ, ఫారసీపదముల నీయన ప్రయోగింపక పోవుట విచిత్ర మనిపించినను - స్వస్థానస్వభాషాభిమానము లీపని చేయించలేదేమో!

ఛందస్సు

ఒక్క మను,వసుచరిత్రముల అనుకరణలేగాక శ్రీనాథ, భాస్కర,సోమనాథుల ప్రతిచ్ఛాయాకవితలు కూడా చంద్రికాపరిణయమున గలవు. ఇవి మాధవరాయల బహువిధగ్రంథపరిశీలనానైపుణి, అనేక శాస్త్ర కావ్య పురాణ విషయ పరిజ్ఞాతృత్వముల వెల్లడి చేయునే కాని ప్రతిభాశున్యుడై అనుకరించినట్టివి కావు. ఛందస్సువిషయమున నీకవి మిక్కిలి జాగరూకత వహించి సందర్భోచితముగా ఆయా ఛందఃప్రయోగ మొనర్చినను కొన్నిస్థలములలో ఛందోభంగము ప్రాప్తించినది. ఇవి కవికృతములో, ముద్రణసమయమున పరిష్కర్తల కనుచూపునుండి తప్పినవో? తెలియదు. వానిలో

2.58 మూడవపాదము: 'హంసాఖ్యఁ దగు కైరవారిపితృప్రసూవి సంపర్కగతిఁ గూర్చి యొప్పు చలము'

ఇందులో యతిభంగము. ఇచట 'ఒప్పు చలము' అని కవి ప్రయోగించి యుండడు. 'చలము నొప్పు' అనిన యతి కుదురును. అర్థభంగము లేదు. అట్లే

3.73 మొదటిపాదము: 'ఇట్టి సకలానఘగుణోత్కరాబ్ధి యైన'

లోను యతిభంగము. దీనిని 'అట్టి' యని ప్రారంభమున సవరించిన యతి కుదురును. ఈగ్రంథమున నొక సంస్కృతదండకము గలదు. దీనికి సంస్కృతములోనే వ్యాఖ్యారచన మొనర్చుట ఒకవిశేషము. 'అశేషగీర్వాణ నిత్యోత్సవాయై నమో నిత్యపూతామితప్రాభవాయై నమో హస్తసంబద్ధనీరేశయాయై నమో దేవతారూప' సాహిత్య ఎకాడమీవారి ప్రతిలో క్రీగీతగల భాగము లేదు. 4వ పాదారంభములో 'సతత మగజే త్వమేవాత్మమాతా' అని యుండి యగణముతో సాగిన యీపాదమున న,స గణముల తరువాత హగణమునందు ప్రథమాక్షరలోపము జరిగినది. దీనిని 'సతతమగజాతే త్వమేవాత్మ' అనిన కుదురునని మందడి వెంకటకృష్ణకవిగారు తమవద్దగల ప్రతిలో నిట్లు దిద్దియుంచుకున్నారని ఆధార పూర్వకముగా చంద్రికాపరిణయ పరిశోధనసిద్ధాంతవ్యాసకర్త తెల్పినది సమంజసముగా గలదు (పే. 271).

చంద్రికాప్రభావము – పరిశోధన

చంద్రికాపరిణయము ముద్రణమైన తరువాత దానిని గూర్చి ఒకటి రెండు వ్యాసములు, విమర్శలు వచ్చినవే కాని విస్తృత ప్రచారము జరుగలేదు. జటప్రోలువారు వ్యాఖ్యాయుతముగా ముద్రణ మొనరింపజేసిన యీప్రతులు కూడా ముద్రణమై తెర చాటున దాగియున్న బిబ్బీలవలె కొల్లాపురం కోటలో పడినవి. కొందరు కవులు, పండితులు పరిచయమున్నవారు రాజాదరణ పురస్సరముగా వీనిని పొందినారు. జటప్రోలువారు ప్రచురించిన యితరగ్రంథముల స్థితికూడా యిట్లే కలదు.

1904, 1928 రెండు పర్యాయములు ముద్రణమైన యీవ్యాఖ్యాగ్రంథము సాహితీలోకమున కందుబాటులో లేనందున కేశవ పంతులవారి పీఠికతో ఆంధ్రప్రదేశ సాహిత్య ఎకాడమీవారు 1982లో మూలమును మాత్రమే ముద్రించి పాఠకుల కందించగల్గి నారు.

వసుచరిత్రవ్యాఖ్యయందు చంద్రికాపరిణయపద్యము లుదాహృతము లైనవి. కాని చంద్రికాపరిణయమువలెనే దీని వ్యాఖ్య యందు ఎచ్చటను 'వసు'ప్రసక్తి లేదు.

నాగార్జునవిశ్వవిద్యాలయమున శ్రీ శంకరరెడ్డిగారు చంద్రికాపరిణయము-సమగ్రపరిశీలన అను సిద్ధాంతవ్యాసమును సమ ర్పించి పి.హెచ్.డి పట్టా (1990) పొందినారు. ఉస్మానియా విశ్వవిద్యాలయమున వెలుదండ సత్యనారాయణగారు చంద్రికా పరిణయము-సమగ్రపరిశీలన అను సిద్ధాంతవ్యాసమును సమర్పించి 1991లో పి.హెచ్.డి పట్టము నందినారు. తెలుగు విశ్వ విద్యాలయ చరిత్రవిభాగం ద్వారా భట్టరు శ్రీనివాసాచార్యులవారు జటప్రోలు సంస్థానము – పరిశీలన వ్యాసమునకు ఎం.ఫిల్. పట్టాను పొందినారు. దీనిలో చంద్రికాపరిణయప్రసక్తి గలదు.

వెలుదండ సత్యనారాయణగారి పరిశోధన విస్తృతమై చంద్రికాపరిణయ ప్రత్యక్షరపరిశీలన మొనర్చినది. ఏవిషయమును కూడా వీరు విస్మరించ లేదు. ఇది చంద్రికాపరిణయమునకు 'భాష్యము' వంటిది. మూలగ్రంథవిశేషముల నెరుగదలచినవారు ఈసిద్ధాంతవ్యాసమును చదువుట అవసరము.

కొల్లాపురాస్థానము రోజులలోనే శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రిగారు చంద్రికాపరిణయమును నాటకముగా వ్రాసి 1931లో ముద్రణ మొనరించినారు. దీనికి రాజా వెంకట లక్ష్మారావుగారు ఆర్థికముగా తోడ్పడినను వీరి మరణానంతరమే పుస్తకము వెలువడినది. రాజావారి దత్తపుత్రులైన జగన్నాథరావుగారి పట్టాభిషేకసమయమున రాణీ రత్నమాంబాగారి సమక్షమందు కుమార రాజా వారికి ఈకృతి సమర్పణ మొనర్చినారు. ఇది సప్తాంకపరిమితము.

వెంకటలక్ష్మారావు (1865-1928) సమకాలములో నున్న వెల్లూరి నరసింగకవి 'శరదాగమ' వ్యాఖ్యను చూచి చంద్రికాపరిణయ ప్రభావమున 'రాచకన్యకాపరిణయ' ప్రబంధమును రచించెను. దీనియందు చంద్రికాపరిణయప్రభావము అధికముగా గలదు. రాచకన్యకాపరిణయమును గూర్చి పరిశోధన మొనర్చి ఉస్మానియానుండి తలముడిపి బాలసుబ్బయ్య పి.హెచ్.డి. పొంది, సిద్ధాంతవ్యాసమును 1989లో ముద్రణ చేయించినారు.

సాహిత్యచరిత్రలయందు చంద్రికాపరిణయమును గూర్చి పరిచయము చేసినారు. కాని సుప్రసిద్ధ వైయాకరణులు , పరిశోధకులు వజ్ఝల చినసీతారామస్వామిశాస్త్రిగారు తమ 'వసుచరిత్రవిమర్శనము' నందు చంద్రికాపరిణయప్రసక్తియే చేయకపోవుట విచారకరము. వారు 'పిల్ల వసుచరిత్రల' పేర్కొని బేరీజు వేసినా దీనిని విస్మరించిరి. వీరి గ్రంథము వావిళ్లసంస్థ ద్వారా వరుసగా 1915, 1922, 1965 సంవత్సరాలలో ముద్రితమైనది.

సుప్రసిద్ధ ఛందోగ్రంథమైన అప్పకవీయమునందు చంద్రికాపరిణయములోనివని 3 పద్యము లుదాహృతము లైనవి (2-165,3-129,3-183). ఈపద్యములు చంద్రికాపరిణయమందు లేవు. మల్లన 'చంద్రభానుచరిత్ర', బాలసరస్వతి 'చంద్రికాపరిణయ' గ్రంథములలో ఈపద్యము లుండవచ్చు. కాలక్రమరీత్యా చంద్రికాపరిణయములోని పద్యములను అప్పకవి పేర్కొనుట కుదరదు.

ఈవ్యాఖ్యాగ్రంథమున 1-140 పద్యము 'ఉత్సాహ' అని యున్నది. కాని యిది సుగంధివృత్తము. వ్యాఖ్యాకారులు గూడ దీనిని గమనించలేదు. 'శరదాగమ' వ్యాఖ్య చంద్రికాపరిణయమునకు జీవము పోసి, వికసింపజేసినది. చంద్రిక యనగా వెన్నెల. ఇది శరత్కాలము (శరదాగమము) చే మఱింత ఆహ్లాదకరమైనదని వ్యాఖ్యాకారులు ఈపేరును పెట్టినట్లున్నారు.

చంద్రికాపరిణయకథను నైమిశారణ్యమున సూతుడు శౌనకాదిమహర్షులకు చెప్పినట్లు మాధవరాయకవి తెల్పెను. ఈ కథకు, ఈమహర్షులకు సంబంధము లేకున్నను కవి యిట్లు చెప్పుట కేవలము జానపదకథాపద్ధతి. మహర్షిప్రోక్త మనుటవలన కథకు ప్రాచీనతాప్రాముఖ్యము లేర్పడునని కవుల భావన. దీనినే మాధవరాయలు పాటించెను.

వ్యాఖ్యానము

'శరదాగమవ్యాఖ్య' తో చంద్రికాపరిణయము 1904,1928లో రెండుపర్యాయములు ముద్రణ మైనది. కేశవపంతులవారు వ్రాసిన ఎకాడమీవారి ప్రచురణ పీఠికలో 1928 సంవత్సర మనియే తెల్పిరి. వారు 1904 ప్రతిని పేర్కొనకపోవుట వింతగా నున్నది.

ప్రథమముద్రణ మదరాసు ఆనందప్రెస్‌లోను, రెండవ ముద్రణ లలితాప్రెస్ (రాజమండ్రి)లోను జరిగినది. రాజమండ్రి ముద్రాశాల శ్రీపాదవారిది. కొల్లాపురం రాజా లక్ష్మారావుగారి కోరిక మేరకు శ్రీపాదవారు ఈవ్యాఖ్యాగ్రంథమును ముద్రణ చేయించినారు. రెండు ముద్రణల పైపు ఒకేవిధముగా గలదు. మొదటి ముద్రణప్రతి చివర 'శుద్ధాశుద్ధపత్రము' ను చేర్చినారు. రెండవదానిలో ఇది లేదు. కాని అప్పటి ముద్రాదోషములు సవరింపబడినవి. మఱికొన్ని క్రొత్తతప్పులు చేరినవి. కందుకూరివారు, వేదంవారు పుస్తకమును గూర్చి తెల్పిన అభిప్రాయములు రెండవముద్రణలో వెనుకముందు పడినవి. పద్యముల క్రమసంఖ్య (అక్కడక్కడ) రెంటిలోను తప్పినది. 1-91 నెం. పద్యము ప్రథమప్రతిలో పూర్తిగా లేదు. ద్వితీయలో సరిగా నున్నది. ఇట్లే రెండు ముద్రణలయందు చిన్న మార్పులు గలవు. రెండు గ్రంథములలోను వ్యాఖ్యాకారుల పరిచయము లేదు. శ్రీపాదవారి చంద్రికాపరిణయనాటకపీఠికలో (15 పుట) రాజావారి అనుమతివలన నేను చంద్రికాపరిణయమును వ్యాఖ్యాయుతముగా ముద్రణ మొనర్చి (సరిచూచి) శ్రీధరకృష్ణశాస్త్రి (వెల్లాలవారి జామాత)గారిద్వారా పంపినానని వ్రాసిరి. ఇది 1931 సంవత్సరం . నాటికే రెండుపర్యాయములు

ముద్రణమైన యీ గ్రంథము తృతీయముద్రణము కూడా అయినట్లున్నది. కాని ఏ గ్రంథములోను ఇది ఎన్నవ ముద్రణయో వారు తెల్పనే లేదు. నావద్ద 1904, 1928 సంవత్సరముల ముద్రణప్రతులు గలవు. ప్రస్తుతము తెలుగువిశ్వవిద్యాలయమువారు వేసినది 1928 ముద్రణప్రతి. ఇక వీని వ్యాఖ్యాతల గూర్చి తెలిసికొందము.

వ్యాఖ్యాతలు

చంద్రికాపరిణయవ్యాఖ్యాత లైన వెల్లాల సదాశివశాస్త్రిగారు, అవధానం శేషశాస్త్రిగారు సంస్కృతాంధ్రపాండితీప్రతిభాపరిణద్ధ మూర్తులు. వీరి శరదాగమవ్యాఖ్య చంద్రికాపరిణయమున కొక భాష్యము.

వెల్లాలవారి మొదటి నివాసము కడప జిల్లాలోని 'వెల్లాల' యను గ్రామము. 350 సంవత్సరములనాడు వీరు అలంపురసంస్థానమునకు విచ్చేసి అగ్రహారాదులు సంపాదించినారు. తరువాత అయ్యవారిపల్లెకు చేరుకొని స్థిరపడిన వీరిది పండితకుటుంబము. శంకరజోస్యులు, వెంకటసుబ్బమ్మల చతుర్థపుత్రుడైన శాస్త్రిగారు అగ్రజులైన రాఘవశాస్త్రిగారివద్ద నాటకాంతసాహిత్యమును, అలంపురం మల్హరిశాస్త్రిగారి సాన్నిధ్యమున వ్యాకరణశాస్త్రమును, మేనమామగారైన అక్షింతల సీతారామశాస్త్రిగారివద్ద తర్కశాస్త్రమును, ప్యాపలి కొండమాచార్యులవారిదగ్గర శబ్దరత్నము నభ్యసించి, అవధానంవారితో కలిసి కాశీ కేగి మహామహోపాధ్యాయ మానవల్లి గంగాధరశాస్త్రిచరణుల సన్నిధిలో అలంకారధర్మశాస్త్రముల నధ్యయన మొనర్చిరి. దండిభట్ల విశ్వనాథశాస్త్రిగారివద్ద భాష్యాంతవ్యాకరణాధ్యయనమును పూర్తి చేయుటయేగాక వారికి పరిభాషేందుచంద్రికా రచనమున తోడ్పడిన మహామనీషి. కాశీవిద్యాభ్యాసానంతరము స్వదేశమునకు తిరిగి వచ్చి జటప్రోలు రాజావారి ఆస్థానపండితు లైనారు.

బాల్యముననే వీరు కన్యకాంబాచంపువును రచించి సహవిద్యార్థుల కాశ్చర్యమును కల్గించిరి. శాస్త్రిగారి కృతులలో 'ఉద్వాహభాస నిరాసము', 'పరివ్రాజ్యచంద్రిక', 'స్త్రీపునర్వివాహనిర్ణయము', 'కంఠీరవవిజయము', 'రామానుజగోపాలవిజయము', 'నామిరెడ్డి చరిత్రము' అనువానినేగాక వెలుగోటి ప్రభువుల కోర్కెపై కావ్యాలంకారసంగ్రహమున నాయకరసప్రకరణములకు వ్యాఖ్య, వెలుగోటివారి వంశచరిత్రములను వ్రాసిరి. ఇచ్చట జటప్రోలువారిని గూర్చి సురభివారి వంశచరిత్రను, మల్లాదివారి దశరూపకానువాదమును గురించి దశరూపకవిమర్శనమును, చిలుకూరివారి చరిత్రపై వీరభద్రీయఖండనములను వ్రాసి, ధర్మశాస్త్ర నిరూపణముగా 'త్రిరాత్రదశరాత్రాశౌచనిర్ణయము', 'ధర్మశ్రాద్ధనిర్ణయము' అనునట్టి రచనల నొనర్చిరి.

శాస్త్రిగారు కేవలము జటప్రోలు పండితులుగనే గాక వెంకటగిరి, బొబ్బిలి సంస్థానాధిపతులచే సత్కృతు లందినవారు. జటప్రోలు రాజావారికి సన్నిహితులై ప్రత్యేకసన్మానములను, పారితోషికములనే గాక కొన్ని వందల యెకరముల భూమిని, స్వగ్రామమున నివాసగృహములను దానముగా పొందినారు.

తమ పూర్వులైన మాధవరాయలు రచించిన చంద్రికాపరిణయమునకు సురభి వెంకటలక్ష్మారావు బహద్దరువారు విపుల వ్యాఖ్య వ్రాయుమని శ్రీశాస్త్రిగారిని కోరినారు. వీరు తమ మేనల్లుడైన అవధానం శేషశాస్త్రితో కలిసి శరదాగమమను పేర నొక విపులమైన వ్యాఖ్యను వ్రాయగా దీనిని రాజావారు క్రీ.శ. 1904లోను, 1928 సంవత్సరములోను రెండు పర్యాయములు అందముగా ముద్రణ మొనరించి ఎందరో పండితుల కుచితముగా సమర్పించుకొనినారు.

వెల్లాలవారు చంద్రికాపరిణయమునకు వ్రాసిన వ్యాఖ్య ఎందరో పండితుల ప్రశంసల పొందినది. దీనిని సహింపలేని కొందరు వ్యాఖ్యావిషయమునకు విమర్శల చేసినారు. ఆనాటి శశిలేఖ పత్రికలో సముద్రాల వెంకటాచలపతిగారు ఈవివాదమును ఆరంభించిరి. ప్రాచ్యలిఖితగ్రంథభాండాగారము (మద్రాసు) నందు 'కౌముది' అను వ్యాఖ్య యొకటి చంద్రికాపరిణయమునకు గలదని

ఆవ్యాఖ్యకు ప్రతిబింబము 'శరదాగమ' మని శేషాద్రిరమణకవులు గూడ విమర్శించిరట. శాస్త్రిగారి స్నేహితులు – రాచకన్యకా పరిణయకర్త ఎల్లూరి నరసింగకవి కూడా ఈవ్యాఖ్యా విషయమై రాజాగారికి చిత్తక్షోభము కల్గునట్లు చెప్పినారట. వీని యన్నిటికి ప్రత్యుత్తరముగా వెల్లాలవారు మీరో ఎవ్వరైనను దీనికి మఱియొక వ్యాఖ్య వ్రాసి నాకు వినిపించిన చాలునని తెల్పి, 'చంద్రికా పరిణయవ్యాఖ్యాద్వయవిమర్శనము' అను పేర 34 పేజీల గ్రంథమును ముద్రణ చేయించి అందరికి పంచి పెట్టినారు. వ్యాఖ్యా విషయమును అధిక్షేపించిన సముద్రాలవారికి శాస్త్రిగారు మద్రాసు న్యాయస్థానముద్వారా నోటీసుకూడా ఇప్పించినారట.

ఈవిధమైన సాహితీరణరంగమున వెల్లాలవారు కాలము గడిపి, క్రోధన పుష్యమి విదియ శుక్రవారము 8-2-1925 తేదీన శివైక్యము చెందినారు. (ఈవిషయము శాస్త్రిగారి పుత్రులు శివరామశాస్త్రిగారు 29-4-1978 తేదీనాడు వ్రాసిన లేఖద్వారా తెల్పినారు.)

శాస్త్రిగారికి మేనల్లుడు, వయస్సులో వీరికన్న 2సం. పెద్దవారైన అవధానం శేషశాస్త్రిగారు బాల్యమునుండి వీరి గృహములోనే యున్నారు. విద్యాభ్యాసము వీరితో పాటే కొనసాగినది. అవధానంవారి వివాహము కూడా వెల్లాలవారే ఏర్పాటు చేయించినారు. జటప్రోలు సంస్థానప్రవేశమునకు కూడా శాస్త్రిగారి చొరవయే పని చేసినది. ఏకసంథాగ్రాహిత్వము, గొప్ప పాండిత్యము గల అవధానంవారు చంద్రికాపరిణయ వ్యాఖ్యాకారులలో నొకరగుట విశేషము. వెల్లాలవారి 'స్త్రీధర్మదీపిక', 'అచ్యుతస్వామి చరిత్ర', 'మూర్తిత్రయాభేదవిచారము', 'ఆఖ్యాతచింతామణి' వంటి గ్రంథరచనలో అవధానంవారి తోడ్పాటు గలదు. శేషయ్య లక్ష్మీనరసమ్మల పుత్రులైన అవధానంవారు నలసంవత్సర ఆషాఢ అమావాస్య (1917)నాడు తనువు చాలించిరి.

వెల్లాలవారు, అవధానమువారు బాల్యాత్ క్షీరనీరన్యాయముగా కలిసి యున్నారు. కవితారచనయందే గాక, సంస్థాన విషయములు, కవిపండితులతో జరుగు సాహిత్యచర్చలు మొదలైన వానియందును వీరిది అభేదపద్ధతి.

తెలకపల్లి రామచంద్రశాస్త్రిగారికి, వెల్లాలవారికి ఏదో విషయమున స్పర్థ ఏర్పడినది. తత్ఫలితము వీరు పరస్పరము ఒకరికొకరు అష్టకములను (నిందాపూర్వకముగా) వ్రాసి ముద్రించిరి. తెల్కపల్లెవారు 'సదాశివాష్టకమును' వ్రాయగా, దీనికి జవాబు వెల్లాలవారి 'రామచంద్రాష్టకము'. ఈవాదములోను కవితాస్పర్థయే ముఖ్యము. వెల్లాలవారి యల్లుడు శ్రీధరకృష్ణశాస్త్రిగారు (1860-1930) సంస్థానమున ప్రసిద్ధులు (మహబూబునగరజిల్లా సర్వస్వమున వీటినిగూర్చి కలదు).

కృతస్మృతి

ఎప్పుడో ముద్రణమై, ఇదానీంతనకాలమున అలభ్యముగా నున్న ప్రాచీనగ్రంథములను లభించినంతవరకు వ్యాఖ్యలతోను, లేని వానికి వ్యాఖ్యల వ్రాయించి ముద్రణ మొనర్చి సాహిత్యలోకమున కందించవలె నను నది తెలుగు విశ్వవిద్యాలయమువారి ప్రణాళిక. ఈపరంపరలోనే వెలుగు చూచుచున్నది చంద్రికాపరిణయము.

వసుచరిత్రకు సాటిరాగల ఈప్రబంధమునకు బహువిధశాస్త్ర-గ్రంథ పరిశీలనాదక్షులైన మహాపండితులు వెల్లాలవారు, అవధానం వారు ప్రతిభానికషోపలమైన 'శరదాగమ' వ్యాఖ్యారచన మొనర్చిరి. ఇది విస్తృతవ్యాఖ్య. ఈశతాబ్ద ప్రారంభదశకమున ప్రథమముద్రణమై శతాబ్దపు చివరివర్షములలో మరల 'శరదాగమచంద్రిక' సాహితీలోకమున వ్యాపించుచున్నందులకు నేనే కాదు ఎందరో సాహిత్యాభిమానులు మోదమందుదురు.

ఈ ఉద్గ్రంథమునకు నేను కూర్చిన 'సమాలోకనము' శరచ్చంద్రికను చూపుటకై సిద్ధము చేసిన కరదీపిక మాత్రమే. తెల్పవలసిన విషయములు ఇంకా ఎన్నియో కలవు. విస్తృతి కారణమున మిక్కిలి సంక్షేపముగా కొన్నిటిని తెల్ప యత్నించినాను.

నా యీప్రయత్నమునకు సహృదయులే ప్రమాణము. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయమువారు వ్యాఖ్యాయుతము గా ఈ గ్రంథమును మఱల ముద్రణ మొనర్చి సాహితీలోకోపకార మొనర్చినందులకు ధన్యవాదములు.

ఈసందర్భమున వ్యాఖ్యాయుత చంద్రికాపరిణయము (2 ముద్రణలు), కేశవపంతులవారి పీఠికతో వెల్వడిన చంద్రికాపరిణయము (మూలము), శ్రీ వెలుదండ సత్యనారాయణ, భట్టరు శ్రీనివాసాచార్యలువారి సిద్ధాంతవ్యాసములు – ఉపకరించినవి. ఆయా రచయితలకు కృతజ్ఞతలు. ఆత్మీయులు, నిరంతరసాహితీపరిశోధకులు – శ్రీ కపిలవాయి లింగమూర్తిగారు అనేక విషయములు తెల్పి తోడ్పడిరి. వారి సహృదయతకు ప్రణామములు.

తడియార లేదు మాధవరాయచంద్రికాపరిణయాక్షరమషీపంకమందు,
చినుగ దింకను సదాశివశాస్త్రినరసభూపాలీయటీకార్ద్ర పద్యవితతి,
మారోర్మిత లిడుచుండె మల్లాదివారికి చెవిలోన వెల్లాల సింహగర్జ,
ముడి విప్పలేదింక మొన్న శ్రీపాదవా రందిన వేయిరూప్యముల మూట,
నేటికిని స్నేహలత పూచు నిరుపమాన
సుమము లాంధ్రికి తలలోన సొమ్ము లగుచు,
ప్రాజ్యగుణమైన జటప్రోలు రాజ్యమహిమ
వినక మారాష్ట్రమును కొల్తవేయ దగునె. (కేశవపంతులవారి రచన)

భాషాసేవకుడు

పాలెం. 509215 శ్రీరంగాచార్య

జటప్రోలు సంస్థానాధీశుల వంశవృక్షము

```
                    చెవ్విరెడ్డి(బేతాళనాయుడు)
                              |
      |------------------|--------------------|-----------------|---
   1. మల్లానాయుడు   *2.దామానాయుడు   3.ప్రసాదిత్యనాయుడు   4. రుద్రనాయుడు
     -|--------------|-----------|-------------|-------------|------|----------|---
*వెన్నమనాయుడు   సచ్చినాయుడు  పెద్దన్న  బ్రహ్మనాయుడు  పర్నేసు  సర్దేసు   మల్లానేడు
 ------ |----------------------|                                              |
  *ఎఱ్ఱదాచానేడు            నల్లదా|చానేడు
        |              |------- |--------|
        |          మాధవనాయుడు     దామానాయుడు
        |-------------------|----------------------|
 *సింగమనాయుడు   వెన్నమనాయుడు     యాచమనాయకుడు
        |-------------------------------------|
 *అనపోతానాయుడు (రాచకొండ)           మాదానేడు (దేవరకొండ)
        |-----------------------------|----------------------|
 *సర్వజ్ఞ(పెద్ద)సింగమనాయుడు   * ధర్మానాయుడు    పెద్దవేదగిరినాయుడు
                           |------- |--------|
                            *తిమ్మనాయుడు
                          |------- --|-----------|
                  ధర్మానాయుడు        చిట్టిదాచానాయుడు
                                  |------- |--------|
                                   *అనపోతానాయుడు
        |-----------------------------|-----------------|
 కుమారలింగమనాయుడు   పెద్దమాదానాయుడు    *చిన్నమాదానాయుడు
                                     |------- --|----------|
                                *ఎఱ్ఱసూరానాయుడు    నల్లసూరానాయుడు
                             |------- ----|----------|
                  *మాదానాయుడు(జటప్రోలు)      యాచమనాయుడు(వెంకటగిరి)
```

*మాదానాయుడు(జటప్రోలు)

|---------------|--------------|-------------|

*పెద్దినాయుడు మల్లినాయుడు నాగినేడు చిట్టినాగినేడు

|---|----|

*మల్లభూపతి

|-----|-----|

*పెద్దమల్లభూపతి

|-----|------|

*ముమ్మడిమల్లానాయుడు

|--------------------|---------------------|

*రామరాయుడు కుమారమల్లానాయుడు *మాధవరాయుడు (చంద్రికాపరిణయకర్త)

|---------------|--------------|

*నారాయణరావు తిరుమలరావు నరసింగరావు

|-------|--------|

*చిన్నమాధవరావు

|-------|--------|

*బొరిగడుపులరావు

(ఇతనినుండి నిస్సంతులైనందున ఇక దత్తు వచ్చినవారు)

*1.జగన్నాథరావు, *2.వెంకటలక్ష్మారావు, *3.వెంకటజగన్నాథరావు, *4.వెంకటలక్ష్మారావు,

*5.రాణి వెంకటరత్నమ్మ, *6.రాజా వెంకటజగన్నాథరావు

|---------------|-------------|

◊ వెంకట ఆదిత్యలక్ష్మారావు ◊ వెంకటరత్న సుధాబాల (కూతురు)

|-------|--------|

◊ వెంకట అనిరుద్ధ జగన్నాథరావు

బొరిగడుపులరావుగారి తర్వాత దత్తు వచ్చినవారిలో:

1. జగన్నాథరావు	మల్లినేని సంతతిలోని పెద్దరామారాయని పుత్రుడు
2. వెంకటలక్ష్మారావు	వరంగల్లు జిల్లా పాకాలప్రాంతం గురిజాలనుండి వచ్చినవారు
3. వెంకటజగన్నాథరావు	వరంగల్లు జిల్లా పాకాలప్రాంతం గురిజాలనుండి వచ్చినవారు
4. వెంకటలక్ష్మారావు	చంద్రికాపరిణయ ముద్రాపకులు. వీరి జన్మనామము నవనీతకృష్ణయాచేంద్రుడు. (వెంకటగిరి కుమార యాచమనాయని కుమారులు).వీరి పుత్రిక సరస్వతీదేవి.

	ఆమె పుత్రికఇందిరాదేవిని (6వ)రాజా వెంకటజగన్నాథరావుగారికి పరిణయము చేసిరి. కొల్లాపురములోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఇందిరాదేవి స్మారక నామము నుంచినారు.
5. రాణి వెంకటరత్నమ్మ	పై వెంకటలక్ష్మారావుగారి సతీమణి
6. రాజా వెంకటజగన్నాథరావు	బొబ్బిలినుండి దత్తు. వీరి జన్మనామము రాజగోపాలరావు. రాజా శ్వేతాచలపతి వెంకట రంగారావుగారి పౌత్రులు. వీరికి ఇందిరాదేవితో పరిణయము.

*గుర్తుగల వారు రాజులు. అనపోతానాయనివఱకు రాచకొండ-దేవరకొండ రాజ్యాధిపతులు. వీరిది వెంకటగిరి (వెలుగోడు) రాచకొండ-దేవరకొండ పరంపర.

◊గుర్తుగల వారు ప్రస్తుత మున్నవారు.

శ్రియై నమః

శ్రీలక్ష్మీనరసింహాయ నమః

చంద్రికాపరిణయము-సవ్యాఖ్యానము

ప్రథమాశ్వాసము

శా. శ్రీవక్షోజధరస్ఫురద్వర మురః◊స్సీమం బ్రకాశింప శం
పావృత్తిన్ సరసత్వ మొంది సుమనః◊పాళి ప్రియాత్మీయస
ద్భావస్ఫూర్తిఁ దనర్చు శ్రీమదనగో◊పాలాహ్వయోజ్జృంభితాం
భోవాహంబు సమస్తలోకముల కా◊మోదప్రదం బయ్యెడున్. 1

అవతారిక: శ్రీమదనవద్యవిద్యావిశారదులును, శ్రీమద్భాగ్యనగరదేశమధ్య విద్యోతమాన శ్రీజటప్రోలు సంస్థానాధిపతులును, శ్రీమత్సురభికుల కలశార్ణవ పూర్ణనిశానాథులును, నగు శ్రీమాధవరాయ ప్రభుపుంగవులు 'శ్లో. కావ్యం యశసేఽర్థకృతే వ్యవహారవిదే శివేతరక్షతయే। సద్యః పరనిర్వృతయే కాన్తా సమ్మిత తయోపదేశయుజే' ఇత్యాది కావ్యప్రకాశాద్యాలంకారికవచన ప్రామాణ్యంబునఁ గావ్యం బతుల శ్రేయస్సాధనం బనియు, 'శ్లో.కావ్యాలాపాంశ్చ వర్జయేత్' అను నిషేధశాస్త్రం బసత్కావ్య విషయం బనియు నెంచి, పుణ్యపురుషధౌరేయుం డగు సుచంద్రనరేంద్రుని చరితంబు నవలంబించి, చంద్రికాపరిణయం బను లోకోత్తరశృంగారరసాసేచకం బగు కావ్యరత్నంబు వినిర్మింప నుద్యమించి, తదవిఘ్నపరిసమాప్తి ప్రచారాది పరిపంథి ప్రత్యూహనివహప్రశమంబునకై, 'శ్లో.ఆశీర్నమస్క్రియా వస్తునిర్దేశో వాపి తన్ముఖ' మ్మనుటవలనఁ ద్రిరూపం బగు మంగళములలో శ్రీమదనగోపాలరూపస్వేష్టదేవతా పరమానుగ్రహాభ్యర్థనాత్మకం బైన యాశీరాత్మక మంగళమును శ్రీవక్షోజధరేత్యాది పద్యంబుచే నాచరించుచున్నారు. సమస్తలోకప్రమోదాభ్యర్థనంబుచేఁ దదంతర్గతస్వప్రమోదాభ్యర్థన మర్థసిద్ధం బగు నని యాశయము.

ఈ పద్యమందు మదనగోపాలాహ్వయోజ్జృంభితాంభోవాహంబు, అని భగవంతునియం దంభోవాహత్వ మారోపించి నందున యథాసంభవముగ నర్థద్వయము కల్గుచున్నది. ఏలా గనిన–

టీక: శ్రీవక్షోజధరస్ఫురద్వరము—శ్రీ= లక్ష్మీరూప యగు రుక్మిణీదేవియొక్క 'శ్లో.రాఘవత్వేభవ త్సీతా, రుక్మిణీ కృష్ణ జన్మని, అన్యేషు చావతారేషు విష్ణోరేషానపాయినీ' యను వచనం బిందుఁ బ్రమాణంబు. వక్షోజధర= పర్వతములవలె నున్నతంబు లగు పాలిండ్లయందు, స్ఫురత్ = ప్రకాశించుచున్న; వరము = కుంకుమము 'కాశ్మీరజన్మాగ్నిశిఖం వరమ్' – అనియమరము; ఉరస్సీమన్ = వక్షస్థలమందు; శంపావృత్తిన్ = మెఱుపుయొక్క యునికివంటి యునికిచేత; ప్రకాశింపన్ = వెలుంగుచుండఁగా; సరసత్వము=రసికత్వము, మేఘపర మైనపుడు జలవత్త్వము. 'ఆస్వాదనధ్వని సుధాంబ్బరసాఖ్యధాతుష్విష్టో రసః' –అని రత్నమాల; ఒంది = పొంది; సుమనః పాళి ప్రియ ఆత్మీయ సద్భావస్ఫూర్తిన్ – సుమనఃపాళి = దేవసంఘమునకు, మేఘపరమైనపుడు జాజిగుమురులకు – 'సుమనాః పుష్ప మాలత్యోః స్త్రియాం దేవే బుధే చ నా' – యని నానార్థరత్నమాల; ప్రియ = హితమగు; ఆత్మీయ = స్వీయమగు; సద్భావ = మంచి స్వభావముయొక్క, సత్తయొక్క – 'భావ స్స్వభావే సత్తాయామ్' – అని విశ్వము, స్ఫూర్తిన్ = స్ఫురణమును; తనర్చు = అతిశయింపఁజేయునట్టి; శ్రీమదనగోపాలా

హ్వాయ ఉజ్జృంభిత అంభోవాహంబు – శ్రీ = శోభాశాలి యగు, మదనగోపాలాహ్వాయ = మదనగోపాలుం డను నామంబు గల, ఉజ్జృంభిత = ఉప్పొంగిన యట్టి, అంభోవాహంబు = మేఘము; సమస్తలోకములకున్ = ఎల్లజగంబులకు; ఆమోదప్రదంబు = సంతసమిచ్చునది; అయ్యెడున్ = అగుఁగాత.

మెఱుపులతోఁ గూడి యుజ్జృంభితమైనయట్టి సజలజలదం బెట్లు సర్వలోకముల కామోదమును జేయునో, యట్లు రుక్మిణీకుచకుంభకుంకుమాంకితవక్షస్కుఁడై యనఁగా నవాప్తమనోరథుండై యుజ్జృంభితుఁడైన భగవంతుఁడు సమస్తలోకంబులకు సంతసంబుఁ జేయు నని తాత్పర్యము. 'స్వయం తుష్టః పరాన్ తోషయతి' – అను న్యాయంబున భగవంతుండు స్వాభీష్టరుక్మిణీపరిరంభతుష్టాంతరంగుఁడైన పిదప స్వాశ్రితసర్వలోకానందప్రదుం డగుట సులభ మని కవిహృదయము. లోకోత్తరశృంగారరసభూయిష్ఠం బగు నీ గ్రంథము నాదిని శృంగారరసాధిదేవత యైన శ్రీకృష్ణమూర్తి సంభోగశృంగారాలంబన విభావముగాఁ బ్రశంసింపఁబడియె.

ఇందు వ్యజ్యమానమగు సంభోగశృంగారంబు మదనగోపాలవిషయక కవిరతి యనెడు భావమునుగూర్చి యంగ మగుటం జేసి రసవదలంకారము. 'శ్లో. అఙ్గభావం రసో యత్ర భావం ప్రత్యథవారసమ్। భజేత తత్ర రసవదలంకార ఉదీరితః' – అని తల్లక్షణంబు. ఇట్లు కవీష్టదేవతావిషయకరతిభావంబును, ననుగ్రాహ్య సమస్తలోక విషయక కవిరతిభావమునుగూర్చి యంగ మగుటం బ్రేయోలంకారము. 'శ్లో. ప్రేయోలఙ్కృతిరఙ్గంచే ద్భావో భావాన్తరం ప్రతి' – అని తల్లక్షణంబు. భావ మనఁగా దేవతామునిపుత్త్రాది విషయకరతియు, వ్యజ్యమాన నిర్వేదాది త్రయస్త్రింశ దన్యతమంబును, దీనిం గూర్చి కావ్యప్రకాశమందు 'శ్లో. రతిర్దేవాదివిషయా వ్యభిచారీ తథాఞ్జితః, భావః ప్రోక్తః' – అని చెప్పఁబడినది.

ఇఁక భగవంతుని మేఘముగ రూపించినందున రూపకాలంకారము. అదియుఁ బరంపరిత మగును. పరంపరితరూపక మనఁగా రూపకాంతరమునకు హేతువగు రూపకంబు. ఇట భగవంతునియం దంభోవాహిత్వరూపణము సుమనఃపాళి యనెడు సుమనఃపాళీత్వాదిరూపకాంతర హేతువైనది గావునఁ బరంపరితం బయ్యె. 'శ్లో. నియతారోపణోపాయ స్స్యాదా రోపః పరస్య యః, తత్పరంపరితం శ్లిష్టాశ్లిష్టభేదా ద్ద్విధా భవేత్'– అని కావ్యదర్పణమందుఁ దల్లక్షణము. మఱియు నారోపాంతర హేతుకారోపవిషయ సుమన ఆదిపదములు శ్లిష్టంబు లగుటంజేసి శ్లిష్టపరంపరిత మనఁబడును. కొందఱు దీని నేకదేశవివర్తి రూపక భేద మండ్రు. మఱికొందఱు శ్లేషాలంకారమును బార్థక్యమునఁ జెప్పి శ్లేషసంకీర్ణరూపక మని వక్కాణింతురు. సుమన ఆదిశబ్దములు పర్యాయపరివృత్త్యసహములు గాన నిది శబ్దార్థోభయాలంకార మనియుఁ జెప్పుదురు. ఐన శ్లిష్టపరంపరితరూపక మనుటయే ముఖ్యము. దీనికి వక్షోజధర యనుచోటి యుపమతో సంసృష్టియు, శంపావృత్తిన్ అనుచోటి నిదర్శనతో సంకరము నని యెఱుంగునది.

వక్షోజధరస్ఫురద్వర మురస్సీమన్ అనుచో రేఫమునకుఁ బలుమాఱావృత్తివలన వృత్త్యనుప్రాస మను శబ్దాలంకారము. 'శ్లో.వర్ణసామ్య మనుప్రాస శ్ఛేకవృత్తిగతో ద్విధా। సోనేకస్య సకృత్పూర్వ ఏకస్యాప్యసకృత్పరః' – అని కావ్యప్రకాశము నందుఁ దల్లక్షణము.

పద్యాదియందు భూదేవతాకంబగు మగణము ప్రయుక్తమగుటంజేసి గ్రంథకర్త్రధ్యేతృవ్యాఖ్యాతృ శ్రోతలకు శుభఫలంబు చేకూరును. 'శ్లో. మో భూమి స్త్రిగురు శ్శ్రియం వితనుతే' – అని తత్ప్రమాణము. రెండవదగు సగణంబు దుష్టఫలప్రదం బయ్యును 'శ్లో. సర్వమూలంతు మగణం ప్రాప్య సర్వేగణాశ్శుభాః'– అను వచనమునుబట్టి మగణముతోఁ జేరుటవలన శుభ ఫలప్రదం బగును. 'శ్లో. క్షం వినా క్రూర సంయుక్త స్సౌమ్య స్త్యాజ్యో విషాన్నవత్, శేషస్తు కషయో శ్శ్రియాన్ శుచశ్రావణ యో

రివ' - అనుటవలన శ్రీశబ్దమందు శవర్ణము సౌమ్యమైనను గ్రూరంబగు రేఫంబుతోఁ జేరినందున దూష్యంబని తలంపరాదు. ఏలన, 'శ్లో. దేవతావాచకా శ్శబ్దా యేచ భద్రాదివాచకాః, తే సర్వే నైవ నిన్ద్యాస్స్యు ర్లిపితో గణతోపి వా' – అనుటవలన దేవతా వాచకం బగు శ్రీశబ్దమున కట్టిదోషంబు ప్రసరింపదు.

సీ. అశ్రాంతభువనవి◊ఖ్యాతసద్గోత్రుఁ డై, కనుపట్టు నేచాన◊కన్నతండ్రి
యలఘుకలాశాలి◊యై సత్ప్రభుత్వంబు,తో మించు నేయింతి ◊తోడఁబుట్టు
విబుధసంత్రాణప్ర◊వీణుఁ డై నిఖిలైక,నుతిఁ గాంచు నే మాన◊వతిధవుండు
రహి నాత్మసరసధ◊ర్మగుణపాళిస్ఫూర్తి, నలరించు నేకొమ్మ ◊యనుఁగుపట్టి
తే. యరయ సత్యాదికీర్తనీ◊యస్వవృత్తి, నెనయుఁ గల్యాణమూర్తి దా◊నేవధూటి
యట్టిసిరి రుక్మిణీరుచి◊రాభిధాన, చిరతరైశ్వర్యములు గృప◊సేయుఁగాత. 2

ఈపద్యగీతిలో సిరి రుక్మిణీరుచిరాభిధాన యనుచోట రుక్మిణీదేవియందు లక్ష్మీత్వము నారోపించుటం జేసి యర్థ ద్వయము దోఁచుచున్నది.

టీక: ఏచానకన్నతండ్రి = ఏ స్త్రీయొక్క కన్నతండ్రి – భీష్మకుఁడును, సముద్రుఁడును; అశ్రాంత భువన విఖ్యాత సద్గోత్రుఁ డై– అశ్రాంత=ఎల్లప్పుడును 'సతతానారతాశ్రాంత సంతతావిరతానిశమ్' అని యమరము, భువన = లోకములయందు, విఖ్యాత = ప్రసిద్ధమగు, సద్గోత్రుఁ డై = మంచికులముగలవాఁడై– అని రుక్మిణీపర మగు నర్థము; అశ్రాంత = నాశము లేని; భువన = జల మందు; విఖ్యాత = ప్రసిద్ధమగు; సద్గోత్రుఁ డై = శ్రేష్ఠము లైన మైనాకాదిపర్వతములుగలవాఁడై యని లక్ష్మీపరమైన యర్థము, 'జీవనం భువనం వనమ్' – అని యమరము; కనుపట్టున్ = చూపట్టునో;

ఏయింతి తోడఁబుట్టు = ఏ సతియొక్క సోదరుఁడు, రుక్మియు, చంద్రుఁడును; అలఘుకలాశాలి ఐ = అధికములగు విద్యల చేత, కాంతులచేత, నొప్పుచున్నవాఁడై; సత్ప్రభుత్వంబుతోన్ = మంచిదొరతనముతోడ, నక్షత్రరాజత్వముతోడ 'సన్నక్షత్రే విద్యమానేభ్యర్హితే' – అని విశ్వము; మించున్ = అతిశయించునో;

ఏ మానవతిధవుండు = ఏ మానవతియొక్క పతి, కృష్ణుఁడును, నారాయణమూర్తియు; విబుధసంత్రాణప్రవీణుఁడై = పండితుల యొక్క, దేవతలయొక్క రక్షణమందు నిపుణుఁడై; నిఖిలైకనుతిఁ గాంచున్ = ఎల్లవారిలో ముఖ్యమౌనట్లుగా పొగడ్త లందునో, 'ఏకే ముఖ్యాన్యకేవలాః' అని యమరము;

ఏకొమ్మ యనుఁగుపట్టి = ఏ స్త్రీయొక్క కూరిమిపుత్రుఁడు, ప్రద్యుమ్నుఁడును, మన్మథుఁడును; రహిన్ = ఆసక్తిచేత; ఆత్మ సరస ధర్మగుణ పాళి స్ఫూర్తిన్ – ఆత్మ = తనయొక్క, సరస = శ్రేష్ఠములగు, ధర్మగుణ = ధర్మగుణములయొక్క, పాళి = పంక్తులయొక్క, స్ఫూర్తిన్ = ప్రకాశమును; ఆత్మ = తనయొక్క, సరసధర్మ = మధురరసయుక్తమగు చెఱకువింటియొక్క, 'ధర్మః పుణ్యే యమే న్యాయే స్వభావాచారయోః క్రతౌ। ఉపమాయా మహింసాయాం చాపే చాపనిషద్యపి' అని విశ్వము; గుణప = అల్లెను పోషించుచున్న, అళిస్ఫూర్తిన్ = తుమ్మెదలయొక్క స్ఫురణమును, అలరించున్ = విస్తరింపఁజేయునో; అరయన్ = విచారింపఁగా; ఏ వధూటి = ఏకొమ్మ; సత్యాదికీర్తనీయస్వవృత్తిన్ – సత్యా = సత్యభామ, ఆది = మొదలగువారి

చేత; సతీ = పార్వతీదేవి, ఆది = మొదలగువారిచేత; కీర్తనీయ = కొనియాడఁదగు; స్వవృత్తిన్ = తనదైన సద్వృత్తిని; ఎనయున్ = పొందియుండునో; తాన్ = తాను; కల్యాణమూర్తి = మంగళవిగ్రహము గలదో, సువర్ణరూపిణి యైనదో, 'వర్ణాం హిరణ్మయీం లక్ష్మీమ్' – అని శ్రుతి; రుక్మిణీరుచిరాభిధాన = రుక్మిణి యను మనోజ్ఞనామము గల; అట్టిసిరి = పూర్వోక్త గుణములు గల లక్ష్మీదేవి; ఇందు సిరియే రుక్మిణీనామము గలదనుటకు ' రాఘవత్వే భవత్సీతా' –యను పూర్వోదాహృత వచనము ప్రమాణము; చిరతరైశ్వర్యములు = అత్యంతచిరకాలస్థాయులగు నైశ్వర్యములు, శాశ్వతైశ్వర్యము లనుట, స్థిరతర యను పాఠము సుకరము; కృపసేయుఁగాతన్ = దయసేయుఁగాత నని యాశీర్వచనము.

రూపకాలంకారభేదము. ఇందు రుక్మిణీదేవి విషయకకవిరతి యనెడు భావము వ్యజ్యమానమగుచున్నది గాన భావధ్వని యగును.

మ. పలుకుందొయ్యలిమోవితేనియలు శుంభత్ప్రీతిమైఁ గ్రోలి ముం
గలిమోముం బొలయల్కపేర మరలం గావించి, పశ్చాత్తటో
జ్జ్వలవక్త్రంబున నాని తా నధికహర్షం బూని యిష్టార్థము
ల్దలకొన్దాత యొసంగుఁ గాత శుభధీలాభంబు మాకెంతయున్. 3

టీక: పలుకుందొయ్యలిమోవితేనియలు= సరస్వతియధరమధువులను; శుంభత్ప్రీతిమైన్ = అధికమైన ప్రేమచేత; క్రోలి = పానముఁ జేసి; పొలయల్కపేరన్ = ప్రణయమానముయొక్క సాకుచేత; ముంగలిమోమున్ = ఎదుట నున్న ముఖమును; మరలంగావించి = మరల్చి; పశ్చాత్తటోజ్జ్వలవక్త్రంబునన్ = వెనుక వెలయుచున్న మోముచేత; ఆని = పానము చేసి; తాన్, అధికహర్షంబు = అధికసంతోషమును; ఊని = వహించి; ఇష్టార్థముల్ = ఇష్టమైన యాలింగనాద్యర్థములను; తలకొన్దాత = పొందునట్టి బ్రహ్మ; మాకున్; శుభధీలాభంబు = మంచిబుద్ధియొక్క లాభమును; ఎంతయున్ = మిక్కిలి; ఒసంగుఁ గాతన్ = ఇచ్చుఁగాక; ఇచటఁ దలకొన్దాత యను చోట 'పదాంతంబులగు ను లు రు ల యుత్వంబునకు లోపంబు బహుళంబుగా నగు' నను బాలవ్యాకరణసూత్రముచేఁ దలకొను అనుదాని కడపటి ఉకారమునకు లోపం బైనది.

ఈపద్యమందు వాణీవిధాతల లోకోత్తర సంభోగ శృంగారము వ్యక్తంబగుచున్నది. 'శ్లో. అనుకూలౌ నిషేవేతే యత్రాన్యోన్యం విలాసినౌ। స్పర్శనాలిఙ్గనాదీని స సంభోగ ఇతీరితః' – అని తల్లక్షణము. ఇట్టి శృంగారము విధాతృవిషయకకవిరతినిగూర్చి యంగభావమునొందినందున రసవదలంకార మగును. లక్షణము వ్రాయఁ బడియె.

సీ. రమణీయతరపదార్థప్రకాశనిదాన, భాస్వత్ప్రసాదసంపద వహించి
పటుసారసానందఘటనైకచాతుర్య, ఘనకృతాలంకారకలన మెఱసి
యనుకూలకాలకంఠాకుంఠకలనాద, వలమానమంజులధ్వనుల నలరి
యతివేలకవిజాలకామోదనాపాద, కారణరసభావగరిమ నెనసి

తే. పరమయతియోగసంస్థానపదమనోజ్ఞ
వైభవోన్నతిఁ దగు సరస్వతి మదీయ

మానసాస్థానమందిరమధ్యవీథి
నిండు కొలువుండుఁ గాత నిష్ఖండలీల. 4

ఈపద్యము గీతియందు నదీభారతులను బోధించు సరస్వతీశబ్దము కర్తృపదముగాఁ జేసి యర్థద్వయము కల్పింపఁబడియె.
టీక: రమణీయతరపదార్థప్రకాశనిదానభాస్వత్ప్రసాదసంపదన్ – రమణీయతర = అత్యంతమనోహరములగు, పదార్థ = శబ్దార్థములయొక్క, ముక్తాదిద్రవ్యములయొక్క, ప్రకాశ = ప్రకాశమునకు, నిదాన = ఆదికారణమగు 'నిదానం త్వాదికారణమ్' – అని యమరము, భాస్వత్ = ఒప్పుచున్న, ప్రసాద = ప్రసాదమనెడు కావ్యగుణముయొక్క, 'యశ్చిత్తం హ్యాశ్నుతే హ్నాయ శుష్కేన్ధనమివానలః। సప్రసాదో మత స్సర్వరససాధారణస్థితిః' – అని సాహిత్యరత్నాకరము, నైర్మల్యముయొక్క 'ప్రసాదస్తు ప్రసన్నతా' అని యమరము, 'గఙ్గారోధః పతనకలుషా గృహ్ణాతీవ ప్రసాదమ్' – అని నైర్మల్యమందు విక్రమోర్వశీయమునఁ గాళిదాసప్రయోగము, సంపదన్ = సమృద్ధిని; వహించి = పొంది;
పటు సారస నానందఘట కైక చాతుర్య ఘనకృ తాలంకార కలనన్ – పటు = సమర్థమగు, సారస = రసికసమూహమునకు, సరసశబ్దముమీఁద సమూహార్థమందణ్ప్రత్యయము, బెగ్గురులకు, ఆనందఘటక = ఆనందము గూర్చునట్టి, ఏక =ముఖ్యమగు, చాతుర్య = నేర్పుచేత, నదీపరమైన యర్థమందు నేర్పుగలయని చాతుర్యశబ్దాంతము బహువ్రీహి చేయవలెను, ఘన = అధికమగునట్లుగా, మేఘములచేత, కృత = చేయఁబడిన; అలంకార = ఉపమాదులయొక్క, ఒప్పిదములయొక్క; కలనన్ = ప్రాప్తిచేత; మెఱసి = విలసిల్లి;
అనుకూల కాలకం ఠాకుంఠ కలనాద వలమాన మంజుల ధ్వనులన్ – అనుకూల = అనుకూలములగు, కూలానుసృతములగు; కాలకంఠ = కలకంఠీసంఘముయొక్క, స్త్రీసమూహముయొక్క యనుట, నెమిళ్లయొక్క, అకుంఠ = అడ్డము లేని, కలనాద = అవ్యక్తమధురశబ్దములభంగి, కలనాదములతోడను, వలమాన = ఒప్పుచున్న, కూడుకొన్న, మంజుల = మనోజ్ఞములగు, ధ్వనులన్ = వ్యంగ్యార్థములచేతను, తరంగధ్వనులచేతను; అలరి = ఒప్పి, 'శ్లో. కాన్తా సమ్మితయా యయా సరసతా మాపాద్య కావ్యశ్రియా' – అని ప్రతాపరుద్రీయమునందుఁ జెప్పుటవలనఁ గావ్యధ్వనులకుఁ గాలకంఠాకుంఠకలనాదవలమానత్వము గలుగునని భావము;
అతివేల కవిజాల కామోద నాపాద కారణ రసభావ గరిమన్—అతివేల = అధికమగు, కవిజాలక = పండితమండలియొక్క; క= జలమందుండెడు, వి = పక్షులయొక్క, జాలక = సమూహముయొక్క; ఆమోదన = సంతసముయొక్క, ఆపాద = సంపాదనమునకు, కారణ = హేతువైన, రస = శృంగారాదిరసరూపకములగు, భావ = రత్యాదిస్థాయిభావములయొక్క, 'శ్లో. విభావై రనుభావై శ్చ సాత్త్వికై ర్వ్యభిచారిభిః। ఆనీయమాన స్స్వాదుత్వం స్థాయీభావో రసస్స్మృతః' – అని స్థాయిభావమే రసరూప మగునని చెప్పఁబడినది గాన రసరూపము లగు రత్యాదిస్థాయిభావములయొక్క యని వ్యాఖ్యాతం బయ్యె, కాదేని, శృంగారాదిరసములయొక్క వ్యజ్యమాన నిర్వేదాది సంచారభావములయొక్క, నదీపరమగు నపుడు – రసభావ = జలసత్త్వయొక్క 'భావ స్స్వభావే సత్తాయామ్' – అని విశ్వము, గరిమన్ = అతిశయమును; ఎనసి = పొంది;
పరమ యతి యోగ సంస్థాన పద మనోజ్ఞ వైభవోన్నతిన్ – పరమ = ఉత్కృష్టమగు, యతి = పదవిచ్ఛేదముయొక్క, 'యతిర్విచ్ఛేదసంజ్ఞకః' అని వృత్తరత్నాకరము, మునులయొక్క, యోగ = సంబంధముయొక్క, ధ్యానమునకు, సంస్థాన = సన్ని

వేశము గల ఆశ్రయములగు, పద = పద్యచతుర్థభాగములయొక్క,ఆశ్రమస్థానములయొక్క, మనోజ్ఞ = మనోహరమగు; వైభవోన్నతిన్ = విభవాతిశయముచేత; తగు సరస్వతి = ఒప్పుచున్న వాగ్దేవి, ఒక నది; మదీయమానసాస్థాన మందిరమధ్య వీథిన్ – మదీయ=నా సంబంధియైన, మానస = హృదయ మనెడు, ఆస్థానమందిర = సభామందిరముయొక్క, మధ్యవీథిన్= మధ్యప్రదేశమందు; నిష్ఖండలీలన్ = అఖండవిలాసముచేత; నిండుకొలువుండు‹ గాతన్ = నిండుకొలువునొందు‹ గాత.

ఇందు శబ్దశక్తి ప్రకృతార్థమందు ప్రకరణాదినియంత్రితమైనందున నప్రకృతనదీపరమైన యర్థము వ్యంగ్యమని ప్రాచీనులు. అర్థద్వయము వాచ్యమె కావచ్చు‹గావున శ్లేషాలంకారమని కొందఱు నవీనులు చెప్పుచున్నారు. మతద్వయమునందు నుప మాలంకారము వ్యంగ్యము. మఱియు సరస్వతీదేవివిషయకకవిరతి ధ్వనిత మగుచున్నది గాన భావధ్వని.

చ. పలుచ‹దనంబు పూని జడ◊భావము నందినవారి మౌళిపై
నిలిపి స్వవిగ్రహైకగతి ◊నిచ్చలు నార్య మహాగుణోన్నతం
గలయ‹గ‹ జేసి ధూర్తకశి◊ఖామణి వై తని గౌరి యల్గ‹గా
నలఘుమృదూక్తి వే‹డు శివు‹◊డాయతసౌఖ్యము మాకు నిచ్చుతన్. 5

టీక: పలుచ‹దనంబు = లఘుత్వమును; పూని = వహించి; జడభావమును = మూర్ఖతను; ఒందినవారిన్ = పొందినట్టివారిని; మౌళిపై నిలిపి = నెత్తిమీ‹ద నెక్కించుకొని; స్వవిగ్రహైకగతిన్ – స్వ = తనయొక్క, విగ్రహ = విరోధముయొక్క,ఏకగతిన్ = ముఖ్యప్రాప్తిచేత, దీనికి‹ గలయ‹గ‹జేసి యను క్రియయం దన్వయము; మహాగుణోన్నతన్ = ఉత్కృష్టములగు సౌశీల్యాది గుణములచే నధిక యగు; ఆర్యన్ = యోగ్యురాలైన నన్ను; కలయ‹గ‹జేసి = కలత పొందునట్లొనరించి; ధూర్తక శిఖామణి వైతి = మోసకాండ్రయందు మొదటివా‹డవైతివి; అన‹గా శివు‹డు పలుచ‹దనంబు పూని జడభావము నందిన వారి నన‹గా చిక్కనిది గాకుండి, జలరూపము నందియున్న యుదకప్రవాహరూపయైన గంగను శిరస్సునందు ధరించినా‹డనియు, మహా గుణోన్నతయు, నార్యయు నగు పార్వతిని తన శరీరమునం దేకీభావము నొందించినవా‹ డనియు, ధూర్తక మన‹గా దుత్తూర కుసుమము, దానిని శిరోభూషణమున నుంచినా‹ డనియు భావము. వెండియు‹ బలుచ‹దనంబు పూని జడభావము నందినవారి లోనగువానిచేత గండస్తనాద్యవయవశైథిల్యము గల్గి జాడ్యము నొందిన ముదుసలిదానిని శిరమునందు నిల్పి, ఉత్తమగుణములు గలదై వెలయు నార్య నన‹గా పదునాఱువర్షములు గల భార్యయం దుదాసీను‹డవై సర్వకాలము‹ దగవుల పాలై ధూర్తాగ్రేసరుం డని యనిపించుకొన్నా‹డ వని వ్యజ్యమాన మగుచున్నది. అని గౌరి యల్గ‹గాన్ = అట్లు గౌరి కోపము వహింప‹గా; అలఘు మృదూక్తిన్ = అధికమై మృదువైన వాక్కుచేత, జాత్యేకవచనము; వే‹డు శివు‹డు = ప్రార్థించు శంభు‹డు; మాకున్; ఆయత సౌఖ్యము = అధికమైన సుఖమును; ఇచ్చుతన్ = ఇచ్చు‹ గాత.

నాయిక యీర్ష్యాకషాయిత యైనపుడు నాయకుండు యథోచితముగ మానతారతమ్యమును గనిపెట్టి యాచరించు నత్యాద్యనునయప్రకారము అలంకారశాస్త్రములలో ‘హేతుజస్తు శమం యాతి యథాయోగ్య ప్రకల్పితైః। సామ్నా భేదేన దానేన నత్యుపేక్షా రసాన్తరైః’ ఇత్యాదిగా‹ జెప్ప‹బడినది. ఇచట సామోపాయము ప్రయోగింప‹బడియె. ఇందు వ్యజ్యమాన మగు విప్రలంభశృంగారము శివవిషయకకవిరతి యను భావము‹ గూర్చి యంగమగు‹ గావున రసవదలంకారము.

చ. హిమధరణీధరాగ్రణికి నెమ్మె చిగుర్ప జనించి స్థాణుసం
గమరతిఁ బొల్చి పత్త్రకనికాయవిభూషితయై శ్రుతీష్టవా
క్క్రమశుకముఖ్యసద్ద్విజవిరాజిత యయ్యు నపర్ణ నాఁగ ని
స్సమత రహించు కల్పలత సాంద్రఫలంబులు మాకు నిచ్చుతన్. 6

ఇందుఁ బార్వతీదేవియందుఁ గల్పలతాత్వము నారోపించి యర్థద్వయంబు చెప్పఁబడుచున్నది.

టీక: హిమధరణీధరాగ్రణికిన్ = హిమగిరిశ్రేష్ఠమునకు; ఎమ్మె = విలాసము; చిగుర్పన్ = అంకురించునట్లుగా; జనించి = పుట్టి, పల్లవించునట్లు జన్మించి యని కల్పలతాపరమైన యర్థము; స్థాణుసంగమరతిన్ – స్థాణు = శివునియొక్క, ఆధార స్తంభముయొక్క, సంగమరతిన్ = సంగమాభిలాషచేత; పొల్చి = ఒప్పి; పత్త్రక నికాయ విభూషితయై – పత్త్రక = మకరికా పత్త్రములయొక్క, ఆకులయొక్క; నికాయ = సమూహముచేత; విభూషితయై = అలంకృతయై; శ్రుతీష్టవాక్క్రమశుక ముఖ్యసద్ద్విజ విరాజిత అయ్యున్ – శ్రుతి = వేదములకు, వీనులకు, ఇష్ట = హితమగు, వాక్క్రమ = వాక్కులయొక్క రీతి గల, శుకముఖ్య = శుకాచార్యుఁడు మొదలుగాఁ గల, చిలుక మొదలుగాఁ గల, సద్ద్విజ = మంచి విప్రులచేత, శ్రేష్ఠము లైన పక్షులచేత, విరాజిత అయ్యున్ = మిక్కిలి రాజిల్లుచున్నదయ్యును; అపర్ణ = పార్వతి యని, అపర్ణ యని పార్వతికి నామాంతరము, ఆకులు లేనిది; నాఁగన్ = అనఁగా; నిస్సమతన్ = సాటి లేనట్టుగా; రహించు కల్పలత = ఒప్పుచుండెడు కల్పవల్లి; సాంద్ర ఫలంబులు = పూర్ణములైన లాభములను, పండ్లను; మాకున్; ఇచ్చుతన్ = ఇచ్చుఁగాత.

పార్వతీదేవి అఖిలేష్టప్రదాయిని యనియు, గిరియందు జనించుట, స్థాణుసంగమరతిఁ బొల్చుట, పత్త్రనికాయభూషిత యగుట, శుభముఖద్విజరాజిత యగుట మొదలగు కల్పలతాధర్మములు గల దనియు, అందువలనఁ గల్పలతారూపముగ నధ్యవసిత యయ్యె ననియు నెఱుంగునది. ఇందు విరోధాభాసరూపకములు. 'శ్లో.ఆభాసత్వే విరోధస్య విరోధాభాస ఇష్యతే' అనియు, 'విషయ్యభేదతాద్రూప్యరఞ్జనం విషయస్య యత్ రూపకం తత్' అనియుఁ దల్లక్షణములు. గౌరీవిషయక కవిరతి వ్యంజితమవుటం జేసి భావధ్వని.

శా. శ్రీగౌరీకుచహైమకుంభకలితక్షీరంబులం గ్రోలి త
ద్భాగాసక్తనిజాననం బపుడు తా భావించి ప్రత్యాపత
న్నాగభ్రాంతిని దూఁటఁగా జనని తా నవ్యానురక్తిన్ నగన్
ద్రాగానందముఁ జెందు నగ్గణపతిన్ బ్రార్థింతు వాక్సిద్ధికిన్. 7

టీక: శ్రీగౌరీకుచహైమకుంభకలితక్షీరంబులన్ – శ్రీ = శోభాసంపన్నురాలైన, గౌరీ = పార్వతీదేవియొక్క, కుచహైమకుంభ = సువర్ణకలశములవలె నుండు స్తనములయందు, కలిత= ఒప్పుచున్న, క్షీరంబులన్= పాలను; క్రోలి = పానము చేసి; తద్భాగా సక్తనిజాననంబు – తద్భాగ = ఆ స్తనప్రదేశమునందు, ఆసక్త = మిక్కిలి సంబంధించినట్టి, ప్రతిబింబించినట్టి యనుట, నిజాన నంబు = తన మోమును; అపుడు = ఆ సమయమునందు; తాన్ = తాను; భావించి = చూచి యనుట; ప్రత్యాపతన్నాగభ్రాంతిన్ = ఎదురించి వచ్చుచుండు నేనుంగను భ్రమముచేత; దూఁటఁగాన్=పొడువఁగా; జనని = తల్లి యగు పార్వతీదేవి; తాన్;

నవ్యానురక్తిన్ = తత్కాలోదితమగు ప్రేమచేత; నగన్ = నవ్వఁగా; ద్రాగానందమున్ = శీఘ్రముగా సంతసించుటను; చెందు నగ్గణపతిన్ = పొందునట్టి ప్రసిద్ధుడైన వినాయకుని; వాక్సిద్ధికిన్ = వాక్కు లభించుటకు; ప్రార్థింతున్ = యాచింతును.

యాచించువాఁడు కేలు మోడ్చి, వినయవంతుఁడై వర్తించుట ప్రసిద్ధమైనందునను, స్వావధికోర్ష ప్రకారక జ్ఞానానుకూల కర పుటసంవలనాదిరూపవ్యాపారమే నమశ్శబ్దార్థ మైనందునను, 'భారతీకవే ర్జయతి' యనుచోఁ గావ్యప్రకాశములోఁ జెప్పిన విధంబుగ నిందు నమస్కారము వ్యంగ్యము గాన నిది నమస్క్రియారూప మగు మంగళ మని యెఱుంగునది. నాగభ్రాంతిని దూఁటఁగా ననుచో భ్రాన్తిమదలంకారము. గణపతివిషయకకవిరతిరూపభావము వ్యఙ్యమానమగుటవలన భావధ్వని.

సీ. వనరాశిభంగంబు ∂గనఁజేసె నెవ్వాఁడు, కరముచేఁ బర్వతో ∂త్కరముచేత
ఘనవలాహకశక్తిఁ ∂గలఁగించె నెవ్వాఁడు, రుతముచే వేగమా∂రుతముచేత
నరిపురవిస్ఫూర్తిఁ ∂బరిమార్చె నెవ్వాఁడు, హేతిచే నిజనఖ∂హేతిచేత
తతమహామిత్త్రవ∂ర్ధన మూన్చె నెవ్వాఁడు, క్షణముచే మధురవీ∂క్షణముచేత
గీ. నవని నెవ్వాఁడు జానకీ∂స్వాత్మ సూచ
నాంజనాత్మజవిఖ్యాతి ∂నధిగమించె
నతని మామకకృతిచమ∂త్కృతికిఁ దలఁతు
మహితధీమంతు హనుమంతు ∂మానవంతు. 8

టీక: వనరాశిన్ = ఉద్యానవనసమూహమును, అశోకవనము ననుట, సముద్రమును అని యర్థాంతరము; భంగంబు = నాశ మును, తరంగమును, జాత్యేకవచనము; ఎవ్వాఁడు; కరముచేన్ = హస్తముచేతను; పర్వతోత్కరముచేత = కొండలయొక్క గుంపుచేతను; కనన్ = పొందునట్లుగా; చేసెన్ = ఒనరించెనో; అశోకవనమును హస్తముచేఁ గూల్చెను, సముద్రమును సేతు బంధనసమయమున పర్వతములచేత తరఁగలుగలదానిగాఁ జేసె నని క్రమముగ నన్వయము. ఇట్లు తక్కిన వాక్యములందును జూడవలయు. 'వనం కానన నీరయోః' – అని రత్నమాల;

ఎవ్వాఁడు =ఎవఁడు; ఘనవలాహకశక్తిన్ – ఘన = గొప్పలయిన, వలాహక = పర్వతములయొక్కయు, మేఘముల యొక్కయు, 'గిరి మేఘౌ వలాహకౌ' – అని రత్నమాల, శక్తిన్ = సామర్థ్యమును; రుతముచేన్ = సింహనాదముచేతను, వేగమారుతముచేతన్ = వేగమువలనఁ బుట్టిన చండమారుతముచేతను; కలఁగించెన్ = కలఁతపఱచెనో;

అరిపుర = శత్రుపురి యగు లంకయొక్కయు, శత్రుశరీరములయొక్కయు, 'గేహే దేహే చ నగరే పురం పాటలిపుత్రకే' – అని శబ్దస్తోమమహానిధి; విస్ఫూర్తిన్ = ప్రకాశమును; ఎవ్వాఁడు =ఎవఁడు; హేతిచేన్ = అగ్నిజ్వాలచేతను, 'హేతిర్జ్వాలాయుధాంశుషు' – అని రత్నమాల; నిజనఖహేతిచేత = తన ఖడ్గమువంటి నఖముచేతను, జాత్యేకవచనము; పరిమార్చెన్ = ఖండించెనో;

తత మహామిత్త్ర వర్ధనము– తత = విస్తృతమైనట్టి; మహత్ = అధికమగు, అమిత్త్ర = శత్రువులయొక్కయు, మిత్త్ర=ఆప్తుల యొక్కయు, వర్ధనము = ఛేదనము, అభివృద్ధిని, 'వర్ధనం ఛేదనేపి స్యాత్' – అని యమరము; క్షణముచేన్ = అల్పకాలము చేతను; మధురవీక్షణముచేతన్ = ప్రసన్న మగు చూపుచేతను; ఊన్చెన్ = కలుగఁజేసెనో;

అవనిన్ = భూమియందు; ఎవ్వాఁడు =ఎవఁడు; జానకీస్వాత్మసూచనాంజనాత్మజవిఖ్యాతిన్ – జానకీ= సీతాదేవి యనెడు, స్వ = ధనముయొక్క, ఆత్మ= రూపముయొక్క, సూచన = సూచించుటయందు, అంజనాత్మజ = అంజనముయొక్క కొడుకనెడు, చిన్న అంజన మనుట, విఖ్యాతిన్= ప్రసిద్ధిని, సీత యనెడు నిక్షేపధనముఁ దెలుపుటయందు చిన్న అంజన మను ప్రసిద్ధి ననుట, అంజనాపుత్త్రుడను ప్రసిద్ధినని భావము; అధిగమించెన్ = పొందెనో;

అతనిన్ = అట్టివానిని; మహితధీమంతున్ = పూజ్యమగు బుద్ధిగలవానిని; మానవంతున్ = అభిమానశాలి యగువానిని; హనుమంతున్ = ఆంజనేయుని; మామకకృతిచమత్కృతికిన్ = నా గ్రంథముయొక్క నేర్పునకై; తలఁతున్ = స్మరించెదను. ఆ మహానుభావుని యనుగ్రహమువలన మత్కృతి చమత్కృతి నొందుఁగాత మని భావము గాన నిది యాశీరూపమంగళముగా నెఱుంగునది.

ఈ పద్యమందు వనరాశిభంగం బిత్యాదిపూర్వవాక్యములయందు రెండర్థములు ప్రకృతంబులే కాన ప్రాచీననవీన మతములయందు శ్లేషాలంకారమె కాని యొకయర్థము వాచ్యము మఱియొకటి వ్యంగ్యమను మతభేదము లేదు. ‘నానార్థ సంశ్రయశ్శ్లేషో వర్ణ్యావర్ణ్యోభయాశ్రితః’ – అని లక్షణము. ఇఁకఁ గరముచేఁ బర్వతోత్కరముచేత నిత్యాద్యుత్తరార్థముల యందు కరముచే నిత్యాదుల కావృత్తి కలిగినందున యమకాలంకారము. ‘అనర్థకా వా భిన్నార్థా స్సార్థకానర్థకాశ్చ వా, ఆవర్త్యన్తే క్రమాద్వర్ణా యదా స్యా ద్యమకం తదా’ – అని కావ్యదర్పణమందుఁ దల్లక్షణము. భావధ్వనియుఁ బైపద్యముల యందుంబలె నూహ్యంబు. పూర్వవాక్యార్థములకు, నుత్తర వాక్యార్థములకుఁ గ్రమాన్వయంబుకలిమిం గ్రమాలంకారము.

సీ. సర్వతోముఖచర◊త్సారద్విజాలంబ, వాచానిరూఢిచే ◊వఱలె నెవ్వఁ
డతిపరాశరముదా◊హతిభారతోజ్జ్వల, ప్రక్రియావిస్ఫూర్తిఁ ◊బరఁగె నెవ్వఁ
డభిరూపచక్రచి◊త్త్రార్థ్వార్థగౌరవ, ప్రతిపాదనప్రౌఢిఁ ◊బ్రబలె నెవ్వఁ
డవిగతఘనరస◊వ్యాయతహృదయంగ, మేరామహోన్నతి ◊నెసఁగె నెవ్వఁ
తే. డతులితాత్మైక్యభావనా◊యత్తవాణి
కావిహృతి మించె నెవ్వఁడా ◊ఘనునిఁ బ్రథమ
కవిని గృష్ణునిఁ బ్రథితభా◊రవి మయూర
కవిని గాలిదాసు నుతింతుఁ ◊గౌతుకమున. 9

ఈ పద్యమందుఁ గవి వాల్మీకి మొదలగు నాదికవులను బ్రహ్మదేవాదివిషయకమైన యర్థాంతరము గలుగునట్లు వర్ణించుచు గీతిలోఁ గ్రమము వచియించెను.

టీక: ఎవ్వఁడు = ఏ మహాపురుషుఁడు; సర్వతోముఖ చర త్సార ద్విజాలంబ వాచా నిరూఢిచేన్ – సర్వతోముఖ = జలమునందు, చరత్ = సంచరించుచున్న, సార = శ్రేష్ఠమైన, ద్విజ = క్రౌంచపక్షులు, ఆలంబ = అవలంబముగాఁ గల, వాచా=వాక్కుయొక్క, ‘శ్లో. మా నిషాద ప్రతిష్ఠాంత్వ మగమ శ్శాశ్వతీ స్సమాః। యత్క్రౌఞ్చమిథునా దేక మవధీః కామమోహితమ్’ ఇత్యేతచ్ఛ్లోకరూపమగు ఛందోమయవాణియొక్క యని భావము, నిరూఢిచేన్=ప్రసిద్ధిచేత నని వాల్మీకి పరమైన యర్థము.

అంతటను ముఖములయందుఁ జరించుచున్నట్టివై శ్రేష్ఠవిప్రులాధారముగాఁ గలవైయున్న వేదరూపములైన వాక్కులప్రసిద్ధిచేత నని బ్రహ్మపరమైన యర్థము; వఱలెన్ = ఒప్పెనో;

ఎవ్వఁడు = ఏ మహానుభావుఁడు; అతి పరాశర ముదాహతి భారతోజ్జ్వల ప్రక్రియా విస్ఫూర్తిన్ – అతి = అధిక మైన, పరాశర= పరాశరమునియొక్క, ముదా = సంతసముయొక్క, అహతి = అవిచ్ఛేదముయొక్కయు, పోషణముయొక్కయు ననుట, భారత=భారతముయొక్క, ఉజ్జ్వల=ప్రకాశించుచున్న, ప్రక్రియా = ప్రకృష్టకరణముయొక్కయు, విస్ఫూర్తిన్ = అతిశయము చేత నని వ్యాసపరమైన యర్థము. అతి = అధిక మైన, పర = శత్రువులగు,ఆశర = రక్కసులయొక్క, ముత్ = సంతోషము యొక్క, ఆహతి = భంగమందలి, భా = సామర్థ్యమందు ‘ భాః ప్రభావే చ తేజసి’ అని విశ్వము, రత = ఆసక్తమైన, ఉజ్జ్వలత్ = ప్రకాశించుచున్న, ప్రక్రియా = యుద్ధాది ప్రక్రియలయొక్క, విస్ఫూర్తిన్ = అతిశయముచేత నని విష్ణుమూర్తిపరమైన యర్థము. ముదాశబ్దము వాచా శబ్దమువలె ‘ శ్లో. వష్టి భాగురి రల్లోప మవాప్యో రుపసర్గయోః, ఆపం చైవ హలన్తానాం యథా వాచా నిశా దిశా’ యను వచనమునుబట్టి యాకారాంతము; పరఁగెన్ = ఒప్పెనో;

ఎవ్వఁడు = ఏ ఘనుఁడు; అభిరూప చక్ర చిత్తార్హార్థ గౌరవ ప్రతిపాదన ప్రౌఢిన్ – అభిరూప = విద్వాంసులయొక్క, ‘ప్రాప్తరూప సురూపాభిరూపా బుధ మనోజ్ఞయోః’ – అని యమరము, చక్ర = సమూహముయొక్క, చిత్త = హృదయములకు, అర్హ = తగి నట్టి, అర్థ = అభిధేయముయొక్క, గౌరవ = గురుత్వముయొక్క, ‘ భారవే రర్థగౌరవమ్’ అని ప్రసిద్ధము, ప్రతిపాదన= చెప్పుట యొక్క, ప్రౌఢిన్ = నేర్పుచేత నని భారవికవిపరమైన యర్థము; అభిరూప = మనోజ్ఞములగు, చక్ర = జక్కవలయొక్క, చిత్తా ర్హార్థ గౌరవ = చిత్తములకు యోగ్యమగు సంఘటనరూప ప్రయోజనాతిశయముయొక్క, ప్రతిపాదన = దానముయొక్క, ‘ విశ్రాణనం వితరణం స్పర్శనం ప్రతిపాదనమ్’ అని యమరము, ప్రౌఢిన్ = నేర్పుచేత నని సూర్యపరమైన యర్థము; ప్రబలెన్ = అతిశయిల్లెనో;

ఎవ్వఁడు = ఏ మహాత్ముఁడు; అవి గత ఘన రస వ్యాయత హృదయంగ మేరా మహోన్నతిన్ – అవి = సూర్యుని, గత = పొందినట్టి, ఘన = దట్టమైన, రస = శృంగారాదిరసములచేత, కాదేని , అధికరక్తిచేత, వ్యాయత = మిక్కిలి యధికమైనట్టియు, హృదయంగమ = మనోహరమైనట్టి, ఇరా = సూర్యశతకమని ప్రసిద్ధమగు గ్రంథరూపమైన వాక్కుయొక్క, మహోన్నతిన్= మిక్కిలి యతిశయముచేత నని మయూరకవిపరమైన యర్థము; అవిగత = పోవని, కాదేని,అవి= పర్వతములను, ‘ అవయ శ్శైలమేషార్కాః’ అని యమరము, గత = పొందిన, ఘన = మేఘములయందు, రస =ఆసక్తిచేత, ‘ రసోగన్ధరసేస్వాదే’ అని విశ్వము, వ్యాయత = అధికమును, హృదయంగమ = మనోహరమునగు, ఇరా = కేకాధ్వనియొక్క, మహోన్నతిన్ = మిక్కిలి యతిశయముచేత నని నెమ్మి పరమైన యర్థము; ఎసఁగెన్ = అతిశయించెనో;

ఎవ్వఁడు = ఏ యుత్తముండు; అతులి తాత్మైక్యభావనాయత్త వాణికా విహృతిన్ – అతులిత = నిస్సమాన మగు, ఆత్మ = తన తోడి, ఐక్యభావనా = అభేదభావనయందు, ఆయత్త = వశంవదమైన, వాణికా = వాగ్దేవియొక్క; విహృతిన్= విహారముచేత నని కాళిదాసపరమైన యర్థము. సరస్వతి కాళిదాసుఁడు నేనే యనె ననుట ప్రసిద్ధము; అతులిత = నిస్సమానమైన,ఆత్మైకృ భావనా = బ్రహ్మైక్యానుసంధానమందు, ఆయత్త వాణికా =ఆయత్తములైన వేదాంతవాక్యములయొక్క,విహృతిన్=విహారము చేత నని యాత్మజ్ఞాని పరమైన యర్థము; మించెన్ = అతిశయించెనో;

ఆఘనులన్ = ఆ శ్రేష్ఠులను; ప్రథమకవిని = వాల్మీకిని, బ్రహ్మనని యర్థాంతరము; కృష్ణునిన్ = వ్యాసుని, కృష్ణమూర్తిని, 'కృష్ణ స్స్యాత్కేశవే వ్యాసే' అని విశ్వము; ప్రథితభారవిని = ప్రసిద్ధుఁడగు భారవికవిని; ప్రథిత = ప్రసిద్ధమగు, భా= తేజముతోఁగూడిన, రవిని = సూర్యుని; మయూరకవిని =మయూరుఁడను కవిని, మయూరక = నెమ్మియను, విని = పక్షిని; కాలిదాసునిన్= కాళిదాసుఁడను మహాకవిని, క = మనస్సు నందు, అలి =సమర్థుఁడైన, దాసునిన్ =ఆత్మజ్ఞుని, జితేంద్రియుండగు నాత్మజ్ఞాని ననుట; కౌతుకమునన్ = సంతోషముచేత; నుతింతున్ = ప్రశంసింతును;

ఇందుఁ బ్రకృతవాల్మీకివ్యాసాదిపరమగు నర్థము వాచ్యమనియు, నప్రకృతబ్రహ్మాదిపరమైన యర్థము వ్యంగ్య మనియుఁ గావ్యప్రకాశాదిమతము, ప్రకృతాప్రకృతార్థములు రెండును వాచ్యములుగఁ జెప్పి శ్లేషాలంకార మని చెప్పువారు నవీనులలోఁ గొందఱు. ఉపమాలంకారధ్వని.

ఉ. భారతనామకామృత మ◊భంగురసద్ధ్వనియుక్తి మించ వి
స్ఫారకవిప్రతానముద◊సాంద్రతఁ దాల్పఁగ నాంధ్రవాఙ్మహా
ధార ధరాతలంబున ను◊దారతఁ దాల్చు రసాధరాంచితా
కారవిధారులం ఘనులఁ ◊గాంతవచస్స్థితికై నుతించెదన్. 10

టీక: భారతనామకామృతము = భారతమను పేరుగల సుధ; అభంగురసద్ధ్వనియుక్తిన్ – అభంగుర = అవిచ్ఛిన్నమైన, సత్ = శ్రేష్ఠమైన, ధ్వని = వ్యంగ్యములయొక్క, గర్జలయొక్క, యుక్తిన్ = సంబంధముచేత; మించన్ = అతిశయింపఁగా; విస్ఫారకవిప్రతానముదసాంద్రతన్ – విస్ఫార = అధికమగు, కవిప్రతాన = కవిసమూహముయొక్క,జలపక్షులగుంపుయొక్క, ముద = హర్షము, సాంద్రతన్ = ఘనతను; తాల్పఁగన్ = వహింపఁగా; ఆంధ్రవాఙ్మహాధారన్ = ఆంధ్రవాక్కనెడు గొప్ప ధారచేత; ధరాతలంబునన్ = భూతలమందు; ఉదారతన్ = గొప్పఁదనమును, దాతృత్వమును, 'ఉదారోదాతృమహతోః' అని అమరము; తాల్చు రసాధరాంచి తాకార విధారులన్ – తాల్చు = వహించునట్టి, రసాధర = రాజులచేత, పర్వతములయందు; అంచిత = పూజింపఁబడిన, ఒప్పినట్టి, ఆకార = ఆకృతులను, విధారులన్ = మిక్కిలి ధరించినవారిని, ఇటఁ గర్మార్థమం దణ్ ప్రత్యయము; ఘనులన్ = గొప్పవారిని, కవిత్రయము ననుట, మేఘముల నని యర్థాంతరము; కాంతవచస్స్థితికై = మనోజ్ఞవాక్సిద్ధికై; నుతించెదన్ = ప్రశంసించెదను.

ఈ పద్యమందు రూపకాలంకారభేదము. 'రూపకం పూర్వసంసిద్ధం శ్లేష ముత్థాపయేద్యది, తదా రూపకమేవ స్యాదన్యథా శ్లేష ఇష్యతే' అను నాలంకారసర్వస్వవ్యాఖ్యాకృదుదాహృతవచనం బిందుఁ బ్రమాణము. నన్నయభట్టును, ఎఱ్ఱాప్రగడయుఁ, దిక్కనసోమయాజియు నమృతస్వరూపమై లోకోత్తరధ్వనులతోఁ గూడి విద్వాంసుల నానందింపఁజేయు నాంధ్రభారతమును భూతలమం దపూర్వముగ రచించి రాజపూజ్యత నొందినవారు గాన,యట్టి ఘనుల నుతిచే నాకవితయు ఘనత గాంచునని వారల నుతింతు నని భావము.

చ. లలితరసోపబృంహణము◊లం గనఁబో దరసజ్ఞవృత్తిచే
మెలఁగి పదార్థకత్రయవి◊మేళన మెంచదు కాణరీతిచేఁ

జెలఁగి ప్రసాద మెన్నఁడును ◊జేకొన దంచితదోషరూఢిచే
వెలసినయట్టి దుష్కవిక◊విత్వము నెంతురె ధీరపుంగవుల్?

ఇందుఁ గుకవుల కవిత్వస్వరూపము దుష్పక్షి యగు జలకాకము విషయమై యర్థాంతరము దోఁచునట్లు చెప్పఁబడుచున్నది. టీక: అరసజ్ఞవృత్తిచేన్ = అరసికుని వృత్తివంటి వృత్తిచేతను, నాలుక లేనివాని వృత్తివంటి వృత్తిచేత నని యర్థాంతరము; మెలఁగి; లలితరసోపబృంహణములన్ – లలిత = మనోజ్ఞములైన, రస = శృంగారాదిరసములయొక్క, మధురాదిరసములయొక్క యని యర్థాంతరము, ఉపబృంహణములన్=అతిశయములను; కనఁబోదు = తెలియఁబోదు, కుత్సితజలపక్షి నాలుక యుండి నను లేనివారిభంగి మధురాదిరసభేదములను గానదని భావము; కాణరీతిచేన్ = అంధునిరీతివంటి రీతిచేత, జ్ఞానాంధుని రీతి చేత ననుట, కాకిరీతిచేత నని యర్థాంతరము,'వాయసైకాక్షిణోః కాణః' హలాయుధము; చెలఁగి =ఒప్పి; పదార్థకత్రయవిమేళ నము = వాచ్యలక్ష్యవ్యంగ్యార్థత్రయముయొక్క యోగమును; పదార్థ = పదార్థములకు, క= ప్రకాశకమగు, త్రయ = సూర్యచం ద్రాగ్నిరూపతేజస్త్రయముయొక్క, విమేళనము = యోగమునని కాకపరమైన యర్థము; ఎంచదు = గణింపదు. జలకాకము నీటఁ జరించుచు స్వభావముగ సూర్యాదితేజోవిశేషము తెలియదని భావము; అంచితదోషరూఢిచేన్ – అంచిత = ఒప్పుచున్న, దోష = అవిమృష్టవిధేయాంశాదికావ్యదోషములయొక్క, రూఢిచేన్ = స్ఫూర్తిచేతను, ఒప్పుచున్న పంకము మొదలగు దోష ముల రూఢిచేత నని యర్థాంతరము; ప్రసాదము = ప్రసాదమనెడు కావ్యగుణమును, నైర్మల్యము నని యర్థాంతరము, ఎన్నఁ డును, చేకొనదు = గ్రహింపదు, నీచజలపక్షులు తఱచుగా బురదలోఁ బొరలుచుండుట స్వాభావికము. అందులో 'కాకః పక్షిషు చణ్డాలః' అని పక్షులలో నింద్యమగు కాకము నైర్మల్యము నెన్నఁడును గనదనుట; వెలసినయట్టి దుష్కవి కవిత్వమున్ = ఇట్లు వెలయుచున్న కుకవియొక్క కావ్యమును, దుష్టమైన జలపక్షియొక్క జలపక్షిత్వము నని యర్థాంతరము; ధీరపుంగవుల్ = పండితోత్తములు; ఎంతురె = గణింతురా?

శృంగారాదిరసవిశేషములతోఁ గూడక, వాచ్యలక్ష్యవ్యంగ్యార్థభేదములతో మెలఁగక, ప్రసాదాది గుణములు లేక, దోష భూయిష్ఠ మగు కుకవికావ్యమును మధురాదిరసవిశేషముల నెఱుఁగక, సూర్యాది లోకోత్తరవస్తువులఁ దెలియక, బురదలో నుండు నీరుకాకమునుబలెఁ బండితు లంగీకరింప రని భావము. ఇందుపమాలంకారధ్వని.

వ. అని యిష్టదేవతావందనంబును, సుకవిజనాభినందనంబును, గుకవినిందనంబును గావించి, యేనొక్క మహాప్రబంధనిబంధనంబున కుద్యోగించి యున్నఁ దత్పుణ్యరాత్రంబున. 12

దీని యర్థము స్పష్టము. వందనం బనుచోట 'వది అభివాదనస్తుత్యోః' అను ధాతువునుబట్టి పై మంగళములలో యథాసంభవ ముగ నతిస్తుతుల గ్రహింపవలయు. పుణ్యరాత్ర మనుచోట 'అహ స్సర్వైకదేశసంఖ్యాత పుణ్యాచ్చ రాత్రేః' అను సూత్రముచేత రాత్రిశబ్ద మకా రాంత మైనదని తెలియునది.

సీ. పరువంపుననగుంపు ◊బలితంపుజిగిపెంపుఁ, గని యొప్పు పాణియు◊గ్మములతోడఁ,
జెలువందు నరవింద◊ములయందములు చింద,ననువొందఁ గల కన్నుఁ◊గొనలతోడ,
జగడంబు గనునంబు◊ముగయంబుజగడంబు, మేలంబులాడు నె◊మ్మోనితోడఁ,

దులకించు బలుమించు(దల(కించు నెఱమించు, గమి మించు హేమాంశు కంబుతోడ,

తే. మారు(బలుమాఱు గేరు మైతీరుతోడ,

సోము నలయించు నెమ్మొము గోముతోడ(,

బర(గు మాపాలిమదనగోపాలమూర్తి

యంచితస్ఫూర్తి సాక్షాత్కరించి పలికె. 13

టీక: పరువంపు ననగుంపు బలితంపు జిగి పెంపున్ – పరువంపు = నూతనమైన,నన = చిగురులయొక్క, గుంపు = సమూహముయొక్క, బలితంపు = హెచ్చైన, జిగి = మెఱు(గులయొక్క, పెంపున్ = అతిశయమును, కని = పొంది, ఒప్పు పాణి యుగ్మములతోడన్ = ఒప్పునట్టి కరద్వయములతోడను, విష్ణుమూర్తి చతుర్భుజుండు గనుక యుగ్మము లని బహువచన ప్రయోగము చేయ(బడినది;

చెలువందు నరవిందముల యందములు – చెలువందు = సుందరమగు, అరవిందముల = తామరలయొక్క, అందములు = సౌందర్యములు, చిందన్ = రాలునట్లు, అనువు= వైపును, ఒందన్ కల కన్ను(గొనలతోడన్=పొంద(గల యట్టి నేత్రాంతముల తోడను;

జగడంబు=వివాదమును, కను నంబుముగయంబు జగడంబు – కను=పొందునట్టి,అంబుముక్ =మేఘముయొక్క,అయంబు = శుభవిధిసంబంధమైన, జగ = అధికమగు,డంబు = గర్వమును, మేలంబులాడు = పరిహసించునట్టి, నెమ్మేని తోడన్ = చక్కనిశరీరముతోడను;

తులకించు బలుమించున్ = ప్రకాశించునట్టి అధికమైన మెఱపును; తల(కించు నెఱమించు గమిన్ = భయపఱచునట్టి అధికము లగు కాంతులసమూహముచేత, మించు హేమాంశుకంబుతోడన్ = అతిశయించుచున్న కనకాంబరముతోడను;

మారున్= కాముని, పలుమాఱున్ = మాటిమాటికిని, కేరు మైతీరుతోడన్ = పరిహసించునట్టి చక్క(దనముతోడను; సోమున్ = చంద్రుని, అలయించు నెమ్మొముగోముతోడన్= తిరస్కరించునట్టి సుందరమైన ముఖముయొక్క సౌకుమార్యముతోడను; పర(గు మాపాలిమదనగోపాలమూర్తి = ఒప్పుచున్న మా భాగధేయమగు మదనగోపాలస్వామి; అంచితస్ఫూర్తిన్ = పూజ్యమైన ప్రకాశముతో, సాక్షాత్కరించి = ప్రత్యక్షమై, పలికెన్.

ఇందుపమాలంకార మర్థాలంకారము. వృత్త్యనుప్రాసము శబ్దాలంకారము.

చ. అనఘ తటాకముల్ వనచయంబులు భూసురకోటిపాలనం

బును వసుగోపనంబు హరిభూరినికేతనముల్ ఘటించి వే

తనయమహోదయంబునను ధన్యత నొందిననీకు సత్కృతిన్

గననికొఱంత యేల యది గ్రక్కున(గూర్పుము మాకు(బ్రీతిగన్. 14

టీక: అనఘ = పాపములు లేనివా(డా! గ్రంథకర్త సంబోధనము. తటాకముల్ = చెఱువులు; వనచయంబులు = వనసమూహములను; భూసురకోటిపాలనంబును = బ్రాహ్మణకోటి పాలనమును; వసుగోపనంబు = ధన నిక్షేపమును; హరిభూరినికేతనముల్

= అనేకవిష్ణ్వాలయములను; ఘటించి = కావించి; వే =శీఘ్రముగా; తనయమహోదయంబునను = పుత్రోత్సవముచేతను; ధన్యతన్ = కృతార్థతను; ఒందిన నీకున్ =కాంచిన నీకు; సత్కృతిన్ = శ్రేష్ఠమగు గ్రంథమును; కననికొఱంత యేల = చేయని లోపమేల? అది= ఆ గ్రంథము; గ్రక్కునన్; మాకుఁ బ్రీతిగన్; కూర్పుము.

సప్తసంతానములలో నాఱింటి నొంది కృతినిర్మాణము సేయకుంట యేల దానిం గూర్పుమని తాత్పర్యము. 'శ్లో. బ్రహ్మప్రతిష్ఠా సన్తానం తటాకో వనమేవ చ, కృతి ర్దేవాలయశ్చైవ నిక్షేప స్సప్తసన్తతిః' అని సప్తసంతానములు.

తే. వృత్తమే మన్నఁ ద్రేతయం దేము దశర
థాత్మజత్వము గని యున్న నమితరక్తిఁ
జాల మెప్పించె ధరణి సుచంద్రవృత్త
మతని చరితంబు వివరింపు మనఘచరిత! 15

టీక: వృత్తమే మన్నన్ = గ్రంథములో వర్ణనీయచరిత్ర మేమనఁగా, 'వృత్తం పద్యే చరిత్రే త్రిషు' అని యమరము; ఏము = మేము; త్రేతయందున్ = త్రేతాయుగమందు; దశరథ = దశరథునియొక్క; ఆత్మజత్వము = పుత్రత్వమును; కని యున్నన్ = రామావతార మెత్తియున్న యవసరంబున ననుట; సుచంద్రవృత్తము =సుచంద్రుండను రాజుయొక్క చరిత్ర; అమితరక్తిన్ = అధికమైన రసముచేత; ధరణిన్ = భూమిని; చాల మెప్పించెన్ = మిక్కిలి సంతోషపెట్టెను; అనఘచరిత = పుణ్యచరిత్రుఁడవైన మాధవరాయా! అతని చరితంబు; వివరింపుము.

ఇచట 'విశాలస్య సుతో రామ హేమచన్ద్రో మహాబలః। సుచన్ద్ర ఇతి విఖ్యాతో హేమచన్ద్రాదనన్తరః' అను శ్రీమద్రామాయణ బాలకాణ్డస్థకథాసంవాదం బనుసంధేయము.

వ. అని యంతర్హితుం డయ్యె, నంతఁ బ్రభాతం బగుటయు నేనును గాల్యకృత్యంబులు నిర్వర్తించి, విద్వజ్జనంబుల రావించి, పుండరీకాక్షసాక్షాత్కారప్రకారంబు వివరించిన వారు నమందానందులై సత్కులప్రసూతుండవు, సద్గుణ గరిష్ఠుండవు నగు నీకు నిట్టిమహోత్సవంబు లే మద్భుతంబు లవధరింపుము. 16

టీక: అని యంతర్హితుం డయ్యెన్ = ఇట్లని యంతర్ధానము నొందినవాఁ డయ్యెను. ఈ క్రియయందుఁ బై మదన గోపాలమూర్తి యనునది కర్తృపదముగా నన్వయింపవలయు; అంతన్ = అటు పిమ్మట; ప్రభాతంబు = వేకువ; అగుటయున్ = కాఁగా; నేనును; కాల్యకృత్యంబులు = కాలోచితములగు స్నానాదిక్రియలను; నిర్వర్తించి = నెఱవేర్చి; విద్వజ్జనంబులన్ = పండితజనులను; రావించి = రప్పించి; పుండరీకాక్షసాక్షాత్కారప్రకారంబు = మదన గోపాలస్వామివారియొక్క ప్రత్యక్షంబగుటను; వివరించినన్ = తెలుపఁగా; వారున్ = పండితులును; అమందానందులై = అధికమైన యానందము గలవారై; సత్కులప్రసూతుండవు – సత్ = శ్రేష్ఠ మగు; కుల = సర్వజ్ఞ సింగభూపాలుండు మొదలగు మహాశయులచేఁ బ్రకాశించు వంశమందుఁ బుట్టినవాఁడవు; సద్గుణగరిష్ఠుండవు = శ్రేష్ఠములగు దానక్షాత్త్రపాండిత్యాదిగుణములచేత నుత్కృష్టుండవు; అగు నీకున్; ఇట్టిమహోత్సవంబులు = భగవత్సాక్షాత్కారంబు గ్రంథకరణోపదేశంబు మొదలగు నిట్టి యభ్యుదయంబులు; ఏమద్భుతంబులు= ఎంతమాత్రము నాశ్చర్యంబులు గావనుట; అవధరింపుము = ఎచ్చరిక పడుము.

సీ. పద్మాహితకరప్ర।భాభాసమానంబు, సురవాహినీభూతి।శోభితంబు
కవిమండలగవీని।కాయాతిగేయంబు, జగదేకపావనా।చారయుక్త
ముజ్జ్వలత్సదనీక।యోగావలంబంబు, చారుపుష్కరపద।సంగతంబు
ఘనసర్వమంగళా।కాంతరూపఖ్యాత, మనుగతానంతర।త్నాంచితంబు
తే. చెలఁగు నట్టివిష్ణుపదం బ।శేషభువన
మండలైకాభిపూర్ణతా।మహిత మగుచు
నింద్రియజ్ఞానవిషయతా।తీతవృత్తి
యగుచు శ్రుతినివేద్యగుణాశ్ర।యంబు నగుచు. 17

ఇందుఁ బ్రస్తుతవిష్ణుపదవర్ణనము శబ్దశక్తిమూలవ్యంజనమున నప్రస్తుతగగనవిషయార్థము దోఁచునట్లు చేయఁబడుచున్నది.
టీక: పద్మాహితకరప్రభాభాసమానంబు — పద్మా = లక్ష్మిచేత, ఆహిత = ఉంపఁబడిన, కర = హస్తములయొక్క, పద్మాహిత కర = చంద్రకిరణములయొక్క, ప్రభా = కాంతిచేత, భాసమానంబు = ప్రకాశించుచున్నదియు; సురవాహినీభూతిశోభితంబు —సురవాహినీ = దేవనదియొక్క, భూతి = జన్మముచే, సంపదచే, శోభితంబు = ప్రకాశించునదియు;
కవిమండల గవీ నికాయాతిగేయంబు — కవిమండల = పండితమండలముయొక్క, శుక్రమండలముయొక్క, గవీ = వాక్కులయొక్క, కాంతులయొక్క, ‘ స్వర్గేషు పశువాగ్వజ్రదిఙ్నేత్రఘృణిభూజలే’ అని యమరము, గోశబ్దముమీఁద టచ్ ప్రత్యయము జీప్ప్రత్యయము వచ్చి గవీ యని రూపమైనది, నికాయ = సమూహముచేత, అతిగేయంబు = మిక్కిలిపొడఁ దగినది, శ్లాఘ్యమైనదని యర్థాంతరము; జగదేకపావనాచార యుక్తము — జగత్ = భువనముయొక్క, ఏక = ముఖ్య మయిన, పావన = పరిశుద్ధము చేయుట యను, జగత్ = జగమందు, ఏక = ముఖ్యమగు, పావన = పవనసమూహము యొక్క, ఆచార = నడవడితోడ, సంచారముతోడ, యుక్తము = కూడినది;
ఉజ్జ్వల త్సదనీక యోగావలంబంబు – ఉజ్జ్వలత్ = ప్రకాశించుచున్న, సత్ = సత్పురుషులయొక్క, రిక్కలయొక్క, అనీక = సంఘములయొక్క, యోగ = ధ్యానమునకు, సంబంధమునకు, అవలంబంబు = ఆధారమును; చారుపుష్కరపదసంగతంబు – చారు = ఒప్పుచున్న, పుష్కరపద = పద్మచిహ్నములతోడను, పుష్కరమనెడి పేరుతోడను, సంగతంబు = కూడినది;
ఘన సర్వమంగళాకాంత రూప ఖ్యాతము – ఘన = గొప్పది యగు, సర్వమంగళ = సర్వశుభములచేత, ఆకాంత = మిక్కిలి మనోహరమైన, సర్వమంగళాకాంత = శివునియొక్క, రూప = రూపముచేతను, మూర్తివిశేషమని యర్థాంతరము, ఖ్యాతము = ప్రసిద్ధము, ‘ద్యౌ భూమి వహ్ని యజ్వానో మూర్తయోఽష్టౌ ప్రకీర్తితాః’ అని యీశ్వరుని మూర్త్యష్టకములో నాకాశము చేరిన దని తెలియునది; అనుగతానంతరత్నాంచితంబు = అనుగతములు నధికములునగు రత్నములచేతఁ బూజింపఁబడినది, అనుగతానంతరత్నాంచితంబు = అనుగతశేషఫణామణిపూజితంబు, అనుగతుఁడగు సూర్యునిచేత నొప్పునది;
అట్టి = ఐనట్టి,విష్ణుపదంబు = నారాయణుని చరణము,ఆకాశము; అశేష భువనమండలైకాభిపూర్ణతా మహితము — అశేష = సమస్తమైన, భువనమండల = లోకసమూహమందు, ఏకాభిపూర్ణతా = కేవలపరిపూర్ణతచేత, అర్థాంతరమం దాకాశము విభువు

గాన యంతట వ్యాపించియుండుటచేత, మహితము = ఒప్పునది, అగుచున్; ఇంద్రియ జ్ఞాన విషయతాతీత వృత్తి— ఇంద్రియ = ఇంద్రియములయొక్క, అనఁగా మనోనేత్రాద్యన్తరబాహ్యేంద్రియంబులయొక్క, జ్ఞాన=జ్ఞానముయొక్క, విషయతా = విషయ మగుటను, అతీత = అతిక్రమించిన, వృత్తి = వర్తనము గలది, అగుచున్; శ్రుతి నివేద్య గుణాశ్రయంబు — శ్రుతి = వేదములచేతను, కర్ణములచేతను, నివేద్య = బోధింపఁదగిన, ఆకాశపక్షమందుఁ దెలియఁదగిన, గుణ = అనంతకల్యాణగుణములకు, శబ్దమునకు, ఆశ్రయంబు = ఉనికిపట్టు,అగుచున్; చెలఁగున్ = ఒప్పును.

ఇందుఁ బ్రస్తుతవిష్ణుచరణపర మైన యర్థమందు శబ్దశక్తిసంయోగాదులవలన నియమిత కాఁగా నప్రస్తుతాకాశవిషయార్థ స్ఫురణము వ్యంజనావృత్తిచేతఁ గలుగుచున్నది. 'శ్లో. అనేకార్థస్య శబ్దస్య వాచకత్వే నియన్త్రితే, సంయోగాద్యై రవాచ్యార్థధీకృ ద్వ్యాపృతిరంజనమ్' అని యిందులకుఁ బ్రమాణము. అనేకార్థములు, ప్రస్తుతములు, అప్రస్తుతములు, ప్రస్తుతాప్రస్తుతములు నుండును. అందుఁ గేవలప్రస్తుతము లైనప్పుడును గేవలాప్రస్తుతము లైనపుడు నీయర్థమే వాచ్యము తక్కినది కాదనుటకు వినిగమకము లేనందున నర్థద్వయము శబ్దశక్తిగమ్యమే యగును. ఇఁక నొకయర్థము ప్రకృతము మఱియొకటి యప్రకృతము నగునపుడు ప్రకరణాదులవలనఁ బ్రస్తుతార్థము బోధితము కాఁగా నప్రస్తుతమును బోధించు నుపాయము లేక వ్యంజనావృత్తి నాశ్రయింపవలె నని భావము. సంయోగాదులు – 'శ్లో. సంయోగో విప్రయోగశ్చ సాహచర్యం విరోధితా, అర్థః ప్రకరణం లిఙ్గం శబ్ద స్యాన్యస్య సన్నిధిః। సామర్థ్య మౌచితీ దేశః కాలో వ్యక్తి స్స్వరాదయః। శబ్దార్థ స్యానవచ్ఛేదే విశేషస్మృతి హేతవః' అనునవి. ఇట్లు కావ్యప్రకాశకారాదిమతము. 'శ్లో. నానార్థసంశ్రయ శ్శ్లేషో వర్ణ్యావర్ణ్యోభయాశ్రితః' అను చంద్రాలోక శ్లోకవ్యాఖ్యయందు 'శ్లో. ఉచ్చరద్భూరికీలాల శ్శుశుభే వాహినీపతిః' అనుచోట శబ్దశక్తి యర్థద్వయమందుండి యుభయార్థములు వాచ్యములగుచుండఁగా నొకటి వాచ్యము నొకటి వ్యంగ్య మగుట దగ దని వ్రాయఁబడియె. ఈ మతద్వయమును విమర్శించి, రసగంగాధరములో 'ఏవం స్థితే నానార్థస్థలే పృథమాయాః ప్రాకరణికాప్రకరణికార్థగతాయాః ప్రతిపత్తయే అవశ్యం వాచ్యయా వ్యంజనయై వాప్రాకరణికార్థ స్యాపి ప్రతిపత్తావలం క్లిష్టకల్పన యే త్యాశయేన ప్రాచీనై రుక్త న్నానార్థవ్యంజకత్వ మపి న దుష్యతి' అని వ్రాయఁబడినది. కావున ధ్వని యని వ్రాసినచోఁ బ్రాచీనమత మనియు, శ్లేష మని వ్రాసినచో నవీనమత మనియు దెలియునది.

చ. వికలితపంకజాతనవ◊విభ్రమ మై, ఘనగోధ్రతాభిభూ
తకమఠనాథ మై, యరుణ◊ధామవిభాసిత మై, ద్విజోత్తమ
ప్రకటితహార్దయోగభర◊భావుక మై, ధరయందుఁ బద్మనా
యకకుల ముద్భవించె నట◊నాత్మజనుష్పదతుల్యవైఖరిన్. 18

టీక: ధరయందున్ = భూమియందు; వికలిత పంకజాత నవవిభ్రమ మై— వికలిత = వికలము చేయఁబడిన, పంకజాత = పాపకదంబముయొక్క, తామరలయొక్క, నవవిభ్రమ మై= నూతనశోభ గలదై 'విభ్రమో భ్రంశనే భ్రాన్తౌ శోభాయామ్' అని విశ్వము; ఘన గోధ్ర తాభిభూత కమఠనాథ మై— ఘన = గొప్పదగు, గోధ్రతా = భూమిని భరించువాఁ డగుటచేత, కాంతిని భరించువాఁడగుటచేత, అభిభూత = తిరస్కరింపఁబడిన, కమఠనాథ మై = ఆది కూర్మము గలదై, కూర్మశ్రేష్ఠము గలదై; అరుణధామవిభాసిత మై— అరుణ = సూర్యతుల్యమగు, ధామ = ప్రతాపముచేత, ఎఱ్ఱని కాంతిచేత, విభాసిత మై = ప్రకాశించునది యై; ద్విజోత్తమ ప్రకటిత హార్ద యోగ భర భావుక మై—ద్విజోత్తమ = బ్రాహ్మణోత్తములయందు, ప్రకటిత = ప్రకటము చేయఁబడినదగు,

హార్ద = స్నేహముయొక్క, యోగ = సంగతియొక్క, భర = అతిశయముచేత, భావుక మై = మంగళము గలదై, విష్ణుపదపక్ష మందు— ద్విజోత్తమప్రకటిత = బ్రాహ్మణోత్తములచేతఁ బ్రకటిత మగు, హార్దయోగ = హృదయసంబంధిధ్యానముయొక్క, భర = అతిశయము గలదై, భావుక మై = మంగళము గలదై, అని యర్థము; అట = ఆ విష్ణుపదమునుండి; పద్మనాయకకులము = పద్మనాయకులవంశము; ఆత్మజనుష్పదతుల్యవైఖరిన్— ఆత్మ=తనయొక్క, జనుష్పద=జన్మస్థానమగు విష్ణుపాదము తోడ, తుల్యవైఖరిన్ = సమానమగు రీతిచేత; ఉద్భవించెన్ = ఆవిర్భవించెను.

పద్మనాయకకులము తన కుత్పత్తిహేతువగు విష్ణుపాదముతోఁ దుల్యగుణ మై వర్తించె నని భావము. ఈపద్యమందుఁ దుల్యపద ముపమావాచకము గాన విష్ణుపదమునకుఁ బద్మనాయకకులమునకు సామ్యము వాచ్య మగుటచే నుపమాలం కారము. కావ్యప్రకాశకారాదు లిట్టి యుపమలను శబ్దాలంకారములలోఁ జేర్చి యున్నారు. ఏలన ఇందు సాధారణధర్మము 'శ్లో. సకలకలంపుర మేత జ్జాతం సంప్రతి సుధాంశుబిమ్బమివ' ఇత్యాదులయందుంబలె శబ్దసామ్యరూప మైనదె కాని యర్థ సామ్యరూప మైనది కాదు, కావున నిది శబ్దాలంకారం బనవలయు. 'శ్లో. స్ఫుట మర్థాలంకారా వేతా వుపమాసముచ్చయౌ కింతు, ఆశ్రిత్య శబ్దమాత్రం సాధర్మ్య మిహాపి సంభవతః' అని రుద్రటుండును వచియించె నని వారి గ్రంథమందు వ్రాయఁబడినది. 'ఇహాపి' యనఁగా శబ్దాలంకారప్రకరణమం దని యర్థము. చిత్రమీమాంసయందు శబ్దమాత్రసాధర్మ్య ముండిన నర్థాలంకా రము గావచ్చు నని వ్రాయఁబడినది.

క. ఆ సంతతిఁ జాపకలా,వాసవి సెన్నొందె సింగ◊వసుధేంద్రుఁడు ఘో
రాసిమహోరాశిమహో,ద్భాసిహుతాశావలీఢ◊పరవంశకుఁ డై. 19

టీక: ఆ సంతతిన్ = ఆ పద్మనాయకవంశమందు; చాపకలావాసవి = బాణవిద్యయం దర్జునునితో సమానుఁ డైనట్టి; సింగవసు ధేంద్రుఁడు = సింగభూపాలుండు; ఘోరాసి మహోరాశి మహోద్భాసి హుతా శావలీఢ పరవంశకుఁ డై—ఘోరాసి = భయా వహ మగు కత్తియొక్క, మహోరాశి = తేజఃకదంబ మనెడు, మహోద్భాసి = మిక్కిలి ప్రకాశించుచున్న, హుతాశ = అగ్నిచే, అవలీఢ = కాల్పఁబడిన, పరవంశకుఁ డై = శత్రువంశము లనెడు అధికము లగు వెదుళ్లుగలవాఁ డై; చెన్నొందెన్ = ప్రకాశించెను. ఇందు రూపకాలంకారము.

సీ. నిజకటకాశ్రిత◊ద్విజపోషణమున నె,వ్వని సార్వభౌమత ◊ఘనత గాంచుఁ
బరమహాహీనస◊ద్బలవిభేదనలీల, రమణ నెవ్వని నరేం◊ద్రత్వ మలరు
గంధాంకకైరవ◊కాండలుంటాకథా,మమున నెవ్వని యిన◊త్వము సెలంగు
జాగ్రద్ఘనాఘన◊సాంద్రమదాపహ,శక్తి నెవ్వని మహే◊శ్వరత వొసఁగు
తే. నతఁడు వొగడొందు జయశాలి, ◊యహితసాల
కీలి, యతిదీప్తినిర్ధూత◊హేళి, యమర
విసరసన్నుతనయకేళి, ◊యసమసుగుణ
విజితభువనాళి, శ్రీసింగ◊వీరమౌళి. 20

టీక: నిజ కట కాశ్రిత ద్విజ పోషణమునన్— నిజ = స్వకీయమగు, కటక = పురమును, గండస్థలమును, 'కటకో స్త్రీ రాజ ధానీ', 'గండః కటోమదో దానమ్' అని రెంటికి నమరము, గండస్థలపక్షమందు కటశబ్దముమీఁద స్వార్థమందు కప్రత్యయము వచ్చినది, ఆశ్రిత = ఆశ్రయించిన, ద్విజ= బ్రాహ్మణులయొక్క, తుమ్మెదలయొక్క, పోషణమునన్ = పోషించుటచేత; ఎవ్వని సార్వభౌమత = ఎవ్వని చక్రవర్తిత్వము, దిగ్గజత్వ మని వ్యజ్యమానార్థాంతరము; ఘనత = గొప్పతనమును, కాంచున్ = పొందునో;

పర మహాహీన సద్బల విభేదనలీలన్— పర = శత్రువులయొక్క, మహాహీన = మిగుల నధికమగు, సద్బల = మంచి సైన్య ములయొక్క, విభేదనలీలన్ = భేదనక్రియచేతను, పర = ఉత్కృష్టములగు, మహాహీన = గొప్ప సర్పములయొక్క, సద్బల = మంచి బలముయొక్క, విభేదనలీలన్ = భేదనక్రియచేత నని యర్థాంతరము, ఎవ్వని నరేంద్రత్వము = ఎవని రాజత్వము, విషవైద్యత్వము, 'విషవైద్యే ధరాధీశే నరేంద్రః' అని శాశ్వతము, రమణ నలరున్ = ఒప్పారునో;

గంధాంక కైరవ కాండ లుంటాక ధామమునన్— గంధ = గర్వము, పరిమళ మని యర్థాంతరము, 'గంధో గంధక ఆమోదే లేశే సంబంధ గర్వయోః' అని విశ్వము, అంక =చిహ్నముగాఁ గల,కైరవ = పిశునులయొక్క, కలువలయొక్క, కాండ = సమూహముయొక్క, లుంటాక = ఛేదక మగు, ధామమునన్ = ప్రతాపముచేత, కాంతిచేత నని యర్థాంతరము, ఎవ్వని ఇన త్వము =ఎవ్వని ప్రభుత్వము, సూర్యత్వము, 'ఇనస్సూర్యే ప్రభౌ' అని యమరము, చెలంగున్ = ప్రకాశించునో;

జాగ్రద్ఘనాఘన సాంద్రమదాపహశక్తిన్ — జాగ్రద్ఘనాఘన = జాగరూకు లైన ఘాతుకులయొక్క, జాగరూకమైన మత్తగజము యొక్క, అనఁగా గజాసురునియొక్క 'ఘనాఘనౌ ఘాతుక మత్తదన్తినౌ' అని విశ్వము, సాంద్ర మద = ఘనమైన యహంకార మును, ఘన మైన మదమును, ఆపహ = పోఁగొట్టెడి, శక్తిన్ = సామర్థ్యముచేత; ఎవ్వని మహేశ్వరత = ఎవ్వని ప్రభుత్వము, ఈశ్వరత్వము; పొసఁగున్ = ఒప్పునో;

అతఁడు; జయశాలి = జయముచే నొప్పువాఁడు; అహితసాలకీలి = శత్రువు లనెడు వ్రాఁకుల కగ్ని రూపుఁడు; అతిదీప్తి నిర్ధూత హేళి = అధికప్రతాపముచేతఁ దిరస్కరింపఁబడిన సూర్యుఁడు గలవాఁడు; అమర విసర సన్నుత నయకేళి = దేవతాసంఘము చేతఁ గొనియాడఁబడిన నీతివిద్యావిహారము గలవాఁడు; అసమ సుగుణ విజిత భువనాళి = అసమానములైన మంచిగుణముల చేత జయింపఁబడిన లోకములు గలవాఁడు; శ్రీసింగవీరమౌళి = శ్రీసింగభూపాలుఁడు; పొగడొందున్ = పొగడ్త గాంచును.

ఇచట సింగభూపాలునందు ద్విజపోషణ, పరబలవిభేదన,కైరవకాండలుంటన, ఘనాఘనమదహరణములచే, దిగ్గజవిశేష, విషవైద్య, రవి, రుద్రుల సామ్యము తోఁచుచున్నది కావున నుపమాలంకారధ్వని. గీతిలో 'ళి' శబ్దమునకుఁ బలుమా ర్లావృత్తి యగుటవలన వృత్త్యనుప్రాసము.

చ. కరు లరిసంవృతాత్మకట◊కంబులు, విష్ణునిబద్ధవిగ్రహుం
డురగవిభుండు, కూర్మవరుఁ ◊డుద్ధతభూభృదుదీర్ణమూర్తి, భూ
ధరము లరాతికాండగణ◊దారితగాత్రము లంచు మేదినీ
తరుణి వరించె సింగవసు◊ధావరు నప్రతిమానవిక్రమున్. 21

టీక: కరులు = దిగ్గజములు; అరి సంవృ తాత్మ కటకంబులు— అరి = శత్రువులచేత, తుమ్మెదలచేత, ఇచట రేఫలకారములకు ‘శ్లో. డలయో రలయో శ్చైవ శసయో ర్వబయో స్తథా। వదన్త్యేషాం హి సాధర్మ్య మలంకార విదో జనాః’ అని సావర్ణ్యము, సంవృత = వ్యాప్తములగు, ఆత్మ = తమయొక్క, కటకంబులు = పత్తనములు గలవి, గండస్థలములు గలవి; ఉరగవిభుండు = ఆదిశేషుఁడు; విష్ణునిబద్ధవిగ్రహుండు— విష్ణు = వ్యాపకునితోడను, నిబద్ధ = కూర్పఁబడిన, విగ్రహుండు = విరోధము గలవాఁడు, హరితోడఁ గూర్పఁబడిన దేహము గలవాఁడు; కూర్మవరుఁడు = ఆదికూర్మము, ఉద్ధత భూభృ దుదీర్ణ మూర్తి— ఉద్ధత = గర్వించిన, భూభృత్ = రాజులచేత, ఉదీర్ణ = ఉబ్బిన, మూర్తి = శరీరము గలది, ఉద్ధతములగు పర్వతములచే గొప్పదైన మూర్తి గలది; భూధరములు = కులాచలములు; అరాతి కాండ గణ దారిత గాత్రములు—అరాతి = శత్రువులయొక్క, కాండ = బాణములయొక్క, గణ = సమూహముచేత, దారితగాత్రములు = భేదింపఁబడిన శరీరములు గలవి, అర = వేగము చేత, అతి = అధికమౌనట్లుగా, కాండగణ = ఉదకసమూహముచేత, దారితగాత్రములు = భేదింపఁబడిన దేహములు గలవి యని భావము; అంచున్ = ఇట్లనుచు; మేదినీతరుణి = భూకాంత; అప్రతిమానవిక్రమున్ = అసమాన మగు పరాక్రమము గల వాఁడగు; సింగవసుధావరున్ = సింగభూపాలుని; వరించెన్ = వరియించెను.

ఇందు, దిక్కరిప్రభృతులందు సామర్థ్యహీనత్వాదిదోషము లుండుటం జేసి, యసమానపరాక్రముఁ డగు సింగభూపాలుని భూరమణి వరించె ననఁగా సర్వభూమిని సింగభూపాలుం డేలె నని భావము. శ్లేష సముత్థాపితవ్యతిరేకాలంకారము.

సీ. అరిపురభేదనా◊యతదోర్బలస్ఫూర్తి, నతరాజవర్ధన◊విততకీర్తిఁ
గనదహీనాంగద◊కలితబాహాలీల, ఖండితాహితఘనా◊ఘనవిహేల
సద్గణరక్షణ◊క్షమచరణాసక్తిఁ, బటుచంద్రకోటీర◊భానిషక్తిఁ
దతసర్వమంగళాం◊చితగాత్రరుచిపాళి, నచలధర్మోన్నత◊ప్రచయకేళిఁ
తే. బ్రకటదుర్గాధినాయక◊భావభూతి
వైరిదర్పకదాంబక◊వహ్నిహేతి
నవనిఁ బొగడొందె సర్వజ్ఞుఁ ◊డనఁగ సింగ
ధరణిభృన్మౌళి తీవ్రప్ర◊తాపహేళి. 22

టీక: అరిపుర భేద నాయత దోర్బలస్ఫూర్తిన్— అరిపుర = శత్రుశరీరములయొక్క, త్రిపురములయొక్క యని యర్థాంతరము, భేదన = భేదించుటయందు, ఆయత = విపులమైన, దోర్బలస్ఫూర్తిన్ = భుజబలాతిశయముచేతను; నత రాజ వర్ధన వితత కీర్తిన్—నత = ప్రణమిల్లిన, రాజ = నరపతులయొక్క, నతరాజ = వంగిన చంద్రునియొక్క, బాలచంద్రునియొక్క యని యర్థాంతరము, వర్ధన = పోషణముచేత, వితత = విస్తీర్ణమగు, కీర్తిన్ = యశస్సుచేతను;
కన దహీ నాంగద కలిత బాహాలీలన్— కనత్ = ప్రకాశించుచున్న, అహీన = అధికమగు,అంగద = భుజకీర్తులతోడను, శివునిపక్షమందు ప్రకాశించుచున్న ఆదిశేషుఁడను భుజకీర్తులతోడ నని యర్థము, కలిత=కూడుకొన్న, బాహాలీలన్=భుజవిలా

సముచేతను; ఖండి తాహిత ఘనాఘన విహేలన్— ఖండిత = ఖండింపఁబడిన, అహిత = శత్రువు లగు, ఘనాఘన = ఘాతుకులయొక్క, శత్రువైన గజాసురునియొక్క యని యర్థాంతరము, విహేలన్ = విశేషవిలాసముచేతను;
సద్గణ రక్షణ క్షమ చరణాసక్తిన్ — సద్గణ = సత్పురుషసంఘముయొక్క, రక్షణ = పోషణమందు, క్షమ = సమర్థమైన, చరణ = నడవడియందు, ఆసక్తిన్ = ప్రీతిచేతను, శివునిపక్షమందు శ్రేష్ఠమగు ప్రమథగణముయొక్క రక్షణమునందు సమర్థములైన పాదములతోడి మిక్కిలి సంబంధముచేత నని యర్థము; పటు చంద్ర కోటీర భా నిషక్తిన్— పటు = సమర్థమైన, చంద్ర = హిరణ్మయమగు, 'కల్యాణ మర్జునం భూరి గైరికం వసు చంద్రకం' అని యమరము, కోటీర = కిరీటముయొక్క, శీతాంశుఘటితమైన కిరీటముయొక్క యని యర్థాంతరము; భా = కాంతియొక్క, నిషక్తిన్ = సంబంధముచేతను;
తత సర్వమంగ ళాంచిత గాత్రరుచి పాళిన్— తత = విస్తృతమగు, సర్వమంగళ = సమస్తశుభములచేత, సర్వమంగళా = పార్వతిచేత, అంచిత = ఒప్పునట్టి, గాత్రరుచి = దేహకాంతులయొక్క, పాళిన్ = సమూహముచేతను; అచలధర్మోన్నత ప్రచయ కేళిన్— అచలధర్మ = చెదరని ధర్మములయొక్క, మేరుధనువుయొక్క, ఉన్నతప్రచయ=అధికవృద్ధియందలి, కేళిన్ = క్రీడచేతను;
ప్రకట దుర్గాధినాయకభావ భూతిన్— ప్రకట = వ్యక్తమగు, దుర్గాధినాయకభావ = దుర్గాధ్యక్షత్వముయొక్క, గౌరీవల్లభత్వముయొక్క, భూతిన్ = సంపదచేతను; వైరి దర్పక దాంబకవహ్ని హేతిన్— వైరి = శత్రువులయొక్క, దర్పక = గర్వమును, ద = ఖండించెడు, అంబకవహ్ని = బాణము లనెడు నిప్పుయొక్క, హేతిన్= జ్వాలచేతను, శివునిపక్షమందు, వైరి = శత్రువైన, దర్పక = మన్మథుని, ద = ఖండించెడు, అంబకవహ్నిహేతిన్= నేత్రాగ్నియొక్క జ్వాలచేతను; తీవ్రప్రతాపహేళి = ఉగ్రప్రతాపముచేత సూర్యతుల్యుండైన; సింగధరణిభృన్మౌళి = సింగభూపాలాగ్రణి; అవనిన్ = భూమియందు; సర్వజ్ఞుఁడనఁగన్ = ఈశ్వరుం డనఁగా, సర్వము దెలిసినవాఁ డనఁగా; పొగడొందెన్ = పొగడ్త గాంచెను.

సింగభూపాలుఁడు విద్యావిశారదుండై, రసార్ణవసుధాకరాదిగ్రంథప్రణేత యై, సర్వజ్ఞుండను బిరుదము గాంచియుండఁగా, నిచటఁ గవి, యరిపురభేదన, నతరాజవర్ధ, నాహీనాంగదకలన, గజాసురఖండ,నాద్యఖిల జగదీశ్వర కార్యకరణముచే సర్వాంశములయందును నీశ్వరునిం బోలి సర్వజ్ఞుం డను తన్నామమును వహించె నని వర్ణించెను. ఇందు శ్లిష్టరూపకాలంకారము.

తే. అర్థిసాత్కృతసురభి, పరిరాశిసురభి,
సుగుణవల్లీప్రకాండైకసురభి, కీర్తి
జితసురభి, శౌర్యసురభి నా సింగనృపతి
పరఁగఁ దద్వంశమును గాంచె సురభిసంజ్ఞ. 23

టీక: అర్థిసాత్కృత సురభి— అర్థిసాత్కృత = యాచకాధీనముగాఁ జేయఁబడిన, సురభి = సువర్ణము గల వాఁడు; పరాళిసురభి = శత్రువులనెడు తుమ్మెదలకు సంపెఁగ యైన వాఁడు; సుగుణవల్లీప్రకాండైకసురభి— సుగుణ = సద్గుణము లనెడు, వల్లీ = లతలయొక్క,ప్రకాండ= గుమురులకు, ఏక = ముఖ్యమైన, సురభి = వసంతుఁడైనవాఁడు; కీర్తిజితసురభి=కీర్తిచేత జయింపఁబడిన కామధేనువు గలవాఁడు; శౌర్యసురభి = శౌర్యముచేత మనోజ్ఞుడైనవాఁడు; నాన్ = అనునట్లుగా; సింగనృపతి = సింగ

భూపాలుఁడు; పరఁగన్ = ఒప్పుఁగా; తద్వంశమును = ఆ సింగభూపతివంశమును; సురభిసంజ్ఞన్ = సురభి అను నామమును; కాంచెన్ = పొందెను. ఇట్టి సింగభూపాలుఁ డుదయించుటచే వారి వంశము సురభివంశ మను నభిఖ్య నొందెనని తాత్పర్యము.

క. ఆరాజదన్వయంబున
ధీరాగ్రణి పెద్దశౌరి ◊దీప్తాసిమహ
స్స్ఫారాహతధారాహత
వీరాహితగోత్రుఁ డగుచు ◊వెలసెన్ ధరణిన్. 24

టీక: ఆరాజదన్వయంబునన్ = ఆ ప్రకాశించుచున్న సురభివంశమందు; ధీరాగ్రణి = ధైర్యవంతులయందు శ్రేష్ఠుం డగు; పెద్ద శౌరి = పెద్దభూపాలుఁడు; దీప్తాసి మహ స్స్ఫా రాహత ధారా హత వీరాహిత గోత్రుఁడగుచున్— దీప్త = ప్రకాశించుచున్న, అసి= ఖడ్గముయొక్క, మహః = కాంతియొక్క, తేజస్సుచేత నని యర్థాంతరము, స్ఫార = అధికమై, మహస్స్ఫార అను పాఠమందు తేజస్స్ఫారరూపమై యని యర్థము, అహత = అప్రతిహతమగు, ధారా = అలుఁగు చేత, హత = కొట్టఁబడిన, వీరాహిత = వీరు లగు శత్రువులయొక్క; గోత్రుఁడగుచున్ = కులము లనెడు పర్వతములు గలవాఁ డగుచు; ధరణిన్ = భూమి యందు; వెలసెన్ = ప్రకాశించెను.

ఇట వర్ణ్యనియం దింద్రత్వము. 'శ్లో. శమయ త్యరితేజోగ్నిం ధారయా త్వత్కృపాణికా' అనుచోట కృపాణికయందు మేఘత్వమువలె నర్థసిద్ధము. కావున నేకదేశవివర్తిరూపకము. 'శ్లో. శ్రౌతా అర్థాశ్చ తే యస్మి న్నేకదేశవివర్తి తత్' అని కావ్య ప్రకాశమునందుఁ దల్లక్షణము.

సీ. ఏమాన్యు నతిభీమ◊భీమప్రతాపంబు,తాపంబు శాత్రవ◊తతికిఁ గూర్చు
నేవీరు ఘనసార◊హితకీర్తికాండంబు, కాండంబు నెల్లెడ ◊నలమి పొల్చు
నేరమ్యు నతిభూరి◊భూరినికాయంబు, కాయంబు నర్థుల ◊కబ్బఁ జేయు
నేరాజు నుత్సాహ◊ధీరాంతరంగంబు, రంగంబు నీతిన◊ర్తకికి నెన్న
తే. నతఁడు ధృతిమంతుఁ, డతిదాంతుఁ, ◊డమలకాంతుఁ,
డశ్వరేవంతుఁ, డవితమ◊హాదిశాంతుఁ,
డంగనాత్మాంబురుహభృంగ◊దంగజితజ
యంతుఁ డగు పెద్దవసుమతీ◊కాంతుఁ డెసఁగు. 25

టీక: ఏమాన్యు నతిభీమభీమప్రతాపంబు— ఏమాన్యు = ఏ మాననీయునియొక్క, అతిభీమ = శివుని నతిక్రమించిన, 'వ్యోమ కేశో భవో భీమః' అని యమరము, భీమ = భయంకర మగు; ప్రతాపంబు = తేజస్సు; శాత్రవతతికిన్ = శత్రుసంఘమునకు; తాపంబు =సంతాపమును; కూర్చున్ = చేయునో;

ఏవీరు ఘనసార హిత కీర్తికాండంబు—ఏవీరు = ఏ వీరునియొక్క, ఘనసార = కర్పూరము పగిది, కాదేని కర్పూరమునకు, హిత = హిత మగు (మిత్రమగు) , కీర్తికాండంబు = కీర్తిసమూహము; కాండంబున్ = బ్రహ్మాండంబును; ఎల్లెడన్ = అంతటను; అలమి = ఆక్రమించి; పొల్చున్ = ఒప్పునో;

ఏరమ్యు నతిభూరి భూరి నికాయంబు— ఏరమ్యు = ఏ రమణీయునియొక్క, అతిభూరి = మిక్కిలి యధికమగు, భూరి = సువర్ణముయొక్క, 'భూరి ప్రాజ్య సువర్ణయోః' అని విశ్వము, నికాయంబు = సమూహము; అర్థులకున్ = యాచకులకు; కాయంబు— క = చిత్తములకు, అయంబు = శుభావహవిధిని, సంతోషముననుట 'అయశ్శుభావహో విధిః' అని యమరము; అబ్బఁ జేయున్ = అందఁజేయునో;

ఏరాజు ఉత్సాహధీరాంతరంగంబు — ఏరాజు = ఏ రాజుయొక్క, ఉత్సాహ = ఉత్సాహవంతం బగు, అర్శ ఆద్యచ్, ధీర = ధైర్యవంత మగు, అంతరంగంబు = చిత్తము; నీతినర్తకికిన్ = నీతి యనెడు నటికి; ఎన్నన్ = పరికింపఁగా; రంగంబు = నాట్య రంగమో;

అతఁడు; ధృతిమంతుఁడు = ధైర్యవంతుఁడు; అతిదాంతుఁడు = మిక్కిలి యింద్రియనిగ్రహము గలవాఁడు; అమలకాంతుఁడు = నిర్మలుఁడును మనోహరుఁడును; అశ్వరేవంతుఁడు=అశ్వములయెడ రేవంతతుల్యుఁడు; అవితమహాదిశాంతుఁడు=పాలింపఁబడిన గొప్ప దిగంతములుగలవాఁడు; అంగనాత్మాంబురుహభృంగదంగజితజయంతుఁడు — అంగనా = స్త్రీలయొక్క, ఆత్మ = మనస్సనెడు, అంబురుహ = కమలమునకు, భృంగత్ = తుమ్మెదవలె నాచరించుచున్న, ఇట 'సర్వప్రాతిపదికేభ్యః క్విబ్వా వక్తవ్యః' అని క్విప్ప్రత్యయము, అంగ = దేహముచేత, జిత = జయింపఁబడిన, జయంతుఁడు = జయంతుఁడు గలవాఁడు; అగు = అయినట్టి;పెద్దవసుమతీకాంతుఁడు = పెద్దరాజు; ఎసఁగున్ = అతిశయించును.

ఇందు తాపంబు తాపంబు లో నగువానియం దనేక వర్ణసముదాయము సామ్యము నొందుటం బట్టి యమకము. ఏరాజునుత్సాహధీరాంతరంగంబు రంగంబు నీతి నర్తకికి నెన్నినను వాక్యమం దంతరంగము నందు రంగత్వారోపముఁ జేయుటంజేసి రూపకాలంకారభేదము.

క. రాజులలో శ్రీదాంబుద
రాజులలో నెంచఁగా విరాజిలు బహువీ
రాజులచే, దానకళా
రాజులచేఁ బెద్దనృపతి రహిఁ బెద్ద యనన్. 26

టీక: పెద్దనృపతి = పెద్దభూపాలుఁడు; రాజులలోన్ = దొరలలో; శ్రీదాంబుదరాజులలోన్ = కుబేర మేఘ చంద్రులలో; ఎంచఁగాన్ = గణింపఁగా; బహువీరాజులచేన్ — బహు = పెక్కులగు, వీర = వీరులయొక్క, ఆజులచేన్ = జగడంబులచేతను; దానకళారాజులచేన్— దానకళా = వితరణవిద్యలయొక్క, రాజులచేన్ = పరంపరలచేతను; రహిన్ = ఒప్పిదముచే; పెద్ద యనన్ = అధికుఁ డనునట్లుగా; విరాజిలున్ = ప్రకాశించును.

పెద్దరాజు దొరలలో వీరాజులచేతను, కుబేరమేఘచంద్రులలో దానకలారాజులచేతను, బెద్ద యనునట్లు విరాజిల్లె నని తాత్పర్యము. త్రిప్రాసకందము. యథాసంఖ్యాలంకారము. 'యథాసంఖ్యం క్రమేణైవ క్రమికాణాం సమన్వయః' అని తల్లక్షణము.

తె. అతనిసతి వల్లభాంబ నా \neలరుఁ గన్న
యిల్లు తనమన్న యిల్లు భా\neసిల్ల, నగుచు
గన్న యిల్ పల్చఁ జేయుచు \neమన్న యిల్ మ
హాపకీర్తియుక్తముఁ జేయు \neనబ్జపాణి. 27

టీక: అతనిసతి = ఆపెద్దనృపాలుని భార్య; కన్నయిల్లు = తన పుట్టినయిల్లు; తన మన్నయిల్లు = తన యత్తగారియిల్లు; భాసిల్లన్ = ప్రకాశించుచుండఁగా; కన్న యిల్ పల్చఁ జేయుచున్ = పుట్టిన యింటిని పలుచఁదనము నొందినదానిగాఁ జేయుచు, అనగా లఘువైన దానిగాఁ జేయుచు; మన్న యిల్ మహాపకీర్తియుక్తముఁ జేయు నబ్జపాణిన్ — మన్న యిల్ = అత్తయింటిని, మహాపకీర్తి = గొప్ప యపయశస్సుతో, యుక్తమున్ = కూడినదానిగా, చేయు నబ్జపాణిన్ = చేయుచున్న లక్ష్మీదేవిని; నగుచున్ = పరిహసించుచు; వల్లభాంబ నాన్ = వల్లభాంబ యను పేర; అలరున్ = ఒప్పును.

వల్లభాంబ లక్ష్మీదేవివలె పుట్టినింటిని లఘువుగాను, అత్తగారియింటిని మహాపకీర్తిగలదానిగాను జేయక పుట్టినిల్లు నత్తగారియిల్లును, దన సద్వృత్తులచే భాసిల్లునట్లు చేసె నని తాత్పర్యము. లక్ష్మీదేవియొక్క పుట్టి నిల్లగు సముద్రము జల రూపము గావున పలుచగా నున్నదనియు, మన్న యిల్లగు పద్మము మహాపకీర్తి యనగా గొప్ప యుదకముతోఁ గూడిన బురద, దానితోఁ గూడియున్నదనియు భావము. 'కీర్తి ర్యశసి కర్దమే' అని విశ్వము. అప్ శబ్దము, 'ఋక్పూరబ్ధూః పథామానక్షే' అను పాణినిసూత్రముచే టచ్ప్ర త్యయము చేయఁగా మహాప యని అకారాంతమైనదని తెలియునది. కాదేని, 'అపాం సమూహ ఆపమ్' అనఁగా నీటిసమూహము ఆపగా అను శబ్దంబునంబోలె గ్రహించునది.

క. ఆ కాంతయందుఁ బెద్ద
క్ష్మాకాంతుఁడు గాంచె మల్ల\neశౌరిని, విలస
న్నాకాంతరమాకాంతర
సాకాంతరమావిశేషు, \neసజ్జనపోషున్. 28

టీక: ఆ కాంతయందున్ = ఆ వల్లభాంబయందు; పెద్దక్ష్మాకాంతుఁడు = పెద్దవసుమతీశుఁడు; విలస న్నాకాంతర మాకాంతర సాకాంత రమా విశేషు— విలసత్ = ఒప్పుచున్న, నాక = పాపరహితమగు, 'అకం పాపేచ దుఃఖే చ' అని విశ్వము, అంతర = హృదయమందలి, మాకాంతరస = విష్ణుభక్తిచేతను, ఆకాంత = ఒప్పునట్టి, రమా = సంపదయొక్క, కాదేని విష్ణుభక్తియొక్క మనోజ్ఞసంపదయొక్క, అధికమగు విష్ణుభక్తి యొక్క యనుట, 'శృంగారాదౌ విషే వీర్యే ద్రవే రాగే' అని యనుటచే రసశబ్దము రాగమందుఁ బ్రయోగింపఁబడినది. ఆరాగము భక్తిరూపమగునని భావము, విశేషున్ = అతిశయము గలవానిని; సజ్జనపోషున్ = విద్వత్పోషకుని; మల్లశౌరిని = మల్లరాయని; కాంచెన్ = కనెను. యమకాలంకారము.

సీ. తన కలావిభవంబు \neతన కలావిభవంబు,కరణి సుదృగ్జాతి \neవఱలఁ జేయఁ
దన దానమహిమంబు \neతన దానమహిమంబు,గతిని బ్రత్యర్థిసం\neఘములఁ బెంపఁ

దన సుమనోవృత్తి ।తన సుమనోవృత్తి,లీల సదాసవ।హేలఁ గూర్పఁ
దన మహామిత్రాళి ।తన మహామిత్రాళి,పగిది నానావనీ।భరణ మూనఁ

తే. దనరు విషమాద్రిజిహ్మగ।స్తబ్ధరోమ
మత్తమాతంగకఠినకూ।ర్మప్రసంగ
విరసవసుధావధూభోగ।పరవిహార
శాలిభుజకేళి మల్లభూ।పాలమౌళి. 29

టీక: తన కలావిభవంబు = తన విద్యలయొక్క వైభవము; తన కలావిభవంబు కరణిన్ = తన దేహకాంతులయొక్క విభవంబు భంగి; సుదృగ్జాతిన్ = విద్వత్సంఘమును, దేహకాంతిపర మైనపుడు స్త్రీసంఘమును ; వఱలఁ జేయన్ = ప్రకాశింపఁజేయు చుండఁగా;
తన దానమహిమంబు = తన త్యాగముయొక్క గొప్పఁదనము; తన దానమహిమంబు గతిని = తనయొక్క భేదనమహిమంబు వలె; ప్రత్యర్థిసంఘములన్ – ప్రత్యర్థి = ప్రతియాచకులయొక్క, వైరులయొక్క, సంఘములన్ = సమూహములను; పెంపన్ = పోషింపఁగా, సంహరింపఁగా;
తన సుమనోవృత్తి = తన మంచి మనోవృత్తి; తన సుమనోవృత్తి లీలన్ = తన పండితవృత్తికరణి; సదాసవహేలన్ – సత్ = సత్పురుషులయొక్క, ఆసవ = ప్రాణసంఘమునకు, అసువులు అనఁగాఁ బ్రాణములు, వాని సంఘము ఆసవ మనఁబడును, సమూహార్థమందు అణ్ప్రత్యయము, హేలన్ = విలాసమును; కూర్పన్ = ఘటిల్లఁ జేయఁగా;
తన మహామిత్రాళి = తనయొక్క అధికులైన మిత్రులగుంపు; తన మహామిత్రాళి పగిదిన్ – తన = తనయొక్క, మహత్ = అధికులైన, అమిత్ర = శత్రువులయొక్క, ఆళి పగిదిన్ = గుంపు రీతి; నానావనీభరణము – నానా = అనేకప్రకారమగు, అవనీ భరణము = భూభరణమును, శత్రుపరమైనపుడు, వనీ = అరణ్యములయొక్క భరణము, ఊనన్ = వహింపఁగా;
విషమాద్రి జిహ్మగ స్తబ్ధరోమ మత్తమాతంగ కఠినకూర్మ ప్రసంగ విరస వసుధావధూ భోగ పరవిహార శాలి భుజ కేళి – విష మాద్రి = అసహ్యములగు పర్వతములయొక్కయు, విషమసంఖ్య యనఁగా సప్తసంఖ్య గల కులాచలముల యొక్కయనుట, జిహ్మగ = కౌటిల్యము నందిన శేషునియొక్కయు, జిహ్మ యనునది భావప్రధాననిర్దేశము, వక్రస్వభావముగా నడచు శేషుని యొక్క యనుట, 'జిహ్మః కుటిల వక్రయోః' అని విశ్వము, స్తబ్ధరోమ =నిక్కిన వెండ్రుకలు గల అనఁగాఁ గురూపి యైన ఆది వరాహముయొక్కయు, వరాహమునకు రోమములు నిగుడుకొని యుండుట సహజ మని భావము, మత్తమాతంగ = మత్తు గొన్న నీచజాతివాండ్రయొక్కయు, మదించిన దిగ్గజములయొక్కయు, కఠినకూర్మ=కఠోరచిత్తుఁడగు నాదికూర్మముయొక్క యు, కూర్మమునకు దేహము కఠినముగా నుండును గాన కఠోరదేహుఁ డగు కూర్మమూర్తియొక్క యని భావము, ప్రసంగ = ప్రకృష్ట మగు సంబంధమందు, విరస = పరాఙ్ముఖి యగు, వసుధావధూ = భూకాంతయొక్క, భోగ = సుఖవిషయకమైన, పర విహార = ఉత్కృష్టక్రీడలచేత, శాలి = ఒప్పుచుండెడు, భుజ = బాహువులయొక్క, కేళి = విలాసముగల వాఁడగు, మల్లభూపాల మౌళి = మల్లభూపాలాగ్రణి, తనరున్ = ఒప్పును.

సాధారణధర్మము సుదృగ్జాతి వఱలఁజేయుట మొదలగునది. ‘శ్లో. సకలకలం పుర మేత జ్జాతం సమ్ప్రతి సుధాంశుబిమ్బ మివ’ అను స్థలమందుబలె నర్థకృతము గాక శ్లేషకృతమై శాబ్ద మైనది గాన, ఇందుఁ దనకలావిభవంబు తనకలావిభవంబుకరణి లోనగువానియం దుపమాలంకారము శబ్దాలంకారములోఁ జేర్పఁదగినది. ఇందుకుఁ బ్రమాణము కావ్యప్రకాశమునందు ‘శ్లో. స్ఫుట మర్థాలఙ్కారా వేతా వుపమా సముచ్చయౌ కింతు, ఆశ్రిత్య శబ్దమాత్రం సాధర్మ్య మిహాపి సమ్భవతః’ అని యున్నది. నానావనీభరణ మనుచోట శబ్దశ్లేషము. వసుధావధూవైరస్యమును గూర్చి సుదృగ్జాతిని వఱలఁజేయుట మొదలగు నవియుఁ గారణములు గాన పదార్థహేతుకకావ్యలింగాలంకారములును యథాసంఖ్యముగా సంభవించును. ‘సమర్థనీయ స్యార్థస్య కావ్యలిఙ్గం సమర్థనమ్’ అని తల్లక్షణంబు. విషమాద్రీత్యాదిస్థలములందు శ్లేషోత్థాపితవ్యతిరేకము. తనకలావిభవంబు తనకలా విభవంబు మొదలగు వాని యందు యమకాలంకారము వ్యక్తము.

మ. అరిచక్రిధ్వజఖండనప్రబలబా◊హాభూతి దుశ్శాసనా
తిరయోన్మూలనపాండితీమహిమచే ◊దీవ్యన్మహాభీమసం
గరకౌతూహలవృత్తి మించె లలనా◊కంజాతబాణుండు మ
ల్లరసేంద్రుండు నిజాసిశంబదళితే◊లాభృన్మహాపక్షుఁడై. 30

టీక: లలనాకంజాతబాణుండు = స్త్రీలకు మదనప్రాయుండగు; మల్లరసేంద్రుండు = మల్లభూపాలుండు, ఇంద్రుం డనుటచేత దేవేంద్రవిషయక మగు నర్థాంతరము దోఁచుచున్నది; నిజాసి శంబ దళి తేలాభృ న్మహాపక్షుఁడై – నిజ = స్వకీయమగు, అసి శంబ = వజ్రాయుధతుల్య మగు ఖడ్గముచేత, ఖడ్గమగు వజ్రాయుధముచేత నని ఇంద్రపర మైన యర్థము, దళిత=ఖండింపఁ బడిన, ఇలాభృత్ = రాజులయొక్క, పర్వతములయొక్క, మహాపక్షుఁడై = అధికమైనసైన్యముగలవాఁడై, పర్వతపరమై నపుడు గొప్పఱెక్కలు గలవాఁడై యని అర్థము, ‘పక్ష స్సహాయే గరుతి’ అని విశ్వము; అరి చక్రి ధ్వజ ఖండన ప్రబల బాహా భూతి దుశ్శాసనాతిరయోన్మూలన పాండితీ మహిమచేన్ – అరి = శత్రువులయొక్క, చక్రి = రథములయొక్కయు, ధ్వజ = ఱెక్కెములయొక్కయు, ఖండన = తునుముటయందు, ప్రబల = బలిష్ఠములగు, బాహా = భుజములయొక్క, భూతి = సంపద యొక్కయు, దుశ్శాసన = దుర్మార్గులయొక్క, అతిరయ = అధికవేగముయొక్క, ఉన్మూలనపాండితీ = నాశవిషయకమైన పాండిత్యముయొక్క, మహిమచేన్ = మహిమచేతను; దీవ్యన్మహాభీమ సంగర కౌతూహలవృత్తిన్ – దీవ్యత్ = ప్రకాశించు చున్న, మహాభీమ = మిక్కిలి భయంకరమగు, సంగర = యుద్ధమందు, కౌతూహలవృత్తిన్ = సంతోషవృత్తి చేతను; ఇట మహా భీమ యనుచోట భీమసేనవిషయార్థాంతర మగును గాన తత్పరమైనపుడు – అరి = శత్రువగు, చక్రిధ్వజ = సర్పధ్వజుఁడగు దుర్యోధనునియొక్క, ఖండన = తునుముటయందు, ప్రబల = ప్రబలమగు, బాహాభూతి = భుజసంపదయొక్కయు, దుశ్శా సన = దుశ్శాసనునియొక్క, అతిరయ = అధికవేగముయొక్క, ఉన్మూలనపాండితీ = నాశముసేయుటయందలి పాండి త్యముయొక్కయు, మహిమచేన్ = మహిమచేతను, దీవ్యత్ = ప్రకాశించుచున్న, మహత్ = అధికమైన, భీమ = భీమసేనుని యొక్క, సంగర = యుద్ధమువంటి యుద్ధమందు, కౌతూహల వృత్తిన్ = కౌతుకవృత్తి చేతను; మించెన్ = అతిశయించెను.

ఇందు భీమేంద్రాదిశబ్దశక్తి ప్రస్తుతార్థపరముగా సంయోగాదులచే నియంత్రితంబైనను వ్యంజనావృత్తిచేత నప్రస్తుతభీమసేన పాకశాసనాద్యర్థములు బోధితము లగుచుండుటచే ప్రకృతాప్రకృతార్థముల కౌపమ్యము ధ్వనితమగును గాన వ్యంగ్యోపమ

గాఁ దెలియవలయు. మతాంతరమున, ప్రకృతాప్రకృతగోచరశ్లేషాలంకారము నగును. అసిశంబ యనుచోట రూపకము. ‘శతకోటి స్స్వరు శ్శమ్బో దమ్భోళి రశని ర్ద్వయోః’ అని అమరము.

సీ. తా నెంతపుణ్యజ◊నీనుఁ డైనఁ దనధ,నంబు సూడ మహాఽవ◊రంబ కాదె
తా నెంతరా జైనఁ ◊ దన వసుస్పర్శనా,డంబరం బెంచ జ◊డంబ కాదె
తా నెంతవారికి◊దా పైనఁ దనజీవ,నంబు సంప్రాప్తపం◊కంబ కాదె
తా నెంతఘనవృత్తి ◊ దాల్చి మిన్నందిన, విపులమౌ తనయీాగి ◊విషమ కాదె
తే. యనుచు రారాజు రేరాజు ◊నబ్ధిరాజు
నంబుదంబును నిరసించు ◊ననఘదాన
మహిమ నాహిమగిరిసేతు◊మహితకీర్తి
పాళి సుగుణాళి మల్లభూ◊పాలమౌళి. 31

టీక: ఆహిమగిరిసేతుమహితకీర్తిపాళి – ఆహిమగిరిసేతు = ఆసేతుహిమాచలపర్యంతము, మహిత = ఒప్పుచున్న, కీర్తిపాళి = యశస్సమూహముగలవాఁడు; సుగుణాళి = శ్రేష్ఠమైన గుణముల సమూహముగలవాఁడు; మల్లభూపాలమౌళి = మల్లరాజ శ్రేష్ఠుఁడు; రారాజున్ = కుబేరుని; రేరాజున్ = చంద్రుని; అబ్ధిరాజున్ = క్షీరసముద్రమును; అంబుదంబును = మేఘమును; తా నెంతపుణ్యజనీనుఁ డైనన్ = తా నెంతపుణ్యాత్ములకు హితము చేయువాఁ డైనను, పుణ్యజను లనఁగా యక్షులు నగుదురు గనుక యక్షులకు హితముచేయువాఁడైనను అని యర్థాంతరము; తనధనంబు = తనయొక్క విత్తము; చూడన్=విచారింపఁగా; మహత్ = మిక్కిలి; అవరంబ = నికృష్టమైనదే, మహత్ = అధికమైన, వరంబ = వరమను నిధిరూపమైనదే, ‘వరశ్చ నిధయో నవ’ అని యమరము; కాదె = కదా!

తా నెంతరా జైనన్ = తా నెంత దొర యైనను; తన వసుస్పర్శనాడంబరంబు – తన వసు = తన ద్రవ్యముయొక్క, స్పర్శన = వితరణముయొక్క, ఆడంబరంబు = అతిశయము; జడంబ కాదె = జాడ్యసంపాదకమే కదా! చంద్రుని యొక్క వసువులు అనఁగా కిరణములయొక్కస్పర్శనాతిశయము జడం బనఁగా జలమయ మైనది, చల్లని దనుట. కార్యకారణములకు నభేదము నవలంబించి యిట్లు వ్యపదేశము సేయఁబడియె. ‘వసు ర్మయూఖాగ్ని ధరాధిపేషు యోక్త్రేలకే స్యా ద్వసు హాట కేపి వృద్ధ్యౌషధాశ్వీన ధనేషు రత్నే’ అని విశ్వప్రకాశిక. ‘స్పర్శనో మారుతే పుంసి దానేతు స్పర్శన మ్మతమ్’ అని విశ్వము.

తా నెంతవారికిన్ = తా నెంత దొడ్డవారలకు, ఎంత యుదకములకు; దా పైనన్ = ఆధారమైనను; తన జీవనంబు = తన బ్రతుకు, ఉదకము, ‘జీవనం భువనం వనమ్’ అని యమరము; సంప్రాప్తపంకంబ = సంప్రాప్తమగు పాపము కలది, బురద గలది, ‘పఙ్కం పాపే చ కర్దమే’ అని విశ్వము; కాదె = కదా!

తా నెంతఘనవృత్తిన్ = తాను ఎంత ఘనమైన వృత్తిని, ఎంత మేఘవృత్తిని; తాల్చి = వహించి; మిన్నందినన్ = అతిశయించి నను, ఆకాశ మందినను; విపులమౌ తనయీాగి = అధికమగు తన త్యాగము; విషమ కాదె = గరళమె, జలమె, ‘జీవనీయం కుశం విషమ్’ అని యమరము; కాదె = కదా!

అనుచున్ = ఇట్లనుచు; అనఘ దాన మహిమన్ = నిర్దోషమగు దానాతిశయము చేత; నిరసించున్ = నిరాకరించును.

ఇందు నాలుగుచరణములయందుఁ జెప్పిన యర్థము వరుసగా గీతియందున్న రారాజు,రేరాజు, అబ్ధిరాజు, అంబుదము వీనితో నన్వయించుటచే యథాసంఖ్యాలంకారము. ఉపమానభూత కుబేరాదిత్యాగములయందు దోషోద్భావనము చేసి యుపమేయమల్లనృపాలత్యాగమందు నిర్దోషత్వరూపవిశేషము చెప్పుటచే శ్లేషోత్థాపితవ్యతిరేకాలంకారము. యథాసంఖ్య మునకు, వ్యతిరేకమునకును బరస్పర నైరపేక్ష్యము వలన సంసృష్టి.

మ. అలమల్లక్షితిభృద్వతంసము సప॥క్షాభిఖ్యఁ జెన్నొంది రాఁ
జలముల్ మాని ప్రతీపవార్ధిరశనా॥జానీంద్రు లొక్కుమ్మడిం
గలితోద్యచ్ఛతకోటిసాధనబల॥ఖ్యాతుల్ దిగం ద్రోచి స్వ
స్థలసౌఖ్యంబులు గోర కందిరి వన॥స్థానస్థితిం జిత్రతన్. 32

టీక: అలమల్లక్షితిభృద్వతంసము = ఆమల్లభూపాలాగ్రణి, పర్వతశ్రేష్ఠము అని అర్థాంతరము తోఁచుచున్నది; సపక్షాభిఖ్యన్ = శత్రువను పేరి చేతను, పర్వతపరమైనపుడు ఱెక్కలు గలదను ప్రసిద్ధిచేతను, పక్షముతోఁ గూడినది సపక్షము, పక్ష మనఁగా విరోధమును, పత్త్రమును, 'పక్ష స్సహాయే గరుతి విరోధే బల మిత్రయోః' అని హలాయుధము; చెన్నొంది = ఒప్పి; రాన్ = రాఁగా; ప్రతీపవార్ధిరశనాజానీంద్రులు – ప్రతీప = శత్రువులగు, వార్ధిరశనాజానీంద్రులు = రాజశ్రేష్ఠులు, వార్ధిరశనాజాని యను చోట 'వార్ధిరశనా జాయా యేషాం తే' అని విగ్రహము చేసినపుడు 'జాయాయా నిజ్' అను సూత్రముచేత నిజాదేశము, ఇచట నింద్రులు అను పదముచేత దేవేంద్రరూపార్థాంతరము దోఁచుచున్నది; చలముల్ =మాత్సర్యములను; మాని = వదలి; ఒక్కుమ్మడిన్ = ఒక మొత్తముగా; కలితోద్యచ్ఛతకోటిసాధనబలఖ్యాతుల్ – కలిత = సంబంధించి యున్నట్టి, ఉద్యత్ = సన్నద్ధ మగుచున్న, శతకోటి = శతకోటిసంఖ్యాకమైన, ఇంద్రపరమైనపుడు వజ్ర మనెడు అని యర్థము, సాధన = యుద్ధసాధనములు గల, బల =సైన్యములు గలవారను, పరాక్రమము గలవారను అని ఇంద్రపరమైన యర్థము, ఖ్యాతుల్ = యశస్సులను; దిగం ద్రోచి = దిగువఁ బడవైచి; స్వస్థలసౌఖ్యంబులు = తమ యునిపట్టునందలి సౌఖ్యములను, స్వర్గస్థలసౌఖ్యముల నని ఇంద్రపర మైన యర్థము; కోరక = ఆశింపక; వనస్థానస్థితిన్ = వనస్థలనివాసమును; చిత్రతన్ = ఆశ్చర్యమగునట్లుగా; అందిరి = పొందిరి. సపక్షమైన యొక పర్వతము రాఁగా నింద్రులు వజ్రముఁ బడవైచి స్వర్గమును వదలి వనములకుఁ బోవుట చిత్రము. మల్ల భూపతి యుద్ధమునకు బయలుదేఱి రాఁగా శత్రురాజు లందఱుఁ దమ నివాసములం గల సర్వవిధసౌఖ్యములను, సమస్తపరి వారమును వదలి యడవుల పాలైరి యని భావము. దీని వలన వర్ణ్యుఁడు లోకోత్తరవీరుఁ డని వ్యంగ్యము. స్వస్థలసౌఖ్య మను చోట నింద్రపరమైనపుడు 'స్వర్' అను శబ్దములోని రేఫమునకు 'ఖరవసానయోర్విసర్జనీయః' అను సూత్రముచే రేఫమునకు విసర్గము వచ్చి, 'ఖర్పరే శరి వా విసర్గలోపో వక్తవ్యః' అను వార్తికముచే విసర్గమునకు లోపము వచ్చినదని యెఱుంగునది.

క. ఆ మల్లనృపతి చెన్నాం,బామానినియందుఁ గాంచె ॥మల్లక్షితిపున్
వ్యోమగవీసోమగవీ, రామగవీశాచ్ఛకీర్తి॥రాజన్మూర్తిన్. 33

టీక: ఆ మల్లనృపతి = ఆ మల్లనృపాలుఁడు; చెన్నాంబామానినియందున్ = చెన్నాంబికయందు; వ్యోమగవీ సోమగవీ రామ గవీశాచ్ఛకీర్తిన్ – వ్యోమగవీ = కామధేనువువలె, సోమగవీ = చంద్రకిరణమువలె, రామ = బలరామునివలె, గో = వజ్రాయు

ధమువలె నని కాని సరస్వతివలె నని కాని, ఈశ = శివునివలె, అచ్ఛ = స్వచ్ఛమగు, కీర్తిన్ = యశస్సు గలవాఁడును; రాజ న్మూర్తిన్ = ప్రకాశించుచున్న శరీరము గలవాఁడును, అగు, మల్లక్షితిపున్ = మల్లభూపాలుని; కాంచెన్ = కనెను; వ్యోమగవీసోమగవీ యను చోటుల గోశబ్దము మీఁద సమాసాంతటచ్ప్రత్యయము వచ్చి జీప్ప్రత్యయము రాఁగా గవీ యను రూపము సిద్ధించినది. గవీశ యను చోట ' గౌశ్చ ఈశశ్చ' యను ద్వంద్వసమాసమందు అవాదేశము వచ్చి గవీశ యని రూప మైనది.

సీ. తన యశశ్ఛద్మజీవనజాతమునకుఁ దో,యదపథంబు మధుప్రియంబు గాఁగఁ
దన కలాదంభనర్తకికి వేలాగోత్ర,పరివృతాచల చారుఖురళి గాఁగఁ
దన ప్రతాపవ్యాజదావవహ్నికిఁ దార,కాసంతతుల్ స్ఫులింగములు గాఁగఁ
దన ధర్మకైతవధారాళవల్లికిఁ, గాంచనాచల ముపఘ్నంబు గాఁగఁ
తే. దన మహోదారతోపధివనదతతికిఁ, గాండరుహజాండకోటు లఖండకరక
కాండములు గాఁగ బింకోలుగండబిరుద,కాంతుఁ డిల నేలె మల్లభూకాంతుఁ డెలమి. 34

టీక: తన యశశ్ఛద్మజీవనజాతమునకున్ – తన = తనయొక్క, యశః = కీర్తి యనెడు, ఛద్మ= నెపముగల, జీవనజాతమున కున్=పుండరీకమునకు, 'జీవనం భువనం వనమ్' అని అమరము; తోయదపథంబు – తోయద=మేఘములయొక్క, పథంబు = మార్గమగు నాకాశము; మధుప్రియంబు = తుమ్మెద; కాగన్ = అగుచుండఁగా;

తన కలాదంభనర్తకికిన్ – తన = తనయొక్క, కలా = విద్య యనెడు, దంభ= వ్యాజముగల, నర్తకికిన్ = నటికి; వేలాగోత్రపరి వృతాచల – వేలాగోత్ర = లోకాలోకపర్వతముచేత, పరివృత = పరివేష్టింపఁబడిన, అచల = భూమి; చారుఖురళి కాఁగన్ = మనోహరమగు గరిడి యగుచుండఁగా;

తన ప్రతాపవ్యాజదావవహ్నికిన్ – తన = తనయొక్క; ప్రతాప = ప్రతాప మనెడు; వ్యాజ = కపటము గల; దావవహ్నికిన్ = దావానలనముకు; తారకాసంతతుల్ = నక్షత్రసమూహములు; స్ఫులింగములు = మిడుఁగురులు; కాగన్ = అగుచుండఁగా;

తన ధర్మకైతవధారాళవల్లికిన్ – తన = తనయొక్క; ధర్మ= ధర్మ మనెడు; కైతవ = దంభము గల; ధారాళ = రూఢమైన; వల్లికిన్ =లతకు; కాంచనాచలము = మేరుపర్వతము; ఉపఘ్నంబు= అంతికాశ్రయము, అనఁగా తీఁగ వాఱుటకు సమీపమునఁ బాఁతిన కొయ్యవంటిది, 'స్యాదుపఘ్నోన్తికాశ్రయే' అని అమరము; కాఁగన్ = అగుచుండఁగా;

తన మహోదారతోపధివనదతతికిన్ – తన = తనయొక్క; మహోదారతా = ఉత్కృష్టదాతృత్వ మనెడు; ఉపధి=నెపము గల; వనదతతికిన్ = మేఘసంఘమునకు; కాండరుహజాండకోటులు – కాండరుహ = కమలమందు, 'కాండో స్త్రీ దణ్డ బా ణార్వ వర్గావసర వారిషు' అని యమరము, జ= పుట్టిన, బ్రహ్మదేవుని సంబంధు లైన, అండకోటులు = బ్రహ్మాండకోటు లనుట; అఖండకరకకాండములు కాఁగన్ = అఖండములగు వర్షోపలము లగుచుండఁగా, 'వర్షోపలస్తు కరకా' అని యమరము; బింకోలుగండబిరుదకాంతుఁడు = బింకోలుగండ యను బిరుదముచేత మనోహరుఁడు; మల్లభూకాంతుఁడు = మల్లభూపతి; ఇలన్ = భూమిని; ఎలమిన్ = సంతోషముతో; ఏలెన్ = పాలించెను.

మల్లభూపతి కీర్తి బ్రహ్మాండము నావరించినదనియు, విద్యావిభవము లోకాలోకపర్వతమునకు లోనగు సప్తద్వీపములు వ్యాపించిన దనియు, ప్రతాపాగ్ని మిన్నంది మించుచున్న దనియు, ధర్మము మేరుపర్వతము దాఁక వ్యాపించిన దనియు, త్యాగము బ్రహ్మాండకోటుల నతిక్రమించి ప్రసరించిన దనియు భావము.

ఇం దత్యుక్త్యలంకారము. 'శ్లో.అత్యుక్తి రద్భుతాతథ్య శౌర్యౌదార్యాది వర్ణనమ్' అని తల్లక్షణము. తోయదపథ వేలాగోత్ర పరివృతాచలా తారకాసంతతి కాంచనాచల బ్రహ్మాండములను మధుప్రియత్వ ఖురశిత్వ స్ఫులింగ త్వోపఘ్నత్వ కరకత్వ రూపముగ రూపించుటచే రూపకాలంకారము. యశశ్ఛద్మ కలాదంభ ప్రతాపవ్యాజ ధర్మకైతవ మహోదారతోపధి యను స్థలములయందుఁ గైతవార్థకపదములచే యశఃప్రభృతుల నిహ్నవవ్యక్తి యగుటంజేసి కైతవాపహ్నుత్యలంకారము. 'కైతవాపహ్నుతి ర్వ్యక్తౌ వ్యాజాద్యై ర్నిహ్నుతేః పదైః' అని లక్షణము.

మ. అరు దై మల్లధరాధినాయక సము◊ద్యద్భూరిధారాధరం
బరిరాడాశుగభేదశక్తిఁ బటు మి◊త్రాలోకమోదప్రదో
త్తరలీలావిభవాప్తి శత్రువనితా◊తాపాస్పదస్ఫూర్తిచే
ధరఁ దార్చుం బరవాహినీవితతి కు◊ద్భ్రాజత్కబంధాఢ్యతన్. 35

టీక: ఇచట మల్లభూపతిఖడ్గమును వర్ణింపఁగా మేఘపరమైన యర్థాంతరము దోఁచుచున్నది.
మల్లధరాధినాయక సముద్యద్భూరి ధారాధరంబు – మల్లధరాధినాయక = మల్లభూపాలునియొక్క, సముద్యత్ = పైకి లేచిన, భూరి = సువర్ణమయ మగు, 'భూరి ప్రాజ్య సువర్ణయోః' అని విశ్వము, ధారాధరంబు = ఖడ్గము, మేఘ మని యర్థాంతరము, 'ధారాధర స్తోయధరే కృపాణే' అని విశ్వము; అరిరాడాశుగభేదశక్తిన్ – అరిరాట్ = శత్రురాజులయొక్క, ఆశుగ = బాణముల యొక్క, శత్రుశ్రేష్ఠ మైన వాయువుయొక్క, ఇచట వాయువు మేఘమునకు శత్రు వనుట ' శ్లో. ఉల్లాస్య కాలకరవాల మహామ్బువాహం దేవేన యేన జరఠోర్జితగర్జితేన। నిర్వాపిత స్సకల ఏవ రణే రిపూణాం ధారాజలైస్త్రిజగతి జ్వలితప్రతాపః' అను దానిలోఁ బర్జన్యుఁడు దావానలమునకు శత్రువను ప్రమాణము కావ్యదర్పణమునందు వ్రాసిన రీతిగఁ దెలియునది, భేద = భంగపఱచుట యందు, శక్తిన్ = సామర్థ్యముచేతను; పటు మిత్రాలోక మోదప్రదోత్తర లీలావిభవాప్తిన్ – పటు = సమర్థమగు, మిత్రాలోక = మిత్రులయొక్క చూపులకు, సూర్యతేజస్సునకు, మోదప్రద = సంతోషకరమగు, ఉత్తర = లోకోత్తరమైన, లీలావిభవ = విలాసాతిశయముయొక్క, ఆప్తిన్ = ప్రాప్తిచేత; శత్రువనితాతాపాస్పదస్ఫూర్తిచేన్ – శత్రువనితా = శత్రుస్త్రీలయొక్క, తాప= సంతాపమునకు, వేఁడిమికి, ఆస్పద=ఆధారమగు, స్ఫూర్తిచేన్=ప్రకాశముచేతను; అరు దై=ఆశ్చర్యకర మై; ధరన్ = భూమియందు; పరవాహినీ వితతికిన్ – పరవాహినీ = శత్రుసైన్యములయొక్క, గొప్పనదులయొక్క, వితతికిన్ = గుంపునకు; ఉద్భ్రాజత్కబంధాఢ్యతన్ – ఉద్భ్రాజత్ = మిక్కిలి ప్రకాశించుచున్న, కబంధ = మొండెములయొక్క, ఉదకముయొక్క, ఆఢ్యతన్ = పూర్ణతను; తార్చున్ = కలిగించును.

మేఘమునకు స్వభావముగ వాయువుచేతఁ గొట్టఁబడుటయు, సూర్యతేజస్సున కప్రకాశకంబుగ నుండుటయుఁ దాపశాంతిఁ జేయుటయుఁ గలిగి యుండఁగా దానికి విపరీతముగ నాశుగభేదనము, మిత్రాలోకమోదప్రదత్వము, తాపకరణము, నాశ్చర్యకర మని యాశయము.

మల్లభూపతి ఖడ్గముచేత శత్రుల బాణపరంపరల నడఁచి వారిని సేనలతోఁ గూడ బీనుఁగుఁబెంటలు గావించి వారి వనితలకు సంతాపమును గూర్చి మిత్రులకు నేత్రోత్సవము గావించె నని భావము. ఇట ఖడ్గమునందు వారిదసామ్యము వ్యజ్యమానమగును. కావున వ్యంగ్యోపమ.

సీ. రాజచంద్రులు గాని ◊రాజచంద్రులు గారు, తర మూన్ప నరిదాన◊దానపటిమ,
నచలేశ్వరులు గాని ◊యచలేశ్వరులు గారు, సరిసేయ ధృతిసంగ◊సంగరముల,
నినకుమారులు గాని ◊యినకుమారులు గారు, కదియింప రుచికాండ◊కాండకలన,
గోపాత్మజులు గాని ◊గోపాత్మజులు గారు, పాటి వాగనుభావ◊భావగరిమ,
తే. ననుచు జగ మెన్నఁ బొగడొందు ◊హారిమండ
లాగ్రఖండితరిపుమండ◊లప్రవీర
కాండనిర్భిన్నమార్తాండ◊మండలాంత
రుండు పెదమల్లనాయకా◊ఖండలుండు. 36

టీక: హారి మండలాగ్ర ఖండిత రిపుమండలప్రవీరకాండ నిర్భిన్న మార్తాండమండలాంతరుండు – హారి = మనోహర మగు, మండలాగ్ర = ఖడ్గముచేత, ఖండిత = నఱకఁబడిన, రిపుమండలప్రవీరకాండ = శత్రువీరుల గుంపుచేత, నిర్భిన్న = భేదింపఁబడిన, మార్తాండమండలాంతరుండు = సూర్యమండలమధ్యభాగము గల వాఁడగు, 'శ్లో. ద్వా విమౌ పురుషౌ లోకే సూర్యమండలభేదినౌ, పరివ్రాడ్యోగయుక్తశ్చ రణే చాభిముఖో హతః' అని మనువు; పెదమల్లనాయకాఖండలుండు = పెదమల్లభూపాలేంద్రుఁడు; జగము = లోకము; అరిదానపటిమన్ – అరిదాన = పగతుర తురుముటయొక్క, దాన= త్యాగముయొక్క, పటిమన్ = సమర్థతయందు; తర మూన్పన్ = సాటి చేయుటకు; రాజచంద్రులు గాని = ఇంద్రుఁడు, చంద్రుఁడు గాని, రాజచంద్రులు గారు = నృపశ్రేష్ఠులు గారు, 'రాజా ప్రభౌ నృపే చన్ద్రే యక్షే క్షత్త్రియ శక్రయోః' అని విశ్వము; ఇట నరిఖండనమందు నింద్రుఁడు, వితరణమందుఁ జంద్రుఁడు సము లగుదురని క్రమాన్వయము. నాలుగు పాదములం దిట్లే చూడవలెను.
ధృతిసంగసంగరములన్ = ధైర్యసంగమునందును, యుద్ధములందును; సరిసేయన్ = పోల్చుటకు; అచలేశ్వరులు గాని = మేరుపర్వతము, రుద్రుండు గాని; అచలేశ్వరులు = భూమిపతులు; కారు = సరిగారు; రుచికాండకాండకలనన్ – రుచికాండ = కాంతిపరంపరలయొక్క, కాండ = బాణములయొక్క, కలనన్ = కూడికయందు; కదియింపన్ = పోల్చుటకు; ఇనకుమారులు గాని = సూర్య స్కందులు గాని; ఇనకుమారులు గారు = రాజపుత్రులు గారు, 'ఇన స్సూర్యే ప్రభౌ' అని యమరము; వాగనుభావభావగరిమన్ – వాగనుభావ = వాక్సామర్థ్యముయొక్క, భావ =విలాసముయొక్క, గరిమన్=అతిశయమునందు; పాటి = సమానులు; గోపాత్మజులు గాని = గీష్పతి మదనులు గాని; గోపాత్మజులు గారు = భూపాలకుమారులు గారు; అనుచున్ = ఇట్లనుచు; ఎన్నన్ = గణింపఁగా; పొగడొందున్ = ఘనత కెక్కును;

ఇందు యథాసంఖ్య మలంకారము. దానదాన, సంగసంగ, లోనగువానియందు ఛేకానుప్రాసము. మండలాగ్రఖండితే త్యాదియందు బిందుపూర్వక డకారము పలు మాఱుఁ గూర్చుటచేత 'ఏకస్యాప్యసకృత్పరః' అను లక్షణముచే వృత్త్యనుప్రాసము. రాజచంద్రులు మొదలగునవి రెండు మాఱులు వచ్చుటచేత యమకము.

ఉ. పూనిక బాలచాపలముఁ బొందు నిభప్రకరంబు, గుడ్లలోఁ
గూన బిలేశయాధిపుఁడు, గూర్మము సూడ శిరంబు నిల్ప లే,
దానగపాళియున్ నడవనైనను నేర దటంచు మేదినీ
మానిని సేరె నౌర పెదమల్లమహీను నహీనయౌవనున్. 37

టీక: ఇభప్రకరంబు = దిగ్గజసమూహము; పూనికన్ = ప్రయత్నముచేత; బాలచాపలమున్ – బాల = బాలునియొక్క, తోఁక యొక్క యని భావము, 'శసయోర్వబయోస్తథా' అనుటచేత నిట బకార,వకార ముల కభేద మవలంబింపఁబడినది, చాపలము = చాంచల్యమును, పొందున్ =పొందును ; బిలేశయాధిపుఁడు = ఆదిశేషుఁడు, గుడ్లలోఁ గూన = మిక్కిలి పసివాఁడనుట, సర్పము లండజములు గాన గుడ్లలోఁగూన శేషుం డని భావము; కూర్మము = ఆదికూర్మము; చూడన్ = పరికింపఁగా; శిరంబు నిల్ప లేదు = మెడలు నిలుపఁ జాల నంతటి బాల్యము గల దనుట, కూర్మము స్వభావముగా శిరంబు నిల్పకుండుట ప్రసిద్ధము; ఆనగపాళియున్ = ఆకులాచలసమూహమును; నడవనైనను నేరదు - నడచుటకు నేరనంత బాల్యము గలది, పర్వతములు నడవకుండుట స్వభావము; అటంచున్ = అట్లనుచు; అహీనయౌవనున్ = పూర్ణయౌవనము గలయట్టి; పెదమల్లమహీను =పెదమల్లభూపాలుని; మేదినీమానిని = భూరమణి; చేరెన్ = పొందెను; ఔర! పెదమల్లభూపాలుం డెల్ల ధరణి నేలె నని భావము. ఇచట నుపమేయాధిక్యపర్యవసాయి యగు శ్లేషోత్థాపితవ్యతిరేకాలంకారము.

శా. ఆమల్లక్షితినాథరత్నకరదీవ్యన్మండలాగ్రాంశుమ
ద్ధామస్థేమ రణాగ్రసీమ నరిగోత్రశ్రేణులం దూల్చు ను
ద్దామప్రౌఢిమఁ గేతువుం దునుము నుద్యత్పుండరీకంబులన్
భూమిన్ వ్రాల్చు సురాళి గన్గొనఁ బురాభూతేతరప్రక్రియన్. 38

టీక: ఆ మల్లక్షితినాథరత్నకర దీవ్య న్మండలా గ్రాంశుమద్ధామ స్థేమ– ఆ మల్లక్షితినాథరత్న = ఆ మల్లభూపాలుఁ డను రాజరత్నముయొక్క, కర = హస్తమందు, దీవ్యత్ = ప్రకాశించుచున్న, మండలాగ్ర = ఖడ్గమనెడు, అంశుమద్ధామ = సూర్యతేజము యొక్క, స్థేమ = స్థిరాంశము; రణాగ్రసీమన్ = యుద్ధాగ్రభాగమునందు; సురాళి కన్గొనన్ = దేవసంఘము చూచుచుండఁగా; పురా భూతేతర ప్రక్రియన్ – పురా = పూర్వమందు, భూతేతర = పుట్టనట్టి, ప్రక్రియన్ = వ్యాపారముచేతను, మునుపు తనకు లేని నడవడిచేత ననుట; అరిగోత్రశ్రేణులన్ – అరి =చక్రవాకములయొక్క, గోత్ర=కులములయొక్క, శ్రేణులన్=సంఘములను, శత్రువంశసంఘములనని యర్థాంతరము; తూల్చున్ = తొలఁగించును; ఉద్దామప్రౌఢిమన్ = ఉత్కృష్టమైన నేర్పుచేతను; కేతువున్ = కేతుగ్రహమును,ధ్వజమును; తునుమున్ = ఖండించును; ఉద్యత్పుండరీకంబులన్ = ప్రకాశించుచున్న తెల్లదామరలను, గొడుగులను; భూమిన్= భూమియందు; వ్రాల్చున్= పడవైచును.

సూర్యతేజస్సునకు జక్కవలగుంపులు దూల్చుట, తెల్లదామరలను వ్రాల్చుట, స్వభావవిరుద్ధము గాన నపూర్వవ్యాపారముగా వర్ణితం బయ్యె నని భావింపవలయును. మల్లభూపాలుఁడు ఖడ్గముచే శత్రుసంఘమును దూల్చి వారి పతాకలను, శ్వేతచ్ఛత్రములను భూమికి వ్రాల్చి జయము గాంచె నని భావము. ఇందు శ్లిష్టశబ్దనిబంధనకేవలపరంపరితరూపకాలంకారము.

తే. ఆ ధరాధిపుసతులు లిం◊గాంబ, కొమ్మ
మాంబికయు, నలచిన్న లిం◊గాంబ, వేంక
టాంబ, మల్లాంబ నా మించి ◊రాత్మనాథ
సేవనాయత్తచిత్తతా◊స్థేమ, నందు. 39

టీక: ఆ ధరాధిపుసతులు = ఆ మల్లభూపాలుని భార్యలు; లింగాంబ, కొమ్మమాంబికయు, చిన్నలింగాంబ, వేంకటాంబ, మల్లాంబ, నాన్ = అనఁగ, ఆత్మనాథసేవనాయత్తచిత్తాస్థేమన్ – ఆత్మనాథ =తమ ప్రియునియొక్క, సేవనాయత్త = సేవాపరతంత్రమగు, చిత్తతా = చిత్తము గలుగుటయొక్క, స్థేమన్ = స్థితిచేత, మించిరి = అతిశయించిరి; అందున్ = వారలయందు. దీనికిఁ బాశ్చాత్యజడరాశి యను నగ్రిమపద్యముతో నన్వయము.

సీ. పాశ్చాత్యజడరాశిఁ ◊బ్రాపించి నర్మద, యగుచు వర్తిలు రేవ ◊నతకరించి,
రాగభూయిష్ఠాత్మ ◊రహి సర్వతోముఖ, వర్తన గల సర◊స్వతిని గేరి,
బహుళపంకోదిత◊పద్మోదయంబున, మలిన యై తగు నర్య◊మసుత నాడి,
నీచోపసర్పణ◊నియతభంగావాప్తి, వెలవెల నౌ జాహ్న◊విని హసించి,
తే. సాధుభాషానుగతిఁ జారు◊చరితయుక్తి, నిత్యనిర్మలచిత్తత ◊నిరుపమాన
కాంతిసంక్రాంతి నుప్పొంగుఁ ◊గవిజనాంత, రంగరంగద్గుణాలంబ ◊లింగమాంబ. 40

టీక: కవిజనాంతరంగ రంగద్గుణాలంబ – కవిజనాంతరంగ = కవిహృదయములయందు, రంగత్ = నాట్యము చేయుచున్న, గుణ = సౌశీల్యాదిగుణములు, ఆలంబ = ఆలంబముగాఁ గల; లింగమాంబ = లింగాంబిక;
పాశ్చాత్యజడరాశిన్ – పాశ్చాత్య = పశ్చిమదేశమునందుఁ బుట్టిన, 'దక్షిణా పశ్చా త్పురస స్త్యప్' అని పశ్చాచ్ఛబ్దముమీఁద భవార్థమున త్యప్ప్రత్యయము, జడరాశిన్ = మూర్ఖసమూహమును, అనఁగా వేదబాహ్యు లగుటచే జడులని చెప్పఁబడు హీనజాతులను; ప్రాపించి = పొంది; నర్మద యగుచున్ = నర్మోక్తుల నిచ్చునది యగుచు; వర్తిలు రేవన్ = వర్తించుచున్న రేవా నదిని, డకారలకారముల కభేదము గనుక పశ్చిమ దేశమునందున్న జలరాశి ననఁగా సముద్రమును ప్రాపించినర్మద యను నామము గలదై వర్తిల్లునట్టి రేవా నది యని భావము ; అతకరించి = తక్కువగాఁ జేసి;
రాగభూయిష్ఠాత్మన్ = అనురాగముచేత భూయిష్ఠ మగు మనస్సుచేత; రహిన్ = ఆసక్తితో; సర్వతోముఖవర్తన = నానా ప్రకారమగు వృత్తి; కల సరస్వతిని = కలిగినట్టి సరస్వతీనదిని, రక్తగుణము చేత భూయిష్ఠమగు ఆత్మ యనఁగా దేహము గలిగి సర్వతోముఖవర్తన మనఁగా జలరూపముగా నున్కి గలిగినట్టి సరస్వతీ నది నని భావము, సరస్వతీనదీజలము రక్త మగుట ప్రసిద్ధము; కేరి = పరిహసించి;

బహులపంకోదితపద్మోదయంబునన్ – బహుల = అధికమగు, పంక = పాపమువలన, ఉదిత = కలిగినట్టి, పద్మా = సంపద యొక్క, ఉదయంబునన్ = అభివృద్ధిచేత; మలిన మై తగు అర్యమసుతన్ = పాపిష్ఠ యగు యమునను, బహలమగు పంక మనఁగా బురద,అందుజన్మించిన పద్మములయొక్క యుదయమున నొప్పి, మలిన యనఁగా నల్లని స్వరూపము గలదై తగు నర్యమసుత నని భావము; ఆడి = నిందించి;

నీచోపసర్పణనియతభంగావాప్తిన్ – నీచోపసర్పణ = క్షుద్రులననువర్తించుటచేత, నియత = నియత మగు, భంగ = మర్యాదాదినాశముయొక్క, అవాప్తిన్ = పొందుటచేత; వెలవెల నౌ = చిన్నపోయిన; జాహ్నవిని = గంగను; హసించి = పరిహాసము చేసి; నిమ్నప్రదేశోన్ముఖి యై నియతము లగు తరఁగలయొక్క ప్రాప్తిచేత మిగులఁదెల్లనౌ జాహ్నవిని హసించి యని భావము. గీతియందు వ్యతిరేకవిశేషణములకుఁ గ్రమము.

సాధుభాషానుగతిన్ – సాధుభాష = వేదవిద్య గలవారియొక్క, అనుగతిన్ = అనుసరణముచేతను; చారుచరితయుక్తిన్ = సచ్చరిత్రల యోగముచేతను; నిత్యనిర్మలచిత్తతన్ = నిరంతరము నిర్మల మగు చిత్తము గలిగి యుండుటచేతను; నిరుపమాన కాంతిసంక్రాంతిన్ = అసమాన మగు కాంతితోఁ గూడి యుండుటచేతను; ఉప్పొంగున్ = అతిశయించును.

లింగమాంబ గంగా యమునా సరస్వతీ నర్మదా నదులతోఁ దుల్యమగు నిర్మలస్వభావము గలదని తాత్పర్యము. శ్లేషోత్థాపితవ్యతిరేకాలంకారము.

సీ. ఆ లింగమాంబిక॥యం దరాతిబలప్ర,భేదనచణు మల్ల॥భిదురపాణిఁ,
దారకాత్మ భయప్ర॥దప్రభావిస్ఫూర్తి, నతిశక్తియుతు వేంక॥టాద్రిగుహునిఁ,
జినలింగమాంబయం॥దు నవీనపంకజా॥తార్దను లింగనృ॥పాబ్జవైరి,
వేంకటాంబికయందు ॥విపులవనీపాల,నక్షముఁ జినలింగ॥నరపసురభి,
తే. బహుళశార్వరపాటన॥పటువిహారి, నంతరస్థాపితాబ్జనే॥త్రాంచితాను
భావుఁ జినమల్లభూపాల॥పద్మహితుని, గాంచెఁ బెదమల్లమేదినీ॥కాంతుఁ డెలమి. 41

టీక: పెదమల్లమేదినీకాంతుఁడు = పెదమల్లభూపాలుఁడు; ఆ లింగమాంబికయందు = ఆ లింగాంబికయందు; అరాతిబల ప్రభేదనచణున్ – అరాతి = శత్రువగు, బల = బలాసురునియొక్క, ప్రభేదనచణున్ = భేదించుటచేత ప్రఖ్యాతుని; అరాతి =శత్రువులయొక్క, బల =సైన్యముయొక్క, ప్రభేదనచణున్ = భేదించుటచేతఁ బ్రఖ్యాతుఁడైన; మల్లభిదురపాణిన్ = మల్ల భూపాలుం డనెడు నింద్రుని;

తారకాత్మభయప్రదప్రభావిస్ఫూర్తిన్ – తారకాసురుని మదికి భయప్రదమగు తేజోతిశయము గల వానిని; తారకా = నక్షత్ర ములయొక్క, ఆత్మ = స్వరూపములకు, భయప్రదప్రభావిస్ఫూర్తిన్ = భయప్రదమగు కాంత్యతిశయము గలవాని; అతిశక్తి యుతున్ = అధికమగు శక్తి యను నాయుధముతోఁగూడినవాని (కుమారస్వామిని), అతిసామర్థ్యయుక్తుఁడైన వానిని; వేంక టాద్రిగుహునిన్ = వేంకటాద్రినాయకుఁ డను స్కందుని;

చినలింగమాంబయందున్ = చినలింగాంబికయందు; నవీనపంకజాతార్దనున్ – నవీన = నూతనమగు, పంకజాత = పద్మము లను, అర్దనున్ = పీడించువానిని, నూతన మగు పాపసంఘనాశకుని ననుట; లింగనృపాబ్జవైరిన్ = లింగరాజనెడు చంద్రుని,

వేంకటాంబికయందున్ = వేంకటాంబయందు; విపులవనీపాలనక్షమున్ – విపుల = అధికములగు, వనీ = వనములయొక్క, పాలన = రక్షణమందు, క్షమున్ = సమర్థుని; విపుల = విపులమగు, వనీప = యాచకులయొక్క, ఆలన = అలంకరణ మందు, క్షమున్ = సమర్థుని; చినలింగనరపసురభి = చినలింగభూపాలుఁ డను వసంతుని,

బహుళశార్వరపాటనపటువిహారిన్ – బహుళ = అధికమగు, శార్వర = అంధకారముయొక్క, పాటన = భేదించుటయందు, దుర్మార్గులయొక్క భేదనమందు, 'శార్వరం త్వన్ధతమసే శార్వరో ఘాతుకే స్మృతః' అని విశ్వము; పటువిహారిన్ = లెస్సగాఁ గ్రీడించువాని;

అంతరస్థాపితాబ్జనేత్రాంచితానుభావున్ – అంతరస్థాపిత = హృదయనిహిత మగు, అబ్జనేత్ర = విష్ణువుయొక్క, అంచిత = ఒప్పునట్టి, అనుభావున్ = ప్రభావము గలవానిని, పక్షద్వయమం దిదె యర్థము; చినమల్లభూపాలపద్మహితుని = చినమల్ల భూపాలుఁడను సూర్యుని; కాంచెన్ = కనెను.

ఈ పద్యమందు శ్లిష్టశబ్దనిబంధనకేవలపరంపరితరూపకాలంకారము లైదు. వానికిఁ బరస్పర నిరపేక్షతను బట్టి సంసృష్టి.

ఉ. అందును వేంకటాద్రివిభుఁ డచ్యుతసాయకనాయకాగ్రిమ
స్పందనిపాతితారిపురసంతతియై, కమలాధిపాంచితా
మందమహాశయాంకుఁ డయి, మాన్యగణావనలోలచిత్తసం
బంధపరీతుఁడై, జగతి భాసిలె నౌర బుధుల్ నుతింపఁగన్. 42

టీక: అందును =ఆ పుత్రులలో; వేంకటాద్రివిభుఁడు =వెంకటాద్రిరాజు, వేంకటాద్రిశివుఁడు,ఇచట 'విభు శ్శివే ప్రభౌ నిత్యే' అను విశ్వనిఘంటువువలన శివరూపార్థము గూడ స్ఫురించుచున్నది;అచ్యుత సాయకనాయ కాగ్రిమస్పంద నిపాతితారిపుర సంతతి యై– అచ్యుత= చెడనట్టి విష్ణుమూర్తి యనెడు, సాయకనాయక = బాణశ్రేష్ఠముయొక్క, అగ్రిమస్పంద = ప్రథమ చలనముచేత, నిపాతిత =నశింపఁజేయఁబడిన,అరిపుర = శత్రుశరీరములయొక్క, శత్రుపురులయొక్క,త్రిపురములయొక్క యనుట, సంతతి యై = వంశము గలవాఁడై, పరంపర గలవాఁడై ; కమలాధి పాంచి తామంద మహాశయాంకుఁడయి– కమలాధిప =విష్ణువుచేత, మృగశ్రేష్ఠముచేతను, అంచిత = ఒప్పెడు, అమంద = అధికమగు, మహాశయ= దొడ్డ హృదయము యొక్క, మహత్ = పూజ్యమగు, శయ =హస్తముయొక్క, 'పఞ్చశాఖ శ్శయఃపాణిః' అని అమరము, అంకుఁడయి = చిహ్నము గలవాఁడై; మాన్యగ ణావన లోల చిత్త సంబంధ పరీతుఁడై– మాన్యగణ=ప్రాజ్ఞసంఘముయొక్క, పూజ్యులగు ప్రమథులయొక్క, అవన = రక్షణమందు, లోల = ఆసక్తమైన, చిత్త = చిత్తముయొక్క, సంబంధ = సంబంధముచేత, పరీతుఁడై = వ్యాప్తుఁడై, అట్టి చిత్తము గలవాఁడై యనుట; జగతిన్ =లోకమందు; బుధుల్ నుతింపఁగన్ = పండితులు, దేవతలు స్తుతి చేయఁగా; భాసిలెన్= ప్రకాశించెను; ఔర=ఆశ్చర్యము.

అనఁగా రుద్రుండేరీతిఁ ద్రిపురముల నచ్యుతుఁ డను సాయకాగ్రిమస్పందముచే నాశముఁ జేసి జగములయందు భాసిల్లెనో యారీతి వేంకటాద్రివిభుఁడును సాయకములచే శత్రుశరీరములను దునిమి జగతిని భాసిల్లె నని భావము. ఉపమాలంకారధ్వని.

సీ. పటుపుండరీకసం॥కటగృహశ్రేణికల్, పటుపుండరీకసం॥కటము లయ్యెఁ,
బృథులాచ్ఛభల్లవి॥స్తృతచత్వరమ్ములు, పృథులాచ్ఛభల్లవి॥స్తృతము లయ్యె,
వితతసాలకదంబ॥వృతలసద్వేశ్మముల్, వితతసాలకదంబ॥వృతము లయ్యె,
ఘనచక్రిఖడ్గిసం॥గతరాజవీథులు, ఘనచక్రిఖడ్గిసం॥గతము లయ్యె,
తే. వేంకటాద్రిక్షమానేతృ॥విపులబాహు,దండకోదండనీరదా॥ఖండచండ
శరపరంపరఁ బరహంస॥సముదయంబు, వెఱచి చనునెడఁ దత్పుర॥వితతినెల్ల. 43

టీక: పరహంససముదయంబు – పరహంస = శత్రుశ్రేష్ఠులయొక్క, శ్రేష్ఠములగు రాజహంసలయొక్క, సముదయంబు = గుంపు; వేంకటాద్రిక్షమానేతృ విపుల బాహుదండ కోదండ నీర దాఖండ చండ శరపరంపరన్ –వేంకటాద్రిక్షమానేతృ= వేంకటాద్రిభూపాలునియొక్క, విపుల = విశాలములగు, బాహుదండ = భుజదండముల యందుండెడు, కోదండ = ధను వనెడు, నీరద = మేఘముయొక్క, అఖండ = అవిచ్ఛిన్నమగు, చండ = దుస్సహమైన, శరపరంపరన్ = బాణపరంపర యనెడు జల పరంపరయందు; వెఱచి = భయపడి; చను నెడన్ = పోవు సమయమందు, తత్పురవితతినెల్లన్ = వాని పత్తనసమూహమం దంతటను;

పటుపుండరీక సంకటగృహశ్రేణికల్ – పటు = సమర్థమైన, పుండరీక =గొడుగులచేత, సంకట = సమ్మర్దములైన, గృహశ్రేణికల్ = గృహపరంపరలు; పటుపుండరీకసంకటములు – పటు = సమర్థమైన, పుండరీక = పులులచేత, సంకటములు = సందడించినవి; అయ్యెన్.

పృథులాచ్ఛభల్లవిస్తృతచత్వరమ్ములు – పృథుల = విశాలములగు, అచ్ఛ = స్వచ్ఛములగు, భల్ల = బాణములచేత, విస్తృత = వ్యాప్తములైన, చత్వరమ్ములు = అంగణములు; పృథుల = గొప్పలైన, అచ్ఛభల్ల = ఎలుఁగులచేత, విస్తృతములు=విస్తరించినవి; అయ్యెన్.

వితత సాల కదంబ వృత లస ద్వేశ్మముల్ – వితత =విశాలము లయిన, సాల = కోటలయొక్క, 'ప్రాకారో వరణ స్సాలః' అని అమరము, కదంబ = సమూహముచేత, వృత = ఆవరింపఁబడిన, లసత్ = ప్రకాశించుచున్న, వేశ్మముల్ = గృహములు; వితత = విస్తృతములగు, సాల =ఏపెలచేత, కదంబ = కడుములచేత, వృతములు అయ్యెన్.

ఘన చక్రి ఖడ్గి సంగత రాజవీథులు – ఘన =గొప్పలగు, చక్రి= చక్రాయుధులగు వారిచేతను, ఖడ్గి = ఖడ్గాయుధములు గల వారిచేతను, సంగత = కూడుకొన్న, రాజవీథులు= రాజమార్గములు; ఘన = ఘనములైన, చక్రి= సర్పములతోడను, ఖడ్గి = ఖడ్గమృగములతోడను, సంగతము =కూడినవి, అయ్యెన్.

ఈ పద్యమున పట్వాదిశబ్దములు పునరుక్తము లయిన విశిష్టతను భేదమున్నది గాన దుష్టములు గావు. ఇట్టి ప్రయోగములు వసుచరిత్రాదులందును గలవు.ఇందు యమకవృత్త్యనుప్రాసములు శబ్దాలంకారములు. రూపకమర్థాలంకారము.

క. ఆతనితమ్ముఁడు లింగ
క్ష్మాతలపతి వొగడు గనియె ॥ సమదారినృప

వ్రాతమనోజ్ఞాతఘనో
ద్భూతరజస్సైన్యవిజిత౹భువనుం డగుచున్. 44

టీక: ఆతనితమ్ముఁడు = ఆ వేంకటాద్రిభూపాలుని తమ్ముఁడు; లింగక్ష్మాతలపతి = లింగభూపాలుఁడు; సమదారినృప వ్రాత మనోజ్ఞాత ఘనోద్భూతరజ స్సైన్య విజిత భువనుండు – సమద =మదముతోఁ గూడిన, అరినృప = శత్రురాజులయొక్క, వ్రాత = సంఘముయొక్క, మనః = మనస్సు లనెడు, అబ్జాత = కమలములకు, ఘన = మేఘప్రాయమగు, ఉద్భూతరజః =అధిక పరాగము గల, సైన్య =సైన్యముచేత, విజిత = జయింపఁబడిన, భువనుండు = లోకములు గల వాఁడు; అగుచున్; పొగడు గనియెన్ = స్తుతిగాంచెను.

మేఘము కమలములకు హాని గలుగఁజేయునది గాన సైన్యపరాగము మనోజ్ఞాతములకు ఘన ప్రాయ మనఁబడియె.

మ. పరగోత్రాభృదనీకముం గదిసి, శుం౹భత్సైన్యగర్జాసము
త్కరఘోరాకృతి నంటి, తచ్ఛిరములం ౹గల్పించెఁ గీలాల ము
ద్ధురవేగోగ్రతదాశుగప్రతతికా౹దుర్వార మై, లింగభూ
వరుఖడ్గచ్ఛలవారిదంబు సుమనో౹వర్ణ్యాతిచిత్రక్రియన్. 45

టీక: లింగభూవరుఖడ్గచ్ఛలవారిదంబు – లింగభూవరు = లింగభూపాలునియొక్క, ఖడ్గ = కత్తియనెడు, ఛల = నెపముగల, వారిదంబు = మేఘము; సుమనోవర్ణ్యాతిచిత్రక్రియన్ – సుమనః = జాజులచేత, దేవతలచేత, వర్ణ్య = పొగడఁదగిన, అతిచిత్ర క్రియన్ = అత్యద్భుతవ్యాపారముచేతను; పరగోత్రాభృదనీకమున్ – పర గోత్రాభృత్ = శ్రేష్ఠములగు పర్వతములయొక్క, శత్రురాజులయొక్క, అనీకమున్ = సమూహమును, సేనను; కదిసి = ఆక్రమించి; శుంభత్సైన్యగర్జాసముత్కర ఘోరాకృతిన్ – శుంభత్ = ప్రకాశించుచున్న, సైన్య =సైన్యముయొక్క, గర్జా = సింహనాదము లనెడు మేఘనాదములయొక్క, సముత్కర = సమూహముచేత, ఘోర =భయంకరమగు, ఆకృతిన్ = ఆకారముచేత; తచ్ఛిరములన్ = ఆ పర్వతశిఖరములను, ఆ రాజుల శిరస్సులను; అంటి = చేరి; ఉద్ధురవేగోగ్రతదాశుగప్రతతికాదుర్వారమై – ఉద్ధుర = అతిశయించిన, వేగ = వేగంబుచేత, ఉగ్ర = తీక్ష్ణమైనట్టి, తదాశుగ = ప్రసిద్ధవాయువుయొక్క, వారి బాణములయొక్క, ప్రతతికా = సమూహమునకు, దుర్వారమై = వారింప నలవిగానిదై; కీలాలమున్ =ఉదకమును,రక్తమును, 'శోణితేమ్భసి కీలాలమ్' అని అమరము, కల్పించెన్ = చేసెను.

వారిద ముద్ధురవేగోగ్ర మగు మారుతమునకు దుర్వారమై వర్షించుట చిత్రమని యాశయము. శ్లిష్టరూపకము. ఖడ్గచ్ఛల వారిద మనుచో కైతవాపహ్నుతి. రెంటికిని సంకరము.

తే. అతని యనుజుఁడు చిన్నలిం౹గావనీశుఁ
డలరు నైజమహోభాను౹ డఖిల శార్వ
రాళిఁ దూల్చియు, నరివధూ౹పాళి కాత్మ
రమణ విరహంబుఁ జేయఁ జి౹త్రప్రశస్తి. 46

టీక: అతని యనుజు(డు = ఆ లింగభూపాలుని తమ్ము(డు; చిన్న లింగావనీశు(డు = చిన్న లింగ భూపాలు(డు; నైజమహోభాను(డు – నైజ = తన సంబంధియైన, మహః = ప్రతాప మనెడు, భాను(డు = సూర్యుండు; అఖిల శార్వరాళిన్ – అఖిల= సమస్తమగు, శార్వర= అంధకారములయొక్క, ఆళిన్ = గుంపును, సమస్తవైరిసంఘముననుట; తూల్చియున్ = నాశము సేసియు; అరివధూ= ఆ(డుజక్కవలయొక్క; పాళికిన్ = గుంపునకు, శత్రువనితలగుంపుల కనుట; ఆత్మరమణ విరహంబున్ = నిజనాథులయొక్క వియోగమును; చిత్రప్రశస్తిన్ = ఆశ్చర్యకరమగు ప్రసిద్ధితో; చేయన్ = చేయుచుండ(గా; అలరున్ = ప్రకాశించును. సూర్యుండు తమస్సంఘమును దూల్చియు, జక్కవపడ(తులకు(బ్రియావియోగంబు ఘటిల్ల(జేయుట చిత్ర మని తాత్పర్యము. చిన్నలింగభూపతి సమస్తవైరులసంహరించి వారి నారులకు విరహము ఘటిల్ల(జేసె నని భావము. విరోధాభాసము. రూపకభేదము.

సీ. లాటాంతరమున కే౦లలితవిగ్రహుగుణ,శ్రేణి వినూతన౦చిత్రరచన,
వంగమండలికి నే ౦వరకలాశాలిప్ర,తాపంబు సూడ ర౦త్నంపుబరణి,
కాశ్మీరమునకు నే౦కల్యాణనిధికీర్తి,వారంబు మహనీయ౦వజ్రపేటి,
యాని చోళమునకు నే ౦యమనశీలునియాజ్ఞ, యలరారు తెలిముత్తి౦యంపుజల్లి,
తే. యత(డు వొగడొందు జగముల౦నరిన్నృపాల, మకుటతటకోటికాహిత౦మణికలాప
రాజినీరాజితాంఘ్రినీ౦రేజశాలి, చాపజితశూలి చినలింగ౦భూపమౌళి. 47

టీక: లాటాంతరమునకున్=లాటదేశమధ్యమనెడు వస్త్రాభ్యంతరమునకు, 'లాటో దేశేం౽శుకేపి చ' అని విశ్వము; ఏ లలిత విగ్రహుగుణశ్రేణి = ఏ మనోహరాంగుని సుగుణముల గుంపు; వినూతనచిత్రరచన = నూతనచిత్రకర్మయో, ఆశ్చర్యకరణ మనుట;

వంగమండలికి = వంగదేశ మనెడు కర్పూరకదంబమునకు, 'వఙ్గః కర్పూర వార్తాక దేశభేదేషు కీర్తితః' అని విశ్వము; ఏ, వరకలాశాలిప్రతాపంబు – వర= శ్రేష్ఠములగు, కలా = విద్యలచేత, శాలి = ఒప్పుచుండెడువానియొక్క, ప్రతాపంబు = ప్రతాపము; చూడన్ = పరికింప(గా; రత్నంపుబరణి = రత్ననిర్మిత మగు బరణియో, అన(గా బరణి కర్పూరము నెట్లు చుట్టి యుండునో అట్లు లింగభూపాలుని ప్రతాపంబు వంగదేశము నావరించి యున్న దనుట, ప్రతాప మెఱ్ఱనిదని కవిసమయము గనుక రతనంపుబరణిగా రూపింప(బడినది.

కాశ్మీరమునకు = కాశ్మీరదేశ మనెడు కుంకుమమునకు; ఏకల్యాణనిధికీర్తివారంబు = ఏ మంగళమూర్తియొక్క యశోరాశి; మహనీయవజ్రపేటి = శ్రేష్ఠమగు వజ్రంపుపెట్టెయో, అన(గా గుంకుమమును బెట్టె యేలాగున నావరించియుండునో యాలాగున లింగభూపాలునికీర్తి కాశ్మీరదేశము నావరించియున్న దనుట, కీర్తి తెల్లని దని కవిసమయము గాన వజ్రపేటికగా రూపింప(బడినది.

ఆని = కదిసి; చోళమునకున్ = చోళదేశ మనెడు ప్రసిద్ధమైన ముసు(గుగుడ్డకు; ఏ యమనశీలుని యాజ్ఞ = ఏ నియంతయొక్క యాజ్ఞ; అలరారు తెలిముత్తియంపుజల్లి = ప్రకాశించునట్టి తెల్లని ముత్తెములచేత(జేయ(బడిన జాలరై యొప్పునో, అన(గా ముసు(గుగుడ్డకు ముత్తియంపుజాలరువలె నారాజునాజ్ఞ చోళదేశమున కలంకారమై యభినంద్యముగా నున్న దనుట.

అతఁడు = ఆ రాజు; అరినృపాల మకుటతట కోటికాహిత మణికలాప రాజి నీరాజి తాంఘ్రినీరేజ శాలి– అరి నృపాల= శత్రు రాజులయొక్క, మకుటతట = కిరీటతటములయొక్క, కోటికా = అగ్రభాగములందు, ఆహిత = ఉంపఁబడిన, మణికలాప = మణిభూషలయొక్క, రాజి = బంతిచేత, నీరాజిత = నివాళింపఁబడిన, అంఘ్రినీరేజ = పాదపద్మములచే, శాలి = ఒప్పుచున్న వాఁడు; చాపజితశూలి =ధనుర్విద్యయందు జయింపఁబడిన రుద్రుఁడు గలవాఁడు, అంతటి సామర్థ్యము గలవాఁడనుట; చిన లింగభూపమౌళి = చినలింగభూపాలశ్రేష్ఠుఁడు; జగములన్ = లోకములయందు; పొగడొందెన్ = ఖ్యాతిగాంచెను. శ్లిష్టరూప కాలంకారము.

క. అతని యనుజుండుచినమ,ల్లతరుణనీరేజశరుఁడు ◊ లలి నొప్పె మహో
న్నతగాయకనుతసాయక,హతనాయకఘటితసౌర◊హరిణేక్షణుఁ డై. 48

టీక: అతని యనుజుండు = ఆ చినలింగభూపాలుని తమ్ముఁడు; చినమల్లతరుణనీరేజశరుఁడు= చినమల్ల భూపాలుఁడను నవమన్మథుఁడు; మహోన్నతగాయక నుత సాయక హత నాయక ఘటిత సౌరహరిణేక్షణుఁ డై – మహోన్నతగాయక = మిక్కిలి యెక్కువగా శబ్దించునట్టి తుమ్మెదలచేత, మహోన్నతులైన గాయకుల చేత నని రాజపరమైన యర్థము, నుత = కొని యాడఁబడిన, సాయక = సుమబాణములచేత, బాణములచేత నని రాజపరమైన యర్థము, హత = కొట్టఁబడిన, నాయక = శృంగారాలంబనపురుషులతో, రాజులచేతితో, ఘటిత = కూర్పఁబడిన, సౌరహరిణేక్షణుఁడై = సురాంగనలు గలవాఁడై; లలిన్ = ఉత్సాహముచేత; ఒప్పెన్. నీరేజశరుని బాణప్రసరణము యువమిథునసంఘటనసంపాదకము గావునఁ జినమల్ల తరుణ నీరేజశరుని సాయకహతనాయకులు సురాంగనాసంఘటనము నొందిరని భావము. ఇందు రూపకాలంకారము.

సీ. ఈ ధన్యు హేతి ధా◊రాధరం బగుఁ, గాని
చో రాజహంసాళి ◊సోలు బెట్టు,
లీ నరేశ్వరుశౌర్య ◊మైనతేజమ, కాని
చో లోకతమములు ◊దూలు బెట్టు,
లీ రాజు పాణి మం◊దారశాఖియ, కాని
యెడ సుమనశ్శ్రేణు ◊లడరు బెట్టు,
లీ మహేంద్రునికీర్తి ◊కౌముది యగుఁ, గాని
యెడఁ గువలయమోద ◊మెసఁగు బెట్టు,
తే. లనుచు విబుధులు నుతియింతు ◊రమరశైల
కందరాసంచలద్దేవ◊కామినీజ
నాభిగీతనవీనచౌ◊హస్తిమల్ల
బిరుదనిస్తంద్రుఁ జినమల్ల◊ధరణిచంద్రు. 49

టీక: ఈ ధన్యు హేతి = ఈ ధన్యుని ఖడ్గము; ధారాధరం బగున్ = మేఘ మగును, పదును గలదగునని భావము; కానిచోన్ = అటు గాకున్న యెడ; రాజహంసాళి – రాజహంస = హంసపక్షివిశేషములయొక్క, ఆళి = గుంపు, రాజశ్రేష్ఠుల గుంపు; సోలు పెట్టులు = అడలుట యే ప్రకారము, మేఘోదయకాలమందు రాజహంసలు పాఱుట కవిసమయసిద్ధము.

ఈ నరేశ్వరుశౌర్యము =ఈ రాజుయొక్క శౌర్యము; ఐనతేజము = సూర్యసంబంధిప్రభయే; కానిచోన్ = కానియెడల; లోక తమములు = లోకములయందుండు చీకటులు, లోకుల యజ్ఞానములు, అజ్ఞానప్రయుక్త దోషము లన్నింటిని దుష్టనిగ్రహముచే శమింపఁజేయుటంబట్టి యిటు వచించుట; తూలు పెట్టులు = నశించుట యెట్టులు.

ఈ రాజుపాణి = ఈ రాజుయొక్క హస్తము; మందారశాఖియ =కల్పవృక్షమే; కానియెడన్ = కానిచో; సుమనశ్శ్రేణులు = దేవసంఘములు, విద్వత్సంఘములు; అడరు పెట్టులు = ఆనందించుట యెట్లు.

ఈ మహేంద్రునికీర్తి = ఈ మహారాజుయొక్క కీర్తి; కౌముది యగున్ = వెన్నెల యగును; కానియెడన్ = కానిచో; కువలయ మోదము = కలువలకు సంతసము, భూవలయమునకు సంతసము; ఎసఁగు పెట్టులు = తనరు పెట్లు.

అనుచున్ = ఇట్లనుచు; విబుధులు =దేవతలు, విద్వాంసులు; అమరశైల కందరా సంచల ద్దేవకామినీజనాభిగీత నవీనచౌహస్తి మల్లబిరుద నిస్తంద్రున్ – అమరశైల = మేరుపర్వతముయొక్క, కందరా = గుహలయందు, సంచలత్ = తిరుగుచున్న, దేవ కామినీజన = దేవతాస్త్రీసంఘముచేత, అభిగీత = గానము చేయఁబడిన, నవీన చౌహస్తిమల్లబిరుద=నూతనమగు చౌహస్తిమల్లుఁ డను బిరుదుచేత, నిస్తంద్రున్ = జాగరూకుని; చినమల్ల ధరణిచంద్రున్ = చినమల్లభూపాలుఁ డను భూలోకచంద్రుని; నుతియింతురు = కొనియాడుదురు. ఇందుఁ బరంపరితశ్లిష్టరూపకాలంకారము.

ఉ. ఆయనుజుల్ భజింప విమలాత్ముఁడు ముమ్మడిమల్లమేదినీ
నాయకుఁ డుర్వి నేలెను గ॥నత్పదపీఠమసారసారభా
మేయకలిందజాజలవి॥మిశ్రితపాదపునర్భవప్రభా
వ్యాయతజహ్నుజావినతి॥వారితవిద్విడశేషదోషుఁ డై. 50

టీక: ఆ యనుజుల్ = ఆ తమ్ములు; భజింపన్ =సేవించుచుండఁగా; విమలాత్ముఁడు =నిర్మలచిత్తము గలిగినట్టి; ముమ్మడి మల్లమేదినీనాయకుఁడు = ముమ్మడి మల్లభూపాలుఁడు, వీరి తండ్రియు,తాతయు మల్లభూపాలుం డను పేరిచేతనే రాజిల్లుటంబట్టి మల్లభూపాలురలో మూఁడవతరమువాఁడగు నీ నృపాలుఁడు ముమ్మడిమల్లమేదినీనాయకుఁ డని చెప్పఁబడియె; కనత్పదపీఠ మసార సార భామేయ కలిందజాజల విమిశ్రిత పాదపునర్భవప్రభా వ్యాయత జహ్నుజా వినతి వారిత విద్విడశేష దోషుఁ డై – కనత్ = ప్రకాశించుచున్న, పదపీఠ = పాదపీఠమునందలి, మసార = ఇంద్రనీలమణులయొక్క, సార = శ్రేష్ఠమగు, భా = కాంతి యనెడి, అమేయ = అధిక మైన, కలిందజాజల = కాళిందీజలముచేత, విమిశ్రిత = కలిపినట్టి, పాదపునర్భవ ప్రభా=పాదనఖకాంతి యనెడు, 'పునర్భవః కరరుహో నఖో స్త్రీ నఖరో స్త్రియామ్' అని అమరము, వ్యాయత=మిక్కిలి విశాలమైన, జహ్నుజా=గంగానదియందు, వినతి= నమస్కారముచేత, వారిత =పోఁగొట్టఁబడిన, విద్విట్ =శత్రువులయొక్క, అశేష = సమస్తములగు, దోషుఁ డై = పాపములు గలవాఁడై, నేరములు గలవాఁడై, ఉర్విన్ = భూమిని, ఏలెన్ = పాలించెను.

ఇచట పాదపునర్భవప్రభేత్యాదివిశేషణ స్వారస్యముచేత వర్ణ్యుఁడగు ముమ్మడిమల్లభూపాలునియందు విష్ణుత్వము ధ్వనించుచున్నది. అలంకారము రూపకము.

సీ. ఉన్నతకూటసం◊పన్న వర్తన మైన, సంతతేరాధర◊సమితి రోసి,
యెల్లకాలము జిహ్మ◊వృత్తి వర్తిలునట్టి, శేషునిపొం దపే◊క్షింప మాని,
యళిపేయమదయుక్తి◊కలిమిఁ దూఁగు దిగంత,కరిమూర్తులను డాయ◊నరుగు టుడిగి,
యలఘుజడాసక్తిఁ◊దల యెత్త వెఱచు మ,హాకమతస్వామి◊నంట వెఱచి,
తే. చెందె భూకాంత యాత్మని◊స్సీమభూమ
సకలగుణరత్నభూషితా◊శావధూటి
కాశ్రవణకోటి ఖరతర◊ఖడ్గపాటి
తవిమతకరోటి మల్లభూ◊ధవకిరీటి. 51

టీక: భూకాంత = భూమి యనెడు స్త్రీ; ఉన్నత కూట సంపన్న వర్తన యైన సంతతేరాధరసమితిన్ – ఉన్నత = అధికములగు, కూట = కపటములచేత, సంపన్న = సమృద్ధ మైన, వర్తన యైన = వృత్తి గలది యైనట్టి, సంతతేరాధరసమితిన్ = ఎల్లప్పుడు కల్లుమోయువారియొక్క గుంపును, భూమిని మోయు పర్వతముల గుంపు ననుట, 'ఇరా భూ వాక్సురాప్సు స్యాత్' అని అమరము; రోసి = విసుఁగుపడి;

ఎల్లకాలము = ఎల్లప్పుడును; జిహ్మవృత్తిన్ = కుటిలస్వభావముచేత, వర్తిలునట్టి శేషుని =వర్తించుచున్న దాసునియొక్క, సేవ్యుఁడు శేషి యనియు, సేవకుఁడు శేషుఁ డనియుఁ బ్రసిద్ధము, వక్రగమనముచేత వర్తించు నట్టి యనంతునియొక్క యనుట; పొందు = సాంగత్యమును; అపేక్షింప మాని = కోరుటను మాని;

అళి పేయ మదయుక్తి కలిమిన్ – అళి = సుర యనెడు, పేయ=పానీయముచేత నైన, మదయుక్తి = మదసంబంధముయొక్క, కలిమిన్ = కల్గుటచేత, తుమ్మెదలచేతఁ బానముచేయఁదగిన మదోదకముయొక్క కలిమిచేత ననుట, 'అళి స్సురా పుష్ప లిహోః' అని విశ్వము; తూఁగు = తూఁగునట్టి; దిగంత = దిక్కుల కడలయందలి,అనఁగా నప్రసిద్ధమగు నొకచోట నుండు; కరిమూర్తులను = రేఫలకారములకభేదమునుబట్టి కలిమూర్తులను పాపమూర్తుల ననుట, గజమూర్తుల నని భావము; డాయ నరుగు టుడిగి = దగ్గఱఁ బోవుటను వదలి;

అలఘు జడాసక్తిన్ – అలఘు = అధికమగు, జడ = మూర్ఖులతోడి, ఆసక్తిన్ = సంబంధముచేతను, లకార డకారముల కభేద మునుబట్టి అధికజలాసక్తిచేతను; తల యెత్తన్ = తల యెత్తుటకు; వెఱచు = భయపడు; మహాకమతస్వామిన్ – మహత్ = అధికమగు, అక = పాపమునకు, మత = ఆశ్రయమగు, స్వామిన్ = ప్రియుని, తలయెత్తని స్వభావము గల ఆదికూర్మస్వామి ననుట; అంటన్ = ముట్టుటకు; వెఱచి = భయపడి;

ఆత్మ నిస్సీమ భూమ సకల గుణరత్న భూషి తాశావధూటికా శ్రవణకోటిన్ – ఆత్మ = తనయొక్క, నిస్సీమ = నిరవధిక మగు, భూమ = ఆధిక్యము గల, సకల = సమస్తములగు, గుణరత్న = గుణము లనెడు రత్నములచేత, భూషిత = అలంకృతములగు, ఆశావధూటికా = దిగంగనలయొక్క, శ్రవణకోటిన్ = కర్ణాగ్రభాగములు గల వాని;

ఖరతర ఖడ్గ పాటిత విమత కరోటిన్ – ఖరతర = మిక్కిలి తీక్ష్ణమగు, ఖడ్గ = ఖడ్గముచేత, పాటిత = చీల్పఁబడిన, విమత = శత్రువులయొక్క, కరోటిన్ = పుఱ్ఱెలుగల వాని, ‘ శిరోస్థని తు కరోటి స్యాత్’ అని అమరము; మల్లభూధవకిరీటిన్ = కిరీటి తుల్యుఁడగు మల్లభూపాలుని, ఉపమానోత్తరపదకర్మధారయసమాసము; చెందెన్ = పొందెను.

భూభరణధురీణు లగు కులాచల శేష దిక్కరి కమఠస్వాములు కాపట్యసంపత్తి కుటిలస్వభావ సురామత్తతా జడాసక్తులను బొందుటచే వారిని వదలి భూకాంత సకలసుగుణసంపత్తి గల మల్లభూపతి నాశ్రయించెనని భావము. ఇందు శ్లేషోత్థాపితవ్యతిరేకాలంకారము.

మ. ఘనభేరీవరభూరిభాంకృతిజరే॥ఖాసంధి లేఖాలయం
బునకున్ మల్లనృపక్షతక్షితిపరా॥ట్పూగంబు లేఁగన్ ఘనా
యనముం జేరె మహాబిలాఖ్యఁ దురగ॥వ్యావిద్ధయుద్ధోచితా
వని పెంపొందెఁ దదీయరత్నతతి ప॥ర్వన్ రత్నగర్భాభిధన్. 52

టీక: ఘన భేరీ వర భూరి భాంకృతిజ రేఖా సంధిన్ – ఘన = గొప్పలగు, భేరీ = భేరులయొక్క, వర = శ్రేష్ఠము లగు, భూరి = అధికములగు, భాంకృతి = భాంకారమువలన, జ = పుట్టిన, రేఖా = చీలికగీఱయొక్క, సంధిన్ = రంధ్రముచేత; లేఖాలయంబునకున్ = స్వర్గమునకు; మల్లనృప క్షత క్షితిపరా ట్పూగంబులు – మల్లనృప = మల్లభూపాలునిచేత, క్షత = కొట్టఁబడిన, క్షితిపరాట్ = రాజశ్రేష్ఠులయొక్క, పూగంబులు = గుంపులు; ఏఁగన్ = పోవఁగా; ఘనాయనమున్ = ఆకాశమును; మహాబిలాఖ్య = అధికవివరము గలదను పేరు, మహాబిల మను పేరు, చేరెన్ = పొందెను; తురగ వ్యావిద్ధ యుద్ధోచితావని – తురగ = గుఱ్ఱములచేత, వ్యావిద్ధ = కొట్టఁబడిన, యుద్ధోచితావని = యుద్ధార్హమగు భూమి; తదీయరత్నతతి = ఆ రాజులకు సంబంధించిన రత్నముల గుంపు; పర్వన్ = ప్రసరింపఁగా; రత్నగర్భాభిధన్ = రత్నగర్భ యను నామముచేత; పెంపొందెన్ = వృద్ధిఁబొందెను. ఆకాశము మహాబిలమను పేరు వొందుటకు, భూమి రత్నగర్భ యనుపేరు వొందుటకు క్షితిపరాట్పూగంబు లేఁగుట, తదీయరత్నతతి పర్వుట హేతువులుగా నుత్ప్రేక్షింపఁబడినవి కావున హేతూత్ప్రేక్షాలంకారము.

సీ. తగ మహావిగ్రహ॥మగు కిరాతశ్రేణిఁ, బ్రత్యగ్రదళితవి॥గ్రహముఁ జేసె,
విప్రమోదాపహ॥వృత్తు లౌయవనుల,విప్రమోదావహ॥విధులఁ జేసె,
ఘనపద్ధతిక్రమ॥గర్హణు లగు శాత్ర,వుల ఘనపద్ధతి ॥మెలఁగఁజేసె,
నిష్ఠురధర్మగ॥రిష్ఠులౌ నహితుల, నతులసుధర్మాభి॥యుతులఁ జేసె,

తే. ననుచు దరవారిపరిదారి॥తారిహస్తి,మస్తనిస్తులనిర్గళ॥న్మౌక్తికముల
సేసఁ జల్లుచు జయలక్ష్మి గేరెనౌర, వీరమల్లక్షమాపాలు॥విమలశీలు. 53

టీక: తగన్ = ఒప్పునట్లుగా; మహావిగ్రహ మగు కిరాతశ్రేణిన్ = మహావిరోధము గల కిరాతులగుంపును; ప్రత్యగ్ర దళిత విగ్రహమున్ = నూతనముగ పోఁగొట్టఁబడిన విరోధములు గల దానిని, ఖండితదేహములు గల దాని ననుట, 'విరోధే కలహే దేహే విస్తారే విగ్రహః' అని హలాయుధుఁడు; చేసెన్ = ఒనరించెను.

విప్ర మోదాపహ వృత్తులౌ యవనులన్ – విప్ర = బ్రాహ్మణులయొక్క, మోద =సంతసమునకు, ఆపహ = నాశకమగు, వృత్తులౌ యవనులన్ = వ్యాపారము గలతురకలను; విప్రమోదావహవిధులన్ = విప్రులకు ప్రమోదావహమగు విధులు గలవారిని, వి = పక్షులకు, ప్రమోదావహవిధులన్ = సంతోషమును గలుగఁ జేయు విధులు గలవారిని, అనఁగా నిహతులై కంకగృధ్రాదిపక్షులకు సంతసముఁ జేయువారి ననుట; చేసెన్ = ఒనరించెను.

ఘన పద్ధతి క్రమ గర్హణు లగు శాత్రవులన్ – ఘన = పెద్దలయొక్క, పద్ధతి = మార్గమందు, క్రమ = సంచరణముయొక్క, గర్హణు లగు = నిందకులగు, సన్మార్గవిరోధులగు ననుట, శాత్రవులన్ =విరోధులను; ఘనపద్ధతిన్ =పెద్దలమార్గమందు, గగనమందు; మెలఁగన్ = వర్తించునట్లు; చేసెన్ = ఒనరించెను. అనఁగాఁ బరిమార్చి వీరస్వర్గమునకు బంపెనని భావము.

నిష్ఠురధర్మ గరిష్ఠులౌ నహితులన్ – నిష్ఠురధర్మ = కఠినధర్మముచేత, కఠినమగు ధనుర్విద్యచేత, గరిష్ఠులౌ అహితులన్ = శ్రేష్ఠులగు పగతురను; అతుల సుధర్మాభియుతులన్ – అతుల = అసమానమగు, సుధర్మాభియుతులన్ =మంచిధర్మముతో, దేవసభతో కూడుకొన్న వారినిగా; చేసెన్ = ఒనరించెను. కఠిన ధర్మము గల వారిని మంచిధర్మము గలవారినిగాఁ జేసె నని యర్థము. ధనుర్విద్యయందు దక్షులగు వీరులను దేవసభఁ జేరునట్లు చేసెనని భావము.

ఔర = ఆశ్చర్యము, ఇట నాశ్చర్యము స్పష్టము; అనుచున్, జయలక్ష్మి, తరవారి పరిదారితారిహస్తి మస్త నిస్తుల నిర్గళ న్మౌక్తి కములన్ – తరవారి = ఖడ్గముచేత, పరిదారిత = ఖండింపఁబడిన, అరిహస్తి = శత్రుగజములయొక్క, మస్త = శిరస్సుల వలన, నిస్తుల = అసమానమగునట్లుగా, నిర్గళత్ = జాఱుచున్న, మౌక్తికములన్ = ముత్యములచేత; సేసఁ జల్లుచున్ = తలఁబ్రాలు చల్లుచు; విమలశీలున్ = నిర్మలస్వభావము గల; వీరమల్లక్షమాపాలున్ = వీరుఁడగు మల్లభూపాలుని; చేరెన్ = పొందెను.

ఇందుఁ జరణచతుష్టయమందును విరోధాభాస మలంకారము. 'ఆభాసత్వే విరోధస్య విరోధాభాస ఉచ్యతే' అని తల్ల క్షణము.

శా. ఆలోచింప దధీచిదానము మహా॥వ్యర్థంబు, దోషాకరుం
డాలేఖావళి కిచ్చు నీగి యొక తో॥యం బై కలామాత్రమై
చాలం దక్కువ యొక్క పక్షమున, నెం॥చన్ మించుఁ గా మల్లభూ
పాలగ్రామణిసాతి సద్గుణతతిన్ ॥ భావించుచో నెంతయున్. 54

టీక: దధీచిదానము = 'దధీచి ర్దానవీరోభూ ద్దయావీర శ్శిబిర్నృపః। హమ్మీరో యుద్ధవీరోభూత్' అని దానవీరుఁడుగాఁ జెప్పఁబడిన దధీచియొక్క దానము; మహావ్యర్థంబు = మిక్కిలి వ్యర్థమైనది; మహావ్యర్థంబు = గొప్పలైన పర్వతములకొఱ

కైనదనుట, 'అవయ శ్శైల మేషార్కాః' అని యమరుఁడు; దోషాకరుండు = చంద్రుఁడు; ఆ లేఖావళికిన్ = ఆ దేవబృందమునకు; ఇచ్చు నీగి = ఒసంగెడు త్యాగము; ఒక తోయం బై = జలమాత్రమే, మఱియొక వస్తువు లేదనుట; కలామాత్ర మై = పదునాఱవభాగరూపమై; చాలం దక్కువ = మిక్కిలి అల్పమైనది; ఒక్కపక్షముననె = ఒకపక్షమందె, ఆ యల్పత్యాగము సైతము కృష్ణపక్ష మందే కాని ఉభయపక్షములందుఁ గాదనుట, సుధాంశువు దేవవర్గమునకు నొక జలరూపమగు షోడశతమకలాత్మకమగు నమృతమును కృష్ణపక్షమందే యిచ్చుననుట; ఎంచన్ = చంద్రుని దాతృత్వము వర్ణ్యుఁడగు మల్లభూపాలుని దాతృత్వముతో సరియైనదే కాదు, ఒక పక్షమందైనను సరి యగునా యని విచారింపఁగా, మల్లభూపాలగ్రామణిసాతి = మల్లభూపాల శ్రేష్ఠునియొక్కదానము, 'సాతి ర్దానావసావయోః' అని అమరము; సద్గుణతతిన్ = శ్రేష్ఠగుణములయొక్కగుంపుచేత; భావించు చోన్ = తారతమ్యమును పర్యాలోచింపఁగా; ఎంతయున్ = మిక్కిలి; మించుఁ గా= అతిశయించును గదా!

ప్రకృతమల్లభూపాలత్యాగమునకు అప్రకృతదధీచిదోషాకరత్యాగములు దుల్యములు గా వనుటవలన ప్రతీపాలంకారభేదము. ' వర్ణ్యేనాన్యస్యోపమాయా అనిష్పత్తివచశ్చ తత్' అని లక్షణము.

సీ. ద్విజరాజు వెఱఁ గంద ◊వివిధకలాపాలి, పచరించుఁ దత్తఱ◊పాటు లేక,
యలమహానటుఁ డెన్న ◊నతులశృంగారవ,ర్తనఁ జూపు నింతైన ◊శ్రాంతి లేక,
తారాళు లీక్షింపఁ ◊దరుణామృతరసాభి,హరణంబు గావించు ◊నరుచి లేక,
యచలాధిపునిచెంత ◊నధికగహ్వరవిహా,రశ్రీలఁ బూను భా◊రంబు లేక,
తే. మల్లభూపాలు ముమ్మడి◊మల్లశౌరి, కీర్తికాంతామతల్లి పం◊కేజజాండ
కాండగర్భాతిభారసం◊క్రాంత యయ్యుఁ, దత్తదనుకూలఖేలనా◊యత్తవృత్తి. 55

టీక: మల్లభూపాలు ముమ్మడిమల్లశౌరి కీర్తికాంతామతల్లి–మల్లభూపాలు ముమ్మడిమల్లశౌరి = మల్లభూపాలుని పుత్త్రుఁడగు ముమ్మడిమల్లవీరాగ్రణియొక్క, కీర్తికాంతామతల్లి = ప్రశస్తమగు కీర్త్యంగన, 'మతల్లికా మచర్చికా ప్రకాణ్డ ముద్ఘ తల్లజౌ ప్రశస్తవాచకాన్యమూని' అని యమరుఁడు; పంకేజజాండ కాండ గర్భాతిభార సంక్రాంత యయ్యున్ – పంకేజజాండ = బ్రహ్మాండములయొక్క, కాండ = గుంపు లనెడు, గర్భ = గర్భములచేతనైన, అతిభార = అధికభారముచేత, సంక్రాంత యయ్యున్ = కూడుకొన్నదయ్యును, అనఁగా బ్రహ్మాండకాండరూప దుర్వహగర్భఖిన్న యయ్యు ననుట; తత్తదనుకూలఖేలనాయత్తవృత్తిన్ = వారివారి కనుకూల మగు క్రీడనమున కధీనమైన వృత్తిచేత;
ద్విజరాజు = బ్రాహ్మణశ్రేష్ఠుఁడు, విద్వాంసుఁ డనుట; వెఱఁగందన్ = ఆశ్చర్యపడునట్లుగా; వివిధకలాపాలిన్ – వివిధ = నానాప్రకారములగు, కలా = విద్యలయొక్క, పాలిన్ = సమూహమును; తత్తఱపాటు లేక = తొట్రుపాటు లేకుండ; పచరించున్ = కనఁబఱచును; ద్విజరాజు = చంద్రుఁడు, వెఱఁగందన్ = భయముచేఁ గందునట్లుగా; వివిధకలాపాలిన్=నానాప్రకారములగు కాంతులగుంపును, తత్తఱపాటు లేక పచరించు నని కీర్తిపరమైన యర్థము;
అల = ప్రసిద్ధుఁడైన; మహానటుఁడు = దొడ్డనట్టువుఁడు, శివుఁడు; ఎన్నన్ = గణించునట్లుగా; అతులశృంగారవర్తనన్ = అసమానమగు నాట్యమును, శృంగారనియమమును; ఇంతైన శ్రాంతి లేక = ఇంచుకైన శ్రమము లేక, చూపున్ = చూపును,
'శృంగార స్సురతే నాట్యే రసే దిగ్గజమణ్డనే' అని విశ్వము;

తారాళులు = తారు ఆళులు = చెలికత్తెలు తాము; ఈక్షింపన్ = చూచుచుండఁగా; తరుణామృత రసాభిహరణంబు – తరుణ = నూతనములగు, అమృత = అమృతమువంటి, రస = మధురాదిరసములయొక్క, అభిహరణంబు = గ్రహణంబు, 'అభిహా రోఽభిగ్రహణమ్' అని అమరము; అరుచి లేక = అసహ్యత లేక, కావించున్ = చేయును. గర్భవతులకుఁ బదార్థములయం దరుచి గలిగి తానెక్కుడు గ్రహింపమి స్వాభావికంబై యుండఁగా నీమె యరుచి లేక రసాభిగ్రహణము గావించు ననుట; తారా ళులు = నక్షత్రసంఘములు; ఈక్షింపన్ = చూచుచుండఁగా; తరుణామృతరస = నవసుధారసముయొక్క; అభిహరణంబు= అభిగ్రహణంబు, గావించు నని కీర్తిపరమైన యర్థము.

అచలాధిపుని చెంతన్ = భూపాలుని సన్నిధియందు; అధికగహ్వరవిహారశ్రీలన్ = అధికములగు దాంభికవిహారములయొక్క సంపదలను; భారంబు లేక = గర్భభారముచే నలసట నొందక; పూనున్ = వహించును; అచలాధిపుని చెంతన్ = హిమవంతుని చెంత; అధికగహ్వరవిహారశ్రీలన్ = అతిశయమైన గుహావిహారములయొక్క సంపదలను; భారంబు లేక = సునాయాసము గా; పూనున్ = వహించును, ' గహ్వరస్తు గుహా దమ్భ నికుఞ్జ గహనేష్వపి' అని విశ్వము, గర్భవతి గర్భిణీ ధర్మములకు విరుద్ధములైన వ్యాపారములు సేసె నని భావము.

కీర్తికాంత విద్వాంసులచేతఁ బ్రశంసింపఁబడిన దనియు, హిమగిరిగుహాదుల నావరించిన దనియు, చంద్రమండలము నాక్రమించి చంద్రునికన్న మిగులఁ దేజరిల్లిన దనియు, నక్షత్రమండలము నతిక్రమించి కైలాసము దాఁక వ్యాపించిన దనియు, పంకేజజాండ కాండగర్భ యనుటచేత బ్రహ్మాండకోటుల నావరించిన దనియు ఫలితార్థము. ఇందుఁ గీర్తికాంతయందు గర్భాభిభరణరూప పుష్కలకారణ మున్నను అరుచ్యలసతాదికార్యములు గలుగనట్లు వర్ణితంబు లగుటనుబట్టి విశేషోక్త్యలంకారము. ' కార్యాజని ర్విశేషోక్తి స్సతి పుష్కలకారణే' అని లక్షణము. కీర్తికాంత యనుచోట రూపకంబు.

తే. ఆధరాధీశసతులు చె॰న్నాంబ, తిరుమ
లాంబ, మల్లాంబిక, యనంత॰మాంబిక యన
నాతతాత్మీయసద్గుణ॰స్యూతసుకవి
సూక్తిముక్తాకదంబ లై ॰యొప్పి రందు. 56

టీక: ఆధరాధీశసతులు = ఆ మల్లభూపాలుని భార్యలు; చెన్నాంబయు, తిరుమలాంబయు, మల్లాంబయు, అనంతమాంబి కయు, అనన్, ఆతతాత్మీయసద్గుణ స్యూత సుకవిసూక్తి ముక్తాకదంబలై– ఆతత =విశాలము లైన, ఆత్మీయసద్గుణ= తమ లోకోత్తరగుణము లనెడు గుణములచేత, స్యూత = కూర్పఁబడిన, సుకవిసూక్తి = సత్కవుల వాక్కులనెడు, ముక్తాకదంబలై = ముత్యములగుంపులు గలవారై; ఒప్పిరి; అందున్ = ఆ సతులయందు; దీనికిముందు పద్యముతో నన్వయము. రూపకాలం కారము.

సీ. తాఁ జంచలాత్మ యై ॰తనుగన్న వారికి, బలుసుళ్లు దెచ్చు న॰బ్జాతపాణిఁ,
దతరజోగుణయుక్తి ॰దానవద్వీపముల, నంటు గంధోదగ్ర ॰యైన భూమి,
నొకమూలఁ బడియుండి ॰యుచ్చసింహాసన,మంది తాఁ జండిక ॰యైన గౌరి,

గురుఁడు వాక్రువ్వ నక్షరవిగ్రహముఁ బూని, నిక్కి రాజాస్థాని కెక్కు వాణిఁ,

తే. బరిహసించుచు జనయితృభవనకీర్తిదాయివర్తన సాత్త్వికధర్మ నియతి

భర్తృచిత్తానుస్మృతిఁ బూజ్యపటలసేవఁ, జెలఁగు సద్గుణనికురుంబ చెన్నమాంబ. 57

టీక: సద్గుణ నికురుంబ = సద్గుణసమూహము గలది యైన; చెన్నమాంబ = చెన్నమ్మయను సతి; తాన్ = తాను; చంచలాత్మ యై = చపలచిత్త యై; తనుగన్న వారికిన్ = తన పుట్టింటివారికి; పలుసుల్లు = అధికోపద్రవములు; తెచ్చు నబ్జాతపాణిన్ = తెచ్చిపెట్టెడు లక్ష్మీదేవిని; తాఁ జంచలాత్మ యై = చలస్వభావము గలద్రై, స్థిరముగానిదై యనుట; తనుగన్న వారికిన్ = తనను గన్నట్టి యుదకమునకు, సముద్రమున కనుట; బలుసుల్లు = అధికావర్తములను దెచ్చు నబ్జాతపాణినని తాత్పర్యము.
తతరజోగుణయుక్తిన్ – తత = విపులమైన, రజోగుణ = రాజసగుణముయొక్క,యుక్తిన్ = యోగముచేత; దానవద్ద్విపములను = రాక్షసశ్రేష్ఠులను; అంటు = ఆశ్రయించు; గంధోదగ్ర యైన భూమిన్ = గర్వముచేత నధికమైన భూమిని; తతరజోగుణ యుక్తిన్ = విస్తృతమగు పరాగగుణముయొక్క సంబంధముచేత; దానవ ద్ద్విపములను – దానవత్ = మదయుక్తములగు, ద్విపములను =గజములను,దిగ్గజముల ననుట, దానవ + ద్విప అనుచోట 'అనచి చ– అచః పరస్య యరో ద్వేవా స్తో న త్వచి' అను దానిచే దానవద్ద్విప అని దకారము నకు ద్విత్వము వచ్చినది; గంధోదగ్ర యైన భూమిన్ = ఘ్రాణగ్రాహ్యగుణవిశేషముచేత అధిక యైన భూమిని, పరాగము గలిగి దిగ్గజములతోఁ గూడి గంధవతి యై పృథివి యుండుట స్వభావము;
ఒకమూలఁ బడియుండి =ఒక గొందిని బడియుండి; ఉచ్చసింహాసనమంది = ఉన్నత మగు రాజాసనము నొంది; తాఁ జండిక యైన గౌరిన్ = తా నత్యంతకోపవతి యైన గౌరిని; ఒకమూలన్ = మూలగా నున్న ఈశాన్యదిక్కునందు, పడియుండి, ఉచ్చసింహాసనము–ఉచ్చ = ఉన్నతమైన, సింహ = సింహమందు, ఆసనము = ఉపవేశనమును,అంది, తాఁ జండిక యైన గౌరిన్ = తాను చండి యనునామాంతరము గలదైన గౌరి ననుట;
గురుఁడు =మామ; వాక్రువ్వన్ = మాటాడఁగా, నోరెత్తఁగా ననుట; అక్షరవిగ్రహమున్ = నశింపని కలహమును; పూని = వహించి; నిక్కి = గర్వించి; రాజాస్థానికిన్ = రాజసభకు; ఎక్కువాణిన్ = ఎక్కెడు సరస్వతిని; గురుఁడు = బృహస్పతి; వాక్రువ్వన్= చెప్పఁగా; అక్షరవిగ్రహముఁ బూని = అకారాద్యక్షరస్వరూపమును దాల్చి; నిక్కి = అతిశయించి; రాజాస్థానికిన్ – రాజ = ఇంద్రునియొక్క, ఆస్థానికిన్ = సభకు; ఎక్కువాణిన్, అనఁగా నకారాద్యక్షరరూపిణి యగు సరస్వతి బృహస్పతి చేత నింద్రసభలో బూజింపఁబడినదని యనుట. కాదేని నుపాధ్యాయుండు సెప్పఁగా రాజసభలఁ బూజిత యగు వాణి ననుట;
పరిహసించుచున్ = మిక్కిలి హాస్యము చేయుచు; జనయితృభవన కీర్తిదాయి వర్తనన్–జనయితృభవన= జనకగృహమునకు, కీర్తిదాయి = కీర్తిజనకమగు, వర్తనన్ = వృత్తిచేత, దీనికిఁ దనుఁగన్నవారికిఁ బలుసుల్లు దెచ్చు నబ్జాతపాణి నను దానితోఁ బ్రతిద్వంద్విగా నన్వయము. ఇట్లు నాలుగుచరణములయందుఁ జెప్పిన యర్థములకు నన్వయంబు దెలియవలయు.
సాత్త్వికధర్మనియతిన్ = సాత్త్వికధర్మములయందు వర్తన చేతను; భర్తృచిత్తానుస్మృతిన్ = భర్తృచిత్తము ననుసరించుటచేతను; పూజ్యపటలసేవన్ = పూజ్యుల సంఘముయొక్క సేవచేతను; చెలఁగున్ = ఒప్పును. చెన్నమాంబ లక్ష్మీభూమిగౌరీసరస్వతుల కన్న మిన్న యని వ్యంగ్యము. ఇందు యథాసంఖ్యాలంకారము, శ్లేషసముత్థాపితవ్యతిరేకాలంకారమును గలవు.

శా. ఆవామామదనుండు మల్లవసుధా◊ధ్యక్షుండు దచ్చెన్నమాం
బావామేక్షణయందు రామవిభునిన్, ◊మల్లావనీవల్లభున్,
శ్రీవాసేక్షణ నిన్ను మల్లమయెడం ◊గృష్ణాధిపున్ మేదినీ
రావుం గాంచె నచంచలప్రమదసాం◊ద్రా! మాధవక్ష్మోణిపా! 58

టీక: అచంచలప్రమదసాంద్రా = స్థిరమైన సంతోషముచేత సాంద్రుఁడగువాఁడా! మాధవక్షోణిపా! = మాధవరాయా! ఆవామా మదనుండు మల్లవసుధాధ్యక్షుండు = యువతీమనోహరుఁడగు నా మల్లభూపాలుండు; తచ్చెన్నమాంబావామేక్షణయందున్ = ఆ చెన్నమాంబికయందు; రామవిభునిన్ = రామభూపాలుని; మల్లావనీవల్లభున్ =మల్లభూపాలుని; శ్రీవాసేక్షణ = శ్రీనివాసములైన దృష్టులు గలమాధవరాయా! నిన్నున్, మల్లమయెడన్ = మల్లాంబిక యెడ; కృష్ణాధిపున్ = కృష్ణరావును; మేదినీ రావున్ = మేదినీరావును; కాంచెన్ = కనెను.

క. అం దగ్రజుండు యువతీ
కందర్పుఁడు రామధరణీ◊కాంతుఁడు వెలసెన్
మందరబలబంధురభుజ
మందరధరమథితవైరి◊మహిపాంబుధి యై. 59

టీక: అందున్ = వారలలో; అగ్రజుండు = జ్యేష్ఠుండును; యువతీకందర్పుఁడు = మానినీమన్మథుఁడు నగు; రామధరణీ కాంతుఁడు = రామభూపాలుఁడు; మందర బల బంధుర భుజ మందరధర మథిత వైరిమహిపాంబుధి యై – మందర = బహుళమగు, బల = సామర్థ్యముతోడ, బంధుర = దట్టములైన, భుజ = బాహువు లనెడు, మందరధర = మందరపర్వతము చేత, మథిత = మథింపఁబడిన, వైరిమహిప = శత్రురాజు లనెడు, అంబుధి యై = సముద్రముగలవాఁడై; వెలసెన్= ప్రకాశించెను.

సీ. ధర్మనిర్మథనంబుఁ ◊దాఁ జేసి జనకజా,పాణౌకృతిక్రీడఁ ◊బ్రబలఁడేని,
నవరజక్షిప్తరా◊జ్యాతిభారుం డయి, వనచరవర్తన ◊వఱలఁడేని,
సతతసుగ్రీవాను◊షక్తాత్ముఁడై దావ,మున మఖవత్సూనుఁ ◊దునుమఁడేని,
నురుగోవిహారాత్త◊పరజీవననిధి యై, యలపుణ్యజనభర్త ◊నడఁపఁడేని,
తే. సాటి యనవచ్చు రాముఁడు ◊సాధుసుకృత
కేళి సర్వంసహాభార◊శాలి త్రాత
సాగ్నిసంతానపాళిసా◊ధ్వవననిత్య
శీలి యగు రామభూపాల◊మౌళికెపుడు. 60

టీక: ఎపుడున్ = సర్వకాలమందును; సాధుసుకృతకేళి – సాధు = శ్రేష్ఠములగు, సుకృత = పుణ్యవిషయ మైన, కేళి = క్రీడ గలవాఁడును; సర్వంసహాభారశాలి = భూభరణధురీణుఁడును; త్రాత = రక్షకుఁడును; సాగ్ని సంతానపాళి సాధ్వవన నిత్యశీలి – సాగ్ని = అగ్న్యుపాసనము చేయు సోమయాజులయొక్క, సంతానపాళి = బిడ్డలగుంపుయొక్క,సాధ్వవన = చక్కగఁ బోషించుట, నిత్యశీలి = నిరంతరస్వభావముగాఁ గల వాఁడును; అగు రామ భూపాలమౌళికిన్ = అయినట్టి రామభూపాలాగ్రేసరునకు; రాముఁడు = శ్రీరాముండు; తాన్ = తాను; ధర్మనిర్మథనంబున్ =ధర్మమార్గభంగమును; చేసి = ఒనరించి; జనకజాపాణౌకృతిక్రీడన్ – జనక = తండ్రివలన, జా = పుట్టినదానియొక్క, సహోదరియొక్కయనుట, పాణౌకృతి= వివాహమందలి, క్రీడన్ = క్రీడచేత; ప్రబలఁడేనిన్ = వృద్ధిఁబొందఁడేని, 'పాణౌకృతి' యనుచోట 'నిత్యం హస్తే పాణా వుపయమనే' అని యలుక్సమాసము; ధర్మ = ధనువుయొక్క; నిర్మథనంబున్ = భంగమును; తాఁ జేసి = తా నొనరించి; జనకజాపాణౌక్రీడన్ = జనకచక్రవర్తి కూతురగు సీతాపాణిగ్రహణమందలి క్రీడచేత ప్రబలినాఁడని భావము.గీతిలోఁ జెప్పిన యర్థములకు వీనికిఁ గ్రమముఁ జూడవలయు.

అవరజక్షిప్తరాజ్యాతిభారుండయి – అవరజ = నీచునియందు, క్షిప్త = ఉంపఁబడిన, రాజ్యాతిభారుం డయి = రాజ్యసంబంధియైన యధికభారము గలవాఁడై; వనచరవర్తనన్ = కిరాతకులవృత్తిచేతను; వఱలఁడేనిన్. అవరజుఁ డనఁగా అనుజుఁడైన భరతుఁడు. అతనియం దుంపఁబడిన రాజ్యభారముగలవాఁడై, వనచరు లగు మున్యాదులయొక్క వర్తనచేత శ్రీరాముఁడు వఱలినాఁడని భావము.

సతతసుగ్రీవానుషక్తాత్ముఁ డై – సతత = ఎల్లప్పుడును, సుగ్రీవా = మంచికంఠము గలదానియందు, అనుషక్తాత్ముఁ డై = అనురాగము గలవాఁడై; దావమునన్=అరణ్యమున; మఖవత్సూనున్ – మఖవత్ =సోమయాజియొక్క, సూనున్=సుతుని;తునుమఁడేనిన్ = వధింపఁడేని. సతతము సుగ్రీవునియం దనుషక్తాత్ముఁడై దావమున మఖవత్సూను ననఁగా నింద్రసుతుఁడగు వాలిని శ్రీరాముఁడు దునిమినవాఁడని భావము. 'హవి ర్జక్షితి నిశ్శజ్కో మఖేషు మఖవా నసౌ. తత్రైకో మఖవా నముత్ర బహవః' ఇత్యాది ప్రయోగములు మతుబంతమైన మఖవచ్ఛబ్దమునకుఁ బ్రమాణములు.

ఉరుగోవిహారాత్తపరజీవననిధియై – ఉరు = అధికమగు, గో = దృష్టులయొక్క, విహార = వ్యాపారముచేత, ఆత్త = పొందఁబడిన, పర = అన్యులయొక్క, జీవననిధియై = జీవనాస్పద మగు ధనముయొక్కనిధిగలవాఁడై, చూపులచే బెదిరించి పరద్రవ్యాపహరణముఁ జేసినవాఁడనుట; అలపుణ్యజనభర్తన్ = ఆ ప్రసిద్ధుఁడైన సుకృతిజనశేఖరుని; అడఁపఁడేనిన్ = తునుమఁడేని; శ్రీరాముని పక్షమున: ఉరు = అధికమగు, గోవిహార = బాణములయొక్క విహారముచేత, ఆత్త = ఆక్రమింపఁబడిన, పర = ఉత్కృష్టమగు, జీవననిధియై = సముద్రము గలవాఁడై; అలపుణ్యజనభర్తన్ = ఆ రాక్షసులకు భర్తయగు రావణుని, అని భావము.పై విధమైన విరుద్ధధర్మములు గలిగియుండఁడేని శ్రీరాముఁడు, సాటియనవచ్చున్=(రామభూపాలునకు) సమానుఁడన వచ్చును.

ఇందు యథాసంఖ్యాలంకారము. 'యథాసంఖ్యం క్రమేణైవ క్రమికాణాం సమన్వయః' అని లక్షణము. మఱియు వర్ణ్యుండగు రామభూపాలున కవర్ణ్యుండగు రామభద్రుం డౌపమ్యనిష్పత్తి లేనందున సాటి గాఁడని చెప్పుటచే ప్రతీపాలంకారము. 'వర్ణ్యేనాన్య స్యోపమాయా అనిష్పత్తి వచశ్చ తత్' అని లక్షణము.

మ. శరజాతంబు దృణీకరించి, రజనీజానిం గలాభంగ మై
పరవం జేసి, యధఃకరించి యలసర్పస్వామి, రామక్షమా
వరుకీర్తిచ్ఛట సత్యలోకమునకున్ వాగ్దేవితోఁ జెల్మికై
కర మేఁగన్ సురధేనువాస్య మటుగాఁ గావించె మధ్యేసృతిన్. 61

టీక: రామక్షమావరుకీర్తిచ్ఛట = రామభూపాలుని యశఃపరంపర; శరజాతంబు = ఱెల్లుగడ్డియొక్క గుంపును; తృణీకరించి = ధిక్కరించి, ఱెల్లు తృణము గానఁ దృణీకరణము సహజము; రజనీజానిన్ = చంద్రుని; కలాభంగ మై పరవంజేసి = తేజో హీనత గలవాఁడై వర్తించునట్లు చేసి, చంద్రుఁడు కృష్ణపక్షమునందు కలాభంగము గలవాఁడై (కలాహీనుఁడై) వర్తిలుట సహజము; అలసర్పస్వామిన్ = ఆ శేషుని; అధఃకరించి = నికృష్టునిఁగాఁ జేసి, ఆదిశేషుఁడు అధోలోకమునందుండుట సహజము; వాగ్దేవితోన్ = సరస్వతీదేవితో; చెల్మికై = స్నేహమునకై; సత్యలోకమునకున్ = బ్రహ్మలోకమునకు; ఏఁగన్ = పోవుచుండఁగా; మధ్యేసృతిన్ = మార్గమధ్యమందు, 'పారే మధ్యే షష్ఠ్యా వా' అని యలుక్సమాసము; సురధేనువు = కామధేనువు; కరము = మిక్కిలి; ఆస్యము = ముఖము; అటుగాఁ గావించెన్ = మరల్చె ననుట. ధేనువు ముఖము నల్లగా నుండును గాన చూపలేక మరల్చుట.

రామభూపాలునికీర్తి స్వర్గమర్త్యపాతాళములు వ్యాపించి సత్యలోకము దాఁకఁ బ్రసరించినదని తాత్పర్యము. ఇందు రామభూపాలకీర్తికర్తృక శేషాద్యధఃకరణాద్యసంబంధ ముండినను తత్సంబంధవర్ణనమును బట్టి సంబంధాతిశయోక్త్యలంకారము. 'సంబంధాతిశయోక్తిస్స్యా దయోగే యోగకల్పనమ్' అని లక్షణము. అదియు శ్లిష్టశబ్దనిబంధన యగుటచే శ్లేషోత్థాపిత యగును.

క. ఆ రామునట్లు వెలసెన్,క్ష్మారామారమణుఁ డగుచు మల్లాధిపుఁ డా
సారాయతధీరాశుగ, వారాహతవైరిదానవద్విపకులుఁ డై. 62

టీక: ఇందు మల్లనృపతి శ్రీరామునట్లు అనఁగా తన యన్న యట్లు వెలసెనని చెప్పఁబడియె. మల్లాధిపుఁడు = మల్లనృపాలుఁడు; ఆసారాయత ధీరాశుగ వారాహత వైరి దానవ ద్విపకులుఁ డై – ఆసార = వర్షధారలవలె, ఆయత = విస్తారము లయిన, ధీర = శ్రేష్ఠములైన, ఆశుగ = బాణములయొక్క, వార = సంఘముచేత, ఆహత = కొట్టఁబడిన, వైరిదానవద్విపకులుఁ డై = వైరు లగు రాక్షసకుంజరములు, అనఁగా రాక్షసశ్రేష్ఠులు గలవాఁడై; వైరి =శత్రువులనెడు, దానవత్ = మదయుక్తములైన, ద్విపకులుఁ డై = గజముల గుంపులు గలవాఁడై యని యర్థాంతరము; క్ష్మా రామా రమణుఁ డగుచున్– క్ష్మా = భూసంబంధిని యగు, అనఁగా భూపుత్రి యగు, రామా = సీత కనుట, రమణుఁ డగుచున్ = వల్లభుఁడగుచు, భూకాంతావల్లభుఁ డగుచు నని యర్థాంతరము, భూపాలుఁ డగుచు నని తాత్పర్యము; ఆ రామునట్లు వెలసెన్ = ప్రసిద్ధుఁడగు దాశరథివలెఁ బ్రకాశించెను. పైని జెప్పిన తన యన్న రామభూపాలునివలెఁ బ్రకాశించెను అని యర్థద్వయముఁ జూడవలయు. ఇందు శ్లేషసంకీర్ణోపమాలంకారము.

సీ. కురులపట్టునకు నేయురుకలానిధియాజ్ఞ, దరుణచంపకగర్భదామకంబు,
మధురోపకంఠసీమకు నేమహాభాగు, తతగుణశ్రేణి ముక్తాలలంతి,

కరహాటకటకభా॰గమున కే॰రాజుతీ,వ్రప్రతాపం బబ్జ॰రాగఘటన,
మద్రమధ్యమున కే॰మాన్యుకలాపాళి, గమనీయమేఖలా॰కలకలంబు,
తే. లలవిదేహదేశమున కే॰లలితమూర్తి, కీర్తి గర్పూరచర్చికా॰స్ఫూర్తి, యతఁడు
రాజచేకోలగండాంక॰రాజితుండు, మల్లభూపాలచంద్రుండు ॰మహిఁ జెలంగె. 63

టీక: కురులపట్టునకున్ = కురుదేశప్రదేశ మనెడు కుంతలప్రదేశమునకు; ఏ ఉరుకలానిధియాజ్ఞ = ఏ యధికవిద్యగలవాని యొక్క యాజ్ఞ; తరుణచంపకగర్భదామకంబు = తత్కాలగ్రథిత మగు సంపెంగపూవుల సంబంధి యైన శిరోమాల్యమో, అనఁగాఁ గుంతలములయందుఁ జంపకమాలిక నాదరముతో వహించిన ట్లా రాజునాజ్ఞ కురుదేశపువారిచే శిరసున వహింపఁ బడుచున్న దనుట. ఆ దేశమునీరాజే పాలించుచున్నాఁడని వ్యంగ్యము. ఇట్లన్ని చరణములయందును నూహింపవలెను.
మధురోపకంఠసీమకున్ = మధురాపురియొక్క సమీపదేశ మనెడు మనోజ్ఞ మగు నుపకంఠసీమకు అనఁగా కంఠసమీపదేశ మునకు; ఏ మహాభాగు తతగుణశ్రేణి = ఏ మహాభాగ్యశాలియొక్క విపులమైన గుణగణము; ముక్తాలలంతి = వ్రేలాడు ముక్తా హారమో, 'లమ్బనం స్యాల్లలంతికా' అని యమరుఁడు. అనఁగా కంఠప్రదేశమునకు ముక్తాలలంతి శోభావహమైనట్లు మధురా పురీపరిసరమునకు నారాజు గుణగణ మలంకార మగు నని యనుట.
కరహాటకటకభాగమునకున్ = కరహాటదేశపట్టణభాగ మను కరమందున్న హాటకకటకభాగమునకు అనఁగా సువర్ణమయ మైన కంకణములయొక్క ప్రదేశమునకు; ఏరాజుతీవ్రప్రతాపంబు = ఏరాజుయొక్క యుగ్రప్రతా పంబు; అబ్జరాగఘటన = పద్మ రాగమణిఘటనమో. తాత్పర్యము పైవ్రాసినరీతి నూహ్యంబు.
మద్రమధ్యమునకున్ = మద్రదేశమధ్య మనెడు మంగళమగు మధ్యప్రదేశమునకు; ఏమాన్యుకలాపాళి = ఏ మాననీయుని విద్యాసమూహము; కమనీయమేఖలాకలకలంబు = మనోజ్ఞమగు నొడ్డాణముయొక్క కలకలధ్వనియో;
అలవిదేహదేశమునకున్ = ప్రసిద్ధమయిన విదేహదేశ మనెడు విశేషమయిన శరీరప్రదేశమునకు; ఏ లలితమూర్తికీర్తి = ఏ కమ నీయశరీరుని కీర్తి; కర్పూరచర్చికాస్ఫూర్తి = కర్పూరలేపనాతిశయరూపమో;
అతఁడు = ఆ రాజు; రాజచేకోలగండాంకరాజితుండు = రాజచేకోలగండయను బిరుదముచేఁ బ్రకాశించువాఁడు; మల్లభూపాల చంద్రుండు = చంద్రునివలె నాహ్లాదకుండగు మల్లభూపాలుఁడు; మహిన్ = భూమియందు; చెలంగెన్ = ప్రకాశించెను. మల్ల భూపతి గుణగణము మొదలగునవి భూషావిశేషరూప మయినపు డతఁడు చంద్రునివలె జగదాహ్లాదకరుఁ డగుట స్పష్టము. శ్లిష్టరూపకాలంకారము.

చ. అనుపమమల్లికార్జునయ॰శోంచితుఁ డైన కుమారమల్లనా
వనిపతి డాయఁ బూని రిపు॰వారము లంత నుపాంతవాహినీ
ఘనతరవారులన్ మునిఁగి ॰గ్రక్కునఁ గాంతురు సౌరసుందరీ
జనకుచకుంభకూటతట॰సాంద్రమృగీమదసారసంగతిన్. 64

టీక: అనుపమమల్లికార్జునయశోంచితుఁడైన కుమారమల్లనావనిపతిన్ – అనుపమ = సాటిలేని, మల్లికా = మల్లికాకుసుమ ములవలె, అర్జున = తెల్లనగు, యశః = కీర్తిచేత, సాటిలేని మల్లికార్జునస్వామియొక్క ఖ్యాతిచేత, అంచితుఁడైన = ఒప్పిన వాఁడైన (అనఁగా శ్రీశైలములోనున్న సాంబశివునకు మల్లికార్జునస్వామి యని నామంబు గాన ఈ రాజపుంగవుల వంశమున తొల్లింటినుండి యా మహానుభావుని సేవించుటయు, వారి నామంబుతోఁ దమబిడ్డలను బిలుచుటయుఁ గలిగియున్నయవి. దీననే పెదమల్లభూపాలుఁడు, చిన మల్లభూపాలుఁడు, ముమ్మడిమల్లభూపాలుఁడు, కుమారమల్లభూపాలుఁడు, అను నామంబులచే విలసిల్లుట. మఱియు లింగభూపాలుండు, లింగాంబిక లోనైనవియు నిష్టదేవతానామంబులే కాని వేఱు గావు. వెండియు నీ రాజశేఖరులకుఁ గూటస్థుం డగు ననపోతమహారాజు శ్రీశైలమునకు సోపానములు గట్టించినట్లు 'యశ్చారుసోపాన పథేన చక్రే శ్రీపర్వతం సర్వజనాంఘ్రిగమ్యమ్' ఇత్యాదిగా సింగభూపాలప్రణీతంబైన రసార్ణవసుధాకరమందు వర్ణింపఁబడినది), కుమారమల్లనావనిపతిన్ = కుమారమల్లభూపాలుని; డాయఁ బూని = చేరఁ గడంగి; రిపువారములు = శత్రుసంఘములు; అంతన్ = అంతట; ఉపాంత వాహినీ ఘన తరవారులన్ – ఉపాంత = సమీపమున నున్న, వాహినీ = సేనలయొక్క, సమీప మున నున్న కృష్ణానదియొక్క, ఘన= గొప్పనైన, తరవారులన్ = ఖడ్గములయందు, ఘనతరవారులన్ = గొప్పనైన జలము లందు; మునిఁగి = క్రుంకి; గ్రక్కునన్ = వేగముగా; సౌరసుందరీ జన కుచకుంభ కూట తట సాంద్ర మృగీమద సార సంగతిన్ – సౌరసుందరీ= సురాంగనలయొక్క, జన = సంఘముయొక్క, కుచకుంభ= కుంభములవంటి కుచములయొక్క, కూట = సమూహముయొక్క, తట = ప్రదేశములయందలి, సాంద్ర = దట్టమగు, మృగీమద = కస్తూరియొక్క, సార = స్థిరాంశము యొక్క, సంగతిన్ = సంబంధమును; కాంతురు = పొందుదురు.

ప్రస్తుతాప్రస్తుతముల కుపమానోపమేయభావము వ్యంగ్యము గాన రాజును సమీపింపఁబూనిన శత్రురాజులు వీరిసేనల ఖడ్గ ములచే నఱకఁబడి సురాంగనాపరిరంభసౌఖ్యమును, మల్లికార్జునస్వామిని జేరఁబూనినవారు కృష్ణానదియందు స్నానము సేసి సురాంగనాసంగసౌఖ్యముఁ బొందినట్లు పొందిరనుట. అలంకారము వ్యంగ్యోపమ.

సీ. శ్రీనంద దనుచు సా◊మైనమే నూనుఁ జా,యల మెచ్చ దనుచు బ◊ల్వాలపు నెఱపుఁ
దనపదంబునఁ జేర◊దనుచు వెల్వెలఁబోవుఁ, జెఱఁగు ముట్టదనుచుఁ ◊జెందు మఱపుఁ
దలముఁ జూడ దనుచుఁ ◊దాఁ గలంగు నిజాప,ఘనము నంట దనుచుఁ ◊గల దొలంగుఁ
గటక మొల్ల దనుచుఁ ◊ఘనదానరతిఁ బూనుఁ, గనుదోయిఁ గప్పుకో◊దనుచు రోఁజు
తే. శూలి సౌరాగ మాశర◊త్కాలఘనము, ముసలి జడధీనుఁ డుగ్రమౌ◊ళి సురవార
ణంబు శేషుండు వారిచం◊దంబుఁ జూచి, గేరు మల్లావనీపాలు◊కీర్తికన్య. 65

టీక: శ్రీనంద దనుచు నిత్యాదిసీసచరణచతుష్టయమందుఁ జెప్పిన యర్థములకు గీతియందుఁ గ్రమముగా నన్వయంబు. శూలి = శివుఁడు; శ్రీనంద దనుచు = శ్రీయనఁగా సంపత్తు, విషము, మల్లావనీనాథుని కీర్తికన్య తన సంపద నొల్లదనుచు; సామైన మే నూనున్ = సగమైన శరీరమును దాల్చినవాఁడు. తన సంపదనె యంగీకరింప నప్పుడు తన్ను వరించుట మిక్కిలి యసంభావనీయమని చింతతో క్షీణించినాఁ డనుట. శివుఁడు తెల్లనివాఁడైనను విషము నల్లనిది గానఁ దెల్లని స్వభావము గల కీర్తికన్య దానిం జూచి శివునిఁ ద్యజించుననియు, నీశ్వరుండు స్వభావముగా నర్ధాంగుఁ డనియుఁ దెలియవలయు;

సౌరాగము = కల్పవృక్షము; చాయలన్ = కాంతులను, నీడలను; మెచ్చ దనుచు = శ్లాఘింపదనుచు; బల్వలపు నెఱపున్ = అధికమైన మోహమును దాల్చును. చాయలనే మెచ్చనిది తన్ను వరించుట దుర్లభ మని వలపు నెఱపు ననుట. కల్పవృక్షము తాను తెల్లనిదైనను దననీడ నల్లనిది గానఁ గీర్తికన్య మెచ్చ దనియు, వలపు అనఁగాఁ బరిమళము నెఱపుట సహజమనియు దెలియవలయు.

ఆ శరత్కాలఘనము = ప్రసిద్ధమైన శరన్మేఘము; తనపదంబునఁ జేరదనుచున్ = తనస్థానమునఁ జేర దనుచు; వెల్వెలఁ బోవున్ = వైవర్ణ్యమును దాల్చును, తెల్లఁబోవును; ఘనపద మాకాశము నల్లనిది గావున నచటఁ గీర్తికన్య చేరదనియు, శరత్కాలఘనము తెల్లగా నుండుట సహజమనియుఁ దెలియునది.

ముసలి = బలరాముఁడు; చెఱఁగు ముట్టదనుచున్ = వస్త్రమును ముట్టదని; మఱపుఁ జెందున్ = మత్తత నొందును; తన చెఱఁగు ముట్టనిది తన్ను వరించుట దుర్లభ మని మఱపుఁ జెందె ననుట. బలరాముఁడు తెల్లనివాఁడైనను కట్టుగుడ్డ నల్లనిది గానఁ గీర్తి ముట్టదనియు బలరాముఁడు మదిరాపానపరవశచిత్తుం డగుట స్వభావ మనియుఁ దెలియవలయు. 'ఘూర్ణయన్ మదిరాస్వాదమదపాటలితద్యుతీ। రేవతీవదనోచ్ఛిష్ట పరిపూతపుటేదృశౌ' అని మాఘమందు బలరాముఁడు హాలాపానవివశుఁ డని వర్ణింపఁబడినది.

జడధీనుఁడు = సముద్రశ్రేష్ఠుఁడు; తలముఁ జూడదనుచున్ = అడుగుభాగమును జూడదనుచు; తాన్; కలంగున్ = కలఁగఁ బాఱును. సముద్రతలము పంకమయ మగుటచే నల్లగా నుండుననియు, సముద్రము కలఁగఁబాఱుట సహజ మనియుఁ దెలియునది.

ఉగ్రమౌళి = శివుని శిరోలంకార మైన చంద్రుఁడు; నిజాపఘనమున్ = తన శరీరమును, 'అఙ్గం ప్రతీకోవయవోపఘనోథ కళేబరమ్' అని యమరుఁడు; అంటదనుచున్ = ముట్టదనుచు; కల దొలంగున్ = కాంతిహీనుఁ డగును; చంద్రునియందుఁ గలంకమున్నది గాన నతనిశరీరమును ముట్టదనియు, చంద్రుఁడు కలాహీనుఁ డగుట సహజ మనియుఁ దెలియవలయు.

సురవారణంబు = ఐరావతము; కటక మొల్లదనుచున్ = తనపురము నొల్లదనుచు; ఘనదానరతిఁ బూనున్= అధికత్యాగరతిని బూనును. 'కట ఏవ కటః' అని కటకశబ్దము గండస్థలమును బోధించును గాన నైరావతము గండస్థల మళిమలినమై యుండుట వలనఁ గీర్తి దాని నొల్ల దనియు, దాన మనఁగా మదోదకము దానియందు రతిఁబూనుట స్వభావమనియుఁ దెలియవలయు.

శేషుండు = ఆదిశేషుఁడు; కనుదోయిన్ = నేత్రయుగ్మముచేత; కప్పుకోదనుచున్ = ఆదరింపదనుచు; రోఁజున్ = బుసపెట్టును. శేషుని కనుదోయియందు కప్పు అనఁగా నల్లదనము గలదనియు, కోదు అనఁగా నంగీకరింపదనియు, సర్పములకు రోజుట సహజమనియు భావము.

శూలి యనఁగా శూలరోగము గలవాఁ డనియు, సౌరాగ మనఁగా సురాసంబంధియైన వృక్ష మనియు, ఆశరత్కాల మనఁగా రాక్షసులవలె నాచరించు కాలమేఘ మనియు, జడధీనుఁ డనఁగా జడమతిగలవారిలో శ్రేష్ఠుఁ డనియు, నుగ్రమౌళి యనఁగా నుగ్రులలో శ్రేష్ఠుఁ డనియు, సురవారణం బనఁగా సురలచే వారింపఁబడిన దనియు, శేషుఁడనఁగా దాసుఁ డనియు నపార్థము తోఁచుచున్నది గాన శివ కల్పతరు శరదంబుద బలభద్ర సముద్ర సురగజ శేషులయొక్క సంపచ్ఛాయాపదాదుల నిరాకరణమును గీర్తికన్య చేసెననియుఁ దెలియవలయు. వారిచందంబుఁ జూచి = వారిరీతిని జూచి; మల్లావనీపాలు కీర్తికన్య = మల్లభూపాలుని కీర్తి యనెడు కన్య; కేరున్ = హసించును. క్రమాలంకారము. శివాదు లర్ధశరీరము మొదలగువాని నవలంబించుటకు మల్లమహీపతి కీర్తికన్యాకర్తృకాస్వీకారము నహేతువును హేతువుగాఁ జెప్పుటచే హేతూత్ప్రేక్ష గమ్య మగు.

తే. ఆధరాధీశు పిమ్మట ◊నఖిలభూమి
భరము నీవు ధరించితి ◊కిరికులేంద్ర
కమఠవల్లభకులశైల◊కరటి సంస
దురగనాథులతోడఁ బె◊న్నుద్ది వగుచు. 66

టీక: ఆధరాధీశు పిమ్మటన్ = ఆ కుమారమల్లభూపాలుని పిదప; కిరికులేంద్ర కమఠవల్లభ కులశైల కరటిసంస దురగనాథుల తోడన్ = ఆదివరాహమూర్తి, ఆదికూర్మము, సప్తకులాచలములు, దిగ్గజగణంబు, ఆదిశేషుండు వీరితోడ; పెన్నుద్ది వగుచున్ =పెద్ద యీడగుచు; అఖిలభూమిభరము = సర్వపృథివీభారమును; నీవు; ధరించితి = భరించితివి. ఇందు గుణోత్కృష్టు లగు ఆదివరాహ కమఠనాథ కులశైల దిగ్గజ శేషులతో మాధవరాయలను దుల్యులనుగాఁ జెప్పుటవలనఁ దుల్యయోగితాలంకార భేదము. ‘శ్లో. గుణోత్కృష్టై స్సమీకృత్య వచోన్యా తుల్యయోగితా’ అని తల్లక్షణము.

సీ. బంధురవనకదం◊బములపాలుగఁ జేసె, ఘనతరపుండరీ◊కముల నెల్ల,
శిఖరిశిఖాశ్రేణిఁ ◊జేరంగఁ బురికొల్పెఁ, గలితసారంగసం◊ఘముల నెల్ల,
ఘోరమహాబిల◊కోటి నుండఁగఁ జేసెఁ, బ్రబలపరాశుగ◊పటలి నెల్లఁ,
గమలేశ్వరాధీన◊గతిఁ బొసంగఁగఁ జేసెఁ, దతవైజయంతికా◊వితతి నెల్లఁ,
తే. దన్ను నవి యెల్ల మఱచినఁ ◊ దాను మఱవ,కాత్మనృపచిహ్నములు దాఁచు ◊నందునందు
శత్రునృపకోటి నీధాటిఁ ◊జకితవృత్తి, పరఁగి చనువేళ మాధవ◊ధరణిపాల. 67

టీక: ఇందు మాధవరాయల శత్రురాజులయొక్క నృపచిహ్నగోపన మర్థద్వయముతోఁ జెప్పఁబడినది.
మాధవధరణిపాల = మాధవరాయా; శత్రునృపకోటి = శత్రురాజబృందము; నీధాటిన్ = నీ దండయాత్రయందు, ‘శ్లో. శత్రు సేనావమర్దాయ సద్య స్సుభటఘోటకైః విజిగీషోః ప్రవృత్తి ర్యా సా ధాటీతి నిగద్యతే’ అని ధాటీలక్షణము; చకితవృత్తిన్ = భీత వృత్తితో; పరఁగి = వర్తించి; చనువేళ = పాఱిపోవు నెడ; ఘనతరపుండరీకముల నెల్లన్ = మిక్కిలి గొప్పవైన శ్వేతచ్ఛత్రముల నెల్లను, తెల్లదామరల నెల్ల నని కాని, వ్యాఘ్రముల నెల్ల నని కాని యర్థాంతరము; బంధురవనకదంబముల పాలుగన్ = దట్టము లైన యుదకసంఘముల పాలగునట్లుగా, లేక యరణ్యముల పాలగునట్లుగా; చేసెన్.
కలితసారంగసంఘముల నెల్లన్ = ఒప్పుచున్న యేనుఁగుల గుంపుల నన్నింటిని, తుమ్మెదల గుంపుల నన్నింటిని; శిఖరిశిఖా శ్రేణిన్ = పర్వతాగ్రప్రదేశములను, వృక్షాగ్రప్రదేశములను; చేరంగన్ = చేరునట్లు; పురికొల్పెన్ = చేసెను. గజము లడవులు చేరు నట్లు, వానియందున్న తుమ్మెదలు చెట్లు చేరునట్లు చేసెనని భావము.
ప్రబలపరాశుగపటలి నెల్లన్ – ప్రబల = మిక్కిలి సామర్థ్యము గల, పర = శ్రేష్ఠములగు, ఆశుగ = బాణములయొక్క, వాయువు యొక్క,పటలి నెల్లన్ = సంఘము నెల్లను; ఘోరమహాబిలకోటిన్ = భయంకర మగు గొప్పబొఱియలగుంపులో, ఘోరమైన మహాబిల యనఁగా నాకాశముయొక్క యగ్రమున, ‘తారాపథోన్త రిక్షంచ మేఘద్వారం మహాబిలమ్’ అని యమరుఁడు;

ఉండఁగఁ జేసెన్ = ఉండునట్లు చేసెను. తతవైజయంతికావితతి నెల్లన్ – తత=విస్తృతమగు, వైజయంతికా= టెక్కెములయొక్క, వితతి నెల్లన్ = సముదాయమునెల్లను; కమలేశ్వరాధీనగతిన్ – కమలేశ్వర = సముద్రముయొక్క (‘ సలిలం కమలం జలమ్’ అని యమరుఁడు), విష్ణుమూర్తియొక్క, అధీన = స్వాధీనతయొక్క, భావప్రధాననిర్దేశము, గతిన్ = ప్రాప్తిచేత; పొసంగఁగఁ జేసెన్ = ఒప్పునట్లు చేసెను.

తన్నున్, అవి యెల్లన్ = ఆ గొడుగులు మున్నగు రాజచిహ్నము లన్నియు; మఱచినన్ = రాజ్యభ్రష్టులై పోవునపుడు తచ్చిహ్నములు తన్ను మఱచుట స్వభావము గాన,అట్లు మఱచినను; తాను మఱవక = తాను మఱచిపోక; ఆత్మనృపచిహ్నములు = తమరాజచిహ్నములు; అందునందు = వానివాని కుచితము లగు నాయా స్థలములయందు; డాఁచున్ = డాఁచిపెట్టును.

అనఁగా మాధవరాయల ధాటియందు భీతులై యరులు పోవునపుడు తమనృపచిహ్నములు యదృచ్ఛగా గొడుగులు నీటిలోను లేక వనములలోను, గజము లడవులలోను, వాని ననుసరించిన తుమ్మెదలు వృక్షాగ్రములలోను, బాణములు బొటియలలోను, టెక్కెములు సముద్రములోను వానియంతకు నవి పడిపోయినను శత్రురాజులు బుద్ధిపూర్వకముగాఁ దత్తదుచిత ప్రదేశములయం దుంచిపోయినట్లున్నదని యనుట. పుండరీకములు వనముల నుండుటయు, సారంగములు శిఖరిశిఖాశ్రేణులఁ జేరుటయు, ఆశుగములు గగనముఁ జేరుటయు, వైజయంతులు విష్ణుమూర్తిని జేరుటయు నుచిత మని భావము. ప్రకృతాప్రకృతార్థ ములకు శ్లేషమూలాభేదారోపముఁ జేయఁబడినది. ఇచట పుండరీక సారంగాశుగ వైజయంతులను మాధవ రాయధాటీపలాయితారిమండలి తత్తదుచితస్థానములలో నుంపకపోయినను నుంచిపోయినట్లు చెప్పుట వలన నుత్ప్రేక్షాలంకారము. మఱియుఁ దత్తదనురూపస్థాననివేశనము శ్లేషమూలముగాఁ దోఁచుచున్నది గాన సమాలంకారము . ‘సమం స్యాద్వర్ణనం యత్ర ద్వయో రప్యనురూపయోః’ అని తల్లక్షణము.

చ. అనలమ హీన మై యెసఁగె ౯నౌర త్వదుద్ధతశౌర్యలక్ష్మిచే,
ధనదుఁడు వొందెఁ దా ధర హి౯తస్థితిఁ దావకదానవైఖరిం
గని, యచలవ్రజంబును ము౯ఖస్ఫుటవర్ణవియుక్తిఁ గాంచె నీ
ఘనతరధైర్యవైభవము ౯గన్గొని, మాధవరాయ చిత్రతన్. 68

టీక: మాధవరాయ, త్వదుద్ధతశౌర్యలక్ష్మిచేన్ – త్వత్ = నీయొక్క, ఉద్ధత = అధికమైన, శౌర్యలక్ష్మిచేన్ = ప్రతాపసంపదచేత; అనలమ = అగ్నియే; హీన మై యెసఁగెన్ = హీనమై యొప్పెను; ఔర = ఆశ్చర్యము, శౌర్యలక్ష్మి యగ్నికిని దుస్సహ మగుటచే నాశ్చర్యము; తావకదానవైఖరిన్ =నీదానరీతిని; కని = చూచి;ధనదుఁడు = కుబేరుఁడు; ధరన్ = భూమియందు; తాన్ = తాను; హితస్థితిన్ = హితవృత్తిని; పొందెన్ = పొందెను, ‘ శ్లో. భజతే విదేశ మధికేన జిత స్తదనుప్రవేశ మథవా కుశలః’ అను న్యాయము ననుసరించి యీ హితవృత్తి నవలంబించె ననుట; నీ ఘనతరధైర్యవైభవము= ఉత్కృష్టమగు నీ ధైర్యసంపదను; కన్గొని = చూచి; అచలవ్రజంబు = పర్వతసంఘము; ముఖస్ఫుటవర్ణవియుక్తిఁ గాంచెన్ = ముఖమందు స్ఫుటవర్ణ వియోగమును, అనఁగా కాంతిహీనతను కాదేని గద్గదభాషణమును, కాంచెన్ = పొందెను. చిత్రతన్ అనునది యంతటను సమన్వయించును. చిత్ర మెట్లన అనల మహీనమై అనఁగా అకారహీనమై, నలమై అనఁగా గడ్డిపోఁచై యెసఁగెను. ధనదుఁడు ధరహితస్థితిన్, అనఁగా ధకార రహితస్థితిని పొంది నదుఁడై ‘ న దదాతీతి నదః’ అను నిర్వచనప్రకారము ఏమియు నియ్యని వాఁడని పేరు

నొందెను. ఇట నశబ్దముతో సమాసము. అచలవ్రజంబు ముఖస్ఫుటవర్ణవియుక్తిన్, అనఁగా ముఖస్ఫుట= ఆదియందు స్ఫుటముగా నున్న, వర్ణ = 'అ' వర్ణముయొక్క, వియుక్తిన్ = వియోగముచేత చలవ్రజ మయ్యె నని తాత్పర్యము. మాధవరాయల శౌర్యసంపదకు నగ్ని గడ్డిపోఁచగా నాయె ననఁగా శౌర్యాగ్నిప్రభకు నగ్నితేజ మల్పమై యెసఁగె ననియు, మాధవరాయల త్యాగమునకు విశేషముగ నిచ్చువాఁడై ధనదుఁ డని పేరొందిన కుబేరుండు నియ్యనివాని వలెఁ దోఁచె ననియు, మాధవరాయల ధైర్యసంపదకుఁ గదలకుండి యచల మనిపించుకొన్న పర్వతవ్రజము చలించుదానివలె నాయె ననియు భావము. మాధవరాయలత్యద్భుతమైన శౌర్యము, దానము, ధైర్యము గలవాఁ డని ఫలితార్థము. అత్యుక్తి యర్థాలంకారము. చిత్రము శబ్దాలంకారము. 'ఆకారగతిస్వరవ్యంజన స్థాననియమచ్యుతగుప్తాదిభేదై రనేకధా చిత్రమ్' అని కావ్యానుశాసన మందుఁ జిత్రలక్షణము.

సీ. తాఁ గుంభినీశతఁ ◊దగి ముఖ్యరుచి నెల్లఁ, బరశిలీముఖకోటి◊పాలు చేసెఁ,
దా ధరాధీశతఁ ◊దనరి శృంగము నెల్ల, ఘనగండకాండసం◊కటముఁ జేసెఁ,
దా భోగిరాజతఁ ◊దాల్చి పదం బెల్ల, సాంద్రాహిభీతిజ◊ర్జరముఁ జేసెఁ,
దా భూమిదారత ◊ధరియించి పురమెల్ల, బహుళదుష్కీర్తిదు◊ర్భరముఁ జేసె
తే. ననుచుఁ గరిరాజి గిరిరాజి, నాహరిపతి, గిరిపతి నిరాకరించి యి◊ద్ధరణికాంత
సెందె నరిభేదవైభవాం◊చితు నభీతుఁ, గీర్తిసంపన్ను మాధవ◊క్షితిప నిన్ను. 69

టీక: ఇందు ధరణికాంత దిగ్గజాదుల నిరాకరించి మాధవరాయలను జేరుటకు శ్లేషభంగిచే హేతునిరూపణముఁ జేసి యర్థద్వయము గలుగఁ జెప్పఁబడియె. ఏలాగనిన: తాన్ = తాను; కుంభినీశతన్ = భూమీశ్వరత్వము చేత; తగి, ముఖ్యరుచి నెల్లన్ = ప్రధానకాంతి నంతయు; పరశిలీముఖకోటిపాలు చేసెన్ = శత్రువులయొక్క బాణపరంపరలపాలు చేసెను, తాను రాజయ్యుఁ దనరాజశక్తి నంతయు శత్రువుల యధీనము చేసెనని యర్థము. దిగ్గజవర్గము కుంభినీశత ననఁగాఁ గరణీపతిత్వము చేతఁ దనరినదనియు, ముఖ్యరుచి ననఁగా ముఖమందుఁ బుట్టిన చవిని, పరశిలీముఖకోటి యనఁగా శ్రేష్ఠమగు తుమ్మెదల గుంపు, దానియధీనము చేసిన దనియు భావము.

తాన్ = తాను; ధరాధీశతన్ = భూపతిత్వముచేత; తనరి, శృంగము నెల్లన్ = దొరతనమునంతయు; ఘనగండకాండసంకటమున్ – ఘన = గొప్పనైన, గండకాండ = ఉపద్రవపరంపరలచేత, సంకటమున్=సమ్మర్ద మైన దానిఁగా; చేసెన్, అని యర్థము. కులాచలవర్గము, ధర = పర్వతములకు, అధీశతన్ = అధిపతిత్వము చేత, తనరి, తనశిఖరము నెల్ల ఘనములయిన (గండకాండ) స్థూలోపలములయొక్క సంఘములచే సంకటమగు నట్లు చేసె నని భావము.

తాన్ = తాను; భోగిరాజతన్ – భోగి = రాజులకు; రాజతన్ = రాజత్వమును, రాజాధీశ్వరత్వము ననుట; తాల్చి, పదం బెల్లన్ = తన నివాసస్థానము నెల్లను; సాంద్రాహిభీతిజర్జరమున్ – సాంద్ర = దట్టమైన, అహిభీతి = శత్రుభీతిచేత, జర్జరమున్ = శిథిలమైనదానిఁగా; చేసెన్ = చేసెను, శేషుండు భోగిరాజతన్ అనఁగా సర్ప రాజతను దాల్చినాఁడనియు, తన పదమైన పాతాళలోకమంతయు అహిభీతిన్ అనఁగా సర్పభీతిచేత జర్జరమైన దనియు భావము.

తాన్ = తాను, భూమిదారతన్ = భూపతిత్వమును; ధరియించి = వహించి; పురమెల్లన్ = పట్టణమంతయు; బహుళదుష్కీర్తిదుర్భరమున్ చేసెన్= అధికమగు నపకీర్తిచేత దుర్భరముగాఁ జేసె నని యర్థము. ఆదివరాహస్వామి భూమిదారమను

నామమును వహించినాఁడనియు, తన పురమెల్లన్, అనఁగాఁ దన దేహము నెల్లను బహులమై దుష్టమగు బురదచేత వ్యాప్తము చేసినాఁడనియు భావము. వరాహములు బురదలోఁ దిరుగుట స్వభావము.

గీతియందుఁ గ్రమముగా నన్వయము: అనుచున్ = ఇట్లనుచు; ఇద్ధరణికాంత = ఈభూకాంత; కరిరాజిన్ = దిగ్గజసంఘమును; గిరిరాజిన్ = కులాచలసంఘమును; ఆ హరిపతిన్ = ప్రసిద్ధుఁ డగు సర్పరాజైన ఆ యాది శేషుని; కిరిపతిన్ = వరాహాధిపతి యైన యాదివరాహమును; నిరాకరించి=తిరస్కరించి; అరిభేదవైభవాంచితున్ = శత్రువిదారణసంపదచే నొప్పుచున్న వానిని; అభీతున్ = భయరహితుని; కీర్తిసంపన్నున్ = కీర్తి మంతుని; మాధవక్షితిప = మాధవరాయా; నిన్నున్, చెందెన్ = పొందెను. ఇందును గ్రమముగా నన్వయము తెలియం దగినది. ఇందు శ్లేషోత్థాపితవ్యతిరేకాలంకారమును, యథాసంఖ్యాలంకారమును.

మ. భవదీయోగ్రచమూపరాగపటలా◊భ్రశ్రేణి యాదోనిధా
నవిషంబుల్ వడిఁ ద్రావ జన్యవసుధా◊నవ్యోరుడోలాధిరూ
ఢవిపక్షక్షితినాథు నూఁచు బలఝూ◊టస్థేమ చిత్రంబు మా
ధవరాయేంద్ర త్వదీయహేతి వెలికిం ◊ దార్చున్ యశఃక్షీరమున్. 70

టీక: మాధవరాయేంద్ర, భవదీయోగ్రచమూ పరాగపటలాభ్రశ్రేణి – భవదీయ = నీకు సంబంధించిన, ఉగ్రచమూ = ఉగ్రమగు సేనయొక్క, పరాగపటల = ధూళీపటల మనెడు, అభ్రశ్రేణి = మేఘపరంపర; యాదోనిధానవిషంబుల్=సముద్రసంబంధి విషములను, జలముల ననుట; వడిన్ = వేగముగా; త్రావన్ = పానము సేయఁగా; బలఝూటస్థేమ =సైన్యసంఘముయొక్క సామర్థ్యము; జన్యవసుధా నవ్యోరు డోలాధిరూఢ విపక్షక్షితినాథున్ – జన్యవసుధా = యుద్ధభూమి యనెడు, నవ్య = నూతన మును, ఉరు = గొప్పదియు నగు, డోలా = ఉయ్యేలను, అధిరూఢ = అధిష్ఠించు, విపక్షక్షితినాథున్ = శత్రురాజును; ఊఁచున్ = ఊఁచును; త్వదీయహేతి = నీఖడ్గము; యశఃక్షీరమున్ = యశస్సనెడు పాలను; వెలికిం దార్చున్ = వమనము చేయును, బయల్పఱచు ననుట; చిత్రంబు = ఆశ్చర్యము.

విషము ద్రావినవారిని పాలు ద్రాపి యుయ్యలలోనుంచి యూఁపఁగా వారు విషముతోడి పాలను గ్రక్కుట సహజమై యుండఁగా చమూపరాగము విషము ద్రావుటయు, శత్రురాజు నూఁచుటయు, ఖడ్గము పాలను కక్కుటయు, చిత్రంబని భావము. మాధవ రాయలసేనాపరాగము సముద్రముదాఁక వ్యాపించి జలము నింకు నట్లు చేసిన దనియు, శత్రువు యుద్ధభూమిని బడిపోయినాఁడనియు, ఖడ్గము మిక్కిలి ఖ్యాతిని ఘటింపఁజేసిన దనియు ఫలితార్థము. అసంగత్యలంకారము. 'విరుద్ధం భిన్నదేశత్వం కార్య హేత్వో రసంగతిః| విషం జలధరైః పీతం మూర్ఛితాః పథికాఙ్గనాః' అని చంద్రాలోకలక్ష్యలక్షణంబులు. పరాగ పటలాభ్రశ్రేణి, జన్యవసుధాడోలా, యశఃక్షీరేత్యాదులందు రూపకము.

సీ. ముకుళితపాణులై ◊వికవిక నగువారి, స్వీయాంకసంగతిఁ ◊జెంద నీదు,
తల నిల్పికొనఁ బూని ◊ తహతహపడువారి, ననురాగయుక్తిడా◊యంగఁ బోవ,
దడుగు వెట్టఁగ లేక ◊వడఁకు చుండెడివారి, స్థిరమహాధారాప్తిఁ ◊జేర్పఁ జనదు,
తృణగర్భ మగుమోము ◊దెఱచు చుండెడువారి, నెద మీఱ ముఖమంటఁ ◊గదియ దింత,

తే. మనుపదో మహస్సూనులఁ ◊ బెనుపదో న,వీనకీర్తిసంతాన మి◊వ్విపుల నౌర!
తావకీనాసిలక్ష్మి చి◊త్రప్రశస్తి, వితతగుణసాంద్ర! మాధవ◊క్షితిమహేంద్ర! 71

టీక: ఈపద్యమందు మాధవరాయాసిలక్ష్మిని బుత్రవతిఁగా నధ్యవసించి యర్థద్వయము గలుగఁ జెప్పఁ బడియె. ఏలాగనిన: ముకుళితపాణు లై = మోడ్పుఁగేలులు గలవారై; వికవిక నగువారిన్ = కకవిక నయ్యెడువారిని; స్వీయ = తనసంబంధి యైన; అంక = తొడయొక్క; సంగతిన్ = సంబంధమును; చెంద నీదు = పొందనీయదు; అతిబాల్యము గలవారై పిడికిలి పట్టుకొని వికవిక నగు శిశువుల నెత్తికొని తనతొడ మీఁదఁ గూర్చుండఁ బెట్టుకొన దని పుత్రవతీపరమైన యర్థము. ప్రణమిల్లుచు కకావికలు పడుచుండెడి శత్రువులను తన సమీపము నొందనీదు అనఁగా నట్టివారి దగ్గరకుఁ బోయి వారిని చంపదని ఖడ్గపర మైన యర్థము. తల నిల్పికొనఁ బూని = తల నిల్పుటకుఁ బ్రయత్నించి; తహతహపడువారిన్ = సంతోషపడుచున్న శిశువులను; అనురాగ యుక్తిన్ = ప్రీతితోడ; డాయంగఁబోవదు = సమీపింపఁబోవదు. తల నిల్పఁజాలక తహతహ పడు శిశువుల సమీపమునకుఁ బ్రీతితోఁ బోదని పుత్రవతీపరమైన యర్థము. యుద్ధములో శిరస్సు నిల్పుకొన వలెనని అనఁగా జీవింపవలెనని (తహతహపడు) త్వరపడు శత్రువులను డాయంగఁబోదని అనఁగా నట్టి వారిని సంహరింపదని ఖడ్గపరమైన యర్థము.

అడుగు వెట్టఁగలేక వడఁకు చుండెడివారిన్ = నడచునంత వయస్సు లేక నడవఁబోయి వడఁకుచుండెడి బాలురను; స్థిరమహాధారాప్తిన్ = స్థిరమై గొప్పది యైన స్తంభాద్యాధారముయొక్క ప్రాప్తిని; చేర్పఁ జనదు= చేర్చుటకుఁ బోవదు. నడవనేరక లేచి పడుచున్న శిశువులను స్తంభాద్యాధారములు చేర్పఁ జనదని పుత్రవతీపర మైన యర్థము. యుద్ధకాలమందుఁ బ్రాణభీతితో నడుగువెట్టఁ జాలక అనఁగాఁ బాఱిపో నుద్దేశించియు భీతితోఁ బాఱఁజాలక కంపించువారిని స్థిరమై యధికమైన (ధారా) అంచు యొక్క ఆప్తిని జేర్పంగఁ జనదు, అనఁగా అట్టివారిని తెగనఱక దని ఖడ్గపరమైన యర్థము.

తృణగర్భ మగు మోము దెఱచుచుండెడువారిన్ = అజ్ఞానముతో గడ్డిపోఁచలను నోటిలోఁ బెట్టికొని తెఱచుచుండెడు బాలురను; ఎద మీఱన్ = మనముప్పొంగఁగా; ముఖమంటన్ = ముఖము శోధించుట కనుట; కదియ దింత = ఎంతమాత్రమును చేరదు, అనఁగా కదిసి గడ్డిపోఁచలను దీయదని పుత్రవతీపరమైన యర్థము. భయమతిశయింపఁగా గడ్డి నోటఁ గఱచుకొనిన శత్రువులను సంహరింపదని ఖడ్గపరమైన యర్థము.

ఔర! వితతగుణసాంద్ర! మాధవక్షితిమహేంద్ర! ఇవ్విపులన్ = ఈభూమియందు; తావకీనాసిలక్ష్మి= నీ ఖడ్గలక్ష్మి; మహస్సూనులన్ = ప్రతాపము ప్రధానముగాఁ గల కుమారుల నని పుత్రవతీపరమైన యర్థము. సూర్యునివంటి ప్రతాపముల నని ఖడ్గపరమైన యర్థము. 'సూనుః పుత్రేఽనుజే రవౌ' అని అమరశేషము; మనుపదో = పోషింపదో? నవీనకీర్తిసంతానము = క్రొత్తనైన కీర్తి యని స్త్రీత్వనిర్దేశమునఁ గీర్తి యనెడు నాఁడు బిడ్డలయొక్క సంతానము నని పుత్రవతీపరమైన యర్థము, కల్ప వృక్షమువంటి కీర్తి నని ఖడ్గపరమైన యర్థము; పెనుపదో = పెంపదో? చిత్రప్రశస్తి = అతిచిత్రము, అనఁగాఁ దాను పుత్రులను గనుచుఁ బెంచుచు బెఱవారిబాలురు ముకుళితపాణులై వికవిక నగుచుండుట లోనగు వ్యాపారములు సేయునెడ స్వీయాంక సంగత్యాదులను జేయకుంట యాశ్చర్యం బని పుత్రవతీపరమైన భావము. మాధవరాయల ఖడ్గము శరణాగతులను, బ్రాణ త్రాణమునకై తహతహపడువారిని, బరుగెత్తిపోవ నుద్దేశించి పోలేక వడఁకుచుండెడివారిని, గడ్డిపోఁచ నోరఁ బెట్టుకొని శర ణార్థులైనవారిని సంహరింపదు. తక్కిన శత్రువుల నందఱిని ధ్వంసము చేసినదని ఖడ్గపరమైన భావము.

మ. ధరణిన్ మాధవరాయ తావకబలో॥ద్యద్రేణుపాళీకృతో
ద్ధురభావత్కమహోగ్ని బుద్ధి ప్రమ యై ॥తోఁపంగ నాన్వీక్షకీ
వరు లవ్యాప్తము ధూళి తద్బలమునం ॥బాటిల్లు ధూమధ్వజా
కరధీ యప్రమ యంచు నెంచుట లిఁకం ॥గైకొందురే యెంతయున్. 72

టీక: మాధవరాయ, ధరణిన్ =భూమియందు; తావక బలోద్య ద్రేణుపాళీ కృతోద్ధుర భావత్కమహోగ్ని బుద్ధి– తావక = నీ సంబంధియగు, బల =సైన్యమందు, ఉద్యత్ = ఎగయుచున్న, రేణుపాళీ = పరాగపంక్తిచేత, కృత = చేయఁబడిన, ఉద్ధుర = దట్టమైన, భావత్కమహోగ్ని బుద్ధి = నీసంబంధియైన ప్రతాపాగ్ని జ్ఞానము; ప్రమయై = యథార్థనుభవమై; తోఁపంగన్ = తోఁచు చుండఁగా; ఆన్వీక్షకీవరులు = తార్కికులు; ధూళి = పరాగము; అవ్యాప్తము = సాధ్యసమానాధికరణాత్యంతాభావప్రతి యోగి; తద్బలమునన్ = ఆసైన్యమందు; పాటిల్లు = ఉదయించు; ధూమధ్వజాకరధీ = వహ్ని విషయకజ్ఞానము; అప్రమ = అయథార్థజ్ఞానము, అనఁగా భ్రాన్తిరూపజ్ఞానము; అంచున్ = ఇట్లనుచు; ఎంచుటలు = అనుకొనుటలు; ఇఁకన్ = ఇఁకమీఁద; ఎంతయున్ = మిక్కిలి;కైకొందురే = గ్రహింతురా? గ్రహింప రనుట. అతార్కికులైనవారలు నీసైన్యరజ స్సున్నచోట నీప్రతా పాగ్ని యుండునన్న విషయము అయథార్థముగాఁ దెలిసికొన్నను, దర్కశాస్త్రపారీణులు తావకబలోద్యద్రేణురూపహేతువు చేత భవత్ప్రతాపాగ్ని జ్ఞానము యథార్థానుభవమై యుండఁగా ధూళి యవ్యాప్తము, ప్రతాపాగ్ని జ్ఞానము భ్రమాత్మక మనుట యంగీకరింపరని తాత్పర్యము. అతిశయోక్తి సంకీర్ణానుమానాలంకారభేదము.

సీ. శారదనారద॥సాదృశ్యము వహించి, హంసమండలి నంద॥మందఁ జేయు,
బుధవరప్రహ్లాద॥బోధకశ్రీఁ బూని, భూరిహరిచ్ఛాయఁ ॥బొలుపు మీఱు,
సామోదపుండరీ॥కాఖండరుచిఁ గాంచి, సర్వజ్ఞమతికి దో॥షము ఘటించు,
ననుపమానఘనార్జు॥నాభిఖ్య నలరారి, పాండురాజవిభూతిఁ॥బరిఢవిల్లు,
తే. నందనందనపాదార॥విందభక్తి, వాసితాశ్రయ శ్రీమాధ॥వక్షితీశ
తావకఖ్యాతికాంత య॥తాంతమగు ని,జానుకూల్యంబు దెల్లమై ॥యతిశయిల్ల. 73

టీక: నందనందనపాదారవింద భక్తివాసితాశ్రయ– నందనందనపాదారవింద= శ్రీకృష్ణపాదపద్మములయొక్క, భక్తివాసిత= భక్తులకనుట, ఆశ్రయ = ఆశ్రయుఁడైన; శ్రీమాధవక్షితీశ = శ్రీమాధవభూపాలుఁడా! తావకఖ్యాతికాంత = నీ కీర్తికాంత; అతాంతమగు నిజానుకూల్యంబు– అతాంతమగు = అమ్లానమగు, అనఁగా ప్రకాశించునది యనుట, నిజానుకూల్యంబు = స్వీయానుకూల్యము; తెల్లమై = వ్యక్తమై, అతిశయిల్లన్ =విజృంభించునట్లుగా; శారదనారదసాదృశ్యము = నూతనమగు నారదమహర్షియొక్క సామ్యమును, ' శారదః పీతమన్దే నాప్రత్యగ్రేఽభినవే త్రిషు' అని హలాయుధము; వహించి=పొంది; హంస = యతులయొక్క; మండలిన్ = సమూహమును, హంస,పరమహంస, కుటీచక, బహూదకు లని యతులలో నాల్గు భేదములు; నందము = ఆనందమును; అందఁ జేయున్ = పొందఁజేయును; నారదమహర్షిసాదృశ్యము నొంది యతుల కానందము గలుగఁజేయు నని యర్థము. శరత్కాలమేఘముయొక్క సాదృశ్యమును వహించి రాయంచలగుంపు నంద

మందునట్లు చేయు నని భావము. రాయంచలు వార్షుకమేఘమునకు వెఱచుటయు, శారదమేఘమునకు సంతసించుటయు కవికులప్రసిద్ధంబు.

బుధవరప్రహ్లాదబోధకశ్రీఁబూని– బుధవరప్రహ్లాద = బుధశ్రేష్ఠుం డగు ప్రహ్లాదునియొక్క, బోధకశ్రీఁబూని = జ్ఞానసంపదను బూని, ఇట బోధశబ్దముమీఁద స్వార్థమందు కప్రత్యయము; భూరి = అధికమగు; హరిచ్ఛాయన్ = విష్ణుమూర్తియొక్క నీడ చేత, పక్షపాతముచేత ననుట; పొలుపు మీఱున్ = ఒప్పుమీఱును; ప్రహ్లాదుని జ్ఞానసంపదను వహించి విష్ణుమూర్తిచ్ఛాయ నొప్పు నని యర్థము. బుధవరులయొక్క (అనఁగా పండితోత్తములయొక్క) ప్రహ్లాదమును బోధించు శ్రీఁబూని సింహముయొక్క కాంతి చేతఁ బొలుపుమీఱు నని భావము.

సామోదపుండరీకాఖండరుచిన్ = సంతసముతోఁ గూడిన పుండరీకుఁడను నొక విష్ణుభక్తునియొక్క యఖండరుచిని; కాంచి = వహించి; సర్వజ్ఞమతికిన్ తోషము ఘటించున్ =అనఁగా సర్వజ్ఞపదము యోగవృత్తిచే విష్ణుమూర్తిని బోధించును గాన విష్ణు మనస్సున కానందముఁ గలుగఁజేయు నని యర్థము. పరిమళముతోఁ గూడిన తెల్లదామరలకాంతి నొంది యీశ్వరునియొక్క మనస్సున కానందము ఘటించు నని భావము. శివుఁడు పుండరీకప్రియుఁ డగుట స్పష్టము.

అనుపమానఘనార్జునాభిఖ్య నలరారి = అసమానము ఘనమును నైన యర్జునునియొక్క కాంతిచేత నలరారి; పాండురాజ విభూతిఁ బరిఢవిల్లున్ = పాండురాజుయొక్క యైశ్వర్యముతో నొప్పియుండు నని యర్థము. అర్జునాభిఖ్య నలరారినపుడు అతనితండ్రి యగు పాండురాజుయొక్క విభూతితోఁ బరిఢవిల్లుట స్పష్టము. అనుపమానము, ఘనము నగునట్లుగా (అర్జున మనఁగా) శుభ్ర మైనది యని పేరొంది (పాండురాజు) తెల్లనిచంద్రునియొక్క విభూతితోఁ బరిఢవిల్లు నని భావము. ఇట్లు నీవు నందనందనపాదారవిందభక్తివాసితుల కాశ్రయమై యున్న వాఁడవు కాన నీకీర్తియు నారద ప్రహ్లాద పుండరీ కార్జునాది భాగవతో త్తముల భంగి నలరి హంసాదుల కానంద మందఁజేయుచు నీయానుకూల్యవర్తనతో రాజిల్లు నని యభిప్రాయము. నీకీర్తి శర త్కాలమేఘాదులతోఁ దులతూగి యున్నదని ఫలితార్థము. ఇందు శ్లేషసంకీర్ణోపమాలంకారము.

సీ. భూరిప్రకంపన॰స్ఫూర్తి గ్రక్కున లేచి, పటుతరరథచక్ర॰భంగ మూన్చి,
పరమస్తకోద్దేశ॰పదవికి నెగఁబ్రాఁకి, తద్ఘనాఖ్యామృత॰ధారఁ గ్రోలి,
యతనుసంగరమాప్తి ॰యంటువాయఁగఁ జేసి, యాత్మైకచింతనా॰యతిఁ దవిల్చి,
యచలయోగస్థేమ ॰మలవడఁగాఁ దీర్చి, కన్నుల నీరొల్కఁ॰గా ఘటించి,
తే. సురుచిరాహారముల్ మాన్పి, ॰పరమశక్తి
భవదసిభుజంగి జటిలతా॰పదవిహార
విభవములఁ గూర్చెఁ బరహంస॰వితతి కెల్లఁ
దనర మాధవరాయ! స॰త్సాంపరాయ! 74

టీక: సత్సాంపరాయ = న్యాయయుద్ధము గల; మాధవరాయ = మాధవప్రభుపుంగవుఁడా! తనరన్ = ఒప్పునట్లు; పరమశక్తి భవదసిభుజంగి = పరమశక్తిస్వరూప మగు నీఖడ్గ మనెడు కుండలిని; పరహంసవితతి కెల్లన్ = శత్రుశ్రేష్ఠసంఘమున కెల్లను అని ఖడ్గపరమైన యర్థము, శ్రేష్ఠులగు యతులయొక్క సంఘమున కెల్ల నని కుండలినీశక్తిపరమైన యర్థము; భూరి = అధికమైన;

ప్రకంపన= చలనముయొక్క; స్ఫూర్తిన్ = ప్రకాశము చేత; గ్రక్కున లేచి = వేగముగ లేచి; పటుతర = దృఢతరములైన; రథ = స్యందనములయొక్క; చక్ర = కండ్లయొక్క; భంగ మూన్చి = భంగము సేసి, అని ఖడ్గపరమైన యర్థము. అధికమగు ప్రాణా యామ నిబద్ధ వాయువుయొక్క స్ఫూర్తిచే గ్రక్కున లేచి దృఢతరదేహసంబంధి మూలాధారాదిచక్రములయొక్క భంగమూన్చి యని శక్తిపరమైన యర్థము.

పర = శత్రువులయొక్క; మస్తకోద్దేశపదవికిన్ = శిరస్థానమునకు; ఎగఁబ్రాఁకి = ఎక్కి; తద్ఘనాఖ్యామృత ధారన్ – తత్ = ఆ శత్రువులయొక్క, ఘన = అధికమగు, ఆఖ్యా = యశ మనెడు, అమృతధారన్ = సుధారసమును; క్రోలి = పానము సేసి, అని ఖడ్గపరమైన యర్థము. ఉత్కృష్టమగు శిరస్థానమున కెక్కి ప్రసిద్ధమగు ఘన మను పేరు గలిగిన సహస్రారసుధను గ్రోలి యని శక్తిపరమైన యర్థము.

అతనుసంగరమాప్తి యంటున్ –అతను = అధికమగు; సంగర = యుద్ధసంబంధి యైన; మా = లక్ష్మి యొక్క; ఆప్తి = ప్రాప్తి యొక్క; అంటు = సంపర్కమును; పాయఁగఁ జేసి = లేకుండఁజేసి; ఆత్మైకచింతనాయతిన్ – ఆత్మ = తనయొక్క, అనఁగా ఖడ్గముయొక్క, ఏక = ముఖ్యమగు, చింతనా = స్మరణముయొక్క, ఆయతిన్ = అతిశయమును; తవిల్చి = కూర్చి, అని ఖడ్గపరమైన యర్థము. అధికమైన సంగముయొక్క రమయొక్క ఆప్తిని లేకుండఁజేసి బ్రహ్మముయొక్క ముఖ్య మగు ధ్యానాతి శయము ఘటింపఁజేసి యని శక్తి పరమైన యర్థము.

అచలయోగస్థేమము –అచల = పర్వతములయొక్క; యోగ = సాంగత్యమందలి; స్థేమము = స్థైర్యమును; అలవడఁగాఁ దీర్చి = తగు నట్లుగాఁ జేసి; కన్నుల నీరొల్కఁగా ఘటించి=దుఃఖముచేతఁ గన్నుల నీ రొల్కునట్లు చేసి యని ఖడ్గ పరమైన యర్థము. చలింపని యోగమందు స్థైర్యమును తగున ట్లొనరించి, యానందముచేతఁ గన్నుల నీ రొల్కునట్లు చేసి యని శక్తిపరమైన యర్థము.

సురుచిరాహారముల్ మాన్పి = మనోహరములగు నాహారములు మానునట్లు చేసి, అరణ్యవాసముచేత శత్రురాజులకు, యోగు లకును ఫలమూలాదులే యాహారంబులు గావున నిరుపక్షములయందును నిదే యర్థము. జటిలతాపదవిహారవిభవములన్ – జటి = జువ్విచెట్లయొక్క, 'ప్లక్షో జటీ పర్కటీ స్యాత్' అని యమరుఁడు, లతా = తీవెలయొక్క, పద = స్థానములయందలి, విహార = విహరణముయొక్క, విభవములన్ = సంపదలను, కూర్చెన్ అని ఖడ్గపరమైన యర్థము. జటిలతా = జటాధారిత్వ మనెడు, పద = చిహ్నముచేత, విహారవిభవముల నని శక్తిపరమైన యర్థము.

మాధవరాయలవారిఖడ్గము గ్రక్కున లేచి శత్రురాజుల రథచక్రాదులను భంగము చేసి, వారితలపై కెక్కి వారి యశంబును గొని యనఁగా వారి నోడించి ఖ్యాతి గాంచి, వారలు యుద్ధలక్ష్మీచింత పోయి తన (ఖడ్గ)చింతయే ముఖ్యముగాఁ గలిగి యడ వులపాలై దుఃఖముతోఁ గన్నీ రొలుకఁగా మృష్టాన్నాహారము లేక వృక్షలతాగుల్మాదిప్రదేశములలోఁ జేరునట్లు చేసె ననియు, నది చూడఁగా యోగాభ్యాసము సేయువారల మూలాధారనిలయ యగు కుండలిని యను శక్తి ప్రాణాయామనిబద్ధవాయువుచే గ్రక్కున లేచి మూలాధారాదిచక్రభంగ మొనర్చి శిరస్థానమందు సహస్రారసుధను గ్రోలి సర్వసంగపరిత్యాగము, బ్రహ్మాను సంధానము గల్గఁ జేయుచు నిశ్చలయోగముతో నానందబాష్పము లొల్కఁగా వార లాహారములు మాని జటాధారు లై యడ వులలో విహరించునట్లు చేసినభంగి నున్న దనియు భావము. ఇందు శ్లిష్టపరంపరితరూపకాలంకారము.

తే. విబుధశిక్షితుఁడవు, శాస్త్రవిదుఁడ, వఖిల
కావ్యవేదివి, ఘనతార్కికవ్యవహృతి
నెఱుఁగుదువు, నీ కసాధ్యమే యింపు మీఱఁ
గృతి వినిర్మింపుము మాధవక్షితిప యనిరి. 75

టీక: మాధవక్షితిప, నీవు విబుధశిక్షితుఁడవు, అలంకారాది సర్వశాస్త్రముల నెఱిఁగినవాఁడవు, అఖిలకావ్య వేదివి, ఘనమైన తర్క శాస్త్రసంబంధి యైన వ్యవహారము నెఱుఁగుదువు, నీకుఁ బుండరీకాక్షనిదేశానుసారముగఁ గృతి నిర్మించుట యసాధ్యంబు గాదు కావున నింపుమీఱఁ గృతి నిర్మింపు మని బుధజనంబు లమందానందకందళితహృదయారవిందులై యని రని పూర్వము వ్రాసిన వచనముతో నన్వయము.

వ. అనిన నేను బరమానందకందళితహృదయారవిందుండనై. 76

షష్ఠ్యంతములు

క. భాషాధిప శేషాహిప
భాషాభూషాయితాత్మపటుగుణతతికిన్
దోషాచరదోషాచర
దోషాచరచక్రకలితదోర్బలభృతికిన్. 77

టీక: భాషాధిప = బ్రహ్మయొక్కయు; శేషాహిప = ఆదిశేషునియొక్కయు; భాషా = వాణికి; భూషాయిత = అలంకారప్రాయ మగు; ఆత్మ = తనయొక్క; పటు = శ్రేష్ఠములగు; గుణ = అనంతకల్యాణగుణములయొక్క; తతికిన్ = సమూహము గల వానికి; దోషాచర దోషాచర దోషాచర చక్ర కలిత దోర్బల భృతికిన్ – దోష = పాపములను, ఆచర = మిక్కిలి ఆచరించు చున్న, దోషాచర = రక్కసులయొక్క, దోషా = భుజములకు, 'దోర్దోషా చ భుజా బాహు' అని హలాయుధనిఘంటువు, చర = ఖండించెడు, చక్ర = సుదర్శనముచేత, కలిత = ఒప్పుచున్న, దోర్బల = బాహుబలముయొక్క, భృతికిన్ = భరణము గల వానికి. దీని కర్పితముగ నొనర్తు నను దానితో నన్వయము. ముందు నిట్లు చూడవలయు.

క. కోపాయితపాపాయత
భూపాయితదనుజమథనపూజితమతికిన్
గోపాలనగోపాలన
గోపాలననిబిడరతికి గోహితకృతికిన్. 78

టీక: కోపాయిత పాపాయత భూపాయిత దనుజమథన పూజితమతికిన్ – కోప = కోపముచేత, ఆయిత = పొందఁబడిన, అయ గతౌ' అను ధాతువుమీఁద క్తప్రత్యయము, పాప = పాపములచేత, ఆయత = అధికులగు, భూపాయిత = రాజులవలె

నాచరించుచున్న, దనుజ = రాక్షసులయొక్క, మథన = నాశనముచేత, పూజిత = శ్లాఘ్యమైన, మతికిన్ = బుద్ధిగలవానికి; గోపాలన గోపాలన గోపాలన నిబిడ రతికిన్ – గోప = రాజులకు, గొల్లలకు, 'గోపాశ్చ గోపాశ్చ గోపాః' అని యేకశేషము, అలన = అలంకారకరమగు, గోపాలన = భూపాలనమందు, గోపాలన = గోవుల పాలనమందు, నిబిడ = దట్టమైన, రతికిన్ = ఆసక్తిగలవానికి; గోహితకృతికిన్ – గో = స్వర్గమునకు, హిత = అనుకూలమగు, కృతికిన్ = వ్యాపారముగలవానికి, 'స్వర్గేషు పశు వా గ్వజ్ర దిఙ్నేత్ర ఘృణి భూ జలే, లక్ష్యదృష్ట్యా స్త్రియాం పుంసి గౌః' అని యమరుఁడు.

క. కమలాసజనకనాభికిఁ
గమలన్మోహాంధతమస◊కమలాంకునకుం
గమలాలయకమలాలయ
కమలాలయశయనభృతికిఁ ◊ గాంతాకృతికిన్. 79

టీక: కమలాస జనక నాభికిన్ – కమలాస = బ్రహ్మకు, జనక = ఉత్పాదకమగు, నాభికిన్ = నాభిగలవానికి; కమలన్మోహాంధ తమస కమలాంకునకున్ – క = ఆత్మకు, మలత్ = పాతకమువలె నాచరించుచున్న, మోహ = అజ్ఞాన మనెడు, అంధతమస = కటికచీఁకటికి, కమలాంకునకున్ = మృగాంకునకు; కమలాలయ కమలాలయ కమలాలయ శయన భృతికిన్ – కమలా = లక్ష్మీదేవికి, ఆలయ =స్థానమగు, కమలాలయ = సముద్రముయొక్క, కమల = ఉదకమందు, అలయ = వినాశములేనట్లు, శయన = శయనముయొక్క, భృతికిన్ = భరణముగలవానికి; కాంతాకృతికిన్ = మనోహరాకారముగలవానికి.

క. శరణాగతపరిరక్షణ
చరణప్రవణాత్మచిత్త◊సరసీజునకున్
నరకాహితనరకాహిత
నరకాహితబాణతతికి ◊నరసారథికిన్. 80

టీక: శరణాగత పరిరక్షణ చరణ ప్రవణాత్మ చిత్త సరసీజునకున్ – శరణాగత= శరణమును బొందినవారియొక్క, పరిరక్షణ = పాలనముయొక్క, చరణ = ఆచరణమందు, ప్రవణ = అభిముఖ మైన, ఆత్మ = తనయొక్క, చిత్త = మానస మనెడు, సరసీజునకున్ = కమలము గలవానికి; నరకాహిత నరకాహిత నరకాహిత బాణతతికిన్ – నరక = నిరయమునకు, అహిత = శత్రువులగు, అనఁగాఁ బుణ్యాత్ములగు, నరక = నరులకు,స్వార్థమందు కప్రత్యయము, అహిత = అహితుఁడగు, నరక = నరకాసురునకు, అహిత = విరోధులగు, బాణతతికిన్ = బాణములయొక్క సముదాయము గలవానికి; నరసారథికిన్ = అర్జునునిసారథియైనవానికి.

క. శ్రీవాసజ్జటప్రోలీ, భావుకపత్తనవిహార◊పటుశీలునకున్
గోవర్ధనగోవర్ధన, గోవర్ధనవృష్టిహృతికి ◊గోపాలునకున్. 81

టీక: శ్రీవాస జ్జటప్రోలీ భావుక పత్తన విహార పటు శీలునకున్ – శ్రీ = లక్ష్మీదేవికి, వాసత్ = నివాసమువలె నాచరించుచున్న, జటప్రోలీ = జటప్రోలనెడు, భావుక = భవ్యమగు, పత్తన = పురియందు, విహార = విహారమందు, పటు = సమర్థమైన, శీలున కున్ = స్వభావము గలవానికి; గోవర్ధన గోవర్ధన గోవర్ధన వృష్టి హృతికిన్ – గోవర్ధన = ఆవుల వృద్ధి నొందించెడు, గోవర్ధన = గోవర్ధనగిరియొక్క, గో = భూమికి, 'సమాసాన్తవిధి రనిత్యః' అనుటచేత సమాసాంతప్రత్యయము రాదయ్యె, వర్ధన = నాశక మగు, వృష్టి = వర్షముయొక్క, హృతికిన్ = హరణము గలవానికి; గోపాలునకున్ = మదనగోపాలస్వామికి.

కథాప్రారంభము

వ. అర్పితంబుగా నాయొనర్పం బూనిన చంద్రికాపరిణయం బను మహాప్రబంధంబునకుం గథాక్రమం బెట్టి దనిన.

ఉ. శ్రీ నిరు వొంది నైమిశము ◊సెన్నగు నందు నిజామలాశయా
లానదృఢావబద్ధకమ◊లావరదంతులు శౌనకాది మౌ
నీనులు సూతజుం బలికి ◊రేనృపుఁ డేలె ధర న్నిరీతిగా
నానృపుఁ దెల్పు మన్న నతఁ ◊డాయతకౌతుకపూరితాత్ముఁ డై. 83

టీక: నైమిశము = నైమిశారణ్యము; శ్రీన్ = శోభావిశేషముచేత; ఇరు వొంది = స్థిరత నొంది; చెన్నగున్ = ప్రకాశించును; అందున్ = ఆయరణ్యమందు; నిజామలాశయాలాన దృఢావబద్ధ కమలావర దంతులు - నిజ = స్వకీయ మైన, అమల = స్వచ్ఛ మైన, ఆశయ = హృదయ మనెడు, ఆలాన = బంధస్తంభమందు, 'ఆలానం బంధస్తంభే' అని యమరుఁడు, దృఢ = స్థిరమౌ నట్లు, అవబద్ధ = కట్టఁబడిన, కమలావర = విష్ణుమూర్తి యనెడు, దంతులు = గజము గలవారలు; శౌనకాది మౌనీనులు=శౌన కాదిమునిరాజులు; సూతజున్ = సూతునిఁ గూర్చి; పలికిరి = వచించిరి; ఏనృపుఁడు = ఏరాజు; ధరన్ = భూమిని; నిరీతిగాన్ = ఈతిబాధారహిత మగునట్లుగా; ఏలెను=పాలించెనో; ఆనృపున్=ఆరాజును; తెల్పుమన్నన్, అతఁడు = ఆ సూతుఁడు; ఆయత కౌతుక పూరితాత్ముఁ డై = విస్తార మైన కుతూహలముచే నిండినహృదయము గలవాఁ డై; పలికెన్ అని యుత్తరపద్యస్థక్రియతో నన్వయము. ఇం దశ్లిష్టపరంపరితరూపకము. 'శ్లో. తత్పరం పరితం శ్లిష్టే వాచకే భేదభాజి వా' అని కావ్యప్రకాశము నందుఁ దల్లక్షణము.

శా. సారాక్షీణకలాకలాపనిధి యై, ◊చక్రప్రియంభావుక
శ్రీరమ్యాకృతి యై, దినేశకులల◊క్ష్మీమూల మై, యుద్ధరా
భారం బూనె సుచంద్రసంజ్ఞ నొకభూ◊పాలాగ్రగణ్యుండు ద
చ్చారిత్రంబు వచింతు నంచుఁ బలికెన్ ◊జంచద్వచోవైఖరిన్. 84

టీక: ఒకభూపాలాగ్రగణ్యుండు = ఒక రాజశ్రేష్ఠుండు; సారాక్షీణ కలా కలాప నిధి యై– సార = శ్రేష్ఠ మగు, అక్షీణ = తక్కువ గాని, కలా = చతుష్షష్టివిద్యలయొక్క, షోడశకలలయొక్కయని యర్థాంతరము, కలాప = సమూహమునకు, నిధి యై = నివాస మై; చక్ర = రాష్ట్రములకు, జక్కవలకు; ప్రియంభావుక = ప్రియ మగు; శ్రీ = సంపదచేత, కాంతిచేత; రమ్య = రమ్య మగు; ఆకృతి యై = ఆకృతి గలవాఁడై; దినేశ =సూర్యునియొక్క, సూర్యులయొక్క (ద్వాదశాదిత్యులయొక్క యనుట) కుల = వంశముయొక్క, సమూహముయొక్క; లక్ష్మీ = సంపదకు, కాంతికి; మూల మై =ఆధార మై; సుచంద్రసంజ్ఞన్ = సుచంద్రుం డను పేరిచేతను, సమీచీన మైన చంద్రుండను పేరిచేత నని యర్థాంతరము, అనఁగాఁ బ్రసిద్ధచంద్రుండు క్షీణకలా కలాపనిధియు, చక్రవాకాప్రియకారిశ్రీరమ్యుండు, దినేశమూలకలక్ష్మియు నగువాఁడు. మఱి యీరాజో అక్షీణకలాకలాపనిధి, చక్రప్రియం భావుక శ్రీరమ్యాకృతి, దినేశకులలక్ష్మీమూలము, కావున (సు)మంచిచంద్రుం డను పేరిచేత నని యాశయము. ఇద్ధరాభారంబు = ఈ భూభారమును; ఊనెన్ = వహించెను; తచ్చారిత్రంబు = ఆ సుచంద్రనరేంద్రుని చరితమును; వచింతు నంచున్ = చెప్పుదు ననుచు; చంచద్వచోవైఖరిన్= ప్రకాశించుచున్న వాగ్వైఖరిచేత; పలికెన్ = వాక్రుచ్చెను. ఇటఁ బ్రసిద్ధచంద్రాధిక్యము సుచంద్రునియందుఁ దోఁచుచున్నది గాన యుపమేయాధిక్యపర్యవసాయి శ్లేషోత్థాపితవ్యతిరేకాలంకారము. 'శ్లో. వ్యతిరేకో విశేష శ్చేదుపమానోపమేయయోః' అని తల్లక్షణము.

సీ. వరగుణసన్మణి◊వ్రాతసంలబ్ధిచే, శ్రితమహీభృద్వర్య◊వితతిచేత,
విచరద్ఘనాఘన◊ప్రచయవిస్ఫూర్తిచే, విమలచక్రిప్రచా◊రములచేతఁ,
బటువేగవన్మహా◊భంగకాండములచే, ఘనవాహినీసము◊త్కరముచేత,
సాంద్రనానావన◊చక్రసంప్రాప్తిచే, నసమరాజీవనే◊త్రాళిచేత,
తే. నలరులచ్చికిఁ బుట్టిని◊ల్లన ననర్ఘ్య,శైలరిపునీలమయసాల◊సామజేంద్ర
కలితసితపద్మకచ్చంద్ర◊కామినీక,లాపరుచిరంబు శ్రీ విశా◊లాపురంబు. 85

టీక: ఈపద్యమందు విశాలాపురవిషయక మైన యర్థము, సముద్రపరమైన యర్థాంతరముం దోఁచుచున్నది. ఏలాగనిన: అనర్ఘ్య శైలరిపునీలమయ సాల సామజేంద్ర కలిత సిత పద్మక చ్చంద్రకామినీ కలాప రుచిరంబు– అనర్ఘ్య = అమూల్యము లగు,శైలరిపునీలమయ = ఇంద్రనీలమణిమయమగు, సాల = ప్రాకారములయందలి, సామజేంద్ర = గజశ్రేష్ఠములందు, కలిత = ఒప్పుచున్న, సిత = తెల్లనైన, పద్మకత్ = బిందుజాలక మనఁగా నేనుఁగులపై నున్న తెల్లనిచుక్కలు, వానివలె నాచరించు చున్న, చంద్రకామినీ = నక్షత్రములయొక్క, కలాప = సంఘముచేత, రుచిరంబు = మనోహరమగు; శ్రీ విశాలాపురంబు = సంపద్యుక్తమైన విశాలాపురము; వరగుణ సన్మణి వ్రాత సంలబ్ధిచేన్– వరగుణ = శ్రేష్ఠగుణములు గల, సన్మణి = పండితోత్తముల యొక్క, వ్రాత = సంఘముయొక్క, సంలబ్ధిచేన్ = ప్రాప్తిచేతను, శ్రేష్ఠములగు గుణములు గల మంచి మణిసంఘములయొక్క ప్రాప్తిచేత నని సముద్రపరమైన యర్థము; శ్రిత మహీభృద్వర్య వితతిచేతన్– శ్రిత = ఆశ్రయించిన, మహీభృద్వర్య = రాజశ్రేష్ఠులయొక్క, వితతిచేతన్ = సంఘముచేత, ఆశ్రయించిన పర్వతములయొక్క గుంపుచేత నని సముద్రపరమైన యర్థము; విచర ద్ఘనాఘన ప్రచయ విస్ఫూర్తిచేన్– విచరత్ = మిక్కిలి చరించుచున్న, ఘనాఘన = మదపుటేనుఁగులయొక్క, ప్రచయ = సమూహముయొక్క, విస్ఫూర్తిచేన్ = ప్రకాశముచేతను, చరించుచున్న వర్షించునట్టి మేఘముల సమూహములయొక్క

విస్ఫూర్తిచేత నని సముద్రపరమైన యర్థము; విమల చక్రి ప్రచారములచేతన్ – విమల = నిర్మలములగు, చక్రి = రథముల యొక్క, ప్రచారములచేతన్ = సంచారములచేతను, నిర్మలమైన విష్ణుమూర్తియొక్క సంచారములచేత నని సముద్రపరమైన యర్థము;

పటు వేగవ న్మహాభంగ కాండములచేన్ – పటు = సమర్థములై, వేగవత్ = వేగయుక్తములై, మహత్ = గొప్పలై, అభంగ = అప్రతిహతములైన, కాండములచేన్ = అశ్వములచేత, అతివేగముగల తరంగములగుంపులచేత నని సముద్రపరమైన యర్థము, 'కాండో౽స్త్రీ దణ్డ బాణార్వ వర్గావసర వారిషు' అని యమరుఁడు; ఘన వాహినీ సముత్కరముచేతన్ – ఘన = అధికమైన, వాహినీ = సేనలయొక్క, సముత్కరముచేతన్ = సముదాయముచేత, అధికములైన నదీసంఘములచేత నని సముద్రపరమైన యర్థము;

సాంద్ర నానా వన చక్ర సంప్రాప్తిచేన్–సాంద్ర = దట్టములైన, నానా = అనేకప్రకారములగు, వన = ఉద్యానములయొక్క, చక్ర = సంఘములయొక్క, సంప్రాప్తిచేన్ = లాభముచేతను, సాంద్రములై యనేకవిధములైన జలావర్తములయొక్క సంప్రాప్తిచేత నని సముద్రపరమైన యర్థము; అసమ రాజీవనేత్రాళిచేతన్ – అసమ = అసమాన లగు, రాజీవనేత్రా = పద్మనేత్రలయొక్క, ఆళి చేతన్ = సంఘముచేతను, అసమానమైన (రాజీవనేత్ర) మీనశ్రేష్ఠములయొక్కగణముచేత నని సముద్రపరమైన యర్థము, 'రాజీవ శ్శకుల స్తిమిః' అని యమరము; లచ్చికిన్ = లక్ష్మీదేవికి; పుట్టినిల్లనన్ = జన్మస్థాన మన్నట్లుగా, సముద్ర మన్నట్లుగా; అలరున్ = ఒప్పారును; ఇట సంబం ధాతిశయోక్తి శ్లేషోత్ప్రేక్షాలంకారములు గలుగు.

సీ. వరణాబ్జరాగభా౹వ్యాజబాలాతపా,నిశజృంభితవియద్ధు౹నీసలిలము,
సౌధవజ్రచ్ఛవి౹చ్ఛలచంద్రికావియో,జితలేఖకేళివే౹శ్మతలసరము,
స్వస్తికనీలత్వి౹షామిషఘనదత్త, కేకాస్వనస్వన౹త్కృతకనగము,
రథ్యావలభితార్క్ష్య౹రత్నశోభాకూట,యవసార్పితామోద౹కార్కరథము,
తే. భర్మకేతుపటాంచల౹పవనగళద,నంతకుహనమధురసాఫ౹లాళిఖాద
నాశయోత్పతదతులకీ౹రాభిరామ,గోపురము మించు నిల విశా౹లాపురంబు. 86

టీక: వరణాబ్జరాగ భా వ్యాజ బాలాత పానిశ జృంభిత వియద్ధునీ సలిలము – వరణ = ప్రాకారములయొక్క, 'ప్రాకారో వరణ స్సాలః' అని యమరుఁడు, అబ్జరాగ =పద్మరాగమణులయొక్క, భా = కాంతి యనెడు, వ్యాజ = నెపము గలిగిన, బాలాతప = లేయెండచేత, అనిశ = ఎల్లప్పుడును, జృంభిత = వికసింపఁజేయఁబడిన, వియద్ధునీ = స్వర్గంగయందలి, సలిలము = జలము గలది, అనఁగా లక్షణచేత సురనదీజలగతపద్మములు బోధితము లగుచున్నవి గాన యెల్లపుడు వికసింపఁజేయఁబడిన వియ ద్ధునీసలిలగతపద్మములు గల దని యాశయము;

సౌధ వజ్ర చ్ఛవి చ్ఛల చంద్రికా వియోజిత లేఖ కేళివేశ్మ తల సరము – సౌధ = మేడలయొక్క, వజ్ర = వజ్రములయొక్క, ఛవి = కాంతి యనెడు, ఛల = వ్యాజము గల, చంద్రికా = వెన్నెలచేత, వియోజిత = ఎడఁబాటు గలదిగాఁ జేయఁబడిన, లేఖ = దేవతలయొక్క,కేళివేశ్మ= క్రీడాగృహములయొక్క, తల = ప్రదేశములయందలి, సరము = సరస్సులు గలది, అనఁగా సరోగత చక్రవాకములు గల దని లక్షణచేత నర్థము చేయవలయు.

స్వస్తిక నీల త్విషా మిష ఘన దత్త కేకాస్వన స్వన త్కృతకనగము – స్వస్తిక = సౌధవిశేషములయొక్క, ‘స్వస్తిక స్సర్వతో భద్రః’ అని యమరుఁడు, నీల = ఇంద్రనీలమణులయొక్క, త్విషా = కాంతి యనెడు, మిష = నెపము గల, ఘన = మేఘము చేత, దత్త = ఇయ్యఁబడిన, కేకాస్వన = కేక యను ధ్వనిచేత, స్వనత్ = ధ్వని చేయుచున్న, అనఁగాఁ గేకాభిన్న స్వనము చేయు చున్న యనుట, కృతకనగము = కృత్రిమపర్వతములు గలది, ఇచటను బూర్వరీతిగఁ గృతకనగస్థమయూరములు గల దని లాక్షణికార్థము చేయవలయు;
రథ్యా వలభి తార్క్ష్యరత్న శోభా కూట యవ సార్పి తామోద కార్కరథము – రథ్యా = రాజవీథులయందున్న, వలభి = చంద్ర శాలలయొక్క, తార్క్ష్యరత్న = గరుడపచ్చలయొక్క, శోభా=కాంతి యనెడు, కూట= నెపము గల, యవస=పచ్చికయందు, అర్పిత = ఉంపఁబడిన, ఆమోదక = సంతసము గల, అర్కరథము = సూర్యరథము గలది, అనఁగాఁ బూర్వరీతిగ సూర్యరథా శ్వములు గలదని లాక్షణికార్థము;
భర్మ కేతు పటాంచల పవన గళ దనంత కుహన మధురసాఫలాళి ఖాద నాశ యోత్పత దతుల కీరాభిరామ గోపురము – భర్మ = స్వర్ణమయములగు, కేతు = టెక్కెములయొక్క, పటాంచల = వస్త్రాగ్రభాగములయొక్క, పవన = వాయువుచేత, గళత్ = జాఱుచున్న, అనంత = ఆకాశ మనెడు, అనఁగాఁ బూర్వరీతిగా లక్షణచే నాకాశస్థనక్షత్రము లనెడు అని యర్థము, కుహన = కాపట్యము గల, మధురసాఫల = ద్రాక్షాఫలములయొక్క, ఆళి = బంతియొక్క, ఖాదన = భక్షణమందు, ఆశయ = అభిప్రాయముచేత, ఉత్పతత్ = మీఁది కెగయుచున్న, అతుల = సాటిలేని, కీర = చిలుకలచేత, అభిరామ = ఒప్పుచున్న, గోపు రము = పురద్వారము గలదియునై, విశాలాపురంబు, ఇలన్ = భూమియందు; మించున్ = అతిశయించును.

ఇట వియద్ధునీసలిల లేఖకేళీవేశ్మతలసరఃకృతకనగార్కరథానంతములకు బాలాతపానిశవికసన చంద్రికావియోజన ఘన దత్తకేకాస్వాన యవసార్పితామోద పటాంచలపవనపతనములు సంభవింపమి లక్షణావృత్తి నాశ్రయించి తద్గతములగు పద్మాదులు చెప్పఁబడియె. లక్షణ యనఁగా శబ్దవృత్తులలోనొకటి. శబ్దవృత్తులు శక్తి లక్షణ వ్యంజన యని మూఁడు. వీని స్వరూ పములు భేదములు ‘శ్లో. సామన్తనగరా ణ్యుచ్చై రాక్రోశన్తి సమన్తతః’ ఇది లోనగు లక్ష్యములు ప్రతాపరుద్రీయాదులయందు విస్తరముగ నిర్ణయింపఁబడిన వనియు, నిట వ్రాయుట యనవసర మనియు, సంక్షేపింపఁబడియె. అలంకారము లిందుఁ గైతవా పహ్నుతి సంబంధాతి శయోక్తిభేదములు.

చ. కలిమినెలంతకై నలువ ఱింగాంచిన మేటివిచిత్రశక్తి రా
జిలఁ బరరాజభీకరతఁ జెన్నలరన్ సృజియించినట్టి యు
జ్జ్వలజలజంబు నాఁగఁ బురి వజ్రమణీవరణం బగడ్త యు
న్కొలఁకున నొప్పుఁ దేఁటిసొబఁగుం గని పైగగనంబు దోఁపఁగన్. 87

టీక: నలువ = బ్రహ్మదేవుఁడు; కాంచినమేటి విచిత్రశక్తి రాజిలన్ = అభ్యసించిన యుత్కృష్టమై యాశ్చర్యకర మగు సామ ర్థ్యము ప్రకాశించునట్లుగా; పరరాజభీకరతన్ = శత్రురాజభీకరతచేత; శ్రేష్ఠమగు చంద్రునకుభీకరతచేత; చెన్నలరన్ = ఒప్పు నట్టుగా; కలిమినెలంతకై = లక్ష్మీదేవికై; సృజియించినట్టి యుజ్జ్వలజలజంబు నాఁగన్ = రచియించిన ప్రకాశమానమగు పద్మ

మనునట్లుగా; పురిన్ = పట్టణమునందు; వజ్రమణీవరణంబు = వజ్రమణిరచిత మగు ప్రాకారము; అగడ్త యన్కొలఁకునన్ = అగడ్త యను కొలనియందు; పై గగనంబు = మీఁది యాకాశము; తేఁటిసొబగుం గని = తుమ్మెదయందము నొంది; తోఁపఁగన్ = తోఁచుచుండఁగా; ఒప్పున్ = ఒప్పును. ఉత్ప్రేక్షాలంకారము.

మ. పురసాలంబు నిజాఖ్యపెంపు గననో ౦భూరిప్రవాళాప్తము
న్వరనీలాళిసమావృతంబు పరిఖా౦నవ్యాలవాలామృతాం
తరసందృశ్యము నై చెలంగుఁ బొగ డొం౦దన్ దానిపెంగొమ్మ ల
బ్బుర మై రాజపతంగయోగకలనం౦బుల్ రేవగల్ గాంచుటన్. 88

టీక: పురసాలంబు = విశాలాపురియొక్క కోట; నిజాఖ్యపెంపు గననో = తనపేరుగలదానియొక్క,అనఁగా సాలవృక్షము యొక్క అతిశయము గనుటకో; భూరిప్రవాళాప్తమున్ = అధికమగు చిగురుటాకులను బొందినదియు, అనఁగా సువర్ణమును బగడములను బొందిన దనుట, 'భూరి ప్రాజ్య సువర్ణయోః' అని విశ్వము; వరనీలాళిసమావృతంబు = శ్రేష్ఠములయి నీలము లయినతుమ్మెదలచేతఁ జుట్టుకొనఁబడినదియు, అనఁగా శ్రేష్ఠములయిన యింద్రనీలమణులగుంపుచేత నావరింపఁబడిన దనుట; పరిఖా నవ్యాలవాలామృతాంతర సందృశ్యము నై– పరిఖా=అగడ్త యనెడు, నవ్య=నూతనమగు,ఆలవాల=పాదుయొక్క, అమృతాంతర=జలాంతరమందు, సందృశ్యము నై=కనిపించునది యై; దానిపెంగొమ్మలు=దాని పెద్దశాఖలు,ఆకోటయొక్క పెద్దకొమ్మ లనుట; రాజపతంగయోగకలనంబుల్ – రాజపతంగ = పక్షిశ్రేష్ఠములయొక్క, యోగకలనంబుల్ = సంబంధము సేయుటలు, చంద్రసూర్యసంబంధము సేయుట లనుట; రేవగల్ గాంచుటన్ = ఎల్లపుడును పొందుచుండుటచేత; అబ్బురమై = ఆశ్చర్యకరమై; పొగ డొందన్ = శ్లాఘ్యత నొందునట్లుగా; చెలంగున్ =ఒప్పును.

ఇట సూర్యుఁడు రాత్రికాలమందు చంద్రుఁడు పగటియందు నుండమింజేసి సర్వకాలమందు సూర్యచంద్రసంబంధము గలిగి యుండుట యాశ్చర్యకర మని భావము. రాత్రి చంద్రసంబంధమును, పగలు సూర్యసంబంధమును బొందు నని క్రమ ముగా నన్వయం బెఱుంగునది. ఇచటఁ బురసాల మున్నత మగుటకు నిజాఖ్య పెంపు గనుట ఫలము గాక పోయినను దానిని ఫలముగా సంభావన సేయుటంజేసి ఫలోత్ప్రేక్ష యగును. అదియు శ్లేషానుప్రాణితము.

చ. అనఘహరిప్రతానయుతి ౦ నబ్జకరానికరాప్తి భోగిరా
డ్జనపరిలబ్ధి విప్రవర౦సంతతియుక్తిఁ బురం బనారతం
బును దెలిదీవికన్న సిరిఁ ౦బూని మనం గని రక్తిఁ జేరి ని
ల్చిన కలశాబ్ధి నా విమల౦జీవనఖేయము వొల్చు నెంతయున్. 89

టీక: అనఘహరిప్రతానయుతిన్ – అనఘ= నిర్దోషములైన, హరి =అశ్వములయొక్క, ప్రతాన = సంఘముయొక్క, యుతిన్ = సంబంధముచేతను; అనఘులైన విష్ణువులయొక్క గుంపుల సంబంధముచేతను; అబ్జకరానికరాప్తిన్ = పద్మములవంటి పాణులు గల స్త్రీసంఘముయొక్క కూడికచేత, లక్ష్ములయొక్క నికరమును బొందుటచేత; భోగిరాడ్జనపరిలబ్ధిన్= భోగవంతు లగు రాజులయొక్క బృందము నొందుటచేతను, ఆదిశేషుల సంఘముయొక్క సంలబ్ధిచేతను; విప్రవరసంతతియుక్తిన్ =బ్రాహ్మ

ణోత్తముల సముదాయముతోఁ గూడుటచేతను, గరుత్మంతుల బృందముతోఁ జేరుటచేతను; పురంబు=విశాలాపురము; అనారతంబును = ఎల్లప్పుడును; తెలిదీవికన్నన్= శ్వేతద్వీపము కన్నను; సిరిఁ బూని = సంపద నొంది; మనన్ = వృద్ధినొందఁగా; కని = అవలోకించి; రక్తిన్ =అనురక్తిచేత; చేరి = పొంది; నిల్చిన కలశాబ్ధి నాన్ = నిల్చియున్న క్షీరాంబురాశియో యనునట్లు; విమల = నిర్మలమగు; జీవన = జలము గల; ఖేయము = అగడ్త, 'ఖేయం తు పరిఖాధార స్త్వంభసామ్' అని అమరము; ఎంతయున్ =మిక్కిలి; పొల్చున్=ఒప్పును.

శ్వేతద్వీపమున నొకహరియు, నొకలక్ష్మియు, నొకశేషుఁడును, నొకగరుడుండు నుండుటయు, నీపుర మందు ననేక హరులు, ననేకలక్ష్ములు, ననేకశేషులు,ననేకగరుడులుఁ గలిగియుండుటయుఁ జూచి క్షీరాంబునిధి శ్వేతద్వీపముకన్న నీపురి సిరిఁబూని మించినదని యెంచి యిచటఁ జేరెనో యనునట్లు విశాలాపురి యగడ్త యొప్పెనని భావము. ఈపద్యమందుఁ బురము శ్వేతద్వీపమునకన్న మించినదనియు, నగడ్త క్షీరాంబురాశివలె నున్నదనియు రెండును వర్ణ్యములే కాన, యుపమేయ మగు పురమం దుపమానమగు శ్వేతద్వీపముకన్న నాధిక్యము శ్లిష్టశబ్దములచేఁ జెప్పుటచే శ్లేషోత్థాపితవ్యతిరేకాలంకారము. అగడ్త కలశాబ్ధి నాఁ బొల్చు నని చెప్పుటచే నుత్ప్రేక్షాలంకారంబును గలుగుచున్నది.

మ. అరుదై చూడఁబడున్ మహిస్థలి విశాలాధీశలోకేట్కృత
స్ఫురణం బొల్చుపురోర్వికిం బరిఖ యంభోరాశి నాఁ దామ్రర
త్నరుగాలోకనిషక్తి శక్రమణిభాధ్వాంతాళియుక్తిన్ మనో
హరవప్రాంతర మెప్పుడున్ మెఱయ లోకాలోకసామ్యంబునన్. 90

టీక: పరిఖ = అగడ్త; విశాలాధీశ = విశాలాపురీనాయకుం డనునట్టి; లోకేట్ = లోకేశుఁడైన బ్రహ్మచేత; కృత =నిర్మింపఁబడిన; స్ఫురణన్ = అతిశయముతో; పొల్చు పురోర్వికిన్ = ప్రకాశించునట్టి విశాలాపుర మనెడు భూమికి; మనోహర వప్రాంతరము = మనోజ్ఞమగు మఱియొకకోట, అనఁగా నొక పిల్లకోట; తామ్రరత్న రుగాలోకనిషక్తిన్ = పద్మరాగమణులయొక్క తేజ స్సని యెడి సూర్యాతపముయొక్క సంబంధముచేతను; శక్రమణిభా ధ్వాంతాళియుక్తిన్ = ఇంద్రనీలమణులకాంతి యను నంధకార పరంపరాసంబంధముచేతను; లోకాలోకసామ్యంబునన్ = లోకాలోకమను పర్వతముయొక్క సాటిచేతను; ఎప్పుడున్=ఎల్లప్పుడును; మెఱయన్ = ప్రకాశించుచుండఁగా; అంభోరాశి నాన్= సముద్రమో యనునట్లుగా; అరుదై =ఆశ్చర్యకరమై; మహిస్థలిన్ = భూమండలమందు; చూడఁబడున్ =అవలోకింపఁబడును; ఉత్ప్రేక్షాలంకారభేదము.

విశాలాపురి యను నుర్వికి నగడ్త సముద్రమువలె నున్నదనియు, దానికి వెలికోట పద్మరాగమణిప్రభా శక్రమణిప్రభ లనెడు తేజస్తిమిరములతో నెప్పుడు మెఱయుటంజేసి లోకాలోకపర్వతమువలె నున్నదనియు భావము.

సీ. వెలయింప నేరఁ డుజ్జ్వలచంద్రికారూఢి, రవిప్రభాసంసక్తిఁ బ్రబలుఁ గాని,
కనఁడు కావ్యాశయగౌరవం బగభేది, యురుకల్పతరులబ్ధి నొనరుఁ గాని,
దఱియ నోపఁడు పక్షధరవరోద్ధతి శేషుఁ,డసమలోచనయుక్తి మసలుఁ గాని,
ప్రతిఘటింపఁ గలంగుఁ బ్రాభాకరస్ఫూర్తి, కబ్జారి కౌముది నలరుఁ గాని,

తే. యనుచుఁ దత్సదినత్వగవాధిపత్వ,కుండలిత్వద్విజేశత్వ౧గుంఫనములు
పరిహసింతు ర౧ప్పురి నధీత, సకలసుగ్రంథతతు లగ్ర౧జన్మపతులు. 91

టీక: అప్పురిన్ = ఆవిశాలానగరమందు; అధీత సకల సుగ్రంథ తతులు = అధ్యయనము చేయఁబడిన సమస్తగ్రంథసముదాయము గలవారైన; అగ్రజన్మపతులు = బ్రాహ్మణశ్రేష్ఠులు; రవి = సూర్యుఁడు; ప్రభాసంసక్తిన్ = ప్రభ యను ప్రకరణముయొక్క సంబంధముచేత, కాంతిచేత ననుట; ప్రబలుఁ గాని = అతిశయించును గాని; ఉజ్జ్వల చంద్రికారూఢిన్ = ప్రకాశించుచున్న చంద్రిక యను గ్రంథముయొక్క యతిశయమును; వెలయింప నేరఁడు = ప్రకాశింపఁజేయ నెఱుంగడు. ప్రభ యను ప్రకరణ మాత్రమే కాని, చంద్రిక యను గ్రంథము చదివిన వాఁడు కాదనుట. సూర్యుఁడు తేజస్సుతోఁ గూడియున్నా డనియు, వెన్నెలను జేయఁజాల డనియు భావము.
అగభేది =ఇంద్రుఁడు; ఉరు కల్పతరు లబ్ధి నొనరుఁ గాని = అధికమగు కల్పతరు వనెడు వేదాంతగ్రంథలాభముచే నొప్పును గాని; కావ్యాశయగౌరవంబు = రఘువంశాదికావ్యాభిప్రాయాతిశయమును; కనఁడు = ఎఱుఁగడు; ఇంద్రుండు కల్పవృక్షమును బొందినవాఁడనియు, శుక్రునియొక్క యాశయగౌరవము గనఁ డనియు భావము.
శేషుఁడు = ఆదిశేషుఁడు; అసమ లోచన యుక్తిన్ = అసమాన మైన లోచన మను గ్రంథసంబంధముచేత; మసలుఁ గాని = చరించును గాని; పక్షధరవరోద్ధతిన్ = పక్షధర మను నామము గల తర్కగ్రంథముయొక్క అతిశయోద్ధతిని; తఱియ నోపఁడు = సమీపింపఁజాలడు. శేషుండు పక్షధరుఁ డనఁగా గరుడుఁడు వానిఁ దఱియ నోపఁ డనియు, అసమానలోచనుఁ డనఁగా శివుఁడు వానితో సంబంధించి యుండు ననియు భావము. శివుఁడు శేషాహిభూషణుం డగుట ప్రసిద్ధము.
అబ్జారి = చంద్రుఁడు; కౌముదిన్ = కౌముది యను వ్యాకరణగ్రంథముచేత ; అలరుఁ గాని = ఒప్పును గాని; ప్రాభాకరస్ఫూర్తి = ప్రాభాకర మను మీమాంసాగ్రంథముయొక్క స్ఫూర్తికి; ప్రతిఘటింపన్ = ఎదురింపను; కలంగున్ = కలఁతపడును; చంద్రుండు వెన్నెలచే నలరు ననియు, సూర్యసంబంధిని యైన ప్రభకుఁ బ్రతిఘటింపఁ జాల డనియు భావము.
అనుచున్ = ఇట్లనుచు; త త్సదినత్వ గవాధిపత్వ కుండలిత్వ ద్విజేశత్వ గుంఫనములు – తత్ = వారి సంబంధియైన, సదినత్వ (సత్+ఇనత్వ)= పండితరాజత్వముయొక్క, శ్రేష్ఠమగు సూర్యత్వముయొక్క యనుట, గవాధిపత్వ = వాక్పతిత్వముయొక్క, స్వర్గాధిపత్యముయొక్క యనుట, కుండలిత్వ = కుండలవత్వముయొక్క, యనఁగా సోమయాజిత్వముయొక్క, సర్పత్వముయొక్క యనుట, ద్విజేశత్వ = బ్రాహ్మణోత్తమత్వముయొక్క, ద్విజరాజత్వము (చంద్రత్వము)యొక్క, గుంఫనములు = కూర్పులు; పరిహసింతురు = హాసాస్పదములుగాఁ జేయుదురు. అనఁగా విశాలాపురియం దున్న విప్రులు సకలవిద్యల నభ్యసించిన వారలని భావము. ఉపమానభూతసూర్యాదుల కన్న నుపమేయభూతద్విజోత్తములందు గుణాధిక్యము చెప్పుటచే శ్లేషోత్థాపితవ్యతిరేకాలంకారము, అతిశయోక్త్యలంకారంబును.

మ. అతులాత్మప్రతిభానిరస్తకమలా౧ధ్యక్షాత్మజుల్ త్రాతచ
క్రతతుల్నిర్మలధర్మహేతులునమ౧స్కారప్రియుల్ నిత్యసం
భృతవిశ్వంభరు లంచితోదయు లదో౧ష్షైకక్రముల్ మింతు రూ
ర్జితతేజోయుతిలోకబంధు లన ధాత్రీనాయకుల్ దత్పురిన్. 92

టీక: ఈ పద్యమునందు రాజపరమైన యర్థము, సూర్యపరమైన యర్థమును దోఁచుచున్నది.

తత్పురిన్ = ఆ విశాలాపురియందు; ధాత్రీనాయకుల్ = రాజులు; అతు లాత్మ ప్రతిభా నిరస్త కమలాధ్యక్షాత్మజుల్– అతుల = అసమానమగు, ఆత్మ = తమయొక్క, ప్రతిభా = కాంతిచేత, నిరస్త = తిరస్కరింపఁబడిన, కమలాధ్యక్షాత్మజుల్ = మన్మథులు గలవారు, సాటిలేని తమ తేజస్సుచేత నిరసింపఁబడిన (కమలాధ్యక్ష యనఁగా) సముద్రముయొక్క ఆత్మజుఁడైన చంద్రులు గలవారని సూర్యపరమైన యర్థము; త్రాత = రక్షింపఁబడిన; చక్ర = రాష్ట్రములయొక్క; తతుల్ = సమూహము గలవారు, రక్షింపఁబడిన చక్రవాకసమూహము గలవారని యర్థాంతరము; నిర్మలధర్మహేతులు– నిర్మల = నిర్దోషములగు, ధర్మ హేతులు = ధనువులు, ఖడ్గములు గలవారు, సూర్యుండు కర్మసాక్షి గావునఁ దత్పరమైనపుడు నిర్మలములైన యాగాదులకు హేతువులైనవారని యర్థము; నమస్కారప్రియుల్ = 'నమః కుర్వన్తీతి నమస్కారాః' అనఁగా నమస్కరించువారు,వారియందుఁ బ్రీతిగలవా రనుట, సూర్యపరమైనపుడు 'శ్లో. నమస్కారప్రియో భానుః' అనుటంబట్టి నమస్కారమందుఁ బ్రీతిగలవా రని భావము; నిత్య సంభృత విశ్వంభరులు = ఎల్లపుడుఁ బోషింపఁబడిన భూమిగలవారు, ఎల్లపుడు ధరింపఁబడిన నారాయణ మూర్తి గలవారని సూర్యపరమైన యర్థము, 'శ్లో. ధ్యేయ స్సవితృమండలమధ్యవర్తీ నారాయణః' మొదలగు వానిచే నారాయణుఁడు సూర్యమండలవాసి యగుట ప్రసిద్ధము, పక్షద్వయమం దీయర్థమే కావచ్చును; అంచితోదయులు = ఒప్పుచున్న యభివృద్ధిగలవారు, పొందబడిన యుదయగిరిగలవారని యర్థాంతరము; అదోషైకక్రముల్ = అదుష్టములై ముఖ్యములైన నడవడికలు గలవారు, సూర్యపరమైనపుడు అదోషైకక్రము లనఁగా దోషైకక్రములు గానివారు, రాత్రిసంచారములేనివా రనుట; ఊర్జితతేజోయుతిన్ = స్థిరమైన ప్రతాపసంబంధముచేత, స్థిరమైన తేజస్సంబంధముచేత నని యర్థాంతరము; లోకబంధులనన్ = లోకహితు లనఁగా, సూర్యులనఁగా, ద్వాదశాదిత్యతాత్పర్యముతో బహువచనము; మింతురు = అతిశయింతురు.

విశాలాపురియందు రాజులు మన్మథులకన్న సుందరులై, రాష్ట్రముల నేలువారై, యాగాదిక్రియల నాచరించుచు, శరణాగతత్రాణముఁ జేయుచు, నిర్దోషమైన నడవడికతోఁ బ్రతాపశాలు రై మింతు రని భావము.

మ. అలఘుశ్రీయుతి సద్గణావనవిహారారూఢి లేఖస్తుతా
చలధర్మాదృతిఁ బ్రాపితాసమనిధిచ్ఛాయాప్రహృష్యత్సుహృ
త్తిలకాసక్తి ననారతంబుఁ బురి నెంతే మించు నర్యేశమం
డలి స్వానంతగుణప్రవృద్ధిగరిమ న్రాజిల్లు నౌ నౌ ననన్. 93

టీక: ఈ పద్యమం దర్యేశమండలిశబ్దముచేత వైశ్యోత్తమపరమైన యర్థముఁ జెప్పఁగాఁ దద్ఘటక మగు నీశపదముచే నీశ్వర రూపార్థము గూడఁ దోఁచుచున్నది. పురిన్ = విశాలాపురియందు; అర్యేశమండలి = వైశ్యోత్తమబృందము, ఈశ్వరబృంద మని ధ్వనితార్థము; అలఘుశ్రీయుతిన్ = అధికసంపద్యోగముచేతను, అధికవిషసంబంధముచేత నని యీశ్వరపరమైన యర్థము, 'శ్రీర్వేషరచనార్థ శోభా సమ్పత్సరళశాఖిషు, వాణీ లక్ష్మీ లవఙ్గేషు విషే' అని రత్నమాల; సద్గణావనవిహారారూఢిన్ – సద్గణ = సత్పురుషసంఘముయొక్క, అవనవిహారారూఢిన్= పాలనక్రీడాతిశయముచేత, శ్రేష్ఠమగు ప్రమథగణముయొక్క పాలనవిహారారూఢిచేత నని శివపరమైన యర్థము; లేఖస్తుతాచలధర్మాదృతిన్ – లేఖ = దేవతలచేత, స్తుత = కొనియాడఁబడిన, అచల = స్థిరమైన, ధర్మ = యాగాదిసత్క్రియలయొక్క, ఆదృతిన్ = ఆదరణముచేత, దేవతలచేత నుతింపఁబడిన

మేరుధనువుయొక్క యాదరణముచేత నని శివపరమైన యర్థము; ప్రాపితాసమనిధిచ్ఛాయాప్రహృష్యత్సుహృత్తిలకాసక్తిన్ – ప్రాపిత = పొందింపఁబడిన, అసమ = సాటిలేని, నిధి = ధననిధులు గలిగినట్టి, ఛాయాప్రహృష్యత్ = తమనీడలయందు సంత సించుచున్న, సుహృత్తిలక = మిత్రరత్నములయందు, ఆసక్తిన్ = ప్రీతిచేత, వైశ్యోత్తములు తమమిత్రులకు సరిలేని ధనము లిచ్చి వారు తమ నీడయందు సంతసించుచుండఁగా వారలయెడఁ బ్రీతిగలవారై యున్నా రనుట; ఈశ్వరపరమైనపుడు – ప్రాపిత = పొందింపఁబడిన, అసమ = విషమములైన, తొమ్మిదైన యనుట, నిధి = మహాపద్మాదినిధులయొక్క, ఛాయా = రక్షణముచేత, ప్రహృష్యత్ = సంతోషించుచున్న, సుహృత్తిలక = కుబేరునియందు, ఆసక్తిన్ = ప్రీతిచేత, నని యన్వయము; అనారతంబున్ = ఎల్లపుడు; స్వానంతగుణప్రవృద్ధిగరిమన్ – స్వ = ధనముయొక్క, అనంతగుణ = అత్యధికమైన, ప్రవృద్ధి = మితిలేని వడ్డి యొక్క, గరిమన్ = అతిశయము చేత,స్వసంబంధి యైన శేషుఁ డనెడు నల్లెత్రాటియొక్కవృద్ధ్యతిశయముచేత నని శివపరమైన యర్థము. ఔ నౌ ననన్ = ప్రశంసించునట్లు; రాజిల్లెన్ = ప్రకాశించెను.ఆ పురియందు వైశ్యులు మిగుల నైశ్వర్యవంతులై సత్పు రుషులఁ బోషించుచు సత్కర్మముల నాచరించుచుఁ దమ హితు లను ధనవంతులనుగాఁ జేసి యతిశయ మైన వృద్ధిరూప మైన ధనాదాయముతో రాజిల్లు చున్నా రని భావము. ఇచటఁ బ్రస్తుతా ప్రస్తుతముల కౌపమ్యము వ్యంగ్యము.

చ. పురమణి హాలికోత్తములు పూన్చిన ధాన్యపుఁ దిప్ప లర్కభూ
విరుచిశిఖాళిఁ బైపయిని వేఁగఁ దదభ్యుదయాదితంత్రమౌ
హరిపద మంతికస్థలగతాంచితదివ్యధునీతరంగశీ
కరనికరంబులం బొదివి గ్రక్కునఁ జల్వ ఘటించు నిచ్చలున్. 94

టీక: పురమణిన్ = పురశ్రేష్ఠమందు; హాలికోత్తములు = ఉత్తమశూద్రులు; పూన్చిన ధాన్యపుఁ దిప్పలు = కుప్పసేసిన ధాన్య రాశులు; అర్కభూవిరుచిశిఖాళిన్ – అర్కభూ = సూర్యునివలనఁ బుట్టిన, విరుచి = విశేషకాంతియొక్క, శిఖాళిన్ =జ్వాలా సమూహముచేత; పైపయిని = మీఁదమీఁదను; వేఁగన్ = తపింపఁగా; తదభ్యుదయాదితంత్రమౌ హరిపదము – తత్ = ఆ హాలికులయొక్క, అభ్యుదయ = ఉత్పత్తికి, ఆదితంత్రమౌ = ప్రథమకారణ మగుచున్న, హరిపదము = విష్ణుపద మనెడు నాకాశము, 'శ్లో. తస్య పాదామ్బుజా జ్జాతో వర్ణో విగతకల్మషః' ఇత్యాదులచే శూద్రులు విష్ణుపాదోద్భవు లగుట ప్రసిద్ధము; అంతికస్థలగ తాంచిత దివ్యధునీ తరంగ శీకర నికరంబులన్ – అంతికస్థలగత = సమీపమును బొందిన, అంచిత = పూజ్యు యగు, దివ్యధునీ = స్వర్గంగయొక్క, తరంగ = అలలయొక్క, శీకర = జలకణములయొక్క, నికరంబులన్ = సమూహ ములచేత; పొదివి = కప్పి; గ్రక్కునన్ = వేగముగా; చల్వన్ =శైత్యమును; నిచ్చలున్ = ఎల్లపుడును; ఘటించున్ = పొందిం చును. ఆ పురియందు హాలికులు ధాన్యములను మిక్కిలి పండించుచున్నారని భావము. ధాన్యరాశులకు గగనతలసంబంధము లేక పోయినను దత్సంబంధ మున్నట్లు చెప్పుటచే సంబంధాతిశయోక్త్యలంకారము. 'శ్లో. సంబంధాతిశయోక్తిస్స్యా దయోగే యోగకల్పనమ్' అని తల్లక్షణము.

మ. అలితోద్యత్కదళీకలాపములు, మేఘావాప్తపాదాన్వితం
బులు, దంతాంతరశోభిహేమవలయంబుల్, ధాతురేఖాసము

జ్వలతావత్కటకాంతముల్, మదగజవ్రాతంబు లవ్విటిర
థ్యల నిచ్చల్ చరియించు, జంగమకుభృ॰త్సామ్యంబు సంధించుచున్. 95

టీక: ఈ పద్యమందు గజములకుఁ బర్వతసామ్యముఁ జెప్పుటచే నర్థద్వయము దోఁచుచున్నది.
మదగజవ్రాతంబులు = మదపుటేనుఁగుల గుంపులు; అలితోద్యత్కదళీకలాపములు – అలిత = అలంకరింపఁబడిన, 'అల భూషణే', ఉద్యత్ = ఎత్తఁబడిన, కదళీ = ధ్వజములయొక్క, కలాపములు = గుంపులు గలవై అని గజపరమైన యర్థము. అలంకరింపఁబడి యెగురుచున్నట్టి జింకలయొక్క గుంపులు గల వని పర్వతపరమైనయర్థము; మేఘావాప్తపాదాన్వితంబులు – మేఘ = మదవిశేషముచేత, 'శ్లో. దానం కపోలయో శ్శీధు రక్ష్ణో శ్శ్రుతో్యే స్తు సాగరః, కరాగ్రే శీకర శ్శిక్యం స్తనాగ్రే మేహనే మదః , హృదయే ఘర్మ సలిల మ్మేఘ స్తు చరణవ్రజే, సంజ్ఞయాష్టమదాహ్యేతే జాయన్తే భద్రదన్తినామ్' అను నమరశేషప్రమాణము చొప్పున ఏనుఁగు పాదమందుఁ బుట్టిన మదోదకమునకు మేఘ మని పేరు, అవాప్త = పొందఁబడిన, పాద = చరణముల చేత, అన్వితంబులు = కూడినవై, మేఘములచేతఁ గూడుకొన్న ప్రత్యంతపర్వతములు గల వని పర్వతపరమైన యర్థము; దంతాంతరశోభిహేమవలయంబుల్—దంత = విషాణములయొక్క, అంతర = మధ్యభాగమందు, శోభి = ప్రకాశించునట్టి, హేమవలయంబుల్ = బంగారుకడియములు గలవై, పాదరిండ్ల మధ్యమునఁ బ్రకాశించు సంపెఁగతీవలగుమురులు గలవై యని పర్వతపరమైన యర్థము; ధాతురేఖాసముజ్జ్వలతావత్కటకాంతముల్ – ధాతురేఖా = సింధూరరేఖలసంబంధి యైన, దీనికి సముజ్జ్వలతయం దన్వయము, సముజ్జ్వలతావత్ = ప్రకాశము గల, కట = గండస్థలముచేత, కాంతముల్ = మనోజ్ఞములై, గైరికాదిధాతురేఖలచేఁ బ్రకాశించు నితంబప్రదేశము గలవని పర్వతపరమైన యర్థము; అవ్విటిరథ్యలన్ = ఆవిశాలాపురవీథుల యందు; నిచ్చల్ = ఎల్లపుడు; జంగమకుభృత్సామ్యంబు = చరించుచున్న పర్వతసామ్యమును; సంధించుచున్= పొందుచు; చరియించున్ = సంచరించును; ఆపురియందు గజములు మహోన్నతము లై చరియించుచున్న పర్వతాకారముగ నున్న వని భావము. ఉపమాలంకారము.

చ. ధర హరి కెక్కుడన్న మహి॰తక్రమ మూని, యహీనకాండభా
స్వరగతి నొంచు పెంపుఁ గని, ॰వాజికులేశత నొంది, యెంతయున్
హరిహయమానహారి యగు॰నట్టి తరంబు వహించి, సైంధవో
త్కరము, సెలంగు వీట, నిజ॰తార్క్ష్యసమాఖ్య యథార్థతం దగన్. 96

టీక: ఈపద్యమందు నశ్వపరమైన యర్థము, గరుడపరమైన యర్థముగూడఁ దోఁచుచున్నది. వీటన్ = విశాలాపురియందు; సైంధవోత్కరము = అశ్వసమూహము; ధరన్ = భూమియందు; హరి కెక్కుడన్న మహితక్రమము = వాయువున కన్న నుత్కృష్టము లనెడు మంచివేగమును, విష్ణువునకు వాహనమనెడు పూజ్యక్రమము నని గరుడపరమైన యర్థము; ఊని = వహించి; అహీనకాండభాస్వరగతిన్ – అహీన = అధిక మగు, కాండ = బాణములయొక్క, భాస్వర = ప్రకాశించునట్టి, గతిన్ = గమనమును; నొంచు పెంపుఁ గని = నొప్పించు గౌరవము నంది, అహీనకాండ = సర్పశ్రేష్ఠముల గుంపులయొక్క, భాస్వర గతిన్ = మంచితెలివిని , నొంచు పెంపుఁ గని యని గరుడపరమైన యర్థము; వాజికులేశతన్ = అశ్వశ్రేష్ఠతను, పక్షిరాజత నని

యర్థాంతరము, 'వాజినోఽశ్వేషు పక్షిణః' అని యమరుఁడు; ఒంది =పొంది, ఎంతయున్ = మిక్కిలి; హరిహయమానహారి యగునట్టి తరంబు వహించి = సూర్యాశ్వముల మానమును హరించునట్టి వేగమును వహించి, ఇంద్రునియొక్క మానమును హరించునట్టి యుత్కర్షమును వహించి యని గరుడపరమైన యర్థము; నిజతార్క్ష్యసమాఖ్య = తమయొక్క తార్క్ష్యము లను పేరు, తార్క్ష్య మనఁగా నశ్వము, గరుత్మంతుఁడును, 'తురఙ్గ గరుడౌ తార్క్ష్యౌ' అని యమరుఁడు; యథార్థతన్ = సార్థకతచేత; తగన్ = ఒప్పుఁగా; చెలంగున్ = ప్రకాశించును; ఆ పురియందు సూర్యాశ్వబాణవాయువేగములకు మించిన వేగము గలిగిన యుత్తమాశ్వము లున్నవని భావము. ప్రకృతాశ్వములకు నప్రకృతగరుడునకు నౌపమ్యము వ్యంగ్యము. అతిశయోక్త్యలంకారము.

మ. వరవర్ణక్రమభాసివాహయుతి, భా౦స్వచ్చంద్రచక్రాప్తి వీ
టి రథశ్రేణి వహించియున్, గడునఖం౦డీభూతవిస్ఫూర్తిచే
నరుదై పొల్చుట నొక్కొ, కేరు, గిరికన్యాధీశచక్రాంగవై
ఖరి, నుద్యద్వలభీ విలంబిత మణీ౦ఘంటాళి ఘాణంఘణిన్. 97

టీక: ఈపద్యమందు రథశ్రేణిని వర్ణింపఁగా యథాసంభవముగ నీశ్వరరథపరమైన యర్థాంతరముగూడఁ దోఁచుచున్నది. వీటి రథశ్రేణి = పురమందలి రథములయొక్క గుంపు; వరవర్ణక్రమభాసివాహయుతిన్‒ వర = శ్రేష్ఠమగు, వర్ణ = రంగుచేతను, జాతిచేత నని కాని, క్రమ = నడుపుచేతను, భాసి = విలసిల్లునట్టి, వాహ = అశ్వములయొక్క, యుతిన్ = సంబంధమును, శ్రేష్ఠము లగు నకారాదివర్ణములచేతను, క్రమపదవాచ్య మగు పాఠవిశేషముచేతను (భాసిల్లు వాహము లనఁగా) వేదరూపాశ్వములు, వాని (యుతి) కూడికచేతను నని యీశ్వరరథపరమైన యర్థము; భాస్వచ్చంద్రచక్రాప్తిన్ = ప్రకాశించుచున్న బంగరు కండ్లయొక్క ప్రాప్తిని, 'గైరికం వసు చంద్రకం' అని యమరుఁడు, సూర్యచంద్రాత్మకచక్రములయొక్క ప్రాప్తి నని యీశ్వరరథ పరమైన యర్థము, ఈశ్వరునకు త్రిపురహరణకాలమున భూమి రథము, వేదములు వాహములు, మేరువు ధనువు, విష్ణువు సాయకంబు లగుట పురాణప్రసిద్ధ మైనది; వహించియున్ = ధరించియు; కడున్ = మిక్కిలి; అఖండీభూతవిస్ఫూర్తిచేన్‒ అఖండీభూత = అవిచ్ఛిన్నమగు, విస్ఫూర్తిచేన్ = ప్రకాశముచేత; అరుదై = ఆశ్చర్యకరమై; పొల్చుట నొక్కొ = ఒప్పుట చేతనో; ఉద్యద్వలభీ విలంబిత మణీఘంటాళి ఘాణంఘణిన్ ‒ ఉద్యత్ = ప్రకాశించుచున్న, వలభీ = కొణిగలయందు, విలంబిత = ప్రేలాడుచుండిన, మణీఘంటా = మణిమయములైన గంటలయొక్క, ఆళి = పంక్తియొక్క, ఘాణంఘణిన్ = ఘణఘణ యను నాదముచేత; గిరికన్యాధీశ చక్రాంగ వైఖరిన్ ‒ గిరికన్యాధీశ=పార్వతీపతియొక్క, చక్రాంగవైఖరిన్ = రథముయొక్క రీతిని; కేరున్ = పరిహసించును. అనఁగా విశాలాపురియం దున్న రథములు రుద్రునిరథమువలె వరవర్ణ క్రమభాసివాహ భాస్వచ్చంద్రచక్రాప్తిమొదలుగాఁ గలవానినిఁ బొందియు, నఖండీభూతవిస్ఫూర్తిచేఁ బొల్చుటచేత నీశ్వరుని భూమ్యాత్మకరథవైఖరి నవఖండాత్మక మని ఘంటల చప్పుడుచేతఁ గేరుచున్నట్టు లున్నదని భావము. ఇందు వ్యతిరేకోత్ప్రేక్షాశ్లేషాలంకారములు.

చ. స్థిరసుమనోవితానముల౦చే, ననిమేషవిలోలలోచనో
త్కరములచే, ననర్ఘమణి౦కామయకూటచయంబుచే, సిరిం

గరము పొసంగు వీటి నవ◊కాంచనసౌధపరంపరల్, మరు
ద్గిరివరవైఖరిం బొలుచు ◊దివ్యపథం బధరీకృతంబు గాన్. 98

టీక: ఈ పద్యమందు సౌధములు మేరుతుల్యముగ నున్న వనుటచే మేరుపరమైన యర్థాంతరముగూడఁ దోఁచుచున్నది. సిరిన్ = సంపదచే; కరము = మిక్కిలి; పొసంగు వీటి నవకాంచనసౌధపరంపరల్ – పొసంగు = ఒప్పుచున్న, వీటి = పురము యొక్క, నవ = నూతనములగు, కాంచనసౌధ = బంగారుమేడలయొక్క, పరంపరల్ = సమూహములు; స్థిరసుమనోవితాన ములచేన్ – స్థిర = తిరమగు, సుమనోవితానములచేన్ = పువ్వుఁజప్పరములచేతను, దేవతాసంఘములచేత నని యర్థాంత రము; అనిమేష విలోల లోచనోత్కరములచేన్ – అనిమేష = మత్స్యములవలె, విలోల = మిక్కిలి చలించుచున్న, లోచనా = కన్నులు గల స్త్రీల యొక్క, ఉత్కరములచేన్ = సమూహములచేతను, దేవతాస్త్రీసంఘముచేత నని యర్థాంతరము; అనర్ఘ మణికామయ కూటచయంబుచేన్ = వెలలేనట్టి మణిమయగృహవిశేషములచేతను, మణిమయశిఖరములచేత నని యర్థాంత రము, 'కూటోస్త్రీ శిఖరం వాసః కూటో ద్వయోః' అని యమరుఁడు; దివ్యపథంబు = అంతరిక్షము; అధరీకృతంబు గాన్ = క్రిందు చేయఁబడి నది కాఁగా; మరుద్గిరివరవైఖరిన్ = మేరుపర్వతమువంటి మేలైన భంగితో; పొలుచున్ = ఒప్పును. విశాలాపురియందు మేడలు గగనమండలము క్రిందగునంత యున్నతము లై, మేరుపర్వతము వలెఁ బ్రకాశించె నని భావము. ఉపమాలంకారభేదము.

మ. అవడీనానిల వాసనాజనిత హా◊ర్దాప్తిం, బురిన్ భర్మహ
ర్మ్య వితానాశ్రిత యోషిదాస్యములఁ జే◊రంబోవు దివ్యాపగా
బ్జవస ద్బంభరపాళి, కుద్గమనజ◊శ్రాంతిం దొలంచున్, విలా
స వనీ సాలలతాంతగంధ లహరీ◊సారంబు మధ్యేసృతిన్. 99

టీక:ఇందుఁ బ్రకారాంతరముగ సౌధోన్నత్యము వర్ణింపఁబడుచున్నది. పురిన్ = విశాలాపురియందు; భర్మ హర్మ్య వితానాశ్రిత యోషి దాస్యములన్ – భర్మహర్మ్య = బంగరుమేడలయొక్క, వితాన = సంఘములను, ఆశ్రిత = ఆశ్రయించినట్టి, యోషిత్ = స్త్రీలయొక్క, ఆస్యములన్ = ముఖములను; అవడీ నానిల వాసనా జనిత హార్దాప్తిన్ – అవడీన = క్రిందికి దిగి వచ్చిన, అనిల = వాయువువలననైన, వాసనా = పరిమళముచేత, జనిత = పుట్టిన, హార్ద = ప్రీతియొక్క, ఆప్తిన్ = ప్రాప్తిచేత; చేరన్= (స్త్రీముఖ ములను) చేరుటకు; పోవు = పోవునట్టి, దీనికి బంభరపాళియం దన్వయము; దివ్యాప గాబ్జ వస ద్బంభరపాళికిన్ – దివ్యాపగా = వ్యోమగంగయందున్న, అబ్జ = కమలములయందు, వసత్ = వసించుచున్న, బంభరపాళికిన్ = తుమ్మెదల గుంపునకు; విలాసవనీ సాల లతాంత గంధలహరీ సారంబు – విలాసవనీ=క్రీడార్థమైన యుద్యానములందలి, సాల=వృక్షములయొక్క, 'అనోకహః కుట స్సాలః' అని యమరుఁడు, లతాంత = కుసుమములయొక్క, గంధలహరీ = పరిమళప్రవాహముయొక్క, సారంబు = స్థిరాంశము; ఉద్గమన జ శ్రాంతిన్ – ఉద్గమన = ఊర్ధ్వమునకుఁ బోవుటవలన, జ = పుట్టినట్టి, శ్రాంతిన్ = శ్రమమును; మధ్యేసృతిన్ = మార్గమధ్యమందు, 'పారే మధ్యే షష్ఠ్యా వా' అని యలుక్సమాసము; తొలంచున్ = పోఁగొట్టును.

విశాలాపురి యందు మేడలు స్వర్గమునకన్న నత్యున్నతము లై యున్నవనియు, స్వర్గంగాసరోజములయందున్న తేఁటు లచటి యోషిదాస్యములఁ జేరంబోవుచుండఁగా మార్గమధ్యమందు కలిగిన శ్రమమును విశాలాపురోద్యానతరుప్రసూనపరిమళము పోఁగొట్టుచున్న దనుటవలన నుద్యానములును స్వర్గమును మించిన యౌన్నత్యము గలిగియున్న వనియు భావము. అతిశయోక్తిభేదము.

మ. పుర చామీకరసౌధ చత్వర మణీ౦పుత్రీ ముఖాంభోజముల్,
శరజాసాలయ కుడ్యబింబితము లై, ౦చక్కం గనన్, దోఁచు ని
ర్భరదర్శార్కకరాభిచర్విత నిశా౦రాణ్ణిర్మి మిత్సాప్తవా
గ్వర సంయోజిత చంద్రకారణచయ౦వ్యాప్తిన్, విజృంభించుచున్. 100

టీక: పుర చామీకరసౌధ చత్వర మణీపుత్రీ ముఖాంభోజముల్ – పుర = విశాలాపురమందలి, చామీకరసౌధ = బంగరుమేడల యొక్క, చత్వర = ముంగిళ్లభూములయందలి, మణీపుత్రీ = మణిమయములగు బొమ్మలయొక్క, ముఖాంభోజముల్ = ముఖపద్మములు; శరజాసాలయ కుడ్యబింబితము లై – శరజాస = పద్మాసనుం డగు బ్రహ్మయొక్క, ఆలయ = గృహము యొక్క, కుడ్య = గోడలయందు, బింబితము లై = ప్రతిఫలించిన వై; చక్కం గనన్ =చక్కగాఁ బరిశీలింపఁగా; నిర్భర దర్శార్క కరాభిచర్విత నిశారాణ్ణిర్మిమిత్సాప్త వాగ్వర సంయోజిత చంద్రకారణచయ వ్యాప్తిన్ – నిర్భర= దట్టము లగు, దర్శార్కకర = అమావాస్యయందలి సూర్యునికిరణములచేత, అభిచర్విత = భక్షింపఁబడిన, నిశారాట్ = చంద్రునియొక్క, నిర్మిమిత్సా = నిర్మాణేచ్ఛను, ఆప్త = పొందినట్టి, వాగ్వర = బ్రహ్మచేత, సంయోజిత = చేర్పఁబడిన, చంద్రకారణచయ = మఱలఁ జంద్రుని నిర్మించుటకు సాధనములైనవానిగుం పనెడు, వ్యాప్తిన్ = ప్రసిద్ధిచేత; విజృంభించుచున్ = అతిశయించుచు; తోఁచున్ = అగ పడును. చంద్రకారణచయ మనున ట్లగపడు ననుట. విశాలాపురి నున్న మేడలు సత్యలోకమువర కున్నతములుగా నున్న వనియు, నా మేడల యంగణభూములందున్న మణులతోఁ జేయఁబడిన బొమ్మలముఖములు బ్రహ్మదేవుని యింటిగోడల మీఁదఁ బ్రతిఫలించి యుండఁగా నవి యమావాస్యల యందు సూర్యకిరణములచే మ్రింగఁబడిన చంద్రులకు మాఱుగా నిర్మించుటకు బ్రహ్మకారణసామగ్రి నొనగూర్చి యుంచినట్లు దోఁచుచున్న వనియు భావము. ఉత్ప్రేక్షాత్యుక్త్యలంకారముల సంకరము.

చ. అతులశుభాగమక్రమము ౦స్వాశ్రిత భూరికలస్వన ద్విజే
శతతులు దెల్ప, వీటిమణి౦సౌధము, లాజిర హర్మ్యలక్ష్మిపైఁ
జతురత నించుసేస, గృహ౦చత్వర వీథిక లొంది, జాలకా
రతిఁ దగుచాన లెల్లఁ దొర౦రాజిల ఱువ్వెడు మొగ్గచాలునన్. 101

టీక: ఈ పద్యమం దంగణభూములయందుఁ జానలు క్రీడించువేళఁ జల్లుకొను మొగ్గలు మణిసౌధాజిరలక్ష్ములయొక్క వైవాహికాక్షతలుగా వర్ణింపఁబడియె. వీటిమణిసౌధములు = పత్తనమందలి మణిమయము లైన మేడలు; స్వాశ్రిత భూరికలస్వన ద్విజేశతతులు – స్వాశ్రిత = తమ్ము నాశ్రయించిన, భూరికలస్వన = అధికము లైన మధురవాక్కులు గల్గిన, ద్విజేశతతులు = పక్షు లనెడు బ్రాహ్మణులయొక్కగుంపులు; అతుల శుభాగమక్రమము – అతులశుభ = సాటిలేని శుభముహూర్తముయొక్క,

ఆగమక్రమము = ప్రాప్తి విధమును; తెల్పన్ = తెల్పుచుండఁగా; ఆజిర హర్మ్యలక్ష్మిపైన్ = అంగణహర్మ్యలక్ష్మిపై; గృహ చత్వర వీథికలు = గృహాంగణభూములను; ఒంది =పొంది; జాలకారతిన్ = మొగ్గలు చల్లుకొనెడు క్రీడచేత; తగుచాన లెల్లన్ = ఒప్పునట్టి స్త్రీలందఱు; తొర రాజిలన్=వేగ మౌనట్లుగా; ఱువ్వెడు మొగ్గచాలునన్=విసరివైచెడు మొగ్గలగుంపుచేత; చతురతన్ = చాతుర్యమున; సేసన్ = అక్షతలను; నించున్ = చల్లును. ఉత్ప్రేక్షాభేదము.

మ. తరుణుల్ వీటిశిరోగృహాళి నిసి ము◊క్తాకంతుకం బాడుచోఁ,
గరకంజంబున జాఱి, బంతి, కడ కేఁ◊గన్, దత్సృతిం జేరు చం
దురుఁ, దద్బుద్ధి గ్రహించి, గోర్వఁగఁ, దద◊స్తోకాహతిన్ గందెఁగా,
కురుమాలిన్యము సత్కులాధిపతి కె◊ట్లొందున్? మదిం జూడఁగన్. 102

టీక: ఇందుఁ బ్రకారాంతరముగ సౌధోన్నత్యము వర్ణింపఁబడియె. వీటిశిరోగృహాళిన్ = పత్తనముయొక్క మేడలయందు; తరుణుల్ = స్త్రీలు; నిసిన్ = రాత్రియందు; ముక్తాకంతుకం బాడుచోన్ = ముత్యములతోఁ గూర్పఁబడినచెం డాడు నెడ; బంతి = చెండు; కరకంజంబునన్ = పాణిపద్మమువలన; జాఱి; కడ కేఁగన్ = దూరమునకుఁ బోఁగా; తత్సృతిన్ = ఆ మార్గమును; చేరు చందురున్ = పొందునట్టి చంద్రుని; తద్బుద్ధిన్ = ఆ చెండను బుద్ధిచేత; గ్రహించి = పట్టుకొని; గోర్వఁగన్ = ఎగవేయఁగా; తదస్తోకాహతిన్ = ఆ గొప్పపాటు చేత; కందెఁగాక = కందెఁ గాని; ఉరుమాలిన్యము = అధికమైన మాలిన్యము; సత్కులాధి పతికిన్ = సత్కులశ్రేష్ఠుఁ డగు వానికి, నక్షత్రరాజున కనుట; మదిన్ = మనస్సునందు; చూడఁగన్ = భావింపఁగా; ఎట్లొందున్? = ఏరీతిఁ జెందును. చంద్రునియందుఁ గలంకము విశాలాపురీసౌధములయం దున్న స్త్రీలు చెండను భ్రమతోఁ బట్టుకొని కొట్టఁగాఁ గలిగినదే కాని మఱియొక విధముగాఁ గలిగినది కాదని భావము. ఇచటఁ జంద్రునియందుఁ గలంకము క్రీడాకాలికసౌధోపరిచర న్నీరజలోచనాస్తోకాహతివలనఁ గలిగినదే కాని యితరమువలన సంభవింప లేదని 'యెట్లొందు' నను దానిచేఁ జెప్పుటవలన మంథానభూమిధరేత్యాదులయందుఁ గువలయానందమున వ్రాసినరీతిని హేత్వపహ్నుతి, భ్రాన్తిమంతమును.

సీ. భవ్యతారారూఢిఁ ◊బదనఖంబులు మించఁ, దొడలు రంభారీతిఁ ◊దొడరి యెంచ,
మేనావరస్ఫూర్తి ◊మెఱుఁగుఁజన్ను లెసంగ, నాసల్ తిలోత్తమో◊న్నతిఁ బొసంగ,
హరిణీవిలాసత ◊నక్షియుగ్మము వొంద, నళికముల్ చంద్రక◊లాత్మఁ జెంద,
నతనూర్వశిస్ఫూర్తి◊ నలరి వేణిక లెచ్చఁ, దనులు హేమైకవ◊ర్తనను మెచ్చ,
తే. నహహ! నిర్జరనీరజా◊స్యావితాన, హారి సౌందర్యసంగతై◊కైకమాని
తావయవకాంతి సంపత్తి, ◊నడరినిల్చు, సిరుల, నలరుదు, రబ్జకం◊ధరలు వీట. 103

టీక: వీటన్=విశాలాపురియందు; అబ్జకంధరలు =శంఖమువంటి కంఠముగల స్త్రీలు,'అబ్జౌ శఙ్ఖ శశాఙ్కౌ చ' అని యమరుఁడు; పదనఖంబులు = పాదనఖములు (కాలిగోరులు); భవ్యతారారూఢిన్ – భవ్య= మనోజ్ఞ యగు, తారా = తార యను దేవాంగన యొక్క, రూఢిన్=ప్రసిద్ధివంటి ప్రసిద్ధిచేతను,మనోజ్ఞములగు నక్షత్రములయొక్క ప్రసిద్ధిచేత ననుట;మించన్=అతిశయింపఁగా;

తొడలు = ఊరువులు; రంభారీతిన్ = రంభ యను నప్సరసస్త్రీయొక్క రీతిని, అనఁటులయొక్క రీతి ననుట; తొడరి = పూని; ఎంచన్ = ఎన్నఁగా, అనఁగా పోలుచుండఁగా నని యర్థము.

మెఱుఁగుఁజన్నులు = మెఱయుచున్న కుచములు; మేనావరస్ఫూర్తిన్ – మేనా = మేనక యనెడు దివ్యస్త్రీయొక్క, వర = శ్రేష్ఠ మగు, స్ఫూర్తిన్ = ప్రకాశముచేతను, మేనావరుఁడైన హిమవంతునియొక్క ప్రకాశమువంటి ప్రకాశముచేత ననుట; ఎసంగన్ = అతిశయింపఁగా; నాసల్ =నాసికలు; తిలోత్తమోన్నతిన్ – తిలోత్తమా =తిలోత్తమ యను నప్సరస్త్రీయొక్క, 'ఊర్వశీ మేనకా రంభా ఘృతాచీ చ తిలోత్తమా సుకేశీ మఞ్జుఘోషాద్యాః కథ్యన్తేఽప్సరసో బుధైః' అని యమరుఁడు, ఉన్నతిన్ = ఔన్నత్యము చేతను, తిలకుసుమముయొక్క యౌన్నత్యముచేత ననుట; పొసంగన్ = ఒప్పుచుండఁగా;

అక్షియుగ్మము = నేత్రయుగ్మము, 'స్తనాదీనాం ద్విత్వవిశిష్టా జాతిః ప్రాయేణ' అను వామనసూత్రముచేత నిట స్త్రీల నేత్రము లనేకము లయినను యుగ్మమని ప్రయోగింపఁబడినది; హరిణీవిలాసతన్ = హరిణి యను సురాంగనయొక్క విలాసము వంటి విలాసమును, ఇట విలాసశబ్దము అర్శ ఆద్యజంత మైనందున విలాసవిశిష్టమును బోధించును, తద్ధర్మము విలాసత అది విలాసరూపమే యగునని యాశయము, విలాసము నక్షియుగ్మ మను పాఠము సమీచీనముగఁ దోఁచుచున్నది, ఆడుజింక యొక్క విలాసము ననుట; పొందన్ = పొందఁగా; అళికముల్ = ఫాలస్థలములు; చంద్రకలాత్మన్ = చంద్రకల యను దేవాం గనయొక్క రూపమును; చెందన్ = పొందఁగా, చంద్రుని కలారూపమును బొందఁగా ననుట;

వేణికలు = జడలు; అతనూర్వశిస్ఫూర్తిన్ = అధిక మగు నూర్వశి యను నప్సరస్త్రీయొక్క ప్రకాశముచేత; అలరి = ఒప్పి, మన్మథునియొక్క గొప్పఖడ్గముయొక్క స్ఫూర్తిచే (అతను+ఉరు+అశి = అతనూర్వశి) నలరారి యనుట, 'శ్లో. డలయో రలయోశ్చైవ శసయో ర్వబయో స్తథా' యనుటచేత నిట నూర్వశి యనుచోట శకార సకారములకభేదము చెప్పఁ బడినది; ఎచ్చన్ = అతిశయింపఁగా; తనులు = శరీరములు; హేమైకవర్తనను – హేమా = హేమ యను దేవాంగనయొక్క, ఏక = ముఖ్య మగు, వర్తనన్ = వృత్తిని; మెచ్చన్ = శ్లాఘింపఁగా, సువర్ణమును బోలఁగా ననుట;

అహహ = ఔరా! నిర్జర నీరజాస్యా వితాన హారి సౌందర్య సంగ తైకైక మానితావయవ కాంతి సంపత్తిన్ – నిర్జర నీరజాస్యా వితాన = దేవాంగనాకదంబముయొక్క, హారి = మనోజ్ఞ మగు, సౌందర్య = సౌందర్యముతో, సంగత = కూడుకొన్న, ఏకైక మానితావయవ = ఒక్కొక్క పూజితాంగముయొక్క, కాంతి సంపత్తిన్ = తేజస్సంపదచేత; అడరి = ఒప్పి; నిల్చు సిరులన్ = స్థిరమగు సంపదలచే; అలరుదురు = ప్రకాశింతురు. విశాలాపురియందున్న స్త్రీల యవయము లొక్కొక్కటి యొక్కొక రంభాది సురాంగనను బోలియుండఁగా వారి సర్వావయవసౌందర్యమునకు సరియైన యువతి త్రైలోక్యములో దుర్లభ యని భావము.

 మ. అనిశాశేషఋతు ప్రసేవిత పురీం◊ద్రారామపంక్తుల్, గళ
ద్ఘన సూనౌఘ పరాగపూగములఁ దో◊డ్తన్ సేతువుల్ దీర్చి, కీ
ర నికాయాస్యనికృత్త పక్వఫలనీ◊రంబుల్ తగ న్నించు, నౌ
య్యన పోషింపనౌ! నందనాఖ్య మను నాకాక్రీడ మెల్లప్పుడున్. 104

టీక: అనిశాశేష ఋతుప్రసేవిత పురీంద్రారామపంక్తుల్ – అనిశ = ఎల్లప్పుడును, అశేషఋతు = షడ్రుతువులచేత, ఇచట 'ఋత్యకః' అను పాణినిసూత్రముచేత నకార ఋకారములకు సంధి లేదు, ప్రసేవిత = బాగుగాసేవింపఁబడిన, పురీంద్రారామ =

పురోద్యానములయొక్క, పంక్తుల్ = సమూహములు; గళద్ఘన సూనౌఘ పరాగపూగములన్ – గళత్ = జాఱుచున్న, ఘన = దట్టమైన, సూనౌఘపరాగ = పుప్పొడులయొక్క, పూగములన్ = సమూహములచేత; తోడ్తన్ =వెంటనే; సేతువుల్ = కట్టలు; తీర్చి = చేసి; కీర నికాయాస్యనికృత్త పక్వఫలనీరంబుల్ – కీర = చిలుకలయొక్క, నికాయ = సమూహముయొక్క, ఆస్య = ముఖములచేత, నికృత్త = భేదింపఁబడినట్టియు, పక్వ = పండినట్టియు, ఫల=పండ్లయొక్క, నీరంబుల్ = మకరందముల ననుట; నందనాఖ్యన్ = నందన మను పేరిచేత, కుమారుఁ డను ప్రసిద్ధిచేత; మను = వృద్ధి నొందు; నాకాక్రీడము = స్వర్గోద్యానమును; ఎల్లప్పుడున్ = సర్వకాలమును; పోషింపనో = పోషించుటకో యేమో; ఒయ్యన = మెల్లగా; తగన్= ఒప్పునట్లుగా; నించున్ = పూరించును. విశాలాపురియం దున్న యుద్యానములు నందనవనముకన్న నుపరిభాగము నొందియున్న వనియు, నందనవనము పురోద్యానములకు బిడ్డ యనునట్లు అల్పముగా నున్న దనియు భావము. ఉపవనకర్తృక పుష్పరజఃకరణకసేతుకృతియుఁ, దదధికరణక పక్వఫలనీర పూరణమును లేనివే నందనవనపోషణహేతువులుగా వర్ణింపఁబడుటచే నసిద్ధవిషయ హేతూత్ప్రేక్షాలంకారము. 'శ్లో. సంభావనా స్యాదుత్ప్రేక్షా వస్తుహేతు ఫలాత్మనా' యని లక్షణము.

సీ. జాలకమాలికా◊జాలంబు లెత్తుట, నుదుటుముత్యపుఁబేరు ◊ లొసఁగు మనుట,
సరసబంధూకగు◊చ్ఛముఁ జూపి కప్పుట, నలప్రొద్దు గ్రుంకఁగా◊వలయు ననుట,
దళముగాఁ గెందమ్మి◊దళములు గూర్చుట, నీ మీఁద ననురక్తి ◊నెగడె ననుట,
చికిలి సంపెఁగననల్ ◊సెలిమిచే నిచ్చుట, గుఱుతు చంపకలతా◊కుంజ మనుట,
తే. తెలుపకయ తెల్పి, కడునేర్పు ◊దేటపడఁగ, నలరుబొంకులఁ జెలఁగించి, యఖిలకమన
పాళి తమదండకై యాస◊పడఁగఁజేసి, విరులు విల్తురు, కుసుమలా◊వికలు వీట. 105

టీక:వీటన్ = విశాలాపురియందు; కుసుమలావికలు = పువ్వు లమ్మెడు స్త్రీలు; జాలకమాలికాజాలంబులు = మొగ్గలసరముల గుంపులు; ఎత్తుటన్ = ఎత్తుటచేత; ఉదుటుముత్యపుఁబేరులు =గొప్ప ముత్యపుసరులు; ఒసఁగు మనుట= ఇమ్మని చెప్పుట; సరస బంధూక గుచ్ఛమున్ – సరస = శ్రేష్ఠ మగు, బంధూక = మంకెనపువ్వులయొక్క, గుచ్ఛమున్ = గుత్తిని; చూపి కప్పుటన్ = చూపి, మూయుటచేత; అలప్రొద్దు గ్రుంకఁగా వలయు ననుట = ఆప్రొద్దు గ్రుంకవలయు నని చెప్పుట; దళముగాన్ = దట్టమౌనట్లుగా; కెందమ్మిదళములు = ఎఱ్ఱతామరఱేకులు; కూర్చుటన్ = కూర్చుటచేత; నీమీఁదన్ = నీపై; అనురక్తి = అనురాగము; నెగడెన్ = అతిశయించెను; అనుట = అని చెప్పుట; చికిలి సంపెఁగననల్ = బాగైన సంపెంగపువ్వులు; చెలిమిచేన్ =ప్రేమచేత; ఇచ్చుటన్ = ఇచ్చుటచేత; చంపకలతాకుంజము = సంపెంగలతలపొద; గుఱుతు = సంకేతస్థానము; అనుట = అని చెప్పుట; తెలుపకయ తెల్పి = ఇట్లు తమ యభిప్రాయమును వాక్కుతోఁ జెప్పకయె వ్యాపారముతోఁ దెల్పి; కడునేర్పు= అధికమగు చాతుర్యము; తేటపడఁగన్ = వ్యక్తమౌ నట్లుగా; అలరుబొంకులన్ = ఒప్పుచున్న యసత్యోక్తులచేత; అఖిలకమన పాళిన్ = ఎల్ల కాముకకోటిని; చెలఁగించి = సంతోషపెట్టి; తమదండకై = తమపూదండకు, పొందునకు; ఆసపడఁగఁజేసి = ఆశించునట్లు చేసి; విరులు = పూవులు; విల్తురు = విక్రయింతురు.

చ. అలనగరాధిమౌళి సరసాగ్రణు లెంచఁ జరించు చల్లవీ
వలి తను భృంగకోటి గొలువన్ విటనేత యనంగ సొంపుమై
నలరెడి పద్మినీతతుల యందపుఁదావులు సెంది, యుబ్బుచుం
గులుకుఁ జిగుర్చుఁ, గన్నెలతకూనల మేల్వల పూని చొక్కుచున్. 106

టీక: ఈపద్యమందు మందమారుతమును విటనాయకునిఁగా వర్ణించుటచే నర్థద్వయము కల్గుచున్నది. అలనగరాధిమౌళిన్ = ఆపురవరముపై; సరసాగ్రణు లెంచన్ = రసికశిరోమణులు మెచ్చఁగా; చరించు చల్లవీవలి = వీచుచున్న చల్లనివాయువు; తనున్ = తన్ను; భృంగకోటి=తుమ్మెదలగుంపులు, విటుల గుంపులు, 'భృఙ్గో ధూమ్యాట షిఙ్గయోః మధువ్రతే' అని విశ్వము; కొలువన్ = సేవింపఁగా; విటనేత యనంగన్ = విటశ్రేష్ఠుండనునట్లు; సొంపుమైన్ = మనోహరతచేత; అలరెడి = ఒప్పుచున్న; పద్మినీతతుల = పద్మలతల గుంపులయొక్క, పద్మినీజాతిస్త్రీసమూహముయొక్క; అందపుఁ దావులు =మనోహర మైన పరిమళములను, నివాసస్థానములను; చెంది = పొంది; ఉబ్బుచున్ = అతిశయించుచు; కన్నెలతకూనల మేల్వలపు = కన్నెల వంటి బాల (లేత) లతలయొక్క మేలైన పరిమళమును, బాలలతలవంటి కన్నెల యందు హెచ్చైన మోహమును; ఊని= పూని; చొక్కుచున్ = పరవశ మగుచు; కులుకున్ = అందమును; చిగుర్చున్ = ఆవిర్భవింపఁ జేయును.

సీ. సేసకొప్పుల నమర్చిన మొల్లమొగడచాల్, సరిగరుమాలపైఁ జక్కఁ దోఁప,
వలెవాటు వైచిన సుళువుఁ జెందిరకావి, వలిపముల్ పదపల్లవముల జీర,
నెలవంక రేఖలు నెలకొన్న పేరుర,ములఁ జిల్కతాళులు తళుకుసూపఁ,
జెలువంబు నెగడఁ దీర్చిన క్రొత్తకస్తూరి,పట్టెల మేల్తావి మట్టుమీఱఁ,
తే. జెక్కుఁగవ ముత్తియపుటొంట్లజిగి వెలుంగఁ, బలుకుఁగప్రంపువీడెంబు వలపు నిగుడ,
నలరువేడుక వెనువెంటఁ జెలులు నడవ, వేడ్కఁ జరియింతు రనిశంబు విటులు వీట. 107

టీక: వీటన్ = విశాలాపురియందు; విటులు = జారులు; సేసకొప్పులన్ = కొండెసిగలయందు; అమర్చిన = ఉంపఁబడిన; మొల్లమొగడచాల్ = కుందకుట్మలములయొక్క బంతులు; సరిగరుమాలపైన్ = జరీరుమాలమీఁద; చక్కన్ = బాగుగా; తోఁపన్ = తోఁచుచుండఁగా;

వలెవాటు వైచిన = వల్లెవాటుగా వేసికొన్న; సుళువుఁ జెందిరకావి = లేఁతచంద్రకావివన్నె గల; వలిపముల్ = వస్త్రములు; పద పల్లవములన్ = పల్లవములవంటి పాదములపై; జీరన్ = జీరాడుచుండఁగా;

నెలవంక రేఖలు = చంద్రవంకరేకలు; నెలకొన్న = వ్యాపించిన; పేరురములన్ = విశాలమైన వక్షస్థలములయందు; చిల్కతాళులు = తావళము లనెడు హారవిశేషములు; తళుకుసూపన్ = ప్రకాశించుచుండఁగా;

చెలువంబు = అందము; నెగడన్ = అతిశయించునట్లు; తీర్చిన క్రొత్తకస్తూరిపట్టెల మేల్తావి = తీర్పఁబడిన నూతనకస్తూరిపట్టెల యొక్క యుత్తమమైన పరిమళము; మట్టుమీఱన్ = అతిశయింపఁగా;

చెక్కుఁగవన్ = గండయుగ్మమందు; ముత్తియపుటొంట్లజిగి = ముత్యములతోఁ గూడిన యంటుపోఁగుల యొక్క కాంతి; వెలుంగన్ = ప్రకాశించుచుండఁగా; పలుకుఁగప్రంపువీడెంబు వలపు = పలుకు కర్పూరముతోఁ జేరిన తాంబూలములయొక్క వాసన; నిగుడన్ = వ్యాపింపఁగా; అలరు వేడుకన్ = అతిశయవిలాసముచేత; వెనువెంటన్ = వెంబడిగా; చెలులు = స్త్రీలు; నడవన్ = నడచుచుండఁగా; అనిశంబున్ = ఎల్లప్పుడు; వేడ్కన్ = వేడుకచేత; చరియింతురు = సంచరింతురు.

మ. అకలంకాంబుజపాళికా సుఖిత భృం౦గాళీ తనూకాంతిదం
భ కళిందప్రభవానుషంగ శిఖిదా౦మా తాండవాపాదనో
దక భంగోత్కర ఘర్షణక్రమ సము౦ద్గచ్ఛ త్పయోబిందు శీ
తకరీభూత పతంగ గంగ, దనరుం ౦దత్ప్రాంతదేశంబునన్. 108

టీక: తత్ప్రాంతదేశంబునన్ = ఆవిశాలాపురిసమీపమందు; అకలంకాంబుజ పాళికా సుఖిత భృంగాళీ తనూ కాంతిదంభ కళిందప్రభ వానుషంగ శిఖిదామా తాండవాపాద నోదక భంగోత్కర ఘర్షణక్రమ సముద్గచ్ఛ త్పయోబిందు శీతకరీభూత పతంగ గంగ– అకలంక = స్వచ్ఛములగు, అంబుజ = పద్మములయొక్క, పాళికా = గుంపులయందు, సుఖిత = సంజాత సుఖములగు, భృంగ = తుమ్మెదలయొక్క, ఆళీ = సమూహముయొక్క, తనూకాంతి = దేహకాంతి యనెడు, దంభ = నెపము గల, కళిందప్రభవా = యమునానదియొక్క, అనుషంగ = సంబంధముచేత, దీని కాపాదనక్రియయం దన్వయము, శిఖిదామా =మయూరసమూహమునకు, తాండవాపాదన = తాండవోత్సవసంపాదక మగు, ఉదక = జలముయొక్క, భంగోత్కర = అలల గుంపులయొక్క, ఘర్షణక్రమ = సంఘర్షణక్రమముచేత, సముద్గచ్ఛత్ = పైకెగురుచున్న, పయోబిందు= ఉదక బిందువులచేత, శీతకరీభూత= చంద్రునివలెఁ జల్లనైన, పతంగ = సూర్యుఁడు గల, గంగ = గంగానది; తనరున్ = ప్రకాశించును. ఈపద్యమందు శిఖిదామా యనుచోట దామన్ శబ్దము ‘డా బుభాభ్యా మన్యతరస్యామ్’ అను సూత్రముచేత డాప్ప్రత్యయము వచ్చుటచే నాకారాంత మైనది. భృంగతనూకాంతి యనెడు యమునాసంగముచేత గంగాతరంగములు మేఘపరంపరలఁ బోలి శిఖితాండవముఁ గలుగఁ జేయుచున్న వనియు, నాతరంగములయొక్క తాఁకుడువలన జలకణములు సూర్యలోకమువఱకు నెగసి సూర్యునిఁ జంద్రునివలెఁ జల్ల నగునట్లు చేయుచున్న వనియు భావము.

మ. విలసత్సారణికానుయాయి విబుధ౦ద్వీపిన్యనర్ఘామృతం
బుల ముక్కారును బండు శాలులు పురీ౦భూదేవపాళీకృతో
జ్జ్వల నానావిధయజ్ఞ తన్న వహవి౦స్సంభుక్తి బర్హిర్ముఖా
వళు లెల్లప్డు నమర్త్యభావ మజర౦త్వం బూని మోదింపఁగన్. 109

టీక: శాలులు = వరిపైరులు; విలసత్సారణికానుయాయి విబుధద్వీపిన్యనర్ఘామృతంబులన్ – విలస త్సారణికా = ప్రకాశించు కాల్వలను, అనుయాయి = అనుసరించిపోవు, విబుధద్వీపినీ = గంగయొక్క, అనర్ఘామృతంబులన్ = అమూల్యములగు నుదకము లను సుధలచేత; ముక్కారును = మూఁడు కార్లును; పండున్ = ఫలించును; పురీ భూదేవపాళీ కృతోజ్జ్వల నానా విధ యజ్ఞ తన్న వహవిస్సంభుక్తిన్– పురీ = విశాలాపురియందలి, భూదేవపాళీ = బ్రాహ్మణబృందముచేత, కృత = చేయఁ

బడిన, ఉజ్జ్వల = ప్రకాశించునట్టి, నానావిధ = అనేకప్రకారము లగు, యజ్ఞ = యజ్ఞములయందు, తన్నవహవిస్సంభుక్తిన్= ఆశాలి సంబంధి యైన నూతనహవిర్భోజనముచేత; బర్హిర్ముఖావళులు = దేవగణములు; ఎల్లప్డున్ = నిరంతరమును; అమర్త్య భావము = మరణము లేకుంటను; అజరత్వంబు = ముసలితనము లేమిని; ఊని = వహించి; మోదింపఁగన్ = సంతసించు చుండఁగా, దీనికి పండు నను సమాపకక్రియతో నన్వయము. అనఁగా బర్హిర్ముఖులకు (గడ్డిదినువారికి) అమృతముతోఁ బండిన లోకోత్తర మైన శాలిహవిస్సు భుజించుటయు, నమర్త్యత్వాజరత్వములుగలుగుటయు, లోకోత్తరానందహేతు వగు నని యాశ యము. గంగానది కాల్వల చేత ముక్కారుపంటలు పండుచుండఁగా విప్రులు యాగము లెప్పుడుఁ జేయుచు దేవతలను సంత సింపఁ జేయుదు రని భావము. ఇచట బర్హిర్ముఖుల నిష్ఠాజరత్వామర్త్యభావములను గూర్చి హేతువు గాని విబుధద్వీపిన్యనర్ఘా మృతఫలితశాలిహవిర్భోజనమును హేతువుగా సంభావన చేయుటవలన హేతూత్ప్రేక్షాలంకారము. అదియు నమృతశబ్దగత రూపకముతో సంకీర్ణంబు.

చ. అనువనసారణీతటయుఁగాంబుజబృందమరందపూరము
లగనిమలు నిండి యానదిజఁలంబులతోఁ బ్రవహింపఁ బై పయిన్
జను నళిపంక్తి బొల్పెసఁగు ఁసాగరనీరముఁ ద్రావి దప్పిచే
ననిశము మేఘమాలిక తఁదంబుకదంబము గ్రోలఁ జేరె నాన్. 110

టీక: అనువన సారణీ తటయుగాంబుజబృంద మరందపూరముల్ – అనువన=వనము ననుసరించిన, సారణీ= కాల్వల యొక్క, తటయుగ = ఇరుప్రక్కలయందున్న, అంబుజబృంద = పద్మముల గుంపుయొక్క, మరందపూరముల్ = మకరంద ప్రవాహములు; గనిమలు నిండి=కయ్యలు నిండి; ఆనదిజలంబులతోన్= ఆ గంగానదిజలములతో; ప్రవహింపన్= ప్రవహించు చుండఁగా; పై పయిన్ = మీఁదమీఁద; చను నళిపంక్తి =పోవు తుమ్మెదలగుంపు; సాగరనీరమున్=సముద్రోదకమును; అనిశము = ఎల్లప్పుడును; త్రావి = పానము చేసి; దప్పిచేన్= తృష్ణచేత; మేఘమాలిక= మబ్బులగుంపు; తదంబుకదంబము = ఆమక రందయుతమైన గంగాజలమును; క్రోలన్ = త్రావుటకు; చేరె నాన్ = చేరినదా యను నట్లు; పొల్పెసఁగున్ = ఒప్పారును; అళిపంక్తిని మేఘముగా సంభావన చేయుటచే స్వరూపోత్ప్రేక్షాలంకారము.

ఉ. పున్నమరేలఁ గాఁపువిరిఁబోఁడులు కాంచనకందుకంబులం
జెన్నగు చంద్రకాంతతటఁసీమల వజ్రపుబిల్లదొంతి నే
య న్నెరయంగఁ జాలినరఁయంబున మార్చి గ్రహింతు రింపుతో
నన్నది నిర్మలోర్మికలఁనందిన పూర్ణసుధాంశుమూర్తులన్. 111

టీక: పున్నమరేలన్ = పున్నమరాత్రులయందు; కాఁపువిరిబోఁడులు = కాఁపులయాఁడువారు; కాంచన కందుకంబులన్ = బంగారుచెండ్లచేత; చెన్నగు చంద్రకాంతతటసీమలన్ = ప్రకాశించుచున్న చంద్రకాంతమణిఖచిత మగు తీరప్రదేశములయందు; వజ్రపుబిల్లదొంతిన్ = వజ్రములతో గుండ్రముగాఁ జేయఁబడిన బిల్లలయొక్క దొంతి, ననఁగా నొకదానిపై నొకటి వరుసగాఁ బెట్టిన రాశిని; ఏయన్ = ఏయఁగా; నెరయంగన్ = ఆబిల్ల లంతట నెరసికొనఁగా; చాలినరయంబునన్ = మిక్కిలివేగముచేత;

అన్నది నిర్మలోర్మికల నందిన పూర్ణసుధాంశుమూర్తులన్ = ఆగంగయొక్క నిర్మలమైన తరంగములయందుఁ బ్రతిఫలించిన పూర్ణచంద్రుని తనువులను; మార్చి = మార్పుచేసి; ఇంపుతోన్ = సంతసముతో; గ్రహింతురు = పట్టుకొందురు. ఇచట వజ్రపు బిల్లలనెడు భ్రాంతితోఁ గాఁపువిరిబోఁడులు చంద్రబింబములను గ్రహించుటవలన భ్రాంతిమదలంకారము.

సీ. కమనీయకామినీ॰గానంబు కమనీయ,కామినీగానంబు ॰గలిసి మెఱయఁ,
జక్రాంగచక్రని॰స్స్వనములు చక్రాంగ,చక్రనిస్స్వనములు ॰చక్క బెరయ,
బహులహర్యాళికా॰ర్భటికలు బహులహ,ర్యాళికార్భటిక లై॰క్యంబు నొంద,
సారంగరాజఘో॰షంబులు సారంగ,రాజఘోషములు మి॰త్రత్వ మూనఁ,
తే. గలితవాహినికాకల॰కలము నిత్య,కలితవాహినికాకల॰కలము బెరయ,
నప్పురపుఁజెల్మిచేఁ బోలె ॰నమరతటిని,చెంత శుచిజీవనస్థితిఁ జెలఁగు నెపుడు. 112

టీక: ఇందు గంగాపర మైన యర్థము, పురపర మైన యర్థమును దోఁచుచున్నది.

కమనీయకామినీగానంబు = మనోజ్ఞస్త్రీల గానము; కమనీయకామినీగానంబు = మనోజ్ఞచక్రవాకస్త్రీల గానము, 'కామీ స్యాత్కాముకే చక్రవాకే పారావతేఽపి చ' అని విశ్వము; కామియొక్క స్త్రీ కామిని యగును; కలిసి = కూడి; మెఱయన్ = ప్రకాశింపఁగా;

చక్రాంగచక్రనిస్స్వనములు = రథసమూహముల ధ్వనులు; చక్రాంగచక్రనిస్స్వనములు = హంససమూహముల ధ్వనులు; చక్కన్ = చక్కఁగా; బెరయన్ =కలయఁగా;

బహులహర్యాళికార్భటికలు – బహుల = అధికములగు, హర్యాళికార్భటికలు = అశ్వసంఘములయొక్క హేషలు; బహు = అధికములగు, లహరీ = అలలయొక్క, ఆళికా=సమూహములయొక్క, ఆర్భటికలు = ధ్వనులు; ఐక్యంబు నొందన్ = అభేదము నవలంబింపఁగా;

సారంగరాజఘోషంబులు = శ్రేష్ఠగజములయొక్క బృంహితములు; సారంగరాజఘోషములు=గండుతుమ్మెదల రుతములు; మిత్రత్వము = సుహృద్భావమును; ఊనన్ = వహింపఁగా;

కలితవాహినికాకలకలము= ఒప్పుచున్న సేనలయొక్క కోలాహలములు; నిత్యకలితవాహినికాకలకలము=ఎల్లప్పుడుఁ గూడుకొన్న ప్రవాహకోలాహలధ్వనులు; బెరయన్ = కూడఁగా; అప్పురపుఁజెల్మిచేఁ బోలెన్ = ఆ విశాలాపురియొక్క మైత్రితోఁ బోలె; అమరతటిని = సురనది; చెంతన్ = సమీపమున; శుచిజీవనస్థితిన్ = నిర్మలమైన బ్రదుకుయొక్క స్థితిచేత, నిర్మలోదకస్థితిచేత ననుట; ఎపుడున్ = సర్వకాలములందు; చెలఁగున్ = ఒప్పును.

గంగానది తనయం దున్న కమనీయచక్రవాకస్త్రీగానాదులు విశాలాపురియం దున్న కమనీయనారీగానాదులు పరస్పరసామ్యమున మైత్రి నొందఁగాఁ దానును ప్రీతితోఁ బోలె శుచిజీవనస్థితిని దాల్చి శుచిజీవనస్థితి యైన పురముచెంత వసించిన దనఁగా నొండొరుల ధర్మము లైక్యముగా నున్న వని భావము. పురమం దున్న వారల జీవనముయొక్క నైర్మల్యమును బట్టి లక్షణచే పురము శుచిజీవన మగు నని యెఱుంగునది. పురసమీపమందు గంగాస్థితి కహేతువు లగు కామినీగానైక్యాదులు హేతువులుగాఁ జెప్పుటచే హేతూత్ప్రేక్షాలంకారము.

క. ఆరాజధాని కధిపతి
యై రాజిల్లును సుచంద్రుఁ డను ◊రాజు, మహో
దారగిరీశోరుదరీ
వారవరీవృత్యమాన◊వైరివ్రజుఁ డై. 113

టీక: ఆరాజధానికిన్ = ఆ నగరమునకు; అధిపతి యై = ప్రభు వై; సుచంద్రుఁ డను రాజు = సుచంద్రుఁడను నామము గల రాజు; మహోదార గిరీ శోరుదరీ వార వరీవృత్యమాన వైరివ్రజుఁ డై – మహోదార = మిక్కిలి యధికము లగు, గిరీశ = పర్వతశ్రేష్ఠములయొక్క, ఉరుదరీ = గొప్పదరులయొక్క, వార = సంఘములయందు, వరీవృత్యమాన = మిక్కిలి వసించినట్టి, వైరివ్రజుఁ డై = శత్రుసంఘము గల వాఁ డై; రాజిల్లును = ప్రకాశించును.

సీ. తనచారుకీర్తిసం◊తానవల్లరికి స,జ్జాలముల్ సజ్జాల◊లీల నెనయఁ,
దననిత్యదానాంబు ◊వనజాలయమునకుఁ, బుష్కరం బతినీల◊పుష్కరముగ,
దనఖడ్గపుత్ర్యభి◊ధానకాదంబిని, కరిరాజు లరిరాజు ◊లై తలంకఁ,
దననవ్యధామసాం◊ద్రద్యోతమునకు ఖ,ద్యోతుండు ఖద్యోత◊రీతిఁ బూనఁ,
తే. దనభుజాభోగిరాడ్భోగ◊మునకు ధరణి,చక్ర మెంతయుఁ జక్రప్ర◊శస్తి బెరయ,
వెలయు నభిరామసౌందర్య◊విజితమదన,శక్రసుతచంద్రవిభుఁడు సు◊చంద్రవిభుఁడు. 114

టీక: అభిరామ సౌందర్య విజిత మదన శక్రసుత చంద్ర విభుఁడు – అభిరామ = ఒప్పుచున్న, సౌందర్య = చక్కఁదనముచేత, విజిత=జయింపఁబడిన, మదన=మన్మథునియొక్కయు, శక్రసుత= జయంతునియొక్కయు, చంద్ర = చంద్రునియొక్కయు, విభుఁడు = విశేషకాంతి గల వాఁ డైన; సుచంద్రవిభుఁడు= సుచంద్రమహారాజు;
తనచారుకీర్తిసంతానవల్లరికిన్ = తనయొక్క కీర్తి యనెడు కల్పవల్లికి; సజ్జాలముల్ = రిక్కలగుంపులు; సజ్జాలలీలన్ = లెస్స యగు మొగ్గలయొక్క లీలవంటి లీలను; ఎనయన్ = పొందఁగా;
తన నిత్య దానాంబు వనజాలయమునకున్= తనయొక్క నిరంతరదానోదక మనెడు సముద్రమునకు; పుష్కరంబు = ఆకసము; అతినీలపుష్కరముగన్ = మిక్కిలి నల్లనైన తామర కాఁగా;
తన ఖడ్గపుత్ర్యభిధాన కాదంబినికిన్ = తన చురకత్తి యనెడు మేఘమాలకు; అరిరాజులు = శత్రురాజులు; అరిరాజు లై = జక్కవ రాజు లై; తలంకన్ = భయపడఁగా;
తన నవ్యధామ సాంద్ర ద్యోతమునకున్ = తన ప్రతాప మనెడు దట్టమైన యెండకు; ఖద్యోతుండు = సూర్యుండు; ఖద్యోతరీతిఁ బూనన్ = మిడుఁగుఱుపురుఁగురీతిని వహింపఁగా;
తన భుజా భోగిరా డ్భోగమునకున్ = తన భుజ మనెడు నాదిశేషుని ఫణమునకు; ధరణిచక్రము =భూచక్రము; ఎంతయున్ = అధికముగా; చక్రప్రశస్తిన్ = చక్రాయుధఖ్యాతిని; బెరయన్ = పొందఁగా; వెలయున్ = ప్రకాశించును.
ఇచట శ్లేషానుప్రాణిత పరంపరితరూపకములకు సంసృష్టి యగు.

చ. అలఘుమహంబునం, గువలయప్రియకారినిజోదయంబున
న్లలితవసుచ్ఛటావితరణంబున, నిస్తులలక్షణంబునం,
గలితచకోరదృఙ్నవసుఖప్రదరూపమునం, గడున్ విరా
జిలు నలరాజు గైకొనఁగఁ జెల్లదె ధాత్రి సుచంద్రనామమున్. 115

టీక: అలఘుమహంబునన్ = అధిక మైన తేజస్సుచేతను, అధిక మైన యుత్సవముచేత నని భావము; కువలయ ప్రియకారి నిజోదయంబునన్ = నల్లకల్వలకుఁ బ్రియమును చేయు తనయావిర్భావముచేత, భూవలయమునకుఁ బ్రియముఁ జేయు తన యభివృద్ధిచేత ననుట; లలిత వసు చ్ఛటా వితరణంబునన్ = మనోజ్ఞమైన కిరణపరంపరయొక్క యీవిచేత, మనోజ్ఞసువర్ణ చ్ఛటాదానముచేత ననుట; నిస్తుల లక్షణంబునన్ = అసమాన మగు కలంకముచేతను, సాటిలేని రాజచిహ్నముచేత ననుట; కలిత చకోరదృ ఙ్నవ సుఖ ప్రద రూపమునన్ – కలిత = ఒప్పుచున్న, చకోర = వెన్నెలపులుగులయొక్క, దృక్ = చూపులకు, నవ = నూతన మౌనట్టుగా, సుఖప్రద = సుఖము నిచ్చు, రూపమునన్ = స్వరూపముచేత; కలిత = ఒప్పుచున్న, చకోర దృక్కులనఁగా స్త్రీలు, వారి కపూర్వసుఖమునిచ్చు (సుందర) రూపముచే ననుట; కడున్ = మిక్కిలి; విరాజిలు అలరాజు = ప్రకాశించు నా రాజు; సుచంద్రనామమున్ = సమీచీన మైన చంద్రనామమును; ధాత్రిన్ = భూమియందు; కైకొనఁగఁ జెల్లదె = స్వీకరింపఁగఁ జెల్లదా, అనఁగాఁ జంద్రునియం దున్న తేజము, కువలయ ప్రియకారి యగు నుదయము, వసుచ్ఛటావితరణము, సాటిలేని చిహ్నము, చకోరదృఙ్నయనసుఖప్రదరూపము గలిగియుండఁగా జంద్రుఁ డను నామ మతనికిఁ జెల్లు నని భావము. ఇచట వర్ణనీయరాజునందు సమర్థనీయ మగు చంద్రనామమును గూర్చి, యలఘుమహంబున నిత్యాదులను హేతువులుగా సమర్థించినందునఁ గావ్యలింగభేదము.

సీ. పుణ్యజనప్రియమున మించు నేరాజు, ప్రబలు నేరా జవిపక్షగుప్తి,
నైకసహస్రాక్ష్యవాప్తకుం డేరాజు, సకలాశ లేరాజు చక్కఁ బ్రోచు,
బహువజ్రభూషల భాసిల్లు నేరాజు, దనరు నేరాజు సత్కవిహితాత్మఁ,
బరదేవహరణచాతురి నొప్పు నేరాజు, బలయుక్తి నేరాజు పరిఢవిల్లుఁ,
తే. జెలఁగు నేరాజు నిచ్చ యశృంఖలైక,లక్ష్మి లొప్పారఁ దను ఘను ల్భక్తిఁ గొలువ,
నహహ యారాజు దనరు దివ్యప్రభుత్య,మానితగుణాంశపరిజితామర్త్యరాజు. 116

టీక: ఈ పద్యమున సుచంద్రునియం దింద్రునకన్న విశేషము వర్ణితం బయ్యె.
ఏ రాజు = ఏ భూమీశుఁడు; పుణ్యజన ప్రియమునన్ = పుణ్యాత్ములయందలి ప్రీతిచేత; మించున్ = అతిశయించునో, ఇంద్రుఁడు పుణ్యజనప్రియుఁడు గాఁడని వ్యతిరేకము, రాక్షసప్రియుఁడు గాఁడని భావము; ఏరాజు, అవిపక్షగుప్తిన్ =శత్రువులు గాని వారి యొక్క రక్షణముచేత, ప్రబలున్ = అతిశ యించునో, ఇంద్రుఁడట్లు కాఁడని వ్యతిరేకము, పర్వతములయొక్క ఱెక్కల గోపనముచేత నింద్రుఁడు ప్రబలువాఁడు కాఁడని భావము;

ఏ రాజు = ఏ భూమీశుఁడు; నైక సహస్రాక్ష్యవాప్తకుండు – నైక = అనేకము లైన, సహస్ర = సహస్రసంఖ్యలు గల, అక్షి = రథములను, అవాప్తకుండు = పొందినవాఁడు; ఇంద్రుఁడు (ఏకసహస్రాక్ష్యవాప్తకుండు) ఒక వేయి నేత్రములు గలవాఁడని భావము, నైకసహస్ర యనుచోట 'సుప్సుపా' యను సూత్రముచేత సమాసము; ఏరాజు, సకలాశలు = అన్నిదిక్కులు; చక్కన్ = చక్కగా; ప్రోచున్ = పాలించునో, ఇంద్రుఁ డొక్క తూర్పు దిక్కునే పాలించు నని భావము.

ఏరాజు, బహు వజ్ర భూషలన్ = అనేకహీరమయ మైన భూషణములచేత, భాసిల్లున్ = ప్రకాశించునో, ఇంద్రుఁడు బహువజ్ర భూషలు గలవాఁడు కాఁడు, మఱేమన్న నొక వజ్రాయుధ మనెడు భూషచే రాజుల్లువాఁ డని భావము; ఏరాజు, సత్కవిహితాత్మన్ = మంచి పండితులకు హిత మైన స్వభావముచేత, తనరున్ = ఒప్పునో, ఇంద్రుఁడు సత్కవిహితాత్మచేఁ దనరఁడు, అనఁగా శ్రేష్ఠుఁడైన శుక్రునకు హితుఁడు కాఁడనుట;

ఏరాజు, పర దేవ హరణ చాతురిన్ = పరరాజసంహారచాతుర్యముచేత, ఒప్పున్ = అతిశయించునో, ఇంద్రుఁడు పరదేవహరణ చాతురి గలవాఁడు కాఁ డనుట; ఏరాజు, బల = సామర్థ్యముయొక్క, యుక్తిన్ = సంబంధముచేత, పరిఢవిల్లున్ = అతిశయిల్లునో, ఇంద్రుఁడు బలయుక్తిచేతఁ బరిఢవిల్లఁడు, అనఁగా బలాసురుని సంబంధము చేయఁ డనుట;

ఏరాజు, నిచ్చ = ఎల్లప్పుడును, అశృంఖలైక లక్ష్ములు = అడ్డములేనట్టి ముఖ్యసంపదలు, ఒప్పారన్ = ఒప్పుచుండఁగా, తనున్ = తన్ను, ఘనుల్ = గొప్పవారు; భక్తిన్ = ప్రీతిచేత; కొలువన్ = సేవింపఁగా; చెలఁగును = ఒప్పునో. ఇంద్రుఁ డశృంఖలైకలక్ష్మ లొప్పారఁ దన్ను ఘనుల్ గొలువఁ జెలఁగువాఁడు కాఁడు, అనఁగా శృంఖలములతోఁ దగిలియున్న మేఘములతో సేవింపఁబడువాఁడని భావము;

దివ్యప్రణుత్య మానితగుణాంశ పరిజితామర్త్యరాజు = దేవతలచేతఁ గొనియాడఁ దగిన పూజ్యము లగు గుణలేశములచేత నోడింపఁబడిన యింద్రుఁడు గలవాఁ డైన; ఆరాజు = ఆ సుచంద్రుఁడు; తనరున్ = ఒప్పును; అహహ = ఆశ్చర్యము; సుచంద్రుఁడు మనుష్యమాత్రుండయ్యు సర్వాతిశయగుణగరిష్ఠుం డగు నింద్రునిఁ దనగుణలేశముచేత జయించుట యాశ్చర్యమని యాశయము. వ్యతిరేకాలంకారము.

మ. పరిసంవర్ధిత చంద్రనాగకులరాꣳట్పద్మామృతం బై నిరం
తరముం బొల్చు తదుర్వరాధిప సముꣳద్యత్కీర్తివారాశి పం
కరుహాజాండము నిండుటల్ నిజ మటుల్ ꣳగా కున్నచోఁ బుష్కరా
న్తరసీమం గనుపట్టునే తరణిమꣳణ్డల్యేకసంచారముల్. 117

టీక: పరిసంవర్ధిత చంద్ర నాగకులరా ట్పద్మామృతం బై– పరిసంవర్ధిత = వృద్ధిఁ బొందింపఁబడిన, చంద్ర = చంద్రుఁడు, నాగకులరాట్ = ఐరావతము, పద్మా = లక్ష్మి, అమృతం బై = సుధయుఁ గలదై అని సముద్రపర మైన యర్థము, మిక్కిలి ఖండింపఁబడిన చంద్రుఁడు, ఐరావతము, పద్మములు (అనఁగాఁ దెల్లదామరలు), అమృతమును గలదై యని కీర్తిపరమైన యర్థము; నిరంతరమున్ = ఎల్లప్పుడును; పొల్చు తదుర్వరాధిప సముద్యత్కీర్తివారాశి = ఒప్పుచున్న యారాజుయొక్క ప్రకాశించుకీర్తి యనెడు సాగరము; పంకరుహాజాండము=పద్మమందు నుదయించిన బ్రహ్మసంబంధి యైన అండము, అనఁగా బ్రహ్మాండము ; నిండుటల్ = నిండి యుండుటలు; నిజము = సత్యము; అటుల్ గాకున్న చోన్ = అట్లు కీర్తివారాశి బ్రహ్మాండము నిండకున్నచో;

పుష్కర = ఆకాశ మనెడు నీటియొక్క; అన్తరసీమన్ = మధ్యప్రదేశమందు; తరణిమణ్డలి = ఖగపూషహిరణ్యగర్భాదిసూర్య మండలి యనెడు నావలగుంపులయొక్క; ఏక = ముఖ్య మగు; సంచారముల్ = సంచరణములు; కనుపట్టునే = చూపట్టునా?

కీర్తివారాశి బ్రహ్మాండము నిండనియెడ నాకాశమధ్యమున నావలు సంచరించుట ఘటింపదు గావునఁ గీర్తివారాశి బ్రహ్మాండములు నిండినదే నిజ మని యాశయము. సుచంద్రుని కీర్తి చంద్రాదులను తిరస్కరించి యనఁగా వానికన్న నెక్కుడైన శుక్లగుణమును వహించి, సముద్రమువలె బ్రహ్మాండములు వ్యాపించినదని భావము. ఇచటఁ గీర్తివారాశికర్తృక బ్రహ్మాండవ్యాపనమును పుష్కరాధికరణతరణిమండలీసంచారములతో నూహించినందున నుపమాలంకారము.

చ. అలఘుసమిత్తలంబున మ॥హామహిమంబునఁ బొల్చు నాకుభృ
త్కులమణిదోఃప్రతాపశిఖి॥కూట మిభశ్రుతివీజనానిలం
బులఁ గడుఁ బర్వినం గరఁగు॥బో యని కాదె యజాండసీమకున్
వలగొనఁ జేసె ధాత యని॥వార్యజలావరణంబు నేర్పునన్. 118

టీక: అలఘుసమిత్తలంబునన్ = అతిశయ మగు యుద్ధరంగ మనెడు సమిధల పట్టున; మహామహిమంబునన్ = అతిశయమైన మహిమచేత; పొల్చు = ఒప్పుచున్న; ఆకుభృత్కులమణి = ఆ రాజశ్రేష్ఠుఁ డనెడు పర్వతశ్రేష్ఠముయొక్క; దోఃప్రతాప శిఖి కూటము = బాహుప్రతాప మనెడు కారుచిచ్చుగుంపు; ఇభ = ఏనుఁగులయొక్క; శ్రుతి = శ్రోత్రము లనెడు; వీజన = విసనకఱ్ఱల యొక్క; అనిలంబులన్ = వాయువులచేత; కడున్ = మిక్కిలి; పర్వినన్ = వ్యాపించినచో; కరఁగుఁ బో యని కాదె=ద్రవించును పో యని కాదా; ధాత = బ్రహ్మదేవుఁడు; అజాండసీమకున్ = బ్రహ్మాండప్రదేశమునకు; అనివార్యజలావరణంబు = నివారింప రాని జలముయొక్క ఆచ్ఛాదనమును, అనఁగా సముద్రములను; నేర్పునన్ = చాతుర్యముచేత; వలగొనన్ = చుట్టుకొనునట్లు; చేసెన్ = ఒనరించెను. అజాండమునకు జలావరణకరణమును గూర్చి హేతువు గాని సుచంద్రప్రతాపవహ్నిద్రావణమును హేతువుగాఁ జెప్పుటవలన హేతూత్ప్రేక్షాలంకారము. ప్రతాపాదులయందు శిఖిత్వాద్యారోపమున రూపకాలంకారము.

సీ. గురుతరత్వచిసార॥గుల్మోత్కరమ్ములు, సరసవిహారమం॥దిరము లయ్యె,
ఘనకందరాముఖో॥ద్గతఝరీజాలంబు, కేళికాదీర్ఘికా॥పాళి యయ్యెఁ,
గటకశోభితతత॥గ్రావకూటంబు లు,ద్యానజదాస్థానవి॥తర్దు లయ్యె,
నభినవశతపర్వి॥కావృతాధిత్యకల్, కలితప్రసవతల్ప॥కులము లయ్యె,
తే. సంతతము నాటవికవర॥సముదయంబు, లభిమతవయస్యవర్యచ॥యమ్ము లయ్యె,
మలయ నగవీథి నమ్మహీ॥వలయనాథ,చంద్రశాత్రవగోత్రాత॥లేంద్రతతికి. 119

టీక: అమ్మహీవలయనాథచంద్ర శాత్రవగోత్రాతలేంద్రతతికిన్ – అమ్మహీవలయనాథచంద్ర= ఆరాజచంద్రుఁ డగు సుచంద్రుని యొక్క, శాత్రవగోత్రాతలేంద్రతతికిన్ =శత్రురాజబృందమునకు; అగవీథిన్= పర్వతప్రదేశమందు; మలయన్ = తిరుగునట్లుగా; కాదేని, మలయనగవీథిన్ = మలయపర్వతప్రాంతమం దని యర్థము;

గురుతర త్వచిసార గుల్మోత్కరమ్ములు – గురుతర = మిక్కిలి గొప్పవైన, త్వచిసారగుల్మ = వేణుగుల్మములయొక్క, ఉత్కరమ్ములు = సమూహములు; సరసవిహారమందిరములు = శ్రేష్ఠము లగు క్రీడాగృహములు; అయ్యెన్ = ఆయెను; ఘన కందరా ముఖోద్గత ఝరీ జాలంబు = గొప్పనైన దరీముఖంబులవలన బయలుదేఱుచున్న సెలయేఱుల గుంపు; కేళికా దీర్ఘికాపాళి = క్రీడావాపీసమూహము; అయ్యెన్ = ఆయెను;

కటక శోభిత తత గ్రావ కూటంబులు – కటక = కొండల నడిమిభాగములందు, శోభిత = ప్రకాశించుచున్న; తత = విశాలము లగు, గ్రావ = శిలలయొక్క, కూటంబులు = గుంపులు; ఉద్భ్రాజ దాస్థాన వితర్దులు – ఉద్భ్రాజత్ = ప్రకాశించుచున్న, ఆస్థాన = కొలువుకూటమందలి, వితర్దులు = వేదికలు; అయ్యెన్ = ఆయెను;

అభినవ శతపర్వి కా వృతాధిత్యకల్ – అభినవ = నూతన మగు, శతపర్వికా = నల్లగఱికచేత, 'గోలోమీ శతపర్వికా' అని యమరుఁడు, ఆవృత = వ్యాప్తము లగు, అధిత్యకల్ = పర్వతోపరిప్రదేశములు, 'ఉపత్య కాద్రే రాసన్నా భూమి రూర్ధ్వ మధిత్యకా' అని యమరుఁడు; కలిత ప్రసవ తల్ప కులములు – కలిత = ఒప్పుచున్న, ప్రసవతల్ప = పువ్వులపాన్పులయొక్క, కులములు = సమూహములు; అయ్యెన్ = ఆయెను;

సంతతమున్ = ఎల్లప్పుడును; ఆటవికవర సముదయంబులు = ఆరణ్యకు లైన కిరాతకుల గుంపులు; అభిమత వయస్యవర్య చయమ్ములు = అనుకూల మైన మిత్రవరుల సమూహములు; అయ్యెన్ = ఆయెను. సుచంద్రనరేంద్రుని యుగ్రప్రతాపమువలన భీతు లయి యరినృపతు లడవుల పాలై రని భావము. ఇందు రూపకములకు సంసృష్టి.

మ. ఇల సజ్జాలకభాసమాన మగు నాఁపృథ్వీశు కీర్త్యాఖ్య ని
ర్మల హర్మ్యేంద్రమునం దదీయ నవధాఁమ వ్యాజ మార్తాండమం
డల రోచుల్ ప్రసరింప నచ్చటఁ గన ఁన్రాజిల్లు వేధోండమ
ణ్డలు లెంతేఁ ద్రసరేణుబృందసమత ఁన్సంధించి యెల్లప్పుడున్. 120

టీక: ఇలన్ = భూమియందు; సజ్జాలక భాసమాన మగు – సత్ = శ్రేష్ఠము లగు, జాలక = గవాక్షములచేత, భాసమాన మగు = ప్రకాశించునది యని సౌధపరమైన యర్థము, సత్పురుషుల సంఘముచేత భాసమాన మనఁగాఁ గొనియాడఁబడిన దని కాని, సజ్జాలకములవలె (అనఁగా నక్షత్రముల గుంపులవలె, లేదా శ్రేష్ఠము లగు మొగ్గలవలె) ప్రకాశించునది యని కాని కీర్తి పరమైన యర్థము; ఆ పృథ్వీశు = ఆ రాజుయొక్క; కీర్త్యాఖ్య = కీర్తి యను నామము గల; నిర్మల = స్వచ్ఛ మగు; హర్మ్యేంద్రమునన్ = ఉత్తమసౌధమునందు; తదీయ నవధామ వ్యాజ మార్తాండ మండల రోచుల్ = ఆ రాజు సంబంధి యైన ప్రతాప మనెడు నెపము గల సూర్యమండలకాంతులు; ప్రసరింపన్ = వ్యాపింపఁగా; అచ్చటన్ కనన్ = ఆ మేడలోఁ జూడఁగా; వేధోండ మణ్డలులు = బ్రహ్మాండముల గుంపులు; ఎంతేన్ = మిక్కిలి; త్రసరేణుబృందసమతన్ – త్రసరేణు = త్ర్యణుకములయొక్క; బృంద = గుంపు యొక్క; సమతన్ = సామ్యమును; సంధించి =పొంది; ఎల్లప్పుడున్= సర్వకాలములయందు, ప్రతాపసూర్యప్రభ దివారాత్రము లుడివోవనిది గావున నెల్లప్పుడు ననుట; రాజిల్లున్ = ప్రకాశించును. అనఁగా నొక మేడయందు గవాక్షద్వారముగ సూర్యకిరణ ములు ప్రసరింపఁగా నాతేజస్సునందుఁ బరాగాదుల సూక్ష్మావయవములు గాన్పించిన యట్లు సుచంద్రునికీర్తి యను మేడలో నారాజు ప్రతాపవ్యాజ సూర్యకాంతులు ప్రస రింపఁగా నచట బ్రహ్మాండకోటులు త్ర్యణుకములగుంపులవలెఁ గాన్పించు నని

యాశయము. ఇందులకు ‘ శ్లో. జాలసూర్యమరీచిస్థం సూక్ష్మం యద్దృశ్యతే రజః, తస్య షష్ఠతమోభాగః పరమాణు స్స ఉచ్యతే’ అని తర్కపరిభాషయందుఁ జెప్పఁబడినది. ఆ పరమాణువు, ద్వ్యణుకమును చక్షుఃప్రత్యక్షగోచరములు గా వనియుఁ, త్ర్యణుకము మొదలుగఁ బ్రత్యక్షగోచరము లగు ననియు వ్రాయఁబడియె. ఇట్లు చెప్పఁగా సుచంద్రునికీర్తి సమస్తబ్రహ్మాండముల నావరించిన దనియు, నారాజు ప్రతాపము సూర్యప్రభవలె దివారాత్రములు వెలుగుచున్న దనియు భావము.

సీ. ఆత్మకిరాతత్వ◊మత్యుత్సవముఁ బూన్ప, వనచరావృతిఁ గూర్మ◊వర్యుఁ డలరు,
నని శంబు దర్వీకర◊రాప్తిఁ జేకొని మహా,ప్రజ్ఞుఁడై కుండలి◊రాజు దనరుఁ,
బరపద్మినీసుసం◊పర్కంబుఁ జేసి దృ,ప్తుం డయి దిక్కరీం◊ద్రుండు ప్రబలు,
బహ్వబ్దసంగతిఁ ◊బడసి యెచ్చటఁ జరిం◊పఁగ నోపక కులాద్రి◊భర్త నిల్చు,

తే. గహనముల నొక్కఁడై దంష్ట్రి◊కాంతుఁ డడరు, ననుచు నిరసించి సత్కులు, ◊నమలరూపు,
ననఘగుణు, నాత్తయౌవను, ◊నలఘుసంప,దాఢ్యు రాకొమరునిఁ జెంది ◊యవని యలరు. 121

టీక: కూర్మవర్యుఁడు = ఆదికూర్మము; ఆత్మకిరాతత్వము = తన బోయతనము; అత్యుత్సవమున్ = అతిసంతసమును; పూన్పన్ = వహింపఁజేయఁగా; వనచరావృతిన్ = అరణ్యసంచారుల వ్యాప్తిచేత; అలరున్ = ఒప్పును; ఆత్మకున్, ఇరా తత్వము=ఉదకమందు సంతతసంచారము అత్యుత్సవముఁ బూన్పఁగా , వనచర అనఁగా జలచరములైన మత్స్యాదులయొక్క ఆవృతిచేతఁ గూర్మవర్యుఁ డలరు నని భావము, ‘ఇరా భూ వాక్సురాప్సు స్యాత్’ – అని యమరుఁడు;

కుండలిరాజు = శేషుఁడు; అనిశంబు = ఎల్లపుడు; దర్వీ= తెడ్లవంటి; కర = హస్తములయొక్క; ఆప్తిన్ = కలుగుటను; చేకొని = పొంది; మహాప్రజ్ఞుఁడై = మిక్కిలి ప్రకృష్టములైన మోకాళ్లు గలవాఁడై;, ‘ప్రజ్ఞుః ప్రగతజానుకః’ అని యమరుఁడు, ‘ప్రసంభ్యాం జానునోర్జుః’ అను సూత్రముచేత జానుశబ్దముపై ‘జ్ఞు’ ఆదేశ మగును. విశేషణద్వయముచేత శేషుఁడు కురూపి యని తోఁచు చున్నది. ఎల్లప్పుడు సర్పసాంగత్యము గలవాఁ డనియు, మహాబుద్ధిశాలి యనియు భావము; తనరున్ = ఒప్పును;

దిక్కరీంద్రుండు = దిగ్గజరాజు; పరపద్మినీసుసంపర్కంబున్ = పరస్త్రీసాంగత్యమును; చేసి = కావించి; దృప్తుం డయి = గర్వియై; ప్రబలున్ = అతిశయించును; దిక్కరి గొప్ప యాఁడేనుఁగుతో సంబంధముఁ జేసి మత్తుగొని యుండునని భావము. పద్మియొక్క స్త్రీ పద్మినీ, పద్మి యనఁగా గజము, ‘ఇభ స్తమ్బేరమః పద్మీ’ అని యమరుఁడు.

కులాద్రిభర్త = కులాచలశ్రేష్ఠము; బహ్వబ్దసంగతిన్ = అనేకసంవత్సరముల సంబంధమును; పడసి = పొంది; ఎచ్చటఁ జరింపఁగ నోపక = ఎచ్చటను సంచరింపఁజాలక; నిల్చున్ = నిల్చును; మిక్కిలి వృద్ధత్వము గలవాఁడని తోఁచుచున్నది. కులాద్రి భర్త బహుళమైన యబ్దము లనఁగా మేఘములు, వానితోఁ గూడి చరింపఁగనోపక యనఁగా రేఫలకారముల కభేదము గావునఁ జలింపఁగ నోపక, అచలత్వముచేత నొప్పి నిల్చియుండు నని భావము;

దంష్ట్రికాంతుఁడు = వరాహపతి; ఒక్కఁడై = వెనుక, ముందు లేనివాఁడై; గహనములన్ = దుఃఖములచేత; అడరున్ = అతిశయించును. వరాహము తా నొక్కటియే యడవులయందుసంచరించు ననుట; అనుచున్ = ఇట్లనుచు; అవని = భూరమణి; నిరసించి = కూర్మరాజు మొదలగువారిని నిరాకరించి; సత్కులున్ = ఉత్తమ కులమువాని, కూర్మరాజువలె నీచజాతివాఁడు గానివాని ననుట. ఇట్లు గీతియందుఁ జెప్పిన వ్యతిరేకవిశేషణములకుఁ గ్రమముగా నన్వయము దెలియునది; అమలరూపున్ =

లోకోత్తరసౌందర్యము గలవాని; అనఘగుణున్ = నిష్కల్మషము లైన గుణములు గలవాని; ఆత్తయౌవనున్ = రూఢతారుణ్యము గలవాని;అలఘు సంపదాఢ్యున్ = అధికమైన పుత్రమిత్రకళత్రాదిసంపదచేఁ బూర్ణుని; రాకొమరునిన్ = రాజపుత్రుండగు సుచంద్రుని; చెంది =పొంది; అలరున్ = ఒప్పును.

సుచంద్రుఁడు సర్వభూమిభరణముఁ జేయుచు, సర్వగుణసంపత్తిచేత రాజిల్లె నని భావము. వ్యతిరేకక్రమాలంకారములు.

మ. కనుఁజాయన్ సిరి వాయ కెప్పుడుఁ జెలంఁగన్, సమ్ముఖం బంది పా
వని వాగ్భామిని యొప్పఁ, గీర్తి శుచిభాఁవం బూని సేవింప, మే
దిని బాహాంతరసంగతిం బొదల, ధాఁత్రీభర్త దాక్షిణ్యవ
ర్తనసత్ప్రీతి వహించి మించు సురవఁర్యస్తుత్యనిత్యోన్నతిన్. 122

టీక: సిరి = లక్ష్మి; కనుఁజాయన్ = కన్నులయెదుట ననుట; ఎప్పుడున్ = ఎల్లకాలమును; పాయక = వదలక; చెలంగన్ = ఒప్పఁగా, రాజులకు సిరి కనుఁజాయ ననఁగా నేత్రకాంతియం దుండుననుట ప్రసిద్ధము; పావని = పవిత్ర యగు వాగ్భామిని, వాణి యను స్త్రీ; సమ్ముఖంబు = ఆభిముఖ్యమును; అంది = పొంది; ఒప్పన్ = ఒప్పుచుండఁగా; కీర్తి = కీర్తికాంత; శుచిభావంబు = శుద్ధాంతఃకరణమును, నిర్మలస్వభావము ననుట; పూని = వహించి; సేవింపన్ = కొలుచుచుండఁగా; మేదిని = భూమి; బాహాంతరసంగతిన్ = వక్షఃస్థలము యొక్క సంబంధముచేత, భుజమధ్యసంబంధముచేతననుట, భూదేవి భుజముచేఁ బాలింపఁబడుట ప్రసిద్ధము; పొదలన్ = ఒప్పఁగా; ధాత్రీభర్త = సుచంద్రుఁడు; దాక్షిణ్యవర్తనన్ = దక్షిణనాయకభావ మనెడు వృత్తిచేత, 'తుల్యోఽనేకత్ర దక్షిణః' అని లక్షణము, మొగమోటపునడవడిచేత ననుట; సత్ప్రీతిన్ = మంచి ప్రేమమును, విద్వత్ప్రీతి ననుట; వహించి = పూని; సురవర్యస్తుత్యనిత్యోన్నతిన్ = దేవతోత్తములచేఁ గొనియాడఁ దగిన నిత్యవైభవాతిశయముచేత; మించున్ = అతిశయించును; సుచంద్రనృపతి కటాక్షప్రసరణ మాత్రమున లక్ష్మి గలుగుననియు, నాతండు సర్వవిద్యలు చదివినవాఁ డనియు, నుత్కృష్టకీర్తిశాలి యనియు, సర్వభూమిని పాలించువాఁ డనియు భావము.

వ. సకల జగచ్ఛాసన పాండితీ ధురంధరుం డగు నా రాజశేఖరుం డొక్కనాఁ డాత్మీయసేవా సమాయాత నానాదిశాధినాయక మనోమహోత్సవోల్లాస సంపాదక విభా విభాసిత చంద్రమకుటాలంకృ తోత్తమాంగుండును, గరుణారస పరిపూరి తాపాంగుండును, నఖిల భువన విజిగీషు ప్రసవేషుయోజిత రసాలశరాసనాంతర దృశ్యమాన కోకనదపలా శాదభ్రవిభ్రమద భ్రూమధ్య విరోచమాన శిఖి శిఖాంచిత విశేషక విశేషుండును, వదనేందు నిర్గత చంద్రికాయిత దరహాస భూషుండును, మహాభోగ మణిగణ సముపే తాహీనాంగద శోభిత బాహుండును, నతనుభూతి భాసమాన దేహుండును, ననవధికైక సద్ద్యుతి యుక్త హార విభూషిత గళుండును, శారద ఘన ప్రభా జయకృత్త్యసితాంశుక సంవేష్టిత నితంబతలుండును, హరివిరోచన సంతతి రసాధీశరాజ వరమకుటవాటికా ఘటిత సరోజ రాగమరీచి రాజి నీరాజిత చరణ కుశేశయుండును, ధీరగణాలో కామోదదాయి శృంగారాతిశయుండును నగుచుఁ గలిత మహారజతకూట స్తంభవారంబులం, గమ

నీయ కాంచన వితాన గుచ్ఛ ప్రభాంకూరంబులం, గలకంఠికాజన గానామృ తాసారంబులం గర మొప్పు కలధౌతాగారారాజ దాస్థానభవనరాజంబునం గనత్తరాహిరిపుమణిమయ భద్రాసనంబున సుఖాసీనుండై, యహిత మహాబల విధ్వంసన శంసనీయ సామర్థ్య ధురీణుండు గావున నిజపరాభూతి కారణ దారుణ సమీరణ సముత్సారణంబు గోరి తనకు విన్నవింపం జేరిన మేఘమండలంబుడంబున నొక్క విబుధ కుధర కుచారత్నంబు వట్టిన మేఘడంబరంబు గనకఝల్లరీ శంపావల్లరీ భాసురం బై యేపు సూప, నరిభేద నోదార కరకాండ మండిత రాజసాహాయ్యంబును, నతిదీప్రతర ప్రకాశాన్విత సదనీక సాంగత్యంబును నధిగమించి విజృంభించు నిశాధిదేవతతో జగడంబు చరింప నోపక పట్టువడిన యంబుజాప్తబింబంబు తీరున నొక్క హరినీలకుంతలావతంసంబు వూనిన యభిరూప జాతరూప హంసరూప ధూప కరండంబు వలనఁ జాలుగా వెడలు సామ్రాణి ధూప ధూమమాలికలు తదంతర సంస్థాయి రమారమణ తనూతల వినిర్య దభిరామ శ్యామ ధామాళికల మోహంబు నివ్వటిల్లఁ జేయ, నిరంకుశ పంకజరాగకంకణ క్రేంకార పూర్వకంబుగా నొక్క రాజకీరవాణీలలామ వీచు ధవళవాల వ్యజనంబు లనుపమాన పవమాన మృదు యాన కలనానదృమాన గగనగంగా తరంగడోలికావీథి నుయ్యల లూఁగు నవదాతపత్రంబులకు సగోత్రం బులై వైచిత్రిఁ జిత్రింప, విశాల విలోచన శతపత్త్రపత్త్ర విలసనంబును విమలభుజామృణాల సౌందర్యంబును వినీల భ్రమరక సౌష్ఠవంబును విరంజిత కింజల్క మాంజుల్యంబును బూని సరసగణ్యలావణ్య వైభవంబున నలరు పద్మినిపై మోహంబు వూని పౌర్వకాలిక వైరంబు డించి ప్రియంబు వచింపఁ జేరి తత్కరకమల లాలితం బగు శీతాంశుమండలంబుదండి నొక్క భుజంగభుఙ్మందయానామతల్లి దాల్చిన కర్పూర కలా చిక నయనామోదవీచికం జేకూర్ప, మహానంది గోరాజకుమారముఖ్యులు సెంతలం గొలువ నపూర్వ విభవంబునం బేరోలగం బుండు నవసరంబున. 123

టీక: ఈవచనంబున రాజశేఖరుం డను కర్తృపదంబుచే నప్రకృతచంద్రశేఖరపరం బైన యర్థాంతరము స్ఫురించుచున్నది. సకల జగచ్ఛాసనపాండితీ ధురంధరుండు= సర్వజగత్పాలనపాండిత్యభారమును వహించువాఁడు; అగు నా రాజశేఖరుండు = అగునట్టి యా రాజపరమేశ్వరుఁడు; ఒక్కనాఁడు, దీనికిఁ బేరోలగం బుండు నవసరంబున ననుదానితో నన్వయము. సకల లోకశిక్షాదక్షుఁడగు ప్రసిద్ధచంద్రశేఖరుం డని యర్థాంతరము;

ఆత్మీయ సేవా సమాయాత నానా దిశాధినాయక మనోమహోత్పలోల్లాస సంపాదక విభా విభాసిత చంద్రమకుటాలంకృతోత్త మాంగుండును – ఆత్మీయ సేవా సమాయాత = తనయొక్క సేవకొఱకువచ్చిన, నానా దిశాధినాయక = నానాదిక్కులందలి రాజులయొక్క, మనోమహోత్పల = హృదయకమలముయొక్క, 'అరవిందం మహోత్పలమ్' అని యమరుఁడు, ఉల్లాస సంపాదక =వికసనసంపాదక మగు, విభా = విశేషకాంతిచేత, విభాసిత = మిక్కిలి ప్రకాశించుచున్న, చంద్రమకుట = స్వర్ణ కిరీటముచేత, 'గైరికం వసు చంద్రకమ్' అని యమరుఁడు, అలంకృత = అలంకరింపఁబడిన, ఉత్తమాం గుండును = శిరస్సు

గల వాఁ డని రాజపరమైన యర్థము; ఆత్మీయసేవాసమాయాత నానా దిశాధినాయక = తనయొక్కసేవార్థము వచ్చిన అష్ట దిక్పాలకులయొక్క, మనః = మనస్సనెడు, మహత్ = గొప్పదగు, ఉత్పల = కల్వలయొక్క, ఉల్లాస సంపాదకవిభా విభాసిత మైన, చంద్రమకుట = చంద్రుఁడను కిరీటముచేత, అలంకృతోత్తమాంగుండును = అలంకరింపఁ బడిన శిరస్సు గల వాఁడని యీశ్వరపర మైన యర్థము;

కరుణారస పరిపూరితాపాంగుండును = దయాతిశయముచే పూర్ణమగు కటాక్షముగలవాఁడని రెంట నొక్క యర్థమే. ఇచట రసపదమునకు శృంగారాద్యన్యతమ మర్థము గాదు. కరుణాఖ్యరసము శోకస్థాయిక మై, ప్రకృతాననుగుణము గావునను, రస పర మైనపుడు కరుణపదము స్త్రీలింగము గానందున నని తెలియునది. ఇందలి విస్తరము మావ్రాసిన కావ్యాలంకారసంగ్రహవిమ ర్శనమునఁ దెలియును.

అఖిల భువన విజిగీషు ప్రసవేషు యోజిత రసాలశరాసనాంతర దృశ్యమాన కోకనదపలా శాదభ్ర విభ్రమద భ్రూమధ్య విరోచ మాన శిఖి శిఖాంచిత విశేషక విశేషుండును – అఖిల భువన = ఎల్లలోకములను, విజిగీషు = జయింపవలెనను కోరిక గల, ప్రస వేషు = మన్మథునిచేత, యోజిత = ఎక్కుపెట్టఁబడిన, రసాలశరాసన = చెఱకువిల్లుయొక్క,‘ రసాలత్విక్షు చూతయోః’ అని విశ్వము, అంతర =మధ్యభాగమునందు, దృశ్యమాన = చూడఁబడుచున్న, కోకనదపలాశ = ఎఱ్ఱతామరఱేకుయొక్క, అదభ్ర విభ్రమద = అధికభ్రాంతి నిచ్చెడు, భ్రూమధ్య విరోచమాన = బొమలనడుమ వెలుంగుచున్న, శిఖిశిఖ = కుంకుమచేత, ‘ కాశ్మీర జన్మాగ్ని శిఖమ్’ అని యమరుఁడు, అంచిత = ఒప్పుచున్న, విశేషక విశేషుండును = తిలకవిశేషముగలవాఁడును; ఈశ్వరపర మైనపుడు, శిఖిశిఖా = అగ్నిజ్వాలచేత అని మాత్రము భేదము, తక్కినది సమానము.

వదనేందు నిర్గత చంద్రికాయిత దరహాస భూషుండును = ముఖ మనెడు చంద్రునివలన వచ్చుచున్న వెన్నెలవలె నుండు మంద హాసము భూషణముగాఁ గలవాఁడని రెంట సమానము.

మహాభోగ మణిగణ సముపే తాహీనాంగద శోభిత బాహుండును – మహత్ = అధికమైన, ఆభోగ =పరిపూర్ణత గల, మణి గణ = మణిసంఘములచేత; సముపేత = కూడుకొన్న, అహీన = గొప్పలైన, అంగద = భుజకీర్తులచేత, శోభిత=ప్రకాశించుచున్న, బాహుండును = భుజములు గలవాఁడును, అని రాజపర మైన యర్థము; మహత్ = గొప్పలైన, భోగ =పడగలయందలి, ‘భోగస్తు ఫణకాయయోః’ అని రత్నమాల, మణిగణ = మణిసంఘములచేత, సముపేత = కూడుకొన్న, అహీన = శేషుండను, అంగద = భుజకీర్తులచేత, శోభిత = ప్రకాశించుచున్న, బాహుండును = భుజములు గలవాఁడని యీశ్వరపరమైన యర్థము.

అతను భూతి భాసమాన దేహుండును – అతను = అధిక మైన, భూతి =సంపదచేత, భాసమాన =ప్రకాశమాన మగు, దేహుం డును = శరీరము గలవాఁడును, అని రాజపరమైన యర్థము; మన్మథునియొక్క భస్మముచేతఁ బ్రకాశించు దేహము గలవాఁ డని యీశ్వరపర మైన యర్థము.

అనవధికైక సద్ద్యుతి యుక్త హార విభూషిత గళుండును – అనవధిక = మేరలేని, ఏక =ముఖ్యమైన, సద్ద్యుతి=మంచికాంతితోడ, యుక్త = కూడుకొన్న, హార =ముక్తావళిచేత, విభూషిత = అలంకృత మగు, గళుండును = కంఠము గలవాఁడును, అని రాజ పరమైన యర్థము; అనవధి = మేరలేని, కైకస = కీకససంబంధిని యైన, కీకసము లనఁగా నస్థులు, ‘ కీకసం కుల్య మస్థి చ’ అని యమరుఁడు, సద్ద్యుతి = మంచికాంతితోడ, యుక్త = కూడుకొనిన, హార =దండలచేత, విభూషిత = అలంకృత మగు, గళుం డును = కంఠము గలవాఁడును, అని యీశ్వరపరమైన యర్థము, శివుఁడు కపాలమాలాధరుఁ డగుట ప్రసిద్ధము;

శారద ఘన ప్రభా జయకృత్త్యసితాంశుక సంవేష్టిత నితంబతలుండును – శారదఘనప్రభా = శరన్మేఘకాంతి యొక్క, జయ = గెలుపే, కృత్త్య = ప్రయోజనముగాఁ గల, సితాంశుక = శుభ్రవస్త్రముచేత, సంవేష్టిత = చుట్టఁబడిన, నితంబతలుండును = మధ్య ప్రదేశము గలవాఁడును, అని రాజపరమైన యర్థము; శారద = మేఘసంబంధిని యైన, శరదశబ్దముపై 'తస్యేద' మను సూత్రముచే నణ్ప్రత్యయము వచ్చినది, ఘనప్రభా = గొప్పకాంతియొక్క, అనఁగా నల్లనికాంతియొక్క, కాదేని, శారద=నూతన మగు, 'శారదః పీతమన్దేనా ప్రత్యగ్రే ప్రథితే త్రిషు' అని వైజయంతి, ఘనప్రభా = మేఘముయొక్కకాంతియొక్క, కాదేని, శారదఘన = సజలజలదముయొక్క, స్వార్థికాణ్ ప్రత్యయము, ప్రభా=కాంతియొక్క, జయ = జయము గల, కృత్తి = గజచర్మ మనెడు; అసితాంశుక = నీలిదుప్పటముచేత, సంవేష్టిత నితంబతలుం డని యీశ్వరపర మైన యర్థము; కైకసద్ద్యుతి, జయకృత్త్యశబ్దములలో 'అనచిచ' అను సూత్రముచే దకారతకారములకు ద్విత్వము.

హరి విరోచన సంతతి రసాధీశరాజ వరమకుట వాటికా ఘటిత సరోజరాగ మరీచిరాజి నీరాజిత చరణ కుశేశయుండును – హరి = చంద్రునియొక్కయు, విరోచన = సూర్యునియొక్కయు, సంతతి = వంశపువారైన, రసాధీశరాజ = నృపశ్రేష్ఠులయొక్క, వర = శ్రేష్ఠము లగు, మకుట = కిరీటములయొక్క, వాటికా = పరంపరలయందు,ఘటిత = కూర్పఁబడిన, సరోజరాగ=పద్మరాగములయొక్క, మరీచిరాజి = కిరణసమూహముచేత, నీరాజిత = హారతి యెత్తఁబడిన, చరణకుశేశయుండును= పాద పద్మములు గలవాఁ డని రాజపరమైన యర్థము; హరి = ఇంద్రునియొక్క, విరోచనసంతతి = యమునియొక్క, రసాధీశ = వరుణునియొక్క, 'ఆస్వాదనధ్వని సుధామ్బు రసాఖ్యధాతుష్విష్టో రసః' అని రత్నమాల, రాజవర = కుబేరునియొక్క, మకుట = కిరీటములయొక్క, వాటికా = పరంపరలయందు, ఘటిత = కూర్పఁబడిన, సరోజరాగ = పద్మరాగములయొక్క, మరీచిరాజి = కిరణసమూహముచేత, నీరాజిత = హారతి యెత్తఁబడిన, చరణ కుశేశయుండును= పాదపద్మములు గలవాఁ డని యీశ్వరపరమైన యర్థము;

ధీరగణాలోకామోదదాయి శృంగారాతిశయుండును – ధీరగణ = పండితసమూహముయొక్క, ఆలోక = చూపులకు, ఆమోదదాయి = సంతసము నిచ్చునది యైన, శృంగార = అలంకారముయొక్క, అతిశయుండును = అతిశయము గల వాఁడును, అనఁగా విద్వదభినందనీయ శృంగారాతిశయము గలవాఁ డనుట; శివునిపర మైనపుడు ధీర మగు ప్రమథగణము యొక్క ఆలోకామోదదాయి యగు శృంగార మనఁగా నాట్యము గలవాఁ డని యర్థము, 'శృఙ్గార స్సురతే నాట్యే రసే దిగ్గజ మణ్డనే' అని విశ్వము; అగుచున్;

కలిత మహారజత కూట స్తంభ వారంబులన్ – కలిత = ఒప్పునట్టి, మహారజత = సువర్ణవికారము లైన, 'మహారజత కాఞ్చనే' అని యమరుఁడు, కూట = గృహవిశేషములయొక్క, స్తంభ వారంబులన్ = స్తంభ సమూహములచేతను, అని రాజపర మైన యర్థము; కలిత = ఒప్పుచున్న, మహత్ = అధికములైన, రజతకూట స్తంభ = స్తంభములవంటి వెండిశిఖరములయొక్క, వారంబులన్ = సమూహములచేతనని శివపర మైన యర్థము;

కమనీయ కాంచనవితాన గుచ్ఛ ప్రభాంకూరంబులన్ – కమనీయ = మనోజ్ఞము లగు, కాంచనవితాన = బంగరుమేలుకట్లయొక్క, గుచ్ఛ = ముక్తాదిగుచ్ఛములయొక్క, ప్రభాంకూరంబులన్ = కాంతులయొక్క అంకురములచేతను, 'భవే దమర్షఆమర్షోప్యఙ్కురోఽఙ్కూర ఏవ చ' అని ద్విరూపకోశము; కమనీయము లగు సంపెఁగతీవలయొక్క పువ్వుగుత్తుల ప్రభాంకూరములచేత నని శివపర మైన యర్థము;

కలకంఠికాజన గానామృ తాసారంబులన్ – కలకంఠికాజన = స్త్రీజనముయొక్క, గానామృత = గాన మనెడు సుధయొక్క, ఆసారంబులన్ = ధారాసంపాతములచేతను, 'ధారాసంపాత ఆసారః' అని యమరుఁడు; కలకంఠికాజన = ఆఁడుఁగోయిల గుంపులయొక్క, గానామృతాసారంబులచేత నని శివపర మైన యర్థము;

కర మొప్పు = మిక్కిలి యొప్పుచున్న; కలధౌతాగారారాజ దాస్థాన భవనరాజంబునన్ – కలధౌతాగార = బంగరుటిండ్లచేత, ఆరాజత్ = ప్రకాశించుచున్న, ఆస్థానభవనరాజంబునన్ = కొలువుకూటపు గృహశ్రేష్ఠమున నని రాజపర మైన యర్థము; కలధౌతాగ = కైలాసపర్వత మనెడు, ఆరారాజత్ = మిక్కిలి ప్రకాశించుచున్న, ఆఙ్ పూర్వకయఙ్లుగంత రాజధాతువుపై శతృప్రత్యయము, ఆస్థానభవనరాజంబున నని శివపర మైన యర్థము, 'కలధౌతం రౌప్యహేమ్నోః' అని యమరుఁడు.

కనత్తరాహిరిపు మణిమయ భద్రాసనంబునన్ = ప్రకాశించుచున్న గారుత్మతమణిమయమైన సింహాసనమందు, ఇంద్రనీలమణి మయ మైన సిహాసనమందు అని కాని యర్థము; సుఖాసీనుండై = సుఖోపవేశము గల వాఁడై;

అహిత మహాబల విధ్వంసన శంసనీయ సామర్థ్య ధురీణుండు గావున – అహిత = శత్రువులయొక్క, మహాబల = అతిసామర్థ్యముయొక్క, విధ్వంసన = నాశముచేత, శంసనీయ = శ్లాఘనీయమగు, సామర్థ్య = సామర్థ్యముయొక్క, ధురీణుండు కావునన్ = భారవాహి గావున నని యర్థము; అహిత = శత్రువైన, మహాబల = వాయువుయొక్క, విధ్వంసన శంసనీయ సామర్థ్యధురీణుండు గావున నని యర్థాంతరము; నిజపరాభూతికారణ దారుణ సమీరణ సముత్సారణంబు గోరి = తన పరాభవమునకు గారణ మైన వాయువుయొక్క తిరస్కారమును గోరి యని రెంటను నొక యర్థమే; తనకు విన్న వింపం జేరిన మేఘ మండలంబు డంబునన్ – అర్థము స్పష్టము, దీని కేపుసూప ననుదానియం దన్వయంబు.

ఒక్క విబుధ కుధరకుచారత్నంబు పట్టిన మేఘడంబరంబు – ఒక్క = ఒకానొక, విబుధకుధర = మేరువంటి, కుచా = స్తనములు గల వారలలో, రత్నంబు = శ్రేష్ఠ యగు స్త్రీ, పట్టిన మేఘడంబరంబు = ధరించిన నల్లగొడుగు; శివపర మైనప్పుడు – ఒకానొక, విబుధ = దేవసంబంధిని యగు, కుధరకుచారత్నంబు = స్త్రీరత్నంబు పట్టిన మేఘడంబరం బని యన్వయము;

కనకఝుల్లరీ శంపా వల్లరీ భాసురం బై – కనకఝుల్లరీ = బంగరుజాల రనెడు, శంపావల్లరీ = మెఱుఁపుదీవ చేత, భాసురం బై = ప్రకాశమాన మై; ఏపు సూపన్ = అతిశయింపఁగా, 'పుణ్డరీకం సితచ్ఛత్రం నీలం తన్మేఘడంబరమ్, తత్ప్రాన్తలమ్బి హేమాది వస్త్రేస్యాత్ ఝుల్లరీ స్త్రియామ్' అని యమరశేషము.

అరి భేద నోదార కరకాండ మండిత రాజసాహాయ్యంబును – అరి = శత్రువులయొక్క, భేదన = విదారణమందు, ఉదార = ఉత్కృష్టము లైన, కరకాండ = హస్తములయందుండు బాణములచేత, మండిత = అలంకృతు లగు, రాజ = రాజులయొక్క, సాహాయ్యంబును = సహాయమును; అరి = చక్రవాకములయొక్క, భేదన = పాపుటయందు, ఉదార = ఉత్కృష్టము లగు, కర = కిరణములయొక్క, కాండ = సమూహముచేత, మండిత = అలంకృతుఁడైన, రాజ = చంద్రునియొక్క, సాహాయ్యంబును, అని యర్థాంతరము.

అతిదీప్రతర ప్రకాశాన్విత సదనీక సాంగత్యంబును – అతిదీప్రతర = మిక్కిలి తేజరిల్లునట్టి, ప్రకాశ = కాంతితోడ, అన్విత = కూడుకొన్న, సత్ = గొప్పవారలయొక్క, అనీక =సమూహముయొక్క, సాంగత్యంబును = మైత్రిని; మిక్కిలి తేజరిల్లు కాంతితోఁ గూడుకొన్న రిక్కలగుంపుల సాంగత్యము నని యర్థాంతరము. అధిగమించి = పొంది; విజృంభించు నిశాధిదేవత తోన్ = ఉజ్జృంభించుచున్నట్టి రాత్ర్యధిష్ఠానదేవతతో; జగడంబు = యుద్ధము; చరింపన్ = చేయుటకు; ఓపక = చాలక; పట్టువడిన యంబుజాప్తబింబంబు తీరునన్ = పట్టువడినట్టి సూర్యబింబమురీతిగా; ఒక్క హరినీలకుంతలావతంసంబు =

ఇంద్రనీలమణులవంటి కురులు గలిగిన స్త్రీలలో శ్రేష్ఠయగు నొకతె యని రాజపర మైన యర్థము; విష్ణుసంబంధిని యైన యొక నీలకుంతలావతంసంబు, అనఁగా లక్ష్మీదేవి యని కాని, విష్ణురూపిణి యగు మోహిన్యాత్మిక యగు స్త్రీ యని కాని యాశ్వర పరమైన యర్థము;

పూనిన యభిరూప జాతరూప హంసరూప ధూపకరండంబువలనన్ – పూనిన = వహించినట్టి, అభిరూప = మనోజ్ఞ మగు, 'ప్రాప్తరూప సురూపాభిరూపా బుధమనోజ్ఞయోః' అని యమరుఁడు, జాతరూప = సువర్ణమయ మైన, ' చామీకరం జాత రూపమ్' అని యమరుఁడు, హంసరూప = సూర్యరూప మైన, 'భాను ర్హంస స్సహస్రాంశుః' అని యమరుఁడు, ధూపకరం డంబువలనన్ = పొగ వేసికొను డబ్బివలన; చాలుగాన్ = బంతిగా; వెడలు = బయల్వెడలుచున్న; సామ్రాణిధూప ధూమ మాలికలు = సామ్రాణిధూపసంబంధి యైన ధూమముయొక్క బంతులు; తదంతర సంస్థాయి రమారమణ తనూతల వినిర్య దభిరామ శ్యామధామాళికల మోహంబు నివ్వటిల్లఁ జేయ – తదంతర=ఆ సూర్యబింబమధ్యభాగమునందు, సంస్థాయి = నివసించి యుండు, రమారమణ = నారాయణునియొక్క, తనూతల = శరీరప్రదేశమునుండి, వినిర్యత్=బయలుదేఱుచున్న, అభిరామ = మనోహర మగు, శ్యామధామ = నీలచ్ఛాయయొక్క, ఆళికల =చాలులయొక్క, మోహంబు = భ్రమను, నివ్వ టిల్లఁ జేయన్ = కలుగఁజేయఁగా; అనఁగా నారాజు చెంత నొక నారీరత్నము ధూపకరండమును ధరించి యుండఁగా నా స్త్రీ నిశాధిదేవతను బోలి యున్నదనియు, దాని చేత నున్న బంగరుబరణి ఆ స్త్రీకి శత్రుభేదనపటిష్ఠబాణహస్తు లగు రాజుల సాహా య్యము, మంచి తేజశ్శాలు లగు సత్పురుషుల సాహాయ్యము గలిగియుండుటం జేసి దానితో జగడంబు సేయంజాలక పట్టు వడిన సూర్యబింబమ్ము వలె నున్నదనియు, ఆ బరణినుండి వెడలు సామ్రాణిపొగయొక్క ధారలు సూర్యబింబమధ్యమున నున్న నారాయణమూర్తి తనూకాంతిశ్రేణులం బోలి యున్న వనియు భావము. శివపరమైన భావము నిట్లే తెలియునది. ఇట్లు చెప్పఁగా సాంబమూర్తికి సుచంద్రునకు, సుచంద్రుని చెంత నున్న నారీరత్నమునకు శివుని చెంత నున్న లక్ష్మికి లేక హరి యను నారికి సామ్యము దోఁచుచున్నది. ఇట్లన్ని వాక్యములయందు సుచంద్రశివులకుఁ దత్పరము లైన యర్థములకు సామ్యము దోఁచు నని యెఱుంగునది.

నిరంకుశ పంకజరాగ కంకణ క్రేంకార పూర్వకంబుగాన్ – నిరంకుశ = అడ్డములేని, దీనికిఁ గ్రేంకారమం దన్వయము, పంకజ రాగ = పద్మరాగమణిమయ మైన, కంకణ = కంకణములయొక్క, క్రేంకార = క్రేంకరణము, పూర్వకంబుగాన్ = పురస్సర మగునట్లుగా; ఒక్క రాజకీరవాణీలలామ = ఒక్క స్త్రీరత్న మని రాజపర మైన యర్థము, రాజ= యక్షసంబంధిని యగు, కీరవాణీలలామ = స్త్రీరత్న మని శివపర మైన యర్థము; వీచు ధవళవాలవ్యజనంబులు = వీచునట్టి తెల్లని సురటీలు; అనుప మాన పవమాన మృదుయాన కలనానదృమాన గగనగంగాతరంగ డోలికా వీథిన్ – అనుపమాన = సాటిలేనట్టి, పవమాన మృదుయాన = మారుతము యొక్క మందగమనముచేత,కల = అవ్యక్తమధురముగా,నానదృమాన = ధ్వనిసేయుచున్న, గగనగంగా = స్వర్గంగయొక్క, తరంగ = అల లనెడు, డోలికావీథిన్ = ఉయ్యేలల వరుసయందు; ఉయ్యల లూఁగు = డోలా విహారము సేయుచున్న; అవదాతపత్రంబులకున్= హంసలకు; సగోత్రంబులు ఐ = బందుగు లై అనఁగాఁ దుల్యము లై యనుట, ఇందులకుఁ గవికల్పలతయందు 'శ్లో. బన్ధు శ్చౌర స్సుహృ ద్వాదీ కల్పః ప్రఖ్యః ప్రభ స్సమః,దేశీయ దేశ్య రిప్వాభ సోదరాద్యా ఇవార్థకాః। యథేన్దుబన్ధు ర్ముక్తాశ్రీచౌరో హారశ్రియ స్సుహృత్ కున్దవాదీ హంసకల్పః క్షీరప్రఖ్యో హిమప్రభః। గఙ్గాసమోఙ్జ దేశీయ శ్శేషదేశ్య స్సుధారిపుః। బిసాభస్తే యశోరాశిః కైలాసోదరసోదరః।' అని ప్రమాణోదాహరణములు దెలియవలయు; వైచిత్రిన్ = ఆశ్చర్యమును; చిత్రింపన్ = రచియింపఁగా ననుట, అనఁగా సుచంద్రుని యొద్ద నొక స్త్రీ పద్మరాగమణిమయ

కంకణక్రేంకారపూర్వకముగా వీచు తెల్లసురటీలు మందమారుతమునకు మధురముగ ధ్వని సేయు గంగానదీతరంగము లనెడు నుయ్యెలలం దూఁగుచున్న హంసలవలె నున్నవని భావము. రాజహంసల ముక్కులు, పాదము లెఱ్ఱగా నుండుట, తక్కిన శరీరము తెల్లగా నుండుట ప్రసిద్ధము గాన స్త్రీహస్తముల నున్న పద్మరాగమణుల కంకణములు ముక్కులవలె నున్నవనియుఁ, దెల్లనిసురటీలు దక్కిన శరీరములవలె నున్నవనియు, నా కంకణధ్వనులు తరంగధ్వనులఁ బోలి యున్నవనియు, హస్తముల గతాగతములు తరంగచలనములవలె నున్నవనియు ఫలితార్థము. శివపరమైనప్డు నిటులే తెలియునది.

విశాల విలోచన శతపత్త్ర పత్త్ర విలసనంబును– విశాల = విపులము లగు, విలోచన = నేత్రము లనెడు, శతపత్త్రపత్త్ర = కమలపత్త్రములయొక్క, విలసనంబును = విలాసమును; విమల భుజా మృణాల సౌందర్యంబును– విమల = నిర్మలము లగు, భుజా = బాహువు లనెడు, మృణాల = తామరతూఁడుయొక్క, సౌందర్యంబును = చక్కఁదనంబును; వినీల భ్రమరక సౌష్ఠవంబును – వినీల = మిక్కిలి నల్లనగు, భ్రమరక = ముంగురు లనెడు తుమ్మెదలయొక్క, సౌష్ఠవంబును = అందమును; విరంజిత కింజల్క మాంజుల్యంబును – విరంజిత = మిక్కిలి రంజింపఁజేయుచున్న, ణిజంతరంజధాతువుపై కర్త్రర్థమందు విభక్తసోదరాదిశబ్దముల యందువలె నిష్ఠాప్రత్యయము, కింజల్క=కేసరము లనెడు పుప్పొడిబొట్టుయొక్క, మాంజుల్యంబును = మనోజ్ఞతయు,‘పుష్ప రేణౌ చ కింజల్కః’ అని యమరశేషము; పూని = వహించి; సరస గణ్య లావణ్య వైభవంబునన్– సరస = మడుఁగులయందు, రసముతోఁ గూడినవి సరసములు, రస మన నుదకము, రసికులచేత నని యర్థాంతరము, గణ్య = గణనీయ మగు, లావణ్య = కాంతివిశేషముయొక్క, ‘శ్లో. ముక్తాఫలేషుచ్ఛాయాయా స్తరళత్వ మివాన్తరా ప్రతిభాతి యదఙ్గేషు లావణ్యం తదిహోచ్యతే’ అని లావణ్యలక్షణము దెలియునది, వైభవంబునన్ = అతిశయముచేత; అలరు పద్మినిపైన్ = ఒప్పుచున్న తామరతీవపై, పద్మినీజాతిస్త్రీపై నని ధ్వన్యమానార్థము; మోహంబు = వలపును; పూని = వహించి; పౌర్వకాలిక వైరంబు = మొదల నున్న విరోధమును; డించి = వదలి; ప్రియంబు = ప్రియవాక్యమును; వచింపన్ = చెప్పుటకు; చేరి, తత్కరకమల లాలితం బగు శీతాంశుమండలంబు దండిన్– తత్కరకమల = ఆ పద్మినీపాణిపద్మముచేత, లాలితం బగు = లాలింపఁ బడునట్టి, శీతాంశు = చంద్రునియొక్క, మండలంబు దండిన్ = బింబమురీతిగా; ఒక్కభుజంగభుజ్మందయానామతల్లి = విటులను బాలించెడు నొక స్త్రీరత్నము, దాసి యనుట, ‘భుజఙ్గో విట సర్పయోః’ అని విశ్వము, ‘భుజ పాలనాభ్యవహారయోః’ అని పాణిన్యనుశాసనము, ఒకగరుడస్త్రీరత్నమని శివపర మైన యర్థము ; తాల్చిన కర్పూరకలాచిక = ధరియించిన కర్పూరముతో జేయఁబడిన తమ్మపడిగ; నయనామోదవీచికన్– నయన = నేత్రములకు, ఆమోదవీచికన్ = సంతోషపరంపరను; చేకూర్పన్ = చేయఁగా; అనఁగా సుచంద్రుని చెంత నొక స్త్రీ తన కన్నులనెడు కమలపత్త్రములచేతను, భుజము లనెడు మృణాళములచేతను, ముంగురు లనెడు తుమ్మెదలచేతను, పుప్పొడిబొట్టు లనెడు కింజల్కములచేతను దామరతీవను బోలియున్నదనియు, ఆతామరతీవ యనెడు నొక పద్మినీజాతిస్త్రీయందుఁ జంద్రుఁ డనురక్తుఁడై వైర ముడిగి ప్రియము చెప్పుటకుఁ బోయి దాని పాణిపద్మముచే లాలింపఁబడుచున్న యట్టు లా స్త్రీ పట్టుకొన్న తమ్మపడిగ యున్న దనియు భావము. శివపరమైనపుడు నిటులే తెలియునది;

మహానంది గోరాజ కుమారముఖ్యులు – మహానంది = అతిసంతసము గలిగిన, గోరాజ = భూపతులయొక్క, కుమార ముఖ్యులు = పుత్త్రవరులు; మహత్ = అధికమగు, నంది = నందికేశ్వరుఁడు, గోరాజ = వృషభము, కుమారముఖ్యులు = కుమారస్వామి మున్నగువారు, అని శివపరమైన యర్థము; చెంతలన్ = సమీపములందు; కొలువన్ = కొలుచుచుండఁగా; అపూర్వవిభవంబునన్ = తొల్లి తనకు లేని విభవంబున, ముందు లోకమందున లేని విభవమ్మున నని యర్థాంతరము; పేరోలగం బుండు నవసరంబునన్ = గొప్ప కొలువు సేరి యున్న సమయంబున, దీనికి శాండిల్యముని యరుదెంచె నను ముందుపద్యమం

దున్న క్రియతో నన్వయము దెలియునది.

సీ. స్వకటాక్షవిశ్రమ◊స్థానన్నరశ్రేణి,యెడఁబోలె వరభూతి ◊యొడల నొప్పె,
హృదయసారసవీథి ◊యెడఁబోలె నలినాక్ష, సంభృతి కంధరా◊స్థలి నెసంగె,
మహితశిష్యోదితా◊మ్నాయాళియెడఁబోలె, నలఘుజటారేఖ ◊తలఁ జెలంగె,
నాత్మసంరచితాధ్వ◊రావళియెడఁబోలె, సత్త్రాటకస్ఫూర్తి ◊చక్షు లూనె,
తే. ననుచు నెమ్మది నద్భుతం◊బడర నఖిల,జనములు నుతింప నరుదెంచె ◊సమ్మదంబుఁ
బూని సుకలానిరస్తోడు◊జాని సుగుణ,మణినికరఖాని శాండిల్య◊మౌని యపుడు. 124

టీక: సుకలానిరస్తోడుజాని (సుకలా నిరస్త+ఉడుజాని)– మంచితేజముచేతఁ దిరస్కరింపఁబడిన చంద్రుఁడు గల వాఁడు, జాని యనుచోట జాయాశబ్దముమీఁద 'జాయాయా నిజ్' అను సూత్రముచేత నిజాగమము; సుగుణమణినికరఖాని= సద్గుణము లనెడు మణుల సమూహమునకు గని యైనవాఁడు, 'ఖనిః ఖాని రపి స్మృతా' అని శబ్దభేదప్రకాశిక; శాండిల్యమౌని= శాండిల్యుఁ డను మహాముని; స్వకటాక్షవిశ్రమస్థానత్ నరశ్రేణి యెడంబోలెన్ – స్వ = తనయొక్క, కటాక్ష =క్రేఁగంటిచూపునకు, విశ్రమ స్థానత్ = విశ్రాంతిస్థానము వలె నాచరించుచున్న, ఇట 'సర్వప్రాతిపదికేభ్యః క్విబ్వా వక్తవ్యః' అను సూత్రముచే నాచారార్థ మందు క్విప్ ప్రత్యయము, నరశ్రేణియెడంబోలెన్ =మనుష్యసంఘమందుబలె; ఒడలన్=దేహమందు; వరభూతి=శ్రేష్ఠసంపత్తు, శ్రేష్ఠభస్మ మని యర్థాంతరము,'భూతి ర్భస్మని సంపది' అని యమరుఁడు; ఒప్పెన్=అమరెను;
హృదయసారసవీథి యెడన్ పోలె= హృదయకమలవీథియందుబలె; కంధరాస్థలిన్ = కంఠస్థలమందు; నలినాక్ష= విష్ణు మూర్తియొక్క, తామరపూసలయొక్క యని యర్థాంతరము; సంభృతిన్ = భరణము; ఎసంగెన్ = అతిశయించెను;
మహితశిష్యోదితామ్నాయాళి యెడఁబోలెన్ – మహిత = పూజ్యమగు, శిష్య =శిష్యులచేత, ఉదిత = పలుకఁబడిన, ఆమ్నా యాళి యెడన్ పోలెన్ = వేదసమూహమందుబలె; తలన్ = శిరస్సునందు; అలఘు =విస్తారమగు; జటా = పదపాఠవిశేషము యొక్క, జడలయొక్క యని యర్థాంతరము; రేఖ = సమూహము; చెలంగెన్ = ఒప్పారెను;
ఆత్మసంరచితాధ్వరావళి యెడన్ పోలెన్– ఆత్మ = తనచేత, సంరచిత = చేయఁబడిన, అధ్వరావళి యెడన్ పోలెన్ = యజ్ఞ సంఘములయందుబలె; చక్షులు = నేత్రములు; సత్త్రాటకస్ఫూర్తి– సత్త్రాటక = ఋత్విజులయొక్క, సత్త్ర మనఁగా యజ్ఞము, దానియందుఁ జరించువారు సత్త్రాటకులు, 'సత్త్ర మాచ్ఛాదనే యజ్ఞే' అని యమరుఁడు, స్ఫూర్తి = ప్రకాశమును;సత్ = సత్పు రుషులయొక్క, త్ర=రక్షణమందు, అట = సంతతగతి గల, స్ఫూర్తి = ప్రకాశ మని యర్థాంతరము; ఊనెన్ = వహించెను.
అంతఃకరణవృత్తి యగు సత్పురుషరక్షణవ్యాపారము చక్షులందుఁ దోఁచుచున్న దనుట. చక్షు లనుచోట సప్తమ్యర్థమందుఁ బ్రథమ వచ్చినది.
అనుచు = ఇట్లనుచు; నెమ్మదిన్ = మంచిమనస్సునందు; అద్భుతంబు =ఆశ్చర్యము; అడరన్ = ఒప్పుచుండఁగా; అఖిల జనములున్ = ఎల్లమనుజులును; నుతింపన్ = పొగడుచుండఁగా; సమ్మదంబున్ =సంతోషమును; పూని =వహించి; అరు దెంచెన్ = వచ్చెను. అనఁగా సుచంద్రనరేంద్రుఁడు పేరోలగం బుండు నవసరంబున శాండిల్యమునివరుండు తనకటాక్షపాత్రు లగువారలకు సంపదలు గలుఁగఁజేయుచు, శరీరమందు భస్మము దాల్చి, హృదయమందు నారాయణుని ధ్యానించుచుఁ,

గంతమందుఁ దామరపూసల మాలిక దాల్చి, శిష్యులకుఁ జెప్పెడు వేదమందుబలెఁ దలమీఁద జటలు దాల్చి, యజ్ఞములందు ఋత్విక్కులం బలె సత్పురుషు లను రక్షింపవలె నను హృదయాభిప్రాయము కన్నులయందుఁ బ్రకాశింపఁజేయుచు వచ్చె నని భావము. ఉపమాలంకారభేదము.

మ. మునిరా జిట్లరుదేర ద్వాస్థితజనా౧మూల్యోక్తివైచిత్రి మే
ల్కని తోడ్తో నెదు రేఁగి, భక్తి వినతుల్ ౧గావించి తోడ్తెచ్చి, నూ
తనచామీకరపీఠి నుంచి, యల గో౧త్రాకామినీకాముకుం
డనువొందన్ ఘటియించె నాదమికిఁ దా ౧నాతిథ్య మప్పట్టునన్. 125

టీక: అల గోత్రాకామినీకాముకుండు = ఆ పృథివీపతి యగు సుచంద్రుఁడు; ఇట్లు = పైఁజెప్పిన విధముగా; మునిరాజు = శాండిల్యుఁడు; అరుదేరన్ = విచ్చేయుఁగా; ద్వాస్థితజ నామూల్యోక్తివైచిత్రిన్ – ద్వాస్థితజన = ద్వారపాలకులయొక్క, 'స్త్రీర్ద్వార్ద్వారమ్' అని అమరుఁడు; అమూల్యోక్తివైచిత్రిన్ = లోకోత్తరవాగ్వైచిత్రిచేత; మేల్కని = జాగరూకుఁడై; తోడ్తోన్ = వెంటనే; ఎదు రేఁగి = ఎదురుఁగఁబోయి; భక్తిన్ = భక్తితోడ; వినతుల్ = ప్రణామములు; కావించి = చేసి; తోడ్తెచ్చి = తోడుకొని తెచ్చి; నూతన = క్రొత్తదగు; చామీకరపీఠిన్ = బంగరుపీటయందు; ఉంచి = కూర్చుండఁబెట్టి; అనువొందన్ = తగునట్టుగా; ఆ దమికిన్ = ఆమునికి; తాన్ = తాను; అప్పట్టునన్ = ఆసమయమందు; ఆతిథ్యము = అతిథిసత్కారము; ఘటియించెన్ = చేసెను;

క. విమలాసనమునఁ బతి యతి
కమలాసనలసదనుజ్ఞి౧క వసించి, మహా
సుమనోరసారుహోద్య
త్సుమనోరససూక్తిఁ దపసి౧తో నిట్లనియెన్. 126

టీక: పతి = భూపతి యైన సుచంద్రుఁడు; యతికమలాసన లస దనుజ్ఞిక = యతిపుంగవుండైన శాండిల్యునియొక్క ప్రకాశించుచున్న యాజ్ఞచేత, అనుజ్ఞాశబ్దముమీఁద కప్ప్రత్యయము, ఇత్వము వచ్చి అనుజ్ఞిక యైనది; విమలాసనమునన్ = నిర్మలమైన యాసనమందు; వసించి = కూర్చుండి; మహా సుమనో రసారుహోద్యత్సుమనోరస సూక్తిన్ – మహత్ = అధికమైన, దీనికి సుమనోరసమం దన్వయము, సుమనః = అమరులయొక్క, రసారుహ = తరువువలన, ఉద్యత్ = ఉదయించుచున్న, సుమనోరస = పూఁదేనియవంటి,సూక్తిన్ = వాక్కుచేత, అనఁగాఁ గల్పతరుకుసుమమకరంద మొలుకుచున్న వాక్కుచేత ననుట; తపసితోన్ = మునితోడ; ఇట్లనియెన్ = చెప్పఁబోవు రీతిగఁ బలికెను.

శా. మౌనీ సేమమె మీకు, మంగళమె యు౧ష్మచ్ఛాత్త్రరాట్పాళికిం,
నానాసూనవప్రసూనములు సిం౧దన్ మించునే యాశ్రమా
గానీకంబు, లనంతరాయకలనన్ ౧ యజ్ఞాళు లీడేఱునే,
శ్రీనొప్పారునె మీ మహోటజము ని౧ర్వేలాసురానీకతన్. 127

టీక: మౌనీ = ఓశాండిల్యమునీ; మీకున్ సేమమె = మీకు కుశలమా! యుష్మచ్ఛాత్రరాట్పాళికిన్ = మీ శిష్యశ్రేష్ఠుల గుంపునకు, మంగళమె = కల్యాణమా! ఆశ్రమాగానీకంబులు = ఆశ్రమద్రుమసమూహములు; నానా = అనేకవిధములగు; సూన = కుసుమములు; నవ = క్రొత్తనైన; ప్రసూనములు = ఫలములు, 'ప్రసూనం పుష్ప ఫలయోః' అని వైజయంతి; చిందన్ = వ్యాపింపఁగా; మించునే = అతిశయించునా! యజ్ఞాళులు = యజ్ఞములయొక్కసమూహములు; అనంతరాయకలనన్ = నిర్విఘ్నముగా; ఈడేఱునే = సిద్ధించుచున్నవా! మీ మహోటజము = మీయొక్క పూజ్యమగు పర్ణశాల; నిర్వేలాసురానీకతన్ = అడ్డము లేని రాక్షసుల యీతి బాధ లేకుండఁగ; శ్రీన్ = సంపదచేత; ఒప్పారునె = ఒప్పుచున్నదా! దీని కిట్లనియె యను పూర్వపద్యమందలి క్రియయం దన్వయము.

చ. యతికులచంద్ర! సత్కువలయప్రియ మై తగు నీదురాక మ
ద్వితతమనస్థ్సతాపగతి వేగ యలంప గలంప సంతతో
ద్ధతతరపంకజాతములఁ దావకపాదనిషేవణాసమా
దృతి మను నాళుభాళి గనునే ధరఁ దక్కిన రాజచక్రముల్. 128

టీక: యతికులచంద్ర = మునికులచంద్రుండవగు శాండిల్యుఁడా!, చంద్రుడా యని యర్థాంతరము; సత్కువలయ= మంచి భూవలయమునకు, కల్వలకు నని యర్థాంతరము; ప్రియ మై = హితమై; తగు నీదురాక = ఒప్పుచున్న నీరాక; మద్వితత మనస్థ్స తాపగతిన్ = నాయొక్కమనస్సునం దున్న విపులమైన సంతాపమును, వేఁడి నని యర్థాంతరము; వేగ =వేగముగా; అలంపన్ = అలయింపఁగా; సంతత ఉద్ధతతరపంకజాతములన్– సంతత = ఎల్లప్పుడును; ఉద్ధతతర =ఉత్కటతరమగు; పంకజాతములన్=పాపసంఘములను, పద్మముల నని యర్థాంతరము; కలంపన్ = కలఁతపఱుపఁగా; తావక పాద నిషేవణాసమాదృతిన్– తావక =నీసంబంధు లగు, పాద = చరణములయొక్క, కిరణములయొక్కయని యర్థాంతరము, నిషేవణ =సేవయందలి, అసమ = సాటి లేని దగు, ఆదృతిన్ = ఆదరమున; మను = వృద్ధిఁబొందెడు; నాళుభాళిన్ = నాయొక్క కల్యాణపరంపరలను; తక్కిన రాజచక్రముల్= ఇతరనృపాలసంఘములు, శ్రేష్ఠచక్రవాకసంఘము లని యర్థాంతరము; ధరన్= లోకమందు; కనునే = పొందునా, పొంద వనుట. ఇచటఁ బ్రస్తుతశాండిల్యవిషయ మైన యర్థముఁ జెప్పఁగాఁ జంద్రకువలయాది నానార్థశబ్దశక్తిమూలవ్యంజనచేతఁ జంద్రాదివిషయకార్థాంతరము వ్యజ్యమాన మగుఁ గావునఁ జంద్రుఁడు రాఁగా నెట్లు గల్వలకుఁ బ్రీతియు, తాపము శమించుటయుఁ, బద్మములు వికసించుటయు, జక్కవలు సంతస మందకుండుటయు నగునో యట్లు శాండిల్యుఁడు రాఁగా భూవలయమునకుఁ బ్రీతియు, సుచంద్రుని మనస్సంతాపము శమించుటయు, సమస్తపాపకదంబము తత్పాదసేవనమున నశించుటయు నితరరాజదుర్లభమై ఘటించె నని భావము. వస్తుకృతోపమాలంకారధ్వని.

చ. కరము మదీయపుణ్యలతికన్ సఫలత్వముఁ బొందఁ బూన్చి యో
సురభిచరిత్ర! నీ విటకు సొంపుగఁ జేరితి శక్యమే భవ
ద్వరసుమనోహితత్వఘనవైఖరి సన్నుతిఁ జేయ నీదయా
పరిణతిఁ గాదె యుత్కలికఁ బాయక భవ్యతరుల్ సెలంగుటల్. 129

టీక: ఓ సురభిచరిత్ర = మనోజ్ఞమైన నడవడి గల యోమునీ, వసంతుని చరితము గలవాఁడ యని ధ్వని; కరము = మిక్కిలి; మదీయపుణ్యలతికన్ = నాసుకృత మనెడు లతికను; సఫలత్వమున్ = ఫలవత్తను; పొందన్ పూన్చి = ఫలములను బొందింప నుద్యమించి యనుట, ఫలములనఁగా లాభములు, పండ్లును; నీవు ఇటకున్ = నాయొద్దకు; సొంపుగన్ = సంతోషముగా; చేరితి=చేరినవాఁడవైతివి; భవద్వర సుమనోహితత్వ ఘనవైఖరి సన్నుతిన్ – భవత్ = నీయొక్క, వర = శ్రేష్ఠ మగు, సుమనోహితత్వ = విద్వత్ప్రీతియొక్క, కుసుమప్రీతియొక్క యని యర్థాంతరము, ఘనవైఖరి = గొప్పరీతియొక్క, సన్నుతిన్ = స్తోత్రమును; చేయన్ = చేయుటకు; శక్యమే =శక్యము గాదనుట; నీదయాపరిణతిన్ కాదె = నీకృపాపరిణామము గదా; భవ్యతరుల్ = మిగులఁ బెద్దలు, ఒప్పుచున్న వృక్షము లని యర్థాంతరము; ఉత్కలికన్ = ఉత్సవమును, మొగ్గల నని యర్థాంతరము; పాయక = తొలంగక; చెలంగుటల్= ప్రకాశించుటలు. ఇచట ఘనవైఖరిశబ్దములో ఘనపదమునకు మేఘపర మైన యర్థాంతరము స్ఫురించినను, దానికిఁ గుసుమహితత్వము లేమిచేతను, సుమనశ్శబ్దమునకు మాలతి యర్థ మైనందునఁ దద్ధితత్వము మేఘమునకు సంభవించినను 'శ్లో. జాతీకదమ్బకేతకరఘుంరఘూనిల నిమ్నగా హలిప్రీతిః' అని కవికల్పలతయందు వర్షర్తువునందె జాతీవర్ణనము చెప్పినందునను, సురభియందు మేఘపర మైన యర్థ మనను గుణ మని తలంచి వ్రాయలేదు. వసంతునకు, శాండిల్యునకు నౌపమ్యము గమ్యము.

మ. ఘనతాత్పర్యము నాపయి న్నిలిపి వేడ్కన్ వచ్చి తస్మత్పురా
తనభాగ్యంబునఁ జేసి యోతపసి రత్నశ్రేణులో భూమియో
ధనమో ధేనువులో కరీంద్రములొ రథ్యవ్రాతమో యిష్టవ
స్తునికాయం బనివార్యభక్తి ఘటియింతుం దెల్పవే సత్కృపన్. 130

టీక: ఓ తపసి = ఓ మునీ, అస్మత్పురాతనభాగ్యంబునఁ జేసి= నాయొక్క పూర్వపుభాగ్యమువలన, నా పయిన్ = నాయందు, ఘనతాత్పర్యము = గొప్పప్రీతిని, 'తత్పరే ప్రసితాసక్తౌ' అని యమరుఁడు; నిలిపి = ఉంచి, వేడ్కన్ = సంతసముతో, వచ్చితి = వచ్చినవాఁడవైతివి; రత్నశ్రేణులో= నవరత్ననికరములో; భూమియో = వసుంధరయో; ధనమో = ద్రవ్యంబో; ధేనువులో = గోవులో; కరీంద్రములొ= గజోత్తమములో; రథ్యవ్రాతమో = అశ్వములగుంపో; ఇష్టవస్తునికాయంబు = యజ్ఞాదులయందు దేయంబుగా నిష్టవస్తు కదంబము; సత్కృపన్ = మంచిదయతోడ; తెల్పవే = చెప్పుమా; అనివార్యభక్తిన్ = నివారింపరాని భక్తితో, అత్యుత్కటమైన భక్తితో ననుట; ఘటియింతున్= ఘటియింపఁజేయుదును.

మ. అని యాభూపతి వల్క, యోగిమణి చిత్తాంకూరితానందుఁడై
యినవంశోత్తమ! తావకీనకృప మాకెల్లప్పుడున్ సేమ, ము
ర్వి నితాంతైకమహామహోన్నతభవాదృఙ్మిత్రసాంగత్యవ
ర్తన నిచ్చ ల్మనుమాకుఁ జేకుఱునె జాగ్రద్దుష్టదోషావళుల్? 131

టీక: అని = ఇట్లని; ఆభూపతి = ఆసుచంద్రుఁడు; పల్కన్ = వచింపఁగా; యోగిమణి = యోగిశ్రేష్ఠుం డగు శాండిల్యుఁడు; చిత్తాంకూరితానందుఁ డై = మనస్సునం దంకురించిన యానందము గలవాఁడై; ఇనవంశోత్తమ = సూర్యవంశపురాజులలో నుత్తముఁడైనవాఁడా; తావకీనకృపన్ = నీదయతో; మాకున్ = మముబోఁటి తాపసులకు; ఎల్లప్పుడున్ = సర్వకాలమందును; సేమము = కుశలము; ఉర్విన్ = భూమియందు; నితాం తైక మహోమహోన్నత భవాదృ జ్మిత్ర సాంగత్య వర్తనన్ – నితాంత =తీవ్రమైన, 'తీవ్రైకాన్త నితాన్తాని' అని యమరుఁడు, ఏక =ముఖ్యమగు, మహః =ప్రతాపముచేత, మహోన్నత =మిగుల నధికుఁడగు, భవాదృక్ = నినుబోఁటి, మిత్ర=చెలికానితోడ, సాంగత్యవర్తనన్ = సంబంధవృత్తిచేత, తేజస్సుచేత మిగుల నధికుఁ డగు సూర్యునిసాంగత్యవృత్తిచేత నని యర్థాంతరధ్వని; నిచ్చల్ = ఎల్లప్పుడు; మను మాకున్ = వృద్ధిఁ బొందునట్టి మాకు; జాగ్రద్దుష్టదోషావళుల్ = జాగరూకు లైన దుర్మార్గులవల్ల నుపద్రవపరంపరలు, రాత్రులపంక్తు లని ధ్వన్యమానార్థము; చేకుఱునె = లభించునా, అనఁగాఁ దీవ్రతేజశ్శాలి యగు సూర్యునిసాంగత్యమువలన రాత్రులయుపద్రవ మెట్లు లభింపదో యట్టు లుగ్ర ప్రతాపశాలి వగు నీసాంగత్యమున మాకు దుర్మార్గులయుపద్రవములు ఘటింప వని భావము. ప్రస్తుతాప్రస్తుతోపమాధ్వని.

తే. అనిశము సమస్తలోకర(క్షైకదీక్ష, నలరు నీకృప సకలేష్ట(మంది మించు
మాకుఁ గోరిక యొక్కింత(మాత్ర మైనఁ, గలదె భవదవలోకనా(కాంక్ష దక్క. 132

టీక: అనిశము = ఎల్లప్పుడు; సమస్త లోక రక్షైక దీక్షన్ = సర్వలోకరక్షణవిషయ మైన ముఖ్యదీక్షచేత; అలరు = ఒప్పునట్టి; నీకృపన్ = నీయొక్క దయచేత; సకలేష్టము =ఎల్లయిష్టములను; అంది =పొంది; మించు మాకున్ = అతిశయించునట్టి మాకు; ఒక్కింతమాత్ర మైనన్ = ఈషత్తైనను; కోరిక=అభిలాష; భవ దవలోక నాకాంక్ష దక్కన్ = నినుఁజూడవలెనను నిచ్చ దక్క; కలదె = కలదా. సమస్తలోకరక్షాదీక్షుండవగు నీదయతో సకలేష్టముల నందిన మాకు నీదర్శనాభిలాష తక్క వేఱొక్క యభిలాష లేదని భావము.

మ. సకలారాతివిదారణంబు, సుమన(స్త్రాణంబుఁ గావించి, ధా
ర్మికులం దెక్కుడ వై, జగత్ప్రియత ధా(త్రీకాంత! నీవొప్ప మౌ
నికులశ్రేష్ఠులతో నిరీతి మఘముల్ (నెగ్గించుచున్ మేము వే
డుక వర్తిల్లుదు, మాశ్రమాళి సురకో(టుల్ నిచ్చ హర్షింపఁగన్. 133

టీక: ధాత్రీకాంత = భూనాథుఁడవగు సుచంద్రుఁడా! సకలారాతి విదారణంబున్ = సమస్తశత్రునిబర్హణమును; సుమనస్త్రాణంబున్ = విద్వజ్జనులరక్షణంబును; కావించి = చేసి; ధార్మికులందున్ = విలుకాండ్రలోపల, పుణ్యశీలురలోపల; ఎక్కుడవై = అధికుఁడవై; జగత్ప్రియతన్ = లోకప్రీతిచేత; నీవొప్పన్ = నీ వతిశయించుచుండఁగా; మేమున్ = మేమును; మౌనికులశ్రేష్ఠులతో = మునివరులతో; నిరీతిన్ = ఈతిబాధ లేనట్లుగా; మఘముల్ = క్రతువులను; నెగ్గించుచున్ = నెఱవేర్చుచు; సురకోటుల్ = దేవసంఘములు; నిచ్చ = ఎల్లప్పుడును; హర్షింపఁగన్ = సంతసింపఁగా; వేడుకన్ = సంతసముతో; ఆశ్రమాళిన్ = ఆశ్రమసమూహమందు; వర్తిల్లుదుము = వసింతుము. నీవు శత్రునిబర్హణముఁ జేసి విలుకాండ్రలోను, విద్వజ్జనరక్షణంబుఁ జేసి

పుణ్యశీలురలోను, శ్రేష్ఠుండ వయి వర్తింపఁగా, మేమును మునిశ్రేష్ఠులతోఁ గూడి యజ్ఞములు సేయుచు సురకోటులు సంతసింపఁగా నాశ్రమములందు వేడుకతో వర్తిల్లుదు మని భావము.

మ. జపముల్ సాగఁగ, వేదపాఠములు ని॑ష్ప్రత్యూహతన్ మించఁగాఁ,
దపముల్ పూర్ణత నొంద, జన్నములు ని॑త్యంబుం బ్రకాశింపఁగా,
నృప! యుష్మన్మహిమం జెలంగుదుము ని॑ర్వేలప్రసూనప్రసూ
నపటల్యంచితసాలజాలయుతస॑న్మాన్యాశ్రమాస్థానికన్. 134

టీక: జపముల్ = మంత్రజపములు; సాగఁగన్ = కొనసాగఁగ; వేదపాఠములు = వేదములయొక్క పాఠములు; నిష్ప్రత్యూహతన్ = నిర్విఘ్నతతో; మించఁగాన్ = అతిశయింపఁగా; తపముల్ = తపస్సులు; పూర్ణతన్ = పరిపూర్ణభావమును; ఒందన్ = పొందఁగా; జన్నములు = యజ్ఞములు; నిత్యంబున్ = ఎల్లప్పుడును; ప్రకాశింపఁగాన్ = తేజరిల్లఁగా; నృప = ఓరాజా! యుష్మన్మహిమన్ = మీమహిమచేత; నిర్వేల ప్రసూన ప్రసూనపటల్యంచిత సాల జాల యుత సన్మాన్యాశ్ర మాస్థానికన్ – నిర్వేల = అనర్గళమగు, ప్రసూన = పుష్పములయొక్కయు, ప్రసూన = ఫలములయొక్కయు, 'ప్రసూనం పుష్పఫలయోః' అని విశ్వము, పటలీ = సంఘముచేత, అంచిత = ఒప్పునట్టి, సాల = వృక్షములయొక్క, జాల = సమూహముతో, యుత = కూడుకొన్నట్టి, సత్ = సత్పురు షులచేత, మాన్య = మాననీయ మగు, ఆశ్రమ = ఆశ్రమ మనెడు, ఆస్థానికన్ = సభయందు; చెలంగుదుము= ప్రకాశింతుము.

చ. భవదవలంబనంబున న॑పాయము గానక యిన్ని నాళ్లు మా
నవకులచంద్ర! సౌఖ్యకల॑నం దనరారితి మట్టిమాకు స
త్సవనవినాశకంబు, ముని॑జాలమనఃప్రమదాపహారకం
బవు నొకకార్య మబ్బె నిపు ॑డాదృతిచే నది చిత్తగింపవే. 135

టీక: భవదవలంబనంబునన్ = నీయాశ్రయమున; అపాయము కానక = చ్యుతి గనక; ఇన్ని నాళ్లున్ = ఇన్ని దినములు; మానవకులచంద్ర = సుచంద్రుఁడా; సౌఖ్యకలనన్ = సౌఖ్యప్రాప్తిచేత; తనరారితిమి = ఒప్పితిమి; అట్టిమాకున్= ఆరీతిగ నున్న మాకు; సత్సవనవినాశకంబు = శ్రేష్ఠములగు యజ్ఞముల నశింపఁజేయునదియు; ముని జాల మనః ప్రమదాపహారకంబు = మునిసంఘములయొక్క సంతోషవినాశకమును; అవు నొకకార్యము =అగునట్టి యొక కార్యము; ఇపుడు=ఈకాలమున; అబ్బెన్ = ఘటిల్లెను; అది = ఆ కార్యము; ఆదృతిచేన్ = ఆదరముచే; చిత్తగింపవే = మనస్కరింపుమా.

వ. అని వెండియు నయ్యతీంద్రుం డాసుచంద్రమహీశచంద్రునితో నిట్లనియె. 136

టీక: అని, వెండియున్ = మఱియును, అయ్యతీంద్రుండు = ఆశాండిల్యుఁడు, ఆసుచంద్రమహీశచంద్రునితోన్ = ఆసుచంద్రుండను రాజచంద్రునితో, ఇట్లనియె = వక్ష్యమాణప్రకారంబునఁ బలికెను.

సీ. ఘనవైరిమకుటము\క్తాజయశ్రీకపి,లావాచనాపాది\లలితశరుఁడు,
భుజబలవ్యాఖ్యాతృ\భూభృద్భిదాస్యాను,బింబవత్స్వారత్న\పీఠతటుఁడు,
రణభేరికాభాంక\రణపరిప్రాపిత, హరిదంష్ట్రిలోకేశ\పురవరుండు,
ప్రతిదినాభ్యుదితకా\ర్శ్యజ్ఞాపితప్రతి,మాన్యతాకామరీ\మహితగృహుఁడు,
తే. ప్రబలు నాత్మచమూప్రతి\ప్రస్థితీక్ష,ణేహికాప్తిపునఃపున\రీషదున్న
మన్ముఖసుమేరుకందరా\క్ష్మావసన్మ,హాసురుండు తమిస్రాభి\ధాసురుండు. 137

టీక: ఘనవైరి మకుట ముక్తా జయశ్రీ కపిలావాచనాపాది లలిత శరుఁడు – ఘన = గొప్పలగు, వైరి మకుట=శత్రుకిరీటముల యొక్క, ముక్తా = ముత్యములచేత,జయశ్రీ = జయలక్ష్మికి, కపిలావాచన = వివాహమందలి స్వస్తివాచనిక కర్మవిశేషమును, ఆపాది = సంపాదించుచున్న, లలిత శరుఁడు = లలితములైన బాణములుగలవాఁడు, పంచబాణుం డని ధ్వనించును.
భుజబల వ్యాఖ్యాతృ భూభృద్భిదాస్యానుబింబవ త్స్వారత్నపీఠతటుఁడు – భుజబల = బాహువిక్రమమునకు, వ్యాఖ్యాతృ = వ్యాఖ్యానించెడు, దీని కాస్యానుబింబమునం దన్వయము, భూభృద్భిత్ = ఇంద్రునియొక్క, ఆస్యానుబింబవత్ = ముఖప్రతి బింబములు గల్గిన, స్వారత్నపీఠ = చింతామణిపీఠముయొక్క, స్వర్ రత్న యని యుండఁగా సంధివశంబునఁ బూర్వ రేఫ మునకు లోపంబును దత్పూర్వాకారంబునకు దీర్ఘంబును గలిగె, తటుఁడు = దరి గలవాఁడు, అనఁగా నతఁడు గూర్చుండు చింతామణిపీఠమున నమస్కరించు నింద్రునిముఖము ప్రతిబింబింపఁగా నతని బాహుబలము దానివలన వ్యాఖ్యాతంబుగా నున్న దనుట.
రణభేరికా భాంకరణ పరిప్రాపిత హరి దంష్ట్రి లోకేశ పురవరుండు – రణభేరికా భాంకరణ = యుద్ధభేరీధ్వనిచేత, పరిప్రాపిత = పొందింపఁబడిన, హరి = సింహములు, దంష్ట్రి = పందులు గలిగిన, లోకేశ = రాజులయొక్క, పురవరుండు = పురవరములు (రాజధానులు) గలవాఁడు. అనఁగా వాని భేరీధ్వనివలన రాజులు భయపడి పురములను వదలి పోఁగా నాపురములయందు సింహములు, వరాహములు చేరిన వనుట.
ప్రతిదినాభ్యుదిత కార్శ్య జ్ఞాపిత ప్రతిమాన్యతా కామరీ మహితగృహుఁడు – ప్రతిదిన = ప్రతిదినమునందు, అభ్యుదిత = పుట్టిన, కార్శ్య=కృశత్వముచేత, జ్ఞాపిత = ఎఱింగింపఁబడిన, ప్రతిమాన్యతాక = అవమానము గల,ప్రతిమాన్యతాశబ్దాంతబహువ్రీహి మీఁద కప్ప్రత్యయము, ఆమరీ =దేవతాస్త్రీలచేత, మహిత = పొగడబడిన, గృహుఁడు= గృహములు గలవాఁడు. అనఁగా రాక్షసునితో బందీకరింపఁబడితి మని యవమానము చేత దినదినము కృశించుచున్న దేవాంగన లతనియింట నున్నారని భావము.
ఆత్మ చమూ ప్రతిప్రస్థితీక్షణేహికాప్తి పునఃపున రీష దున్నమ న్ముఖ సుమేరుకందరా క్ష్మావస న్మహాసురుండు – ఆత్మ = తన యొక్క, చమూ =సేనలయొక్క, ప్రతిప్రస్థితి =మరలిపోవుటయొక్క, ఈక్షణ = చూచుటయందు, ఈహికాప్తి = ఇచ్ఛాప్రాప్తి చేత, పునఃపునః = మాటిమాటికి, ఈషదున్నమత్= ఇంచుక యున్నత మగుచున్న, ముఖ = మోములు గల, సుమేరు=మేరు పర్వతముయొక్క, కందరాక్ష్మా = గుహల భూములయందు, వసన్ = నివసించుచున్న, మహత్ = ఉత్కృష్టులైన, సురుండు

= దేవతలు గలవాఁడు. అనఁగా దేవతలు వానిదాడికి వెఱచి మేరుగుహలయందు డాఁగి తమ్ముఁ వెదకి దునుమవచ్చిన తమిస్రాసురుని సైనికులు మరలిపోవుచుండఁగా సారెసారెకు నిక్కిచూచుచున్నా రని భావము.
తమిస్రాభిధాసురుండు = తమిస్రుం డని పేర్కొనఁబడు రక్కసుఁడు, ప్రబలున్ = అతిశయించును.

చ. అనుపమధేనుకాహితత ◊నంది చరించు మునివ్రజంబులం
బెనుపుఁ, గడున్ మహాసవకృ◊పీటభవాళులఁ దూలఁజేయుఁ, జ
య్యనఁ గలఁచున్ బహూదకచ◊యంబుల, వ్రాల్చు ధరిత్రి శ్యామలం
జనవర! దానవద్విపము ◊సాంద్రమదస్ఫురణంబు హెచ్చఁగన్. 138

టీక: ఈపద్యమందు రాక్షసపరమైన యర్థము, గజపరమైన యర్థము గలుగును. జనవర = సుచంద్రుఁడా; దానవద్విపము = గజమువంటి దానవుఁడు, మదించిన గజము; సాంద్ర = దట్టమైన; మద = గర్వముయొక్క, మదముయొక్క; స్ఫురణంబు = ప్రకాశము; హెచ్చఁగన్ = అతిశయింపఁగా; అనుపమ = అసమానమైన, ధేనుకా= గోవులకు, అహితతన్ = శత్రుభావమును, ఆఁడేనుఁగులకు హితభావము నని గజపరమైన యర్థము, ‘ధేనుకా కరిణీ వశా’ అని యమరుఁడు; అంది = పొంది; చరించున్ = తిరుగును; మునివ్రజంబులన్ =మునులగుంపులను, అగిసియను వ్రూఁకులగుంపులను; పెనుపున్ = నాశముఁ జేయును; మహాసవకృపీటభవాళులన్ – మహత్ = అధికమైన, సవ=యజ్ఞములయొక్క, కృపీటభవ = అగ్నియొక్క, ఆళులన్ = సమూహములను; మహత్=అధికమగు, ఆసవ=మకరందము గల, కృపీటభవ= తామరలయొక్క, ఆళులన్ = గుంపులను; కడున్ =మిక్కిలి; తూలఁజేయున్ = చలింపఁజేయును; చయ్యనన్ = శీఘ్రముగా; బహూదక= బహూదకు లను సన్న్యాసుల యొక్క, హంస, పరమహంస, కుటీచక, బహూదకు లని సన్న్యాసులలో నాల్గు భేదములు గలవు; చయంబులన్ = గుంపులను; కలఁచున్ = కలఁతపఱచును; ధరిత్రిన్ = భూమియందు; శ్యామలన్ = యౌవన మధ్యస్థలగు స్త్రీలను; వ్రాల్చున్ = వ్రాలునట్లు చేయును, ప్రేంకణము మున్నగు వృక్షవిశేషములను భూమిని వ్రాల్చు నని గజ పరమైన యర్థము.

సీ. హరిహయాస్యాతత◊స్ఫురణ దూలఁగఁ దార్చి, శుచిధామమహిమంబుఁ ◊జూఱ వుచ్చి,
చటులమహాకాల◊పటిమంబు దిగఁ ద్రోచి, నానాశరచ్ఛటా◊శ్రీ నడంచి,
కమలవరప్రభౌ◊ఘంబు మాయఁగఁ జేసి, ఘనమరుత్పురసాల◊గరిమ ముంచి,
ప్రచురసోమావలే◊పం బెల్లఁ గరఁగించి, పంచాస్యశక్తిఁ బో◊పడ నొనర్చి,
తే. యిట్టు లాపూర్వదేవవం◊శేశ్వరుండు, విశ్వ హరిదీశ విజయాప్తి ◊వెలయు నాత్మ
చండదోర్దండమండల◊మండలాగ్ర, జనితసత్కీర్తిదీప్తిప్ర◊చారమూర్తి. 139

టీక: ఈపద్యమందు తమిస్రాసురుని ప్రతాపకీర్తుల పరమైన యర్థద్వయము గలుగును.
హరిహయాస్యాతతస్ఫురణన్ – హరిహయ = ఇంద్రునియొక్క, ఆస్య = ముఖముయొక్క, ఆతతస్ఫురణన్ = విపులమైన కాంతిని, తూలఁగఁ దార్చి = తూలఁగఁ జేసి యని ప్రతాపపరమైన యర్థము; హరిహయ = విష్ణువాహనమైన గరుడునియొక్క,

ఆస్య=ముఖముయొక్క, ఆతతస్ఫురణన్ = అతిశయప్రకాశమును, తూలఁగఁజేసి, అనఁగా గరుత్మంతుని ముఖకాంతి తెల్లగా నుండును గాన దానిం దూలఁగఁజేసి యని కీర్తిపర మైన యర్థము. ఇట్లు వాక్యాంతరముల నూహ్యంబు;

శుచిధామమహిమంబున్ – శుచి= అగ్నియొక్క, 'శుచి రప్పిత్తమ్' అని యమరుఁడు,ధామ=తేజముయొక్క, మహిమంబున్ = మహిమను, చూఱ పుచ్చి = కొల్లవెట్టి యని ప్రతాపపరమైన యర్థము; శుచిధామ = చంద్రునియొక్క మహిమంబుఁ జూఱ పుచ్చి యని కీర్తిపరమైన యర్థము.

చటులమహాకాలపటిమంబున్ దిగఁ ద్రోచి = చటులమై అధికమైన యమునియొక్క మహిమను దిగఁద్రోచి యని ప్రతాపపర మైన యర్థము; చటులమైన మహాకాల యనఁగా శివునియొక్క మహిమను దిగఁద్రోచి యని కీర్తిపరమైన యర్థము.

నానాశరచ్ఛటాశ్రీన్ – నానా = అనేకప్రకారము లగు, ఆశర = నిరృతియొక్క, ఛటా=పరంపరారూప మైన, శ్రీన్ = సంపదను; అడంచి = అడఁగఁజేసి యని ప్రతాపపరమైన యర్థము; అనేకప్రకారము లగు శరములు, అనఁగా ఱెల్లులు, వానిఛటలయొక్క శ్రీని అడంచి యని కీర్తిపరమైన యర్థము.

కమలవరప్రభౌఘంబున్ – కమలవర=జలాధిపతి యైన వరుణునియొక్క, ప్రభౌఘంబున్ = కాంతిపుంజమును, మాయఁగఁ జేసి = నశించునట్లు చేసి యని ప్రతాపపరమైన యర్థము; కమల = పద్మములయొక్క, తెల్లదామరలయొక్క, వర=శ్రేష్ఠమైన, ప్రభా = కాంతియొక్క, ఓఘంబున్ = సంఘమును, మాయఁగఁజేసి యని కీర్తిపరమైన యర్థము.

ఘనమరుత్పురసాలగరిమన్ – ఘన=అధికమగు, మరుత్=వాయువుయొక్క, పుర=నగరముయొక్క, సాల=కోటయొక్క, గరిమన్ = అతిశయమును, ముంచి =మునుఁగఁజేసి యని ప్రతాపపరమైన యర్థము; ఘన = గొప్పయగు, మరుత్పుర = స్వర్గ సంబంధి యైన, సాల=వృక్షముయొక్క, కల్పవృక్షముయొక్కయనుట, గరిమన్=అతిశయమును, ముంచి =మునుఁగఁ జేసి యని కీర్తిపరమైన యర్థము.

ప్రచురసోమావలేపం బెల్లన్ – ప్రచుర మగు కుబేరునియొక్క గర్వము నంతయు, కరఁగించి=కరఁగఁజేసి యని ప్రతాపపరమైన యర్థము; ప్రచుర మగు కర్పూరముయొక్క దర్పమును గరఁగించి యని కీర్తి పరమైన యర్థము, 'సోమః కుబేరే కర్పూరే' యని రత్నమాల;

పంచాస్యశక్తిన్ = శివునిసామర్థ్యమును, పోపడన్ = పోవునట్లు, ఒనర్చి = చేసి యని ప్రతాపపరమైన యర్థము. సింహశక్తిని పోపడ నొనర్చి యని కీర్తిపరమైన యర్థము, 'సింహో మృగేన్ద్రః పంచాస్యః' అని యమరుఁడు.

ఇట్టులు=ఈప్రకారముగ; ఆపూర్వదేవవంశేశ్వరుండు=ఆరాక్షసకులేశ్వరుఁ డైన తమిస్రాసురుఁడు; విశ్వహరిదీశవిజయాప్తిన్ – విశ్వ = సమస్తమగు, హరిదీశ = ఇంద్రాదిదిక్పాలకులయొక్క, విజయాప్తిన్ = విజయముయొక్క లాభముచేత; ఆత్మచండ దోర్దండమండల మండలాగ్ర జనిత సత్కీర్తి దీప్తి ప్రచార మూర్తి– ఆత్మ = తనయొక్క, చండ= ఉగ్రమగు, దోర్దండమండల= భుజదండమండలమందున్న, మండలాగ్ర = ఖడ్గమువలన, జనిత = పుట్టినట్టి, సత్కీర్తి = ఉత్తమయశస్సుయొక్కయు, దీప్తి= ప్రతాపముయొక్కయు, ప్రచార = వ్యాప్తికి, మూర్తి = శరీరప్రాయుఁడై; వెలయున్ = ప్రకాశించును. ఇంద్రాద్యష్టదిక్పాలకుల నడంచు ప్రతాపమును, గరుత్మన్ముఖహిమాంశుప్రభృతుల తేజము నొంచు కీర్తియుఁ గల వాఁడై తేజరిల్లు నని భావము.

మ. నవసంగ్రామధరాహృతంబు లగు నా॥నాలేఖనాగాన్వయే
భవితానమ్ముల సాధ్యరాడ్రథములం॥ బ్రాంచత్తురంగాస్యర

త్న విమానంబుల నొప్పఁ జేసి హిమగో॥త్రాభృద్దరీరాజధా
న్యవతంసంబున మించు నాతఁ డసురేం॥ద్రానీకకోటీయుతిన్. 140

టీక: నవసంగ్రామధరాహృతంబు లగు– నవ = నూతన మగు, సంగ్రామధరా = యుద్ధభూమియందు, ఆహృతంబులు = తీసి కొనిరాఁబడినవి యగు; నానా లేఖనాగాన్వయేభ వితానమ్ములన్– నానా = అనేకప్రకారము లగు, లేఖనాగ = ఐరావతము యొక్క, అన్వయ = వంశీయము లైన, ఇభ= గజములయొక్క, వితానమ్ములన్ = సమూహములను; సాధ్యరాట్ = సాధ్యేశ్వరునియొక్క; రథములన్ = స్యందనములను; ప్రాంచత్ = ఒప్పుచున్న; తురంగాస్యరత్న = కింపురుషరాజుయొక్క; విమానంబులన్ = పుష్పకములను, కాదేని కింపురుషుల రత్నమయవిమానముల నని యర్థము; ఒప్పఁ జేసి = ఒప్పు నట్లొనరించి; హిమగోత్రాభృద్దరీరాజధాన్యవతంసంబునన్ - హిమగోత్రాభృత్ = హిమవత్పర్వతముయొక్క; దరీ = గుహ యనెడు; రాజధాన్యవతంసంబునన్ = పురవరమందు; అసురేంద్రానీక = రాక్షసేంద్రసమూహముయొక్క; కోటీ = అనేకములయొక్క; యుతిన్ = సంబంధముచేత; అతఁడు = ఆ తమిస్రాసురుఁడు; మించున్ =అతిశయించును.

చ. అలదనుజేశ్వరుండు మృగ॥యాపరమానసుఁ డై, నిశాచరా
వళులు భజింప మౌనికుల॥వర్యమహోటజరాజిఁ జేరి దా
బలిమిని దాపసేంద్రతతిఁ ॥బట్టి వధించుఁ, దదూర్జితాధ్వర
జ్వలనము లార్పఁ జేయు నని॥వారితశోణితవారిధారలన్. 141

టీక: అలదనుజేశ్వరుండు = ఆతమిస్రాసురుఁడు; మృగయాపరమానసుఁ డై = వేఁటయం దాసక్తమైన చిత్తము గలవాఁడై; నిశాచరావళులు = రాక్షసులగుంపులు; భజింపన్ = కొలుచుచుండఁగా; మౌనికులవర్య = మునిశ్రేష్ఠులయొక్క; మహోటజ రాజిన్ = గొప్పనైన యాశ్రమసమూహములను; చేరి = పొంది; తాన్ = తాను; తాపసేంద్రతతిన్ = మునీంద్రసంఘములను; బలిమిని = బలాత్కారముచేత; పట్టి = పట్టుకొని; వధించున్ = హింసించును; తత్ = ఆమునీశ్వరులయొక్క; ఊర్జిత = ఉత్కృష్టములగు; అధ్వర=యజ్ఞసంబంధమైన; జ్వలనములు = అగ్నులను; ఆర్పన్ = ఆర్పుటకు; అనివారిత = ఆటంకము లేని; శోణిత = రక్త మనెడు; వారి = నీటియొక్క; ధారలన్ = ధారలను; చేయున్ = కలిగించును.

తే. ధీరచక్రంబుల నడంచు, ॥సారసవన
హననసృతిఁ బొల్చు, భూరిదోషానువృత్తి
నెనసి చెలరేఁగు, నాదాన॥వేంద్రుఁ డవని
నవియ కావె తమిస్రని॥ర్వ్యాజగతులు. 142

టీక: ఇందుఁ దమిస్రాసురపరమైన యర్థము, నంధకారపరమైన యర్థముఁ గలుగును.

ఆదానవేంద్రుఁడు = ఆరాక్షసుఁడు; ధీరచక్రంబులన్ = విద్వన్మండలములను, ధీరము లయిన జక్కవల నని యర్థాంతరము; అడంచున్ = అడఁగఁజేయును; సారసవనహననసృతిన్ – సార=శ్రేష్ఠము లగు, సవన= యజ్ఞములయొక్క,హననసృతిన్ =

హింసామార్గమందు, పొల్చున్ = ఒప్పును; సారస=పద్మములయొక్క, వన=వనములయొక్క, హననస్మృతిని బొల్చు నని యర్థాంతరము; భూరిదోషానువృత్తిన్ = అనేక పాతకములయొక్క యనుసరణమును, అధికముగ రాత్రులను గూడుట యని యర్థాంతరము; ఎనసి= పొంది; చెలరేఁగున్ = విజృంభించును; అవనిన్=భూమియందు; తమిస్రనిర్వ్యాజగతులు – తమిస్ర= తమిస్రుఁడను రాక్షసునియొక్క, చీకటియొక్క యని యర్థాంతరము, నిర్వ్యాజగతులు= స్వాభావికవ్యాపారములు; అవియ కావె = అట్టివె కావా, అనఁగా చీకటి యేరీతి చక్రవాకముల నడఁచి, తామరతోఁటలను భంగపఱచి, రాత్రి ననుసరించి యుండునో, యట్లు తమిస్రాసురుఁడును విద్వన్మండలి నడఁచి, శ్రేష్ఠయజ్ఞములను భంగపఱచి, మిక్కిలి పాపమార్గము ననుసరించి యున్నాడని భావము. ప్రస్తుతతమిస్రునకు, అప్రస్తుతాంధకారమునకును నౌపమ్యము గమ్యము. 'తమిస్రం తిమిరం తమః' అని యమరుఁడు.

చ. ధరణిపచంద్ర!తద్దనుజ◊దౌష్ట్యమునన్ సకలర్షినాయకా
ధ్వరములకున్, మహాజపితృ◊వారజపంబులకున్, వ్రతివ్రతో
త్కరములకుం, దపస్విసము◊దాయతపంబులకున్, సురేంద్రదు
స్తరవిఘ్నముల్ వొడమ◊సాగెఁ జుమీ బహుకాల మెంతయున్. 143

టీక: ధరణిపచంద్ర = రాజచంద్రుఁడా, తద్దనుజదౌష్ట్యమునన్ =ఆతమిస్రాసురునిదుష్టత్వముచేత; సకలర్షినాయక= ఎల్ల మునీంద్రులయొక్క, అధ్వరములకున్ = యజ్ఞములకు, మహత్=అధికమగు, జపితృవార=జపముఁ జేయువారి గుంపులయొక్క, జపంబులకున్ = జపములకు, వ్రతి=బ్రహ్మచారులయొక్క, వ్రతోత్కరములకున్= నియమజాతములకు, తపస్వి=తాపసులయొక్క, సముదాయ = సమూహముయొక్క, తపంబులకున్ = తపస్సులకు, సురేంద్ర = ఇంద్రునకు, దుస్తరతర = వారింపరాని, విఘ్నముల్ = ఆటంకములు, ఎంతయున్ = మిక్కిలి, బహుకాలము=దీర్ఘకాలము, పొడమసాగెఁ జుమీ = ఉదయింపసాగెఁ జుమా.

చ. అనుపమతైక్ష్ణ్యసంచితగ◊వాళి సురారి హరింతు, మైన మా
యనఘమహాతపోర్జితమ◊హంబు వ్యయం బగు నంచుఁ దన్మతిం
గనము; గవాళి నయ్యసుర◊కాంతు హరింపుము భూప! యైన నీ
యనఘ మహాతపోర్జితమ◊హం బలఘుత్వము నొందుఁ గావునన్. 144

టీక: అనుపమతైక్ష్ణ్యసంచితగవాళిన్ – అనుపమ = నిరుపమాన మైన, తైక్ష్ణ్య = ఉగ్రతచేత, సంచిత = సంపాదింపఁబడిన, గవాళిన్ = వాక్పరంపరలచేత, శాపరూపము లైన వాక్పరంపరలచే ననుట; సురారిన్ = రక్కసుని; హరింతుము = సంహరింతుము; ఐనన్ = అట్లయినయెడల; మా అనఘమహాతపోర్జితమహంబు – మా = మాయొక్క, అనఘ =నిర్దోష మైన, మహాతపః = అధికతపముచేత, ఆర్జిత=సంపాదింపఁబడిన, మహంబు =తేజస్సు; వ్యయం బగు నంచున్ = నష్టమగు ననుచు; తన్మతిన్ = అట్టి బుద్ధిని; కనము= చూడము, అనఁగా వాని సంహారము చేయుటకు యత్నింప మనుట; గవాళిన్ = బాణపరంపరలచేత; అయ్యసురకాంతున్ = ఆరాక్షసనాథుని; హరింపుము = సంహరింపుము; భూప=సుచంద్రుఁడా; ఐనన్= అట్లైన

యెడల; నీ = నీయొక్క; అనఘ = ఒచ్చెము లేని; మహత్ =అధికమైన; ఆతప=ఎండవలె; ఊర్జిత = ఊర్జితమైన; మహంబు = ప్రతాపము; అలఘుత్వమున్= ఆధిక్యమును; ఒందున్ కావునన్=పొందును గాబట్టి, వానిని సంహరింపు మని వెనుక కన్వయము. యమకాలంకారభేదము.

మ. అఖిలాస్త్రైకవిధానశాలివి, సప◊త్నాధీశమాయాతమి
స్రఖరాంశుండవు, జన్యభూవిహృతి◊సారజ్ఞుండ, వీ వౌట స
ర్వఖలధ్వంసనదక్ష! యాదనుజు సం◊గ్రామోర్వి బాణోద్భవ
చ్ఛిఖిఁ గూల్పం దగు దీవె, పూనుము మన◊స్థ్సేమంబుఁ దద్వృత్తికిన్. 145

టీక: సర్వఖలధ్వంసనదక్ష = సకలదుష్టసంహారమునందు దక్షుండ వగు సుచంద్రుఁడా! అఖిలాస్త్రైకవిధానశాలివి – అఖిలాస్త్ర = సకలవిధాస్త్రములయొక్క,ఏక=ముఖ్య మగు, విధానశాలివి = విధిచే నొప్పువాఁడవు; సపత్నాధీశమాయాతమిస్రఖరాంశుండవు – సపత్నాధీశ = శత్రుశ్రేష్ఠుం డగు; మాయాతమిస్ర = మాయావి యగు తమిస్రాసురు డను చీకటికి, కాదేని శత్రుశ్రేష్ఠునిమాయ యను చీకటికి, ఖరాంశుండవు = సూర్యుండవు; జన్యభూవిహృతిసారజ్ఞుండవు – జన్యభూ =యుద్ధభూమియందలి; విహృతి సారజ్ఞుండవు =విహారముయొక్క సారము నెఱింగినవాఁడవు; ఈ వౌటన్ = నీ వగుటవలన; సంగ్రామోర్విన్=యుద్ధభూమి యందు; బాణోద్భవచ్ఛిఖిన్ = బాణమువలనఁ బుట్టు నగ్నిచేత; ఆదనుజున్ = ఆరాక్షసుని; ఈవె కూల్పం దగుదువు = నీవె సంహరింప సమర్థుఁడవు; తద్వృత్తికిన్ = ఆ యసురసంహారవృత్తికి; మనస్థ్సేమంబున్ = మనస్స్థైర్యమును; పూనుము = వహింపుము.

క. అని పల్కన్ నృపతి దయా
ధుని సిల్కం బలుకువాలు◊దొరలం గడుఁ బా
యని యల్కం దూల్చు పలా
దునిఁ జుల్కం జేసి నియమి◊తో నిట్లనియెన్. 146

టీక: అని పల్కన్ = ఇట్లు శాండిల్యుఁడు పల్కఁగా; నృపతి = సుచంద్రుఁడు; దయాధుని =దయానది; చిల్కన్ = చిందునట్లు గా, దీని కిట్లనియెన్ అను క్రియతో నన్వయము; పలుకువాలుదొరలన్ = శాపరూపవాక్కు లాయుధముగాఁ గల ప్రభువులను, అనఁగా మునిశ్రేష్ఠులను; కడున్ = మిక్కిలి; పాయని యల్కన్ = వీడని కోపముచేత; తూల్చు పలాదునిన్ = సంహరించు క్రవ్యాదుని; చుల్కంజేసి = లఘువుగా నెంచి; నియమితోన్ = మునితోడ; ఇట్లనియెన్ = వక్ష్యమాణప్రకారముగఁ బలికెను.

చ. పుడమిన్నృపాలు రబ్బురముఁ ◊బూన, బలంబులతోడ నీదువెం
బడి నరుదెంచి రాత్రిచర◊బంధునిఁ గూల్చెద, నంత యేల యి
య్యెడ నలదానవుం డనఁగ ◊నెంత, భవత్కృప వాఁడు నా కసా
ధ్యుఁడె, హరి గాచియున్న, హరు◊తో రణమేదిని కేఁగుదెంచినన్. 147

టీక: పుడమిన్ =భూమియందు; నృపాలురు = రాజులు; అబ్బురమున్ = ఆశ్చర్యమును; పూనన్ = వహింపఁగా; బలంబుల తోడ =సైన్యములతోడ; నీదువెంబడిన్ = నీవెంట; అరుదెంచి = వచ్చి; రాత్రించరబంధునిన్ = రాక్షసబంధు వగు నా తమిస్రుని; ఇయ్యెడన్ = ఇప్పుడు; కూల్చెదన్ = సంహరించె దను; అంత యేల = అంత చెప్పనేల; అలదానవుం డనఁగ నెంత = ఆ రాక్షసుం డనఁగా నెంత; భవత్కృపన్ = మీయొక్క దయచే; హరి గాచియున్నన్ = విష్ణువు రక్షించి యున్నను; హరుతోన్ = శివునితోడ; రణమేదినికిన్ = యుద్ధభూమికి; ఏఁగుదెంచినన్=వచ్చినను; నాకున్, వాఁడు = ఆరాక్షసుండు; అసాధ్యుఁడె= సాధింప నలవి కానివాఁడా?

మ. దనుభూభారవిముక్తి గోతలము సెం◊దన్, గోతలాప్తిన్ సుప
ర్వనికాయం బెనయన్, సుపర్వయుతి శ◊శ్వత్సద్వితానంబులుం
దనరం, బాయని సద్వితానముల నా◊నామౌనిగేహంబు లె
చ్చ, నవాస్త్రావళిఁ గూల్తుఁదత్సురరిపు◊స్వామిన్ రణాస్యంబునన్. 148

టీక: గోతలము=భూతలము; దనుభూ = రాక్షసులయొక్క; భారవిముక్తిన్ = భారమోక్షమును; చెందన్= పొందఁగా; సుపర్వనికాయంబు = దేవతలసమూహము; గోతలాప్తిన్ = స్వర్గతలప్రాప్తిని; ఎనయన్ = పొందఁగా; సుపర్వయుతిన్ = మంచిపర్వముయొక్క యోగముచేత; శశ్వత్సద్వితానంబులున్= సంతతములైశ్రేష్ఠము లగు యజ్ఞములు, 'వితానో యజ్ఞ విస్తార లోభేషు' అని విశ్వము; తనరన్ = ఒప్పఁగా; పాయని = ఎడయని; సద్వితానములన్ = విద్వత్కదంబములతోడ; నానామౌనిగేహంబులు = అనేకమునిగృహములు; ఎచ్చన్ = మించఁగా; రణాస్యంబునన్ = యుద్ధముఖమందు; తత్సుర రిపుస్వామిన్ = ఆ దేవారిరాజగు రక్కసుని; నవాస్త్రాళిన్ = నూతనమగు నస్త్రముల గుంపులచేత; కూల్తున్ = సంహరింతును. తాత్పర్యము స్పష్టము. ఏకావళీ, కారణమాలాలంకృతులు. 'శ్లో. గృహీతముక్తరీత్యార్థశ్రేణి రేకావళీ మతా, గుమ్ఫః కారణ మాలా స్యా ద్యథా ప్రాక్ప్రాన్తకారణైః' అని లక్షణము.

తే. యమికులమహేంద్ర! యిది కార్య ◊మనుచు నొక్క
శిష్యుఁ బనిచిన వచ్చి, యా◊శివిషోప
మాశుగాళి సురారాతి ◊ నవనిఁ గూలి
చెదను, మీ రింతపనికి వి◊చ్చేయఁదగునె. 149

టీక: యమికులమహేంద్ర =మునికులరాజవైన శాండిల్యుఁడా; ఇది కార్య మనుచున్ = ఇదికర్తవ్యంబని; ఒక్క శిష్యుఁబనిచినన్ =ఒక్క యంతేవాసిని బంపినను; వచ్చి= నేనంతవఱకు వచ్చి; ఆశీవిష=సర్పములకు; ఉపమ=తుల్యము లగు; ఆశుగ=బాణములయొక్క; ఆళిన్ = పంక్తులచేత; సురారాతిన్ = దేవతలకు శత్రువైన రక్కసుని; అవనిన్ =భూమియందు; కూలిచెదను = పడవైతును; మీరు = మహర్షి శ్రేష్ఠులైన మీరు; ఇంతపనికిన్=ఇట్టి స్వల్పకార్యమునకు; విచ్చేయన్ = వచ్చుటకు; తగునె= తగి నట్టిదా.

చ. అని విభుఁ డమ్మునీశు విన◊యంబునఁ బూజన మూన్చి, భక్తిచే
ననిచి, నిజాప్తమంత్రిజన◊తైకవచోగతి సమ్మదం బెదం
దనరఁగ, నాత్మదివ్యపృత◊నానికరంబుల రా ఘటించి, తా
నెనపె జయప్రయాణనియ◊తైహికమానసవీథి నంతటన్. 150

టీక: అని = ఈప్రకారము వచించి; విభుఁడు = సుచంద్రుఁడు; అమ్మునీశున్ = ఆశాండిల్యుని; వినయంబునన్ = అడఁకువతోడ; పూజనము = అర్చనము; ఊన్చి=చేసి; భక్తిచేన్ = భక్తిచేత; అనిచి = పంపి; నిజ = తనయొక్క; ఆప్త=హితులయొక్కయు; మంత్రిజనతా=మంత్రిసమూహముయొక్కయు; ఏక=ముఖ్యమగు; వచోగతిన్ = వాగ్రీతిచేత; సమ్మదంబు = సంతసము; ఎదన్ = హృదయమునందు; తనరఁగన్=ఒప్పఁగా; ఆత్మ=తనయొక్క; దివ్యపృతనా =దివ్యసేనలయొక్క; నికరంబులన్=సమూహములను; రాన్=వచ్చునట్లు; ఘటించి=చేసి; తాన్ = తాను; జయప్రయాణ=విజయయాత్రయందు; నియతైహికన్ = నియతాభిలాషను, ఈహాశబ్దముపై కప్ప్రత్యయము; మానసవీథిన్=మనోవిథిని; అంతటన్=ఎల్లెడల; ఎనపెన్= వ్యాపింపఁ జేసెను. జయప్రయాణమునకు నిశ్చలచిత్తుం డయ్యె ననుట.

మ. గళదర్కంబుఁ, బనీపతత్కుజము, రిం◊ఖద్గోత్రగోత్రంబుఁ, జా
చలదుర్వీవలయంబు, ఫక్కదఖిలా◊శాకంబు, భిద్యన్నభ
స్థ్సలమేఘౌఘము, భ్రశ్యదృక్షము, రణ◊త్పద్మాసనాండంబు నై
యలరెం దన్మహిపాలజైత్రగమబం◊భారావ మప్పట్టునన్. 151

టీక: అప్పట్టునన్ = ఆసమయమందు; తన్మహిపాలజైత్రగమబంభారావము – తన్మహిపాల = ఆసుచంద్రునియొక్క, జైత్ర= జయార్థమై, గమ=ప్రస్థానసూచక మగు, 'ప్రస్థానం గమనం గమః' అని యమరుఁడు, బంభా=భేరియొక్క, 'బమ్భా భేర్యామ్' అని అమరశేషము, ఆరావము = ధ్వని; గళత్ అర్కంబున్ = పడుచున్న సూర్యుఁడు గలదియు; పనీపతత్ కుజమున్ = మిక్కిలి కూలుచున్న వృక్షములు గలదియు, పనీపతచ్ఛబ్దము యఙ్లుగంతము; రింఖత్ గోత్రగోత్రంబున్ = ఎగిరిపడుచున్న గిరిసంఘములు గలదియు; చాచలత్ ఉర్వీవలయంబున్ = మిక్కిలి చలించుచున్న భూవలయము గలదియు; ఫక్కత్ అఖిలాశాకంబున్=పగులుచున్న సకలదిక్కులు గలదియు, ఆశాశబ్దాంతబహువ్రీహిమీఁద కప్ప్రత్యయము, 'ఆపోన్యతరస్యామ్' అని వికల్పముచేత హ్రస్వము లేదు; భిద్యత్ నభస్థలమేఘౌఘమున్ = చీలుచున్న గగనస్థలమందలి మేఘములగుంపు గలదియు; భ్రశ్యత్ ఋక్షమున్=పుడమిని వ్రాలుచున్న రిక్కలు గలదియు, భ్రంశు అధఃపతనే యనుటచేత భ్రంశుధాతు వధఃపతనార్థకంబు; రణత్ పద్మాసనాండంబున్=మ్రోఁగుచున్న బ్రహ్మాండంబు గలదియు; ఐ, అలరెన్=ఒప్పెను. అత్యుక్త్యలంకారము.

సీ. సితకాండజాతసం◊గతి విరాజిల్లుటఁ, జక్రాంగ మగుటకు ◊సందియంబె,
చారుసూనవితాన◊సంయుక్తి వెలయుట, స్యందనం బగుటకు సందియంబె,
వరవైజయంతికా◊పరిషక్తి నొప్పుటఁ, జక్రిదా నగుటకు ◊సందియంబె,

సుకరయుగాదికాంగకలబ్ధిఁ దనరుట, సద్రథం బగుటకు సందియంబె,

తే. హరిభయంకరభూరిధామాప్తి మనుట, జగతి నిది తార్క్ష్యమగుటకు సందియంబె

యనఁగఁ బొగడొందు రత్నశతాంగ మప్పు, డధిపుకనుసన్నఁదెచ్చె నియంత యొకఁడు. 152

టీక: ఇందు రథము వర్ణింపఁబడుచున్నది. ఎట్లనిన: సితకాండజాతసంగతిన్– సిత=తెల్లనైన, కాండ=గుఱ్ఱములయొక్క. జాత= గుంపుయొక్క, సంగతిన్ = సంబంధముచేత; సిత= తెల్లనగు, కాండజాత=తామరలయొక్క, సంగతిచేత నని యర్థాంతరము; విరాజిల్లుటన్ = ప్రకాశించుటచేత; చక్రాంగము=రథము, హంసము అని యర్థాంతరము; అగుటకున్, సందియంబె = సందేహము లేదనుట.

చారుసూనవితానసంయుక్తిన్– చారు=మనోజ్ఞము లగు, సూనవితాన=పువ్వులచప్పరముయొక్క, సంయుక్తిన్ =సంబంధముచేత, మనోజ్ఞకుసుమసంఘముచేత నని యర్థాంతరము; వెలయుటన్ = ప్రకాశించుటచేత; స్యందనం బగుటకున్ = రథమగుటకు, నెమ్మిచెట్టగుట కని యర్థాంతరము; సందియంబె = సందేహము లేదనుట.

వరవైజయంతికాపరిషక్తి నొప్పుటన్ = శ్రేష్ఠము లగు పతాకలయొక్క సంబంధముచేత నొప్పుటచే, శ్రేష్ఠ మగు వనమాలికయొక్క సంబంధముచే నొప్పుటచే నని యర్థాంతరము; తాన్=తాను; చక్రి అగుటకున్ = రథ మగుటకు, విష్ణు వగుటకు; సందియంబె = సందేహమా, సందేహము లే దనుట.

సుకరయుగాదికాంగకలబ్ధిన్ తనరుటన్–సుకర=అనుకూలమగు, యుగ=కాఁడి, ఆదిక=మొదలుగాఁగల, అంగక=అంగములయొక్క, లబ్ధిన్ = లాభముచేత, తనరుటన్ = ఒప్పుటచేత; సమీచీన మైన హస్తద్వయము మొదలగు నంగములతోఁ గూడి తనరుటచేత నని యర్థాంతరము; సద్రథంబు = మంచితేరు, మంచి శరీర మని యర్థాంతరము, ‘రథో దేహే స్యందనే చ’ అని రత్నమాల; అగుటకు సందియంబె = అగుటకు సందేహము లేదనుట.

హరిభయంకరభూరిధామాప్తిన్– హరి=సూర్యునకు, భయంకర= భయమును జేయు, భూరి= అధిక మగు, ‘భూరి ప్రాజ్య సువర్ణయోః’ అని విశ్వము, ధామ=తేజముయొక్క, ఆప్తిన్ = కూడికచేత; మనుటన్ = వృద్ధిఁబొందుటచేత; జగతిన్ = లోకమందు; ఇది = ఈరథము; తార్క్ష్యము = అశ్వములు గలది, తార్క్ష్యశబ్దముపై నర్శ ఆద్యచ్ ప్రత్యయము, గరుత్మంతుఁడని యర్థాంతరము; అగుటకుసందియంబె = అగుటకు సందేహము లేదనుట;

అనఁగన్ = ఇట్లని; పొగడొందు = పొగడ్తను గాంచుచున్న; రత్నశతాంగము = రత్నఖచిత మగు రథము; అప్పుడు= ఆ జయభేరీనినాదావసరమున; అధిపుకనుసన్నన్ = రాజునేత్రసంజ్ఞచేత; నియంత యొకఁడు = ఒక సూతుండు; తెచ్చెన్ = తీసికొని వచ్చెను. ఈపద్యమందు రథము విషయభేదముచే నానారూపముగ లోకముచేత నుల్లేఖింపఁబడుటం జేసి యుల్లేఖాలంకారభేదము. ‘శ్లో. ఏకేన బహుధోల్లేఖే ప్యసౌ విషయభేదతః’ అని తల్లక్షణము. లోకులచేత నని యుల్లేఖకర్తృబహుత్వము వివక్షిత మగు నేని, ‘శ్లో. బహుభి ర్బహుధోల్లేఖాదేకస్యోల్లేఖ ఇష్యతే’ అని యుల్లేఖాలంకారభేద మగును.

చ. తొడవులు మేటిమేనిజిగితో నిగుడం, గుడివంకఁ గెంపురా

పిడియము దోఁప, బంధునృపబృందము లందఱు నివ్వటిల్ల వెం

బడి నెడ యీక రాఁ, దళుకు౦బంగరుఁజేల యొకింత జీరఁగా,
వెడలె హజార మానృపతి ౦విప్రయుగంబును దృష్టి నాఁగుచున్. 153

టీక: ఆనృపతి = ఆసుచంద్రుఁడు; తొడవులు =భూషణములు; మేటిమేనిజిగితోన్ = శ్రేష్ఠమగు దేహకాంతితోడ; నిగుడన్ = వ్యాపింపఁగా; కుడివంకన్ = కుడిప్రక్కను; కెంపురాపిడియము = పద్మరాగమణిమయ మగు బాకు; తోఁపన్ = అగపడు చుండఁగా; బంధునృపబృందములు=బంధునృపాలురసముదాయములు; అందఱున్=ఎల్లరు; నివ్వటిల్లన్=అతిశయించు నట్లుగా; వెంబడిన్=వెంట; ఎడ యీక = పిక్కటిల్లునట్లుగా; రాన్ =రాఁగా; తళుకుబంగరుఁజేల =ప్రకాశించు కనకచేలము; ఒకింత జీరఁగాన్=ఇంచుక జీరాడఁగా; విప్రయుగంబును= బ్రాహ్మణద్వయమును; దృష్టిన్=చూపుచే; ఆఁగుచున్=అడ్డగించుచు, అనఁగా దృష్టిగోచరముగా బ్రాహ్మణయుగ్మమును జేయుచు నని భావము, 'శ్లో.కన్యా గౌర్భేరి శంఖం దధి ఫల కుసుమం పావకం దీప్యమానం యానం వా విప్రయుగ్మం హయ గజ వృషభం పూర్ణకుమ్భద్వయం చ' అని మొదలుగా జ్యోతిషశాస్త్రీయశకునాధ్యాయమందు బ్రాహ్మణయుగ్మదర్శనము ప్రస్థితులకు మంగళకర మని చెప్పఁ బడినది; హజారము= కొలువుకూటము; వెడలెన్=బయలుదేఱెను.

చ. కొలు విపు డబ్బె నంచు బలు౦కోర్కి మహీశులు నిల్చి కొల్వుమ్రొ
క్కులు ఘటియించి రప్పతి క౦కుంతకలధ్వనివేత్రు లంగరా
ట్కులుఁడు పరా కితం డతఁడు ౦కోసలనేత పరా కితండు కే
రలుఁడు పరా కతండు కురు౦రాజు పరా కని యుగ్గడింపఁగన్. 154

టీక: మహీశులు =రాజులు; కొలు విపు డబ్బె నంచున్ = ఇపుడు సుచంద్రుని సేవ ఘటించె ననుచు; నిల్చి = నిల్చుకొని; అప్పతికిన్=ఆరాజునకు; వేత్రులు=వేత్రధారులు, అనఁగా బెత్తపువారు, వేత్రశబ్దము మీఁద మత్వర్థీయేని ప్రత్యయము; అకుంత కల ధ్వనిన్=నిరర్గళమధురశబ్దముతో; ఇతండు=మ్రొక్కుచున్న యీ ప్రభువు; అంగరాట్కులుఁడు=అంగదేశాధీశ్వరవంశ్యుఁడు; పరాకు=తత్పరుఁడవు గమ్ము; అతఁడు = ప్రణమిల్లువున్న యాతండు; కోసలనేత =కోసలాధీశుఁడు; పరాకు; ఇతండు = నమస్కరించుచున్న యీ రాజు; కేరలుఁడు = కేరళదేశాధీశుఁడు; పరాకు; అతండు = నతి నొనర్చు నా నరపతి; కురురాజు = కురుదేశాధీశుఁడు; పరాకు=హెచ్చరిక పడుము; అని ఉగ్గడింపఁగన్ = అనుచు శబ్దించుచుండఁగా; బలు కోర్కి =మిక్కిలి యాసక్తితో; కొల్వుమ్రొక్కులు =కొలువు ప్రణామములు; ఘటియించిరి=చేసిరి.

మ. నృపరత్నంబు వినీతసూతతిలకా౦నీతప్రియస్యందనం
బపు డింపెచ్చఁగ నెక్కి యొప్పె మఘవా౦శాద్రిం గనం బొల్చు పూ
ర్ణపయోజారి యనన్, బుధావళి నవా౦నందంబుచేఁ జూడ, న
భ్రపదం బాఁగుచు వాహినీశ్వరమహా౦భంగార్భటుల్ హెచ్చఁగన్. 155

టీక: నృపరత్నంబు = నృపశ్రేష్ఠుండగు సుచంద్రుఁడు; వినీతసూతతిలకానీతప్రియస్యందనంబు – వినీత = వినయవంతుఁడైన, సూతతిలక=ఉత్తమసారథిచేత; ఆనీత=తేబడిన; ప్రియస్యందనంబు = ప్రియమగు రథమును; ఇంపెచ్చఁగన్= ప్రీతి హెచ్చఁగా; ఎక్కి = అధిరోహించి; అపుడు=ఆసమయమున; కనన్= చూడఁగా; మఘవాశాద్రిన్ = ఉదయగిరియందు; పొల్చు=ఒప్పునట్టి; పూర్ణపయోజారి యనన్= పూర్ణచంద్రుఁడో యన్నట్లుగా, దీనికి ఒప్పె నను క్రియతో నన్వయము; బుధావళి=పండితమండలి, దేవసంఘ మని యర్థాంతరము; నవానందంబుచేన్=తత్కాలోల్లసితానందముచేత; చూడన్=అవలోకింపఁగా; అభ్రపదంబు= గగనతలమును; ఆఁగుచున్ = అడ్డగించుచు; వాహినీశ్వరమహాభంగారభటుల్ – వాహినీశ్వర =సేనాధిపతుల యొక్క, మహత్=అధికమైన, అభంగ = అవిచ్ఛిన్నము లైన, ఆర్భటుల్ = శబ్దములు, అని రాజపరమైన యర్థము; వాహినీశ్వర= సముద్రముయొక్క, మహాభంగ=పెద్దతరఁగలయొక్క, ఆర్భటుల్ = శబ్దము లని చంద్రపరమైన యర్థము; హెచ్చఁగన్ = అతిశయింపఁగా; ఒప్పెన్=ప్రకాశించెను.

అనఁగా సుచంద్రనృపతి రథారూఢుం డై, బుధులు మోదముతోఁ దన్నవలోకించుచుండఁగా, సేనానాయకార్భటులు హెచ్చుచుండఁగా, నుదయగిరి నధిరోహించి దేవతలు ప్రీతితో దన్నవలోకించుచుండఁగా సముద్రతరంగధ్వను లెచ్చుచుండఁగా మించు పూర్ణచంద్రునివలె భాసించె నని భావము. రూపకాలంకారభేదము. 'తద్రూపక మభేదోయ ఉపమానోపమేయయోః' అని కావ్యప్రకాశమందుఁ దల్లక్షణము.

వ. ఇట్టు లాలోకమిత్త్రుం డహీన భూరి ప్రగ్రహ ప్రకాండ పరిస్యూతంబును, నఖిల సన్మణి ప్రకర వర్ణనీయ ప్రభా భాసమానైక చక్ర సముపేతంబును, నాశుగ మార్గాతి క్రమణ చణ వేగవ దసమావదాత తురంగ సంయోజితంబును, నమర వినుతాభిరామ ధామారుణ సారథి విభ్రాజితంబునునై విరాజిల్లు శతాంగరాజం బారోహించి, యాత్మీయ భక్తిభావ సంసక్త చిత్తంబున నడరు చక్రకాంత చక్రంబులం గటాక్షించుచు నని వార్య రసవిశేష విలసిత పద్మినీ సందోహంబుల కామోదంబుఁ గూర్చుసొంపునం బెంపొందుచు, నఖండ రాజమండల తేజోగౌరవంబు నిజ తేజో మహిమంబున సంపాదించుచు, నక్షీణ దస్యు వీక్షణ సమ్మద విక్షేపకాక్షుద్ర కరకాండ చండిమంబునఁ జూపట్టుచు, నఖర్వ శార్వర మాహాత్మ్య నిర్వాప ణోల్లాసంబున వెడలె నయ్యెడ. 156

టీక: ఇట్టులు=ఈప్రకారముగా; ఆలోకమిత్త్రుండు = ఆ లోకహితుం డగు సుచంద్రుఁడు, 'ఖద్యోతో లోకబాన్ధవః' అనుటచేత సూర్యుఁ డను నర్థాంతరము స్ఫురించును; అహీన = అధికములైన; భూరి=సువర్ణమయము లైన; ప్రగ్రహ=పగ్గములయొక్క; ప్రకాండ =సమూహముచేత; పరిస్యూతంబును=కట్టబడినది యని సుచంద్రపరమైన యర్థము, సర్పశ్రేష్ఠము లనెడు నధికము లైన పగ్గములసమూహముచేఁ గట్టఁబడిన దని సూర్యరథపరమైన యర్థము; అఖిల సన్మణి ప్రకర వర్ణనీయ ప్రభా భాసమా నైక చక్ర సముపేతంబును–అఖిల= సమస్తము లగు, సన్మణి=శ్రేష్ఠములగు మణులయొక్క, సత్పురుషశ్రేష్ఠులయొక్క యని యర్థాంతరము, ప్రకర= గుంపుచేత, వర్ణనీయ=కొనియాడఁ దగిన, ప్రభా =కాంతులచేత, భాసమాన=ప్రకాశమానము లగు, ఏక=ముఖ్య మైన, చక్ర=కండ్లతోడను, సముపేతంబును= యుక్తంబును, భాసమాన మైన యొకకంటితోడ సముపేతంబు అని

సూర్యపరమైన యర్థము; ఆశుగ మార్గాతిక్రమణ చణ వేగవదసమావదాత తురంగ సంయోజితంబును—ఆశుగ=బాణము యొక్క, మార్గ=సరణియొక్క, అతిక్రమణ=అతిక్రమించుటచేత, చణ=ప్రసిద్ధము లైన, వేగవత్ = వేగవంతములగు, అసమ =అసమానములైన, అవదాత=తెల్లనైన, తురంగ= గుఱ్ఱములతోడ, సంయోజితంబును = కూడినదియు, సూర్యరథపరమై నపుడు బేసిసంఖ్య గల పచ్చగుఱ్ఱములతోడ నని యర్థము, 'అవదాత స్సితే పీతే శుద్ధే' అని విశ్వము; అమరవినుతాభిరామ ధామారుణ సారథి విభ్రాజితంబును – అమరవినుత=దేవతలచేఁ గొనియాడఁబడిన, అభిరామ=మనోహర మగు, ధామ= ప్రతాపముచేత, అరుణ=సూర్యతుల్యుఁడగు, సారథి=సూతునిచేత, విభ్రాజితంబును= ప్రకాశించునది యని సుచంద్రరథ పరమైన యర్థము, అమరవినుతమై యభిరామమైన తేజము గల యనూరుఁ డను సారథిచేత విభ్రాజితం బని సూర్యరథపర మైన యర్థము; ఐ = అగుచు; విరాజిల్లు = ప్రకాశిల్లు; శతాంగరాజంబు=పూర్వోక్తగుణవిశిష్ట మైన యుత్తమరథమును; ఆరో హించి= ఎక్కి; ఆత్మీయ భక్తిభావ సంసక్త చిత్తంబునన్– ఆత్మీయ = తన సంబంధి యైన, భక్తిభావ = భక్తి యనెడు భావము చేత, స్వవిషయక మైన భక్తిభావముచేత ననుట, సంసక్త= సంబంధించిన, చిత్తంబునన్= మానసముచేత; రసగంగాధరాద్యలం కారగ్రంథములయందు భక్తికి రసత్వముఁ జెప్పినవారి మతఖండనావసరంబున ' శ్లో. రతి ర్దేవాదివిషయా వ్యభిచారీతథాఞ్జితః, భావః ప్రోక్తః' అనుటచేత, భక్తిని, దేవాదివిషయకరతిభావములోఁ జేర్చినందున, నిట భక్తిభావ యని వచింపఁబడియె. మఱియు ఆత్మీయభక్తిభావ యనుచోట 'శ్లో. జఙ్ఘాకాణ్డోరునాలో నఖకిరణలసత్కేసరాలీకరాలః ప్రత్యగ్రాలక్తకాభాప్రసరకిసలయో మఞ్జు మఞ్జీరభృఙ్గః, భర్తు ర్నృత్తానుకారే జయతి నిజతనుస్వచ్ఛలావణ్యవాపీ సంభూతామ్భోజశోభాం విదధ దభినవోదణ్డ పాదో భవాన్యాః' అను దానియందు భవానీగతనిజప్రతీతి కావలసియుండఁగా దండపాదగతనిజత్వ ప్రతీతి యగుటనుబట్టి విరుద్ధమతి కారిత్వరూపకావ్యదోషము ప్రసరించు నని కావ్యప్రకాశమునందుఁ జెప్పినరీతిగ సుచంద్రగతాత్మీయత్వప్రతీతి కావలసియుండఁ గాఁ జక్రకాంతగతాత్మీయప్రతీతి యగుటవలనఁ బైఁ జెప్పినదోషము ప్రసరించు నని తోఁచును గాని 'నత్వా సాంబం శివం బ్రహ్మ నాగేశః కురుతే' అనుచోట జగన్ని రూపితాంబాత్వప్రతీతివలెఁ బ్రధానభూతక్రియాకర్తృనిరూపితాత్మీయత్వప్రతీతి నవలంబించి నందున నట్టిదోషంబు ప్రసరింప దని యెఱుంగునది. అడరు = ఒప్పునట్టి; చక్రకాంతచక్రంబులన్ = రాష్ట్రాధిపతులయొక్క సంఘములను; చక్ర=చక్రవాకపక్షులయొక్క, కాంత= మనోజ్ఞములగు, చక్రంబులన్=సంఘముల నని యర్థాంతరము; కటా క్షించుచున్=అవలోకించుచు; అనివార్యరసవిశేష విలసితపద్మినీ సందోహంబులకున్ – అనివార్య= అడ్డగింపరాని, రసవిశేష = ఆసక్తివిశేషముచేత, అధికమైన మకరందముచేత నని యర్థాంతరము, విలసిత=ప్రకాశించునట్టి, పద్మినీ= పద్మినీజాతిస్త్రీల యొక్క, తామరతీవలయొక్క యని యర్థాంతరము, సందోహంబులకున్ =గుంపులకు; ఆమోదంబున్ =సంతసమును; కూర్చుసొంపునన్=ఘటింపఁజేయు సౌందర్యమువలన; పెంపొందుచున్ = అతిశయించుచు; అఖండ రాజమండల తేజో గౌరవంబు – అఖండ=అవిచ్ఛిన్నమగు, రాజమండల =నృపసంఘముయొక్క, పూర్ణచంద్రమండలముయొక్క, తేజోగౌర వంబు=ప్రతాపాతిశయము, కాంత్యతిశయము; నిజతేజోమహిమంబునన్ = తనప్రతాపమహిమముచేత; సంపాదించుచున్= కలుగఁజేయుచు; అక్షీణ దస్యు వీక్షణసమ్మదవిక్షేపకాక్షుద్ర కర కాండ చండిమంబునన్– అక్షీణ = తక్కువ గాని, దస్యు= శత్రువులయొక్క, దొంగలయొక్క, వీక్షణ=చూపులయొక్క, సమ్మద=సంతసమునకు, విక్షేపక = నాశకము లగు , పగలు చోరులకు సందర్భము ఘటింపదు గాన దొంగలసంతసమునకు సూర్యతేజము నాశక మనుట, అక్షుద్ర =అధికము లైన, కర= హస్తమందలి,కాండ=బాణములయొక్క, చండిమంబునన్=ఉగ్రతవలన, కరకాండ=కిరణసమూహముయొక్క చండిమం బున నని సూర్యపర మైన యర్థము; చూపట్టుచున్ = అగపడుచు; అఖర్వ శార్వర మాహాత్మ్య నిర్వాపణోల్లాసంబునన్–

అఖర్వ= అధికమగు, శార్వర = శత్రువు లగు రక్కసులయొక్క, చీకటియొక్క యని సూర్యపరమైన యర్థము, మాహాత్మ్య =గొప్పదనముయొక్క, నిర్వాపణ=ప్రశమనమందు, ఉల్లాసంబునన్ =సంతోషముచేత, ప్రకాశముచేత; వెడలెన్=బయలు దేఱెను; అయ్యెడన్=ఆసమయమున. ఇట సూర్యునకు, సుచంద్రునకు నౌపమ్యము గమ్యము గావున నుపమాలంకారధ్వని.

చ. హరిభయకృద్రయాన్వితములై, యభిరూపకలాపజాతభా
స్వరత వహించి, చూడఁదగు వాజివరంబుల నెక్కి రాజశే
ఖరతనయౌఘ మేఁగె మహికాంతుని వెంబడి దివ్యశక్తితో
నరు దగు తారకాత్మదరదాత్మసమాఖ్య బుధుల్ నుతింపఁగన్. 157

టీక: ఈపద్యమందు సుచంద్రపరమైన యర్థముఁ, గుమారస్వామిపరమైన యర్థముఁ గలుగుచున్నది.

హరి భయకృ ద్రయాన్వితములు ఐ– హరి=వాయువునకు, సర్పములకని యర్థాంతరము, భయకృత్ =వెఱపు పుట్టించెడు, రయ=వేగముతోడ, అన్వితములు ఐ =కూడినవై; అభిరూప కలాప జాత భాస్వరతన్– అభిరూప=మనోజ్ఞము లగు, కలాప =భూషణములయొక్క, మనోజ్ఞమగు పింఛముయొక్క యని యర్థాంతరము, 'కలాపో భూషణే బర్హే' అని యమరుఁడు, జాత=కల్గిన, భాస్వరతన్=ప్రకాశమును; వహించి= ధరించి; చూడఁదగు =చూచుట కింపైన; వాజివరంబులన్ = అశ్వరత్నములను, కుమారస్వామిపరమై నపుడు పక్షిశ్రేష్ఠములను, నెమ్మిుల నని భావము; ఎక్కి =అధిరోహించి; రాజశేఖర తనయౌఘము = రాజశ్రేష్ఠుల కుమారసంఘము, చంద్రశేఖరుని కుమారు లైన షణ్ముఖులసంఘ మని ధ్వన్యమానార్థము; దివ్యశక్తితోన్ =అమానుషసామర్థ్యముతో, దివ్య మగు శక్తి యను నాయుధముతో నని స్కందపరమైన యర్థము; అరుదగు తారకాత్మ దరదాత్మసమాఖ్యన్– అరుదగు =ఆశ్చర్యకరమైన; తారకాత్మ=నక్షత్రదేహములను, దర=శంఖమును, ద=ఖండించెడు, ఆత్మసమాఖ్యన్=తనకీర్తిని; తారక=తారకాసురునియొక్క, ఆత్మ=చిత్తమునకు, దరద= భయము నిచ్చెడు, ఆత్మసమాఖ్యన్ = తనపేరిని; బుధుల్ = పెద్దలు, దేవతలు అని స్కందపరమైన యర్థము; నుతింపఁగన్ = కొనియాడఁగా; మహికాంతునివెంబడిన్ = సుచంద్రుని వెంబడి; ఏఁగెన్=చనుదెంచెను.

అనఁగా సర్పములకు భయంకర మగు వేగమును వహించి, మనోహరమగు పింఛమును దాల్చిన మయూరము నెక్కి, శక్త్యాయుధముతోఁ గూడి, తారకాసురాత్మభయంకర మగు తన పేరిని దేవతలు నుతించు చుండఁగా స్కందుండు వెడలినట్లు రాజకుమారులు వాయుభయంకరమైన వేగము గల్గి, మనోహరభూషణములు దాల్చి భాసిల్లు నశ్వరత్నముల నెక్కి, యమానుష మైన బలిమితోఁ గూడి, నక్షత్రశంఖకాంతులను దిరస్కరించు తమకీర్తిని బెద్దలు గొనియాడుచుండఁగా సుచంద్రుని వెంట నేతెంచి రని భావము. ప్రస్తుతాప్రస్తుతోపమాధ్వని యని తెలియునది.

చ. తనుపులకాలిమేలు పయిఁ దార్చిన బంగరుజాలుచాలు చ
క్కనికటిసీమలం దనరు గైరికరేఖలడాలు సాలఁ గ
న్గొన ముద మూన్ప భద్రకరికోటులు వెల్వడె రాజువెంటఁ జ
య్యనఁ బదమేఘగాళితతు లందుకజాలకయుక్తిఁ బూనఁగన్. 158

టీక: భద్రకరికోటులు = భద్రగజసమూహములు; తనుపులకాలిమేలు – తను=శరీరమందలి, పులక = రోమాంచములయొక్క, ఆలి=పంక్తియొక్క, మేలు =అతిశయము; పయిన్=శరీరమందు; తార్చిన బంగరుజాలుచాలు = ఉంచినట్టి బంగరుజాలు యొక్క చాలు; చక్కనికటిసీమలన్ = అందమైన కటిప్రదేశములందు; తనరు గైరికరేఖలడాలు = ఒప్పుచున్న ధాతురేఖల కాంతి; కన్గొనన్ = చూడఁగా; చాలన్=మిక్కిలి; ముదము=సంతసమును; ఊన్పన్=చేయఁగా; చయ్యనన్=వేగముగా; పద = పదములందున్న; మేఘ=మేఘమను మదోదకమును; గాళి(గ+అళి)–గ=పొందినట్టి, అళి=తుమ్మెదలయొక్క; తతులు = గుంపులు; అందుకజాలకయుక్తిన్=నిగళసమూహముయొక్క కూడికను; పూనఁగన్=వహింపఁగా;రాజవెంటన్=సుచంద్రుని వెంబడి; వెల్వడెన్=బయలుదేఱెను.

మ. అమరెం దత్సృతి నేఁగు నీలమయచక్రాంగంబు లింద్రావరో
ధముఁ దప్పించుక ధాత్రిఁ జేరిన సముద్యత్పుష్కలావర్తము
ఖ్యమహామేఘకులంబులో యనఁగఁ జక్కం గాండధారావిశే
షములుం, భూరిమణీశరాసనవిభాజాతంబులుం జూడఁగన్. 159

టీక: తత్సృతిన్=ఆ సుచంద్రుఁడు పోవుదారిని; ఏఁగు =పోవుచున్న; నీలమయ=ఇంద్రనీలమణిమయము లగు; చక్రాంగం బులు=రథములు; ఇంద్రావరోధమున్=ఇంద్రుని యడ్డగింతను; తప్పించుక=వదిలించుకొని; ధాత్రిన్=భూమిని; చేరిన = పొందిన; సముద్యత్=ప్రకాశించుచున్న; పుష్కలావర్తముఖ్య =పుష్కలావర్తము మొదలగు; మహామేఘ=గొప్పమేఘముల యొక్క; కులంబులో యనఁగన్=గుంపులోయనునట్లుగా,దీని కమరెన్ అనుక్రియతోనన్వయము; చక్కన్=బాగుగా; కాండ ధారావిశేషములున్ =గుఱ్ఱాలయొక్క గతివిశేషములను, 'ఆస్కందితం ధౌరితకం రేచితం వల్గితం ప్లుతం గతయోమూః పఞ్చ ధారాః' అని యమరుఁడు, జలధారల విశేషముల నని మేఘపరమైన యర్థము; భూరిమణీ శరాసన విభా జాతంబులున్– భూరిమణీ= అధికమణులు గల, శరాసన=ధనువులయొక్క,ఇంద్రధనువులయొక్క, విభా=విశేషకాంతులయొక్క, జాతం బులన్ =సంఘములను; చూడఁగన్ =అవలోకింపఁగా; అమరెన్=ఒప్పెను. ఉత్ప్రేక్షాలంకారము.

చ. అనఘవిసారపాళియుతి, నంచితశుభ్రశరాప్తిఁ, బుండరీ
కనిచయలబ్ధి, నాగవరకాండనిషక్తిఁ, గనం బొసంగువా
హిని యల యంశుమత్కులమహీశ్వరు వెంబడి నేఁగఁ జొచ్చె న
భ్రనది భగీరథానుసృతిభవ్యరయస్థితి నేఁగుచాడ్పునన్. 160

టీక: ఈపద్యమున సుచంద్రునివెంటఁ జనుసేన భగీరథునివెంటఁ జనుగంగవలె నున్నదని వర్ణించుటం జేసి సేనాభగీరథుల పర మైన యర్థద్వయము గల్గుచున్నది.

అనఘవిసార పాళి యుతిన్– అనఘ=ఒచ్చెములేని, విసార=ప్రసరణము గల, పాళి=టెక్కెములయొక్క, యుతిన్ = సంబం ధముచేత నని సేనాపరమైన యర్థము, అనఘములైన మత్స్యవిశేషములయొక్కగుంపుల చేత నని గంగాపరమైన యర్థము, 'విసార శ్శకులార్భకః' అని యమరుఁడు; అంచిత శుభ్ర శరాప్తిన్– అంచిత = ఒప్పుచున్న, శుభ్ర=నిర్మలము లైనట్టి, శర=

బాణములయొక్క, జలములయొక్కయు,ఆప్తిన్=ప్రాప్తిచేతను; పుండరీకనిచయలబ్ధిన్ = వెల్లగొడుగులగుంపులయొక్క లాభముచేతను, తెల్లతామరల గుంపులయొక్క లాభముచేతను; నాగ వరకాండ నిషక్తిన్ – నాగ=గజములయొక్కయు, వర కాండ=శ్రేష్ఠాశ్వములయొక్కయు, నిషక్తిన్ =సంబంధముచేతను, 'కాణ్డో స్త్రీదణ్డ బాణార్వ వర్గావసర వారిషు' అని యమ రుఁడు; నాగవర=సర్వశ్రేష్ఠములయొక్క, కాండ=సమూహముయొక్క, నిషక్తిన్=సంబంధముచేత నని గంగాపరమైన యర్థము; కనన్=చూచుటకు; పొసంగువాహిని = ఒప్పుచున్న సేన, నది యని యర్థాంతరము దోఁచును; అల యంశుమ త్కుల మహీశ్వరు వెంబడిన్= ఆసూర్యవంశీయుఁడగు సుచంద్రుని వెంబడి; అభ్రనది =ఆకాశగంగ; భగీరథానుసృతి=భగీర థుని ననుసరించినదై; భవ్యరయస్థితిన్=అధికవేగవృత్తిచేత; ఏఁగుచాడ్పునన్ = పోవురీతిగా; ఏఁగఁ జొచ్చెన్=పోవ నారం భించెను; సురనదికి, సేనకు నుపమానోపమేయభావమున నుపమాలంకారము. సుచంద్రునకు, భగీరథునకు బింబప్రతిబింబ భావాదు లూహ్యంబులు. రాజువెంబడి సేన వెడలు చుండఁగా భగీరథచక్రవర్తివెంబడి స్వర్గంగ పోవుచున్న రీతిగా నున్నదని భావము.

చ. కలితమృదంగతుంగరవ◊గర్జ, నటత్త్రిదశీతనుప్రభో
జ్జ్వలచపలాళి యంబుధర◊వర్త్మమునం దగ నాథరేంద్రుపై
నలరెడు మానసంబున మ◊హాశరజాతవినాశ ముర్వరం
దెలుపు ప్రసూనవృష్టి జగ◊తీధరశత్రువు నించె నయ్యెడన్. 161

టీక: కలిత మృదంగ తుంగరవ గర్జ–కలిత=ఒప్పుచున్న, మృదంగ=మృదంగముయొక్క, తుంగరవ= అధికమగు ధ్వని యనెడు, గర్జ=మేఘధ్వనియు; నటత్ త్రిదశీ తనుప్రభోజ్జ్వల చపలాళి – నటత్= నర్తించుచున్న, త్రిదశీ = దేవాంగనలయొక్క, తనుప్రభా=దేహకాంతి యనెడు, ఉజ్జ్వల=ప్రకాశించుచున్న, చపలా=మెఱుపులయొక్క,ఆళి=పంక్తి; అంబుధర వర్త్మము నన్=ఆకసమునందు; తగన్=ఒప్పఁగా; ఆథరేంద్రుపైన్= ఆ సుచం ద్రునిమీఁద, ఆపర్వతముమీఁద నని యర్థాంతరము స్ఫురిం చును; అలరెడు మానసంబునన్ = ఒప్పుచున్న మనస్సుచేత, అతనిపైఁ బ్రీతిచేత ననుట, మానసమను సరోవరమం దని యర్థాం తరధ్వని; ఉర్వరన్=భూమియందు; మహాశర జాత వినాశము–మహత్=ఉత్కృష్టులైన,ఆశర=రాక్షసులయొక్క, జాత= సంఘముయొక్క, వినాశము=క్షయమును; మహత్=ఉత్కృష్టమగు,శరజాత=పద్మములయొక్క వినాశము నని యర్థాంతర ధ్వని; తెలుపు ప్రసూనవృష్టి= తెలియఁజేయుచున్న పుష్పవృష్టి యను వర్షము; అయ్యెడన్=ఆ సమయమందు; జగతీధర శత్రువు=పర్వతారి యైన యింద్రుఁడు; నించెన్ =పూరించెను. పర్వతములయందు మేఘము జలము వర్షించురీతి నింద్రుఁడు సుచంద్రునిపైఁ బ్రీతితోఁ బుష్పముల వర్షించె నని భావము.

చ. అలయజరాపగన్ రవికు◊లాధిపుపార్శ్వగవాహపాశ్వని
స్తులగతిజైలధూళివిత◊తుల్ విరళోదయ గాఁగ ఘటింపఁ ద
ద్బలవిచరద్గజేశకర◊పాళి నిజామితశీకరాంబుమం
డలిని రసోదయస్థితిఁ బె◊నంగఁగ నెంతయుఁ దార్చెఁ జిత్రతన్. 162

టీక: అల యజరాపగన్ =ఆవిశాలపురి చెంత నున్న గంగను; రవికులాధిపు పార్శ్వ గ వాహపాశ్వ నిస్తులగతి జైల ధూళి వితతుల్– రవికులాధిపు=సుచంద్రునియొక్క, పార్శ్వ=ప్రక్కలను, గ=పొందినట్టి, వాహప = రౌతులయొక్కయు, అశ్వ= గుఱ్ఱములయొక్కయు, నిస్తులగతి =అసమానమైన గమనమువలన, జ= పుట్టిన, ఐల=ఇలాసంబంధ మగు, ఇల యనఁగా భూమి, 'గౌరిలా కుమ్భినీ క్షమా' అని యమరుఁడు; ధూళి=పరాగములయొక్క, వితతుల్= గుంపులు; విరళోదయ గాఁగన్ =కొంచ మైన యావిర్భావము గలదానిఁగా, తక్కువగా ననుట; ఘటింపన్ =చేయఁగా; తద్బల విచర ద్గజేశ కరపాళి–తత్= ఆసుచంద్రునియొక్క,బల=సైన్యమందు, విచరత్=సంచరించుచున్న, గజేశ=కరిశ్రేష్ఠములయొక్క,కర=తుండములయొక్క, పాళి=పంక్తి; నిజామిత శీకరాంబు మండలిన్ – నిజ=స్వకీయము లగు, అమిత=అధికము లగు, శీకరాంబు=నీటితుంపరల యొక్క, మండలిన్=సమూహముచేత; రసోదయస్థితిన్—రస=నీటియొక్క, ఉదయ= ఆవిర్భావముయొక్క, స్థితిన్=ఉనికి చేత; పెనంగఁగన్=కూడునట్లు; చిత్రతన్ = ఆశ్చర్యముచేత; ఎంతయున్=మిక్కిలి; తార్చెన్= చేసెను. ఆశ్చర్యకరమగు రీతిగాఁ జేసె ననుట. ఇచట విరళోదయ గాఁగ ఘటింప ననుచోట విగత మైన రేఫము గల లకారము యొక్క యుదయము గల దానిఁగా నని యర్థమువలన అజరాపగ యనుచోట రేఫముపోయి దానిస్థానమందు లకార ముదయించఁగా అజరాపగ అజలాపగ యగు ననియు, అంబుమండలిని రసోదయస్థితి అనుచోట అంబుమండలి నిరసోదయస్థితి యని పదవిభాగము చేసి, నిర్=గతమైన, అ=అకారముగల, స=సకారముయొక్క ఉదయస్థితిచేత నని యర్థము చేయుటవలన అజరాపగశబ్ద ములో అకారము పోయి దాని స్థానమందు సకార ముదయింపఁగా అజరాపగ సజలాపగ అగు ననియు చిత్రత నెఱుంగునది. ఈపద్యమందు 'శ్లో. రాజం త్సప్తాత్యకూపారా స్త్వత్ప్రతాపాగ్ని శోషితాః, పున స్త్వదరినారీణాం బాష్పపూరేణ పూరితాః' అను శ్లోకమందుబలె నత్యుక్త్యలంకారము.

చ. అతులితవైజయంతయుతి, ◊నంచితసాగరజాతదంతిసం
గతి, ఘనచక్రిసంభృతి, న◊ఖండితవైభవదేవనాయకా
యతిఁ, దనరారు నానృపబ◊లాళి యెసంగె ధరిత్రి జంగమ
స్థితిఁ జరియించులేఖపురి◊చెల్వునఁ జూపఱ కింపు నింపుచున్. 163

టీక: ఇందు సేనాపరమైన యర్థము, అమరావతీపరమైన యర్థములు గలుగుచున్నవి. అతులితవైజయంతయుతిన్ – అతులిత =సాటిలేని, వైజయంత=టెక్కెములయొక్క, యుతిన్ = సంబంధముచేత నని సేనాపరమైన యర్థము. అతులితమైన యింద్ర నగరుయొక్క సంబంధముచేత నని అమరావతీపరమైన యర్థము. 'స్యా త్ప్రాసాదో వైజయన్తః' అని యమరుఁడు; అంచిత సాగరజాత దంతి సంగతిన్–అంచిత=ఒప్పుచున్న,సాగరజాత=దీవులయందుఁ బుట్టిన,దంతిసంగతిన్=గజసంబంధముచేత, అంచిత మైన సాగరజాతదంతి యనఁగా నైరావతము. దాని సంబంధముచేత నని యర్థాంతరము; ఘనచక్రిసంభృతిన్ – ఘన= గొప్పనైన, చక్రి=రథములయొక్క, సంభృతిన్=భరణముచేతనని సేనాపరమైన యర్థము. ఘనుఁడైన విష్ణువుయొక్క భరణము చేత నని యర్థాంతరము; అఖండితవైభవ దేవ నాయకాయతిన్ – అఖండిత వైభవ=అవిచ్ఛిన్నములైన వైభవములచేత, దేవ= ప్రకాశించుచున్న, 'దివు క్రీడా వ్యవహార ద్యుతి స్తుతి మోదమద స్వప్న కాన్తి గతిషు' అని యనుశాసనము, నాయక=రాజుల యొక్క, ఆయతిన్= సమృద్ధిచేత నని సేనాపరమైన యర్థము. అఖండితవైభవము గల సురశ్రేష్ఠుల సమృద్ధిచేత నని యర్థాంత

రము; తనరారు = ఒప్పుచున్న; ఆనృపబలాళి = ఆసుచంద్రునియొక్క సేనాకదంబము; ధరిత్రిన్=భూమియందు; జంగమస్థితిన్ = జంగమవృత్తిచేత; చరియించు=సంచరించుచున్న; లేఖపురిచెల్వునన్ =అమరపురియందమున; చూపఱకున్=అవలోకించు జనమునకు; ఇంపు నింపుచున్=సుఖముఁజేయుచు; ఎసంగెన్=ఒప్పారెను. శ్లేషభిత్తికాభేదాధ్యవసాయముచేత వైజయంతికాదిరూపముగా నధ్యవసానము చేయఁబడిన వైజయంతప్రాసాదము మొదలగు వానిచే సేనాకదంబము సురనగరముగా నగపడుచున్నదని తాత్పర్యము. ఉపమాలంకారభేదము.

ఉ. ఆతఱిఁ గాన రాజిలె మ◊హాప్రతికూలభిదానిదానవి
ద్యోతితకాండమండితచ◊మూదధిశేఖరమధ్యవీథి ము
క్తాతివిభాసితం బగు శ◊తాంగవరేణ్యముపైఁ దదుర్వరా
నేత సితాంతరీపమున ◊నీటువహించిన విష్ణుపోలికన్. 164

టీక: తదుర్వరానేత=ఆభూపతి యైన సుచంద్రుఁడు; ఆతఱిన్=ఆసమయమందు; మహా ప్రతికూల భిదా నిదాన విద్యోతిత కాండ మండిత చమూదధి శేఖర మధ్యవీథిన్ – మహాప్రతికూల = మిగులవిరోధులయొక్క, గొప్పలైన యెదురుదరులయొక్క యని యర్థాంతరము, భిదా=భేదనమందు, నిదాన=ఆదికారణమైన, విద్యోతిత=ప్రకాశించునట్టి,కాండ=బాణములచేత, జలముల చేత నని యర్థాంతరము,మండిత=రాజిల్లునట్టి, చమూ=సేన యనెడు, ఉదధి=సముద్రముయొక్క, శేఖర=శిరస్సుయొక్క, మధ్యవీథిన్=మధ్యప్రదేశమునందు; ముక్తాతివిభాసితం బగు శతాంగవరేణ్యముపైన్ – ముక్తా=ముత్యములచేత, ముక్తులగు వారిచేత నని యర్థాంతరము, అతివిభాసితంబు = మిగుల ప్రకాశమానము, అగు =ఐనట్టి, శతాంగవరేణ్యముపైన్=రథశ్రేష్ఠము మీఁద; కానన్=చూడఁగా; సితాంతరీపమునన్ = శ్వేతద్వీపమందు; నీటువహించిన = అందము దాల్చినట్టి; విష్ణుపోలికన్ = శ్రీమహావిష్ణువువలె; రాజిలెన్=ప్రకాశించెను. అనగా సుచంద్రనృపతి సేనామధ్యమున ముత్యపుసరులతో రాజిల్లు రథము నధిష్ఠించి, సముద్రమధ్యమున ముక్తులతో రాజిల్లు శ్వేతద్వీపములో నున్న విష్ణుమూర్తివలె వెలసె నని భావము.

తే. అపుడుసదనీకమధ్యగుం ◊డగుచు నలధ
రారమణమౌళి నేత్రప◊ర్వంబుఁ గూర్చె
విమలనక్షత్రలోకసం◊వృతి ధరిత్రిఁ
జేరినట్టి సుధాసూతి చెలువుఁ బూని. 165

టీక: అల ధరారమణమౌళి = ఆరాజశేఖరుఁడగు సుచంద్రుఁడు; అపుడు=ఆసమయమందు; సదనీక మధ్యగుం డగుచున్= పండితమండలీమధ్యముననున్న వాఁడగుచు; విమలనక్షత్రలోకసంవృతిన్ = నిర్మలము లగు నక్షత్రములగుంపులయొక్క పరివేష్టనముచేత; ధరిత్రిన్=భూమిని; చేరినట్టి, సుధాసూతి = చంద్రునియొక్క; చెలువున్=అందమును; పూని=వహించి; నేత్రపర్వంబున్=నేత్రోత్సవమును; కూర్చెన్ = ఘటిల్లఁజేసెను. అనఁగా జయమునకు వెడలునపుడు సుచంద్రుఁడు నీతివిద్యాస్త్రవిద్యావేత్తలతోఁ బరివేష్టితుఁడై నక్షత్రకదంబముతోఁ బరివేష్టితుఁడైన చంద్రునివలెఁ బ్రకాశించె నని తాత్పర్యము.

క. జననాథుఁడిట్లు సేనా
జనసంవృతుఁడగుచు నరిగె ◊సమ్మిళదళినీ
నినదవనీసునదధునీ
కనదవనీధరవరాళి◊కం గనుఁగొనుచున్. 166

టీక: ఇట్లు=ఈప్రకారముగా; జననాథుఁడు=సుచంద్రుఁడు; సేనాజనసంవృతుఁ డగుచున్=సేనలగుంపులతోఁ గూడినవాఁడగుచు; సమ్మిళదళినీ నినద వనీ సునదధునీ కన దవనీధరవరాళికన్ – సమ్మిళత్= మిక్కిలి కూడుచున్న, అళినీ=ఆఁడు తుమ్మెదలయొక్క, నినద=ధ్వనిగల, వనీ=వనములయొక్క, సు=సమీచీనములైన, నద=పురుషప్రవాహములయొక్క, ధునీ=స్త్రీప్రవాహములయొక్క, కనత్ = ఒప్పుచున్న, అవనీధరవర=పర్వతశ్రేష్ఠములయొక్క, ఆళికన్ =గుంపును; కనుఁగొనుచున్ = అవలోకించుచు; అరిగెన్= పోయెను.

చ. అలపతి గాంచెఁ జెంత ఘన◊హైమగుహాగృహవాసికిన్నరీ
కులమణివల్లకీసమను◊కూలమనోహరగీత్యుపాంగదు
జ్జ్వలసురసాలజాలసుమ◊వల్లరికావిచరన్మిళిందని
ర్మలరవభగ్న పాంథజన◊మానకవాటము హేమకూటమున్. 167

టీక: అలపతి=ఆసుచంద్రుఁడు; చెంతన్=సమీపమున; ఘనహైమగుహా గృహ వాసి కిన్నరీకుల మణివల్లకీ సమనుకూల మనోహర గీత్యుపాంగ దుజ్జ్వల సురసాల జాల సుమ వల్లరికా విచర న్మిళింద నిర్మలరవ భగ్న పాంథజన మానకవాటమున్ – ఘన = గొప్పలగు, హైమ=సువర్ణమయములగు, గుహా=గుహలనెడు, గృహ= ఇండ్లయందు, వాసి=వసించియుండు, కిన్నరీకుల =కిన్నరస్త్రీలగుంపులయొక్క, మణివల్లకీ =మణులవీణలయొక్క, సమనుకూల=మిక్కిలి యనుకూలమగు, మనోహర = మనోజ్ఞమైన, గీతి=గానమునకు, ఉపాంగత్ = సుతి యగుచున్న, ఉజ్జ్వల=ప్రకాశించుచున్న, దీనికిమిళిందనిర్మలరవమం దన్వయము, సురసాల= కల్పతరువులయొక్క, జాల=గుంపుయొక్క, సుమ=పువ్వులయొక్క, వల్లరికా=తీఁగలయందు, విచరత్= సందడించుచున్న, మిళింద=తుమ్మెదలయొక్క,నిర్మల=స్వచ్ఛమగు,రవ=ధ్వనిచేత,భగ్న=బ్రద్దలు చేయఁబడిన, పాంథజన=పథికసంఘముయొక్క, మానకవాటమున్=మాన మనెడు ద్వారము గలదానిని, హేమకూటమున్=హేమకూట మను పర్వతమును; కాంచెన్=చూచెను.

చ. కనుఁగొని తన్మహీభృదుప◊కంఠమునన్ నిజరాజధానిపా
ల్పున సుమనోనికాయపరి◊భూషిత యై, కలకంఠికామణీ
జనయుత యై, కనత్కనక◊సాలసమన్విత యై పొసంగు చ
క్కనివని వేడ్క వేలము డి◊గన్ ఘటియించె జనేంద్రుఁడయ్యెడన్. 168

టీక: కనుఁగొని =హేమకూటమును జూచి; జనేంద్రుఁడు=సుచంద్రుఁడు; తన్మహీభృదుపకంఠమునన్ = ఆపర్వతసమీపమున; నిజరాజధానిపొల్పునన్=తనవిశాలపురీవిధమున; సుమనోనికాయ పరిభూషిత యై– సుమనోనికాయ=జాజిగుమురులచేత నని వనీపరమైన యర్థము, పండితమండలిచేత నని విశాలాపురీపరమైన యర్థము, పరిభూషిత ఐ= అలంకృత యై; కలకంఠికామణీ జన యుత ఐ– కలకంఠికామణీ=శ్రేష్ఠమైన యాఁడుగోయిలలయొక్క యని వనీపరమైన యర్థము, స్త్రీరత్నములయొక్క యని పురీపరమైన యర్థము, జన=సమూహముచేత, యుత ఐ =కూడినదై; కన త్కనకసాల సమన్విత ఐ– కనత్=ప్రకాశించు చున్న, కనకసాల=సంపెఁగచెట్లతోడ నని వనీపరమైన యర్థము, బంగరుకోటలతోడ నని పురీపరమైన యర్థము, సమన్విత ఐ =కూడుకొన్నదై; పొసంగు చక్కనివనిన్ = ఒప్పుచున్న మంచివనమందు; అయ్యెడన్= ఆసమయమునందు; వేడ్కన్= ఉత్సాహముతోడ; వేలము =సేనను; డిగన్ ఘటియించెన్ = డిగునట్లు చేసెను.

ఆశ్వాసాంతపద్యములు

మ. తనుభానిర్జితమార, మారరిపుకాం◊తాచిత్తసంసార, సా
రనిరస్తాఘకవార, వారణభిదా◊రాజద్బలోదార, దా
రనివేశాయితసూర, సూరసితభా◊రమ్యాక్షివిస్తార, తా
రనిభఖ్యాతివిసార, సారసభవ◊ప్రస్తుత్యనిత్యోదయా! 169

టీక: తనుభానిర్జితమార = దేహకాంతిచేత గెలువఁబడిన మదనుఁడు గలవాఁడా; మారరిపుకాంతాచిత్త సంసార – మారరిపు= శివునకు, కాంతా=ప్రియ యగు పార్వతియొక్క, చిత్త=హృదయమునందు, సంసార= చరించుచున్నవాఁడా, విష్ణువు పార్వతికిఁ బుత్రుడు గనుక నాతనియం దామెకు వాత్సల్య మున్న దనుట. బ్రహ్మవైవర్త గణేశఖండమునందు విష్ణువు గణేశ రూపముగాఁ బార్వతికిఁ బుత్రుఁడైనట్టు లున్నది; సారనిర స్తాఘకవార= బలముచేత నిరసింపఁబడిన పాపసంఘము గల వాఁడా, అఘశబ్దముపై కప్ప్రత్యయము; వారణ భిదా రాజ ద్బలోదార – వారణ=కువలయాపీడ మను గజముయొక్క, భిదా =భేదనమందు, రాజత్= ప్రకాశించుచున్న, బల=సామర్థ్యముచేత, ఉదార =ఉత్కృష్టుఁడైన వాఁడా; దార నివేశాయిత సూర– దార= భార్య యగు లక్ష్మీదేవికి, నివేశాయిత=గృహముగా నాచరించుచున్న, సూర =మంచి వక్షస్స్థలముగల వాఁడా; సూర సితభా రమ్యాక్షి విస్తార–సూర =సూర్యుఁడు, సితభా=చంద్రుఁడు అనెడు, రమ్య=చక్కని, అక్షి=నేత్రములయొక్క,విస్తార = విస్తారము గలవాఁడా; తారనిభ ఖ్యాతివిసార=నక్షత్రములతో సమానమైన కీర్తిప్రసారము గలవాఁడా; సారసభవప్రస్తుత్యనిత్యోదయా–సారసభవ=బ్రహ్మచేత, ప్రస్తుత్య=కొనియాడఁదగిన, నిత్యోదయా=నిరంతరాభ్యుదయము గల వాఁడా! ఈసంబోధనలకును ముందు చెప్పబోవు రెండుపద్యములందలి సంబోధనలకును నిది ప్రథమాశ్వాసము అను గద్యముతో నన్వయము. ఇందు ముక్తపదగ్రస్త మను శబ్దాలంకారము.

క. శరణాగతశుభకరణా!
కరణాతీతాత్మవివిధ◊కార్యాచరణా!

చరణానతాసుహరణా!
హరణాయితసత్స్యమంతకాభాభరణా! 170

టీక: శరణాగతశుభకరణా = శరణమును బొందినవారికి శుభమును జేయువాఁడా; కరణాతీతాత్మ వివిధ కార్యాచరణా– కరణాతీత=ఇంద్రియాతీతములైన, ఆత్మ=స్వీయములైన, వివిధ=అనేకవిధములగు, కార్య=సృష్ట్యాదికార్యములను, ఆచ రణా=ఆచరించునట్టివాఁడా; చరణానతాసు హరణా–చరణ= పాదములయందు, అనత =నమ్రులుగానివారియొక్క, అసు= ప్రాణములను, హరణా=హరించువాఁడా; హరణాయిత సత్స్యమంత కాభాభరణా– హరణాయిత=అరణముగాఁ జేయఁ బడిన, సత్స్యమంతక = మంచి స్యమంతకమణియొక్క, ఆభా=కాంతి, ఆభరణా=భూషణముగాఁ గలవాఁడా!
ఇందును ముక్త పదగ్రస్తాలంకారమే.

పృథ్వీ. ధరాధరమచర్చికాధర !ధరారిముఖ్యోదయ
ద్ధరాపహమహత్తరాదర! దరస్వనోత్సేకితా
శరప్రకరనిష్పతచ్ఛర! శరప్రభూతాలయా
వరాంకకలనప్రభావర! వరప్రదానుగ్రహా! 171

టీక: ధరాధరమచర్చికాధర=ప్రశస్తపర్వత మగు మందరమును ధరించినవాఁడా; ధరారిము ఖ్యోదయ ద్ధరాపహ మహత్త రాదర– ధరారిముఖ్య=ఇంద్రుఁడు మొదలగువారికి, ఉదయత్=పుట్టుచున్న, దర = భయముయొక్క, ఆపహ=పోగొట్టుట యందు, మహత్తర=అధికమగు, ఆదర=ప్రీతి గలవాఁడా; దర స్వనోత్సేకితాశర ప్రకర నిష్పతచ్ఛర–దరస్వన=పాంచజన్య ధ్వనిచేత, ఉత్సేకిత=సంజాతోత్సేకము గలవియు, ఆశర=రాక్షసులయొక్క, ప్రకర=సమూహమందు, నిష్పతత్ =పడుచు న్నవియు నగు, శర =బాణములు గలవాఁడా; శర ప్రభూ తాలయా వరాంక కలన ప్రభా వర– శర=నీటియందు, ప్రభూత= పుట్టినట్టి కమలము, ఆలయా=గృహముగాఁగల లక్ష్మియొక్క, వర=కుంకుమముయొక్క, అంక=గుర్తులయొక్క, కలన= సంబంధముచేత నైన, ప్రభా=కాంతిచేత, వర=శ్రేష్ఠుఁడైనవాఁడా; వరప్రదానుగ్రహా=వరములనిచ్చు ననుగ్రహము గలవాఁడా!
ముక్తపదగ్రస్తా లంకారము. ఈకృతిపతి సంబోధనములకు నిది ప్రథమాశ్వాస మను గద్యముతో నన్వయ మని వ్రాయఁబడియె.

గద్యము: ఇది శ్రీమదనగోపాలప్రసాదసమాసాదితోభయభాషాకళాకళత్ర రేచర్లగోత్రపవిత్ర
సురభిమల్లక్ష్మాపాలసత్పుత్ర కవిజనవిధేయ మాధవరాయప్రణీతం బైన
చంద్రికాపరిణయంబను మహాప్రబంధంబునందుఁ బ్రథమాశ్వాసము.

గద్యము. ఇది శ్రీసతీరమణకరుణాసమాసాదితసర్వసౌభాగ్యభాగ్యనగరమహారాజ్యసంకలిత శ్రీజటప్రోలు
సంస్థానప్రాజ్యసకలసామ్రాజ్య శ్రీరేచర్లగోత్రపవిత్ర కవిజనగేయ శ్రీవేంకటజగన్నాథరాయ

సత్పుత్ర సత్సంప్రదాయ శ్రీసురభి వేంకటలక్ష్మణరాయ పరిపోష్య సరసవైదుష్య
తదాస్థానతలమండిత శేషసదాశివపండిత విరచిత
శరదాగమసమాఖ్యవ్యాఖ్యయందుఁ
బ్రథమాశ్వాసము.

శ్రియై నమః

శ్రీలక్ష్మీనరసింహాయ నమః

చంద్రికాపరిణయము-సవ్యాఖ్యానము

ద్వితీయాశ్వాసము

క. అహరీశసుతావీచీ
విహరణరణదంఘ్రికటకవిశ్వాసిపత
ద్గ్రహయాళుపాణిపద్మ
స్పృహయాళుమదాళిజాల శ్రీగోపాలా! 1

టీక: అహరీశసుతా వీచీ విహరణ రణదంఘ్రికటక విశ్వాసి పతద్గ్రహయాళు పాణిపద్మ స్పృహయాళు మదాళిజాల– అహరీశసుతా=యమునానదియొక్క, వీచీ=తరఁగలయందు, విహరణ=క్రీడచేత, రణత్=మ్రోయుచున్న, అంఘ్రికటక= హంసకముల(అందెల)యందు, 'హసకః పాదకటకః' అని యమరుఁడు, విశ్వాసి=విశ్వసించునట్టి, పతత్=హంసపక్షిని, 'పతత్పత్త్రరథాణ్డజాః' అని యమరుఁడు,గ్రహయాళు= గ్రహింప నిచ్ఛ గల, పాణిపద్మ=కరకమలమందు, స్పృహయాళు= వాంఛగల, మదాళిజాల =మదించిన తుమ్మెదలగుంపుగలవాఁడైన, శ్రీగోపాలా=శ్రీమదనగోపాలస్వామీ! అని కృతిపతిసంబోధనము. దీనికిఁ జిత్తగింపు మను నుత్తరపద్యస్థక్రియతో నన్వయము.

యమునానదియందుఁ గ్రీడించుచున్న కృష్ణమూర్తియొక్క పాదకటకధ్వనియందు హంసపలుకు లనుభ్రాంతిచేత హంసలు సమీపమునకుఁ బోఁగా, శ్రీకృష్ణుండు వానిని బట్టు తలంపుతో కరకమలంబు సాపఁగా నాకేలుదమ్మియందు వాస్తవ కమలభ్రాన్తిచేఁ దుమ్మెదలగుంపు చుట్టుకొన్నదని తాత్పర్యము. భ్రాన్తిమదలంకారము. 'శ్లో. భ్రాన్తిమా నన్యసంవిత్తి రన్యస్మిన్ సామ్యదర్శనాత్' అని కావ్యదర్పణమందుఁ దల్లక్షణము.

తే. చిత్తగింపుము శౌనకాద్యుత్తమర్షి
సమితి కిట్లను రోమహర్షణతనూజుఁ
డిట్లు వేలంబు డిగఁదార్చి, నృపతి హేమ
పటకుటి వసించి యుండె సంభ్రమ మెలర్ప. 2

టీక: చిత్తగింపుము = అవధరింపుము; శౌనకాద్యుత్తమర్షిసమితికిన్ = శౌనకుఁడు మొదలుగాఁ గల మహర్షిసంఘమునకు; ఇట్లు =వక్ష్యమాణప్రకారముగ; రోమహర్షణతనూజుఁడు=సూతుఁడు; అనున్=వచించును; ఇట్లు =ఈప్రకారము; వేలంబు= ఉపవనమును; డిగన్=దిగుటకు; తార్చి=ఒనరించి; నృపతి=సుచంద్రుఁడు; హేమపటకుటిన్ =బంగారుగుడారమునందు; సంభ్రమము=సంతసము; ఎలర్పన్=అతిశయింపఁగ; వసించి యుండెన్ =నివసించి యుండెను.

చ. అలతఱిఁ దద్గిరీంద్రతటి◊కాంచనకాంచనమాలతీలతా
వలయలతాంతకాంతతర◊వాసనవాసనవానిలాళికల్
మలయ, విభుండు వేడ్కఁ దన◊మానస మాన, సముజ్జ్వలాత్ము నె
చ్చెలిఁ గని పల్కు స్వర్ద్రుసుమ◊జీవనజీవనభేదనోక్తికన్. 3

టీక: అలతఱిన్=ఆసమయమునందు; తద్గిరీంద్ర తటికాంచన కాంచన మాలతీలతా వలయ లతాంత కాంతతర వాసన వాసనవానిలాళికల్ – తద్గిరీంద్ర = ఆహేమకూటముయొక్క, తటికా=దరులకు, అంచన= అలంకారమగు, కాంచన=సంపెఁగలయొక్క, మాలతీలతా= జాజితీవలయొక్క, వలయ=గుమురులయందలి, లతాంత = కుసుమములయొక్క, కాంతతర= మిక్కిలి మనోజ్ఞములగు, వాసన=సుగంధములకు, వాస= నివాసములగు, నవ=నూతనమగు, అనిలాళికల్=వాయుసమూహములు; తనమానసము=తనమనస్సును; ఆనన్=స్పృశించునట్లుగా; మలయన్=వీచుచుండఁగా; విభుండు=సుచంద్రుఁడు; వేడ్కన్= సంతోషముచేత; సముజ్జ్వలాత్మున్= మిక్కిలి ప్రకాశించుదేహముగల, లేదేని బుద్ధిగల; నెచ్చెలిన్= ప్రియసఖుని; కని=చూచి; స్వర్ద్రుసుమ జీవన జీవన భేదనోక్తికన్ – స్వర్ద్రుసుమ=కల్పతరుకుసుమములయొక్క, జీవన=మకరందముయొక్క, జీవన= బ్రదుకునకు, భేదన=భేదకమగు, ఉక్తికన్=వాక్యమును; పల్కున్=వచించును. యమకాలంకారము.

ఉ. ఈయగరాజమౌళి మన ◊మిచ్చట నుండుట తా నెఱింగి యా
త్మీయసమగ్రవైభవగ◊తిం దిలకింపఁగ రమ్మటంచు మో
దాయతిఁ బిల్వఁ బంచెఁ బవ◊నాంకురపాళికఁ, జూతమే వయ
స్యా! యచలేంద్రదివ్యమహి◊మాతిశయంబు ప్రియంబు పొంగఁగన్. 4

టీక: ఈయగరాజమౌళి =పర్వతశ్రేష్ఠ మగు నీహేమకూటము; మనము,ఇచ్చటన్=ఈప్రదేశమున; ఉండుట = ఉండుటను; తాన్=తాను; ఎఱింగి =తెలిసికొని; ఆత్మీయసమగ్రవైభవగతిన్= తనయొక్క సమగ్రమైన వైభవరీతిని; తిలకింపఁగన్=చూచుటకు; రమ్మటంచున్ = రావలయు ననుచు; పవనాంకురపాళికన్=మందమారుతపరంపరను; మోదాయతిన్=సంతోషాతిశయముచేత; పిల్వన్=పిలుచుటకు; పంచెన్=పంపెను; వయస్యా=సఖుఁడా! ప్రియంబు =ప్రేమము; పొంగఁగన్=మించఁగా; అచలేంద్ర దివ్య మహిమాతిశయంబు – అచలేంద్ర=హేమకూటముయొక్క; దివ్య=లోకోత్తరమగు; మహిమాతిశయంబు = మహిమోన్నతిని; చూతమే = చూతమా. హేమకూటవనమందున్న సుచంద్రునిపై హేమకూటముననుండి మందమారుత పరంపర ప్రసరింపఁగాఁ దన విభవాతిశయము గాంచుటకు హేమకూటము సుచంద్రునిఁ బిల్వ మందమారుతమును బంపినదా యన్న ట్లుండె నని భావము. ఇందు గమ్యోత్ప్రేక్ష.

చ. అని జననేత తత్ప్రియస◊ఖాగ్రణికేల్ కయిదండఁ బూని, చ
క్కని తెలిమిన్న మెట్టికలు ◊గట్టిన త్రోవ నగేంద్ర మెక్కెఁ, బా
వనమరుదుచ్చలత్కిసల◊వారమృషావ్యజనాళిఁ బార్శ్వసీ
మ నలరు మల్లికాయువతి◊మండలి యింపుగ వీవ నత్తఱిన్. 5

టీక: అని = ఇట్లని; జననేత = సుచంద్రు(డు; పార్శ్వసీమన్=ఇరుప్రక్కలను; అలరు =ఒప్పుచున్న; మల్లికాయువతిమండలి = మల్లెతీవియ లనెడు స్త్రీలగుంపు; పావన మరుదుచ్చల త్కిసల వార మృషావ్యజనాళిన్ – పావన=పవిత్రమగు, మరుత్= గాలి చేత, ఉచ్చలత్=మిక్కిలి కదలుచున్న, కిసల= పల్లవములయొక్క, 'కిసాలయం కిసలయం కిసాలం కిసలం కిసమ్' అని ద్విరూపకోశము, వార=సమూహమనెడు, మృషావ్యజన=కృత్రిమతాళవృంతములయొక్క, ఆళిన్ = సమూహముచేత, 'కిసలవారమిషవ్యజనాళిన్' అని పాఠమందు, కుసుమవార మను నెపము గల సురటీలగుంపుచేత నని యర్థము. ఇంపుగన్ = సొంపుగా; వీవన్ = వీచుచుండ(గా; అత్తఱిన్=ఆసమయమందు; తత్ప్రియసఖాగ్రణికేల్= శ్రేష్ఠు(డగు ఆ ప్రియసఖుని హస్తమును; కయిదండన్=హస్తాలంబముగ; పూని= గ్రహించి; చక్కని తెలిమిన్న మెట్టికలు గట్టిన త్రోవన్=సుందర మగు వజ్ర మణులసోపానములు గట్టిన దారిచే; నగేంద్రము=హేమకూటమును; ఎక్కెన్ = అధిష్ఠించెను.

సుచంద్రు(డు హేమకూటము నధిష్ఠించుతఱి నుభయపార్శ్వములందు మందమారుతముచే(బల్లవములు చలించు చుండ(గా మల్లికాలతలనెడు కాంతలు సురటీలచే వీచుచున్న యటు లుండె నని భావము. గమ్యోత్ప్రేక్ష.

క. అలరారు వేడ్క(దద్గిరి
కులరాడ్వైభవము(గాంచు ◊కుతలేశ్వరుతో
నలరాచెలి యిట్లను మధు
జలరాశితరంగనినద◊జయయుతఫణితిన్. 6

టీక: అలరారు వేడ్కన్=ఒప్పుచున్న సంతోషముతోడ; తద్గిరికులరాడ్వైభవమున్ = ఆపర్వతరాజైన హేమకూటముయొక్క వైభవమును; కాంచు=చూచుచున్న; కుతలేశ్వరుతో=రాజుతోడ; అలరాచెలి =ఆరాజసఖు(డు; మధుజలరాశి తరంగ నినద జయయుత ఫణితిన్ – మధుజలరాశి =పూదేనియసముద్రముయొక్క, తరంగ=అలలయొక్క, నినద=ధ్వనియొక్క, జయ = గెలుపుతోడ, యుత=కూడుకొనిన, ఫణితిన్=వాక్కుచేత; ఇట్లనున్= వక్ష్యమాణరీతిగా(బలికెను. ద్వ్యక్షరీప్రాసకందము.

సీ. కరిరాజధీపూర◊పరిరాజితోదార, హరిరాజిహృతసార◊శరదపాళి,
నగచారివరజాత◊మృగచాతురీభీత,మృగచాలనోద్భూత◊పృథులధూళి,
సకలాజరీగూహ◊నకలావిలీనాహ,పికలాపినీవ్యూహ◊బిలగృహాళి,
లలితాపగోర్మిత◊రలితాసితాబ్జాత,గలితాసవజసాతి◊విలసనాళి,
తే. మహిప! కను(గొను తనుజను◊ర్మహిమజనన,జనకకలరవకులరవ◊ధ్వనితసురభి
భరితఘనరవవనచర◊తురగవదన,కులజలదచూళి యిమ్మహా◊కుధరమౌళి. 7

టీక: కరిరాజ ధీపూర పరిరాజి తోదార హరిరాజి హృత సార శరదపాళిన్ – కరిరాజ=గజశ్రేష్ఠము లనెడు,ధీపూర=బుద్ధి రాశిచేత, పరిరాజిత=మిగుల ప్రకాశించుచున్న, ఉదార=ఉత్కృష్టమగు, హరి=సింహములయొక్క, రాజి=పంక్తిచేత, హృత=హరింప(బడిన, సార=శ్రేష్ఠమగు, కాదేని హృతసార=హరింప(బడిన సారము గల, శరద=మేఘములయొక్క, పాళిన్ = గుంపు గలదియు;
నగచారివర జాత మృగ చాతురీ భీత మృగ చాలనోద్భూత పృథుల ధూళిన్ – నగచారివర=వనచరశ్రేష్ఠులయొక్క, జాత=

గుంపుయొక్క,మృగ=వేఁటయొక్క,'మృగః పశౌ కురఙ్గే చ కరి నక్షత్రభేదయోః,యాఞ్చాయాం మృగయాయాం చ' అని విశ్వము, చాతురీ=చాతుర్యమువలన, భీత=భయపడినట్టి, మృగ=లేళ్లయొక్క, చాలన=సంచరణముచేత, ఉద్ధూత =ఉద యించిన, పృథుల=అధికమగు,ధూళిన్=పరాగముగలదియు;

సకలాజరీ గూహనకలా విలీనాహపికలాపినీ వ్యూహ బిలగృహాళిన్ – సకల = సమస్తమగు, అజరీ = దివ్యస్త్రీలయొక్క, గూహనకలా =దాఁగిలిమూఁత లనెడు నాటలయందు, విలీన=డాఁగినట్టి, ఆహపికలాపినీ=సర్పస్త్రీలయొక్క, అహిశబ్దముపై 'తస్యేదమ్' అని అణ్ ప్రత్యయము వచ్చి ఆహ యని యైనది, వ్యూహ = సంఘము గల, బిలగృహ =గుహలయొక్క, ఆళిన్ =పంక్తి గలదియు;

లలితాపగోర్మి తరలి తాసితాబ్జాత గలితాసవజ సాతివిలస నాళిన్ – లలిత=మనోజ్ఞములగు, ఆపగా = నదులయొక్క, ఊర్మి = తరఁగలవలన, తరలిత = చలింపఁజేయఁబడిన, అసిత = నల్లనైన, అబ్జాత = పద్మములవలన, గలిత = జాఱినట్టి, ఆసవ = మకరందమువలన, జ =పుట్టినట్టి, సాతివిలసన=అత్యంతప్రకాశము గల, అళిన్ = తుమ్మెదలు గలిగినదియు;

తనుజను ర్మహిమజనన జనక కలరవ కుల రవ ధ్వనిత సురభి భరిత ఘనరవ వనచర తురగవదన కుల జలదచూళిన్ – తను జనుః =దేహ మెత్తుటయొక్క, కాదేని మనసిజునియొక్క, 'జనుర్జనన జన్మాని' అని యమరుఁడు, మహిమజనన = ఉత్కర్షో త్పత్తికి, జనక=సంపాదకములైన, కలరవ=కోకిలలయొక్క, కుల =గుంపుయొక్క,రవ=ధ్వనులచేత, ధ్వనిత = సంజాత ధ్వని యగు, సురభి=వసంతముచేత, భరిత =నిండినట్టి, దీనికి చూళియం దన్వయము.

ఘనరవ=గొప్పధ్వనులు గల, వనచర=కిరాతకులయొక్కయు, తురగవదన= కిన్నరులయొక్కయు, కుల=గుంపులును, జలద=మేఘములును గల, చూళిన్ = అగ్రభాగము గలదియు నైన, 'ఘనతర' యను పాఠమున భరితమై ఘనతరమైన వన మందుఁ జరించు చున్న కిన్నరస్త్రీలు గల దని యర్థము. జలదచూళు లనఁగా ఘనకచలు.

ఇమ్మహాకుధరమౌళిన్=ఈగొప్పపర్వతరాజును, మహిప = సుచంద్రుఁడా! కనుఁగొను = అవలోకింపుము.

మ. జననాథేశ్వర! కంటె రత్నకటకాం◊చత్స్వర్ణమౌళ్యాప్తమై,
యనిశాత్యాశ్రితరాజసింహనివయం◊బై, సంవృతానేకవా
హిని యై, చందనగంధవాసితము నై, ◊యీశైలవర్యంబు దాఁ
దనరెన్ నీవిట నొందుమాత్రనె భవ◊త్సారూప్యముం గాంచెనాన్. 8

టీక: జననాథేశ్వర=సుచంద్రుఁడా! ఈశైలవర్యంబు=ఈపర్వతశ్రేష్ఠము; తాన్ = తాను; నీవు; ఇటన్ = ఇచట; ఒందుమాత్రనె= చేరినంతమాత్రముననె; భవత్సారూప్యమున్=నీసాటిని; కాంచెనాన్=పొందెనా యనునట్లు;రత్నకటకాంచత్స్వర్ణమౌళ్యాప్త మై– రత్న=రత్నమయము లగు, కటక=చరులందు, అంచత్=ఒప్పుచున్న, స్వర్ణ=సంపెంగ లనెడు, మౌళి=అశోకము లనెడు, 'మౌళిః కఙ్కేళి చూతయోః' అని విశ్వము, రత్నకటక=రత్నపుఁగడియములను, అంచత్స్వర్ణమౌళి=బంగరుకిరీట మును, ఆప్తమై= పొందినదై; అనిశాత్యాశ్రితరాజసింహనిచయంబై– అనిశ=ఎల్లప్పుడును, అత్యాశ్రిత=మిక్కిలి యాశ్రయించి నట్టి, రాజసింహ=పెద్దసింగము లనెడు నృపశ్రేష్ఠులయొక్క, 'స్యురుత్తరపదే వ్యాఘ్ర పుఙ్గ వర్షభ కుఞ్జరాః, సింహ శార్దూల నాగాద్యాః పుంసి శ్రేష్ఠార్థగోచరాః' అని యమరుఁడు, నిచయంబై =సమూహము గలదై; సంవృతానేకవాహిని యై– సంవృత= చుట్టుకొనఁబడిన, అనేక=అనేకములగు, వాహిని యై = నదులనెడు సేనలు గలదై; చందనగంధవాసితము నై = చందనతరువు లనెడు శ్రీగంధముయొక్క పరిమళముచేత వాసిత మైనదై; తనరెన్ = ఒప్పెను; కంటె=చూచితివా?

చ. అనుపమధాతుధూళియుతి, నంచితకుంజనిషక్తి నొప్పు నీ
ఘనసితరత్నగండతటిఁ గ్రాలెడుపొన్న నృపాల! కాన్పు తె
ల్లని తొలుగౌరు నెక్కినయిలాధరవైరియె చుమ్ము, కానిచో
నొనరునె దేవవల్లభతయున్, సుమనోభరణంబు దానికిన్. 9

టీక: నృపాల=సుచంద్రుఁడా! కాన్పు=చూడుము; అనుపమధాతుధూళియుతిన్– అనుపమ=సాటిలేని, ధాతు=జేగురు యొక్క, ధూళి=పరాగముయొక్క, యుతిన్=సంబంధముచేతను; అంచితకుంజనిషక్తిన్– అంచిత=ఒప్పుచున్న, కుంజ= పొదలయొక్క, దంతములయొక్క, నిషక్తిన్= సంబంధముచేతను; ఒప్పు = ఒప్పుచున్న; ఈ ఘనసితరత్నగండతటిన్ = ఈ ఘనమగు వజ్రమణిమయమైన స్థూలోపలప్రదేశమందు; క్రాలెడు పొన్న = ఒప్పునట్టి పొన్నచెట్టు; తెల్లని తొలుగౌరు నెక్కిన యిలాధరవైరియె చుమ్ము = తెల్లనైన యైరావతము నెక్కిన పర్వతవైరి యగునింద్రుండే చుమీ! కానిచోన్=అటు గానియెడ; దేవవల్లభతయున్ =దేవవల్లభ మగుటయు, 'పున్నాగః పురుష స్తుఙ్గః కేసరో దేవవల్లభః' అని యమరుఁడు; సుమనోభరణంబు = పుష్పభరణమును, దేవతాపోషణమును; దానికిన్=ఆపున్నాగమునకు; ఒనరునె = ఘటిల్లునా?
అనఁగా సురరాజు గానిచో దేవవల్లభతయు, సుమనోభరణంబు ఘటిల్లవు గావున సురరాజే యనుట. వజ్రమణిమయ మయి ధాతుధూళివిరాజితం బగు గండోపల మైరావతంబును బోలి యున్నదనియు, దానిపై నున్న పుష్పించిన పున్నాగము దేవేంద్రునిఁ బోలి యున్నదనియు భావము. రూపకాలంకారభేదము.

సీ. బహునీలతటులఁ గన్పట్టు సూర్యాకృతుల్, పొందమ్ము లని త్రెంపఁ బూని పూని,
నవవజ్రకటకమండలిఁ దోఁచు నైజమూర్తులఁ బరేభమనీషఁ గ్రుమ్మి క్రుమ్మి,
కురువిందమయపాదసరణిఁ గ్రాలెడు ఘనమ్ముల వశామతిఁ గేల నలమి యలమి,
గారుడగ్రావశృంగములఁ బొల్చు సురాధ్వతటినిఁ బెన్నది యంచుఁ దఱిసి తఱిసి,
తే. యలఘువీథి భయోపబృంహకదురంత, బృంహితార్భటి దిక్కోటి వ్రీలఁజేయు,
సమదవైఖరి నీయద్రి సంచరించు, వనగజశ్రేణి కనుఁగొంటె మనుజవర్య! 10

టీక: మనుజవర్య =సుచంద్రుఁడా! ఈయద్రిన్=ఈపర్వతమందు; సమదవైఖరిన్=మదయుక్తమైనరీతితోడ; సంచరించు వన గజశ్రేణి=తిరుగుచున్న యరణ్యగజసమూహము; బహునీలతటులన్– బహు=అధికములగు, నీల=నీలమణిమయము లగు, తటులన్=చఱులయందు; కన్పట్టు సూర్యాకృతుల్=ప్రతిఫలించునట్టి సూర్యబింబములు; పొందమ్ములని =బంగరు పద్మము లనుకొని; త్రెంపన్=తెంచుటకు; పూని పూని=ప్రయత్నించి, ప్రయత్నించి;
నవవజ్రకటకమండలిన్– నవ=నూతనమగు, వజ్ర=వజ్రమణిమయములగు, కటక=నితంబప్రదేశములయొక్క,మండలిన్ = సమూహమందు; తోఁచు =ప్రతిఫలించు; నైజమూర్తులన్ = తమశరీరములను; పరేభమనీషన్=ఇతరగజములను బుద్ధిచేత; క్రుమ్మి క్రుమ్మి=కొమ్ములతోఁ బొడిచి పొడిచి;
కురువిందమయపాదసరణిన్ =పద్మరాగమణిమయమైన ప్రత్యంతపర్వతమార్గమందు; క్రాలెడు =ఒప్పుచున్న; ఘనమ్ములన్ =మబ్బులను; వశామతిన్= ఆఁడేనుఁగులను బుద్ధిచేత; కేలన్=తుండములచేత; అలమి యలమి=ఆక్రమించి, యాక్రమించి; గారుడగ్రావ శృంగములన్– గారుడగ్రావ =గారుత్మతమణిమయములగు; శృంగములన్=శిఖరములయందు; పొల్చు=

ఒప్పునట్టి (ప్రతిబింబించినట్టి); సురాధ్వతటినిన్=ఆకాశగంగను; పెన్నది యంచున్=పెద్దనది యనుచు; తఱిసి తఱిసి = సమీపించి, సమీపించి;

అలఘువీథిన్=అధికమగు వనవీథియందు; భయోపబృంహక దురంత బృంహితార్భటిన్– భయ=భీతికి, ఉపబృంహక = వర్ధకమగు, దురంత=పారము లేని, బృంహిత=స్వకీయధ్వనులయొక్క, ఆర్భటిన్=అతిశ యముచేత; దిక్కోటిన్= దిక్సమూహమును; వ్రీలన్=చీలునట్లుగా; చేయున్=చేయును; కనుఁగొంటె= చూచితివా?

ఈహేమకూటము నానావిధమణికూటములతో విరాజిల్లుచున్నదనియు, నిందుఁ బెక్కు మదపుటేనుఁగులగుంపు లున్నవనియు భావము. భ్రాన్తిమదలంకారము.

చ. కలితమణీశరాసఘనకాండభృతిన్, వరవాజిసంగతిం,
బొలుచుసువర్ణకూట మరిభూపవిదారణఁ జూడఁ గాంచనా
చలవిజయప్రయాణపరిసన్నహనాత్మతఁ బూనుటల్ కడుం
దెలిపె మరుద్గతిధ్వనదుదీర్ణగుహాచయభేరికాధ్వనుల్. 11

టీక: కలిత మణీశరాస ఘనకాండ భృతిన్—కలిత=ఒప్పుచున్న, మణీశరాస=మణులు దాపిన విండ్లయొక్కయు, ఇంద్రధనువుయొక్కయు, ఘనకాండ= గొప్పనైన బాణములయొక్కయు, బాణములవలె నున్న (తద్రూపముగా నేర్పడిన) మేఘములయొక్కయు, భృతిన్=ధారణముచేత; వర వాజి సంగతిన్–వర=శ్రేష్ఠములైన; వాజి=పక్షులనెడు గుఱ్ఱములయొక్కయు, సంగతిన్ =సాంగత్యముచేత; పొలుచు=ఒప్పునట్టి; సువర్ణకూటము=హేమకూటము; అరిభూపవిదారణన్=శత్రురాజభేదనమును; చూడన్=కనుటకు; కాంచనాచల విజయ ప్రయాణ పరిసన్నహ నాత్మతన్– కాంచనాచల= మేరుపర్వతమునకు, విజయ= జయముకొఱకైన, ప్రయాణ= పయనముయొక్క, పరిసన్నహన=సన్నాహమందు, ఆత్మతన్ = చిత్తము గల్గుటను; పూనుటల్=వహించుటలను; మరుద్గతి ధ్వన దుదీర్ణ గుహాచయ భేరికా ధ్వనుల్—మరుద్గతి = వాయువుయొక్క గమనముచేత, ధ్వనత్=ధ్వని సేయుచున్న, ఉదీర్ణ=ఉత్కటమగు, గుహాచయ=గుహలసమూహము లనెడు, భేరికా= భేరులయొక్క, ధ్వనుల్ = శబ్దములు; కడున్=మిక్కిలి; తెలిపెన్=ఎఱింగించెను.

వాతాభిఘాతమున గుహాచయము మ్రోఁగుచుండఁగా మణీశరాసఘనకాండభృతి, వరవాజిసంగతులచే నొప్పుచున్న హేమకూటము శత్రుభేదనమునకై మేరుపర్వతమునకుఁ బయనము చేయుచుఁ బ్రయాణ భేరీనాదము సేయుచున్నటు లున్నదని భావము. గమ్యోత్ప్రేక్ష.

చ. మనుకులరాజచంద్ర! కనుమా ప్రతిబింబితపర్ణజాలన
మ్రనఖరయుక్తిఁ దోఁచు నలమౌక్తికశృంగనృసింహమూర్తి పెం
పొనరె నధిత్యకాప్రభవితోన్నతవిద్రుమవల్లికల్ పలా
శనజఠరంబు సీర్చి పెలుచం బయి నెత్తు నవాంత్రపాళిగన్. 12

టీక: మనుకులరాజచంద్ర=సుచంద్రుఁడా! ప్రతిబింబిత పర్ణజాల నమ్ర నఖర యుక్తిన్– ప్రతిబింబిత= ప్రతిఫలించినట్టి, పర్ణజాల =ఆకులగుంపనెడు, నమ్ర=వంగినట్టి, నఖర=గోళ్లయొక్క, యుక్తిన్=సంబంధముచేత; తోఁచు = తోఁచునట్టి; అలమౌక్తిక శృంగనృసింహమూర్తి= ఆముత్యములశిఖర మనెడు నృసింహస్వామి; అధిత్యకా ప్రభవి తోన్నత విద్రుమవల్లికల్– అధి

త్యకా =పర్వతోర్ధ్వప్రదేశమందు, 'ఉపత్యకాద్రే రసన్నా భూమి రూర్ధ్వ మధిత్యకా' అని యమరుఁడు, ప్రభవిత= సంజాతప్రభవము లైన, ఉన్నత=విశాలము లయిన, విద్రుమవల్లి కల్=పగడపుఁదీవలు; పలాశన=రాక్షసుని (హిరణ్యకశిపుని)యొక్క; జఠరంబు=పొట్టను; పెలుచన్= ఆగ్రహముచేత; చీర్చి=బ్రద్దలు చేసి; పయిన్=మీఁదికి; ఎత్తు=ఎత్తునట్టి; నవ=క్రొత్తనగు; అంత్ర =ప్రేవులయొక్క; పాళిగన్=గుంపగుచుండఁగా; పెంపొనరెన్= ఒప్పారెను; కనుమా=చూడుమీ.

ఈహేమకూటమునందు ముక్తామయమగు నొకశృంగము నృసింహునిఁ బోలి, దానియందుఁ బ్రతిఫలించిన పల్లవములు నఖములఁ బోలి యుండఁగా, నధిత్యకలయం దుదయించిన పగడపుఁదీవలు హిరణ్యకశిపుజఠరము సీర్చి పైకెత్తిన ప్రేఁగులా యనునట్లు విలసిల్లె నని భావము.

సీ. వదనాంబుజమరీచి◊వారంబు తొలుదొల్త, నృక్షనాయకమాన◊రీతి నొంపఁ,
గలితవీక్షాపాత◊కలనంబు లంతంతఁ, బుండరీకమదైక◊భూతి మాన్ప,
సరసోరుయుగవిభా◊సారంబు మునుమున్న, కదళికామహిమంబుఁ◊ గడకుఁ దేర్పఁ,
గబరికాబంధవై◊ఖరి మించి వేవేగఁ, బరమఘనాఘన◊స్ఫురణఁ దూల్ప,

తే. నలరి కాంతారమృగనికా◊యముల నడఁప, నిరతమృగయానువర్తనా◊పరత నరతఁ
గాంచి యిచ్చటి తటులఁ జ◊రించు చెంచు,చంచరీకాలకలఁ జూడు ◊జనవరేణ్య! 13

టీక: జనవరేణ్య=సుచంద్రుఁడా! ఇచ్చటి తటులన్=ఈహేమకూటపు సానువులయందు; వదనాంబుజమరీచివారంబు– వదనాంబుజ=ముఖకమలముయొక్క, మరీచి=కాంతులయొక్క, వారంబు=సమూహము; తొలుదొల్తన్= తొల్తనే; ఋక్షనాయక=భల్లూకశ్రేష్ఠముయొక్క, చంద్రునియొక్క యని యర్థాంతరము; మానరీతిన్= అహంకారభంగిని; నొంపన్= అడంపఁగా;

కలితవీక్షాపాతకలనంబులు – కలిత=ఒప్పుచున్న; వీక్షాపాతకలనంబులు =దృక్పాతముల వ్యాప్తులు; అంతంతన్= ముందుగనే; పుండరీకమదైకభూతిన్ – పుండరీక= శార్దూలములయొక్క, తెల్లదామరలయొక్క యని యర్థాంతరము; మద= గర్వముయొక్క; ఏక=ముఖ్యమగు; భూతిన్=సంపదను; మాన్పన్= పోగొట్టఁగా;

సరసోరుయుగవిభాసారంబు – సరస=శ్రేష్ఠమగు, ఊరు=తొడలయొక్క,యుగ=కవయొక్క, విభాసారంబు = కాంతిసారము; మునుమున్న=ముందుముందుగనే; కదళికా=లేళ్ళయొక్క, 'కదళీ కన్దళీ చీన శ్చమూరు ప్రియకావపి' అని యమరుఁడు, అనఁటులయొక్క యని యర్థాంతరము; మహిమంబున్=అతిశయమును, కడకున్ తేర్పన్=దూరీకరింపఁగా;

కబరికాబంధవైఖరి – కబరికాబంధ=కేశబంధముయొక్క; వైఖరి=రీతి; వేవేగన్=అతివేగముగా; పరమఘనాఘనస్ఫురణన్ –పరమ=శ్రేష్ఠమగు; ఘనాఘన= మదపుటేనుఁగులయొక్క, వార్షుకాబ్దములయొక్క యని యర్థాంతరము; స్ఫురణన్= ప్రకాశమును; తూల్పన్= తొలఁగింపఁగా;

అలరి =సంతసించి; కాంతారమృగనికాయములన్=అరణ్యమృగసమూహములను; అడఁపన్=అడంచుటకు; నిరతమృగయానువర్తనాపరతన్ – నిరత=ఎల్లపుడు, మృగయానువర్తనా=వేట ననుసరించుటయందు, పరతన్=ఆసక్తిచేత; నరతన్= నరత్వమును; కాంచి=పొంది; చరించు=సంచరించుచున్న; చెంచుచంచరీకాలకల = తుమ్మెదలవంటి ముంగురుగల చెంచు కాంతలను; చూడు= చూడుము. 'శ్లో. భామాసేయం బలిజకులజా భావభూభాగధేయమ్' అనునట్లు చెంచుశబ్ద ప్రయోగము.

ఈపర్వతమందుఁ జరించు చెంచువనితలు తమముఖకాంతి ఋక్షమానమును, దృక్కాంతి పుండరీకములగర్వమును, తొడలు కదళీమదమును, కొప్పులు ఘనాఘనములదర్పమును తమసంకల్పమునకు మునుమున్నే తొలఁగఁజేయఁగా సంత సించి నిరతమ్మృగయాపరత్వముచే నరజన్మమెత్తినవారే కాని వాస్తవముగ మనుష్యస్త్రీలు కా రని భావము.

చ. నికటఝరీకృపీటసరణిం దనరూపము సూచి భవ్యమౌ
క్తికమయకూటసీమఁ దగుకేసరి తాఁ బ్రతిసింహబుద్ధిఁ గో
పకలనమై వడిన్ దుమికి పైకొని సీర్చి తదంతరస్థర
త్నకులము లంచు నాత్మఁ గొని దారున వెల్వడెఁ గాన్పు మోనృపా! 14

టీక: ఓనృపా=ఓసుచంద్రుఁడా! భవ్యమౌక్తికమయకూటసీమన్ – భవ్య=మనోజ్ఞమైన, మౌక్తికమయ= ముక్తామయ మగు, కూటసీమన్ =శిఖరప్రదేశమందు; తగు=ఒప్పునట్టి; కేసరి=సింహము; నికట ఝరీ కృపీటసరణిన్– నికట=సమీపమందలి, ఝరీ=సెలయేటియొక్క, కృపీటసరణిన్=జలప్రదేశమందు; తనరూపము =తనప్రతిబింబమును; చూచి=అవలోకించి; తాన్= తాను; ప్రతిసింహబుద్ధిన్=ప్రతిస్పర్ధి యగు మఱియొక సింహ మను బుద్ధిచేత; కోపకలనమై= కోపావిష్టమై; వడిన్=వేగముగా; దుమికి=ఆజలములో దుమికి; పైకొని=కవిసి; సీర్చి=బ్రద్దలు చేసి; తదంతరస్థరత్నకులములు=ఆజలమధ్యమున నుండు రత్న జాలములు; అంచున్=అనుచు; ఆత్మన్=మనమునందు; కొని=అనుకొని; దారునన్=వేగముగా; వెల్వడెన్ = బయల్పడెను; గాన్పుము =అవలోకింపుము. ఈహేమకూటముయొక్క మౌక్తికమయ మగు నొకశృంగమందుఁ దగు సింహము చెంత నున్న సెలయేటిప్రవాహమునఁ బ్రతిఫలించిన తనరూపమును జూచి ప్రతిసింహ మనుకొని కోపించి, దుమికి, సీర్చి, యది ప్రతిసింహము కాదు జలాంతరమున నున్న రత్నచయ మనుకొని వేగముగ వెల్వడె నని భావము.

చ. అలఘుపరాగహేమవసనాంచల మించుక జాఱఁ దేఁటిచూ
పుల మరు గెల్చు నీసొబగుపొంకముఁ గన్గొని మోహతాపసం
కలనత నో మహీరమణ! కంటివె యీ వనలక్ష్మి వేఁడియూ
ర్పులు వెడలించెఁ జంపకపుఁబువ్వుల మాఁగినగాడ్పుచాలునన్. 15

టీక: ఓమహీరమణ=ఓ సుచంద్రుఁడా! ఈవనలక్ష్మి = ఈవనసంపద యనెడు నొక స్త్రీ; అలఘుపరాగహేమవసనాంచలము – అలఘు=విశాలమగు, పరాగ=పుప్పొడి యనెడు, హేమవసన=స్వర్ణవస్త్రముయొక్క, అంచలము=అగ్రము; ఇంచుక= కొంచెము; జాఱన్ =జీరాడఁగా; తేఁటిచూపులన్= తుమ్మెదలనెడు చూపులచేత; మరు గెల్చు నీసొబగుపొంకమున్ = కాముని నోడించు నీసౌందర్యముయొక్క పొందికను; కన్గొని=అవలోకించి; మోహతాపసంకలనతన్—మోహ=వలపువలన నైన, తాప =సంతాపముయొక్క, సంకలనతన్=సంబంధముచేత, 'సంకలయతీతి సంకలనః' కర్త్రర్థమందు నంద్యాదిల్యుట్ప్రత్యయము; చంపకపుఁబువ్వుల మాఁగినగాడ్పుచాలునన్=సంపెంగిపువ్వుల సంబంధియైన మాఁగిన గాడ్పులయొక్కగుంపు చేత; వేఁడి యూర్పులు వెడలించెన్= ఉష్ణ మగు నిశ్వాసములను విడిచెను; కంటివె=చూచితివా?

ఇందు సుచంద్రునందు వనలక్ష్మికిఁ దదీయసౌందర్యవిశేషాద్యవలోకనమహిమచేఁ బ్రథమరాగోదయ మైనట్లు వ్యక్తమగు చున్నది కావున నభిలాషహేతుకవిప్రలంభశృంగారము వ్యజ్యమానమగును. విప్రలంభ మనఁగావియోగకాలావచ్ఛిన్నరతియె.

నాయికానాయకులకు వైయధికరణ్యము వియోగ మని కొంద ఱభిప్రాయపడినారు గాని యట్లైనచో ‘శ్లో. ఏకస్మిన్ శయనే పరాఙ్ముఖతయా వీతోత్తరం తామ్యతో రన్యోన్యస్య హృది స్థితేప్యనునయే సంరక్షతో ర్గౌరవమ్’ ఇత్యాదికావ్యములయం దేకశయ్యావిప్రలంభము చెప్పఁబడినది యసంగత మగును గావున వియుక్తుండ నైనవాఁడ నను బుద్ధియె వియోగమ్మని సిద్ధాంతము. ఇట్టి విప్రలంభమునకు సుచంద్రుఁ డాలంబనవిభావంబును, తదీయ సౌందర్యాదు లుద్దీపనవిభావంబులును, వేఁడి యూర్పు లనుభావంబులును, ఆక్షిప్యమాణరోమాంచాశ్రుపాతాదులు సాత్త్వికములును. తాదృశచింతాదైన్యాదులు వ్యభిచారులును పరిపూర్ణము లగు కారణకార్యసహకారు లుండుటంబట్టి లోకోత్తరవిభవంబు ఘటించినయది. విభావానుభావాది స్వరూపము ముందు వివరింపఁబడును.

చ. అతులఫణీశరమ్యకట౦కాన్వితమై, నిజమూర్ధభాగసం
భృతమలినాన్యపుష్కరఝ౦రీతిలకం బయి, కాలికానుషం
జిత మయి, దేవసేవ్య మయి ౦చెన్నగు నీకుధరాధిరాజ మో
క్షితివరచంద్ర! కైకొనుట ౦చిత్రమె ధాత్రి గిరీశనామమున్. 16

టీక: ఓక్షితివరచంద్ర =ఓరాజచంద్రుఁడా! అతుల ఫణీశ రమ్య కట కాన్వితమై– అతుల=అసమానము లగు, ఫణీశ=సర్పశ్రేష్ఠములచే, రమ్య= మనోజ్ఞము లగు, కటక=చరులతోడ, అన్వితమై=కూడుకొన్నదై, సాటిలేని ఫణీశుఁలనెడు రమ్య మయిన కడియములచేఁ గూడినదై యని యర్థాంతరము; నిజ మూర్ధభాగ సంభృత మలినాన్య పుష్కర ఝరీతిలకం బయి—నిజ= తన దైన, మూర్ధభాగ=శిరోభాగమందు, సంభృత=భరింపఁబడిన, మలినాన్య=నిర్మల మగు, పుష్కర= జలము గల, ఝరీ తిలకం బయి =శ్రేష్ఠ మగు సెలయేళ్లు కలదయి, మలినాన్య యగు పుష్కరఝరీ యనఁగ వ్యోమగంగ గల దయి యని యర్థాంతరము; కాలికానుషంజిత మయి – కాలికా=మేఘమాలచేత, పార్వతీదేవిచేత నని యర్థాంతరము, అనుషంజిత మయి =సంసక్త మయి; దేవసేవ్య మయి =దేవతలకు విహరించు స్థల మయి, ఇంద్రాదిభజనీయ మయి; చెన్నగు= ఒప్పుచున్న; ఈకుధరాధి రాజము =ఈపర్వతశ్రేష్ఠము; ధాత్రిన్=భూమియందు; గిరీశనామమున్=గిరిశ్రేష్ఠమను పేరిని, శివనామము నని యర్థాంతరము; కైకొనుట =స్వీకరించుట; చిత్రమె = ఆశ్చర్యకరమా? గిరీశునందున్న గుణగణముతో విరాజితం బగు నీపర్వతమునకు గిరీశ మను నామ ముండుట యాశ్చర్యకరము గా దనుట.

సీ. అలరుఁదీవియలఁ బా౦యక మించుక్రొందేఁటి,జోటిమ్రోఁత లొయారి౦పాట గాఁగ,
స్థలకంజినీకం౦జములగాడ్పు దారిఁ బైఁ, బర్వుపుప్పొడి పచ్చ౦పావడలుగఁ,
గనకశృంగాగ్రసం౦గతపాండుకాండదా౦నీకముల్ నవపుండ౦రీకములుగ,
నతిచలచ్ఛదయుక్తి౦నలరురంభాస్తంభ౦జాలంబు జయపతా౦కాలి గాఁగ,
తే. భోగవతికావతంసముల్ ౦పుణ్యతరులు, రాజశార్దూలసంఘముల్ ౦ప్రాంతవీథిఁ
గొలువఁ బేరోలగం బున్న౦చెలువుఁ బూనె, నీధరాభృద్వరునిఁ గంటె ౦ భూధరేంద్ర! 17

టీక: భూధరేంద్ర =ఓరాజేంద్రుఁడా! అలరుఁదీవియలన్=పువ్వులతోఁ గూడిన తీవలను; పాయక=వదలక; మించుక్రొందేఁటి జోటిమ్రోఁతలు—మించు=అతిశయించునట్టి, క్రొందేఁటిజోటి=వయసుతుమ్మెదబోఁటులయొక్క, మ్రోఁతలు=ఝుంకారములు; ఒయారిపాట గాఁగన్= నారీమణులపాట యగుచుండఁగా;

స్థలకంజినీకంజములగాడ్పు దారిన్ – స్థలకంజినీ=మెట్టదామరతీవలయొక్క, కంజముల=పద్మములయొక్క, గాడ్పుదారిన్ =వాయుప్రసరణమార్గముచేత; పైఁ బర్వుపుప్పొడి =పయి కెగయు పుష్పరేణువు; పచ్చపావడలుగన్=పసిఁడిపంచెలు గాఁగ; కనకశృంగాగ్ర సంగతపాండుకాండదానీకముల్—కనక= సువర్ణమయము లగు, శృంగ=శిఖరములయొక్క, అగ్ర=కొనల యందు, సంగత=కూడియున్న, పాండు=తెల్లనగు, కాండద =మేఘములయొక్క, అనీకముల్=గుంపులు; నవపుండరీకము లుగన్ =శ్వేతచ్ఛత్రములు కాఁగా;

అతిచల చ్ఛద యుక్తి న్–అతిచలత్=మిక్కిలి కదలుచున్న, ఛద=పర్ణములయొక్క, యుక్తిన్=సంబంధముచేత; అలరు= ఒప్పుచున్న; రంభాస్తంభ= అనఁటిస్తంభములయొక్క, జాలంబు=గుంపులు; జయపతాకాలి కాఁగన్ = విజయధ్వజముల గుంపులు కాఁగా;

భోగవతికా వతంసముల్ =వేశ్యారత్నములు, నాగకన్యకాశ్రేష్ఠములు; పుణ్యతరులు=మిక్కిలి పుణ్యశీలురైనవారు, మనోజ్ఞము లగు వృక్షములు, 'పుణ్య మ్మనోజ్ఞేఽభిహితం తథా సుకృత ధర్మయోః' అని విశ్వము; రాజశార్దూలసంఘముల్ = రాజ శ్రేష్ఠుల గుంపులు, వ్యాఘ్రశ్రేష్ఠముల గుంపులు; ప్రాంతవీథిన్=సమీపప్రదేశమందు; కొలువన్=సేవించుచుండఁగా ; పేరోలగం బున్న చెలువున్=కొలువుకూటమందున్న యందమును; పూనెన్=వహించెను; ఈధరాభృద్వరునిన్=ఈపర్వత శ్రేష్ఠమును, ఈ రాజశ్రేష్ఠము నని ధ్వనితార్థము; కంటె =అవలోకించితివా?

క్రొందేఁటిజోటిమ్రోతలు నారీమణులగానంబులుగాను, మెట్టదామరలనుండి వెడలుగాడ్పునఁ బైఁబర్వు పుప్పొడి పసుపు పంచగాను, శిఖరాగ్రమందు వెలయు తెల్లమబ్బు శ్వేతచ్ఛత్రముగాను, కదలుచున్న యాకులు గల యనంటులు జయపతాక ములుగాను శోభిల్లుచుండఁగా, నాగకన్యకాశ్రేష్ఠంబు లనెడు వేశ్యారత్నంబులు, మనోహరములగు వృక్షములనెడు పుణ్య వంతులు, శ్రేష్ఠములగు పులు లనెడు రాజశ్రేష్ఠులు చెంతలం గొలుచుచుండఁగాపేరోలగం బున్న రాజరత్నమువలె నీధరాధర శ్రేష్ఠము తేజరిల్లుచున్న దని తాత్పర్యము.

వ. వెండియు నీహేమకూటంబు హేమకూట ప్రభాకూట సంధ్యారాగోదయవైఖరీ పరిఫుల్ల్యమాన గిరిమల్లి కావల్లికా ప్రసూనాంబుజాత ప్రవాహ సంవర్ధితం బగుట నాత్మనిదానాభిధానంబునం బ్రసిద్ధిం బొందు నతి మంజుల హింజులపుంజ వలయంబు నడుమం జెలువూను పారిజాతమహీజాత లతానికాయకాయమానం బుల క్రింద నందంబు లగుకురువిందవేదికాబృందంబులపై నిండువేడుక నెమ్మనంబుల మెండుకొన నెచ్చెలి పిండు పసిండిదండియలు పూని సుతి మీట నతికలిత కలనాద కాకలీస్వర విలసనంబున విషమాంబక బిరుదగీతవ్రాతంబులు పాడు తెఱగంటికలువకంటిదంటల నవీన తానసంతానమానంబులం జొక్కి సం జాతపులకప్రరోహంబులం బొలుచు చెలువున నుదారకోరకవారంబులం జూపట్టు నీరంధ్రప్రియాళుప్రతా నంబులవలన నీరంధ్రప్రియాళు ప్రతాన నికుంజగేహంబుల నొక్కయెడనైన నినభయంబు గానక సుఖం బుండి యాఖండలశిలాగండోపలఫలక ప్రతిఫలి తాధిత్యకాస్థల రమమాణ గరుడమాణవకమూర్తులం గని వెఱ దొరయ నచ్చటం జొరఁబాఱు చిలువదొరల ఫణాతల మణికులభాస్వద్ఘృణిపూరంబులకు నిలువ నోపక వెడలి పఱతెంచు కటికిచీకటి కిన్నరాంబుజముఖీ కదంబక విరచిత నూతన దోహద ధూమంబుల యోజం దేజరిల్ల సద్యస్సముత్పద్యమాన ఫలమిళిత శాఖాకలితంబు లగు దాడిమీ కులంబులఁ దిలకించి

యచ్చటి కాశ్రయింపం జనుదమని నిజప్రియజనంబులఁ బిలుచు రాచిలుకచిలుకలకొలకుల కలికిపలుకులు విని యలరు కర్ణికారవారంబులవలనఁ గర్ణికారవార ప్రవాళశ్రేణు లబ్జరాగతోరణ మాలికలును, నిస్తుల గోస్తనీ విలంబమాన ఫుల్లగుచ్ఛంబు లచ్ఛమౌక్తిక వితానంబులును, నమలకకుత్థ్సల నానట్యమాన మత్తాళిపాళిక లభిరూపధూపధూమమాలికలునుం గాఁగ నమరు మందార వీరున్మందిరంబున సంపెంగ తీవ జాళువాగొలుసుల నుయ్యెల లూఁగు సాధ్యమిథ్యామధ్యాజనంబుల చరణపయోజసంయోజనంబులకు లక్ష్యంబులై తదీయ స్పర్శన వినిర్గతానురాగకందళంబుల యందంబునం జివురించు నశోకానోకహంబులవలన నశోకానోకహకుసుమవిసర వర్షిత మరంద ధారాళధారా గౌరవంబునఁ బెనులోయఁ బడిన ధగధగని పగడంపుఁగోనల ఘుగఘుగ వలచు కపురంపుటనంటుల చప్పరంబుల క్రిందం జెప్పరాని వేడుక ముప్పిరిగొన విచ్చలవిడి డాఁగిలిమ్రుచ్చులాడునెడ నెడయనివడి యడర నుదంచిత చంచరీకమాలికల నుల్లసిత పల్లవంబుల నుత్తుంగ నిస్తుల స్తబకంబుల నుజ్జ్వలత్కళికాకులంబుల నుల్లసిల్లు తరుణవ్రతతికలం గల కుడుంగరంగంబులలోఁ దమ్ముఁ దెలియకుండ డాఁగియున్న యన్నులమిన్నల వీక్షింపఁ జరించు సిద్ధరాజ తనూజా సమాజంబుల నిశాత విలోచనాపాతంబుల నపూర్వవిలాసంబుఁ గాంచు తిలకనగతిలకంబులవలనఁ దిలకనగతిలక కుసుమ గళ న్మకరంద సంపర్కంబునం బదనైన ముత్తియంపుదొనల నిండిన సంకుమదపంకంబునం బొంకంబుగా మృదుమృదుత్వగభినవదళంబుల నలినభవునిం గొలువఁ జనిన తమతమ రమణునికై సందేశంబులు లిఖించి చెలుల నంచి పంచశర పంచశరీప్రపంచిత రహణశిఖిశిఖాంచల చంచలిత మానసంబున నడలి బడలి చెలువ మెలుపు కలువదొర రాయరంగులం బఱచిన కలువరేకు జముకాణంబులపయిం బొరలు గంధర్వసౌగంధికగంధిరత్నంబుల సంతాపంబు సన విరినీరు నించియు, కెంజివురులం గప్పియుఁ, జల్లపుప్పొడులు సల్లియు, నలరుజొంపంబులం బొదివియు, శీతలోపచారంబులు సేయు తత్ప్రియవయస్యాలలామంబులకుం దోడునీడలై, చూడం దగు వాసంతికాజాతంబు లలసవాతపోత ప్రచారంబులం గౌఁగిలింప నవారిత సుమనోవికాసంబునం బొలుపు గాంచు కురువకలతా వలయంబులవలనఁ గురువకలతావలయ వల్లవపల్లవాధరామండల మధ్యస్థల సందర్శనీయ పురందరశిలాశిఖర నందనందన సంభృత రంజిత వేణుదండాయమాన మానిత కటకవాల వాయజ సూత్రానుబింబంబు లహిరూపంబులుగా నెఱింగి యుప్పొంగి చెంగున నెగసి చరణంబులం ద్రొక్కిపట్టి చంచూపుటంబుల సించి ఱెక్కల నడిచి యేమియుం దేరకున్న విస్మయంబు మనంబు బెరయ విఫల ప్రయత్నంబులై పుడమి వ్రాలు కాంతార మయూర దారకంబులం జొచ్చి కికాకిక కేళి సల్పు గరుడసరోజముఖీ నికరంబుల దరస్మిత విలాసంబున సమధిక పథికచేతస్తాప సంవర్ధక ప్రసవామోద పరంపరలఁ జెన్ను మీఱు పున్నాగపూగంబులవలనఁ బున్నాగ పూగ మధుసాల రసాలముఖ్య దివ్యతర్వంతరంబున

మంజులకంజరాగ భిత్తిభాగ మరీచిపుంజంబు భాస్వదాతప ప్రాబల్య ఖంజనంబును, శాతకుంభకుంభవిభా డంబరంబు సంధ్యారాగారంభంబును, వలభిన్మణివలభి రుచిరరుచి పూరంబు నిబిడ తిమిర వివర్ధనం బును, ముక్తోల్లోలవిభాసారంబు దారకానిసర్గంబును, భూరిస్తంభ సంగ్రథిత హీరదర్పణ ద్యుతిజాతంబు నిస్తంద్ర చంద్రికా కల్ప నంబునుం గావింప నక్షీణ క్షణదైక విలసనంబునం బొలుచు కేళికాహర్మ్యంబున మిక్కిలి పిక్కటిల్లు మక్కువఁ జక్కెరవిల్తుజగడంబుల మగలఁ జొక్కించి యాత్మీయ పుంభావసంభా వనా సంభూతశ్రమంబు దూలఁ జెంగటి వనుల సంచరించు నాగకన్యావతంసంబుల యాగాఢ నిశ్వాస సమీరంబుల తోరంబగు సిరి నొప్పారు సిందువారంబులవలన సిందువారాది నగవార శిలాతలంబుల నురులు దాల్చియు, నెత్తమ్ము లిమ్ముగాఁ బ్రవహించు సెలయేఱులపై వలలు సేర్చియు, స్వజాతి ద్విజా తుల రాఁబిలుచు పులుగుల దీములు గట్టియు, జిగురుఁగండె లమర్చియు, విచిత్రతరవనపతత్రిగోత్రం బులం బట్టుకొను తలంపున మెండైన పొదలనుండి యప్పటప్పటికి వానిం గానఁ దమకించి చెంచెత లెత్తు నెమ్మొగంబు తమ్మిచాయల వసంతసమయ సముదిత సౌభాగ్యమ్మునం బొదలు చామ్పేయ ధాత్రీరుహం బులవలనఁ జామ్పేయధాత్రీరుహ కుసుమగళిత పరాగరాశి మధురసనదీ పులినదేశంబునఁ గపురంపుట నంటి లేయాకుఁ బఱచి మరకత మకరకేతనాహితమూర్తిని నిలిపి తదేకపూజాతాత్పర్యంబున నున్న సద్గ ణోత్తములకు విరు లొసంగు నంతరంగంబునఁ బ్రమదావనంబు సొచ్చి ప్రమథమధురోష్ఠితల్లజంబులు గేల నూది నిక్కి విటపాంతరాభివేష్టిత మల్లికాప్రసూనంబులఁ గోయునెడఁ దత్కర సంయోగంబువలన నిజేష్ట ఫలలాభంబు చేకూరెనో యన రమ్యఫలంబులం బెంపొందు మాకందంబులవలన మాకందవాసనాభి వాసిత పవమాన ప్లవమాన నీలాశోకరజస్తోమంబు ప్రవర్గ్యోపక్రమ నిర్గచ్ఛద్ధూమ వర్తనంబునం బర్వ నమం దానంద కందళితచిత్తారవిందంబులతో ముందుముందుగఁ బఱతెంచు పురందరాది బృందారకవర్గంబుల తనూశ్రమంబుఁ దెరలం జేయు శీతలతర తాపసాశ్రమ నానావిధ వసుధారుహ నివహంబుల చెంతలం దదీయ శాఖాప్రసవముఖ వినిష్ఠ్యూత మధుపాళికం బ్రసవితంబులగు విశారద విటపి పటలంబులవలనను, వలను మిగిలి మేరుకుధరంబునుంబోలె శక్రపురాతిభాసురంబును, హిమవన్నగంబునుంబోలె గోభృత్కా ర్ముకాన్వితకాళికాతిశోభితంబును, మందరధరంబునుంబోలె వ్యాళాధిరాజ పరివేష్టితంబును, ఋశ్యమూ కాద్రియుంబోలె హరిజాతికలితంబును, మాల్యవద్గోత్రంబునుంబోలె రామసంచారసంగతంబును, నీలాచ లంబునుంబోలె పురుషోత్తమభూషితంబును, గంధమాదనగ్రావంబునుంబోలె మహావరాహపాళికాలింగి తంబును, సమామోద సంకలిత శ్యామా మహితం బయ్యును నసమామోద సంకలిత శ్యామామహితంబై, వీనఘనార్భటి విఘూర్ణిత మహాబిలం బయ్యును నవీనఘనార్భటి విఘూర్ణిత మహాబిలంబై, మరాళికా శ్రిత కటక స్థలవనజాతం బయ్యును నమరాళికాశ్రిత కటకస్థల వనజాతంబై, సదృక్ష రాజసారంగ సంతాన

సంకలితం బయ్యును నసదృక్ష రాజసారంగ సంతాన సంకలితంబై, కాలాహితసుమనోనగభాసమానం బయ్యును నకాలాహిత సుమనో నగభాసమానంబై యొప్పుచున్న యది విలోకింపుము.

టీక: వెండియున్=మఱియును; ఈహేమకూటంబు=ఈహేమకూటపర్వతము, దీనికి వచనాంతమందున్న యొప్పుచున్న దను క్రియతో నన్వయము;హేమకూట ప్రభాకూట సంధ్యారాగోదయ వైఖరీ పరిఫుల్ల్యమాన గిరిమల్లికా వల్లికా ప్రసూనాంబు జాత ప్రవాహ సంవర్ధితం బగుటన్ – హేమకూట=కనకశిఖరములయొక్క, ప్రభాకూట=కాంతిపుంజ మనెడు, సంధ్యారాగ= సాయంకాలసూచక మగు నారుణ్యముయొక్క, ఉదయ = ఆవిర్భావముయొక్క, వైఖరీ = రీతిచేత, పరిఫుల్ల్యమాన = వికసించుచున్న, గిరిమల్లికా=కుటజవృక్షములయొక్క, వల్లికా=లతలయొక్క, ప్రసూన= పుష్పములయొక్క, అంబుజాత = మకరందసమూహముయొక్క,ప్రవాహ=వఱదచేత, సంవర్ధితం బగుటన్=వృద్ధిఁబొందింపఁ బడినదైన హేతువుచేత; ఆత్మనిదానాభిధానంబునన్—ఆత్మ=తమకు, నిదాన=ఆదికారణముయొక్క, అభిధానంబునన్=పేరిచేత; ప్రసిద్ధిం బొందు నతిమంజుల హింజులపుంజ వలయంబు నడుమన్ –ప్రసిద్ధిం బొందు=ఖ్యాతిఁ గాంచునట్టి, అతిమంజుల=మిక్కిలి మనోహరము లగు, హింజుల=నీరుగన్నెరులయొక్క, అంబుజాతమువలన వృద్ధి నందినది గావున నీరుగన్నెర లని పేరు పొందినదట, 'నిచుళో హింజుళో హింజుః' అని యమరుఁడు, పుంజ వలయంబు నడుమన్ =వలయాకారమగు గుంపుల నడుమను; చెలువూను పారిజాత మహీజాత లతానికాయ కాయమానంబుల క్రిందన్ – చెలువూను=సౌందర్య మొందు, పారిజాత=పారిజాత మనెడు, మహీజాత=వృక్షములయొక్క, లతానికాయ=తీవగుంపుయొక్క, కాయమానంబుల క్రిందన్=పందిళ్లక్రింద; అందంబు లగు కురువిందవేదికా బృందంబులపైన్ – అందంబు లగు=సుందరములైన, కురువిందవేదికా=పద్మరాగమణులతోఁ గట్టిన తిన్నెలయొక్క, బృందంబులపైన్=సమూహములమీఁద; నిండువేడుక=పరిపూర్ణకుతూహలము; నెమ్మనం బులన్=మంచి మనస్సులందు; మెండుకొనన్=అతిశయింపఁగా; నెచ్చెలిపిండు=ప్రియసఖీసమూహము; పసిండిదండియలు =బంగరువీణలు; పూని =వహించి; సుతి మీటన్=శ్రుతిని అతిశయింపఁజేయఁగా, శ్రుతి యనఁగా స్వరారంభకావయవవిశేషము. 'శ్లో.ప్రథమశ్రవణాచ్ఛబ్ద శ్శ్రూయతే హ్రస్వమాత్రకః, సాశ్రుతి స్సంపరిజ్ఞేయా స్వరావయవలక్షణా' అని శ్రుతిలక్షణము; అతికలిత=మిక్కిలి కలయుచున్న; కలనాద=అవ్యక్తమధురధ్వని గల; కాకలీ స్వర=మధురమై అస్ఫుటమైన స్వరముయొక్క; విలసనంబునన్ =ఉన్మేషముచేత; విషమాంబక=పంచబాణునియొక్క; బిరుద=సామర్థ్యచిహ్నములయొక్క; గీత=గానములయొక్క; వ్రాతంబులు=సమూహములు; పాడు=పాడెడు; తెఱగంటి=దేవతాసంబంధినులగు; కలువకంటిదంటల=దిట్టతనము గల స్త్రీలయొక్క; నవీన=అపూర్వమగు; తాన= తానకారముతోఁ బాడెడు పాటలయొక్క; సంతానమానంబులన్= సమూహగౌరవములచేత; చొక్కి=సుఖపరవశమై; సంజాత పులక ప్రరోహంబులన్ – సంజాత= పుట్టినట్టి, పులక=రోమాంచములయొక్క, ప్రరోహంబులన్=అంకురములచేత; పొలుచు చెలువునన్=ఒప్పు చందంబున; ఉదారకోరకవారంబులన్ – ఉదార=గొప్పలయిన, కోరక=కలికలయొక్క, వారంబులన్=సమూహములచేత; చూపట్టు=కన్పడుచున్న; నీరంధ్ర=దట్టమైన; ప్రియాళు ప్రేంకణములయొక్క; ప్రతానంబులవలనన్=సమూహములవలన, ఈ పంచమ్యంతమునకు ముందు రాఁగల పంచమ్యంతములకు 'వలను మిగిలి' అను క్రియతో నన్వయము; నీరంధ్ర ప్రియాళు ప్రతాన నికుంజగేహంబులన్ – నీరంధ్ర=దట్టమైన; ప్రియాళు =ప్రేంకణములయొక్క; ప్రతాన=సమూహముయొక్క, నికుంజ గేహంబులన్=పొదరిండ్లయందు; ఒక్కయెడ నైనన్= ఒక సమయమం దైనను; ఇనభయంబున్=సూర్యభయమును; కానక= చూడక; సుఖంబుండి=సుఖముతోడ వసించి; ఆఖండల శిలా గండోపల ఫలక ప్రతిఫలి తాధిత్యకాస్థల రమమాణ గరుడ మాణవక మూర్తులన్ – ఆఖండలశిలా=ఇంద్రనీలమణులయొక్క,గండోపలఫలక=పలకలవంటి స్థూలోపలములయందు,ప్రతిఫలిత=ప్రతిబింబితములైన, ఇది మాణవకమూర్తులకు

విశేషణము,అధిత్యకాస్థల= పర్వతోర్ధ్వప్రదేశమందు, రమమాణ= క్రీడించుచున్న, గరుడ=గరుడపక్షులయొక్క, మాణవక =బిడ్డలయొక్క,మూర్తులన్=శరీరములను; కని=చూచి; వెఱ దొరయన్=భయమొదవఁగా; అచ్చటన్=ఆనికుంజగేహ ములయందు; చొరఁబాఱు=చొచ్చుచున్న; చిలువదొరల ఫణాతల మణికుల భాస్వద్ఘృణిపూరంబులకున్— చిలువదొరల= ఫణి శ్రేష్ఠములయొక్క, ఫణాతల=పడగలయందున్న, మణికుల=మణుల సమూహముయొక్క,భాస్వత్=ప్రకాశించుచున్న, ఘృణి=కాంతులయొక్క, కాదేని మణిసమూహ మనెడు సూర్యకిరణములయొక్క యని యర్థము, పూరంబులకున్=ప్రవాహ ములకు; నిలువన్ ఓపక=ఉండఁజాలక; వెడలి=బయలుదేఱి; పఱతెంచు=పోవునట్టి; కటికిచీకటి= గాఢాంధకారము; కిన్న రాంబుజముఖీ కదంబక విరచిత నూతన దోహద ధూమంబుల యోజన్— కిన్నరాంబుజముఖీ= కిన్నరస్త్రీలయొక్క, కదంబక =సమూహముచేత, విరచిత=చేయఁబడిన, నూతన=నవీన మగు, దోహద = దోహద మనఁగా తరుగుల్మలతాదుల కకాల మందు పుష్పఫలాదినిమిత్తమై చేయు క్రియావిశేషము. అట్టి క్రియావిశేషము లెవ్వి యన, దాడిమికి పొగ, అశోకమునకు స్త్రీపాద తాడనము, పొగడకు ముఖసీధువు, గోరింట కాలింగనము, బొట్టుగునకు వీక్షణము, మామిడికి కరస్పర్శము, సంపెఁగకు ముఖ రాగము, కొండగోఁగునకు సల్లాపము, వావిలికి ఊర్పు, మోరటికి పాట, సురపొన్నకు నవ్వు ఇత్యాదిగాఁ దెలియవలయు. అట్టి దోహదరూపమైన, ధూమంబుల=పొగలయొక్క, యోజన్ =రీతిచేత; తేజరిల్లన్=ప్రకాశింపఁగా; సద్యస్సముత్పద్య మాన ఫలమిళిత శాఖాకలితంబులగు దాడిమీ కులంబులన్— సద్యస్సముత్పద్యమాన=తత్కాలోత్పద్యమానములగు, ఫల= ఫలముల చేత,మిళిత=కూడుకున్నట్టి, శాఖా=కొమ్మలచేత, కలితంబులగు=ఒప్పుచున్నట్టి, దాడిమీ కులంబులన్= దానిమ్మ చెట్లగుంపులను; తిలకించి=చూచి; అచ్చటికిన్=అప్రదేశమునకు; ఆశ్రయింపన్=ఆశ్రయించుటకు; చనుదమని =పోవుదమని; నిజప్రియ జనంబులన్=తమ ప్రియులను; పిలుచు =ఆహ్వానముఁ జేయుచున్న; రాచిలుకచిలుకల కొలకుల=శ్రేష్ఠమైన శుకాం గనలయొక్క; కలికి= అందమైన; పలుకులు= మాటలను; విని=ఆకర్ణించి; అలరు=వికసించు; కర్ణి కారవారంబులవలనన్= కొండగోఁగుల సమూహమువలన; కర్ణికారవార = కొండగోఁగుగుంపులయొక్క; ప్రవాళ= పల్లవములయొక్క; శ్రేణులు= పరంపరలు; అబ్జరాగ=పద్మరాగమణిమయములైన; తోరణ మాలికలును=తోరణముల గుంపులును;

నిస్తుల=అసమానములగు; గోస్తనీ =ద్రాక్షయొక్క; విలంబమాన=వ్రేలాడుచున్నట్టి; ఫుల్ల=వికసించినట్టి; గుచ్ఛంబులు = గుత్తులు; అచ్ఛ=స్వచ్ఛమగు; మౌక్తిక =ముత్యములయొక్క; వితానంబులును =మేలుకట్లును; అమల= స్వచ్ఛమగు; కకుత్థ్సల=శ్రేష్ఠప్రదేశమందు; నానట్యమాన =విహరించుచున్నట్టి; మత్త=మదించిన; అళి=తుమ్మెదలయొక్క; పాళికలు= గుంపులు; అభిరూప=మనోహరమగు; ధూప =ధూపసంబంధియైన; ధూమ=పొగయొక్క; మాలికలున్=సమూహము లును; కాఁగన్=అగుచుండఁగా; అమరు= ఒప్పుచున్న; మందారవీరుత్=కల్పలతలయొక్క; మందిరంబునన్=గృహ మందు; సంపెంగతీవ జాళువాగొలుసులన్= సంపంగితీవ లనెడు బంగరుగొలుసులయందు; ఉయ్యెల లూఁగు=డోలావిహా రము సేయుచున్న; సాధ్య మిథ్యామధ్యా= తనుమధ్య లైన సాధ్యాంగనలయొక్క; జనంబుల= సమూహములయొక్క; చరణపయోజ=పాదపద్మములయొక్క; సంయోజ నంబులకున్=సంబంధములకు; లక్ష్యంబులై= విషయంబులై; తదీయ స్పర్శన వినిర్గతానురాగ కందళంబుల యందంబునన్— తదీయ స్పర్శన = ఆసాధ్యస్త్రీల పాదపయోజస్పర్శచేత, వినిర్గత =వెడలి వచ్చిన, అనురాగ=ప్రీతియొక్క, కందళంబుల యందంబునన్=అంకురముల భంగి; చివురించు నశోకానోకహంబుల వలనను = చిగురించుచున్న యశోకవృక్షములవల్లను, అశోకమునకు నబలాపాదతాడనము దోహద మని తెలుపఁబడియె; అశోకానోకహ కుసుమ విసర వర్షిత మరంద ధారాళ ధారా గౌరవంబునన్— అశోకానోకహ= అశోకవృక్షములయొక్క, కుసుమ విసర = పుష్పసమూహముచేత, వర్షిత=వర్షింపఁబడినట్టి, మరంద=పూఁదేనియయొక్క, ధారాళ= అధికమగు, ధారా =ధారలయొక్క, గౌరవంబునన్=అతిశయముచేత; పెనులోయఁ బడిన ధగధగని పగడంపుఁ గోనలన్ =పెద్దకొండచిలిక

యందుఁ బడిన ధగధగమని మెఱయు పగడములయొక్క కోనలందు; ఘుగఘుగ వలచు =ఘుగ ఘుగమని పరిమళించు; కపురంపుటనంటుల =కర్పూరపుటనఁటులయొక్క; చప్పరంబుల క్రిందన్ = పందిళ్ల క్రిందను; చెప్పరాని వేడుక =చెప్ప నలవిగాని సంతసము; ముప్పిరిగొనన్ = మిక్కిలి వృద్ధిఁ బొందఁగా; విచ్చలవిడి=యథేచ్ఛముగా; డాఁగిలిమ్రుచ్చులాడునెడన్ =డాఁగిలిమ్రుచ్చులను నాటలాడునపుడు; ఎడయని వడి=సందు లేని వేగము; అడరన్=ఒప్పఁగా; ఉదంచిత=మిక్కిలి యొప్పు చున్న; చంచరీకమాలికలన్=భృంగపంక్తులచేతను; ఉల్లసిత పల్లవంబులన్=ప్రకాశించుచున్న చిగురుటాకులచేతను; ఉత్తుంగ =ఉన్నతమగు; నిస్తుల=సాటిలేని; స్తబకంబులన్= గుత్తులచేతను; ఉజ్జ్వలత్కళికాకులంబులన్ = ప్రకాశించుచున్న మొగ్గల గుంపుచేతను; ఉల్లసిల్లుతరుణవ్రతతికలన్ =ప్రకాశించుచున్న లేఁతలతలయందు; కల = ఉండినట్టి; కుడుంగరంగంబులలోన్ =లతాగృహములయొక్క మధ్యప్రదేశములయందు;తమ్ముꣳన్; తెలియకుండ డాఁగియున్న = ఎఱుఁగకుండ దాఁగికొని యున్న; అన్నులమిన్నల =ఉత్తమస్త్రీలను; వీక్షింపన్=చూచుటకు; చరించు = సంచరించుచున్న; సిద్ధరాజతనూజా= సిద్ధ రాజకన్యకలయొక్క; సమాజంబుల=సంఘములయొక్క; నిశాత= తీక్ష్ణములగు; విలోచన=దృష్టులయొక్క; ఆపాతంబు లన్=ప్రసరణముచేత; అపూర్వవిలాసంబున్ = లోకోత్తరవిలాసమును; కాంచు తిలకనగ తిలకంబులవలనన్=కాంచునట్టి శ్రేష్ఠములగు తిలకవృక్షములవలనను, తిలకవృక్షము లనఁగా బొట్టుగుచెట్లు. వీనికి దోహదము వీక్షణ మని తెలుపఁబడియె; తిలకనగతిలక కుసుమ గళన్మకరంద సంపర్కంబునన్ –తిలకనగతిలకకుసుమ =శ్రేష్ఠములగు బొట్టుగులయొక్క పుష్పముల వలన, గళత్=జాఱుచున్నట్టి, మకరంద=పూఁదేనియయొక్క, సంపర్కంబునన్ =సంబంధమువలన; పదనైన=ఆర్ద్రమైన; ముత్తియంపుదొనలన్ = ముత్యపుదొనలయందు; నిండిన సంకుమద పంకంబునన్ = నిండినట్టి జవ్వాదిబురదచేత; పొంకంబు గాన్ = సుందరమగునట్లుగా; మృదు మృదుత్వగభినవదళంబులన్ –మృదు= మెత్తనగు, మృదుత్వక్ =భూర్జవృక్షము యొక్క, 'భూర్జే చర్మి మృదుత్వచౌ' అని యమరుఁడు, అభినవ=నూతనమగు, దళంబులన్= పత్త్రములయందు; నలిన భవునిన్=బ్రహ్మను; కొలువన్=సేవించుటకు; చనిన తమతమ రమణునికై = పోయినట్టి తమతమ ప్రియునికొఱకు; సందే శంబులు =స్వీయవృత్తాంతములు; లిఖించి=వ్రాసి; చెలులన్=సకియలను; అంచి =పంపి; పంచశర పంచశరీ ప్రపంచిత రహణశికీ శిఖాంచల చంచలిత మానసంబునన్ – పంచశర=మన్మథునియొక్క, పంచశరీ = శరపంచకముచేత, 'పంచానాం శరాణాం సమాహారః' అని ద్విగువు చేసి, జీప్ప్రత్యయము చేయఁగా పంచశరీ యని యైనది, ప్రపంచిత= విస్తరింపఁజేయఁ బడిన, రహణ=వియోగ మనెడు, శిఖి=అగ్నియొక్క, శిఖా=జ్వాలలయొక్క, అంచల =అగ్రములచేత, చంచలిత=మిక్కిలి చలింపఁ జేయఁబడిన,మానసంబునన్=మనస్సుచేత; అడలి=దుఃఖించి ; బడలి =అలసి; చెలువము =అందమును; ఎలపు= చేయుచున్న; కలువదొరరా=చంద్రకాంతమణులయొక్క; అరంగులన్= తిన్నెలమీఁద; పఱచిన కలువరేకు జముకాణంబుల పయిన్= పఱచినట్టి కలువఱేకు లను నాస్తరణవిశేషములందు; పొరలు= పరివర్తనము సేయుచున్న; గంధర్వ=గంధర్వుల యొక్క; సౌగంధికగంధిరత్నంబుల=స్త్రీరత్నములయొక్క, సౌగంధిక మనఁగా మంచి పరిమళము గల యొకవిధమైన కలువ. దానిగంధమువంటి గంధము గల వారలు సౌగంధికగంధులు. వారలలో శ్రేష్ఠులు సౌగంధికగంధిరత్నంబులు, 'సౌగంధికంతు కహ్లారమ్, రత్నం స్వజాతిశ్రేష్ఠేఽపి' అని యమరుఁడు; సంతాపంబు = సంతాపము; చనన్=పోగొట్టుటకు; విరినీరు=పుష్పజల మును; నించియు=పూరించియు, కెంజివురులన్=ఎఱ్ఱని చిగురుటాకులచేత, కప్పియున్=ఆచ్ఛాదించియు, చల్లపుప్పొడులు చల్లియున్ =చల్లని పుష్పరేణువులను జల్లియు; అలరుజొంపంబులన్ = పువ్వుల గుబురులచేత; పొదివియున్= కప్పియు; శీతలోపచారంబులు =శైత్యోపచారములను; చేయు=చేయుచున్నట్టి; తత్ప్రియవయస్యాలలామంబులకున్ = వారియొక్క ప్రియసఖీరత్నములకు; తోడునీడలై=సహాయములై; చూడన్=అవలోకించుటకు; తగు=ఒప్పుచున్న; వాసంతికాజాతంబులు =బండిగురువెందతీవల గుంపులు; అలస వాతపోత

=మందమారుతముయొక్క; ప్రచారంబులన్=సంచారము చేత; కౌఁగి లింపన్=ఆలింగనము సేయఁగా;అవారిత సుమనో వికాసంబునన్=అడ్డగింపఁబడని కుసుమవికాసముచేత; పొలుపుఁ గాంచు కురువకలతా వలయంబువలనన్ = అందమగు గోరంటతీవల వలయములవలనను, 'ఆలిఙ్గనేన కురవో హరిణేక్షణానా మామోద గౌరవభృతో భువి సర్వ ఏవ' అనుటవలన హరిణేక్షణాలింగనమే కురవకామోదహేతు వైనను, వాసంతికాజాతంబు నందే స్త్రీ లింగమహిమచే స్త్రీజాతత్వారోపమున విచ్ఛిత్తి విశేషము నపేక్షించి యిట్లు కవి వచించె. ఇట్లు మఱికొన్ని దోహదము లిందు వచింపఁబడినయవి;

కురువకలతావలయ వల్లవ పల్లవాధరా మండల మధ్యస్థల సందర్శనీయ పురందరశిలా శిఖర నందనందన సంభృత రంజిత వేణుదండాయమాన మానిత కటకవాల వాయజ సూత్రానుబింబంబులు– కురువకలతా వలయ = గోరింటతీవలగుంపనెడు, వల్లవ పల్లవాధరామండల =యాదవాంగనల గుంపుయొక్క, మధ్యస్థల = మధ్యభాగమందు, సందర్శనీయ=చూడ సొంపైనట్టి, పురందరశిలాశిఖర =ఇంద్రనీలమణిమయమైన శిఖర మనెడు, నందనందన =కృష్ణుని చేత, సంభృత=భరింపఁబడిన, రంజిత=ప్రకాశించునట్టి, వేణుదండాయమాన=వేణుదండమువలె నాచరించుచున్న, మానిత= పూజిత మగు, కటక=(అద్రి) నితంబప్రదేశమందలి, వాలవాయజసూత్ర = సూత్రాకార మగు వైడూర్యముయొక్క, 'వైడూర్యం వాలవాయజమ్' అని యమరుఁడు, అనుబింబంబులు=ప్రతిబింబములను; అహిరూపంబులుగాన్=సర్పములుగా; ఎఱింగి= తెలిసికొని; ఉప్పొంగి= విజృంభించి; చెంగున నెగసి =చెంగునపైకి లేచి, చెంగనునది ధ్వన్యనుకరణశబ్దము; చరణంబులన్ ద్రొక్కిపట్టి =పాదముల చేతఁ ద్రొక్కిపట్టి; చంచూపుటంబులన్=ముక్కులయొక్క యగ్రభాగములచేత; చించి =బ్రద్దలు చేసి; ఱెక్కలన్=పక్షములచేత; అడిచి=కొట్టి; ఏమియున్ తేరకున్నన్=ఏమియు తేటపడకుండఁగా; విస్మయంబు=ఆశ్చర్యము; మనంబు=మనస్సును; బెరయన్= పొందఁగా; విఫలప్రయత్నంబులు ఐ=నిష్ఫలమైన యత్నములుగలవి యై; పుడమిన్= భూమియందు; వ్రాలు= పడుచున్న; కాంతారమయూర దారకంబులన్=వనమయూరముల బిడ్డలను; చొచ్చి=చేరి; కికాకిక కేళిన్= 'కికాకిక' యను ధ్వనివిశేష ముతోఁ గూడిన క్రీడను; సల్పు=చేయునట్టి; గరుడసరోజముఖీ=గరుడస్త్రీలయొక్క; నికరంబుల=గుంపుల యొక్క; దరస్మిత విలాసంబునన్=మందహాసవిలాసముచేత; సమధిక=మిక్కిలి యధికమౌనట్లుగా; పథిక=పాంథుల యొక్క; చేతస్తాప=మనస్సంతాపమునకు; సంవర్ధక=మిక్కిలి వర్ధక మగునట్టి; ప్రసవ=పుష్పములయొక్క; ఆమోద= పరిమళముయొక్క; పరంపరలన్=సమూహములచేత; చెన్ను మీఱు=అందమగు; పున్నాగ పూగంబులవలనన్= పొన్నల గుంపులవలనను; పున్నాగ=పొన్నలు; పూగ=పోఁకలు; మధు=ఇప్పలు;సాల=ఏపెలు; రసాల=తీయమావులు; ముఖ్య= మొదలుగాఁ గల; దివ్య=లోకోత్తరములగు;తరు=వృక్షములయొక్క; అంతరంబునన్=మధ్యభాగమున; మంజుల కంజరాగ భిత్తిభాగ మరీచిపుంజంబు భాస్వ దాతప ప్రాబల్య ఖంజనంబును– మంజుల =మనోజ్ఞమగు, కంజరాగ=పద్మరాగమణుల యొక్క, భిత్తిభాగ=గోడలయొక్క ప్రదేశసంబంధులగు, మరీచి=కాంతులయొక్క,పుంజంబు=గుంపు, భాస్వదాతప = సూర్యాతపముయొక్క, ప్రాబల్య=అతిశయముయొక్క, ఖంజనంబును=నిలుకడను, 'ఖజి గతివైక్లబ్యే' అని యనుశాసనము. 'ఖండనంబు' నను పాఠము స్పష్టార్థకము. పద్మరాగభిత్తికాంతిపుంజము వృద్ధాతపమును బోలియున్నదనుట; శాత కుంభ కుంభ=కనకకలశములయొక్క; విభా=విశేషకాంతియొక్క; ఆడంబరంబు= విజృంభణము; సంధ్యారాగారంభంబును =సంధ్యాసమయారుణిమయొక్క ప్రాదుర్భావమును; వలభిన్మణి=ఇంద్రనీలములయొక్క;వలభి=చంద్రశాలలయొక్క; రుచిర=మనోహరమగు;రుచి=కాంతులయొక్క;పూరంబు =గుంపు; నిబిడ=దట్టమైన; తిమిర=చీకటికి; వివర్ధనంబును = ఛేదనమును; ముక్తా=ముత్యములయొక్క; ఉల్లోల=మిక్కిలి తరలమైన; విభా =విశేషకాంతియొక్క;సారంబు=స్థిరాంశము, 'ముక్తాఫలేషుచ్ఛాయాయా స్తరలత్వ మివాన్తరా' అని ముత్యములయందుఁ దరలత్వము లావణ్యలక్షణమున రసార్ణవసుధాకరములోఁ జెప్పఁబడినది, అది పూర్వము వ్రాయఁబడియె; తారకానిసర్గంబును=నక్షత్రస్వభావమును; భూరిస్తంభ సంగ్రథిత

హీరదర్పణ ద్యుతిజాతంబు – భూరిస్తంభ=సువర్ణస్తంభములయందు, సంగ్రథిత =కట్టఁబడిన,హీరదర్పణ=వజ్రదర్పణముల యొక్క, ద్యుతిజాతంబు=కాంతిపుంజము; నిస్తంద్ర చంద్రికా కల్పనంబును –నిస్తంద్ర =జాగరూకమైన అనఁగా తేజరిల్లునట్టి, చంద్రికా=వెన్నెలయొక్క,కల్పనంబును =ఉత్పాదనమును; కావింపన్=చేయఁగా; అక్షీణ క్షణదైక విలసనంబునన్ – అక్షీణ = అధికమగు, క్షణదా=రాత్రియొక్క, ఏక=ముఖ్యమగు, విలసనంబునన్=ప్రకాశముచేత; పొలుచు=ఒప్పునట్టి; కేళికాహర్మ్యం బునన్=క్రీడాసౌధమునందు; మిక్కిలి=అతిశయమగునట్లుగా; పిక్కటిల్లు =వృద్ధిఁబొందునట్టి; మక్కువన్=ప్రేమచేత; చక్కెర విల్తు జగడంబులన్=మదనకదనములందు; మగలన్=భర్తలను; చొక్కించి=సుఖపరవశులను జేసి; ఆత్మీయ=తమసంబంధి యైన; పుంభావ=పురుషాయితముయొక్క; సంభావనా =నిష్పాదనమువలన;సంభూత=పుట్టినట్టి;శ్రమంబు=ఖేదము; తూలన్ =తొలఁగుటకు; చెంగటి వనులన్=సమీపములందలి వనములయందు; సంచరించు=విహరించుచున్న; నాగకన్యావతంసం బుల =శ్రేష్ఠలగు నాగకన్యలయొక్క; ఆగాధ =మిక్కిలి దట్టమగు;నిశ్వాస సమీరంబులన్=నిశ్వాసవాయువులచేత; తోరం బగు సిరిన్=అధికమైన పుష్పఫలసంపదచేత; ఒప్పారు =ఒప్పుచున్న; సిందువారంబులవలన=వావిలిచెట్లవలనను; సిందువా రాది =వావిళ్లు మొదలగు; నగవార=చెట్లసమూహములు గల; శిలా=పాషాణములయొక్క;తలంబులన్=ప్రదేశములయందు; ఉరులు=మృగబంధనంబులు; తాల్చియున్=ధరించియు;నెత్తమ్ములన్=పర్వతములమీఁది సమప్రదేశమునందు; ఇమ్ముగాన్ = ఇంపుగా; ప్రవహించు సెలయేఋలపైన్=పాఱుచున్న సెలయేఋలమీఁద; వలలు=బంధరజ్జువులను; చేర్చియున్= ఉంచి యును; స్వజాతి ద్విజాతుల =తమజాతి పక్షులను; రాఁబిలుచు=చేరఁబిల్చుచున్న; పులుగుల=పక్షులయందు; దీములు =పక్షులను బట్టుటకై పెంపుడుపక్షులు లోనగువానిని; కట్టియున్=బంధించియు; జిగురుఁగండెలు=జిగురుతోఁ గూడిన పేనిన దారపుఁగండెలను; అమర్చియున్=సిద్ధముచేసియును; విచిత్రతర వనపతత్త్రి గోత్రంబులన్= నానావర్ణములు గల వనపక్షుల గుంపులను; పట్టుకొను తలంపునన్=గ్రహించు నుద్దేశమున; మెండైన పొదలన్=గొప్పనైన పొదలయందు;ఉండి = దాఁగి యుండి; అప్పటప్పటికిన్ =ప్రతిక్షణమందు; వానిన్=ఆయురులు మొదలుగాఁ గల వాటిని; కానన్=చూచుటకు; తమకించి = త్వరపడి; చెంచెతలు=చెంచుస్త్రీలు; ఎత్తు నెమ్మొగంబుల తమ్మిచాయలన్ =ఎత్తునట్టి సుందరమైన ముఖపద్మముల కాంతుల చేత; వసంతసమయ =వసంతకాలమందు; సముదిత=ఉదయించిన; సౌభాగ్యమ్మునన్=విభవాతిశయముచేత; పొదలు= ఒప్పుచున్న; చాంపేయ ధాత్రీరుహంబులవలనన్=సంపెంగచెట్లవలనను; చాంపేయధాత్రీరుహ=సంపెంగచెట్లయొక్క; కుసుమ =పువ్వులవలన; గళిత=జాఱినట్టి; పరాగరాశి =పుప్పొడిసమూహ మనెడు; మధురసనదీపులిన =మకరందనదీ సైకతముయొక్క; దేశంబునన్=ప్రదేశమునందు; కపురంపుటనంటిలేయాకున్ =కర్పూరపుటనంటి లేఁతయాకును; పఱచి =విస్తరించి; మరకత మకర కేతనాహితమూర్తిని =మరకతమణిమయ మగు శివమూర్తిని; నిలిపి=స్థాపించి; తదేకపూజా తాత్పర్యంబునన్ – తత్=ఆసాంబమూర్తియొక్క,పూజా=పూజయందలి; తాత్పర్యంబునన్=ఆసక్తిచేత; ఉన్న=ఉన్నటు వంటి; సద్గణోత్తములకున్=ప్రమథశ్రేష్ఠులకు; విరు లొసంగు నంతరంగంబునన్=పూవుల నిచ్చు మనస్సుచేత; ప్రమదావనంబు =ఉద్యానవనమును; చొచ్చి =ప్రవేశించి; ప్రమథమధురోష్ఠీతల్లజంబులు=ప్రశస్తలైన ప్రమథాంగనలు; కేలన్=హస్తములచేత; ఊఁది=ఊనుకొని; నిక్కి=మీఁదికి సాగి; విటపాంతర=శాఖాంతరములయందు; అభివేష్టిత=చుట్టుకొనియుండునట్టి; మల్లికా ప్రసూనంబులన్ =మల్లెపూవులను; కోయునెడన్=కోయునప్పుడు; తత్కర సంయోగంబువలనన్=ఆప్రమథస్త్రీల కరసంప ర్కమువలన; నిజేష్ట ఫలలాభంబు =తమ కిష్టమైన ఫలములయొక్క లాభము; చేకూరెనో యనన్=ఘటిల్లెనో యనునట్లు; రమ్యఫలంబులన్=మనోహరము లగు పండ్లచేతను, లాభములచేతను; పెంపొందు మాకందంబులవలనన్=వృద్ధిఁబొందు మావులవలనను; మాకందవాసనాభివాసిత పవమాన ప్లవమాన నీలాశోక రజ స్తోమంబు – మాకంద=రసాలపుష్పముల యొక్క, వాసనా=పరిమళముచేత, అభి వాసిత=వలచునట్టి, పవమాన=వాయువుచేత, ప్లవమాన=తేలియాడుచున్న, నీలా

శోకరజః=నల్లని యశోకకుసుమముల పరాగముయొక్క, స్తోమంబు=సమూహము; ప్రవర్గ్య=అగ్నిష్టోమాద్యంగవిశేష హోమముయొక్క; ఉపక్రమ =ప్రారంభమందు; నిర్గచ్ఛత్=వెడలి వచ్చుచున్న; ధూమ=పొగయొక్క; వర్తనంబునన్=వృత్తి వంటి వృత్తిచేత; పర్వన్=వ్యాపింపఁగా; అమందానంద =అధికానందముచేత; కందళిత=అంకురించినట్టి; చిత్తారవిందంబుల తోన్= చిత్తములనెడు కమలములచేత; ముందుముందుగన్ =తొలుతొల్త; పఱతెంచు=పరుగెత్తి వచ్చునట్టి;పురందరాది బృందా రకవర్గంబుల =ఇంద్రుఁడు మున్నగు దేవతలసమూహముయొక్క;తనూశ్రమంబున్=దేహశ్రమను; తెరలంజేయు= పోగొట్టు నట్టి; శీతలతర=మిక్కిలి చల్లనైన; తాపసాశ్రమ=మున్యాశ్రమములయందలి; నానావిధ=వివిధములైన; వసుధారుహ=చెట్ల యొక్క; నివహంబుల=సమూహములయొక్క; చెంతలన్ = సమీపప్రదేశములయందు; తదీయ=ఆచెట్లకు సంబంధించిన, శాఖా= కొమ్మ లనెడు స్త్రీలయొక్క యని శాఖాగతస్త్రీలింగమునఁ జెప్పవలయు. స్త్రీముఖనిష్ఠ్యూతగండూషము వకుళమునకు దోహద ముగాఁ జెప్పఁబడియుండెఁగదా; ప్రసవముఖ= పుష్పము లనెడు ముఖములవలన;వినిష్ఠ్యూత=ఉమియఁబడిన; మధు=మకరందముయొక్క;పాళికన్=సమూహముచేత; ప్రసవితంబులగు = పుష్పించినవి యగు; విశారద విటపి పటలం బులవలనను =పొగడమ్రాఁకుల సమూహమువలనను, 'విశారదో మధ్య గన్ధో వకుళ స్సచ కేసరః' అని రత్నమాల; వలను మిగిలి =ఒప్పి; మేరుకుధరంబునుం బోలెన్ =మేరుపర్వతమువలె; శక్రపురాతిభాసురంబును=ఇంద్రపురముచే భాసిల్లునది, శక్ర=మద్దిచెట్లచేతను,పుర=గుగ్గిలపుఁజెట్లచేతను, అతిభాసురంబు=మిక్కిలి ప్రకాశించునది యని భావము. 'శక్రోమహేన్ద్రే హేమాద్రౌ కుటజేఽర్జునభూరుహే' అనియు,'పురం పురి శరీరే చ గుగ్గులే కథితః పురః' అనియు విశ్వము; హిమవన్నగం బునుం బోలెన్=హిమవత్పర్వతంబువలె; గోభృత్కార్ముకాన్విత కాళికాతిశోభితంబును– గోభృత్+కార్ముక= శివుని తోడను, త్రిపురవధకాలమున మేరువు శివునికి కార్ముక మగుట ప్రసిద్ధము, అన్విత= కూడియున్న, కాళికా=పార్వతిచేత, అతిశోభితంబును=మిక్కిలి ప్రకాశించునదియు; గోభృత్కార్ముక=ఇంద్రధనువుతోడ, అన్విత =కూడుకొన్న, కాళికా= మేఘపంక్తిచేత, అతిశోభితంబును=మిక్కిలి ప్రకాశించునదియు; మందరధరంబునుంబోలెన్=మందరపర్వతమువలె; వ్యాళాధిరాజ =వాసుకిచేతను, దుష్టగజశ్రేష్ఠముచేతను; పరివేష్టితంబును=చుట్టుకొనఁబడినదియు; ఋశ్యమూకాద్రియుం బోలెన్=ఋశ్యమూకపర్వతమువలె; హరిజాతి =కపిగణముతో, సింహగణముతో;కలితంబును=కూడినదియు; మాల్యవ ద్గోత్రంబునుంబోలెన్=మాల్యవంతపర్వతమువలె; రామ=శ్రీరామునియొక్క, పశువిశేషముయొక్క,'రామః పశు విశేష స్స్యాత్' అని విశ్వము; సంచార=సంచరణముచేత; సంగతంబును=కూడుకొన్నదియు; నీలాచలంబునుంబోలెన్= నీలాద్రి వలె; పురుషోత్తమ=సర్వేశ్వరునిచేత, మంచిపొన్నలచేత; భూషితంబును=అలంకరింపఁబడినదియు; గంధమాదన గ్రావం బునుంబోలెన్=గంధమాదనశైలమువలె,'గ్రావాణౌ శైల పాషాణౌ' అని యమరుఁడు; మహావరాహపాళికాలింగితంబును= విష్ణుమూర్తియొక్క చిహ్నముతోఁ గూడుకొన్నదియు,'మహావరాహో గోవిన్ద స్సుషేణః కనకాఙ్గదీ' అని విష్ణుసహస్ర నామము; మహత్=గొప్పలైన, వరాహపాళికా=అడవిపందులయొక్కగుంపుతో; ఆలింగితంబును=కూడుకొన్నదియు;సమ =అనురూపమయిన; ఆమోద =సంతసముతో; సంకలిత =కూడుకొన్న; శ్యామా=యౌవనమధ్యస్థలగు స్త్రీలచేత; మహితం బయ్యును = ఒప్పుచున్నదయ్యును; అసమామోద=సరిలేని పరిమళముతోడ; సంకలిత=కూడుకొన్న; శ్యామా=ప్రేంకణపుఁ దీవలచేత;'శ్యామాతు మహిళాహ్వయా' అని యమరుఁడు; మహితంబు ఐ =ఒప్పుచున్నదై, విరోధాభాసాలంకారము; వీన =పక్షిరాజములయొక్క;ఘన=గొప్పలైన; ఆర్భటి=ధ్వనులచేత; విఘూర్ణిత=వ్యాప్తమైన; మహాబిలంబు=గొప్పగుహలు గలది; అయ్యును; నవీన=క్రొత్తలగు;ఘన=మేఘములయొక్క; ఆర్భటి=ధ్వనులచేత; విఘూర్ణిత=వ్యాప్తమైన; మహాబిలంబు ఐ =ఆకాశము గలదై, విరోధపరిహారము; మరాళికా=పెంటియంచలచేత; ఆశ్రిత=ఆశ్రయింపఁబడిన; కటకస్థల=పర్వతనితంబ ప్రదేశములందలి; వనజాతంబయ్యును=జలపూరము గల దయ్యును; అమరాళికా=దేవపరంపరలచేత; ఆశ్రిత=ఆశ్రయింపఁ

బడిన; కటకస్థల=పర్వతనితంబ ప్రదేశములందలి; వనజాతంబు ఐ=అరణ్యసమూహము గలదై; సదృక్షరాజ=మంచి భల్లూక ముఖ్యములయొక్కయు; సారంగ =లేళ్లయొక్కయు; సంతాన =సంతతులచేత; సంకలితంబు=కూడుకొన్నది; అయ్యును; అసదృక్ష =సరిలేని; రాజసారంగ=శ్రేష్ఠగజములయొక్క; సంతాన =సంతతులచేత; సంకలితంబు ఐ = కూడుకొన్నదై; కాలాహిత సుమనః=యమునికి శత్రువైన దేవునియొక్క, అనఁగా శివునియొక్క; నగ=పర్వతమగు కైలాసమువలె; భాసమానంబు అయ్యును=ప్రకాశమానమయ్యును; అకాల=అకాలమందు, అనఁగా సమయము గాని సమయమందు; ఆహిత =ధరింపఁబడిన; సుమనః=పూవులతోఁ గూడిన; నగ=వృక్షములచేత; భాసమానంబు ఐ=ప్రకాశమానమై; ఒప్పుచున్న యది ; విలోకింపుము = చూడుము.

చ. అని లలితోక్తి నాప్రియవ॥యస్యశిఖామణి చిత్తసీమఁ బా
యనిలలితోఁ దదద్రిమహి॥మాతిశయం బెఱిఁగింప, నప్పు డా
మనుకులరాజమౌళి బిల॥మండలి చొక్కపుఁదీవెయింటిమేల్
మను కులరాజకాంతతట॥మార్గములం గనుఁగొంచు నేఁగుచున్. 19

టీక: అని =ఇట్లని; లలితోక్తిన్=మనోజ్ఞమైన వాక్కుచేత; ఆ ప్రియవయస్యశిఖామణి =ఆప్రియసఖరత్నంబైన కుముదుండు; చిత్తసీమన్=హృదయసీమను; పాయని లలితోన్=వదలని ప్రీతితోడ; తదద్రిమహిమాతిశయంబు=ఆహేమకూటముయొక్క మహిమావిశేషమును; ఎఱిఁగింపన్= తెలుపఁగా; అప్పుడు=ఆసమయమున; ఆమనుకులరాజమౌళి = మనువంశపు రాజులలో శ్రేష్ఠుండగు నా సుచంద్రుఁడు; బిలమండలి = గుహాచయముయొక్క; చొక్కపు = శ్రేష్ఠమగు; తీవెయింటి = లతాగృహముల యొక్క; మేల్=అతిశయముచేత; మను=వర్తించునట్టి; కుల=మంచిజాతివియైన; రాజకాంత=చంద్రకాంతమణులయొక్క; తట=ప్రదేశములయొక్క; మార్గములన్=త్రోవలను; కనుఁగొంచున్=చూచుచు; ఏఁగుచున్=పోవుచు. దీనికి ముందుపద్యమందున్న కోనఁ గనియెన్ అను క్రియతో నన్వయము. సుచంద్రుఁడు చూచుచు నేఁగుచున్న గుహామార్గములు చంద్రకాంతమణి ఖచితములై యిరుప్రక్కల లతాగృహములచే నావరింపఁబడిన వని భావము.

సీ. కట్టెండ వెడఁదకాఁ॥కఁ గఱంగి ప్రవహించు, జవ్వాదిడిగ్గియ॥చాల లోయఁ
బడుచుఁ జొక్కపుఁ గ్రొత్త॥పటికంపుఁజఱిపజ్జ, బాగైన కెంపురా॥పఱుకువాలు
పొదరుఁ బొన్నల రాలు॥పుప్పొడియిసుముపైఁ, బగిలి యొప్పెడు వేరు॥పనసపంటి
నీటికాల్వలఁ బ్రోచి ॥పాటించు జేజేల,మ్రాఁకుతీవలఁ జుట్టి॥రాఁగ నలరు
తే. దాకపందిలిక్రింద ని॥ద్దంపువేడ్క, దవిలి కోలాట మాడుగం॥ధర్వసతుల
చారు సౌవర్ణకటకసిం॥జా నినాద,కుల ఘుమఘుమాయమాన మౌ ॥కోనఁ గనియె. 20

టీక: కట్టెండ వెడఁదకాఁకన్– కట్టెండ =అధికమైన యెండయొక్క,వెడఁద=విశాలమగు,కాఁకన్=వేఁడిచేత; కఱంగి = ద్రవించి; ప్రవహించుజవ్వాదిడిగ్గియ–ప్రవహించు=పాఱునట్టి, జవ్వాది=సంకుమదముయొక్క,డిగ్గియ=నడబావి;చాలన్=మిక్కిలి; లోయన్=కొండనడిమిచీలికయందు; పడుచున్=పడినట్టి దగుచు; చొక్కపుఁగ్రొత్తపటికంపుఁజఱిపజ్జన్– చొక్కపు=ఉత్తమమైన, క్రొత్త=నూతనమైన, పటికంపు=స్ఫటికములయొక్క, చఱి = తటముయొక్క, పజ్జన్=సమీపమున; బాగైన కెంపురా

పణుకువాలు – బాగైన =అందమైన, కెంపురా=పద్మరాగమణులయొక్క, పణుకు = సందులయందలి, వాలు = దీర్ఘమైన; పొదరుఁబొన్నల = పొదలైన పున్నాగములవలన; రాలుపుప్పొడియిసుమునపైన్ = పడుచుండిన పుప్పొడి యను నిసుకపై; పగిలి=బ్రద్దలై; ఒప్పెడు వేరుపనసపంటినీటికాల్వలన్ – ఒప్పెడు = ప్రకాశించునట్టి, వేరుపనస=వేరుపనసలయొక్క,పంటి= ఫలసంబంధి యగు, నీటికాల్వలన్=జలప్రవాహములవలన; ప్రోచి =పోషించి; పాటించు =ఆదరించుచున్న; జేజేలమ్రాఁకుతీవలన్=కల్పవృక్షములతీవలను; చుట్టిరాఁగన్=పరివేష్టించి రాఁగా;అలరు దాకపందిలిక్రిందన్=ఒప్పుచున్న ద్రాక్షపందిలియొక్క క్రిందను; నిద్దంపువేడ్కన్=స్నేహయుక్తమైన వేడుకను; తవిలి=పొంది;కోలాట=కోలాటమనెడు క్రీడావిశేషమును; ఆడు=ఆడుచున్న; గంధర్వసతుల=గంధర్వస్త్రీలయొక్క; చారు సౌవర్ణకటక సింజా నినాదకుల ఘుఘుమాయమానము ఔ – చారు= సుందరమగు, సౌవర్ణకటక=బంగరుకడియములయొక్క, సింజా=చిన్నగంటలయొక్క, నినాదకుల = ధ్వనిసమూహము చేత, ఘుమఘుమాయమానము ఔ=ఘుమఘుమ యను ధ్వని గలిగినట్టి దగు; కోనన్=పర్వతమందలి రహస్యప్రదేశమును; కనియెన్=చూచెను. ఎండకాఁకచేఁ గఱఁగి ప్రవహించునట్టి జవ్వాదిచే నేర్పడిన డిగ్గియ, పటికంపుఁజఱి దగ్గఱ నున్న కెంపు రాలపణుకులయందు పొదలైపెరిఁగియున్న పొన్నచెట్లనుండి రాలిన పుప్పొడియిసుకమీఁద నున్న వేరుపనసపండ్లరసముల కాల్వలను, పోషించి కల్పవృక్షపుఁదీవలను ఆదరించును. అట్టి కల్పవృక్షపుఁదీవలను చుట్టుకొని వృద్ధిఁబొందునట్టి ద్రాక్ష పందిళ్లక్రింద గంధర్వస్త్రీలు కోలాట మాడునట్టి కోనను చూచె నని భావము.

లయగ్రాహి

మానిత నవీన కిస౹లానురతి కానఘ పి౹కీనిచయ గానముల౹చే, నళినికానీ
కానుగత మానసచ౹రీనిరుపమానరుతి౹చే, నళికులీనవని౹తానికర నానా
ధ్వానములచే, ననిల౹యానమునఁ బైనిగుడు ౹సూనతతి తేనియల౹సోన రొదచే, నిం
పైన యలకోనఁ గని ౹యానృపతి దా నెనసె ౹మానసతటీ నివిశ౹మాన ముద మంతన్. 21

టీ. మానిత నవీన కిసలానురతికానఘ పికీనిచయ గానములచేన్ –మానిత=శ్రేష్ఠమగు, నవీన=క్రొత్తనైన,కిసల=పల్లవములందు, ‘కిసాలం కిసలం కిసమ్’ అని ద్విరూపకోశము, అనురతిక= అనురక్తి కలిగినట్టి, అనఘ=ఒచ్చెములేనట్టి, పికీనివయ = ఆఁడు కోయిలలగుంపులయొక్క, గానములచేన్=గీతములచేతను; నళినికానీకానుగత మానసచరీ నిరుపమాన రుతిచేన్ – నళినికా = పద్మలతలయొక్క, అనీక=సంఘములను, అనుగత =అనుసరించినట్టి, మానసచరీ=హంసస్త్రీలయొక్క, నిరుపమాన = సాటిలేనట్టి, రుతిచేన్=ధ్వనిచేతను; అళి కులీనవనితా నికర నానా ధ్వానములచేన్ – అళి=తుమ్మెదలయొక్క, కులీనవనితా =కులస్త్రీలయొక్క, ఆఁడుతుమ్మెదలయొక్కయనుట, నికర = సమూహముయొక్క, నానా = అనేకప్రకారములగు, ధ్వానములచేన్ = నాదములచేతను; అనిలయానమునన్= వాతప్రసారముచేత;పైన్=మీఁదను; నిగుడు=వ్యాపించునట్టి, సూనతతి =పూగుత్తులయొక్క; తేనియలసోన=మకరందపువర్షముయొక్క; రొదచేన్ =ధ్వనిచేతను; ఇంపైన =సొంపైన; అలకోనన్ = ఆ కోనను; కని=చూచి; ఆనృపతి = ఆసుచంద్రుఁడు; మానసతటీ=హృదయప్రదేశమును; నివిశమాన = ప్రవేశించుచున్న; ముదము = ఆనందము; అంతన్=అంతటను; తాన్=తాను; ఎనసెన్=పొందెను.

తే. ఇట్టు లక్కోన నెనసి త౹దీయ చిత్ర, మహిమ మెంతయుఁ గాంచుచు ౹మనుజనేత
తళుకుఁ బ్రాఁగెంపు మెట్టుల౹దారి డిగ్గి, యాత్మహితుతోడ నొయ్యన ౹యరుగ నచట. 22

టీ. మనుజనేత =సుచంద్రు(డు;ఇట్టులు=ఈప్రకారమున; అక్కోనన్=ఆకోనను; ఎనసి =పొంది; తదీయ చిత్రమహిమము = ఆ కోనకు సంబంధించిన చిత్రమైన మహిమము; ఎంతయున్=మిక్కిలి; కాంచుచున్=చూచుచు; తళుకు(బ్రా(గెంపు మెట్టులదారిన్ – తళుకు=ప్రకాశించుచున్న, ప్రా(గెంపు=చిరంతనపద్మరాగములయొక్క, మెట్టులదారిన్=సోపానమార్గమునుండి; డిగ్గి = దిగి; ఆత్మహితుతోడన్=తనచెలికానితోడ; ఒయ్యన=తిన్నగ; అరుగన్=పోవుచుండ(గా; అచటన్=ఆప్రదేశమందు; దీని కుత్తర పద్యముతో నన్వయము.

చ. పగడపు(గంబముల్, తళుకు(బచ్చలబోదెలు, కెంపుదూలముల్,
జగమగఱాలదెంచికలు, చక్కని నీలపు(బల్కచాల్, మెఱుం
గగు తెలిమిన్నలోవయును, నచ్చపు బంగరు పేరరంగునం
దగ(గనుపట్టు నొక్క వికసన్మణిమండప మప్డు దో(ప(గన్. 23

టీ. పగడపు(గంబముల్=విద్రుమస్తంభములు; తళుకు=ప్రకాశించుచున్న; పచ్చల=గారుత్మతమణులయొక్క; బోదెలు = స్తంభములమీ(ద నుంచు నవయవవిశేషములు; కెంపుదూలముల్=పద్మరాగమణులదూలములు;జగ=శ్రేష్ఠములగు; మగఱాల =వజ్రములయొక్క; దెంచికలు=దూలములమీ(ద నడ్డముగా నుంప(బడు గృహావయవవిశేషములు; చక్కని =అందమైన; నీలపు=నీలమణులయొక్క; పల్కచాల్= దెంచికలమీ(ద వేయ(బడు పల్కలవరుసలు; మెఱుంగగు =ప్రకాశించుచున్న; తెలిమిన్న=స్ఫటికములయొక్క; లోవయును=చూరును; తగన్=ఒప్పుచుండ(గా; అచ్చపు=శ్రేష్ఠమగు; బంగరు=సువర్ణము యొక్క; పేరు=విశాలమైన; అరంగునన్=వేదికయందు;కనుపట్టు=కన(బడునట్టి; ఒక్క వికసన్మణిమండపము=ఒకప్రకాశ మానమగు మణిమందిరము; అప్డు =ఆసమయమందు; తో(ప(గన్=అగపడుచుండ(గా. దీనికి వసించెనను నుత్తరపద్యమందు గల క్రియతో నన్వయము. ఇందుత్తాలంకారము. 'ఉదాత్త మృద్ధే శ్చరితం శ్లాఘ్యం నాన్యోపలక్షణమ్' అని తల్లక్షణము.

చ. కను(గొని యాన్నృపాలరతికాంతు(డు విస్మయ మంతరంబులో
నెనయ(గ నోవయస్య మన మిచ్చట నిల్తమె కొంత ప్రొద్దటం
చనువుగ మందయానమున నమ్మణిమండపమౌళి(జేరి, యం
దొనర(గ రత్నపీఠి ముదమొప్ప వసించె, వసించు నంతటన్. 24

టీ. కను(గొని =చూచి; ఆనృపాలరతికాంతు(డు=ఆసుచంద్రు(డు; విస్మయము=ఆశ్చర్యము; అంతరంబులోన్=హృదయ మందు; ఎనయ(గన్ =వృద్ధి(బొంద(గా; ఓవయస్య =ఓసఖు(డా! మనము, ఇచ్చటన్, కొంతప్రొద్దు=కొంతసేపు; నిల్తమె=వసిం తమా; అటంచున్ =అని చెప్పుచు; అనువుగన్=అనుకూలముగా; మందయానమునన్=తిన్నని గమనముచేత; అమ్మణిమం డపమౌళిన్ =ఆమణిమయమండపశ్రేష్ఠమును; చేరి=పొంది; అందున్=ఆమంటపమందు;ఒనర(గన్=ఇంపుగను; రత్నపీఠిన్ =రత్నమయమైన పీఠమందు; ముదము=సంతసము; ఒప్పన్=అతిశయిల్లగా; వసించెన్=కూర్చుండెను; వసించు నంతటన్. = అట్లు కూర్చుండినంతలో. దీనికి ముందుపద్యముతో నన్వయము.

సీ. ఒకమణిపుత్రిక యొయ్యారమున(జేరి, కపురంపు వలపుబాగా లొసంగె,
నొక సాలభంజిక యుదిరిపువ్వుల కెంపు(,బావడ నేరు పేర్పడ(గ వీచె,

నొక వసుప్రతిమ యిం॰పూన్చు తెల్లని తావిఁ,బొదివించెడు కలాచి ॰పూని నిలిచె,
నొక చొకాటపుబొమ్మ॰యొయ్య నొయ్యన పొన్న,విరిచాలు గూర్చిన ॰సురటి విసరె,

తే. నిటులు పాంచాలికామణి॰పటల మూడి,గము లుచితరీతి దార్ప, నా ॰యమరకేళి
మండపశ్రీ నుతించుచు ॰మనుజభర్త, దండఁ జెలి గొల్వ సుఖలీల ॰నుండె నంత. 25

టీ. ఒకమణిపుత్రిక =ఒకమణిమయప్రతిమ;ఒయ్యారమునన్=విలాసముగా; చేరి=సమీపమునకు వచ్చి; కపురంపువలపు = కర్పూరపరిమళము గల; బాగాలు=వక్కపొడితో జేరిన విడెములు; ఒసంగెన్=ఇచ్చెను;
ఒక సాలభంజిక=ఒకబొమ్మ; ఉదిరిపువ్వుల కెంపుఁబావడన్=బంగారుపూవులు గల చెంగావివస్త్రముచేత; నేరు పేర్పడఁగన్= చాతుర్య మేర్పడునట్లు; వీచెన్=విసరెను;
ఒక వసుప్రతిమ =ఒక బంగరుబొమ్మ; ఇంపూన్చు= అందమగు; తెల్లని =శుభ్రమగునట్టి; తావిన్ =పరిమళమును; పొదివించెడు =పొందించునట్టి; కలాచి =తమ్మపడిగము; పూని =వహించి; నిలిచెన్.
ఒక చొకాటపుబొమ్మ=ఒక స్వచ్ఛమైన ప్రతిమ; ఒయ్యనొయ్యన =తిన్నతిన్నగా; పొన్నవిరిచాలు=పొన్నపువ్వులగుంపు; కూర్చిన సురటిన్ = పొదివిన వ్యజనముచేత; విసరెన్.
ఇటులు=ఈప్రకారము; పాంచాలికామణిపటలము=పాంచాలికాశ్రేష్ఠములగుంపు; ఊడిగములు=ఉపచారములు; ఉచితరీతిన్ = యోగ్యమైన రీతిచేత; తార్పన్=చేయుచుండఁగా; ఆ యమర కేళిమండప శ్రీన్ – ఆ, అమర=దేవతలయొక్క, కేళిమండప= విలాసమందిరముయొక్క, శ్రీన్=సంపదను; నుతించుచు=కొనియాడుచు;మనుజభర్త=సుచంద్రుఁడు; దండన్=సమీపమందు; చెలి=సఖుఁడు; కొల్వన్=సేవించుచుండఁగ; సుఖలీలన్=సుఖముచేతనైన విలాసముతోడ; ఉండెన్=వసించెను; అంతన్=ఆ సమయమందు; దీనికి వ్యవహితోత్తరపద్యమందున్న ‘ఒక్కసింగంబు వడిఁ బొదనుండి వెడలె’ నను దానితో నన్వయము.

చ. కరు లిల వ్రాల, శంబరని॰కాయము దూలఁ, దరక్షులోకము
ల్వెఱఁ బరువంద, మత్తకద॰ళీచయముల్ బెగడొంద, గండకో
త్కరములు స్రుక్క, ఋక్షసము॰దాయము నెవ్వగఁ జిక్కఁ, గీశము
ల్తరుతతి నీఁగ, సూకరకు॰లంబులు డాఁగ, మహాద్భుతంబుగాన్ 26

టీ.కరులు=ఏనుఁగులు; ఇలన్=భూమియందు; వ్రాలన్=పడుచుండఁగ; శంబరనికాయము=హరిణవిశేషములయొక్క సమూహము, ‘రజ్కు శమ్బర రోహిషాః’ అని యమరుఁడు; తూలన్=తొలఁగుచుండఁగా; తరక్షులోకముల్=సివంగుల గుంపులు, ‘తరక్షుస్తు మృగాదనః’ అని యమరుఁడు; వెఱన్=భీతిచేత; పరువందన్=పాఱుచుండఁగ; మత్త=మదించిన; కదళీచయముల్=ఇఱ్ఱులగుంపులు, ‘కదళీ కన్దళీ చీన శ్చమూరుప్రియకావపి’ అని యమరుఁడు; బెగడొందన్=భయపడఁగ; గండకోత్కరములు = ఖడ్గమృగములసముదాయములు; స్రుక్కన్=వెనుదీయఁగ; ఋక్షసముదాయము =ఎలుఁగుబంట్ల గుంపు, ‘ఋక్షాచ్ఛభల్ల భాలూకాః’ అని యమరుఁడు; నెవ్వగన్=మిక్కిలివిచారముచే; చిక్కన్=పట్టువడఁగా; కీశముల్= కోఁతులు, ‘మర్కటో వానరః కీశః’ అని యమరుఁడు; తరుతతిన్=వృక్షసమూహమందు; ఈఁగన్= తూఱఁగా; సూకరకులంబులు=అడవిపందులగుంపులు; డాఁగన్=దాఁగుచుండఁగా; మహాద్భుతంబుగాన్= మిక్కిలివింతగా. ఈపద్యమున కుత్తర పద్యస్థక్రియతో నన్వయ మని యెఱుంగునది.

సీ. అఖిల జంతు నిఖాద౧నారూఢిమైఁ బోలె, నతివివృతంబైన ౧యాస్య మమర,
నాశేభములఁ జీర్ప౧నట్టి సిబ్బితిఁ బోలె, నతి గన్న ఖరసం౧తతి వెలుంగ,
స్వమృగహింసావిహా౧రము గాంచురతిఁ బోలెఁ, దలపై నెగయు వాల౧దండ మొనర,
నిగుడు కోపాంకుర౧నికరం బగుటఁ బోలె, సితకేసరముల కెం౧జిగి చిగుర్ప,

తే. వక్రదంష్ట్రలు శతకోటి ౧వాదు గెలువ, వర్తులపుఁ గన్నుగవ భాను౧వాసిఁ గేర,
ఘుటఘుటార్భటి ఘనకోటి౧పటిమ దెగడ, నొక్క సింగంబు వడిఁ బొద౧నుండి వెడలె. 27

టీ. అఖిల జంతు నిఖాదనారూఢిమైఁ బోలెన్– అఖిల =సమస్తమైన, జంతు=జంతువులయొక్క, నిఖాదన=భక్షణముయొక్క, ఆరూఢిమైన్ పోలెన్ = అలవాటుచేతబలె; అతివివృతంబైన =అతివిశాలమైన; ఆస్యము=నోరు; అమరన్=ఒప్పుచుండఁగా; ఆశేభములన్=దిగ్గజములను; చీర్పనట్టి సిబ్బితిన్ పోలెన్=బ్రద్దలుసేయమిచే కల్గిన సిగ్గుచేతబలె; నతి=వంగుటను; కన్న= పొందిన; నఖరసంతతి =గోళ్లసముదాయము; వెలుంగన్=ప్రకాశింపఁగా;

స్వమృగ=స్వజాతిమృగములయొక్క; హింసా=వధయనెడు; విహారము =క్రీడను; కాంచురతిన్ పోలెన్=పొందుటయం దాసక్తి చేతబలె; తలపైన్=శిరమునందు; ఎగయు=చేరియున్న; వాలదండము=దండముతో సమానమగు తోఁక; ఒనరన్= ఒప్పుచుండఁగా;

నిగుడు=వ్యాపించుచున్న; కోప=కోపముయొక్క; అంకుర=మొలకలయొక్క; నికరంబు=సమూహము; అగుటన్ పోలెన్= అగుటచేతబలె; సిత=తెల్లనగు; కేసరములన్=మెడమీఁది వెంట్రుకలయందు; కెంజిగి=రక్తకాంతి; చిగుర్పన్=ఉదయించు చుండఁగా;

వక్రదంష్ట్రలు =కుటిలమగు కోఱలు; శతకోటి=వజ్రాయుధముయొక్క; వాదు=వాదమును; గెలువన్=గెలుచుచుండఁగా, అనఁగ కోఱలు వజ్రాయుధతుల్యములుగా నున్నవనుట; వర్తులపుఁ గన్నుగవ=గుండ్రమగు కనుదోయి; భానువాసిన్= సూర్యాధిక్యతను; కేరన్=పరిహసించుచుండఁగా;ఘుటఘుటార్భటి=ఘుటఘుటమను ధ్వని; ఘనకోటి=మేఘబృందము యొక్క; పటిమన్ = సామర్థ్యమును; తెగడన్=తిరస్కరింపఁగా; ఒక్క సింగంబు =ఒక సింహము; వడిన్=వేగముచేత; పొదనుండి వెడలెన్ = పొదలోనుండి బయల్పడెను.

సమస్తమృగములను బెదరించుచు, విశాలముఖము, వంగినగోఱులు, శిరస్సునందుఁ జేర్పఁబడిన వాలము, ఎఱ్ఱని కేస రాగ్రములు, వజ్రాయుధతుల్యము లగు కోఱలును, సూర్యబింబమును దిరస్కరించు కనుఁగవయుఁ గల యొక సింహము పొదనుండి వెల్వడె నని భావము.

క. వెలలి జిఘృక్షాగౌరవ,కలనన్ లంఘింప నృపతి ౧గన్గొని నిజని
స్తుల చంద్రహాసధారం, దలఁ ద్రెవ్వఁగ నేసె నద్భు౧తంబుగ నంతన్. 28

టీ. వెలలి =వెడలి; జిఘృక్షా=గ్రహణేచ్ఛయందలి; గౌరవ=ఆదరముయొక్క;కలనన్= ప్రాప్తిచేత; లంఘింపన్=దుముకఁగా; నృపతి=సుచంద్రుఁడు; కన్గొని =చూచి; నిజ=తనదగు;నిస్తుల=సాటిలేనిదగు; చంద్రహాస=కత్తియొక్క; ధారన్=అంచుచేత; తలన్=(ఆసింగముయొక్క) శిరస్సును; త్రెవ్వఁగన్=తెగునటుల; ఏసెన్=వైచెను; అద్భుతంబుగన్=ఆశ్చర్యముగ; అంతన్= అంతలో. దీని కుత్తరపద్యముతో నన్వయము.

మ. క్షితినాథేంద్ర శితాసిసంహతిభవాऽసృగ్వ్యాప్త తత్సింహరా
జ తనూదీధితిసంధ్యలో వెడలు భాऽస్వన్మూర్తి నా నొక్కమా
నిత తేజస్తతి దోఁచె నంత నచట ऽన్వీక్షింప నయ్యెన్ రమా
పతి నా పూరుషరూప మొక్కటి జగऽత్ప్రస్తుత్య దీవ్యద్ద్యుతిన్. 29

టీక: క్షితినాథేంద్ర శితాసి సంహతి భవాసృ గ్వ్యాప్త తత్సింహరాజ తనూదీధితి సంధ్యలోన్ – క్షితినాథేంద్ర = సుచంద్రునియొక్క, శిత=తీక్ష్ణమగు, అసి=కత్తియొక్క,సంహతి=ప్రహారమువలన,భవ=పుట్టిన, అసృక్=రక్తముచేత, వ్యాప్త =పొందఁబడిన, తత్సింహరాజ =ఆమృగరాజుయొక్క, తనూదీధితి=దేహకాంతి యనెడు, సంధ్యలోన్=సంధ్యాకాలమందు; వెడలు=ఉదయించు; భాస్వన్మూర్తి నాన్ =భానుఁడో యనఁగ; ఒక్కమానిత తేజస్తతి = ఒకానొక పూజ్యమైన తేజస్సమూహము; తోఁచెన్ = కనిపించెను; అంతన్= అంతలో; అచటన్=ఆతేజఃపుంజమందు; జగత్ప్రస్తుత్య=లోకములచే స్తుతింపఁదగినట్టి; దీవ్యత్=ప్రకాశించుచున్న; ద్యుతిన్ =కాంతిచేతను; పూరుషరూప మొక్కటి = ఒకానొక పూరుషాకృతి; రమాపతి నాన్ =నారాయణుఁడో యనఁగ; వీక్షింపన్=చూచుటకు; అయ్యెన్ = ఆయెను (తారసిల్లెను).

సుచంద్రుని ఖడ్గముచే ఖండింపఁబడిన యాసింహముయొక్క రక్తసిక్తమగు శరీరకాంతి యను సంధ్యయం దుదయించిన తేజఃపుంజ మనెడు సూర్యబింబమందు తద్గతనారాయణమూర్తియో యన్నటు లొక పూరుషాకృతి చూపట్టె నని భావము.

చ. అది గని యానృపాలుఁడు మऽనోంబురుహంబున విస్మయాంకురం
బొదవఁగ నుండఁ, గిన్నరత ऽనూనుచుఁ, దత్పురుషావతంస మా
యుదధిగభీరుఁ జేరి, వినऽయోన్నతి, ‘ భానుకులాయ, శత్రువ
ర్యదమనపణ్డితాయ, భవऽతేఽస్తు నమో’ యని మ్రొక్కెఁ, మ్రొక్కినన్. 30

టీ. ఆనృపాలుఁడు =ఆసుచంద్రుఁడు; అది గని=ఆపురుషరూపమును జూచి; మనోంబురుహంబునన్=చిత్తకమలమందు; విస్మయాంకురంబు=ఆశ్చర్యము; ఒదవఁగన్=కలుగునటుల; ఉండన్=ఉండఁగా; కిన్నరతన్=కిన్నరత్వమును; ఊనుచున్ =వహించుచు; తత్పురుషావతంసము=ఆపురుషశ్రేష్ఠుఁడు; ఆ ఉదధిగభీరున్= ఆసముద్రగంభీరుఁడగు సుచంద్రుని; చేరి=సమీపించి; వినయోన్నతిన్=వినయాతిశయముచే; భానుకులాయ=సూర్యవంశస్థుఁడవైనట్టి; శత్రువర్యదమనపణ్డితాయ=పగతురఁ బరిమార్చుటయందు పండితుఁడవైన; భవతే=నీకొఱకు; నమః=నమస్కారము; అస్తు=అగుఁగాక; అని =అనుచు; మ్రొక్కెన్=ప్రణమిల్లెను; మ్రొక్కినన్=ఇట్లు ప్రణమిల్లఁగా. దీని కుత్తరపద్యముతో నన్వయము.

తే. ఆదరంబునఁ గెంగేల ऽనతని నెత్తి, దండఁ గూర్చుండఁ గావించి ऽధరణిభర్త
తత్కథా శ్రవణైక ముऽదాయుతాత్మ, నప్పురుషమౌళిఁ గాంచి యిऽట్లనుచుఁ బలికె. 31

టీ. ధరణిభర్త =భూపతి యగు సుచంద్రుఁడు; ఆదరంబునన్=ప్రీతితోడ; కెంగేలన్=ఎఱ్ఱనైన హస్తముచే; అతనిన్=ఆ కిన్నరుని; ఎత్తి =లేవఁదీసి; దండన్=సమీపమున; కూర్చుండన్=ఉపవేశించునట్లు; కావించి=చేసి; తత్కథా శ్రవణైక ముదాయుతాత్మన్–

తత్కథా =అతనియొక్కకథయొక్క; శ్రవణ=వినుటయందు; ఏక=ముఖ్యమగు; ముదా=సంతసముచేత; యుత=కూడినట్టి; ఆత్మన్=మనస్సుచేత; అప్పురుషమౌళిన్=ఆపురుషశ్రేష్ఠుని; కాంచి=అవలోకించి; ఇట్లనుచుఁ బలికెన్=వక్ష్యమాణప్రకారముగా వచించెను.

చ. అకలుషరూపశోభివి, మ◊హామతిశాలివి, కిన్నరత్వబో
ధకశుభపాళి, విట్టి విబు◊ధస్తుతివృత్తిఁ జెలంగు నీకు ని
త్యకటుతరేభవైరిరమ◊ణాకృతి యేగతిఁ జెందె, నెట్లు త
ద్వికృతి యడంగెఁ, దెల్పఁగద◊వే విన వేడుక వుట్టె నియ్యెడన్. 32

టీ. అకలుషరూపశోభివి– అకలుష=ఒచ్చెములేని, రూప=స్వరూపముచేత, శోభివి=ప్రకాశించునట్టివాఁడవు; మహామతి శాలివి=గొప్పబుద్ధితో నొప్పువాఁడవు; కిన్నరత్వబోధకశుభపాళివి– కిన్నరత్వ=కిన్నరత్వమునకు, బోధక=జ్ఞాపకములగు, శుభ=మంగళకరమైన, పాళివి=చిహ్నములు గలవాఁడవు, 'పాళిః కేతు ర్ధ్వజో లిఙ్గమ్' అని యమరుఁడు; ఇట్టి = ఈవిధమగు; విబుధస్తుతివృత్తిన్= పండితస్తవనీయము, లేదా దేవస్తవనీయ మగు వర్తనముచేత; చెలంగు నీకున్=ఒప్పునట్టి నీకు; నిత్య కటుత రేభవైరిరమ ణాకృతి– నిత్య=ఎల్లప్పుడు, కటుతర=కఠినతరమగు, ఇభవైరిరమణ=గజరిపుశ్రేష్ఠమైన సింగముయొక్క,ఆకృతి = ఆకారము; ఏగతిన్=ఏవిధముగా; చెందెన్=అమరెను; ఎట్లు =ఏవిధముగా; తద్వికృతి =ఆసింహభావము;అడంగెన్=నశించెను; తెల్పఁగదవే=తెల్పవే; ఇయ్యెడన్=ఇచట; వినన్=వినుటకు; వేడుక=కుతూహలము; పుట్టెన్=ఉదయించెను. ఇట్టిలోకోత్తరగుణశాలి వగు నీకు సింహత్వము గలుగుట యెట్లు, మరల నది పోవుట యెట్లు విశదీకరింపు మని భావము.

క. అను జనపతి వాక్యము మది
కనివారితమోద మొసఁగ, ◊నాఘనుఁడు పునః
పున రవనతి ఘటియించుచుఁ
దనకథ వివరించె ని ట్లు◊దారమృదూక్తిన్. 33

టీ. అను జనపతి వాక్యము =ఉక్తప్రకారమగు సుచంద్రునివచనము; మదికిన్=చిత్తమునకు;అనివారితమోదము=అపరిమితానందమును; ఒసఁగన్=ఘటింపఁజేయఁగా; ఆఘనుఁడు=ఆదివ్యపురుషుఁడు; పునఃపునరవనతి=పలుమాఱు నమస్కారములను; ఘటియించుచున్=చేయుచు; ఇట్లు=వక్ష్యమాణప్రకారమున; ఉదారమృదూక్తిన్=అతిశయమార్దవయుతమైన పలుకులచేత; తనకథ =తనవృత్తాంతమును; వివరించెన్=విశదీకరించెను.

సీ. కలిమితొయ్యలిదాల్పు◊బలుసామిపొక్కిట, మనుతమ్మి యేవేల్పుఁ ◊గనిన తల్లి,
మినుకుఁజాల్తుద దెల్పు ◊మిన్న లోఁ గాంచుజో,గులటెంకి యేవేల్పు◊కలికి వీడు,
చిలుకుముద్దులవీణె◊చెలియగాఁ దగు చాన, బొమ్మరిం డ్లేవేల్పు ◊నెమ్మొగంబు,
లీరేడుజగముల◊వారలఁ బుట్టించు, తీరువ యేవేల్పు ◊పౌరుపత్తె
తే. మట్టి పెనువేల్పు హరిహయ◊ హవ్యవాహ, హరిజ హరిరిపు హరిణాంక◊గురుపరిబృఢ
హరిణహయ హయముఖరాజ ◊హరులు గొలువ, హొళిఁ బేరోలగం బుండు ◊నవసరమున. 34

టీ. కలిమితొయ్యలిదాల్పు బలుసామి పొక్కిటన్‒ కలిమితొయ్యలిదాల్పు = లక్ష్మీధరుండగు, బలుసామి = గొప్పదేవుని యొక్క, విష్ణువుయొక్క యనుట, పొక్కిటన్ =నాభియందు; మను=ఉండునట్టి, తమ్మి=తామర, ఏవేల్పున్=ఏదేవుని; కనిన తల్లి = కనినట్టి తల్లియో;
మినుకుఁజాల్తుద = ఉపనిషద్రూపమగు వేదాంతము; తెల్పు మిన్న = తెలియఁజేయునట్టి యుత్కృష్టుని; లోన్=అంతరంగ మందు; కాంచు=దర్శించు; జోగులటెంకి=యోగులయొక్క నివాసస్థలము; ఏవేల్పు=ఏదేవునియొక్క; కలికి వీడు=అంద మైన పురము. అనఁగా సత్యలోకమందుఁ బరబ్రహ్మను ధ్యానించు యోగులు వసించియుందురని భావము.
ఏవేల్పు నెమ్మొగంబులు=ఏదేవునియొక్క చక్కని మొకములు; చిలుకుముద్దులవీణె చెలియ=అతిశయమై, సుందరమైన వీణయొక్క సకియ; కాఁదగు =అగునట్టి; చాన =సరస్వతీరూపిణి యగు స్త్రీయొక్క; బొమ్మరిండ్లు =బాలికలు బొమ్మల నుంచి క్రీడించు గృహములో;
ఏవేల్పు పారుపత్తెము= ఏదేవుని యధికారము; ఈరేడుజగములవారలన్=పదునాల్గులోకములయందున్నవారిని; పుట్టించు తీరువ =కలిగించునట్టి పనియో;
అట్టి పెనువేల్పు =అట్టి పెద్దదేవుండు, అనఁగా బ్రహ్మదేవుఁడు; హరిహయ= ఇంద్రుండు;హవ్యవాహ =అగ్ని;హరిజ=సూర్య సుతుఁడైన యముఁడు; హరిరిపు=రాక్షసుం డగుటచే విష్ణుశత్రువగు నిరృతి; హరిణాంకగురు పరిబృఢ =చంద్రజనకుఁడగు సముద్రునకు అధిపతి యగు వరుణుండు, 'ప్రచేతా వరుణః పాశీ యాదసాంపతి రప్పతిః' అనియు, 'ప్రభుః పరిబృఢోఽధిపః' అనియు నమరుఁడు; హరిణహయ =లేడి వాహనముగాఁగల వాయువు; హయముఖరాజ=కిన్నరాధిపతి యగు కుబేరుండు; హరులు=శివుండును; కొలువన్= సేవించుచుండఁగా; హాళిన్=ఆసక్తిచేత; పేరోలగం బుండు నవసరమునన్=కొలువుకూటం బున నుండుతఱి. దీని కుత్తరపద్యస్థ మైన యిట్లనున్ అను దానితో నన్వయము.

చ. కొలువున నిల్చి భక్తివిధిఁ గొల్చు మహామనువర్ణదేవతా
కులములలో నజత్వ మొనఁగూర్చు మహామనువర్ణదేవతా
వళు లొకకొన్ని పర్వి నవజ్వలనోజ్జ్వలకీలికాప్లుతిం
గళవళ మందఁ గాంచి, యలకంజభవుండు ప్రియోక్తి నిట్లనున్. 35

టీ. కొలువునన్=కొలువుకూటమందు; నిల్చి=నిల్చుకొని; భక్తివిధిన్=భక్తివిధానముచేత; కొల్చు=సేవించుచున్న; మహామను వర్ణదేవతాకులములలోన్‒మహామను =మహామంత్రములయొక్క, వర్ణ=బీజములయొక్క, దేవతా = తదధిష్ఠానదేవతల యొక్క, కులములలోన్=సమూహములలో; అజత్వము=బ్రహ్మత్వము; ఒనగూర్చు=చేయుచున్న; మహామను = మహా మంత్రములయొక్క, వర్ణదేవతావళులు = వర్ణాధిష్ఠానదేవతాసంఘములు; ఒకకొన్ని పర్విన= ఒకానొక కొన్ని చుట్టుకొనఁగా; నవజ్వలనోజ్జ్వలకీలికాప్లుతిన్ ‒ నవ = నూతనమగు, జ్వలన = అగ్నియొక్క, ఉజ్జ్వల = ప్రకాశించుచున్న, కీలికా = మంటల యొక్క; ఆప్లుతిన్=ఆప్లుతికి (దుముకుటకు); కళవళ మందన్=కలఁతనొందఁగా; అలకంజభవుండు =ఆబ్రహ్మదేవుఁడు; కాంచి =చూచి; ప్రియోక్తిన్=ప్రియవచనముచేత; ఇట్లనున్=వక్ష్యమాణప్రకారముగాఁ బలికెను.
పారిజాతారణ్యమున తపంబొనరించు వసంతుఁడను విప్రుని తపోగ్నిజ్వాలలచేఁ గంది మహామనువర్ణదేవతలు నలువను వలగొనఁ దిలకించి యతఁడు వక్ష్యమాణప్రకారముగా వచించె నని భావము.

చ. కటకట సర్వలోకశుభ◊కాంక్ష లొసంగుచు నిచ్చ మించు మీ
కిటులభజింపరాని యవి◊హీనవిపత్తికసేరె నెట్లు, త
త్పటిమ హరింతుఁ దెల్పుఁ డన ◊పద్మజుని న్మనువర్ణదేవతా
పటలము మ్రొక్కి యిట్లనియెఁ ◊బాయని దైన్యము మోముఁ జెందఁగన్. 36

టీ. కటకట =కష్టము (అయ్యో!); సర్వలోకశుభకాంక్షలు—సర్వ=సమస్తమైన, లోక=భువనములకు, 'లోకస్తు భువనే జనే' అని యమరుఁడు,శుభకాంక్షలు =మంగళప్రదమగు కోరికలను; ఒసంగుచు=ఇచ్చుచు; నిచ్చ=ఎల్లపుడు; మించు మీకున్= అతిశయించుచున్న మీకు; ఇటుల =ఈరీతిని; భజింపరాని=సేవింప నలవిగాని; అవిహీనవిపత్తిక=అధికమగు నాపద; చేరె నెట్లు= ఏరీతి సమకూరెను; తత్పటిమన్ = ఆ యాపదయొక్క బలమును; హరింతున్ = పోగొట్టుదును; తెల్పుఁడు=విన్న వింపుడు; అనన్= అనఁగా; మనువర్ణదేవతాపటలము– మను =మంత్రములయొక్క, వర్ణ=బీజములయొక్క,దేవతా= అధి ష్ఠానదేవతల యొక్క; పటలము=సమూహము; పద్మజునిన్=నలువను; మ్రొక్కి=నమస్కరించి; పాయని దైన్యము=వీడని దీనత్వము; మోముఁ జెందఁగన్=ముఖమును జేరియుండఁగ; ఇట్లు=వక్ష్యమాణప్రకారముగ; అనియెన్=వచించెను.

శా. ఆరమ్యాగమమార్గగద్విజశరణ్యం ◊బై యిలం బారిజా
తారణ్యంబు సెలంగు, నయ్యటవి బ్ర◊హ్మత్వంబు రాఁ గోరి దు
ర్వారాత్మద్రఢిమాప్తి మామకజప◊వ్యాపారపారంగతుం
డై రాజిల్లు తపస్వి యొక్కఁడు వసం◊తాభిఖ్య నింపొందుచున్. 37

టీ. ఇలన్=పుడమియందు; ఆరమ్యాగమమార్గగద్విజశరణ్యం బై – ఆరమ్య=అంతటను మనోజ్ఞమగు, ఆగమమార్గ= వేద మార్గమును, గ=పొందినట్టి, ద్విజ=బ్రాహ్మణులకు, శరణ్యం బై = రక్షక మైనదై. ఆరమ్య+ అగమ అను విభాగముచేత, వృక్ష వీథులఁ జేరిన పక్షుల కని యర్థాంతరము దోఁచుచున్నది ; పారిజాతారణ్యంబు =పారిజాతవనము; చెలంగున్=ఒప్పును; అయ్యటవిన్=ఆపారిజాతారణ్యమందు; బ్రహ్మత్వంబు రాఁ గోరి = బ్రహ్మత్వమును కాంక్షించి; దుర్వారాత్మద్రఢిమాప్తిన్– దుర్వార=దుర్నివారమగు, ఆత్మద్రఢిమ=మనోదార్ఢ్యముయొక్క, ఆప్తిన్=ప్రాప్తిచే; మామక జపవ్యాపార పారంగతుండై– మామక=నాకు సంబంధించిన మంత్రముయొక్క, జపవ్యాపార=జపరూపవ్యాపారమందు, పారంగతుండై = పారము ముట్టిన వాఁడై; వసంతాభిఖ్య నింపొందుచున్=వసంతుఁడను నామముచే నొప్పినవాఁడగుచు; తపస్వి యొక్కఁడు =ఒకానొక తపసి; రాజిల్లున్=ప్రకాశించును.

చ. కనఁ డితరంబు, దా వినఁ డొ◊కానొక విప్రవరోక్తిఁ, బల్కఁ డిం
పున నొకమాట, నిట్టి దమ◊భూషితుఁడై ముని నిశ్చలాంతరం
బెనసి యతృప్తికృజ్జపస◊మేధనవైఖరి మించుఁ, దత్ప్రవ
ర్తన మిటు లయ్యె, దీని నొక◊దారి నడంపఁగఁ జూడు మిత్తఱిన్. 38

టీ. తాన్=ఆవసంతుఁడు; ఇతరంబు=మఱియొక వస్తువును; కనఁడు=చూడడు; ఒకానొక విప్రవరోక్తిన్ =ఒకానొకటైన పక్షి శ్రేష్ఠంపునాదమును; వినఁడు=ఆకర్ణింపఁడు, ఒక్క బ్రాహ్మణోత్తముని వాక్యమునైన వినఁడని తోఁచుచున్నది ; ఇంపునన్ =

ఆనందముతో; ఒకమాట పల్కఁడు = ఒక్కమాటనైన వచింపఁడు; ఇట్టి =ఈరీతి; దమభూషితుఁడై =ఇంద్రియనిగ్రహముచే భూషితుఁడై; ముని=వసంతాఖ్యుఁడు; నిశ్చలాంతరంబు =చలింపని మనస్సును;ఎనసి=పొంది; అతృప్తికృజ్జప సమేధన వైఖరిన్ – అతృప్తికృత్=అసంతుష్టిని జేయు, జప=జపముయొక్క, సమేధన=వృద్ధియొక్క,వైఖరిన్=రీతిచేత; మించున్= అతిశయించును; తత్=ఆవసంతునియొక్క; ప్రవర్తనము=నడవడి; ఇటులు=ఈరీతిగా; అయ్యెన్=ఉండెను; దీనిన్=ఈ నడవడికను; ఇత్తఱిన్=ప్రస్తుతము; ఒకదారిన్=ఒక యుపాయముచే; అడంపఁగన్= అడఁచుటకు; చూడుము=అలోచింపుము.

చ. అన వనజాసనుం డలమ౦హాయతి యెంతకుఁ జొచ్చె నౌర! స
జ్జనవినుతాజభావగతిఁ ౦జక్కఁగ నొందెడివాఁడె , యెట్టు లై
న నొక నవాంతరాయము పె౦నంగఁగఁ జేసెద నంచుఁ జింతతోఁ
దనరఁగ నుండ, నప్పు డగ౦దారి విరించిగుఱించి యిట్లనున్. 39

టీ. అనన్=ఈరీతిగఁజెప్పఁగా; వనజాసనుండు=నలువ; అలమహాయతి =ఆవసంతుఁడు; ఎంతకున్ చొచ్చెన్= ఎంతకుఁ దలపడెను; ఔర=ఆశ్చర్యము; సజ్జనవినుతాజభావగతిన్ – సజ్జన=సత్పురుషులచే, వినుత=స్తుతింపఁబడిన,అజభావగతిన్ =బ్రహ్మత్వగతిని; చక్కగన్=సరిగా; ఒందెడివాఁడె = పొందఁగలవాఁడె; ఎట్టు లైనన్=ఏరీతి నైన; ఒక నవాంతరాయము=ఒకానొక నూతనమైన విఘ్నమును;పెనంగఁగన్=కలయునటుల; చేసెదనంచున్=చేయుదు ననుచు; చింతతోన్ =ఆలోచనతో; తనరఁగ నుండన్ = అతిశయించుచు నుండఁగా; అప్పుడు=ఆసమయమున; అగదారి=ఇంద్రుఁడు; విరించిగుఱించి=బ్రహ్మనుద్దేశించి; ఇట్లు=వక్ష్యమాణప్రకారముగ; అనున్= పలికెను.

చ. యతి యన నెంత, తన్మనుజ౦పైకసమాధి యనంగ నెంత, త
ద్వ్రత మన నెంత, యియ్యెడ ము౦దంబున విఘ్నము దార్తు రిమ్మరు
త్సతు లఖిలేశ! యిట్టి సుర౦తామరసేక్షణ లుండ, లోకసం
తతినుతశక్తి మించు రతి౦నాయకుఁ డుండ, విచారమేటికిన్. 40

టీ. అఖిలేశ = బ్రహ్మదేవుఁడా! యతి యనన్ = యతి యగు వసంతుఁ డనఁగ; ఎంత=ఎంతమాత్రము, సాధారణుఁ డనుట; తత్=అతనియొక్క; మనుజప=మంత్రజపముయొక్క; ఏక=ముఖ్యమగు;సమాధి యనంగన్= చిత్తవృత్తి నిరోధ మనునది; ఎంత=ఎంతమాత్రము, సులభముగఁ జలింపఁజేయఁ దగినదని భావము; తత్=అతనియొక్క;వ్రత మన నెంత =వ్రతనియమ మనునది యెంత మాత్రము, స్వల్ప మనుట; ఇమ్మరుత్సతులు=ఈదేవాంగనలు; ఇయ్యెడన్=ఈసమయమందు; ముదంబునన్=సంతోషము చేత; విఘ్నము=అంతరాయమును; తార్తురు=చేయుదురు; ఇట్టి సురతామరసేక్షణలు=ఇట్టి దేవాంగనలు; ఉండన్=ఉండఁగ; లోక=జనులయొక్క, లేదా లోకములయొక్క; సంతతి=సమూహముచేత; నుత=కొనియాడఁదగిన; శక్తిన్ =సామర్థ్యముచేత; మించు=అతిశయించు; రతినాయకుఁడు=మన్మథుఁడు; ఉండన్=ఉండఁగ; విచారము=వంత; ఏటికిన్= ఎందుకు, అనవసర మనుట. మహాయోగుల ధృతిఁ గలంచు దేవాంగనలు, మన్మథుఁడు నుండ విచార మేటి కని భావము.

సీ. ఏలదే బంటుగా ౦నీమేనకాకాంత, యచలగాధికుమారు ౦నంతవాని,
నేఁచదే సొబగుచే ౦నీధాన్యమాలిని, వింతగా శాండిల్యు ౦నంతవాని,

నెమ్మెతోఁ గలయదే ◊యీయూర్వశీవామ, హాళిమై జాబాలి ◊యంతవాని,
నెనయవే వరుసతో ◊నీవేల్పుచెలిచాలు, లలమండకర్ణజు ◊నంతవాని,

తే. నిట్టి సురసుందరులు గల్గ ◊నింతపనికి, మనములోఁ జాలఁ జింత నీ◊వెనసె దేల?
వీరిలో నొక్కవెలఁది న◊మ్మారుఁ గూర్చి, పంచు మీకార్య మిపుడె ఫ◊లించుఁగాని. 41

టీ. ఈమేనకాకాంత=ఈ మేనక యను సురాంగన; అచల=చలింపని; గాధికుమారు నంతవానిన్ = విశ్వమిత్రు నంతటివానిని; బంటుగాన్=దాసునిగా; ఏలదే=పరిగ్రహింపదా యని కాకువు.
ఈధాన్యమాలిని=ధాన్యమాలిని యను నీ సురాంగన; శాండిల్యు నంతవాని=శాండిల్యమహాముని యంతటివానిని; వింతగా = చిత్రముగా; సొబగుచేన్ =సౌందర్యముచే; ఏఁచదే =శ్రమపెట్టదా యని కాకువు.
ఈయూర్వశీవామ=ఊర్వశి యను నీ సురాంగన; జాబాలి యంతవానిన్= జాబాలిమహర్షి యంతటివానిని; హాళిమైన్= ఆసక్తి చేత; ఎమ్మెతోన్=ప్రేమతో; కలయదే=పెనఁగదా యని కాకువు.
ఈవేల్పుచెలుచాలులు=ఈసురాంగనాసమూహములు; అలమండకర్ణజు నంతవానిన్ = ఆ మండకర్ణజుఁ డను పేరు గల మహాముని యంతటివానిని; వరుసతోన్=క్రమముగా; ఎనయవే=పొందవా యని కాకువు.
ఇట్టి సురసుందరులు=ఇట్టి సామర్థ్యము గల సురసుందరాంగులు; కల్గన్=ఉండఁగా; ఇంతపనికిన్=ఇంత స్వల్పకార్యమునకు; మనములోన్=మనసునందు; చాలన్=మిక్కిలి; చింత=విచారము; ఈవు =నీవు; ఎనసెదు ఏల= పొందెద వేల?
వీరిలోన్= ఈ సురసుందరులలో; ఒక్కవెలఁదిన్= ఒక్కసుందరిని; అమ్మారున్=ఆమన్మథునితో; కూర్చి= చేర్చి; పంచుము = పంపించుము; ఇపుడె=ఈక్షణమందె; ఈకార్యము=ఈపని; ఫలించుఁగాని= ఫలవంత మగును.
మహామునుల మనంబు చలింపఁజేయు సామర్థ్యము గల్గిన సురాంగన లుండ మీ రింతపనికిఁ జింతింపఁ బని లేదని భావము.

చ. అన నమృతంపుఁదేట జత ◊యందిన యాసురరాజుమాట చ
య్యన శ్రుతిపర్వమై మదిని ◊హర్షమహాపగఁ బొంగఁ జేయ , 'నీ
పని కిది కార్యమౌర' యని ◊పల్కువెలందిమగండు కంతుఁ బి
ల్వ ననిలుఁ బంచి, వేల్పునవ◊లాతలమిన్నల నంతఁ గాంచినన్. 42

టీ. అనన్=ఈప్రకారము పలుకఁగ; అమృతంపుఁదేట జత=అమృతసారమునకు సమత్వమును; అందిన =పొందిన; ఆసుర రాజుమాట =ఆయింద్రుని మాట; చయ్యనన్=శీఘ్రముగ (వెంటనే); శ్రుతిపర్వమై=వినసొంపయి; మదిని =మనసునందు; హర్షమహాపగన్=సంతస మను గొప్ప యేటిని; పొంగఁ జేయన్=ఉబుకఁజేయఁగ; ఈపనికిన్=దీనికి; ఇది =ఇంద్రోక్తమైన యుపాయము; కార్యము=చేయఁదగినది; ఔర యని, పల్కువెలందిమగండు =నలువ; కంతున్=మన్మథుని; పిల్వన్= పిలుచుటకు; అనిలున్=వాయుదేవుని; పంచి=పంపి; అంతన్=అటుపిమ్మట; వేల్పునవలాతలమిన్నలన్=సురాంగనాశిరోమణులను; కాంచినన్=చూడఁగ. దీని కుత్తరపద్యస్థక్రియతో నన్వయము.

సీ. వెలవెల నై తోఁచె ◊నలచంద్రకళ యత్య,తులతమశ్శ్రీఁ బొందఁ◊గలనె యనుచుఁ,
దల యెత్త లేదయ్యె ◊నలరంభ ధీరకుం,జరము సెక్కిన మనఁ◊జాల ననుచుఁ,

దెలివి వాయఁగఁ బొల్చె ◊నలతార హంసుని,గొడవఁ బోయిన మహం◊బడఁగు ననుచు,
శ్యామలలో నీఁగె ◊నలమాధవి ధరిత్రి, ఘనులగోస్సృతి నిల్వఁ◊గలనె యనుచు,
తే. నిట్టు లనిమేషకాంత ల◊హీనభంగ,వృత్తి సంధించి చలియింపఁ ◊జిత్తమందు
వే యెఱిఁగి చిత్రరేఖ య◊న్వేల్పుచెలువ, నలువకు జొహారు గావించి ◊నిలిచె నపుడు. 43

టీ. అలచంద్రకళ=ఆ చంద్రకళ యను సురాంగన; యత్యతులతమశ్శ్రీన్—యతి=వసంతుఁడను తపసియొక్క, అతుల= అధికమగు, తమశ్శ్రీన్=తమోగుణాతిశయమును; పొందఁ గలనె యనుచున్=చూడఁ గలనా యనుచు, అనఁగా వసంతుడను తపసియొక్క తమోగుణమును పరీక్షింపగలనా యనుచు; వెలవెలనై తోఁచెన్ =చిన్నఁబోయినదై కన్పడెను. ఇట చంద్రకళ= చంద్రరేఖ, అత్యతుల=మిక్కిలి యధికమగు, తమశ్శ్రీన్=రాహువుయొక్క అతిశయమును, కాంచునా యను నర్థము శబ్దశక్తి స్వభావమువలన ధ్వనించుచున్నది.

అలరంభ= రంభ యను నా దేవాంగన; ధీరకుంజరము =పండితశ్రేష్ఠుఁడగు వసంతుఁడు; చెన్కొనన్=ఎదిరించినచోఁ; మనఁజాల ననుచున్ =బ్రతుకఁజాల నని; తలయెత్తలేదయ్యెన్= శిరము ఎత్తలేదని యర్థము. అనఁటి గంభీరగజము ఎదిరించిన మనఁజాల దను నర్థాంతరము స్ఫురించుచున్నది.

అలతార =తార యను సురాంగన; హంసునిగొడవన్=పరమహంసుఁడగు వసంతుని నిరోధమందు; పోయినన్= ప్రవర్తించిన యెడల; మహంబు=తేజము; అడఁగు ననుచున్ =నివర్తించు ననుచు; తెలివి వాయఁగన్=ప్రజ్ఞ వీడినట్లు; పొల్చెన్= అగపడెను. రిక్క ప్రొద్దు నెదిరించినచోఁ దేజ ముడుగు నని తెలివిపాయునటుల అగపడెనని యర్థాంతరము దోఁచుచున్నది.

అలమాధవి=మాధవి యనునట్టి యా దేవాంగన; ఘనులగోస్సృతిన్=పెద్దలయొక్క వాక్యమునకు;నిల్వఁగలనె యనుచున్= తాళఁగలనా యని; ధరిత్రిన్=భూమియందు; శ్యామలలోన్=స్త్రీలలోఁ; ఈఁగెన్=చొచ్చెను; మాధవి=లతావిశేషము; ఘనులగో స్సృతిన్ =మేఘములయొక్కజలధారకు; నిల్వఁగలనె యనుచున్ =నిలువఁగలనా యని; శ్యామలలోన్ =లతలయందు; ధరి త్రిన్ =భూమియందు;ఈఁగెన్=ప్రవేశించెను అని యర్థాంతరము దోఁచుచున్నది.

ఇట్టులు=ఈరీతిగా; అనిమేషకాంతలు=దేవాంగనలు; అహీన=అధికమగు; భంగవృత్తిన్=భంగవర్తనను; సంధించి=పొంది; చిత్తమందు=మనసునందు; చలియింపన్=చలింపఁగా; అపుడు=ఆసమయమందు; చిత్రరేఖయన్వేల్పుచెలువ=చిత్రరేఖ యను సురాంగన; వే=శీఘ్రముగ; యెఱిఁగి =గుర్తించి; నలువకున్=బ్రహ్మకు; జొహారు గావించి =నమస్కరించి; నిలిచెన్=నిల్చెను. నలువ వసంతుఁడను మహర్షియొక్క తపోవిఘ్నమునకై పంపుటకుఁ జంద్రకళాదిసురాంగనల నవలోకింప, వారు తపోవిఘ్న మొనరింపఁజాలమని చలింపఁగఁ, జిత్రరేఖ యనుసురాంగన వారిచందంబు గుర్తెఱిఁగి నలువకు నమస్కరించి నిల్చెనని భావము.

చ. నిలిచి యవార్య యౌవన వి◊నిర్మల సుందరభావ సత్కళా
కుల జనితైక దర్పమును ◊గూడిన చేడియ గాన ముందు దాఁ
దెలియక ధాత కిట్లను స◊తీమణి, ‘దేవ! భవన్మనోహితం
బలర నొనర్తు, నన్ను దయ ◊నంపుము నిర్జరు లెల్ల మెచ్చఁగన్.’ 44

టీక: నిలిచి =నిలుచుండి; అవార్య యౌవన వినిర్మల సుందరభావ సత్కళా కుల జనితైక దర్పమును– అవార్య =వారించుట కశక్యమైన, యౌవన=తారుణ్యముయొక్క, వినిర్మల =అత్యమలమగు,సుందరభావ=సౌందర్యముయొక్క, సత్కళా=శ్రేష్ఠ

మగు విద్యలయొక్క, కుల=సమూహముచేత, జనిత=పుట్టింపఁబడిన, ఏక=ముఖ్యమగు, దర్పమును=మదమును; కూడిన చేడియ గాన=పొందియున్న వనితగాన; తాన్=తాను; ముందు తెలియక = ముందు రాఁబోవు దాని నెఱుంగక; సతీమణి =చిత్ర రేఖ; ధాతకున్ =బ్రహ్మకు; ఇట్లనున్ =వక్ష్యమాణప్రకారమునఁ బలికెను. దేవ=స్వామీ! భవత్=మీయొక్క; మనోహితంబు= మనసునకు హితమైన పనిని; అలరన్=సంతోషించునటుల; ఒనర్తున్=చేతును; నన్ను దయ నంపుము = నన్ను దయతోఁ బంపుము ; నిర్జరు లెల్ల మెచ్చఁగన్=దేవతలందఱు మెచ్చు కొనుచుండఁగా, ఈపద ముత్తరపద్యముతో నన్వయించును.

చ. మరుఁడు సహాయుఁడై బలసమగ్రతతో వెనువెంట రాఁగ, స
త్వరగతి ధాత్రి నొంది, యలతాపసుఁ జేరి, భవత్కృపాపరి
స్ఫురితకలావిలాసములఁ జొక్కపువేడుక నిక్కఁ జేసి, బం
ధురనిజశక్తి నిచ్చటికిఁ దోకొని వచ్చెద నేలి బంటుగన్. 45

టీక: మరుఁడు =మన్మథుఁడు; సహాయుఁడై=తోడై; బల=సేనలయొక్క; సమగ్రతతోన్=పరిపూర్ణతచేత; వెనువెంట రాఁగన్= ఎడఁబాయక రాఁగ; సత్వరగతిన్=శీఘ్రగమనముచేత; ధాత్రి నొంది=భూమిని జేరి; అలతాపసుఁ జేరి = ఆవసంతుని సమీపించి; భవత్కృపాపరిస్ఫురితకలావిలాసములన్ – భవత్=మీయొక్క, కృపా=దయచేత, పరిస్ఫురిత=ప్రకాశింపఁజేయఁబడిన, కలా = విద్యలయొక్క, విలాసములన్=లీలలచేత; చొక్కపువేడుకన్=శ్రేష్ఠమైన యభిలాషను; నిక్కఁ జేసి=అతిశయింపఁజేసి; బంధుర=అధికమగు; నిజశక్తిన్ = స్వసామర్థ్యముచేత; బంటుగన్ =సేవకునిఁగ; ఏలి=పాలించి; ఇచ్చటికిన్=ఇచ్చటికి;తోకొని వచ్చెదన్= తోడుకొని వత్తును.

సీ. జలపానసంరక్తి సడలించి మోవితేనియ గ్రోలుతమిఁ జాల నింప వచ్చు,
తొలుపల్కుఁజదువులు వొలియించి రతికూజితంబులు నడపుటల్ దార్ప వచ్చు,
ధ్యాననైశ్చల్యంబు దలఁగించి వలఱేని,కలహంపుఁజింతలోఁ గలప వచ్చు,
యతివేషవైఖరి నడఁగించి విటపాళి, యెంచుమేల్ సొగసు చేయింప వచ్చు,
తే. నొంటి దిరుగుట మాన్పి యింపొనరు సఖులఁ, గూడి విహరించుతెఱఁగు వే కూర్ప వచ్చు
నాత్మచాతురి నేమి సేయంగరాదు, తపసి నివ్వేళ ననుఁ బంపు తమ్మిచూలి. 46

టీక: తపసిన్=వసంతుని; జలపానసంరక్తిన్ = ఉదకపానమందుఁ గల యాసక్తిని; సడలించి=వదలించి; మోవితేనియ గ్రోలు తమిన్ = కాంతాధరరసమును బానముసేయునట్టి యాసక్తిని; చాలన్=మిక్కిలి; నింప వచ్చున్=కల్గజేయవచ్చును; తొలుపల్కుఁజదువులు =వేదపాఠములను; పొలియించి=నశింపఁజేసి; రతికూజితంబులు=మణితములను; నడపుటల్ = జరపుటలను; తార్ప వచ్చున్=చేయవచ్చును;
ధ్యాన=ధ్యానమందలి; నైశ్చల్యంబున్=చాంచల్యరాహిత్యమును; తలఁగించి=వదలించి; వలఱేనికలహంపుఁజింతలోన్ = సురతవిషయకచింతయందు; కలపవచ్చున్=ప్రవేశింపఁజేయవచ్చును;
యతివేషవైఖరిన్=మునివేషముయొక్క రీతిని; అడఁగించి =పోఁగొట్టి; విటపాళి=విటసమూహము; ఎంచు=ప్రశంసించునట్టి; మేల్ సొగసు=శ్రేష్ఠమగు నందమును; చేయింప వచ్చున్ = ఘటింపఁజేయవచ్చును;

ఒంటి దిరుగుటన్=జతలేక సంచరించుటను; మాన్పి=పోఁగొట్టి; ఇంపొనరు సఖులన్=ఆనందముచే నొప్పుచున్న కాంతలను; కూడి=కలసి; విహరించుతెఱఁగున్=క్రీడించు క్రమమును; వే =శీఘ్రముగ;కూర్ప వచ్చున్=ఘటింపవచ్చును; ఆత్మ చాతురిన్=బుద్ధిచాతుర్యముచేత; ఏమి సేయంగరాదు=ఏమి చేయుటకు రాదు, సర్వమును చేయవచ్చు ననుట; ఇవ్వేళన్ = ఈసమయమునందు; తమ్మిచూలి=ఓ నలువా! ననుఁ బంపు = నన్ను పంపుము. బుద్ధిచాతుర్యముచేత జలపానాదిముని ధర్మములను బోఁగొట్టి వసంతునకు విటవేషము ధరింపఁజేయవచ్చు నని నలువనుగుఱించి చిత్రలేఖ యను సురాంగన విన్న వించె నని భావము.

చ. తొలకరిచూపు లిం పొసఁగుధూపము లై పయిఁ బర్వఁ, గంధరో
జ్జ్వలకలనిస్వనం బుడుకచాల్ రొద యై విన వేడ్కఁ దార్పఁ, బూ
విలుగలవేల్పురాసివము వేగమె మౌనికి రేఁచి, మత్కుచా
చలయుగరంగవీథి ఘనసంభ్రమతన్ నటియింప నూన్చెదన్. 47

టీ. తొలకరిచూపులు=ప్రథమావలోకనములు; ఇంపొసఁగుధూపము లై = ఆనందము నిచ్చు ధూమవిశేషములై; పయిఁ బర్వన్ = పైపై వ్యాపింపఁగా; కంధరోజ్జ్వలకలనిస్వనంబు = కంఠమందుదయించిన రవము, అనఁగ రతికూజిత మని భావము; ఉడుక చాల్ రొద యై = చర్మవాద్యసమూహముయొక్క ధ్వని యై, ఆవేశమును జేయు చర్మవాద్యముయొక్క ధ్వనిరూపమయి; వినన్=వినుటకు; వేడ్కన్=సంతోషమును; తార్పన్= చేయుచుండఁగ; పూవిలుగలవేల్పురాసివము =మన్మథావేశమును; వేగమె =శీఘ్రముగనె; మౌనికి =వసంతుఁడను మునికి; రేఁచి=అతిశయింపఁజేసి; మత్కుచాచలయుగరంగవీథిన్ – మత్= నాయొక్క; కుచాచల=పర్వతములవంటి స్తనములయొక్క, యుగ=జంటయను,రంగవీథిన్ =నాట్యస్థలమందు; ఘనసంభ్ర మతన్=అధికత్వరచేతను, 'సంభ్రమో వేగ హర్షయోః' అని విశ్వము; నటియింపన్=నాట్యముచేయునటుల; ఊన్చెదన్= చేయుదును. కటాక్షములు నల్లవనుట కవిసమయము గావున చూపులను ధూపమును వేసి, మణిత మను జమిడికి ధ్వనిని సోఁకఁ జేసి, వసంతునకు మన్మథావేశమును దెప్పించి, నా కుచయుగమను నాట్యరంగమున నర్తింపజేతు నని భావము.

సీ. వలఱేని మనములో మొలపించు క్రొంజూపు,తూపులధైర్యంబు దూల్ప నేనిఁ,
దలఁపుల నెవ్వేళ తలఁగక యూరించి, కెరలుమేల్కాళలఁ జొక్కింపనేనిఁ,
గౌఁగిట నలమి చొకాటపుఁగూటమిఁ, గలయంగఁ బేరాసఁ గొలుపనేనిఁ,
దులకించుమోహంపువలఁ జిక్కి వెనువెంటఁ,బాయక తిరుగంగఁ జేయనేనిఁ,
తే. బలుకువాల్దొర నివ్వేల్పుపడఁతు లెల్ల, వినుతి సేయంగ విటునిఁ గావింపనేని,
నజరకులమునఁ బుట్టితినంచు నిచ్చ, పలుకఁగా సిగ్గు గాదె యఙ్జాతజన్మ! 48

టీ. అబ్జాతజన్మ=బ్రహ్మదేవుఁడా! వలఱేనిన్=మన్మథుని; మనములోన్=మనసునందు; మొలపించు క్రొంజూపుతూపులన్ – మొలపించు=ఉదయింపఁజేయు, క్రొంజూపుతూపులన్=క్రొత్తచూపు లను బాణములచేత; ధైర్యంబు=ధృతిని; తూల్పనేనిన్ = చలియింపఁజేయని యెడలను;
ఎవ్వేళన్=ఎప్పుడును; తలఁపులన్= కోరికలను;తలఁగక=ఎడతెగకుండునటుల; ఊరించి=పుట్టించి; కెరలుమేల్కాళలన్ =

అతిశయించు విద్యలచేత; చొక్కింపనేనిన్=పరవశమొందింపనియెడలను;
కౌఁగిటన్=కవుఁగిలియందు; అలమి=ఆక్రమించి; చొకాటపుఁగూటమిన్ =శ్రేష్ఠమగు సంగమమందు; కలయంగన్=కూడుటకు;
పేరాసన్=గొప్పయాశను; కొలుపనేనిన్=పుట్టింపనియెడలను;
తులకించు = ఒప్పుచున్న; మోహంపువలన్ = మోహమను జాలమందు; చిక్కి= పట్టువడి; వెనువెంటన్= వెంబడివెంబడి;
పాయక=ఎడఁబాయక; తిరుగంగన్=తిరుగునటుల; చేయనేనిన్=ఒనర్పనియెడలను;
పలుకువాల్దొరన్=మునిరాజగు వసంతుని; ఇవ్వేల్పుపడఁతు లెల్లన్ = ఈసురాంగన లెల్ల; వినుతి సేయంగన్=ప్రస్తుతి చేయుచుండఁగ; విటునిఁ గావింపనేనిన్ = జారుని గావింపనియెడలను;
అజరకులమునన్=దేవతావంశమందు; పుట్టితినంచున్=జన్మించితి ననుచు; నిచ్చ=ఎల్లప్పుడును; పలుకఁగాన్ = వచించుటకు సిగ్గు గాదె = లజ్జ కాదా, సిగ్గగు ననుట;

ఓనలువా! నేను క్రొంజూపులచే కామమును బుట్టించి ధైర్యమును దొలఁగించియు, మఱియు కౌఁగిలించి సురతమం దాసక్తిఁ బుట్టించియు, మోహ మను జాలమునఁ దగులుకొని నావెంటఁదిరుగంగఁ జేయుచు నామహర్షిని విటునిఁ గావింపనైతినేని దేవతా వంశమందుఁ బుట్టితి నని చెప్పుకొనుట నాకు లజ్జాకర మని భావము.

చ. అనఁ దెఱగంటికొమ్మ పలుకాత్మమనఃప్రమదంబు గూర్ప న
వ్వనరుహసూతి యాదరణవైఖరి నిట్లను, 'నోనెలంత! ది
వ్యనికర వర్ణ్య విభ్రమకలాప్రవిమోహిత సర్వలోకవై
తనరెడు నీకు ధాత్రి నొకతాపసు లోఁబడ నూన్చు టబ్రమే! 49

టీక: అనన్ =పూర్వోక్తప్రకారముగాఁ బలుకఁగా; తెఱగంటికొమ్మ పలుకు = దేవాంగన యగు చిత్రరేఖవాక్యము; ఆత్మమనఃప్రమదంబు– ఆత్మ=తనయొక్క, మనః=మనస్సుయొక్క, ప్రమదంబు=సంతసమును; కూర్పన్ = చేయఁగ; అవ్వనరుహసూతి =ఆబ్రహ్మదేవుఁడు; ఆదరణవైఖరిన్=మన్ననరీతిచే; ఇట్లు=వక్ష్యమాణప్రకారముగ; అనున్=పలికెను; ఓనెలంత = ఓ చిత్రరేఖా! దివ్యనికర వర్ణ్య విభ్రమకలాప్రవిమోహిత సర్వలోకవు– దివ్య=స్వర్గమందుఁ బుట్టిన దేవాదులయొక్క, నికర = సముదాయముచేత, వర్ణ్య =పొగడఁదగిన, విభ్రమకలా=భ్రామకవిద్యలచే, ఆప్రవిమోహిత= బాగుగా మోహింపఁజేయఁబడిన, సర్వలోకవు=సమస్తలోకములు గలదానవు; ఐ=అయి; తనరెడు నీకున్=అతిశయించు నీకు; ధాత్రిన్=పుడమియందు; ఒక తాపసున్ =ఒకమునిని; లోఁబడ నూన్చుట=వశమగునట్లు చేయుట; అబ్రమే=ఆశ్చర్యమా, ఆశ్చర్యము కాదనుట.
సమస్తవశ్యవిద్యలచే లోకముల నెల్ల మోహింపఁజేయు నీకుఁ బుడమి నొకతాపసుని మోహింపఁజేయు టరుదా యని భావము.

ఉ. చొక్కపునీటునం, గలలసొంపున, చారువిలాసవైఖరిం
జక్కఁదనంబునం, సరసచాతురి, నీసురయౌవతంబులో
నెక్కువదాన వౌట చెలి యిచ్చ ఘటించితిఁ గాక దీని కీ
తక్కినవారిచే నగునె తార్పఁగ నీదృశకార్య మెంతయున్. 50

టీక: చొక్కపునీటునన్=శ్రేష్ఠమగు మురిపెముచేత; కలలసొంపునన్=విద్యలయొక్క ప్రాచుర్యముచేత; చారువిలాసవైఖరిన్– చారు=సుందరమగు, విలాస=హావాదులయొక్క, వైఖరిన్=రీతిచేతను; చక్కఁదనంబునన్=సౌందర్యముచేతను; సరస =

మనోజ్ఞమగు; చాతురిన్ = చాతుర్యముచేతను; ఈసురయౌవతంబులో=ఈదేవతాస్త్రీసమూహములో; ఎక్కువదాన వౌటన్ = అధికురాలవు గాన; చెలి=చిత్రరేఖా! ఇచ్చన్=ఇచ్ఛచేత; దీనికిన్ =ఈకార్యమునకు; ఘటించితిఁ గాక=నియోగించితిని; ఈ తక్కినవారిచేన్=నీకంటె నితరులైన వీరిచేత; ఈదృశకార్యము=ఇటువంటి గొప్పపని; ఎంతయున్=మిక్కిలి; తార్పఁగన్= చేయుటకు; అగునె=సాధ్యపడునా, కాదని కాకువు.

స్మరశాస్త్రమందు ప్రావీణ్యముగలదాన వగుటచే సౌందర్యమందు నెక్కు వైనదానవగుటచే నీచేఁదక్కనితరులచే నీపని కాదని సమ్మతిచే నియోగించితి నని భావము.

సీ. ననబోఁడి యతులఘ౦నస్ఫూర్తిఁ దూలింపఁ, జాలదే నీనీల౦వాలకాంతి,
లీలం దమీశావ౦లేపంబు విదళింపఁ, జాలదే నీయాస్య౦జలజదీప్తి,
వనజానన యహీన౦మునిప్రౌఢిఁ గలఁగింపఁ, జాలదే నీరోమ౦పాళికాంతి,
ముదిత సత్తాపస౦ముజ్జృంభణముఁ బెంపఁ,జాలదే నీపదో౦జ్జ్వలనఖాళి,
తే. యచలవక్షోజపరమహం౦సౌఘమహిమ, నడఁపఁ జాలదె నీమంద౦యానలీల
యగుటఁ దల్లక్ష్మి చెలు వందు౦నట్టి నీకు, పడఁతి యొకమౌని నిల మోహ౦పఱచు టెంత. 51

టీక: ననబోఁడి =చిత్రరేఖా! నీనీలవాలకాంతి =నీయొక్క నల్లనైన కురులకాంతి, 'వాలః కచే శిశౌ మూర్ధ్ని' అని విశ్వనిఘంటువు. యతులఘనస్ఫూర్తిన్‌– యతుల=మునులయొక్క, ఘన=అధికమైన, స్ఫూర్తిన్=సామర్థ్యమును; తూలింపఁ జాలదే= చలింపఁజేయ సమర్థము గాదా యని కాకువు; అతుల=సరిలేని, ఘన=మేఘముయొక్క,స్ఫూర్తిన్=ప్రకాశమును తూలింపఁ జాలదే యని యర్థాంతరము దోఁచుచున్నది;

లీలన్=విలాసముచే; నీయాస్యజలజదీప్తి= కమలమువంటి నీ ముఖముయొక్కకాంతి, 'ఉపమితం వ్యాఘ్రాదిభి స్సామాన్యా ప్రయోగే' యను సూత్రమువలన సమాసము; దమీశావలేపంబు=మునిశ్రేష్ఠునియొక్క గర్వమును, 'దర్పోఽవలేపోఽవష్టంభః' అని యమరుఁడు; విదళింపఁజాలదే=పోగొట్టఁజాలదా యని కాకువు; తమీశ యను విభాగమందు 'ద్రుతప్రకృతికము మీఁది పరుషములకు సరళము లగు. ఆదేశసరళములకు ముం దున్న ద్రుతంబునకు బిందుసంశ్లేషంబులు విభాషనగు' అను సూత్రము లచే దకారమును బిందువును వచ్చినవి. తమీశ=నిశాపతి యగు చంద్రునియొక్క, 'రజనీ యామినీ తమీ' అని యమరుడు, అవలేపంబు=గర్వమును, నీయాస్యజలజదీప్తి లీలచే విదళింపఁజాలదా యను నర్థము స్ఫురించుచున్నది.

వనజానన=చిత్రరేఖా! నీరోమపాళికాంతి=నీనూఁగారు కాంతి; అహీనమునిప్రౌఢిన్‌– అహీన=అధికమగు, మునిప్రౌఢిన్= మునులయొక్క ప్రాగల్భ్యమును; కలఁగింపఁజాలదే=కలఁతపఱుపఁజాలదా యని కాకువు; నీరోమపాళికాంతి=నీనూఁగారు కాంతి; అహీన=ఆదిశేషునియొక్క, మునిప్రౌఢిన్=మౌనముద్రను,బిగువు ననుట, కలఁగింపఁజాలదే యను నర్థాంతరము స్ఫురించుచున్నది.

ముదిత=చిత్రరేఖా! నీపదోజ్జ్వలనఖాళి=నీపాదములయందు ప్రకాశించు నఖపంక్తి; సత్తాపసముజ్జృంభణమున్‌–సత్=శ్రేష్ఠ మగు, తాపస=మునులయొక్క, ముత్=సంతసముయొక్క, జృంభణమున్ =అతిశయమును; పెంపఁజాలదే=ఖండింపఁ జేయఁ జాలదా, ఖండించు ననుట; నీనఖపంక్తి, సత్తాపసముజ్జృంభణమున్‌– సత్=నక్షత్రములయొక్క, తాపసముజ్జృంభణ మున్=తాపాతిరేకమును, పెంపఁజాలదా=అతిశయింపఁజేయఁజాలదా యను నర్థము దోఁచుచున్నది.

అచలవక్షోజ=పర్వతములవంటి స్తనములుగల చిత్రరేఖా! పరమహంసౌఘమహిమన్‌–పరమహంస=సన్న్యాసులయొక్క,

ఓఘ=సమూహముయొక్క, మహిమన్=సామర్థ్యమును; నీమందయానలీల, అడఁప జాలదె =అడఁగింపఁజాలదా, చాలు ననుట; పరమహంసౌఘమహిమన్–పరమ=ఉత్కృష్టములగు,హంస=రాజహంసలయొక్క, ఓఘ=సమూహముయొక్క, మహిమన్=సామర్థ్యమును, నీమందయానలీల అడఁగింపఁజాలదా అను నర్థాంతరము దోఁచుచున్నది.అగుటన్= ఈప్రకారము కావుటవలన; తల్లక్ష్మి చెలువందునట్టి నీకున్=ఆనీలవాలకాంత్యాదిసంపదచే నొప్పుచున్నట్టినీకు; పడఁతి = ఓ చిత్రరేఖా! ఒకమౌనిన్=ఒకమునిని; ఇలన్=భూమియందు; మోహపఱచు టెంత = మోహపరచు టెంతమాత్రము అసాధ్యము కాదనుట.

చిత్రరేఖా! నీకురులు, ముఖము, నూఁగారు, నఖములు, నీమందయానములే మునులధృతి దూల్చుచుండఁగఁ బుడమి నొకమునిని, మోహపఱచుట నీ కకించిత్కర మని భావము.

చ. అలవిరివింటిదంట ముదమారఁగ నీ వెనువెంట రా, ధరా
స్థలివడిఁజేరి, యామునియుదారతపఃక్రమ మెల్ల మాన్చి, యు
జ్జ్వలగతి వచ్చునీకుఁ జెలువా యొనగూర్తు వహింప నీసురా
బలలు శిరోనతిం బవలుపంజులు చెంద్రికపావడన్ రహిన్.' 52

టీక: చెలువా=చిత్రరేఖా! అలవిరివింటిదంట =దిట్టతనముగల యామన్మథుఁడు; ముదమారఁగన్=సంతసము నిండఁగా; నీ వెనువెంట రాన్ = నీవెంబడి రాఁగ; ధరాస్థలిన్=భూప్రదేశమును; వడిన్=వేగమున; చేరి=పొంది; ఆముని=ఆవసంతుని యొక్క; ఉదారతపఃక్రమ మెల్లన్=యెక్కువైన తపమెల్లను; మాన్చి=పోఁగొట్టి; ఉజ్జ్వలగతిన్=ప్రకాశించుగమనముచేత; వచ్చునీకున్=వచ్చునట్టి నీకు; ఈసురాబలలు =ఈదేవాంగనలు; శిరోనతిన్=తలవంపును; వహింపన్=పొందునటుల; పవలుపంజులు=పగలుదివిటీలను; చెంద్రికపావడన్=కుసుంభపువస్త్రమును; రహిన్=ప్రీతితో; ఒనగూర్తున్=ఇత్తును.

ఇల వసంతుని తపోభంగ మొనరించివచ్చునీకు నితరసురాంగనలకు లజ్జ గలుగునటుల పవలుపంజులు, వస్త్రములు బహుమతిగా నిత్తు నని భావము.

తే. అని యనేకవిధంబుల నాదరంబు, దొలఁక రంభాదినిర్జరీకులము లాత్మఁ
గలఁకచేఁ గుంద నప్పల్కు కలికిమగఁడు, చెలిమి నాచిత్రరేఖతోఁ బలుకునపుడు. 53

టీక: అని =ఈప్రకారము వచించి; అనేకవిధంబులన్=నానారీతులచేత; ఆదరంబు=మన్నన; తొలఁకన్=అతిశయింపగా; రంభాదినిర్జరీకులములు = రంభ మొదలగుదేవాంగల గుంపులు; ఆత్మన్=చిత్తమందు; కలఁకచేన్=కలఁతచేత; కుందన్ = చింతింపఁగ; అప్పల్కుకలికిమగఁడు=ఆబ్రహ్మ; చెలిమిన్=నెయ్యముతో; ఆచిత్రరేఖతోన్, పలుకునపుడు = మాటలాడు చుండఁగా.

సీ. ననసేసకొప్పు నొందిన యొంటిపొరచెంద్ర,కావిరుమాల వింతై వెలుంగ,
రతికౌఁగిలింతఁ దొరపుఁజిక్కు గన్న మొ,గ్గలసరుల్ పేరెదఁ జెలువుమీఱ,
నెలవంకరేఖల నిలిచి పైఁజెదరుక,ప్పురపుగందపుఁదావి బుగులుకొనఁగఁ,
గలికిగోణమ్ముపైఁ గట్టిన క్రొత్తగే,దఁగితేకువంకి యందముగ మెఱయఁ,

తే. జిలుకకోయిలమూఁకలు ◊సేరి నడవఁ, గలువతేఁ డామనియుఁ బార్శ్వ◊ముల రహింప,
శారికలు నైజజయవిద్య◊చయముఁ జదువ, వేడ్కఁ జనుదెంచె నపుడు పూ◊వింటిజోదు. 54

టీక: ననసేసకొప్పున్=పుష్పయుక్తమగు కొండెసిగను; ఒందిన=పొందినట్టి; ఒంటిపొరచెంద్రకావిరుమాల =ఒంటిమడత గల చెంగావి తలగుడ్డ; వింతై =చిత్రమైనదై; వెలుంగన్=ప్రకాశింపఁగా;
రతికౌఁగిలింతన్=రత్యాలింగనముచేత; తోరపుఁజిక్కు గన్న = మిక్కిలి పెనఁగిన; మొగ్గలసరుల్=మొగ్గలతోఁ గూర్చిన హారములు; పేరెదన్=విశాలమగువక్షమునందు; చెలువుమీఱన్= అందముచే నతిశయింపఁగా;
నెలవంకరేఖలన్=నఖక్షతములందు; నిలిచి =తగులుకొని; పైఁజెదరు కప్పురపుగందపుఁదావి – పైఁజెదరు = మీఁది కెగయుచున్న; కప్పురపుగందపుఁదావి = కర్పూరగంధముయొక్క పరిమళము; బుగులుకొనఁగన్ = నెఱసికొనఁగా;
కలికిగోణమ్ముపైన్ = సుందరమగు కాసెదట్టిపైన; కట్టిన =కట్టినట్టి; క్రొత్తగేదఁగితేకువంకి =నూతనమగు కేతకీదళ మనెడి బాకు; అందముగన్=సుందరముగా; మెఱయన్=ప్రకాశించుచుండఁగా;
చిలుకకోయిలమూఁకలు =శుకపికసేనలు; చేరి నడవన్=సమీపించి నడచుచుండఁగా; కలువతేఁడామనియున్ = చంద్రుఁడును వసంతుఁడును; పార్శ్వముల = ఇరుప్రక్కలయందు; రహింపన్=ఒప్పుచుండఁగా; శారికలు =గోరువంకపక్షులు; నైజజయవిద్యచయమున్ = తనసంబంధ మగు బిరుదులను; చదువన్=పఠింపఁగా; వేడ్కన్ = సంతసముచే; అపుడు=ఆసమయమున; పూవింటిజోదు =మన్మథుఁడు; చనుదెంచెన్=వచ్చెను.

మ. వలరా జట్లరుదేర, నానలువ దీ◊వ్యద్రత్నసింహాసన
స్థలి నొయ్యన్ డిగి చేర వచ్చి, నతి నొం◊దం బాణిచే నెత్తి, య
ర్మిలితోఁ గౌఁగిటఁ గూర్చి, యంత రతినా◊రీభర్తతో నందదు
జ్జ్వలపీఠిన్ వసియించెఁ, జెంగటనె ని◊ల్వం దదృలవ్రాతముల్. 55

టీక: వలరాజు=మన్మథుఁడు; అట్లు = పూర్వోక్తప్రకారమున; అరుదేరన్=రాఁగ; ఆనలువ =ఆబ్రహ్మదేవుఁడు; దీవ్యత్= ప్రకాశించుచున్న; రత్నసింహాసనస్థలిన్=రత్నమయసింహాసనమునుండి; ఒయ్యన్ =శీఘ్రముగ; డిగి =దిగి; చేర వచ్చి = సమీపమునకు వచ్చి; నతి నొందన్ = (మన్మథుఁడు) నమస్కరింపఁగా; పాణిచే నెత్తి = హస్తముచే లేవఁదీసి; అర్మిలితోన్ = ప్రేమతో; కౌఁగిటన్ కూర్చి = కౌఁగిలించి; అంతన్=అటు పిమ్మట; తత్ =ఆమన్మథునియొక్క; బలవ్రాతముల్ =శుకపికాది సేనాసమూహములు; చెంగటనె = సమీపమందే; నిల్వన్=ఉండఁగా; రతినారీభర్తతోన్=మన్మథునితో; నందదుజ్జ్వలపీఠిన్ = ఆనందకర మగు ప్రకాశించుచున్న పీఠమందు; వసియించెన్=కూర్చుండెను. నలువ మన్మథుఁడు రాఁగానే అతని నెదుర్కొని కౌఁగిలించి రత్నమయసింహాసనమునఁ గూర్చుండఁబెట్టుకొనె నని భావము.

చ. ఘనవినయాత్ము నున్నయల◊కంజశరుం దిలకించి యవ్విరిం
చనుఁ డనురక్తి దోఁప చతు◊రానని నొక్కటి యై రహించు తి
న్ననిమధురోక్తిఁ బల్కు, ‘రతి◊నాయక! నిన్గనుగొన్న నామదిన్
మనిచెఁ బ్రమోదసంతతి ర◊మాపతిఁ గాంచినదారి నియ్యెడన్. 56

టీక: ఘనవినయాత్మన్ = అధికమగు వినయము గల బుద్ధిచేత; ఉన్న=ఉన్నట్టి; అలకంజశరున్ = ఆమన్మథుని; తిలకించి = చూచి; అవ్విరించను(డు=ఆబ్రహ్మదేవు(డు; అనురక్తి తో(పన్ = అనురాగ ముదయింప(గా; చతురాననిన్=నాల్గుముఖములచేత, 'చతుర్ణామాననానాం సమాహారశ్చతురాననీ, సంఖ్యాపూర్వో ద్విగుః' అని సమాసము; ఒక్కటి యై రహించు తిన్ననిమధురోక్తిన్ = ఒక్కటైన మృదుమధురోక్తిని; పల్కున్=పల్కెను;(అది యేమన) రతినాయక =మన్మథు(డా! నిన్నను గొన్నన్= నిన్ను(జూడ(గా; ఇయ్యెడన్=ఇపుడు; రమాపతిన్= విష్ణుమూర్తిని; కాంచినదారిన్=చూచినరీతిని; నామదిన్ = నామనస్సునందు; ప్రమోదసంతతి =ప్రమోదమును; మనిచెన్= వృద్ధి(బొందించెను.

చ. సరసతరాసమాస్త్రములు ◊సంతతజీవికశింజినీలతా
స్ఫురితశరాసనోత్తమము(◊బూని తలంప(గ మేటి వై సుమా
కరసఖ నీవు రాజిల(గ(◊గాదె సమస్తజగజ్జనుల్ పర
స్పరపరివైమతీగతులు ◊బాసి ప్రియప్రమదాప్తి నుబ్బుటల్. 57

టీక: సరసతరాసమాస్త్రములు – సరసతర=మిక్కిలిశ్రేష్ఠమగు, అసమ=సాటిలేని, అస్త్రములు=బాణములు, మకరందముతో(గూడుకొన్న బేసిసంఖ్యగల పూ(దూపు లని తో(చుచున్నది; సంతత జీవిక శింజినీలతా స్ఫురిత శరాసనోత్తమమున్ – సంతత = అవిచ్ఛిన్నమైన, జీవిక=జీవనము గలిగిన, శింజినీలతా=అల్లెత్రాటిచేత, తుమ్మెదనారి యని తో(చుచున్నది, స్ఫురిత= ప్రకాశించుచున్న, శరాసనోత్తమమున్ =మేటివింటిని, పూని =గ్రహించి, ఇక్షుధనువును గ్రహించి యని భావము; తలంప(గన్ =ఆలోచింప(గ; మేటి వై =అగ్రేసరు(డ వై; సుమాకరసఖ = వసంతునకు సఖు(డ వైన మన్మథు(డా! నీవు రాజిల(గ(గాదె =నీవు సర్వోత్కర్షముగ నుండుటవలన(గదా; సమస్తజగజ్జనుల్ = ఎల్లజగములలో నుండు జనులు; పరస్పరపరివైమతీగతులు– పరస్పర= అన్యోన్యము, పరివైమతీగతులు =ప్రణయకలహములవలననైన మనస్తాపములను; పాసి =వదలి; ప్రియప్రమదాప్తిన్ = సంతోషముచే; ఉబ్బుటల్=విజృంభించుటలు.
చెఱకువిల్లు, పూ(దూపులును, తుమ్మెదనారియు(బూని నీవు విజృంభించుచుండ(గ(గదా సమస్తజనులు వైమతుల(బాసి విజృంభింతు రని భావము.

సీ. మునిభామకై యింద్రు(◊బెను(గోడిగా లస,ద్ధృతి(దూల్చి మించిన ◊దిట్టతనము,
నొక్క కాత్యాయని ◊నొందంగ సెగకంటి, పౌరుషం బరచేసి ◊ప్రబలునేర్పు,
హంసాఖ్య(దగు కైర◊వారిపితృప్రసూవి,సంపర్కగతి(గూర్చి ◊యొప్పుచలము,
గురుపత్ని(గలయ స◊త్కులనేత యగువాని, సతతంబు(గుందించు ◊చతురవృత్తి,
తే. నఖిలభువనాభినవ్యమ◊హాద్భుతౌఘు, కల్పనానర్గళస్ఫూర్తి ◊గాంచి వెలయ,
మాదృశుల కెన్న నలవియె ◊మంజుకంజ,బాణజితలోకజాల, శం◊బరవిఫాల! 58

టీక: మునిభామకై =అహల్యకై; ఇంద్రున్=దేవేంద్రుని; పెను(గోడిగాన్ =కుక్కుటముగా; లసత్=ప్రకాశించుచున్న; ధృతి = ధైర్యమును; తూల్చి =పో(గొట్టి; మించిన=అతిశయించిన యట్టి, దిట్టతనమున్=సామర్థ్యమును; ఇచట పెను(గోడిగాల నను చోట పెద్దకోడిగపు(జేష్టలచేత నని యర్థాంతరము దో(చుచున్నది.

ఒక్క కాత్యాయనిన్ = ఒక్కతి యైన పార్వతిని, 'ఉమా కాత్యాయనీ' అని అమరము; ఒందంగన్=పొందుటకు; సెగకంటి పౌరుషంబు = ఈశ్వరశరీరమును; అరచేసి =సగము చేసి; ప్రబలునేర్పున్ = అతిశయించిన నైపుణ్యమును; ఈచరణమందు ఒక్క కాత్యాయనిన్ = సగమేండ్లుగల ముదిమిముదితను, 'కాత్యాయ న్యర్ధవృద్ధాచ' అని యమరుఁడు, సెగకంటిపౌరుషమును = సెగకంటియొక్క శరీరధర్మము నను నర్థమును దోఁచుచున్నది;

హంసాఖ్యన్=సూర్యనామముచేత; తగు=ఒప్పుచున్న; కైరవారి=ఆదిత్యునికి; పితృప్రసూ=సాయంసంధ్యయొక్క, 'సాయం సంధ్యా పితృప్రసూః' అని యమరుఁడు; విసంపర్కగతిన్ =విశేషమైన సంబంధమును; కూర్చి=కలుగఁజేసి; ఒప్పువలమున్ = ఒప్పిదమగు మాత్సర్యమును; హంసాఖ్యఁదగు=పరమహంస యను ప్రసిద్ధి నొందు; కైరవారి=ఆదిత్యునికి; పితృప్రసూ= తండ్రివలనఁ బుట్టినవానియొక్క, తోఁబుట్టుస్త్రీలయొక్కయని భావము; విసంపర్కగతిన్ =విశేషమైన సంబంధమును; కూర్చి= కలుగఁజేసి యను నర్థాంతరము దోఁచుచున్నది.

గురుపత్నిఁ గలయ =బృహస్పతిభార్య యగు తారను గలయుటకు; సత్కులనేత యగువానిన్= రిక్కలఱేఁడగు చంద్రుని; సతతంబున్=ఎల్లపుడును; కుందించు చతురవృత్తిన్=క్షీణింపఁజేయు చాతుర్యమును; మంచికులమువారిలోఁ బెద్దను సత తంబుఁ గుందించు నను నర్థము ధ్వనించుచున్నది;

అఖిలభువనాభినవ్య మహాద్భుతౌఘ కల్ప నానర్గళ స్ఫూర్తిన్ – అఖిలభువన=సమస్తలోకములకు, అభినవ్య=మిక్కిలి నూతనమగు, మహాద్భుతౌఘ=అత్యాశ్చర్యసంఘముయొక్క, కల్పన=కల్పించుటయందు, అనర్గళ=నిరంకుశమగు, స్ఫూర్తిన్= సామర్థ్యమును; కాంచి =పొంది; వెలయన్=ప్రకాశింపఁగా; మాదృశులకు=మాబోఁటివారికి; ఎన్నన్=గణించు టకు; మంజు కంజబాణ జిత లోకజాల=మనోహరమగు పద్మబాణములచే జయింపఁబడిన లోకసమూహము గలవాఁడా, శంబరవిఫాల = శంబరాంతకుఁడా, అలవియె = వశమా? కాదనుట.

ఇంద్రశివసూర్యచంద్రులధృతిఁ దూల్చి కామపరతంత్రులఁ జేసిన నీసామర్థ్యము నెన్న మాబోఁటివారి కలవిగాదని తాత్పర్యము.

చ. కనుగలవిల్లు పూని కడుఁగాటపుసంపెఁగమొగ్గముల్కిచాల్
గొని కలనాదసైన్యములుఁ గొల్వఁగ వీవలితేరి నెక్కి నీ
వనికి రమాకుమారక! భుజాంచితశక్తిఁ గడంగ డాఁగఁడే
ఘనకరవీరసూనదరిఁ గాలవిరోధి భయావిలాత్ముఁడై.' 59

టీక: రమాకుమారక =మన్మథుఁడా! నీవు, కనుగలవిల్లు పూని =చెఱకుసింగిణి గ్రహించి; కడుగాటపుసంపెఁగమొగ్గముల్కిచాల్ – కడుగాటపు=మిక్కిలి సమర్థమైన, సంపెఁగమొగ్గ =సంపెంగమొగ్గ లనెడు, ముల్కిచాల్=బాణబృందమును; కొని=గ్రహించి; కలనాదసైన్యములు=కోయిల లను సైనికులు; కొల్వఁగన్=సేవింపఁగ; వీవలితేరి నెక్కి=మందమారుత మనెడు రథము నెక్కి; భుజాంచితశక్తిన్=భుజబలముచేత; అనికిన్=యుద్ధమునకు; కడంగన్=ప్రయత్నింపఁగా; కాలవిరోధి=శంకరుఁడు; భయావి లాత్ముఁడై = భయముచేఁ గలఁతనొందినవాఁడై; ఘనకరవీరసూనదరిన్ – ఘన=అధికమగు, కరవీరసూన=గన్నేరుకుసుమ మనెడు; దరిన్=గుహయందు; డాఁగఁడే = దాఁగఁడా యని కాకువు.

క. అని వినుతిపూర్వకంబుగ, మనసిజునిం బలికి యపుడు మఱియు నతనితోన్
తనకార్య మెల్లఁ దేటగ, వనజాసనుఁ డిట్లు వలుకు వరమృదుఫణితిన్. 60

టీక: అని=ఈప్రకారము; వినుతిపూర్వకంబుగన్=స్తుతిపూర్వకముగ; మనసిజునిన్=వలరాజును; పలికి=వచించి; అపుడు = ఆసమయమునందు; మఱియున్=ఇంకను; అతనితోన్=ఆమన్మథునితో; తనకార్య మెల్లన్ = తనపని యంతయు; తేటగన్= వెల్లడిగ; వనజాసనుఁడు=బ్రహ్మ; ఇట్లు=వక్ష్యమాణప్రకారమున; వరమృదుఫణితిన్ =శ్రేష్ఠమగు మృదువాక్యరీతిగ; పలుకున్ =పలికెను.

శా. ‘వింటే మన్మథ! మత్ప్రభుత్వమున కుర్విం బుట్టు విఘ్నావళిన్
గెంటం దార్చుచు మామకాత్మహితభంగిన్ మించు నీ వుండుటల్
కంటం గానక బ్రహ్మభావమున కాకాంక్షించి యొక్కండు పెన్
గొంటే యౌ ముని దెచ్చినాఁ డిటఁ దపఃకుల్యాధ్వసంచారితన్. 61

టీక: మన్మథ=మన్మథుఁడా! మత్ప్రభుత్వమునకున్= నాదొరతనమునకు; ఉర్విన్=భూమియందు; పుట్టు విఘ్నావళిన్ = ఉదయించు నంతరాయములను; గెంటం దార్చుచు=చలింపఁజేయుచు; మామకాత్మహితభంగిన్ = నాశరీరముకొఱకు హిత మైన విధముచే; మించు నీ వుండుటల్ =అతిశయించు నీవునికిని; కంటం గానక =చూడక; బ్రహ్మభావమునకు=బ్రహ్మత్వము నకు; ఆకాంక్షించి =ఆశపడి; ఒక్కండు పెన్ గొంటే యౌ ముని = ఒక దుష్టతపస్వి; తపఃకుల్యాధ్వసంచారితన్ – తపఃకుల్యా= తపస్సనెడు కృత్రిమనదియొక్క, అధ్వసంచారితన్=మార్గసంచారముచేత; ఇటన్=ఇచ్చటికి; తెచ్చినాఁడు, వింటే=వింటివా. అనఁగా పుడమి నాబ్రహ్మత్వమునకుఁ బుట్టినట్టి యంతరాయములను బోఁగొట్టు నీయునికిని దెలియక యొకజడదారి బ్రహ్మ త్వమును గోరి తపం బొనరించుచున్నాడని భావము.

చ. ముని యజభావ మందఁ దపముల్ గడుఁ జేసినఁ జేయుఁగాక, పా
వన మనురాజజాతజపవైఖరి మించిన మించుఁ గాక, ని
త్యనియమవృత్తిఁ దాలిచినఁ దాలుచుఁ గాక, విచారమేల నో
మనసిజ! నాకు నీవు బలుమక్కువతమ్ముఁడవై చెలంగఁగన్. 62

టీక: ఓమనసిజ = ఓమన్మథుఁడా!ముని =వసంతుఁడు; అజభావ మందన్= బ్రహ్మత్వమును పొందుటకు; తపముల్ =తపం బులు; కడున్=మిక్కిలి; చేసినన్=ఒనరించినను; చేయుఁగాక=ఒనరించుఁ గాక; పావనమనురాజజాతజపవైఖరిన్– పావన = పవిత్రమగు, మనురాజజాత=మంత్రశ్రేష్ఠముల సమూహముయొక్క, జపవైఖరిన్=జపవిధానముచేత; మించినన్ = అతిశ యించిన; మించుఁ గాక = అతిశయించుఁ గాక; నిత్యనియమవృత్తిన్ = ఎల్లపుడు నియమవృత్తిని; తాలిచినన్= ధరించిన; తాలుచుఁ గాక = ధరించును గాక; నాకు నీవు, పలుమక్కువతమ్ముఁడవై చెలంగఁగన్ = మిక్కిలి ప్రేమగల తమ్ముఁడవై యుండఁగా; విచారమేల = చింత యెందుకు, చింత పనిలేదని భావము. నలువ విష్ణుమూర్తి నాభికమలమునందు జన్మించినవాఁ డగుటచే మన్మథున కన్న యని భావము.

చ. హరి సకలాధిపత్యము సుమాళుగ! మా కొనగూర్చె మున్ను త
త్పరిభవకార్యసంహృతియుఁ దత్పరిపాలనమున్ ఘటింపఁగా

నిరతముఁ గర్త వీ వగుట ◊నేర్పున నీ విలఁ జేరి తన్మునీ
శ్వరతప మెల్లఁ దూల్పఁ దగు ◊సారమహోమహిమంబు లెంచఁగన్. 63

టీక: సుమాశుగ =మన్మథుఁడా! హరి =విష్ణుమూర్తి; మున్ను =పూర్వము; సకలాధిపత్యము =సమస్తభువనాధిపత్యము; మా కొనగూర్చెన్ = మాకు కలుగఁ జేసెను; తత్పరిభవకార్యసంహృతియున్ – తత్=ఆయాధిపత్యముయొక్క, పరిభవకార్య = తిరస్కారకార్యముయొక్క, సంహృతియున్ = ప్రతిక్రియయును; తత్పరిపాలనమున్=ఆయాధిపత్యపరిపాలనమును; ఘటింపఁగాన్=ఘటింపఁజేయుటకు; నిరతమున్ = ఎల్లప్పుడు; కర్త వీ వగుటన్ = నీవు కర్త వగుటవలన; నేర్పునన్=జాణ తనముచేత; నీవు ఇలఁ జేరి =నీవు పుడమిని ప్రవేశించి; సారమహోమహిమంబు లెంచఁగన్ = పరాక్రమాతిశయము లెంచఁగా; తన్మునీశ్వరతప మెల్లన్ = ఆమునీశ్వరుని తపము నంతయు; తూల్పఁ దగున్ = భంగము చేయవలెను.

చ. అనఘ కలాకలాపిని య◊నల్పవిలాసిని చిత్రరేఖ పే
రను దగు నీవధూనికర◊రత్నము నీవెనువెంట రాఁగ, వే
చని ధరఁ జేరి, యానియమి◊చంద్రుతపం బెడలించి, వానిఁ దూ
ల్ప నిజశక్తి నేతదబ◊లాపరిచారకుఁ జేయు మంగజా! 64

టీక: అంగజా=మన్మథుఁడా! అనఘ కలాకలాపిని – అనఘ=అమోఘములైన, కలా=మన్మథవిద్యలే, కలాపిని = భూషణ ముగాఁ గల్గినయట్టిదియు; అనల్ప=అధికమగు, విలాసిని =విలాసములు గలిగినట్టిదియు; చిత్రరేఖ పేరను =చిత్రరేఖ యను పేరిచేత; తగు=ఒప్పుచున్నట్టి; ఈవధూనికరరత్నము = ఈనారీకులరత్నము; నీవెనువెంటన్= నీవెంబడి; రాఁగన్=వచ్చు చుండఁగా; వే చని = త్వరగా వెళ్లి; ధరఁ జేరి =పుడమి నొంది; ఆనియమిచంద్రుతపంబు = ఆమునిశ్రేష్ఠుని (వసంతుని) తప స్సును; ఎడలించి =తొలఁగించి; వానిఁ దూల్పన్=ఆమునిని దూలించుటకై; నిజశక్తిన్=స్వసామర్థ్యముచేత; ఏతదబలా= ఈ చిత్రరేఖకు; పరిచారకున్=సేవకునిగా; చేయుము=ఒనర్పుము.

చ. అలికవిలోచనోగ్రతప◊మంతయు మున్నడఁగించినట్టి నీ
బలము చలంబు దివ్యశర◊పాండితి నేఁడును జూపి, మౌని ని
చ్చెలువ కధీనుఁ జేయు మిఁకఁ ◊జెప్పెడి దేమి రతీశ, సర్వముం
దెలిసిననీకు దీనఁ దగ ◊నిల్పుము మద్భువనాధిపత్యమున్.' 65

టీక: రతీశ =మన్మథుఁడా! మున్ను =పూర్వమందు; అలికవిలోచనోగ్రతప మంతయున్=శంకరుని తీక్ష్ణతపము నంతయు; అడఁ గించినట్టి నీబలము = పోఁబెట్టినట్టి నీసామర్థ్యము; చలంబు = పట్టుదల; దివ్యశరపాండితి = అమోఘమగు బాణవిద్యాపాండి త్యము; నేఁడును=ఇపుడును; చూపి=కనిపింపఁజేసి; మౌనిన్=మునిని; ఇచ్చెలువకు=ఈచిత్రరేఖకు; అధీనున్=స్వాధీనునిగ; చేయుము= ఒనరింపుము; సర్వముం దెలిసిననీకున్=సర్వజ్ఞుఁడ వగు నీకు; ఇఁకన్=ఈమీఁద; చెప్పెడి దేమి =చెప్పవలసిన దేమున్నది, 'కిమర్పితాత్మభారాణాం వక్తవ్య మవశిష్యతే' యను న్యాయమువలన నీకుఁ దెలుపున దేమియును లేదని భావము; దీనన్=ఈ కార్యమువలన; మద్భువనాధిపత్యమున్ =నాలోకాధిపత్యమును; తగన్=యుక్తముగ; నిల్పుము= ఉంపుము.

ఉ. నా విని నల్వఁ జూచి, రతి◊నాయకుఁ డిట్లను, 'వాగధీశ! యి
ట్లీవు వచింపఁగాఁ దగవె, ◊యీఘనకార్యభరంబు నాది గా
దే, విబుధుల్ నుతింప జగ◊తీస్థలిఁ జేరి, మునీంద్రు దేవరా
జీవదశాక్షితో నెనయ◊జేసెద, మానుము వంత నెమ్మదిన్. 66

టీక: నా విని =ఈప్రకారము వచింపఁగా విని; రతినాయకుఁడు=మన్మథుఁడు; నల్వఁ జూచి=బ్రహ్మను చూచి; ఇట్లనున్=వక్ష్యమాణప్రకారముగఁ బల్కెను; వాగధీశ=ఓ నలువా! ఇట్లు=పూర్వోక్తప్రకారమున; ఈవు=నీవు; వచింపఁగాఁ దగవె = పలుకుట ఉచితమా, కాదనుట; ఈఘనకార్యభరంబు = ఈగొప్ప కార్యభారము; నాది గాదే = నాదే కద యని కాకువు; విబుధుల్ = దేవతలు; నుతింపన్=స్తుతిచేయఁగ; జగతీస్థలిఁ జేరి = పుడమి సొచ్చి; మునీంద్రున్=వసంతుని; దేవరాజీవదశాక్షితోన్=దేవాంగనయైన చిత్రరేఖతో; ఎనయఁ జేసెదన్=కలయునటుల చేసెదను; నెమ్మదిన్=హృదయమునందు; వంత=దుఃఖమును; మానుము = వదలుము.

చ. అళితతిపోటుఁగూఁత లెగ◊యం, బెనుమావులు డిగ్గి చిల్కరౌ
తులు నడవన్, మహాబలము ◊దోడ్తన చుట్టికొనం, దపస్వి ని
శ్చలధృతి సాలమండలము ◊చయ్యన లగ్గలు వట్టి పట్టి యీ
నెలఁతయురోజదుర్గతటి ◊నిల్పెదఁ దత్పటుహృన్మహీవిభున్'. 67

టీక: అళితతిపోటుఁగూఁతలు=తుమ్మెదగుంపుల శూరవాక్యములు; ఎగయన్=అతిశయించుచుండఁగా; చిల్కరౌతులు =శుకములను రౌతులు; పెనుమావులు =పెద్ద చూతవృక్షము లను గుఱ్ఱములను; డిగ్గి=దిగి; నడవన్ =నడచుచుండఁగా; మహాబలము =వీవలి యను సైన్యము; తోడ్తన=వెంటనె; చుట్టికొనన్=ఆవరింపఁగా; తపస్వి నిశ్చలధృతి సాలమండలము– తపస్వి=మునియొక్క, నిశ్చల=చలింపని; ధృతి=ధైర్యమనెడు, సాలమండలము=ప్రాకారమండలము, 'ప్రాకారో వరణస్సాలః' అని యమరుఁడు; చయ్యనన్=శీఘ్రముగ; లగ్గలు వట్టి పట్టి =ప్రాఁకిప్రాఁకి; ఈనెలఁతయురోజదుర్గతటిన్ = ఈ చిత్రరేఖయొక్క పర్వతతుల్యమగు స్తనము లనెడు కోటయందు; తత్పటుహృన్మహీవిభున్– తత్=ఆమునియొక్క, పటు= సమర్థమైన, హృత్=హృదయమనెడు, మహీవిభున్=భూపతిని; నిల్పెదన్=బంధింతును.

చ. అన మరుఁ బల్కునం బ్రమద◊మంది విరించి సువర్ణచేలముల్
ఘనమణిభూషణంబు లల◊కంతునకున్ సురకాంతకుం బ్రియం
బెనయ నొసంగి, యంత రజ◊నీశ వసంత సమీర తామ్రలో
చనవర ముఖ్యమారబల◊సంతతి నాదృతి సేసి యిట్లనున్. 68

టీక:అనన్=ఈప్రకారము పలుకఁగ; మరు పల్కునన్=మన్మథవాక్యముచేత; విరించి=నలువ; ప్రమదమంది =సంతసించి; సువర్ణచేలముల్=బంగారువస్త్రములు; ఘన=అధికమగు; మణిభూషితంబులు=మణిమయాభరణంబులు; అలకంతునకున్ =ఆమన్మథునికి; సురకాంతకున్=దేవాంగనకు; ప్రియంబు=ప్రేమము; ఎనయన్=పొందునటుల; ఒసంగి=ఇచ్చి; అంతన్=

అటు పిమ్మట; రజనీశ వసంత సమీర తామ్రలోచనవర ముఖ్యమారబలసంతతిన్–రజనీశ=చంద్రుఁడు, వసంత=వసంతుఁడు, సమీర=వాయువు, తామ్రలోచనవర=పికశ్రేష్ఠములు, ముఖ్య=ఆదిగాఁ గల; మారబలసంతతిన్=మన్మథసైన్యమును; నాదృతి సేసి =ఆదరించి; ఇట్లు=వక్ష్యమాణప్రకారము; అనున్=పలికెను.
అనఁగా మునితపోభంగ మొనరింప సమకట్టి యున్న మన్మథునకును, దేవాంగనకును బ్రహ్మ కనకాంబరములును, మణి భూషణములును బహుమతిగా నొసంగి, మన్మథసహాయు లగు చంద్రవసంతాదులను ప్రియోక్తుల నాదరించె నని భావము.

సీ. తెఱవ నవ్వుల యోగి◊ధృతిఁ గలంపకమున్న, నెఱయు వెన్నెలలు పై◊నింప వన్న,
నెలఁత కేలను మౌని◊కళ లంటకయమున్న, చిగురాకు నెమ్మొనఁ ◊జేర్ప వన్న,
సకిపైఁట యతిఁ జొక్కఁ ◊జక్కవీవకమున్న, ప్రబలుచల్లదనానఁ ◊గ్రమ్మ వన్న,
చెలిపాట యమివీను◊లలరఁ బాడకమున్న, కలనాదభంగికల్ ◊తెలుప వన్న,
తే. యోకుముదమిత్ర, యోచైత్ర, ◊యోసమీర, యోపికాధీశ మీనేర్పు ◊లొనరఁ జూపి,
పడఁతి కాజడదారి లోఁ◊బఱప రన్న, మన్మనోభీష్టకార్యంబు ◊ మనుప రన్న. 69

టీక: తెఱవ =చిత్రరేఖ; నవ్వులన్=మందహాసములచేత; యోగిధృతిన్=మునియొక్క ధైర్యమును; కలంపకమున్న= కలఁత పఱపకముందె; నెఱయు వెన్నెలలు = వ్యాపించు చంద్రికలను; పై నింప వన్న =పైని గప్పుమా;
నెలఁత=చిత్రరేఖ; కేలను=హస్తముచేత; మౌనికళలు=వసంతునియొక్క కళాస్థానములను; అంటకయమున్న= స్పృశింపక ముందే, స్త్రీపురుషులకు నొక్కొక్కదినమందు నొక్కొక్కయంగమునఁ గళ యుండుట కళాశాస్త్రప్రసిద్ధము; చిగురాకునెమ్మొనన్ = చిగురుటాకుయొక్క అగ్రమును; చేర్ప వన్న=కూర్పుమా;
సకి=చిత్రరేఖ; పైఁటన్=పైఁటకొంగుచేతను, అనఁగా ముసుగుకొంగుచేతను; యతిన్=మునిని; చొక్కన్=పరవశించునటుల; చక్కన్=అనుకూలముగ; వీవకమున్న=విసరకమునుపే; ప్రబలుచల్లదనానన్=అధికమగు చల్లదనముచేత; క్రమ్మవన్న=పై కొనుమా;
చెలి=చిత్రరేఖ; పాటన్=పాటను; యమివీనులు=మునియొక్క కర్ణములు; అలరన్=సంతోషించునటుల; పాడకమున్న = పాడకమునుపే; కల=అవ్యక్తమధురమగు; నాద=ధ్వనులయొక్క; భంగికల్ =రీతులు; తెలుప వన్న=తెలియఁజేయుమా;
ఓకుముదమిత్ర=ఓచంద్రుఁడా! ఓచైత్ర=ఓవసంతుఁడా! ఓసమీర=ఓమందమారుతమా! ఓపికాధీశ =ఓకోకిలరాజా! ఈ చంద్రాదులకు పూర్వచరణములందు చెప్పఁబడిన విషయమునకు క్రమముగా నన్వయ మని యెఱుంగునది; మీనేర్పులు=మీజాణతనములను; ఒనరన్=ఒప్పునటులు; చూపి=ప్రదర్శించి; పడఁతికిన్=చిత్రరేఖకు; ఆజడదారిన్=ఆమునిని; లోఁబఱపరన్న= వశపఱుపుఁడీ; మన్మనోభీష్టకార్యంబు=నామనమున కిష్టమగు పనిని; మనుపరన్న= సిద్ధించునట్లు చేయుఁడీ.

చ. అని నిజమిత్త్రవర్యనిచ◊యంబుల నీగతిఁ బల్కి యమ్మరు
ద్వనధరవేణికామణి వి◊ధాత రహిం దన కొప్పగించి పం
చిన విరివింటిజోదు పిక◊సేనలతో సురవారిజాక్షితో
ఘన మగు వేడ్క వొంగఁ దద◊గారము వెల్వడి వచ్చె నంతటన్. 70

టీక: విధాత=బ్రహ్మదేవుఁడు; అని=ఈప్రకారముగ; నిజమిత్త్రవర్యనిచయంబులన్—నిజ=స్వకీయులగు, మిత్త్రవర్య=మిత్త్ర శ్రేష్ఠులయొక్క, నిచయంబులన్=సమూహములను; ఈఁగతిన్=ఈరీతిని; పల్కి=వచించి; అమ్మరుద్వనధరవేణికామణిన్ = మేఘతుల్యమగు వేణిగల యా సురాంగనారత్నమును; రహిన్=ప్రీతితో; తన కొప్పగించి =తనయధీనము చేసి; పంచినన్= పంపఁగా; విరివింటిజోదు=మన్మథుఁడు; పికసేనలతో =కోకిలబలములతో;సురవారిజాక్షితో=దేవాంగనతో; ఘనమగు వేడ్క = అధికమగు సంతసము; పొంగన్=అతిశయింపఁగా; తదగారము =ఆవిరించిమందిరమునుండి; వెల్వడి వచ్చెన్ =బయలు దేఱి వచ్చెను; అంతటన్=అటు పిమ్మట. ముందరిపద్యముతో నన్వయము.

సీ. చిలుకతత్తడిరౌతు◊చేతితియ్యనివింట, గాఢకృపీటజ◊కాండ మెగసె,
నుడురాజు పఱతెంచు◊నెడఁ బుండరీకంబు, వికలత్వమున నిరా◊వీథిఁ ద్రెళ్లె,
కరువలి కడ్డమై ◊వెఱఁ గూన్చె నలఘున,పద్యనవ్యాత్మభీ◊ప్రదమహాహి,
యామని రాఁగఁ జ◊య్యన విగతచ్ఛదం,బుగఁ జూడఁబడె నప్డు ◊పురుషకాళి,
తే. నిర్జరవధూటికావామ◊నేత్రసీమ, జడిగొని పరిప్లవత్వంబు ◊సరగఁ దోఁచె,
నిట్లు శకునంబు లేపున ◊నెన్ని యున్న, వానిఁ జూడక యధికగ◊ర్వంబుతోడ. 71

టీక:చిలుకతత్తడిరౌతు=మన్మథునియొక్క; చేతితియ్యనివింటన్= చేతియందున్న చెఱకువింటినుండి; గాఢ=అధికమగు; కృపీటజకాండము=అగ్నిసంఘము; ఎగసెన్=పైకి వచ్చెను. కృపీట మనఁగా నుదకము, దానియందుఁ బుట్టినది కృపీటజము. ‘కృపీటయోని ర్జ్వలనః’ అని యగ్నికి జలమందుఁ బుట్టుటకు ప్రమాణము. పయనించి యున్న వలరాజుయొక్క కార్ముకము నుండి యుల్కాపాత మవశకున మని భావము. ఇచట మన్మథుని వింటివలన కృపీటజకాండ మనఁగ జలజబాణ మెగసె నని శబ్దశక్తిస్వభావముచే సహజార్థము దోఁచుచున్నది.
ఉడురాజు=చంద్రుఁడు; పఱతెంచు నెడన్ =త్వరచే వచ్చుచున్న సమయమందు; వికలత్వమునన్=విచ్ఛేదముచేత; పుండరీ కము =శ్వేతచ్ఛత్రము; ఇరావీథిన్ = భూప్రదేశమందు, ‘ఇరా భూ వాక్సురాప్సు స్యాత్’ అని యమరుఁడు; త్రెళ్లెన్= పడెను. చంద్రుఁడు వచ్చుచుండఁగా నతని శ్వేతచ్ఛత్రము విఱిగి భూతలమునందుఁ బడుట నశకున మని భావము. చంద్రోదయమందు పుండరీకము అనఁగాఁ దెల్లతామర చెడి, ఇరావీథిని ననఁగా జలమందుఁ ద్రెళ్లె నని సహజార్థము దోఁచుచున్నది.
కరువలికిన్=మారుతమునకు; అడ్డమై =అడ్డమైనదై; నవ్యాత్మభీప్రదమహాహి– నవ్య=నూతనమగు, ఆత్మ=మనస్సునకు, భీప్రద=భయమునిచ్చు, మహాహి =గొప్పసర్పము; అలఘునపద్యన్= ఆగొప్పమార్గమునందు; వెఱఁ గూన్చెన్=నిశ్చేష్టత కలిగించెను. మార్గమధ్యమందు పా మడ్డమైనచో నశకునమని భావము. అలఘునపద్యన్= ఆయాకాశమార్గమందు, అవ్యాత్మ భీప్రదమహాహి– అవి=సూర్యునియొక్క, ‘అవయశ్శైల మేషార్కాః’ అని యమరుఁడు, ఆత్మ=శరీరమునకు, భీప్రద=భయ ప్రదమగు, మహాహి=గొప్పసర్పమగు రాహువు; వెఱఁ గూన్చె నని స్వభావార్థము శబ్దశక్తిచేఁ దోఁచుచున్నది.
ఆమని రాఁగన్= వసంతుఁడు రాఁగ; అప్డు =ఆసమయమున; విగతచ్ఛదంబుగన్=వస్త్రహీనముగ; పురుషకాళి = పురుషుల బృందము; చయ్యనన్=శీఘ్రముగ; చూడఁబడెన్= అవలోకింపఁబడెను. వసంతుఁడు బయలుదేఱు నపుడు దిగంబరపురుష బృందము కన్పడుట యశకున మని భావము. వసంతుఁడు రాఁగా, పురుషకాళి=పున్నాగతరువులగుంపు, ‘పున్నాగే పురుషః’ అని యమరుఁడు, విగతచ్ఛదంబుగన్=రాలినయాకులు గలదై, ‘ఛదస్స్యాత్పట పర్ణయోః’ అని విశ్వము, చూడఁబడె నను స్వభావార్థము దోఁచుచున్నది.

నిర్జరవధూటికావామనేత్రసీమన్ – నిర్జరవధూటికా=చిత్రరేఖయొక్క, అవామనేత్రసీమన్=కుడికంటిపట్టున; జడిగొని =అతిశయించి; పరిప్లవత్వంబు=చాంచల్యము; సరగన్=వేగముగ; తోఁచెన్=కనిపించెను. స్త్రీలకు దక్షిణనేత్రస్పంద మశకున మని భావము. చిత్రరేఖయొక్క వామనేత్రసీమ యనఁగా సుందరమైన నేత్రములయొక్క ప్రదేశమందుఁ బరిప్లవత్వము దోఁచె ననుట సహజార్థము; ఇట్లు= ఈప్రకారము; అశకునంబులు=దుశ్శకునములు; ఏపునన్=అతిశయముచేత; ఎన్నియున్నన్= ఎన్ని కల్గినను; వానిఁ జూడక = ఆయశకునములను సరకుసేయక; యధికగర్వంబుతోడ = ఎక్కుడు కావరముతో, కంజశరుఁడు ధాత్రిం దొరసె నని మీఁది కన్వయము. మునితపోభంగ మొనరించుటకు అశకునము లెన్ని తోఁచినను, వాని సరకుసేయక దర్పముతోఁ బోవుచు నని భావము.

మ. అలసత్యాధ్వము డిగ్గి యప్డు తప మొ౹య్యన్ దాఁటి దీవ్యజ్జన
స్థల మాపిమ్మట నొంది యంతట మహ౹స్థానంబునుం బొంది వే
ల్పులరావీ డట వేడ్క డగ్గఱి భువ౹ర్లోకేంద్ర మవ్వేళఁ జే
రి లలిం గంజశరుండు దా దొరసె ధా౹త్రిన్ మేరుమార్గంబునన్. 72

టీక: కంజశరుండు=మన్మథుఁడు; అలసత్యాధ్వము =ఆసత్యలోకమునుండి; డిగ్గి =దిగి; అప్డు=ఆసమయమందు; తపము= తపోలోకమును; ఒయ్యన్ =తిన్నగ;దాఁటి=అతిక్రమించి; దీవ్యత్=ప్రకాశించుచున్న;జనస్థలము=జనర్లోకమును; ఆపిమ్మటన్ =అటుపిమ్మట; ఒంది=పొంది; అంతటన్=అటుపిమ్మట; మహస్థానంబునుం బొంది =మహర్లోకమును పొంది; వేల్పులరావీడు=ఇంద్రపట్టణమును; అట=అచ్చట; వేడ్కన్=సంతోషముతో; డగ్గఱి =సమీపించి; అవ్వేళన్=ఆసమయమునందు; భువర్లోకేంద్రము=భువర్లోకశ్రేష్ఠమును; చేరి=సమీపించి; లలిన్=క్రమముగ; తాన్=తాను; ధాత్రిన్=పుడమిని; మేరుమార్గంబునన్= మేరుపర్వతమార్గమున; దొరసెన్=ప్రవేశించెను. అనఁగా మన్మథుఁడు సత్యలోక,తపోలోక,జనర్లోక,మహర్లోక,స్వర్లోక, భువర్లోకములను దాఁటి భూలోకమును మేరుమార్గముచేఁ బ్రవేశించె నని భావము.

చ. ధర నిటు లొంది, యంత సము౹దారగిరీనపురీఝరీదవో
త్కరముల నెల్లఁ గన్గొనుచుఁ, ౹గాముఁడు వింధ్యముఁ జేరె నందుఁ బ
ద్మరిపుసుతోర్మిజాంబుకణ౹మండలపుష్పితనీపనిత్యభా
స్వర మగు పారిజాతవన౹వర్యము గన్నుల కింపుఁ గూర్పఁగన్. 73

టీక: కాముఁడు=మన్మథుఁడు; ధరన్=భూమిని; ఇటు లొంది = ఈప్రకారము పొంది; అంతన్=అటుపిమ్మట; సముదార గిరీన పురీ ఝరీ దవోత్కరములన్ – సముదార=ఉత్కృష్టము లగు, గిరీన (గిరి+ఇన)=పర్వతరాజములయొక్క, పురీ=నగరముల యొక్క, ఝరీ=నదులయొక్క, దవ=వనములయొక్క,ఉత్కరములన్=సమూహములను; ఎల్లన్=సర్వమును;కన్గొనుచున్ =చూచుచు; వింధ్యమున్=వింధ్యపర్వతమును; చేరెన్=సమీపించెను; అందున్=ఆవింధ్యపర్వతమందు; పద్మరిపుసుతోర్మిజాంబుకణ మండల పుష్పిత నీప నిత్య భాస్వరము – పద్మరిపుసుతా=చంద్రునకు గూతురగు నర్మదానదియొక్క, ఊర్మిజ= అలలవలనఁ బుట్టిన, అంబుకణ=నీటితుంపురులయొక్క, మండల=సమూహముచేత, పుష్పిత =పూచిన, నీప=కడిమిచెట్లచేత, నిత్య=ఎల్లపుడును, భాస్వరము=ప్రకాశించునది; అగు=అయినట్టి; పారిజాతవనవర్యము=పారిజాతవనశ్రేష్ఠము; కన్నులకు= నేత్రములకు; ఇంపుఁ గూర్పఁగన్ = ఆనందము కలుగఁజేయుచుండఁగా. ముందరి పద్యముతో నన్వయము.

మన్మథుఁడు వింధ్యముఁ జేరెను. అచ్చట గొప్పగొప్ప పర్వతములను, పర్వతములం దున్న నదులను జూచుచు, నర్మదా తరంగములవలనఁ బుట్టిన తుంపురులచేఁ జెన్నుమీఱు కడిమిమ్రాకులచేఁ బ్రకాశించు పారిజాతవనము తన కన్నులకు వేడుకఁ గల్గఁ జేయుచుండగా నని భావము.

చ. గురుజవశక్తి వచ్చి యొకఁ కోయిలవేగరి తద్వసంతభూ
సురతిలకాశ్రమం బిదియఁ చుమ్మని తెల్పఁగఁ గంతుఁ డందు ని
ర్జరసతితో, నిజాప్తవరఁ జాలముతో వసియించెఁ దత్ప్రసూ
నరసకులార్ద్రమారుతముఁ నన్ స్వతనూశ్రమ మెల్లఁ బాయఁగన్. 74

టీక: కంతుఁడు=మన్మథుఁడు; గురు=అధికమగు; జవశక్తిన్=వేగసామర్థ్యముచేతను; ఒకకోయిలవేగరి = ఒక కోయిలయను వేగులవాఁడు; వచ్చి=సమీపించి; తద్వసంతభూసురతిలకాశ్రమంబు=ఆవసంతుఁ డను బ్రాహ్మణశ్రేష్ఠునియొక్క ఆశ్రమము; ఇదియచుమ్ము అని= ఇదేసుమా యని; తెల్పఁగన్=తెలియఁజేయఁగ; అందున్=ఆవనమందు; నిర్జరసతితోన్=దేవాంగనతో; నిజ=తనయొక్క; అప్తవర=మేలైన యిష్టులయొక్క; జాలముతోన్=సంఘముతో; తత్ప్రసూనరసకులార్ద్రమారుతమునన్– తత్=ఆవనముయొక్క, ప్రసూనరస=పుష్పరసముయొక్క, కుల=సమూహముచేత, ఆర్ద్ర=తడుపఁబడిన, మారుతమునన్= వాయువుచేత; స్వ=తనయొక్క; తనూశ్రమము=శరీరాయాసము; ఎల్లన్=అంతయు; పాయఁగన్=తొలఁగునట్లు; వసియించెన్ =నివసించెను. వసంతు డనుమునియొక్క యాశ్రమ మిది యని కోయిల చెప్పఁగ నాప్తవర్గముతో మన్మథుఁ డావనమందు నిలిచె నని భావము.

చ. చెలు వగు మైత్త్రిఁ గోయిలవఁ జీరులఁ దుమ్మెదకమ్మగట్టుమూఁ
కల గొరువంకరాదొరలఁ గాటపుఁజిల్కలకాల్బలంబులన్
నలినకలంబవీరబలఁ నాథుఁడు చైత్త్రుఁడు తద్బలోచితో
జ్జ్వలలతికాకుటీపటలిఁ ఁజక్కగఁబాళెము డించె నయ్యెడన్. 75

టీక: నలినకలంబవీర బలనాథుఁడు=పద్మములు బాణముగాఁ గల వీరుఁడైన మన్మథునియొక్క సైన్యాధిపతియగు; చైత్త్రుఁడు =వసంతుఁడు; చెలువగు మైత్త్రిన్=ఒప్పుచున్న స్నేహముచేతను; కోయిలవజీరులన్= కోయిల లనెడు శూరులను; తుమ్మెద కమ్మగట్టు మూఁకలన్= తుమ్మెద లను కమ్మగట్టులయొక్క సేనలను; గొరువంకరాదొరలన్=శారికాశ్రేష్ఠము లనుదొరలను; గాటపుఁజిల్కలకాల్బలంబులన్=దృఢము లైన చిల్క లనుకాల్బలములను; తద్బలోచితోజ్జ్వలలతికాకుటీపటలిన్– తద్బల = ఆసేనలకు, ఉచిత=అనుకూలమగు, ఉజ్జ్వల=ప్రకాశించు,లతికా=తీవలయొక్క,కుటీ=గుడిసెలయొక్క,పటలిన్= సమూహమందు; అయ్యెడన్ =ఆసమయమునందు; చక్కగన్=బాగుగ; పాళెము=దండును; డించెన్=దించెను. అనఁగా కంతునికి సేనాధిపతి యగువసంతుఁడు కోయిలలు మొదలగు సేనాగణముల ననుకూలమగు లతాగృహముల విడియించె నని భావము.

సీ. చివురించు నెఱకెంపుఁ చివురాకుగమి కట్టు,నట్టి కౌసుంభాంబఁ రాశిఁ బోలఁ,
జాలఁ దోఁచిన నూత్నఁ జాలకశ్రేణి మేల్,హురుమంజిముత్తెపుఁ సరులఁ బోల,
నళు లెక్క నరదోఁచు ఁ తెలిపూలచాలు క్రై,శ్యములఁ జేర్చిన గర్భఁ కములఁ బోల,

నలరుగుత్తుల నిండ ౧నలరు పుప్పొడి గుబ్బ,కవలపై నల(దుగం౧దవొడి(బోల,

తే. సరసశృంగారవైఖరి ౧ధరణి(బొదలు, లతిక లయ్యెడ వీక్షించు౧కుతుక మొస(గె(

జైత్రకాంతాగమనదిష్ట౧సముచితౌజ్జ్వ,లీపరిభ్రాజదుత్తమా౧లీల నొంది. 76

టీక: చివురించు నెఱకెంపు చివురాకుగమి– చివురించు=పల్లవించుచున్న, నెఱకెంపు=మిక్కిలి యెఱ్ఱనైన, చివురాకుగమి=చిగురుటాకుల గుంపు; కట్టునట్టి =ధరించియున్న; కౌసుంభ=కుసుంబారంగుగల; అంబరాళిన్=వస్త్రసమూహములను; పోలన్=పోలియుండ(గ,

చాలన్=మిక్కిలి; తో(చిన =ఉదయించి యున్న; నూత్న=క్రొత్తనైన; జాలకశ్రేణి =మొగ్గలచాలు; మేల్=శ్రేష్ఠమగు; హురుమంజి ముత్తెపుసరులన్=హురుమంజిదేశమున(బుట్టిన ముత్యముల హారములను; పోలన్=పోలియుండ(గ,

అళు లెక్కన్= భృంగము లధిష్ఠింప(గ; అరదో(చు =సగము గనిపించు; తెలిపూలచాలు=తెల్లపూవులబంతి;కైశ్యములన్=కేశసమూహములందు,‘తద్బృన్దే కైశికం కైశ్యమ్’ అని యమరు(డు; చేర్చిన=ఉంచినట్టి; గర్భకములన్=కేశమధ్యమునందుంచిన దండలను, ‘కేశమధ్యేతు గర్భకమ్’ అని యమరు(డు; పోలన్=పోలియుండ(గ,

అలరుగుత్తులన్=పూవుగుత్తులయందు; నిండన్=పూర్ణముగ; అలరు=ఒప్పుచున్న; పుప్పొడి=పుష్పపరాగము; గుబ్బకవలపైన్ = స్తనయుగ్మముపై; అల(దు=పూసిన; గందవొడిన్=బుక్కాపొడిని; పోలన్=పోలియుండ(గ,

సరస=మనోజ్ఞమగు; శృంగార=సౌందర్యముయొక్క; వైఖరిన్=రీతిచేత; ధరణిన్=పుడమియందు; పొదలు లతికలు= వృద్ధి నొందుచున్న తీవలు; చైత్రకాం తాగమనదిష్ట సముచి తౌజ్జ్వలీ పరిభ్రాజ దుత్తమాలీలన్ – చైత్రకాంత=వసంతు(డను ప్రియుని యొక్క, ఆగమనదిష్ట=ఆగమనసమయమునకు, అన(గా(బ్రియు(డు వచ్చువేళకు, సముచిత=అనుకూల మగు, ఔజ్జ్వలీ=ప్రకాశముచేత, పరిభ్రాజత్=వెలు(గుచున్న, ఉత్తమాలీలన్=వరవర్ణినీవిలాసమును; ఒంది=పొంది; అయ్యెడన్=ఆసమయమందు; వీక్షించుకుతుకము=చూచువేడుకను; ఒస(గెన్=ఇచ్చెను.

చిగురుటాకులు కుసుంభావస్త్రములను, మొగ్గలు హురుమంజిముత్యపుసరులను, తుమ్మెదలు ముసురుటచే సగము గన(బడు తెలిపూలచాలు కొప్పున ధరించు సరములను, పుప్పొడిచే(గప్ప(బడిన పూగుత్తులు గందవొడి యలందిన పాలిండ్లను పోలియుండ, లతలు వసంతుం డను ప్రియునియొక్క యాగమనసమయమున కుచితశృంగారవైఖరిని ధరియించి, యుత్తమస్త్రీల లీలను బొందియుండె నని చెప్పుటచే లతలయందు వాసకసజ్జాత్వము దో(చుచున్నది. ప్రియు(డు రా(గల(డని సురత సామగ్రీసన్నాహము చేసి తనువు నలంకరిచుకొనునది వాసకసజ్జ యని దాని లక్షణము.

ఉ. డాసె సుమాళి(దుమ్మెదమి౧టారి, దమిం జివు రాని కోయిలల్

మ్రోసె, రసాలకేసరస౧మూహసుగంధము దిక్తటంబులం

బూసె మెకంబు నెక్కు-దొర, ౧మున్నును పైకొను కా(కచే ధృతిం

బాసె వియోగి, యోగివన౧పాళిక నామని యాక్రమింప(గన్. 77

టీక: తుమ్మెదమిటారి=భృంగస్త్రీ; సుమాళిన్=పూబంతిని; డాసెన్=సమీపించెను; కోయిలల్=పికములు;తమిన్ = ఆసక్తితో; చివురు=చిగురాకును; ఆని=తిని; మ్రోసెన్=ధ్వని(జేసెను (పాడెను); మెకంబు నెక్కు-దొర=వాయువు; రసాలకేసరసమూహసుగంధము—రసాల=తియ్యమావులపూలయొక్క, కేసర=పొన్నపూలయొక్క, సమూహ=గుంపుయొక్క, సుగంధము=

పరిమళమును; దిక్తటంబులన్= దిక్ప్రదేశములయందు; పూసెన్= లేపనము చేసెను; వియోగి = వియుక్తుఁడు; మున్మును= ముందుముందు; పైకొను=మీఱుచున్న; కాఁకచేన్= (ఎడబాటునందలి)వేఁడిమిచే; ధృతిన్=ధైర్యమును; పాసెన్=వదలెను; యోగివనపాళికన్=మునితపోవనమును; ఆమని=వసంతుఁడు; ఆక్రమింపఁగన్=ఆవరించుచుండఁగ.

అనఁగా వసంతకాలము రాఁగానే తుమ్మెదలు కుసుమములను జేరె ననియు, కోయిలలు గూసె ననియు, రసాలకేసర పుష్పముల సుగంధము గలవాయువు విసరె ననియు, విరహుల ధృతి సడలె ననియు భావము.

చ. మునివన మంతయుం దనచ◊మూపతి యత్తఱి నాక్రమింప, మిం
చినబలదర్పగౌరవము◊చే విషమాశుగవీరశేఖరుం
డని కిదె చుమ్ము వేళ యని ◊యాప్తమతిం బికమంత్రి దెల్పఁ, జ
య్యన వెడలెన్ రసాలవిశి◊ఖాసము సూనశరాళిఁ బూనుచున్. 78

టీక: మునివనము=వసంతమునియొక్క తపోవనము; అంతయున్=సర్వమును; తనచమూపతి=తనసేనాపతి యగు నామని; అత్తఱిన్=ఆసమయమందు; ఆక్రమింపన్= ఆవరింపఁగ; పికమంత్రి = కోకిల మనుసచివుఁడు; ఆప్తమతిన్=హితబుద్ధిచేత; అనికిన్ =యుద్ధమునకు; ఇదె చుమ్ము=ఇదియే చూడుము; వేళ యని=సమయ మని; తెల్పన్=తెలియఁజేయఁగ; విషమాశుగవీరశేఖరుండు = మన్మథవీరాగ్రేసరుఁడు; మించిన బలదర్పగౌరవముచేన్ – మించిన = అతిశయించిన, బల =సారము యొక్క,దర్ప=గర్వముయొక్క,గౌరవముచేన్=గురుత్వముచేత;రసాలవిశిఖాసము=రసాలబాణాసనమును; సూనశరాళిన్ =పూఁదూపుల సమూహములను; పూనుచున్=ధరించుచు; చయ్యనన్=శీఘ్రముగ; వెడలెన్ =బయలుదేఱెను.

అనఁగాఁ దనచమూపతి యగువసంతుఁడు మునితపోవనము నాక్రమించినపిమ్మట పిక మనుమంత్రి యుద్ధమునకు నిది సమయ మని తెలుపఁగ, మన్మథుఁడు రసాలబాణాసనమును, పుష్పబాణములను గొని వెడలె నని భావము.

సీ. అరిరాజచిత్తభీ◊కరకరకాండప్ర,చండిమ మనురాజ◊మండలంబు,
క్రొందళంబులఁ జాలఁ ◊గూర్చుక హరివితా,నములతోఁ జైత్రసే◊నావిభుండు,
కన్నుల నెఱమంటఁ ◊గ్రక్కుచుఁ గలరుతుల్, బెరయ నానావన◊ప్రియబలంబు,
కనకరజోరేఖఁ ◊గనుపట్టు వరగంధ,పటిమ రాజిలు మహా◊బలకులంబు,
తే. తొలుదొలుతఁ దీవ్రవిస్ఫూర్తిఁ ◊దొడరి నడవఁ, జిలుక మేల్పక్కిపై నెక్కి ◊యలరువింటి
దంట యమ్మౌనిఁ గదిసె దు◊ర్దాంతశౌరి,కాళి యాత్మైకబిరుదప◊ద్యములు చదువ. 79

టీక: అరిరాజ చిత్త భీకర కర కాండ ప్రచండిమన్ – అరిరాజ=శత్రురాజులయొక్క, చిత్త=మనసునకు, భీకర=భయంకరమగు, కర=హస్తమునందున్న, కాండ=బాణములయొక్క, ప్రచండిమన్=ప్రాబల్యముచేత; మనురాజమండలంబు – మను=వర్తించు, రాజమండలంబు=క్షత్రియబృందము; ఇచట అరిరాజ=శ్రేష్ఠమగు జక్కవలయొక్క, చిత్త=మనసునకు, భీకర=భయంకర మగు, కరకాండ=కిరణగణముయొక్క, ప్రచండిమన్=ప్రాబల్యముచేత, మను=వర్తించు,రాజమండలంబు=చంద్రమండలమని స్వభావార్థము దోఁచుచున్నది.

క్రొందళంబులన్=క్రొత్తసేనలను; చాలన్=మిక్కిలి; కూర్చుక=జతపఱచుకొని; హరివితానములతోన్ =గుఱ్ఱపుగుంపులతో;

జైత్రసేనావిభుండు=జయశీలుఁ డగు సేనాధిపతి; ఇచ్చట క్రొందళంబులన్=చిగురాకులను, కూర్చుకొని, హరివితానములతోన్=శుకబృందములతో, చైత్రసేనావిభుండు = సేనాధిపతి యగు వసంతుఁ డని స్వభావార్థము దోఁచుచున్నది.

కన్నులన్=కన్నులచేత, నెఱమంటన్=అధికమగు జ్వాలలను, క్రక్కుచున్=విడుచుచు, కలరుతుల్=కలిగినవిరాలాపములు, బెరయన్=వ్యాపింపఁగ, నానావనప్రియబలంబు=అనేకవిధము లగు వెంచుమూఁక; ఇచ్చట, కన్నులన్=కన్నులచేత, ఎఱమంటన్=మంటివంటి యెఱుపును, క్రక్కుచున్=విడుచుచు, కలరుతుల్=అవ్యక్తమధుర మగు ధ్వనులు, బెరయన్=వ్యాపింపఁగ, నానావనప్రియబలంబు=అనేకవిధము లగు కోయిలలగుంపు లని స్వభావార్థము దోఁచుచున్నది.

కనకరజోరేఖన్=బంగరుపొడిరేఖచేతను; కనుపట్టు =చూపట్టుచున్న; వర=శ్రేష్ఠమైన; గంధపటిమన్=గర్వాతిశయముచేత, 'గన్ధో కన్ధక ఆమోదే లేశే సమ్బన్ధ గర్వయోః' అని విశ్వము; రాజిలు=ప్రకాశించు; మహాబలకులంబు – మహత్=అధికమగు, బల=సేనలయొక్క, కులంబు=గుంపు; ఇచ్చట, కనకరజోరేఖన్=సంపెఁగపుష్పములయొక్కపరాగశ్రేణిచేత, కనుపట్టు = చూపట్టుచున్న, వర=శ్రేష్ఠమైన, గంధ=పరిమళములయొక్క, పటిమన్=సారముచేత, రాజిలు=ప్రకాశించు, మహాబల = వాయువుయొక్క, కులంబు = సంఘ, మని స్వభావార్థము దోఁచుచున్నది.

తొలుదొలుతన్=ముందుముందుగ; తీవ్రవిస్ఫూర్తిన్=అధిక మగు విజృంభణముతో; తొడరి=పూని; నడవన్=నడచుచుండఁగ; అలరువింటిదంట=మన్మథుఁడు; దుర్దాంతశారికాళి=నివారించుటకు శక్యముగాని గోరువంకలగుంపు; ఆత్మైకబిరుదపద్యములు—ఆత్మ=తనయొక్క, ఏక=ముఖ్యమగు, బిరుదపద్యములు=జయచిహ్నములు గలపద్యములను; చదువన్=చదువుచుండఁగా; చిలుక మేల్పక్కిపై నెక్కి=మేలగు శుకవాహనము నెక్కి; అమ్మౌనిన్=ఆమునిని; కదిసెన్=సమీపించెను.

అనఁగా చంద్రుఁడు, సేనాపతి యగు వసంతుఁడు, కోయిలలు, మందమారుతము, అనేకసేనలతో ముందుముందు నడచుచుండఁగా మన్మథుఁడు శుకవాహనము నెక్కి, సామర్థ్యచిహ్నములు గల పద్యములు గోరువంకలు చదువుచుండఁగ, వసంతముని మీఁదికిఁ బోయె నని తాత్పర్యము.

చ. అపుడు రణోత్సుకుం డగు సితాంబుజసాయకుకంటిసన్నఁ గీ
రపటలి, చల్లగాడ్పు, తొవరాయఁడు, కోయిలపౌఁజు, చైత్రుఁ, డ
చ్చపుఁదెలిఱెక్కపుల్గు, లని సల్పఁగఁ జాలుదు నేనె నేనె యం
చపరిమితాగ్రహస్ఫురణ నమ్మునిఁ జుట్టిరి సత్వరంబుగన్. 80

టీక: అపుడు =ఆసమయమందు; రణోత్సుకుం డగు =యుద్ధమునం దుత్సాహము గలవాఁడైన; సితాంబుజసాయకు=పద్మబాణుఁడగు మన్మథునియొక్క; కంటిసన్నన్=కనుసంజ్ఞచేత; కీరపటలి=చిలుకలగుంపు; చల్లగాడ్పు=మందమారుతము; తొవరాయఁడు=చంద్రుఁడు; కోయిలపౌఁజు=కోకిలలసైన్యము; చైత్రుఁడు=వసంతుఁడు;అచ్చపుఁదెలిఱెక్కపుల్గులు=హంసలు; అనిన్=యుద్ధమును; చల్పఁగన్=చేయుటకు; నేనె నేనె చాలుదు నంచు=(అహమహమికతో)నేనొక్కడనే నేనొక్కడనే సరిపోదు ననుచు; అపరిమితాగ్రహస్ఫురణన్– అపరిమిత=మితిలేని, ఆగ్రహ=కోపముయొక్క, స్ఫురణన్=ఆవిర్భావముచేత; సత్వరంబుగన్=వేగముగ; అమ్మునిన్=ఆవసంతర్షిని; చుట్టిరి =చుట్టుకొనిరి. అనఁగా రణోత్సుకుం డగు నాపంచ శరుఁడు కనుసైగఁజేయఁగ, శుకసమూహాదులు నేనొక్కఁడనే రణము సల్పుటకు సమర్థుఁడ ననఁగా నేనొక్కఁడనే రణము సల్పుటకు సమర్థుఁడ ననుచు నహమహమికచే మునినిఁ జుట్టుముట్టి రనిభావము.

సీ. శైత్యవత్కరకుంతచటులధారారేఖ, శమినేత నాటించెఁ జలువమిన్న,
తళుతళుక్కన వేగ జళిపించి మావిక్రొం,దళపుఁ గత్తిని మౌని నఱకె సురభి,
కడుఁ జంచరీకసంఘము మ్రోయ ఘనజాల,కంబుల యతి మొత్తెఁ గడుసుగాడ్పు,
కటురజోగ్నికణాళి గ్రమ్మఁ జెందొవమందు,తిత్తుల మునిఁ గప్పెఁ హత్తి యంచ,
తే. యిట్టు లాదిట్ట లందఱుఁ జుట్టుముట్టి, గట్టితన ముట్టిపడ నురుక్షాంతికవచ
ధారి జడదారి నొప్పించి ధైర్యలీల, నడఁప లేకున్కి గని మరుం డపుడు గడఁగి. 81

టీక: చలువమిన్న=చంద్రుఁడు; శైత్యవత్కర కుంత చటుల ధారారేఖన్ – శైత్యవత్=చల్లఁదనము గల, కర=కిరణము లనెడు, కుంత=ఈఁటెలయొక్క, చటుల=చలించుచున్న, ధారారేఖన్=వాదరచేతను; శమినేతన్=మునిపతిని; నాటించెన్=గ్రుచ్చెను; సురభి=వసంతుఁడు; తళుతళుక్కనన్=తళతళ మనునటుల; వేగ=శీఘ్రముగ; జళిపించి=ఆడించి; మావిక్రొందళపుఁ గత్తిని = మావిచిగురాకనెడు కత్తిచేత; మౌనిన్=మౌనిని; నఱకెన్=ఖండించెను;
గడుసు=కఠినమైన; గాడ్పు=వాయువు; ఘనజాలకంబులన్=గొప్ప మొగ్గలనెడు లోహముద్గరసంఘములచేత; యతిన్ = మునిని; కడున్=మిక్కిలి; చంచరీక=తుమ్మెదలయొక్క; సంఘము=గుంపు; మ్రోయన్=ధ్వనిచేయుచుండఁగ; మొత్తెన్ = కొట్టెను;
అంచ=హంస;కటురజోగ్నికణాళి – కటు=తీక్ష్ణమగు, రజః=పరాగ మనెడు, అగ్నికణాళి=మిడుఁగుఱుల గుంపు; క్రమ్మన్= పైకొనఁగ; జెందొవమందుతిత్తులన్= ఎఱ్ఱగలువ లనెడు మాదకద్రవ్యవిశేషము గల భస్త్రికలచేత; మునిన్=ఋషిని; హత్తి=చేరి; కప్పెన్=కప్పెను;
ఇట్టులు=ఈప్రకారము; ఆదిట్ట లందఱున్ = ఆధైర్యవంతు లైన చంద్రాదు లందఱును; చుట్టుముట్టి=పరివేష్టించి; గట్టితనము= సామర్థ్యము; ఉట్టిపడన్= అతిశయింపఁగ; ఉరుక్షాంతికవచధారిన్ – ఉరు=అధికమగు, క్షాంతి=శమ మనెడు, కవచ=బొందల మును, ధారిన్=ధరించినవాఁడగు; జడదారిన్=మునిని; నొప్పించి=బాధించి; ధైర్యలీలన్=(మునియొక్క) ధైర్యవిలాసమును; అడఁప లేకున్కి=అడఁగఁజేయకుండుటను; కని =చూచి; అపుడు=ఆసమయమునందు; మరుండు=మన్మథుఁడు; కడఁగి = ప్రయత్నించి. దీని కుత్తరపద్యస్థక్రియతో నన్వయము.

చంద్రుఁడు కిరణములను కుంతములచేతను, వసంతుఁడు చూతపల్లవ మను తరవారిచేతను, మలయానిలము మొగ్గలను నినుపగుదియలచేతను, అంచ చెందొవలను మందుతిత్తులచేతను బాధించియు శమ మను కవచమును ధరించిన శమినేత ధైర్యము నడఁపలేకుండుటంజూచి మదనుఁడు (ముందుచెప్పఁబోవు) పద్మముకుళాస్త్రములను మునిపై నించెనని భావము.

చ. చనని నవాగ్రహస్ఫురణఁ జక్కెరవిల్తుఁడు తేజి బోరునన్
మునిపతిమీఁద నూకి కడుముట్టక మ్రోయుగొనంబు తుంటవిం
ట నొనరఁ గూర్చి చంద్రఋతునాథులు గన్గొని యౌర! మేలు మే
లనఁ బరితేజితాబ్జముకుళాస్త్రపరంపర నించె నుద్ధతిన్. 82

టీక: చక్కెరవిల్తుఁడు=మారుఁడు; చనని నవాగ్రహస్ఫురణన్=వీడని నూతనక్రోధముయొక్క స్ఫురణచేతను; తేజిన్ =గుఱ్ఱ మగు శుకమును; బోరునన్=బోరను ధ్వని గలుగునటులు; మునిపతిమీఁదన్=ఋషిమీఁదను; నూకి=త్రోలి; కడున్=మిక్కిలి;

ముట్టక=తాఁకకయే; ప్రొయుగొనంబు=మొరయుచున్న యల్లెత్రాటిని; తుంటవింటన్=చెఱకువింటియందు; ఒనరన్=అనుకూలముగ; కూర్చి=జతపఱచి; చంద్రఋతునాథులు=చంద్రుఁడు, వసంతుడును; కన్గొని=చూచి; ఔర=ఆశ్చర్యము;మేలు మేలనన్=మేలు మేలని ప్రశంసింపఁగ; పరితేజిత=చికిలిపెట్టఁబడిన; అబ్జముకుళ=తామరమొగ్గ లనెడు; అస్త్ర=తూపులయొక్క; పరంపరన్=గుంపును; ఉద్ధతిన్=వేగముచేత; నించెన్=కప్పెను.

అనఁగా మన్మథుఁడు తనగుఱ్ఱమును మునిమీఁదికి విడిచి, తనంతటనె మొరయుచున్న యల్లెత్రాటిని (అనఁగా తుమ్మెద బారు ననుట) చెఱకువింట నెక్కిడి చంద్రాదులు పొగడఁగ పద్మ బాణములు మునిపై నించె నని భావము.

చ. మదనబిసప్రసూనశరమండలి యాజడదారిసామిపే
రెద వడిఁ దాఁకునత్తఱిఁ దదీయపరాగము చిందుటల్ స్తవా
స్పద మయి పొల్చె తద్విశిఖజాలసమాహతిభిన్నమౌనిరా
జదృఢరమేశ భక్తికవచస్ఫుటచూర్ణమనీష దార్చుచున్. 83

టీక:మదనబిసప్రసూనశరమండలి– మదన=మన్మథునియొక్క, బిసప్రసూన=పద్మములను,శరమండలి=తూఁపులగుంపు; ఆజడదారిసామి=అమునిరాజుయొక్క;పేరెదన్=విశాల మగు ఱొమ్మును; వడిన్=వేగముగ; తాఁకునత్తఱిన్=తాఁకునప్పుడు; తదీయపరాగము=ఆతామరపూదూఁపుపుప్పొడి; చిందుటల్=రాలుటలు; త ద్విశిఖజాల సమాహతి భిన్న మౌనిరాజ దృఢరమేశ భక్తికవచ స్ఫుట చూర్ణమనీషన్ – తత్=ఆమన్మథునియొక్క, విశిఖజాల=బాణసమూహముయొక్క, సమాహతి=కొట్టుటచేత, భిన్న=బ్రద్దలయిన, మౌనిరాజ=ఋషిరాజుయొక్క,దృఢ=గాఢమయిన,రమేశభక్తి=విష్ణుభక్తి యనెడు, కవచ=బొందళముయొక్క, స్ఫుట=వ్యక్తమగు, చూర్ణ =పొడియొక్క, మనీషన్=బుద్ధిని; తార్చుచున్=కలుగఁజేయుచు; స్తవాస్పదమయి=స్తుతి కర్హమయి; పొల్చెన్=ఒప్పెను.

మన్మథుని పద్మబాణసమూహము మునీశ్వరుని ఱొమ్మును దాఁక, నాసమయమం దాపద్మబాణపరాగము చిందుటలు మన్మథబాణములచే భేదింపఁబడిన విష్ణుభక్తి యనెడు కవచముయొక్క పొడి యను భ్రమను కలిగించె నని భావము.

చ. వరజవశక్తిచేఁ బలుకువాల్దొరపేరెదఁ దాఁకి తాఁకునం
బరిహృతకుట్మలాత్మ మగు మారునితామరమొగ్గముల్కి ని
బ్బరముగఁ బర్వఁ దద్రసము భాసిలె తన్మునిధైర్యజీవనో
త్కరములు పిల్చి వెగ్గలముగాఁగఁ గడున్ వెడలించుపోలికన్. 84

టీక: వరజవశక్తిచేన్—వర=శ్రేష్ఠమగు, జవ=వేగముయొక్క, శక్తిచేన్=సామర్థ్యముచేత; పలుకువాల్దొర=మునిరాజుయొక్క; పేరెదన్=విపులమగు వక్షమును; తాఁకి =తగిలి; తాఁకునన్=తాఁకుటచేత; పరిహృతకుట్మలాత్మము—పరిహృత=పోఁగొట్టఁబడిన, కుట్మలాత్మము=కోరకావస్థగలది; అగు=ఐనట్టి; మారునితామరమొగ్గముల్కి=మన్మథుని పద్మకోరకబాణము; నిబ్బరముగన్=అధికముగ; తద్రసము =దానియొక్క మకరందము; పర్వన్=వ్యాపింపఁగ; తన్మునిధైర్యజీవనోత్కరములు– తన్ముని =ఆమునియొక్క, ధైర్య=ధైర్య మనెడు, జీవన=ఉదకముయొక్క, ఉత్కరములు=సమూహములను; పిల్చి=త్రావి; వెగ్గలముగాఁగన్=మిక్కుటము కాఁగ; కడున్=మిక్కిలి; వెడలించుపోలికన్ =పైకి వెళ్లఁగ్రక్కు రీతిగ; భాసిలెన్=ప్రకాశించెను.

అనఁగా నతివేగముగ తామరమొగ్గతూఁపు జడదారియెడ దాఁకి కోరకభావము వీడి మకరందము కాఱఁగా నది యా మునిధైర్య మను నుదకమును ద్రావి యధిక మగుటచే వెడలఁగ్రక్కు రీతి భాసిలె నని భావము.

చ. అచలసమాధియోగగతి నందిన యమ్ముని జెందదయ్యె న
వ్యచలనరేఖ యప్పు డసమాశుగకాండము పర్విన గరం
బచలసమాధియోగగతి నందిన యమ్ముని నెట్లు చెందు న
వ్యచలనరేఖ యెంత యసమాశుగకాండము పర్విన మహిన్. 85

టీక: అప్పుడు=ఆసమయమందు; కరంబు=మిక్కిలి; అసమాశుగ=మన్మథునియొక్క;కాండము =బాణము, జాత్యేకవచన ముగా నిది ప్రయోగింపఁబడినది; పర్విన=వ్యాపించినను; అచలసమాధియోగగతిన్ – అచల=చలింపని, సమాధి=చిత్తవృత్తి నిరోధముచేనైన, యోగగతిన్=ధ్యానగతిని; అందిన=పొందినట్టి; అమ్మునిన్=ఆజడదారిని; నవ్యచలనరేఖ=నూతన మగు చాంచల్యపరంపర; చెందదయ్యెన్=పొంద దయ్యెను; అచలసమాధియోగగతిన్ – అచలసమ=పర్వతసమాన మగు, అధి యోగ=ధ్యానముయొక్క, గతిన్ =రీతిని; అందిన=పొందినట్టి; అమ్మునిన్=ఆతపసిని; ఎంత=ఎంతకాలము; అసమ= సాటి లేనిదగు, ఆశుగకాండము =వాయుబృందము; పర్విన=వ్యాపించినను; మహిన్=భూమియందు; నవ్యచలనరేఖ=నూతన మగు చాంచల్యపరంపర; ఎట్లు=ఏరీతి; చెందున్=పొందును? అనఁగా లోకమందు వాయుసంఘము పర్వతమును జలింపఁ జేయనట్లు చలింపని సమాధియోగమందున్న యామునిని మన్మథుని బాణబృందము చలింపఁజేయఁజాల దయ్యెనని భావము.

మ. తనకంజాతశరంబు లిట్లు మునిచంద్రస్ఫీతతేజంబుచే
వనవీథిన్ వికలత్వ మొందఁ గని దుర్వారావలేపక్రమం
బున నాకంతుఁడు కేలుదోయిఁ గొని నేర్పుల్ మీఱఁ బూమొగ్గనే
జను దద్వక్షము గుప్పునం బొడిచె నోజం జైత్రుఁ డౌనౌ యనన్. 86

టీక: తనకంజాతశరంబులు=తనసంబంధు లగు పద్మబాణములు; మునిచంద్రస్ఫీత తేజంబుచేన్ – మునిచంద్ర=మునిచంద్రుని యొక్క, స్ఫీత=అధికమగు,తేజంబుచేన్=కాంతిచేత; ఇట్లు=ఈప్రకారము; వనవీథిన్=అడవియందు; వికలత్వము=నిరర్థక త్వమును; ఒందన్=పొందఁగ, ఇచట ముని యనెడు చంద్రునికాంతిచే, వనవీథిన్=ఉదకమందు, కమలములు వికలత్వము ననఁగా ముకుళనమును పొందె నను నర్థము స్ఫురించుచున్నది; కని=చూచి; దుర్వా రావలేప క్రమంబునన్— దుర్వార = నివారించుట కశక్యమైన, అవలేప=గర్వముయొక్క, క్రమంబునన్=రీతిచేత; ఆకంతుఁడు =ఆమన్మథుఁడు; పూ మొగ్గనేజను =పూమొగ్గ యను తోమరమును;కేలుదోయిన్=రెండుచేతులచే; కొని =తీసి; నేర్పుల్=చాతుర్యములు; మీఱన్=అతిశయిం పఁగ; తద్వక్షము=ఆమునిఱొమ్మును; గుప్పునన్=శీఘ్రముగ; చైత్రుఁడు=వసంతుఁడు; ఔనౌ యనన్=పొగడఁగ; ఓజన్ = ఉత్సాహముతో; పొడిచెన్=గ్రుచ్చెను. అనఁగా మన్మథుఁడు తనపద్మబాణములు వ్యర్థములు కాఁగానే యమోఘ మగు పూమొగ్గ యను తోమరముతో మునిం బొడిచె నని భావము.

చ. దళ మగు రోస మెచ్చఁ దనతత్తడి నోరగఁ బోవఁ జేసి ని
స్తులపథికాసృగక్త మను సొంపున రోహితదీప్తిజాతముల్

గలయఁగ మించు నూతనపలాశసుమం బను బాగుదారచేఁ
జలమున నయ్యతిన్ నఱకె సారససాయకవీరుఁ డంతటన్. 87

టీక: అంతటన్ =అటుపిమ్మట; సారససాయకవీరుఁడు=మన్మథవీరుఁడు; దళము=అధికము; అగు రోసము=అయినట్టి కోపము; ఎచ్చన్=అతిశయింపఁగ; తనతత్తడిన్=తనవాహనమైన చిలుకను; ఒరగన్=ప్రక్కకు; పోవన్=పోవునటులు; చేసి =ఒనర్చి; నిస్తులపథికాసృగక్తము– నిస్తుల=నిస్సమాన మగు, పథిక=విరహులయొక్క, అసృక్=రక్తముచే; అక్తము = పూయఁబడినది; అను సొంపునన్=అనువిధంబున; రోహితదీప్తిజాతముల్—రోహిత=ఎఱ్ఱనైన, దీప్తి=కాంతులయొక్క, జాతముల్=పుంజములు; కలయఁగన్=వ్యాపింపఁగా; మించు =అతిశయించు; నూతన=క్రొత్త; పలాశసుమం బను = మోదుగపూవను; బాగుదారచేన్=చూరకత్తిచేత; చలమునన్=మాత్సర్యముచేత; అయ్యతిన్=ఆమునిని; నఱకెన్= ఖండించెను.

అనఁగా మన్మథుఁడు క్రోధ మతిశయింపఁగ తనవాహనము నొకప్రక్కకుఁ దోలి, పథికులరక్తముచేఁ దడిసినదో యన నెఱ్ఱనగు మోదుగుసుమ మను చూరకత్తిచే మునిని నఱకె నని భావము.

చ. మునిపతి కేమిటన్ జుఱుకుముట్టకయుండినఁ గాంచి తేజి చ
య్యన డిగి యప్డు నైకనిశితాయుధజాతము పూని మిక్కిలం
గనుఁగొనలన్ రుషానలశిఖాతతి పర్వ మరుండు చంద్రచం
దనపవమానముఖ్యవృతిఁ దా నడచెన్ యతిమీఁది కుద్ధతిన్. 88

టీక: మునిపతికి=జడదారిసామికి; ఏమిటన్=ఏయస్త్రముచేతను; చుఱుకు ముట్టక=వేఁడితాఁకక; ఉండినన్=ఉండఁగ; కాంచి = చూచి; తేజి=గుఱ్ఱమునుండి; చయ్యనన్=శీఘ్రముగా; డిగి =దిగి; అప్డు =ఆసమయమునందు; నైక నిశి తాయుధ జాతము– నైక=అనేకములైన, నిశిత=తీక్ష్ణములైనట్టి, ఆయుధ=కుంతాద్యాయుధములయొక్క, జాతము=సమూహమును; పూని = గ్రహించి; మిక్కిలన్=అతిశయించునట్లు; కనుఁగొనలన్=నేత్రాంతములయందు; రుషానల శిఖా తతి– రుషానల=కోపాగ్నియొక్క, శిఖా=జ్వాలలయొక్క, తతి=సమూహము; పర్వన్= వ్యాపించుచుండఁగ; మరుండు=మన్మథుఁడు; చంద్ర చందన పవమాన ముఖ్య వృతిన్– చంద్ర=చంద్రుఁడు, చందనపవమాన =మలయానిలము, ముఖ్య=ఆదిగాఁగలవారియొక్క, వృతిన్=మేళనముచేతను; తాన్=తాను (మన్మథుఁడు); ఉద్ధతిన్=గర్వముచేత; యతిమీఁదికిన్=మునిమీఁదికి; నడచెను.

క. నడచి యళిఘంటికాధ్వని, యడరఁ బరాగాగ్నికణచయంబులు వెడలం
గడు నమరురాగసుమ మను, బెడిదం బగు శక్తివైచె భీకరలీలన్. 89

టీక: నడచి =గమించి; అళి ఘంటికా ధ్వని—అళి=తుమ్మెదలను, ఘంటికా=చిఱుగంటలయొక్క, ధ్వని=నాదము; అడరన్ =అతిశయింపఁగ; పరాగాగ్నికణచయంబులు– పరాగ=పుప్పొడియనెడు, అగ్నికణ=స్ఫులింగములయొక్క,చయంబులు =సమూహములు; వెడలన్=బయలుదేఱుచుండఁగ; కడునమరురాగసుమము– కడున్=మిక్కిలి, అమరు=ఒప్పియున్న, రాగసుమము=బంధూకపుష్పము; అను=అనెడు; బెడిదం బగు=సమర్థమైన; శక్తిన్ =శక్తిని; భీకరలీలన్=భయంకరమగు క్రియచేతను, 'లీలా విలాస క్రియయోః' అని యమరుఁడు; వైచెన్=వేసెను. అనఁగా భృంగధ్వని యనెడు చిఱుగంటలధ్వని చేతను, పుప్పొడి యను నగ్నికణములచేతను నొప్పు మంకెనపుష్పమను శక్తిని (శక్త్యాయుధమును) మునిపైకి వేసెనని భావము.

ఉ. దాన నొకింతయున్ విధృతిఁ ◊దాల్పని యాదమినేతఁ జూచి, త
త్సూనశరుండు బీరమున ◊శూరత యుట్టిపడంగ నయ్యెడన్
మానితపారిజాతసుమ◊నఃకలికాగద కేల నెత్తి, య
మ్మౌనిని మోఁదె దివ్యకుసు◊మప్రతతుల్ మరుదాళి నింపఁగన్. 90

టీక: దానన్ = ఆశక్తి యను నాయుధముచేత; ఒకింతయున్ = కొంచెమయినను; విధృతిన్ = అధైర్యమును; తాల్పని = ధరింపనట్టి; ఆదమినేతన్=ఆమునిరాజును; చూచి=అవలోకించి; తత్సూనశరుండు=ఆమన్మథుఁడు; బీరమునన్=పరాక్రమముచేత; శూరత=శౌర్యము; ఉట్టిపడంగన్=అతిశయింపఁగా; అయ్యెడన్=ఆసమయమందు;మానిత పారిజాతసుమనఃకలికాగద – మానిత=శ్రేష్ఠమగు, పారిజాతసుమనః=పారిజాతపుష్పముయొక్క, కలికా=మొగ్గ యనెడు, గద=గదాయుధమును; కేలన్ ఎత్తి=హస్తముతో నెత్తి; మరుదాళి=దేవసంఘములు; దివ్యకుసుమప్రతతుల్ – దివ్య=స్వర్గమందున్న, కసుమ = పుష్పములయొక్క,ప్రతతుల్=సమూహములను; నింపఁగన్=నిండించుచుండఁగ; అమ్మౌనిని=ఆమునిని; మోఁదెన్=కొట్టెను.

ఆముని శక్తి యను నాయుధమునకు ధైర్యము చెడకయుండుటం జూచి, మరుఁడు శౌర్యముతో పారిజాతకోరక మను గదతో నతని మోఁదె నని భావము.

ఉ. అందుల కింతయుం జలన◊మందనిపెంపున కబ్బురం బెదం
జెంది, ప్రసూనకోశతటిఁ ◊జెల్వగు గేదఁగిఱేకుఁజిక్కటా
రంది, యనూనరోషగతి ◊నమ్మునిఁ గ్రుమ్మె మరుండు శాంకరా
మందమనోధృతిక్షపణ◊మాన్యభుజాబలరేఖ హెచ్చఁగన్. 91

టీక: అందులకున్=ఆగదాయుధప్రహారమునకు; ఇంతయున్=ఇంచుకైనను; చలనమందని=చలింపని; పెంపునకున్= మహత్త్వమునకు; అబ్బురంబు=ఆశ్చర్యము; ఎదన్=హృదయమందు; చెంది=పొంది; ప్రసూనకోశతటిన్ – ప్రసూన=పూవనెడు, కోశ=ఒరయొక్క, తటిన్=ప్రదేశమందు; చెల్వగు గేదఁగిఱేకుఁ జిక్కటారు – చెల్వగు=అందమైన, గేదఁగిఱేకు=కేతకీదళమనెడు, చిక్కటారు=చూరకత్తిని; అంది=పొంది; అనూనరోషగతిన్ – అనూన=తక్కువకాని, రోష=క్రోధముయొక్క, గతిన్= ప్రాప్తిచేత; మరుండు =మన్మథుఁడు; అమ్మునిన్=ఆమునిని; శాంక రామంద మనోధృతి క్షపణ మాన్య భుజాబల రేఖ – శాంకర=శంకరునికి సంబంధించిన, అమంద=అధికమగునట్టి,మనోధృతి=మనస్థైర్యముయొక్క, క్షపణ=పోగొట్టుటచేత, మాన్య=పొగడఁదగిన, భుజాబల=భుజబలముయొక్క,రేఖ=విలాసము;హెచ్చఁగన్=అతిశయింపఁగ; క్రుమ్మెన్=పొడిచెను.

అనేకవిధము లగు నస్త్రములకు చలనమందకయున్న మునిశక్తికి మనమున నబ్బుర మంది, యామరుండు వెతకి కేతకీదళమను కటారు గొని మునిని పొడిచె నని భావము.

చ. సరసబలంబు గొల్వ సుమ◊సాయకుఁ డంతటఁ బోక మౌని డా
సి రమణ మొగ్గ యన్ గుదియఁ ◊జేకొని మొత్తి ప్రవాళ మన్మహా
పరశువుఁ బూని వే యడిచి ◊బాగగు మంకెనవంకిఁ బట్టి ప
ల్లరములఁ గ్రుమ్మి యార్చె హిమ◊ధాముఁడు గన్గొని మెచ్చ నయ్యెడన్. 92

టీక: సుమసాయకు(డు=మన్మథు(డు; సరసబలంబు – సరస=శ్రేష్ఠమగు, బలంబు=సేన; కొల్వన్=సేవింప(గా; అంతట(బోక = అంతటితో నిలువక; మౌనిన్=మునిని; డాసి=సమీపించి; రమణన్=ఆసక్తిచేత; మొగ్గ యన్ గుదియన్=కోరకమను గదను; చేకొని=గ్రహించి;మొత్తి=కొట్టి; ప్రవాళమన్మహాపరశువున్=చిగురనునట్టి గొప్పగండ్రగొడ్డలిని; పూని=గ్రహించి; వే=వేగముగ; అడిచి =కొట్టి; బాగగు మంకెనవంకిన్=శ్రేష్ఠమగు బంధూకమనెడు బాకును; పట్టి=పట్టుకొని; పల్తరములన్=అనేకరీతులచే; అయ్యెడన్=ఆసమయమందు; హిమధాము(డు=చంద్రు(డు; కన్గొని =చూచి; మెచ్చన్=మెచ్చుకొనునట్లు; క్రుమ్మి = పొడిచి; ఆర్చెన్=అఱచెను.

మరు(డు పలువిధములైన ఆయుధములను ప్రయోగించినను ముని చలింపకుండుట(జూచి, మునిని సమీపించి, మొగ్గ యను గుదియతో మొత్తి, చిగురా కనుపరశువుతో(గొట్టి, మంకెన యనుబా(కుతో(బొడిచె నని భావము.

తే. ఇట్టు లమ్మారు(డమ్ముని <నెనసి యని ఘ
టించు నవ్వేళ నిది వేళ<యంచు(దల(చి
చిత్రరేఖావధూటి వి<చిత్రరీతి
శమి కనతిదూరమున సఖీ<జనము గొలువ. 93

టీక: ఇట్టులు= ఈప్రకారము; అమ్మారు(డు=ఆమన్మథు(డు;అమ్మునిన్=ఆమునిని; ఎనసి=కలసి; అనిన్= యుద్ధమును; ఘటించు నవ్వేళన్=చేయునట్టి యాసమయమందు; ఇది వేళ యంచున్=ఇది తగిన సమయమనుచు; తల(చి=స్మరించి; చిత్రరేఖావధూటి=చిత్రరేఖ యను దేవాంగన; విచిత్రరీతిన్=ఆశ్చర్యమగువిధముచే; శమికి=మునికి; అనతిదూరమునన్= సమీపమందు; సఖీజనము=చెలికత్తెలు; కొలువన్=సేవింప(గా. తిలకాళి దిలకించు నను నుత్తరపద్యస్థక్రియతో నన్వయము.

సీ. తిలకాళి(దిలకించు(<జెలి పెండ్లితఱి(గాంచు,తెఱ(గు తపస్వికి(<దెలుపుకరణి,
గో(గుచెంగట(బల్కు(<గోమలి ప్రియములు, పలుకుటల్ దపసికి(<దెలుపుకరణి,
మావిపై(గరముంచు <మగువ కళాస్థాన,మలముటల్ మౌనికి(<దెలుపుకరణి(,
గ్రోవి(గౌ(గిట(దార్చు(<గుముదాక్షిపరిరంభ,కలనంబు యోగికి(<దెలుపుకరణి,
తే. నిట్టు లప్పారికాంక్షి క<హీనమదన,తంత్రవిజ్ఞానగరిమను <దరుణి దెలుప
వల్లి దోహదచర్య దై<వాఱ నపుడు, హాళి దళుకొత్త(దద్వనీ<కేళి సలిపె. 94

టీక: చెలి=చిత్రరేఖ; పెండ్లితఱిన్=వివాహసమయమందు; కాంచు తెఱ(గున్=చూచునట్టి రీతిని; తపస్వికిన్=జడదారికి; తెలుపు కరణిన్=తెలియ(జేయు రీతిగ; తిలక=బొట్టుగుచెట్లయొక్క; ఆళిన్=పంక్తిని; దిలకించున్=చూచెను.
కోమలి=చిత్రరేఖ; ప్రియములు పలుకుటల్ =ప్రియోక్తులు పలుకురీతిని; తపసికిన్=మునికి; తెలుపుకరణిన్=తెలియ(జేయు రీతిగా; గో(గు=కర్ణికారముయొక్క; చెంగటన్= సమీపమందు; పల్కున్=పలికెను.
మగువ =దేవాంగన; కళాస్థానము=కామశాస్త్రప్రసిద్ధమగు కళాస్థానమును; అలముటల్=ఆక్రమించుటలు, స్పృశించుటలను అనుట; మౌనికిన్=తపసికి; తెలుపుకరణిన్=తెలియ(జేయురీతిగ; మావిపైన్=చూతవృక్షము మీ(ద; కరము=హస్తమును; ఉంచున్=ఉంచెను.

కుముదాక్షి=చిత్రరేఖ; పరిరంభ=కౌఁగిలింతయొక్క; కలనంబు =చేయుటను; యోగికిన్=మునికి; తెలుపుకరణిన్=తెలియఁ జేయు నటుల; క్రోవిన్=కురువకమును; కౌఁగిటన్=భుజాంతరమందు; తార్చున్=చేర్చెను.

ఇట్టులు=ఈప్రకారముగ; అప్పారికాంక్షికిన్=ఆమునికి; అహీన మదనతంత్ర విజ్ఞాన గరిమను– అహీన=అధికమగు, మదన తంత్ర=కామశాస్త్రముయొక్క; విజ్ఞాన=తెలివియొక్క; గరిమను=అతిశయమును; తరుణి=వనిత(చిత్రరేఖ); తెలుపన్=తెలియఁ జేయుటకు; వల్లి దోహదచర్య– వల్లి=తీవలయొక్క, దోహదచర్య=దోహదములయొక్క క్రియ; దైవాఱన్=అతిశయింపఁగ; అపుడు=ఆసమయమున; హాళి =ఉత్సాహము; తళుకొత్తన్=అతిశయింపఁగ; తద్వనీకేళి=ఆవనమునందలి విహారమును; సలిపెన్= ఒనరించెను.

ఇందు దోహద మనఁగాఁ దరుగుల్మలతాదుల కకాలమున ఫలపుష్పదాయక క్రియావిశేషము. 'తరుగుల్మలతాదీనా మకాలే ఫలపుష్పయోః, ఆధానాయక్రియా యాస్యా త్స దోహద ఇతీర్యతే' అని తల్లక్షణము. 'ఆలిఙ్గనా త్కురవక శ్చమ్పకో ముఖదర్శనాత్, చూతో యోషిత్కరస్పర్శా త్తిలకో దృక్ప్రసారణాత్, ఆకర్ణనా త్కర్ణికార స్త్వశోకః పాద తాడనాత్' ఇత్యాది గా దోహదవిశేషములు దెలియవలయు.

సీ. దమి దీననైనఁ జి◊త్తము బయల్పఱచునో, యని సంచరించు న◊భ్యర్ణపదవి,
మని దీననైన నూ◊తనరక్తిఁ దాల్చునో, యని పాడుఁ దేనియల్ ◊చినుకుపాట,
శమి దీననైన ని◊శ్చలభావ ముడుపునో, యని పొదల్ దూఱు ల◊తాళి గదల,
యతి దీననైన ధై◊ర్యముఁ బాయఁ జేయునో, యని పల్కు సఖుల నొ◊య్యారి పలుకు,
తే. నియమి దా దీననైనఁ గ◊న్విప్పు నొక్కొ, యని మసలు దండ రాసాప్తి ◊నాళియుక్తి,
నైన నానాతి చిత్రచ◊ర్యానిరూఢిఁ, దాపససమాధివైఖరి ◊దఱుఁగ దయ్యె. 95

టీక: దమి=మునివర్యుఁడు; దీననైనన్=దీనిచేతనైనను; చిత్తము=మనసును; బయల్పఱచునోయని=తెలియఁబఱచునా యని; అభ్యర్ణపదవిన్=సమీపస్థానమందు; సంచరించున్=తిరుగును.

ముని=జడదారి; దీననైనన్=దీనిచేతనైనను; నూతనరక్తిన్=నూతన మగు ననురాగమును; తాల్చునో యని = వహించునా యని; తేనియల్చినుకుపాట= మకరందమును గురియు గీతమును; పాడున్=పాడును.

శమి =జడదారి; దీననైనన్=దీనిచేతనైనను; నిశ్చలభావము=నిశ్చలత్వమును; ఉడుపునో యని =విడుచునా యని; లతాళి =తీవలగుంపులు; కదలన్=కదలునటులు; పొదల్=కుంజములను; తూఱున్=ఈఁగును.

యతి=మునిరాజు; దీననైనన్=దీనిచేతనైనను; ధైర్యమున్ =ధృతిని; పాయఁ జేయునోయని =విడుచునా యని; సఖులన్= చెలికత్తెలతో; ఒయ్యారి పలుకు=విలాసోక్తిని; పల్కున్=వచించును.

నియమి=జడదారి; తాన్=తాను; దీననైనన్=దీనిచేతనైనను; కన్విప్పు నొక్కొయని =కనులు దెఱచునా యని; దండన్= సమీపమందు; ఆళియుక్తిన్=సకియలతోడికూడికచేతను; రాసాప్తిన్—రాస=కోలాటముయొక్క; ఆప్తిన్=ప్రాప్తిచేత; మసలున్=విహరించును; ఐనన్=అయినను; ఆనాతిచిత్రచర్యానిరూఢిన్—ఆనాతి=ఆదేవాంగనయొక్క, చిత్రచర్యా= విచిత్ర కార్యములయొక్క, నిరూఢిన్ = అతిశయముచేత; తాపససమాధివైఖరి =మునిమనస్థైర్యముయొక్క రీతి; తఱుఁగ దయ్యెన్ = తక్కువపడ దయ్యెను.

చిత్రరేఖ ముని హృదయమును దెలుపునా యని సమీపమందు సంచరించినను, అనురాగమును పూనునా యని రమ

ణీయగానముఁ జేసినను, చలించునా యని లతలు గదలఁ బొదలు దూఱినను, ధైర్యమును విడుచునా యని సఖులతోఁ బ్రియోక్తులు పలికినను, కనులనైన విప్పునా యని సకియలఁగూడి కోలాట మాడినను, కొంచెమైనను మునియొక్క సమాధి తక్కువ గాలేదని భావము.

ఉ. ఆయతిలోకమౌళిహృద౧యంబు బయల్పడ కున్కి గాంచి యా
తోయజనేత్ర యాళితతి౧తో మునిసన్నిధిఁ జేరి జాళువా
కాయలవీణె గైకొని త౧గన్ శ్రుతిఁ గూర్చి యొయార మెచ్చఁగా
నాయెడ నేర్పు మించ గమ౧పాదికపుంఖణ మూన్చి వేడుకన్. 96

టీక: ఆయతిలోకమౌళిహృదయంబు =ఆమునిరాజుయొక్క చిత్తము; బయల్పడక=వెల్వడక; ఉన్కి=ఉండుటను; కాంచి =చూచి; ఆతోయజనేత్ర =ఆచిత్రరేఖ; ఆళితతితోన్=సకియలగుంపుతో; మునిసన్నిధిన్=యతిసమీపమును; చేరి=పొంది; జాళువాకాయలవీణెన్=బంగరుకాయలు గల వీణెను; కైకొని =గ్రహించి; తగన్ =ఒప్పునటులు; శ్రుతిన్=స్వరముల కారంభకమైన సుతిని, 'స్వరా శ్శ్రుతిభ్య స్సంజాతాః' అని సంగీతరత్నాకరము; కూర్చి= కలుగఁజేసి; ఒయారము=విలాసము; ఎచ్చఁగాన్=అతిశయింపఁగా; ఆయెడన్=ఆసమయమందు; నేర్పు=నైపుణ్యము; మించన్=అతిశయించునటులు; వేడుకన్ =సంతోషముతో; గమపా దికపుంఖణము– గ=గాంధారము, మ=మధ్యమము, ప=పంచమము, ఆదిక=మొదలుగాఁ గల, స్వరములయొక్క, పుంఖణము=మూర్ఛనను, స్వరారోహావరోహక్రమము ననుట. గమపాద్యక్షరములు గాంధారాదిస్వర వాచకము లనుట సంగీతశాస్త్రమందు సంకేతింపఁబడినది; ఊన్చి=చేసి. దీనికి వీణె వాయించె నను ఉత్తరపద్యస్థక్రియతో నన్వయ మని తెలియవలయును. అనఁగా నామునివర్యునియొక్క యాశయము దెలియక చిత్రరేఖ సకియలతోఁ గూడి, యామునిసన్నిధిం జేరి, బంగరు కాయలు గల మంచివీణను దీసికొని సుతిచేసి, గమపాదిస్వరముల వాయించె నని భావము.

సీ. ఘనమార్గవిభవంబు ౧వనితవేణినె గాదు, శ్రుతిపర్వరాగసం౧తతి నెసంగె,
సమతాళవిస్ఫూర్తి ౧సతిగుబ్బలనె గాదు, నవ్యగీతప్రతా౧నముల నెనసెఁ,
గలహంసవైఖరి ౧చెలిగతులనె గాదు, సరసప్రబంధపుం౧జమునఁ దోఁచెఁ,
బల్లవంబులపెంపు ౧పడఁతికేలనె గాదు, సొగసైనపదపాళి ౧సొంపు పూనె,
తే. ననుచు వనదేవతాజనం ౧బభినుతింప, రక్తివిధమును దేశీయ౧రాగగతియుఁ,
జిత్రతరమంద్రరాగజ౧శ్రీలు వెలయ, నింతి మునిచెంత వీణె వా౧యించె నంత. 97

టీక: ఘనమార్గవిభవంబు– ఘనమార్గ=ఆకసముయొక్క, విభవంబు=నైల్యము, లేదా, ఘన=మేఘముయొక్క, మార్గ= కస్తురియొక్క, విభవంబు=నైల్యము; వనితవేణినెగాదు– వనిత=చిత్రరేఖయొక్క, వేణినె కాదు=జడయందే కాదు; శ్రుతిపర్వరాగసంతతిన్– శ్రుతిపర్వ=చెవుల కింపగు, రాగ=భైరవి, తోడి మొదలగు రాగములయొక్క, సంతతిన్=సమూహమందు; ఎసంగెన్=ఒప్పెను; ఘనమార్గవిభవంబు– ఘనమార్గ=గొప్పదైన సంగీతభేదముయొక్క, విభవంబు=అతిశయము, రాగసంతతి నెసంగె నని యర్థము. మార్గము, దేశి యని సంగీతము రెండువిధములు. మహేశునియొద్దనుండి బ్రహ్మాదులచేఁ దేఁబడి, భరతాదులచేఁ బ్రకటింపఁబడినది మార్గము. దేశదేశమునందు భిన్నముగాఁ బ్రచారము గలది దేశి యని తెలియునది.

సమతాళవిస్ఫూర్తి– సమ=సమానమగు, తాళ=తాళఫలములయొక్క,విస్ఫూర్తి=అతిశయము; సతిగుబ్బలనె గాదు = చిత్ర రేఖయొక్క స్తనములందే కాదు; నవ్యగీతప్రతానములన్– నవ్య=నూతనమగు, గీత=గానముయొక్క,ప్రతానములన్=పుంజ ములను; ఎసెసెన్=పొందెను; సమతాళవిస్ఫూర్తి – సమ=సమగతి గల చంచత్పుటాదితాళములయొక్క,విస్ఫూర్తి=అతిశ యము, గీతప్రతానముల నెసెసె నని యర్థము.

కలహంసవైఖరి– కలహంస=రాయంచయొక్క, వైఖరి=గతివిశేషము; చెలిగతులనె గాదు=చిత్రరేఖయొక్క నడకలయందే కాదు; సరసప్రబంధపుంజమునన్ తోఁచెన్= 'చతుర్భిర్ధాతుభి షడ్భి శ్చాఙ్గై ర్యస్మాత్ప్రయుజ్యతే, తస్మాత్ప్రబన్ధః కథితః' అని సంగీతరత్నాకరములో ప్రబన్ధలక్షణము. ఇట్టి లక్షణము గల సరసమైన ప్రబంధమందు కాన్పించె నని భావము. 'శ్లో. చక్ర వాకః క్రౌఞ్చ సహస్వరాధోధ్వనికుండిని, ఆర్యా గాథా ద్విపదగా కలహంసశ్చ తోటకః' అని సంగీతరత్నాకరమందున్నది. అనఁగా, కలహంసవృత్తముయొక్క వైఖరి ప్రబంధమునఁ దోఁచె నని యర్థము.

పల్లవంబులపెంపు=చిగురాకులయొక్క అతిశయము; పడఁతికేలనె గాదు=చిత్రరేఖయొక్క కరమునందే కాదు; సొగసైనపద పాళిన్=సుందరమగు ధ్రువపదములయొక్క బృందమునందు; సొంపు =అందమును; పూనెన్=పొందెను. పల్లవంబులపెంపు = గీతములందలి మొదటిపాదములయొక్క అతిశయము, ధ్రువాదులఁ బొందె నని యర్థము.

అనుచున్=ఈప్రకారము వచించుచు; వనదేవతాజనంబు=వనదేవతలు; అభినుతింపన్=కొనియాడఁగ; రక్తివిధమును =రక్తి యొక్కరీతిని; దేశీయరాగగతియున్=దేశీయరాగముయొక్కరీతియును; చిత్రతరమంద్రరాగజశ్రీలు—చిత్రతర=విచిత్రమగు, మంద్ర=హృదయస్వరములవలనను, రాగ=శుద్ధస్వరములవలనను,జ=పుట్టిన,శ్రీలు=రచనలు; వెలయన్=ప్రకాశింపఁగ; ఇంతి=చిత్రరేఖ; మునిచెంత=మునిసమీపమునందు; అంతన్=అప్పుడు; వీణె వాయించెన్=వీణను పలికించెను.

ఉ. చెన్నగుజాళువాయొళవు, ◊చిన్నరికెంపులమెట్లు, నీలపు
న్వన్నియ నొప్పు కాయలు, న◊వంబగు వజ్రపుకర్వె, పచ్చలం
బన్నినయట్టిమేరువును, ◊బాగగుతంత్రులు మించ నొప్పు మే
ల్కిన్నర చెంతఁ జేరి యొక◊కిన్నరకంఠి యొసంగ నయ్యెడన్. 98

టీక: చెన్నగుజాళువాయొళవు =ప్రకాశించుచున్న బంగరుదండము; చిన్నరికెంపులమెట్లు = చక్కనగు కెంపులసరికట్లు; నీలపున్వన్నియన్=నల్లనిచాయచేత; ఒప్పు కాయలు ఒప్పుచున్న కాయలు; నవంబగు =క్రొత్తనైన; వజ్రపుకర్వె వజ్రముల యొక్క కకుభము; పచ్చలన్=గరుడపచ్చలచేత; పన్నినయట్టి = రచించినట్టి; మేరువును=శిఖరమును; బాగగుతంత్రులు =శ్రేష్ఠమగు తీగెలు; మించన్=అతిశయింపఁగ; ఒప్పు =ప్రకాశించుచున్నట్టి; మేల్కిన్నర=శ్రేష్ఠమైన వీణాభేదమును; ఒక కిన్నర కంఠి=ఒకముదిత; చెంతఁ జేరి=చిత్రరేఖాసమీపమును బొంది; ఒసంగన్=ఈయఁగా; అయ్యెడన్=ఆసమయమందు. దీని కుత్తరపద్యమునందలి 'పల్కించె' నను క్రియతో నన్వయము.

మ. సరసత్వంబునఁ గేల నూని యల యో◊షామౌళి చక్కన్ రిరి
మ్మరిగామారి యటంచు రిప్పనిమగా◊మమ్మారి యంచు న్విభా
స్వరనానానవరక్తిఁ దానతతి మిం◊చన్ గౌళ వాయించి, ని
బ్బరపు న్వేడుకఁ జేయుపంతువిధముల్ ◊పల్కించె నప్పట్టునన్. 99

టీక: అల యోషామౌళి =ఆచిత్రరేఖ; సరసత్వంబునన్ =రసికతతో; కేలన్=హస్తముచేత; ఊని=(కిన్నెరను) గ్రహించి; చక్కన్ =సొంపుగా; రిరిమ్మరిగామారి యటంచు రిప్పనిమగామమ్మారి యంచున్ = ఈప్రకారమనుచు; విభాస్వరనానానవరక్తిన్ – విభాస్వర=ప్రకాశించుచున్న, నానా=అనేకవిధములగు, నవరక్తిన్=నూతనమగు సొంపుచేత; తానతతి మించన్ =తాన యను శబ్దజాల మతిశయింపఁగ; గౌళ వాయించి = గౌళరాగమును పలికించి; నిబ్బరపు న్వేడుకఁ జేయుపంతువిధముల్=మిక్కిలి వినోదము గొల్పునట్టి శ్రేష్ఠమగు రీతులను; పల్కించెన్=వాయించెను; అప్పట్టునన్=ఆసందర్భమున, దీనికి ఉత్తరపద్యస్థ మగు 'సల్పె' నను క్రియతో నన్వయము. అనఁగ చిత్రరేఖ కుముదాక్షి యొసంగిన కిన్నర దీసికొని, సరిగమాదిస్వరములను వాయించి, గౌళయను రాగమును తానతతి ననఁగ తాన యనుశబ్దములతో ననేకరీతుల వాయించె నని భావము.

మ. బళిరే మైసిరితీరు, నిల్కడలు సేఁబా, సయ్యరే పేరణీ
కలనం, బౌర పదాళికాభినయవైఁఖర్యంబు, మజ్జారె కో
పులవైచిత్రి, యహో వినిర్మలకరాంఁభోజాతవిన్యాస, మం
చలివేణుల్ వినుతింప సల్పె నటనం ఁబాకొమ్మ తత్సన్నిధిన్. 100

టీక: ఈపద్యమందు 'బళిరే, సేబాసు, అయ్యారే, ఔర,మజ్జారె, అహో' యను పదములు ప్రశంసార్థకము లని యెఱుంగునది. మైసిరితీరు=దేహకాంతియొక్కరీతి, బళిరే! నిల్కడలు=ధైర్యములు, సేబాసు! పేరణీకలనంబు=భాండముపైఁజేయునృత్యము, అయ్యరే! పదాళికాభినయవైఖర్యంబు – పదాళికా=గానోపయోగిపదపుంజములయొక్క, అభినయవైఖర్యంబు= పదార్థాభి నయరీతి, ఔర! కోపులవైచిత్రి =నాట్యసంబంధులగుతీర్పులయొక్కవిచిత్రత, మజ్జారె! వినిర్మలకరాంభోజాతవిన్యాసము– వినిర్మల=స్వచ్ఛమగు, కరాంభోజాత=కరకమలములయొక్క, విన్యాసము=ఉంచుట, అహో! అంచున్= ఈప్రకారము వచింపుచు; అలివేణుల్=స్త్రీలు; వినుతింపన్=కొనియాడఁగ; ఆకొమ్మ =ఆచిత్రరేఖ; తత్సన్నిధిన్=ఆమునిసమీపమందు; నట నంబు = నాట్యమును; సల్పెన్=చేసెను. అంగనలు నుతియించుచుండఁగఁ జిత్రరేఖ మునిసన్నిధి నభినయించి నాట్యముఁ జేసె నని తాత్పర్యము.

క. ఈలీల నన్ని విద్యలు, వేలుపుతొవకంటి చూపి ఁవిపులసమాధి
శ్రీలాభగౌరవంబున, శైలాభం దెమలకున్న ఁశమిఁ గాంచి రహిన్. 101

టీక: ఈలీలన్=ఈరీతిగ; వేలుపుతొవకంటి =చిత్రరేఖ; అన్ని విద్యలున్=ఎల్లవిద్యలు; చూపి=ప్రదర్శించి; విపులసమాధిశ్రీ లాభగౌరవంబునన్– విపుల=విశాలమగు, సమాధి=చిత్తవృత్తినిరోధముయొక్క,శ్రీ=సంపదయొక్క,లాభ=ప్రాప్తివలననైన; గౌరవంబునన్ = గరుత్వముచేత;శైలాభన్=పర్వతమువలె; తెమలకున్న శమిన్=చలింపకున్న మునిని; రహిన్=ప్రీతితో; కాంచి=చూచి.

చ. అనుపమకాంచిరమ్యతటఁహాటకకింకిణికారుఝణంఝణ
ధ్వని చెలరేఁగ, నానియమిఁదండకుఁ జేరి, యొయార మెచ్చ న
వ్వనిత తపోధనేంద్రపదఁవారిజయుగ్మము కేల నంటి, యొ
య్యనఁ దలఁ జేర్చి, నూత్నమధుఁరామృతపూరసమోక్తి నిట్లనున్. 102

టీక: అనుపమ కాంచి రమ్యతటహాటకకింకిణికా ఝుణంఝుణధ్వని– అనుపమ=అసమానమగు,కాంచి=ఒడ్డాణములయొక్క, రమ్య=మనోహరమగు,తట=ప్రదేశమందలి,హాటకకింకిణికా=బంగారుచిఱుగంటలయొక్క,ఝుణంఝుణధ్వని = ఝుణఝుణ యను శబ్దము; చెలరేఁగ=అతిశయింపఁగ; ఆనియమిదండకున్=ఆమునిసమీపమునకు; చేరి, ఒయారము=విలాసము; ఎచ్చన్ = అతిశయింపఁగ; అవ్వనిత=ఆచిత్రరేఖ; తపోధనేంద్రపదవారిజయుగ్మము– తపోధనేంద్ర=జడదారిసామియొక్క, పదవారిజయుగ్మము=పాదకమలద్వయమును; కేలన్=హస్తముచేత; అంటి=తాఁకి; ఒయ్యనన్=తిన్నగా; తలన్=శిర మును; చేర్చి=కదియించి; నూత్నమధురామృతపూరసమోక్తిన్– నూత్న=క్రొత్తనగు, మధుర=తియ్యని, అమృత=సుధ యొక్క, పూర=ప్రవాహముతోడ, సమ=సదృశమగు, ఉక్తిన్=వాక్యమును; ఇట్లు=ఈప్రకారముగ; అనున్=పలికెను.

సీ. తెఱగంటిదొరలకుఁ దీఱలేనివిరాళి, మొనపుచక్కఁదనానఁ దనరుదాన,
కులుకుచిత్తరువుబొమ్మలకు జీవమునించఁ,గలపాటవగ నేర్చి యలరుదాన,
రంభాదికనిలింపరామలఁ దలవంపఁ, జేయు నాట్య మెఱింగి సెలఁగుదాన,
హరిగిరిశాదిదివ్యసభాళి బిరుదు లె,న్నైనఁ జేకొని నిచ్చ నడరుదాన,

తే. పలుకుతొయ్యలి వీవంచు నలువ మెచ్చ, నలఘుసాహిత్యవిద్యాప్తి వెలయుదాన,
చిత్రరేఖాసమాఖ్య రాజిల్లుదాన, నిన్ను సేవింపవచ్చితి నియమిచంద్ర! 103

టీక: తెఱగంటిదొరలకుఁన్=దేవశ్రేష్ఠులకు; తీఱలేనివిరాళిన్=ఎడతెగనిమోహమును; మొనపు=కలుగఁజేయు;చక్కఁదనానన్ = సౌందర్యముచేత; తనరుదానన్= ఒప్పుచున్నదానను;
కులుకుచిత్తరువుబొమ్మలకున్=చిత్తరువునందు వ్రాసిన చక్కనిబొమ్మలకు; జీవము=ప్రాణమును; నించఁగల పాటవగన్= నిండఁ జేయుటయందు సామర్థ్యము గల్గిన గానముయొక్కసొంపును; నేర్చి=అభ్యసించి; అలరుదానన్=ప్రకాశించుదానను; రంభాదికనిలింపరామలన్—రంభాదిక=రంభమొదలగు, నిలింపరామలన్= దేవాంగనలను; తలవంపన్=శిరమువంచునట్లు, చేయునాట్యము=చేయునట్టి నాట్యము; ఎఱింగి=తెలిసి; చెలఁగుదానన్=ప్రకాశించుదానను;
హరిగిరిశాదిదివ్యసభాళిన్– హరి=కృష్ణుఁడు, లేదా ఇంద్రుఁడు,గిరిశ=శివుఁడు, ఆది=మొదలుగాఁ గలవారియొక్క, దివ్య= మనోహరమగు, సభాళిన్=సభాసమూహములయందు; ఎన్నైనన్=ఎన్నిటినైన, లెక్కకు మించి యనుట; బిరుదులు=జయ చిహ్నములను; చేకొని=గ్రహించి; నిచ్చ =ఎల్లప్పుడు; అడరుదాన=ఒప్పుచున్నదానను;
నలువ=బ్రహ్మదేవుఁడు; ఈవు=నీవు; పలుకుతొయ్యలివి=సరస్వతివి; అంచున్=అనుచు; మెచ్చన్=మెచ్చునటులు; అలఘు సాహిత్యవిద్యాప్తిన్– అలఘు=అధికమగు, సాహిత్యవిద్యా=నాటకాలంకారాదిసాహిత్యవిద్యలయొక్క, ఆప్తిన్=ప్రాప్తిచేత; వెలయుదానన్=ఒప్పుచున్నదానను; చిత్రరేఖాసమాఖ్యన్=చిత్రరేఖ యను నామముచేత; రాజిల్లుదానన్=ప్రకాశించుదానను; నియమిచంద్ర = ఓ మునిశ్రేష్ఠుఁడా! నిన్ను సేవింపవచ్చితిన్ = నిన్నుఁ గొలుచుటకు వచ్చితిని.

నియమిచంద్రా! దేవోత్తములకును మోహమును గొల్పు నందముచేతను, అచేతనములగు బొమ్మలకును ప్రాణ మిచ్చు నంతటి గానముచేతను, రంభాదిదేవాంగనలకు నలవిగాని నాట్యముచేతను దనరుచు, అనేకశివకేశవాద్యుత్తముల సభల యందు బిరుదములఁ గొని మించుచు, నలువ సరస్వతివి నేవే యని మెచ్చునంతటి సాహిత్యవిద్యచే నొప్పుచుండుదాన, చిత్ర రేఖ యను పేరు గలదాన, నేను నిన్ను సేవింపవచ్చితి నని భావము.

క. అనునెడ నమ్మునికులమణి, కనుఁగవ నర విప్పి ౹కాంతఁ గన్గొని యంతన్
బునరనవధికసమాధిక,లన నక్షులు మోడ్చి నిశ్చ౹లతచే నుండన్. 104

టీక: అనునెడన్=అని పలుకునపుడు; అమ్మునికులమణి=ఆఋషిశ్రేష్ఠుఁడు; కనుఁగవన్=కనుదోయిని; అర విప్పి = సగము దెఱచి; కాంతన్=చిత్రరేఖను; కన్గొని=చూచి; అంతన్=అటుపిమ్మట; పునరనవధికసమాధికలనన్ – పునః=మఱల, అనవధిక =అంతములేని, సమాధి=చిత్తవృత్తినిరోధముయొక్క, కలనన్ =ప్రాప్తిచేత; అక్షులు=నేత్రములను; మోడ్చి=ముకుళించి; నిశ్చలతచే =అచంచలతచేత; ఉండన్ =ఉండఁగ.

ఉ. కాంచి తపస్విచిత్తగతి ౹గాంచఁగ లేక యయారె మామకా
భ్యంచిత శాంబరీమహిమ ౹కయ్యతి లోఁబడు నంచు నెంచి త
త్కాంచనగాత్రి యాళిజన౹తాయుతి మిక్కిలి చెంతఁజేరి నే
త్రాంచలసీమ నవ్వు వొల౹యన్ మునిఁ బల్కె నవోక్తిచాతురిన్. 105

టీక: తత్కాంచనగాత్రి =ఆచిత్రరేఖ; కాంచి=చూచి; తపస్విచిత్తగతిన్=మునియొక్క మనస్థితిని; కాంచఁగ లేక=తెలియఁజాలక; అయారె =ఆశ్చర్యము! మామకాభ్యంచితశాంబరీమహిమకున్ – మామక=నాసంబంధి యగు, అభ్యంచిత=శ్రేష్ఠమగునట్టి, శాంబరీమహిమకున్=మాయాసామర్థ్యమునకు; అయ్యతి=ఆముని; లోఁబడు నంచున్=వశపడు ననుచు; ఎంచి = తలఁచి; ఆళిజనతాయుతిన్=సఖీజనముతోడి కూడికచేతను; మిక్కిలి చెంతఁజేరి =అత్యంతసమీపమును బొంది; నేత్రాంచలసీమన్ =నయనాంతముల ప్రదేశమునందు; నవ్వు =స్మితము; పొలయన్=వ్యాపింపఁగ; నవోక్తిచాతురిన్ – నవ=నూతనమైన, ఉక్తిమాటలయందలి, చాతురిన్=నేర్పుచేత; మునిన్=వసంతునిగూర్చి; పల్కెన్=పలికెను.

సీ. జవరాలినునుగుబ్బ౹చన్నులఁ జేరుట, వసుధాధరస్థలీ౹వసతి గాఁగ,
నతివరత్యంతశ్ర౹మాంబులఁ దోఁగుట, నమరాపగావగా౹హనము గాఁగ,
తెఱవకెమ్మోవిక్రొం౹దేనియ గ్రోలుట, నిరుపమామృతపాన౹సరణి గాఁగ,
కొమ్మతో రతికూజి౹తమ్ములు నొడువుట, సరసాగమాంతాళి౹చదువు గాఁగఁ,
తే. దలఁపఁ బద్మాంబకాభిఖ్య౹దైవతంబు, మసలక దయారసంబున ౹నొసఁగు సు మ్మ
ఖండితానందగరిమ ని౹క్కలన మనుము, వట్టి యీఖేదకనివృత్తి ౹గట్టి మౌని. 106

టీక: మౌని=వసంతుఁడా! జవరాలినునుగుబ్బచన్నులఁ జేరుట=స్త్రీలయొక్క నునుపుగుబ్బచన్నులను బొందుట; వసుధాధరస్థలీవసతి=పర్వతప్రదేశమందలి నివాసము; కాఁగన్= అగునటులు;
అతివరత్యంతశ్రమాంబులన్ – అతివ=వనితయొక్క, రత్యంత=సురతాంతమువలన నైన, శ్రమాంబులన్=శ్రమోదకముల యందు; తోఁగుట= మునుఁగుట; అమరాపగావగాహనము – అమరాపగా=స్వర్గంగయందు, అవగాహనము =స్నానము; కాఁగన్= అగునటులు;
తెఱవకెమ్మోవిక్రొందేనియల్ – తెఱవ=వనితయొక్క, కెమ్మోవి=అరుణాధరోష్ఠముయొక్క, క్రొందేనియల్=నూతనమధుర

రసములను; క్రోలుట=పానముచేయుట; నిరుపమామృతపానసరణి– నిరుపమ=సాటిలేని, అమృత=సుధయొక్క, పాన సరణి=పానముయొక్క రీతి; కాఁగన్= అగునటులు;
కొమ్మతోన్=కాంతతో; రతికూజితమ్ములు=మణితములు; నొడువుట=పలుకుట; సరసాగమాంతాళిచదువు– సరస=శ్రేష్ఠ మగు, ఆగమాంత=వేదాంతములయొక్క, ఆళి=బృందముయొక్క,చదువు =చదువుట; కాఁగన్= అగునటులు;
తలఁపన్=భావింపఁగ; పద్మాంబకాభిఖ్యదైవతంబు = పద్మాంబకుఁ డను పేరుగల దేవత, పద్మములు బాణములుగా గల దేవుఁడు మన్మథుఁ డనుట; మసలక=తడవుసేయక; దయారసంబునన్=కృపారసముచేత; అఖండితానందగరిమన్ = అఖండానందాతిశయమును; ఒసఁగున్=ఇచ్చును; సుమ్ము=సత్యము; వట్టి=నీరసమగు;ఈఖేదకనివృత్తిన్=దుఃఖకర మగు నీనివృత్తిమార్గమును; కట్టి=బంధించి, విరమించి యనుట; ఇక్కలనన్=ఈరీతిగ; మనుము=వర్తింపుము.

అనఁగ స్త్రీకుచంబుల నెనయుట పర్వతనివాస మనియు, సురతాంతశ్రమవారి మునుగుట స్వర్గంగాస్నాన మనియు, నధరరసాస్వాద మమృతరసాస్వాద మనియు, స్త్రీలతో రతికూజితములు నుడువుట వేదాంతవిద్యల చదువుట యనియుఁ దలఁచి మన్మథుని ధ్యానింతువేని, మునిచంద్రా! నీకు నతం డఖండానందము నొసంగును. కేవలము నీరసమగు నీనివృత్తిమార్గ మును వదలు మని భావము.

సీ. పరమకాశ్యాకృతిఁ ♦బ్రబలదే నియమీశ, సోమమండలదాస్య♦రోమవల్లి,
యనవద్యమధురాత్మ ♦నలరదే మునికాంత, జలరుహేక్షణమధు♦స్రావిమోవి,
పురుషోత్తమస్థేమఁ ♦బొసఁగదే యతిచంద్ర, యచలకల్పోరోజ♦ యలఘునాభి,
శ్రీరంగవైఖరిఁ ♦జెలఁగదే దమివర్య, కనకజాతీయాంగి ♦కన్నుదోయి,
తే. యగుట నిత్యపవిత్రరూ♦పాప్తి నడరు, కలికితోఁ గూడి యుండినఁ ♦గాక కలదె
యతనుసుఖరాశి యిట్టి మ♦హాఘదాయి, ఘోరకాంతారమహి నున్న ♦ధీరముఖ్య. 107

టీక: నియమీశ=ఓమునిరాజా! సోమమండలదాస్యరోమవల్లి– సోమమండలత్ =చంద్రమండలమువలె నాచరించుచున్న, ఆస్య=ముఖము గల స్త్రీయొక్క, రోమవల్లి=నూఁగారు; పరమకాశ్యాకృతిన్– పరమ=ఉత్కృష్టమగు, కాశి=వారణాసి యొక్క, ఆకృతిన్ =స్వరూపముచేత; ప్రబలదే =అతిశయింపదా యని కాకువు. పరమక=ఉత్కృష్టమగు, ఇచట స్వార్థ మందు కప్రత్యయము, అసి=ఖడ్గముయొక్క, ఆకృతిన్=స్వరూపముచేత ప్రబలదా యని స్వభావార్థము. శ్లేషయందు శసల కభేదము నవలంబించుట యాలంకారికసమ్మతము.
మునికాంత=మునినాథా! జలరుహేక్షణమధుస్రావిమోవి– జలరుహేక్షణ=వనజాక్షియొక్క, మధుస్రావి=మకరందమును స్రవించు, మోవి=ఓష్ఠము; అనవద్యమధురాత్మన్– అనవద్య=నిర్దుష్టమగు, మధురాత్మన్ =మధుర యను దివ్యక్షేత్రము యొక్క యాకారముచేత; అలరదే =ప్రకాశింపదా యని కాకువు. మధురాత్మన్– మధుర=తీయని, ఆత్మన్=స్వరూపము చేత, అలరదా యని స్వభావార్థము.
యతిచంద్ర=ఓమునిచంద్రుఁడా! అచలకల్పోరోజ యలఘునాభి = ఇంచుకతక్కువగా పర్వతము లగుచున్న స్తనములు గల దానియొక్క లోతైన పొక్కిలి; పురుషోత్తమస్థేమన్– పురుషోత్తమ=పురుషోత్తమక్షేత్రముయొక్క, స్థేమన్=మహిమచేతను; పొసఁగదే=ఒప్పదా యని కాకువు. పొక్కిలి, పురుషోత్తమస్థేమన్– పురుషోత్తమ = పున్నాగపుష్పముయొక్క, స్థేమన్= మహిమవంటి మహిమచే పొసఁగదా యని స్వభావార్థము.

దమివర్య=యతిశ్రేష్ఠుఁడా! కనకజాతీయాంగి కన్నుదోయి– కనకజాతీయ=సువర్ణప్రకారము గల, అంగి=దేహము గలదాని యొక్క, ఇచట 'ప్రకారవచనే జాతీయర్' అని జాతీయప్రత్యయము, కన్నుదోయి=నేత్రయుగ్మము; శ్రీరంగవైఖరిన్– శ్రీరంగ = శ్రీరంగమను పుణ్యక్షేత్రముయొక్క, వైఖరిన్=రీతిచేత; చెలఁగదే=ప్రకాశింపదా యని కాకువు. శ్రీరంగవైఖరిన్– శ్రీ=సిరికి, రంగ = విహారస్థానముయొక్క, వైఖరిన్=రీతిచే, చెలఁగదా యని స్వభావార్థము.

అగుటన్=ఈప్రకారముగ వనితావయవములు పుణ్యక్షేత్రాకృతిని బొందుటచేత; నిత్యపవిత్రరూపాప్తిన్– నిత్య=నిరంతరము, పవిత్ర=నిర్మలమగు, రూప=స్వరూపముయొక్క, ఆప్తిన్=ప్రాప్తిచేత; అడరుకలికితోన్=ఒప్పుచున్న కాంతతో; కూడి యుం డినఁ గాక =కలసియుండినం గాక; ఇట్టి =ఈప్రకారము; మహాఘదాయిఘోరకాంతారమహిన్– మహత్=అధికమగు, అఘ = పాపమును, 'అఘం దుఃఖే చ పాపే చ' అని విశ్వము, దాయి=ఇచ్చుచున్న, ఘోర=భయంకరమగు, కాంతారమహిన్= అరణ్యభూమియందు; ఉన్నన్=ఉన్నచో, ధీరముఖ్య=పండితోత్తముఁడ! అతనుసుఖరాశి– అతను=అధికమగు, సుఖరాశి =ఆనందరాశి, మన్మథసుఖరాశి యని స్వభావార్థము; కలదె=ఉండునా?

అనఁగ రోమవల్లి పరమకాశ్యాకృతిని, మోవి మధురాత్మతను, పాక్కిలి పురుషోత్తమక్షేత్రగరిమను, కనుదోయి శ్రీరంగ వైఖరిని బొందియుండుటచే, సర్వదా పవిత్రరూపమును పొందిన కలికితోడఁ గూడి యుండిన నతనుసుఖము ఘటిల్లును గాని, యఘప్రదమగు నీ భయంకరారణ్యములో నుండినచో నెట్లు ఘటిల్లు నని భావము.

మ. ఉరురామైకగుణానువర్ణనమొ, కాంతోచ్చైస్తనాగస్థలీ
పరివాసంబొ, సతీవరాంఘ్రిభజనాప్రాశస్త్యమో, సౌదృశో
త్కరసేవాగతియో, ప్రియారుణకరాత్యాలోకనంబో, మదిం
గర మూహింపఁగ నిట్టి నీతప మనంగా నేమి మౌనీశ్వరా! 108

టీక: ఉరురామైకగుణానువర్ణనమొ– ఉరు=అధికమైన, రామ=దాశరథియొక్క, ఏక=ముఖ్యమగు, గుణ=కల్యాణ గుణ ములయొక్క, అనువర్ణనమొ=స్తుతించుటయో; రామా=సుందరియొక్క, ఏక=ముఖ్యమగు, గుణ=సౌందర్యాదిగుణముల యొక్క, అనువర్ణనమొ=వర్ణించుటయో యని స్వభావార్థము దోఁచుచున్నది; కాంతోచ్చైస్తనాగస్థలీపరివాసంబొ– కాంత= రమణీయమైన, ఉచ్చైస్తన=గొప్పవైన, 'సాయం చిరం ప్రాహ్ణే ప్రగేవ్యయేభ్యష్ట్యుట్యులౌతుట్చ' అని అవ్యయము మీఁద ట్యు ట్యుల్ప్రత్యయతుడాగమములు వచ్చినవి, అగస్థలీ=పర్వతప్రదేశములయందు, పరివాసంబొ =నివాసమో; కాంతా=వనిత యొక్క, ఉచ్చైః=ఉన్నతమైన, స్తనాగ=పర్వతములవంటి కుచములయొక్క, స్థలీ=ప్రదేశమందు, పరివాసంబొ యని స్వభా వార్థము; సతీవరాంఘ్రిభజనాప్రాశస్త్యమో– సతీవర=శంకరునియొక్క, అంఘ్రి=పాదములయొక్క, భజనా=సేవ యొక్క, ప్రాశస్త్యమో=ప్రశస్తతయో; సతీవరా=ఉత్తమస్త్రీలయొక్క, అంఘ్రిభజనా=చరణసేవయొక్క, ప్రాశస్త్యమో=ప్రశస్తతయో యని స్వభావార్థము దోఁచుచున్నది; సౌదృశోత్కరసేవాగతియో– సౌదృశోత్కర=విద్వాంసులసమూహముయొక్క, సేవా=భజన యొక్క, గతియో=ప్రాప్తియో; సౌదృశోత్కర=సుదృశలైన స్త్రీసంబంధిబృందముయొక్క,సేవాగతియో యని స్వభావార్థము దోఁచుచున్నది; ప్రియారుణకరాత్యాలోకనంబో– ప్రియ=ప్రియమగు, అరుణకర=సూర్యకిరణములయొక్క, అత్యాలోకనం బో =నిరంతరమైన చూచుటయో; ప్రియా=ప్రియురాలియొక్క, అరుణ=ఎఱ్ఱనైన,కర=హస్తములయొక్క, అత్యాలోకనంబో యని స్వభావార్థము దోఁచుచున్నది;

మౌనీశ్వరా=జడదారిసామీ! మదిన్=మనసునందు; కరము=మిక్కిలి; ఊహింపఁగన్=వితర్కింపగ; ఇట్టి=ఈవిధమగు;

నీతప మనంగా నేమి = నీతప మన(గా నేమి, ఏవిధమైన దనుట. శ్రీరామశివాదులగుణకీర్తనమా నీవు చేయు తప మని భావము. నారీగుణకీర్తనమా నీవు చేయు తప మని స్వభావాభిప్రాయము.

మ. చెలిబెళ్కుల్ గని, కొమ్మపాట విని, యోషిన్మౌళి నెమ్మోముతా
వులమే లాని, నెలంతమే నలమి, పూవుంబో(డికెమ్మోవితే
నెలచాల్గ్రోలి, సమేతరాక్షసుఖ మెంతే(గాంచ(గా లేక మి
క్కిలి యాత్మాధిగతైకహృత్సుఖనిషక్తిన్ మౌని! కాంక్షింతురే. 109

టీక: మౌని=మునివర్యా! చెలిబెళ్కుల్=వనితావిలాసములను; కని=చూచి; కొమ్మపాటన్=స్త్రీగానమును; విని=ఆకర్ణించి; యోషిన్మౌళి నెమ్మోముతావులమేలు – యోషిన్మౌళి=నారీరత్నముయొక్క, నెమ్మోము=సుందరవదనముయొక్క, తావుల =పరిమళములయొక్క, మేలు=సారమును; ఆని=ఆఘ్రాణించి; నెలంతమేను=కాంతాశరీరమును; అలమి=కౌ(గిలించి; పూవుంబో(డి కెమ్మోవితేనెలచాలు – పూవుంబో(డి = కుసుమకోమలమైన స్త్రీయొక్క, కెమ్మోవి= ఎఱ్ఱనియధరముయొక్క, తేనెల = తేనెవంటిరసముయొక్క, చాలు=పరంపరను; క్రోలి=పానముచేసి; సమేతరాక్షసుఖము=పంచేంద్రియములయొక్క, అన(గా(జక్షుశ్శ్రోత్రజిహ్వాఘ్రాణత్వగింద్రియములయొక్క యనుట, సుఖము=సుఖమును; ఎంతేన్=మిక్కిలి; కాంచ(గా లేక =పొందలేక; మిక్కిలి=అతిశయముగ; ఆత్మాధిగతైకహృత్సుఖనిషక్తిన్ – ఆత్మ=పరమాత్మవలన, అధిగత=పొంద(బడి నట్టియు, ఏక=ముఖ్యమైనట్టియు,హృత్సుఖనిషక్తిన్=హృదయసుఖసంబంధమును; కాంక్షింతురే=కోరుదురా యని కాకువు.

అన(గా బుద్ధిమంతులు స్త్రీవిలాసదర్శన, తదీయగానశ్రవణ, తన్ముఖగంధాఘ్రాణ, తదధరరసపాన, తదాలింగన జనిత మగు పంచేంద్రియసుఖమును గోరక, కేవలపరమాత్మవలన(బొంద(బడిన హృత్సుఖమును మాత్రము కోరరని భావము.

సీ. సుమసౌకుమార్యాప్తి నమరునీనెమ్మేను, ఘనపంచశిఖికీల(గంద కున్నె,
నెలపుల్గుపెంపూని యలరునీకనుదోయి, సూర్యదర్శనసక్తి స్రుక్క(బడదె,
తమ్మియందమ్మూని తనరునీనెమ్మోము, శుచిభసితచ్ఛాయ సొగసెడయదె,
తళుకుకెంజిగురాకు సొలపూనునీయంఘ్రి, సూచిపై మెట్టిన సొంపు సెడదె,
తే. యకటకట నీవొకింతైన యంతరంగ,మున(దలంపవుగాని సంభోగయోగ్య
భావమున మించు నీయట్టి భవ్యమూర్తి, కీదృశమహాతపోగ్లాని నెనయ(దగునె. 110

టీక: సుమసౌకుమార్యాప్తిన్ – సుమ=పుష్పములయొక్క, సౌకుమార్య=సుకుమారత్వముయొక్క, ఆప్తిన్=ప్రాప్తిచేత; అమరునీనెమ్మేను =ఒప్పుచున్న నీసుందరశరీరము; ఘనపంచశిఖికీలన్ – ఘన=గాఢమగు, పంచశిఖి=పంచాగ్నుల యొక్క, కీలన్=జ్వాలచేత; కందకున్నె=పరితపింపకుండునా?
నెలపుల్గు=చకోరములయొక్క; పెంపు=సౌందర్యమును; ఊని =పొంది; అలరునీకనుదోయి=ప్రకాశించు నీకనుగవ; సూర్య దర్శనసక్తిన్ – సూర్య=సూర్యునియొక్క, దర్శన=చూచుటయొక్క, సక్తిన్=సంబంధముచేత; స్రుక్క(బడదె=తపింపదా? తమ్మియందమ్ము – తమ్మి=కమలముయొక్క,అందమ్ము=సౌందర్యమును;ఊని=పొంది; తనరు=ఒప్పుచున్న; నీనెమ్మోము =నీచక్కనిముఖము; శుచిభసితచ్ఛాయన్ – శుచి=శుభ్రమగు,భసిత=భస్మముయొక్క, ఛాయన్=కాంతిచేత, శుచిభ= తెల్లని

కిరణములు గల చంద్రునియొక్క, సితచ్ఛాయన్=తెల్లనికాంతిచేత, అనఁగా వెన్నెలచేత; సొగసు=అందమును; ఎడయదె= విడువదా?

తళుకుకెంజిగురాకుసొలపూనునీయంఘ్రి– తళుకు=ప్రకాశించుచున్న,కెంజిగురాకు=ఎఱ్ఱనిచిగురుటాకుయొక్క, సొలపు = మృదుత్వమును, ఊను=పొందినట్టి, నీయంఘ్రి =నీపాదము; సూచిపైన్=సూదిమీఁద; మెట్టినన్=త్రొక్కఁగ; సొంపు=అంద మును; చెడదె =వీడదా?

అకటకట =అయ్యో కష్టము! నీవు,ఒకింతైన =కొంచెమైన;అంతరంగమునన్=మనస్సునందు; తలంపవుగాని=స్మరింపవుగాని; సద్భోగయోగ్యభావమునన్– సత్=శ్రేష్ఠమగు, భోగ=సుఖమునకు,యోగ్యభావమునన్ =యోగ్యత్వముచేత;మించు=ఒప్పు చున్న; నీయట్టి=నీవంటి; భవ్యమూర్తికిన్=మంగళమూర్తికి;ఈదృశమహాతపోగ్లానిన్– ఈదృశ=ఇటువంటి,మహత్=గొప్ప నగు, తపః=తపమువలన కల్గిన, గ్లానిన్=దుఃఖమును; ఎనయఁదగునె =పొందఁదగునా?

అనఁగా లోకోత్తరమృదులసుందరావయవములు గల్గిన నీకు ఘోరతపం బొనరింప నుచితము గాదని భావము.

మ. అసమజ్వాలశిఖాళి వ్రేఁగిన నిరాహారంబు గైకొన్న శీ
తసరిద్వారులఁ గ్రుంకియున్న భుజగీతంద్రీపరిధ్వంసిసా
హసవృత్తిం గయికొన్న నీ కతనుకల్యాణంద మెట్లబ్బు భ
వ్యసితాంభోరుహలోచనాంఘ్రియుగసేవం దక్క యోగీశ్వరా. 111

టీక: యోగీశ్వరా =జడదారిసామీ! అసమజ్వాలశిఖాళిన్– అసమ=సరిలేని,జ్వాల=మంటలయొక్క,శిఖా=అగ్రముల యొక్క, ఆళిన్= పంక్తిచేత; వ్రేఁగినన్=పరితపించినను; నిరాహారంబు=భోజనాభావమును; కైకొన్నన్=గ్రహించినను, ఉప వాసముండిన ననుట; శీతసరిద్వారులన్– శీత=చల్లనైన, సరిత్=నదులయొక్క,వారులన్=నీటియందు; క్రుంకియున్నన్ = మునిఁగినను; భుజగీతంద్రీపరిధ్వంసిసాహసవృత్తిన్– భుజగీ=శక్తిమూలాధారస్థకుండలినీశక్తియొక్క, తంద్రీ=నిద్రను, పరి ధ్వంసి=పోఁగొట్టెడు, సాహసవృత్తిన్=తెగువపనిని; కయికొన్నన్=గ్రహించినను, మహాయోగసాధ్యమగు మూలాధారస్థ కుండలినీశక్తిని మేల్కొల్పునంతటి తెగువను స్వీకరించిన ననుట,

'శ్లో. భుజఙ్గాకారరూపేణ మూలాధారం సమాశ్రితా, శక్తిః కుణ్డలినీనామ బిసతన్తునిభా శుభా।
మూలకన్దం ఫణాగ్రేణ దష్ట్వా కమలకన్దవత్, ముఖేన పుచ్ఛంతం గృహ్య బ్రహ్మరన్ధ్రం సమాశ్రితా।
పద్మాసనగత స్స్వస్థో గుదమాకుఞ్చ్య సాధకః, వాయు మూర్ధ్వగతిం కుర్వన్ కుమ్భకావిష్టమానసః।
వాయ్వా ఘాతవశాదగ్ని స్స్వాధిష్ఠానగతో జ్వలన్, జ్వలనాఘాతపవనాఘాతై రున్నిద్రితోహిరాట్।
రుద్రగ్రన్థిం తతో భిత్త్వా విష్ణుగ్రన్థిం భినత్త్యతః, బ్రహ్మగ్రన్థిం చ భిత్త్వైవం కమలాని భినత్తి షట్।
సహస్రకమలే శక్తి శ్శివేన సహ మోదతే, సాచావస్థాపరాజ్ఞేయా సైవ నిర్వృతికారణమ్।'

అని వామకేశ్వరమహాతంత్రమున నున్నది.

భవ్యసితాంభోరుహలోచనాంఘ్రియుగసేవం దక్కన్– భవ్య=మంగళమూర్తి యగు, సితాంభోరుహలోచన=తెల్లదామరల వంటి కన్నులు గల విష్ణుమూర్తియొక్క, అంఘ్రియుగసేవం దక్కన్=పాదద్వయముయొక్క సేవవలనం గాక; ఇచట సితాం భోరుహలోచనా=పద్మములవంటి కన్నుల గల స్త్రీయొక్క, అంఘ్రియుగసేవం దక్కన్ =పాదసేవచేఁ దప్ప నను స్వభావార్థము స్ఫురించుచున్నది; నీకున్, అతనుకల్యాణందము– అతను=అధికమగు, కల్యాణందము =శుభప్రదమగు నానందము, అనఁగ

జన్మమృత్యుజరావర్జిత మగు నానందము ననుట; ఇచట, అతనుకల్యానందము =మన్మథయుద్ధసంబంధమైన యానందమని స్వభావార్థము స్ఫురించుచున్నది, అతను=మన్మథునియొక్క, కలి=యుద్ధము, కలిశబ్దమునకు యుద్ధ మర్థమనుట స్పష్టము; ఎట్లబ్బున్=ఏవిధముగా కల్గును?

అనఁగాఁ బంచాగ్నిజ్వాలలచేఁ గందినను, పస్తుండినను, చల్లనినీటఁ గ్రుంకినను, మహాయోగసామర్థ్యముఁ బొంది మూలాధారస్థకుండలినీశక్తిని మేల్కొల్పినను, విష్ణుమూర్తిసేవం దక్క అనఁగా శరీరశోషకకర్మల నెన్నింటిని జేసినను బ్రహ్మజ్ఞానము లేక యతనుకల్యాణ మబ్బదని భావము. స్త్రీసేవనముచేతనే మన్మథసుఖము కలుగునని స్వభావాభిప్రాయము.

సీ. మాతంగయుతదావ◊మహికన్నఁ గొంచమే, వరవిప్రవృతకేళి◊వనధరిత్రి,
ఘనపంకమయశైవ◊లినికన్న నల్పమే, యమలహంసాంచితా◊బ్జాకరంబు,
శైలాటగృహదగ◊చ్ఛటకన్నఁ దక్కువే, సద్వితానోద్యోత◊సౌధపాళి,
యనిశ మిరాశనం◊బునకన్న నింద్యమే, పుణ్యసుదృక్కృత◊భోజనంబు,
తే. కాన నీకాన నీవృత్తి◊గరిమ మెల్ల, మాని నే మానితప్రీతి◊మహిమఁ గొల్వ
మౌని యిమ్మౌనిలింపస◊ద్మంబుఁ జేరు, దాన మోదానపాయత ◊దాల్తు విపుడు. 112

టీక: మౌని =వసంతుఁడా! వరవిప్రవృతకేళివనధరిత్రి– వర=శ్రేష్ఠులగు, విప్ర=బ్రాహ్మణులచేత, వృత=ఆవరింపఁబడిన, కేళివన=ఉద్యానవనముయొక్క, ధరిత్రి=భూమి; మాతంగయుతదావమహికన్నన్– మాతంగ=చండాలురతో, యుత=కూడికొన్న, దావమహికన్నన్ =వనభూమికంటె; కొంచమే=తక్కువయా? యని కాకువు. ఇచట వర=శ్రేష్ఠమగు, వి=పక్షులచేత, ప్రవృత=ఆవరింపఁబడిన,కేళివనధరిత్రి=ఉద్యానవనభూమి, మాతంగయుత=గజములతోఁ గూడుకొన్న, దావమహికన్నన్ = అరణ్యభూమికన్న, తక్కువయా యని స్వభావార్థము దోఁచుచున్నది.

అమలహంసాంచితాబ్జాకరంబు– అమల=నిర్దోషులగు,హంస=పరమహంసలచేత, అంచిత=ప్రకాశించుచున్న, అబ్జాకరంబు =తామరకొలను; ఘనపంకమయశైవలినికన్నన్–ఘన=అధికమగు, పంకమయ=పాపమయమైన,శైవలినికన్నన్=నదికన్న, 'శైవలినీ తటినీ హ్రాదినీ ధునీ' అని యమరుఁడు; అల్పమే=కొంచెమా యని కాకువు. ఇచట స్వచ్ఛములైన హంసలతోఁ గూడియున్న కొలను, ఘనపంకమయ=అధికమగు బురదతోఁజేరియున్న, శైవలినికన్న స్వల్పమా యను స్వభావార్థము దోఁచుచున్నది.

సద్వితానోద్యోతసౌధపాళి– సత్=సత్పురుషులయొక్క, వితాన=సమూహముచేత, ఉద్యోత=ప్రకాశము గల, సౌధపాళి= మేడలయొక్క గుంపు;శైలాటగృహదగచ్ఛటకన్నన్–శైలాట=కిరాతులకు, 'కిరాత సింహౌ శైలాటౌ' అని రత్నమాల, గృహత్=ఇల్లువలె నాచరించు, అగచ్ఛటకన్నన్=కొండలగుంపుకన్న; తక్కువే=తక్కువయా యని కాకువు. ఇచట, సద్వితా నోద్యోతసౌధపాళి = శ్రేష్ఠమగు మేలుకట్లచే ప్రకాశము గల మేడలగుంపు,శైలాటగృహదగచ్ఛటకన్నన్–శైలాట =సింహములకు, గృహత్=ఇల్లువలె నాచరించు, అగచ్ఛటకన్నన్=కొండలగుంపుకన్న, తక్కువయా యను స్వభావార్థము దోఁచుచున్నది.

పుణ్యసుదృక్కృతభోజనంబు – పుణ్య=పవిత్రమైన,సుదృక్=విద్వాంసులచేత, కృత=చేయఁబడిన, భోజనంబు=ఆహారము, 'పుణ్యం మనోజ్ఞేఽభిహితం తథా సుకృతధర్మయోః' అని విశ్వము; అనిశమిరాశనంబునకన్నన్– అనిశము=ఎల్లపుడు, ఇరా = సురయొక్క, 'ఇరా భూ వాక్సురామ్బుషు' అని వైజయంతి, అశనంబునకన్నన్=భోజనముకన్న; నింద్యమే = నింద్యమా?

యని కాకువు. ఇచట, పుణ్యసుదృక్కృతభోజనంబు – పుణ్య=మనోహరలైన,సుదృక్=వామేక్షణలచేత, కృత=చేయఁబడిన, భోజనంబు=ఆహారము; అనిశమిరాశనంబునకన్నన్ – అనిశము=ఎల్లపుడు, ఇరాశనంబునకన్నన్ = జలభక్షణముకంటె; నింద్యమే = నింద్యమా? యని స్వభావార్థము దోఁచుచున్నది.

కానన్=కాఁబట్టి; ఈకానన్=ఈయడవియందు; నీవృత్తిగరిమము=నీవ్యాపారాతిశయము; ఎల్లన్=అంతయు; మాని=విడిచి; నేన్=నేను; మానితప్రీతిమహిమన్=మేలైన ప్రేమయొక్క పేరిమిచేత; కొల్వన్=సేవించుచుండఁగ; ఇమ్మౌ=అనుకూలమగు; నిలింపసద్మంబున్=స్వర్గధామమును; చేరు=పొందుము; దానన్=దానిచేత; ఇపుడు, మోదానపాయతన్ – మోద=సంతోషముయొక్క, అనపాయతన్=అపాయరాహిత్యమును; తాల్తువు=వహింతువు.

మాతంగసంకులమగు వనభూమికన్నను, పంకభూయిష్ఠమగు నదికన్నను, కిరాతకులకు నివాస మగు పర్వతసమూహముకన్నను, ఎల్లపుడుఁ జేయు సురాపానముకన్నను, విప్రులతోఁ గూడియున్న యుద్యానవనము, పరమహంసలతోఁ గూడియున్న కొలను, సత్పురుషులతోఁ గూడియున్న మేడలు, పవిత్రులగు విద్వాంసులచే నిర్మింపఁబడిన భోజనమును హీనము లయినవి గావు గనుక నాతోడఁ స్వర్గముఁ జేరి సంతోషాతిశయమును బొందుమని భావము. ఏనుఁగులు మొదలగు వానితోఁ గూడినయడవి మొదలగువానికన్నను, మంచిపక్షులు మొదలగువానితోఁ గూడిన యుద్యానవనము మొదలగునవి మిక్కిలి యుత్తమములు, కావున, నీవు నాతోఁ గూడ స్వర్గము చేరి సుఖింపు మని స్వభావాభిప్రాయము.

చ. పలుమఱు వట్టిపల్కు లిఁకఁ బల్కఁగ నేల యతీంద్ర, త్వత్సము
జ్జ్వలతరరూపయౌవనరుచావరవిభ్రమక్లృప్తమోహనై,
బలుతమి నిన్నుఁ జేరి ధృతిఁ బాసిన నన్ రతిఁ జొక్కఁజేయు ము
త్కలికల నీకధీనగతిఁ దాల్చితి సూనశరుండు సాక్షిగన్. 113

టీక: యతీంద్ర =మునిశ్రేష్ఠుఁడా! పలుమఱున్=మాటిమాటికి; వట్టిపల్కులు=వ్యర్థపుమాటలను; ఇఁకన్=ఈమీఁద; పల్కఁగన్ = పల్కుటచే; ఏల=ఏమి ప్రయోజనము? త్వత్సముజ్జ్వలతరరూపయౌవనరుచావరవిభ్రమక్లృప్త మోహనై–త్వత్=నీయొక్క, సముజ్జ్వలతర=మిక్కిలి ప్రకాశించుచున్న, రూప= ఆకృతిచేతను, యౌవన=తారుణ్యముచేతను, రుచా=కాంతిచేతను, ఇట హలంతలక్షణటాప్ప్రత్యయము వచ్చి రుచా యని ఆకారాంతరూపము, వర=ఉత్తమమగు,విభ్రమ=చక్కదనము లేదా విలాసముచేతను, క్లృప్త=కలిగింపఁబడిన, మోహనై = మోహముగలదాననై; బలుతమిన్=అత్యాసక్తిచేత; నిన్నుఁ జేరి =నిన్ను సమీపించి; ధృతిఁ బాసిన నన్=ధైర్యము విడిచిన నన్ను; రతిన్=సురతముచేత; చొక్కఁజేయుము=పరవశింపఁ జేయుము; సూనశరుండు సాక్షిగన్ =మన్మథుఁడు సాక్షి యగునట్లు; ఉత్కలికలన్=ఉత్కంఠలచేత; నీకున్, అధీనగతిన్=స్వాధీనవిధిని; తాల్చితిన్=ధరించితిని.

చ. అని మునిరాజునిశ్చలతఁ నాత్మవచోర్థవయోరరీకృతిన్
మనమున నిశ్చయించి యలమత్తమతంగజయాన యేమి వ
చ్చిన నిఁక వచ్చుఁ గాక యని చిక్కనిధైర్యము పూని యేలు న
న్ననుపమరక్తి నంచు దమిహస్తముఁ బట్టి కళం దెమల్చినన్. 114

టీక: అలమత్తమతంగజయాన=మదపుటేనుఁగుయొక్క గమనమువంటి గమనము గల యాచిత్రరేఖ; అని=ఇట్లు పలికి; మునిరాజునిశ్చలతన్=మునీశ్వరునియొక్క నిశ్చలత్వమును; ఆత్మవచోర్థచయోరరీకృతిన్—ఆత్మవచః=తనవాక్కులయొక్క, అర్థచయ=అర్థసమూహముయొక్క,ఉరరీకృతిన్=అంగీకారమును,'ఊరీకృత మురరీకృత మఙ్గీకృతమ్' అని యమరుఁడు; మనమునన్=మనస్సునందు; నిశ్చయించి=నిర్ణయించుకొని; ఏమి వచ్చినన్=ఏమి యాపద వచ్చినను; ఇఁకన్=ఈమీఁద; వచ్చుఁగాక యని, చిక్కనిధైర్యము = గాఢమగు ధృతిని; పూని = వహించి; నన్నున్, అనుపమరక్తిన్=అసమానమగు నను రాగముచేత, ఏలు = పాలింపుము; అంచున్= అనుచు; దమిహస్తమున్=మునిహస్తమును; పట్టి = గ్రహించి; కళన్ = కళాస్థానమును; తెమల్చినన్=చలింపఁజేయఁగ. ఉత్తరపద్యస్థక్రియతో నన్వయము.

అనఁగఁ జిత్రరేఖ తాను జెప్పిన వాక్యముల కాయతివర్యుఁ డంగీకరించె నని యాతని నిశ్చలత్వముచే భ్రమించి, ఇఁక మీఁద నేమైనఁ గానిమ్మని దృఢమైన ధైర్యముతో మునికరమును బట్టి కళాస్థానమును జలింపఁజేసె నని భావము.

క. ఆతతి నాయతివర్యుం, డాతతముగఁ దెఱచె లోచనాబ్జములు మనో
భూతప్రతిఘోజ్జ్వలన,స్ఫీతజ్వాలద్విలోలజిహ్వాంచలుఁ డై. 115

టీక: ఆయతివర్యుండు=ఆవసంతుఁడు; ఆతతిన్ =ఆసమయమునందు; లోచనాబ్జములు=కనుఁదామరలను; ఆతతముగన్ = విశాలముగ; మనోభూత ప్రతి ఘోజ్జ్వలన స్ఫీత జ్వాల ద్విలోల జిహ్వాంచలుఁ డై– మనోభూత=మనసునందుఁ బుట్టిన, ప్రతిఘా = కోప మనెడు, 'ప్రతిఘా రుట్ క్రుధౌ స్త్రియామ్' అని యమరుఁడు, ఉత్=అధికమగు, జ్వలన=అగ్నియొక్క, స్ఫీత=అధికమగు, జ్వాలత్=మంటవలె నాచరించునట్టియు, విలోల=చలించుచున్నట్టియు, జిహ్వాంచలుఁ డై=నాలుకచివరగలవాఁ డై; తెఱచెన్= విప్పెను.

అంత ముని, మనసునం దుదయించు కోపాగ్నిజ్వాలయో యన్నటు లుండు నాలుకకలవాఁడై, కనులు విప్పె నని భావము.

వ. ఇవ్విధంబున నవ్వాచంయమిసార్వభౌముండు తత్పద్మినీహృత్పద్మ సాధ్వసాపాదన చమత్కారి దినాంత సంధ్యాయమాన కోపరసశోణిమధురంధరంబు లగు నేత్రపుష్కరంబులు విప్పి, చెప్పరాని యాగ్రహభంగిఁ జెంగట నున్న యక్కురంగలోచనామణిం గనుంగొని, తోఁకఁ ద్రొక్కిన పెనుజిలువచెలువున దీర్ఘం బగునిట్టూర్పు సడలించుచు, 'నో నిలింపచాంపేయగంధి యగంధమహాంధకజిత్పరిపంథి మదాంధకార సంబంధంబునఁ గన్నుగానక మానక నిగుడుమనస్థైర్యంబున దవంబులు చేరి వనంబుల దినంబులుగడుపుచు నమలయమలక్ష్మీసాంగత్యంబున నున్న నన్ను నూరకయె పెచ్చుపెరుఁగు తెచ్చుకోలువలపునఁ బచ్చవిల్తుకయ్యంబునకు నెయ్యం బుంపు మని మదీయకరంబుఁ బట్టఁజెల్లునే, యైన నది యేమి సేయం జను నియ్యెడ నీ వేలుపుఁదొయ్యలితనంబు దూలి యియ్యవని మనుజవనితవై పుట్టి, సుదోషాకరసమాఖ్యం దగు నొక్కయిరాపుం జెట్టవట్టి యుండెదు గాక' యని శపియించె నపుడు. 116

టీక: ఇవ్విధంబునన్=ఈప్రకారముగ; అవ్వాచంయమిసార్వభౌముండు =మునిచక్రవర్తి యగు నావసంతుఁడు; తత్పద్మినీహృత్పద్మ సాధ్వసాపాదన చమత్కారి దినాంత సంధ్యాయ మానకోపరస శోణిమధురంధరంబులు – తత్పద్మినీ=ఆపద్మినీ జాతిస్త్రీయొక్క, హృత్పద్మ=హృదయకమలమునకు, సాధ్వసాపాదన=భయాపాదకమగు, చమత్కారి=విచిత్రమగు,

దినాంత=పగటిచివరయందలి, సంధ్యాయమాన=సంధ్యవలె నున్న, కోపరస=క్రోధరసముయొక్క,శోణిమ=ఎఱ్ఱదనము యొక్క, ధురంధరంబులు=భారవహములు; అగు=అయినట్టి; నేత్రపుష్కరంబులు=కనుదామరలను; విప్పి=తెఱచి; చెప్ప రాని=వచించుట కలవిగాని; ఆగ్రహ=కోపముయొక్క; భంగిన్=రీతిచేత; చెంగటన్=సమీపమందు; ఉన్న యక్కురంగ లోచనామణిన్ = ఉన్నట్టి స్త్రీరత్నమగు చిత్రరేఖను; కనుంగొని=చూచి; తోఁక ద్రొక్కినపెనుజిలువచెలువునన్ = తోఁక ద్రొక్కిన పెనుసర్పము కైవడి; దీర్ఘం బగునిట్టూర్పు=నిడుద యగు నిశ్వాసమును; సడలించుచున్=విడుచుచు; ఓ నిలింపచాంపేయ గంధి = చంపకపుష్పముయొక్క పరిమళమువంటి (దేహ)పరిమళము గలిగిన యో సురాంగనా! అగంధమహాంధకజిత్పరి పంథి మదాంధకారసంబంధంబునన్ – అగంధ=అధికమగు, మహాంధకజిత్=అంధకాసురుని జయించిన శంకరునికి, పరి పంథి = శత్రువైన మన్మథునియొక్క, మద=గర్వమనెడు, అంధకార=చీఁకటియొక్క, సంబంధంబునన్=సంయోగముచేత; కన్ను గానక=కన్ను దెలియక; మానక=వదలక; నిగుడు=కలుగునట్టి; మనస్థైర్యంబునన్=మనస్సుయొక్క దార్ఢ్యముచేత; దవంబులు =అరణ్యములు; చేరి=ప్రవేశించి; వనంబులన్=తపోవనములయందు; దినంబులు=వాసరములను; గడుపుచు = వెచ్చించు చుచు; అమలయమలక్ష్మీసాంగత్యంబునన్– అమల=స్వచ్ఛమగు, యమ=నియమముయొక్క, లక్ష్మీ=సంపద యొక్క, సాంగత్యంబునన్=సంబంధముచేత; ఉన్న నన్నున్=ఉన్నట్టి నన్ను; ఊరకయె=నిష్కారణముగ; పెచ్చుపెరుఁగు తెచ్చుకోలువలపునన్ – పెచ్చుపెరుఁగు=అతిశయించు, తెచ్చుకోలువలపునన్=ఆరోపితకామముచేతను; పచ్చవిల్తుకయ్యం బునకున్= మన్మథయుద్ధమునకు, అనఁగా సురతమునకు; నెయ్యంబు=ప్రేమను; ఉంపుము అని = ఉంచుమనుచు; మదీయ కరంబున్ =నాయొక్కహస్తమును; పట్టన్=గ్రహింపఁగా; చెల్లునే=తగునా? ఐనన్=అటులైనను; అది=ఆకరమును బట్టు కొనుట; ఏమి సేయం జనున్=ఏమి చేయఁ బోవును, ఆకార్యము నిరర్థక మనుట; ఇయ్యెడన్=ఈసమయమందు; నీ వేలుపుఁ దొయ్యలితనంబు=నీ దేవాంగనాత్వము; తూలి=తొలఁగి; ఇయ్యవనిన్=ఈపుడమియందు; మనుజవనితవు =మనుష్యస్త్రీవి; ఐ=అయి; పుట్టి=జనించి; సుదోషాకరసమాఖ్యన్=సుదోషాకరుఁడను నన్వర్థనామముచేత; తగు=ఒప్పునట్టి; ఒక్కయిరాపున్ = ఒక్క మద్యపాయిని; జెట్టపట్టి=వివాహమాడి; యుండెదు గాక=ఉందువు గాక; అని=అనుచు; అపుడు; శపియించెన్= శాపము నిచ్చెను.

అనఁగ నామునిసార్వభౌముఁడు కోపముచే నెఱ్ఱనగుకన్నులు దెఱచి, చిత్రరేఖను జూచి, తోఁక ద్రొక్కినపాముభంగి నిశ్వాసంబు విడుచుచు, 'ఓదేవాంగనా నీవు మదనమదాంధకారముచేఁ గన్ను గానక దవంబులఁ జేరి తపం బొనరించుచున్న నన్ను నకార ణంబుగ సురతమునకై నామీఁద ప్రేమ ముంచుమని కరంబు గ్రహించుట యుక్తముగా' దని పలికి, యిప్పుడె నీదేవాంగనాత్వము తొలఁగి మనుజాంగనవై పుట్టి, సుదోషాకరుఁ డను పేరుగల నొక యిరాపునిఁ బెండ్లియాడు మని శపించె నని భావము.

సీ. తనక్రొందళములమిన్నన చెట్లపాలుగాఁ, జనియె సూనశ్రీల నెనసి మధువు,
తనతరోగరిమ మెంతయు ధూళిపాలుగా, నరిగె వడంకుచు నసదుగాడ్పు,
తనమహస్ఫూర్తి తొల్తనె యగ్నిపాలుగాఁ, బఱచె వెల్వెలఁ బొఱి పద్మవైరి,
తనపాత్రవృత్తి తోడ్తనె మింటిపాలుగా, నడఁగెఁ గొమ్మలఁ బికాద్యభ్రగాళి,
తే. తనపురారాతిభీకరోదగ్రవిగ్ర,హస్ఫురణ భూతిపాలుగా నతనుఁ డేగె,
చాపశతజాతములు వనస్థలిని వైచి, యమ్మహామౌని కోపాప్తి నడరు నపుడు. 117

టీక: అమ్మహామౌని=ఆవసంతుఁడు; కోపాప్తిన్=కోపప్రాప్తిచేత; అడరు నపుడు =అతిశయించు నపుడు; మధువు=చైత్రుఁడు;

తనక్రొందళముల మన్నన =తనయొక్క నూతనమగు సేనలయొక్క మన్నన; చెట్లపాలుగాన్=చెట్లపాలు కాఁగా; సూనశ్రీలన్ – సు=మిక్కిలి, ఊన=కొదువపడిన, శ్రీలన్=సంపదలను, ఎనసి=పొంది; చనియెన్=పోయెను.మునికి కోపము వచ్చి యతిశయించు నపుడు చైత్రుఁడు తనదండు చెట్లపాలు కాఁగా, సంపదల వీడిపోయెనని తాత్పర్యము. ఇచటఁజైత్రుఁడు క్రొందళములనఁగఁ జిగురాకులు చెట్లపాలు కాఁగా, అనఁగా వృక్షములయందు చేరఁగానే సూనశ్రీల ననఁగా ప్రసూనసంపదలను పొంది చనియె నని స్వభావార్థము. వసంతము రాఁగానె మ్రాఁకు లంకురించుటయును, పుష్పించుటయును సహజమని భావము. అసదుగాడ్పు=మందమారుతము; తనతరోగరిమము=తనబలిమియొక్క యతిశయము; ఎంతయున్=మిక్కిలి; ధూళిపాలుగాన్=దుమ్ముపాలు కాఁగా; వడంకుచున్=వణఁకుచు; అరిగెన్=పోయెను. మలయానిలము తనసామర్థ్యము ధూళిపాలై పోఁగా, భయపడి వణఁకుచుఁ బోయె నని భావము. అసదుగాడ్పు=మందమారుతము; తనతరోగరిమము=తనయొక్క వేగాధిక్యము; ధూళిపాలుగాన్=దుమ్ములోఁ గలియఁగ; వడంకుచున్=చలించుచు; అరిగె నని స్వభావార్థము. అనఁగ మారుతమునకు ధూళిలోఁ గలయుటయు, చలించుటయు సహజమని భావము.

పద్మవైరి=చంద్రుఁడు; తనమహస్ఫూర్తి=తనప్రతాపస్ఫూర్తి; తొల్తనె=మొదటనె; అగ్నిపాలుగాన్=అగ్నిపాలైపోవ; వెల్వెలఁ బాఱి =వివర్ణముగలవాఁడై, కాంతిహీనుఁడై యనుట; పఱచెన్=పాఱిపోయెను. చంద్రుఁడు తనప్రతాప మగ్నిపాలు కాఁగానే కాంతిహీనుఁడై పాఱిపోయె నని భావము. తనమహస్ఫూర్తి=తనకలాస్ఫూర్తి; తొల్తనె=మొదటనె; అగ్నిపాలుగాన్=అగ్నిపాలై పోవ, అగ్నిహోత్రుఁడు మొదట చంద్రుని ప్రథమకలను పానము చేయుననుట ప్రసిద్ధము. దీనికి 'ప్రథమాం పిబతే వహ్నిః' అను వచనము ప్రమాణము; వెల్వెలఁ బాఱి =వెలవెలనై, పఱచుట సహజ మని భావము.

పికాద్యభ్రగాళి=పికము మున్నగు పక్షులగుంపు; తనపాత్రవృత్తి =తనయొక్క తగినవార మనెడు వర్తనము; తోడ్తనె =వెంటనె ; మింటిపాలుగాన్ = ఆకాశములో గలసిపోఁగా, అనఁగా వ్యర్థము కాఁగా; కొమ్మలన్=స్త్రీలయందు; అడఁగెన్=దాఁచుకొనెను. కోయిల మొదలగు పక్షులగుంపు తనసంబంధి యగు యుద్ధాదులకు తగినవాఁడను వృత్తి మింటిపాలు కాఁగా వెంటనె భయపడి స్త్రీల మఱుగున దాగికొనె నని భావము. ఇచ్చట కోయిలలు మొదలగునవి, తనపాత్రవృత్తి=తనయొక్క పాత్రము అనఁగా ఱెక్కలసంబంధి యైన వ్యాపారము, ఎగయుట యనుట, మింటిపాలుగాన్ = ఆకాశమునందు వర్తింపఁగ, కొమ్మలన్ = వృక్షశాఖలందు, అడఁగె నని స్వభావార్థము. కోయిలలు మున్నగు పక్షులు మింటి కెగిరి కొమ్మలయందుఁ జేరుట సహజ మని యభిప్రాయము.

అతనుఁడు=మన్మథుఁడు; తనపురారాతిభీకరోదగ్రవిగ్రహస్ఫురణ—తన=తనసంబంధి యగు, పురారాతి=శంకరునికి, భీకర = భయప్రదమైనట్టియు, ఉదగ్ర=అధికమైనట్టియు, విగ్రహ=విరోధముయొక్క, స్ఫురణ=స్ఫురించుట; భూతిపాలుగాన్= బూడిదలో కలియగనె; చాపశరజాతములు=విల్లమ్ములసమూహములను; వనస్థలిన్=వనమందు; వైచి =పడవేసి; ఏగెన్=పోయెను. అనఁగ మన్మథుఁడు శంకరునికి భీకర మగు తనమాత్సర్యస్ఫురణము భూతిపాలు కాఁగానే అడవిలో ధనస్సును, బాణములను పాఱవైచి పోయె నని భావము. మన్మథుని విగ్రహస్ఫురణ మనఁగా శరీరస్ఫురణము. భూతిపా లనఁగా నాశరీరము భస్మీభూతము కాఁగానే, వనస్థలిన్=నీటియందు, శరజాతము లనఁగా తనకు బాణములైన అరవిందాదులను విడిచి పోయె నని స్వభావార్థము. మన్మథుని శరీరము హరనేత్రాగ్నిచే భస్మ మగుటయు, నతని బాణము లగు నరవిందాదులు జలమునందుండుటయు సహజ మని భావము.

క. ఈరీతి మునీశ్వరవా,గ్భూరీతిభయార్తచంద్ర౦కుసుమాస్త్రపికీ
కీరీతిరోహితతఁ గని, నారీతిలకంబు వెఱపు౦నన్ మదిఁ గలఁగన్. 118

టీక: ఈరీతిన్=ఈప్రకారముగ; మునీశ్వర వా గ్భూరీతి భ యార్త చంద్ర కుసుమాస్త్ర పికీ కీరీ తిరోహితతన్ – మునీశ్వర= జడదారి సామియొక్క, వాక్=శాపరూపవచన మనెడి, భూరి=అధికమగు, ఈతి=పీడవలన నైన, భయ=వెఱపుచేత, ఆర్త= పీడితులగు, చంద్ర=చంద్రునియొక్క, కుసుమాస్త్ర=మన్మథునియొక్క, పికీ=ఆఁడుకోయిలలయొక్క, కీరీ=ఆఁడుచిల్కల యొక్క, తిరోహితతన్=తిరోహితత్వమును, వెనుదిరుగుటను; కని=చూచి; నారీతిలకంబు=చిత్రరేఖ, వెఱపునన్=భయము చే, మదిన్= మన మందు; కలఁగన్=కలఁతపడఁగ. దీనికి నుత్తరపద్యస్థమగు 'పల్కు' అను క్రియతో నన్వయము.

మునీశ్వరశాపమునకు చంద్రమన్మథపికకీరములు భయముచే తిరోధానమును బొందుటను జూచి చిత్రరేఖ భయపడి కలఁత నొందె నని భావము.

ఉ. అయ్యతివర్యుఁ జేరి వినయంబున నంఘ్రుల వ్రాలి పల్కు, నో
యయ్య! భవత్ప్రభావగతి నాత్మ నెఱుంగక ప్రాజ్యగర్వసా
హాయ్యమునన్ ఘటించితి మహాగము నైన దయాత్మఁ బ్రోవవే
యియ్యెడ నీకు నే ననఁగ నెంత త్వదుక్తి మరల్చి నెమ్మదిన్. 119

టీక: అయ్యతివర్యున్=ఆమునిశ్రేష్ఠుని; చేరి=సమీపించి; వినయంబునన్=అడఁకువచేత; అంఘ్రులన్=పాదములందు; వ్రాలి =ఒరగి; పల్కున్=పలికెను; ఓ అయ్య=ఓమునినాథా! భవత్ప్రభావగతిన్ – భవత్=మీయొక్క, ప్రభావగతిన్=సామర్థ్య విధమును; ఆత్మన్=చిత్తమందు; ఎఱుంగక=తెలియక; ప్రాజ్యగర్వసాహాయ్యమునన్ – ప్రాజ్య=అధికమగు, గర్వ=అహం కారముయొక్క, సాహాయ్యమునన్=తోడ్పాటుచేత, మహాగమున్=గొప్పయపరాధమును; ఘటించితిన్=చేసితిని; ఐనన్ =అట్లైనను; ఇయ్యెడన్=ఈసమయమందు; నీకున్, నే ననఁగ నెంత=నేనెంతటిదానను, అల్పురాల ననుట; త్వదుక్తిన్=నీశాప వాక్యమును; నెమ్మదిన్=నిండుమనముచేత; మరల్చి =త్రిప్పి; దయాత్మన్=దయతోఁ గూడిన చిత్తముచేత; ప్రోవవే=కావుమా.

చ. కటకట నిర్జరీత్వ ముడుగన్ ధర మర్త్యవధూటికాత్మ నే
నెటులు జనింతు, నైన మఱి యేగతి దుష్టసమాఖ్యఁ బూని స
త్పటలవినిందనీయగతిఁ దాల్చినవాని వరించి యోర్తు, నా
వటముగ నీదుమాట మునివర్య మరల్చి దయాత్మఁ బ్రోవవే. 120

టీక: నిర్జరీత్వము=దేవాంగనాత్వము; ఉడుగన్=పోవఁగ; ధరన్=భూమియందు; మర్త్యవధూటికాత్మన్=మనుష్యాంగనా రూపముచేత; ఏనెటులు జనింతున్ = ఏవిధముగా నేను పుట్టుదును; ఐనన్=అట్లు జనించినను; మఱి యేగతి =మఱి యేరీతిగ; దుష్టసమాఖ్యన్=దుష్టనామమును; పూని=వహించి; సత్పటలవినిందనీయగతిన్ – సత్పటల =సత్సమూహమునకు, వినింద నీయ=మిక్కిలి గర్హితమగు, గతిన్=రీతిని; తాల్చినవానిన్=ధరించినవానిని; వరించి=కోరి; ఓర్తున్=సహింతును? కటకట = అతికష్టము; మునివర్య =మునిశ్రేష్ఠుఁడా! ఆవటముగన్=ఉపాయముగ; నీదుమాటన్=నీశాపరూపవాక్యమును; మరల్చి= త్రిప్పి; దయాత్మన్=దయతోఁ గూడిన చిత్తముచేత; ప్రోవవే=రక్షింపుమా.

అనఁగ మునినాథా! నీశాపమున నాదేవత్వము వీడినను సహింతును గాని, దుష్టసమాఖ్యను బూనిన మద్యపాయిని పెండ్లి యాడి యెటు లోర్తును? యుక్తిచే నీశాపోక్తిని మరల్చి, నన్నుఁ బ్రోవు మని భావము.

చ. అనువనితాప్రియోక్తిఁ గరుణాయతనాయితమానసాబ్జుఁడై
మునికులముఖ్యుఁ డిట్లను నమోఘము మద్వచనంబు లైన నే
ర్పున నిఁక దాని కన్యగతిఁ బూన్తుఁ బయోజదళాక్షి యంచుఁ బా
వననిపుణత్వరూఢి దయివాఱ యతీశుఁడు పల్కె మెండియున్. 121

టీక: అనువనితాప్రియోక్తిన్ = ఈప్రకారము పలుకుచున్న చిత్రరేఖయొక్క ప్రియమైన పలుకులను; కరుణాయతనాయిత మానసాబ్జుఁడై– కరుణా=కరుణయొక్క, ఆయతనాయిత=గృహమువలె నాచరించుచున్న, మానసాబ్జుఁడై = చిత్తకమలము గలవాఁడై; మునికులముఖ్యుఁడు=మునిశ్రేష్ఠుఁడు; ఇట్లు=వక్ష్యమాణప్రకారముగ; అనున్=పలికెను; పయోజదళాక్షి=పద్మనేత్రి వగు చిత్రరేఖా! మద్వచనంబు=నామాటలు;అమోఘములు=రిత్తవోవునవి కావు; ఐనన్=అట్లైనను; నేర్పునన్=నైపుణ్యముచేత; ఇఁకన్= ఈమీఁద; దానికిన్ = ఆశాపవాక్యమునకు; అన్యగతిన్ = అర్థాంతరమును; పూన్తున్ అంచు = కలుగఁజేతు ననుచు; పావననిపుణత్వరూఢి– పావన=పరిశుద్ధమగు, నిపుణత్వ=నైపుణ్యముయొక్క, రూఢి=ప్రసిద్ధి; దయివాఱన్=అతిశయించు నటులు; మెండియున్=మఱియును; యతీశుఁడు=మునిశ్రేష్ఠుఁడు; పల్కెన్=పల్కెను.

చ. సరసిజగంధి వింటివె సుచంద్రసమాఖ్య రహించుభూపతిం
బరిణయ మందు మంచు నలభవ్యవచస్తతి కర్థమౌట ను
ర్వర ఘనరాజవంశమున రాజిలి జిష్ణువిరోధిభేదనా
దరు నినవంశమౌళిమణిఁ దన్వి వరించి చెలంగె దెంతయున్. 122

టీక: సరసిజగంధి=పద్మముయొక్క గంధమువంటి గంధము గల చిత్రరేఖా! వింటివె =వింటివా? అలభవ్యవచస్తతికిన్ = సుదోషాకరసమాఖ్యుఁడగునొక యిరాపు ననెడి వచనజాతమునకు; సుచంద్రసమాఖ్య రహించుభూపతిం బరిణయ మందు మంచున్ = సుచంద్రుండను పేరుగల రాజును వివాహము చేసికొను మని; అర్థమౌటన్=అర్థ మగుటవలన, ఎటులనఁగ, దోషా శబ్దమునకు రాత్రి యను నర్థము, ఆరాత్రిని జేయువాఁడు దోషాకరుఁడు అనఁగా చంద్రుఁడు గావునను, సుదోషాకరుఁడన సుచంద్రుఁ డని యర్థము. ఇరా యనఁగ భూమి, 'ఇరా భూ వాక్సురాప్సు స్యాత్' అని యమరుఁడు, కావున నిరాపుఁడనఁగా భూపుఁ డని యర్థము. ఈరీతిగా సుదోషాకరాఖ్యుఁడగు నిరాపు డనఁగా సుచంద్రుఁ డను పేరుగల రాజని యర్థము; ఉర్వరన్ =భూమియందు; ఘనరాజవంశమునన్=గొప్పరాజవంశమందు; రాజిలి=ఒప్పినదానవై; జిష్ణువిరోధిభేదనాదరున్– జిష్ణు విరోధి=ఇంద్రశత్రువు లగు రాక్షసులయొక్క, భేదన=బ్రద్దలుచేయుటయందు, ఆదరున్=ఆదరముగలవానిని; ఇనవంశమౌళి మణిన్=సూర్యవంశశిరోరత్నమును; వరించి=కోరి; తన్వి=చిత్రరేఖా! ఎంతయున్=మిక్కిలి; చెలంగెదు=ఒప్పెదవు.

తే. అఖిలభూమిధురాభరణాఢ్యు నాథ,రాభుజునిఁ జెట్టవట్టి దుర్వారవిభవ
సంగతి శతసహస్రవత్సరము ధరణి, నలరి యంత భవద్రూపమందె దనిన. 123

టీక: అఖిలభూమిధురాభరణాఢ్యున్– అఖిల=సమస్తమగు, భూమిధురా=భూభారముయొక్క, భరణ=భరించుటచేత; ఆఢ్యున్=అధికుఁడగు; ఆధరాభుజునిన్=ఆరాజును (సుచంద్రుని); చెట్టవట్టి =వివాహమాడి; దుర్వారవిభవసంగతిన్– దుర్వార=అనివార్యమగు, విభవ=సంపదయొక్క,సంగతిన్=సంబంధముచేత; శతసహస్రవత్సరము=నూఱువేలసంవత్సర

ములు; ధరణిన్=భూమియందు; అలరి=ఒప్పి; అంతన్=అటుపిమ్మట; భవద్రూపము=నీదేవాంగనారూపమును; అందెదు = పొందుదువు; అనినన్=అనఁగా. దీని కుత్తరపద్యస్థక్రియతో నన్వయము. అనఁగ సార్వభౌముఁడగు సువచంద్రునిఁ బెండ్లియై లక్ష సంవత్సరములు పుడమియందుండి యామీఁద నీదేవాంగనారూపమును బొందగలవని భావము.

చ. విని ప్రమదప్రవాహపరి॥వేష్టితమానస చిత్రరేఖ యం
త నలమునీశుపాదనలి॥నంబులకుం బ్రణమిల్లి యాఘనుం
డనుప హితాళిపాళియుతి ॥నాస్థలి నల్లనఁ బాసి యాత్మకాం
చనమయకేళికానిలయ॥సంస్థలిఁ జేరె రయంబు మించఁగన్. 124

టీక: ప్రమదప్రవాహపరివేష్టితమానస – ప్రమద=సంతోషమను, ప్రవాహ=ప్రవాహముచే, పరివేష్టిత=చుట్టఁబడిన, మానస= చిత్తము గలదగు; చిత్రరేఖ, విని=మునివచనమును విన్నదై; అంతన్=అటుపిమ్మట; అలమునీశుపాదనలినంబులకున్ = ఆమునీశ్వరుని పాదకమలములకు; ప్రణమిల్లి=నమస్కరించి; ఆఘనుండు = గొప్పవాఁడైన యావసంతుఁడు; అనుపన్= పంపివేయఁగ; హితాళిపాళియుతిన్ – హిత=అనుకూలురగు, ఆళి=సకియలయొక్క, పాళి=పంక్తియొక్క, యుతిన్= కూడికచేతను; ఆస్థలిన్=ఆపారిజాతారణ్యప్రదేశమును; అల్లనన్=తిన్నగ; పాసి=వదలి; ఆత్మకాంచనమయకేళికానిలయ సంస్థలిన్ – ఆత్మ=తనయొక్క,కాంచనమయ=సువర్ణమయమగు, కేళికానిలయ=కేళీగృహముయొక్క, సంస్థలిన్ =ప్రదేశ మును; రయంబు మించఁగన్ = త్వరతోడ; చేరెన్=చేరెను. పుర్వోక్తవాక్యములను విన్నదై చిత్రరేఖ వసంతమునికి నమస్కరించి సంతసమున సకియలం గూడి స్వకీయకాంచనమయగృహమును జేరె నని భావము.

ఉ. ఆలలితాంగి యొక్క భవి॥కాహమునన్ క్షణదోదయాఖ్య పాం
చాలవసుంధరాపతికి ॥శ్యామ యనం బొగడొందు సుందరీ
మౌళియెడన్ జనించె, నల॥మానవభర్తయు భూరిహర్షభూ
షాకలితాత్ముఁడై యునిచెఁ ॥జంద్రిక యన్శుభనామ మింతికిన్. 125

టీక: ఆలలితాంగి=ఆచిత్రరేఖ; ఒక్క భవికాహమునన్=ఒకశుభదినమునందు;క్షణదోదయాఖ్యపాంచాలవసుంధరాపతికిన్ – క్షణదోదయాఖ్య=క్షణదోదయుఁ డను పేరుగల, పాంచాలవసుంధరాపతికిన్=పాంచాలదేశపురాజునకు; శ్యామయనన్ = శ్యామ యను పేరిట; పొగడొందు=ప్రసిద్ధిని పొందినట్టి; సుందరీమౌళియెడన్ = కాంతారత్నమునందు; జనించెన్=పుట్టెను; అలమానవభర్తయు=ఆక్షణదోదదయరాజును; భూరిహర్షభూషాకలితాత్ముఁడై– భూరి=అధికమగు, హర్ష=సంతసముచేత, భూషా=ఆభరణములచేతను, కలిత=పొందఁబడిన, ఆత్ముఁడై=మనమును దేహమును గలవాఁడై; ఇంతికిన్=కూఁతునకు; చంద్రికయన్శుభనామము= చంద్రిక యను శుభనామధేయమును; ఉనిచెన్=ఉంచెను.

చిత్రరేఖ పుడమియం దొకశుభదినమున పాంచాలరాజైన క్షణదోదయునికి శ్యామయను నారీరత్నమందు కూఁతురై జన్మించెను. ఆకూఁతురునకు క్షణదోదయుఁడు చంద్రిక యను మంగళకరమైన పేరును పెట్టెను.

మ. తనకార్యంబున కీగతిం జని యమ॥ర్త్యస్త్రీలలామంబు పా
వనమౌన్యుక్తి నిజాదివర్ణరహిత॥త్వం బూని ధాత్రిం జనిం

చిన వార్తన్ విని చింత నొంది మదిఁ దచ్చిత్రస్నేహంబుతో దివ్యచి
హ్నానికాయంబులు గల్గఁ జేసె నవలాలోకబ్జాసనుం డెంతయున్. 126

టీక: అబ్జాసనుండు=నలువ; తనకార్యంబునకున్=మునితపోభంగరూప స్వకార్యమునకు; ఈగతిన్=ఈరీతిగా; చని=పోయి; అమర్త్యస్త్రీలలామంబు = దేవాంగనారత్నమగు చిత్రరేఖ; పావనమౌన్యుక్తిన్ = పవిత్రమగు మునిశాపోక్తిచేత; నిజాదివర్ణరహిత త్వంబు – నిజ=అమర్త్యస్త్రీశబ్దముయొక్క, ఆదివర్ణ=ప్రథమవర్ణమగు ‘అ’ కారముయొక్క, రహితత్వంబు=రాహిత్యమును, అనఁగా ‘అమర్త్యస్త్రీ’ లోని ‘అ’ కారము తొలగుటవలన ‘మర్త్యస్త్రీ’ యైనదని భావము; ఊని=పూని; ధాత్రిన్=పుడమియందు; జనించిన వార్తన్=జన్మించెనను జనశ్రుతిని;విని=ఆకర్ణించి; చింతన్=విచారమును; ఒంది=పొంది;మదిన్=హృదయమునందు; తత్స్నేహంబుతోన్=ఆచిత్రరేఖయందలి ప్రేమచేత; నవలాకున్=చంద్రికకు; ఎంతయున్=మిక్కిలి; దివ్యచిహ్నానికాయంబులు = దివ్యమగు భాగ్యచిహ్నములయొక్క సమూహములను; కల్గన్=కల్గునట్లుగ; చేసెన్=ఒనరించెను. అనఁగఁ బారిజాతారణ్య మందు బ్రహ్మత్వమునకై తపం బొనరించు వసంతమునితపోభంగమునకుం దాను బంపిన చిత్రరేఖకు నామునిశాపమువలన మర్త్యస్త్రీత్వము రాఁగానే నలువ చింతించి, యాకాంతకు నమోఘభాగ్యచిహ్నములు గలుగఁ జేసె నని భావము.

ఉ. ఆసరసీరుహాక్షి కఖిలాద్భుతదాయివిపంచికాకలా
భ్యాస మొనర్పఁ జెంతఁ దగునట్టి ననుం గుముదాఖ్యుఁ గాంచి ప
ద్మాసనుఁ డంపఁ బూర్వసమయామితమైత్రి ధరిత్రిఁ జేరి యు
ద్భాసితతద్రహస్యగతిఁ దన్వికి నేర్పితి నేర్పు పెంపునన్. 127

టీక: ఆసరసీరుహాక్షికిన్ = ఆచంద్రికకు; అఖిలాద్భుతదాయివిపంచికాకలాభ్యాసము – అఖిల=సమస్తజనులకు, అద్భుత = ఆశ్చర్యమును, దాయి=ఇచ్చునట్టి, విపంచికాకలా=వీణావిద్యయొక్క, అభ్యాసము=నేర్పుటను; ఒనర్పన్=చేయుటకు; కుముదాఖ్యున్=కుముదుఁడను పేరుగల; చెంతన్ తగునట్టి ననున్= సమీపమునందున్న నన్ను; కాంచి = చూచి; పద్మాస నుఁడు =నలువ; అంపన్=పంపఁగా; పూర్వసమయామితమైత్రిన్– పూర్వసమయ=పూర్వకాలమందున్నట్టియు, అమిత= అధికమగునట్టియు, మైత్రిన్=స్నేహముచేతను; ధరిత్రిన్=భూమిని; చేరి=పొంది; ఉద్భాసితతద్రహస్యగతిన్– ఉద్భాసిత = ప్రకాశించుచున్న, తత్=ఆవీణావిద్యయొక్క, రహస్య=నిగూఢమగు, గతిన్ =రీతిని;తన్వికిన్=చంద్రికకు; నేర్పు పెంపునన్ = నైపుణ్యాతిశయముచేత; నేర్పితిన్=అభ్యసింపఁజేసితిని.

అనఁగ నలువ చెంతనున్న కుముదుఁడను పేరుగల నన్నుఁ జూచి, పుడమికిఁ బోయి చంద్రికకు వీణావిద్యారహస్యమును దెలుపు మనఁగా, నేను బూర్వస్నేహంబున భూమింజేరి తద్విద్యారహస్యము నామెకు నేర్పితి నని భావము.

తే. అంత నొకనాఁడు శారదాకాంతవలన
వింతరాగంబు లొకకొన్ని విని ముదమున
వాని నన్నింటి నారాజవర్యసుతకుఁ
దెలిపెద నటంచుఁ బుడమి కేతెంచు నపుడు. 128

టీక: అంతన్=అటుపిమ్మట; ఒకనాఁడు =ఒకదినమందు; శారదాకాంతవలనన్=సరస్వతీదేవివలన; వింతరాగంబులు=విచిత్ర మగు రాగములను; ఒకకొన్ని=కొన్నింటిని; విని=ఆకర్ణించి; ముదమునన్=సంతసముచేత; వాని నన్నింటిన్ = ఆరాగముల నన్నిటిని; ఆరాజవర్యసుతకున్=ఆచంద్రికకు; తెలిపెద నటంచున్ =తెలియఁజేసెద ననుచు; పుడమికి=భూమికి; ఏతెంచు నపుడు = వచ్చుచున్న సమయమందు;

సీ. కనుదోయి కింపూన్చు ◊కలికికుంకుమబొట్టు, దార్చిననెమ్మోముఁ◊దమ్మిదాని,
నీటుగాఁ దీర్చిన ◊కాటుకరేఖచే, నొప్పారు విమలాక్షి◊యుగముదాని,
నునుపు లౌ తొడలని◊గ్గున వింతవగ దోఁచు, నవ్యచీరాచ్ఛాద◊నమ్ముదానిఁ,
బసపుచాల్పూఁతచేఁ ◊బచ్చదామరపెంపు, దలఁకించు పాణిపా◊దమ్ముదాని,
తే. జలదనికటస్థలి రహించు ◊చపలవోలెఁ, బర్ణదళశాలపొంతఁ జూ◊పట్టుదాని,
నొక్క మునికాంత నీయద్రి◊చక్కిఁ గాంచి, చాల వైచిత్రి నెమ్మది ◊సందడింప. 129

టీక: కనుదోయికిన్=కనుఁగవకు; ఇంపూన్చుకలికికుంకుమబొట్టు– ఇంపు=సొంపును, ఊన్చు=చేయుచున్న, కలికి = సుందరమగు, కుంకుమబొట్టు=కాశ్మీరతిలకము; తార్చిన=దిద్దిన; నెమ్మోము తమ్మిదానిన్=అందమగు ముఖకమలము గలదానిని;
నీటుగాన్=శృంగారముగ; తీర్చినకాటుకరేఖచేన్=దిద్దినకాటుకరేకచేత; ఒప్పారు విమలాక్షియుగముదాని– ఒప్పారు =ప్రకాశించుచున్న; విమల=నిర్మలమగు; అక్షియుగముదాని = కనుదోయి గలదానిని;
నునుపు లౌ తొడలనిగ్గునన్ = నునుపులగు తొడలయొక్క కాంతిచేత; వింతవగ=ఆశ్చర్యకరమగు విలాసము; తోఁచు=ప్రకట మగుచున్న; నవ్యచీరాచ్ఛాదనమ్ముదానిన్– నవ్య=నూతనమగు, చీరాచ్ఛాదనమ్ముదానిన్ = నారకోఁకగలదానిని;
పసపుచాల్పూఁతచేన్ = పసపు సమృద్ధిగాఁ బూయుటచే; పచ్చదామరపెంపు=పసపుతామరపూలయొక్క అతిశయమును; తలఁకించు=చలింపఁజేయు; పాణిపాదమ్ముదానిన్ = హస్తపాదములు గలదానిని, ప్రాణ్యంగము లగుటచే నేకవద్భావము.
జలదనికటస్థలిన్– జలద=మేఘముయొక్క, నికటస్థలిన్=సమీపప్రదేశమునందు; రహించు =ఒప్పుచున్న; చపలవోలెన్= మెఱుపుతీఁగవలె; పర్ణదళశాల=మోదుగాకులతోఁ గప్పఁబడిన పర్ణశాలయొక్క; పొంతన్=సమీపమున; చూపట్టుదానిన్=కను పట్టుదానిని; ఒక్క మునికాంతన్= ఒకమునిపత్నిని; ఈయద్రిచక్కిన్=ఈపర్వతస్థానమందు; కాంచి = చూచి; చాల వైచిత్రి = మిక్కిలి యాశ్చర్యము; నెమ్మదిన్=మనమునందు; సందడింపన్=అతిశయింపఁగా.

చ. కళ గలమోము, కెంపుసిరి ◊గాంచినపల్దెర, తేనె లొల్కు ప
ల్కులు, బిగువైన చన్నుఁగవ, ◊కుందనపుంజిగి నేలు ముద్దుచె
క్కులు గల యాచెలిం బ్రియపుఁ◊గూర్మి వగ న్ననవిల్తుపోరునం
గలయక యున్న చోఁ దలఁపఁ◊గ్గలునొకో నవసౌఖ్యమం చొగిన్. 130

టీక: కళ గలమోము = కాంతి గల ముఖము; కెంపుసిరిన్ కాంచినపల్దెర – కెంపుసిరిన్=ఎఱ్ఱనికాంతిని; కాంచినపల్దెర=పొంది నట్టి మోవి; తేనె లొల్కు పల్కులు = మకరందమును జిల్కు మాటలు; బిగువైన చన్నుఁగవ =బిగుతుగల పాలిండ్లును;

కుందనపుంజిగిన్ = అపరంజికాంతిని; ఏలు ముద్దుచెక్కులు =గ్రహించిన సుందరమగు కపోలములు; కల =కలిగినట్టి; ఈచెలిన్ = ఈమునిపత్నిని; ప్రియపు కూర్మిన్ = ప్రియమగు చెలిమిచేతను; వగన్=విలాసముచేతను; ననవిల్తుపోరునన్= సురతమునందు; కలయక యున్న చోన్ = కూడకయుండినయెడల; నవసౌఖ్యము=నూతనమగు సుఖము; దలఁపఁగల్గు నొకో= తలఁపవచ్చునా? తలఁపరాదని భావము; అంచున్=అని తలఁచుచు; ఒగిన్=క్రమముగా.

ఉ. తాపసరాట్కుమారసమ◊తాకలితాకృతి నాత్మవిద్య మా
యాపటిమన్ ధరించి, తదు◊దారనవచ్ఛదశాలఁ జేరి, యు
ద్దీపితభక్తిఁ దన్మునిపి◊తృప్రముఖానవరక్షమీశరా
జీపదపద్మము ల్వినతి◊చేయుచు నంతటఁ దత్కథాగతిన్. 131

టీక: తాపసరాట్కుమారసమతాకలితాకృతిన్ – తాపసరాట్కుమార=మునిశ్రేష్ఠుని కుమారునియొక్క, సమతా=సమత్వముతో, కలిత=కూడుకొన్న, ఆకృతిన్=ఆకారమును; ఆత్మవిద్యన్ =స్వభావసిద్ధమైన విద్యచేత; మాయాపటిమన్ = మాయయొక్క పటుత్వము (సామర్థ్యము) చేత; ధరించి=వహించి, నామాయచేత మునిపుత్త్రాకృతిని ధరించి యని భావము; తదుదారనవచ్ఛదశాలన్ – తత్=ఆమునికుమారునియొక్క, ఉదార=ఉత్కృష్టమగు, నవ=నూతనమైన, చదశాలన్=పర్ణశాలను; చేరి =సమీపించి; ఉద్దీపితభక్తిన్=అధికమగు భక్తిచేత; తన్మునిపితృప్రముఖానవరక్షమీశరాజీపదపద్మముల్ –తన్ముని=ఆమునియొక్క,పితృ=తండ్రి, ప్రముఖ=మొదలుగాఁగల, అనవరక్షమీశ=పెద్దమునులయొక్క, రాజీ=పంక్తియొక్క, పదపద్మముల్ =పాదకమలములను; వినతిచేయుచున్=నమస్కరించుచు; అంతటన్=అటుమీఁద; తత్కథాగతిన్–తత్=ఆమునులయొక్క, కథాగతిన్=కల్పితవృత్తాంతముయొక్కరీతిచే. దీని కుత్తరపద్యమందున్న క్రియతో నన్వయము.

తే. ప్రొద్దు గడపుచు నుండ మ◊త్పూర్వకర్మ
గౌరవమ్మున నమ్ముని◊కాంతుఁ డచటి
కుట్టిపడ్డట్లు కన్నూడి◊నట్టు లపుడు
వేగమున వచ్చెఁ దత్సభ ◊వెఱఁగుపడఁగ. 132

టీక: ప్రొద్దు గడపుచు నుండన్=పూర్వోక్తకథచేఁ కాలము బుచ్చుచుండఁగ; మత్పూర్వకర్మగౌరవమ్మునన్ – మత్=నాయొక్క, పూర్వకర్మ=పూర్వజన్మదుష్కర్మముయొక్క, గౌరవమ్మునన్= ఆధిక్యతచేత; అమ్మునికాంతుఁడు = ఆ మునినాథుఁడు; అచటికిన్=ఆపర్ణశాలకు; ఉట్టిపడ్డట్లు=హఠాత్తుగ; కన్నూడినట్టులు=నేత్రములూడిన విధముగ; అపుడు = ఆ సమయమునందు; తత్సభ =ఆసభ; వెఱఁగుపడఁగన్=ఆశ్చర్యమునందు నటులు; వేగమున=శీఘ్రముగ; వచ్చెన్.

ఉ. వచ్చిన నమ్మునీశుఁ గని ◊వారక గుండియ వ్రీల నంత నే
నచ్చటఁ దెచ్చుకోలు ధృతి ◊నయ్యతితో శపనోక్తిజాలకం
బెచ్చఁగఁ బెద్దప్రొద్దు కల◊హించితి నప్డు పరస్పరోగ్రఘో
షోచ్చలితాత్మతన్ సభ య◊హో యని యబ్బుర మూని నిల్వఁగన్. 133

టీక: వచ్చినన్=రాఁగానే; అమ్మునీశున్=ఆమునినాథుని; కని =చూచి; వారక=నిలువక; గుండియ=హృదయము; వ్రీలన్ =చీలఁగ; అంతన్=ఆమీఁద; నేను, అచ్చటన్ =ఆస్థలమందు; తెచ్చుకోలు ధృతిన్ =తెచ్చిపెట్టుకొన్న ధైర్యముచేత; అయ్యతి తోన్ =ఆమునితోడ; శపనోక్తిజాలకంబు– శపనోక్తి=తిట్టులయొక్క, జాలకంబు=సమూహము; ఎచ్చఁగన్=అతిశయింపఁగ; పెద్దప్రొద్దు=దీర్ఘకాలము; సభ =సభయందుండిన జనులు; పరస్పరోగ్రఘోషోచ్చలితాత్మతన్– పర స్పర=మా యన్యోన్యుల యొక్క, ఉగ్ర=తీక్ష్ణమగు, ఘోష=ధ్వనిచేత, ఉచ్చలిత=మిక్కిలి చలించిన;ఆత్మతన్=మనసుగలవా రగుటచేత; అహో యని = అహోయనుచు; అబ్బురము =ఆశ్చర్యమును; ఊని=పూని; నిల్వఁగన్=నిలుచుండఁగ; అప్డు =ఆసమయమందు; కలహించితిన్ = జగడమాడితిని.

క. ఆయతిపతి యాయెడ మ
న్మాయాగతి నెల్లఁ దెలిసి నన్గాంచి మనో
భూయఃపరికందళితమ
హీయఃప్రతిఘరసాప్తి నిట్లని పలికెన్. 134

టీక: ఆయతిపతి=ఆమునిరాజు; ఆయెడన్=ఆసమయమందు; మన్మాయాగతిన్– మత్=నాయొక్క, మాయాగతిన్= కపటరీతిని; ఎల్లన్=అంతయు; తెలిసి=తెలిసికొని; నన్గాంచి=నన్నుఁ జూచి; మనోభూయఃపరికందళితమహీయః ప్రతిఘరసాప్తిన్– మనః=మనమునందు, భూయః=అధికముగా, పరికందళిత=అంకురించినట్టియు, మహీయః= అధికమగు, ప్రతిఘరస=క్రోధరసముయొక్క, ఆప్తిన్=ప్రాప్తిచేత; ఇట్లని పలికెన్ =ఈరీతిగా ననెను.
ఆమునినాథుఁడు నాకపటము నంతయు నెఱిఁగినవాఁడై, కోపగించి వక్ష్యమాణప్రకారముగఁ బలికె నని భావము.

శా. ఓరీ కిన్నర! యిట్లు పాపమతివై యుద్వృత్తి మౌనీశ్వరా
కారం బూని మందగనైకరతికాంక్షాయుక్తిచే మీఱి యౌ
రా రాఁ జెల్లునె యిప్డు నీవు పవిధారారూపశాపోక్తి దు
ర్వారేభాహితమూర్తివై పొడమరా వైళంబె యియ్యద్రిపైన్. 135

టీక: ఓరీ కిన్నర=ఓ కిన్నరుఁడా! ఇట్లు=ఈప్రకారము; పాపమతివై =పాపబుద్ధి గలవాఁడవై; ఉద్వృత్తిన్=దుష్టవృత్తిచేత; మౌనీశ్వరాకారంబు = మునివేషమును; ఊని = ధరించి; మందగనైకరతికాంక్షాయుక్తిచేన్– మందగనా = నాభార్యయొక్క, ఏక= ముఖ్యమగు, రతి=సురతమునందలి, కాంక్షా=కోరికతోడి, యుక్తిచేన్=కూడికచే; మీఱి=అతిక్రమించి; రాఁ జెల్లునె = రాఁదగునా? ఔరా=ఆశ్చర్యము; ఇప్డు =ఆసమయమందు; నీవు, పవిధారారూపశాపోక్తిన్– పవి=వజ్రాయుధముయొక్క, ధారారూప=వాదరవంటిదగు,శాపోక్తిన్=శాపవచనముచేత;వైళంబె =శీఘ్రముగనే; ఇయ్యద్రిపైన్=ఈపర్వతముమీఁద; దుర్వారేభాహితమూర్తివై– దుర్వార = నివారించుటకు శక్యము గాని, ఇభాహితమూర్తివై = సింహ (గజరిపు)శరీరముగల వాఁడవై; పొడమరా = జన్మింపుమురా.

చ. అని ముని శాప మిచ్చిన భయంబు మనంబున నిండి యుండ న
య్యనఘుని పాదపద్మముల నయ్యెడఁ జయ్యన వ్రాలి భక్తిచే

కొని యిటు లంటి, నో నియమి౦కుంజర! మీరు మహాగసుండ నై
నను నను౯ బ్రోవ రయ్య కరు౦ణాసదనం బగు మానసంబునన్. 136

టీక: ముని =జడదారి; అని=ఈప్రకారముగ; శాప మిచ్చినన్=శాప మీయఁగా; భయంబు=వెఱపు;మనంబునన్=మనస్సునందు; నిండియుండన్=పరిపూర్ణమయి యుండఁగా; అయ్యనఘునిపాదపద్మములన్ = పుణ్యాత్ముఁడగు నామునియొక్క పాదకమలములందు; అయ్యెడన్=ఆసమయమందు; చయ్యనన్=శీఘ్రముగ; వ్రాలి=ఒరగి; భక్తిచేకొని =భక్తి వహించి; ఇటు లంటి=వక్ష్యమాణప్రకారముగఁ బలికితిని; ఓనియమికుంజర = ఓమునిశ్రేష్ఠుఁడా! మీరు, మహాగసుండను = నేను గొప్ప యపరాధము గలవాఁడను; ఐనను =అట్లైనను; ననున్, కరుణాసదనం బగు మానసంబునన్ =దయకు నెలవైన మనస్సుతో; ప్రోవ రయ్య = రక్షింపుఁడయ్య.

మ. వనజంతూత్కరహింసనోగ్రతరదు౦ర్వ్యాపారసంలబ్ధి మే
దిని౯ గన్పట్టు మతంగజారివరమూ౦ర్తిం బూని వర్తింప నో
ర్తునె యయ్యో మునివర్య యిప్డు నవకా౦రుణ్యంబు నాపై ఘటిం
చి ననుం బ్రోవవె పాపవే మదుపల౦క్ష్యీభూతశాపోక్తికన్. 137

టీక: వనజంతూత్కరహింసనోగ్రతరదుర్వ్యాపారసంలబ్ధిన్– వనజంతు=అడవిమృగములయొక్క, ఉత్కర= సమూహము యొక్క, హింసన=సంహరించుటయందు, ఉగ్రతర=అతితీక్ష్ణమగు, దుర్వ్యాపార=దుష్టవృత్తియొక్క, సంలబ్ధిన్=ప్రాప్తిచేత; మేదినిన్=భూమియందు; కన్పట్టు=చూపట్టుచున్న; మతంగజారివర=సింహశ్రేష్ఠముయొక్క; మూర్తిన్=శరీరమును; పూని =గ్రహించి; వర్తింపన్=ఉండుటకు; ఓర్తునె=సహింతునా? అయ్యో =అకటా! మునివర్య=మునిశ్రేష్ఠుఁడా! ఇప్డు=ఈసమయమందు; నవకారుణ్యంబు=నూతనమగు దయను; నాపైన్=నాయందు; ఘటించి=ఉంచి;ననున్, ప్రోవవె =రక్షింపవే; మదుపలక్ష్యీభూతశాపోక్తికన్– మత్=నేను, ఉపలక్ష్యీభూత=లక్ష్యముగాఁ గలదైన, శాపోక్తికన్ = శాపవచనమును; పాపవే =తొలగింపుమా!

తే. అన దయామయమానసుం ౦డగుట మౌని
మామకీనోక్తి నిజ, మైన ౦మయుకులేంద్ర!
వర్షపంచకము హరీంద్ర౦భావ మూని
యంత నీరూప మందెద ౦వనుచు ననిచె. 138

టీక: అనన్=ఇట్లు ప్రార్థింపఁగా; దయామయమానసుండు=కృపామయమగు హృదయము గలవాఁడు; అగుటన్ = కావుట వలన; మౌని=జడదారి; మామకీనోక్తి =నామాట; నిజము=సత్యమైనది; ఐనన్=అయినను; మయుకులేంద్ర= కిన్నర శ్రేష్ఠుఁడా, 'తురఙ్గవదనో మయుః' అని యమరుఁడు; వర్షపంచకము=ఐదేండ్లు; హరీంద్రభావము=సింహత్వమును;ఊని=పొంది; అంతన్ =ఆమీఁద; నీరూపము=నీపూర్వరూపమును; అందెదవు=పొందెదవు; అనుచు = అని పలుకుచు; అనిచెన్=పంపెను.

చ. అనిచిన నేను నమ్మునికులాగ్రణికిం బ్రణమిల్లి మన్మనో
మనసిజశాంబరీకులచమత్కృతి యెంతకుఁ దెచ్చె నంచుఁ బా
యని పెనుచింతతోఁ గలఁగ నాంతర మేనటు వాసి యీవినూ
తనమణిమండపోత్తమము దారునఁ జేరి వసించి యున్నెడన్. 139

టీక: అనిచినన్=పంపఁగా; నేను, అమ్మునికులాగ్రణికిన్ = ఆమునిశ్రేష్ఠునికి; ప్రణమిల్లి =నమస్కరించి; మన్మనో మనసిజ శాంబరీకుల చమత్కృతి – మత్=నాయొక్క, మనః=మనస్సునందలి, మనసిజ=మన్మథునియొక్క, శాంబరీకుల = మాయా బృందముయొక్క, చమత్కృతి=చమత్కారము; ఎంతకు దెచ్చె నంచున్ = ఎంత పని (హాని) చేసె ననుచు; పాయని=వీడని; పెనుచింతతోన్=అధికమైన విచారముతో; ఆంతరము=అంతరంగము; కలఁగన్=కలఁతపడఁగ; ఏను=నేను; అటు పాసి =ఆ స్థలమునువిడిచి; ఈవినూతనమణిమండపోత్తమము=ఈక్రొత్తరవలచవికను; దారునన్= శీఘ్రముగ; చేరి =ప్రవేశించి; వసించి ఉన్నెడన్= కూర్చుండి యున్న సమయమందు.

సీ. కురువిందరుచి నాజిఁ గుదియించు రదరాజి, వక్రతాశాతతావళిత మయ్యె,
నెలపుల్గుకవడంబు గలఁచునేత్రయుగంబు, వృత్తతాహరితతాయత్త మయ్యె,
నంబుదావళినీలి నడఁచుశిరోజాళి, ఖర్వతాశోణతాకలిత మయ్యె,
నలరుతామరగోము నలయించునెమ్మోము, వివృతతా విపులతాభివృత మయ్యె,
తే. నహహ యని పశ్యదఖిలవాహాస్యవితతి, విస్మయం బూన బుధవర్ణ్యవిమలరూప
గౌరవంబున మించు మద్గాత్ర మపుడు, భీమకంఠీరవాకృతిస్థేమ గనియె. 140

టీక: కురువిందరుచిన్=పద్మరాగమణికాంతిని; ఆజిన్=యుద్ధమందు; కుదియించురదరాజి=క్రుంగజేయుచున్న దంతపంక్తి, పద్మరాగములను దిరస్కరించు దంతపంక్తి యని భావము; వక్రతాశాతతావళితము– వక్రతా=కుటిలత్వముచేతను, శాతతా = తీక్ష్ణత్వముచేతను, వళితము=చుట్టఁబడినది; అయ్యెన్=ఆయెను.
నెలపుల్గుకవ డంబు– నెలపుల్గుకవ=చకోరమిథునముయొక్క, డంబు=గర్వమును; కలఁచునేత్రయుగంబు = కలఁత పఱచు కనుదోయి; వృత్తతా హరితతాయత్తము– వృత్తతా=వర్తులత్వమునకు, హరితతా=పీతత్వమునకు,ఆయత్తము=స్వాధీనము; అయ్యెన్=ఆయెను.
అంబుదావళి=మేఘపంక్తియొక్క; నీలిన్ =నల్లఁదనమును; అడఁచుశిరోజాళి=అడఁగద్రొక్కు కురులగుంపు; ఖర్వతాశోణతా కలితము– ఖర్వతా=కుఱుచఁదనముచేతను, శోణతా=రక్తత్వముచేతను, ఆకలితము=పొందఁబడినది; అయ్యెన్= ఆయెను.
అలరుతామరగోమున్– అలరు=ప్రకాశించు,తామర=కమలముయొక్క, గోము=సౌకుమార్యమును, అందము ననుట; అలయించు నెమ్మోము = శ్రమపఱచుచున్న చక్కనిముఖము; వివృతతా విపులతాభివృతము– వివృతతా = తెఱచుకొని యుండుటచేతను, విపులతా=వైశాల్యముచేతను, అభివృతము = ఆవరింపఁబడినది; అయ్యెన్ = ఆయెను.
అహహ యని = ఆశ్చర్య మాశ్చర్య మని; పశ్యదఖిలవాహాస్యవితతి– పశ్యత్=చూచుచున్నట్టియు, అఖిల=సమస్తమైన, వాహాస్యవితతి =కిన్నరుల బృందము; విస్మయంబు=ఆశ్చర్యమును; ఊనన్=పొందఁగా; బుధవర్ణ్యవిమలరూపగౌరవంబునన్– బుధ=దేవతలచేత, వర్ణ్య=పొగడఁదగిన, విమల=స్వచ్ఛమగు, రూప=సౌందర్యముయొక్క, గౌరవంబునన్= అతిశ

యముచేత; మించు=ఒప్పునట్టి; మద్గాత్రము=నాశరీరము; అపుడు=ఆసమయమందు; భీమ కంఠీర వాకృతి స్థేమన్– భీమ= భయంకరమగు, కంఠీరవ=సింహముయొక్క, ఆకృతి=ఆకారముయొక్క, స్థేమన్=స్థైర్యమును; కనియెన్=పొందెను.

అనఁగఁ బద్మరాగములవంటి నాదంతములు కుటిలములై పదనుగలవైనవి. చకోరయుగమువంటి నాకనుదోయి గుండ్రమై హరితవర్ణము గలదయ్యెను. మేఘపంక్తివలె నల్లనైన నాకురులు కుఱుచనివై యెఱ్ఱనైనవి. కమలమువంటి నామోము తెఱవఁబడి నదై విశాల మయ్యెను. ఇట్లు నాశరీరము కిన్నరబ్బందము చూచుచుండఁగ భయంకర మగు సింహాకృతిని బొందె నని భావము.

వ. ఇట్టు లతులనాగవిదళనవ్యాపార నవీనశతమఖకరవాలాయమాన ఖరనఖరంబులును, నక్షీణమృగ క్షతజకటాజ్యధారా సముజ్జ్వల జ్జఠరజ్వలన సమున్నత జ్వాలాయమాన రసనాకిసలయంబును, నమందతుంద కారామందిర బందీకృత స్వభృత సారంగకులీన సారంగవిమోచనలాలసా విలసనోత్త మాంగ రాజసదన వదనద్వారాశ్రిత చంద్రరేఖాయమాన వక్రదంష్ట్రాయుగంబును, నాత్మీయహరి తానుబోధక భాస్వద్విరోచనమండలాయమాన నిస్తులలోచనద్వయంబును, నలయప్రభావోరరీకృ తాఖిలజంతు నికృంతన తంతన్యమాన చాతుర్యపృష్ఠేకృత కీనాశపాశాయమాన దీర్ఘవాలంబును, నతిఘనఘనాఘనస్థైర్య సమున్మీలనశీల నిబిరీసనిశ్వాసమారుత ప్రచారకారణ మహాబిలాయమాన నాసారంధ్రంబును, గల సింహాకారంబు నివ్వటిల్ల నుల్లంబు జల్లు మన మదాప్తజనంబులు చెంతల నిలువ లేక యెల్లెడలకుం జన సకలజగద్వార పారావారగిళనపానసమ ర్థాక్షుద్రక్షుధోదన్యా పరి క్షుభితమానసంబు పక్షీకరించి యనేకకాంతారజంతుసంతానంబుల మెక్కుచుఁ, దదీయాసృక్పూ రంబు గ్రోలి సొక్కుచు, దుష్టవర్తనంబున నింతకాలం బిచ్చటఁ దిరిగి తిరిగి భవత్కరహేతిధారామాహా త్మ్యంబునఁ బూర్వరూపంబు గంటి, నీవలన మంటి నిన్ను నేమని సన్నుతింతు నని యత్తురంగవద నుండు వెండియుఁ బ్రణామంబులు గావించి యవ్విభుండు నయభాషణంబుల నుపలాలింప నానం దించె నప్పుడు. 141

టీక: ఇట్టులు=ఈప్రకారము; అతులనాగ విదళనవ్యాపార నవీన శతమఖ కరవాలాయమాన ఖర నఖరంబులును– అతుల= సాటిలేని, నాగ=ఏనుఁగు లనెడు, అతులన=సాటిలేని, అగ=కొండలయొక్క, కొండలవంటి తులలేని గజముల ననుట, విద ళనవ్యాపార=బ్రద్దలుచేయు నుద్యోగమునందు, నవీన=నూతనమగు, శతమఖ=ఇంద్రునియొక్క,కరవాలాయమాన =వజ్రా యుధమువలె నాచరించుచున్న, ఖర=తీక్ష్ణములగు, నఖరంబులును=గోళ్లను; అక్షీణ మృగక్షతజ కటాజ్యధారా సముజ్జ్వల జ్జఠరజ్వలన సమున్నత జ్వాలాయమాన రసనాకిసలయంబును– అక్షీణ=ఎడతెగని, మృగక్షతజ= మెకములనెత్తురను, కట=అధికమగు, ఆజ్యధారా=ఘృతధారచేత, సముజ్జ్వలత్=మండుచున్న, జఠరజ్వలన=జఠరాగ్ని యొక్క, సమున్నత= నిడుదయగు, జ్వాలాయమాన =మంటవలెనాచరించుచున్న, రసనాకిసలయంబును=లేయాకువలె నున్న నాలుకయును; అమంద తుంద కారామందిర బందీకృత స్వభృత సారంగకులీన సారంగ విమోచన లాలసా విలస నోత్తమాంగ రాజసదన వదన ద్వారాశ్రిత చంద్రరేఖాయమాన వక్రదంష్ట్రాయుగంబును– అమంద=అధికమగు, తుంద=కడు పనెడు, కారామందిర= చెఱసాలయందు, బందీకృత=చెరవేయఁబడిన, స్వభృత=తనచేఁ బోషింపఁబడిన, సారంగకులీన =మృగ(లేళ్ల)జాతియందుఁ

బుట్టిన, సారంగ=కురంగములయొక్క, విమోచన=విడిపించుటయందలి, లాలసా=ఆసక్తియొక్క, విలసన=విలాసముచేత, ఉత్తమాంగ=శిరస్సనెడు, రాజసదన=రాజగృహముయొక్క, వదన =ముఖమనెడు, ద్వార=వాకిటిని, ఆశ్రిత=ఆశ్రయించిన, చంద్రరేఖాయమాన=చంద్రరేఖవలె నాచరించుచున్న, వక్ర= వంకరమైన, దంష్ట్రాయుగంబును =కోఱజంటయును; ఆత్మీయ హరి తానుబోధక భాస్వ ద్విరోచన మండలాయమాన నిస్తులలోచనద్వయంబును – ఆత్మీయ=తనసంబంధి యగు, హరితా= సింహత్వమునకు, అనుబోధక = సూచకమగు, భాస్వత్=ప్రకాశించుచున్న, విరోచన=అగ్ని యొక్క, మండలాయమాన= కుప్పవలె నున్న, నిస్తుల = సాటిలేని, లోచన ద్వయంబును=నేత్రయుగ్మమును, ఇచట హరితా=విష్ణుత్వమును, అనుబోధక= సూచించునవియు, భాస్వత్= ప్రకాశించుచున్న వియు నగు, విరోచనమండలాయమాన=సూర్యచంద్రమండలములవలె నాచ రించుచున్న కనుఁగవ యని యర్థాంతరము దోఁచుచున్నది. 'వహ్నీందుర్కా విరోచనాః' యని రత్నమాల; అలయ ప్రభావో రరీకృ తాఖిల జంతు నికృంతన తంతన్యమాన చాతుర్య పృష్ఠీకృత కీనాశ పాశాయమాన దీర్ఘవాలంబును – అలయ=నాశము లేని, ప్రభావ=మహిమచేత, ఉరరీకృత=అంగీకరింపఁబడిన, అఖిల=సమస్తమైన, జంతు=ప్రాణులయొక్క, నికృంతన=ఛేదన మందు, తంతన్యమాన =మిక్కిలి వృద్ధిఁ బొందుచున్న, చాతుర్య=నేర్పుచేత,పృష్ఠీకృత=పృష్ఠభాగమందుంపఁబడిన, కీనాశ =యమునియొక్క, పాశాయమాన=పాశాయుధమువలె నాచరించుచున్న, దీర్ఘవాలంబును =పొడవైన తోఁకయును; అతిఘన ఘనాఘనస్థైర్యసమున్మీలనశీల నిబిరీస నిశ్వాసమారుత ప్రచార కారణ మహాబిలాయమాన నాసారంధ్రంబును – అతిఘన= మిక్కిలి యధికమైన, ఘనాఘన=మత్తగజము లను వర్షాకాలమేఘములయొక్క, స్థైర్య=దార్ఢ్యముయొక్క, సమున్మీలన= ఉత్పాటనము, శీల=స్వభావముగాఁ గల, నిబిరీస=దట్టమగు, నిశ్వాసమారుత=నిట్టూర్పువాయువుయొక్క, ప్రచార=సంచా రమునకు, కారణ=హేతుభూతమగు, మహాబిలాయమాన=ఆకాశమువలె నాచరించుచున్న, 'మేఘద్వారం మహాబిలమ్' అని యమరుఁడు, నాసారంధ్రంబును=నాసికారంధ్రమును; కల = ఉన్నట్టి; సింహాకారంబు =సింహముయొక్క స్వరూపము; నివ్వటిల్లన్=ఒప్పుచుండఁగ; ఉల్లంబు=మనము; జల్లుమనన్=తల్లడిల్లఁగా ననుట; మదాప్తజనంబులు=నామిత్రులు; చెంతలన్ =సమీపమందు; నిలువ లేక =నిలుచుండలేక;ఎల్లెడలకున్=అంతటను; చనన్=పోఁగా; సకల జగద్వార పారావార గిళన పాన సమర్థాక్షుద్ర క్షుధోదన్యా పరిక్షుభిత మానసంబు–సకల=సమస్త మగు, జగద్వార(జగత్+వార)=లోకసమూహముయొక్క, పారావార=సముద్రములయొక్క, గిళన=తినుటయందు, పాన=త్రాగుటయందు, సమర్థ=శక్తిగల, అక్షుద్ర=అధికమగు, క్షుధా+ఉదన్యా=ఆఁకలిదప్పులచేత, పరిక్షుభిత= క్షోభపడిన, మానసంబు=హృదయమును; పక్షీకరించి =అంగీకరించి; అనేక కాంతార జంతు సంతానంబులన్ – అనేక=అసంఖ్యాకములగు, కాంతార=అరణ్యమందలి,జంతు=మృగములయొక్క, సంతానంబులన్=గుంపులను; మెక్కుచున్=తినుచు; తదీయాసృక్పూరంబున్ – తదీయ =ఆమృగసంబంధమైన, అసృక్ =రక్తముయొక్క, పూరంబున్=ప్రవాహమును; క్రోలి=పానముఁ జేసి; చొక్కుచున్=పరవశత నొందుచు; దుష్టవర్తనంబునన్= చెడువృత్తిచేత; ఇంతకాలంబు= ఇంతవఱకు; ఇచ్చటన్=ఈపర్వతమందు; తిరిగి తిరిగి =క్రుమ్మరిక్రుమ్మరి; భవ త్కరహేతి ధారా మాహాత్మ్యంబునన్ – భవత్ =మీయొక్క, కర=హస్తమందలి, హేతి=ఖడ్గముయొక్క,ధారా=వాదరయొక్క, మాహా త్మ్యంబునన్=మహిమచేత; పూర్వరూపంబున్ = పూర్వమందున్న కిన్నరరూపమును; కంటిన్=పొందితిని; నీవలనన్= నీ కారణముగ; మంటిన్=జీవించితిని; నిన్ను, ఏమని సన్నుతింతున్=ఏమని కొనియాడెదను; అని=అనుచు; అత్తురగవదనుండు =ఆకిన్నరుఁడు; వెండియున్=మఱియును; ప్రణామంబులు=వందనంబులను; కావించి =చేసి; అవ్విభుండు=ఆసుచంద్రుఁడు; నయభాషణంబులన్=అనునయోక్తులచేత; ఉపలాలింపన్=ఊఱడింపఁగ; ఆనందించెన్=సంతసించెను; అప్పుడు=ఆసమయ మందు.

అనఁగ, వజ్రాయుధతుల్యము లగు తీక్ష్ణనఖములును, అధికమగుమేకంబుల రక్తమను ఘృతధారచేతఁ బైకెగయు జఠ రాగ్నిమంటవలె నున్న నాలుకయు, అధిక మగు కడుపనెడు కారాగృహమందు బంధింపఁబడిన స్వపోషితమృగసంబంధి మృగంబులను విడిపించుటకై యక్కఱఁబూని శిరమనురాజస్థానమునకు ద్వారమయిన ముఖమునం గాచికొని యున్న చంద్ర రేఖవలె నుండు కోఱలును, నిప్పులకుప్పవలె నున్న కనుఁగవయు, సర్వప్రాణుల సంహరించు యముని దండమువలె నున్న వాలదండమును, కాలమేఘంబులఁ దూలించు గాఢమారుతమునకు స్థానంబగు నాకసంబువలె మత్తగజంబులఁ బొఱిండ్రోలు నిట్టూర్పులకుఁ జోటై యున్న నాసారంధ్రంబులు గల్గి, సింహాకృతిఁ బూని నిలువఁ, జెంగట నున్న సంగడికాండ్రు విడిచి పరు విడుటయు, నంత నాకు మున్నీటినీటి నెల్లంగ్రోలునంతటి నీరువట్టును, నెల్లజగంబులం దినునంతటి యాఁకలియును బొడమ, నీయడవిలో నుండు మెకంబుల నెల్ల మెక్కుచు నింతకాలం బిచ్చట విచ్చలవిడిఁ గ్రుమ్మరుచుండి, నీఖడ్గమహిమంబున నాతొంటి రూపంబు గంటి నని సుచంద్రునితోఁ గుముదుండు విన్నవించె నని భావము.

తే. వరకలాసాంద్రుఁ డైన యా॰వసుమతీశ
చంద్రు నలగోనికాయప్ర॰చారమహిమ
కుముదుఁ డతిమంజులామోద॰సమితి నలరె
పుష్కరచరాళి వైచిత్రిఁ ॰బొందుచుండ. 142

టీక: వరకలాసాంద్రుఁడు – వర=శ్రేష్ఠమగు, కలా=విద్యలచేత, సాంద్రుఁడు=నిండినవాఁడు; ఐన=ఐనట్టి; ఆవసుమతీశచంద్రు నలగోనికాయ ప్రచార మహిమ – ఆవసుమతీశచంద్రు =రాజశ్రేష్ఠుఁడగు నాసుచంద్రునియొక్క, అలగోనికాయ= ఆవాక్య సమూహముయొక్క, ప్రచార=ప్రసక్తియొక్క, మహిమ=సామర్థ్యముచేత; ఆవసుమతీశ =ఆరాజనెడి, చంద్రు= నిశాపతి (చంద్రుని) యొక్క, అలగోనికాయ=ఆకిరణపుంజముయొక్క, ప్రచారమహిమచేత నని యర్థాంతరము దోఁచుచున్నది. కుముదుఁడు= కుముదుఁడను పేరుగల కిన్నరుఁడు; అతి మంజులామోద సమితిన్ – అతి=అధికమగు, మంజుల=మనోజ్ఞ మగు, ఆమోద= సంతసముయొక్క, పరిమళముయొక్క, సమితిన్=సమూహముచే; పుష్కరచరాళి=దేవబృందము; అర్థాం తరమున, పుష్కర =కమలములను, చర=పొందిన, అళి=భృంగము; వైచిత్రిన్=విచిత్రతను; పొందుచుండన్, అలరెన్ = సంత సించెను.

అనఁగ విద్యలచే పరిపూర్ణుం డగు సుచంద్రునియొక్క వచనకదంబముచేఁ గుముదుఁ డను కిన్నరుఁడు దేవతలు చూచి వైచిత్రిని పొందుచుండఁగ సంతసించె నని భావము. కాంతులచే పరిపూర్ణుం డగు చంద్రునియొక్క కిరణపుంజముచేత కలువ మనోజ్ఞమగు పరిమళముతో భృంగములు సంతోషించునట్లు వికసించి ప్రకాశించె నని యర్థాంతరమునకు భావము.

మ. కలితారాతివిరామ, రామరుచిసం॰గప్రస్ఫురద్ధామ, భా
మలవక్త్రాహతసోమ, సోమనుతశుం॰భద్భూరిసంగ్రామ, గ్రా
మలసద్వేణుసకామ, కామకలిసం॰పల్లాలసశ్యామ, శ్యా
మలరోచిశ్చయవామ, వామనతనూ॰మాన్యత్రిలోకీక్రమా! 143

టీక: కలితారాతివిరామ– కలిత=చేయ(బడిన, అరాతి=శత్రువులయొక్క, విరామ=నాశముగలవా(డా, రామ రుచి సంగ ప్రస్ఫుర ద్భామ– రామ=మనోహరమగు, రుచి=కాంతియొక్క, సంగ =సంబంధముచేత, ప్రస్ఫురత్ =ప్రకాశించుచున్న, భామ =సూర్యు(డుగలవా(డా, 'భామః క్రోధేరవౌ దీప్తౌ' అని విశ్వము. సూర్యబింబమందుండు నారాయణమూర్తి తన కాంతి పుంజములచే నాసూర్యుని(బ్రకాశింప(జేయువా(డని భావము; భామల వక్త్రాహత సోమ– భా=కాంతిచేత, అమల= స్వచ్ఛమగు, వక్త్ర=ముఖముచేత, ఆహత=కొట్ట(బడిన, సోమ =చంద్రు(డు గలవా(డా, సోమ నుత శుంభ ద్భూరి సంగ్రామ– సోమ= శివునిచేత, నుత=ప్రశంసింప(బడిన, శుంభత్=ప్రకాశించుచున్నట్టి, భూరి=అధికమైన,సంగ్రామ = యుద్ధము గలవా(డా; గ్రామ లస ద్వేణు సకామ– గ్రామ=స్వరసందోహముచేత, లసత్=ప్రకాశించుచున్న, వేణు=మురళియందు, సకామ= కోరికతో(గూడినవా(డా, కామకలి సంప ల్లాలస శ్యామ– కామకలి=మన్మథయుద్ధముయొక్క, సంపత్ = సంపదయందు, లాలస= ఆసక్తి గల, శ్యామ= కాంతలు గలవా(డా; శ్యామలరోచి శ్చయ వామ– శ్యామలరోచిః=నల్లనికాంతులయొక్క, చయ=సమూహముచేత, వామ= మనోహరు(డైనవా(డా; వామనతనూ మాన్య త్రిలోకీక్రమా – వామనతనూ = త్రివిక్రమాకృతిచేత, మాన్య = పూజ్యమైన, త్రిలోకీ క్రమా =ముల్లోకములయందు(బాదన్యాసము గలవా(డా!

క. సత్యాహితాంతరంగా, సత్యాశయపుండరీక॥చంచద్భృంగా,
సత్యాత్మకగుణసంగా, సత్యాలయయోగియోగ॥సంతతరంగా! 144

టీక: సత్యాహి తాంతరంగా– సత్యా=సత్యభామయందు, 'నామైకదేశే నామగ్రహణ' మను న్యాయమువలన సత్యభామా నామైకదేశమగు సత్యాశబ్దమునకు సత్యభామ యని యర్థమని యెఱుంగునది, ఆహిత=ఉంప(బడిన, అంతరంగా =మనస్సు గలవా(డా, సత్యభామయందు ఆసక్తి గలవా(డని భావము; సత్యాశయపుండరీక చంచ ద్భృంగా– సతీ= పార్వతీదేవియొక్క, ఆశయపుండరీక = హృత్కమలమందు, చంచత్=చలించుచున్న, భృంగా =తుమ్మెదరూప మైన వా(డా, పార్వతి తన హృత్పుండరీకమున నెల్లపుడు నారాయణమూర్తిని ధ్యానించుచున్నదని భావము; సత్యాత్మక గుణ సంగా– సత్యాత్మక = సత్యరూపమగు, గుణ=శౌర్యాదిగుణములయొక్క, సంగా = సంబంధము గలవా(డా; సత్యాలయ యోగి యోగ సంతత రంగా – సత్య=సత్యలోకమే, ఆలయ = నివాసముగా(గల, యోగి=మునులయొక్క, యోగ=ధ్యానమె, సంతత=ఎల్లపుడును, రంగా =నాట్యస్థానముగా(గలవా(డా!
సత్యలోకమందు వసించి తపం బొనరించు మునుల ధ్యానమునందు నెడ(బాయకుండు వా(డని భావము.

ఉత్సాహవృత్తము: కరివరాంగబహులభంగ॥కరణసంగతగ్రహా
చరరథాంగ! హరిశతాంగ॥జనక! రంగదద్రిజాం
తరసుమంగళాబ్జభృంగ!॥తతపతంగమందిరా!
పరభుజంగరిపుతురంగ!॥ప్రబలరంగభూషణా! 145

టీక: కరివ రాంగ బహుల భంగకరణ సంగత గ్రహాచర రథాంగ– కరివర=గజేంద్రునియొక్క, అంగ =దేహమును, బహుల= అనేకప్రకారములు, భంగకరణ = నాశము సేయుటయందు, సంగత = ఆసక్తమైన, గ్రహ=మొసలియొక్క,ఆచర = సంహారకమగు, రథాంగ = చక్రాయుధము గలవా(డా, గజేంద్రునిం బట్టుకొన్న మొసలిని సంహరించిన చక్రాయుధము గలవా(డని భావము; హరి శతాంగ జనక– హరి=మారుతము, 'యమానిలేన్ద్ర చన్ద్రార్క విష్ణు సింహాంశు వాజిషు, శుకాహి పిక భేకేషు

హరిః' అని యమరుఁడు, శతాంగ=రథముగాఁ గల మన్మథునకు, జనక = తండ్రి యైనవాఁడా; రంగ దద్రిజాంతర సుమంగ ళాబ్జ భృంగ – రంగత్=చలించుచున్న, అద్రిజా=పార్వతీదేవియొక్క, అంతర = హృదయ మనెడు, సుమంగళ= మంగల ప్రదమగు, అబ్జ =కమలమునకు, భృంగ=భ్రమరరూపుఁడైనవాఁడా, అనఁగా పార్వతీ దేవి యెల్లపుడును హృదయకమల మందు నారాయణమూర్తిని నిల్పుకొని ధ్యానించుచున్నది గాన నామె హృదయకమలమునకు భ్రమరప్రాయుఁడై యున్నవాఁ డని భావము; తత పతంగ మందిరా – తత=విశాలమగు, పతంగ=సూర్యుఁడే, 'పతంగౌ పక్షి సూర్యే చ' అని యమరుఁడు, మందిరా = గృహముగాఁ గలవాఁడా, సూర్యమండలమందు సర్వదా వసించు వాఁడని తాత్పర్యము. ఇందుకు 'ధ్యేయ స్సదా సవితృమణ్డలమధ్యవర్తీ నారాయణః' అను వచనము ప్రమాణము; పర భుజంగరిపు తురంగ – పర =ఉత్కృష్టుఁడగు, భుజంగ రిపు=గరుత్మంతుఁడే, తురంగ = గుఱ్ఱముగాఁ గలవాఁడా; ప్రబల రంగ భూషణా – ప్రబల=ఉత్కృష్టమగు, రంగ=శ్రీరంగవిమా నమునకు, భూషణా=అలంకారప్రాయుఁడైనవాఁడా!

'ఈహ మీఱ సూర్యగణము ౹లేడు గాంతమైన ను, త్సాహవృత్త మనఁగఁ గృతులఁ ౹జాగుచుండు' నని ఉత్సాహవృత్తలక్షణ మప్పకవీయమునఁ జెప్పఁబడినది.

గద్యము: ఇది శ్రీమదనగోపాలప్రసాదసమాసాదితోభయభాషాకళాకళత్ర రేచర్లగోత్రపవిత్ర
సురభిమల్లక్ష్మాపాలసత్పుత్ర కవిజనవిధేయ మాధవరాయప్రణీతం బైన
చంద్రికాపరిణయంబను మహాప్రబంధంబునందు ద్వితీయాశ్వాసము.

గద్యము: ఇది శ్రీసతీరమణకరుణాసమాసాదితసర్వసౌభాగ్యభాగ్యనగరమహారాజ్యసంకలిత
శ్రీజటప్రోలుసంస్థానప్రాజ్యసకలసామ్రాజ్య శ్రీరేచర్లగోత్రపవిత్ర కవిజనగేయ
శ్రీవేంకటజగన్నాథరాయసత్పుత్ర సత్సంప్రదాయ శ్రీసురభి వేంకటలక్ష్మణరాయ
పరిపోష్య సరసవైదుష్య తదాస్థానతలమండిత శేషసదాశివపండిత
విరచితశరదాగమసమాఖ్యవ్యాఖ్యయందు
ద్వితీయాశ్వాసము

శ్రియై నమః

శ్రీలక్ష్మీనరసింహాయ నమః

చంద్రికాపరిణయము-సవ్యాఖ్యానము

తృతీయాశ్వాసము

క. విలసత్కమలాపదయుగ
లలితానుపమానదివ్య◊లాక్షాలక్ష్మో
జ్జ్వలతరకౌస్తుభమణిపి
చ్ఛిలరుచివక్షోవిశాల శ్రీగోపాలా! 1

టీక: విలసత్కమలాపదయుగ లలితానుపమాన దివ్యలాక్షా లక్ష్మోజ్జ్వలతర కౌస్తుభమణి పిచ్ఛిల రుచి వక్షోవిశాల – విలసత్ = ప్రకాశించుచున్న, కమలాపదయుగ =లక్ష్మీపాదయుగళముయొక్క, లలిత=మనోజ్ఞము, అనుపమాన=సాటిలేనిది యగు, దివ్యలాక్షా=లోకోత్తరమగు లత్తుకయొక్క, లక్ష్మ=చిహ్నముచేత, ఉజ్జ్వలతర=మిక్కిలి ప్రకాశమానమగు, కౌస్తుభమణి = కౌస్తుభమను మణివిశేషముచేత, పిచ్ఛిల=దట్టమైన, రుచి=కాంతిగల, వక్షః=ఎదచేత, విశాల=గొప్పవాఁడ వగు, అనఁగా, విశాలవక్షస్థ్సలముగల; శ్రీగోపాలా=శ్రీమదనగోపాలస్వామీ! అని కృతిపతిసంబోధనము. దీనికిఁ జిత్తగింపు మను నుత్తరపద్యస్థ క్రియతో నన్వయము.

తే. చిత్తగింపుము శౌనకా◊ద్యుత్తమర్షి
సమితి కిట్లను రోమహ◊ర్షణతనూజుఁ
డప్పు డామోద మూని య◊క్షాధిపతి మ
హీంద్రుఁ దిలకించి వెండియు ◊నిట్టు లనియె. 2

టీక: చిత్తగింపుము = అవధరింపుము; శౌనకాద్యుత్తమర్షిసమితికిన్ = శౌనకుఁడు మొదలుగాఁ గల మహర్షిసంఘమునకు; ఇట్లు =వక్ష్యమాణప్రకారముగ; రోమహర్షణతనూజుఁడు=సూతుఁడు; అనున్=వచించును ;అప్పుడు= ఆ సమయమందు; యక్షాధి పతి=యక్షశ్రేష్ఠుఁడగు కుముదుఁడు;ఆమోదము=సంతసమును, 'ప్రమో దామోద సమ్మదాః' అని యమరుఁడు;ఊని=వహించి; మహీంద్రున్=సుచంద్రుని; తిలకించి =వీక్షించి; వెండియున్=మఱియు; ఇట్టులు=ఈప్రకారముగ; అనియెన్=పలికెను.

చ. ఇరఁ గల పద్మినీతతుల◊యింపును సొంపు నడంచు మంపునం
గరముఁ బొసంగు చంద్రిక య◊ఖండవిలాసము సన్నుతింపఁగాఁ

దరమె తదీయదీధితివి◊తానము గన్గొనుమాత్రఁ బెంపు దు
ష్కరగతి మించు భూర్యసమ◊కాండగవోదితతాపమండలిన్. 3

టీక: ఇటఁ బ్రస్తుతచంద్రికాఖ్యనాయికాపరమైనయర్థమును, జ్యోత్స్నాపరమైనయర్థమును గలుగుచున్నది.
ఇరన్=భూమియందు, జలమందని వెన్నెలపర మైనయర్థము, 'ఇరా భూ వాక్సురాప్సు స్యాత్' అని యమరుఁడు; కల పద్మినీ తతులయింపును=కలిగినట్టి పద్మినీజాతిస్త్రీలయొక్క యానందమును, తామరతీవలయొక్క యానందము నని జ్యోత్స్నాపర మైనయర్థము; సొంపును=సౌందర్యమును; అడంచు మంపునన్=అడఁగించు మదముచే; కరమున్=మిక్కిలి; పొసంగు చంద్రిక అఖండవిలాసము =ఒప్పుచున్న చంద్రికయొక్క యవిచ్ఛిన్నమైన విలాసము, వెన్నెలయొక్క యఖండ విలాస మని యర్థాంత రము; సన్నుతింపఁగాన్=కొనియాడఁగా; తరమె =శక్యమా? తదీయదీధితివితానము – తదీయ = ఆ చంద్రికయొక్కయు, వెన్నెలయొక్కయు, దీధితివితానము=కాంతిపుంజము; కన్గొనుమాత్రన్ =అవలోకించునంతనే; దుష్కర గతిన్=అశక్యమగు రీతిచే; మించు=అతిశయించునట్టి; భూర్యసమకాండగవోదితతాపమండలిన్ – భూరి=అధికమయిన, అసమకాండ=విషమ బాణుఁడైన (అనఁగా, బేసిసంఖ్యగల బాణములు గల) మరునియొక్క, సప్తాశ్వుఁడైన సూర్యునియొక్క యని యర్థాంతరము, 'కాణ్డో స్త్రీ దణ్డ బాణార్వ' యని యమరుఁడు, గో=బాణములచేతను, కిరణములచేత నని యర్థాంతరము, 'స్వర్గేషు పశు వాగ్వజ్రదిఙ్నేత్ర ఘృణి భూ జలే, లక్ష్య దృష్ట్యా స్త్రియాం పుంసి గౌః' అని యమరుఁడు. గో+ఉదిత యనుచోట గోశబ్దముమీఁది ఓకారమునకు అవఙాదేశము వచ్చి 'గవోదిత' అని యయ్యె, ఉదిత=ఉదయించిన, తాపమండలిన్ =సంతాపాతిశయమును, వేఁడియొక్క యతిశయము నని వెన్నెలపరమైనయర్థము; పెంపున్=పోషించును, నశింపఁజేయు నని యర్థాంతరము.

అనఁగాఁ జంద్రికాఖ్యనాయిక భూమియందుఁ గలపద్మినీజాతిస్త్రీలలో నుత్తమురా లనియు, ఆమె దేహకాంతి యవలో కించినంతనే స్మరోద్దీపన మగుననియుఁ దాత్పర్యము. వెన్నెల జలమందున్న తామరతీవల యింపుసొంపుల నడంచుననియు, ఆతపబాధ శమింపఁజేయు ననియు నర్థాంతరమందుఁ దాత్పర్యము. ప్రకృతాప్రకృతార్థముల కౌపమ్యము గమ్యము.

సీ. నెలఁత చన్గవదారి ◊నెఱికొప్పు కటియొప్పు, ఘనచక్రవైఖరి ◊నని నడంచుఁ,
గొమ్మ కన్నులరాణ ◊నెమ్మోము మెడగోము, కలితాబ్జమహిమంబుఁ ◊దలఁగఁ జేయు,
సకి నుందొడలరీతి ◊చికురాళి నఖపాళి, సుకలభోర్జితజయ◊స్ఫూర్తి నలరుఁ,
జెలి వలగ్నాభ ప◊ల్కులతీరు నూఁగారు, హరిమదాపహవృత్తి ◊నతిశయిల్లు,
తే. నహహ! త్రైలోక్యవర్ణనీ◊యాజరాంగ, నావతారవిలాసాప్తి ◊నడరు కతన
మహిప! పాంచాలరాట్సుతా◊మంజులాంగ,కాంతి చిత్రకరస్థేమఁ ◊గాంచు టరుదె? 4

టీక: నెలఁత చన్గవదారి – నెలఁత=చంద్రికయొక్క, చన్గవ=స్తనయుగ్మముయొక్క, దారి=పద్ధతి; నెఱికొప్పు =అందమైన కేశబం ధము; కటియొప్పు=పిఱుందులయందము; ఘనచక్రవైఖరిన్ = గొప్పవి యైన జక్కవలరీతిని,
మేఘసంఘముయొక్కరీతిని; ఘనచక్రవైఖరిన్—ఘన=గొప్పవియైన, చక్ర=బండికండ్లయొక్క, వైఖరిన్=రీతిని;
అనిన్=పోరునందు; అడంచున్=అడఁగఁ జేయును. అనఁగాఁ జంద్రికయొక్క చన్గవదారి ఘనములైన జక్కవలరీతిని, కొప్పు మేఘసంఘపురీతిని, పిఱుందులు గొప్పవగు బండికండ్లరీతిని జయించు నని యథాసంఖ్యముగా నన్వయము.
కొమ్మ కన్నులరాణ =చంద్రికయొక్క నేత్రములయొప్పిదము; నెమ్మోము =అందమగు ముఖము; మెడగోము =కంఠసొకు

మార్యము; కలితాబ్జమహిమంబున్ – కలిత=ఒప్పుచున్న, అబ్జ=కమలముయొక్క, చంద్రునియొక్క, శంఖముయొక్క, మహిమంబున్ =అతిశయమును; తలఁగన్=తొలఁగునట్లుగా; చేయున్. ఆమె కన్నులు కమలముయొక్కయు, మోము చంద్రునియొక్కయు, కంఠము శంఖముయొక్కయు మహిమను దలఁగఁజేయు నని తాత్పర్యము.

సకి=చంద్రికయొక్క, నుందొడలరీతి=నునుపగు తొడలవైఖరి; చికురాళి=కుంతలపంక్తి; నఖపాళి=నఖములయొక్క పంక్తి; సుకలభోర్జితజయస్ఫూర్తిన్ – సు=లెస్సయైన, కలభ=కరబహిర్భాగముయొక్క, తుమ్మెదలయొక్క, 'కలభః కరపార్శ్వే స్యా ద్భ్రమరే కరిశాబకే' అని విశ్వము, సుకల=మంచిప్రకాశము గల, భ=నక్షత్రములయొక్క, 'నక్షత్ర మృక్ష భం తారా' అని యమరుఁడు, ఊర్జిత=అతిశయించిన, జయ=గెలుపుయొక్క, స్ఫూర్తిన్ =ప్రకాశముచేత; అలరున్=ఒప్పును. ఆమెతొడలు కరబహిర్భాగముయొక్కయు, కేశములు తుమ్మెదలయొక్కయు, గోళ్లు నక్షత్రములయొక్కయు గెలుపుచేత నమరుచున్న వని తాత్పర్యము.

చెలి =చంద్రికయొక్క; వలగ్నాభ=మధ్యప్రదేశముయొక్క కాంతి; పల్కులతీరు =వచనభంగి; నూఁగారు=రోమావళి; హరిమదాపహవృత్తిన్ – హరి=సింహముయొక్కయు, చిలుకయొక్కయు, సర్పముయొక్కయు, మదాపహవృత్తిన్ =గర్వము నడంచు వర్తనచేత; అతిశయిల్లున్ =మించును. ఆమెనడుము సింహమును, పలుకు చిలుకను, నూఁగారు సర్పమును, బోలిన దనుట.

అహహ=ఆశ్చర్యము! మహిప=సుచంద్రుఁడా! పాంచాలరాట్సుతామంజులాంగకాంతి =పాంచాలరాజపుత్త్రియైన చంద్రికయొక్క మనోజ్ఞమగు దేహకాంతి; త్రైలోక్య వర్ణనీయాజరాంగనావతార విలాసాప్తిన్ – త్రైలోక్య=లోకత్రయముచేత, వర్ణనీయ= కొనియాడఁదగిన, అజరాంగనావతార=దేవాంగనావతారముయొక్క, విలాస=విలాసముయొక్క, ఆప్తిన్=పొందికచేత; అడరు కతన =ఒప్పుటవలన; చిత్రకరస్థేమన్=ఆశ్చర్యమగు స్థితిని; కాంచుట=పొందుట; అరుదె=ఆశ్చర్యమా?

అనఁగా, జంద్రిక ముల్లోకములచేత వర్ణనీయమైన విలాసమును బొందినది గావున నామెకు ఘనవక్త్రాదిజయము గల స్తనయుగ్మ కేశపాశ కటిస్థలాదులు మూఁడేసి యవయవములు గలిగియుండుట యాశ్చర్యము గాదని తాత్పర్యము. ఇట మంజులాంగకాంతి యనుచోట 'శోభైవ కాన్తి రాఖ్యాతా మన్మథాప్యాయితోజ్జ్వలా, సా శోభా రూపభోగాద్యై ర్యత్స్యాదఙ్గవిభూషణ' మ్మని కాన్తి లక్షణమును, మెడగోము అనుచోట 'యత్స్పర్శాసహతాఙ్గేషు కోమలస్యాపి వస్తునః, తత్సౌకుమార్యమ్' అని సౌకుమార్యలక్షణమును దెలియవలయు.

చ. సమరహితాత్మమై యతను॰సాయకశక్తి భరించు నాసుదే
హమెఱుఁగుమేనితోఁ గడు ఘ॰నాళి సహాయముఁ గన్న చంచలౌ
ఘము పగ లొందిన న్విగత॰కాంతిక మౌ ననఁ దద్విహీనతా
క్రమమున మించు చంపకము ॰గాంచునె సొంపు విరోధ మూనినన్. 5

టీక: సమరహితాత్మమై = యుద్ధమునకు హితమయిన స్వరూపము కలదై, సమరహిత= సమమైనదానిచే రహితమైన, అనఁగా సాటిలేని, ఆత్మమై = స్వరూపము గలదై యని యర్థాంతరము; అతనుసాయకశక్తిన్ = అధికములగు బాణములయొక్క శక్తిని, మరునితూపనెడు శక్తిని నని యర్థాంతరము, 'రమ్యం హర్మ్యతలం నవాస్సునయనా గుఞ్జద్విరేఫా లతాః ప్రోన్మీల న్నవమల్లికాసురభయో వాతా స్సచన్ద్రాః క్షపాః, యద్యేతాని జయన్తి హన్త పరిత శ్శస్త్రా ణ్యమోఘాని మే' అని మరునికి వనితయు సాయకముగాఁ జెప్పఁబడినది; భరించు నాసుదేహమెఱుఁగుమేనితోన్ = భరించునట్టి యాచంద్రికయొక్క ప్రకాశించునంగము

తోడ, దీనికిఁ బగలొందిన ననుదానితో నన్వయము; కడున్=మిక్కిలి; ఘనాళిన్– ఘన=గొప్పవారలయొక్క, మేఘముల యొక్క యని యర్థాంతరము, ఆళిన్=సమూహమును; సహాయమున్=తోడునుగా; కన్న చంచలౌఘము = పొందిన విద్యు త్సమూహము; పగ లొందినన్=వైరముల నొందినచో, దివసము నొందినచో నని యర్థాంతరము; విగతకాంతికము ఔన్ అనన్ = కాంతిహీనమగు ననఁగా; తద్విహీనతాక్రమమున మించు చంపకము– తత్=ఆఘనాళిచేత, అనఁగా గొప్పదైన తుమ్మెదచేత, విహీనతా=రాహిత్యముయొక్క, క్రమమునన్=రీతిచేత, మించు = గర్వించు, చంపకము =సంపెఁగతీవ; విరోధము=వైరము; ఊనినన్ = పొందినచో; సొంపున్=అందమును; కాంచునె=వహించునా?

అనఁగా సమరసన్నద్ధమై యనేకబాణసంతతితోఁ గూడుకొన్న యామెదేహముతో ఘనాళిసాహాయ్యము నొందిన మెఱుపే పగలొందినచో గెలువనపుడు అట్టి ఘనాళి సాహాయ్యము లేనిచంపకము విరోధ మూనినయెడల గెలువఁజాలదని చెప్పవలసి నది లేదనుట. ఆమె దేహము సాటిలేని దనియు, మదనోద్దీపకమనియు, మెఱుపుఁదీవయు సంపెంగతీవయు సాటి యనుట సంభావింపఁ దగదనియు భావము. ఇందుఁ జంద్రిక యొక్క దేహలత వర్ణింపఁబడియె. ఇట్లు చెప్పుటచేత లోకోత్తరలావణ్యాతి శయము చంద్రికాదేహమునందుఁ జెప్పఁబడినది. 'ముక్తాఫలేషు చ్ఛాయాయా స్తరళత్వ మివాన్తరా, ప్రతిభాతి యదఙ్గేన లావణ్యం తదిహోచ్యతే' అని లావణ్యలక్షణము దెలియవలయు.

మ. జగతీనాయక కన్యపాదనఖముల్ ◊సజ్జాలకత్రాణమా
న్యగతిం జేకొని లోకవర్ణ్యవిధుకాం◊తాకారసంపత్తి మిం
చఁగ ముత్యంబులు శుక్తికాతటిఁ దప◊శ్చర్య న్విజృంభించి హె
చ్చగు తాద్రూప్యముఁ బొందెఁ గానియెడ ము◊క్తాభిఖ్య యెట్లబ్బెడిన్. 6

టీక: జగతీనాయక=సుచంద్రుఁడా! కన్యపాదనఖముల్=చంద్రికయొక్క పాదములయొక్క గోరులు; సజ్జాలకత్రాణమాన్య గతిన్– సజ్జాలక=సత్పురుషుల సమూహముయొక్క, శ్రేష్ఠములైన మొగ్గలయొక్క యని యర్థాంతరము, త్రాణ=రక్షణము చేత, మాన్య =పూజ్యమగు, గతిన్ =స్థితిని; చేకొని =గ్రహించి;లోకవర్ణ్యవిధుకాంతాకారసంపత్తిన్– లోకవర్ణ్య=లోకముచేఁ గొని యాడఁ దగిన, విధు=విష్ణుమూర్తియొక్క, కాంత=మనోహరమైన, ఆకార=ఆకృతియొక్క, సంపత్తిన్=సంపదచేత, 'విధు ర్విష్ణౌ చంద్రమసి' అని యమరుఁడు; విధుకాంతా=నక్షత్రములయొక్క, ఆకారసంపత్తిన్=ఆకృతిసంపత్తుచేత నని యర్థాంత రము;మించఁగన్=అతిశయింపఁగా; ముత్యంబులు=మౌక్తికములు;శుక్తికాతటిన్ =శుక్తికయను నదియొడ్డున, ముత్యపు చిప్పలదరి నని యర్థాంతరము; తపశ్చర్యన్=తపముఁజేయుటచేత; విజృంభించి =అతిశయించి;హెచ్చగు తాద్రూప్యమున్= ఉత్కృష్టమగు తత్ (ఆగోరులయొక్క)రూపము కల్గియుండుటను;పొందెన్=పొందెను; కాని యెడన్ = అటుగానిచో; ముక్తా భిఖ్య=మోక్షమును బొందినవను పేరు; ఎట్లబ్బెడిన్ = ఏవిధముగ లభించును?

అనఁగా ముత్యములు శుక్తికానదీతీరమునఁ దపముఁ జేసి చంద్రికానఖసారూప్యముక్తిని గాంచినవి గావుననే ముక్తాఖ్య నొందినవి, కానిచో నొందఁజాల వనుట. చంద్రికాపాదనఖములు మొగ్గలను, నక్షత్రములను బోలియున్నవని భావము. ఇట నఖములు వర్ణితంబు లయ్యె. చిత్రరేఖావతారరూప యగుటం జేసి చంద్రిక దేవతాత్మ గావున 'మానవా మౌళితో వర్ణ్యా దేవా శ్చరణతః పునః' అను కవికులనియమము ననుసరించి నఖాదిగా వర్ణించుట యని తెలియవలయు.

చ. అనిశవిభాసితాత్మమృదు◊తారుణతాజితపల్లవాభ యై
తనరువెలందిపాదరుచిఁ ◊దమ్ముు లిరం గమలాప్తుగోక్రమం

బునఁ గని మించఁగాదె సిరి ◊పూని కరమ్ములఁ జక్క నొత్తు లో
చనములు గంతుకేళివిధి◊జక్లమదారణదంభధీగతిన్. 7

టీక: అనిశ విభాసి తాత్మ మృదుతారుణతా జిత పల్లవాభ యై– అనిశ=ఎల్లపుడును, విభాసిత=ప్రకాశించుచున్న, ఆత్మ=తన సంబంధి యగు, అనఁగా పాదసంబంధి యగు, మృదుతా=మార్దవముచేతను,అరుణతా=ఎఱ్ఱఁదనముచేతను,జిత=జయింపఁబడిన, పల్లవ=చిగురుటాకులయొక్క, ఆభ యై =కాంతి గలదై, అనఁగాఁ బల్లవములందు మ్రదిమారుణ్యములు సర్వకాలమునందు నుండునవి గావు కావునఁ బాదరుచిచే నవి యోడింపఁబడిన వనుట. ఇట్లు చెప్పుటచేఁ జంద్రికాపాదములయందు మార్దవాతిశయము గదితం బయ్యె. 'స్పృష్టం యత్రాఙ్గ మస్పృష్ట మివ స్యా న్మార్దవం హి తత్' అని తల్లక్షణంబు. ఆరుణ్యోక్తిచే ద్వితీయయౌవనము గదిత మగు. 'స్తనౌ పీనౌ తను ర్మధ్యః పాణౌ పాదే చ రక్తిమా, ఊరూ కరికరాకారావఙ్గం వ్యక్తాఙ్గసన్ధికమ్। నితమ్బౌ విపులో నాభి ర్గభీరా జఘనం ఘనమ్, వ్యక్తా రోమావళి స్స్నిగ్ధ్య మఙ్గకే లలితాక్షిణీ। ద్వితీయే యౌవనే' అని రసార్ణవసుధాకరమందుఁ దల్లక్షణం బెఱుంగునది; తనరువెలందిపాదరుచిన్ =ప్రకాశించునట్టి చంద్రికయొక్క పాదకాంతిని; తమ్ములు = తోఁబుట్టువులు, పద్మములని యర్థాంతరము; ఇరన్=భూమియందు, ఉదకమందు; కమలాప్తుగోక్రమంబునన్ =విష్ణుమూర్తి యొక్క వచనక్రమముచేత, విష్ణువుయొక్కవరప్రదానముచేత ననుట, సూర్యకిరణసంచారముచేత నని యర్థాంతరము; కని = పొంది; మించన్ కాదె = మించుటచేతఁగదా! సిరి =లక్ష్మి; కరమ్ములన్=హస్తములయందు; పూని=వహించి; లోచనములు = నేత్రములను; కంతు కేళివిధి జ క్లమ దారణ దంభధీ గతిన్ – కంతుకేళివిధి=అనంగక్రీడావిధానమువల్ల, జ=పుట్టినట్టి, క్లమ= శ్రమముయొక్క, దారణ= పోఁగొట్టుటయొక్క, దంభధీ=వ్యాజబుద్ధియొక్క, గతిన్ =ప్రాప్తిచేత; చక్కన్=బాగుగా; ఒత్తున్= ఒత్తుకొనును.

అనఁగా నెల్లపుడు రాజిల్లు తనమార్దవారుణ్యములచేఁ బల్లవకాంతి నోడించిన చంద్రికాపాదరుచిని, తమ్ములు అనఁగాలక్ష్మీ సహోదరములగు తామరసములు విష్ణుమూర్తివరముచేత గ్రహించెనని సిరి సంతసించుచుఁ గంతుకేళిపరిశ్రమాపనోదనవ్యాజమునఁ గన్ను లొత్తుకొనుచున్న దనుట. చంద్రికాపాదములు పల్లవములకన్న మార్దవారణ్యములు గల వనియు, పద్మములు సూర్యకిరణప్రచారముచే నట్టివానికాంతిని బొందిన వనియు భావము. లక్ష్మీదేవి పద్మహస్త యగుట, 'నిత్యం సా పద్మహస్తా మమ వసతు గృహే సర్వమాఙ్గళ్యయుక్తా' యని ప్రసిద్ధము. ఇట్లు సిరి పద్మహస్త యగుటకు, పద్మములు చంద్రికాపాదమ్రదిమారుణ్యములను బొందుట హేతువు గాకున్నను, హేతువుగాఁ జెప్పుటవలన హేతూత్ప్రేక్షాలంకారము. ఆమ్రదిమారుణ్యములకు భగవత్ప్రసాదైకలభ్యత చెప్పుట లోకోత్తరత్వానితరసాధ్యత్వాదిప్రతీత్యర్థ మని తెలియునది.

చ. వెలఁదిమెఱుంగుపిక్కల య◊వేలమరీచిక ధాటి వెల్వడెన్
జలమున నంచుఁ గాహళిక ◊సాంద్రరుతిన్ బయలూన్ప శాలి లోఁ
గలసినభీతి వాహినుల◊కాండముతో హరిమండలంబుతో
వల నగు పొందుఁ గాంచియును ◊వప్రము వెల్వడ కుండు నెంతయున్. 8

టీక: వెలఁదిమెఱుంగుపిక్కల యవేలమరీచిక – వెలఁది = చంద్రికయొక్క, మెఱుంగుపిక్కల = ప్రకాశించుచున్న జంఘలయొక్క, అవేలమరీచిక=అధికమగు కాంతి; ధాటిన్=జైత్రయాత్రనుగూర్చి; చలమునన్=మాత్సర్యముచేత; వెల్వడెన్= బయలుదేఱెను; అంచున్, కాహళిక = బూరుగ; సాంద్రరుతిన్=దట్టమగు ధ్వనిని; బయలూన్పన్=వెల్లడిసేయఁగా; శాలి =

వరిపొట్టయనుట; లోన్=అంతరంగమందు; కలసినభీతిన్=కూడుకొన్న భయముచేత; వాహినులకాండముతోన్= సేనల యొక్క గుంపుతో, నదులజలముతోను, 'కాణ్డో స్త్రీ దణ్డ బాణార్వ వర్గావసర వారిషు' అని యమరుఁడు; హరిమండలంబుతోన్ = అశ్వసమూహముతో, శుకవర్గముతోను; వలనగుపొందున్ =అనుకూలమైన సంబంధమును; కాంచియును=పొందియును; వప్రము=కోటను, వరిమడిని; ఎంతయున్=మిక్కిలి; వెల్వడ కుండున్=బయలుదేఱకుండును. 'చిత్రతన్' అను పాఠమున వాహినుల కాండముతోను, హరిమండలముతోను వలనగుపొందుఁ గాంచియు వెల్వడకుండుట చిత్ర మని తెలియునది.

చంద్రిక పిక్కలకాంతి జైత్రయాత్ర వెడలఁగఁ గాహళిక పెద్దపెట్టున రొద సేయుటను శాలి విని తాను వాహినీకాండముల తోను, హరిమండలంబుతోనుం గూడినదయ్యు వప్రము వెల్వడకుండెననుట. ఆమె పిక్కలు బూరుగులకన్నను, వరిపొట్టల కన్నను మిన్నగా నున్నవని భావము. వాహినులకాండము, హరిమండలము, వప్ర మను చోటుల శ్లిష్టరూపకము. పిక్కలను కాహళములు వరిపొట్టలు లోనగువానితోడఁ బోల్చుట కవిసమయసిద్ధము.

ఉ. రాజవరాత్మజాతపరిరంభసుఖం బొనగూర్చు నాకుభృ
ద్రాజకుచోరుకాండములు రంభలు గావున నొక్కొ నిచ్చలున్
రాజిలురక్తి సారసవనప్రవివర్ధనవృత్తిఁ బూనుఁ బో
రాజితహస్తిహస్తనికరంబులు తత్ప్రియభావ మూనఁగాన్. 9

టీక: రాజవరాత్మజాత పరిరంభసుఖంబు – రాజవరాత్మజాత=రాజకుమారునకు, నలకూబరునకని యర్థాంతరము, పరి రంభసుఖంబు =ఆలింగనసౌఖ్యమును; ఒనగూర్చు ఆకుభృద్రాజకుచోరుకాండములు – ఒనగూర్చు=కలుగఁజేయునట్టి, ఆకుభృద్రాజకుచా=పర్వతశ్రేష్ఠములవలె నున్నతములగు కుచములుగల చంద్రికయొక్క, ఊరుకాండములు =స్తంభముల వంటి యూరువులు, 'నారీపీనపయోధరోరుయుగళం స్వప్నేపి నాలిఙ్గిత మ్మాతుః కేవలమేవ యౌవనవనచ్ఛేదే కుఠారా వయమ్' ఇత్యాదికావ్యవ్యవహారములవల్లను, కామశాస్త్రాద్యుక్తాలింగన ప్రభేదాంతర్గతివల్లను, ఊర్వాలింగనము ప్రసిద్ధమని తెలియవలెను; రంభలు గావున నొక్కొ= రంభయను దేవాంగన లగుటవలననో, పూజయందు బహువచనము, అనఁటు లగు టనో; నిచ్చలున్=సర్వకాలమందును; రాజితహస్తిహస్తనికరంబులు =ప్రకాశించుచున్నట్టి యేనుఁగుతొండముల గుంపులు; తత్ప్రియ భావము = ఆరంభాత్మకములైన యూరువులకు మిత్త్రభావమును; ఊనఁగాన్ =పొందునట్లు; రాజిలురక్తిన్=ప్రకా శించుచున్న యనురాగముచేత; సారసవనప్రవివర్ధనవృత్తిన్– సారసవన=తామరతోఁటలయొక్క, ప్రవివర్ధనవృత్తిన్ =ఛేదిం చుటయొక్క వ్యాపారమును; సారస=సరస్సంబంధియగు,వన=జలముచేత, ప్రవివర్ధన=వృద్ధిఁబొందుటయొక్క,వృత్తిన్ = వ్యాపారమును; సార=శ్రేష్ఠములైన,సవన=యాగములయొక్క, ప్రవివర్ధన=వృద్ధిఁబొందుటయొక్క,వృత్తిన్=వ్యాపారమును; సారస=రసిక సంబంధియగు,వన=సమూహముయొక్క, ప్రవివర్ధన=వృద్ధిఁబొందుటయొక్క, అనఁగా సంతోషపఱచుట యొక్క, వృత్తిన్ = వ్యాపారమును; ఇవి క్రమముగాఁ గరికర కదళీ దేవాంగనా చంద్రికోరూ పపరములయిన యర్థములు; పూనున్=వహించును; పో =నిశ్చయము.

చంద్రికోరువులు రాజవరాత్మజాతుఁడగు వరునకుఁ బరిరంభసుఖము నియ్యఁదగినవి కావున రాజవరాత్మజాతుఁడగు నలకూబరునకుఁ బరిరంభసుఖ మిచ్చు రంభలయ్యె ననియు, అట్లు రంభాభావము పొంది తమకు (అనఁగా రంభాశబ్దమునకు అనఁటులును అర్థము కావున నట్టి యనఁటులకు) శత్రువు లయిన కరికరంబులను సారసవనప్రవివర్ధనవృత్తిఁ బూనుటచే మిత్త్రములగునట్లు చేసికొనినవి యని తాత్పర్యము. ఏనుఁగుతొండములు కమలవనమును ఛేదించుటయు, అనఁటులు సరోజల

ముచే వృద్ధిఁబొందుటయు, దేవాంగనాసంగసౌఖ్యమునకై యాగములు చేయఁబడుటయుఁ బ్రసిద్ధము. ఆమెయూరువులు అనంటులను, ఏనుఁగుతొండములను పోలినవని భావము. ‘ఊరూ కరికరాకారా వజ్గం వ్యక్తాజ్గసన్ధికమ్’ అన్న చొప్పున ద్వితీయయౌవన మిందుఁ జెప్పఁబడియె.

చ. సతిజఘనప్రభాగరిమ ◊సైకతముల్ పరిశుద్ధతీర్థవా
సితఁ దగి శారదాదరణ◊చే నిసుమంతగ్రహించి మించ స
మ్మతిఁ గన నోపకే యవని ◊మాటికిఁ గప్పికొను న్సమీరసం
తతిగతినిశ్చ్యుతాసనవ◊నప్రసవౌఘపరాగశాటికన్. 10

టీక: సైకతముల్ =ఇసుకదీములు; పరిశుద్ధతీర్థవాసితన్ – పరిశుద్ధ=నిర్మలమగు,తీర్థ=పుణ్యక్షేత్రమందలి, ‘తీర్థం శాస్త్రాధ్వర క్షేత్రోపాయోపాధ్యాయ మన్త్రిషు। అవతారర్షి జుష్టామ్భః స్త్రీరజస్సు చ విశ్రుతమ్’ అని విశ్వము, వాసితన్=నివాసముచేత, వసించు వాఁడు వాసి, వానిధర్మము వాసిత అది వాసరూపంబ యగును; తగి= ఒప్పి; శారదాదరణచేన్=సరస్వతీప్రసాదముచేత, శరత్కాలసంబంధియైన యాదరముచేత, శరత్కాలముననే సైకతప్రకాశము గావున నిట్లు వచింపఁబడియె; సతిజఘనప్రభాగరిమన్ = చంద్రికయొక్క కటిపురోభాగములయొక్క శోభాతిశయమును; ఇసుమంతన్=కొంచెముగాను, ఇసుకనంతయు నని వాస్తవార్థము; గ్రహించి=పొంది; మించన్=అతిశయింపఁగా; అవని=భూమి; సమ్మతిన్=అంగీకారముచేత; కనన్=చూచుటకు; ఓపకే =సహింపకయే; సమీరసంతతి గతి నిశ్చ్యుతాసన వన ప్రసవౌఘ పరాగ శాటికన్ – సమీరసంతతి=వాయుసంఘముయొక్క, గతి = గమనముచేత, నిశ్చ్యుత=జాఱినట్టి, ఆసన=బంధూకవృక్షములయొక్క,వన=వనములయొక్క,ప్రసవౌఘ=పుష్పరాశి సంబంధి యగు, పరాగ=రజమనెడు,శాటికన్=కాషాయవస్త్రము ననుట, మాటికిన్=సారెకు, కప్పికొనున్=ఆచ్ఛాదించుకొనును. అనఁగా చంద్రికాజఘనసౌందర్యము నించుక గ్రహించి మించిన సైకతంబుల సౌభాగ్యము చూచి సహింపఁజాలక భూమి సన్న్యసించె నని భావము.

చ. స్థిరతపనీయసారసన◊దీప్తిమృషాతపనాతపంబు భా
స్వరకటిహర్మ్యనాభిమిష◊జాలకవీథికఁ బర్వినం దదం
తరమున నక్షిలక్ష్యగతిఁ ◊దాల్చినసూక్ష్మతరాణు వౌఁ జుమీ
కరికులరాజయాననను◊గౌను మనంబునఁ జింత యూన్పఁగన్. 11

టీక: కరికులరాజయాన నునుగౌను – కరికులరాజయాన=గజరాజగమన యైన చంద్రికయొక్క, నునుగౌను = నునుపైన మధ్యభాగము; మనంబునన్=మనసునందు; చింత ఊన్పఁగన్ = ధ్యానింపఁగా; స్థిర తపనీయ సారసన దీప్తి మృషా తపనాతపంబు – స్థిర=అచంచలమగు, తపనీయ=బంగరుయొక్క, ‘తపనీయం శాతకుమ్భమ్’ అని యమరుఁడు, సారసన=ఒడ్డాణముయొక్క, ‘స్త్రీకట్యా మ్మేఖలా కాఞ్చీ సప్తకీ రశనా తథా। క్లీబే సారసనమ్’ అని యమరుఁడు, దీప్తి=కాంతి యనెడు, మృషా = వ్యాజముగల,తపనాతపంబు=సూర్యాతపము; భాస్వర కటి హర్మ్య నాభిమిషజాలక వీథికన్– భాస్వర=ప్రకాశించుచున్న, కటి=కటిప్రదేశమనెడు,హర్మ్య=మేడయొక్క, నాభిమిషజాలక=పొక్కిలియనెడు నెపముగల గవాక్షముయొక్క, వీథికన్= ప్రదేశమందు; పర్వినన్=ప్రసరింపఁగా; తదంతరమునన్=ఆసూర్యాతపమధ్యమున; అక్షిలక్ష్యగతిన్=చక్షురింద్రియవిషయ స్థితిని; తాల్చిన=ధరించిన; సూక్ష్మతరాణువు=అతిసూక్ష్మమగు నణువు; ఔన్ జుమీ = అగును సుమా!

'జాలసూర్యమరీచిస్థం సూక్ష్మం య ద్దృశ్యతే రజః। తస్య షష్ఠతమో భాగః పరమాణు స్స ఉచ్యతే' అని చెప్పిన రీతిగాఁ బ్రత్యక్షవిషయమగు త్రసరేణుత్వము మధ్యమం దధ్యవసిత మైనది. 'కౌను సూక్ష్మతరాణువౌన్ కటిహర్మ్య' మను చోటుల రూపకాలంకారము. 'దీప్తిమృషాతపనాతపంబు', 'నాభిమిషజాలక' యను చోటులకైతవాపహ్నుతియు, కరికులరాజయాన యను చోట నుపమాలంకారంబు నగు.

మ. అలివేణీమణినాభి తుంగఘనపుꣳష్పాభంగశోభాగతిం
జెలు వందం దదమూల్యసద్గుణగణꣳశ్రీఁ గానఁగా లేమినో
జలజాతాకరపాళి చుట్టుకొను నిꣳచ్చల్ దుర్యశోవల్లికా
వళి నస్పృశ్యనిరంతరావిశదశైꣳవాలాళి దంభంబునన్. 12

టీక: అలివేణీమణినాభి=తుమ్మెదలవంటి జడగల స్త్రీలలో నుత్తమురాలగు చంద్రికయొక్క పొక్కిలి; తుంగ ఘనపుష్పాభంగ శోభాగతిన్ – తుంగ= ఉన్నతమైన, ఘనపుష్ప=జలముయొక్క, 'మేఘపుష్పం ఘనరసమ్' అని యమరుఁడు, అభంగ= తరఁగలు లేని,శోభా= కాంతియొక్క, గతిన్=రీతిచేత; తుంగ=పొన్నయొక్క, ఘన=గొప్పదగు, పుష్ప=పువ్వుయొక్క, అభంగ=భంగములేని, శోభాగతి చేత నని వాస్తవార్థము; చెలువందన్=సుందరమగుచుండఁగా; తదమూల్యసద్గుణగణశ్రీన్ – తత్=ఆనాభిసంబంధి యైన, అమూల్య=వెలలేని, సద్గుణగణ=శ్రేష్ఠమగు గుణసంఘముయొక్క, మొలనూలు లోనగువాని యొక్క, శ్రీన్= సంపదను; కానఁగా లేమినో=పొందలేకుండుటవలననో; నిచ్చల్=ఎల్లప్పుడు; అస్పృశ్య నిరంత రావిశద శైవా లాళి దంభంబునన్ – అ స్పృశ్య=తాఁకఁగూడనట్టియు, నిరంతర=ఎల్లప్పుడు, అవిశద=నల్లగానుండునట్టియు 'విశదశ్వేత పాణ్డురాః' అని యమరుఁడు,శైవాల =నాచుఁదీవలయొక్క, ఆళి=గుంపనెడు, దంభంబునన్=నెపముచేత; దుర్యశోవల్లికా వళిన్=అయశోలతాసంఘమును; జలజా తాకరపాళి=కమలాకరసమూహము; చుట్టుకొనున్=కప్పికొనును.

అనఁగా నామె పొక్కిలి ఘనపుష్పాభంగశోభాగతిని బొందఁగా సభంగశోభాగతియైన జలజాతాకరపాళి తదమూల్యస ద్గుణశ్రీనొందఁజాలక యోడి దుర్యశోవల్లిని దాల్చినదని భావము. వర్ణ్యముచేత నోడింపఁబడిన దిట్లు చెప్పఁదగినదని సంప్రదా యము. ఇందులకు 'లజ్జా కోపో యశోనాశ రోషాక్రన్దాస్య కృష్ణతాః। రాగ పాణ్డురతాశస్త్రీవిషఝమ్పాతపో జపాః। రాజప్రసాద హంసైకదన్తభక్తి నిషేవణమ్। దుఃఖస్నేహాభిచారేర్ష్యాసహనోద్గీవికాదయః। వర్ణ్యేన విజితస్యైతే పరాభవసముద్భవాః। భావా వాచ్యా యథౌచిత్యమ్' అనియు, 'ముఖజితం కమలం మూర్తమి వాయశో భృఙ్గావళీ వ్యాజేన ధత్తే' అనియు, కవికల్పలతయం దున్నది.

చ. తలకక యౌవనాంబునిధిఁ ꣳదానముఁ జేసి, కటీవితర్దిఁ జెం
ది, లలితవిప్రసేవితుఁడు ꣳనీరజబాణుఁడు పాంథభేదనో
జ్జ్వలమతి నాభికుండమునఁ ꣳజయ్యన హోమ మొనర్పఁ బర్వు శ్యా
మలతరధూమరేఖ యన ꣳమానిని యారు పొసంగు నింపుగన్. 13

టీక: లలితవిప్రసేవితుఁడు – లలిత=సరళులైన,విప్ర=బ్రాహ్మణులచేత, సేవితుఁడు=కొలువఁబడినవాఁడగు; లలిత=సుందరము లైన, వి=శుకాదిపక్షులచేత, ప్రసేవితుఁడు=కొలువఁబడినవాఁడని వాస్తవార్థము; నీరజబాణుఁడు=మరుఁడు; పాంథభేదనోజ్జ్వల మతిన్–పాంథ=బాటసారులయొక్క, భేదన=విదారణమందు, ఉజ్జ్వల=ప్రకాశించునట్టి, మతిన్=బుద్ధిచేత; యౌవనాంబు

నిధిన్ =ప్రాయంబనెడు మున్నీటియందు; తలకక=వెఱవక; తానమున్ =స్నానమును; చేసి=ఒనరించి; కటీవితర్దిన్ = కటి ప్రదేశమను వేదికను; చెంది=పొంది; నాభికుండమునన్=పొక్కిలి యనెడు కుండమునందు, కుండ మనఁగా హోమమునకై విధిచొప్పునఁ ద్రవ్వఁబడిన గుంట; చయ్యనన్=వేగముగ; హోమము ఒనర్పన్ = హోమము చేయఁగా; పర్వు=వ్యాపించెడు; శ్యామలతరధూమరేఖ – శ్యామలతర=మిక్కిలి నల్లనగు, ధూమరేఖ=ధూమమాలిక; అనన్=అనునట్లు; మానినియారు = చంద్రికయొక్క రోమరాజి; ఇంపుగన్=అందముగా; పొసంగున్=ఒప్పును.

చంద్రికయారు మరుఁడు పథికుల వధింప నిచ్చించి యౌవనాంబునిధియందు స్నానము చేసి, విప్రసేవితుఁడయి, కటీ వితర్దియందు నాభికుండమున వేల్చిన ధూమమాలికయో యన్నట్లున్న దని భావము. ఉత్ప్రేక్షాలంకారము. 'యౌవనాంబు నిధి', 'నాభికుండము' అను చోట్ల రూపకములకు నుత్ప్రేక్షకు నంగాంగీభావముచే సంకరము.

మ. నవరోమావళియష్టికాగ్రముపయి న్రాజిల్లి చందోయి తా
నవి మెప్పించి తదాత్మత న్మన నసూయన్ గ్రీవ యబ్జాప్తవై
భవముం జేకొనె, నొందె మున్నరుణబింబస్ఫూర్తిఁ గెమ్మోవి, వే
ణి విరాజిల్లెఁ దమస్సపత్నగతి నెంతేఁ దాల్చి యయ్యింతికిన్. 14

టీక: అయ్యింతికిన్ =ఆచంద్రికకు; చందోయి =స్తనయుగ్మము; నవ రోమావళి యష్టి కాగ్రముపయిన్ – నవ=నూతనమగు, రోమావళి= ఆరనెడు,యష్టికా=ఆసనవిశేషముయొక్క, యష్టికాసనము యోగప్రసిద్ధము, అగ్రముపయిన్ =కొనపైన; రాజిల్లి = ప్రకాశించి, అనఁగా తాదృశాసనారూఢమై తపము దాల్చి యనుట; తాన్, అవిన్=సూర్యుని; మెప్పించి =సంతుష్టుని జేసి; తదాత్మతన్=ఆయవిస్వరూపముచేతను, పర్వతస్వరూపముచేతను, 'అవయశ్శైల మేషార్కాః' అని యమరుఁడు; మనన్ = వృద్ధిఁబొందఁగా; గ్రీవ=కంధరము; అసూయన్ = ఈర్ష్యచేత; అబ్జాప్తవైభవమున్= సూర్యునియొక్క వైభవమును; అబ్జ=శంఖ మునకు, ఆప్త =చెలియనెడు,వైభవమున్ =విభవమును, 'అబ్జౌ శఙ్ఖ శశాఙ్కౌ చ' అని యమరుఁడు, ఇచట చకారమున పద్మా ర్థకతయు, సూర్యుండు పద్మబాంధవుం డగుటయు తెల్లము; చేకొనెన్=గ్రహించెను; కెమ్మోవి=ఎఱ్ఱనగునట్టి యధరము; మున్ను =తొలుత; అరుణబింబస్ఫూర్తిన్=సూర్యబింబప్రకాశమును, అరుణమైన దొండపండుయొక్క ప్రకాశమును; ఒందెన్= పొందెను; వేణి=జడ; తమస్సపత్నగతిన్ – తమః=రాహువునకు, 'తమస్తు రాహుః' అని యమరుఁడు, సపత్న=శత్రువనెడు, గతిన్ =రీతిని; ఎంతేన్=మిక్కిలి; తాల్చి=వహించి; విరాజిల్లెన్=ప్రకాశించెను.

ఆచంద్రికయొక్క కుచములు పర్వతోన్నతము లనియు, కంఠము శంఖతుల్యం బనియు, అధరము బింబసదృశమనియు వేణి రాహువును బోలియున్నదనియు భావము. 'బన్ధు శ్చౌర స్సుహృ ద్వాదీ కల్పః ప్రఖ్యః ప్రభ స్సమః। దేశీయ దేశ్య రిప్వాభ సోదరాద్యా ఇవార్థకాః' అనుటచే ఆప్తసపత్నశబ్దములు తౌల్యమును ప్రతిపాదించును.

సీ. సకియురోజములసాటికి గహ్వరముఁ బూని, కుధరపాళిక కలఁగుండు వడియెఁ,
గలికిగుబ్బలపెంపుఁ గనఁ జాలఁ దమిఁ గాంచి, కోకముల్ రాజుచేఁ గుందువడియెఁ,
జెలికుచంబులఁ బోల నొళవున సరిఁ జూచి, కనకకోలంబముల్ గట్టువడియె,
నెలఁతచందోయితోఁ దులఁదూఁగ రతిఁ బూని, భృంగారుతతి వేగ యెత్తువడియెఁ,

తే. దఱియు గోత్రమ్ములకును గోత్రమ్ము లరుల, కరులు కాయమ్ములకును గాయములు భద్ర
ఘటకములకు సదాభద్రఘటకములు బళిరె వధూకులమణిపయోధరము లెన్న. 15

టీక: కుధరపాళిక =పర్వతసమూహము; సకియురోజములసాటికిన్=చంద్రికపాలిండ్ల సామ్యమునకు; గహ్వరమున్=దంభమును; పూని=వహించి; కలఁగుండు వడియెన్ = కలఁతపడెను, పర్వతము గుహలుగలిగి కలఁగుండు పడుట సహజము.
కోకముల్=చక్రవాకములు; కలికిగుబ్బలపెంపున్=చంద్రికగుబ్బల యతిశయమును; కనన్=పొందుటకు; చాలన్=మిక్కిలి; తమిన్=ఆసక్తిని,రాత్రిని, 'రజనీ యామినీ తమీ' అని యమరుఁడు; కాంచి=పొంది; రాజుచేన్=ప్రభువుచేత, చంద్రునిచేత;కుందు పడియెన్=దుఃఖమును బొందెను. చక్రవాకములు రాత్రి చంద్రునిచే గుందువడుట సహజము.
కనకకోలంబముల్ =బంగరుకిన్నెరకాయలు; చెలికుచంబులన్=చంద్రికాస్తనములను; పోలన్=పోలుటకు, ఒళవునన్ =లోలోపల, వీణాదండమందు; సరిన్=సాటిని; చూచి=అవలోకించి; కట్టువడియెన్=సిగ్గునఁజాలించుకొనెను. కోలంబకము లొళవునఁ గట్టువడుట సహజము.
భృంగారుతతి– భృంగారు=బంగరుగిండ్లయొక్క, తతి=సమూహము, 'భృఙ్గారుః కనకాలుకా' అని యమరుఁడు; నెలఁతచందోయితోన్=చంద్రికయొక్క చన్నుఁగవతోడ; తులఁదూఁగన్=సాటిఁబొందుటకు; రతిన్=ప్రీతిని; పూని=వహించి; వేగ = శీఘ్రముగా; ఎత్తువడియెన్=డస్సెను,తూఁచఁబడెను. బంగరుగిండ్లు తూఁచఁబడుట సహజము.
వధూకులమణిపయోధరములు=స్త్రీరత్నంబగు చంద్రికయొక్క పాలిండ్లు; ఎన్నన్=ఎంచఁగా; తఱియు గోత్రమ్ములకున్ = సమీపించుచున్న పర్వతములకు; గోత్రమ్ములు=పూజనీయములు, 'గోత్ర స్సంభావనీయేఽపి' అని విశ్వము; అరులకున్= చక్రవాకములకు; అరులు=శత్రువులు; కాయమ్ములకున్=వీణాకాయములకు, కోలంబకముల కనుట; కాయములు= కటువగు ద్రవ్యములచేఁజేసిన యౌషధములు; భద్రఘటకములకున్=పైఁజెప్పిన భృంగారువులకు,'భద్రకుమ్భః పూర్ణకుమ్భో భృఙ్గారుః' అని యమరుఁడు; సదాభద్రఘటకములు =ఎల్లప్పుడు శ్రేయమును ఘటిల్లఁజేయునవి, కాదేని 'అభద్ర' అని పద విభాగము చేసి, అమంగళము చేయునవని చెప్పవలెను. సదాపదము 'సుప్సుపా' అని సమసించినది; బళిరె =ఆశ్చర్యము.

గోత్రమ్ములకు గోత్రమ్ము, లరుల కరు లిత్యాదిగాఁ దత్తత్సమానరూపత నొందుట యాశ్చర్య మని భావము. ఆమె స్తనములు పర్వతములవలె నున్నతమయిన వనియు, జక్కవలవలె జతగూడి యున్నవనియు, వీణాకాయలవలెఁ బొంకముగ నున్నవనియు, భృంగారువులవలె మెఱుఁగు గలిగి యున్నవనియు భావము. ఇందుఁ జందోయి వర్ణితం బయ్యె.

మ. భువిఁ గశ్చిత్పదపూర్వకంబుగ సుధీపుంజంబు తన్బల్కనా
త్మ వెతం జేకొని దేవదత్తము మిళిందద్వేణికంతాత్మ సొం
పు వెలుంగం జనియించి మించె బళి సత్తూర్వాగాంచితంబై ప్రసి
ద్ధవరాభిఖ్య నెసంగి భూరిగుణరత్నప్రాప్తి సంధించుటన్. 16

టీక: దేవదత్తము =అర్జునునిశంఖము, అజ్ఞాతకులగోత్రంబగు నొకవ్యక్తివిశేషము; భువిన్=భూమియందు; సుధీపుంజంబు = విద్వన్మండలము; తన్=తన్ను; కశ్చిత్పదపూర్వకంబుగన్– కశ్చిత్పదపూర్వకంబుగన్ పల్కన్= 'కశ్చిద్దేవదత్తః' అను వ్యవహారముచే కశ్చిత్పదము ముం దగునట్లుగా, పల్కన్=వచింపఁగా, అట్లు వ్యవహరించుట శాస్త్రములయందుఁ బ్రసిద్ధంబు; ఆత్మన్=మనస్సునందు; వెతన్=దుఃఖమును; చేకొని =పొంది; మిళిందద్వేణికంతాత్మన్– మిళిందత్ వేణి=తుమ్మెదలవలె

నాచరించుచున్న జడ గల చంద్రికయొక్క, 'మిళిందత్' అనుచోట ఆచారార్థమున క్విప్ ప్రత్యయము, కంఠాత్మన్=కంఠరూపముచేత; సొంపు వెలుంగన్= శోభ యతిశయించునట్లుగా; జనియించి=ఉదయించి; సత్పూగాంచితంబు ఐ– సత్ = విద్వాంసులయొక్క, పూగ=సంఘముచేత, అంచితంబు ఐ =పూజితంబై, పోఁకభంగి నొప్పుచున్నదై; ప్రసిద్ధవరాభిఖ్యన్ = ప్రసిద్ధమై శ్రేష్ఠమైన పేరిచేత; ప్రసిద్ధ=ప్రసిద్ధమగు, వర=కుంకుమముయొక్క, అభిఖ్యన్=కాంతిచేత, 'వరం బాహ్లీక పీతనే', 'అభిఖ్యా నామ శోభయోః' అని యమరుఁడు; ఎసంగి =ఒప్పి; భూరిగుణరత్నప్రాప్తి–భూరి=అధికమైన, గుణరత్న=రత్నములవంటి గుణములయొక్క, ప్రాప్తి=పొందిక, భూరిగుణ=గొప్పసూత్రము గల, రత్నప్రాప్తి =మణులపొందిక; సంధించుటన్=కలుగుట వలన; మించెన్=అతిశయించెను; బళి=ఆశ్చర్యము!

దేవదత్తము పండితమండలిచే కశ్చిత్పదపూర్వకముగా వ్యవహరింపఁబడుచున్నానని వెత నొంది, చంద్రికాకంఠరూపముగా జనించి, సుగుణరత్నములను బొంది, సత్పూగాంచితంబై, ప్రసిద్ధనామమును దాల్చి విరాజిల్లె ననుట. అనఁగా అర్జున శంఖావతారరూపముగా నామెకంఠము వెలయుచున్న దని భావము. పూర్వ మంతసామాన్యస్థితిలో నుండిన దేవదత్తము కంఠరూపతఁ దాల్చి తద్విపరీతముగ లోకోత్తరస్థితిచేఁ జెలంగుట యాశ్చర్యము.

చ. వనితభుజాప్రసూనసరవల్లువిలాసముఁ జెందఁగోర్కిఁగై
కొని వనజాకరాళి బిసకోటి గళద్వయసాంబుసీమ ని
ల్చి నయనపద్మము ల్దెఱచి సేయుఁ దరణ్యవలోకనం బహం
బున నిశ వాని మోడ్చి పెనుపుం దదుదంచితచింతనాగతిన్. 17

టీక: బిసకోటి=తామరతూఁడుగుంపు; వనిత భుజాప్రసూనసర వల్లు విలాసమున్ – వనిత=చంద్రికయొక్క, భుజాప్రసూనసర = పుష్పహారములవలెనుండు బాహువులయొక్క, వల్గు=మనోజ్ఞమైన, విలాసమున్=లీలను; చెందన్=పొందుటకు; కోర్కిన్ = వాంఛను;కైకొని =పొంది; వనజాకరాళిన్=పద్మాకరములయొక్కనికరమందు; గళద్వయసాంబుసీమన్– గళద్వయస = కంఠప్రమాణమైన, 'ప్రమాణే ద్వయసచ్' ఇత్యాదిసూత్రముచేఁ బ్రమాణార్థమందు గళశబ్దముపై ద్వయసచ్ ప్రత్యయము, అంబుసీమన్ = జలప్రదేశమందు; నిల్చి; నయనపద్మముల్ = నయనరూపములైన పద్మములను; తెఱచి =విప్పికొని; అహంబునన్ = పగటియందు; తరణ్యవలోకనంబు=సూర్యావలోకనమును; చేయున్=ఒనరించును; నిశన్=రాత్రియందు; వానిన్ = ఆనేత్రపద్మములను; మోడ్చి=మూసికొని; తదుదంచితచింతనాగతిన్ – తత్=ఆసూర్యునిసంబంధియైన, ఉదంచిత= అధికమైన, చింతనా=ధ్యానముయొక్క, గతిన్=రీతిని; పెనుపున్=వృద్ధిఁ బొందించును.

తపంబొనరించు వారిలోఁ గొందఱు జలమధ్యమునఁ గంఠమువఱకు నిల్చి, సూర్యావలోకనమే సేయుచు, సూర్యుం డస్తమింపఁగా నతనినే ధ్యానించుచుఁ గన్నులు మోడ్చికొని రేయి గడిపి మఱల సూర్యోదయమునఁ దన్నిరీక్షణము సల్పుట ప్రసిద్ధము. అట్లు బిసకోటి చంద్రికాభుజావిలాససిద్ధికై కొలంకునందు సూర్యావలోకనము సేయుచుఁ దపోవిశేషము నాచరించుచున్నట్లుత్ప్రేక్షింపఁబడినది. అనఁగాఁ జంద్రికాభుజాలతలు మృణాళములను మించియున్నవని ఫలితార్థము. 'ప్రాయోబ్జం త్వత్పదే నైక్యం ప్రాప్తుం తోయే తపస్యతి' అనుచోటవలె నుత్ప్రేక్షాలంకారము.

సీ. ఎంత సద్గుణలబ్ధి నెనసి మించిన నైన, మణులరంధ్రములె నెమకు ననంగ,
నెంతవారికిఁ బుట్టి యెమ్మె గాంచిన నైన, సుధపెంపుఁ బలుచగాఁ జూచు ననఁగ,

నెంత బల్మొనఁ గూడి యింపుఁ జెందిన నైనఁ, జిగురాకు నగవీథిఁ జేర్చు ననఁగ,
నెంత రసోదయం బెచ్చఁ బొల్చిన నైనఁ, జెఱకు నిష్ఫలముగాఁ జేయు ననఁగ,
తే. ననిశ మామోద మొక్కింత గనక వాయు,రీతిఁ జాంచల్యము వహించి రిత్త విరిసి
సొంపు చెడ వాడు బంధూకసుమచయంబు, తెఱవకెమ్మోవితో విరోధింపఁ గలదె. 18

టీక: ఎంత సద్గుణలబ్ధిన్=ఎంత సుగుణలాభమును, మంచిసూత్రములయొక్క లాభమును; ఎనసి=పొంది; మించిననైనన్ = అతిశయించినప్పటికిని; మణులరంధ్రములె =మణులయొక్క దోషములనే, బెజ్జములనే యని యర్థాంతరము;నెమకున్= వెదకును; అనంగన్=ఇట్లనుచుండఁగా;
ఎంతవారికిన్=ఎంతదొడ్డవారికి; పుట్టి = జనించి;ఎమ్మె=అందము; కాంచిన నైనన్ =పొందినప్పటికి; సుధపెంపున్=అమృతముయొక్క అతిశయమును; పలుచగాన్=తక్కువగా, సుధ చిక్కనిది గాకుండుట స్వభావము; చూచున్ అనఁగన్ = అవలోకించు ననఁగా;
ఎంత బల్మొనన్ = ఎంత యధికమైన సేనను, సూక్ష్మాగ్రమును; కూడి; ఇంపున్=యోగ్యతను; చెందిన నైనన్ =పొందినప్పటికి; చిగురాకు నగవీథిన్ చేర్చు ననఁగన్ = చిగురాకున్=కిసలయమును, నగన్ వీథిన్ చేర్చు ననఁగన్ = లోకమునవ్వునట్లుగా వీథికిఁ దెచ్చుననఁగా; చిగురాకున్=కిసలయమును; అగవీథిన్= వృక్షపంక్తిని, చేర్చు ననఁగ నని యర్థాంతరము;
ఎంత రసోదయంబు=ఎంత వీర్యాతిశయము, పానకముయొక్క యుదయము; ఎచ్చన్=అతిశయించునట్లుగా; పొల్చిన నైనన్=ఒప్పినప్పటికి; చెఱకున్=ఇక్షువును; నిష్ఫలముగాన్= లాభములేనిదానిగ, పండ్లులేనిదానిగ నని యర్థాంతరము; చేయు ననఁగన్ = ఒనరించుననఁగా;
అనిశము=ఎల్లప్పుడు; ఆమోదము=సంతసము,పరిమళము; ఒక్కింత గనక=కొంచెమైనను గానక; వాయురీతిన్—వాయు = వాతరోగముయొక్క, తెమ్మెరలయొక్క, రీతిన్=రీతిచేత; చాంచల్యము వహించి=చంచలత్వము నొంది; రిత్త విరిసి =వృథా గర్వముచేతఁజెడి, ఫలములేక వికసించి; సొంపు చెడన్=అందముడుగునట్లు; వాడు బంధూకసుమచయంబు=మ్లానమౌ దాసన పువ్వులగుంపు; తెఱవకెమ్మోవితోన్=చంద్రికయొక్క ఎఱ్ఱనిపెదవితో; విరోధింపఁ గలదె=పోరఁగల్గునా?

అనఁగా నంతంత యుత్కృష్టము లగు మణిసుధాపల్లవేక్షువులే యోడినపు డిట్లు సామాన్యమగు బంధూకము విరోధింపఁ జాల దనుట.చంద్రికమోవి బంధూకపుష్పపల్లవమణులకన్న మార్దవారుణ్యములు గలిగి యిక్షుసుధలకన్న తీయనైనదని ఫలితార్థము.

మ. హరిమధ్యానఘదంతకోరకసమత్వారూఢి పుణ్యాకర
స్ఫురణల్ గాంచినహీరసంతతి కిలం బొల్పొందుఁగా కబ్బునే
పరమాఘంబునఁ బొల్చు మా కని వనిం బల్మాఱు ఖేదించు బం
భరనాదంబున మొల్లమొగ్గలు గళన్మధ్వశ్రుపూరంబుగన్. 19

టీక: మొల్లమొగ్గలు =కుందకుట్మలములు;హరిమ ధ్యానఘ దంతకోరక సమత్వారూఢి– హరిమధ్యా= సింహమువంటి సన్ననినడుముగల చంద్రికయొక్క, అనఘ=ఒచ్చెములేని, దంతకోరక=కలికలవంటి దంతములయొక్క, సమత్వారూఢి =సామ్యప్రాప్తి; పుణ్యాకరస్ఫురణల్ – పుణ్య=సుకృతములకు, ఆకర=ఆధారములైన, స్ఫురణల్=ప్రకాశములను; పుణ్య

=మనోహరమైన, ఆకర=గనులయందు, స్ఫురణల్ =ఉండుటలను; కాంచినహీరసంతతికిన్=పొందిన వజ్రసంఘములకు; ఇలన్=భూమియందు; పొల్పొందుఁ గాక =ఒప్పును గాక; పరమాఘంబునన్ – పరమ=అధికమగు, అఘంబునన్=పాపము చేత; పర=శ్రేష్ఠమైన, మాఘంబునన్ = మాఘమాసమందు; పొల్చు మాకున్=ఉదయించిన మాకు; అబ్బునే=అమరునా? అని =ఇట్లనుచు; గళన్మధ్వశ్రుపూరంబుగన్ – గళత్=జాఱుచున్నట్టి, మధు=పూదేనియ యనెడు, అశ్రుపూరంబుగన్ = కన్నీటి ప్రవాహముగలదియగునట్లుగా; బంభరనాదంబునన్ =తుమ్మెదలరొదలచేత; వనిన్ =తోఁటయందు; పల్మాఱున్=సారెకు; ఖేదించున్ = దుఃఖించును. అనఁగాఁ జంద్రికయొక్క దంతకోరకములకు హీరములు సాటియగును గాని మొల్లమొగ్గలు తాము కామని దుఃఖించె ననుట. ఇట 'దుఃఖస్నేహాభిచారేర్ష్యాసహనోద్గ్రీవికాదయః' అను పూర్వోదాహృతప్రమాణమునుబట్టి 'ముఖజిత శ్చన్ద్రః పీయూషబిన్దువ్యాజేనాశ్రూణి ముఞ్చతి, ముఖజితం కమలం భ్రమరారావై రాక్రన్దతి' అని కవికల్పలతలోఁ జెప్పిన చొప్పున 'ఖేదించు బంభరనాదంబున మొల్లమొగ్గలు గళన్మధ్వశ్రుపూరంబుగన్' అని పరాజయచిహ్నంబు వర్ణిత మయ్యె. ఉత్ప్రేక్షాలంకారభేదము.

ఉ. మానినిమేటితావి గల ◊మాటలతేట గ్రహింపఁ గోరి నా
నానగరాజితప్రవచ◊నద్విజరాజులఁ జేరి యీప్సితం
బూనమి వాక్సతీపదప◊యోరుహయావకవారిఁ గ్రోల నౌ
నౌ నెఱకెంపు సొంపెసఁగె ◊నాననసీమలఁ గీరరాజికిన్. 20

టీక: మానినిమేటితావి గలమాటలతేటన్ – మానిని=చంద్రికయొక్క, మేటితావి గల=మంచిపరిమళము గల, మాటల=పలుకులయొక్క, తేటన్=సారమును; గ్రహింపన్=స్వీకరించుటకు; కోరి=ఇచ్చించి; నానా నగరాజిత ప్రవచన ద్విజరాజులన్ – నానా = అనేక, నగర=రాజధానులయందు, అజిత=గెలువఁబడనట్టి, ఓడనివారైన యనుట, ప్రవచన=ప్రకృష్టమైన వాక్కులు గల వారైన, ద్విజరాజులన్ =బ్రాహ్మణశ్రేష్ఠులను; నానానగ=అనేకవిధములైన వృక్షములయందు, రాజిత=ఒప్పుచున్న, ప్రవచన= ప్రకృష్టమైన పలుకులు గల, ద్విజరాజులన్=పక్షిపంక్తులను; చేరి=ఆశ్రయించి; ఈప్సితంబు=ఇష్టార్థము; ఊనమిన్ = పొందనందున; వాక్సతీ పదపయోరుహ యావకవారిన్ – వాక్సతీ=వాగ్దేవియొక్క, పదపయోరుహ=పాదపద్మసంబంధియగు, యావకవారిన్ =లత్తుకనీరును, వాగపేక్షగలవారు వాగ్దేవి నాశ్రయించుట సహజము; క్రోలన్=పానము సేయఁగా; కీరరాజికిన్ =చిలుకలగుంపునకు; ఆననసీమలన్=ముఖప్రదేశములయందు; నెఱకెంపు =అధికమైన యెఱ్ఱదనము; సొంపెసఁగెన్=ప్రకాశించెను; ఔనౌన్=యథార్థము. చంద్రికపలుకులు చిలుకలపలుకులకన్న ముద్దుగా నున్నవని భావము.

చ. కలికికపోలయుగ్మరుచి ◊కాంచనదర్పణకాంతిసంతతుల్
కలయఁగఁ జేరఁ బ్రేమమునఁ ◊గౌఁగిటఁ గూర్చి నిజోజ్జ్వలాంకసం
స్థలి నిడి కర్ణపూరవిల◊సత్సితరత్నమరీచిపాళికా
చ్ఛలమునఁ బాలు వోసి వరు◊స న్వరపత్త్రికడోల నూఁచెడున్. 21

టీక: కలికికపోలయుగ్మరుచి – కలికి=చంద్రికయొక్క, కపోలయుగ్మ=గండస్థలద్వయముయొక్క, రుచి=కాంతి, ఇది కర్త; కాంచనదర్పణ కాంతిసంతతుల్ – కాంచనదర్పణ=బంగరుటద్దముయొక్క,కాంతిసంతతుల్=కాంతు లనెడు శిశువులు;కలయఁగన్ =కలయుటకు; చేరన్=సమీపింపఁగా; ప్రేమమునన్=ప్రీతిచేత; కౌఁగిటన్ కూర్చి=ఆలింగనముఁ జేసికొని; నిజోజ్జ్వ

లాంకసంస్థలిన్ – నిజ=స్వీయమగు, ఉజ్జ్వల=ప్రకాశించునట్టి, అంకసంస్థలిన్=తొడమీఁదను, సమీపవనభూమియం దనుట; ఇడి=కూర్చుండఁబెట్టి; కర్ణపూర విలస త్సితరత్న మరీచిపాళికా చ్ఛలమునన్ – కర్ణపూర=కమ్మలయందు, విలసత్= ప్రకాశించుచున్న, సితరత్న=వజ్రమణులయొక్క, మరీచిపాళికా=కాంతిపరంపర లనెడు, ఛలమునన్=నెపముచేత; పాలు=క్షీరములను; పోసి; వరుసన్=క్రమముగా; వరపత్త్రికడోలన్=శ్రేష్ఠములగు మకరికాపత్త్రము లనెడు నుయ్యేలయందు; ఊఁచెడున్.

కపోలరుచి దర్పణకాంతు లనెడు శిశువులను బ్రేమమునఁ గౌఁగిలించి, తొడపైఁ గూర్చుండఁబెట్టుకొని, పాలు పోసి, యుయ్యేల నూఁచె నని దర్పణకాంతులయందు శిశువృత్తమును, కపోలరుచులందు మాతృవృత్తమును వర్ణించుటవలన దర్పణకాంతికన్నఁ గపోలకాంతి యతిశయించి యున్న దని భావము. జననులు బిడ్డలు చేర రా నిట్లుచేయుట లోకప్రసిద్ధము.

చ. వనములఁ జేరి పుణ్యతమ◊వాసనఁ గాంచి మలీమసాళిమై
త్త్రి నడఁచి మాధవాదృతి సి◊రి న్భరియించి సమత్వ మెంచు కాం
చనకళికావళి న్నిజరు◊చాబలవైఖరి రిత్తపుచ్చనో
తనుతరమధ్యనాస తిల◊దాన మొనర్చుఁ జుమీ యజస్రమున్. 22

టీక: వనములన్=అరణ్యములందు; చేరి =వసించి; పుణ్యతమవాసనన్ – పుణ్యతమ=పవిత్రతమమైన, వాసనన్=అపూర్వమును, మనోహరమైన పరిమళమును; కాంచి=పొంది; మలీమసాళిమైత్త్రిన్ –మలీమస=మలినులయొక్క, ఆళి=పంక్తియొక్క, మైత్త్రిన్ =సఖ్యమును; మలీమసాళి=నల్లనివైన తుమ్మెదలయొక్కమైత్త్రిన్ అని యర్థాంతరము; అడఁచి=పోఁగొట్టి; మాధవాదృతిన్= విష్ణువునందలి యాసక్తిచేత, వసంతానుగ్రహముచేత; సిరిన్=సంపదను,కాంతిని; భరియించి=ధరించి; సమత్వము =తనతోడి సామ్యమును; ఎంచు=కోరునట్టి; కాంచనకళికావళిన్=సంపెంగమొగ్గలపరంపరను; తనుతరమధ్యనాస=సూక్ష్మమధ్య యగు నాచంద్రికయొక్క ముక్కు; నిజరుచాబలవైఖరిన్ – నిజ=స్వకీయమైన, రుచా=కాంతియొక్క, బల=అతిశయముయొక్క, వైఖరిన్=రీతిచేత; రిత్త పుచ్చనో=వ్యర్థము సేయుటకో; అజస్రమున్=ఎల్లపుడును; తిలదానము=నూలదానమును; ఒనర్చుఁ జుమీ = చేయును సుమీ; తిలకుసుమఖండనముఁ జేయునని వాస్తవార్థము.

ఇంత యనర్ఘమైన వస్తువు నాతో సాటిని గోరుట దురితమునఁ జేసియె కాఁబోలు నని తత్పాపనిరసనమునకై తిలదానము సేయుచున్నట్లున్న దనుట. తిలదానమువలన నరిష్టనిరసనము కలుగు ననుట ‘ తిలాః పాపహరా నిత్య’ మిత్యాదులవలనఁ దేటపడును. చంద్రికయొక్క నాసికతిలకుసుమమును, సంపెంగమొగ్గను మించి విరాజిల్లుచున్న దని ఫలితార్థము.

సీ. తారకావరదీప్తిఁ ◊దనరారఁగానె కా, గనియె సతీర్థతఁ ◊గలువగుంపు
ఘనరోహితహితాత్మ ◊ననువొందఁగానె కా, నెనసె సగోత్త్రత ◊నేణికాళి
ప్రద్యుమ్నబోధివ◊ర్తనఁ దాల్పఁగానె కా, గాంచె సపక్షత ◊ఖంజనములు
నమలినశ్రీ నవ్వ◊హము మించఁగానె కా, పడసె సమిత్త్రతఁ ◊బంకజమ్ము
తే. లనుచు హృద్వీథిఁ దలఁప శ్యా◊మాళిమైత్త్రి, నిరతచకితస్వభావతా◊సరణి నతను
వాజిభావాప్తిఁ బక్ష్మస◊మాజలబ్ధి, నిందుముఖికన్నుదోయి తా◊నొందు టరుదె. 23

టీక: తారకావరదీప్తిన్ – తారకావర=చంద్రునియొక్క, దీప్తిన్=ప్రకాశముచేత; తారకా=నల్లగ్రుడ్లయొక్క, వర=శ్రేష్ఠమగు,

దీప్తిన్=ప్రకాశముచేత; తనరారఁగానె కా=ఒప్పఁగానే కదా! కలువగుంపు=కువలయసమూహము; సతీర్థతన్=ఒకగురువు గలిగియుండుటను, జలములఁ గూడి వర్తించుటను; కనియెన్ = పొందెను.ఆమె కన్నులకుఁ గలువగుంపు సహాధ్యాయిత్వము నొందెననఁగా సామ్యము వహించె ననుట. 'సతీర్థ్యాస్త్వేకగురవః' అని యమరుఁడు.

ఘనరోహితహితాత్మన్ – ఘన=గొప్పనగు, రోహిత=ఇఱ్ఱులకు,హిత=ప్రియమైన, ఆత్మన్ =స్వరూపముచేత,మత్స్యమువలె హితమైన స్వరూపముచేత నని యర్థాంతరము; అనువొందఁగానె కా= ఒప్పఁగానే కదా! ఏణికాళి=ఆఁడుజింకలగుంపు, సగోత్ర తన్=జ్ఞాతిత్వముచేత; ఎనసెన్=చేరెను. ఆమె నేత్రములకు ఏణికాళి బాంధవ్యమును బొందినదనఁగా సమాన మయ్యె ననుట. 'గోకర్ణ పృషతైణర్శ్య రోహితాః', 'రోహితో మద్గురః' అని యమరుఁడు.

ప్రద్యుమ్నబోధివర్తనన్ – ప్ర=ప్రకృష్టమైన, ద్యుమ్న=ధనమును, 'ద్యుమ్నమర్థో రై విభవావపి' అని యమరుఁడు, బోధి=తెలి పెడు, వర్తనన్=వృత్తిని; తాల్పఁగానె కా=వహింపఁగానే కదా! ఖంజనములు =కాటుకపిట్టలు; సపక్షతన్=మిత్త్రత్వమును, ఱెక్కలతోఁగూడియుండుటను;కాంచెన్=పొందెను. కాటుకపిట్ట లామెకన్నులకు సపక్షభావమును బొందెననఁగా సాదృశ్యముఁ బొందెనని భావము. నిక్షేపగర్భమైన భూమిమీఁదనే కాటుకపిట్టలు జతగూడునని ప్రసిద్ధము.

అమలినశ్రీన్= నిర్మలమైన కాంతిచేత, నిర్మలయగు లక్ష్మీదేవిచేత; అన్వహము=ఎల్లప్పుడు, ప్రతిపగటియందును; మించఁగానె కా=అతిశయింపఁగానే కదా! పంకజమ్ములు=పద్మములు; సమిత్త్రతన్=సమానమిత్త్రతను; పడసెన్=పొందెను. ఆమెనేత్రము లకు పద్మములు సమిత్త్రములయ్యె ననఁగా సమానము లయ్యె నని భావము.

అనుచున్=ఇట్లనుచు; హృద్వీథిన్=అంతరంగప్రదేశమందు; తలఁపన్; ఇందుముఖికన్నుదోయి=చంద్రికయొక్క నేత్రద్వ యము; శ్యామాళిమైత్త్రిన్ – శ్యామా=రాత్రులయొక్క, ఆళి=గుంపుయొక్క, శ్యామ=నల్లనగు, అళి=తుమ్మెదలయొక్క, మైత్త్రిన్=సఖ్యమును; శ్యామా=యౌవనమధ్యస్థలగు,ఆళి=చెలులయొక్క, మైత్త్రిన్=మిత్త్రత్వమును; నిరతచకితస్వభావతా సరణిన్ – నిరత=ఎల్లప్పుడు, చకితస్వభావతా=భయసంభ్రమప్రధానమైన స్వభావముగలుగుటయొక్క,సరణిన్=మార్గమును; అతనువాజిభావాప్తిన్ – అతనువాజిభావ=అధికమగు పక్షిత్వముయొక్క, మదనబాణముయొక్క, 'వాజినోశ్వేషు పక్షిణః' అని యమరుఁడు, ఆప్తిన్=పొందికను; పక్ష్మసమాజలబ్ధిన్—పక్ష్మ=కింజల్కములయొక్క, ఱెప్పలయొక్క, సమాజ= గుంపుయొక్క,లబ్ధిన్=ప్రాప్తిని,'పక్ష్మాక్షిలోమ్నికిఞ్జల్కే' అని యమరుఁడు;తాన్; ఒందుట=పొందుట; అరుదె=ఆశ్చర్యమా?

అనఁగా కలువలు సతీర్థము లగుటచే శ్యామాళిమైత్త్రిని, ఏణికాళి సపక్షత దాల్చుటచే నిరతచకితస్వభావమును, కాటుక పిట్టలు సపక్షములగుటచే అతనువాజిభావమును పంకజములు సమిత్త్రము లగుటచే పక్ష్మసమాజలబ్ధిని, చంద్రికానయనము లొందుట యరుదు గాదనుట. ఆమె నేత్రములు కలువలను, జింకలను, కాటుకపిట్టలను, తామరలను బోలియున్నవని భావము. బంధుశ్చౌర స్స్పృహా ద్వాదీత్యాదిపూర్వోక్తప్రమాణ మిందు గమనింపవలయు.

చ. నరవరతాపదాత్మకత ◊నాతి తపాంతరమాభ మించఁగా
హరిహయచాపముల్ బలె న◊యారె బొమ ల్గనుపట్టు నాపయి
న్సరససువర్ణసూనసర◊చంచలతోఁ జెలువందు కైశ్యకం
ధర మిలఁ గాలకంతకుల◊దర్పవిభేదనశక్తి నొప్పఁగన్. 24

టీక: నాతి=చంద్రిక; నరవరతాపదాత్మకతన్ – నరవర=రాజులకు, తాప=సంతాపమును, ద=ఇచ్చెడు,ఆత్మకతన్= స్వభా వము గల్గుటచేత, మనుష్యశ్రేష్ఠులకు తాపమును బోఁగొట్టెడు స్వభావము గలుగుటచేత; తపాంతరమాభన్ – తపాంతరమా

=వర్షాసంపదయొక్క, ఆభన్=కాంతివంటికాంతిచేత; మించఁగాన్=అతిశయింపఁగా; బొమల్=కనుబొమలు; హరిహయ చాపముల్ బలెన్=ఇంద్రధనువులవలె; కనుపట్టున్=అగపడును; ఆపయిన్=ఆపైని; సరససువర్ణసూనసరచంచలతోన్– సరస=శ్రేష్ఠములగు, సువర్ణసూన=సంపెంగపువ్వులయొక్క,సర=హారమనెడు,చంచలతోన్=మెఱపుతో; చెలువందు కైశ్యకంధరము=ఒప్పునట్టి కేశసమూహ మనెడు మేఘము; ఇలన్=భూమియందు; కాలకంఠకులదర్పవిభేదనశక్తిన్– కాలకంఠ=నీలకంఠములగు నెమిళ్లయొక్క, హంససంబంధియగు, కుల=సమూహముయొక్క, 'కలకణ్ఠః కలధ్వానే హంసే పారావతే పికే' అని విశ్వము, శ్లిష్టరూపకము, దర్ప=గర్వముయొక్క, విభేదనశక్తిన్=భేదించుసామర్థ్యముచేత; ఒప్పఁగన్=ప్రకాశింపఁగా, కనుపట్టున్ అను వెనుకటి క్రియతో నన్వయము; అయారె=ఆశ్చర్యము!

అనఁగా చంద్రిక వర్షాసంపదను బోలియుండఁగా నామెకనుబొమలు ఇంద్రధనువులను బోలినవనియు, కేశచయ మనెడు మేఘము సంపెఁగపూదండ యను మెఱపుతోఁ గూడినదై నెమిళ్లను హంసలను బాఱఁదోలుశక్తి కలిగి యుండె ననియు భావము. ఇందు కనుబొమలు వర్ణింపఁబడియె.

మ. వరబాల్యాహ మడంగ యౌవననిశా౹వక్త్రంబునం గంజజి
త్కర దంతాంశుకశోణకాంత్యుదయరా౹గశ్రీలు హాసావదా
తరుచుల్ గన్పడఁ బ్రాచిఁ బోల నలిక౹స్థానంబు దృక్చంద్రికా
శ్యురుహర్షం బొనగూర్చు సామ్యుదితచం౹ద్రోత్కర్షమున్ బూనుచున్. 25

టీక: వరబాల్యాహ మడంగన్– వర=శ్రేష్ఠమగు, బాల్య=శైశవమనెడు, అహంబు=పగలు, అడంగన్=శమింపఁగా; యౌవననిశావక్త్రంబునన్ =తారుణ్యమనెడు ప్రదోషసమయమందు, 'ప్రదోషో రజనీముఖమ్' అని యమరుఁడు; దంతాంశుకశోణకాంత్యుదయరాగశ్రీలు– దంతాంశుక=అధరముయొక్క,శోణకాంతి=అరుణప్రకాశమనెడు, ఉదయరాగశ్రీలు=ఉదయకాలిక రాగసంపదలు; హాసావదాతరుచుల్ – హాస=చిఱునగవుయొక్క, అవదాత=శుభ్రములగు,రుచుల్=కాంతులు; కన్పడన్ =అగపడుచుండఁగా; కంజజిత్కర=చంద్రిక; ప్రాచిన్=తూర్పును; పోలన్=పోలుచుండఁగా; అలికస్థానంబు=ఫాలస్థలము, ఇది కర్త; సామ్యుదితచంద్రోత్కర్షమున్–సామ్యుదిత= సగముదయించిన, చంద్ర=చంద్రునియొక్క, ఉత్కర్షమున్= ఉత్కర్షమువంటి యుత్కర్షమును; పూనుచున్ =వహించుచు; దృక్చంద్రికాశ్యురుహర్షంబు– దృక్ =కన్నులనెడు, చంద్రికాశి= వెన్నెలపిట్టలయొక్క, ఉరు=అధికమగు, హర్షంబు=సంతసమును; ఒనగూర్చున్=చేయును.

అనఁగా బాల్యమను దివసముయొక్క యవసానమై, తారుణ్యమను నిశయొక్క ప్రాదుర్భావ మగునపుడు అధరారుణ్యమును, హాసావదాతరుచులును గన్పడఁగాఁ జంద్రిక పూర్వదిశను బోలియుండు ననియు, ఫాలస్థల మర్ధోదితచంద్రుని బోలియుండు ననియు, నేత్రములు చకోరములఁ బోలు ననియు భావము. ఇట నలకస్థలము వర్ణితం బయ్యె.

మ. ఘనముక్తామయకుండలద్యుతులఁ ద౹త్కాంతాశ్రుతు ల్సాటిగా
వని నవ్వన్ సరి దామె యంచు నతితీ౹వ్రాగ్నిచ్ఛటాతప్తతై
లనికాయంబులు ముట్టి శష్కులులు ని౹ల్వ న్మేల్రుచిం గాంచి యం
గన లేగింతురు సారెపేర రహి ని౹క్కం బ్రత్యగారమ్మునన్. 26

టీక: తత్కాంతాశ్రుతుల్=ఆచంద్రికయొక్క కర్ణములు; ఘనముక్తామయకుండలద్యుతులన్– ఘన=గొప్పలగు, ముక్తామయ కుండల=మౌక్తికవికారములగు కమ్మలయొక్క, ద్యుతులన్=కాంతులచేత; సాటిగావని =శష్కులులు సరిగావని; నవ్వన్= నవ్వఁగా; శష్కులులు =చక్కిలములు; సరి తామె యంచున్ = తామే సాటియైన వనుచు; అతితీవ్రాగ్నిచ్ఛటాతప్తతైలనికాయంబులు– అతితీవ్ర=మిక్కిలి దుస్సహమగు, అగ్నిచ్ఛటా=అగ్నిపరంపరలచేత,తప్త=కాలినట్టి, తైలనికాయంబులు =తైల సమూహములను; ముట్టి=తాఁకి; మేల్రుచిన్=మంచికాంతిని, మంచి స్వాదువును;కాంచి=పొంది; నిల్వన్=నిల్వఁగా; అంగనలు = కాంతలు; సారెపేరన్ = సారెయను నెపమున; రహి=ప్రీతి; నిక్కన్=అతిశయింపఁగా; ప్రత్యగారమ్మునన్=ప్రతిగృహము నందును; ఏగింతురు=ఊరేగింతురు. బాసచేసి గెలిచినవారిని నూరేగించుట ప్రసిద్ధము. చంద్రికాకర్ణములు శష్కులులను బోలి యున్నవని తాత్పర్యము.

చ. తరుణిమొగంబె తా నని సు◊ధానిధి విష్ణుపదమ్ము ముట్టి దు
ష్కరకరజాతపాండిమ వి◊గర్హితుఁడై యశుచిం గృశింపఁ బం
కరుహము తన్ముఖోపమము ◊గా నని తా హరిపాద మంటి యిం
దిర దనుఁ జేరఁ గీర్తిఁ గని ◊దీపితజీవన మయ్యె నెంతయున్. 27

టీక: సుధానిధి=చంద్రుఁడు; తాను; తరుణిమొగంబె=చంద్రికయొక్క ముఖమే; అని=ఇట్లు వచించి; విష్ణుపదమ్మున్ = నారాయణుని చరణమును; ముట్టి =స్పృశించి, అనఁగా నేనామె ముఖమే కాని వేఱు గానని భగవంతుని చరణము బట్టి బాసచేసి యనుట, సుధానిధి విష్ణుపదమును అనఁగా నాకాశమును ముట్టి యున్నాడని సహజార్థము; దుష్కర కర జాత పాండిమన్– దుష్కర = అచికిత్స్యమైన, కర=హస్తములయందు,జాత=పుట్టినట్టి, పాండిమన్=పాండురోగముచేత, దుర్లభమైన కిరణములయందలి ధావళ్యముచేత నని స్వభావార్థము; విగర్హితుఁడై=నిందితుఁడై; వి=చక్రవాకపక్షిచేత, గర్హితుఁడై యని స్వభావార్థము; అశుచిన్= మాలిన్యముచేత, కృష్ణపక్షమందు; కృశింపన్=క్షీణింపఁగా, కృష్ణపక్షమందు చంద్రుఁడు క్షీణుఁడగుట ప్రసిద్ధము; పంకరుహము =పద్మము; తన్ముఖోపమము – తత్=ఆచంద్రికయొక్క, ముఖ=మోముతో, ఉపమము=పోలికగలదానను; కానని; తాన్= కమలము; హరిపాద మంటి =నారాయణుని చరణము ముట్టి, సూర్యునికిరణము తాఁకి; ఇందిర =సంపద, లక్ష్మీదేవి; తనున్ చేరన్= తనను పొందఁగా, కమలము లక్ష్మికి వాస మగుట ప్రసిద్ధము; కీర్తిన్=యశస్సును, బురదను, 'కీర్తిర్యశసి కర్దమే' అని విశ్వము; కని=పొంది; ఎంతయున్=మిక్కిలి; దీపితజీవనము=మంచిబ్రతుకు గలది, ప్రకాశింపఁజేయఁబడిన జలము గలది; అయ్యెన్=ఆయెను.

ఇట న్యాయమార్గము నవలంబించి సత్యమునందున్న వాఁడు మిగుల సంపదగలవాఁడై, కీర్తిమంతుఁడై, మంచిజీవనము గల వాఁ డగుననియు, అన్యాయము నవలంబించి బాసలు లోనగునవి చేయువాఁడుపాపరోగములు గలిగి గర్హితుఁడై క్షయించు ననియు వస్తుకృతవస్తుధ్వని యగును. చంద్రుఁడు, పద్మము ఈరెండును చంద్రికావదనమునకు సాటి గా వని ఫలితార్థము.

సీ. శుభకలాపాప్తి మిం◊చుమయూరి ఘనపోష్య,కోటిలోఁ దొలుదొల్తఁ ◊గొమరు గాంచె,
నఖిలశిరోధార్య◊మైన యుదీచ్యసం,తతి స్వవాలాఖ్యాన◊గతి రహించె,
నతనుగుణస్ఫూర్తి ◊నలరుహిందోళౌఘ, మనివారితాళితా◊వ్యాప్తి నెనసె,
వరరసోన్నతి నొప్పు ◊వర్షుకాంభోదజా,తము సుమనోహిత◊త్వమున వెలసె,

తే. నైన భాస్వత్సహాయత \స్వాంతసీమ, నించు కంతయుఁ గోరక \మించుతమము
తరుణి కైశ్యంబుతో విరో\ధంబు గాంచి,చిత్రము మహానిశోదయ\శ్రీల మనుట. 28

టీక: శుభకలాపాప్తిన్=శుభపరంపరాప్రాప్తిచేత, శుభమైన పింఛముయొక్క ప్రాప్తిచేత; మించుమయూరి =అతిశయించుచున్న మయూరస్త్రీ; ఘనపోష్యకోటిలోన్ – ఘనపోష్య=అధికమగునట్లుగాఁ బోషింపఁదగినవారియొక్క, మేఘములచేతఁ బోషింపఁదగినవారియొక్క, కోటిలోన్=సమూహములో; తొలుదొల్తన్=మొట్టమొదట; కొమరున్=మనోహరతను; కాంచెన్=పొందెను. అనఁగాఁ గళ్యాణపరంపరతోఁ గూడిన మయూరి తరుణికైశ్యమునకు ఘనపోష్యకోటిలోఁ జేరిన దని భావము. మయూరి కలాపముతోఁ గూడియుండుటయు, మేఘములపోష్యకోటిలో జేరి యుండుటయు స్వభావము.
అఖిలశిరోధార్య = అనఁగా నందఱకును బహుమానము చేయఁ దగినది, ఎల్లరకును శిరమున ముడువఁ దగినది; ఐన ఉదీచ్య సంతతి = అయినట్టి కురువేరుగుంపు; స్వవాలాఖ్యానగతిన్ – స్వ=తనయొక్క, వాల (=బాల)=శిశువనెడు, ఆఖ్యానగతిన్= అభిధానరీతిచేత, తనదు వాలమనెడు పేరు వొందుటచేత; రహించెన్= ఒప్పెను; ‘వాలం హ్రీబేర బర్హిష్ఠోదీచ్యా కేశాంబునామ చ’ అని యమరశేషము;
అతనుగుణస్ఫూర్తిన్ – అతనుగుణ=దొడ్డగుణములయొక్క, స్ఫూర్తిన్ =ప్రకాశముచేత, మరుని యల్లెత్రాడనెడు ప్రకాశము చేత; అలరుహిందోళౌఘము = ఒప్పారు తుమ్మెదలగుంపు, ‘హిందోళౌ రాగ మధుపౌ’ అని యుత్పలము; అనివారితాళితా వ్యాప్తిన్ – అనివారిత=నివారింపఁబడని, ఆళితా= సఖీత్వముయొక్క, మధుపభావముయొక్క, వ్యాప్తిన్=వ్యాప్తిని; ఎసఁగెన్= పొందెను;భృంగపంక్తి అతనుగుణస్ఫూర్తి నలరుటచేతఁ జంద్రికాకైశ్యమునకు సఖీత్వమును గాంచిన దనుట. భృంగపంక్తి స్మర గుణస్ఫూర్తి నలరుటయు అళి యనుపేరిచే మహిత మగుటయుఁ బ్రసిద్ధము.
వరరసోన్నతిన్ = శ్రేష్ఠమగు నాసక్త్యతిశయముచేత, వరమైన జలాధిక్యతచేత; ఒప్పు వర్షుకాంభోదజాతము = ఒప్పుచున్నట్టి వర్షించు మేఘములసముదాయము; సుమనోహితత్వమునన్=మిక్కిలి మనమునకు హితమగుటచేత, జాజికి హితమగుటచేత; వెలసెన్=ప్రకాశించెను. ఆమెకైశ్యమునకు భక్త్యతిశయము గల వర్షుకమేఘము కైశ్యముయొక్క మనసునకు హితమగుటచే వెలసె ననుట. వర్షుకమేఘము జలోన్నతిచే నొప్పుటయు, జాజికి హితమగుటయుఁ దెల్లము.
ఐనన్=వీనిస్థితి యెల్లను నిట్లైనను; భాస్వత్సహాయత= మంచి సహాయసమూహము, సూర్యుని సాహాయ్యము; స్వాంతసీమన్ =హృదయప్రదేశమందు; ఇంచుకంతయున్ = కొంచెమైనను; కోరక=అభిలషింపక; మించుతమము=అతిశయించు నంధకారము; తరుణికైశ్యంబుతోన్=చంద్రికయొక్క కేశసమూహముతోడ; విరోధంబు గాంచి = పగఁ బూని; మహానిశోదయశ్రీలము – మహత్=అధికమైన, అనిశ=సార్వకాలికమైన, ఉదయశ్రీలము = ఉదయలక్ష్మి గలదానను; మహత్=అధికమైన,నిశా= రాత్రి యందలి, ఉదయశ్రీలము = ఆవిర్భావలక్ష్మి గలదానను, ‘లక్ష్మీవాన్ లక్ష్మణ శ్శ్రీలః’ అని యమరుఁడు; అనుట=అని నుడువుట; చిత్రము = ఆశ్చర్యము!

అట్లు శుభకలాపాప్తి, అఖిలశిరోధార్య యగుట, అతనుగుణస్ఫూర్తి, వరరసోన్నతి – వీనిచే నొప్పుచున్న మయూర్యు దీచ్యహిందోళవర్షుకాభ్రములు, చంద్రికాకైశ్యమునకు వరుసగ ఘనపోష్యకోటిలోఁజేరుటయు, వాలాఖ్యానగతి దాల్చుటయు, ఆళిత్వమును గాంచుటయు, సుమనోహితమగుటయు, సహజములైనను, మంచిసహాయ మించుకైన లేక మించు నంధకారము తత్కైశ్యమువలె మహానిశోదయశ్రీల మనుట చిత్ర మని భావము.అంధకారము సూర్యసాహాయ్యములేనిదగుటవలన, నిశలోన మాత్ర ముదయశ్రీగల దాన ననవచ్చును గాని అనిశోదయశ్రీ యనఁగాఁ బగటియందును ఉదయశ్రీ గలదాన ననుకొనుట చిత్ర మనియు తెలియవలయు. చంద్రికాకైశ్యము మయూర్యుదీచ్యభృంగసంఘవర్షుకాభ్రతమముల మించియున్నదని భావము.

మ. అలరుంగల్వలనీటు, మంచుజిగియొయ్యారంబునుం, దమ్మిమొ
గ్గలచెల్వంబును, గెంపుదామరల చొక్కాటంపుటందంబు, రి
క్కలడాల్ పెంపును, మించ నిచ్చెలువురేఖం బొల్చు నాశ్యామ ని
ర్మలరక్తిం గన రాట్సుతేక్షణచకోరంబుల్ ముదం బూనవే. 29

టీక: ఇట్లు చంద్రికావయవములను నఖకచాంతము వర్ణించి యీపద్యమున వాని మొత్తము యథాసంభవముగ వర్ణితంబయ్యె. ఏలా గనిన: అలరుంగల్వలనీటు=ఒప్పుచున్న కువలయములయొక్క శృంగారవిశేషము, కలువ లనఁగా నట్లు నిశ్చయింపఁబడిన కన్నులు; మంచుజిగియొయ్యారంబునున్=హిమదీధితియొక్క సౌందర్యగర్వము, అనఁగా నట్లు నిశ్చితమగు మోము; తమ్మిమొగ్గలచెల్వంబును = పద్మముకుళములయొక్క యందమును, అనఁగాఁ జందోయి యనుట; కెంపుదామరల చొక్కాటంపుటందంబు = రక్తోత్పలములయొక్క చొక్కమగు నందము, అనఁగాఁ బైవిధముగ హస్తము లని భావము; రిక్కలడాల్ పెంపును= నక్షత్రకాంతియొక్క యతిశయమును, గోరు లనుట; మించన్=అతిశయింపఁగా; ఇచ్చెలువు రేఖన్ =పైఁజెప్పిన సౌందర్యరీతిచేత; పొల్చు నాశ్యామన్= ఒప్పుచున్న యాయౌవనమధ్యస్థ యగు చంద్రికను, రాత్రి నని యర్థాంతరము తోఁచుచున్నది. తత్పక్షమందుఁ గల్వలనీటు, మంచుజిగి లోనగువానికి శక్యార్థమే సమన్వయించు నని తెలియవలయు; నిర్మలరక్తిన్ =మంచి యనురాగముచేత; కనన్=చూడఁగా; రాట్సుతేక్షణచకోరంబుల్ – రాట్సుత=రాచకొమరులయొక్క, ఈక్షణచకోరంబుల్= దృష్టు లనెడి వెన్నెలపిట్టలు; ముదంబు=సంతోషమును; ఊనవే=వహింపవా? వహించు ననుట.

అనఁగాఁ గల్వలనీటు, మంచుజిగియొయ్యారంబు, తమ్మిమొగ్గలచెల్వంబు, కెంపుదామరలయందంబు, రిక్కలడాల్ పెంపు వీనితోఁ బొల్చు రాత్రిని గనినంతనే చకోరములకు సంతసము గల్గినట్లు గల్వలను బోలు కన్నులును, చంద్రునిబోలు ముఖమును, తమ్మిమొగ్గలఁబోలు చందోయియు, కెందామరలను బోలు కరములును, రిక్కలను బోలు గోళ్లను గలిగి విరాజిల్లు యౌవనమధ్యస్థ యగు నామెను జూచినమాత్రనె రాకొమరులనేత్రములకుసంతసము గలుగు నని భావము.

ఇట 'వాపీ కాపి స్ఫురతి గగనే తత్పరం సూక్ష్మపద్యా సోపానాళీ మధిగతవతీ కాఞ్చనీ మైన్ద్రనీలీ। అగ్రేశైలౌ సుకృతిసుగమౌ చందనచ్ఛన్నదేశౌ తత్రత్యానాం సులభ మమృతం సన్నిధానా త్సుధాంశోః' ఇత్యాదులయందువలె సాధ్యవసాయలక్షణచేత కువలయాదిశబ్దములకు నయనాదిరూపార్థము చెప్పుకొనవలయును. సాధ్యవసాయలక్షణ యనఁగా లక్షణలో నొకభేదము. లక్షణ యనఁగా శబ్దవృత్తులలో నొక్కటి. వాచకము, లక్షకము, వ్యంజకము అని శబ్దము ముత్తెఱంగులు. అందు సాక్షాత్సంకేతితార్థమును జెప్పునది వాచకము, లక్ష్యార్థమును జెప్పునది లక్షకము, వ్యంగ్యార్థమును జెప్పునది వ్యంజకము. సంకేత మనఁగాఁ బదపదార్థసంబంధవిశేషము, అదియే శక్తి యనఁ బరగుచు రూఢి, యోగము, యోగరూఢి యని త్రైవిధ్యమొందును. శాస్త్రకృత్కల్పితావయవార్థనైరపేక్ష్యముచే విశిష్టార్థబోధకమగు గవాదిశబ్దములందలివ్యాపారము రూఢి యనియు శాస్త్రకృత్కల్పితావయవార్థమాత్రసహకారముచే నర్థమును జెప్పు పాచకాది శబ్దగతవ్యాపారము యోగము అనియు, పైవిధమైన యవయవార్థసహకారముచేత విశిష్టార్థమును జెప్పు పంకజాది శబ్దగతవ్యాపారము యోగరూఢి యనియుఁ దెలియవలెను. ఇఁక స్వశక్యసంబంధము లక్షణనాఁ బరగు. 'గంగాయాం ఘోషః' అనుచోట గంగాపదశక్యము ప్రవాహము, దానితో సంయోగసంబంధము ఘోషమునకు లేనందున వాక్యార్థానుపపత్తిపరిహారమునకై గంగాపదమునకు తీర మర్థమనుట కీలక్షణ యంగీకృతంబయ్యె. ఇది ప్రయోజనవతి, నిరూఢ అని రెండు విధములు. కొంచెము ప్రయోజనము నుద్దేశించి యాశ్రయించునది ప్రయోజనవతి, 'గంగాయాం ఘోషః' ఇత్యాదిస్థలములయందు గంగాగతశైత్యపావనత్వాది ప్రతీతిప్రయోజనము నపేక్షించి యాశ్రయింపఁబడినందునఁ బ్రయోజనవతి, 'కర్మణి కుశలః' ఇత్యాదిస్థలములలోఁ గుశలాదిపదములకు 'కుశాన్

లూనాతీతి కుశలః' ఇతి వ్యుత్పత్తి సిద్ధావయవార్థసంబంధనైరపేక్ష్యముగ చతురుండు బోధితుఁడగుచున్నాఁడు గావున నిరూఢ లక్షణ యగును. ఈలక్షణ గౌణి యని శుద్ధ యనిప్రకారాంతరమున ద్వివిధ యగును. సాదృశ్యసంబంధమూలకలక్షణ గౌణి యగును, తదితరసంబంధమూలక యగునది శుద్ధ యగును. ఈశుద్ధ జహత్స్వార్థ యని యజహత్స్వార్థ యని ద్వివిధము. స్వార్థమును పరిహరించి కేవల లక్ష్యార్థమునె చెప్పునది జహత్స్వార్థ. 'గంగాయాం ఘోషః' అనుచోట శక్యార్థమైన ప్రవాహ మునకు శాబ్దబోధలలో భావములేనందున నది జహత్స్వార్థ యగును. 'కున్తాః ప్రవిశన్తి' ఇత్యాదిస్థలములయందు శక్యార్థమగు కుంతములకుఁ బ్రవేశక్రియయం దన్వయముండుటంబట్టి అజహత్స్వార్థ యైనది. ఇఁక సారోప యనియు, సాధ్యవసానిక యనియు లక్షణ ప్రకారాంతరమున ద్వివిధయై యొప్పు. సారోప యనఁగా నారోపముతోఁ గూడినది, ఆరోపము ఆహార్యనిశ్చ యము. 'గౌ ర్వాహికః, అగ్ని ర్మాణవకః సింహో మాణవకః' ఇత్యాదిస్థలములయందు సాదృశ్యముచేతను, 'ఆయుర్ఘృతమ్' ఇత్యాదులయందుఁ గార్యకారణాది సంబంధములచేతను, వాహికాదులయందు గోత్వాద్యారోపమున సారోప యనియు, విషయిమాత్రము నిలిచి, విషయము దానిచే లక్ష్యము గాఁదగియున్నచోట అనఁగ,'అయంగౌః, అయమగ్నిః, అయం సింహః' ఇత్యాదిస్థలములయందు సాధ్యవసానిక యనియుఁ దెలియవలయు. ఇట్లత్యంతాభేదముగఁ జెప్పుటకు అదియే యిది యని యతిశయోక్తి ఫలము. కావుననె 'విషయస్యానుపాదనాత్ విషయ్యుపనిబధ్యతే। యత్ర సాతిశయోక్తిస్స్యా త్కవిప్రౌఢోక్తి సమ్మతా' అని యాలంకారికులుదీని నతిశయోక్త్యలంకారభేదముగా గణించినారు. ఇఁక వ్యంజనాదిభేదములు అధికముగా నుండుటచే విస్తరభీతిని విరమించితి.

శా. ఆవామేక్షణవిభ్రమస్ఫురణమా ◊యాతన్వియొయ్యారమా
యావామామణిచారుదీప్తిచయమా ◊యాకొమ్మసౌందర్యమా
యావక్రాలకసత్కళావిభవమా ◊యాలేమబిబ్బోకమా
భావంబందు నుతింప నల్వ వశమా ◊పద్మాప్తవంశోత్తమా! 30

టీక: పద్మాప్తవంశోత్తమా =సూర్యవంశపురాజులలో నుత్తముఁడ వగు సుచంద్రుఁడా! ఆవామేక్షణవిభ్రమస్ఫురణమా = ఆ చంద్రికయొక్క విలాసస్ఫురణమా! 'విభ్రమ స్త్వరయా కాలే భూషాస్థానవిపర్యయః' ఇత్యుక్తలక్షణవిభ్రమము ఇచట సంభవిం పమివలన విభ్రమశబ్దమునకు విలాసార్థము గ్రహించిన మేలని తలంచెద. ఇట్లు 'ఇష్టేప్యనాదరో మానాద్గర్వా ద్బిబ్బోక ఈరితః' అను లక్షణముచే లక్షితమైన బిబ్బోకము మాత్రము గాక ముందు బిబ్బోకపదము శృంగారచేష్టాసామాన్యపరముగానే చెప్ప కొనవలయు నని తోఁచుచున్నది; ఆతన్వియొయ్యారమా =ఆచంద్రిక సౌందర్యగర్వమా! ఆవామామణిచారుదీప్తిచయమా = స్త్రీరత్నమగు నాచంద్రికయొక్క మనోజ్ఞకాంతిపుంజమా! 'కాంతి రేవ వయోభేద దేశకాలగుణాదిభిః। ఉద్దీపి తాతివిస్తారం యాతా చేద్దీప్తి రుచ్యతే' అని దీప్తిలక్షణము. కాంతిలక్షణము వెనుక వ్రాయంబడియె; ఆకొమ్మసౌందర్యమా = ఆచంద్రికా సంబంధి యగు సౌందర్యమా! ఆవక్రాలకసత్కళావిభవమా = కుటిలాలక యగు నాచంద్రికయొక్క శ్రేష్ఠవిద్యావిభవంబా! ఆలేమబిబ్బోకమా = ఆచిన్నదానియొక్క శృంగారచేష్టయా! భావంబందున్ = మనసునందైనను; నుతింపన్=కొనియాడు టకు; నల్వ వశమా = బ్రహ్మ తరమా?

అనఁగా బ్రహ్మకైన సాకల్యముగ నామె గుణగణము తెలిసి మనసునందైనఁ గొనియాడ వశముగా దని తాత్పర్యము. లోకో త్తర సౌందర్యవతి యని ధ్వని.

చ. అలఘుమనోభవోదయకరాంగయుతిం దగు నామిళిందకుం
తల, నలమీననేత్ర, నలతామరసానన, నాపికారవో
జ్జ్వలవరమంజులాబ్జగళసంగత, నాబిసబాహ, నాప్రవా
ళలలితపాద, నాచెలిఁ దలంపఁగ నీకెతగు న్నృపాలకా! 31

టీక: నృపాలకా = సుచంద్రుఁడా! అలఘుమనోభవోదయకరాంగయుతిన్— అలఘు=అధికమగునట్లు, మనోభవోదయకర =కామోదయకరమగు, అంగ=అవయవములతోడి, యుతిన్=కూడికచేత; తగు=ఒప్పునట్టి; ఆమిళిందకుంతలన్=ఆతుమ్మెదలఁబోలు కురులు గల యామెను; అలమీననేత్రన్=ఆమీలఁబోలు కన్నులుగల యామెను; అలతామరసాననన్=ఆతమ్మినిఁబోలు మోముగల యామెను; ఆపికారవోజ్జ్వలవరమంజులాబ్జగళసంగతన్— ఆపికారవోజ్జ్వల=ఆకోయిల పలుకులఁబోలు పల్కులచేఁ బ్రకాశించునదియు, వరమంజులాబ్జగళసంగతన్ = శ్రేష్ఠమగు శంఖమును బోలినదియు నగు కంఠ ముతోఁ గూడినదియు నగు నామెను; ఆబిసబాహన్=ఆతామరతూండ్లనుబోలు బాహువులు గల యామెను; ఆప్రవాళలలితపాదన్=ఆచిగురుటాకులవలె మనోజ్ఞములగు పాదములు గల యామెను; ఆచెలిన్=ఆస్త్రీని; తలంపఁగన్=స్మరింపఁగా; నీకె తగున్ = నీకే యుక్తము.

ఇటఁ జెప్పిన మిళిందములు,మీనములు, తమ్ములు, పికములు,శంఖములు, తామరతూడులు, చిగురుటాకులు ఇవి యెల్ల స్మరసామగ్రులలోఁ జేరి యుద్దీపనవిభావములుగాఁ జెప్పఁబడినవి కావున వానిని బోలు నవయవములు గలిగిన చంద్రిక మనోభవోదయకరాంగయుతిచేతఁ దగు నని భావము.

ఉద్దీపనవిభావము లనఁగా విభావవిశేషములు, విభావ మనునది రసోత్పాదనకారణంబు. ఇట రసశబ్దము రసస్థాయి యగు రతిహాసక్రోధాదులపరము గాని యద్వితీయానందాత్మకమయిన రసము పరము గాదు. అట్లయిన బ్రహ్మానందరూప మయి నిత్యమగుదాని కుత్పత్తిలయములు చెప్పవలసి వచ్చును. కారణ మనఁగాఁ గార్య నియత పూర్వవర్తి. ఇట్లా యుత్పాదనకారణంబు రెండు విధములు, ఆలంబనము, ఉద్దీపనము అని. రత్యాదుల కెద్ది యాలంబనమో అనఁగా విషయమో యది యాలంబనవిభావము. ఎట్లన, దుష్యంతునిరతికి శకుంతల యాలంబనము గనుక నాతని రతి కామె యాలంబనవిభావము. ఇట్లామెరతి కాయన యాలంబనవిభావ మగును. రత్యాదులఁ బోషించునవి యుద్దీపనవిభావములు. మలయానిల చంద్రోదయాదులు రతిని బోషించునవి గాన నుద్దీపనవిభావము లనం బరఁగు. ఇది యెల్లను, 'విభావః కథ్యతే తత్ర రసోత్పాదన కారణమ్। ఆలమ్బ నోద్దీప నాత్మా సద్వేధా పరికీర్తితః। ఆలమ్బన న్నాయికా స్స్యు ర్దక్షిణాద్యాశ్చ నాయకాః।ఆలమ్బన గుణ శ్చైవ తచ్చేష్టా తదలంకృతిః। తటస్థ శ్చేతి విజ్ఞేయ శ్చతుర్థోద్దీపనక్రమః। ఆలమ్బన గుణో రూప యౌవనాది రుదాహృతః। తచ్చేష్టా యౌవనోద్భూత హావభావాదికా మతా। నూపురాఙ్గదహారాది తదలంకరణ మ్మతమ్। మలయానిల చంద్రాద్యా స్తటస్థాః పరికీర్తితాః।' ఇత్యాది శాస్త్రప్రమాణములవలనఁ దెలియఁదగు. లోకమునఁ గారణములని, కార్యములని, సహకారులని చెప్పఁబడునవియె కావ్యనాట్యములయందు విభావాదిశబ్దములతో వ్యవహరింపంబడు. 'కారణాన్యథ కార్యాణి సహకారీణి యాని వై। రత్యాదేః స్థాయినో లోకే తానిచే న్నాట్యకావ్యయోః। విభావా అనుభావాశ్చ కథ్యన్తే వ్యభిచారిణః।' అను కావ్యప్రకాశము వలన నీవిషయము వ్యక్తం బగును.

చ. సరసతరోక్తి నమ్ముని సుచంద్రసమాఖ్య రహించుభూపతిం
బరిణయ మందు మంచు సకిఁబల్కెఁ దదాఖ్య రహించుమేదినీ

శ్వరమణి వీవె కాన నల∘సారసలోచన నిన్వరించు న
ప్పరమయతీశువాక్తతి య∘పార్థతఁ గైకొనునే మహీస్థలిన్. 32

టీక: అమ్మని = పూర్వమందు ద్వితీయాశ్వాసమునఁ జెప్పఁబడిన వసంతుఁ డను నామునిసరసతరోక్తిన్ = మిక్కిలి రస వంతమైన వాక్కుచేత; సుచంద్రసమాఖ్యన్ రహించుభూపతిన్ – సుచంద్రసమాఖ్యన్=సుచంద్రుఁడను పేరిచేత, రహించు = ఒప్పుచున్న, భూపతిన్=రాజును; పరిణయ మందుము=వివాహమాడుము; అంచున్=అనుచును; సకిన్=చిత్రరేఖనుగూర్చి; పల్కెన్=వచించెను; తదాఖ్యన్=ఆసుచంద్రుఁడను పేరిట; రహించు=ఒప్పుచున్న; మేదినీశ్వరమణివి = రాజశ్రేష్ఠుఁడవు; ఈవె కానన్=నీవే కావున; అలసారసలోచన = పద్మనయన యగు నాచంద్రిక; నిన్ వరించున్ =నిన్నుఁ గోరును; మహీస్థలిన్=భూతలమందు; అప్పరమయతీశువాక్తతి=ఆమునిశ్రేష్ఠుని వాక్యసమూహము; అపార్థతన్=అయథార్థతను; కైకొనునే =పొందునా? పొందదనుట. దానంజేసి నీ వవశ్యముగాఁ దత్పరిణయమునకై యత్నింపవలయు, నీప్రయత్నము సఫలమగునని భావము.

మ. అని యిట్లాత్మకథాప్రవృత్తి కలవా∘హాస్యుం డుపోద్ఘాతవ
ర్తన రాజిల్ల వినిర్మలోక్తిచయధా∘రం జంద్రికాసుందరీ
జననైకక్రమ మంతయుం దెలుప ని∘ష్ఖండైకతానాత్మచే
విని యాశ్చర్యసమగ్రతం బెనిచెఁ బృ∘థ్వీభర్త చిత్తంబునన్. 33

టీక: అని ఇట్లు; అలవాహాస్యుండు = కుముదుండను పేరు గల యాకిన్నరుఁడు; ఆత్మకథాప్రవృత్తికిన్ – ఆత్మ=తనయొక్క, కథా=కథయొక్క, ప్రవృత్తికిన్=ప్రసక్తికి; ఉపోద్ఘాతవర్తన=ఉపోద్ఘాతస్థితి; రాజిల్లన్=ప్రకాశించునట్లు; వినిర్మలోక్తిచయధారన్ = మిక్కిలినిర్మలమైన వాగ్ధారచేత; చంద్రికాసుందరీజననైకక్రమము= సుందరి యగు చంద్రికయొక్క యుత్పత్తియొక్క ముఖ్యమైన క్రమమును; అంతయుం దెలుపన్ = సర్వమును దెల్పఁగా; పృథ్వీభర్త = సుచంద్రుఁడు;నిష్ఖండైకతానాత్మచేన్ – నిష్ఖండ= అఖండమగు, ఏకతాన= ఏకాగ్రతగల, ఆత్మచేన్ = చిత్తముచేత; విని = ఆకర్ణించి; చిత్తంబునన్ = మనస్సునందు; ఆశ్చర్యసమగ్రతన్= ఆశ్చర్యపరిపూర్తిని; పెనిచెన్= వృద్ధిఁ బొందించెను. అనఁగా లోకోత్తరసౌందర్యశాలిని యగు చంద్రికయొక్క గుణగణములు వినఁగా సుచంద్రుఁని కత్యాశ్చరము దోఁచినదని భావము.

శా. పాంచాలీవరవిభ్రమశ్రవణసం∘పద్రేఖనో, మాన్మథా
భ్యంచచ్ఛాంబరికా సమున్నతినొ, పూ∘ర్వాదృష్టసంభూతినో,
మించెం దన్మహిపాలహృత్పదవి ని∘ర్మేయస్థితిం బూను త
త్పంచాస్యోపమమధ్యమాకులమణీ∘భవ్యానురాగాళికల్. 34

టీక: తన్మహిపాలహృత్పదవిన్=ఆసుచంద్రునియొక్కమనోమార్గమందు; పాంచాలీవరవిభ్రమశ్రవణసంపద్రేఖనో– పాంచాలీ =చంద్రికయొక్క,వర=శ్రేష్ఠమగు, విభ్రమ=విలాసములయొక్క, శ్రవణ=వినికిడియొక్క, సంపద్రేఖనో=సంపత్పరంపరచేతనో; మాన్మథాభ్యంచచ్ఛాంబరికాసమున్నతినొ – మాన్మథ=మన్మథసంబంధిని యగు, అభ్యంచత్ = ఒప్పుచున్న, శాంబరికా = మాయయొక్క, సమున్నతినొ=అతిశయముచేతనో; పూర్వాదృష్టసంభూతినో = జన్మాంతరీయాదృష్టసంపత్తిచేతనో; నిర్మేయస్థితిన్=అమేయవృత్తిని; పూను=వహించునట్టి; తత్పంచాస్యోపమమధ్యమాకులమణీభవ్యానురాగాళికల్—తత్= ఆ, పం

చాస్యోపమమధ్యమా = సింహమువంటి (సన్ననైన) నడుము గల స్త్రీలయొక్క, కులమణీ=సమూహమందు శ్రేష్ఠురాలైన చంద్రిక యందలి, భవ్యానురాగాళికల్=శుభోదర్కంబులగు అనురాగములగుంపులు; మించెన్ = అతిశయించెను.

అనఁగా సుచంద్రునకుఁ జంద్రికావిషయమై యనురాగోదయ మైనదని తాత్పర్యము. 'యత్ప్రేమ సంగమాత్పూర్వం దర్శన శ్రవణోద్భవమ్। పూర్వానురాగ స్సజ్ఞేయశ్శ్రవణం తద్గుణశ్రుతిః। ప్రత్యక్ష చిత్ర స్వప్నాదౌ దర్శనం దర్శన మ్మతమ్।' అనుటవలన దర్శనంబునంబోలె గుణశ్రవణంబునను రాగోదయ మగు. ఇట్లు హంసముఖమున నలగుణశ్రవణమువలన దమయంతి కనురాగోదయము చెప్పఁబడినది.

ఇట ననురాగ మనఁగా 'అంకుర పల్లవ కలికా ప్రసూన ఫల భోగ భాగియం క్రమశః। ప్రేమా మానః ప్రణయ స్స్నేహో రాగోఽనురాగశ్చ' అని చెప్పఁబడిన రతియొక్క షష్ఠావస్థారూపము గాదు. మఱి యేమన్న రతిమాత్రమో, రతిప్రథమావస్థ యగు ప్రేమమో గ్రహింపవలయు. ఇది సంగమపూర్వకాలమందు సుఘటము. 'యత్ప్రేమ సంగమాత్పూర్వ' మనునదియు నీపక్షమున నూపపాదము. ఇది 'నిసర్గే ణాభియోగేన సంసర్గేణాభిమానతః। ఉపమా ధ్యాత్మ్య విషయైః' అనుటవలన నిసర్గము నను గలుగును. ఇట్లు 'అలం వివాదేన యథా శ్రుతం త్వయా తథావిధ స్తావ దశేష మస్తు నః। మమాత్రభావైకరసం స్థితం మనో నకామవృత్తి ర్వచనీయ మీక్షతే' అను కుమారసంభవమందు రూపాదిదృష్టకారణనిరపేక్షమై, జన్మాంతరవాసనారూపమైన రతి శివునియందుఁ బార్వతికి నిసర్గముగఁ జెప్పఁబడినది.

మన్మథమాయ శాస్త్రోక్తరతిజనకసామగ్రిలో స్వతంత్రకారణముగాఁ జూపట్టదు. కాని కార్యమాత్రమును గూర్చి దైవాదృష్టాదులకుఁ గారణత చెప్పుకొన్నట్లు రతిమాత్రమును గూర్చి మన్మథునకుఁ గారణత కవిసమయసిద్ధముగాఁ జెప్పుకొనవలయు. సాహిత్యదర్పణమందు 'మౌర్వీ లోలమ్బమాలా ధను రథ విశిఖాః కౌసుమాః పుష్పకేతో ర్భిన్నం స్యా దస్యబాణై ర్యువజన హృదయం స్త్రీకటాక్షేణ తద్వత్। ఇత్యాద్యున్నేయ మన్య త్కవిసమయగతం సత్కవీనాం ప్రబన్ధే।' అని యిది కవిసమయ మని చెప్పఁబడినది. ఇట్లు 'అపి యది విశిఖా శ్శరాసనం వా కుసుమ మయం ససురాసురం తథాపి। మమ జగదఖిలం వరోరు నాజ్ఞామిద మతిలజ్ఘ్య ధృతి మ్ముహూర్త మేతి' ఇత్యాదిగాఁ బ్రబోధచంద్రోదయకుమారసంభవాది సత్కవిప్రబంధములవలన నూహింపవలయు.

ప్రస్తుతపద్యమునఁ జంద్రికాగుణశ్రుతి మన్మథమాయా జన్మాంతరవాసనాత్మకములగు త్రివిధకారణములలో దేనిచేతనో సుచంద్రునకుఁ జంద్రికయందుఁ బ్రేమోదయమైనదని వచించుటవలన, సుచంద్రునియందుఁ బైకారణత్రయమునకును సంభవము కలదని కవియాశయము సూచితమగుచున్నది.

ఇటఁ బూర్వానురాగరూపమగు విప్రలంభశృంగారంబు వ్యక్తంబు. 'విప్రలమ్భో విజ్ఞేయ స్స చతుర్ధా నిగద్యతే। పూర్వానురాగ మానౌ చ ప్రవాస కరుణావితి' అని సింగభూపాలీయమునఁ దత్ప్రమాణంబు.

విప్రలంభము శృంగారములో నొక భేదము, శృంగార మొక రసము, రసము, 'శ్లో. విభావై రనుభావై శ్చ సాత్త్వికై ర్వ్యభిచారిభిః। ఆనీయమాన స్స్వాదుత్వం స్థాయీభావో రస స్స్మృతః' అనుటచే విభావానుభావ సాత్త్వికభావ వ్యభిచారి భావములచే నిర్భరానందరూపత నొందింపఁబడిన స్థాయిభావంబే. స్థాయిభావ మనఁగా 'సజాతీయ విజాతీయై రతిస్కృతమూర్తిమాన్, యావద్రసం వర్తమాన స్స్థాయీ లవణాకరః' అనుటచే, సజాతీయభావములచేతఁ గాని, విజాతీయభావములచేతఁగాని తిరోధానము నొందక లవణాకరము దనలోఁ జేరిన మంచినీటిని క్షారరూపము నొందించునట్లు తనలోఁ జేరు భావముల నన్నింటిని తనరూపము నొందించు భావము.అది రతి, హాసము, శోకము, క్రోధము, ఉత్సాహము, భయము, జుగుప్స, విస్మయము, శమము అని నవవిధము. 'రతి ర్హాస శ్చ శోక శ్చ క్రోధోత్సాహౌ భయం తథా। జుగుప్సా విస్మయ శమాః స్థాయీభావా నవ

క్రమాత్’ అని తత్ప్రమాణంబు. ఇఁక విభావ మనఁగా రసోత్పాదకకారణము. అయ్యది ఆలంబనము, ఉద్దీపన మని రెండు విధములు. అందు శృంగారమునకు ఆలంబనము నాయికానాయకులు. ఉద్దీపనము, ఆలంబనగుణము తచ్చేష్ట, తదలంకృతి, తటస్థ మని నాల్గు విధములు గలది. ఏతత్ప్రమాణవచనములు ‘అలఘుమనోభవోదయకరాంగద్యుతిన్’ అను పద్యంపుటీకలో వ్రాయఁబడియె. అనుభావము లనఁగా నాయికానాయకుల హృద్గతములయిన రత్యాదులను దెల్పు భ్రూవిక్షేపకటాక్షాదికములు, ‘భావ మ్మనోగతం సాక్షా త్స్వహేతుం వ్యఞ్జయన్తి యే, తేఽనుభావాఇతి ప్రోక్తా భ్రూవిక్షేపస్మితాదయః’ అని తత్ప్రమాణము. ఇఁక సాత్త్వికములు శరీరభావములు, భావము లనఁగారసానుకూలవికారాత్మకము లనియు, కేవల మనోవికారరూపము లనియు మతభేదముచేఁ జెప్పఁబడిన వికారవిశేషములు, అవి శారీరము లనియు, మానసము లనియు విభజింపఁబడినవి. అందు శారీరములు సాత్త్వికము లనియు, మానసములు వ్యభిచారు లనియు నెన్నంబడుచున్నవి. సాత్త్వికములు స్తంభము, ప్రళయము, రోమాంచము, స్వేదము, వైవర్ణ్యము, కంపము, అశ్రువు, వైస్వర్యము అని యెనిమిది. ‘స్తమ్భ ప్రళయ రోమాఞ్చాః స్వేదో వైవర్ణ్య వేపథూ। అశ్రువైస్వర్య మిత్యష్టౌ సాత్త్వికాః పరికీర్తితాః’ అని తత్ప్రమాణము. వ్యభిచారిభావము లనఁగా విశేషముగ రసాభిముఖములై సర్వరసములయందుఁ జరించుచుండు భావములు. ‘వ్యభీ ఇత్యుపసర్గౌ ద్వౌ విశేషాభిముఖత్వయోః। విశేషా దాభిముఖ్యేన చరన్తో వ్యభిచారిణః’ అని చెప్పఁబడినవి. అవి ముప్పదిమూఁడు. ‘శ్లో. నిర్వేద గ్లాని శఙ్కాఖ్యా స్తథాసూయా మద శ్రమాః। ఆలస్యం చైవ దైన్యం చ చిన్తా మోహః స్మృతి ర్ధృతిః। వ్రీడా చపలతా హర్ష ఆవేగో జడతా తథా। గర్వో విషాద ఔత్సుక్య న్నిద్రాపస్మార ఏవ చ। సుప్త మ్ప్రబోధోఽమర్షా శ్చా ప్యవహిత్థ మథోగ్రతా। మతి ర్వ్యాధి స్తథోన్మాద స్తథా మరణ మేవ చ। త్రాసశ్చైవ వితర్కశ్చ విజ్ఞేయా వ్యభిచారిణః। త్రయస్త్రింశ దమీ భావా స్సమాఖ్యాతా స్తు నామతః’ అను భరతవచననిచయము తత్ప్రమాణము. ఇట్టివిభావాది కారణసామగ్రిచే నిర్భరానందరూపత నొందింపఁబడిన స్థాయియే రస మై శృంగారము, హాస్యము, కరుణము, రౌద్రము, వీరము, భయానకము, బీభత్సము, అద్భుతము, శాంతము అని నవవిధమైనది. అందు శృంగారము సంభోగ మనియు విప్రలంభ మనియు రెండు తెగలై యున్నది. సంభోగశృంగారమనఁగా సంయోగకాలావచ్ఛిన్నరతియు, సంయోగము బహిరింద్రియసంబంధరూప మనియు, ముదితపంచేంద్రియసంబంధాభావరూప విప్రలంభభిన్నస్వరూప మనియు, సంయుక్తుండను ఇత్యాకారక మతిరూప మనియు నిర్ణీతమైనది. అది పరస్పరావలోక నాలింగ చుంబనాది నానారూపమై సంక్షిప్తము, సంకీర్ణము, సంపన్నము, సమృద్ధ మని నాల్గు భేదములు గలదిగాఁ జెప్పిరి. ‘దర్శన స్పర్శనాదీనా మానుకూల్య నిషేవణమ్। ఘటతే యత్ర యూనో స్స సంభోగోఽయం చతుర్విధః। సంక్షిప్త స్సంకీర్ణ స్సంపన్నతర స్సమృద్ధిమానితి తే। పూర్వానురాగ మాన ప్రవాస కరుణానుసంభవాః క్రమశః’ అని తత్ప్రమాణము. ఇఁక విప్రలంభము వియోగకాలావచ్ఛిన్నరతి, వియోగము దంపతులకు వైయధికరణ్యరూపము గాదు,ఏకశయ్యయందును నీర్ష్యాదిసద్భావమునందును విప్రలంభమును గవులు వర్ణించుటనుబట్టి , పైవిధమున ముదితపంచేంద్రియసంబంధాభావరూపము, వియుక్తుండ నైతి ఇత్యా కారకబుద్ధిరూపము గాని యగును. అది పూర్వానురాగ, మాన, విరహ, ప్రవాస, శాప భేదమునఁ బంచవిధ మని కావ్యప్రకాశకా రాదిమతము. పూర్వానురాగ మనఁగా తరుణీతరుణులకు సంగమపూర్వకాలమందు దర్శనశ్రవణాదులచేఁ గల్గు నితరేతరప్రేమయే. ‘యత్ప్రేమ సంగమాత్పూర్వం దర్శనశ్రవణోద్భవమ్। అసౌ పూర్వానురాగాఖ్యో విప్రలమ్భ ఇతీరితః’ అని వెనుక వ్రాసిన ప్రమాణముఁ జూడవలయు.

తే. కలితమానసకైరవం ◊బలరఁ జంద్రి,కావిలాసంబు వినిన భూ◊కాంతమౌళి
కపుడు నేత్రచకోరంబు ◊లమితమోద, మొదవఁ దిలకింప లాలసం ◊బుదిత మయ్యె. 35

టీక: కలితమానసకైరవంబు= ఒప్పుచున్న మనస్సనెడు కలువ; అలరన్=సంతసించునట్లు; చంద్రికావిలాసంబు =చంద్రిక యొక్క విలాసమును,వెన్నెలయొక్క విలాసము నని యర్థాంతరము; వినిన భూకాంతమౌళికిన్ = ఆకర్ణించిన రాజశేఖరునకు; నేత్రచకోరంబులు =కన్నులనెడు వెన్నెలపుల్గులు; అమితమోదము = అధికమైన యానందము; ఒదవన్=పొందునట్లు; తిల కింపన్=చంద్రికను వీక్షించుటకు; లాలసంబు = ఆసక్త్యతిశయము, 'లాలసో లాలసాపి స్యా ద్యాచ్నా తృష్ణాతిరేకయోః, ఔత్సుక్యే చ' అని విశ్వము; అపుడు; ఉదిత మయ్యెన్ = ఆవిర్భవించెను. వెన్నెలకుఁ గుముదములు ముదమందుటయు, చకోర ములు ప్రీతిఁ గాంచుటయు ప్రసిద్ధము. అనఁగా మానస మలర నామెవిలాసము విన్న నృపతికి నేత్రోత్సవమగునట్లుగా నామెను జూడ వాంఛ గలిగె నని భావము.

ఇందు చక్షుఃప్రీతి యను ననంగదశ వచింపఁబడినది. ఆదశలు, 'చక్షుఃప్రీతి ర్మనస్సంగ స్సంకల్పోఽథ ప్రజాగరః। అరతి స్సంజ్వరః కార్శ్యం లజ్జాత్యాగో భ్రమో మృతిః। దశావస్థా భవన్త్యేతే విప్రలమ్భేఽభిలాషజే' అని చెప్పఁబడినవి. చక్షుఃప్రీతి యనఁగా దదేకాలోకనరతి. ఈయనంగదశలంగూర్చి 'అభిలాషచింతనానుస్మృతి గుణసంకీర్త నోద్వేగాః' అనియు, 'చక్షుః ప్రీతిః ప్రథమం చిన్తాసఙ్గ స్తతోథ సంకల్పః। నిద్రాచ్ఛేద స్తనుతా విషయనివృత్తి స్త్రపానాశః' అనియు నానాప్రకార, నామక్రమభేద ములు గ్రంథములయందుఁ జూపట్టుచున్నవి. తన్నిరూపణంబు విస్తరభీతిచే నుపేక్షితంబయ్యె.మావ్రాసిన కావ్యాలంకారసంగ్రహ విమర్శమునఁ దెలియు.

క. ఈకరణి మదిం దద్రజ,నీకరముఖిఁ గాంచువాంఛ ◊నిక్కం ధరణీ
లోకరమాసుతుఁడు మధు,శ్రీకరవాక్పటిమ యక్ష◊శేఖరుఁ బలికెన్. 36

టీక: ధరణీలోకరమాసుతుఁడు=భూలోకమన్మథుఁడగు నాసుచంద్రుఁడు; ఈకరణిన్=ఈరీతిగా; మదిన్=చిత్తమందు; తద్రజనీ కరముఖిన్=చంద్రముఖియగు నాచంద్రికను; కాంచువాంఛ = చూడవలెనను నిచ్ఛ; నిక్కన్=అతిశయింపఁగా; యక్షశేఖరున్ =యక్షశ్రేష్ఠుఁడైన కుముదునిగూర్చి; మధుశ్రీకరవాక్పటిమన్=మకరందసంపదవంటి సంపదనుజేయునట్టి మాటలప్రౌఢిచేత, మధురవచనముచేత ననుట; పలికెన్=వచించెను.

ఉ. ధీరవరేణ్య! నీ విపుడు ◊దెల్పిన నిర్మలచంద్రికోదయో
దారసుధారసంబు మది ◊కప్రమితప్రమదంబు నించి, యెం
తే రచియించె నవ్వనజ◊నేత్రఁ గనుంగొన నూత్నలాలసా
పూరము గానఁ జానఁ గనఁ◊బోవుద మాస్పద మావహిల్లగన్. 37

టీక: ధీరవరేణ్య=పండితోత్తముఁడవగు నోకుముదుఁడా! నీవు; ఇపుడు; తెల్పిన నిర్మలచంద్రికోదయోదారసుధారసంబు– తెల్పిన =బోధించినట్టి, నిర్మల=స్వచ్ఛమగు, చంద్రికా=చంద్రికయొక్క, ఉదయ=ఆవిర్భావ మనెడు, ఉదార=అధికమగు, సుధారసంబు = అమృతరసము, అనఁగా వెన్నెలయొక్క యావిర్భావ మమృతమయమై సుఖకరమైనట్లు చంద్రికోదయ క్రమము సుఖకరమైన దనుట; మదికిన్=మనస్సునకు; అప్రమితప్రమదంబు=అమితమైన సంతసమును; నించి =పూరించి; అవ్వనజనేత్రన్ = ఆచంద్రికను; కనుంగొనన్=చూచుటకు; నూత్నలాలసాపూరము– నూత్న=అపూర్వమగు, లాలసా = ఉత్కటమగు కోరికయొక్క, పూరము =ప్రవాహమును; ఎంతేన్ = మిక్కిలి; రచియించెన్=కలిగించెను; కానన్ = కావున; ఆస్పదము ఆవహిల్లగన్ = పని ఘటించునట్లు; చానన్=ఆసుందరిని; కనన్=చూచుటకు; పోవుదము =చనుదము.

చ. అనఁ గుముదుండు వల్కు వసు◊ధాధిప! నీశుభరూపరేఖికల్
గనుఁగొనుమాత్ర నామహిప◊కన్య యెద న్నినుఁ జేర్చి దా వరిం
చు నిది నిజంబు కంజముఖిఁ ◊జూడఁగ రమ్ము మదభ్రయాన మీ
వనువుగ నెక్కి యంచు నతఁ ◊డయ్యెడ దానిఁ దలంచె నంతలోన్. 38

టీక: అనన్=సుచంద్రుఁడిట్లు పలుకఁగా; కుముదుండు =కుముదుఁడను యక్షుఁడు; పల్కున్; వసుధాధిప=సుచంద్రుఁడా! నీశుభరూపరేఖికల్=నీమంగళకరమగు రూపమును రేఖలను, అనఁగా సాముద్రికోక్తములగు పద్మాదిరేఖల ననుట,రూపమునకు 'అఙ్గాన్యభూషితా న్యేవ ప్రక్షేప్యాద్యైర్విభూషణైః। యేన భూషితవద్భాన్తి తద్రూప మితి కథ్యతే' అని లక్షణంబు; కనుఁగొను మాత్రన్=చూచినమాత్రముననే; ఆమహిపకన్య=ఆరాజకుమారి;ఎదన్=హృదయమందు; నినున్; చేర్చి=ఉంచి; తాన్ =తానే; వరించున్=కోరును; ఇదినిజంబు=ఈమాట నిక్కము; మదభ్రయానము=నావిమానమును;అనువుగ=అనుకూలముగ; ఎక్కి =అధిరోహించి; కంజముఖిన్=పద్మముఖియైన యామెను; చూడఁగ రమ్ము =చూచుటకు రమ్ము; అంచున్= అనుచు; అతఁడు=ఆకుముదుఁడు; అయ్యెడన్=ఆసమయమున; దానిన్=ఆవిమానమును; తలంచెన్=స్మరించెను; అంతలోన్ = అట్లు స్మరించినంతలో, దీనికి 'నిల్చె' నను నుత్తరపద్యస్థక్రియతో నన్వయము.

చ. బలువగు విస్మయంబున నృపాలుఁడు గన్గొనఁ జెంత నిల్చె ని
ర్మలధనరాజపుష్పకస◊మానము, సద్వలభీతసుప్రభా
గిలితదినేశమానము, వి◊కీలితచారుమణీవితానకో
జ్జ్వలరుచిరోచమాన, మల◊వాహముఖేంద్రవిమాన మయ్యెడన్. 39

టీక: అయ్యెడన్ = ఆసమయమందు; నిర్మలధనరాజపుష్పకసమానము=ప్రశస్తమైన కుబేరుని పుష్పకవిమానముతో సదృశమైనదియు; సద్వలభీతసుప్రభాగిలితదినేశమానము – సత్=శ్రేష్ఠములైన, వలభి=చూరుపట్టెలను, ఇత=పొందినట్టి, సుప్రభా= మంచికాంతిచేత,గిలిత=మ్రింగఁబడిన,దినేశ=సూర్యునియొక్క, మానము=అహంకారము గలదియు; వికీలితచారుమణీవితానకోజ్జ్వలరుచిరోచమానము – వికీలిత=కట్టఁబడిన, చారుమణీ=అందమైనమణులయొక్క, వితానక= సమూహముచేత, ఉజ్జ్వల=ప్రకాశించుచున్న, రుచి=కాంతిచేత, రోచమానము=ప్రకాశమానమైనట్టిదియు నగు;వాహముఖేంద్రవిమానము = యక్షేశ్వరునియొక్కవిమానము; నృపాలుఁడు=సుచంద్రుఁడు;బలువగు విస్మయంబునన్ =అధికాశ్చర్యముతోడ; కన్గొనన్= చూడఁగా; చెంతన్=సమీపమున; నిల్చెన్= నిల్చెను.

చ. నిలిచిన యవ్విమాన మవ◊నీపతిచంద్రుఁడు మిత్త్రయుక్తుఁడై
యలధనదాభ్రయానము ధ◊రాత్మభవాపతివోలె నెక్కి ని
స్తులరయసంగతిం జనియెఁ ◊దోడ్తఁ దదర్వముఖాన్వయాధిరా
ట్కలితమహాత్మభావగతిఁ ◊గన్పడకుండఁ బరాళి కత్తఱిన్. 40

టీక: అవనీపతిచంద్రుఁడు=ఆరాజచంద్రుఁడు; మిత్త్రయుక్తుఁడై = చెలికానితోఁ గూడిన వాఁడయి; నిలిచిన యవ్విమానము = ఎదుట నున్న యావిమానమును;అలధనదాభ్రయానమున్=ఆకుబేరునిపుష్పకవిమానమును; ధరాత్మభవాపతి వోలెన్ =

సీతాపతియైన శ్రీరామునివలె; ఎక్కి=అధిష్ఠించి; నిస్తులరయసంగతిన్=సాటిలేని వేగముచేత; తదర్వముఖాన్వయాధిరాట్కలితమహాత్మభావగతిన్ – తదర్వముఖాన్వయాధిరాట్= ఆకుముదునిచేత,కలిత=చేయఁబడిన,మహాత్మభావ =మాహాత్మ్యముయొక్క, గతిన్= ప్రాప్తిచేత; పరాళికిన్=ఇతరజనసమూహమునకు; అత్తఱిన్=ఆసమయమున; కన్పడకుండన్=అగపడనట్లు; తోడ్తన్= వెంటనే; చనియెన్= పోయెను.

అనఁగా శ్రీరాముఁడు రావణవధానంతరమున సుగ్రీవాదిమిత్త్రయుక్తుఁడై కుబేరునిపుష్పకము నెక్కినట్లు సుచంద్రుఁడు మిత్త్రయుక్తుఁడై కుముదుని విమానము నెక్కి యాకుముదుని ప్రభావముచే నితరులకుఁ గనఁబడనివాఁడై చనియె నని భావము.

మ. వనితాదర్శనదోహదాతిశయధా౹వత్స్వాంతరంగాగ్రవ
ర్తనకన్న న్మనుమున్న యేగు మయుస౹మ్రాడ్వ్యోమయానంబునన్
జననాథేంద్రుఁడు వేడ్కతోఁ జనియె వీ౹క్షాలక్ష్యతం బూన దా
వనికాయంబులు పట్టణంబులు నదీ౹వారంబు లందంబుగన్. 41

టీక: జననాథేంద్రుఁడు = సుచంద్రుఁడు; వనితాదర్శనదోహదాతిశయధావత్స్వాంతరంగాగ్రవర్తనకన్నన్– వనితాదర్శన = చంద్రికాదర్శనమందలి, దోహదాతిశయ=ఆసక్తియొక్క అతిశయముచేత, ధావత్=పరుగెత్తుచున్న, స్వ=తనయొక్క, అంతరంగ=మనస్సుయొక్క, అగ్రవర్తనకన్నన్= ముందునికికన్నను; మనుమున్న=ముందుముందుగనే; ఏగు =పోవుచున్న; మయుసమ్రాట్= కిన్నరప్రభువగు కుముదునియొక్క, వ్యోమయానంబునన్ =విమానమువలన; దావనికాయంబులు = అడవులగుంపులు; పట్టణంబులు =నగరములు; నదీవారంబులు=నదీసమూహములు; అందంబుగన్=సుందరమగునట్లు; వీక్షాలక్ష్యతన్=దృగ్విషయతను; పూనన్=వహింపఁగా; వేడ్కతోన్=సంతసముతోడ; చనియెన్=పోయెను.

చ. చని చని తత్తరోమహిమఁ ౹జయ్యన నాక్షణదోదయక్షమే
శనగర మప్పు డబ్బుర మె౹సంగఁ గనుంగొని యంతఁ జంద్రికా
వనజముఖీవిలాసవన౹వాటికఁ దత్తిలకామ్రకుందచం
దనసుమవాసితానిలవి౹తాన మెదుర్కొనఁ జేరి యచ్చటన్. 42

టీక: తత్తరోమహిమన్=ఆవిమానవేగాతిశయముచేత; చని చని =పోయి పోయి; ఆక్షణదోదయక్షమేశనగరము = పూర్వోక్తమగు క్షణదోదయుఁడను రాజుయొక్క నగరమును; అప్పుడు; అబ్బురము=ఆశ్చర్యము; ఎసంగన్=అతిశయించునట్లు; కనుంగొని = చూచి; అంతన్=అంతట; చంద్రికావనజముఖీవిలాసవనవాటికన్=చంద్రికయొక్క క్రీడావనమును; తత్తిలకామ్రకుందచందనసుమవాసితానిలవితానము– తత్=ఆవనమునకు సంబంధించిన, తిలక=బొట్టుగు, ఆమ్ర = మామిడి, కుంద = మొల్ల, చందన =గంధపుచెట్లయొక్క,సుమ=పుష్పములచేత, వాసిత=పరిమళించు, అనిలవితానము=వాయుసమూహము; ఎదుర్కొనన్=అభిముఖముగా రాఁగా, పూజనీయులు విచ్చేయునపుడు వారల కెదురుగఁ బోవుట సముచిత మని వాయు వా రాజున కెదురుగఁ బోయినట్లున్న దనుట; చయ్యనన్= శీఘ్రముగ; చేరి =ప్రవేశించి; అచ్చటన్=ఆవనమందు. దీనికి 'కాంచె' నను ముంగలిపద్యమందలి క్రియతో నన్వయము.

చ. హరిముఖనేత సూప వసు◊ధాధిపచంద్రుఁడు గాంచె ముంగలన్
హరినిభమధ్యమన్, హరిక◊రాదృతశంఖసమానకంధరన్,
హరిజయశాలివాణి, హరి◊దంశుకవైరిశరాససుభ్రువున్,
హరిణసపత్ననేత్ర, హరి◊ణాంకముఖిన్, హరినీలకుంతలన్. 43

టీక: హరిముఖనేత = తురంగవదనశ్రేష్ఠుండగు కుముదుఁడు; చూపన్=చూపఁగా; వసుధాధిపచంద్రుఁడు =రాజశ్రేష్ఠుఁడగు సుచంద్రుఁడు; ముంగలన్=ఎదుట; హరినిభమధ్యమన్=సింహముయొక్క నడుమువంటి నడుము గలదానిని; హరికరాదృత శంఖసమానకంధరన్ = విష్ణుకరముచే నాదృతమైన శంఖము (పాంచజన్యము) వంటి మెడ గల దానిని; హరిజయశాలివాణిన్= చిలుకల జయించుటచేఁ బ్రకాశించు పలుకులు గలదానిని; హరిదంశుకవైరిశరాససుభ్రువున్ – హరిదంశుక= దిగంబరుఁడగు శివునకు, వైరి=శత్రువైన మరునియొక్క,శరాస=వింటినిబోలు, సుభ్రువున్=మంచిబొమలు గల దానిని; హరిణసపత్ననేత్రన్= ఏణములకుఁ బగలగు నేత్రములు గల దానిని; హరిణాంకముఖిన్ = చంద్రునివంటి ముఖము గల దానిని; హరినీలకుంతలన్ = ఇంద్రనీలమణులఁ బోలు నలకలు గల దానిని, అట్టి చంద్రిక ననుట; కాంచెన్=చూచెను. 'యమానిలేన్ద్రచంద్రార్కవిష్ణుసింహాంశు వాజిషు, శుకాహి కపి భేకేషు హరిః' అను నామలిఙ్గానుశాసనముచే హరిపదమున కిట తురంగ, సింహ, విష్ణు, శుక, ఇంద్రరూపార్థములు తెలియఁదగినవి.

సీ. తానచాతురి కద్భు◊తముఁ దాల్చుపోలిక, వరమణిపుత్రికల్ ◊శిరము లూఁప,
ఘనగానసుధఁ గ్రోలి ◊తనివొంది బయ లూన్చు, గతి శిలాతతి జలౌ◊ఘమ్ముఁ గురియ,
యతిలయశ్రుతులవి◊స్తృతితత్త్వ మూనిన,చాయ నాళులు విని◊శ్చలతఁ దాల్ప,
బలురక్తి లోనిండి ◊పట్టఁజాలక వెలు,వడుదారి వల్లికల్ ◊ కడుఁ జిగుర్ప,
తే. హారివసుపీఠికాసీన◊యై విపంచిఁ, గలసి గానము సేయు భూ◊కాంతపుత్త్రిఁ
గనకనిభగాత్రిఁ గాంచి య◊య్యినకులుండు, చాల నాశ్చర్యజలరాశిఁ ◊దేలె నపుడు. 44

టీక: తానచాతురికిన్ – తాన=తన్నకారముతోఁ బాడెడు పాటలయొక్క, చాతురికిన్=నేర్పునకు; అద్భుతమున్ =ఆశ్చర్యమును; తాల్చుపోలికన్ =వహించురీతి; వరమణిపుత్రికల్ =శ్రేష్ఠములగు మణిమయములైనప్రతిమలు; శిరములు=తలలను; ఊఁపన్= చలింపఁజేయఁగా;
ఘనగానసుధన్=అధికమగు గానామృతమును; క్రోలి =పానముచేసి; తనివొంది =తృప్తిపొంది; బయ లూన్చు గతిన్= బయల్పఱచురీతిగా; శిలాతతి =పాషాణసంఘము; జలౌఘమ్మున్ = నీటిప్రవాహమును; కురియన్=వర్షింపఁగా;
యతిలయశ్రుతుల విస్తృతితత్త్వము– యతి=యతులయొక్క, లయ=లయమనెడి తాళప్రాణముయొక్క, శ్రుతుల=స్వరారంభకావయవవిశేషముయొక్క, విస్తృతి =విస్తారముయొక్క,తత్త్వము =స్వరూపమును; ఇట తాళప్రాణములు, 'కాలో మార్గః క్రియాఙ్గానిగ్రహో జాతిః కళా లయః। యతిః ప్రస్తారకశ్చైవ తాళప్రాణా దశ స్మృతాః' అనునవి, శ్రుతి యనఁగా, 'ప్రథమ శ్శ్రవణా చ్ఛబ్ద శ్శ్రూయతే హ్రస్వమాత్రకః। సా శ్రుతి స్సంపరిజ్ఞేయా స్వరావయవలక్షణా' అని చెప్పఁబడినది. దాని విస్తృతి, 'చతుశ్చతుశ్చైవ షడ్జమధ్యమపఞ్చమాః। ద్వేద్వే నిషాదగాన్ధారౌ త్రిస్త్రీ రిషభధైవతౌ' ఇత్యాదిగాఁ జెప్పబడినది; తత్త్వము = స్వరూపమును;ఊనిన చాయన్= వహించినరీతి; ఆళులు =చెలియలు; వినిశ్చలతన్=నైశ్చల్యమును; తాల్పన్=వహింపఁగా;

బలురక్తి = అధికానురాగము; లోన్=అంతరంగమందు;నిండి; పట్టన్ చాలక= ఆఁగలేక; వెలువడుదారిన్ = బయల్పడురీతిగ; వల్లికల్ = లతలు; కడున్=మిక్కిలి; చిగుర్పన్=చివురింపఁగా;

హారివసుపీఠికాసీన యై– హారి=మనోజ్ఞమగు, వసుపీఠికా=బంగరుపీఁటయందు, ఆసీన ఐ = కూర్చుండినదై; విపంచిన్ = వీణను; కలసి=చేరి; గానము సేయు = పాడుచుండెడు; భూకాంతపుత్త్రిన్=రాజకుమారిని;కనకనిభగాత్రిన్ = బంగరుతో, కాదేని సంపెఁగపువ్వుతో సాటియగు శరీరము గలదానిని, అట్టి చంద్రికను; కాంచి = చూచి; అయ్యినకులుండు= ఆసుచంద్రుఁడు; చాలన్= మిక్కిలి; ఆశ్చర్యజలరాశిన్ = విస్మయమను సముద్రమునందు; అపుడు=ఆదర్శనసమయమందు; తేలెన్=తేలెను. 'అపూర్వదర్శనా చ్చిత్తవిస్తారో విస్మయో మతః' అనుటవలన లోకోత్తరసౌందర్యశాలిని యగు నాసుదతిని జూడ రాజునకు విస్మయోదయం బయ్యె ననుట.

చ. తెఱలక కన్యఁజేరి తదధీనతఁ బొల్చి యినావలోక మ
త్తఱి నలర న్మిళద్ధరిరథంబయి మున్నె మనోభ్ర మెంతయున్
మెఱయఁగ నంతకన్న మును మించె శ్రమోదకవృష్టి చిత్రతన్
దొఱయఁగ మున్నె క్షేత్రమునఁ దోరముగాఁ బులకాఖ్యసస్యముల్. 45

టీక: తెఱలక = బయలువెడలక; కన్యన్= చంద్రికను, కన్యారాశినని యర్థాంతరము; చేరి = పొంది; తదధీనతఁ బొల్చి = ఆ కన్యకు వశమై యొప్పారి; ఇనావలోకము– ఇన= రాజుయొక్క, అవలోకము=చూపు, సూర్యప్రకాశమని యర్థాంతరము, అనఁగా ధర్మధర్ముల కభేదగ్రహణముచే సూర్యుఁడే యనుట, సూర్యుఁడు కన్యారాశిని జేరఁగా నని ఫలితార్థము, 'ఇన స్సూర్యే ప్రభౌ' అని యమరుఁడు; అత్తఱిన్=ఆసమయమున; అలరన్=ఒప్పఁగా; మనోభ్రము=మనస్సనెడు నాకసము; మిళద్ధరిరథం బయి– మిళత్=సంబంధించినట్టి, హరిరథంబు = చిలుక రథముగాఁ గల మరుఁడుగలదై, ఇంద్రరథమగు మేఘము గలదై యని యర్థాంతరము; ఎంతయున్=మిక్కిలి; మెఱయఁగన్= ప్రకాశింపఁగా, మెఱపులు మెఱయఁగా; మున్నె =అంతకు ముందె; శ్రమోదకవృష్టి = స్వేదోదకవర్షము; చిత్రతన్= ఆశ్చర్యముచేత; దొఱయఁగన్=పొందఁగా; అంతకన్న మును = దానికంటెను పూర్వమె; క్షేత్రమునన్=శరీరమందు, సస్యోచితభూప్రదేశమునందు; తోరముగాన్ = అధికముగా; పులకాఖ్యసస్యముల్= పులకలనెడు సస్యములు; మించెన్=అతిశయించెను;

అనఁగా సుచంద్రునిదృష్టి కన్యను జేరి తెఱలక యుండఁగా అనఁగా దర్శనానందము ననుభవించుచుండఁగా మనంబునఁ గందర్పోదయమైన దనియు, మేనెల్ల స్వేదోద్గమ మయ్యె ననియుఁ, బులక ల్ననలొత్తె ననియు భావము. సూర్యుఁడు కన్యా రాశిని చేరఁగా వర్షర్తు వగుటంజేసి వృష్టి గలుగుట లోకప్రసిద్ధము. సూర్యుఁడు కన్యారాశిని జేరుట, తదనంతరము మేఘయుక్త మై యాకాశము మెఱయుట, తదనంతరము వర్షము, తదనంతరము క్షేత్రమున సస్యోదయమని క్రమముండఁగా, మేఘముతోఁ జేరి యాకసము మెఱయుటకు మున్ను వర్షమును, దానికి మున్ను క్షేత్రమున సస్యములు గలుగుటయు చిత్రమని తాత్పర్యము. ఇచట సస్యమునకు వర్షము, వర్షమునకు మబ్బుతోఁ గూడియున్న మిన్ను మెఱయుట కారణము గాకున్నను ఆకసము మెఱ యుటకు మున్ను వృష్టి గలిగె ననియు, నంతకు మున్ను సస్య ముదయించె ననియు, కార్యకారణభావమునకు వైపరీత్యమును బట్టి అత్యంతాతిశయోక్త్యలంకారము. 'అత్యంతాతిశయోక్తి స్స్యాత్పౌర్వాపర్యవ్యతిక్రమే' అని తల్లక్షణము. అవిదితక్రమము లుగా నతిశీఘ్రకాలములో నుదయించినవని ఫలితార్థము.

'పాంచాలీశుభవిభ్రస్ఫురణ' యను పద్యమునందే భవ్యానురాగాళికల్ అనుటచేత రాగోదయమైనదని యేర్పడినను

రాగము ఆసక్తిరూపమనియు, కామ ముత్కటాసక్తిరూపమనియు సిద్ధాంతము గాన గుణశ్రవణమున సామాన్యాసక్తి గలిగి సాక్షాద్దర్శనమున నుత్కటాసక్తి గలిగినదని తెలియునది. 'ధ్యాయతో విషయా న్పుంస సఙ్గ స్తేషూపజాయతే। సఙ్గా త్సంజాయతే కామః॥' అను గీతావచనమునందును దద్భాష్యతద్వ్యాఖ్యలయందును రతికామముల స్వరూపము పైవిధముగ నున్నది. ఈవిషయము విస్తారముగఁ గావ్యాలంకారసంగ్రహమున 'వనితయుఁ బతియు' ననుపద్యము టీకలో మాచే వ్రాయఁబడినది. ఇట సుచంద్రునకు స్వేదము, పులకలు అను సాత్త్వికభావోదయము చెప్పఁబడినది. సాత్త్వికము లనఁగా ననుభావవిశేషములు. అనుభావము లనఁగా, 'అనుభావయన్తి' అను వ్యుత్పత్తిచే జాతరత్యాద్యనుమాపకములు. 'భావం మనోగతం సాక్షాత్స్వహేతుం వ్యఞ్జయన్తి యే। తేఽనుభావా ఇతి ప్రోక్తా భ్రూవిక్షేపస్మితాదయః॥' అని తల్లక్షణము వ్రాయఁబడియె. స్తంభాదులిట్టి యనుభావములలోఁ జేరినను దానికి సాత్త్వికములని నామము గలుగుట సత్త్వమాత్రమునఁ గలుగుటంజేసి. ఇందులకుఁ బ్రమాణము, 'సర్వేపి సత్త్వమూలత్వా ద్భావా యద్యపి సాత్త్వికాః। తథా ప్యమీషాం సత్త్వైకమూలత్వా త్సాత్త్వికప్రథా। అనుభావాశ్చ కథ్యన్తే భావసంసూచనా దమీ। ఏవం ద్వైవిధ్య మేతేషాం కథితం భావకోవిదైః।' అని సింగభూపాలీయము. సత్త్వ మనఁగా 'అన్యేషాం సుఖదుఃఖాదిభావేషు కృతభావనమ్। ఆనుకూల్యేన యచ్చిత్తం భావకానాం ప్రవర్తతే। సత్త్వం తదితి విజ్ఞేయం ప్రాజ్ఞైః సత్త్వోద్భవానిమాన్। సాత్త్వికా ఇతి జానన్తి భరతాద్యా మహర్షయః। తే స్తమ్భస్వేదరోమాఞ్చస్వరభేదా శ్చ వేపథుః। వైవర్ణ్యమశ్రుప్రళయా విత్యష్టౌ పరికీర్తితాః॥' అనుట లోనగునది యాగ్రంథముననే నిరూపింపఁబడినది. ఇట హర్షాతిశయమున స్వేదరోమాం చములు. 'నిదాఘ హర్ష వ్యాయామ శ్రమ క్రోధ భయాదిభిః। స్వేద స్సంజాయతే' యనియు, 'రోమాఞ్చో విస్మయోత్సాహ హర్షాద్యైః' అనియు నందులకుఁ బ్రమాణము. ఇట శ్రమోదకశబ్దము స్వేదోదకమందు రూఢమని కవిహృదయముగాఁ గొనఁదగి యున్నది.

చ. తరుణిమెఋంగుటారుగడ ◊దారున నెక్కి నృపాలుచూపుదొ
మ్మరి రమణీయహారగుణ◊మండలిసందునఁ దారుచుం బయో
ధరసృతి లాగు వైచి వడిఁ ◊దార్కొని సమ్ముఖరాజుఁ జేరఁ బం
కరుహశరుండు శార్యభిధ◊కాహళి మ్రోయఁగఁ జేసె నత్తఱిన్. 46

టీక: నృపాలుచూపుదొమ్మరి =రాజదృష్టి యనెడు దొమ్మరి;తరుణిమెఋంగుటారుగడన్ = చంద్రికయొక్క మెఱయుచున్న యారనెడు గడను; దారునన్=వేగముగ; ఎక్కి=అధిష్ఠించి; రమణీయహారగుణమండలిసందునన్‌– రమణీయ=మనోజ్ఞమగు, హార=ముత్యంపుపేరు లనెడు, గుణ=త్రాళ్లయొక్క, మండలి=సమూహముయొక్క, సందునన్=మధ్యభాగమున నుండు నవకాశమున; తారుచున్=చేరుచు; పయోధరసృతిన్ = స్తనసీమ యనెడుగగనమందు; లాగు వైచి =లాగు వేసి; వడిన్ = వేగముగా; తార్కొని =కదిసి; సమ్ముఖరాజున్=చంద్రునివంటి మోమనెడు నెదుట నున్న రాజును; చేరన్=చేరఁగా; పంకరుహశరుండు=మరుండు; శార్యభిధకాహళిన్=గొరువంక యను పేరుగల బూరుగును; అత్తఱిన్=ఆలాగువేచు సమయమందు; మ్రోయఁగన్=ధ్వనించునట్లు; చేసెన్=చేసెను.

లోకమ్మున దొమ్మరి గడపాఁతి, దాని నెక్కి, త్రాళ్లనుండి జాఱి, పైపైన లాగువైచి యధిపతి యెదుట నిలుచుటయు, నత్తఱిఁ దదీయుఁడు కాహళి మ్రోఁయఁగఁ జేయుటయుఁ బ్రసిద్ధంబు. అట్టు లానరపాలుచూపు తొలుత నాసుందరిరోమరాజిపైఁ బ్రసరించి పయోధరములను జేరి యామె మోమున కెదుట నిలిచియుండె ననియు, నప్పుడు గోరువంక కూయసాగిన దనియు, మరుఁడు మ్రోయఁగఁజేసె ననుటచే నాకూఁతరాజునకు మిక్కిలి కామోద్దీపకముగ నుండెననియు భావము.

చ. అవనిపకన్యనాభిజల◊జాకరసన్నిధి రోమవల్లికా
నవతరయష్టికాపదము◊నం బ్రియయోగము వూని శ్రీసతీ
భవమహిమాప్తి సిద్ధరస◊పాళికఁ బొందియుఁ బొంద వయ్యెఁ ద
త్ప్రవిమలకంధరాధ్వచర◊తన్ నృపునేత్రము లద్భుతస్థితిన్. 47

టీక: నృపునేత్రములు=సుచంద్రుని చూపులు;అవనిపకన్యనాభిజలజాకరసన్నిధిన్– అవనిపకన్య=రాజపుత్త్రి యగు చంద్రిక యొక్క, నాభి=పొక్కిలి యనెడు,జలజాకర=సరస్సుయొక్క, సన్నిధిన్=తీరమునందు; రోమవల్లికానవతరయష్టికాపదమునన్– రోమవల్లికా=నూఁగారనెడు,నవతర=అత్యపూర్వమైన,యష్టికాపదమునన్=యష్టికాసన మనెడు యోగాసనవిశేషమునందు; ప్రియయోగము=ప్రీతియుతమగు సంగతి యనెడు ప్రియధ్యానమును; పూని =వహించి; శ్రీసతీభవమహిమాప్తిన్– శ్రీసతీభవ=శ్రీపుత్త్రుండగు మరునియొక్క, శ్రీమంతులగు పార్వతీపరమేశ్వరులయొక్క, మహిమాప్తిన్=మాహాత్మ్యప్రాప్తిచేత; సిద్ధరసపాళికన్– సిద్ధరస=సిద్ధమైన శృంగారరసముయొక్క, దివ్యరసముయొక్క, పాళికన్=పరంపరను; పొందియున్; తత్ప్రవిమలకంధరాధ్వచరతన్ – తత్=ఆకన్యయొక్క, ప్రవిమల=నిర్మలమగు,కంధరాధ్వ=కంఠమార్గమందు,చరతన్ = సంచరణమును, 'అధ్వని చరతీత్యధ్వచరః' అను విగ్రహమందు 'చరేష్టః' అని కర్త్రర్థమందు టచ్ ప్రత్యయము, దానిపై భావార్థమందు తల్ ప్రత్యయము రాఁగా చరించువానిధర్మము చరణమే యగును, ప్రసిద్ధమై నిర్మలమైన మేఘమార్గమగు గగనమునందు సంచారమును అని యర్థాంతరము; అద్భుతస్థితిన్=ఆశ్చర్యవర్తనచే; పొందవయ్యెన్=వహింపవయ్యెను.

పుణ్యతీర్థసన్నిధిని యష్టికాసనముపై యోగనిష్ఠాగరిష్ఠుండై పార్వతీపరమేశ్వరానుగ్రహమున సిద్ధరసమును బొందినవాఁడు గగనమార్గసంచరణమును బొందుట ప్రసిద్ధము. అట్లు పొందకుండుట చిత్రముగ నున్నదని తాత్పర్యము. సుచంద్రనరపాలునిచూపు లాకన్యయారునందుఁ జేరి యందుఁ బ్రీతి గలిగి స్మరావేశముచే శృంగారసరససిద్ధి ననఁగా నానందాతిశయమును బొంది కంఠముపైఁ బాఱక సుఖపారవశ్యమున నచటనే నిలిచియుండెనని ఫలితార్థము.

మ. స్తనమేరుస్థలవృత్తి నుబ్బు వళికా◊స్వర్దీర్ఘిపినీభంగకు
ర్దనఁ జొక్కుం గను మధ్యనాకవిహృతిన్ ◊రమ్యోరురంభోపగూ
హనలబ్ధిం జెలఁగు న్నృపేక్షణము లా◊హా చిత్ర మేణీవిలో
చనయాస్యేందుసుధైకసేవ ననిమే◊షత్వంబు సంధిల్లుటన్. 48

టీక: నృపేక్షణములు=ఆరాజుదృష్టులు; ఏణీవిలోచనయాస్యేందుసుధైకసేవన్– ఏణీవిలోచన=లేడికన్నులవంటి కన్నులు గల చంద్రికయొక్క, ఆస్యేందు=ముఖచంద్రునియొక్క, సుధా=అమృతముయొక్క, ఏక=ముఖ్యమగు, సేవన్=సేవచేత; అనిమేషత్వంబు =ఱెప్పపాటులేమి, దేవత్వము; సంధిల్లుటన్ =సంభవించుటచేత; స్తనమేరుస్థలవృత్తిన్– స్తన=కుచములనెడు, మేరుస్థల = మేరుపర్వతప్రదేశమున, వృత్తిన్=ఉనికిచేత; ఉబ్బున్=వృద్ధిఁబొందును; వళికాస్వర్దీర్ఘిపినీభంగకుర్దనన్– వళికా=వళిత్రయమనెడు, స్వర్దీర్ఘిపినీభంగ=వ్యోమగంగాతరంగములయందు,కుర్దనన్=క్రీడచేత, 'క్రీడా ఖేలా చ కుర్దనమ్' అని యమరుఁడు; చొక్కున్ =సుఖపరవశమగును; మధ్యనాకవిహృతిన్– మధ్యనాక=కౌనెనెడు నాకసమందు, విహృతిన్= విహారమును; కనున్=పొందును. స్వర్గవిహారము నొందు ననుట దేవత్వపక్షమున కత్యంతానుగుణం బైనను స్తనములు మేరువుతోడను, వళులు స్వర్గంగాతరంగములతోడను, ఊరువు లనంటులతోడను సాటియగునట్లు కౌనాకసముతోడనే సాటియగును

గాని స్వర్గముతోడఁ గాదని యిట్లు వ్యాఖ్యాతంబయ్యె; రమ్యోరురంభోపగూహనలబ్ధిన్—రమ్య=మనోజ్ఞములగు, ఊరు=తొడలనెడు, రంభా=దివ్యస్త్రీయొక్క, ఉపగూహన=కౌగిలింతయొక్క,లబ్ధిన్=ప్రాప్తిచేత; చెలఁగున్=ఒప్పును; ఆహా చిత్రము=అత్యాశ్చర్య మనుట.

అనఁగాఁ బ్రసిద్ధచంద్రమండలస్థసుధను గ్రోలి దేవత్వమును గాంచినవారు మేరుస్థలవాస, స్వర్గంగాతరంగవిహార, వ్యోమ మార్గసంచార, రంభాలింగనాదుల నొందినట్లు నృపేక్షణములు చంద్రికాముఖచంద్ర సుధారసపానమున నట్టి విభవము నొందుట యాశ్చర్యతమం బనుట. ఆకన్యయొక్క లోకోత్తరముఖాద్యవయవములయందుఁ బ్రసరించి ఱెప్పపాటులేని నృపుని చూపులు నిరతిశయానందము నొందెనని భావము.

తే. ఉజ్జ్వలతరానురాగసం◊ధ్యోదయంబు, దగ మహాస్తంభభావంబు ◊దాల్చినట్టి
పతిమనంబున నీరజాం◊బకుఁడు దోఁచె, నపుడు హరిరథసంలబ్ధి ◊ననుసరించి. 49

టీక: ఉజ్జ్వలతరానురాగసంధ్యోదయంబు– ఉజ్జ్వలతర=మిక్కిలి ప్రకాశించునట్టి, అనఁగా నుత్కటమైనట్టి, అనురాగ=ప్రీతి విశేష మనెడు, సంధ్యా=సంధ్యాకాలముయొక్క, ఉదయంబు =ప్రాదుర్భావము; తగన్=ఒప్పఁగా; మహాస్తంభభావంబు– మహత్=అధికమైన, స్తంభభావంబు = చేష్టారహితత్వమును, గృహాధారదారువిశేషభావమును; తాల్చినట్టి పతిమనంబునన్ = వహించినట్టి నృపునిచిత్తమందు; నీరజాంబకుఁడు = పద్మబాణుం డగు మరుండనెడు పద్మనయనుండగు నారాయణుండు; హరిరథసంలబ్ధిన్ = మందమారుతమనెడు తేరియొక్క సంలబ్ధియను సింహదేహప్రాప్తిని; అనుసరించి=పొంది; అపుడు; తోఁచెన్ = అగపడెను.

పూర్వము హిరణ్యకశిపువధకై సంధ్యాకాలమున స్తంభమధ్యమున నారాయణుండు నృసింహరూపము దాల్చి తోఁచి నట్లు నృపునిమనం బుత్కటరాగంబయి స్తంభభావంబు దాల్చి యుండ నందు మందమారుతము నధిష్ఠించి కాముఁడు దోఁచె ననుట. ఆరాజున కనురాగోద్రేకమయి మనము స్తంభమనెడు సాత్త్వికభావము దాల్చిన దనియు, నపుడు మరుఁడు మందమారు తారూఢుండయి సాక్షాత్కరించిన యట్లు తోఁచెననియు భావము. 'స్తంభ స్స్యాత్ నిష్క్రియాఙ్గత్వమ్' అనుటచే స్తంభము శరీరధర్మము గాఁదగియున్నను, రాగాదిజన్యమానసస్తంభము లేక శారీరము గలుగదనియు 'సత్త్వజన్యత్వే సతి గతినిరోధ స్తంభః' అను లక్షణానుగతమైన రాగసంభవమయిన మనోవ్యాపారనిరోధమునుబట్టి యిట స్తంభపదప్రయోగ మని తెలియు నది. కామోదయరాగోదయములు వెనుకఁ జెప్పఁబడినవె యైన నిందుఁ దదుత్కటదశగాఁ దెలియఁదగును.

చ. నిరుపమపద్మినీకులమ◊ణీపరిదర్శనశక్తి నైశ్చలీ
గరిమ భజించి సమ్మదవి◊కాసమునం గనుపట్టుకుంభినీ
శ్వరతిలకంబు నుద్ధతి ని◊శాతపలాశసుమాంకుశంబుచేఁ
గర మసమాస్త్రయంత నఱ◊కం జనియించె శిరశ్చలనస్థితుల్. 50

టీక: నిరుపమపద్మినీకులమణీపరిదర్శనశక్తిన్ – నిరుపమ=సాటిలేనట్టి, పద్మినీకులమణీ =పద్మినీజాతిస్త్రీలయందు శ్రేష్ఠు రాలైన చంద్రికయొక్క, పరిదర్శనశక్తిన్=దర్శనసామర్థ్యముచేత, సాటిలేని గజస్త్రీరత్నముయొక్క దర్శనసామర్థ్యముచేత నని యర్థాంతరము, పద్మియొక్క స్త్రీ పద్మిని, 'ఇభ స్తమ్బేరమః పద్మీ' అని యమరుఁడు; నైశ్చలీగరిమన్=నిశ్చలభావము యొక్క యాధిక్యమును; భజించి =పొంది; సమ్మదవికాసమునన్ = సంతోషాతిశయముచేత, అధికమైన మదవికాసముచేత

నని గజపరమైన యర్థము; కనుపట్టుకుంభినీశ్వరతిలకంబున్ = చూపట్టు రాజశ్రేష్ఠుని, చూపట్టు గజశ్రేష్ఠము నని యర్థాంతరము. 'గౌ రిలా కుమ్భినీ క్షమా' అనుటచే కుమ్భినీశబ్దము భూమియందును, 'కుమ్భినః స్త్రీ కుమ్భినీ' అను వ్యుత్పత్తి చే గజస్త్రీయందును వర్తించును; ఉద్ధతిన్=దర్పముచేత; నిశాతపలాశసుమాంకుశంబుచేన్ – నిశాత=తీక్ష్ణమగు, పలాశసుమ=మోదుగపూవనెడు, అంకుశంబుచేన్ = అంకుశమను నాయుధముచేత; అసమాస్త్రయంత = మన్మథుఁడను మావటివాఁడు; కరము=బాగుగా; నఱకన్=నఱకఁగా; శిరశ్చలనస్థితుల్= మెప్పున శిరఃకంపనము సేయుటలు, చుఱుకున తల విదుర్చుటలు అని గజపక్షమున నర్థము; జనియించెన్ = ఉదయించెను. చంద్రికాదర్శనానందాతిశయముచే నైశ్చల్యము వహించి, మన్మథబాణహతుఁడై మెప్పున నారాజు శిరఃకంపము సేయఁగా నది యాఁడేనుఁగునం దాసక్తమయి మదవిలాసముచేఁ గదలకుండినగజమును నియంత యంకుశముచేఁ బొడువఁగా నాగజము చుఱుకునఁ దల విదిర్చినట్లుండెనని భావము.

చ. అలరెడిశ్యామకెంజిగురు◊టాకులఁ జేరినఁ గోరకంబులన్
మలయుచు నున్నఁ జారుసుమ◊మాలిక లొందిన మంజుమంజరీ
స్థలములపొందు గన్న మధు◊సంతతిఁ గూడినఁ బాయ వయ్యెడం
జెలఁగుటనో ద్విరేఫగతి◊చే మహిపాలకురమ్యనేత్రముల్. 51

టీక: మహిపాలకురమ్యనేత్రముల్= సుచంద్రుని మనోజ్ఞనేత్రములు, అనఁగా దృష్టులు; ద్విరేఫగతిచేన్= భృంగరీతిచేత, రేఫద్వయప్రాప్తిచేత; చెలఁగుటనో = ఒప్పుటచేతనో, రమ్యనేత్రపదమందు ఆద్యంతములయందు రెండురేఫము లున్నవిగావున నవి ద్విరేఫగతిఁజెలంగు ననుట, ద్విరేఫశబ్దముచే లక్షితలక్షణావృత్తివలన భ్రమరపదబోధ్యములగు భృంగములు బోధితము లగు నని శాస్త్రసరణి; అలరెడిశ్యామకెంజిగురుటాకులన్ – అలరెడి=ప్రకాశించుచున్న, శ్యామ=లతయొక్క, కెంజిగురుటాకులన్=రక్తపల్లవములను, ఈ పద్యమున నుపమానములైన పల్లవాదులు చెప్పఁగా సాధ్యవసానలక్షణచే నుపమేయములగు హస్తాదులు బోధ్యములు గావున, శ్యామకెంజిగురుటాకులన్ అనఁగాఁ జంద్రికాహస్తములచేత నని గ్రాహ్యము. ఇట్లంతటఁ దెలియవలయు; చేరినన్=పొందినను; కోరకంబులన్=మొగ్గలయందు, వానిచే లక్ష్యంబులగు గోరులయందు ననుట; మలయుచున్ ఉన్నన్=తిరుగుచున్నను; చారుసుమమాలికలు =మనోహరములైన పూలదండలను, అనఁగా నామె బాహువులను; ఒందినన్ = చేరినను; మంజుమంజరీస్థలములపొందు – మంజు=మనోజ్ఞములగు, మంజరీ=పువ్వుగుత్తులయొక్క, వానిచే లక్ష్యంబులగు స్తనములయొక్క, స్థలముల =ప్రదేశములయొక్క, పొందు = సంపర్కమును; కన్నన్ = కాంచినను; మధుసంతతిన్ = మరందపరంపరను; కూడినన్=చేరినను, ఆమెపెదవిని జేరిన ననుట; అయ్యెడన్ = అప్పుడు; పాయవు = వీడవు.

అనఁగా ద్విరేఫములు లతావిశేషముయొక్క చివురులను, కోరకములను, సుమములను, పువ్వుగుత్తులను, మకరందమును గూడి యున్నను బాయకుండునట్లు, ద్విరేఫగతిఁ జెలంగు నృపాలునినేత్రములు చిగురుటాకులఁ బోలు హస్తములను, కోరకంబులఁ బోలు గోరులను, సుమమాలికలఁ బోలు బాహువులను, పువ్వుగుత్తులఁబోలు స్తనములను, పూఁదేనియను బోలు నధరరసమును గూడియు వీడకున్నవని భావము. అతిశయోక్త్యలంకారభేదము. 'విషయస్యానుపాదానా ద్విషయ్యుపనిబధ్యతే। విజ్ఞేయాతిశయోక్తిస్సా కవిప్రౌఢోక్తిసమ్మతా॥' అని తల్లక్షణంబు పూర్వము దెలుపఁబడియె.

తే. ఇట్లు తచ్చంద్రికాయత్త◊దృక్చకోరుఁ,డై రసాధీశపద్మాకు◊మారుఁ డపుడు
ప్రమదము, నవాద్భుతంబును ◊బల్లవింప, నాత్మ నాయింతి నిట్లని ◊యభినుతించె. 52

టీక: ఇట్లు = ఈప్రకారముగ; రసాధీశపద్మాకుమారుఁడు = భూపతియనెడు మన్మథుఁడు; తచ్చంద్రికాయత్తదృక్చకోరుఁడై = ఆచంద్రికాపరతంత్రములగు నేత్రము లను చకోరములు గలవాఁడై; అపుడు; ప్రమదము = సంతసము; నవాద్భుతంబును =లోకోత్తరాశ్చర్యమును; పల్లవింపన్=చివురింపఁగా; ఆత్మన్=మనస్సునందు; ఆయింతిన్=ఆచంద్రికను; ఇట్లని =వక్ష్యమాణప్రకారముగ; అభినుతించెన్= శ్లాఘించెను.

సీ. కాఁబోలు నీహేమ◊గాత్రి క్రొత్తగ సానఁ,దీరిన వలఱేని◊చారుహేతి,
కాఁబోలు నీకంబు◊కంఠి పాల్కడలిజి◊డ్డడఁగఁ జూపట్టుశీ◊తాంశురేఖ,
కాఁబోలు నీతమ్మి◊కంటి చిరద్యుతుల్, మించఁ బొల్చిన తళ్కు◊మించుఁదీవ,
కాఁబోలు నీనీల◊కైశ్య మన్మథశిల్పి, బాగుగాఁ దీర్చిన ◊పసిఁడిబొమ్మ,
తే. యౌర యీచెల్వచెలువ,మ◊యారె యీపొ,లంతి యొయ్యార, మహహ యీ◊యింతిమిన్న
సొంపు, మజ్జారె యీచాన◊సొగసుపెంపు, బళిరె యీలేమఁ బొగడ వా◊క్పతివశంబె. 53

టీక: ఈహేమగాత్రి =ఈకనకాంగి; క్రొత్తగన్=నూతనముగ; సానన్=సానయందు, సాన యనఁగా మణులు లోనగువానిఁ జక్కఁబఱచు సాధనవిశేషము; తీరిన వలఱేనిచారుహేతి – తీరిన=చక్కఁబడిన, వలఱేని=మరునిసంబంధియగు, చారు = మనోజ్ఞమైన, హేతి =ఖడ్గము; కాఁబోలు = కాఁదగును.
ఈకంబుకంఠి =శంఖమును బోలు కంఠముగల యీసుందరి; పాల్కడలిజిడ్డడఁగన్ – పాల్కడలి = పాలసముద్రముయొక్క, జిడ్డడఁగన్ =జిడ్డు అణఁగిపోఁగా; చూపట్టుశీతాంశురేఖ =అగపడుచంద్రరేఖ; కాఁబోలు = కాఁదగును.
ఈతమ్మికంటి =ఈపద్మనయన; చిరద్యుతుల్ = స్థిరమైన కాంతులు; మించన్=అతిశయించునట్లు; పొల్చిన తళ్కుమించుఁదీవ = ఉదయించినట్టి ప్రకాశమానమయిన మెఱపుదీఁగ; కాఁబోలు = కాఁదగును.
ఈనీలకైశ్య=ఈనీలకుంతల; మన్మథశిల్పి=మరుఁడను శిల్పకారుఁడు; బాగుగాన్= చక్కఁగా; తీర్చిన = దిద్దిన; పసిఁడిబొమ్మ=బంగరుబొమ్మ; కాఁబోలు = కాఁదగును.
ఔర =ఆశ్చర్యము! ఈచెల్వచెలువము=ఈస్త్రీసౌందర్యము; అయారె = అద్భుతము! ఈపొలంతియొయ్యారము= ఈస్త్రీయొక్క సౌందర్యగర్వము; అహహ=చిత్రము! ఈయింతిమిన్నసొంపు = ఈయుత్తమస్త్రీ రమ్యత; మజ్జారె =విస్మయకరము! ఈచానసొగసుపెంపు = ఈస్త్రీయొక్క సౌందర్యాతిశయము; బళిరె=వింత! ఈలేమన్=ఈస్త్రీని; పొగడన్=నుతించుటకు; వాక్పతివశంబె = బ్రహ్మతరమా?

అనఁగాఁ జతుర్ముఖుఁడై చతుర్వేది తెలిసిన యట్టి బ్రహ్మకైన నిట్టి లోకోత్తరనాయికను వర్ణింప నలవి గాదనుట. ఆమె స్మరహేతిని, శశిరేఖను, మించుఁదీవను, పసిఁడిబొమ్మను బోలియున్నదని ఫలితార్థము.

మ. అతిశోణం బతికోమలం బతివిశా◊లాత్మం బతిశ్లక్ష్ణకం
బతినిమ్నం బతిమేచకం బతిదృఢం ◊బత్యంతపారిప్లవం
బతివక్రం బతిదీర్ఘ మౌర బళి యీ◊యంభోజపత్త్రాక్షి య
ప్రతిమానావయవప్రతానము మనః◊పద్య న్విచారింపఁగన్. 54

టీక: ఈయంభోజపత్త్రాక్షి అప్రతిమానావయవప్రతానము – ఈయంభోజపత్త్రాక్షి =ఈకమలపత్త్రాక్షి యొక్క, అప్రతిమాన= సాటిలేని, అవయవప్రతానము = అవయవసంఘము; మనఃపద్యన్=చిత్తవీథిని; విచారింపఁగన్ =ఆలోచింపఁగా; అతిశోణంబు =మిక్కిలి యెఱ్ఱనైనదియు; అతికోమలంబు =మిక్కిలి మృదులమైనదియు; అతివిశాలాత్మంబు = మిక్కిలి విపులస్వరూపం బును; అతిశ్లక్ష్ణకంబు = మిక్కిలి కృశమైనదియు; అతినిమ్నంబు=మిక్కిలి లోఁతుగ నున్నదియు; అతిమేచకంబు=మిక్కిలి నల్లనైనదియు; అతిదృఢంబు=మిక్కిలి స్థూలమైనదియు; అత్యంతపారిప్లవంబు=మిక్కిలి చపలమైనదియు; అతివక్రంబు = మిక్కిలి కుటిలమైనదియు; అతిదీర్ఘము =మిక్కిలి పొడవైనదియు; ఔర బళి =అత్యాశ్చర్యము!

అనఁగ నొకయువతి యవయవసమూహము పరస్పరవిరుద్ధముగ శోణత్వమేచకత్వ, కృశత్వవిశాలత్వాదిధర్మముల నొప్పియుండుట యాశ్చర్యమని యాశయము. ఆయువతి యరకా లతిశోణం బనియు, పాదంబు లతికోమలము లనియు, కటిస్థల మతివిశాలం బనియు, మధ్యభాగం బతిశ్లక్ష్ణమనియు, నాభి యతినిమ్నం బనియు, నూగా రతిమేచకం బనియు, చను దోయి యతిదృఢంబనియు, కన్దోయి యత్యంతపారిప్లవం బనియు, ముంగురు లతివక్రంబు లనియు, జడ యతిదీర్ఘం బనియు భావము. ఇటఁ జంద్రికాగతసౌందర్యాతిశయంబు వర్ణితంబయ్యె. 'అఙ్గప్రత్యఙ్గకానాం య స్సన్నివేశో యథోచితమ్। సుశ్లిష్టసంధి బన్ధ స్స్యా త్తత్సౌన్దర్య మితీర్యతే' అని తల్లక్షణము. ఇట్లు 'దీర్ఘాక్షం శరదిన్దుకాంతివదనం బాహూ నతా నంసయో స్సంక్షిప్తం నిబిడోన్నతస్తన మురః పార్శ్వే ప్రమృష్టే ఇవ। మధ్యః పాణిమితో నితమ్బి జఘనం పాదా వరాళాఙ్గుళీ ఛన్దో నర్తయితు ర్యథైవ మన శ్శ్లిష్టం తథాస్యావపుః॥' ఇత్యాదిగా గ్రన్థాన్తరములయందు సౌందర్యవర్ణనము తెలియవలయు.

సీ. అలరారు నేమొ ర॰మ్యాళిపాళి నెలంత, కులుకుపెన్నెఱులతోఁ ॰జెలిమిఁ గాంచి,
చరియించు నేమొ బల్ ॰మరుమార్గణశ్రేణి, పడఁతిదృగ్రుచి కర్థి॰భావ మూని,
చెలువొందు నేమొ మం॰జులకుచంబులు పక్వ,బింబోష్ఠిచనుదోయి ॰పేరు మోసి,
మనఁజేయు నేమొ యిం॰పున ధాత్రి చెలికటి,తటవిస్తృతికి దాది॰తనముఁ దాల్చి,
తే. యతిశయిలు నేమొ పద్మంబు ॰లనుదినంబు, భామపాదద్వయప్రభా॰ప్రాప్తి నొప్పి
మహిమ గను నేమొ సద్వంశ॰మణిచయంబు, కలికిపదనఖజననశే॰ఖరత నొంది. 55

టీక: రమ్యాళిపాళి =రమ్యమైన తుమ్మెదలగుంపు; నెలంతకులుకుపెన్నెఱులతోన్ = చంద్రికయొక్క యందమైన పెద్దవెండ్రు కలతోడ; చెలిమిన్=సఖ్యమును; కాంచి =పొంది; అలరారు నేమొ ప్రకాశించునేమొ; అనఁగా రమ్యమైన యాళిపాళి యన సఖీసముదయము గావునఁ జెలిమి గాంచుట దానికి నైజంబగునని కవిహృదయము.

బల్=అధికమైన; మరుమార్గణశ్రేణి =మదనుని బాణములగుంపు; పడఁతిదృగ్రుచికిన్ = ఈస్త్రీయొక్కదృక్కాంతికి; అర్థి భావము = యాచకత్వమును; ఊని =పూని; చరియించు నేమొ = సంచరించునేమొ; మరుతూఁపు లీపడఁతిదృగ్రుచికి యాచకవృత్తి దాల్చి నట్లున్నవన దృగ్రుచియం దాధిక్యంబు మార్గణములయందు న్యూనతయుఁ దోఁచును. దానంజేసి పడఁతిదృగ్రుచి మరుతూఁ పులకన్న మిన్నగా నున్నదని ఫలితము. మార్గణశ్రేణి యనఁగా యాచకులగుంపు గావున నది యర్థిభావము దాల్చుట స్వభావము. 'మార్గణౌ యాచకార్థినౌ' అని యమరుఁడు.

మంజు=మనోజ్ఞములగు; లకుచంబులు =గజనిమ్మపండ్లు; పక్వబింబోష్ఠిచనుదోయి = పండినదొండపండువంటి మోవిగల చంద్రికయొక్క చనుగవయొక్క; పేరు మోసి =నామమును వహించి; చెలువొందు నేమొ = సొంపువహించునేమొ; ఆమె చను దోయి లకుచములను మించినదని భావము. మంజులకుచశబ్దములో కుచశబ్దము చేరియున్నది గావున మంజులకుచములు

కుచములపేరు మోసియుండుట సహజము.

ధాత్రి =భూమి; ఇంపునన్=ఇచ్ఛచేత; చెలికటితటవిస్తృతికి= చంద్రికయొక్క జఘనవిస్తారమునకు; దాదితనమున్ =పెంపుడు తల్లి యగుటను; తాల్చి =వహించి; మనఁజేయు నేమొ =వృద్ధిఁ బొందించునేమొ; ఆమె జఘనము భూమియొక్క వైశాల్యము వంటి వైశాల్యమున రాజిల్లు నని భావము. 'ధాత్రీ స్యా దుపమాతాపి' అను కోశమున ధాత్రీశబ్ద ముపమాతను బోధించుఁ గావున నుపమాత దాదితనమును దాల్చుట స్వభావము.

పద్మంబులు=తమ్ములు; అనుదినంబు=ప్రతిదినమును; భామపాదద్వయప్రభాప్రాప్తిన్=ఈసుందరియొక్క పాదయుగళ కాంతియొక్క ప్రాప్తిచేత; ఒప్పి; అతిశయిలు నేమొ = అతిశయించునేమొ; ఆమె పాదద్వయప్రభ పద్మప్రభను మించిన దనుట. 'పదః మేవ మా యేషాం తాని పద్మాని' అనుటచేత, పాదలక్ష్మివంటిలక్ష్మిగలవేపద్మములు. కావున నవి పాదద్వయప్రభాప్రాప్తి నలరుట యరిది గాదు. భామపదము సూర్యునిబోధించుఁగావున సూర్యకిరణప్రభాప్రాప్తిచేతఁ బద్మము లతిశయించుట సహజ మనియుఁ దోఁచు. ఇప్పక్షమున, భామ=సూర్యునియొక్క, పాదద్వయ=కిరణద్వయముయొక్కయే, అనఁగా రెండు కిరణ ములు ప్రసరించినను పద్మములు వికసిల్లి రాజిల్లునని యాశయముగాఁ దోఁచుచున్నది.

సద్వంశమణిచయంబు = మంచివెదురులయందుఁ బుట్టిన ముత్యములగుంపు; కలికిపదనఖజననశేఖరతన్ – కలికి=ఈ సుందరియొక్క, పదనఖ =పాదములయందలిగోరులవలన, జనన=జన్మవలననైన, శేఖరతన్ = శ్రేష్ఠతను; ఒంది = పొంది; మహిమన్=పూజ్యతను; కను నేమొ = కాంచునేమొ. అనఁగా చంద్రికపాదనఖములు ముత్యములను మించిన వనుట. సద్వంశ మణిచయం బనఁగా మంచికులముగలమణులగుంపు పదనఖజనన అనఁగాఁ బాదనఖజనకము లైన పాదములకు భూషణ భావము దాల్చు ననుట. జననశబ్దము కర్త్రర్థల్యుట్ప్రత్యయాంతము, నఖములు కరరుహము లయినట్లు పదరుహములును గావచ్చును. 'పదన్యాసక్రీడారణితమణిమంజీరరశనమ్' ఇత్యాదికవివ్యవహారములవలన మణులు పదములకు భూషణము లనుట స్పష్టము. ఇందును చంద్రిక లోకోత్తరసౌందర్యశాలిని యని వ్యక్తం బగుచున్నది.

మ. వలజారత్నము దోఁచు నెన్నడు మణుత్వస్థేమఁ గాంచం గటి
స్థల మెంతేని మహత్త్వ మంద జడ దోర్త్తం దీర్ఘతం బూన ని
చ్చలు గుల్ఫంబులు హ్రస్వతం గన రతీశబ్రహ్మలీలాకృతో
జ్జ్వలమాయాపరిమాణవైభవసమచ్ఛాయ న్విరాజిల్లఁగన్. 56

టీక: నెన్నడుము=అందమైన కౌను; అణుత్వస్థేమన్– అణుత్వ=అణుపరిమాణభావముయొక్క, సూక్ష్మతయొక్క యనుట, స్థేమన్ = స్థితిని; కాంచన్=పొందఁగా; కటిస్థలము=కటిప్రదేశము; ఎంతేని=మిక్కిలి; మహత్త్వము=మహత్పరిమాణభావ మును, వైశాల్యముననుట; అందన్=పొందఁగా; జడ= వేణి; తోడ్తన్ = వెంటనె; దీర్ఘతన్=దీర్ఘపరిమాణభావమును; పూనన్; నిచ్చలు = ఎల్లపుడు; గుల్ఫంబులు = పిక్కలు; హ్రస్వతన్ = హ్రస్వపరిమాణభావమును; కనన్=పొందఁగా; వలజారత్నము =స్త్రీరత్నమగు చంద్రిక, 'చారుస్త్రీ భూశ్చ వలజా' అని రత్నమాల; రతీశబ్రహ్మలీలాకృతోజ్జ్వలమాయాపరిమాణవైభవసమ చ్ఛాయన్– రతీశబ్రహ్మ=అనంగుఁడను విధాతచేత, లీలాకృత=విలాసనిర్మితమగు, ఉజ్జ్వల=ప్రకాశించుచున్నట్టి, మాయా పరిమాణ = మాయామయములగు నణుదీర్ఘాదిపరిమాణములయొక్క, వైభవ=సమృద్ధియొక్క, సమచ్ఛాయన్=తుల్య చ్ఛాయచేత; విరాజిల్లఁగన్ =ప్రకాశించునట్లు; తోఁచున్ = అగపడును.

అనఁగా ననంగుఁడను విధాత మాయావిలాసముచేత అణుమహద్దీర్ఘహ్రస్వభేదముచే శాస్త్రసిద్ధమైన పరిమాణచతుష్టయ మును జంద్రికారూపముగ సృజియించినట్లు తోఁచుచున్న దనుట.

చ. హరిణధరాస్యమోవిపసలా, కిసలాకృతిఁ బొల్చు నంఘ్రు లా,
యరుణతరోష్ఠిగుబ్బవగలా, మృగలాలస మూన్చు కన్నులా,
హరినిభవాణిమేనిసటలా, నిటలాకరవాలకమ్ములా,
యరిభిదురోజ నెన్న వసమా యసమాశుగమానభేదికిన్. 57

టీక: హరిణధరాస్యమోవిపసలా– హరిణధరాస్య=చంద్రవదనయొక్క, మోవి=అధరముయొక్క, పసలా=సారములా! కిసలాకృతిన్=పల్లవాకారముచేత; పొల్చు నంఘ్రు లా = ఒప్పుచున్న పాదములా! అరుణతరోష్ఠిగుబ్బవగలా = ఆబింబోష్ఠి యొక్కచన్దోయివిలాసములా! మృగలాలస మూన్చు కన్నులా– మృగ=లేఁడియొక్క,లాలసము= ప్రీత్యతిశయము, ఊన్చు కన్నులా = కలిగించు నేత్రములా! హరినిభవాణిమేనిసటలా– హరినిభవాణి=చిలుకపలుకులు గల దానియొక్క, మేని= శరీ రముయొక్క, సటలా = నడకలా! నిటలాకరవాలకమ్ములా– నిటల=నొసలు, ఆకర=ఆశ్రయముగాఁ గల, అనఁగా ఫాలము నందు వ్రేలాడునట్టి, వాలకమ్ములా = కేశములా! ముంగురులా యనుట; అరిభిదురోజన్ (అరిభిత్+ఉరోజన్) = చక్రవాకభేదక ములగు కుచములుగల నీమెను; ఎన్నన్=కొనియాడుటకు; అసమాశుగమానభేదికిన్ =శివునకైనను; వసమా= శక్యమా? ఇట్టి లోకోత్తరసౌందర్యశాలిని యగు దీని నెన్నఁ బంచవక్త్రునంతవానికిని తరము గా దనుట.

సీ. కలికిచీఁకటిపిండుఁగలికిఁ బిల్చుకచాళి, వాలుగలసజాలు వాలుఁగనులు,
బింబమ్ము నకుఁ బ్రతిబింబంబు కెమ్మోవి, యేపూను రేరేనియేపు మోము,
ఇంచుమేలిమి నలయించు మేల్పలుకులు, కంబులకన్నఁ బొంకంబు గళము,
జక్కవకవ నేఁచుఁ జక్క వలుదగుబ్బ, లలివధూకులము నాలలిత మారు,
వాపులసిరి సారె వాపు లసన్నాభి, మెఱుఁగురంభలరూపమెఱుఁగుఁ దొడలు,
తే. తమ్మ లన మంజులశ్రీయుతమ్మ లడుగు, లుడుపురాణాస్యకాంతుల నుడుపు గోరు,
లవని నీకొమ్మలావణ్య లవనిరూఢి, యమరసుందరులం దైన నమరఁ గలదె. 58

టీక: కచాళి =కేశపంక్తి; కలికిచీఁకటిపిండున్=అందమగు నంధకారపుంజమును; కలికిన్=జగడమునకు; పిల్చున్ = ఆహ్వా నముసేయును; వాలుఁగనులు =నిడుదకన్నులు;వాలుగలసజాలు– వాలుగల=మత్స్యములయొక్క, సజాలు=శిక్షారూప ములు; దీనికన్నులు మత్స్యములకు శిక్షారూపములనుటచే మత్స్యములకన్నఁ గన్నులుసుందరములని భావము.
కెమ్మోవి =ఎఱ్ఱనిపెదవి; బింబమ్ము నకున్=దొండపండునకు; ప్రతిబింబంబు =ప్రతిరూపము; మోము =ముఖము; ఏపు=గర్వ మును, ఊను =వహించుచున్నట్టి, రేరేనియేపు =చంద్రునియొక్క బాధ, అనఁగా తనయందమునకు గర్వించుచున్న చంద్రుని బాధించున దనుట.
మేల్పలుకులు = శ్రేష్ఠములగు మాటలు; ఇంచుమేలిమిన్= చెఱకుయొక్క యతిశయమును; అలయించున్=అలయునట్లు చేయును; గళము =కంఠము; కంబులకన్నన్ = శంఖములకన్నను; పొంకంబు = సుందరమైనది.

వలుదగుబ్బలు=స్థూలములగు స్తనములు; చక్కన్ =బాగుగా; జక్కవకవన్= చక్రవాకమిథునమును; ఏఁచున్= బాధించును; ఆరు=నూఁగారు; అలివధూకులమునాన్ = ఆఁడుతుమ్మెదలగుంపనఁగా; లలితము=ఒప్పునట్టిది.
లసన్నాభి = ప్రకాశించుపొక్కిలి; వాపులసిరిన్=నడబావులయొక్క సంపదను; సారెన్ =మాటిమాటికి; పాపున్=తొలఁగఁ జేయును; తొడలు=ఊరువులు; మెఱుఁగురంభలరూపము=ప్రకాశించుచున్న యనంటులయొక్క రూపమును;ఎఱుఁగున్ = తెలియును.
అడుగులు=పాదములు;తమ్ములనన్=పద్మము లనఁగా;మంజులశ్రీయుతమ్ములు=మనోజ్ఞమైన కాంతితోఁ గూడినవి; గోరులు =నఖములు;ఉడుపురాణాస్యకాంతులన్–ఉడు=రిక్కలయొక్క,పురాణ=మునుపటివైన, ఆస్యకాంతులన్=ముఖరుచులను; ఉడుపున్=ఉడుగఁజేయును; అవనిన్=భూమియందు; ఈకొమ్మలావణ్యలవనిరూఢి = ఈస్త్రీయొక్క లావణ్యలేశముయొక్క ఆధిక్యము; అమరసుందరులందైనన్=దేవలోకకామినులయందైన; అమరఁగలదె = అబ్బఁగలదా?

అనఁగా నిట్టిలావణ్యలేశము సురసుందరులకైన నమర దనుట. లావణ్య మనఁగా దేహకాంతివిశేషము. ఆమెకచములు చీఁకటిని,కన్నులుమత్స్యములను, మోవి బింబమును, ఇత్యాదిగాఁ బోలియున్నవని ఫలితము. ఇది పంచపాదిసీసము.

చ. అని పతి సన్నుతించు, హృద॥యంబున విస్మయ ముంచు, నేఁడుగా
యనుపమశక్తి దర్పకున ॥కబ్బె నటంచు వచించు, నవ్విరిం
చనుశుభసర్గకోవిదత ॥సారెకు నెంచు, నిమేషరాహితిం
గనుఁగవ పూన వెండియును ॥గాంచు వెలందిఁ దదేకతానతన్. 59

టీక: అని = ఇట్లని; పతి = సుచంద్రుఁడు; సన్నుతించున్=కొనియాడును; హృదయంబునన్=చిత్తమందు; విస్మయము= ఆశ్చర్యమును; ఉంచున్; దర్పకునకున్=మరునకు; అనుపమశక్తి= సాటిలేని సామర్థ్యమును; నేఁడుగా = ఇపుడుగదా! అబ్బెన్=అమరెను; అటంచున్; వచించున్=పలుకును; అవ్విరించనుశుభసర్గకోవిదతన్= ఆబ్రహ్మయొక్కశుభనిర్మాణ పాండితిని; సారెకున్=మాటిమాటికి; ఎంచున్=గణించును; కనుఁగవ =నేత్రయుగ్మము; నిమేషరాహితిన్ = ఱెప్పపాటు లేమిని; పూనన్=వహింపఁగా; వెండియును =మఱియును; తదేకతానతన్= తదేకాగ్రతతో, ‘ఏకతానోఽనన్యవృత్తిః’ అని యమరుఁడు; వెలందిన్=చంద్రికను; కాంచున్ = అవలోకించును.

చ. అపుడు మహీంద్రుతోడ నల॥యక్షవిభుండు వధూటిఁ గంటివే
తపనకులేంద్ర నాపలుకు ॥తథ్యత గాంచెఁ గదా తదాప్తి నే
నిపు డట కేగి కొమ్మకుఁ త్వ॥దేకమతిం బొడమింతు నంచు న
న్నృపతియనుజ్ఞఁ గైకొనుచు ॥హృద్యవిమానము డిగ్గి యత్తఱిన్. 60

టీక: అపుడు; అలయక్షవిభుండు=ఆకుముదుఁడు; మహీంద్రుతోడన్=సుచంద్రునితోడ; తపనకులేంద్ర=సూర్యవంశోత్తముఁడా! వధూటిన్=చంద్రికను; కంటివే = చూచితివిగదా! నాపలుకు = నామాట; తదాప్తిన్= అట్లు నేఁజెప్పిన స్త్రీయొక్క ఉపలబ్ధిచేత; తథ్యత గాంచెఁ గదా =యథార్థత నొందెగదా! నేన్; ఇపుడు; అటకున్=ఆచంద్రికయుండుచోటికి; ఏగి; కొమ్మకున్= చంద్రికకు; త్వదేకమతిన్= నీయందలిప్రీతి ననుట; పొడమింతున్=ఉదయింపఁజేయుదును; అంచున్; అన్నృపతియనుజ్ఞన్ = ఆరాజు నాజ్ఞను; కైకొనుచున్=స్వీకరించుచు; హృద్యవిమానము=మనోజ్ఞపుష్పకమునుండి; డిగ్గి=దిగి; అత్తఱిన్=ఆసమయమందు,

దీనికి 'వనధరఁ జేరి' యను నుత్తరపద్యస్థక్రియతో నన్వయంబు.

చ. వనధరఁజేరి చారుతరు॥వారము చయ్యన దాఁటి పూర్వవ
ర్తన నవలాలఁ జేరఁ జనఁ ॥దామరసానన లెల్ల వచ్చెఁ గా
ఘనగురుఁ డంచు నబ్రమునఁ ॥గాంచఁగఁ గాంచనపీఠి డిగ్గి యా
జనవరకన్య యాళిజన॥సంవృతిఁ దా నెదు రేగి భక్తితోన్. 61

టీక: వనధరన్=ఉద్యానవనస్థలమును; చేరి; చారుతరువారము = మనోజ్ఞమగు వృక్షసంఘమును; చయ్యనన్=శీఘ్రముగ; దాఁటి; పూర్వవర్తనన్ = పూర్వరీతిగా; నవలాలన్ = ఉవిదలను; చేరఁజనన్ = చేరఁబోఁగా; తామరసాననలు ఎల్లన్ = స్త్రీలం దఱు; ఘనగురుఁడు =మన పెద్దయుపాధ్యాయుఁడు; వచ్చెఁ గా = వచ్చెనుగదా! అంచున్; అబ్రమునన్=ఆశ్చర్యముతోడ; కాంచఁగన్=చూడఁగా; ఆజనవరకన్య=ఆచంద్రిక; కాంచనపీఠిన్=బంగరుపీటను; డిగ్గి = దిగి; ఆళిజనసంవృతిన్ = సఖీ సంఘపరివృతిచేత; తాన్; ఎదురేగి = ఎదుర్కొని; భక్తితోన్=భక్తితోడ, దీనికి 'ఆనతిసేయ' నను ముందుక్రియతో నన్వయము.

చ. గురుకుచభారరేఖ నొగిఁ ॥గోమలి యానతి సేయ నాదయా
కరమతి పెండ్లికూఁతురవు ॥గమ్మని దీవన లిచ్చి తద్వధూ
త్కరకృతపూజనావిధులు ॥గైకొని తద్వనితాసమర్పితాం
బరచరరాజరత్నచయ॥భాసురపీఠి వసించె నయ్యెడన్. 62

టీక: గురుకుచభారరేఖన్ = గొప్పలగు స్తనములయొక్క భారాతిశయముతోడ; ఒగిన్=క్రమముగా; కోమలి=చంద్రిక; ఆనతిన్ = ప్రణామమును; చేయన్=చేయఁగా; ఆదయాకరమతి = కరుణాకరమగు మదిగల యాకుముదుఁడు; పెండ్లికూఁతురవు కమ్ము; అని = అనుచు; దీవనలు ఇచ్చి=ఆశీర్వదించి; తద్వధూత్కరకృతపూజనావిధులు = ఆస్త్రీసమూహముచే చేయఁబడిన అర్చనావిధులను;కైకొని = స్వీకరించి; తద్వనితాసమర్పితాంబరచరరాజరత్నచయభాసురపీఠిన్ – తత్=ఆయొక్క, వనితా =స్త్రీలచేత, సమర్పిత= ఈయఁబడిన, అంబరచరరాజరత్నచయ=ఇంద్రనీలమణిసమూహముతోడ, అంబరచరరాజనఁగా ఇంద్రుఁడు, అందుచే అంబరచరరాజరత్న మనగా ఇంద్రనీలమణి, భాసుర=ప్రకాశించుచున్న, పీఠిన్=పీటయందు; వసించెన్= కూర్చుండెను; అయ్యెడన్, దీనికి అగ్రిమపద్యస్థమగు 'వసించె' నను క్రియతో నన్వయము.

తే. మనుజపతికన్య సఖులతో ॥మణిమయాస,నమున వసియించె నప్పు డా॥కొమిరెమిన్న
నెచ్చెలి చకోరి యన మించు ॥నెలఁత యోర్తు, కుముదుఁ దిలకించి యిట్లనుఁ ॥గుతుకఫణితి. 63

టీక: మనుజపతికన్య = చంద్రిక; సఖులతోన్=చెలియలతోడ; మణిమయాసనమునన్ = రత్నపీఠమందు;వసియించెన్; అప్పుడు; ఆకొమిరెమిన్ననెచ్చెలి = ఆచంద్రికయొక్క సకియ; చకోరి యన మించు నెలఁత యోర్తు = చకోరి యను నొక స్త్రీ; కుముదున్=కుముదుని; తిలకించి = చూచి; కుతుకఫణితిన్=సంతసముతోఁ గూడిన వాక్కుచేత; ఇట్లనున్ = ఇట్లు పల్కును.

చ. హరిసమధామ! యుష్మదరు॥ణాంఘ్రులు గన్గొన నిప్డు మద్గృగం
బురుహము లెంతయుం జెడని॥మోదముఁ జేకొనె, దూరమయ్యె దు

స్తరహృదయాంధకారసము◊దగ్రత లెల్లఁ, బ్రవృద్ధిఁ గాంచె వి
స్ఫురదభిలాషచక్రములు, ◊పొల్పడఁగె న్నిబిడప్రదోషముల్. 64

టీక: ఇందుఁ గుముదపరమైన యర్థము, సూర్యపరమైన యర్థము గలుగుచున్నది. హరిసమధామ=సూర్యతుల్యమగు తేజముగలవాఁడా! యుష్మదరుణాంఘ్రులు = మీయొక్క శోణచరణములు, పాటలములగు కిరణములని యర్థాంతరము; కన్గొనన్=అవలోకింపఁగా; ఇప్డు; మద్దృగంబురుహములు =నానేత్రము లనెడు కమలములు; ఎంతయున్=మిక్కిలి; చెడని మోదమున్ = నశింపనిసంతసమును; చేకొనెన్=పొందెను; దుస్తరహృదయాంధకారసముదగ్రతలు – దుస్తర= తరింపనలవి గాని, హృదయాంధకారసముదగ్రతలు = హృదయమునందుండెడు నజ్ఞానమను చీఁకటులయాధిక్యములు; ఎల్లన్= సమస్తము; దూరమయ్యెన్=తొలఁగెను; విస్ఫురదభిలాషచక్రములు= ప్రకాశించుచున్న కోర్కులగుంపులనెడు చక్రవాకములు; ప్రవృద్ధిఁ గాంచెన్=వృద్ధిఁబొందెను; నిబిడప్రదోషముల్ = దట్టములైన దురితములను రజనీముఖములు; పొల్పడఁగెన్=నశించెను. సూర్యుని శోణకిరణదర్శనమున నంబురుహములు సంతసించుటయు, చీఁకటులు దూరమగుటయు, చక్రవాకములు వృద్ధినొందుటయు, ప్రదోషములు శమించుటయు నెట్లో, అట్లు తమ చరణదర్శనమున నాకు నేత్రానందము, అజ్ఞాననాశము, వాంఛాసముదయాభివృద్ధి, దోషశాంతియుఁ గలిగె ననుట.

చ. అనుదినముం బ్రియంబును ద◊యామహిమంబును మించ వత్తు రీ
జనవరపుత్త్రికామణికిఁ ◊ జక్క విపంచిక నేర్ప నేఁటికిన్
జనియె సుమీ యనేకదివ◊సంబులు మీ రిట రాక నేఁడు నిం
దునిఁ దెలికల్వలో యన ని◊నున్ గనఁ గోరు మదీయనేత్రముల్. 65

టీక: అనుదినమున్=ప్రతిదినమును; ప్రియంబును=ప్రేమమును; దయామహిమంబును = కరుణాతిరేకమును; మించన్; ఈ జనవరపుత్త్రికామణికిన్=ఈరాజపుత్త్రిక యగు చంద్రికకు; చక్కన్=బాగుగా; విపంచికన్=వీణను; నేర్పన్=అభ్యసింపఁజేయుటకు; వత్తురు; నేఁటికిన్=ఇప్పటికి; మీరిటన్ రాక =మీరిచ్చోటి కరుదేరక; అనేకదివసంబులు = బహుదినములు; చనియెన్ సుమీ = కడచెను సుమా! నేఁడున్=ఇప్పుడు గూడ; ఇందునిన్=చందురుని; తెలికల్వలోయనన్ = తెల్లకలువలవలె; మదీయ నేత్రముల్=నాకన్నులు; నినున్; కనన్=అవలోకించుటకు; కోరున్=ఇచ్ఛించును. అనఁగా నిప్పుడు నీవు వచ్చుటకుముందు గూడ నిన్నుఁ దలఁచుచుంటి ననుట.

చ. మునుపటియట్ల యిచ్చటికి ◊మోదముతో నరుదేరకుంకి కో
జనపరివర్ణ్యదివ్యగుణ◊జాలక కారణ మేమి యేపురం
బెనసితి రేవిశేషగతు ◊లింపుగఁ గాంచితి రేన్నృపాలుతో
ననువగు మైత్త్రి సల్పితిరి ◊యంతయుఁ దెల్పఁగదే దయామతిన్. 66

టీక: ఓజనపరివర్ణ్యదివ్యగుణజాలక=జనులచే వర్ణింపఁదగిన లోకోత్తరగుణగణముగలవాఁడా! మునుపటియట్ల =పూర్వము వలెనె; ఇచ్చటికిన్;మోదముతోన్=సంతసముతోడ; అరుదేరకుంకికిన్=రాకుండుటకు;కారణ మేమి =హేతువేమి? ఏపురంబు =ఏనగరమును; ఎనసితిరి=పొందితిరి? ఏవిశేషగతులు; ఇంపుగన్=సొంపుగను; కాంచితిరి=అవలోకించితిరి? ఏన్నృపాలుతోన్

=ఏరాజుతోడ;అనువగు = అనుకూలమైన; మైత్రిన్=చెలిమిని; సల్పితిరి=చేసితిరి; అంతయున్; దయామతిన్=కరుణాబుద్ధి తోడ; తెల్పఁగదే=తెల్పుడు.

క. అన వనితావాక్యసుధా,జనితామోదవృతమానసపయోరుహుఁడై
యనువార యక్షవిభుఁడి,ట్లను వారణయానఁ గని మహామధురోక్తిన్. 67

టీక: అనన్=చకోరి యిట్లనఁగా; వనితావాక్యసుధాజనితామోదవృతమానసపయోరుహుఁడై– వనితా=చకోరియొక్క, వాక్య సుధా=పలుకులను నమృతముచేత, జనిత=పుట్టినట్టి, ఆమోద=సంతసముచేత,వృత=కూడినట్టి,మానసపయోరుహుఁడై = చిత్తాంభోజము గలవాఁడై; అనువారన్=అనుకూలమగునట్లుగా; యక్షవిభుఁడు=కుముదుఁడు; వారణయానన్=ఆస్త్రీని;కని = చూచి; మహామధురోక్తిన్=మిక్కిలి తియ్యనిమాటలచేత; ఇట్లు అనున్=వక్ష్యమాణప్రకారముగఁ బల్కును.

మ. కలఁ డత్యుత్కటధాటికాతురగరింఖాజాతభూక్షోదక
జ్జలచిహ్నాప్తమహఃప్రదీపహృతతీక్ష్ణధ్వాంతవేలాకుభృ
ద్బిలగేహప్రతిమాయితామితసమిద్భేరీకులధ్వానమం
డలనిర్విణ్ణరిపుక్షితీంద్రుఁడు సుచంద్రక్ష్మాపచంద్రుం డిలన్. 68

టీక: అత్యుత్కట ధాటికా తురగరింఖాజాత భూక్షోదకజ్జలచిహ్నాప్త మహఃప్రదీపహృత తీక్ష్ణధ్వాంత వేలాకుభృ ద్బిలగేహ ప్రతిమాయి తామితసమి ద్భేరీకులధ్వానమండల నిర్విణ్ణ రిపుక్షితీంద్రుఁడు– అత్యుత్కట =మిక్కిలి యధికమగు, ధాటికా =జైత్రయాత్రయందలి, తురగ=అశ్వములయొక్క,రింఖాజాత =గిట్టలవలనఁ బుట్టిన, భూక్షోద=భూపరాగమనెడు, కజ్జల =మసియొక్క,చిహ్నాప్త =చిహ్నమును బొందిన, మహఃప్రదీప=ప్రతాపమనెడు దీపముచేత, హృత=హరింపఁబడిన, తీక్ష్ణ ధ్వాంత=గాఢాంధకారము గల, వేలాకుభృత్=లోకాలోకపర్వతములయొక్క, బిలగేహ=గుహలనెడు నిండ్లయందు, ప్రతి మాయిత=బొమ్మలుగాఁజేయఁబడిన, ఇది రిపుక్షితీంద్రులకు విశేషణము, అమిత=కొలఁదిలేనట్టి, సమిత్=యుద్ధమందలి, భేరీకుల=భేరులగుంపుయొక్క, ధ్వానమండల=ధ్వనులసమూహముచేత, నిర్విణ్ణ=నిర్వేదము నొందిన; రిపుక్షితీంద్రుఁడు = శత్రురాజులు గలవాఁడు; సుచంద్రక్ష్మాపచంద్రుండు= సుచంద్రుఁడను రాజచంద్రుఁడు; ఇలన్=భూమియందు; కలఁడు.

అనఁగా సుచంద్రుని శత్రువులు లోకాలోకపర్వతగుహలు నిబిడధ్వాంతసంతతిసమావృతములని యచట దాఁగియున్న వారనియు, ఆబిలగృహములు సేనాపరాగ మనెడు మషిచిహ్నము గల సుచంద్రప్రతాపదీపముచేత నంధకారశూన్యములై యుద్ధభేరీనాదవ్యాప్తములు కాఁగా వారలు మన కిచట నైన క్షేమము లేక పోయెఁగదా యని నిర్విణ్ణులై బొమ్మలవలె చేష్టారహి తులై యున్నా రనియు భావము. సూర్యతేజము ప్రసరింపని లోకాలోకపర్వతగుహలవఱకు సుచంద్రుని ప్రతాపము ప్రసరించిన దనియు, సర్వశత్రువులు పలాయితులై పర్వతగుహల నాశ్రయించి రనియు ఫలితార్థము.

మ. సరసీజాతహితాన్వయేశ్వరుయశోజాతంబు చక్రాప్తమై
హరిశోభాంచితమై భృతాబ్జనికరంబై రాజిలం దత్తులే
తరభావోదితపంక మంకవిధిచేత న్మేనునం గప్పినన్
సురకుక్షిలవరప్రదక్షిణముఁ బూనినుం జంద్రుఁ డశ్రాంతమున్. 69

టీక: వెనుకటిపద్యమున సుచంద్రుని ప్రతాపాతిశయమును జెప్పి, యిట నారాజు యశోతిశయమును జెప్పుచున్నాడు. సరసీజాతహితాన్వయేశ్వరుయశోజాతంబు = సూర్యవంశ్యులయందు శ్రేష్ఠుండగు సుచంద్రునియొక్క కీర్తిపుంజము; చక్రాప్తమై = రాష్ట్రహితమై, చక్రవాకములకు ప్రియమై యని యర్థాంతరము; హరితేజోంచితమై =సింహతేజముతోడ నొప్పుచున్నదై, సూర్యదీప్తిచేతఁ బ్రకాశించుచున్నదై యని యర్థాంతరము; భృతాబ్జనికరంబై = పోషింపఁబడిన శంఖములు గలదై, పద్మములు గలదై యని యర్థాంతరము; రాజిలన్=ప్రకాశింపఁగా; తత్తులేతరభావోదితపంకము – తత్తులేతరభావ=ఆయశస్సుయొక్క సామ్యాభావముచేత, ఉదిత = జనించినట్టి, పంకము =పాపము; అంకవిధిచేతన్ = కలంకరూపముగా ననుట; మేనునన్ = శరీరమందు; కప్పినన్=వ్యాపింపఁగా; చంద్రుఁడు=శీతాంశువు; అశ్రాంతమున్ =ఎల్లపుడును; సురకుత్కీలవరప్రదక్షిణమున్ – సురకుత్కీలవర=మేరుపర్వతముయొక్క, ప్రదక్షిణమున్=ప్రదక్షిణమును; పూనున్ = వహించును.

అనఁగాఁ జంద్రకాంతి చక్రవాకముల కప్రియమైనదియు, సూర్యతేజముచే విరాజిల్లనిదియు, అబ్జములఁ బోషింపనిదియు, సుచంద్రుని యశోరాశి యట్లు కాక చక్రప్రియమును, సూర్యతేజోరాజితంబును, అబ్జపోషకంబునునై విరాజిల్లుటం జేసి, చంద్రునకుఁ దద్యశోరాశి సామ్యము లేమిచేఁ గలంకరూపముగఁ బాపము శరీరమున వ్యాపించినందున నతండు తత్పాపనివృత్తికై మేరుపర్వతప్రదక్షిణమును బ్రత్యహముఁ జేయుచున్నాడని భావము. సుచంద్రుని యశము రాష్ట్రహితమై, సింహశంఖసమాన ధావళ్యము గలిగి తేజరిల్లుచున్నదని ఫలితార్థము.

మ. పరవాహిన్యధినాథజీవనహృతిం బాటిల్లు తద్భూపని
ర్భరధామస్థితి తన్మహాప్రథనగోత్రాధూళి తద్వృత్తిమైఁ
గర మొప్పన్వలయాద్రిఁ జేరుఁ దదరిక్ష్మాపాళినైజాంగముల్
వరకీరాళిపికవ్రజం బనుచరత్వం బూనఁగాఁ జేయఁగన్. 70

టీక: ప్రకారాంతరముగఁ బ్రతాపమునే చెప్పుచున్నాడు. పరవాహిన్యధినాథజీవనహృతిన్ – పరవాహిన్యధినాథ=శత్రుసేనానాయకులయొక్క, జీవన=ప్రాణములయొక్క, హృతిన్=హరణముచేత; పాటిల్లు=ఒప్పునట్టి; తద్భూపనిర్భరధామస్థితి = ఆరాజుయొక్క అధికమైన ప్రతాపస్థితి, ఇది కర్త; తన్మహాప్రథనగోత్రాధూళి – తత్=ఆరాజుసంబంధియగు, మహత్=అధికమైన, ప్రథన=యుద్ధమునందలి, గోత్రాధూళి= భూపరాగము; తద్వృత్తిమైన్= ఆపరవాహిన్యధినాథజీవనహృతి యనెడు వృత్తిచేత, అనఁగా పరమైన సముద్రముయొక్కనీరింకించుటచేత ననుట; కరము=మిక్కిలి; ఒప్పన్; తదరిక్ష్మాపాళి – తత్= ఆరాజుయొక్క, అరిక్ష్మాపాళి= శత్రురాజులగుంపు, నైజాంగముల్ = తమశరీరములు; వరకీరాళి – వర=శ్రేష్ఠములగు, కీరాళి =చిలుకలగుంపు; పికవ్రజంబు=కోకిలలగుంపు; అనుచరత్వంబు=సహచరతను; ఊనఁగాఁ జేయఁగన్ = వహింపఁజేయుచుండఁగా; వలయాద్రిన్ = లోకాలోకపర్వతమును; చేరున్=పొందును. సుచంద్రుని ప్రతాపము శత్రుసేనానాయకుల ప్రాణహరణముఁ జేసి, లోకాలోకమువఱకు వ్యాపించిన దనియు, తదీయ యుద్ధభూపరాగము సముద్రమునీ రింకించినదనియు, అతనియొక్క శత్రురాజుల శరీరములు పలుకులచేతను, తలవెండ్రుకలచేతను శుకపికాళి ననుసరించిన వనియు భావము. వారి శరీరములు కీలు గొంతులు పడి తలవెండ్రుక లూచిపోయి పక్షి శరీరములవలె నుండెనని ఫలితార్థము.

చ. సరసకలాంచితాస్యుఁ డయి, చారువిలోచనపద్ముఁడై, కళం
కరహితగాత్రుఁడై, జగతిఁ గన్పడు నానృపమౌళితో జనుల్

హరిముఖునిన్, సుమాంబకుఁ, గళంకసమన్వితగాత్రుఁ బోల్తురే
నిరుపమసౌందరీవిధికి నిచ్చలు సాటి యటంచు నెమ్మదిన్. 71

టీక: ఇచట సుచంద్రుని సౌందర్యము చెప్పఁబడియె. సరసకలాంచితాస్యుఁ డయి – సరస=శ్రేష్ఠములగు, కలా=కాంతులచేత, అంచిత=ఒప్పుచున్న, ఆస్యుఁ డయి = ముఖముగలవాఁడై, శ్రేష్ఠములగు విద్యలచే నంచితమగు ముఖము గలవాఁడయి యని యర్థాంతరము; చారువిలోచనపద్ముఁడై=మనోహరమైన పద్మములవంటి నేత్రములు గలవాఁడై, మనోహరమైన నేత్రములందు పద్మ యనఁగా లక్ష్మి గలవాఁడై యని యర్థాంతరము; కళంకరహితగాత్రుఁడై = కళంకము (మచ్చ)లేని శరీరము గలవాఁడై, ఒచ్చెములేని శరీరము గలవాఁడై యని యర్థాంతరము; జగతిన్=లోకమందు; కన్పడు =చూపట్టుచున్న, ఆనృపమౌళితోన్ = ఆరాజశేఖరునితోడ; జనుల్=లోకులు; హరిముఖునిన్ = నలకూబరుని, గుఱ్ఱపుమోరగలవాని ననిగాని, కోఁతిమోరగలవాని నని గాని ధ్వని; సుమాంబకున్ = మన్మథుని, పూగంటివాని నని ధ్వని; కళంకసమన్వితగాత్రున్ = చంద్రుని, ఒచ్చెములతోఁ గూడిన శరీరము గలవాని నని ధ్వని; నిరుపమసౌందరీవిధికిన్ = సాటిలేని సౌందర్యవిధానమునకు; నిచ్చలు =ఎల్లప్పుడు; సాటి యటంచున్ = సరియనుచు; నెమ్మదిన్ = చిత్తమందు; పోల్తురే = సరిపోల్ప రనుట.

అనఁగా నట్టి ముఖము, లోచనములు, గాత్రముగల సుచంద్రునితోడ గుఱ్ఱపుమూతి, పువ్వుపడిన కన్నులు, ఒచ్చెములు గల గాత్రము గల నలకూబర, సుమాయుధ, చంద్రులు సాటి యని జనులు సరిపోల్పరని తాత్పర్యము. నిరుపమానసౌంద ర్యము వ్యంగ్యము.

చ. అవనిపచంద్రరూపవిభవాతిశయశ్రవణోయమానమో
హవితతి యూను భోగిమనుజామరకన్యల నిచ్చ నేఁచుఁ బం
చవిశిఖుఁ డాశుగత్రితయిఁ జక్కగ శేషశరద్వయంబుఁ గాం
క్ష వెలయ డాఁచు ముంగల నఖండఫలంబు వహించు నన్మతిన్. 72

టీక: అవనిపచంద్రరూపవిభవాతిశయశ్రవణోయమానమోహవితతి – అవనిపచంద్ర=సుచంద్రునియొక్క, రూపవిభవ= రూప సంపదయొక్క, రూపలక్షణము వ్రాయఁబడియె, అతిశయ=ఆధిక్యముయొక్క,శ్రవణ=వినుటచేత, ఊయమాన=నేయఁబడు చున్న, వృద్ధిఁ బొందింపఁబడుచున్న యనుట, 'ఊఞ్ తన్తుసన్తానే' అనుదానిపై శానచ్ ప్రత్యయము చేయఁగా ఊయమాన యని యైనది, మోహవితతి =మోహాతిశయమును; ఊను =వహించునట్టి; భోగిమనుజామరకన్యలన్=నాగ మానవ దేవకన్య లను, స్వర్గమర్త్యపాతాళలోకములందుండు కన్యకల ననుట; నిచ్చన్=ఎల్లపుడు; బంచవిశిఖుఁడు=మరుఁడు; ఆశుగత్రితయిన్ = అరవింద, నవమల్లికా, నీలోత్పలము లనెడు బాణత్రయముచేత; చక్కగన్=బాగుగ; ఏఁచున్=బాధించును; శేషశరద్వయం బున్ = తక్కిన చూతాశోకము లనెడు బాణద్వయమును; ముంగలన్=ఈచంద్రికకు రాజునకు పరస్పరావలోకన మబ్బునపు డనుట; అఖండఫలంబు =అవిచ్ఛిన్న లాభము, చూతాశోకములు ఫలించుఁ గావున నఖండమైన పండ్ల నని యర్థాంతరము దోఁచుచున్నది; వహించు నన్మతిన్= పొందునను తలంపుచేత; కాంక్ష వెలయన్= కోర్కి యతిశయించునట్లు; డాఁచున్= మఱుఁగు పఱచును.

'మార ఏకో మహాధన్వీ ద్వయ మేకం కరోత్యసౌ' అనుటచే మన్మథశరప్రయోగమునకుఁ దరుణీతరుణసంఘటనమే ముఖ్యఫలంబు గాన నట్టిఫలము స్వర్గమర్త్యపాతాళలోకస్త్రీలయందుఁ గాక చంద్రికయందే కలుగు నని కాముండు చంద్రికా

సుచంద్రసమావేశసమయమునకుఁ బ్రతీక్షించుచున్నాఁ డని భావము. ఇందువలన దేవాంగనాదిప్రార్థనీయసౌందర్యము గల వాఁ డనియు, వారలకు దుర్లభుం డనియు, దానం జేసి చంద్రికచే నవశ్యముగఁ గోరఁదగినవాఁ డనియు, ఫలిత మగుచున్నది.

తే. ఇట్టి సకలానఘగుణోత్క రాబ్ధి యైన,యామహీకాంతుతో మైత్రి యడరు కతన
నిన్ని దినములు తద్యోగ మెనసి యుంటి, నెడయ నేఁ గొమ్మ హృద్వీథిఁ బొడమ కుక్కి. 73

టీక: ఇట్టి సకలాఘగుణోత్కరాబ్ధి యైన యామహీకాంతుతోన్ = ఈప్రకారముగ సకలనిర్దుష్టగుణముల కాకరుండైన యా సుచంద్రుఁ డను రాజుతోడ; మైత్రి =సఖ్యము; అడరు కతనన్ = అతిశయించుహేతువున; ఇన్ని దినములు; తద్యోగము=అతని సంబంధమును; ఎనసి =పొంది; ఉంటిన్; కొమ్మ = చకోరీ! హృద్వీథిన్=అంతరంగప్రదేశమందు; పొడమ కుక్కిన్=తోఁప కుండుటచేత; నేన్; ఎడయన్ = ఆరాజు నెడఁబాయను. ఇట్టి సకలసద్గుణములు గల సుచంద్రునితోఁ గూడి యారాజు నెడఁ బాయఁజాలక యంతకాల ముంటి నని భావము. (ప్రథమపాదమునందలి యతిభంగము 'ఇట్టి' ని 'అట్టి' గా మార్చినచో తొలగి పోవును.)

ఉ. ఈనృపకన్యఁ జూచురతి నిప్పుడు తజ్జనరాడనుజ్ఞ చేఁ
బూని రయాప్తి వచ్చితి, నపూర్వవిలాసినియై రహించు నీ
మానినిఁ గాంచ నిత్తఱి నమందముదావళిఁ జెందె నాత్మ, కం
జానన! యంచు నామయుకులాగ్రణి వెండియుఁ బల్కె నాచెలిన్. 74

టీక: ఈనృపకన్యన్=ఈరాజపుత్రిని; చూచురతిన్ = చూడవలెనను వాంఛచేత; ఇప్పుడు; తజ్జనరాడనుజ్ఞచేన్= ఆరాజునానతి చేత; పూని =ప్రయత్న పడి; రయాప్తి న్ =వేగప్రాప్తిచేత; వచ్చితిన్; అపూర్వవిలాసినియై=లోకోత్తరవిలాసము గలదై;రహించు నీమానినిన్ = ఒప్పుచున్న యీచంద్రికను; కాంచన్=చూడఁగా; ఇత్తఱిన్=ఈసమయమున; కంజానన=ఓపద్మముఖీ! ఆత్మ= చిత్తము; అమందముదావళిన్=అధికమగు సంతోషపరంపరను; చెందెన్=పొందెను; అంచున్; ఆమయుకులాగ్రణి =ఆయక్షేశ్వ రుఁడు; ఆచెలిన్=ఆచకోరినిగూర్చి; వెండియున్=మఱల; పల్కెన్=వచించును.

చ. అళికచ! నెమ్మదిం దలఁప నప్పతికే తగు నీవెలంది, యీ
జలరుహనేత్రకే తగు రసారమణేంద్రుఁడు, గాన నామనో
జలలితమూర్తి యీలలనఁ జక్క వరించినఁ గాక మామదిం
దళమయి మించ నేర్చునె యుదారకుతూహలవార్ధివీచికల్. 75

టీక: అళికచ=తుమ్మెదలఁబోలు కురులుగల చకోరీ! నెమ్మదిన్=మంచిమనస్సుచేత; తలఁపన్=విచారింపఁగా; ఈవెలంది = ఈచంద్రిక; అప్పతికే=ఆసుచంద్రునికే; తగున్=ఒప్పును; రసారమణేంద్రుఁడు=భూపతిశ్రేష్ఠుఁడైన యా సుచంద్రుఁడు; ఈజల రుహనేత్రకే=ఈకమలాక్షికే; తగున్=ఒప్పును; కానన్=ఆకారణముచేత; ఆమనోజలలితమూర్తి= ఆమన్మథసుందరతనువు గలరాజు; ఈలలనన్=ఈచిన్నదానిని; చక్కన్=చక్కగా; వరించినన్ కాక =వరించినఁగాని; మామదిన్=మామనస్సునందు; ఉదారకుతూహలవార్ధివీచికల్ – ఉదార=అధికమగు, కుతూహల=సంతసమనెడు, వార్ధి=సముద్రముయొక్క,వీచికల్=తరఁ గలు; దళమయి=దట్టమయి; మించన్ నేర్చునె = అతిశయింప నేర్చునా, నేర్వ వనుట.

మ. కనుగల్వ ల్వికసిల్ల, మోదము పొసం◊గన్ దజ్జనాధీశచం
ద్రుని వీక్షించినఁ గాని మామకహృదు◊ద్భూతస్పృహారేఖ యి
మ్మెనయం జాలదు, చాన, యవ్విభుని మీ◊కీలోపలం గాంచఁ గ
ల్గు నన, న్గోమలి కిన్నరేశ్వరునిఁ బ◊ల్కు న్గోర్కి దైవాఱఁగన్. 76

టీక: కనుగల్వల్=కన్నులనెడు కలువలు; వికసిల్లన్=వికసించునట్లును; మోదము=సంతసము; పొసంగన్ = కల్గునట్లును; తజ్జనాధీశచంద్రునిన్ =ఆరాజచంద్రుని; వీక్షించినన్ కాని =చూచినంగాని; మామకహృదుద్భూతస్పృహారేఖ = నామనంబునఁ బొడమిన వాంఛాతిశయము;ఇమ్మెనయం జాలదు= ఆనుకూల్యముఁ బొందఁజాలదు; చాన =చకోరీ! అవ్విభునిన్=ఆరాజును; మీకు; ఈలోపలన్= ఇంతలోనె; కాంచన్ కల్గు = చూచుట సంభవించును; అనన్ = ఇట్లు వచింపఁగా; కోమలి= చకోరి; కోర్కి దైవాఱఁగన్ = కోరిక యతిశయింపఁగా; కిన్నరేశ్వరునిన్=కుముదునిగూర్చి; పల్కున్=వచించును.

మ. హరివంశోత్తము సద్గుణాళి విని ని◊త్యం బేము వర్ణింప స
త్వరబుద్ధిం గనఁ జాన గోరుఁ బతి నా◊త్మం, గాంచ మాకుం దదం
తర మెల్లప్పుడు మించుఁ గాన, నలగో◊త్రాభర్త నే మిప్పు డే
కరణిం గాంతుము, గాంచుదారిఁ గృప ని◊క్కం దెల్పవే నావుడున్. 77

టీక: హరివంశోత్తముసద్గుణాళి =సూర్యవంశమునం దుత్తముఁడగు నారాజుయొక్క శ్రేష్ఠమగుగుణములగుంపును; విని= ఆకర్ణించి; నిత్యంబు=ఎల్లపుడు; ఏము=మేము; వర్ణింపన్=ఆరాజుగుణములఁ గొనియాడఁగా; చాన=చంద్రిక; సత్వరబుద్ధిన్ = త్వరతోఁ గూడిన మతిచేత; పతిన్=రాజును, భర్తననియుఁ దోఁచును; కనన్=అవలోకించుటకు; ఆత్మన్ =మనమున; కోరున్ = వాంఛించును; మాకున్; కాంచన్=చూచుటకు; తదంతరము=ఆమనస్సు, అంతరశబ్దార్థములు చెప్పునపుడు ‘ బహి రవసర మధ్యేంత రాత్మని చ’ అని యమరుఁడు; ఎల్లప్పుడు; మించున్=అతిశయించును; కానన్=ఆహేతువువలన; అలగోత్రాభర్తన్ = ఆరాజును; ఏము; ఇప్పుడు=ఈసమయమున; ఏకరణిన్ = ఏరీతి; కాంతుము=చూతుము; కాంచుదారిన్=చూచుమార్గమును; కృప నిక్కన్= కరుణ యతిశయిల్లునట్లు; తెల్పవే=ఆనతీవే, నావుడున్=ఇట్లనఁగా, దీనికి ముందుపద్యముతో నన్వయము.

మ. వనితా యావిభుఁ గాంచువాంఛ మదిఁ జె◊ల్వం బూనినం గాంచవే
జనితాసక్తి నృపాలు మామకకర◊చ్ఛాయ న్మనోవీథి నూ
త్ననితాంతాద్భుత మబ్బ నంచు మహిమం ◊దత్సద్గుణశ్రేణికా
ఖని తాఁ బ్రాక్కృతమాయ నంతయుఁ జనం ◊గావింప నప్పట్టునన్. 78

టీక: వనితా=చకోరీ! ఆవిభున్=ఆరాజును; కాంచువాంఛ =చూడవలెననుకోరిక; మదిన్=మనస్సునందు; చెల్వంబు ఊనినన్ = చక్కగాఁ గుదిరినయెడల; మనోవీథిన్=మనఃప్రదేశమునందు; నూత్ననితాంతాద్భుతము=అపూర్వమైన మిక్కిలియాశ్చర్యము; అబ్బన్=అమరునట్లు; మామకకరచ్ఛాయన్=నాచేతిచాయను; జనితాసక్తిన్=కలిగినప్రీతితో; నృపాలున్=రాజును; కాంచవే=చూడుమా; అంచున్=ఇట్లనుచు; తత్సద్గుణశ్రేణికాఖని=ఆశ్రేష్ఠగుణాకరుఁడగు కుముదుఁడు; మహిమన్=ప్రభావము

చేత; తాన్; ప్రాక్కృతమాయను అంతయున్=ఇతరజనులకుఁ గాన్పింపఁ గూడదని మున్ను చేసిన మాయ నంతయు; చనన్ = తొలఁగునట్లు; కావింపన్=చేయఁగా; అప్పట్టునన్=ఆప్రదేశమున, దీనికి ముందు కన్వయము.

సీ. బెళుకుచూపులవానిఁ, బలుమాఱు బలుమారు,సొంపు నిందించుమే೧ల్సొబగువాని,
నొఱపు మించినవాని, నెఱమించునెఱమించు,మెలపుఁ గందించు నె೧మ్మేనివాని,
సొగసు మీఱినవానిఁ, బగడంబుపగడంబు,తలఁపుఁ గుందించుమేల్೧తళుకువానిఁ,
గళుకు హెచ్చినవానిఁ, గపురంపుకపురంపు,వలపుఁ జిందించున೧వ్వొలయువానిఁ,
తే. గళ మెలకువాని, మంజులో೧జ్జ్వలమువానిఁ, జెలువు గలవాని, నొయ్యార ೧మలరువాని,
నభ్రయానసమాసీను, ೧నాక్షితీశుఁ, జూచి వెఱఁగంది నిలిచి రా೧సుదతు లపుడు. 79

టీక: బెళుకుచూపులవానిన్= ప్రకాశించుచున్న దృష్టులుగలవానిని; పలుమాఱు=సారెకు; బలుమారుసొంపు–బలు = అధికమైన, మారు=మన్మథునియొక్క, సొంపు=సౌందర్యమును; నిందించుమేల్సొబగువాని =నిందించునట్టి మేలైన చక్కఁదనముగలవానిని;
ఒఱపు మించినవానిన్=యోగ్యతచే నతిశయించినవానిని; నెఱమించు నెఱమించుమెలపున్– నెఱ=అధికముగ, మించు = ప్రకాశించుచున్న, నెఱమించు=నిండుమెఱపుయొక్క, మెలపున్=జాగరూకతను; కందించు నెమ్మేనివాని=శ్రమపఱచు నందమగు శరీరముగలవానిని;
సొగసు మీఱినవానిన్=అందముచే నతిశయిల్లువానిని; పగడంబుపగడంబుతలఁపున్ – పగడంబు=ప్రవాళముయొక్క, పగ= విరోధముయొక్క, డంబు=అతిశయముయొక్క, తలఁపున్=చింతను; కుందించుమేల్తళుకువానిన్– కుందించు=దుఃఖపెట్టుచున్న, మేల్=అధికమైన, తళుకువానిన్=ప్రకాశముగలవానిని;
కళుకు హెచ్చినవానిన్ = కాంతిచే నతిశయించినవానిని; కపురంపుకపురంపువలపున్ – క=సుఖమునకు, పురంపు=స్థానమైన, కపురంపువలపున్=కర్పూరసంబంధిపరిమళమును; చిందించునవ్వొలయువానిన్ = చెదరఁగొట్టుచున్న మందహాసము వెలయించువానిని;
కళ మెలకువానిన్=కళాప్రకాశముగలవానిని; మంజులోజ్జ్వలమువానిన్=మనోహరమైన శృంగారముగలవానిని, 'ఉజ్జ్వలో ధీర శృంగార విశదేషు విలాసిని' అని విశ్వము; చెలువు గలవానిన్=అందకానిని; ఒయ్యార మలరువానిన్ = విలాసమొప్పువానిని; అభ్రయానసమాసీనున్=విమానారూఢుని; ఆక్షితీశున్=ఆసుచంద్రుని; చూచి; వెఱగంది=ఆశ్చర్యమంది; ఆసుదతులు=ఆ స్త్రీలు; నిలిచిరి; అపుడు=ఆసమయమందు, దీని కుత్తరపద్యస్థక్రియతో నన్వయము.

చ. పులకలు మేన నిక్కఁ, వల೧పుంబస మానసవీథిఁ జిక్కఁ, దృ
క్షలి ననిమేషవిస్ఫురణ ೧దక్కఁ, బ్రమోదము చిందు ద్రొక్కఁ, ని
ర్మలమణిపీఠి డిగ్గి యొక೧మానిని కేల్కొయిలాగు వూని యా
యలికులవేణి రాజకుసు೧మాశుగుఁ గాంచె నొకింత సిబ్బితిన్. 80

టీక: మేనన్=శరీరమునందు; పులకలు=గగుర్పాటులు; నిక్కన్= అతిశయింపఁగా; మానసవీథిన్=అంతరంగమందు;

వలపుంబస = మోహసమృద్ధి; చిక్కన్=చేరఁగా; దృక్ఫలిన్=చూపునందు; అనిమేషవిస్ఫురణ=ఱెప్పపాటులేమియొక్క స్ఫూర్తి; దక్కన్=లభింపఁగా; ప్రమోదము=సంతసము; చిందు ద్రొక్కన్=నటింపఁగా; ఆయలికులవేణి=నీలవేణియగు నా చంద్రిక; ఒకమానినికే ల్కాయిలాగు =ఒకస్త్రీయొక్క హస్తావలంబమును; పూని = గ్రహించి; నిర్మలమణిపీఠిన్=స్వచ్ఛమగు మణిమయాసనమునుండి; డిగ్గి =దిగి; రాజకుసుమాశుగున్=రాజమన్మథుఁడగు సుచంద్రుని; ఒకింత సిబ్బితిన్=కొంచెము లజ్జచేత; కాంచెన్=అవలోకించెను.

ఇచటఁ జంద్రికకు లోకోత్తరవస్తుదర్శనమున విస్మయము, దానంజేసి మేనఁ బులకలు, తదనంతర మాతనియందు రత్యుదయము, తదనంతరము మనోరథలాభముచేత హర్షము, దానంజేసి నిమేషశూన్యదర్శనము, ప్రథమదర్శనమున లజ్జోదయము చెప్పఁబడియె. 'శ్లో.లోకోత్తరపదార్థానా మపూర్వాలోకనాదిభిః।విస్తార శ్చేతసోయస్తు విస్మయ స్స నిగద్యతే। క్రియా స్తత్రాక్షివిస్తార సాధూక్తి పులకాదయః' అని విస్మయలక్షణతత్కార్యకారణములు, 'రోమాఞ్చో విస్మయోత్సాహహర్షాద్యై స్తత్ర విక్రియాః। రోమోద్గమో ముఖోల్లాస గాత్రసంస్పర్శనాదయః' అని రోమాంచలక్షణతత్కార్యకారణములు, 'యూనో రన్యోన్యవిషయాస్థాయినీచ్ఛారతి ర్భవేత్। నిసర్గేణాభియోగేన సంసర్గేణాభిమానతః। ఉపమాధ్యాత్మ్యవిషయై రేషా స్యాత్తత్ర విక్రియాః। కటాక్షపాత భ్రూక్షేప ప్రియవాగాదయో మతాః' అని రతిలక్షణతత్కార్యకారణములు, 'మనోరథస్యలాభేన సిద్ధ్యాయోగ్యస్య వస్తునః। ప్రియసంగమదేవాదిప్రసాదాదేశ్చ కల్పితః। మనఃప్రసాదో హర్ష స్స్యాత్తత్ర నేత్రస్యఫుల్లతా। ప్రియభాషణ మాశ్లేషః పులకానాం ప్రరోహణమ్।' అనిహర్షలక్షణతత్కార్యకారణములు, తెలియవలయు. నేత్రస్యఫుల్లతా, అనుటచేత నిర్నిమేషభావమును వివక్షితమే. అట్లు 'నివాతపద్మస్తిమితేనచక్షుషా నృపస్య కాంతం పిబత స్సుతాననమ్। మహోదధేః పూర ఇవేన్దు దర్శనాద్గురుః ప్రమోదః ప్రబభూవ చాత్మని' ఇత్యాదులయందు నిర్నిమేషతఁ జూడవలయు. 'అకార్యకరణావజ్ఞాస్తుతి నూతన సంగమైః। ప్రతీకారాక్రియాద్యైశ్చ వ్రీడాత్వనతిధృష్టతా। తత్ర చేష్టాని గూఢోక్తిరాధోముఖ్యవిచిన్తనే। అనిర్గమో బహిః క్వాపి దూరాదేవావగుంఠనమ్। నఖానాం కృన్తనం భూమిలేఖనం చైవమాదయః' అని లజ్జాలక్షనతత్కార్యకారణములు తెలియవలయు. ఇట్లు చెప్పినవినిలో రతి యనునది స్థాయిభావము. అది, 'నియతం వికాసవిస్తృతివిక్షోభక్షేపసంజ్ఞితా ధర్మాః। చత్వారో జాయన్తే సపది విభావాదిసంగమే మనసః। కథితో వికాసమూలశ్శృఙ్గారోవిస్తరోపధిర్వీరః। క్షోభోపధిస్తురౌద్రోబీభత్సః క్షేపమూలకః పూర్వైః। హాస్యాశ్చర్యభయానకదయావికాసాదిమూలకాః క్రమశః' అనుటవలన విభావాదిసంగమమున మనసునందుఁ గల్గు వికాసరూపధర్మము, దానికి స్థాయిత్వము సజాతీయవిజాతీయానభిభావ్యమై యావదానందానుభవము నిలిచియుండుటం బట్టి కలిగినది, తల్లక్షణంబు వెనుక వ్రాయఁబడియె. విస్మయంబు స్వతంత్రముగ నద్భుతరసమునుగూర్చి స్థాయి యైనను నిట దానికి స్థాయిత్వము గలుగదు. దాని కనుభవపర్యంతావస్థాయిత్వము లేక కించిత్కాలావస్థాయిత్వ ముండుటంబట్టి దానియందు, 'విరుద్ధైరవిరుద్ధైర్వా భావైర్విచ్ఛిద్యతే నయః। ఆత్మభావన్న యత్యన్యాన్' ఇత్యాదిస్థాయిలక్షణము సమన్వయింపదు. మఱేమన్న, 'రత్యాదయః స్థాయిభావాస్స్యు ర్భూయిష్ఠ విభావజాః। స్తోకై ర్విభావై రుత్పన్నా స్త ఏవ వ్యభిచారిణః' అను సంగీతరత్నాకరమువలనను, 'భావోవాపి రసోవాపి ప్రవృత్తిర్వృత్తిరేవ వా। సర్వేషాం సమవేతానాం రూపం యస్య భవే ద్బహు। సమన్తవ్యోరసస్థాయీ శేషా స్సంచారిణో మతాః' అను భరతవచనమువల్లను, దానికి రతినిగూర్చి సంచారిత్వమే ఘటిల్లునని తెలియవలయు. ఇఁక రోమాంచ మనునది సాత్త్వికభావము, అది యనుభావవిశేషమె, మనోగతభావమును బయల్పఱచునట్టి భావము లనుభావములు, వాని లక్షణములు, భేదములు వెనుక వ్రాయఁబడియె. హర్షము, లజ్జయు సంచారులు, ఇవి రతిని పుష్టి పఱచునవి, 'ఉన్మజ్జన్తో నిమజ్జన్తః స్థాయిన్యమ్బునిధావివ। ఊర్మివ ద్వర్ధయన్త్యేనం యాన్తి తద్రూపతాం చ తే' ఇత్యాదులు తత్ప్రమాణములు. ఇట్లు సాత్త్వికవ్యభిచారులచే నుపచితమగు స్థాయి రసరూపత నొందునని ముందు తెల్లమగును.

చ. జనపతియాస్యచంద్రుఁ గనఁ జాలఁ జెలంగు వధూటికావలో
కనకుహనాచకోరములు గ్రక్కున వ్రీళతమశ్చయంబు పా
ల్చిన భ్రమియింప దాని సడలించె మరుండు విచిత్రశక్తి నూ
తనశరజాతనిర్వమదుదారశిఖోదయరాగవైఖరిన్. 81

టీక: జనపతియాస్యచంద్రున్=రాజుముఖమనెడు చంద్రుని; కనన్=చూచుటకు; చాలన్=మిక్కిలి; చెలంగు = ఒప్పుచున్న; వధూటికావలోకనకుహనాచకోరములు – వధూటికా=చంద్రికయొక్క, అవలోకన=చూపులనెడు, కుహనా=నెపము గల , చకోరములు = వెన్నెలపులుఁగులు; గ్రక్కునన్=వేగముగా; వ్రీళతమశ్చయంబు =లజ్జయను నంధకారపుగుంపు;పాల్చినన్ = ఉదయించుటచేత; భ్రమియింపన్=కలఁతనొందఁగా; మరుండు = మన్మథుఁడు; విచిత్రశక్తిన్=అద్భుతమగుసామర్థ్యముచేత; నూతనశరజాతనిర్వమదుదారశిఖోదయరాగవైఖరిన్ – నూతన=క్రొత్తదగు, శరజాత=బాణసంఘముచేత, నిర్వమత్=వెడలుచున్న, ఉదార=అధికమైన,శిఖా=జ్వాలలనెడు, ఉదయరాగ=ఉదయకాలారుణ్యముయొక్క, వైఖరిన్ =రీతిచేత; దానిన్=ఆ లజ్జాంధకారమును; సడలించెన్=పోఁగొట్టెను.

అనఁగా నామె రాజును జూచునపుడు లజ్జ ప్రతిబంధకముగా నుదయించియు రాగాతిశయమునఁ దొలంగినదనియు, నందువలన సంపూర్ణనయనానందము ఘటిల్లిన దనియు వ్యజ్యమానమగుచున్నది. కామము రాగాతిశయరూపమేకాని వేఱొండు పదార్థము గాదు. ఇచ్ఛారూపము రతి యనియు, నుత్కటేచ్ఛారూపము కామమనియు వ్రాయఁబడియె.రమ్యవస్తుదర్శనమున దానియందుఁ బ్రీతి గల్గి యిది మదిష్టసాధనమగునని దానియం దుత్కటప్రీతి గల్గుట యనుభవసిద్ధము. చంద్రికకు సుచంద్రునిఁ జూడగనె లోకోత్తరవస్తుదర్శనప్రయుక్తవిస్మయము గల్గి వెనుక రతి గల్గి తదనంతరంబ కామ ముదయించినదని చెప్పఁబడియె. సుచంద్రునకు నిట్లే రత్యనంతరము కామము వెనుక చెప్పఁబడినది. రతి సంభోగేచ్ఛాత్మక మను మతమును గూర్చియు రతి కామముల పౌర్వాపర్యమును గూర్చియు కావ్యాలంకారసంగ్రవిమర్శనము చూడవలయు.

తే. చెలిఁ దఱియ వచ్చునరపాలసితదృగాళి, దారి నానారిచూపుచా ల్దవిలి నడచె
నపుడు గగనధునీప్రవాహంబు సొచ్చి, వేగ యెదురెక్కు మీనౌఘవిధి వహించి. 82

టీక: చెలిన్=చంద్రికను; తఱియన్=సమీపించుటకు; వచ్చునరపాలసితదృగాళిదారిన్=వచ్చుచున్న తేనితెల్లనిచూపుచాలుయొక్కత్రోవను; ఆనారిచూపుచాల్=ఆచంద్రికయొక్క దృక్పరంపర; తవిలి =సంబంధించి; అపుడు; గగనధునీప్రవాహంబు =వ్యోమగంగాప్రవాహమును; చొచ్చి=ప్రవేశించి; వేగ=త్వరగా; ఎదురెక్కు=ఎదురునడచుచున్న; మీనౌఘవిధిన్=మీనుల గుంపు ప్రకారమును; వహించి =పొంది; నడచెన్=పోయెను.

ఆరాజుచూపులు తెల్లగ స్వర్గంగాప్రవాహముంబోలెఁ జంద్రికయందుఁ బ్రసరించిన వనియు, ఆప్రవాహరూపమగు చూపుచాలునందు నెదురెక్కు మీనులఁబోలెఁ జంద్రికాదృక్పరంపర నృపుపై నడిచె ననియు, దానం జేసి యన్యోన్యదర్శనానందపరిపూర్తి ఘటిల్లె ననియుఁ దెలియవలయు.

ఇట నాయికానాయకాన్యోన్యదర్శనానందానుభవముచే నితరేతరానురాగము ప్రవ్యక్తంబగుచున్నది. దానంజేసి పూర్వానురాగాఖ్యవిప్రలంభశృంగార మిందు సకలసామగ్రులు గలుగుటచేఁ బూర్ణముగ స్ఫురించుచున్నది. ఏలాగనిన, అన్యోన్యావలోకనమున నితరేతరవిషయకమైన ప్రీతి వ్యక్తమగుచున్నదిగదా! 'యూనో రన్యోన్యవిషయాస్థాయినీచ్ఛారతి ర్భవేత్' అనుట

వలన నది రతి యనఁబడుచున్నది. దాని కిరువురును ఆలంబనవిభావములు. 'ఆలమ్బన న్నాయికాస్యు ర్దక్షిణాద్యాశ్చ నాయకాః' అని వెనుక వ్రాయంబడియె. నాయిక స్వీయా, పరకీయా,సామాన్యాభేదముచేఁ ద్రివిధ యనియు, నందు స్వీయ, ముగ్ధా, మధ్యా,ప్రగల్భాభేదముచేఁ ద్రివిధ యనియు, నందు మధ్యాప్రగల్భలు ధీరా, అధీరా, ధీరాధీరాభేదముచేఁ బ్రత్యేకముగఁ ద్రివిధలై , జ్యేష్ఠాకనిష్ఠాభేదమునఁ బ్రత్యేకముగ నాఱుతెగ లనియు, పరకీయ పరోఢా, కన్యకాభేదముచేఁ ద్వివిధ యనియు, సామాన్య యొకతె యనియు, నిట్లు పదార్వురైన నాయికలు ప్రత్యేకముగ స్వాధీనపతికా, వాసకసజ్జా, విరహోత్కంఠిత, అభిసారికా, విప్రలబ్ధా, ఖండితా, కలహాంతరితా, ప్రోషితపతికాభేదముచేత నెనిమిదిభేదములు గలవారై, యుత్తమా,మధ్యమా, అధమాభేదములతోఁ బ్రత్యేకముగఁ ద్రివిధలై, మున్నూటయెనుబదినాల్గుభేదములతో రాజిల్లుదు రనియు, 'శ్లో. స్వీయా త్రయోదశవిధా ద్వివిధాతు పరాఙ్గనా| వేశ్యైకైవం షోడశధా తాశ్చావస్థాభి రష్టభిః|ప్రత్యేక మష్టధా తాసా ముత్తమాదిప్రభేదతః| త్రైవిధ్య మేవం చ చతురశీతిత్రిశతం భవేత్|' అనుటవలన నెఱుంగునది. అట్లు నాయకులు పతి, ఉపపతి, వైశికుఁడు,అని ముగ్గు రనియు, అందుఁ బతి దక్షిణుఁడు, అనుకూలుఁడు, ధృష్టుఁడు, శఠుఁడు, అని నాలుగుభేదములు గలవాఁడనియు సింగభూపా లీయమున, 'శృఙ్గారాపేక్షయా తేషాం త్రైవిధ్యం కథ్యతే బుధైః| పతి శ్చోపపతి శ్చైవ వైశికశ్చేతి భేదతః| పతిస్తు విధినా పాణి గ్రాహకః కథ్యతే బుధైః| చతుర్ధా సోఽపి కథితో వృత్త్యా కావ్యవిచక్షణైః| అనుకూల శ్శఠోధృష్టో దక్షిణశ్చేతి భేదతః|' ఇత్యా దుల వలనఁ దెలియునది. ఇట్లు చంద్రికాసుచంద్రరూపాలంబనవిభావములు సానురాగావలోకనాద్యనుభావములు, పూర్వోక్త స్వేదాదిసాత్త్వికములు, హర్షలజ్జాదిసంచారులు, 'యౌవనం రూపలావణ్యే సౌన్దర్యమభిరూపతా| మార్దవం సౌకుమార్యం చే త్యాలమ్బన గతాగుణాః' అని చెప్పఁబడిన యాలంబనగుణములు, భావహావహేలావిభ్రమకిలికించితమోట్టాయితకుట్టమి తాదిగాఁ జెప్పఁబడినవానిలో యథాసంభవముగఁ దచ్చేష్టలు, నూపురాంగదహారాది తదలంకరణములు, ఉపవనమంద మారుతకోకిలాలాప భ్రమరఝుంకారాదితటస్థములును నీనాలుగుతెగలైన యుద్దీపనవిభావములు చేరియుండుటవలనఁ బరి పూర్ణసామగ్రీసంఘటన మైనందున రతిరూపస్థాయిభావమునకు రసరూపత గలుగుచున్నది. 'శ్లో.ఏతేచ స్థాయినః స్వైస్వై ర్విభావై ర్వ్యభిచారిభిః| సాత్త్వికై రనుభావైశ్చ నటాభినయయోగతః| సాక్షాత్కారమివానీతైః ప్రాపితా స్స్వాదురూపతామ్| సామాజికానా మ్మనసి ప్రయాన్తి రసరూపతామ్|' ఇత్యాదులు తత్ప్రమాణంబులు. ఇట నటాభినయపదము కావ్యమున కుప లక్షకము, 'రత్యాదేః స్థాయినో లోకే తానిచే న్నాట్యకావ్యయోః| విభావా అనుభావాశ్చ కథ్యన్తే వ్యభిచారిణః| వ్యక్త స్సతై ర్విభా వాద్యైః స్థాయీభావో రస స్స్మృతః|' అను కావ్యప్రకాశాదులవలన నయ్యది యెఱుంగునది. 'విభావై రనుభావైశ్చ సాత్త్వికై ర్వ్యభిచారిభిః| నీతా సదస్యరస్యత్వంరతి శ్శృఙ్గార ఉచ్యతే' అనుటవలన నిది శృంగారరసము. అందును, 'అయుక్తయో స్తరుణయోర్యోనురాగః పరస్ప రమ్| అభీష్టాలిఙ్గనాదీనామనవాప్తౌ ప్రకృష్యతే| స విప్రలమ్భో విజ్ఞేయః' అనుటవల్ల విప్రలంభ మనియు, అందును, 'యత్ప్రేమ సంగమాత్పూర్వం దర్శనశ్రవణోద్భవమ్' అని ఉపక్రమించి 'సోయంపూర్వానురాగాఖ్యో విప్రలమ్భ ఇతీరితః' అనుటవలనఁ బూర్వానురాగాఖ్యవిప్రలంభ మనియుఁ దెలియునది. విప్రలంభము పూర్వానురాగమాన ప్రవాసాదిభేదములు గలదని వెనుక వ్రాయంబడియె.

చ. నిజబలరూఢి దోఁపఁ దఱి నివ్వటిలెన్ బళి యంచుఁ దాఁ జతు
ర్భుజుఁడయి పంచసాయకుఁడు భూరిధృతిన్ క్షణదోదయాధిపా
త్మజబొమవింటిదోయి నసమానవిలోచనమాలికాసితాం
బుజవిశిఖాళి నించె నలభూపతి పేరెద గాఁడి పాఱఁగన్. 83

టీక: పంచసాయకుఁడు=మరుఁడు; నిజబలరూఢి =తనసామర్థ్యాతిశయము; తోఁపన్=కనఁబడునట్లు; తఱి =సమయము; నివ్వటిలెన్ =ఘటిల్లెను; బళి =ఔర! అంచున్=అనుకొని; తాన్; చతుర్భుజుఁడయి =నాలుగుచేతులు గలవాఁడై, ఉప్పొంగిన వాఁడయి యనుట; భూరిధృతిన్ =అధికమైన ధైర్యముచేత; క్షణదోదయాధిపాత్మజబొమవింటిదోయిన్ – క్షణదోదయాధి పాత్మజ=క్షణదోదయరాజపుత్త్రిక యగు చంద్రికయొక్క, బొమవింటిదోయిన్=బొమలనెడు ధనుర్యుగ్మముచేత; అలభూ పతి=ఆరాజు (సుచంద్రుని)యొక్క, పేరెద =విశాలవక్షమును, కాఁడి పాఱఁగన్ =తూఁటిపాఱునట్లు; అసమానవిలోచనమాలికా సితాంబుజవిశిఖాళిన్ – అసమాన= సాటిలేని, విలోచనమాలికా=(చంద్రికా)దృక్పరంపర యనెడు, అసితాంబుజవిశిఖాళిన్= నీలోత్పలరూపమైన బాణపరంపరను, ‘అరవిన్ద మశోకం చ చూతం చ నవమల్లికా| నీలోత్పలం చ పఞ్చైతే పఞ్చబాణస్య సాయకాః’ అని యమరుఁడు; నించెన్ = పూరించెను.

చంద్రికాదృక్పరంపర మన్మథునిచేఁ బ్రయోగింపఁబడిన నీలోత్పలబాణపరంపరను బోలియుండె ననియు, నామెబొమలు పంచశరశరాసనములఁ బోలియుండె ననియు భావము. ఆరాజున కామెచూపులు కరము మదనోద్దీపనకరము లని ఫలితార్థము.

చ. అలవిభుఁ గాంచుఁ, గాంచి యెద ◊నప్పతిరూపము నుంచు, నుంచి ని
శ్చలమతి నెంచు, నెంచి మది ◊జాఱనికోర్కుల ముంచు, ముంచి యూ
ర్పులు కడు నించు, నించి వల◊పుల్ మన నాత్మ భ్రమించు, మించుఁబోఁ
డి లసదనంగసాయకత◊టీవిలుఠత్పటుశాంబరీగతిన్. 84

టీక: మించుఁబోఁడి=మెఱుపువంటిదేహముగల చంద్రిక; లసదనంగసాయకతటీవిలుఠత్పటుశాంబరీగతిన్ – లసత్= ప్రకా శించుచున్న, అనంగసాయక=స్మరశరములయొక్క,తటీ=అగ్రభాగములయందు,విలుఠత్=పొరలుచున్న, పటు=సమర్థ మైన, శాంబరీగతిన్=మాయారీతిచేత; అలవిభున్=ఆరాజును; కాంచున్=చూచును; కాంచి =చూచి; అప్పతిరూపమున్ = ఆరాజురూపమును; ఎదన్=హృదయమునందు; ఉంచున్=నిలిపికొనును; ఉంచి = నిల్పికొని; నిశ్చలమతిన్=స్థిరచిత్తముచేత; ఎంచున్=ప్రశంసించును; ఎంచి =ప్రశంసించి; మదిన్=చిత్తమును; జాఱనికోర్కులన్ = వీడనిమనోరథములలో; ముంచున్ = మునుఁగఁజేయును; ముంచి; కడున్=మిక్కిలి; ఊర్పులు=నిశ్వాసములను; నించున్=నిండఁజేయును; నించి; వలపుల్= అను రాగములు; ఆత్మన్=చిత్తమందు; మనన్=పుట్టఁగా; భ్రమించున్=భ్రాంతినొందును. ఇటఁ జక్షుఃప్రీతి మనస్సంగ గుణనుతి చింత నోన్మాదము లను ననంగదశలు యథాసంభవముగ గదితంబు లయ్యె. ఊర్పులు స్మరదశానుభావములుగా నెఱుఁగవలయు.

క. ఈలీల నృపతిదర్శన,కేళీభవవిస్మయాను◊కీలితమతియై
నాళీకనయన ఆ! లల,నాళీకమలాస్త్రుఁ డనుచు ◊నతనిం బొగడెన్. 85

టీక: నాళీకనయన =కమలనేత్రయగు చంద్రిక; ఈలీలన్=ఈప్రకారముగ; నృపతిదర్శనకేళీభవవిస్మయానుకీలితమతి ఐ – నృపతి=రాజుయొక్క, దర్శనకేళీ=దర్శనవిలాసమున,భవ=పుట్టినట్టి, విస్మయ=ఆశ్చర్యముచేత, అనుకీలిత=బంధింపఁ బడిన, మతి ఐ =మనస్సుగలదై; ఆ = ఇది యాశ్చర్యమును దెలుపును; లలనాళీకమలాస్త్రుఁడు = యువతీసమూహమునకు కందర్పుఁడు; అనుచున్; అతనిన్=ఆరాజును (ఆసుచంద్రుని); పొగడెన్ = నుతించెను. నుతిప్రకారం బగ్రిమపద్యాదిగాఁ జెప్పఁ బడుచున్నది.

సీ. తనవిధుత్వ మ్మాస్యఁమున నొప్ప ఘనలక్ష్మి, యొనరఁ దోఁచినపూరుఁషోత్తముండు,
తనతమోగతి కైశ్యఁమునఁ దోఁప సద్గణ,త్రాణంబునకుఁ జేరు ఁరాజమౌళి,
తనయంగమహిమ నేఁత్రముల రాజిలఁ గళా,వ్యాప్తిఁ జూపట్టుప్రఁజాధినేత,
తనశోణరుచి మోవిఁ ఁదగ జగమ్ములమ్రొక్కు,లంది చెల్వొనులోఁకైకబంధుఁ,
తే. డట్టి యీదిట్ట పతి యంచు ఁనబ్జపాణి, యవనిభృన్నాయకకుమారి ఁహంసయాన
పద్మినీమణి మానసఁపదవి మెచ్చ, సన్నుతింపఁ దరంబె భుఁజంగపతికి. 86

టీక: తనవిధుత్వమ్ము=తనవిష్ణుత్వము, చంద్రత్వమని యర్థాంతరము దోఁచుచున్నది, 'విధు ర్విష్ణౌ చంద్రమసి' అని యమరుఁడు;ఆస్యమునన్=ముఖమున; ఒప్పన్; ఘనలక్ష్మి=గొప్పదియైన శ్రీదేవి, రాజ్యలక్ష్మి యని యర్థాంతరము దోఁచుచున్నది; ఒనరన్=ఒప్పఁగా; తోఁచినపూరుషోత్తముండు = తోఁచినట్టి నారాయణుఁడు, నరశ్రేష్ఠుఁడని యర్థాంతరము.
తనతమోగతి =తన తమోగుణప్రాప్తి, చీఁకటితీరని యర్థాంతరము దోఁచుచున్నది;కైశ్యమునన్=కేశసమూహమందు; తోఁపన్; సద్గణత్రాణంబునకున్ = శ్రేష్ఠమగు ప్రమథగణరక్షణమునకు, సత్పురుషసంఘమున కని యర్థాంతరము; చేరు రాజమౌళి = భూమిఁ జేరిన మహాదేవుండు, రాజశ్రేష్ఠుండని యర్థాంతరము;
తనయంగమహిమ = తనముఖాద్యవయవబాహుళ్యము, అంగములపూజ్యత యని యర్థాంతరము దోఁచును; నేత్రములన్ = కన్నులయందు; రాజిలన్=ప్రకాశింపఁగా; కళావ్యాప్తిన్=విద్యావ్యాప్తిచేత, తేజోవ్యాప్తిచేత నని యర్థాంతరము; చూపట్టు ప్రజాధినేత=అగపడుచున్న బ్రహ్మదేవుఁడు, నరపతి యని యర్థాంతరము;
తనశోణరుచి = తనరక్తకాంతి; మోవిన్=పెదవియందు; తగన్=ఒప్పఁగా; జగమ్ములన్=లోకములందు; మ్రొక్కులు=ప్రణామములను; సూర్యపక్షమున 'నమస్కారప్రియో భానుః' అనుటచేతను, రాజపక్షమున శరణాగతిచేతను, అని తెలియవలయు; అంది =పొంది; చెల్వొనులోకైకబంధుఁడు = అందమందిన సూర్యుఁడు, భువనహితుఁడని యర్థాంతరము.
అట్టి యీదిట్ట = పూర్వోక్తగుణశాలియగు నీదిట్టతనముగలవాఁడు; పతి = పెనిమిటి, భూపతి యని తోఁచును; అంచున్ = ఇట్లనుచు; అబ్జపాణి = పద్మహస్త యగు లక్ష్మీదేవి, పద్మములవంటి హస్తములుగల స్త్రీయని తోఁచును; అవనిభృన్నాయక కుమారి = పర్వతరాజసుత యగు గౌరి, రాజపుత్త్రి యని యర్థాంతరము దోఁచును; హంసయాన = హంస వాహనముగాఁగల సరస్వతి, హంసగమనయైన కలికి యని యర్థాంతరము దోఁచును; పద్మినీమణి = పద్మలత యను నారీమణి, 'పద్మినీవల్లభో హరిః' అనుటచేత సూర్యునిప్రియ పద్మిని యని చెప్పఁబడియె, పద్మినీజాతిస్త్రీరత్న మని యర్థాంతరము దోఁచుచున్నది; మానసపదవిన్=మనోవీథియందు; మెచ్చన్=ప్రశంసింపఁగా; భుజంగపతికిన్=శేషునికి; సన్నుతింపన్=కొనియాడుటకు; తరంబె =వశమా?

అనఁగా లక్ష్మీ గౌరీ సరస్వతీ పద్మినీమణులే, పైఁజెప్పినక్రమముగ విష్ణుమూర్తి యనియు, శివుఁడనియు, బ్రహ్మదేవుండనియు, సూర్యుండనియుఁ గొనియాడుచుండఁగా నిట్టి యుత్తముని గొనియాడుటకు శేషునకైనఁ దరముగాదనుట. లక్ష్మి విష్ణువును, గౌరి శివుని, సరస్వతి బ్రహ్మను, పద్మిని సూర్యునిఁ బతి యని కొనియాడుట సహజమని తెలియునది. ఆరాజు మోము చంద్రునిఁ బోలిన దనియు, కేశములు చీఁకటిని బోలినవనియు, నేత్రములు విశాలము లనియు, మోవి యరుణమైన దనియు, దానంజేసి పద్మములఁబోలుకేలుగలదానికి, రాజపుత్త్రియగుదానికి, నంచనడలదానికి, పద్మినీజాతిస్త్రీరత్నమునకుఁ బతిగాఁ గోరఁదగినవాఁడనియు, భావపర్యవసానమగుచున్నది. ఇందువలన నబ్జపాణిత్వ రాజపుత్త్రీత్వ హంసగమనాత్వ

పద్మినీమణిత్వాది గుణవిశిష్ట యగు తనకు నిట్టి లోకోత్తరగుణగరిష్ఠుఁడగు సుచంద్రుఁడు పతిగా వరింపఁదగినవాఁడని ఫలిత మగు చున్నది. శ్లిష్టరూపకము.

మ. గళపూగచ్ఛవి యబ్జకాండపరిసర్గం బూన్పఁ, గన్నుల్ గనన్
నలరూపంబులు పెంప, లేనగవు చంద్రశ్రేణుల న్మన్ప, ని
ర్మల మౌమోవి మధూత్కరంబు ఘటియింప, న్మించు నీభర్తతోఁ
దలఁపం జెల్లునె సాటి యౌ ననుచుఁ దద్రమ్యాంగసౌభాగ్యముల్. 87

టీక: గళపూగచ్ఛవి = పూగమువంటి గళముయొక్క కాంతి; అబ్జకాండపరిసర్గంబు—అబ్జకాండ = పద్మబాణుఁడగు మరుని యొక్క, శంఖసమూహముయొక్క, పరిసర్గంబు = సృష్టిని; ఊన్పన్ =వహింపఁగా; కన్నుల్ కనన్ =నేత్రములు చూడ; నల రూపంబులు = నలచక్రవర్తియొక్క స్వరూపములను, కమలరూపములను; పెంపన్=పోషింపఁగా; లేనగవు =చిఱునగవు; చంద్రశ్రేణులన్ = చంద్రులయొక్క గుంపులను, కర్పూరముయొక్క గుంపులను; మన్పన్=వృద్ధిఁబొందింపఁగా; నిర్మలము= నిర్దోషము; ఔ మోవి = అయిన పెదవి; మధూత్కరంబు = వసంతులయొక్క సమూహమును, తేనెలయొక్క సమూహమును; ఘటియింపన్= చేయఁగా; మించు నీభర్తతోన్ = అతిశయించు నీరాజుతో; తద్రమ్యాంగసౌభాగ్యమున్ – తత్=ఆస్మరనలచంద్ర వసంతులయొక్క, రమ్య=మనోజ్ఞములగు, అంగ =శరీరములయొక్క,సౌభాగ్యముల్=సౌందర్యములు; సాటియౌననుచున్ = సరియగుననుచు; తలఁపన్ చెల్లునె = స్మరింపఁదగునా? తగదనుట.

సుచంద్రుని యొక్కొక్క యవయవంబే యనేకస్మరనలచంద్రవసంతాదులను సృజించుచుండఁగా నట్టిసుచంద్రునితో వారు సాటి యౌదు రనుట చెల్ల దని యభిప్రాయము. ఈరాజు గళము శంఖమును, కన్నులు పద్మములను, లేనగవు కర్పూ రమును, బోలియున్న వనియు, పెదవి తేనియలు ఘటియించుచున్నదనఁగా నంత మధుర మనియు ఫలితము. శంఖాదులకు గళాద్యుపమిత్యనిష్పత్తిచేతఁ బ్రతీపభేదము శ్లిష్టరూపకోత్థాపితము.

చ. ఘనఖరతామిళద్విషమకాండసమున్నతహేతిజాతతా
పనికర మంతయుం గడకుఁ బాయఁగ నీసదధీశుపాదసే
వనగతి యేతదీయఘనవర్తనఁ గాంచక యున్నచోఁ గరం
బెనయదె నాదుశ్యామతనమెంతయు నుర్వి నిరర్థకత్వమున్. 88

టీక: ఇందుఁ జంద్రికాపరమైనయర్థము, రాత్రిపర మైనయర్థము గలుగును. ఏలాగనిన: ఘనఖరతామిళద్విషమకాండసము న్నతహేతిజాతతాపనికరము – ఘన=అధికమగు,ఖరతా=తీక్ష్ణత్వముతో, మిళత్=కూడుకొన్న, విషమకాండ=పంచబాణుని యొక్క, సప్తాశ్వుఁడైన సూర్యునియొక్క యని రాత్రిపరమైన యర్థము; సమున్నత=మిక్కిలి యతిశయించిన, హేతి=బాణ ములవలన, 'హేతి స్స్యా దాయుధే జ్వాలే' అని విశ్వము,జాత=పుట్టినట్టి, తాప=సంతాపముయొక్క, నికరము=సంఘము; హేతి=కిరణములయొక్క, జాత= సమూహమువలననైన, తాప=వేడియొక్క, నికరము= సమూహము అని రాత్రి పరమైన యర్థము; అంతయున్=ఎల్లను; కడకుఁ బాయఁగన్=కడకుఁ బోవఁగా; ఈసదధీశుపాదసేవనగతి– ఈసదధీశు = ఈ మంచి రాజుయొక్క, పాద=అడుగులయొక్క, సేవన=సేవించుట; ఈసదధీశు=నక్షత్రేశుఁడైన యీచంద్రునియొక్క, పాద= కిరణ ములయొక్క, సేవన=సేవించుట, అని రాత్రి పరమైన యర్థము; గతి =శరణము; ఏతదీయఘనవర్తనన్= ఈరాజుయొక్క

యున్న తవృత్తిని, ఈచంద్రునియొక్క పూర్ణభావము నని యర్థాంతరము; కాంచక యున్న చోన్= చూడకుండినయెడల; నాదు శ్యామతనము=నాయొక్క యౌవనవతీత్వము, రాత్రిత్వము అని యర్థాంతరము; ఎంతయున్=మిక్కిలి; ఉర్విన్=పుడమి యందు; నిరర్థకత్వమున్=వ్యర్థతను; కరంబు ఎనయదె = మిక్కిలి పొందదా?

అనఁగా సూర్యకిరణజనితతాపము సనుటకు చంద్రకిరణసేవనమె రాత్రికెట్లు శరణంబో అట్లుకాక యున్న రాత్రి యెట్లు వ్యర్థమో, అట్లు స్మరశరజనితసంతాపము సనుటకు నాకు నీరాజుపాదసేవనమె శరణంబు, అట్లు కానిచో నాదుతారుణ్య మంతయు వ్యర్థంబ యగునని భావము. ప్రకృతాప్రకృతముల కౌపమ్యంబు గమ్యము.

చ. అని యనివార్యదోహదస⁽⁾మన్వితమానసవల్లియై, వినూ
తనచపలాతనూకులమ⁽⁾తల్లి దలంచుచునుండునంతలో
వనిత యొకర్తు చేరి చెలు⁽⁾వా నిను రమ్మనె నిష్ఠ వీణియన్
విన జనయిత్రి యన్న గురు⁽⁾ని న్వినయంబునఁ గాంచెఁ గాంచినన్. 89

టీక: వినూతనచపలాతనూకులమతల్లి = నూతనమైన మెఱుపువంటి శరీరముగలవారిగుంపున శ్రేష్ఠయగు చంద్రిక; అనివార్య దోహదసమన్వితమానసవల్లియై – అనివార్య=నివారింప నలవికాని, దోహద=ఆసక్తితో, దోహదక్రియతో నని వల్లీపదస్వార స్యముచే నర్థాంతరము దోఁచును, సమన్విత=కూడుకొన్నట్టి, మానస=మనస్సనెడు, వల్లియై=లతగలదై; అని=పైవిధముగ; తలంచుచు = తలపోయుచు; ఉండునంతలో =ఉన్నంతలో; వనిత యొకర్తు = ఒకస్త్రీ; చేరి=వచ్చి; చెలువా=సకియా! జనయిత్రి =తల్లి; ఇష్ఠ =ఈసమయమున; వీణియన్ =వీణావాద్యమును; వినన్=వినుటకు; నినున్ రమ్మనెన్; అన్నన్=ఇట్లనఁగా; గురునిన్=గురువైన కుముదుని; వినయంబునన్ =వినయముతోడ; కాంచెన్=చూచెను; కాంచినన్ = అట్లు చూడఁగా, దీనికి ముందుపద్యముతో నన్వయము.

ఉ. కిన్నరకంఠి యీనృపతి⁽⁾కి న్సతి వయ్యెదు నాదుమాట యా
సన్న శుభంబు పొమ్మనుచుఁ ⁽⁾జక్కఁగ నంచినఁ దద్గురూక్తిచేఁ
గన్నియ యేగె మాతసము⁽⁾ఖంబును గాంతలు వెంట రాఁగ ను
ద్యన్నవహీరపాదకట⁽⁾కార్భటి యంచల బుజ్జగింపఁగన్. 90

టీక: కిన్నరకంఠి = కిన్నరులకంఠస్వరమువంటి కంఠస్వరముగలదానా! ఈనృపతికిన్=ఈరాజునకు; సతి వయ్యెదు = భార్యవు కాఁగలవు; నాదుమాట = నావాక్యము; ఆసన్న శుభంబు =సమీపించినశుభంబు గలది; పొమ్మనుచున్ = పోవలసిన దనుచు; చక్కగన్=బాగుగ; అంచినన్=పంపఁగా; తద్గురూక్తిచేన్=ఆగురువాక్యముచేత; కన్నియ=చంద్రిక; కాంతలు=స్త్రీలు; వెంట రాఁగన్ = వెంబడి రాఁగా; ఉద్యన్నవహీరపాదకటకార్భటి – ఉద్యత్=ఉదయించుచున్న, ఇది యార్భటికి విశేషణము, నవ=క్రొత్తనగు, హీర=వజ్రమయములగు, పాదకటక=కాలియందెలయొక్క, ఆర్భటి=ధ్వని; అంచలన్=హంసలను; బుజ్జ గింపఁగన్=లాలనసేయఁగా; మాతసముఖంబును = తల్లిసన్నిధింగూర్చి; ఏగెన్=పోయెను.

మ. అలయోషామణి యిట్టు లేగ రవివం⁽⁾శాధీశుఁ డుద్భ్రాంతహృ
త్తలయోగంబున నెందుఁ జెందె లతికా⁽⁾తన్వంగి వీక్షించుటల్

గలయో మారశరాళి నేకరణి వేఁ◊గ న్వచ్చు నివ్వేళ నా
నలయోషిత్సమఁ గాంచ కే ననుచుఁ జిం◊తారేఖ సంధించుచున్. 91

టీక: అలయోషామణి = ఆస్త్రీరత్నము; ఇట్టులు=ఈప్రకారము; ఏగన్=పోవఁగా; రవివంశాధీశుఁడు=సుచంద్రుఁడు; ఉద్భ్రాంత హృత్తలయోగంబునన్–ఉద్భ్రాంత=భ్రమిసినట్టి, హృత్తల=హృదయప్రదేశముతోడి,యోగంబునన్=సంబంధముచేత; లతికాతన్వంగి =లతాసుకుమారదేహయగు చంద్రిక; ఎందున్ జెందెన్ = ఎటఁ బోయెను? వీక్షించుటల్=చూచుటలు; కలయో = స్వప్నమో; ఇవ్వేళన్=ఈసమయమందు; ఆ నలయోషిత్సమన్=దమయంతీతుల్యయగు నాచంద్రికను; కాంచక=చూడక; ఏన్=నేను; మారశరాళిన్=స్మరశరములగుంపుచేత; ఏకరణిన్=ఏరీతి; వేఁగన్ వచ్చున్=తపింపవచ్చును? అనుచున్=ఇట్లనుచు; చింతారేఖ =చింతాపరంపరను; సంధించుచున్ = కావించుచు, దీని కుత్తరపద్యముతో నన్వయము.

సీ. శారి పూఁబొదఁ జేరి ◊చక్కఁబల్కెనదారి, నారి పల్కె నటంచు ◊సారె దలఁచు,
రామచంపకధామ◊రాజి పర్వెడుసీమ, భామ నిల్చె నటంచుఁ ◊బ్రేమఁ గాంచు,
నంచ యింపు రహింప ◊నడుగు వెట్టినయంచఁ, గాంచనాంగి చరించె ◊నంచుఁ జూచు,
బాలకోకిల చాల◊నోలి మ్రొసెడుమూల, బాల పాడె నటంచుఁ ◊జాల మెచ్చు
తే. లలితపవమాన మాన నా◊లయవనస్థ,లాబ్జలసమానసౌమన◊సానుమోద
మలమ నసమానమానస ◊మతులప్రమద,మానఁగ సుచంద్రమానవా◊ధ్యక్షుఁ డలరు. 92

టీక: శారి =గోరువంక; పూఁబొదన్=పువ్వులపొదను; చేరి =పొంది; చక్కన్=బాగుగ; పల్కినదారిన్=పల్కినత్రోవను; నారి = చంద్రిక; పల్కెన్ అటంచున్ = పల్కె ననుచు; సారె =మాటిమాటికి; తలఁచున్=ఎంచును.
రామచంపకధామరాజి – రామ=ఒప్పుచున్న,చంపక=సంపెఁగలయొక్క,ధామరాజి =కాంతిపరంపర; పర్వెడుసీమన్ = ప్రసరించు ప్రదేశమునందు; భామ = చంద్రిక; నిల్చెన్ అటంచున్ = నిలిచియున్నదనుచు; ప్రేమన్ =ప్రీతితో; కాంచున్=చూచును.
అంచ =హంస; ఇంపు రహింపన్=సొంపగునట్లుగా; అడుగువెట్టినయంచన్=అడుగిడినచోట; కాంచనాంగి =చంద్రిక; చరించె నంచున్=సంచరించె ననుచు; చూచున్ = అవలోకించును.
బాలకోకిల =చిన్నికోయిల; చాలన్=మిక్కిలి; ఓలిన్=వరుసగా; మ్రొసెడుమూలన్=కూయువంక; బాల =చంద్రిక; పాడెన్ అటంచున్ = గానముచేసె ననుచు; చాలన్=అధికముగా; మెచ్చున్ = శ్లాఘించును.
లలితపవమానము=మనోహరమైన మందమారుతము; ఆనన్=స్పృశింపఁగా; ఆలయవన స్థలాబ్జ లసమాన సౌమనసానుమోదము – ఆలయవన=సదనోద్యానమందుండెడు, స్థలాబ్జ=మెట్టదామరమొదలగు, లసమాన=ప్రకాశించుచున్న, సౌమనస = పుష్పసమూహముయొక్క, అనుమోదము =పరిమళము; అలమన్=క్రమ్ముటచేత; అసమానమానసము = సాటిలేని మనస్సు; అతులప్రమదము=నిరుపమానమగు సంతసమును; ఆనఁగన్=పొందఁగా; సుచంద్రమానవాధ్యక్షుఁడు = సుచంద్రనరపాలుఁడు; అలరున్ = ప్రకాశించును. చంద్రికాయత్తచిత్తుండై తదేకధ్యానము సేయు నారాజునకు పైఁజెప్పిన శారిపల్కులు లోనగునవి యెల్లఁ జంద్రికావ్యాపార ములుగఁ దోచె నని తాత్పర్యము.

చ. అళినికరంబు కీలుజడ, ◊యందపుఁగెందలిరాకు మోవి, ని
స్తలతరమంజరుల్ మెఱుఁగుఁ◊జన్నులు, మొగ్గలచాల్ పదాంబుజ

స్థలనఖపాళి గాఁగ, వనధాత్రిఁ గనంబడుతీవ లెల్ల నా
చెలిసొబ గానృపాలు మదిఁ జేర్చి భ్రమింపఁగఁజేసె నయ్యెడన్. 93

టీక: అయ్యెడన్ = ఆసమయమందు; అళినికరంబు =తుమ్మెదలగుంపు; కీలుజడ = జాఱవిడిచిన జడయును; అందపుఁగెందలి రాకు = అందమయిన ఎఱ్ఱనిచిగురాకు; మోవి =అధరంబును; నిస్తులతరమంజరుల్=వట్రువులగు పువ్వుగుత్తులు; మెఱుఁగుఁ జన్నులు = ప్రకాశించు కుచములును; మొగ్గలచాల్=మొగ్గలగుంపు; పదాంబుజస్థలనఖపాళి = పాదకమలములయందుండు గోరులచాలును; కాఁగన్=అగుచుండఁగా; వనధాత్రిన్=ఉద్యానవనభూమియందు; కనంబడుతీవలు ఎల్లన్ = కననగుచున్న లత లెల్ల; ఆచెలిసొబగు=ఆచంద్రికయందమును; ఆనృపాలు మదిన్=ఆరాజుమనమునందు; చేర్చి; భ్రమింపఁగఁజేసెన్ = భ్రమ నొందునట్లు చేసెను.

అనఁగాఁ బైఁజెప్పిన చొప్పున నొప్పులతలెల్లఁ జంద్రికావయవములసొబగుఁ గాన్పించి, యారాజు ననంగదశలలోని యున్మాదావస్థ నొందునట్లు చేయు ననుట. 'సర్వావస్థాసు సర్వత్ర తన్మనస్కతయా సదా। అతస్మిన్ తదితి భ్రాన్తి రున్మాదో విరహోద్భవః' ఇట్లుక్తలక్షణలక్షితం బగునున్మాద మను ననంగదశావిశేష మిందు వచింపఁబడియె. ఇట్లు శారి పూఁబోదఁ జేరి యను క్రిందిపద్యమునందును దెలియవలయు.

సీ. కమ్మపుప్పొడిగాడ్పు గ్రమ్మ నొప్పగుబండి,గురివెందవిరిగుత్తికొమరుఁ జూచి,
యలరు సంపెఁగతీవ యలమ నింపుగఁ దోఁచు,కలికిక్రొమ్మల్లియచెలువుఁ జూచి,
మగతేఁటి వేడ్క మించఁగ ముద్దుగొనిన చ,క్కనిమెట్టదామరకళుకుఁ జూచి,
సొలపుచక్కెరతిండిపులుఁగు నొక్కెడిబింబి,కాపక్వఫలముపొంకంబుఁ జూచి,
తే. తరుణిచనుదోయి, కెంపుగందవాడఁ బూసి, చెలువనెమ్మేను కౌఁగిటఁ జేర్చి కొమ్మ
మోము ముద్దిడి, పూఁబోణిమోవిఁ గ్రోలి, చెలఁగు టెపు డబ్బునో యంచుఁ దలఁచు నృపతి. 94

టీక: నృపతి=సుచంద్రుఁడు; కమ్మపుప్పొడిగాడ్పు=కమ్మనిపుప్పొడిసంబంధి యగు వాయువు; క్రమ్మన్=ప్రసరింపఁగా; ఒప్పగు బండిగురివెందవిరిగుత్తికొమరున్=ఒప్పిదమగు బండిగురివెందపూగుత్తియొక్క సౌందర్యమును; చూచి=వీక్షించి; అలరు సంపెఁగతీవ = ప్రకాశించు చంపకలత; అలమన్=ఆక్రమింపఁగా; ఇంపుగన్=ఇంపగునట్లు; తోఁచు కలికిక్రొమ్మల్లియ చెలువున్ =తోఁచుచున్న యందమగు నూత్నమల్లికయొక్క యందమును; చూచి=వీక్షించి;
మగతేఁటి =గండుతుమ్మెద; వేడ్కన్=ఉత్సవము; మించఁగన్=అతిశయించునట్లు; ముద్దుగొనిన =చుంబించిన; చక్కనిమెట్ట దామరకళుకున్ = అందమైన మెట్టదామరయొక్క చక్కఁదనమును; చూచి=వీక్షించి;
సొలపుచక్కెరతిండిపులుఁగు =పరవశమయిన శుకపక్షి; నొక్కెడిబింబికాపక్వఫలముపొంకంబున్ = కొఱుకుచున్న పండిన దొండపండుయొక్క యందమును; చూచి=వీక్షించి;
తరుణిచనుదోయి =చంద్రికాకుచయుగ్మమును; కెంపుగందవొడిఁ బూసి=ఎఱ్ఱనిగందపొడిచేఁ బూసి; చెలువనెమ్మేను= సుందరి యొక్క యందమైన శరీరమును; కౌఁగిటన్ చేర్చి = ఆలింగనముఁజేసికొని; కొమ్మమోము=ఆస్త్రీముఖమును; ముద్దిడి=చుంబనము చేసి; పూఁబోణిమోవిన్ = ఆనారియధరమును; క్రోలి = పానముఁజేసి; చెలఁగుట = ప్రకాశించుట; ఎపుడబ్బునో = ఎపుడు కలుగునో; అంచున్ ; తలఁచున్=స్మరించును.

అన(గా బండిగురివెందవిరిగుత్తి చన్దోయిగను, దానిపై(గ్రమ్ము పుప్పొడి కెంపుగందవొడిగను, సంపెంగచే(జుట్ట(బడిన మల్లియ పురుషాలింగితతన్వంగిగాను, మగతేటిచే(జుంబితమైన మెట్టదామర పురుషచుంబితస్త్రీముఖముగను, శుకతుండ ఖండితమగు బింబఫలము దంతక్షతమైన స్త్రీయధరముగాను దో(చి యారాజు చంద్రికాస్తనయుగ్మాలింగనాధరచుంబనాదు లెపు డబ్బునో యని స్మరించె ననుట. ఇట ననుస్మృతి యను ననంగదశ చెప్ప(బడియె. 'ముహుర్ముహు ర్నిశ్వసితై ర్మనోరథ విచిన్తనైః। ప్రద్వేష స్త్వన్యకార్యాణా మనుస్మృతి రుదాహృతా' అని నాట్యశాస్త్రమందు(దల్లక్షణము.

సీ. ఎంతమాధవదయా◊సంతానసంసిద్ధి(, బొలిచెనో యిచ్చటి◊తిలకపాళి,
యెంతపుణ్యద్విజా◊ధీశసంసేవన, వఱలెనో యిచ్చటి◊చిఱుతమావి,
యెంతమహాసవో◊ద్ధృతిగతాత్మసుమాప్తి, మనియెనో యిచ్చటి◊కనకరాజి,
యెంతసదాళిచి◊త్తేష్టదానస్ఫూర్తి, వెలసెనో యిచ్చటి◊కలికిక్రోవి,
తే. చెలికటాక్షైకధారచే(◊జెల(గ నెల(త, పాణిలాలనమున మించ(◊ బడ(తిమోము
గని యలర, నాతిపరిరంభ◊గరిమ(జొక్క, ననుచు నృపమౌళి కడు(జింత(◊బెనుచు మదిని. 95

టీక: ఇచ్చటితిలకపాళి = ఈవని నున్న బొట్టుగులగుంపు; ఎంతమాధవదయాసంతానసంసిద్ధిన్ = ఎంత విష్ణువుయొక్క కరుణాసముదయసంసిద్ధిచేత, ఎంత వసంతదయాసముదయసంసిద్ధిచేత నని స్వభావార్థము; పొలిచెనో = ఉదయించెనో, ఇచ్చటిచిఱుతమావి = ఇటనున్న చిన్నిమావి; ఎంతపుణ్యద్విజాధీశసంసేవనన్ = ఎంత పుణ్యవంతులైన విప్రశ్రేష్ఠులసేవచేత, ఎంత మనోజ్ఞములగు పక్షిశ్రేష్ఠములయొక్క సేవచేత నని వాస్తవార్థము, 'పుణ్య మ్మనోజ్ఞేఽభిహితం తథా సుకృత ధర్మయోః' అని విశ్వము; వఱలెనో =ఒప్పెనో,
ఇచ్చటికనకరాజి =ఈయుద్యానవనమందలి సంపె(గచాలు; ఎంతమహాసవోద్ధృతిగతాత్మసుమాప్తిన్ – ఎంతమహాసవ = ఎంతగొప్పయజ్ఞములయొక్క, ఉద్ధృతి=పోషణముచేత, గత=పొంద(బడిన, ఆత్మ=తమయొక్క, సు=లెస్సయిన, మా= సంపదయొక్క, ఆప్తిన్=ప్రాప్తిచేత; ఎంత, మహత్=అధికమైన, ఆసవ=పూ(దేనియయొక్క, ఉద్ధృతి=భరణమును, గత= పొందిన, ఆత్మ=తమయొక్క, సుమాప్తిన్= కుసుమములప్రాప్తిచేత నని వాస్తవాభిప్రాయము; మనియెనో=పెంపొందెనో, ఇచ్చటికలికిక్రోవి =ఇందలి యందమగు గోరింట; ఎంతసదాళిచిత్తేష్టదానస్ఫూర్తిన్ – ఎంత, సదాళి=సత్పురుషులగుంపు యొక్క, చిత్త=చిత్తములకు, ఇష్టదాన = ఇష్టములైన వస్తువుల ప్రదానముయొక్క, స్ఫూర్తిన్ =విస్ఫురణముచేత; ఎంత, సదా= ఎల్లప్పుడు, అళి=తుమ్మెదలయొక్క, ఇట సదాశబ్ద మళిశబ్దముతో 'సుప్సుపా' అని సమసించినది, చిత్త=చిత్తములకు, ఇష్టదాన = ఇష్టమైన పుష్పాసవప్రదానముయొక్క, స్ఫూర్తిన్ =విస్ఫురణముచేత నని వాస్తవాశయము; వెలసెనో = ప్రకాశించెనో, చెలికటాక్షైకధారచేన్ = చంద్రికయొక్క క్రేగంటిచూపులపరంపరచేత; చెల(గన్=ఒప్పుటకు; నెల(తపాణిలాలనమునన్ = ఆమె హస్తముచే లాలించుటవలన; మించన్=అతిశయించుటకు; పడ(తిమోము గని =ఆమెయొక్కముఖమును గాంచి; అలరన్ = సంతసించుటకు; నాతిపరిరంభగరిమన్=ఆమె యాలింగనాతిశయముచేత;చొక్కన్=సుఖపరవశత నొందుటకును; అనుచున్ =ఇట్లనుచు; నృపమౌళి =రాజశ్రేష్ఠు(డు; మదిని=హృదయమునందు; కడున్=మిక్కిలి; చింతన్=విచారమును;పెనుచున్= వృద్ధి(బొందించుకొనును.

అన(గా(దిలకపాళి, చిఱుతమావి, కనకరాజి, కలికిక్రోవి అంత లోకోత్తరనాయికా కటాక్షప్రసార,కరలాలన, ముఖదర్శన, పరిరంభములచే నలరుట దుర్ఘటము గావున నవి యెంతో మాధవదయాసంసిద్ధి, ద్విజాతిసేవనాదులు పొందియుండవలెననుట.

బొట్టుగులకు స్త్రీకటాక్షవీక్షణంబు, మావులకు స్త్రీకరలాలనంబు, సంపెఁగలకు స్త్రీముఖదర్శనంబు, గోరంటలకు స్త్రీపరిరంభంబు దోహదములు గావునఁ గటాక్షవీక్షణాదులచే నవి సంతసించుట స్వభావసిద్ధంబని కవిహృదయంబు. 'తరుగుల్మలతాదీనా మకాలే ఫలపుష్పయోః। ఆధానాయ క్రియా యా స్యా త్స దోహద ఇతీర్యతే। ఆలిఙ్గనా త్కురవక శ్చమ్పకో ముఖదర్శనాత్। చూతో యోషిత్కరస్పర్శా త్తిలకో దృక్ప్రసారణాత్। ఆకర్ణనా త్కర్ణికార స్త్వశోకః పాదతాడనాత్।దాడిమీ ధూమసందోహా త్ప్రియాళు ర్గానసంపదః।' ఇత్యాదిగా దోహదలక్షణములు. ఏతద్విశేషంబులుకొన్ని ద్వితీయాశ్వాసమున వ్రాయఁబడియె.

మ. నవలా యేగినదారిఁ గాంచు, మదిఁ ద\న్నాళీకపత్త్రేక్షణా
నవలావణ్యవిశేష మెంచు, వలవం\తం జాలఁ జింతించు, రా
జవలారాతి తదేకమోహలహరీ\సంసక్తచిత్తంబునన్
గువలాస్త్రాతినిశాతసాయకశిఖా\కుంఠీభవద్ధైర్యుఁడై. 96

టీక: రాజవలారాతి (రాజ+బలారాతి)=రాజేంద్రుఁడు, 'శసయో ర్బవయో స్తథా' అనుటచేత బవలకు భేదంబులేమి కవి వ్యవహారసిద్ధమని వెనుక వ్రాయంబడియె; తదేకమోహలహరీసంసక్తచిత్తంబుననన్– తత్=ఆచంద్రికయందు, ఏక= ముఖ్యమగు, మోహలహరీ=మోహప్రవాహముతో, సంసక్త=కూడుకొన్నట్టి, చిత్తంబునన్=మనస్సుచేత; కువలాస్త్రాతినిశాతసాయకశిఖా కుంఠీభవద్ధైర్యుఁడై– కువలాస్త్ర=మరునియొక్క, అతినిశాత=మిక్కిలితీక్ష్ణములగు, సాయక= బాణములయొక్క,శిఖా = జ్వాలలచేత, కుంఠీభవత్=తగ్గుచున్న, ధైర్యుఁడై =ధైర్యము గలవాఁడయి; నవలా యేగినదారిన్= చంద్రిక పోయిన త్రోవను; కాంచున్=చూచును; మదిన్=హృదయమునందు; తన్నాళీకపత్త్రేక్షణానవలావణ్యవిశేషము – తన్నాళీకపత్త్రేక్షణా = ఆకమల నయనయగు చంద్రికయొక్క, నవ=నూతనమగు, లావణ్యవిశేషము=విలక్షణలావణ్యమును; ఎంచున్=ప్రశంసించును; వలవంతన్=మన్మథవ్యథచేత; చాలన్=మిక్కిలి; చింతించున్=చింతసేయును.

చ. నరవిభుఁ డిట్లు తత్సతియ\నర్గళమోహగతిం భ్రమింపఁ గి
న్నరపతి యప్డుచేరి మహి\నాయక యీగతి వంత నాత్మ నుం
తురె నినుఁ బ్రేమఁ జూచిన వ\ధూమణి నింతకు మున్నె యేఁచెఁ ద
త్స్మరశరకోటి త్వద్గతస\మగ్రమనోరథగా ఘటించుచున్. 97

టీక: నరవిభుఁడు=సుచంద్రుఁడు; ఇట్లు=ఈప్రకారముగ; తత్సతియనర్గళమోహగతిన్ = ఆచంద్రికావిషయకమైన యనివార్యమగు మోహరీతిచేత; భ్రమింపన్=చిత్తభ్రమనొందఁగా; కిన్నరపతి = కుముదుఁడు; అప్డు; చేరి = ఆరాజు సమీపమునొంది; మహినాయక =ఓరాజా! ఈగతిన్=ఈరీతిగ; వంతన్=సంతాపమునందు; ఆత్మన్=చిత్తమును; ఉంతురె =ఉంచుదురా? నినున్; ప్రేమన్=ఆసక్తిచేత; చూచినవధూమణిన్=అవలోకించిన యాస్త్రీరత్నమును; ఇంతకున్ మున్నె=ఇంతకుఁ బూర్వమె; తత్స్మరశర కోటి = ఆమన్మథుని మార్గణపరంపర; త్వద్గతసమగ్రమనోరథ=నీయందుఁ గలిగిన సమగ్రాభిలాషగలది; కాన్=అగునట్లు; ఘటించుచున్ =చేయుచు; ఏఁచెన్=బాధించెను. స్మరుఁడు మున్నే చంద్రికను నీసంగమము నభిలషించుదానిఁగా గావించుటం జేసి తనంతనే కార్యసిద్ధి యగుఁగాన దానికై నీవు చింతింపఁ బని లేదని తాత్పర్యము.

క. నీలాలక వరియించెద,వేలా వలవంత మేదినీశ్వర యన నా
కాలాబ్జవిమతకులజన,పాలాగ్రణి కూటధృతివిభాస్వన్మతితోన్. 98

టీక: మేదినీశ్వర=సుచంద్రుఁడా! నీలాలకన్=చంద్రికను; వరియించెదవు=పెండ్లియాడెద వనుట; వలవంత = మన్మథవ్యథ; ఏలా=ఎందుకు? అనన్= కుముదుఁ డిట్లు వచింపఁగా; ఆకాలాబ్జవిమతకులజనపాలాగ్రణి– కాలాబ్జవిమత=నీలోత్పలవిరోధి యగు సూర్యునియొక్క, కుల = వంశస్థులైన, జనపాల=రాజులయందు, అగ్రణి =శ్రేష్ఠుఁడైన యా సుచంద్రుఁడు; కూటధృతి విభాస్వన్మతితోన్=నిశ్చలమైనధైర్యముచే నొప్పుచున్న మదితోడ, దీని కుత్తరపద్యస్థమగు ‘పనిచె’ నను క్రియతో నన్వయము.

తే. గగనయానోత్తమస్యదగతి ధరిత్రి,నగరకాననకుధరసంతతులఁ గనుచుఁ
జని తనబలంబు నెనసి యాక్ష్మావిభుండు, కూర్మి గనుపట్ట నంత నాకుముదుఁ బనిచె. 99

టీక: ఆక్ష్మావిభుండు = ఆరాజు; గగనయానోత్తమస్యదగతిన్ – గగనయానోత్తమ = ఉత్తమవిమానముయొక్క, స్యద = వేగముయొక్క, ‘రయ స్యదః’ అని యమరుఁడు, గతిన్ =తీరుచేత; ధరిత్రిన్=భూమియందు; నగరకాననకుధరసంతతులన్ =పురారణ్యపర్వతములగుంపులను; కనుచున్=చూచుచు; చని=పోయి; తనబలంబున్=తనసైన్యమును; ఎనసి=చేరి; కూర్మి=ప్రేమము; కనుపట్టన్=కనఁబడునట్లు; అంతన్; ఆకుముదున్=పైఁజెప్పిన కుముదుని; పనిచెన్=పంపివేసెను.

చ. మును మునితోడఁ బల్కిన యమూల్యనిజోక్తిఁ దలంచి యారసా
జనపతిమౌళి సత్వరత సంగరభూమిఁ దమిస్రదానవేం
ద్రుని వధియింతు నంచు లలితోఁ దపనీయరథాధిరూఢుఁడై
చనియె రణానకప్రకరసాంద్రరుతుల్ దెస లెల్లఁ గ్రమ్మఁగన్. 100

టీక: మును =పూర్వమున; మునితోడన్=శాండిల్యునితోడ; పల్కిన యమూల్యనిజోక్తిన్ = వచించినట్టి యనర్ఘమగు తన మాటను; తలంచి = స్మరించి; ఆరసాజనపతిమౌళి = ఆరాజశేఖరుఁ డగు సుచంద్రుఁడు; సత్వరతన్=వేగముచేత; సంగర భూమిన్ = యుద్ధభూమియందు; తమిస్రదానవేంద్రునిన్ = తమిస్రాసురుని; వధియింతున్ అంచున్= సంహరింతు ననుచు; లలితోన్=ప్రీతితోడ; తపనీయరథాధిరూఢుఁడై = కనకరథము నధిష్ఠించినవాఁడగుచు; రణానకప్రకరసాంద్రరుతుల్ – రణ = యుద్ధసంబంధమైన, ఆనకప్రకర=భేరీసంఘముయొక్క, ‘ఆనకః పటహో స్త్రీ స్యాత్’ అని యమరుఁడు,సాంద్ర=దట్టములగు, రుతుల్=ధ్వనులు; దెసలు ఎల్లన్= దిక్కులనెల్లను; క్రమ్మఁగన్=ఆవరింపఁగా; చనియెన్=పోయెను.

సీ. అతులరింఖోద్భవక్షితిధూళి నానాశ,రాధీశమహిమఁ బోనాడు హయము,
లతిశాతదంతప్రహతిఁ గర్బురాచల,స్థితి నెల్ల మాయించు ద్విరదచయము,
లలఘుకేతనమారుతాళి మహాసురో,త్తమమండలిఁ దెరల్చు విమలరథము,
లాత్మభాసురసమాఖ్యాశక్తి యామినీ,చరభయంబు ఘటించు సద్భటేంద్రు,
తే. లపుడు వేవేలు గొలువ, నయ్యవనిభర్త, యిటులు కల్యాణమయరథం బెక్కి వేగ
శిశిరగిరిఁ జేర నరిగె నక్షీణదనుజ,దళనచణదివ్యసాధనోద్భాసి యగుచు. 101

టీక: అతులరింఖోద్భవక్షితిధూళిన్– అతుల=సాటిలేని, రింఖా=ఖురములచేత, ఉద్భవ=ఉదయించిన, క్షితిధూళిన్ = భూపరాగముచేత; నానాశరాధీశమహిమన్– నానా=అనేకప్రకారములగు, శరాధీశ=సముద్రములయొక్క, మహిమన్ = అతిశయమును, అనేకప్రకారులగు, ఆశరాధీశుల లనఁగా రాక్షసేశ్వరులయొక్క మహిమను నని యర్థాంతరధ్వని, 'క్రవ్యాదో స్రప ఆశరః' అని యమరుఁడు; పోనాడు హయములు = పోఁగొట్టెడు నశ్వములు;
అతిశాతదంతప్రహతిన్=మిక్కిలితీక్ష్ణములగు దంతములయొక్క ప్రహారములచేత; కర్బురాచలస్థితిన్=మేరుపర్వతస్థితిని, రాక్షసులయొక్క స్థిరమైన స్థితి నని యర్థాంతరము, 'గాఙ్గేయం భర్మ కర్బురమ్', 'రాత్రించరో రాత్రిచరః కర్బురః' అని యమరుఁడు; ఎల్లన్; మాయించు = మాపుచున్న; ద్విరదచయము =గజసమూహము;
అలఘుకేతనమారుతాళిన్ – అలఘు=అధికమగు, కేతన=ధ్వజములయొక్క, మారుతాళిన్=వాతజాతముచేత; మహాసురోత్తమమండలిన్ – మహత్=అధికమగు, సురోత్తమమండలిన్=సూర్యపుంజమును, ద్వాదశాదిత్యుల ననుట, 'సురోత్తమో ధామనిధిః పద్మినీవల్లభో హరిః' అని యమరుఁడు, గొప్ప యసురోత్తమమండలి నని యర్థాంతరము; తెరల్చువిమలరథములు =పోఁగొట్టుచున్న నిర్మలమైన రథములు;
ఆత్మభాసురసమాఖ్యాశక్తిన్– ఆత్మ=తమయొక్క, భాసుర=ప్రకాశమానమగు, సమాఖ్యా=యశముయొక్క, శక్తిన్=సామర్థ్యముచేత; యామినీచరభయంబు – యామినీచర=చంద్రునియొక్క, రాక్షసులయొక్క యని యర్థాంతరము, భయంబు = భీతిని; ఘటించుసద్భటేంద్రులు = చేయు శ్రేష్ఠభటనాయకులు;
అపుడు = ఆసమయమున; వేవేలు = అనేకసహస్రములు; కొలువన్=సేవింపఁగా; అయ్యవనిభర్త=ఆరాజు; ఇటులు =ఈరీతిగా; కల్యాణమయరథంబు = బంగరుతేరును, మంగళమయమయినరథము నని యర్థాంతరము, 'కల్యాణ మర్జునం భూరి' అని యమరుఁడు; ఎక్కి=అధిష్ఠించి; అక్షీణదనుజదళనచణదివ్యసాధనోద్భాసి– అక్షీణ= తక్కువగానట్టి, ఇది సాధనశబ్దమునకు విశేషణము, దనుజదళనచణ = రాక్షససంహారమునకు సమర్థమగు, దివ్య=లోకోత్తరమైన,సాధన=శరాదిసామగ్రిచేత, ఉద్భాసి=ప్రకాశించువాఁడు; అగుచున్; వేగ=వేగముగా; శిశిరగిరిన్=హిమవత్పర్వతమును; చేరన్ అరిగెన్ = పొందునట్లు చనెను. అనఁగా ఖురధూళిచే సముద్రమహిమ నపహరించు హయములును, దంతప్రహారములచేఁ గాంచనాచలము రూపుమాపు గజములును, గేతనవాతముచే సూర్యమండలిని దెరల్చు రథములును, నిజతేజములచేఁ జంద్రుని భయపెట్టు భటశ్రేష్ఠులును గొలుచుచుండ స్వర్ణమయరథంబు నెక్కి సుచంద్రుఁడు రాక్షససంహారసాధనసహస్రంబుతో శిశిరగిరిం జేరె ననుట.

శా. భాస్వన్మండలమధ్యగుం డగురమాభామావిభుండో యనన్
వస్వభ్యంచితచక్రపాదమున నందం బంది భూభర్త సై
న్యస్వాముల్ భజియింప దైత్యకటకేంద్రద్వారభూభృద్దరీ
భాస్వన్మార్గము సొచ్చె నంత ఘనబంభాఘోషముల్ హెచ్చఁగన్. 102

టీక: భూభర్త =సుచంద్రుఁడు; భాస్వన్మండలమధ్యగుండు=సూర్యమండలమధ్యవర్తి; అగురమాభామావిభుండు ఓ అనన్= అయినట్టి నారాయణుఁడో యనఁగా; వస్వభ్యంచితచక్రపాదమునన్ – వసు=సువర్ణముచేత, అభ్యంచిత=పూజ్యమగు, చక్రపాదమునన్ = చక్రములు పాదములుగాఁ గల రథమునందు; అందంబు అంది = సొంపుగాంచి; సైన్యస్వాముల్ =సేనానాయకులు; భజియింపన్=సేవించుచుండఁగా; అంతన్=ఆసమయమందు; ఘనబంభాఘోషముల్ = గొప్పలగు భేరులయొక్క నాదములు; హెచ్చఁగన్=అతిశయింపఁగా; దైత్యకటకేంద్రద్వారభూభృద్దరీభాస్వన్మార్గము – దైత్య=తమిస్రాసురునియొక్క,

కటకేంద్ర=నగరశ్రేష్ఠముయొక్క, ద్వార=ద్వారమునందలి, భూభృత్=పర్వతముయొక్క, దరీ=గుహయనెడు, భాస్వత్=ప్రకాశించుచున్న, మార్గమున్=దారిని; సొచ్చెన్=ప్రవేశించెను.

మ. పతి గాంచెన్ నవగోపురేశమకుటా◊బ్జద్వేష్యుదంశుచ్ఛటా
మతికృత్కేతనధౌతదీప్రము మహా◊క్ష్మాహంసకజ్ఞానదా
యతవప్రంబు సమగ్రసాలవలయా◊గాంతస్థితాన్యాచలా
కృతిమత్సౌధసముత్కరంబు దనుజ◊శ్రీమత్పురం బయ్యెడన్. 103

టీక: అయ్యెడన్ = ఆసమయమందు; పతి = సుచంద్రుఁడు; నవగోపురేశమకుటాబ్జద్వేష్యుదంశుచ్ఛటామతికృత్కేతనధౌతదీప్రము– నవ=నూతనమగు, ఇది యంశుచ్ఛటకు విశేషణము, గోపురేశ=పురద్వారమనెడు శివునియొక్క, ‘పురద్వారం తు గోపురమ్’ అని యమరుఁడు, మకుట=శిఖరములనెడు కిరీటములందలి, అబ్జద్వేషి=చంద్రునియొక్క, ఉత్=ఊర్ధ్వముఖములైన, అంశు=కిరణములయొక్క, ఛటా=పరంపర యనెడు, మతి=జ్ఞానమును, కృత్=చేయుచున్న, అనఁగా హరమకుటతటశీతాంశుకిరణపుంజమును బోలుచున్న దనుట, కేతన=ధ్వజములచేత,ధౌతదీప్రము=శుభ్రమైనదియు, ప్రకాశించునదియునగు; మహాక్ష్మాహంసకజ్ఞానదాయతవప్రంబు– మహత్=అధికమయిన, క్ష్మాహంసక=భూదేవిసంబంధియగు పాదకటక మనెడు, ‘హంసకః పాదకటకః’ అని యమరుఁడు,జ్ఞాన=జ్ఞానమును; ద=ఇచ్చుచున్న, ఆయత=విశాలమైన,వప్రంబు=కోటగలదియు; సమగ్రసాలవలయాగాంతస్థితాన్యాచలాకృతిమత్సౌధసముత్కరంబు – సమగ్ర=సంపూర్ణమైన, సాలవలయాగ = లోకాలోకపర్వతమువంటి ప్రాకారముయొక్క, అంతస్థిత=లోపలనున్నవియు, అన్యాచల=ఇతరపర్వతములయొక్క, ఆకృతిమత్=ఆకారమువంటి యాకారముగలవియు నగు, సౌధ=మేడలయొక్క, సముత్కరంబు = గుంపులుగలదియు నగు; దనుజ = రాక్షసునియొక్క; శ్రీమత్పురంబు=ప్రకాశించుచున్న నగరమును; కాంచెన్ =చూచెను.

చ. కనుఁగొని యానతియ్య మహి◊కాంతునను‌జ్ఞ బలంబు లెల్లఁ ద
ద్ఘనవరణంబు చుట్టి, పరి◊ఖాతతిఁ బూడ్వఁగఁ గోట ద్రవ్వ, గ్ర
క్కున బలుమేరువుల్ నిలుప ◊ఘోరతరోగతి సంభ్రమించెఁ ద
త్స్వనము సురారిపాళి కని◊వార్యరణక్రమ ముగ్గడింపఁగన్. 104

టీక: కనుఁగొని = చూచి; ఆనతియ్యన్ = అనుజ్ఞ యొసంగఁగా; మహికాంతునను‌జ్ఞన్=రాజునాజ్ఞచేత; బలంబులు ఎల్లన్ = సైన్యము లెల్లను; తద్ఘనవరణంబు చుట్టి = ఆగొప్పకోట నావరించి; పరిఖాతతిన్=అగడ్తలగుంపును; పూడ్వఁగన్ = మృత్పాషాణాదులచే నించుటకును; కోటన్ త్రవ్వన్=ప్రాకారమును త్రవ్వుటకును; గ్రక్కునన్=వేగముగా; బలుమేరువుల్=అధికములగు సారువలను; నిలుపన్=ఉంచుటకును; తత్స్వనము =ఆధ్వని; సురారిపాళికిన్=రక్కసులగుంపునకు; అనివార్యరణక్రమము =నివారింపరాని యుద్ధక్రమమును; ఉగ్గడింపఁగన్ =బయల్పఱచునట్లు; ఘోరతరోగతిన్=అధికమైన వేగముతీరున, కాదేని బలముతీరున; సంభ్రమించెన్=వేగిరపడెను. ఆరాజుసైన్య మగడ్తఁ బూడ్చుట, కోట ద్రవ్వుట లోనగు కార్యములకు వేగమున సంభ్రమించె ననుట.

వ. అంత నద్దురంత కోలాహలార్థవిజ్ఞాపక చారవార వాచా జాయమాన ప్రతిఘాసముద్దాముండగు నా తమిస్రతమిస్రాచరసార్వభౌముం డనూనకువలయ భయంకర కోపాటోపశోణిమధురీణ వదనాంబురుహ బంధుబింబ వినిర్గత కిరణాంకూరమాలికాయమాన నిస్తబ్ధతామ్రశ్మశ్రుజాలుండును, నధరాధర ఫలగ్రాస సమాసక్తోపరి ద్విజోపరిగతాగ్రహ తదితరద్విజారబ్ధ కలహసముదిత నినాదమతిక్రుద్ధరదనాగ్రాఘాత సంజాతకిటకిటారవ బధిరీకృత పర్యంతవర్తికుండును, నరిరాజహంస మదాపహారి కరశరద ధగధగాయ మాన నూతనైరావతీ ప్రమాకర కనకకరవాలికాతారళీ ముకుళీకృత సభాజనలోచనాబ్జుండును, నతంద్ర సుచంద్రరాజచంద్ర ప్రతాపవీతిహోత్ర పరంపరాప్రకార సమున్నమ దంతరంగకరండాఖండరోషపార దౌల్బణీ విదార్యమాణ చీలబంధనశేముషీదాయక సాంపరాయిక లాలసాక్రమ సమేధమానాపఘన ఘనత్వ ఫలత్తనుత్రాణుండును, నలఘుబలాహితకాండాసమానవిలాస విక్షపణదీక్షాదక్ష వికటభ్రుకుటి కుండును, నఖిలప్రపంచ పంచతాకరణచణ విలయకాల మహాకాలసరూపరూపుండును, నగుచు నేఁడు గదా మదాశయపూర్తి గావించెఁ బంచజనమాంసంబని తలంచుచు, మణిమయాసనంబు డిగ్గన డిగనుఱికి, నిజావాసంబు వెడలి, వినీతసారథివరానీత శతాంగరాజం బెక్కి, క్రక్కిఱిసి రక్కసిదొరలు వెనువెంటం గొలువ, నభంగురమతంగజతురంగమ చక్రాంగపదాతిసముదయంబులతో నాహవోత్సాహంబున వెడలె నయ్యెడ.

టీక: అంతన్=అటుతరువాత; అద్దురంత కోలాహలార్థ విజ్ఞాపక చారవార వాచా జాయమాన ప్రతిఘాసముద్దాముండు – అద్దు రంతకోలాహల=ఆయపారమైన కలకలధ్వనికి, అర్థ=ప్రయోజనభూతమైన యుద్ధముయొక్క,విజ్ఞాపక=నివేదకులగు, చార =వేగులయొక్క, వార=సంఘములయొక్క,వాచా=వచనములచే, జాయమాన=జనించుచున్న, ప్రతిఘ=రోషముచేత,సము ద్దాముండు=అధికుఁడు; అగు నాతమిస్రతమిస్రాచరసార్వభౌముండు =అయినట్టి యా తమిస్రుఁడను పేరుగల రాత్రించరచక్ర వర్తి,‘ తమిస్రా తామసీరాత్రిః’ అని యమరుఁడు;
అనూనకువలయభయంకర కోపాటోప శోణిమధురీణ వదనాంబురుహబంధుబింబ వినిర్గత కిరణాంకూరమాలికాయమాన నిస్తబ్ధ తామ్ర శ్మశ్రుజాలుండును – అనూన=అధికమైన, కువలయ=భూవలయ మనెడుకల్వకు, భయంకర=భయప్రదమైన, కోపాటోప=కోపాతిశయముచేత, శోణిమధురీణ=రక్తిమభారవాహకమగు, చాల నెఱ్ఱనయిన యనుట, వదన=ముఖమనెడు, అంబురుహబంధుబింబ = సూర్యబింబమువలన, వినిర్గత= వెడలివచ్చుచున్న, కిరణాంకూరమాలికాయమాన=బాలకిరణ పరంపరవలె నాచరించుచున్న, దానిం బోలుచున్నయనుట, నిస్తబ్ధ=నిగుడుకొన్న, తామ్ర=ఎఱ్ఱనయిన, శ్మశ్రుజాలుండును = మీసములగుంపుగలవాఁడును;
అధరాధర ఫల గ్రాస సమాసక్తోపరిద్విజోపరిగతాగ్రహ తదితరద్విజారబ్ధ కలహసముదిత నినాదమతిక్రు ద్ధరదనాగ్రాఘాత సంజాత కిటకిటారవ బధిరీకృత పర్యంతవర్తికుండును – అధరాధర=క్రిందిపెదవి యనెడు, ఫల=పండుయొక్క, గ్రాస= భక్షణమందు, సమాసక్త=వాంఛగల, ఉపరిద్విజ=పైపండ్లనెడు పక్షులయొక్క, ఉపరి=మీఁదను, గత=పొందినట్టి, ఆగ్రహ =కోపముగల, తదితరద్విజ=వానికన్న నితరములగు దిగువపం డ్లనెడు పక్షులచేత, ఆరబ్ధ=ఆరంభింపఁబడిన, కలహ=

పోరుచేత, సముదిత =ఉదయించిన, నినాద=ధ్వనియనెడు, మతి = బుద్ధిని, కృత్ = చేయుచున్న, రదనాగ్రాఘాత=దంతాగ్ర ఘట్టనముచేత, సంజాత=ఉదయించిన, కిటకిటారవ=కిటకిట యను ధ్వనిచేత, బధిరీకృత=బధిరులుగాఁ జేయఁబడిన, పర్యంతవర్తికుండును = పార్శ్వమునందలి జనములుగలవాఁడును;

అరిరాజహంస మదాపహారి కరశరద ధగధగాయమాన నూతనైరావతీ ప్రమాకర కనకకరవాలికాతారళీ ముకుళీకృతసభాజన లోచనాబ్జుండును– అరిరాజ=శత్రురాజులనెడు, హంస=హంసలయొక్క, మదాపహారి= గర్వము నుడిగించెడు,కరశరద = హస్తమనెడు మేఘమునందు, ధగధగాయమాన=ధగధగ ప్రకాశించుచున్న, నూతననైరావతీ=తొలకరిమెఱపనెడు, 'ఐరావత్యః క్షణప్రభా' అని యమరుఁడు, ప్రమాకర=యథార్థజ్ఞానకరమైన, కనకకరవాలికా=బంగరుచూరకత్తియొక్క, తారళీ= చాంచల్యముచేత, ముకుళీకృత=ముకుళములుగాఁ జేయఁబడిన, సభాజన=సభలోనిజనులయొక్క, లోచనాబ్జుండును = నేత్రకమలములు గలవాఁడును;

అతంద్ర సుచంద్రరాజచంద్ర ప్రతాపవీతిహోత్ర పరంపరాప్రకార సమున్న మదంతరంగకరం డాఖండరోషపారదౌల్బణీ విదార్యమాణ చీలబంధనశేముషీదాయక సాంపరాయికలాలసాక్రమ సమేధమానాపఘనఘనత్వ ఫలత్తనుత్రాణుండును– అతంద్ర= జాగరూకమైన, సుచంద్రరాజచంద్ర=సుచంద్రనరపాలాగ్రణియొక్క,ప్రతాప=ప్రతాపమనెడు,వీతిహోత్రపరంపరా ప్రకార=అగ్నిపరంపరలరీతిచేత, సమున్నమత్=మిక్కిలి పైకెగయుచున్న,అంతరంగకరండ=చిత్తమనెడు మూసయందలి, అఖండ=అవిచ్ఛిన్నమగు,రోషపారద=క్రోధమనెడు పాదరసముయొక్క,ఔల్బణీ =ఉద్రేకముచేత,విదార్యమాణ=బ్రద్దలు చేయఁబడిన, చీలబంధన =మూసపై మట్టితో చేసిన గట్టనయనెడు, శేముషీ=మతియొక్క, దాయక=ఇచ్చునదియైన, దీనికి తనుత్రాణముతో నన్వయము, సాంపరాయిక=సమరమందలి, లాలసాక్రమ=తృష్ణాతిశయముచేత, సమేధమాన=వృద్ధిఁ బొందుచున్న, అపఘన=అంగముయొక్క,'అఙ్గంశరీరోపఘనోవయవః' అని యమరుఁడు, ఘనత్వ=గొప్పతనముచేత, ఫలత్=పగులుచున్న, 'ఫల విశరణే' అని యనిశాసనము, తనుత్రాణుండును =కవచముగలవాఁడును;

అలఘుబలాహితకాండాస మానవిలాస విక్షపణదీక్షాదక్ష వికటభ్రుకుటికుండును– అలఘు=అధికమగు, బలాహితకాండాస =ఇంద్రధనస్సుయొక్క, మానవిలాస=గర్వవిలసనముయొక్క, విక్షపణదీక్షా=నాశనదీక్షయందు,దక్ష=సమర్థమగు, వికట= వికృతమగు, భ్రుకుటికుండును=భ్రూభంగముగలవాఁడును;

అఖిలప్రపంచ పంచతాకరణచణ విలయకాల మహాకాలసరూపరూపుండును– అఖిల=సమస్తమగు, ప్రపంచ=లోకముల యొక్క, పంచతాకరణ=నాశకరణమందు, చణ=సమర్థమైన, విలయకాలమహాకాల=ప్రళయకాలరుద్రునితో, సరూప= సమానమగు, రూపుండును =రూపముగలవాఁడును; అగుచున్;

నేఁడుగదా=ఇపుడుగదా! పంచజనమాంసంబు=మనుష్యమాంసము, 'స్యుః పుమాంసః పంచజనాః' అని యమరుఁడు; మదాశయపూర్తిన్=నాయిష్టపూర్తిని; కావించెన్=చేసెను; అని తలంచుచున్= ఇట్లు చింతిలుచు; మణిమయాసనంబు = మణిమయమైన సింహాసనమునుండి; డిగ్గనన్=తటాలున; డిగన్ ఉఱికి = వేగముగా దిగి యనుట; నిజావాసంబు=తనయొక్క గృహమునుండి; వెడలి = బయలుదేఱి; వినీతసారథివరానీతశతాంగరాజంబు = వినయవంతుఁడైన సారథిశ్రేష్ఠునిచేఁ దేఁబడిన రథశ్రేష్ఠమును; ఎక్కి=అధిష్ఠించి; రక్కసిదొరలు=రాక్షసాధిపతులు; వెనువెంటన్=మిక్కిలి వెంబడిగా; క్రక్కిఱిసి=ఎడములేనట్లు; కొలువన్=సేవించుచుండఁగా; అభంగుర మతంగజ తురంగమ చక్రాంగ పదాతి సముదయంబులతో– అభంగుర= అప్రతిహతములగు,మతంగజ=ఏనుఁగులయొక్కయు, తురంగమ=గుఱ్ఱములయొక్కయు,చక్రాంగ=రథములయొక్కయు, పదాతి=కాల్బలముయొక్కయు, సముదయంబులతోన్=సమూహములతోడ; ఆహవోత్సాహంబునన్=యుద్ధమునందలి వేడుకవలన; వెడలెన్=బయలుదేఱెను; అయ్యెడన్=ఆసమయమునందు.

అనఁగా నాతమిస్రాసురుఁడు సూర్యబింబమునుండి వెడలిన కిరణములుంబోలె తన ముఖమునుండి వెడలి నిగుడుకొన్న మీసములుగలవాఁడును, దంతాఘట్టనజనితారవ బధరీకృతపరివారజనుండును, నిజకరాగ్రజలదనానట్యమానవిద్యుల్లతాయమానకరవాలికాధాళధళ్య ముకుళీకృత సభ్యజనలోచనాబ్జుండును, సుచంద్రప్రతాపాగ్ని సంతాపిత రోషపారదోద్రేక విదార్యమాణ మనఃకరండ బీలబంధనాయిత యుద్ధలాలసా సమేధమానగాత్ర ఘనతాభిద్యమాన తనుత్రాణుండును, ఇంద్రధనుర్మదాపహ భ్రుకుటీవిరాజమానుండును, సకలలోకలయకారి కల్పాంతకాలరుద్ర సదృక్షవిగ్రహుండును అగుచు మణిమయాసనము నుండి డిగ్గి రథారూఢుఁడై, యనేకరాక్షసనాయకపరివృతుఁడై, గజరథతురగాదిరణసామగ్రితో బయలుదేఱె ననుట.

మ. కరిఘీంకారము లాశరేశబలహుంకారంబు లర్వవ్రజ
స్థిరహేంకారము లక్షిచక్రవిలసత్క్రేంకారముల్ గూడి స
త్వరతం ద్విద్వయసాగరోర్మి చటులధ్వానంబు నాఁ జేర భూ
వరసేనాజన మాయితం బగుచు దైవాఱెన్ రణోత్సాహతన్. 106

టీక: కరిఘీంకారములు=గజముల ఘీమను ధ్వనులు; ఆశరేశబలహుంకారంబులు=రాక్షసేశ్వరుని సేనల హుంకారములు; అర్వవ్రజస్థిరహేంకారములు = అశ్వబృందముయొక్క స్థిరమైన హేషారవములును; అక్షిచక్రవిలసత్క్రేంకారముల్ = రథసమూహముయొక్క ప్రకాశమానమగు క్రేంకారములు; కూడి=మెలఁగి; సత్వరతన్=వేగముచేత; ద్విద్వయసాగరోర్మి చటుల ధ్వానంబు నాన్—ద్విద్వయసాగర=నాల్గుసముద్రములయొక్క,'నవద్వయద్వీప పృథగ్జయశ్రియామ్' అనునట్లు ద్విద్వయ ప్రయోగము, ఊర్మి=తరంగములయొక్క,చటుల=చంచలమైన, ధ్వానంబు నాన్=ధ్వనియో యనునట్లు; చేరన్=చెందఁగా; భూవరసేనాజనము=సుచంద్రునిసేనలోని జనము; ఆయితం బగుచున్=సిద్ధమగుచు; రణోత్సాహతన్ =యుద్ధోత్సాహము గలుగుటచేత; దైవాఱెన్=ఒప్పెను.

మ. అరుణాభ్రోదితరక్తవృష్టి యనుకూలాన్యానిలశ్రేణి భా
స్వరకేత్వగ్రవిలగ్నగృధ్రము శివాజాతామితారావముల్
పరిదశ్యోల్క నిజాజయంబు వివరింపన్ వానిఁ జింతింప కా
సురవంశేశిత సంగరోర్వి నెనసెన్ శూరత్వ మొప్పారఁగన్. 107

టీక: అరుణాభ్రోదితరక్తవృష్టి— అరుణాభ్ర= ఎఱ్ఱనిమేఘమువలన, ఉదిత =ఉదయించిన, రక్తవృష్టి= రక్తవర్షంబును; అనుకూలాన్యానిలశ్రేణి— అనుకూలాన్య =ప్రతికూలమైన,అనిలశ్రేణి=వాతసమూహమును; భాస్వరకేత్వగ్రవిలగ్నగృధ్రము– భాస్వర=ప్రకాశమానమగు, కేత్వగ్ర= ధ్వజాగ్రమందు, విలగ్న=సంబంధించిన,గృధ్రము=గద్దయును; శివాజాతామితారావముల్—శివాజాత=జంబుకములగుంపుయొక్క, అమితారావముల్= అపరిమితధ్వనులును; పరిదశ్యోల్క=కనఁబడుచున్న కొఱవియు,'ఉల్కాస్యాన్నిర్గతజ్వాలా' అని యమరుఁడు;నిజాజయంబు=తనపరాజయమును; వివరింపన్=స్ఫుటీకరింపఁగా; వానిన్=ఆరక్తవృష్ట్యాదులను; చింతింపక = విచారింపక; ఆసురవంశేశిత— ఆసుర= రాక్షససంబంధియైన, వంశ=కులమునకు, ఈశిత=ప్రభువైన తమిస్రుఁడు; శూరత్వము=శౌర్యము; ఒప్పారఁగన్=ఒప్పుచుండఁగా; సంగరోర్విన్=యుద్ధభూమిని; ఎనసెన్ =పొందెను.

ఉ. దానవనాయకాజ్ఞ సమ◌ దక్షణదాచరసైన్యకోటులున్
మానవనాయకాజ్ఞ నస◌మానమహాజనసైన్యకోటులున్
బూనినరోషచండిమ న◌పూర్వకలంబసమీకకేళి వై
మానికవార మభ్రమున ◌మాటికిఁ గన్గొన సల్పె నేర్పునన్. 108

టీక: దానవనాయకాజ్ఞన్=రాక్షసేంద్రుని యాజ్ఞచేత; సమదక్షణదాచరసైన్యకోటులున్—సమద=గర్వయుక్తమైన, క్షణదాచర=రాక్షసులయొక్క, సైన్యకోటులున్=సేనాసమూహములును;మానవనాయకాజ్ఞన్ =నరపతియైన సుచంద్రునియాజ్ఞచేత; అసమానమహాజనసైన్యకోటులున్—అసమాన=సాటిలేనట్టి, మహత్=శ్రేష్ఠులైన, జన=నరులయొక్క, సైన్యకోటులున్=సేనాసమూహములును; పూనినరోషచండిమన్ = వహించిన రోషాతిశయముచేత; అపూర్వకలంబసమీకకేళిన్ – అపూర్వ=లోకోత్తరమగు, కలంబసమీక=బాణయుద్ధమనెడు,కేళిన్=క్రీడను, ‘ కలంబ మార్గణ శరాః’ అనియు, ‘ సమీకం సాంపరాయికమ్’ అనియు నమరుఁడు; అభ్రమునన్=ఆకాశమునుండి;వైమానికవారము=దేవతాబృందము; మాటికిన్=సారెకు; కన్గొనన్ = అవలోకింపఁగా; నేర్పునన్=చాతుర్యముచేత; సల్పెన్=చేసెను.

చ. అపుడు మహోగ్రవర్తన భ◌టాగ్రణిఁ బోరె భటాగ్రయాయి, హ
స్తిపకవరేణ్యుతో రణముఁ ◌జేకొనె హస్తిపకేశ్వరుండు, సా
దిపటలిఁ జయ్యనం గదిసె ◌ధీరత సాదిచయంబు, దోర్బలై
కపటిమచేఁ బరస్పరజి◌ఘాంస మనంబుల నంకురింపఁగన్. 109

టీక: అపుడు=ఆసమయమున; మహోగ్రవర్తనన్=అత్యుగ్రవృత్తిచేత; భటాగ్రణిన్=భటశ్రేష్ఠునితో; భటాగ్రయాయి = భటశ్రేష్ఠుఁడు; పోరెన్=పెనఁగెను; హస్తిపకవరేణ్యుతోన్=మావటులయందు శ్రేష్ఠుఁడగువానితోడ; హస్తిపకేశ్వరుండు = మావటులయందు శ్రేష్ఠుండు; రణమున్=యుద్ధమును; చేకొనెన్ = చేసెను; సాదిపటలిన్=అశ్వారోహకులయొక్క సమూహమును; సాదిచయంబు = అశ్వారోహకుల సమూహము; చయ్యనన్=వేగముగా; ధీరతన్=దైర్యముచేత; కదిసెన్= తాఁకెను; దోర్బలైకపటిమచేన్=బాహుబలాధిక్యతచేత; పరస్పరజిఘాంస=అన్యోన్యహననేచ్ఛ; మనంబులన్=చిత్తములందు; అంకురింపఁగన్ =ఉదయింపఁగ. ఇది పై పోరెనిత్యాది క్రియల యన్నిటితో నన్వయించును.

మ. ద్రుఘణంబుల్ పరఁగించి, కుంతములచేఁ ◌దూలించి, కోదండము
క్తఘనాస్త్రాళులఁ గ్రమ్మి శూలతతి వే◌గన్ గ్రుమ్మి, దుర్వారపా
రిఘధారాగతిఁ జీరి, సంగరధరి◌త్రిన్ మించెఁ దద్వీరసే
న, ఘనాధ్వంబు పగుల్పఁ దత్తుముల స◌న్నాదంబు చిత్రంబుగన్. 110

టీక: ద్రుఘణంబుల్ = ముద్గరములను; పరఁగించి=ప్రయోగించి; కుంతములచేన్=బల్లెములచేత; తూలించి=తూలఁజేసి; కోదండముక్తఘనాస్త్రాళులన్ – కోదండ=ధనుస్సులనుండి, ముక్త=విడువఁబడిన, ఘన=గొప్పవగు,అస్త్రాళులన్=బాణముల సమూహములచేత; క్రమ్మి=కప్పి; శూలతతిన్=బాఁకులగుంపుచేత; వేగన్=త్వరగా; క్రుమ్మి=గ్రుచ్చి; దుర్వారపారిఘధారాగతిన్ – దుర్వార=వారింపశక్యముగాని, పారిఘ=పరిఘసమూహముయొక్క,ధారాగతిన్=అంచులతీరుచేత; చీరి=బ్రద్దలు

చేసి; తద్వీరసేన=ఆమానవదానవవీరులయొక్కసైన్యము; చిత్రంబుగన్ =ఆశ్చర్యముగ; తత్తుములసన్నాదంబు = ఆసంకుల సమరముయొక్క ధ్వని; ఘనాధ్వంబు= ఆకసమును; పగుల్పన్=భేదింపఁగా; సంగరధరిత్రిన్ =యుద్ధభూమియందు; మించెన్=అతిశయించెను.

మ. నరనాథేంద్రభటుల్ సురారిభటులున్ స్వస్వాభిధాశౌర్యముల్
వరుసం దెల్పుచుఁ బోరి రుగ్రరణఖేలాపాండితిన్ నిర్జరో
త్కరముల్ వ్యోమవితర్దిఁ జేరి యని ఖడ్గాఖడ్గిలీలల్ శరా
శరియుజ్జృంభణముల్ గదాగదివిలాసంబుల్ మదిన్ మెచ్చగన్. 111

టీక: నిర్జరోత్కరముల్=దేవతాసంఘములు; వ్యోమవితర్దిన్=గగనమను వేదికను; చేరి=పొంది; అనిన్=యుద్ధమందలి; ఖడ్గాఖడ్గిలీలల్ =ఖడ్గములచేఁ జేయు యుద్ధక్రియలను; శరాశరియుజ్జృంభణముల్=బాణములచేఁ జేయు యుద్ధవిజృంభణలను; గదాగదివిలాసంబుల్=గదలతోఁ జేయు యుద్ధవిలసనములను; మదిన్=చిత్తమందు; మెచ్చగన్=కొనియాడఁగా; నరనాథేంద్రభటుల్= రాజభటులును; సురారిభటులున్=రాక్షసభటులును; స్వస్వాభిధాశౌర్యముల్=తమతమపేళ్లను, పరాక్రమములను; వరుసన్=క్రమముగా; తెల్పుచున్=తెలియఁజేయుచు; ఉగ్రరణఖేలాపాండితిన్ – ఉగ్ర=భయంకరమగు, రణ=యుద్ధమనెడు, ఖేలా=క్రీడయొక్క, పాండితిన్=పాండిత్యముచేత; పోరిరి=యుద్ధముఁ జేసిరి.

శా. ఆలో నాదిననాథవంశమణి చక్రాంగోత్తమాస్థానిఁ బ్ర
త్యాలీఢస్థితిఁ బొల్చి కుండలితబాణాసోజ్జ్వలత్పాణియై
చాలన్ శింజినికానినాదమున నాశావీథి మేల్కాంచ ని
ర్వేలాస్త్రప్రకరంబు నించె నసుహృద్వీరాసుహృద్వృత్తిచేన్. 112

టీక: ఆలోన్=అంతలో; ఆదిననాథవంశమణి = ఆసూర్యవంశశ్రేష్ఠుఁడగు సుచంద్రుఁడు; చక్రాంగోత్తమాస్థానిన్ =ఉత్తమరథమను నాస్థానమునందు; ప్రత్యాలీఢస్థితిన్=స్థానవిశేషస్థితిచేత, అనఁగా నెడమకాలును ముందుకుఁ జాఁపి నిల్చి యనుట, 'స్యాత్ ప్రత్యాలీఢ మాలీఢ మిత్యాదిస్థానపంచకమ్' అని యమరుఁడు; పొల్చి = ఒప్పి; కుండలితబాణాసోజ్జ్వలత్పాణియై– కుండలిత = కుండలాకారముగఁ జేయఁబడిన, బాణాస=ధనుస్సుచేత, ఉజ్జ్వలత్=ప్రకాశించుచున్న, పాణియై =హస్తముగలవాఁడై; చాలన్=మిక్కిలి; శింజినికానినాదమునన్ =అల్లెత్రాటిధ్వనిచేత; ఆశావీథి=దిక్ప్రదేశము; మేల్కాంచన్=మేల్కొనఁగా, అనఁగా దిగంతములవఱకు శింజానాదము వ్యాపింపఁగా; నిర్వేలాస్త్రప్రకరంబు = అధికములగు బాణములగుంపులు; అసుహృద్వీరాసుహృద్వృత్తిచేన్ – అసుహృద్వీర = శత్రువీరులయొక్క, అసుహృత్=ప్రాణములుహరించుచున్న, వృత్తిచేన్=వర్తనముచేత; నించెన్=పూరించెను.

మ. పరబర్హ్యుద్ధతిఁ దూల్చి తార్క్ష్యహరణప్రౌఢిన్ విజృంభించి ని
ర్భరశక్తిన్ ధర గాఁడి పాఱె నలగోత్రాభృన్మహాజిహ్మగో
త్కరముల్ తద్విహృతిప్రకారభయరేఖావన్మహాజిహ్మగో
త్కరమున్ నిందయొనర్పఁ దత్పురము వేగం జేరు చందంబునన్. 113

టీక: అలగోత్రాభృన్మహాజిహ్మగోత్కరముల్ – అలగోత్రాభృత్=ఆసుచంద్రునియొక్క, మహత్=గొప్పలైన, అజిహ్మగ=బాణములయొక్క, 'అజిహ్మగ ఖగాశుగాః' అని యమరుఁడు, ఉత్కరముల్=సమూహములు, సర్పసమూహములని యర్థాంతరము ధ్వనించుచున్నది. తత్పక్షమందు 'జిహ్మగ' అని పదచ్ఛేదము; పరబర్హ్యుద్ధతిన్ – పర=శత్రువులైన, బర్హి=గర్విష్ఠుల యొక్క, 'బర్హిర్గర్వే కేకిపింఛే' అని విశ్వము, ఉద్ధతిన్=దర్పమును, ఉత్కృష్టములైన మయూరములయొక్క యుద్ధతి నని యర్థాంతరము; తూల్చి = ఉడిగించి; తార్క్ష్యహరణప్రౌఢిన్ – తార్క్ష్య=అశ్వములయొక్క, హరణ=సంహారము యొక్క, ప్రౌఢిన్ = ప్రావీణ్యముచేత, గరుత్మత్సంహారప్రావీణ్యముచేత నని యర్థాంతరము, 'తురంగ గరుడౌ తార్క్ష్యౌ' అని యమరుఁడు; విజృంభించి=అతిశయించి; తద్విహృతిప్రకారభయరేఖావన్మహాజిహ్మగోత్కరమున్ – తత్=ఆబర్హితార్క్ష్యములయొక్క, విహృతి ప్రకార=విహారభంగిచేత, భయరేఖావత్=భయపరంపరగల, మహత్=గొప్పలగు, జిహ్మగ=పాములయొక్క, ఉత్కరమున్=సమూహమును; నిందయొనర్పన్=నిందచేయుటకు; తత్పురము=సర్పపురమగు పాతాళమును; వేగన్=శీఘ్రముగా; చేరు చందంబునన్ = పొందురీతిగా; నిర్భరశక్తిన్=అధికసామర్థ్యముచే; ధరన్=భూమిని; కాఁడి=నాటి; పాఱెన్=పరుగెత్తెను. అనఁగా సుచంద్రుని బాణములనెడు సర్పములు శత్రువులనెడు మయూరములఁ దూల్చి, వారి యశ్వము లనెడు గరుత్మంతుల సంహరించి, వేగాతిశయమున భూమిని దూఱిపోవుచుండఁగా నది మయూరగరుడులకు వెఱచి పాతాళము సొచ్చిన సర్పములను నిందింపఁ బాతాళముఁ జేరఁబోవుచున్నట్లుండె ననుట.

చ. అమితనృపాలసాయకచ౦యంబు నిశాటచమూతనుత్రఝూ
టము వడిఁ దాఁకి పై కెగయు౦టల్ వినుతింపఁగ నయ్యె నౌర యు
త్తమనవకాముకచ్ఛట ము౦దంబున వచ్చె నటంచు నిర్జర
ప్రమదల కెల్లఁ జక్కఁ దెలు౦పం జనుపెంపు వహించి యయ్యెడన్. 114

టీక: అమితనృపాలసాయకచయంబు – అమిత=మితిలేనట్టి, నృపాల=సుచంద్రునియొక్క, సాయక=బాణములయొక్క, చయంబు=సముదాయము; నిశాటచమూతనుత్రఝూటము – నిశాటచమూ=రాక్షససేనయొక్క, తనుత్రఝూటము = కవచ సమూహమును; వడిన్=వేగముగా; తాఁకి=తగిలి; పై కెగయుటల్ = మీఁదికెగురుటలు; అయ్యెడన్=ఆసమయమందు; నిర్జర ప్రమదల కెల్లన్ = రంభాదిదేవాంగనలకెల్లను; ఉత్తమనవకాముకచ్ఛట=శ్రేష్ఠమగు క్రొత్తకాముకులగుంపు; ముదంబునన్=సంతోషముతో; వచ్చెన్ అటంచున్ = వచ్చెననుచు; చక్కన్=బాగుగా; తెలుపన్=తెలియఁజేయుటకు; చనుపెంపు = పోవు నతిశయమును; వహించి =పొంది; వినుతింపఁగ నయ్యెన్=శ్లాఘింపనాయెను; ఔర = ఆశ్చర్యము!

అనఁగా రాక్షససైనికకవచములను దాఁకి పైకెగయు సుచంద్రుని బాణపరంపర క్రొత్తకాముకవర్గంబు వచ్చుచున్నదని దేవాంగనలకుఁ దెల్పుటకుసురలోకమున కేగుచున్న చందమున నుండెననిభావము. ఆరాజుబాణములచే రక్కసులెల్ల నీలిగి దేవలోకమును బొందుచుండిరని ఫలితము.

చ. ఘనగజదర్పభేదన మ౦ఖండసురారిపురప్రభంజనం
బు నలఘుధర్మఖండనముఁ ౦బూనిచి వేలుపు లెంచ నుగ్రవ
ర్తనఁ దనరారు నమ్మనుజ౦రాజకలంబము చిత్రవైఖరిన్
దనిపె నజాత్మజాంతర ము౦దారతరప్రమదోర్మి నయ్యనిన్. 115

టీక: ఉగ్రవర్తనన్=తీక్ష్ణవ్యాపారముచేత, శివునివర్తనచేత నని యర్థాంతరము, 'ఉగ్రః కపర్దీ శ్రీకంఠ శ్శితికంఠః కపాలభృత్' అని యమరుఁడు; తనరారు అమ్మనుజరాజకలంబము – తనరారు = ఒప్పుచున్న, అమ్మనుజరాజ=జనపతియగు నాసుచంద్రుని యొక్క, కలంబము =బాణము, 'కలమ్బ మార్గణ శరః' అని యమరుఁడు; ఘనగజదర్పభేదనము = గొప్పగజములమదము యొక్కశమనమును, గజాసురుని దర్పభేదనమునని యర్థాంతరము; అఖండసురారిపురప్రభంజనంబును – అఖండ = అవిచ్ఛిన్నమైన, సురారిపుర=రాక్షసగాత్రములయొక్క, త్రిపురాసురులయొక్కయు నని యర్థాంతరము, ప్రభంజనంబును = నాశనమును; అలఘుధర్మఖండనము = అధికమైన విండ్లను తునుముటను, యముని భంగముసేయుట నని యర్థాంతరము,'ధర్మః పుణ్యే యమే న్యాయే చాపే చాపనిషద్యపి' అని విశ్వము; పూనిచి =కల్పించి; వేలుపులు=దేవతలు; ఎంచన్ = ప్రశంసించునట్లుగా; అయ్యనిన్=ఆయుద్ధమందు;అజాత్మజాంతరము=నారదునియొక్కమనస్సును, దక్షప్రజాపతిపుత్రియైనపార్వతిమనస్సు నని యర్థాంతరము; ఉదారతరప్రమదోర్మిన్=అత్యధికమైన సంతోషపరంపరచేత; చిత్రవైఖరిన్=ఆశ్చర్యకరముగా; తనిపెన్ =తృప్తిపఱచెను. అనఁగా శివుండు గజాసురుని భేదించి, త్రిపురభంజనముఁ జేసి, యము నవమానించి, పార్వతిచిత్తమున కానందముఁ జేసినట్లు సుచంద్రునిబాణము శత్రుగజభేదనమును, సురారిశరీరభంజనమును, తదీయధనుఃఖండనంబును గావించి యుద్ధము గాంచు ప్రీతితో గగనముఁ జేరిన నారదుని చిత్తమున కానందముఁ జేసెనని భావము.

ఉ. ఆది గుణచ్యుతిన్ గనిన॥యట్టినృపాలు నజిహ్మగాళి త
న్మేదినిలోన సుజ్జ్వలన॥మిత్త్రపరంపరఁ గ్రోలి వేగ మెం
తేఁ దనరన్ బళీ యసుర॥నేతృకులంబు తదేకయుక్తిఁ ద
చ్ఛ్రీ దయివాఱె నొక్కొ యజ॥రీవృతి నాకపదంబుఁ జేరఁగన్. 116

టీక: ఆదిన్=తొలుత; గుణచ్యుతిన్=అల్లెత్రాటివలన జాఱుటను; ఆదిగుణచ్యుతిన్=మొదటిదైన గుణసంజ్ఞ గల యకారము యొక్కచ్యుతినని యర్థాంతరము, అకారము గుణమని వ్యాకరణప్రసిద్ధము; కనినయట్టినృపాలు అజిహ్మగాళి= పొందినట్టి రాజుయొక్క బాణపరంపర, అజిహ్మగాళిశబ్దములో నాద్యకారచ్యుతి కాఁగా జిహ్మగాళి యగుటచేత సర్పపంక్తి యని యర్థాంతర మగు; తన్మేదినిలోన = ఆరణభూమియందు; సుజ్జ్వలనమిత్త్రపరంపరన్– సుజ్జ్వల=లెస్స ప్రకాశించుచున్న, నమిత్త్రపరంపరన్=శత్రుపరంపరను; 'తన్మేదినిలోన్ అసుజ్జ్వలనమిత్త్రపరంపరన్' అని విభాగము చేసి, తన్మేదినిలోన్ = ప్రసిద్ధమైన భూమియందు, అసుజ్జ్వలనమిత్త్ర=ప్రాణవాయువులయొక్క,పరంపరన్=సముదాయమును; క్రోలి=పానముచేసి; వేగ =శీఘ్రముగా; ఎంతేన్=మిక్కిలి; తనరన్=ఒప్పఁగా; అసురనేతృకులంబు=రాక్షసనాయకకులము; అజరీవృతిన్=దేవాంగనాపరివృతిచేత; నాకపదంబుఁ జేరఁగన్ =స్వర్గముఁజేరుటకు; తదేకయుక్తిన్ – తత్=ఆబాణములయొక్క, ఏకయుక్తిన్=ముఖ్యసంబంధముచేత; తచ్ఛ్రీన్—తత్=ఆబాణములయొక్క, శ్రీన్=సంపదచేత; ఆసర్పములయొక్క విషముచేత నని యర్థాంతరము; దయివాఱె నొక్కొ=ఒప్పెనేమో; బళీ!

అనఁగా, అజిహ్మగములు అనఁగా బాణములు ఆదిగుణచ్యుతినిబొంది జిహ్మగములు అనఁగా సర్పములై యసురులను బొందఁగా, నాయసురులు వానిసంబంధముచే నాజిహ్మగములయొక్క శ్రీని (విషమును) బొందినవారలై, వానిసంపద యైన ఆదిగుణచ్యుతిని బొంది సురలై స్వర్గముఁ జెంది రనుట. అసురులు సుచంద్రునిబాణములచే హతులై స్వర్గముఁ జేరిరని భావము.

మ. నరవర్యాశుగకృత్తతద్దనుజసై౧న్యం బప్డు చూపట్టె దు
స్తరఝుంఝూనిలధూతదావగతి భ్ర౧శ్యత్కాంచనస్యందనో
త్కరమై, నశ్యదనేకవాజివరజా౧తంబై, పతన్మౌళియై,
పరిశీర్యద్ఘనకుంభ్యనీకమయి, భూ౧భాగంబు దా఼ గప్పుచున్. 117

టీక: అప్డు=ఆసమయమందు; నరవర్యాశుగకృత్తతద్దనుజసైన్యంబు– నరవర్య=నరశ్రేష్ఠు఼డగు సుచంద్రునియొక్క, ఆశుగ=బాణములచేత, కృత్త=ఛేదింప఼బడిన, తద్దనుజసైన్యంబు = ఆతమిస్రునిసైన్యము; దుస్తరఝుంఝూనిలధూతదావగతిన్– దుస్తర = తరింపశక్యముగాని, ఝుంఝూనిల=ఝుంఝూవాతముచేత, ధూత=కంపితమైన,దావగతిన్ =అరణ్యమువలె; భ్రశ్యత్కాంచనస్యందనోత్కరమై– భ్రశ్యత్=పడుచున్న, కాంచనస్యందన=బంగరుతేరులయొక్క, ఉత్కరమై=గుంపులు గలదై; భ్రశ్యత్=పడుచున్న, కాంచన=సంపె఼గలయొక్క, స్యందన=తినాసపుచెట్లయొక్క, ఉత్కరమై=గుంపులు గలదై యని దావపరమైన యర్థము; నశ్యదనేకవాజివరజాతంబై =నశించుచున్న యనేక తురగశ్రేష్ఠములయొక్క గుంపులు గలదై, అనేక పక్షిశ్రేష్ఠముల గుంపులు గలదై యని యర్థాంతరము; పతన్మౌళియై=పడుచున్న కిరీటములు గలదై, కూలుచున్న యశోకములు గలదై యని యర్థాంతరము, 'మౌళిః కంకేళి చూతయోః' అని విశ్వము; పరిశీర్యద్ఘనకుంభ్యనీకమయి– పరిశీర్యత్= చీలుచున్న , ఘన=గొప్పలగు,కుంభి=ఏను఼గులయొక్క, అనీకమయి=సమూహముగలదై; చీలుచున్న, కుంభి=కలిగొట్టు చెట్లయొక్క, అనీకమయి=సమూహముగలదై యని దావపరమైన యర్థము; భూభాగంబు = భూప్రదేశమును; తాన్; కప్పుచున్ = ఆవరించుచు; చూపట్టెన్=అగపడెను.

అన఼గా నసురసైన్యము ఝుంఝూనిలధూతమైన యరణ్యము చందంబున భ్రశ్యత్కాంచనస్యందనాదికమై చూపట్టె ననుట.

మ. బలుపాదంబులు కూర్మముల్, మెఱు఼గు దో఼౧ప న్మించు నేజల్ జలా
హులునుం, దెల్లనిచాయపట్టుగొడుగుల్ ౧ప్రోద్ధూతడిండీరకం
బులు, చిక్కుల్వడు కేశపాశనికరం౧బుల్ నా఼చులుం గా఼గ ద
త్పలభుగ్గాత్రజరక్తనిర్ఝరిణి గ౧న్పట్టెన్ శరోత్కర్షతన్. 118

టీక: బలుపాదంబులు = అధికమగు నంఘ్రులు;కూర్మముల్ =తా఼బేళ్లును; మెఱు఼గు దో఼పన్= ప్రకాశము తో఼చునట్లుగా; మించు నేజల్ = అతిశయించు నాయుధవిశేషములు; జలాహులునున్=నీటిపాములును; తెల్లనిచాయపట్టుగొడుగుల్ = తెల్లనిరంగుపట్టుగొడుగులు;ప్రోద్ధూతడిండీరకంబులు = మిక్కిలి కంపితములగు నురు఼గులును; చిక్కుల్వడు కేశపాశనికరంబుల్=చిక్కువడిన వెండ్రుకలగుంపులు; నా఼చులున్=శైవాలములును; కా఼గన్=అగుచుండ఼గా; తత్పలభుగ్గాత్రజరక్తనిర్ఝరిణి = ఆరాక్షసులశరీరమునుండి పుట్టినరక్తనది; శరోత్కర్షతన్=బాణముల యుత్కర్షముచేత; కన్పట్టెన్=చూపట్టెను.

అన఼గా బాణపరంపరలచే఼ ద్రుంప఼బడిన రాక్షసశరీరములనుండి వెడలిన నెత్తురుటేర్లలో఼ బడినరాక్షసపాదములు కూర్మములుగాను, నేజలు నీటిపాములుగాను, శ్వేతచ్ఛత్రములు ఫేనములుగాను, కేశపాశములు శైవాలములుగాను దో఼చె ననుట.

సీ. భూరిదైత్యకపాల౧పూర్ణరక్తముపేరి,కాశ్మీరపంకంబు ౧కలయ఼ బూసి,
రథములజాళువా౧రావిఱేకులపేరి,పసి఼డిబొట్టులు ఫాల౧పదవి఼ దీర్చి,

మహిఁ ద్రెళ్లి యున్న ర॥మ్య శిరస్త్రములపేరి,కులుకుకుళ్లాయి తాఁ ॥దల దవిల్చి,
యసృగంబుసిక్తధ్వ॥జాంబరంబులపేరి, బలుచంద్రకావిదు॥ప్పటులు గప్పి,
తే. యలఘుపలభక్ష్యభోజ్యము ॥లారగించి, మహితచక్రపదాస్థాన॥మండపమునఁ
జక్కఁ గొలువిచ్చె నపు డెద ॥నిక్కు వేడ్కఁ, జటులబేతాళవంశ్యరా॥జన్యసమితి. 119

టీక: అపుడు=ఆసమయమందు; చటులబేతాళవంశ్యరాజన్యసమితి – చటుల=చంచలమగు, బేతాళవంశ్య=బేతాళవంశము నందుఁ బుట్టిన భూతములనెడు, రాజన్యసమితి =రాజసభ; భూరిదైత్యకపాలపూర్ణరక్తముపేరి కాశ్మీరపంకంబు – భూరి= అధికమగు, దైత్యకపాల=రాక్షసులపుఱ్ఱెలయందు, పూర్ణ=నిండినట్టి, రక్తముపేరి = రక్తమను పేరుగల, కాశ్మీరపంకంబు = కుంకుమపంకమును; కలయన్=అంతటను; పూసి =లేపనముఁ జేసి,

రథములజాళువారావిఱేకులపేరి పసిఁడిబొట్టులు – రథముల=అరదములయొక్క, జాళువారావిఱేకులపేరి = బంగరు రావి ఱేకు లనెడు, పసిఁడిబొట్టులు = బంగరుబొట్టులను; ఫాలపదవిన్=ఫాలప్రదేశమున; తీర్చి = దిద్ది;

మహిఁ ద్రెళ్లి యున్న రమ్యశిరస్త్రములపేరికులుకుకుళ్లాయి – మహిన్=భూమియందు, త్రెళ్లియున్న =పడియున్న, రమ్య= మనోజ్ఞమైన, శిరస్త్రములపేరి=తలతొడుపులను పేరుగల, కులుకుకుళ్లాయి = అందమైనటోపి; తాన్=తాను; తలన్=శిరము నందు; తవిల్చి=ఉంచి,

అసృగంబుసిక్తధ్వజాంబరంబులపేరి బలుచంద్రకావిదుప్పటులు – అసృక్=రక్తమనెడు, అంబు=ఉదకమందు, సిక్త= తడుపఁ బడిన, ధ్వజాంబరంబులపేరి =ధ్వజపటములనుపేరుగల, బలుచంద్రకావిదుప్పటులు =పెద్దచెంగావివస్త్రములను; కప్పి= ఆచ్ఛాదించి,

అలఘుపలభక్ష్యభోజ్యములు=అధికములగు మాంసములనెడు భక్ష్యభోజ్యములను; ఆరగించి=భక్షించి; మహితచక్రపదా స్థానమండపమునన్ – మహిత=పూజ్యమగు, చక్రపద=రథమనెడు,ఆస్థానమండపమునన్=సభామండపమందు; చక్కన్= బాగుగా; ఎదన్=హృదయమందు; నిక్కు వేడ్కన్=అతిశయించునుత్సాహముచేత; కొలువిచ్చెన్=కొలువుచేసెను.

అనఁగా నపుడు భూతములనెడు రాజులగుంపు రక్కసులతలపుఱ్ఱెలలో నిండిన నెత్తురనెడు గందము పూసికొని, తేరుల రావిఱేకులనెడు బంగరుబొట్టులు పెట్టుకొని, ధరఁ బడియున్న తలతొడుపులనెడు కుళ్లాయీలు తలఁ దవిల్చికొని, నెత్తురుతోఁ దడిసిన కేతనపటము లనెడు చెంద్రకావిదుప్పటులు గప్పికొని మాంసమనెడు భక్ష్యభోజ్యము లారగించి, తేరులనెడు కొలువు కూటములఁ గూర్చుండె ననుట.

వ. అప్పు డప్పాలసుదిండిమూఁకలదండం బఖండదోర్దండమండితశౌర్యచండిమంబున నమ్మహీమండ లేశ్వరుం జుట్టుముట్టి యుట్టిపడుకట్టల్క నట్టిట్టు దెమలక పరిఘ పట్టిస ముద్గర గదా భిందివాల తోమర శూలాది నానావిధాయుధ యూథంబులం గప్పి, మరుత్కులాభినుత్య సమిత్కుతల చమత్కారోత్క ర్షంబు సూపుచు విజృంభించినం దిలకించి, మనోంచల ప్రపంచిత ప్రతిఘారస ప్రకాండుండై యామనుజ నాయకమార్తాండుండు వలయితచాపవల్లికాతల్లజంబున నిశితభల్లంబులు గూర్చి నేర్పు వెలయం బఱపి, కరంబులు శిరంబులు పదంబులు రదంబులు నురంబులు నుదరంబులు వేఱుపఱుపరాకుండం దుని యలు చేయుచు నరిభయంకర ప్రమరతర సహోవిభవంబునం దనచటులసాయకచాతుర్యంబు సూపు

నెడ నొక్కొక్కయెడ నుదారతీవ్రాశుగధారాప్రచారంబున నుద్వేలకీలాలపూరంబులు బోరునం గురియ ముక్తాహారంబులు సారెకుం బుడమిఁ ద్రెళ్ల విగతకరకంబులై నిజఘనాఘననామంబు నిజం బగుటకుంబోలె ననంతాస్థానంబున భ్రమించు దంతావళసంతానంబులును, నొక్కొక్కయిక్క మిక్కుటం బగు చాంచల్యం బున ధరాపరాగపూగసంవళితంబై రూపజీ నానాజిహ్మగసంహతిక్రమంబునకుఁ దల్లడిల్లుచు నాత్మ హర్యభిధానంబు సార్థకంబు గావించుటకుంబోలె మూలలకుఁ జేరు హయనిచయంబులును, నొక్కొక్క వంక విశంకటశింజినీటంకార జలదగర్జా సమూర్జనంబున నాంతరంబు ర్రీల విముక్తకాండజాతంబులై వాహినీమధ్యంబున గతివిశేష మొక్కింత యెఱుంగక చక్రాంగభావంబు సత్యంబగుటకుంబోలె సడలు స్యందనసందోహంబులును, నొక్కొక్కచెంత సుచంద్రసాంద్రధామస్తోమంబు గనుంగొనం బాయక నెమ్మ నంబుల సాధ్వసం బుప్పొంగి పొంగ మహాబలాతివియోగంబున స్రుక్కుచు మిక్కిలి రయంబునం బొదలు దూఱం దలఁచుచుఁ జిందువంబై పఱచుచు స్వచక్రనామంబు సిద్ధంబుఁజేయనుంబోలెఁ జలియించు సేనా జనంబులును, నొక్కొక్కమూల యాతుధానతనుత్రాణ వితానాయసచూర్ణపరంపర శోణితఝురపూరం బున శాదభూతంబై యేపుసూపఁ బుండరీకసమాఖ్యాకలితంబు లగుటంబోలె బహుశిలీముఖసమాక్రాంతం బులై విదళితత్వంబు వహించు తెలుపట్టుగొడుగులును, నొక్కొక్కపొంత నవక్రచక్రఘాతంబుల విశకలి తోత్తమాంగంబులై భాస్వచ్చంద్రరథాచ్ఛాదనం బంబరంబునం గావించుచుఁ గేతువిఖ్యాతిం బొగడొం దుటం బోలె నిశాటకాంతానుషంగంబు డింపని బిరుదపతాకానికరంబులును, నొక్కొక్కచాయఁ బరు లతోఁ గలహంబులు మాని యసమాంబకలగ్నహృదయలై ద్విజపక్షపాతంబు చేకొని తాము సాదు లగుటం బోలె నైశ్చల్యంబునం దోఁచువాహారోహకులును, నొక్కొక్కదిక్కున హరిదంశుక స్తవనీయ నరవర ప్రక్ష్వేడనతాడనంబుల విగతప్రాణంబులై రాజరా జుల్లసద్విస్మయంబున వీక్షింప సూతజాతతా గతిం బరఁగుటంబోలె ధరణిం బడిన యంతృకులంబులును, నొక్కొక్కక్రేవలఁ బుణ్యజనానంగీకృతంబు లై యెంతయు సౌగుణ్యంబు సంపాదింపక నిశ్శరయోగంబు బెరసి ధన్వాహ్వయంబులగుటంబోలెఁ బెంపు గననికోదండంబులును, నొక్కొక్కసీమల ఘనకాండాసారమహిమంబున వీతపత్రంబులై యలఘు ఫల నికాయసాంగత్యంబు గానక సొంపుచెడి బాణాత్మంబునఁ బరఁగుటంబోలె ధరాపదవి వ్రాలిన నారాచ జాలంబులును, బొలుపొంద నత్యద్భుతంబై దేవదానవాయోధనధరాస్థలంబు నందంబున జిష్ణుకరాసి ఖండిత కర్బురచక్రాంగసంగతంబై, రామరావణయుద్ధదేశంబుడంబున చటులహరిపటలరటనాఘటి తంబై, హరపురాసురసమరాస్థానంబుపోలిక ననంతకలంబవిజృంభణగుంభితంబై, కుమారతారకా స్కందనతలంబు చందంబున నభేద్యశక్తిసంయుతంబై, కౌరవపాండవసంగ్రామాంగణంబుచెలువునఁ

జక్రికేతనవిదారణచణ భీమగదాక్రియాసముపేతంబై, యమ్మహాసంగరరంగంబు వినుతికెక్కె నయ్యవసరంబున.

టీక: అప్పుడు=ఆసమయమందు; అప్పొలసుదిండిమూఁకలదండంబు=ఆక్రవ్యాదసేనలయొక్కగుంపు; అఖండదోర్దండమండితశౌర్యచండిమంబునన్ – అఖండ=అవిచ్ఛిన్నమగు, దోర్దండ=బాహుదండములచేత, మండిత=అలంకృతమైన, శౌర్యచండిమంబునన్ = శౌర్యాతిశయముచేత; అమ్మహీమండలేశ్వరున్=ఆభూమండలేశ్వరుఁడగు సువంద్రుని; చుట్టుముట్టి = చుట్టుకొని; ఉట్టిపడుకట్టల్కన్=మిక్కిలి యధికమైన క్రోధముచేతననుట; అట్టిట్టు దెమలక=అటునిటు పోక; పరిఘ పట్టిస ముద్గర గదా భిందివాల తోమర శూలాది నానావిధాయుధయూథంబులన్ = ఇనుపకట్లగుదియ మొదలు బల్లెమువఱకుఁ గల నానావిధాయుధసమూహములచేత; కప్పి=ఆవరించి; మరుత్కులాభినుత్యసమిత్కుతలచమత్కారోత్కర్షంబు– మరుత్కుల = దేవతాబృందముచేత, అభినుత్య=ప్రశంసనీయమగు, సమిత్కుతల=యుద్ధభూమియొక్క, చమత్కారోత్కర్షంబు = చాతుర్యాతిశయమును; చూపుచున్=కనఁబఱచుచు; విజృంభించినన్=చెలరేఁగఁగా; తిలకించి=చూచి; మనోంచలప్రపంచితప్రతిఘారసప్రకాండుండై– మనోంచల=చిత్తప్రదేశమందు,ప్రపంచిత=విస్తరిల్లఁజేయఁబడిన, ప్రతిఘారసప్రకాండుండై =ప్రశస్తరౌద్రరసము గలవాఁడై; ఆమనుజనాయకమార్తాండుండు=ఆనరనాథసూర్యుఁడు; వలయితచాపవల్లికాతల్లజంబునన్=కుండలీకృతమగు ప్రశస్తధనుర్లతయందు;నిశితభల్లంబులు=తీక్ష్ణములైన బాణములను;కూర్చి=తొడిగి; నేర్పువెలయన్=చాతుర్యము విలసిల్లగా; పఱపి=వ్యాపింపఁజేసి; కరంబులు = చేతులు; శిరంబులు =తలలు; పదంబులు=పాదములు; రదంబులు=దంతములు; ఉరంబులు =ఎదలు; ఉదరంబులు =జఠరములు; వేఱుపఱుపరాకుండన్ =వేఱుగాఁ దెలియరాకుండునట్లు; తునియలు చేయుచున్ =ఖండములు చేయుచు;అరిభయంకరప్రచురతరసహోవిభవంబునన్– అరి=శత్రువులకు,భయంకర=భయప్రదమగు, ప్రచురతర = అధికతరమగు, సహః=బలముయొక్క, 'తర స్సహోబల శౌర్యాణి' అని యమరుఁడు, విభవంబునన్ = సమృద్ధిచేత; తనచటులసాయకచాతుర్యంబు = తనయొక్క వేగవంతమగు బాణములనేర్పును; చూపునెడన్=చూపుసమయమందు; ఒక్కొక్కయెడన్= ఒక్కొక్కచోట; ఉదారతీవ్రాశుగధారాప్రచారంబునన్– ఉదార=గొప్పలగు, తీవ్రాశుగ=దృఢసాయకములయొక్క, చండమారుతములయొక్కయని యర్థాంతరము, ధారా=అంచులయొక్క, జలధారలయొక్క, ప్రచారంబునన్ = సమృద్ధిచేత; ఉద్వేలకీలాలపూరంబులు = అధికములగు రక్తప్రవాహములు, ఉదకప్రవాహములని యర్థాంతరము; బోరునన్ కురియన్ = మిక్కిలి కురియఁగా; ముక్తాహారంబులు = ముత్యపుసరములు; సారెకున్ = మాటిమాటికి; పుడమిన్ = భూమియందు; త్రెళ్లన్=వ్రాలఁగా; విగతకరకంబులై = పోయినతొండములుగలవై, రాలినవడగండ్లుగలవై యని యర్థాంతరము; నిజఘనాఘననామంబు = తమమదగజనామము, వార్షుకాబ్దనామము; నిజం బగుటకుంబోలెన్ =యథార్థమగుటకువలె; అనంతాస్థానంబునన్– అనంతా=భూమియొక్క, స్థానంబునన్=ప్రదేశమందు; అనంత ఆస్థానంబునన్=ఆకాశప్రదేశమందని యర్థాంతరము; భ్రమించు దంతావళసంతానంబులును=సంచరించుచున్న యేనుఁగులగుంపులును, అనఁగా వర్షించుమేఘములు చండమారుతముచే బోరున జలపూరము వర్షించి వర్షోపలవిహీనములయి గగనమందు సంచరించునట్లు ఘనాఘననామసామ్యమున మదపుటేనుఁగులును సుచంద్రునితీవ్రబాణములచే రక్తము వర్షించి ముత్యములు పుడమిం ద్రెళ్లఁగాఁ దొండములు లేనివై యుద్ధభూమిని జరించుచుండె ననుట. ఏనుఁగులగుంపు లొకమూల ఖండితతుండములయి యుండెనని ఫలితార్థము.

ఒక్కొక్కయిక్కన్ = ఒక్కొక్కప్రదేశమందు; మిక్కుటంబగు చాంచల్యంబునన్=అధికమగు చపలతచేత; ధరాపరాగపూగసంవళితంబై = భూపరాగపుంజముచేత వ్యాప్తమయి; రూపఱి =రూపుచెడి; నానాజిహ్మగసంహతి క్రమంబునకున్ – నానా =

అనేకవిధములగు, అజిహ్మగసంహతి=బాణసమూహముయొక్క, అనేకవిధములగు సర్పసంఘముయొక్కయని యర్థాంతరము, క్రమంబునకున్=సంచరణంబునకు;తల్లడిల్లుచున్=పరితపించుచు; ఆత్మహర్యభిధానంబు=తమ యశ్వనామమును, వాయువనెడు పేరును; సార్థకంబు గావించుటకుంబోలెన్ = యథార్థము సేయుటకువలె; మూలలకున్=మఱుఁగులకు, విదిగ్భాగములకు; చేరు హయనిచయంబులును = చేరుచున్న గుఱ్ఱములగుంపులును; అనఁగా నశ్వసమూహము అనేకవిధములైన బాణప్రహారములచేతఁ దల్లడిల్లి మూలలఁ బడియుండఁగా నది తమకు గలహర్యభిధానము అనఁగా వాయువులను నామము సార్థకముఁ జేయుటకు సర్పసంచారమువలన తల్లడిల్లి వాయవ్యమూలల కొదిఁగినట్లుండెనని భావము. బాణాఘాతమున కశ్వములు తల్లడిల్లి పరాగవ్యాప్తములై యొకమూలఁ బడియుండె నని ఫలితార్థము.

ఒక్కొక్కవంకన్ = ఒక్కొక్కప్రదేశమునందు; విశంకటశింజినీటంకారజలదగర్జాసమూర్జనంబునన్ – విశంకట=విపులమగు, శింజినీటంకార=అల్లెత్రాటిధ్వనియనెడు, జలదగర్జా=మేఘనాదముయొక్క, సమూర్జనంబునన్ = అతిశయముచేత; ఆంతరంబు వ్రీలన్ = హృదయము వ్రయ్యలు కాఁగా; విముక్తకాండజాతంబులై =విడువఁబడిన గుఱ్ఱములసమూహములు గలవై, విడువఁబడిన జలసమూహముగలవై, అనఁగా నీటిని వదలినవై యని యర్థాంతరము; వాహినీమధ్యంబునన్=సేనామధ్యమున, నదీమధ్యమందని యర్థాంతరము; గతివిశేషము =గమనవిశేషము; ఒక్కింత యెఱుంగక =కొంచెమయినఁ గానక; చక్రాంగభావంబు = రథభావము, హంసభావమని యర్థాంతరము; సత్యం బగుటకుంబోలెన్ = యథార్థమగుటకువలె; సడలు స్యందనసందోహంబులును = శిథిలమగు రథసమూహములును; అనఁగా హంసలు మేఘధ్వనిని విని భయపడి జలసమీపమును వీడి నదీమధ్యసంచారము కొంచెమయిన లేకయుండుట స్వభావము గాన చక్రాంగనామసామ్యంబున స్యందనంబులును వానివలె శింజినీనాదంబునకు వెఱచి విముక్తాశ్వములై సేనామధ్యసంచారము మాని పడి యున్నట్లు తోఁచుచున్న వనుట.

ఒక్కొక్కచెంతన్ = ఒక్కొక్కప్రదేశమునందు; సుచంద్రసాంద్రధామస్తోమంబు = సుచంద్రునియొక్క సాంద్రమైన ప్రతాపసమూహమును; కనుంగొనన్ =చూడఁగా; పాయక=ఎడయక; నెమ్మనంబులన్=నిండుమనస్సులయందు; సాధ్వసంబు= వెఱపు; ఉప్పొంగి పొంగన్ = ఉబికి వెలిపర్వఁగా; మహాబలాతివియోగంబునన్ – మహత్=అధికమైన, బల=బలముగలవారియొక్క, అతివియోగంబునన్ = మిక్కిలి యెడఁబాటుచేత; మహత్=అధికమైన, అబల=స్త్రీయొక్క, అతివియోగంబున నని యర్థాంతరము; స్రుక్కుచున్=కుందుచు; మిక్కిలి = అధికమైన; రయంబునన్=వేగముచేత; పొదలు =నికుంజములను; తూఱన్ = చొచ్చుటకు; తలఁచుచున్=సంకల్పించుచు; చిందువంబై =చెదరినవై; పఱచుచున్=పరుగెత్తుచు; స్వచక్రనామంబు = తన సైన్యనామమును, తన చక్రవాకనామము నని యర్థాంతరము, ‘చక్రం చయే జలావర్తే రథాఙ్గే రాష్ట్రసైన్యయోః’ అని రత్నమాల; సిద్ధంబుఁజేయనుంబోలెన్ = నిష్పన్నముసేయుటకువలె; చలియించు సేనాజనంబులును = కదలుచున్న సేనాజనములును; అనఁగా చక్రవాకములు చంద్రధామస్తోమము చూచి భయపడి ప్రియావియోగమును గాంచి స్రుక్కుచు అతివేగముగ పొదలు దూఱుచు చెదరినవగుచు నొప్పుట స్వభావము గాన, చక్రనామసామ్యమున సేనాజనసముదాయంబును సుచంద్రరాజ ప్రతాపము గని భయపడి సేనానాయకవియోగమును గాంచి స్రుక్కుచు మిక్కిలివేగమున పొదలు దూఱఁ బాఱుచు చెదరె ననుట. సుచంద్రప్రతాపమునకు వెఱచి, సేనాజనులు పటాపంచలై చీకాకుపడిరని తాత్పర్యము.

ఒక్కొక్కమూలన్ = ఒక్కొక్కప్రదేశమునందు; యాతుధానతనుత్రాణవితానాయసచూర్ణపరంపర – యాతుధాన=రాక్షసులయొక్క, తనుత్రాణవితాన = కవచసమూహముసంబంధియగు, అయసచూర్ణపరంపర = ఇనుపపొడిగుంపు; శోణితఝరపూరంబునన్ – శోణితఝర =నెత్తుటేర్లయొక్క, పూరంబునన్ =వఱదయందు; శాదభూతంబై =బురదరూపమై, ‘పంకోస్త్రీ శాద కర్దమౌ’ అని యమరుఁడు; ఏపుసూపన్=అతిశయింపఁగా; పుండరీకసమాఖ్యాకలితంబులగుటంబోలెన్ = శ్వేతచ్ఛత్రములయినందునంబలె, సితాంభోజములయినందునంబలె నని యర్థాంతరము; బహుశిలీముఖసమాక్రాంతంబులై=అనేకబాణముల

చేతఁ జుట్టఁబడినవై, తుమ్మెదలచేతఁ జుట్టఁబడినవై యని యర్థాంతరము; విదళితత్వంబు = పగులుపఁ బడుటను, వికసించు టను; వహించు తెలుపట్టుగొడుగులును = పొందినట్టి శ్వేతచ్ఛత్రములును; అనఁగా శ్వేతచ్ఛత్రములు పుండరీకనామము గలవి గనుక తెల్లదామరలు నదీప్రవాహపంకమునందు అళికులమిళితములై వికసించియుండునట్లు శోణితనదీపూరమునందు యాతు ధానతనుత్రాణచూర్ణమను బురదయందు బాణసమాక్రాంతంబులై పగిలి పడియున్న వనుట. శోణితము నదీప్రవాహముగఁ బొఱు చున్నదనియు అందు రాక్షసకవచచూర్ణము పంకముగా నున్నదనియు అందు బాణసంకీర్ణములై పగిలి పడియున్న తెల్లగొడు గులు సితాంభోజములను బోలియున్నవనియు భావము.

ఒక్కొక్కపొంతన్ = ఒక్కొక్కప్రదేశమునందు; అవక్రచక్రఘాతంబులన్= అకుటిలమగు చక్రనామకాయుధములతాఁకులచేత, సుదర్శనప్రహారములచేత నని యర్థాంతరము; విశకలితోత్తమాంగంబులై = తునియలుచేయఁబడిన కొనలు కలవై, త్రుంపఁ బడిన శిరములు కలవై యని యర్థాంతరము; భాస్వచ్చంద్రరథాచ్ఛాదనంబు– భాస్వత్ చంద్రరథ=ప్రకాశించుచున్న స్వర్ణ రథములయొక్క, సూర్యచంద్రశరీరములయొక్క, ఆచ్ఛాదనంబు=ఆవరణమును; అంబరంబునన్ = వస్త్రముచేత, ఆకాశము నందు; కావించుచున్ =చేయుచు; కేతువిఖ్యాతిన్ = పతాక యను పేరును, కేతుగ్రహమనుపేరు నని యర్థాంతరము; పొగడొం దుటంబోలెన్ = ప్రసిద్ధిని బొందుటచేవలె; నిశాటకాంతానుషంగంబు – నిశాటకాంత=రక్షోనాథులయొక్క, రాక్షస్త్రీయొక్క అని యర్థాంతరము, అనుషంగంబు =అనుసరణమును; డింపని బిరుదపతాకానికరంబులును = వదలని బిరుదయుక్తములయిన టెక్కెముల గుంపులును; అనఁగా పతాకలు కేతుశబ్దసామ్యమున, కేతుగ్రహము చక్రముచే నఱకఁబడినతల గలిగి యంబరమున సూర్యచంద్రశరీరాచ్ఛాదనమును గావించుచు రాక్షసస్త్రీ యనుసరణమును వహించునట్లు, చక్రాయుధములచేతఁ ద్రుంపఁబడిన కొనలు గలవై, వస్త్రములచే రథముల నాచ్ఛాదించుచు, నిశాచరనాథుల ననుసరించుచు నొకమూలఁ బడియుండెనని భావము.

ఒక్కొక్కచాయన్= ఒక్కొక్కప్రదేశమునందు; పరులతోన్ =శత్రువులతో, ఇతరజనులతో నని యర్థాంతరము; కలహంబులు మాని = జగడము వదలి; అసమాంబకలగ్నహృదయులై = సరిలేని యమ్ములు నాటిన ఱొమ్ములు గలవారై, విషమలోచనుఁ డైన శివునియం దాసక్తమైన హృదయము గలవారై; ద్విజపక్షపాతంబు = కంకగృధ్రాదులయొక్క ఱెక్కలపాటును, బ్రాహ్మ ణులయందలి ప్రీతిని; చేకొని = స్వీకరించి; తాము; సాదు లగుటన్ బోలెన్ = రౌతులగుటచేతవలె, సజ్జనులగుటచేబలె; నైశ్చ ల్యంబునన్ =నిశ్చలతచేత; తోఁచు వాహారోహకులును=తోఁచుచున్న అశ్వారోహకులును; అనఁగా సాధుజనులు పరులతో కలహము మాని, సాంబమూర్తియందు లగ్నహృదయులై, బ్రాహ్మణపక్షపాతము దాల్చి, ధ్యానయోగమున నైశ్చల్యమును భజించునట్లు తన్నామసామ్యంబున అశ్వారోహకులును పరులతో కలహము మాని, అసమాంబకములచే లగ్నహృదయులై, గృధ్రాదిద్విజపక్షపాతమును దాల్చి, ప్రాణవియోగ మగుటవలన నైశ్చల్యమును వహించి యొకమూలఁ బడియుండిరని భావము.

ఒక్కొక్కదిక్కునన్ = ఒక్కొక్కప్రదేశమునందు; హరిదంశుక స్తవనీయనరవరప్రక్ష్వేడనతాడనంబులన్–హరిదంశుక = దిగంబరుఁడైన శివునిచేత, స్తవనీయ=కొనియాడఁదగిన, నరవర=సుచంద్రునియొక్క, ప్రక్ష్వేడన=బాణములయొక్క, తాడ నంబులన్=దెబ్బలచేత; హరిదంశుక = పీతాంబరుఁడైన కృష్ణునిచేత,స్తవనీయ=కొనియాడఁదగిన, నర=అర్జునునియొక్క, వర=శ్రేష్ఠములైన, ప్రక్ష్వేడన=బాణములయొక్క, తాడనంబులన్=దెబ్బలచేత, నని యర్థాంతరము; విగతప్రాణంబులై = గతా సువులై; రాజరాజు=కుబేరుఁడు, దుర్యోధనుఁడని యర్థాంతరము; ఉల్లసద్విస్మయంబునన్ = ప్రకాశించు నాశ్చర్యముతోడ; వీక్షింపన్=చూచుచుండఁగా; సూతజాతతాగతిన్ = సూతజాతిప్రాప్తిచేత, సూతులవల్లఁ బుట్టుట యనఁగా కర్ణత్వముయొక్క ప్రాప్తిచేత; పరఁగుటంబోలెన్ = ఒప్పుచుండుటచేతవలె; ధరణిన్=భూమియందు; పడిన యంతృకులంబులును = పడియున్న సారథుల సముదాయములును; శ్రీకృష్ణునిచేఁ గొనియాడఁదగిన కిరీటియొక్క బాణతాడనములచే విగతప్రాణుండై దుర్యోధను

నిచే సవిస్మయంబుగ నీక్షింపఁబడు కర్ణుని చందంబున యంతృకులంబు సుచంద్రుని బాణతాడనములచే విగతప్రాణంబై కుబేరునిచే సవిస్మయంబుగ నీక్షింపఁబడుచు యుద్ధభూమి కొకమూలఁ బడియుండెనని సూతజాతత్వసామ్యమున వర్ణింపఁబడియె.

ఒక్కొక్కక్రేవలన్= ఒక్కొక్కప్రదేశములందు; పుణ్యజనానంగీకృతంబులై = రక్కసులచేతఁ బరిగ్రహింపఁబడనివియై, పెద్దలచేతఁ బరిగ్రహింపఁబడనివియై యని యర్థాంతరము; ఎంతయున్=మిక్కిలి; సౌగుణ్యంబు = మంచియల్లె గలుగుటను, మంచి గుణములు గలుగుటను; సంపాదింపక =ఆర్జింపక; నిశ్శరయోగంబు = గుణసాంగత్యములేమిచే బాణయోగాభావమును, జలసంగత్యభావమును; బెరసి = పొంది; ధన్వాహ్వయంబులగుటంబోలెన్ = విల్లనెడు పేరుగల వగుటచేతవలె, నిర్జలదేశములని పేరుగాంచుటచేతవలె, 'ధన్వజాంగలదేశే స్యా ద్ధన్వచాపే' అని విశ్వము; పెంపున్=వృద్ధిని; కననికోదండంబులును = పొందని ధనుస్సులును; అనఁగా నిర్జలదేశములు సజ్జనులచే ననంగీకృతంబులై మంచిప్రదేశము లనుట లేక జలహీనములై పెంపు గనని యట్లు ధన్వనామసామ్యముచే విండ్లును పుణ్యజనులైన రాక్షసులచే విడువఁబడి అల్లెత్రాటిసంబంధము లేనందున శరసంబంధము గానక యొకమూలఁ బడియున్నవని భావము. ధనువులు తమ్ముఁ బట్టుకొను నాయకులచేతను, అల్లెత్రాళ్ల చేతను వియుక్తములై విశకలితములుగాఁ బడియున్నవని పరమార్థము.

ఒక్కొక్కసీమలన్ = ఒక్కొక్కప్రదేశములందు; ఘనకాండాసారమహిమంబునన్ = గొప్పబాణవృష్టిమహిమచేత; ఘన = మేఘసంబంధియైన, కాండ=ఉదకముయొక్క, ఆసార=వర్షధారలయొక్క,మహిమంబునన్=అతిశయముచేత; వీతపత్రంబులై =పోయిన ఱెక్కలు గలవై, రాలినయాకులు గలవై; అలఘుఫలనికాయసాంగత్యంబు– అలఘు= అధికమైన, ఫలనికాయ =ములుకులగుంపుయొక్క, పండ్లగుంపుయొక్క, 'ఫలం హేతురసేర్ధే స్యా త్ఫలకే ముష్టి లాభయోః జాతీఫలేపి కర్కోలేసస్య బాణాగ్రయోరపి' అని విశ్వము, సాంగత్యంబు = కూడియుండుటను; కానక=పొందక; సొంపుచెడి =అందముఁ బాసి; బాణాత్మంబునన్ = శరస్వరూపముచేత, గోరంటవృక్షస్వరూపముచేత; పరఁగుటంబోలెన్ =ఒప్పుటచేతవలె; ధరాపదవిన్=భూతలమందు; వ్రాలిన =పడినట్టి; నారాచజాలంబులును = బాణసమూహములను; అనఁగా గోరంటలు వర్షాకాలమున జలధారలచే విగతపత్రములై, ఫలములను బొందక, సొంపుచెడి భూతలమందు వ్రాలుట ప్రసిద్ధంబు గావున నట్లు బాణశబ్దసామ్యమున రాక్షసనారాచంబులు సుచంద్రబాణవర్షమహిమచేత పక్షహీనములయి వీడినములుకులు గలవై, సొంపుచెడి ధరాతలమున వ్రాలియున్న వనుట.

పొలుపొందన్=ఇట్లు మూలమూలలకుఁ బడిన రథగజతురగాదు లొప్పుచుండఁగా; అత్యద్భుతంబై = మిక్కిలి యాశ్చర్యకరమై; దేవదానవాయోధనధరాస్థలంబు నందంబునన్ = దేవాసురయుద్ధభూమిచందంబున; జిష్ణుకరాసిఖండితకర్బురచక్రాంగసంగతంబై– జిష్ణు=ఇంద్రునియొక్క, జయశీలుండైన సుచంద్రునియొక్క యని యర్థాంతరము, కర =హస్తమందలి, అసి=ఖడ్గముచేత, ఖండిత=నఱకఁబడిన,కర్బురచక్రాంగ=బంగరురథములతోడను, రాక్షససంఘములయొక్కతనువులతోడను, సంగతంబై =కూడుకొన్నదై; రామరావణయుద్ధదేశంబుడంబునన్ = రామరావణులయొక్క యుద్ధప్రదేశమువలె; చటులహరిపటలరటనాఘటితంబై = చంచలములగు అశ్వసమూహముల ధ్వనితోఁగూడినదై, వానరసేనయొక్క యార్భటులతోఁ గూడినదై; హరపురాసురసమరాస్థానంబుపోలికన్ = ఈశ్వరత్రిపురాసురుల యుద్ధభూమివలె; అనంతకలంబవిజృంభణగుంభితంబై– అనంతకలంబ = విష్ణురూపమగు బాణముయొక్క, బహుబాణములయొక్క,విజృంభణగుంభితంబై = అతిశయముతోఁ గూడుకొన్నదై; కుమారతారకాస్కందనతలంబుచందంబునన్ = కుమారతారకాసురలయొక్క రణభూమివలె; అభేద్యశక్తిసంయుతంబై = భేదింప నలవిగాని శక్తియను నాయుధముతోఁ గూడినదై, అభేద్యమైన సామర్థ్యముతోఁ గూడినదై; కౌరవపాండవసంగ్రామాంగణంబుచెలువునన్ = కౌరవపాండవుల యుద్ధభూమివలె; చక్రికేతనవిదారణచణభీమగదాక్రియాసముపేతంబై– చక్రికేతన=సర్పకేతనుఁడగు దుర్యోధనునియొక్క, విదారణ=భేదనమందు, చణ=సమర్థమైన, భీమ=భీముని

యొక్క, గదాక్రియా =గదావిహారముతోడ, సముపేతంబై=కూడినదై; చక్రికేతన=రథపతాకలయొక్క, విదారణ=భేదన మందు, చణ=సమర్థమైన,భీమ= భయంకరమైన,గదాక్రియా =గదావిహారముతోడ, సముపేతంబై=కూడినదై, అనియర్థాంత రము; అమ్మహాసంగరరంగంబు = ఆమహాయుద్ధరంగము;వినుతికెక్కెన్=వాసికెక్కెను; అయ్యవసరంబునన్= ఆసమయ మున, దీని కుత్తరపద్యముతోడ సంబంధము.

చ. చకితనిశాటమై, పతిత◊సాదిజనంబయి, సుప్తయంతృజా
లకమయి, భిన్నకుంజరకు◊లంబయి, లూనరథంబునై, తద
ర్కకులనృపాలశక్తి నిల ◊వ్రాలిన యాత్మబలంబుఁ గాంచి, పా
యక మను రోషరేఖ యెడ◊నంది తమిస్రసురారి యత్తఱిన్. 121

టీక: చకితనిశాటమై = భయపడుచున్న రాక్షసులు గలదై; పతితసాదిజనంబయి = పడిన యశ్వారోహకులగుంపుగలదై; సుప్తయంతృజాలకమయి = నిద్రించిన సారథులగుంపు గలదై; భిన్నకుంజరకులంబయి = బ్రద్దలుచేయఁబడిన గజసంఘము గలదై; లూనరథంబునై = ఛిన్నములైన రథములు గలదై; తదర్కకులనృపాలశక్తిన్ = సూర్యవంశీయుఁడైన యారాజుయొక్క సామర్థ్యముచేత; ఇలన్=భూమియందు; వ్రాలిన =పడినట్టి; ఆత్మబలంబున్=తనసైన్యమును;కాంచి=చూచి; పాయక =వీడక; మను రోషరేఖ = వృద్ధిఁబొందుచున్నక్రోధపరంపరను; ఎడన్=మనస్సునందు; అంది = పొంది; తమిస్రసురారి = తమిస్రాసు రుఁడు; అత్తఱిన్=ఆసమయమందు. దీని కుత్తరపద్యముతో నన్వయము.

మహాస్రగ్ధర. వరకోదండప్రకాండో◊జ్జ్వలగుణనినద◊వ్రాతసాహాయ్యవద్దు
స్తరకంతక్రోధనృత్య◊త్కహకహరవముల్ ◊తన్నృపానీకినీభీ
కరలీలన్ దోఁపఁ బ్రోత్థో◊త్కటరుడరుణితే◊క్షావిధిం దత్త్రియామా
చరుఁ డక్షీంద్రంబు భూమీ◊శరథము నెదుటం ◊జక్కఁ బోనిచ్చి యంతన్. 121

టీక: వరకోదండప్రకాండోజ్జ్వలగుణనినదవ్రాతసాహాయ్యవద్దుస్తరకంతక్రోధనృత్యత్కహకహరావముల్ – వర=శ్రేష్ఠమగు, కోదండప్రకాండ=ప్రశస్తమగు చాపమందు, ఉజ్జ్వల=ప్రకాశించుచున్న, గుణ=అల్లెత్రాటియొక్క, నినదవ్రాత=ధ్వనిసంఘము యొక్క, సాహాయ్యవత్=సాహాయ్యయుక్తమగు, దుస్తరకంత=గహనమయిన కంతమందు,క్రోధనృత్యత్=కోపముచే నాట్య మొనరించుచున్న, కహకహరవముల్= కహకహయను ధ్వనులు; తన్నృపానీకినీభీకరలీలన్ = ఆరాజుసైన్యమునకు భయం కరమగు రీతిచే; తోఁపన్ = తోఁచుచుండఁగా; ప్రోత్థోత్కటరుడరుణితేక్షావిధిన్ – ప్రోత్థ=ఉదయించిన, ఉత్కట=అధికమైన, రుట్= రోషముచేత, అరుణిత=ఎఱ్ఱగాఁజేయఁబడిన, ఈక్షావిధిన్ = దృగ్రీతిచేత; తత్=ఆయొక్క, త్రియామాచరుఁడు=తమి స్రాసురుఁడు; అక్షీంద్రంబు = రథశ్రేష్ఠమును; భూమీశరథము నెదుటన్ = సుచంద్రునిరథము ముందుగా; చక్కన్ పోనిచ్చి = సూటిగాఁ బోవునట్లు చేసి; అంతన్ = ఆమీఁదట, దీనికి ముందఱిపద్యముతో నన్వయము. 'స్తతనస్రాగ ల్విరించాష్టవిరతులు మహాస్రగ్ధరం జెప్ప నొప్పున్' అని మహాస్రగ్ధరలక్షణము.

క. వలయితచాపజ్యాసం,స్థలి రోపత్రితయిఁ గూర్చి ◊జనపతియెద నే
ర్పలవడ నాటించి మహీ,వలయాధిపుఁ గాంచి యసుర◊వరుఁ డిట్లనియెన్. 123

టీక: వలయితచాపజ్యాసంస్థలిన్ – వలయిత=వలయాకారముగాఁ జేయఁబడిన, చాప=ధనుస్సుయొక్క, జ్యాసంస్థలిన్ = అల్లెత్రాటియందు; రోపత్రితయిన్=బాణత్రయమును; కూర్చి = సంధించి; జనపతియెదన్ = సుచంద్రునివక్షమందు; నేర్పు అలవడన్ = నేర్పుమీఱునట్లు; నాటించి = నాటుకొనునట్లు చేసి; మహీవలయాధిపున్=సుచంద్రుని; కాంచి =చూచి; అసుర వరుఁడు = రాక్షసశ్రేష్ఠుఁడు; ఇట్లనియెన్= వక్ష్యమాణప్రకారముగాఁ బలికెను.

మ. మతి నొక్కింత విచార మూన కురుసంపద్గర్వరేఖ న్మహా
దితిజాధీశవిరోధ మంది యిటు లేతేర న్మనం బుంతురే
రతి ధాత్రిన్ మనఁ గల్గినన్ జనుము మద్రాజద్భుజాదండమం
డితకోదండవినిర్వమద్విశిఖముల్ నిం గాఁడ విప్పట్టునన్. 124

టీక: మతిన్=బుద్ధియందు;ఒక్కింత = అల్పమయినను;విచారము=ఆలోచనమును; ఊనక=వహింపక; ఉరుసంపద్గర్వరేఖన్ = అధికమగు నైశ్వర్యమదపరంపరచేత; మహాదితిజాధీశవిరోధము = గొప్పరాక్షసప్రభువైన నాతో వైరమును; అంది = పొంది; ఇటులు ఏతేరన్=ఇట్లు వచ్చుటకు; మనంబు ఉంతురే = మనస్సు నుంచుదురా? ధాత్రిన్=భూమియందు; మనన్=బ్రతుకుటకు; రతి = కోరిక; కల్గినన్ = ఉన్న యెడల; చనుము = పొమ్ము; మద్రాజద్భుజాదండమండితకోదండవినిర్వమద్విశిఖముల్ – మత్ = నాయొక్క, రాజత్=ప్రకాశించుచున్న, భుజాదండ=బాహుదండములచేత, మండిత=అలంకరింపఁబడిన, కోదండ=ధనువు వలన,వినిర్వమత్=వెడలుచున్న,విశిఖముల్=అమ్ములు; నిన్=నిన్ను; ఇప్పట్టునన్=ఈసమయమున; కాఁడవు=బాధింపవు.

మ. మునివాక్యంబున మోసపోయితివి తన్మూలంబుగాఁ జుమ్ము నీ
కెనసెన్ గాలము మద్రణేహ గనువాఁడెవ్వాఁడిలన్ మించెఁ జొ
చ్చెనొ నీవీనుల లేదొ భూమివర యాజిప్రాప్తదేవేశకృం
తనసంలోలమదాశయాన్యవిధికృద్ధాత్రుక్తమిత్త్రోక్తికల్. 125

టీక: మునివాక్యంబునన్=శాండిల్యమునివచనముచే; మోసపోయితివి = వంచితుఁడవైతివి; తన్మూలంబుగాఁ జుమ్ము = అతని మూలముగా సుమీ; నీకున్; కాలము = నాశకాలము; ఎనసెన్ =ఘటిల్లెను; మద్రణేహ గనువాఁడు = నాతో యుద్ధము జేయు నిచ్ఛగలవాఁడు; ఎవ్వాఁడు=ఎవఁడు; ఇలన్=భూమియందు; మించెన్=అతిశయించెను? భూమివర = ఓ మహీపతీ! ఆజి ప్రాప్తదేవేశకృంతనసంలోలమదాశయాన్యవిధికృద్ధాత్రుక్తమిత్త్రోక్తికల్ – ఆజిప్రాప్త = యుద్ధమును బొందిన, దేవేశ=ఇంద్రుని యొక్క, కృంతన=సంహారమందు, సంలోల=మిక్కిలిఆసక్తుఁడనగు, మత్=నాయొక్క, ఆశయ=అభిప్రాయమునకు, అన్య విధికృత్= మఱియొకప్రకారముఁ జేయుచున్న, ధాత్రుక్త= బ్రహ్మదేవునిచేఁ బలుకఁబడిన, మిత్త్రోక్తికల్=సాంత్వనములు; నీ వీనులన్= నీశ్రోత్రములను; చొచ్చెనొ లేదొ = ప్రవేశించెనో లేదో? అనఁగా నొకపుడు దేవేంద్రుఁడు యుద్ధమునకు వచ్చియుండఁగా నతని సంహరింప నుద్యమించిన నేను బ్రహ్మ బతిమాలఁ గాఁ జంపక వదలినవాఁడ. ఈవృత్తాంతము నీచెవి సోఁకినదో లేదో అనుట. ఇట్లు చెప్పుటం జేసి సర్వాతిశాయిసామర్థ్యము గల వాఁడని గర్వము ధ్వనిత మగును.

సీ. లలనాళిగీతకల్యాణగీతిక గాదు, చెవి యాన ఘనసింహరవము గాని,
సరసకేళిచంద్రశాలికావళి గాదు, విహరింప సంగ్రామవీథి గాని,

బంధురకర్పూర◊గంధచర్చిక గాదు, మే నూన మొనముల్కి◊సోన గాని,
సేవాపరాప్తధా◊త్రీవరౌఘము గాదు, తిలకింప దనుజేంద్ర◊బలము గాని,
తే. గురుహితజనావృతవిహార◊ఖురళి గాదు, శరగరిమఁ జోప శాత్రవాం◊తరము గాని,
తరము గాదిట్లు రణ మూనఁ ◊దరణికులజ, తఱిమి వధియింతు నీవేళఁ ◊దలఁగి చనుము. 126

టీక: తరణికులజ = సూర్యవంశజుఁడవైన సుచంద్రుఁడా! చెవి యానన్ = శ్రోత్రపానము చేయుటకు, సుఖాకర్ణనమున కనుట; ఘనసింహరవము గాని = (ఇది) గొప్పసింహనాదము గాని; లలనాళిగీత =స్త్రీబృందముచే గానముచేయఁబడిన;కల్యాణగీతిక = శుభగీతము; కాదు.

విహరింపన్=క్రీడించుటకు; సంగ్రామవీథి గాని = (ఇది) రణరంగముగాని; సరసకేళీచంద్రశాలికావళి – సరస=శ్రేష్ఠమగు, కేళీ చంద్రశాలికా = క్రీడాసౌధవిశేషములయొక్క, ఆవళి =పంక్తి; కాదు.

మేనూనన్ = శరీరమందూనుటకు; మొనముల్కిసోన గాని = (ఇది) తీక్ష్ణాగ్రములగు బాణములవృష్టిగాని; బంధురకర్పూర గంధ చర్చిక – బంధుర=దట్టమగు, కర్పూరగంధ = కర్పూరగంధముయొక్క, చర్చిక =లేపనము; కాదు.

తిలకింపన్ =వీక్షించుటకు; దనుజేంద్రబలము గాని = (ఇది)రాక్షసేశ్వరసైన్యముగాని; సేవాపరాప్తధాత్రీవరౌఘము – సేవాపరాప్త = కొలుచుటకై వచ్చినట్టి ప్రియులైన, ధాత్రీవర=రాజులయొక్క, ఓఘము =సంఘము; కాదు.

శరగరిమన్ = బాణగరిమచే; చోపన్=తఱుముటకు; శాత్రవాంతరము గాని = (ఇది) శత్రుమధ్యముగాని; గురుహితజనావృత విహారఖురళి – గురు=అధికులగు, హితజన=మిత్త్రజనులచేత, ఆవృత=వ్యాప్తమైన, విహారఖురళి =క్రీడార్థమైనగరిడి; కాదు; ఇట్లు=ఈవిధముగా; రణ మూనన్=యుద్ధముసేయుటకు; తరము గాదు = శక్యము గాదు; ఈవేళన్ = ఈక్షణమందు; తఱిమి వధియింతున్ = బలాత్క రించి పరిమార్తును; తలఁగి =యుద్ధమునుండి తొలఁగి; చనుము = పొమ్ము.

త్వరితగతి. అనియసురకులరమణుఁ ◊డరుణతరవీక్షా
జనితరుడనలకణవి◊సర మరిమనోభీ
జనక మయి పొదల శిత◊శరచయముచేఁ ద
ద్వనజహితజనపతిఁ ◊ద్వరితగతిఁ గప్పెన్. 127

టీక: అని = ఈప్రకారముగాఁ బలికి; అసురకులరమణుఁడు = దనుజేశ్వరుఁడైన తమిస్రుఁడు; అరుణతరవీక్షాజనితరుడనలకణ విసరము – అరుణతర = మిక్కిలి యెఱ్ఱనగు, వీక్షా=చూపులచేత, జనిత=పుట్టింపఁబడిన, రుడనల = రోషాగ్ని యొక్క, కణ విసరము = లేశములగుంపు; అరిమనోభీజనకమయి = శత్రుహృదయములకు భయజనకమై; పొదలన్=ఒప్పుఁగా; శితశర చయముచేన్ = తీక్ష్ణబాణపరంపరచేత; తద్వనజహితజనపతిన్=ఆసూర్యవంశజుఁడైన రాజును, ‘సంతతి ర్గోత్ర జనన కులాని’ అని యమరుఁడు; త్వరితగతిన్ =శీఘ్రగతిచేత; కప్పెన్ = ఆవరించెను.

ఆరాజుపైఁ గఱకుటమ్ములగుంపులు గురిపించెనని తాత్పర్యము. ఇందు వృత్తనామమయిన త్వరితగతిశబ్దము ప్రకృతార్థ పరముగ నిమిడించుటచే ‘నితమ్బ గుర్వీ తరుణీ దృగ్యుగ్మవిపులా చ సా’ ఇత్యాదిస్థలములయందువలె ముద్రాలంకారము. ‘సూచ్యార్థసూచనం ముద్రా ప్రకృతార్థపరైః పదైః’ అని తల్లక్షణంబు. త్వరితగతివృత్తలక్షణము. ‘అదనదనున హరినుతు ◊లమర ధర బాలా।శదళమనఁ దనరుఁ గవి◊జనులు వచియింపన్। బదునొకటగు నెడ యతి ◊పదిలముగఁ జేరన్। గదియు నగ

ణము లయిదు ెగగము తుద నొందన్’ అని యప్పకవీయమునఁ జెప్పఁబడియె. త్వరితగతికి పాలాశదళమని నామాంతర మని యందె వచింపఁబడియె.

చ. తెఱలనిశక్తి నప్పొలసుెదిండికొలంబులమేటి యిట్టు ల
త్తఱి విశిఖాళిఁ గప్ప వసుెధాపతి దట్టపుమంచుపిండు బల్
కఱకఱిమించులం దునుముెకంజహితుం డన వాఁడితూపులన్
మఱలఁగఁ జేసి యాదనుజెనాథుఁ గుఱించి మృదూక్తి నిట్లనున్. 128

టీక: అప్పొలసుదిండికొలంబులమేటి =ఆరాక్షసకులాధిపతి; తెఱలనిశక్తిన్=తొలఁగని సామర్థ్యముచేత; ఇట్టులు=ఈరీతిగ; అత్తఱిన్=అప్పుడు; విశిఖాళిన్=బాణపరంపరచే; కప్పన్=ఆవరింపఁగా; వసుధాపతి = సుచంద్రుఁడు;దట్టపుమంచుపిండున్= నిబిడహిమకదంబమును;బల్ కఱకఱిమించులన్=అధికమైన కఠినమైన తేజస్సులచేత;తునుముకంజహితుండనన్=ఖండించు సూర్యుండో యనునట్లు; వాఁడితూపులన్=కఱకుబాణములచేత; మఱలఁగఁ జేసి =మఱలునట్లు చేసి; ఆదనుజనాథుఁగుఱించి = ఆరాక్షసేశ్వరునిగూర్చి; మృదూక్తిన్=మృదువైన వాక్కులచేత; ఇట్లనున్=వక్ష్యమాణప్రకారముగఁ బలుకును.

చ. అలఘురణోర్విఁ జేరి యసురాధిప యీగతి వట్టిపల్కుచాల్
పలుకుట వీరధర్మమె నెభస్థ్సలి నిర్జరు లెల్లఁ జూడ నీ
చలము బలంబు శస్త్రకులెచాతురిఁ జూపుము చూచి యంతటన్
బ్రలయకృశానుహేతిసమెబాణపరంపరఁ గూల్తు గ్రక్కునన్. 129

టీక: అసురాధిప =రాక్షసాధిపతీ! అలఘురణోర్విన్=అధికమయిన యుద్ధభూమిని; చేరి =పొంది; ఈగతిన్=ఈతీరున; వట్టి పల్కుచాల్=వ్యర్థవాక్పరంపరను; పలుకుట = చెప్పుట; వీరధర్మమె=వీరులపాడియా? నభస్థ్సలిన్=ఆకసమునందు; నిర్జరు లెల్లన్ = దేవతలెల్లను; చూడన్=అవలోకింపఁగా; నీచలమున్=నీమాత్సర్యమును; బలంబున్=సామర్థ్యమును; శస్త్రకుల=బాణ పుంజమునందలి; చాతురిన్ = నేర్పును; చూపుము =కనఁబఱపుము; చూచి=అవలోకించి; అంతటన్=అటుతరువాత; ప్రలయ కృశానుహేతిసమబాణపరంపరన్=ప్రళయకాలానలజ్వాలాతుల్యమగు బాణసంఘముచేత; గ్రక్కునన్=వేగముగా; కూల్తున్ =చంపుదును.

తే. ఈయెడఁ దమిస్ర నీదర్పెమెల్లఁ గూల్చి, యరిభయదలీలఁ దనరు దీెవ్యత్సుచంద్ర
శైత్యవత్కరకాండముల్ెచక్కఁ గాంచి, త్రిదశబృందంబు లానందెరేఖఁ జెందు. 130

టీక: తమిస్ర=ఓతమిస్రాసురుఁడా! అంధకారమా యని యర్థాంతరము దోఁచుచున్నది; ఈయెడన్=ఇపుడు; నీదర్పమెల్లన్ = నీయహంకారమంతయు; కూల్చి=పడవైచి; అరిభయదలీలన్ = శత్రువులకు వెఱపుగొలుపునట్లుగా, జక్కవలకు భయప్రద మగు నట్లుగా నని యర్థాంతరము; తనరు = ఒప్పుచున్న; దీవ్యత్సుచంద్రశైత్యవత్కరకాండముల్ – దీవ్యత్=ప్రకాశించుచున్న, సుచంద్ర=సుచంద్రునియొక్క, శైత్యవత్=వాఁడిగల, తీక్ష్ణవాచకమయిన శితశబ్దముమీఁద శైత్యశబ్దమయినది, కరకాండముల్ = హస్తమందుండిన బాణములను; సుచంద్ర=మంచిశీతాంశువుయొక్క, శైత్యవత్=చలువగల, కరకాండముల్=కిరణజాలము

లను; చక్కన్ =బాగుగా; కాంచి=చూచి; త్రిదశబృందంబులు=దేవసంఘములు; ఆనందరేఖన్=ఆనందపరంపరను; చెందున్ =పొందును.

ఇచటఁ బ్రస్తుతాప్రస్తుతముల కౌపమ్యము గమ్యము గాన నంధకారదర్పమడంచి, చక్రవాకభయంకరము లగుచు చంద్రకిరణములు దేవతాబృందము నానందింపఁజేయునట్లు, నాతీక్ష్ణబాణపరంపర నీదర్ప మడంచి శత్రుభయంకరమై దేవతాగణము నానందింపఁజేయు నని భావము.

చ. యతుల వధించి తత్కృతసవాళి హరించి ధరిత్రి ధార్ష్ట్యసం
గతిఁ దగునీవు నాయెదురుకట్టున నిల్చితిగా నిశాట త
త్కృతికి ఫలంబు నీ వెనయ నిత్తఱిఁ దార్చెద మద్భుజోగ్రధ
న్వతరుణభోగివాంతవిషవహ్ని సమానకలంబధారచేన్. 131

టీక: నిశాట =రాక్షసుఁడా! యతులన్=మునులను; వధించి =హింసించి; తత్కృతసవాళిన్=వారిచే నాచరింపఁబడిన యజ్ఞ సంఘములను; హరించి =చెఱిపి; ధరిత్రిన్=భూమియందు; ధార్ష్ట్యసంగతిన్– ధార్ష్ట్య=గడుసుఁదనముయొక్క, సంగతిన్ = సంబంధముచేత; తగు నీవు = ఒప్పుచున్న నీవు; నాయెదురుకట్టున నిల్చితిగా = నాసమ్ముఖమున నిల్చితివి గదా! తత్కృతికిన్ = ఆచర్యకు; ఫలంబున్=లాభమును; నీ వెనయన్ =నీవు పొందునట్లు; ఇత్తఱిన్=ఈసమయమున; మద్భుజోగ్రధన్వతరుణభోగివాంతవిషవహ్నిసమానకలంబధారచేన్ – మత్=నాయొక్క, భుజ=బాహువులయందున్న, ఉగ్రధన్వతరుణభోగి = కోడె నాగుఁబామువంటి భయంకరమగు ధనుస్సుచేత, వాంత=క్రక్కఁబడిన, విషవహ్ని=విషాగ్నితోడ, సమాన=సాటియయిన, కలంబధారచేన్=బాణపరంపరలచేత; తార్చెదన్=చేసెదను.

మాలిని. అని మనుజకులేంద్రుం డయ్యెడన్ భూరిబాణా
సన మెనసి శరాళిన్ జాల దైత్యేంద్రు నొంచెన్
ఘనము నగముపై నిష్ఖండవార్ధారచే నా
ఘనగుణరుతి గర్జాగౌరవం బూని మించన్. 132

టీక: అని = ఇట్లు వచించి; మనుజకులేంద్రుండు=జనపతి; ఘనగుణరుతి=గొప్పనగు అల్లెత్రాటి ధ్వని; గర్జాగౌరవంబు=మేఘ ధ్వనియొక్క అతిశయమును; ఊని=వహించి; మించన్=అతిశయింపఁగా; ఘనము =మేఘము;నగముపైన్=వృక్షముపై; నిష్ఖండ=అఖండమగు; వార్ధారచే నాన్=వారిధారచేత నన్నట్లు; అయ్యెడన్=ఆసమయమున; భూరిబాణాసనము=గొప్ప వింటిని; ఎనసి=పొంది; శరాళిన్ = బాణపరంపరలచేత; చాలన్=మిక్కిలి; దైత్యేంద్రున్=రాక్షసాధిపతిని; నొంచెన్=నొప్పించెను. 'మనసిజగురునెంతున్ మాలినీవృత్తమందున్, ననమయయగణంబుల్ నందవిశ్రాంతి గూడన్' అని మాలినీలక్షణము.

చ. జనపతి వైచినట్టి శితసాయకముల్ నిజసాయకచ్ఛటన్
దునియఁగఁ జేసి దైత్యపతి తోడనె యమ్ములు కొన్ని గూర్చి వై
చినఁ గడుఁ జూర్ణతన్ గగనసీమను గప్పఁగ నాత్మబాణవ
ర్తన నెనయించెఁ జూచునజరప్రకరంబులు కేలఁ బాపఁగన్. 133

టీక: దైత్యపతి =తమిస్రుఁడు; వైచినట్టి శితసాయకముల్= రాజు ప్రయోగించినట్టి తీక్ష్ణమైన బాణములను; నిజసాయకచ్ఛటన్ = తనబాణపరంపరలచేత; తునియఁగన్ చేసి =తునియునట్లు చేసి; తోడనె = వెంటనే; అమ్ములు కొన్ని గూర్చి = కొన్ని బాణములను సంధించి; వైచినన్=ప్రయోగింపఁగా; జనపతి =సుచంద్రుఁడు; ఆత్మ బాణవర్తనన్=తనబాణవ్యాపారముచేత; చూచునజరప్రకరంబులు=అవలోకించుచున్న దేవసంఘములు; కేలన్=హస్తములచేత; పాపఁగన్=తొలఁగఁజేయునట్లు; కడున్ చూర్ణతన్ = మిగుల చూర్ణత్వముచేత; గగనసీమను=ఆకాశప్రదేశమును; కప్పఁగన్=ఆచ్ఛాదించునట్లు; ఎనయించెన్=పొందించెను.

అనఁగా సుచంద్రుఁడు తన నిశితసాయకములను దైత్యేంద్రుఁడు తునియలుచేసి కొన్ని బాణములు ప్రయోగింపఁగా వానిని నిజసాయకములచే చూర్ణమై గగనసీమకు వ్యాపించునట్లు చేసెననియు, అందు రణావలోకనమునకై ఏతెంచిన దేవసంఘములు ఆచూర్ణము తమకడ్డము గాఁగా హస్తములచేతఁ దొలఁగించుకొని రనియు భావము.

చ. అలపతి వైచు బాణముల నాదనుజేశుఁడు, వాఁడు వైచు న
మ్ముల హరిభేది తున్మ్రుచు, నపూర్వరణం బొనరించి రయ్యెడన్
తలఁకక విల్లునన్ ఖగవితానము గూర్చుట వాని వైచుటల్
దెలియఁగ నోప కెంతయు మతిన్ సురసంతతి సన్నుతింపఁగన్. 134

టీక: అలపతి వైచు బాణములన్= ఆరాజు ప్రయోగించు తూపులను; ఆదనుజేశుఁడు = ఆతమిస్రాసురుఁడు; వాఁడు వైచు అమ్ములన్ = ఆదనుజేశుఁడు ప్రయోగించుబాణములను; హరిభేది = సుచంద్రుఁడు, కుముదుఁడనువాఁడు శాపవశమున హరి, అనఁగా సింహరూపమునొందియుండఁగా వాని సింహశరీరమును భేదించినవాఁడు గావున హరిభేది యనఁబడియె; తున్మ్రుచున్ = ఖండించుచు; అయ్యెడన్=ఆసమయమున; తలఁకక = భయపడక; విల్లునన్ = ధనువునందు; ఖగవితానము= బాణసంఘమును, 'ఖగస్సూర్యేషు పక్షిషు' అని రత్నమాల; కూర్చుట=సంధించుటను; వాని వైచుటల్=వానిం బ్రయోగించుటలను; సురసంతతి = దేవసంఘము; ఎంతయున్=మిక్కిలి; తెలియఁగ నోపక=తెలియఁజాలక; మతిన్=చిత్తమునందు; సన్నుతింపఁగన్ = కొనియాడఁగ; అపూర్వరణంబు= లోకోత్తరయుద్ధమును; ఒనరించిరి=సల్పిరి.

ప్రహరణకలితము. అభినవధృతి లోనడరఁగఁ బలభు
గ్విభుఁ డరిబలముల్ వెడలి నడవఁగన్
స్వభటనికర మెంచఁగఁ జటులగదన్
ప్రభుకులమణిపైఁ బఱపెను వడిగన్. 135

టీక: అభినవధృతి = నూతనధైర్యము; లోన్=మనస్సునందు; అడరఁగన్=ఒప్పుచుండఁగా; పలభుగ్విభుఁడు=రాక్షసరాజు; అరిబలముల్ = శత్రుసైన్యములు; వెడలి నడవఁగన్= రణమునుండి భీతులై పాఱఁగా; స్వభటనికరము=తనసైన్యము; ఎంచఁగన్=ప్రశంసింపఁగా; చటులగదన్=చంచలమైన గదాయుధమును; ప్రభుకులమణిపైన్= రాజేంద్రునిపై; వడిగన్=వేగముగా; పఱపెను = ప్రయోగించెను.

'పనిగొను నెపుడున్ బ్రహరణకలితన్, ననభనవలు మందగజవిరమమున్' అని ప్రహరణకలిత వృత్తలక్షణము.

పంచచామరము. సురారిరాజు మీఁద వైచెఁ శూరహర్షమార్గదన్
స్థిరధ్వనిప్రభావదీర్ణదిక్పదన్ మహాగదన్
ధరావరాగ్రయాయి ఖడ్గధారఁ ద్రుంచె నుర్వరా
ధరోరుకూట ముగ్రవజ్రధార నింద్రుఁడో యనన్. 136

టీక: సురారిరాజు =రాక్షసేశ్వరుఁడు; మీఁదన్=మీఁదికి; వైచె శూరహర్షమార్గదన్ = ప్రయోగించునదియు, శూరుల హర్ష మార్గము ఖండించునదియు; స్థిరధ్వనిప్రభావదీర్ణదిక్పదన్= స్థిరమగు ధ్వనియొక్క మహిమచేత బ్రద్దలుచేయఁబడిన దిక్తటములు గలదియు నగు; మహాగదన్ = గొప్పదగు గదాయుధమును; ధరావరాగ్రయాయి =రాజేంద్రుఁడు; ఉర్వరాధరోరు కూటము = పర్వతసమూహమును; ఉగ్రవజ్రధారన్=కఠినమైన వజ్రాయుధముయొక్క అంచుచేత; ఇంద్రుఁడోయనన్ =సురేశ్వరుఁడో యనునట్లు; ఖడ్గధారన్=ఖడ్గముయొక్క అంచుచేత; త్రుంచెన్ = ఖండించెను. ‘ జరజ్రజంబులున్ గముం బొసంగి తొమ్మిదింటిపై, విరామ మొంది’ యని పంచచామరవృత్తలక్షణము.

మ. గద యీలీల నృపాసిధార ధరఁ ద్రుంగం దీవ్రరోషం బెదన్
గదురం దానవమాయచే నసురలోకస్వామి యవ్వేళ వై
రిదరాపాది మహాసురాస్త్రము ధరిత్రీభర్తపై వైచె స
త్పదవిన్ జూచు సురాళి కన్నులకు నిద్రాముద్ర చేకూడఁగన్. 137

టీక: ఈలీలన్=ఈతీరుగ; నృపాసిధారన్=రాజుయొక్క ఖడ్గముయొక్క అంచుచేత; గద =తనగదాయుధము; ధరన్= భూమియందు; త్రుంగన్= తునియలు కాఁగా; తీవ్రరోషంబు = అధికమైనకోపము; ఎదన్=హృదయమందు; కదురన్=కల్గగా; అసురలోకస్వామి=రాక్షసేశ్వరుఁడు; దానవమాయచేన్=రాక్షసమాయచేత; అవ్వేళన్=అపుడు; వైరిదరాపాది మహాసురాస్త్రము = శత్రుభయప్రదమగు గొప్ప యాసురాస్త్రమును; సత్పదవిన్ = నక్షత్రపదవి యగు నాకాశమందు; చూచు సురాళి కన్నులకు = చూచునట్టి దేవబృందముయొక్క నేత్రములకు; నిద్రాముద్ర =ముకుళీభావ మనుట; చేకూడఁగన్=కల్గునట్లు; ధరిత్రీభర్తపైన్ =రాజుమీఁద; వైచెన్= ప్రయోగించెను.

శిఖరిణి. ఖరాస్యాస్త్రంబుల్ ఘూకముఖశరముల్ కాకవదన
స్ఫురద్బాణంబుల్ తన్నొదివికొని రా భూరిపరిఘ
క్షురప్రాసిశ్రేణిన్ గురియుచు వెఱంగూల నజరుల్
త్వరన్ దద్దైతేయాస్త్రము నడచెఁ దత్సైన్య మలరన్. 138

టీక: ఖరాస్యాస్త్రంబుల్=ఖరముఖబాణములు; ఘూకముఖశరముల్ =ఘూకముఖములు గలిగిన బాణములు; కాకవదన స్ఫురద్బాణంబుల్ = కాకముఖములచేఁ బ్రకాశించుచున్న బాణములు; తన్ = తనను, ఆసురాస్త్రము ననుట; పొదివికొని రాన్ = కప్పికొని రాఁగా; భూరిపరిఘక్షురప్రాసిశ్రేణిన్= అధికములైన పరిఘలయొక్కయు, చురకత్తుల యొక్కయు, ఖడ్గముల యొక్కయు గుంపులను; కురియుచున్=వర్షించుచు; అజరుల్=దేవతలు; వెఱన్=భయముచేత; కూలన్=దిగులొందునట్లుగ;

త్వరన్ =వేగముచేత; తత్సైన్యము=వానిసైన్యము; అలరన్=సంతోషింపఁగా; తద్దైతేయాస్త్రము=ఆయాసురాస్త్రము; నడచెన్ = వెడలెను. 'ద్విజశ్రేష్ఠుల్ మెచ్చ న్యమనసభవల్ విశ్వవిరతి ప్రజాతాహ్లాదంబై శిఖరిణి యనా భాసురమగున్' అని శిఖరిణీవృత్త లక్షణము. ఇట నప్పకవి యొకచోటనే విశ్రమముఁ జెప్పినను ఈకవి విశ్రమద్వయమునుఁ బొందుపఱిచెను.

మందాక్రాంత. ఉర్వీశస్వామి ఘనమతితో \ నుగ్రకీలాళి పైపైఁ
బర్వన్ రాఁ జూచి వెఱఁగు మదిన్ \ బాయకెచ్చన్ దదీయా
ఖర్వప్రస్ఫూర్తి నడఁచుతమిం \ గాంచి దోశ్శక్తిమై గాం
ధర్వాస్త్రం బప్డు మహిపతి సం \ తానముల్ మెచ్చవైచెన్. 139

టీక: ఉర్వీశస్వామి=సుచంద్రుఁడు; ఘనమతితోన్=గొప్పబుద్ధితో; ఉగ్రకీలాళి=భయంకరమగు నగ్ని జ్వాలాపరంపర; పైపైన్ పర్వన్ రాన్ = మీఁదికిఁ బ్రసరించుటకు రాఁగా; చూచి; వెఱఁగు =ఆశ్చర్యము; మదిన్ పాయక ఎచ్చన్ = మనస్సులో విడువక యధికము కాఁగా; తదీయాఖర్వప్రస్ఫూర్తిన్=వాని యతిశయస్ఫూర్తిని; అడఁచుతమిం గాంచి=శమింపఁజేయు కోర్కిఁ బూని; దోశ్శక్తిమైన్ = బాహుశక్తిచేత; అప్డు=ఆసమయమున; మహిపతి సంతానముల్=రాజబృందములు; మెచ్చన్ = కొనియాడు నట్లుగా; గాంధర్వాస్త్రంబు=గాంధర్వాస్త్రమును; వైచెన్=ప్రయోగించెను. 'మందాక్రాంత స్గిరిశవిరతు ల్మభ్న తాగాగణంబుల్ పొందెన్' అని మందాక్రాంతావృత్తలక్షణము నప్పకవి చెప్పె.

భుజంగప్రయాతము. ఖరాంశుచ్ఛటన్ వహ్ని \ కాండంబులన్ శీ
తరుక్పాళిని న్మించి \ ధాత్రీనభంబుల్
స్వరోచిం బ్రకాశింప \ క్ష్మానాయకాస్త్రం
బిరం దానవాస్త్రీయ \ వృత్తిన్ హరించెన్. 140

టీక: ఖరాంశుచ్ఛటన్ = సూర్యపరంపరను; వహ్నికాండంబులన్=అగ్నిపరంపరను; శీతరుక్పాళినిన్=చంద్రపరంపరను; మించి = అతిశయించి; ధాత్రీనభంబుల్ = భూమ్యంతరిక్షములు; స్వరోచిన్=తనకాంతిచేత; ప్రకాశింపన్=విలసిల్లఁగా; క్ష్మానాయకాస్త్రంబు = రాజయొక్క బాణము; ఇరన్=భూమియందు; దానవాస్త్రీయవృత్తిన్ = రాక్షసబాణసంబంధివ్యాపారమును; హరించెన్ = శమింపఁజేసెను. 'భుజంగప్రయాతాఖ్యము ల్నాల్గుయాలన్ గజవ్రాతవిశ్రాంతిగాఁ జెప్ప నొప్పున్' అని భుజంగ ప్రయాతవృత్తలక్షణము.

తే. ఇట్లు తనయస్త్రసామర్థ్య \ మెల్లఁ దూల, నౌడు కఱచుచు హుమ్మని \ యాగ్రహమున
మీసములు నిక్క నపుడు త \ మీచరుండు, శక్తి నృపు వైచె నిజమంత్ర \ శక్తి గరిమ. 141

టీక: తమీచరుండు = రాక్షసుఁడు; ఇట్లు=ఈప్రకారముగా; తనయస్త్రసామర్థ్యమెల్లన్ = తనయాసురాస్త్రసామర్థ్యమంతయు; తూలన్=తొలఁగిపోవఁగా; ఔడు కఱచుచున్ = పెదవికఱచుచు; హుమ్మని =హుంకారము చేసి; ఆగ్రహమునన్=కోపముచేత; మీసములు = శ్మశ్రువులు; నిక్కన్=నిగుడఁగా; అపుడు=ఆసమయమున; నిజమంత్రశక్తిగరిమన్=తనమంత్రసామర్థ్యముచేత; శక్తి = శక్తి యను నాయుధమును; నృపున్=రాజును గూర్చి; వైచెన్=ప్రయోగించెను.

పృథ్వి. కనత్కనకఘంటికా॥కలఘుణత్కృతిప్రక్రియన్
జనాధిపమహాచమూ॥శ్రవణభేదనం బూన్చుచున్
ఘనప్రతిమ ధూమసం॥ఘములఁ జీఁకటు ల్నించుచున్
ఘనస్యదనిరూఢిచేఁ ॥గదలి శక్తి యేతేరఁగాన్. 142

టీక: కనత్కనకఘంటికాకలఘుణత్కృతిప్రక్రియన్ – కనత్=ప్రకాశించుచున్న, కనకఘంటికా=బంగరుగజ్జెలయొక్క, కల= అవ్యక్తమధురమగు, ఘుణత్కృతి= తద్రూపమైన ధ్వనివిశేషముయొక్క, ప్రక్రియన్=వ్యాపారముచేత; జనాధిపమహాచమూ శ్రవణభేదనంబు – జనాధిప=రాజుయొక్క, మహాచమూ=గొప్పసేనయొక్క, శ్రవణభేదనంబు = చెవుల భేదించుటను; ఊన్చు చున్ = చేయుచు; ఘనప్రతిమధూమసంఘములన్ – ఘనప్రతిమ=మేఘమునకు సాటియగు, ధూమసంఘములన్ = పొగ గుంపులచేత; చీఁకటుల్=అంధకారములను; నించుచున్ =పూరించుచు; ఘనస్యదనిరూఢిచేన్=అధికమగు వేగస్ఫూర్తిచేత; కదలి = వెడలి; శక్తి = శక్తి యను నాయుధము; ఏతేరఁగాన్=రాఁగా. దీని కుత్తరపద్యముతో నన్వయము.

పృథ్వీవృత్తలక్షణమును గూర్చి, 'జసల్ జసయవంబు లుష్ణకరసంఖ్యవిశ్రాంతులున్, బొసంగి కవిపుంగవుల్ పలుక భూమిలోఁ బృథ్వినా, నసంశయమగుం గళిందతనయామనోవల్లభా' అని యప్పకవి పండ్రెండవయక్షరము యతిగాఁ జెప్పి నను మహాకవులు పెక్కండ్రు తొమ్మిదవవర్ణము విశ్రమముగా వ్యవహరించుచున్నారు.

క. మనుజపతి దానిఁ గనుఁగొని, యనిఁ గుండలితాశుగాసుఁ॥డై శరపంక్తిం
దునియలుగాఁ బడ వైచెన్, మనమున వేల్పులు నిజైక॥మహిమను బొగడన్. 143

టీక: మనుజపతి=రాజు; దానిన్ = ఆ శక్త్యాయుధమును; కనుఁగొని=అవలోకించి; అనిన్=యుద్ధమునందు; కుండలితాశు గాసుఁడై – కుండలిత=వలయాకారముగాఁజేయఁబడిన; ఆశుగాసుఁడై =ధనువుగలవాఁడై, ఆశుగాసశబ్దము శరాసాదిశబ్ద ములవలె ధనుర్వాచకమగునని దెలియవలయు; వేల్పులు = దేవతలు; మనమునన్ =చిత్తమునందు; నిజైకమహిమను = తనయొక్క ముఖ్యమగు సామర్థ్యమును; పొగడన్ =శ్లాఘింపఁగా; శరపంక్తిన్=బాణపరంపరలచేత; తునియలుగాన్= శకలములుగా; పడవైచెన్=పడఁగొట్టెను.

చ. తనవరశక్తి యిట్లు వసు॥ధాపతిమార్గణధారఁ ద్రెళ్ల నా
దనుజవిభుండు శత్రుబల॥దారణశీలము స్వాగ్రనిర్గళ
త్సునిశితకీలికీల మొక॥శూలము చయ్యనఁ బూని దీనిచే
మనుము నృపాల యంచుఁ బర॥మప్రతిఘోద్ధతి ప్రేయ నెత్తఁగన్. 144

టీక: ఆదనుజవిభుండు = ఆరాక్షసరాజు; ఇట్లు=ఈచొప్పున; తనవరశక్తి = తనయొక్క శ్రేష్ఠమగు శక్త్యాయుధము; వసుధాపతి మార్గణధారన్=రాజుబాణములయొక్క అంచుచేత; త్రెళ్లన్=పడఁగా; శత్రుబలదారణశీలము =వైరిసైన్యసంహరణస్వభావము గలదియు; స్వాగ్రనిర్గళత్సునిశితకీలికీలము – స్వ=తనయొక్క, అగ్ర=అగ్రభాగమువలన, నిర్గళత్=వెడలివచ్చుచున్న, సుని శిత=మిక్కిలి తీక్ష్ణములగు, కీలికీలము = అగ్నిజ్వాలలు గలదియు నగు, ఒకశూలము = ఒకశూలాయుధమును; చయ్యనన్

=వేగముగా; పూని=వహించి; దీనిచేన్=ఈయాయుధముచేత; నృపాల=ఓరాజా! మనుము = బ్రతుకుము, విరుద్ధలక్షణచే చావుమని యర్థము; అంచున్=ఇట్లనుచు; పరమప్రతిఘోద్ధతిన్ = అత్యంతమగు కోపముచేత; ప్రేయన్=ఏయుటకు; ఎత్తఁగన్= మీఁదికెత్తఁగా. దీనికి ముందుపద్యముతో నన్వయము.

చ. జనవిభుఁడంతలోఁ గరము ᳚చాతురి హెచ్చఁగ ధన్వ మూని వే
గనియతి నర్ధచంద్రవిశి᳚ఖద్వయి పావకమంత్రరేఖతోఁ
దనరఁగఁ గూర్చి వైచి ధరఁ ᳚దార్కొనఁ జేసెఁ దదీయదోర్యుగం
బనుపమశూలకాంచనశ᳚రాసనముల్ తొలుదొల్త డిందఁగన్. 145

టీక: జనవిభుఁడు=సుచంద్రుఁడు; అంతలోన్=వాఁడు శూలమెత్తివేయునంతలో; కరము=మిగుల;చాతురి =నేర్పు;హెచ్చఁగన్ = మించఁగా;ధన్వము=ధనుస్సును; ఊని=వహించి; వేగనియతిన్=వేగనియమముచేత; అర్ధచంద్రవిశిఖద్వయిన్=అర్ధచంద్ర బాణద్వయమును; పావకమంత్రరేఖతోన్=ఆగ్నేయమంత్రపుంజముచేత; తనరఁగన్=ఒప్పునట్లుగా; కూర్చి=ఘటించి; వైచి = ప్రయోగించి; అనుపమశూలకాంచనశరాసనముల్ = సాటిలేని శూలమును, కాంచనధనువును; తొలుదొల్తన్=మొదటనె; డిందఁగన్ = పడఁగా; తదీయదోర్యుగంబు=వానిబాహుయుగ్మమును; ధరన్ = భూమియందు; తార్కొనన్ చేసెన్ = పడు నట్లు చేసెను.

ఉ. అంత ననంతరోషశిఖి ᳚యాంతరవీథికఁ జిందు ద్రొక్కఁ గా
లాంతకతుల్యమూర్తి యల᳚యాశరసంతతిచక్రవర్తి దు
ర్దాంతరయంబుతో మణిశ᳚తాంగము డిగ్గన డిగ్గి వ్యాత్తవ
క్త్రాంతర మూని మ్రింగెద ర᳚సాధిపు నం చరుదెంచె నుద్ధతిన్. 146

టీక: అంతన్=అటుతరువాత; కాలాంతకతుల్యమూర్తి=ప్రళయకాలమృత్యువుతో సమానమైన; అలయాశరసంతతిచక్రవర్తి= ఆరాక్షసకులాధిపతియగు తమిస్రుఁడు; ఆంతరవీథికన్=హృదయప్రదేశమందు; అనంతరోషశిఖి=అధికమైన క్రోధాగ్ని; చిందు ద్రొక్కన్=ఉప్పొంగఁగ; దుర్దాంతరయంబుతోన్=నివారింపరానివేగముతో; మణిశతాంగము=మణిమయమైనరథమునుండి; డిగ్గన డిగ్గి =తటాలున దిగి; వ్యాత్త=తెఱవఁబడిన; వక్త్రాంతరము=ముఖమధ్యమును; ఊని=వహించి; ఉద్ధతిన్=దర్పము చేత; రసాధిపున్=రాజును; మ్రింగెద నంచు=కబళించెద ననుచు; అరుదెంచెన్=వచ్చెను.

వ. ఇట్లప్రతిమానప్రతిపక్షహర్యక్షవర్యంబు వీక్షించి మహాక్షితిధరాసన్నక్షోణివలనం గుప్పించు పంచాననంబు తెఱంగునఁ దచ్చక్రాంగం బభంగురామర్షసాంగత్యంబున డిగ్గ నుఱికి గోత్రాధిపవిచిత్రపత్త్రిరాజ పరిత్రుటితబాహార్గళయుగళుండై, నిస్తంద్రసురేంద్ర శతకోటిశితకోటి పాటితపక్షద్వయంబగు నంజనాచలంబు చందంబునం జూపట్టుచు నశేషారిబలవిలోచనోత్సవవిమోచనంబు గావించు మేచకప్రభాఘట్టంబున నెట్టన మట్టుమీఱు కటికచీఁకటిం బుట్టించుచుఁ బొడకట్టు నుద్దండతనూదండంబు శింశుమారచక్రవీథి రాయం బెరుఁగఁ జేయుచు, నిష్ఠురదీర్ఘనిశ్వాసధూమ నిష్కాలనీరదనికాయంబులకు శంఖారవోత్థహుంకారవారం

బుల విశంకటగర్జనావిశేషంబులు నెగడించుచు, గ్రీష్మదినమధ్యందినమార్తాండమండలం బొడియం దమకించు విధుంతుదగ్రహంబుదారి నున్మీలితవదనకోటరుండై మహిపమార్తాండుంగుఱించి యనంతాధ్వంబునన్ బరువూన్చుచు, నతిభయంకరాకారంబునన్ బఱతేర, నప్పు డప్పొలసుదిండిమన్నీనిఁ గన్నారంజూచి ధీరోదాత్తుండగు నాసుచంద్రరాజేంద్రుండు నిజకోదండంబున సమంత్రకంబుగ నారాయణాస్త్రంబు గూర్చి ప్రయోగించిన నయ్యస్త్రశిఖావతంసంబును నతివేలశుచిజాలసమన్వితంబుగావునఁ బుష్కరస్థానసంస్థాయి నానానిమేషసంతానభంగంబు చేకూర్చుచు, ననేకదివ్యకాండసర్గచమత్కారి ఘనప్రకారభాసమానంబుగావున భువనజాతవిలాససముత్సారణంబు సంఘటించుచు, నమలకమలాప్తదైవతప్రభావిభూషితంబుగావున నాత్మమిత్రచక్రానందసంధాయకతేజోవైఖరిన్ దేజరిల్లుచు, నమితరయంబున నభ్రమార్గంబు చేపట్టి యెదురుగఁ బఱతెంచు నాదైతేయనాయకుశిరంబుఁ ద్రుంచె నయ్యవసరంబున. 147

టీక: ఇట్లు = ఈతీరున; అప్రతిమానప్రతిపక్షహర్యక్షవర్యంబు– అప్రతిమాన = సాటిలేని, ప్రతిపక్షహర్యక్షవర్యంబు = శత్రుశ్రేష్ఠుఁడు, ‘హర్యక్షః కేసరీ హరిః’ అనియు, ‘సింహ శార్దూల నాగాద్యాః పుంసి శ్రేష్ఠార్థగోచరాః’ అనియు అమరుఁడు; వీక్షించి = చూచి; మహాక్షితిధరాసన్నక్షోణివలనన్– మహత్=గొప్ప, క్షితిధర=పర్వతముయొక్క, ఆసన్నక్షోణివలనన్ = సమీపభూమినుండి; కుప్పించుపంచాననంబుతెఱంగునన్ = దుముకుచున్న సింహమువలె; తచ్చక్రాంగంబు=ఆరథమునుండి; అభంగురామర్షసాంగత్యంబునన్– అభంగుర=అప్రతిహతమగు, అమర్ష=చేతఃప్రజ్వలనముయొక్క, ‘అమర్ష స్సాపరాధేషు చేతః ప్రజ్వలనం మతమ్’ అని అమర్షలక్షణము, సాంగత్యంబునన్=సంబంధముచేత; డిగ్గన్ఉఱికి=వేగముగా దిగి; గోత్రాధిప విచిత్రపత్త్రిరాజ పరిత్రుటిత బహార్గళయుగళుండై– గోత్రాధిప=రాజుయొక్క,విచిత్ర=ఆశ్చర్యకరమగు, పత్త్రిరాజ=ఉత్తమసాయకములచేత, పరిత్రుటిత=ఛేదింపఁబడిన, బాహార్గళయుగళుండై =అర్గళములఁబోలు భుజాద్వయముగలవాఁడై; నిస్తంద్రసురేంద్ర శతకోటి శితకోటి పాటితపక్షద్వయంబు– నిస్తంద్ర=జాగరూకుఁడైన, సురేంద్ర=దేవేంద్రునియొక్క, శతకోటి =వజ్రాయుధముయొక్క, శితకోటి= తీక్ష్ణాగ్రముచేత, పాటిత=నఱకఁబడిన, పక్షద్వయంబు=గరుద్యుగ్మము గలిగినది; అగు =అయినట్టి; అంజనాచలంబుచందంబునన్ = నీలాచలమువలె; చూపట్టుచున్=అగపడుచు; అశేషారిబలవిలోచనోత్సవవిమోచనంబు– అశేష = సమస్తములగు, అరి = శత్రువులయొక్క, తమిస్రుఁడుగావున జక్కవలయొక్కయని యర్థాంతరము స్ఫురించును, బల=సైన్యముయొక్క, విలోచనోత్సవ=నయనానందముయొక్క, విమోచనంబు = పోగొట్టుటను; కావించు మేచకప్రభాఛట్టంబునన్– కావించు = చేయుచున్న, మేచకప్రభా=నీలకాంతులయొక్క, ఛట్టంబునన్=గుంపుచేత; నెట్టనన్ = అనివార్యముగా; మట్టు మీఱు కటికచీఁకటిన్= అతిశయించు గాఢాంధకారమును; పుట్టించుచున్=కలుఁగఁజేయుచు;పొడకట్టు ఉద్దండ తనూదండంబు– పొడకట్టు = చూపట్టుచున్న, ఉద్దండ=ఉత్కటమగు, తనూదండంబు = శరీరకాండము; శింశుమారచక్ర వీథిన్= సూర్యాది గ్రహసంచారచక్రముయొక్క ప్రదేశమును; రాయన్=ఒరయునట్లు;పెరుఁగఁ జేయుచున్ = వృద్ధిఁబొందఁ జేయుచు; నిష్ఠురదీర్ఘ నిశ్వాసధూమనిష్కాలనీరదనికాయంబులకున్– నిష్ఠుర=కఠినమై, దీర్ఘ=పొడవైన, నిశ్వాస=ఊర్పు సంబంధియగు, ధూమ= పొగ యనెడు, నిష్కాల=అకాలభవమగు, నీరద=మేఘములయొక్క, నికాయంబులకున్=గుంపులకు; శంఖారవోత్థహుంకారవారంబులన్– శంఖారవోత్థ= శంఖనాదములనుండి పుట్టిన, హుంకారవారంబులన్ = హుమ్మను శబ్దపరంపరలచేత; విశంకటగర్జనావిశేషంబులు = విశాలములగు గర్జనావిశేషములను; నెగడించుచున్=పుట్టించుచు; గ్రీష్మ

దినమధ్యందిన మార్తాండమండలంబు – గ్రీష్మదిన=గ్రీష్మకాలదినమందలి, మధ్యందిన=మధ్యాహ్నకాలికమగు, మార్తాండ మండలంబు = సూర్యమండలమును; ఒడియన్ తమకించు విధుంతుదగ్రహంబు దారిన్ – ఒడియన్ = పట్టుటకు, తమకించు= త్వరపడు, విధుంతుదగ్రహంబు = రాహుగ్రహముయొక్క, దారిన్ = తీరున; ఉన్మీలితవదనకోటరుండై = తెఱవఁబడిన ముఖ బిలముగలవాఁడై; మహిపమార్తాండుంగుఱించి = రాజనెడు సూర్యునిగుఱించి; అనంతాధ్వంబునన్ = అంతరిక్షమార్గమున; పరువూనుచున్ = పరుగెత్తుచు; అతిభయంకరాకారంబునన్=మిగుల భయప్రదమగు నాకృతితోడ; పఱతేరన్=రాఁగా; అప్పుడు=ఆసమయమున; అప్పొలసుదిండిమన్నీనిన్=ఆరాక్షసరాజును; కన్నారన్ చూచి=బాగుగ నవలోకించి; ధీరోదాత్తుం డగు నాసుచంద్ర రాజేంద్రుండు = ధీరశ్రేష్ఠుండగు ఆసుచంద్రుఁడను రాజశ్రేష్ఠుఁడు; నిజకోదండంబునన్=తనధనువునందు; సమంత్రకంబుగన్ = మంత్రయుక్తముగ; నారాయణాస్త్రంబున్ = నారాయణుఁ డధిదేవతయైన యస్త్రమును; కూర్చి = సంధించి; ప్రయోగించినన్= విడువఁగా; అయ్యస్త్రశిఖావతంసంబును = ఆయుత్తమాస్త్రంబును; అతివేలశుచిజాలసమన్వితంబు = అధిక మగు నగ్నిసంతతులతోడఁ గూడినది, అధికములు, శుద్ధములు నగు వలలతోఁగూడినదని యర్థాంతరముదోఁచును; కావునన్ = అయినహేతువువలన; పుష్కరస్థానసంస్థాయినానానిమేషసంతానభంగంబు – పుష్కరస్థాన=ఆకసమునందు, సంస్థాయి = నిలిచియున్న, నానా=అనేకవిధములగు, అనిమేషసంతాన=సురసంఘముయొక్క, జలప్రదేశముల నున్న మత్స్యసముదా యముయొక్క యని యర్థాంతరము; భంగంబు=పతనమును; చేకూర్చుచున్=చేయుచు; అనేకదివ్యకాండసర్గచమత్కారి ఘనప్రకారభాసమానంబు – అనేక=అనేకములగు, దివ్య=లోకోత్తరములైన, కాండ=బాణములయొక్క, ఉదకములయొక్క, సర్గ=సృష్టియందు, చమత్కారి=నేర్పుగల్గిన, ఘనప్రకార=అధికవిధములచేత, మేఘప్రకారముచేత, భాసమానంబు=ప్రకాశిం చునది; కావునన్ = అయినందున; భువనజాతవిలాససముత్సారణంబు – భువనజాత=లోకసంతతియొక్క, జలజాతము యొక్క, విలాస=సంతసముయొక్క, సముత్సారణంబు=మోచనమును; సంఘటించుచున్=చేయుచు; అమలకమలాప్తదైవత ప్రభావిభూషితంబు – అమల = స్వచ్ఛమగు, కమలాప్తదైవత=విష్ణువుయొక్క, సూర్యునియొక్కయని యర్థాంతరము, ప్రభా= కాంతిచేత, విభూషితంబు = అలంకృతమైనది; కావునన్=అయినందున; ఆత్మమిత్రచక్రానందసంధాయకతేజోవైఖరిన్ – ఆత్మ =తనయొక్క, మిత్రచక్ర= సుహృత్సంఘములకు, మిత్రములగు చక్రవాకములకు, ఆనందసంధాయక = సంతసము జేయు, తేజోవైఖరిన్ = తేజోవిశేషము చేత; తేజరిల్లుచున్=ప్రకాశించుచు; అమితరయంబునన్=అమితవేగముచేత; అభ్రమార్గంబు = ఆకాశమార్గమును; చేపట్టి=అవలంబించి; ఎదురుగన్=అభిముఖముగా; పఱతెంచు =ఏతెంచు; ఆదైతేయనాయకుశిరంబున్ =ఆరాక్షసరాజుయొక్కశిరసును; త్రుంచెన్=ఖండించెను; అయ్యవసరంబునన్=ఆసమయమందు. దీనికి ముందుపద్యమందుఁ గల క్రియతో నన్వయము.

సీ. గంధర్వసతులు చొ◊క్కపుపాట వాడిరి, వాడిరి తద్భవ్య◊వార్తమయులు,
కులరాజమంత్రిము◊ఖ్యులు సంభ్రమించిరి, మించిరి సాధ్యు ల◊మేయసుఖిత,
నరనాథసిద్ధు లం◊దఱు కొనియాడిరి, యాడిరి బృందార◊కాబ్జముఖులు,
ప్రద్రవద్రిపుల రా◊డ్భటులు మన్నించిరి, నించిరి విరిసోన ◊నిఖిలలేఖు,
తే. లాత్మ సామంతనృపు లబ్ర◊మంది రిష్ట,సిద్ధి ముని లాశ్రమంబులు చెంది రసుర
కువలయాక్షులు మిక్కిలి ◊గుంది రభయ,భూతి జానపదుల్ మదిఁ ◊బొంది రపుడు. 148

టీక: గంధర్వసతులు = గంధర్వస్త్రీలు; చొక్కపుపాట పాడిరి=చక్కనైన పాటను గానము చేసిరి; మయులు=యక్షులు; తత్= ఆవిజయమునకుసంబంధించిన, భవ్యవార్తన్=మంగలకరమగు వృత్తాంతమును; పాడిరి=గానము చేసిరి.
కులరాజమంత్రిముఖ్యులు = కులమువారు, రాజులు, మంత్రులు; సంభ్రమించిరి = సంతోషించిరి; సాధ్యులు=దేవవిశేషులు; అమేయసుఖితన్=అపరిమితసౌఖ్యముచేత; మించిరి = అతిశయించిరి.
నరనాథసిద్ధులు=రాజుయొక్క కార్యసిద్ధులను; అందఱున్=ఎల్లరును; కొనియాడిరి=ప్రశంసించిరి; బృందారకాబ్జముఖులు = దేవతాస్త్రీలు; ఆడిరి= నాట్యముఁ జేసిరి.
ప్రద్రవద్రిపులన్ = పలాయమానులగు శత్రువులను; రాడ్భటులు = రాజభృత్యులు; మన్నించిరి = గౌరవించిరి; నిఖిలలేఖులు = సర్వదేవతలు; విరిసోనన్ = పుష్పవర్షమును; నించిరి = పూరించిరి.
ఆత్మన్=హృదయమందు; సామంతనృపులు=ఇరుగుపొరుగు భూపులు; అబ్రమందిరి=ఆశ్చర్యమందిరి; మునులు= ఋషులు; ఇష్టసిద్ధిన్ = మనోరథలాభముచేత; ఆశ్రమంబులు = తమనివాసములను; చెందిరి=పొందిరి;
అసురకువలయాక్షులు =రాక్షస స్త్రీలు; మిక్కిలి = అధికముగా; కుందిరి=దుఃఖించిరి; జానపదుల్ =ప్రజలు; అభయ భూతిన్=అభయసంపదను; మదిన్=బుద్ధియందు; పొందిరి=లభించిరి; అపుడు=ఆసమయమందు. దీనికి ముందుపద్య ముతో నన్వయము. ఈపద్యమందు యమకాలంకారవిశేషము. 'అర్థేసత్యర్థభిన్నానాం వర్ణానాంసా పునః క్రియా। యమకం పాదతద్భాగవృత్తి తద్యాత్యనేక తామ్' అని కావ్యప్రకాశమున యమకలక్షణము. 'యుద్ధేతు వర్మ బలచారరజాంసి తూర్య నిస్సాణనాదశరమణ్డల రక్తనద్యః। ఛిన్నాతపత్రరథచామరకేతు కుమ్భిముక్తాసురీవృతభటా స్సురపుష్పవృష్టిః' అనుటంబట్టి యథోచితముగ నిట్లు పుష్పవృష్ట్యంతము వర్ణితం బయ్యె.

మ. హరిదీశానసురాళితోఁ బ్రమథవర్యశ్రేణితో సర్వని
ర్జరయోగీశ్వరకోటితో రయిత గోత్రంజేరి గౌరీమనో
హరుఁ డాభూపతి గారవించి మహిలోకాత్యద్భుతాపాదిబం
ధురనానావిధపారితోషికములన్ దోడ్తో నొసంగెన్ గృపన్. 149

టీక: గౌరీమనోహరుడు=శివుఁడు;హరిదీశానసురాళితోన్=దిక్పాలాదిదేవబృందముతోడ; ప్రమథవర్యశ్రేణితోన్=ప్రమథ శ్రేష్ఠులగుంపులతోడ; సర్వనిర్జరయోగీశ్వరకోటితోన్=సమస్తదేవమునిసంఘముతోడ; రయితన్ = వేగముచేత; గోత్రన్ = భూమిని; చేరి = పొంది;ఆభూపతిన్=ఆరాజును (సుచంద్రుని); గారవించి =గౌరవముచేసి;మహిలోకాత్యద్భుతాపాదిబం ధురనానావిధపారితోషికములన్ – మహిలోక = భూలోకమునందు, అత్యద్భుతాపాది = మిక్కిలి యాశర్యమును గొల్పు, బంధుర = ఇంపైన, నానావిధ = బహువిధములైన, పారితోషికములన్=బహుమానములను; తోడ్తోన్=వెంటనే; కృపన్ = దయచేత, ఒనొసంగెన్=ఇచ్చెను. శివుఁడు దేవబృందముతోను, ప్రమథమునివర్గములతోను బుడమికి నేతెంచి యారాజునకు లోకోత్తరపారితోషికములనిచ్చె ననుట.

చ. దనుజకులేంద్రసైన్యవరదారుణసాయకపాళి నుర్విఁ ద్రె
ళ్లిన మహిపాలసైన్యపటలిన్ మనఁజేసె శచీవిభుండు పా

వనకరుణాసుధానికర॰వర్షపరంపరకన్న మున్న ప
ర్వీన నిజశక్తికల్పితన॰వీనసుధారసవృష్టిధారచేన్. 150

టీక: శచీవిభుండు = ఇంద్రుఁడు;దనుజకులేంద్రసైన్యవరదారుణసాయకపాళిన్– దనుజకులేంద్ర = రాక్షసేంద్రునియొక్క,సైన్య =సైన్యముయొక్క,వర=శ్రేష్ఠమగు,దారుణ=భయంకరమగు,సాయకపాళిన్=బాణపరంపరలచేత; ఉర్విన్=భూమియందు; త్రెళ్లిన మహిపాలసైన్యపటలిన్ = పడినట్టి రాజసైనికుల సమూహమును; పావనకరుణాసుధానికరవర్షపరంపరకన్నన్– పావన=పవిత్రమగు, కరుణా=కృపచేతనైన, సుధానికర=సుధాసమూహముయొక్క, వర్షపరంపరకన్నన్=వృష్టిపరంపర కన్నను; మున్న = పూర్వమే; పర్వీననిజశక్తికల్పితనవీనసుధారసవృష్టిధారచేన్– పర్వీన=వ్యాపించినదియు, నిజశక్తికల్పిత =తన సామర్థ్యముచే కల్పింపఁబడినదియు,నవీన=నూతనమగు, సుధారస=అమృతరసముయొక్క, వృష్టిధారచేన్=వర్షధార చేత; మనఁజేసెన్ = బ్రతికించెను.

మ. దివిజాలభ్యతమిస్రదైత్యవిజయా॰ప్తిన్ సేవితుం డైన యా
యవనీనాథవరేణ్యుఁ జేరి వినయా॰త్మాత్మ గాధేయగా
లవశాండిల్యవసిష్ఠముఖ్యమునిజా॰లం బేకవాచాగతిన్
నవకల్యాణకరాదిదివ్యవరసం॰తానంబు లూన్చెన్ రహిన్. 151

టీక: దివిజాలభ్యతమిస్రదైత్యవిజయాప్తిన్– దివిజాలభ్య=దేవతలకుఁ బొందనలవిగాని, తమిస్రదైత్య=తమిస్రాసురునియొక్క, విజయ=విజయముయొక్క, ఆప్తిన్= ప్రాప్తిచేత; సేవితుండైనయాయవనీనాథవరేణ్యున్=సేవింపఁబడిన యారాజశ్రేష్ఠుని; చేరి = పొంది; వినయాత్మాత్మ =వినయవశమైన చిత్తముతో;గాధేయగాలవశాండిల్యవసిష్ఠముఖ్యమునిజాలంబు= విశ్వామిత్రుఁడు, గాలవుఁడు, శాండిల్యుఁడు, వసిష్ఠుఁడు మొదలుగాఁ గల మునిసంఘము; ఏకవాచాగతిన్=ఏకవాక్యముగ; నవకల్యాణకరాది దివ్యవరసంతానంబులు– నవకల్యాణకరాది = అపూర్వమగు మంగళకరములైనట్టివగు, దివ్యవర=దేవతాసంబంధులగు వరములయొక్క, సంతానంబులు = సమూహములు; రహిన్=ప్రీతిచేత; ఊన్చెన్=వహింపఁజేసెను. విశ్వామిత్రుఁడు లోనగు మునివర్యు లారాజున కభ్యుదయపరంపరాభివృద్ధిగా నాశీర్వదించి రనుట.

చ. జనవిభుఁడిట్లు దైత్యబల॰జాతజయంబు వహించి దేవతా
జనములచే బహూకృతిని ॰జాల భరించి కడుం దలంచె నె
మ్మనమునఁ జంద్రికాయువతి॰మంజుకటాక్షసమేధితేందిరా
తనయమహాజయం బెపుడు ॰దారునొకో యని కోర్కి మించఁగన్. 152

టీక: ఇట్లు=ఈప్రకారముగా; జనవిభుఁడు=సుచంద్రుఁడు; దైత్యబలజాతజయంబు = రాక్షససైన్యముయొక్క గెల్పును; వహించి = పొంది; దేవతాజనములచేన్ = దేవతాసంఘములచేత; బహూకృతిని = సత్కారమును; చాలన్=మిక్కిలి; భరించి = వహించి; నెమ్మనమునన్=మంచిమనస్సునందు; చంద్రికాయువతిమంజుకటాక్షసమేధితేందిరాతనయమహాజయంబు– చంద్రికాయువతి = చంద్రికయొక్క, మంజు=సుందరమగు, కటాక్ష=నేత్రాంతదృష్టులచేత, సమేధిత=వృద్ధిపొందింపఁబడిన,

ఇందిరాతనయ = మన్మథునియొక్క, మహాజయంబు = గొప్పనైన గెలుపు; ఎపుడు దారునొకో = ఎపుడు కలుగునో, అని = ఈప్రకారముగా, కోర్కి మించఁగన్ = అభిలాష యతిశయించఁగా; కడున్=మిక్కిలి; తలంచెన్=చింతించెను. ఆచంద్రికతో నెప్పుడు సంభోగింతునో యని కోరుచుండె ననుట. ఇటఁ జింత యను ననంగదశగాఁ దెలియునది.

క. ఈలీల నపుడు తత్పాం
చాలీమోహాత్తచిత్త◊సారసుఁడై భూ
పాలాగ్రణి సకలాజర
జాలానుమతిన్ బ్రమోద◊సంతతి మెఱయన్. 153

టీక: అపుడు=ఆసమయమున; ఈలీలన్=ఈప్రకారముగ; భూపాలాగ్రణి = రాజశ్రేష్ఠుఁడు; తత్పాంచాలీమోహాత్తచిత్తసారసుఁడై = ఆచంద్రికయందలిమోహముచేఁ బొందఁబడిన హృదయారవిందము గలవాఁడై; సకలాజరజాలానుమతిన్ = సమస్తదేవతా బృందములయొక్క సమ్మతిచేత; ప్రమోదసంతతి = హర్షాతిశయము; మెఱయన్ = ప్రకాశించుచుండఁగా, దీనికి చనియె నను వ్యవహితోత్తరపద్యస్థక్రియతో నన్వయము. పద్యత్రయ మేకక్రియతో నన్వయించుటవల్ల, 'శ్లో. ద్వాభ్యాం యుగ్మ మితి ప్రోక్తం త్రిభి శ్లోకైర్విశేషకమ్' అను నుక్తలక్షణముచే లక్షితంబగు విశేషకసంజ్ఞ యీపద్యత్రయి కమరుచున్నది.

మ. అనఘోచ్చైస్స్తనకుంభలబ్ధి ఘనవా◊లావాప్తి హీరాభదం
తనిషక్తిన్ నవపద్మభాలసితవ◊క్త్రస్ఫూర్తి రాజిల్లు ప
ద్మిని రూఢానుశయాఢ్యహృత్సరణి భూ◊మిస్వామి దా నెక్కి కాం
చనబంభారభటుల్ తమిస్రవిజయ◊చ్ఛాయన్ బ్రబోధింపఁగన్. 154

టీక: భూమిస్వామి = భూపతియగు సుచంద్రుఁడు;అనఘోచ్చైస్స్తనకుంభలబ్ధిన్ – అనఘ=ఒచ్చెములేని, ఉచ్చైస్స్తన=మిక్కిలి గొప్పనైన, కుంభ=కుంభస్థలముయొక్క,లబ్ధిన్=ప్రాప్తిచేత; ఉచ్చైః=మిట్టలైన,స్తనకుంభ=కలశములవంటికుచములయొక్క, లబ్ధిన్=ప్రాప్తిచేత నని యర్థాంతరధ్వని; ఘనవాలావాప్తిన్ – ఘన=గొప్పదియైన, వాల=పుచ్ఛముయొక్క, ఆవాప్తిన్=ప్రాప్తి చేత, గొప్పతలవెండ్రుకల ప్రాప్తిచేత నని యర్థాంతరము; హీరాభదంతనిషక్తిన్ = వజ్రసమమగు దంతములయొక్క సంబంధము చేత నని ఉభయత్ర అన్వయము; నవపద్మభాలసితవక్త్రస్ఫూర్తిన్ – నవ=నూతనములగు, పద్మ=సిబ్బెపుబొట్టులయొక్క, భా= కాంతిచేత, లసిత = ప్రకాశించుచున్న, వక్త్రస్ఫూర్తిన్=ముఖప్రకాశముచేత; నవ=నూతనమగు, పద్మ=కమలముయొక్క, భా= కాంతిచేత, లసిత = ప్రకాశించుచున్న, వక్త్రస్ఫూర్తిన్=ముఖప్రకాశముచేత నని యర్థాంతరము; రాజిల్లు పద్మినిన్ = ప్రకాశించు చున్న ఆఁడేనుఁగును, పద్మినీజాతిస్త్రీ నని యర్థాంతరము; రూఢానుశయాఢ్యహృత్సరణిన్ – రూఢ=అధికమగు, అనుశయ = ద్వేషముచేత, ఆఢ్య=సమృద్ధమైన, హృత్సరణిన్=హృత్ప్రదేశముతో, అరతిచేత ననుట, అరతి యనఁగా ననంగదశావిశే షము; తాన్; ఎక్కి=అధిష్ఠించి; కాంచనబంభారభటుల్ =స్వర్ణమయభేరులయొక్క నినాదములు; తమిస్రవిజయచ్ఛాయన్ = తమిస్రాసురజయప్రకాశమును; ప్రబోధింపఁగన్=బోధించుచుండఁగా. దీనికి 'చనియె' నను ఉత్తరపద్యస్థక్రియతో నన్వయము. అనఁగా పద్మిని చంద్రికాలక్షణములతోఁ గూడియుండుటం జేసి తత్స్మరణప్రయుక్తమైన యరతితో దాని నెక్కె నని భావము.

చ. అలఘుఝరీతరంగవిభవాతిశయంబు కనద్వనీలతా
వలిమహిమల్ సరోలలితవారిజవైఖరియున్ నగోజ్జ్వల
జ్జలదమహంబు తన్మహిపచంద్రసుతాంగవిభావిలాసముల్
దెలుపఁగఁ గాంచుచున్ జనియెఁ ద్రిమ్మరునెమ్మదితోడ వీటికిన్. 155

టీక: అలఘుఝరీతరంగవిభవాతిశయంబు – అలఘు = అధికమగు, ఝరీ=సెలయేళ్లయొక్క, తరంగ=అలలయొక్క, విభవాతిశయంబు = సంపత్సమృద్ధి; కనద్వనీలతావలిమహిమల్ – కనత్=ప్రకాశించుచున్న, వనీ=వనములయందున్న, లతా = తీవెలయొక్క, ఆవలి = పంక్తులయొక్క, మహిమల్=అతిశయములు; సరోలలితవారిజవైఖరియున్ – సరః=సరస్సులందలి, లలిత=ఒప్పుచున్న, వారిజ=పద్మములయొక్క, వైఖరియున్=విధమును; నగోజ్జ్వలజ్జలదమహంబు – నగ=పర్వతముల యందు, ఉజ్జ్వలత్=ప్రకాశించుచున్న, జలద=మేఘములయొక్క, మహంబు =విలాసము; తన్మహిపచంద్రసుతాంగవిభావిలాసముల్ – తన్మహిపచంద్రసుతా = ఆరాజకుమారియగు చంద్రికయొక్క, అంగవిభావిలాసముల్=అంగములయొక్క కాంతి విశేషములను; తెలుపఁగన్=స్మరింపఁజేయుచుండఁగా; కాంచుచున్ = చూచుచు; త్రిమ్మరునెమ్మదితోడన్ = మిక్కిలి చలించు చున్న నిండుమనస్సుతోడ; వీటికిన్=నిజరాజధానికి; చనియెన్ = పోయెను. అనఁగా తరంగ,లతా,పద్మ,జలదములు చంద్రిక యొక్క వళులను,బాహువులను,కన్నులను,కొప్పును స్మరింపఁజేయుచుండఁగాఁ జూచుచుం బోయె నని భావము.

చ. తనపుర మంతఁ జేరి వసుధాపతి భోటవరాటలాటము
ఖ్యనిఖిలదేశభూపతుల నంచి నిజాంచితహైమమందిరం
బెనసి యనీహ మించ దినకృత్యము లూన్చి విలాసహర్మ్యమౌ
ళి నలరుశయ్య నప్డు పవళించె నృపాలసుతైకమోహతన్. 156

టీక: అంతన్=అటుపైని; వసుధాపతి=సుచంద్రుఁడు; తనపురము=తనపత్తనమును; చేరి = పొంది; భోటవరాటలాటముఖ్య నిఖిలదేశభూపతులన్ = భోటవరాటలాటాదిసమస్తదేశప్రభువులను; అంచి = పంపి; నిజాంచితహైమమందిరంబు – నిజ = తన దగు, అంచిత=పూజ్యమయిన,హైమమందిరంబు = బంగరుమేడను; ఎనసి = పొంది; అనీహ = అరతి యను మన్మథావస్థ; మించన్=అతిశయింపఁగా;దినకృత్యములు=అవశ్యాచరణీయములగు సంధ్యాదికార్యములను; ఊన్చి=చేసి; విలాసహర్మ్య మౌళిన్=క్రీడాసౌధశ్రేష్ఠమందు; అలరుశయ్యన్=పువ్వుపఱుపునందు; నృపాలసుతైకమోహతన్ =చంద్రికయందు ముఖ్యమైన ప్రీతిగలవాఁడగుటచేత; అప్డు = ఆసమయమున; పవళించెన్ = శయనించెను.

ఆశ్వాసాంతపద్యములు

మ. ప్రతిమాతీతగభీరతావిజితపారావార, రావారసం
యతనానాశరకర్ణకోటరపృషత్కాసార, కాసారజాం
చితనేత్రాజనతామనోహరమహాశృంగార, శృంగారసం
భృతమార్గైకవిహారలాలసమనోబృందార, బృందారతా! 157

టీక: ప్రతిమాతీతగభీరతావిజితపారావార – ప్రతిమాతీత=సాటిలేనట్టి, గభీరతా=గాంభీర్యముచేత, 'గాంభీర్య మవికార స్స్యాత్ సత్యపి క్షోభకారణే' అని తల్లక్షణము, విజిత=గెలువఁబడిన, పారావార =సముద్రముగలవాఁడా! రావారసంయతనానాశరకర్ణకోటర పృషత్కాసార – రావ=ధ్వనిచేత, అర=శీఘ్రముగా, సంయత=నిరోధింపఁబడిన, నానా = వివిధములైన, ఆశర =రాక్షసులయొక్క, కర్ణకోటర=కర్ణరంధ్రములుగల, పృషత్క=బాణములయొక్క,ఆసార = వర్షధార గలవాఁడా! కాసారజాంచితనేత్రా జనతామనోహరమహాశృంగార – కాసారజ=పద్మములవలె, అంచిత=ఒప్పుచున్న, నేత్రా= కన్నులుగల స్త్రీలయొక్క, జనతా=సంఘములకు, మనోహర=మనోజ్ఞమగు, మహత్=అధికమైన, శృంగార =అలంకారములుగలవాఁడా! శృంగారసంభృత మార్గైకవిహారలాలసమనోబృందార – శృంగార=శృంగారరసముచేత, సంభృత=మిగులఁ బోషింపఁబడిన, మార్గ =మార్గమునందలి, ఏక=ముఖ్యమగు, విహార=క్రీడయందు, లాలస=ఆసక్తిగల, మనః=మనస్సుగల, బృందార= దేవుఁడా! బృందారతా = బృందాదేవియందు రతుఁడగువాఁడా! ఈకృతిపతిసంబోధనములకు, నుత్తరపద్యములందలి తత్సంబోధనములకును 'ఇది' యను నాశ్వాసాంతిమగద్యముతో నన్వయము.

క. రణభీమ! భీమనుతవా, రణవిజయైకాభిరామ! ౦రామాత్మకకా
రణధామ! ధామనిధికై,రణరాజద్భామ! భామ౦రహితాచరణా! 158

టీక: రణభీమ = యుద్ధమున భయంకరుఁడవైనవాఁడా! భీమనుతవారణవిజయైకాభిరామ – భీమ=శివునిచేత, నుత=కొనియాడఁబడిన, వారణ=కువలయాపీడమను గజముయొక్క, విజయ = గెలుపుచేత, ఏక=ముఖ్యమగునట్లుగా, అభిరామ = ఒప్పెడువాఁడా! రామాత్మకకారణధామ – రామా=స్త్రీలయొక్క, ఆత్మ=మనస్సులయొక్క, క=సుఖమునకు, కారణ=హేతువగు, ధామ=దేహముగలవాఁడా! 'ధామ దేహే గృహేపి చ' అని విశ్వము; ధామనిధికైరణరాజద్భామ – ధామనిధి=సూర్యునియొక్క,కైరణ=కిరణసంఘముభంగి, రాజత్=ప్రకాశించుచున్న, భామ=దీప్తిసంపదగలవాఁడా! భామరహితాచరణా =క్రోధరహితమగు నాచరణముగలవాఁడా! ఈ రెండుపద్యములందును ముక్తపదగ్రస్తమను శబ్దాలంకారము.

కవిరాజవిరాజితము. నరకవిభేదన, నారజఖాదన, ౦నారదవాదనకేళి, దరీ,
యరిగణశాదనవారుణపాద, న౦యాంచితవాదన, భూరిదరీ
చరరిపుమాద, నరాశ్వవిచోదన, ౦సారఫలార్జనవార్జహరీ,
పరనిజపాదనతావన, రాదన౦భాజితకుంద, నరేశ, హరీ! 159

టీక: నరకవిభేదన = నరకాసురనకు భేదకుఁడైనవాఁడా! నారజఖాదన = అగ్నిభక్షకుఁడవైనవాఁడా! నారదవాదనకేళి = నారదునియొక్క వీణావాద్యమందుఁ గ్రీడగలవాఁడా! దరీ=శంఖముగలవాఁడా! అరిగణశాదనవారుణపాద = అరిగణ మనెడు పంకమునకు నూతనసూర్యరూపుఁడవైనవాఁడా! నయాంచితవాదన =నీతియుక్తమైన వచనముగలవాఁడా! భూరిదరీచరరిపుమాద – భూరి=అధికములగు, దరీ=గుహలయందు, చర=సంచరించుచున్న, రిపు=శత్రువులయొక్క, మా=సిరిని, ద= ఖండించినవాఁడా! నరాశ్వవిచోదన = అర్జునునియొక్క గుఱ్ఱములను దోలువాఁడా, అనఁగా పార్థసారథియైనవాఁడా! సారఫలార్జనవార్జహరీ – సార=శ్రేష్ఠమగు, ఫల=మోక్షాదిఫలముయొక్క, ఆర్జన=సంపాదన మనెడు, వార్జ=కమలములకు, హరీ = సూర్యరూపుఁడవైనవాఁడా! పరనిజపాదనతావన = శ్రేష్ఠములగు తనయొక్క పాదములయందు నతులైనవారిని రక్షించు

వా(డా! రాదనభాజితకుంద – రాదన=దంతసంబంధమైన, భా=కాంతిచేత, జిత=జయింప(బడిన, కుంద=మొల్లలుగలవా(డా! నరేశ = పురుషోత్తము(డా! హరీ =మదనగోపాలస్వామీ!

గద్య: ఇది శ్రీమదనగోపాలప్రసాదసమాసాదితోభయభాషాకవిత్వకళాకళత్ర రేచర్లగోత్రపవిత్ర సురభిమల్లక్షమాపాలసత్పుత్ర కవిజనవిధేయ మాధవరాయప్రణీతం బైన చంద్రికాపరిణయంబను మహాప్రబంధంబునందు(దృతీయాశ్వాసము.

గద్యము: ఇది శ్రీసతీరమణకరుణాసమాసాదిత సర్వసౌభాగ్య, భాగ్యనగరమహారాజ్యసంకలిత శ్రీజటప్రోలు సంస్థానప్రాజ్యసకలసామ్రాజ్య, శ్రీరేచర్లగోత్రపవిత్ర కవిజనగేయ శ్రీవేంకటజగన్నాథరాయ సత్పుత్ర, సత్సంప్రదాయ, శ్రీసురభి వేంకటలక్ష్మణరాయ పరిపోష్య, సరసవైదుష్య, తదాస్థానతలమండిత శేషసదాశివపండిత విరచిత శరదాగమసమాఖ్య వ్యాఖ్యయందు తృతీయాశ్వాసము సంపూర్ణము.

శ్రియై నమః

శ్రీలక్ష్మీనరసింహాయ నమః

చంద్రికాపరిణయము-సవ్యాఖ్యానము

చతుర్థాశ్వాసము

క. కమలాకుచకలశతటీ
విమలాంచితమృగమదాభి◊విలసన్ముద్రా
కమలామతికృల్లాంఛన
విమలాలసరిపువిభేద◊విధ గోపాలా! 1

టీక: కమలాకుచకలశతటీవిమలాంచితమృగమదాభివిలసన్ముద్రాకమలామతికృల్లాంఛన – కమలా=లక్ష్మీదేవియొక్క, కుచ కలశతటీ = కలశములవంటి కుచములతటమందలి, విమల=నిర్మలమై, అంచిత=ఒప్పుచున్నదియైన, మృగమద=కస్తూరి యొక్క, అభివిలసత్=ప్రకాశమానమగు, ముద్రా=గుర్తుయొక్క,కమలా=సంపత్తియొక్క,మతి=బుద్ధిని, కృత్=చేయుచున్న, లాంఛన = శ్రీవత్సము గలవాఁడా! విమలాలసరిపువిభేదవిధ– విమల=విశేషపాపముగల, అలస=ధర్మమునందలసులైన, రిపు = శత్రువులయొక్క, విభేద=భేదనము,విధ =రీతిగాఁగలవాడా! గోపాలా= శ్రీమదనగోపాలస్వామీ! ఈకృతిపతి సంబోధనము నకు 'చిత్తగింపు'మను నుత్తరపద్యస్థక్రియతో నన్వయము.

తే. చిత్తగింపుము శౌనకా◊ద్యుత్తమర్షి
సమితి కిట్లను రోమహ◊ర్షణతనూజుఁ
డంత రంగద్వధూమోహ◊మన్నృపాలు
డంతరంగస్థలంబున◊నతిశయిల్ల. 2

టీక: చిత్తగింపుము = ఆకర్ణింపుము; శౌనకాద్యుత్తమర్షిసమితికిన్ = శౌనకుఁడు మొదలగు శ్రేష్ఠులగు మునిసంఘమునకు; రోమ హర్షణతనూజుఁడు = సూతుఁడు; ఇట్లనున్=వక్ష్యమాణప్రకారముగాఁ బలుకును; అంతన్=అటుతరువాత; రంగద్వధూమో హము– రంగత్=ఒప్పుచున్న, వధూ=చంద్రికయందలి, మోహము=అభిలాషము; అంతరంగస్థలంబునన్ =మనస్సునందు; అతిశయిల్లన్=మించఁగా; అన్నృపాలుఁడు=ఆరాజు. దీనికి 'అనుచుఁ దలపోయుచుండు' నను నుత్తరపద్యస్థక్రియతో నన్వ యము. ఈపద్యమందు యమకాలంకారము. ఇట్లీయాశ్వాసమం దంతటను యమకాలంకారంబు ప్రధానంబుగ నగును. 'స్వర వ్యఞ్జనసముదాయ పౌనరుక్త్యం యమకమ్' అని వాత్స్యాయనసూత్రము.

సీ. వరియించు టెన్నఁడో◊వరమనోమోదంబు, నలువార రాజక◊న్యాలలామ,
విహరించు టెన్నఁడో◊గృహవన్య నాతిమి,న్నలు వారక భజింపఁ◊గలికిఁ గూడి,

నెలకొల్పు టెన్నఁడో ◊నిశితపాణిరుహాంక,నలు వారణేంద్రయా ◊నాకుచములను,
దేలించు టెన్నఁడో ◊హాళిఁ గ్రొంజెమటసో,నలు వాఱ నెలఁతఁ గం◊దర్పకేళిఁ,
తే. జెలువ మరుపోరు వెనుక సొ ◊మ్ముల నలర్చి, చెలు వమరురక్తి నెన్నఁడో ◊కలిసియుండు
టనుచుఁ దలపోయుచుండుఁ దా ◊నాత్తచంద్రి,కాభిలాషానుగుంభిత◊స్వాంతుఁ డగుచు. 3

టీక: రాజకన్యాలలామన్=చంద్రికను; వరమనోమోదంబు=శ్రేష్ఠమగు మనస్సంతోషము; నలువారన్=ఒప్పఁగా; వరియించు టెన్నఁడో = వివాహమాడుట యెన్నఁడో?

గృహవన్యన్=సదనోద్యానమందు; నాతిమిన్నలు = స్త్రీరత్నములు; వారక =ఎడదెగక; భజింపన్ = కొలుచుచుండఁగా; కలికిన్ కూడి = చంద్రికను గూడి; విహరించు టెన్నఁడో = క్రీడించు టెన్నఁడో?

వారణేంద్రయానాకుచములను = గజేంద్రగమన యగు చంద్రికయొక్క స్తనములయందు, నిశితపాణిరుహాంకనలు—నిశిత= తీక్ష్ణములగు, పాణిరుహ=గోళ్ళయొక్క, అంకనలు = చిహ్నములను, నెలకొల్పు టెన్నఁడో = చేయు టెన్నఁడో?

నెలఁతన్ = చంద్రికను; కందర్పకేళిన్ = అనంగక్రీడయందు; హాళిన్=ప్రీతిచేత; క్రొంజెమటసోనలు = నూతనస్వేదాసారములు; పాఱన్=ప్రవహింపఁగా, ఇట సంధివశమున పకారమునకు వకారము వచ్చినది. అలఘురేఫమైనను యమకమునకు బాధ లేదు; తేలించు టెన్నఁడో = తృప్తిపొందించు టెన్నఁడో?

చెలువన్=చంద్రికను; మరుపోరు వెనుకన్ = సురతానంతరమందు; సొమ్ములన్=ఆభరణములచేతను; అలర్చి=సంతోషింపఁ జేసి; చెలువు అమరురక్తిన్ = ఒప్పిదమగు ప్రీతిచేత; కలిసియుండుట = కూడియుండుట; ఎన్నఁడో = ఏనాఁడో? అనుచున్ = ఇట్లనుచు; తాన్ = సుచంద్రుఁడు; ఆత్తచంద్రికాభిలాషానుగుంభితస్వాంతుఁడు – ఆత్త=పొందఁబడిన, చంద్రికాభిలాష=చంద్రికా విషయమైన యనురాగముచేత, అనుగుంభిత=కూర్పఁబడిన, స్వాంతుఁడు = చిత్తముగలవాఁడు; అగుచున్; తలపోయు చుండున్ = చింతించుచుండును.

ఇచటఁ జింత యను ననంగదశావిశేషము గదితంబయ్యె. 'శ్లో. కే నోపాయేన సంసిద్ధ్యే త్కదా తేన సమాగమః, దూతీ ముఖేన కింవాచ్య మిత్యాద్యూహస్తు చిన్తనమ్' అని తల్లక్షణంబు. ఇట 'కదా వారాణస్యా మమరతటనీరోధసి వసన్, వసానః కౌపీనం శిరసి నిదధానోఞ్జలిపుటమ్' అనుచోట శాంతమునకువలె శృంగారరసమునకు ఎన్నఁడో అను పదములచే సూచిత మగు చింతాఖ్యవ్యభిచారభావమంగ మగుటంజేసి ప్రేయోలంకారమగును. ఇదియే భావాలంకార మనఁబడును.

చ. లలి మదిఁ జాల మించ నవ◊లా! నవలాలితకంతుకల్యనా
విలగతిఁ బ్రోవ కున్కి దగ◊వే తగ వేమరు కౌఁగిలింతచేన్
గలయక యున్నఁదాళఁ గల◊నా కలనాద! యటంచుఁ బల్కు భూ
తలపతిమారశారపవి◊తాపవితానము మేనఁ గూరఁగన్. 4

టీక: మదిన్=చిత్తమందు; లలి=ప్రేమము; చాలన్=మిక్కిలి; మించన్=అతిశయింపఁగా; నవలా=ఓతరుణీ! నవలాలితకంతు కల్యనావిలగతిన్ – నవ=నూతనమైన, లాలిత=ఆదరింపఁబడిన, కంతుకలి=సురతమందలి, అనావిలగతిన్=అకలుషస్థితి చేత; ప్రోవకున్కి=రక్షింపకుండుట; తగవే= న్యాయమా? న్యాయము గాదనుట; తగన్=ఒప్పునట్లుగా; వేమరున్=సారెకు; కౌఁగిలింతచేన్=ఆలింగనముచే; కలయక యున్నన్ = కూడకయున్న యెడ; కలనాద = అవ్యక్తమధురస్వనముగలదానా!

తాళఁ గలనా = ఓర్వఁగలనా? అటంచున్ = అట్లనుచు; భూతలపతి= రాజగు సుచంద్రుఁడు; మారశారపవితాపవితానము– మార=మన్మథునియొక్క, శారపవి=వజ్రమువంటి శరసంఘముచేతనైన, తాపవితానము= తాపపరంపర; మేనన్=శరీరమున; కూరఁగన్=ఘటిల్లఁగా; పల్కున్=వచించును.

సీ. అహిరోమలతికపొంᳲదందినఁ గాని నొం,పఁగ రాదు మలయాగᳲమారుతములఁ,

గనకాంగికౌఁగిలిᳲయెనసినఁ గాని పెం,పఁగ రాదు మధుపభాᳲమారుతముల,

ఘనవేణిఁ గూడి మింᳲచినఁ గాని రూపుదూ,ల్పఁగ రాదు శశభృన్నᳲవప్రకరముల,

వనజారివదనఁ జేᳲరినఁ గాని సిరు లడం,పఁగ రాదు వనసంభᳲవప్రకరముల,

తే. ననుచు రాజీవనేత్రమోᳲహంబు చాల

ననుచు రాజీవసాయకాᳲనల్పభయము

మలయ గాహితచింతమైఁ ᳲగలఁగఁ జిత్త

మల యగాహితనిభుఁడు తాᳲపాప్తి నడల. 5

టీక: అహిరోమలతికపొందు =సర్పతుల్యమగు నూఁగారు గల చంద్రికయొక్క సాంగత్యమును; అందినఁ గాని = పొందిననే గాని; మలయాగమారుతముల = మలయాచలసంబంధులగు గాడ్పులను; నొంపఁగ రాదు = నొప్పించుట కలవిగాదు. అనఁగా చంద్రిక సర్పతుల్యమైన రోమావళి గలది గావున తత్సాంగత్యమున వాయువును గెలువ వచ్చు ననుట. సర్పములు వాతాశనము లగుట ప్రసిద్ధము.

కనకాంగికౌఁగిలి = సంపెఁగనుబోలు నంగములు గలదానియొక్క యాలింగనమును; ఎనసినఁ గాని = పొందినఁగాని; మధుపభామారుతములన్ = ఆఁడుతుమ్మెదలయొక్క రొదలను; పెంపఁగరాదు = నశింపఁజేయుట కలవి గాదు. చంద్రిక చంపకాంగి గావున దానికౌఁగిటఁ జేరినచో తేంట్ల నడఁపవచ్చు ననుట. సంపెఁగకు తేంట్లకు గల విరోధము ప్రసిద్ధము.

ఘనవేణిన్= మేఘమువంటి జడగలదానిని; కూడి = పొంది; మించినన్ కాని = అతిశయించిననే కాని; శశభృన్నవప్రకరములన్ = చంద్రునియొక్క నూతనమగు ప్రకృష్టకిరణములను; రూపుదూల్పఁగ రాదు = రూపుమాప నలవిగాదు. చంద్రిక జలదము వంటివేణి గలదిగావున దానిసాంగత్యమునఁ జంద్రకిరణములఁ గప్పవచ్చు ననుట.

వనజారివదనన్=చంద్రునిఁబోలు మోముగలదానిని; చేరినన్ కాని=పొందిననేకాని; వనసంభవప్రకరములన్=తమ్ములయొక్క సమూహములయందు; సిరులడంపఁగ రాదు =కాంతుల నడఁచుటకు నలవిగాదు. చంద్రిక చంద్రునివంటి మోముగలది గావున దానిఁ జేరి కమలముల సిరుల నడంప వచ్చు ననుట.

అనుచున్=ఇట్లు వచించుచు; రాజీవనేత్రమోహంబు = చంద్రికయందలి యనురాగము; చాలన్=మిక్కిలి; ననుచు రాజీవసాయ కానల్పభయము– ననుచు = వృద్ధిఁబొందించుచున్న, రాజీవసాయక=మరునివలననైన, అనల్పభయము=అధికమైన భీతి; మలయన్=ఉద్రేకింపఁగా; గాహితచింతమైన్ = పొందఁబడినచింతచేత; చిత్తము=హృదయము; కలఁగన్=కలఁతపాఱఁగా; అల యగాహితనిభుఁడు= ఇంద్రతుల్యుఁడైన యాసుచంద్రుఁడు; తాపాప్తిన్=సంతాపప్రాప్తిచేత; అడలన్=తపింపఁగా. దీనికి 'తనర్చెన్' అను నుత్తరపద్యస్థక్రియతో నన్వయము.

చ. నరపతిధైర్యభంగము ద◊నర్చె నవీనరతీశధాటిఁ గై
కరభసలీల చందనన◊గచ్యుతమారుతపాళి చాంద్రదు
ష్కరభ సలీలకోకిలని◊కాయశుకవ్రజశారికాసము
త్కరభసలీలసద్ధ్వనివి◊ధానము లత్తఱిఁ జిత్రవర్తనన్. 6

టీక: అత్తఱిన్=ఆసమయమున; చిత్రవర్తనన్= ఆశ్చర్యకరమగు రీతిచేత; నవీనరతీశధాటిన్ = నూతనమైన మరుని జైత్రయాత్రయందు; కైకరభసలీల – కైక=కేకిసంబంధియగు, కేకిశబ్దముమీఁద సంబంధార్థమందణ్ప్రత్యయము, రభసలీల = హర్షక్రియ, 'రభసో వేగ హర్షయోః', 'లీలా విలాస క్రియయోః' అని విశ్వము; చందననగచ్యుతమారుతపాళి – చందననగ =మలయపర్వతమునుండి, చ్యుత=జాఱిన, వెడలిన యనుట, మారుతపాళి=తెమ్మెరలగుంపు; చాంద్రదుష్కరభ = చంద్రుని సంబంధియగు ననివార్యమైన కాంతి; సలీలకోకిలనికాయశుకవ్రజశారికాసముత్కరభసలీలసద్ధ్వనివిధానములు – సలీల= విలాసముతోఁ గూడినదగు, కోకిలనికాయ=పికసముదాయముయొక్కయు,శుకవ్రజ=చిలుకలగుంపుయొక్కయు, శారికాసముత్కర =గోరువంకలగుంపుయొక్కయు, భసలీ=తుమ్మెదలయొక్కయు,లసత్=ఒప్పుచున్న, ధ్వనివిధానములు = ధ్వనియొనర్చుటలు; నరపతిధైర్యభంగము = రాజుయొక్క ధైర్యముడుగుటను; తనర్చెన్=చేసెను.

రాజున కుదయించిన చంద్రికావిషయక మైనయనురాగము మలయానిలచంద్రికాకోకిలాలాపాది సహకారి కారణ సమవధానమున మిగుల నుద్దీపిత మయ్యె ననుట. 'తటస్థా శ్చన్ద్రికాధారా గృహచన్ద్రోదయా వపి, కోకిలాలాప మాకన్ద మన్దమారుత షట్పదాః, లతామణ్డప భూ గేహదీర్ఘికా జలదారవాః, ప్రాసాదగర్భసంగీత క్రీడాద్రి సరిదాదయః' అని తటస్థోద్దీపనవిభావములు గదితంబు లయ్యె. 'ఉద్దీపనవిభావాస్తు రసముద్దీపయన్తి యే' అని యుద్దీపనవిభావలక్షణము. 'విభావః కథ్యతే తత్ర రసోత్పాదనకారణమ్' అని విభావలక్షణములోనగునవి వెనుక సవిస్తరముగ వ్రాయంబడియె.

సీ. ఘనసింహగతికి స్రు◊క్కనిదిట్ట హంసవీ,క్షణదారకవ్రాత◊గతికి బెదరు,
దనుజాస్త్రకీలి కో◊ర్చినమేటి పూర్ణిమా,క్షణదారమణహేతి◊జాతి కడలుఁ,
గలిరవాళికిఁ గలం◊గనిదంట కిసలభ,క్షణదారనిస్వన◊చ్ఛటకుఁ దెరలుఁ,
దామిస్రశస్త్రిఁ గుం◊దనిసామి విరహిహృ,త్క్షణదారయుతమార◊శస్త్రి నొదుఁగు,
తే. నఖిలలేఖావగీర్ణన◊వాజిరాజి,తాజరారిధనుర్ముక్త◊వాజిరాజి
దోడ్త మయి నాట నలఁగని◊దొర యనలగు,రూత్కరము గాత్రసీమయం◊ దొరయ నలఁగు. 7

టీక: ఘనసింహగతికిన్=గొప్పనైన సింహముయొక్క గమనమునకు; స్రుక్కనిదిట్ట = వెనుదీయని ధైర్యముగలవాఁడు; హంసవీక్షణదారకవ్రాతగతికిన్ – హంస=హంసలయొక్క,వీక్షణదారక=దృష్టిభేదకమగు, వ్రాత=సంఘములయొక్క, గతికిన్ =గమనమునకు; బెదరున్ =భయపడును.

దనుజాస్త్రకీలికిన్ =రాక్షసబాణవహ్నికి; ఓర్చినమేటి = సహించిన యధిపుఁడు; పూర్ణిమాక్షణదారమణహేతిజాతికిన్ – పూర్ణిమా=పున్నమయందలి, క్షణదారమణ=చంద్రునియొక్క, హేతిజాతికిన్ = కాంతిపుంజమునకు; అడలున్=వెఱచును.

కలిరవాళికిన్ = రణసంబంధియగు ధ్వనిపరంపరకు; కలంగనిదంట = కలఁతనొందని దిట్టతనముగలవాఁడు; కిసలభక్షణదార

నిస్వనచ్ఛటకున్ – కిసలభక్షణదార=ఆఁడుకోయిలలయొక్క, నిస్వనచ్ఛటకున్=నాదపరంపరకు; తెరలున్=చలించును. తామిస్రశస్త్రిన్ = తమిస్రాసురసంబంధియగు చురకత్తికి; కుందనిసామి =దుఃఖింపనిభూపతి; విరహిహృత్క్షణదారయుతమారశస్త్రిన్– విరహిహృత్=విరహవంతులహృదయముయొక్క, క్షణ=ఉత్సవములను, ద=ఖండించెడు, అర=వేగముతో, యుత =కూడియున్న, మారశస్త్రిన్=మన్మథుని ఆయుధముచేత; ఒదుఁగున్=తొలఁగును.

అఖిలలేఖావగీర్ణనవాజిరాజితాజరారిధనుర్ముక్తవాజిరాజి– అఖిలలేఖ=సమస్తదేవతలచేత, అవగీర్ణ=పొగడఁబడిన, నవ= నూతనమైన, ఆజి=యుద్ధమందు, రాజిత=విలసిల్లినట్టి, అజరారి=రాక్షసులయొక్క, ధనుః=ధనుస్సులచేత, ముక్త=విడువఁబడిన, వాజి=బాణములయొక్క, రాజి=పరంపర; తోడ్తన్=వెంటనే; మయిన్=శరీరమందు; నాటన్=నాటఁగా; నలఁగనిదొర =శ్రమపడని రాజు;అనలగురూత్కరము=వాయుసంఘము, అగ్ని వాయువువలనఁ బుట్టినట్లు శ్రుతిప్రసిద్ధమగుటవలన వాయు వనలగురు వని చెప్పఁబడియె; గాత్రసీమయందున్=శరీరప్రదేశమందు; ఒరయన్=ఒరసికొనఁగా; నలఁగున్=శ్రమపడును.

చ. నిరతము వ్రాయు నాహరిణనేత్రతలంబు నవామలాలస
స్ఫురణ విభుండు దృగ్యుగళముం గరముం గురులున్ మొగంబునున్
వెర దొరయింప నాహరిణనేత్రతలంబున వామలాలస
త్సరసిజమందిరాతనయశాంబరికాకృతమోహరేఖనాన్. 8

టీక: విభుండు = సుచంద్రుఁడు; ఆహరిణనేత్రతలంబునన్ = మిగులశుభ్రమైనవస్త్రతలమునందు; నవామలాలసస్ఫురణన్– నవ=నూతనమైన, అమల=స్వచ్ఛమైన, అలసస్ఫురణన్ = ఆలస్యస్ఫురణముచేత; ఆహరిణనేత్రతలంబు = హరిణాక్షి యగు నాచంద్రికయొక్క స్వరూపమును, 'తలం స్వరూపాధరయోః' అని విశ్వము; దృగ్యుగళమున్ = కన్నుఁగవయు; కరమున్=హస్తమును; కురులున్=వెండ్రుకలును; మొగంబునున్=ముఖమును; వెర దొరయింపన్ = విరహదుఃఖము పుట్టింపఁగా; వామలాలసత్సరసిజమందిరాతనయశాంబరికాకృతమోహరేఖనాన్– వామ=ప్రతికూలమైన, లాలసత్=మిగులఁ బ్రకాశించుచున్న, సరసిజమందిరాతనయ = శ్రీపుత్త్రుఁడైన మరునియొక్క,శాంబరికా=మాయచేత, కృత= చేయఁబడిన, మోహరేఖనాన్ = మోహపరంపర యనఁగా; నిరతము = ఎల్లప్పుడు; వ్రాయున్=లిఖించును. అనఁగాఁ గాలక్షేపార్థము ప్రియురాలిని వ్రాయఁగాఁ, దదంగములు, కన్నులు కలువలను బోలినవి కరములు చిగురులను బోలినవి కురులు తుమ్మెదలను బోలినవి ముఖము పద్మమును బోలినది యగుటంజేసి, మదనమాయాప్రాతికూల్యముచేత భయావహము లయ్యె ననుట.

చ. ఎనసినరాగసంపద నరేశిత తా హితచంద్రికావధూ
తనురుచిఁ గాంచి మోహభృతిఁ దాల్చిన నాయెడనుండి కీరభూ
రినినదభంగిఁ గుందు, బళిరే! సితతాహితచంద్రికావధూ
తనిజధృతిన్ భ్రమించు, మదిఁ దార్కొనుచింతఁ గలంగు నెంతయున్. 9

టీక: నరేశిత=రాజు; ఎనసినరాగసంపదన్=పొందిన రాగాతిశయముచేత; తాన్=తాను; హితచంద్రికావధూతనురుచిన్ = హితమైన చంద్రికావధువుయొక్క తనుకాంతిని; కాంచి=చూచి; మోహభృతిన్=మోహపరిపోషణమును; తాల్చిన నాయెడనుండి = వహించినప్పటినుండి; కీరభూరినినదభంగిన్– కీర=శుకములయొక్క, భూరి=అధికమైన, నినదభంగిన్=ధ్వనిప్రకారము

చేత; కుందున్=దుఃఖించును; బళిరే = ఆశ్చర్యము! సితతాహితచంద్రికావధూతనిజధృతిన్– సితతా=శుభ్రత్వముచేత, హిత= మనోజ్ఞమైన, చంద్రికా=వెన్నెలచేత, అవధూత=పోఁగొట్టఁబడిన, నిజధృతిన్= తనయొక్క ధైర్యముచేత; భ్రమించున్=తిర్గును; మదిన్ = చిత్తమునందు; తార్కొనుచింతన్ = పొందునట్టి చింతచేత; ఎంతయున్=మిక్కిలి; కలంగున్=కలఁతపడును. అనఁగా సుచంద్రుఁడు చంద్రికయందలి యనురాగము దాల్చిననాటనుండి శుకధ్వనులు లోనగువానికిఁ గుందుచుండు ననుట.

సీ. తనువేల తావకో◊దార స్తనవసుధా,ధర పాళిఁ గౌఁగిటఁ ◊దార్పకున్న,
శ్రుతు లేల భవదుదం◊చితగాన నవసుధా,ద్వీపికోర్మి రుతముల్ ◊వినక యున్నఁ,
గనుదోయి యేల నీ◊గాత్రాంచన వసు ధా,లంధల్య విభవముల్ ◊గాంచ కున్న,
ఘ్రాణ మేల త్వదాస్య◊రాకార్జునవసు ధా,మక సుగంధ శ్రేణి ◊ మరగ కున్న,
తే. రసన యిది యేల నీయోష్ఠ◊రమ్య మధుర
సోత్కరము వేడ్కఁ గ్రోలక ◊యున్న మధుర
వాణి యని పల్కుఁ బతి యాత్మ ◊వఱల మధు ర
మాధిపసుతోత్థ తాపజా◊తాసమధుర. 10

టీక: పతి=భూపతి యగు సుచంద్రుఁడు; మధురవాణి=తీయనిపలుకులగలదానా! తావకోదారస్తనవసుధాధరపాళిన్ – తావక = నీసంబంధియగు, ఉదార=ఉత్కృష్టములగు, స్తనవసుధాధర=గిరులవంటి స్తనములయొక్క, పాళిన్=ప్రదేశమును; కౌఁగిటన్ = భుజాంతరమందు; తార్పకున్నన్= చేర్పకున్న యెడ; తనువేల = శరీరమేల?

భవదుదంచితగాననవసుధాద్వీపికోర్మిరుతముల్—భవత్= నీయొక్క, ఉదంచిత=ఉత్కృష్టమైన, గాన=గీతములనెడు, నవ= అపూర్వమైన, సుధాద్వీపికోర్మి= అమృతనదీతరంగములయొక్క,రుతముల్=ధ్వనులను; వినక యున్నన్= విననియెడల; శ్రుతు లేల =కర్ణములేల? భవచ్ఛబ్దము సర్వనామము గాన ‘సర్వనామ్నో వృత్తిమాత్రే పుంవద్భావః’ అని పుంవద్భావము. ద్వీపిక యనుచోట ద్వీపశబ్దముపై కన్ ప్రత్యయము ఇకాదేశము.

నీగాత్రాంచనవసు ధాలంధల్యవిభవముల్ – నీగాత్ర=నీశరీరమునకు, అంచన= అలంకారమైన, వసు=బంగరుయొక్క, ధాలం ధల్య= ధళధళమను మను ప్రకాశముయొక్క, విభవముల్=అతిశయములు; కాంచకున్నన్=చూడకున్నయెడల; కనుదోయి యేల = నేత్రయుగ్మ మెందుకు?

త్వదాస్యరాకార్జునవసుధామకసుగంధశ్రేణిన్ – రాకా= నిండుచంద్రునియొక్క, అర్జునవసు = తెల్లనికాంతికి, ధామక= ఆశ్రయ మైన, త్వత్=నీయొక్క, ఆస్య= ముఖముయొక్క; సుగంధశ్రేణిన్=పరిమళపరంపరను; మరగ కున్నన్=పరిచయముచేయ కున్న యెడల; ఘ్రాణ మేల = నాసికయేల?

నీయోష్ఠరమ్యమధురసోత్కరము = నీయధరముయొక్క రమ్యమగు మధురరసరాశిని; వేడ్కన్=సంతోషముచేత; క్రోలక యున్నన్ = పానముఁ జేయకున్నయెడల; రసన యిది యేల = ఈనాలుక యేల? అని = ఇట్లనుచు;

మధురమాధిపసుతోత్థతాపజాతాసమధుర – మధురమాధిపసుత=వసంతమన్మథులవలన, ఉత్థ=పుట్టిన,తాపజాత=సంతాప పుంజముయొక్క, అసమధుర = సాటిలేని భారము; ఆత్మన్=చిత్తమందు; వఱలన్=ఒప్పగా; పల్కున్=వచించును.

చ. అలయవిరాజమానకుచ ◊నాయవనీపతి చిత్తవీథిలో
నలయవిరాజమానరతి ◊నంది దలంపఁగ నొందు మేనునం
బులక లుషంబునన్ మధువుఁ◊బోలెఁ బరిస్ఫుటపద్మసీమ నం
బు లకలుషంబు లెప్పుడును ◊బొల్పుగ నుబ్బు విలోచనంబులన్. 11

టీక: ఆయవనీపతి=ఆసుచంద్రుఁడు; చిత్తవీథిలోన్=హృదయదేశమందు; అలయవిరాజమానరతిన్– అలయ=నాశరహితమై, విరాజమాన=ఒప్పుచున్న, రతిన్=ఆసక్తిని; అంది=పొంది; అలయవిరాజమానకుచన్–అల = ఆ, అవిరాజ =పర్వతశ్రేష్ఠముయొక్క, మాన=పరిమాణముగల, కుచన్=స్తనములుగల చంద్రికను; తలంపఁగన్=స్మరింపఁగా; మేనునన్=దేహమునందు; పులకలు = రోమాంచములు; ఒందున్=కల్గును; విలోచనంబులన్ =నేత్రములందు; ఉషంబునన్=ఉషఃకాలమందు; పరిస్ఫుటపద్మసీమన్ = వికచకమలస్థలియందు;మధువుఁ బోలెన్=మకరందమువలె; అకలుషంబులు=నిర్మలములగు; అంబులు = అశ్రువులు; ఎప్పుడును = ఎల్లపుడు; పొల్పుగన్=ఒప్పుగా; ఉబ్బున్ = అతిశయించును. ఆరాజు చంద్రికను అనురాగముచేత స్మరింపఁగా దేహమందుఁ బులకలు, లోచనములం దశ్రువులు గలిగె ననుట.

మ. వరపాంచాలకుమారికాతిలక భ◊వ్యధ్యాన సంపత్తిచే
నరుదారన్ భరియించె హృత్సరణిలో ◊నశ్యామలాభాయతిన్
హరిసంభేది తదీర్ష్యనో కనియె మే◊ నశ్యామలాభాయతిన్
సరసీజాస్త్రుఁడు మున్నె చేకొన నదా◊నశ్యామలాభాయతిన్. 12

టీక: వరపాంచాలకుమారికాతిలకభవ్యధ్యానసంపత్తిచేన్– వర=శ్రేష్ఠమగు, పాంచాలకుమారికాతిలక=చంద్రికయొక్క, భవ్య=మనోజ్ఞమగు, ధ్యానసంపత్తిచేన్=స్మరణసమృద్ధిచేత; హరిసంభేది = సుచంద్రుఁడు; హృత్సరణిలోన్ = చిత్తవీథియందు; అశ్యామలాభాయతిన్– అశ్యామ=ఆతరుణియొక్క, లాభ=ప్రాప్తి యనెడు, ఆయతిన్=ఉత్తరకాలమును; అరుదారన్ = ఆశ్చర్యము కలుగునట్లు; భరియించెన్ = భరించెను; తదీర్ష్యనో– తత్=ఆహృదయమందలి, ఈర్ష్యనో = అసూయచేతనో; సరసీజాస్త్రుఁడు = మన్మథుఁడు; మున్నె=అంతకుపూర్వమె; అదానశ్యామలాభాయతిన్– అదాన=అమ్లానమగు, నూతనమగు ననుట, శ్యామ=ప్రేంకణపుష్పమును, శ్యామాశబ్దముమీఁద వికారార్థమం దణ్ ప్రత్యయము వచ్చి శ్యామ అని అయినది. 'పుష్పమూలేషు బహుళం' అని బహుళగ్రహణముచేత ప్రత్యయమునకు లుక్కు లేదు,ల=గ్రహించెడు, ఆభా=అతిసామర్థ్యమందలి, 'భా ప్రభావే తేజసి' అని విశ్వము, యతిన్=నియమమును; చేకొనన్=గ్రహింపఁగా; మేను=సుచంద్రునిదేహము; అశ్యామలాభాయతిన్– అశ్యామల=శుభ్రమయిన,ఆభా=కాంతియొక్క, ఆయతిన్=సాంగత్యమును; కనియెన్=పొందెను.

అనఁగా సుచంద్రునిచిత్తము అశ్యామలాభాయతిని ధరింపఁగా తదీర్ష్యచే నతనిమేనును అశ్యామలాభాయతిని బొందిన దనియు, మరుఁడంతకన్న మున్నె అశ్యామలాభాయతిని బొందె ననియు భావము.

చ. అలనరపాలచంద్రుహృద◊యాంబురుహం బితరప్రవృత్తిచేఁ
జెలఁగక యుండ నూన్చి చెలిఁ ◊జేర్చెఁ గడున్ సితపక్షరాజమం

డల మధు పాళికాభ్రచర౹నాథ మరు త్సితపక్షరాజమం
డల మధుపాళికల్ గొలువ ౹నవ్యభవోన్నతిఁ గంతుఁడయ్యెడన్. 13

టీక: అయ్యెడన్=ఆసమయమందు; కంతుఁడు=మన్మథుఁడు; సితపక్షరాజమండలమధుపాళికాభ్రచరనాథమరుత్సితపక్షరాజమండలమధుపాళికల్ – సితపక్షరాజమండల=శుక్లపక్షమునందలి చంద్రబింబము, మధు=వసంతము, పాళికా= గుంపులైన, అభ్రచరనాథ=పక్షిశ్రేష్ఠములు, శుకపికశారికాదు లనుట, మరుత్=మలయమారుతము, సితపక్షరాజమండల= రాజహంసలగుంపు, మధుపాళికల్= తుమ్మెదలబారులు; నవ్యభవోన్నతిన్ = క్రొత్తపుట్టువుయొక్క యతిశయముచేత; కొలువన్ =సేవించుచుండఁగా; అలనరపాలచంద్రహృదయాంబురుహంబు = ఆసుచంద్రునియొక్క హృదయకమలము; ఇతరప్రవృత్తిచేన్ = విషయాంతరవ్యాపారముచేత; చెలఁగక యుండన్=ఒప్పకయుండునట్లు; ఊన్చి=చేసి; చెలిన్=చంద్రికను; కడున్= మిక్కిలి; చేర్చెన్= ఆహృదయాంబురుహమునం దుంచెను.

అనఁగా మలయానిల చంద్ర శుక పిక భ్రమర ఝుంకారాదులచే ఆరాజచిత్తము విషయాంతరవ్యాపార ముడిగి చంద్రికయందె నిలిచి యుండె ననుట. ఈకార్యము స్మరసామర్థ్యలభ్య మగుట కవిసమయపరిపాటీసిద్ధము. ఇం దరతి యను స్మరావస్థపరిపూర్తి గదితం బయ్యె. అరతి యనఁగా విషయాంతర పరిత్యాగపూర్వక తదేకాయత్తచిత్తత యని వ్రాయఁబడియె.

తే. పతిహృదయ మిట్లు నిజశౌర్య౹పటిమ నంబు,నామకచఁ జేర్చి యెనయించె ౹నలి మనం బు
రద్విషద్వైరి శితశర౹ప్రథిమ నంబు,జహితకులుపైఁ దదేణలో౹చనమనంబు. 14

టీక: పురద్విషద్వైరి=మన్మథుఁడు; నిజశౌర్యపటిమన్=తనయొక్కశౌర్యసామర్థ్యముచేత; ఇట్లు=ఈప్రకారము; పతిహృదయము= సుచంద్రుని మనస్సును; అంబునామకచన్ = కురువేరువంటి వెండ్రుకలు గల చంద్రికను, అంబునామ మనఁగా కురువేరనుటకు 'ఉదీచ్య కేశాంబునామచ' అని వెనుక వ్రాయఁబడె; చేర్చి=పొందించి; శితశరప్రథిమన్=తీక్ష్ణములైన తూపులయొక్క అతిశయముచేత; తదేణలోచనమనంబు = లేడికన్నులవంటి కన్నులు గల యాచంద్రికయొక్క మనస్సును; అంబుజహితకులుపైన్ = సూర్యవంశ్యుఁడైన సుచంద్రునిపై; నలిన్=మిక్కిలి; మనన్=వర్తించునట్లు; ఎనయించెన్=పొందించెను.

చ. అలవిరివింటిదంట తది౹లాధిపమోహము నెమ్మనంబునన్
గల వలమానభేదిమణి౹కైశికఁ గెందలిరాకుముల్కులన్
గలవల మాన నూన్చె నలు౹కన్ నవసంగరముద్ర నిల్చి మం
గలవలమాన మీనతిల౹క ధ్వజశోభి మరుద్రథంబునన్. 15

టీక: అలవిరివింటిదంట = దిట్టతనము గల యాకుసుమసాయకుండు; తదిలాధిపమోహము = ఆసుచంద్రునియందలి యనురాగము; నెమ్మనంబునన్=మంచిమనస్సునందు; కలవలమానభేదిమణికైశికన్ – కల=కలిగినట్టి, వలమానభేదిమణి=ఇంద్రనీలమణులవంటి, కైశికన్=కొప్పుగల చంద్రికను; మంగలవలమానమీనతిలకధ్వజశోభిమరుద్రథంబునన్ – మంగల=శుభావహమైన, వలమాన=బెళుకుచున్న, మీనతిలక=మత్స్యశ్రేష్ఠ మనెడు, ధ్వజ=పతాకచేత,శోభి=ప్రకాశించుచున్న, మరుద్రథంబునన్=మందమారుత మనెడు రథముమీఁద; నవసంగరముద్రన్=నూతనమైన యుద్ధస్థితిచేత; నిల్చి = ఉండి; అలుకన్=కోపముచేత; కెందలిరాకుముల్కులన్=ఎఱ్ఱని పల్లవములను బాణములచేత;కలవలము=ఆకులతను; ఆనన్ = పొందునట్లు;

ఊఁన్చెన్= చేసెను. సుచంద్రునిపై మోహము దాల్చిన చంద్రికకు నవపల్లవాద్యుద్దీపకదర్శనమువలన నాకులత గలిగె ననుట.

మ. జననాథస్మర చింతనా పరవశ ◊స్వాంతంబునం బొల్చుకో
కనదామోద రయంబుచేఁ గమిచి పొం◊గంజేసెఁ దాపంబుఁ జ
క్కన దామోదరసూను ఘోటపటలీ ◊గాఢధ్వనిశ్రేణి యా
కనదామోదరసాప్త భృంగకుల ఝం◊కారంబు లప్పట్టునన్. 16

టీక: అప్పట్టునన్=ఆసమయమందు; దామోదరసూనుఘోటపటలీగాఢధ్వనిశ్రేణి – దామోదరసూను=మరునికి, ఘోట= అశ్వములగు చిల్కలయొక్క, పటలీ=గుంపుయొక్క, గాఢధ్వనిశ్రేణి = తీవ్రమైన ధ్వనిపరంపర; ఆకనదామోదరసాప్తభృంగకులఝంకారంబులు – ఆకనత్=మిగులఁ బ్రకాశించుచున్న, ఆమోదరస=సంతోషరసమును, ఆప్త=పొందిన, భృంగకుల= తేఁటిగుంపులయొక్క, ఝంకారంబులు=మ్రోఁతలు; జననాథస్మరచింతనాపరవశస్వాంతంబునన్ – జననాథస్మర= మరునిఁ బోలు సుచంద్రునియొక్క, చింతనా=ధ్యానమునకు, పరవశ=ఆయత్తమైన, స్వాంతంబునన్=మనస్సుచేత; పొల్చు కోకనదామోదన్ = ఒప్పుచున్న పద్మగంధియగు చంద్రికను, కోకనదము లనఁగా రక్తోత్పలములు, వానియామోదమువంటి యామోదము (గంధము) గలది కోకనదామోద ; రయంబుచేన్=వేగముచేత; కమిచి=పట్టుకొని; తాపంబున్=సంతాపమును;చక్కనన్ = బాగుగను; పొంగంజేసెన్ = ఉప్పొంగునట్లు చేసెను. శుకకూజిత భ్రమరఝంకారములచేఁ జంద్రికసంతాపము మిక్కిలి యుప్పొంగె ననుట.

సీ. వినఁ గొంకు శుకపిక◊ధ్వని మనోభవ మాన,రాగ కాతనుబలా◊రభటి యనుచు,
నంట భీతిలుఁ బల్ల◊వాళి హృద్భవ మాన,నీయ ధామశిఖాని◊కాయ మనుచు,
నెనయ నోడు విలాస◊వనవాటి భవమాన,హర భూరిదుర్గచ◊యం బటంచుఁ,
గన స్రుక్కునవకోర◊కచ్ఛటాభ వమాన,కారి కందర్పాసి◊ధార యనుచు,
తే. నిటులు వలవంతఁ గుందు నా◊నృపతిరూప,ఘనవిభవ మానరానియు◊త్కలికఁ గాంచి
నట్టితఱినుండి క్షణదోద◊యావనీశ్వ,రాత్మభవ మానసంబు తా◊పార్చిఁ గలఁగ. 17

టీక: క్షణదోదయావనీశ్వరాత్మభవ=క్షణదోదయరాజపుత్రికయైన చంద్రిక; ఆనృపతిరూపఘనవిభవము = ఆసుచంద్రునియొక్క సౌందర్యాతిశయమును; ఆనరానియుత్కలికన్ = పట్టఁజాలని సంతసముచేత; కాంచినట్టితఱినుండి = చూచినట్టి సమయమునుండి; మానసంబు = చిత్తము; తాపార్చిన్=సంతాపజ్వాలచేత; కలఁగన్ = కలఁతపాఱఁగా; శుకపికధ్వనిన్ = చిలుకలయొక్కయు, కోయిలలయొక్కయు పలుకులు; మనోభవమానరాగకాతనుబలారభటి – మనోభవ=మనస్సునందుఁ బుట్టిన, మానరాగక=గర్వమాత్సర్యములు గల,అతనుబల=మన్మథసైన్యముయొక్క, ఆరభటి యనుచున్=ధ్వని యనుచు; వినన్ = వినుటకు; కొంకున్ = కొంకును.

పల్లవాళిన్= చిగురుటాకులగుంపును; హృద్భవమాననీయధామశిఖానికాయ మనుచున్ – హృద్భవ=మరునియొక్క, మాననీయ = పూజనీయమగు, ధామ=ప్రతాపముయొక్క, శిఖా=జ్వాలలయొక్క, నికాయ మనుచున్= గుంపనుచు; అంటన్ = ముట్టుటకు; భీతిలున్=వెఱచును. ప్రతాప మెఱ్ఱని దనుట కవిసమయప్రసిద్ధము.

విలాసవనవాటిన్=ఉద్యానవనవీథిని; భవమానహరభూరిదుర్గచయంబు అటంచున్ – భవమానహర=కామునియొక్క, భూరి =అధికమగు, దుర్గచయంబు = దుర్గముల సంఘము, అటంచున్=అనుచు;ఎనయన్=పొందుటకు; ఓడున్=వెనుదీయును. నవకోరకచ్ఛటాభన్ = క్రొతమొగ్గలగుంపులయొక్క కాంతిని; వమానకారికందర్పాసిధార యనుచున్ – వమానకారి= అవమానము చేసెడు, అవశబ్దాకార మిచట లోపించినది, కందర్ప=మరునియొక్క, అసిధార = ఖడ్గముయొక్క అంచు, అనుచున్ ; కనన్ = చూచుటకు; స్రుక్కున్ = భయపడును. ఇటులు=ఈప్రకారముగ; వలవంతన్=మన్మథవ్యథచేత; కుందున్=దుఃఖించును. ఇట సంతాపాతిశయముచే శుకధ్వని మొదలగువాని యందరతి వ్యజ్యమాన మగును.

చ. ఉదుటున మోహనాదిక మ॥హోగ్రతరాస్త్ర నిరూఢిఁ దత్తమి
స్రదనుజభేదిపై నెడయఁ॥జాలనికోరిక నానవీనతో
యదకచ కొందఁజేయ నభ॥వారి శయమ్ములఁ గంకణావళుల్
వదలెఁ దొలంకెఁబో నయన॥వారిశయమ్ములఁ గంకణావళుల్. 18

టీక: అభవారి = మన్మథుఁడు; ఆనవీనతోయదకచకున్ = నవజలదమునుబోలు వెండ్రుకలు గల యాచంద్రికకు; ఉదుటునన్ = ఔద్ధత్యముచేత; మోహనాదికమహోగ్రతరాస్త్రనిరూఢిన్ – మోహనాదిక=మోహనము మొదలుగాఁగల, మహోగ్రతర=మిగుల భయంకరమగు, అస్త్ర=బాణములయొక్క, నిరూఢిన్= ప్రసిద్ధిచేత; తత్తమిస్రదనుజభేదిపైన్ = తమిస్రాసురవిరోధి యగు సువంద్రునిమీఁద; ఎడయఁజాలనికోరికన్ = తొలఁగనివాంఛను; ఒందఁజేయన్=పొందఁజేయఁగా; శయమ్ములన్=హస్తములందు; కంకణావళుల్=వలయములగుంపులు; వదలెన్=జాఱెను; నయనవారిశయమ్ములన్ = వారిజములఁబోలు నేత్రములయందు; కంకణావళుల్=జలబిందువులగుంపులు; తొలంకెఁబో = చిందెనుబో.

కార్శ్యముచేతఁ గరకంకణములు, దైన్యముచేత నయనాశ్రువులు చంద్రికకు జాఱె ననుట. కార్శ్య మనునది యనంగదశా విశేషము. దైన్యము తత్సంచారి యగును. అశ్రువు దైన్యానుభావరూప మగు సాత్త్వికభావము. విరహోత్కర్షము దీనియందు గదితం బయ్యె.

చ. కనుదొవదోయి నిర్నిమిష॥గౌరవ మందఁగ నబ్బురంబుతో
ననుపమరక్తితోఁ బ్రియమ॥హాఫలకాలసమానరూపమున్
గనుఁగొను నెప్పు డెప్పు డల॥కామిని యాతఱి యెల్ల నెన్నఁగా
ననువుగఁ బొల్చెఁ బూనియ మ॥హాఫలకాలసమానరూపమున్. 19

టీక: అలకామిని = ఆచంద్రిక; ప్రియమహాఫలకాలసమానరూపమున్ – ప్రియ=ప్రియుఁడగు సుచంద్రునియొక్క, మహాఫలక = గొప్పపలకయందు, ఆలసమాన=మిగులఁ బ్రకాశించుచున్న, రూపమున్=స్వరూపమును; అబ్బురంబుతోన్ = ఆశ్చర్యముతోను; అనుపమరక్తితోన్ = సాటిలేని యనురాగముతోను; కనుదొవదోయి = కలువలవంటికన్నుఁగవ; నిర్నిమిష గౌరవము = ఱెప్పపాటిలేమియొక్క యాధిక్యమును; అందఁగన్=పొందునట్లుగా; ఎప్పుడెప్పుడు=ఏయేసమయమునందు; కనుఁగొనున్ = చూచునో; ఆతఱి యెల్లన్ = ఆసమయమంతయు; ఎన్నఁగాన్=పరికింపఁగా; మహాఫలకాల సమానరూపమున్ – మహత్ = గొప్పదియైన, ఫలకాల=ప్రియసమాగమకాలమునకు, సమానరూపమున్=తుల్యరూపమును; పూనియ =పొందియే;

అనువుగన్=అనుకూలముగా;పొల్చెన్=ఒప్పెను. ఆచంద్రిక కాలక్షేపార్థము పలకయందు వ్రాయఁబడిన తన ప్రియునిరూపము నెప్పు డెప్పు డనురాగాతిశయమున నవలోకించునో అప్పుడు ప్రత్యక్షప్రియసంగమువలె నామెకు భాసిల్లు నని భావము.

సీ. కన నింపుఁ గూర్చు చ◊క్కనిమోమువలిమిన్న, మనసార ముద్దు గై◊కొనఁగఁ దివురు,
నేల వే లనుచుఁ గ◊పోలలవలి మిన్న,కయ పునర్భవపాళిఁ ◊గరము మీటుఁ,
గలికిచన్గుబ్బలి◊కవ యాన వలిమిన్న, వాసక్తిఁ గౌఁగిట ◊నందఁ జూచు,
లలితాధరోష్ఠప◊ల్లవసుధావలి మిన్న,లము సమ్మదమునఁ గ్రో◊లంగఁ దలఁచుఁ,
తే. జెలఁగి యాశీతకరకళా◊జేతృఫాల,ఫలక రమణీయమోహసం◊భ్రాంత యగుచు
ఫలక రమణీయరూపంబు ◊ప్రౌఢి వ్రాసి, యంబురుహబాణకేళికా◊శాప్తి నపుడు. 20

టీక: అపుడు=ఆసమయమున; ఆశీతకరకళాజేతృఫాలఫలక =చంద్రకళను గెలిచెడు నుదురుగల యాచంద్రిక; రమణీయ మోహసంభ్రాంత = మనోజ్ఞమగు మోహముచేత సంభ్రమించునది; అగుచున్; ఫలక = పలకయందు; రమణీయ=మనోజ్ఞ మగు, రూపంబు=ప్రియస్వరూపమును; ప్రౌఢిన్=నేర్పుచేత; వ్రాసి=లిఖించి; అంబురుహబాణకేళికాశాప్తిన్– అంబురుహ బాణ=మన్మథునియొక్క, కేళికా=క్రీడయందలి, ఆశాప్తిన్ = ఆశాప్రాప్తిచేత; చెలఁగి=ఒప్పి; కనన్=చూచుటకు; ఇంపున్ = సొంపును; కూర్చు చక్కనిమోమువలిమిన్నన్ = ఘటిల్లఁజేయు నందమైన ముఖచంద్రుని; మనసారన్ = ముచ్చటదీఱునట్లు; ముద్దు గైకొనఁగన్ = ముద్దుపెట్టుకొనుటకు; తివురున్ = ప్రయత్నించును; ఏలవు ఏల అనుచు = ఎందుకు రక్షింపవనుచు; కపోలలవలిన్=తమలపాకువంటి చెక్కిలిని; మిన్నకయ = ఊరకయే; పునర్భవపాళిన్ = నఖరాజిచేత; కరము = మిక్కిలి; మీటున్ = గీఱును; కలికిచన్గుబ్బలికవ– కలికి=అందమైన, చన్గుబ్బలి=పర్వతములఁబోలు స్తనములయొక్క,కవ=యుగము; ఆనన్=ఒరయునట్లు;వలిమిన్=బలాత్కారముచేత, 'వబయో రభేదః' అనుచొప్పున బలిమి వలిమిగా వాడఁబడినది; నవాసక్తిన్ = అపూర్వానురాగముచేత; కౌఁగిటన్ = భుజాంతరమందు; అందన్ చూచున్ = పొందఁ జూచును; లలితాధరోష్ఠపల్లవసుధా వలి– లలిత=మనోజ్ఞమైన, అధరోష్ఠపల్లవ = పల్లవమునుబోలు నధరోష్ఠముయొక్క, సుధావలి = అమృతపరంపరను; మిన్ను +అలము=మిన్నలము=ఆకాశము నంటునట్టి, అధికమైన యనుట; సమ్మదమునన్=సంతసముచేత; క్రోలంగన్=పానముఁ జేయుటకు; తలఁచున్ = తలంచును. పూర్వపద్యోక్తమైన సాక్షాత్సంగమవద్భావన మిందు వివరింపఁ బడియె.

చ. చలనముఁ బొందసాగెఁ జెలి◊స్వాంత మరాళమరాళవృత్తికిన్
విలయకృశానుహేతి తుల◊నీయ నిశాత నిశాతపాళికిన్
ఫలనిభవాయుకీర్ణ మధు◊పాదప రాగ పరాగ పాళికిన్
లలిత రసాల సంగత క◊లస్వనవీన నవీన గీతికిన్. 21

టీక: చెలిస్వాంతము=చంద్రికయొక్క మనస్సు; అరాళమరాళవృత్తికిన్=కుటిలమైన హంసవర్తనమునకు; విలయకృశాను హేతితులనీయనిశాతనిశాతపాళికిన్—విలయకృశాను=ప్రళయకాలాగ్నియొక్క, హేతి=జ్వాలలతోడ, తులనీయ =పోల్పఁ దగిన, నిశాత=తీక్ష్ణమైన, నిశాతప=వెన్నెలలయొక్క, ఆళికిన్=సమూహమునకు; ఫలనిభవాయుకీర్ణమధుపాదపరాగపరాగ పాళికిన్ – ఫలనిభ=బాణపుములుకులకు సరియైన, వాయు=దక్షిణమారుతముచే, కీర్ణ=చెదరినట్టి, మధుపాదప=ఇప్పచెట్ల

యొక్క, రాగ=దాడిమములయొక్క, పరాగ=పుప్పొడులయొక్క, పాళికిన్=గుంపునకు; లలితరసాలసంగతకలస్వనవీన నవీనగీతికిన్ – లలిత=మనోజ్ఞములగు, రసాల=తీయమావులయందు, సంగత=సంబంధించినట్టి, కలస్వన=అవ్యక్తమధుర ధ్వనులు గల కోకిలములు మొదలుగాఁ గల, వీన (వి+ఇన) = పక్షిశ్రేష్ఠములయొక్క, నవీన=క్రొత్తనైన, గీతికిన్=గానమునకు; చలనముఁ బొందన్=చాంచల్యమును పొందుటకు; సాగెన్=ఆరంభించెను.

ఇట నుద్వేగ మను స్మరదశ గదితం బగును. 'మానసః కంప ఉద్వేగః కథిత స్తత్ర విక్రియాః, చిత్తసంతాపనిశ్వాసౌ ద్వేషః శయ్యాసనాదిషు। స్తమ్భ చిన్తాశ్రు వైవర్ణ్యదీనత్వాదయ ఈరితాః' అని తల్లక్షణ తత్కార్యంబులు తెలియవలయు.

మ. జనరాట్కన్య స్వసంగతి న్మను మహా॥చక్రాంగనాళీకలో
చన పొందున్ నిజజీవబంధురతిరా॥ట్చక్రాంగనాళీకయో
జనమున్ నిర్మలభాస్వదాప్తమతిమ॥చ్చక్రాంగనాళీకన
ద్ఘనసంసర్గము నొంద లేదుగ సుచం॥ద్రవ్యక్తలోభంబునన్. 22

టీక: జనరాట్కన్య=రాజపుత్త్రికయగు చంద్రిక; స్వసంగతిన్=తనసాంగత్యముచేత, తనమంచినడకచేత నని దోఁచును; మను మహాచక్రాంగనాళీకలోచన పొందున్ – మను=బ్రతుకుచున్న, మహత్=అధికమైన, చక్రాంగ=హంసలయొక్క, నాళీకలోచన = పద్మనయనలయొక్క, హంసస్త్రీలయొక్క యనుట, పొందున్=సాంగత్యమును; నిజజీవబంధురతిరాట్చక్రాంగనాళీకయోజ నమున్ – నిజ=తనయొక్క, జీవబంధు=ప్రాణవాయువులకుఁజుట్టమగు, ప్రాణస్నేహితుఁడని తోఁచును, రతిరాట్చక్రాంగ= రతి పతియైన మన్మథునియొక్క రథమగు మందమారుతముయొక్క, నాళీక (న+అళీక) = సత్యమైన, యోజనమున్=సంబంధ మును; నిర్మలభాస్వదాప్తమతిమచ్చక్రాంగనాళీకనద్ఘనసంసర్గమున్ – నిర్మల=నిర్మలుఁడైన, భాస్వత్=సూర్యునికి, ఆప్తమతి మత్=హితబుద్ధిగల, చక్రాంగనా=ఆఁడుజక్కవలయొక్క, ఆళీ=పరంపరయొక్క, కనత్=ఒప్పుచున్న, ఘనసంసర్గమున్ = గొప్పసంబంధమును; సుచంద్రవ్యక్తలోభంబునన్ = సుచంద్రునియందు వ్యక్తమైన ఆసక్తిచేత, మంచిబంగారమందు వ్యక్తమైన యాసక్తిచేత నని యర్థాంతరము దోఁచును; ఒంద లేదుగ = పొందదుగదా! ధనాశగలవా రాప్తులను వదలునట్లు, చంద్రిక సుచం ద్రునిమీఁది యనురాగముచే స్వసంగత్యాదులు గలవైనను హంసప్రభృతులను వదలె ననుట.

సీ. కొమిరె యాయాశుకూ॥టమి గోరుఁ బో యాత్మ,కరవాలశిఖిహేతిఁ ॥గంతుఁ డేచ,
నువిద యాఘనునిపొం॥దూహించుఁ బో చైత్రి,కరవాలపనసూచి ॥గాఁడి పాఱఁ,
దెఱవ యాకనకమూ॥ర్తిఁ దలంచుఁ బో మధు,కరవాలకచ లెల్లఁ ॥గలఁగఁ జేయ,
మగువ యాభోగిపై ॥మన ముంచుఁ బో సుదు,ష్కరవాలపవనంబు ॥గాసి వెట్ట,
తే. నినుని వినుతించుఁబో మదిఁ ॥గనలి నారి,క నలినారిమరీచిసం॥ఘాత మలమ,
నారమణి నిత్య మిటులు హృ॥త్సారసంబు, సారసంబుద్ధతాపసం॥సక్తి నెనయు. 23

టీక: కంతుఁడు=మరుఁడు; ఆత్మకరవాలశిఖిహేతిన్ – ఆత్మ=తనయొక్క, కరవాల=ఖడ్గమనెడు, శిఖి=అగ్నియొక్క, హేతిన్ = జ్వాలచేత; ఏఁచన్=బాధింపఁగా; కొమిరె = చంద్రిక; ఆయాశుకూటమిన్=ఆసుచంద్రునియొక్క సంగమమును; కోరుఁ బో = కాంక్షించును బో, ప్రసిద్ధుఁడగు శివునియొక్క సాంగత్యమును గోరునని యర్థాంతరము దోఁచును. శివుఁడు స్మర

హరుండు గావున నతని సాంగత్యమున స్మరబాధ శమించు నని యతనిసంగతిని గోరు ననుట.

చైత్రికరవాలపనసూచి – చైత్రికరవ=చైత్రమాసమందుఁ బుట్టిన ధ్వని గల కోయిలలయొక్క, ఆలపన=ధ్వని యనెడు, సూచి = సూది; గాఁడి పాఱన్= తూఁటిపాఱఁగా; ఉవిద=చంద్రిక; ఆఘనునిపొందు = ఆసుచంద్రుని సంగమమును, మేఘముయొక్క సంగము నని యర్థాంతరము దోఁచును ; ఊహించుఁబో = ఆలోచించును బో, అనఁగా మేఘకాలమందు పికములు ధ్వనిసేయ వని కవిసమయము కావున నాఘనసాంగత్యముచేత పికరుతివలననైన బాధను శమింపఁజేయ వచ్చునని ఘనుని పొందూ హించె ననుట. సుచంద్రుని పొందువలనఁ దద్బాధోపశమనము సహజము.

మధుకరవాలకచలు – మధుకర=తుమ్మెదలయొక్క, వాలకచలు=వాల మనఁగా కురువేరు, దానింబోలు వెండ్రుకలు గలవారు వాలకచలు, స్త్రీలు, ఆఁడుతుమ్మెదలనుట,‘ వాలం హ్రీబేర బర్హిష్ఠోదీచ్య కేశామ్బునామచ’ అని అమరశేషము;ఎల్లన్=అన్నియు; కలఁగఁ జేయన్ = కలఁతపడునట్లు చేయఁగా; తెఱవ = చంద్రిక; ఆకనకమూర్తిన్ = బంగరువంటి దేహముగలవాఁడగు సుచంద్రుని, సంపెంగ నని యర్థాంతరము దోఁచును; తలంచుఁబో = స్మరించును బో. అనఁగా సంపెంగ తుమ్మెదలకు విరోధి గావున తత్సాహాయ్యమునఁ దుమ్మెదలబాధ శమించు నని దానిఁదలంచు ననుట. సుచంద్రుని సాహాయ్యమునఁ దేఁటులబాధయొక్క యుపశమనము సహజము.

సుదుష్కరవాలపవనంబు = మిక్కిలి యనివార్యమైన లేఁతగాడ్పు, ‘ శసయోర్బవయో స్తథా’ అనుటచే నిట వకారబకారముల కభేదము చెప్పఁబడియె; గాసి వెట్టన్= బాధింపఁగా; మగువ = చంద్రిక; ఆభోగిపైన్= ఆరాజుపైని, ఆసర్పముపై నని యర్థాంతరము దోఁచును; మన ముంచుఁబో= మనస్సు నిల్పునుబో. అనఁగా సర్పములు పవనవిరోధులు గావునఁ దత్సాహాయ్యమున మందమారుతబాధను శమింపఁజేయ వచ్చునని భోగిపై మనముంచు ననుట. సుచంద్రసంగమమువలన తత్బాధోపశమనము సహజము.

నలినారిమరీచిసంఘాతము = చంద్రతేజఃపరంపర; అలమన్=ఆక్రమింపఁగా; నారిక=చంద్రిక; మదిన్ =చిత్తమందు; కనలి= తపించి; ఇనునిన్=సుచంద్రరాజును, సూర్యుని నని యర్థాంతరము దోఁచును; వినుతించుఁబో=ప్రశంసించునుబో; అనఁగా చంద్రతేజఃపుంజము సూర్యప్రకాశమువలన శమించును గావున చంద్రికాబాధోపశమనమునకై సూర్యుని నుతించె ననుట. సుచంద్రసంగమమువలన తత్బాధోపశమనము సహజము.

ఆరమణి = ఆచంద్రిక;నిత్యము=ఎల్లపుడు; హృత్సారసంబు సారసంబుద్ధతాపసంసక్తిన్ – హృత్సారసంబు = మనోంబుజము యొక్క, సార=చేగబాఱిన, సంబుద్ధ=స్ఫుటమైన, తాప=సంతాపముయొక్క, సంసక్తిన్=సంబంధమును; ఇటులు = ఈప్రకారముగా; ఎనయున్ = పొందును.

చ. సతతము తీవ్రహేతిధర॰ సార సమాన వరాజసూను సం
జిత విరహోగ్ర తాప తతి॰చేఁ జలియించు నిజాంతరంగకం
జతలము తన్ముఖేందుజిత॰సారస మానవరాజసూనుసం
గతముగ నూన్చి కూర్చె నవి॰ఖండితసమ్మదవార్ధివీచికన్. 24

టీక: తన్ముఖేందుజితసారస – తత్=ఆ, ముఖేందుజితసారస = ముఖచంద్రునిచే గెలువఁబడిన తమ్మి గల చంద్రిక; సతతము = ఎల్లప్పుడు; తీవ్రహేతిధరసారసమానవరాజసూనుసంజితవిరహోగ్రతాపతతిచేన్ – తీవ్ర=గాఢమైన, హేతిధర=అగ్నివలె, సార = అధికమైన, సమాన=గర్వముతోఁ గూడిన, వర=శ్రేష్ఠమైన, అజసూను=మరునిచేత, ‘ అజో హరౌ హరే కామే’ అని విశ్వము,

సంజిత=కూర్పఁబడిన, విరహోగ్రతాపతతిచేన్ = విరహసంబంధమైన తీవ్రమైన సంతాపపరంపరచేత; కాదేని, హేతిధరసార = అగ్ని బలముతో, సమ=తుల్యమగు, అనవర=కొదువగాని, అజసూను=మరునిచేత నని యర్థము; చలియించు నిజాంతరంగ కంజతలము – చలియించు=కంపించుచున్న, నిజ=తనయొక్క, అంతరంగకంజతలము = మనఃపద్మతలమును; అవిఖండిత సమ్మదవార్ధివీచికన్ = అవిచ్ఛిన్నమగు సంతోషసముద్రతరంగములను, సముద్రతరంగములవలె నవిచ్ఛిన్నముగ నుదయించు సంతసము ననుట, జాత్యేకవచనము; ఊన్చి=వహింపఁజేసి; మానవరాజసూనుసంగతముగన్ = రాజపుత్త్రుండగు సుచంద్రు నితోఁ గూడినదానిఁగా; కూర్చెన్=ఘటిల్లఁజేసెను.
అనఁగాఁ జంద్రిక కామాగ్ని సంతప్తమగు తనమనంబు సుచంద్రునిపై నిలిపి ప్రమోదవార్ధిలో మునుఁగఁజేసె ననుట.

చ. నలినసమాననా ధృతిఘ॥నత్వ మడంచె రుషార్చి నెమ్మదిన్
మలయ సమీరణాళికుసు॥మవ్రజబోధిత భృంగశింజినిన్
నలి నసమాన నాల సుమ॥న శ్శర మండలిఁ గూర్చి నొంచుచున్
మలయసమీరణాఖ్యరథ॥మధ్యగుఁడై ననవిల్తుఁ డుద్ధతిన్. 25

టీక: ననవిల్తుఁడు=పుష్పధన్వి యగు మరుఁడు; ఉద్ధతిన్=దర్పముచేత; మలయసమీరణాఖ్యరథమధ్యగుఁడై =మలయ మారుత మను పేరిటితేరి నడుమ నుండినవాఁడై; సమీరణాళికుసుమవ్రజబోధిత భృంగశింజినిన్–సమీరణాళి=మరువపుచాలు యొక్క, కుసుమవ్రజ=పూమొత్తములచేత, బోధిత=మేల్కొల్పఁబడిన, భృంగ=తుమ్మెదలనెడు, శింజినిన్=అల్లెత్రాటియందు; నలిన్ = మిక్కిలి; అసమాననాలసుమనశ్శరమండలిన్= సాటిలేని కాఁడలుగల పూవుటమ్ములయొక్కగుంపును; కూర్చి= సంధించి; నొంచుచున్=నొవ్వఁజేయుచు; రుషార్చి =రోషజ్వాల; నెమ్మదిన్=నిండుమనమునందు; మలయన్=వ్యాపింపఁగ; నలినసమాననాధృతిఘనత్వము – నలినసమాననా = తమ్మినిఁబోలు మోముగల చంద్రికయొక్క, ధృతి=ధైర్యముయొక్క, ఘనత్వము = ఆధిక్యమును; అడంచెన్=అడఁగఁజేసెను. అనఁగామలయమారుతభ్రమరఝంకారాదులచేఁ జంద్రికకు సంతాప మెక్కుడై యాసుచంద్రనరేంద్రునిపొందు లేక నిలువఁజాల నను నధైర్య ముదిత మయ్యె ననుట.

తే. అంత వలఱేనికి సహాయ॥మగుచు హితఫ,లాభికాంక్షి శుకత్రిద॥శాళిసురభి
జగతి గనుపట్టె నవసూన॥శాలి సురభి,లామ్రతిలకైకసంగమా॥శాలి సురభి. 26

టీక: అంతన్=తదనంతరమునందు; హితఫలాభికాంక్షి శుకత్రిదశాళి సురభి– హిత=ప్రియములైన, ఫల=పండ్లనెడు లాభము లను, అభికాంక్షి=కోరుచున్న,శుకత్రిదశ=చిలుకలను దేవతలయొక్క, ఆళి=గుంపునకు, సురభి=కామధేనువైనది, అనఁగా దేవతలకుఁ గామధేనువు కోరినలాభము లిచ్చునట్లు శుకవ్రజమునకుఁ గోరినపండ్లను వసంత మిచ్చు ననుట; నవసూనశాలి సురభిలామ్రతిలకైకసంగమాశాలి సురభి– నవ=నూతనములైన, సూన=కుసుమములచేత, శాలి=ఒప్పుచున్న, సురభిల= పరి మళించుచున్న, ఆమ్ర=మావులయొక్క, తిలక=బొట్టుగులయొక్క, ఏక=ముఖ్యమగు, సంగమ=సంపర్కమందు, ఆశ= ఆసక్తి కల్గిన, అలి=తుమ్మెదలు గలదియునగు, సురభి=వసంతము; వలఱేనికిన్=కామునికి; సహాయమగుచున్=తోడగుచు; జగతిన్=భూమియందు; కనుపట్టెన్=అగపడెను. అనఁగా వసంతోదయ మాయె ననుట. ఇటనుండి వసంతవర్ణన మారంభింపఁ బడుచున్నది.

సీ. సుమనోగసమ చూత౦ సుమనోగణ పరీత, సుమనోగణిత సార౦ శోభితాళి,
కలనాదసంతాన౦ కలనాద సమనూన, కలనా దలిత మాన౦బల వియోగి,
లతికాంతరిత రాగ౦ లతికాంతసపరాగ, లతికాంతపరియోగ౦లక్ష్యకాళి,
కమలాలయాస్తోక౦ కమలాలయదనేక, కమలాలసితపాక౦కలితకోకి,
తే. జాలకవితానకవితాన౦పాళిభూత, చారుహరిజాతహరిజాత౦తోరణోల్ల
సద్వ్రతతికావ్రతతికావ్ర౦జక్షయాతి,భాసురము పొల్చె వాసంత౦వాసరంబు. 27

టీక: సుమనోగ సమ చూత సుమనోగణ పరీత సుమనోగణిత సార శోభితాళి – సుమనోగ=కల్పవృక్షముతోడ, సమ=తుల్య మగు, చూత=మావులయొక్క, సుమనోగణ=కుసుమకదంబముచేత, పరీత=వ్యాప్తమైన, ఇది అళివిశేషణము, సుమనః = మంచిమనస్సులయందలి, అగణిత=అధికమైన, సార=సామర్థ్యముచేత, శోభిత=ప్రకాశించుచున్న, అళి=తుమ్మెదలు గలది. అన౯గా రసాలకుసుమముల నాశ్రయించినవి మనస్సులయం దగణితసామర్థ్యము గలవి యగు తుమ్మెదలు గల దనుట, ఇది వాసంతవాసరమునకు విశేషణము. ముందు నిట్లె తెలియవలయు.

కలనాదసంతాన కల నాద సమనూన కలనా దలిత మానబల వియోగి – కలనాదసంతాన =కోయిలగుంపుయొక్క, కల= అవ్యక్త మధురమైన, నాద=ధ్వనియొక్క, సమనూన = మిగుల నధికమైన, కలనా=ఆకలనముచేత, అన౯గా వినికిచేత, దలిత = పో౯గొట్ట౯బడిన, మానబల=కోపసామర్థ్యము గల, వియోగి=విరహులు గలది. అన౯గా కోకిలాలాపసమాకలనముచేత విరహిజన మానబలము పోయిన దనుట.

లతికాంతరిత రాగ లతికాంత సపరాగ లతికాంత పరియోగ లక్ష్య కాళి – లతికాంతరిత=తీవెలచేత౯ గప్ప౯బడిన, రాగ=దాడిమలయొక్క, లతికా=కొమ్మలయొక్క, అంత=మనోజ్ఞమగు, సపరాగ=పుప్పొడితో౯ గూడిన, లతికాంత=పువ్వులయొక్క, పరియోగ = సంపర్కముచేత, లక్ష్య=చూడ౯దగిన, క=ఉదకముయొక్క, ఆళి=శ్రేణులు గలది. అన౯గా వసంతవాసరమున జలప్రాదాదులు పుప్పొడితో౯ గూడి వ్రాలినదాడిమీకుసుమములచే౯ జూడ సొంపుగా నుండు ననుట.

కమలాల యాస్తోక కమలాలయ దనేక కమలాలసిత పాక కలిత కోకి – కమలాలయ=పద్మాకరములయొక్క, అస్తోక= అధికములగు, ఇది కమలములకు విశేషణము, కమలా=లక్ష్మీదేవికి, ఆలయత్=గృహమువలె నాచరించుచున్న, అనేక= అసంఖ్యాకములైన, కమలా=పద్మములయందు, ఆలసిత=మిగుల౯ బ్రకాశించుచున్న, పాక=పిల్లలతోడ,‘ పోతః పాకోర్భకో డిమ్భః’ అని యమరు౯డు, కలిత=కూడుకొనిన, కోకి=ఆ౯డుజక్కవలు గలది. ఈసమాసముమీ౯ద సమాసాంతవిధి యనిత్య మగుట౯ జేసి ‘ నద్యృతశ్చ’ అని కప్ప్రత్యయము లేదు. కొల౯కులయందు వసంతవాసరమున చక్రవాకస్త్రీలు బిడ్డలతో నివసించి రాజిల్లుచుందు రనుట.

జాలక వితానక వితాన పాళిభూత చారు హరిజాత హరిజాత తోరణోల్లసద్వ్రతతి కావ్రతతికా వ్రజ క్షయాతిభాసురము – జాలక= మొగ్గలయొక్క, వితానక=సమూహమనెడు, వితాన=మేలుకట్టుచేతను, పాళిభూత= బారులుగా నున్న, చారు= మనోజ్ఞములైన, హరిజాత=మన్మథునికి, హరిజాత=వాహనములైన చిలుకలగుంపనెడు, తోరణ=తోరణముచేతను, ఉల్లసత్ =ప్రకాశించుచున్న, వ్రతతి=తీవెలయొక్క, కావ్రతతికా=ఈషల్లతలయొక్క, పక్కకొమ్మలయొక్క యనుట, ‘ ఈషదర్థేచ’ అను సూత్రముచేత కుశబ్దమునకు కాదేశము, వ్రజ=సంఘములనెడు, క్షయ=గృహములచేత, ‘ నివేశః శరణం క్షయః’ అని యమరు౯డు, అతి భాసురము = మిగుల౯ బ్రకాశమాన మైనది. అన౯గా వసంతవాసరమున లతాగృహములు మొగ్గలగుంపు

లనెడు మేలుకట్లచేతను, చిల్కలబారు లనెడు తోరణములచేతను విలసిల్లుచుండు ననుట; వాసంతవాసరంబు=వసంతదినము; పొల్చెన్=ఒప్పెను.

సీ. కిసలార్పితానంద౦రసలాభకపికాళి, కామనం బబలాప్త౦కామనంబు,
సుమభావిధాన్యోన్య౦సమభావయుతరాగ,పర్ణకం బాపత౦త్పర్ణకంబు,
నవపారిజాతప్ర౦సవపాళిపుష్టాళి,దారకంబు వియోగి౦దారకంబు,
కురువామితపరాగ౦గురువాసనాకీర్ణ,పుష్కరం బుద్దీప్త౦పుష్కరంబు,
తే. సారమాకందఫలలగ౦త్కీరమాని, నీక్షణంబు క్షరద్యామి౦నీక్షణంబు
మంజులానేకకుసుమవ౦ద్వంజులాది,కాగమముపొల్చె నిలఁ జైత్రి౦కాగమంబు. 28

టీక: కిస లార్పి తానందరస లాభక పికాళికా మనం బబలాప్త కామనంబు – కిసల=చిగురులచేత, అర్పిత=ఉంపఁబడిన, ఆనందరస = ప్రమోదరస మనెడు, లాభక=ఆదాయము గల్గిన, పికాళికా=కోకిలపంక్తులయొక్క, మనంబు=మనస్సుగలది, అబల = స్త్రీలచేత, ఆప్త=పొందఁబడిన, కామనంబు=కాముకులు గలది. ‘కమనః కామనోభికః’ అని యమరుఁడు. అనఁగా వసంతము రాఁగానే స్త్రీలు త్యక్తమత్సరులై కాముకులైన ప్రియులతోఁ గలియుదు రనుట.
సుమభావి ధాన్యోన్యసమభావ యుత రాగ పర్ణకం బాపత త్పర్ణకంబు – సుమభావిధా=కుసుమకాంతిప్రకారముచేత, అన్యోన్య సమభావ=పరస్పరతుల్యతతోడ, యుత=కూడిన, రాగ=దాడిములును, పర్ణకంబు=మోదుగులును గలది, ఆపతత్= రాలుచున్న, పర్ణకంబు = కారాకులు గలది.
నవ పారిజాత ప్రసవపాళి పుష్టాళిదారకంబు వియోగి దారకంబు – నవ=నూతనములగు, పారిజాత=పారిజాతములయొక్క, ప్రసవపాళి=పువ్వులగుములచేత, పుష్ట=పోషింపఁబడిన, అళిదారకంబు = తుమ్మెదలపిల్లలు గలది, వియోగి= విరహులకు, దారకంబు = (హృదయ)భేదకమయినది.
కురువామిత పరాగ గురు వాసనాకీర్ణ పుష్కరం బుద్దీప్త పుష్కరంబు – కురువ=గోరంటలయొక్క, అమిత=అధికమైన, పరాగ= పుప్పొడులయొక్క, గురు=అధికమైన, వాసనా=పరిమళములచే, ఆకీర్ణ=వ్యాపింపఁబడిన, పుష్కరంబు=ఆకాశము గలది, ఉద్దీప్త=ప్రకాశించుచున్న, పుష్కరంబు= పద్మములు గలది.
సార మాకందఫల లగత్కీరమానినీక్షణంబు క్షరద్యామినీ క్షణంబు – సార=శ్రేష్ఠములైన, మాకంద=తియ్యమావులయొక్క, ఫల=పండ్లయందు, లగత్=లగ్నములగుచున్న, కీరమానినీ=ఆఁడుచిలుకలయొక్క, ఈక్షణంబు = దృష్టులు గలది, క్షరత్ = తగ్గుచున్న, యామినీ=రాత్రియొక్క, క్షణంబు= క్షణములు గలది. రాత్రి తగ్గుట, పగలు హెచ్చుట వసంతమున సహజము.
మంజు లానేక కుసుమవ ద్వంజులాది కాగమము – మంజుల=మనోజ్ఞమగు, అనేక=అసంఖ్యాకములగు, కుసుమవత్= పుష్పములు గల్గిన, వంజుల=అశోకవృక్షము, ఆదిక=మొదలుగాఁగల, ఆగమము = వృక్షములు గలదియు నగు; చైత్రికాగమంబు = చైత్ర మాసము రాక, ‘ స్యాచ్చైత్రే చైత్రికో మధుః’ అని యమరుఁడు; ఇలన్=భూమియందు; పొల్చెన్= ప్రకాశించెను.

చ. వరపురుషోత్తమాప్తి ననివారితసైంధవరత్నయుక్తి ని
ర్భరవసుకూటలబ్ధిఁ దన౦రారి నభోబ్ధిఁ జరించు నుజ్జ్వల

త్తరణి యనంగహారిసఖ౦ధామపథంబును బొందె నయ్యెడన్
దరణి యనంగ హారియమ౦నాథదిశానిలజాలధారచేన్. 29

టీక: వరపురుషోత్తమాప్తిన్ – వర=శ్రేష్ఠమగు,పురుషోత్తమ=నారాయణమూర్తియొక్క, పురుషశ్రేష్ఠులయొక్క యని యర్థాంత రము,ఆప్తిన్=ప్రాప్తిచేత; అనివారితసైంధవరత్నయుక్తిన్ – అనివారిత=అడ్డగింపఁబడని,సైంధవరత్న=అశ్వశ్రేష్ఠములయొక్క, సముద్రసంబంధులగు మణులయొక్క యని యర్థాంతరము, యుక్తిన్=కూడికచేత;నిర్భరవసుకూటలబ్ధిన్ – నిర్భర=మిగుల నధికములైన, వసు=కిరణములయొక్క, ధనములయొక్క యని యర్థాంతరము, కూట=రాశియొక్క, లబ్ధిన్=ప్రాప్తిచేత; తన రారి= ఒప్పారి; చరించు =సంచరించుచున్న; ఉజ్జ్వలత్తరణి = ప్రకాశమానుఁడగు సూర్యుఁడు; అనంగహారిసఖధామపథం బును – అనంగహారిసఖ=శివునిచెలికాఁడైన కుబేరునియొక్క, ధామ=నివాసస్థానముయొక్క, అలకాపురియొక్క యనుట, పథంబును = త్రోవను; హారియమనాథదిశానిలజాలధారచేన్ – హారి=మనోజ్ఞమగు, యమనాథ=యముఁడు ప్రభువుగాఁగల, దిశా=దిక్కునందలి, అనిలజాలధారచేన్= వాతజాలపరంపరచేత; తరణి యనంగన్=ఓడయట్లు; అయ్యెడన్=ఆకాలమందు; నభోబ్ధిన్= ఆకాశమను సముద్రమును; పొందెన్=పొందెను.

అనఁగా నారాయణమూర్తిచేతను, ఉత్తమాశ్వములచేతను, అమూల్యకిరణసంఘముచేతను దనరారు సూర్యుఁడు మల యానిలముతోడ నాకాశమందు దక్షిణదిశనుండి యుత్తరదిశకుఁ జేరెననియు, నట్లు చేరుట యుత్తమపురుషులచే నధిష్ఠితమై, యమూల్యరత్నములచేతను, ధనములచేతను ఒప్పియున్న యోడ సముద్రమందు అనిలజాలపరంపరచేత దక్షిణదిశనుండి యుత్తరదిశకుఁ జేరిన యట్లున్నదనియు భావము. వసంతర్తువునందు సూర్యుండు దక్షిణదిశనుండి యుత్తరదిశకుఁ జేరుట ప్రసిద్ధము.

చ. మొనచిగురాకుమోవిపస ౦మున్ మగతుమ్మెద చూపుకోపు పెం
పునఁ గలికాకుచోజ్జ్వలత౦పొందున నావనలక్ష్మి పొల్చినన్
గని యతనుప్రతాపపరి౦కల్పితమోహనిరూఢిమైఁ దలం
గని యతనుప్రతాపగతిఁ ౦గైకొనె భానుఁడు మందవర్తనన్. 30

టీక: భానుఁడు = సూర్యుఁడు; మున్=తన యెదుట; ఆవనలక్ష్మి=ఆవనసంపద, స్త్రీలింగస్వారస్యమున నొకస్త్రీ యని తోఁచును; మొనచిగురాకుమోవిపసన్ – మొనచిగురాకు=చివరయందలి చిగురుటాకనెడు, మోవి=అధరముయొక్క, పసన్=అందము చేతను; మగతుమ్మెద చూపుకోపు పెంపునన్ – మగతుమ్మెద=పురుషభృంగమనెడు, చూపు=దృష్టియొక్క,కోపు =అందము యొక్క, పెంపునన్=అతిశయముచేతను; కలికా కుచోజ్జ్వలత పొందునన్ – కలికా=మొగ్గలనెడు, కుచ=స్తనములయొక్క, ఉజ్జ్వలత పొందునన్ = ప్రకాశసంబంధముచేతను; పొల్చినన్=ఒప్పగా; కని=చూచి; అతనుప్రతాపపరికల్పితమోహనిరూఢి మైన్ – అతనుప్రతాప=మదనుని పరాక్రమముచేత, పరికల్పిత=నిర్మింపఁబడిన, మోహనిరూఢిమైన్=మోహాతిశయముచేత; తలంగని అతనుప్రతాపగతిన్ – తలంగని=తొలఁగిపోనట్టి, అతను=అధికమైన, ప్రతాప=వేఁడియనెడు సంతాపముయొక్క, గతిన్=ప్రాప్తిని; మందవర్తనన్=మెల్లనిగతిచేత, తెలివిచాలనివారిరీతిచేత నని యర్థాంతరము దోఁచు; కైకొనెన్=స్వీకరించెను.

అనఁగాచిగురాకువంటి మోవి, తుమ్మెదలవంటి చూపులు, మొగ్గలవంటి స్తనములు గల యొకస్త్రీ కనఁబడఁగా మందులైన వారు మదనపరికల్పితమోహాతిశయముచేత సంతాపము నొందునట్లు వనలక్ష్మి వసంతసమయసముదిత పల్లవకలికాభ్రమరాది

సంపదచే మెలఁగఁగా సూర్యుఁడు మందవర్తనచేత మిగుల వేఁడిమిని దాల్చె ననుట. వసంతప్రాదుర్భావము కాఁగా సూర్యుని గతి మందమై, వేఁడిమి యతిశయిల్లె నని భావము. సమాసోక్త్యలంకారము. 'విశేషణానాం సామ్యేన యత్ర ప్రస్తుతవర్తినామ్, అప్రస్తుతస్య గమ్యత్వం సా సమాసోక్తి రుచ్యతే' అని తల్లక్షణము.

చ. నిరుపమకేళికావనుల (నీటుగ నామని తోఁచునంతలో
విరహిమృదుప్రవాళపద (వీవలితావి లతాపరాగముల్
వెరవిఁడిఁ జేయఁ జిత్తపద(వీవలితావిలతాపరాగముల్
గరము వహించి దూఱె రతి(కాంతునిఁ దూఱి మదిన్ స్మరాస్త్రముల్. 31

టీక: నిరుపమకేళికావనులన్ – నిరుపమ=నిస్సమానములైన, కేళికావనులన్ = విహారవనములయందు; నీటుగన్=అందముగా; ఆమని = వసంతము; తోఁచునంతలోన్=ఉదయించినక్షణమందె; విరహిమృదుప్రవాళపద—విరహి=వియోగముగల, మృదుప్రవాళపద = మృదువులును చిగురుటాకులను బోలినవియు నగు పాదములు గలస్త్రీ; వీవలితావి = వాయుసౌరభ్యము; లతాపరాగముల్=లతలసంబంధులైన పుప్పొడులు; వెరవిఁడిన్= జీవనోపాయములేనిదానిఁగా; చేయన్=చేయఁగా; చిత్తపదవీవలితావిల తాపరాగముల్ – చిత్తపదవీ=మనోమార్గమందు, వలిత=సంచరించుచున్న, ఆవిల=కలుషములైన, తాపరాగముల్ = సంజ్వరానురాగములు; కరము = మిక్కిలి; వహించి =పొంది; మదిన్=చిత్తమందు; స్మరాస్త్రముల్=మదనబాణములు; తూఱిన్=నాటఁగా; రతికాంతునిన్=మన్మథుని; దూఱెన్=నిందించెను. అనఁగా వసంతోదయమైనతోడనె విరహిణికి వాయుసౌరభ్యమువలనను, లతాపరాగములవలనను, మిక్కిలి బాధ కలిగె ననియు, దానంజేసి చిత్తమందు సంతాపానురాగములు మిక్కుటములై స్మరాస్త్రములు మది నాటినట్లు తోఁచిన దనియు, అందు వలనఁ దత్ప్రయోజకుండైన మరుని దూషించె ననియు భావము. వసంతోదయమున విరహిణులకు సంతాపోద్రేకమైన దని ఫలితార్థము.

మ. ధరఁ బాంథుల్ బెగడొందఁ ద్రిమ్మరియె భ(ద్రశ్రీమహీభృన్మృషా
సరసాలాన వసత్యశృంఖలిత చం(చన్మారుతేభంబు కే
సరసాలానవపత్త్రముల్ తులుముచున్ (జైత్రాహజాగ్రద్విలా
సరసాలానవధిప్రసూనరజముల్ (సారెన్ బయిన్ రువ్వుచున్. 32

టీక: ధరన్=భూమియందు; పాంథుల్=పథికులు; బెగడొందన్=భయపడునట్లుగా; భద్రశ్రీమహీభృ న్మృషా సరసాలాన వసత్యశృంఖలిత చంచ న్మారుతేభంబు – భద్రశ్రీ=శుభలక్ష్మితోఁగూడిన, భద్రజాతితోఁ గూడిన – ఇది యిభవిశేషణము, మహీభృత్=మలయపర్వత మనెడు, మృషా=నెపముగల, సరసాలాన=మంచికట్టుకంబముయొక్క, వసతి=స్థానమునుండి, అశృంఖలిత=విడిచిపెట్టఁబడిన, చంచత్=ప్రకాశించుచున్న, మారుత=వాయువనెడు; ఇభంబు=గజము; కేసర సాలానవ పత్త్రముల్– కేసర=పొన్నలయు, సాల=ఏపెలయు, అనవపత్త్రముల్=కారాకులను; తులుముచున్=రాల్చుచు; చైత్రాహ జాగ్రద్విలాస రసాలానవధి ప్రసూన రజముల్—చైత్రాహ=వసంతదినములయందు, జాగ్రత్=నిస్తంద్రములైన, విలాస=ఒప్పిదముగల, రసాల=తియ్యమావులయొక్క, అనవధి=మేరలేని, ప్రసూనరజముల్=పుష్పపరాగములు; సారెన్=మాటిమాటికి; పయిన్=మీఁదను; రువ్వుచున్=వెదచల్లుచు; త్రిమ్మరియెన్=చరించెను.

అనఁగా నొకగజము కట్టుకంబమునుండి విడువఁబడినదియై మ్రాఁకులయొక్క యాకులు రాల్చుచు, పరాగములు రువ్వుచు, తెరవరులు బెగడొందునట్లు ద్రిమ్మరుచందంబున, మందమారుతము మలయపర్వతమునుండి వెడలి, కారాకులు రాల్చుచు, పుప్పొడులు సారెకు రువ్వుచు, విరహిజనులు బెగడొందునట్లు ద్రిమ్మరియె ననుట. రూపకక్రైతవాపహ్నుతులు.

చ. వనచరపాళికా నినద౦వారము మించఁగఁ గాననంబులన్
వనచరపాళికాప్త కుహ౦నాశబరాగ్రణి నిల్చి యాశుగా
ళి నలమ సాలసంతతి చ౦లించుచు నంత శుచిచ్ఛదావళుల్
చననిభయాప్తి వైచె నన ౦జాఱె ననంత శుచిచ్ఛదావళుల్. 33

టీక: వనచరపాళికానినదవారము – వనచరపాళికా=కోకిలసంఘమనెడు కిరాతకులగుంపుయొక్క, నినదవారము = ధ్వని సమూహము; మించఁగన్=అతిశయించుచుండఁగా; కాననంబులన్=అరణ్యములందు; వనచరపాళికాప్తకుహనాశబరాగ్రణి– వనచరపాళిక=మీనకేతనునియొక్క, 'జీవనం భువనం వనమ్' అనియు, 'పాళిః కేతు ర్ధ్వజో లిఙ్గమ్' అనియు నమరుఁడు, ఆప్త = చెలియైన వసంతుఁడనెడు; కుహనా=నెపముగల, శబరాగ్రణి=కిరాతపతి; నిల్చి; ఆశుగాళిన్=వాయువు లనెడు బాణముల యొక్క చాలుచేత; అలమన్=ఆక్రమింపఁగా; సాలసంతతి = వృక్షసమూహము, తెరువరులగుంపని ధ్వనితార్థము; చలించు చున్ = కదలుచు, భయముచేత వడఁకుచు; అంతన్=తదుపరి; శుచిచ్ఛదావళుల్=శుభ్రమైన వస్త్రముల పంక్తులను; చనని భయాప్తిన్ = తొలఁగని భయప్రాప్తిచేత; వైచెన్=విడిచెను; అనన్ = అనునట్లు; అనంతన్=భూమియందు; శుచిచ్ఛదావళుల్= కారాకుల గుంపులు; జాఱెన్=వ్రాలెను.

అనఁగా నడవిలో నొకశబరాగ్రణి తనపరివారకిరాతకు లెల్లఁ జుట్టి ధ్వనులు సేయుచుండఁగా బాణము లేయ, నత్తఱి తెరు వరులు మిగుల భీతిచేత శుభ్రము లగు తమవస్త్రములు విప్పియిచ్చిన యట్లు కోయిలలు రొదసేయుచుండఁగా వసంతము కాన నములందు వ్యాపించి మందమారుతమును వీవఁజేయఁగా మ్రాఁకులపండుటాకులు భూమిని రాలె నని తాత్పర్యము.

సీ. మధుయంత విటపిసా౦మజకటమ్ముల వ్రాయ, నలరు గైరికరేఖి౦కాళు లనఁగ,
హరివిదారితపత్త్ర౦యగు నగశ్రేణిపై, నడరు గైరికరేఖి౦కాళు లనఁగ,
నళిధూమకందళి ౦యలమఁ గన్పడు దవాం,గణవిరోచనమయూ౦ఖము లనంగ,
మును మ్రింగి వెగటైన౦వనతమస్తతి గ్రక్కు, ఘనవిరోచనమయూ౦ఖము లనంగ,
తే. నహహ యవ్వేళ పత్త్రతో౦యధితటస్థ,లకనదతిరోహితప్రవా౦ళము లనంగ,
నమరె నతిరోహితప్రవా౦ళముల నంగ,కనకకరవాలికాప్రమా౦కరము లగుచు. 34

టీక: మధుయంత =వసంతమనెడు మావటివాఁడు; విటపిసామజకటమ్ములన్=మ్రాఁకులను నేనుఁగులయొక్క గండస్థలముల యందు; వ్రాయన్=లిఖింపఁగా; అలరు గైరికరేఖికాళులు=ఒప్పుచున్న సిందూరరేఖాపంక్తులు; అనఁగన్=అనునట్లుగా. దీనికి 'ప్రవాళము లమరె' నను దానితో నన్వయము.
హరివిదారితపత్త్ర– హరి=వాయువనెడు సింద్రునిచేత, విదారిత=ఖండింపఁబడిన, పత్త్ర = ఆకులను ఱెక్కలు గలది; అగు = ఐ నట్టి; నగశ్రేణిపైన్ = వృక్షములనెడు కొండలయొక్కచాలున; అడరు గైరికరేఖికాళులు = ఒప్పుచున్న జేగుఱురేఖలయొక్క చాలులు; అనఁగన్= అనునట్లుగా;

అళిధూమకందళి = తుమ్మెదలనెడు ధూమాంకురము; అలమన్=ఆక్రమింపఁగా; కన్పడు =చూపట్టుచున్న; దవాంగణవిరోచనమయూఖములు – దవాంగణ=వనాంతరమనెడు, విరోచన=అగ్ని యొక్క, మయూఖములు=జ్వాలలు; అనంగన్ = అనునట్లుగా;

మును =తొలుత; మ్రింగి = కబళించి; వెగటైనన్=వెక్కసము కాఁగా; వనతమస్తతి = వనములనెడు రాహులగుంపు; క్రక్కు ఘన విరోచనమయూఖములు – క్రక్కు= వమనముసేయు, ఘన=అధికమైన, విరోచన=సూర్యునియొక్క,మయూఖములు=కిరణములు; అనంగన్=అనునట్లుగా;

పత్త్రతోయధి తటస్థల కన దతిరోహిత ప్రవాళములు – పత్త్రతోయధి=ఆకులనెడు సముద్రముయొక్క, తటస్థల=దరియందు, కనత్=ఒప్పుచున్న, అతిరోహిత=మిగుల నెఱ్ఱనైన, ప్రవాళములు=పవడములు; అనంగన్= అనునట్లుగా; అతిరోహిత ప్రవాళములు – అతిరోహిత=తిరోహితములు గాని, అనఁగా స్ఫుటముగా బయల్పడిన, ప్రవాళములు=పల్లవములు; అనంగ కనక కరవాలికా ప్రమాకరములు – అనంగ=మదనునియొక్క,కనకకరవాలికా=బంగరుకత్తియొక్క, ప్రమా=యథార్థజ్ఞానమునకు, కరములు= చేయునవి; అగుచున్ = అయినవయి; అవ్వేళన్=అపుడు; అమరెన్=ఒప్పెను; అహహ=ఆశ్చర్యము! నవపల్లవములు పైఁజెప్పినరీతిగా విలసిల్లె నని తాత్పర్యము.

చ. కలికల రంగదుజ్జ్వలతఁ గన్పడెఁ గాననసీమ ముత్తెముల్
కలి కలరంగ నొంచి నిజ౹గౌరిమచే, నడఁగించి చంద్రమః
కలికల, రంగమై నవసు౹గంధపరంపర కెల్లఁ, జాల ను
త్కలికలరం గనారతముఁ ౹గాంచిన చూపఱచూడ్కి కుంచుచున్. 35

టీక: కలికలరంగదుజ్జ్వలత – కలికల=కోరకములయొక్క, రంగత్=ఒప్పుచున్న, ఉజ్జ్వలత=ప్రకాశము; కాననసీమన్ = అరణ్యప్రదేశమందు; ముత్తెముల్=మౌక్తికములు; కలికిన్=కలహమునకు; అలరంగన్=ఒప్పఁగా; నొంచి =నొప్పించి; నిజగౌరిమచేన్ = తనపాండిమచేత; చంద్రమఃకలికలన్=శశికళలను; అడఁగించి=అడఁగఁజేసి; నవసుగంధపరంపర కెల్లన్— నవ=నూతనమగు, సుగంధ=పరిమళముయొక్క, పరంపర కెల్లన్= సముదయమున కంతయు; రంగమై = ఆశ్రయమై; అనారతమున్ = ఎల్లప్పుడును; కాంచిన చూపఱచూడ్కికిన్ =అవలోకించిన చూచువారియొక్క దృష్టికి; చాలన్=మిక్కిలి; ఉత్కలికలరంగు=వేడుకలయొప్పిదమును; ఉంచుచున్=చేయుచు; కన్పడెన్=అగపడెను. అనఁగాఁ గలికలు కాననసీమలందుఁ దమపాండిమచే ముత్యములను, శశికలలను మించుచు నపూర్వపరిమళమును దాల్చుచు, చూపఱుల మాడ్కులకింపులు నించుచుఁ గాన్పించె ననుట.

చ. విరిగమి వొల్చె సర్వవన౹వీథులఁ, దారకదీధితి చ్ఛిదా
పర మహిమానివారణము, ౹పాంథవధూజన దృష్టిమాలికా
పరమహి, మానితాళికుల౹భవ్యవిహారనివాస, ముజ్జ్వల
త్పరమ హిమానికాజయజ ౹భాసుర చైత్రికకీర్తి యత్తఱిన్. 36

టీక: అత్తఱిన్=అప్పుడు; సర్వవనవీథులన్=ఎల్లయడవులపట్టులందు; తారక దీధితి చ్ఛిదాపర మహిమానివారణము–తారక = నక్షత్రములయొక్క, దీధితి=కాంతులయొక్క, ఛిదా=ఛేదనమందు, పర=ఆసక్తమైన, మహిమ=సామర్థ్యముచేత,

అనివారణము=అడ్డులేనిదియు; పాంథవధూజన దృష్టిమాలికా పరమహి– పాంథవధూజన=వియోగిస్త్రీలయొక్క, దృష్టి మాలికా = చూపుచాలులకు, పరమహి = శత్రుభూమిరూప మైనదియు; మానితాళికుల భవ్య విహారనివాసము – మానిత= శ్రేష్ఠములగు, అళికుల=తుమ్మెదగుంపులకు, భవ్య=మనోజ్ఞమగు, విహారనివాసము = విహారస్థానరూపమైనదియు; ఉజ్జ్వల త్పరమ హిమానికాజయ జ భాసుర చైత్రికకీర్తి– ఉజ్జ్వలత్=ప్రకాశించుచున్న, పరమ=ఉత్కృష్టమగు, హిమానికా=మంచు గమియొక్క, 'హిమానీ హిమసంహతిః' అని యమరుఁడు, జయ=గెలుపువలన, జ=పుట్టినట్టి, భాసుర=ప్రకాశించుచున్న, చైత్రికకీర్తి=వసంతునియొక్క కీర్తిరూపమైనదియు నగు; విరిగమి = పువ్వులగుంపు; పొల్చెన్= ప్రకాశించెను.

సర్వవనస్థలులందు నక్షత్రకాంతి నడంచునంత ప్రకాశము గలదై, విరహిస్త్రీలచూపులకు శత్రుప్రాయం బగుచు, మంచును జయించి పొందిన చైత్రునికీర్తియో యనునట్లు విరిగమి పొల్చె ననుట. వసంతమందు హిమము నివృత్తమగుట ప్రసిద్ధంబ.

సీ. ఫలియించెఁ దిలకముల్ ◊భసలేక్షణమ్ముల, సురసాలతా సము◊త్కరము గాంచఁ,
జివురించె నునుఁబొన్న ◊నవసూనసంతతి, సురసాలవల్లరుల్ ◊ సరస నవ్వ,
ననఁజూపె బొగడచాల్ ◊నవమధుచ్ఛట నింద్ర,సురసా లలితశాఖ ◊కరము నుమియఁ,
గుసుమించె లేఁగ్రోవి ◊కొమరు వీవలి విభా, సుర సాలవల్లికల్ ◊సొరిది నలమ,
తే. సితవసు రసాల చారుమా◊రుత ముఖాప్తవరులు మెచ్చంగ మధు వల◊ర్పకయ మున్నె
యలరి సురసాలవైఖరిఁ ◊జెలువు గాంచె, నపు డగశ్రేణి యిట్లు దో◊హదనిరూఢి. 37

టీక: తిలకముల్ = బొట్టుగులు; సురసాలతా సముత్కరము– సురసాలతా=సర్పాక్షితీవలయొక్క, సముత్కరము=సమూహము; భసలేక్షణమ్ములన్=తేటిచూపులచేత; కాంచన్= చూడఁగా; ఫలియించెన్ = పండెను.
నునుఁబొన్న=సుందరమగు పొన్నచెట్టు; సురసాలవల్లరుల్ =లెస్సయిన మావిపువ్వుగుత్తులు; సరసన్=సమీపమందు; నవ్వన్ = నవ్వఁగా; చివురించెన్=పల్లవించెను.
పొగడచాల్=పొగడచెట్లవరుస; ఇంద్రసురసాలలితశాఖ– ఇంద్రసురసా=వావిలియొక్క, లలిత=మనోజ్ఞమగు, శాఖ=కొమ్మ; కరమున్=మిక్కిలియు; నవమధుచ్ఛటన్—నవ=నూతనమైన, మధు=మరందముయొక్క, ఛటన్=పరంపరను, ఉమియన్ = ఉమియఁగా; ననఁజూపెన్=కుసుమించెననుట,
లేఁగ్రోవి = లేఁత కురవకము; కొమరువీవలిన్ – కొమరు = అందమైన, వీవలిన్=వాయువుచేత, విభాసురసాలవల్లికల్ – విభా సుర=ప్రకాశించుచున్న, సాలవల్లికల్=ఏపెమ్రాఁకుతీవెలు, అనఁగా లేఁతకొమ్మలు; సొరిదిన్=వరుసగా; అలమన్=కౌఁగిలిం చుటచేత; కుసుమించెన్= పుష్పించెను.
మధువు=వసంతము; సితవసు రసాల చారుమారుత ముఖాప్తవరులు– సితవసు=శుభ్రాంశువైన చంద్రుఁడు, రసాల=తియ్య మావులు, చారుమారుత=మనోజ్ఞమైన వాయువు, ముఖ=మొదలైన, ఆప్తవరులు=కూర్మిచెలులు; మెచ్చంగన్=ప్రశంసించు నట్లుగా; అలర్పకయ మున్నె = వికసింపఁజేయక ముందె; అగశ్రేణి=మ్రాఁకులచాలు; ఇట్లు=పైఁజెప్పినవిధముగా; దోహద నిరూఢిన్ = దోహదముయొక్క యతిశయముచేత; అలరి=ప్రకాశించి; అపుడు=ఆసమయమందు; సురసాలవైఖరిన్ = కల్ప వృక్షములవలె; చెలువు గాంచెన్= అందము నొందెను.

అనఁగా తిలకములకు స్త్రీవీక్షణము, పొన్నలకు స్త్రీలనవ్వు, పొగడలకు స్త్రీముఖశీధువు, కురవకములకు స్త్రీయాలింగనము దోహదముగావున ఈదోహదములచే వసంతోదయమునకు మున్నె పుష్పఫలాదిభరితములై వేల్పుమ్రాఁకులవలె చెలువొందె

ననుట. ఇట నాల్గుచరణములయందు సురసాలతా, సురసాలవల్లరీ, ఇంద్రసురసా, సాలవల్లికలయందు స్త్రీలింగమహిమచే స్త్రీత్వారోపముఁ జేసి తదీయభసలేక్షణాదులచే దోహదనిర్వాహము.

చ. తలిరులు దోఁచెఁ గోకిలవి◊తానము వేడుకఁ గాంచ, సూనముల్
వొలిచె మిళింద ముబ్బి కడుఁ ◊బూన నవాంగము, మారుతాంకురం
బొలికెఁ బరాగముల్ వని ల◊తోత్కర మాకులపాటు నందగన్,
దొలుదొలుతన్ వియోగిసుద◊తుల్ కర మాకులపాటు నందఁగన్. 38

టీక: వనిన్=వనమునందు; కోకిలవితానము =కోకిలలగుంపు; వేడుకన్=సంతసమును; కాంచన్= పొందఁగా; తలిరులు = పల్లవములు; తోఁచెన్ = ఉదయించెను; మిళిందము=తుమ్మెద; కడున్ = మిక్కిలి; ఉబ్బి=ఉప్పొంగి; నవాంగము=క్రొత్తశరీరమును; పూనన్=వహింపఁగా, అనఁగా సంతోషాతిశయముచే నుప్పొంగి క్రొత్తదేహమును దాల్చినట్లుండఁగా ననుట; సూనముల్=పుష్పములు; పొలిచెన్=ఉదయించెను; లతోత్కరము=తీవలగుంపు; ఆకులపాటునన్ = కారాకులు రాలుటచేతను; తగన్=ఒప్పునట్లు; పరాగముల్=పుప్పొడులను; మారుతాంకురంబు = మందమారుతము; ఒలికెన్=చల్లెను;తొలుదొలుతన్ =తొల్తనే; వియోగిసుదతుల్=విరహిస్త్రీలు; కరము=మిక్కిలి; ఆకులపాటున్= వ్యాకులత్వమును; అందఁగన్=పొందఁగా, ఇది యన్నిక్రియలతోను నన్వయించును. అనఁగా వృక్షలతాదులు తొలుతఁ గారాకులు రాలఁగాఁ జిగిరించి, కుసుమించి, పుప్పొడులు రాలె ననుట.

మ. అలరెన్ జైత్రబలాధినేత మదసా◊రంగాళి సద్వాజిమం
డలి రాగంబున మించుక్రొందళములన్ ◊రమ్యాత్మఁ జేకూర్పఁగాఁ
గలనాదారి తమీన మారుతయుతిన్ ◊గంజాస్త్రుఁ డుద్యత్సహః
కలనా దారిత మీనదృక్పురుష జా◊గ్రద్ధైర్యుఁడై యయ్యెడన్. 39

టీక: అయ్యెడన్=అపుడు; చైత్రబలాధినేత= వసంతుఁడనెడు పడవాలు; మదసారంగాళిసద్వాజిమండలి – మదసారంగాళి= మదించిన తుమ్మెద లనెడు మదపుటేనుఁగులయొక్క, ఆళిన్=పంక్తిని; సద్వాజిమండలిన్=శ్రేష్ఠములగు పక్షులనెడు గుఱ్ఱముల గుంపును; రాగంబునన్=రక్తిమ యనెడు క్రోధముచేత; మించుక్రొందళములన్ = అతిశయించు చిగురాకులనెడు క్రొత్తసైన్యములను; రమ్యాత్మన్=మంచిమనస్సుచేత; చేకూర్పఁగాన్=ఘటిల్లఁజేయఁగా; కంజాస్త్రుఁడు=మరుఁడు; కలనాదారితమీనమారుతయుతిన్ – గలనాద=కోయిలలయొక్కయు, అరి=జక్కవలయొక్కయు, తమీన=చంద్రునియొక్కయు, మారుత= మలయవాతముయొక్కయు, యుతిన్=ప్రాప్తిచేత; ఉద్యత్సహఃకలనాదారితమీనదృక్పురుషజాగ్రద్ధైర్యుఁడు ఐ – ఉద్యత్= పుట్టుచున్న, సహః=బలముయొక్క, 'సహో బల శౌర్యాణి స్థామ శుష్మం చ' అని యమరుఁడు, కలనా=ప్రాప్తిచేత, దారిత= చీల్పఁబడిన, మీనదృక్=స్త్రీలయొక్కయు, పురుష=పురుషులయొక్కయు,జాగ్రత్=నిస్తంద్రమైన, ధైర్యుఁడు ఐ = ధైర్యము గలవాఁడై; అలరెన్ = ఒప్పెను.

అనఁగా మరుఁడు తనసేనాధిపతియగు వసంతుఁడు సారంగరాజిని, క్రొందళములను గూర్పఁగా దాను మలయానిల చంద్రాదులతోఁ గూడి స్త్రీపురుషుల ధీరత్వము నుడిగించె ననుట.

మ. కలకంఠీకులపంచమస్వరగృహ౦త్కాంతారవారంబులన్
దలిరా కాకమలేశ్వరాత్మజ మహ౦స్త్వంబున్ సుమచ్ఛాయకం
దలి రాకాకమలేశ్వరాత్మజ మహ౦స్త్వంబున్ గడుం బూని క
న్నుల కుద్వేలభయంబు గూర్ప మఱి పాం౦థుల్ గుంది రప్పట్టునన్. 40

టీక: అప్పట్టునన్=ఆసమయమందు; కలకంఠీకులపంచమస్వరగృహత్కాంతారవారంబులన్ – కలకంఠీకుల=కోకిలస్త్రీల గుంపులయొక్క, పంచమస్వర=తజ్జాతినియత మగు పంచమరాగమునకు, గృహత్=గృహమువలె నాచరించుచున్న, ఆశ్రయ మైన యనుట, కాంతారవారంబులన్=అరణ్యసమూహములయందు; తలిరాకు=చిగురుటాకు; ఆకమలేశ్వరాత్మజ మహస్త్వంబున్ – ఆకమలేశ్వరాత్మజ=ఆలక్ష్మీపతియైన విష్ణువుయొక్క తనూజు(డైన మన్మథునియొక్క, మహస్త్వంబున్= ప్రతాపభావమును; సుమచ్ఛాయకందలి – సుమ=కుసుమములయొక్క, ఛాయ=కాంతులయొక్క,కందలి=మొలక, ఇట ‘ఛాయా బాహుల్యే’ అను సూత్రముచేత ఛాయాశబ్దమునకు నపుంసకత్వము; రాకాకమలేశ్వరాత్మజమహస్త్వంబున్ = పూర్ణిమాచంద్ర ప్రకాశభావమును, కమలేశ్వరు(డనగా జలాధిపతియగు సముద్రుడు, అతని యాత్మజు(డు చంద్రు(డు,‘సలిలం కమలం జలమ్’ అనియు, ‘పూర్ణే రాకా నిశాకరే’ అనియు నమరు(డు; కడున్=మిక్కిలి; పూని=వహించి; కన్నులకున్= చూపులకు; ఉద్వేలభయంబున్=అధికమైన వెఱపును; కూర్పన్=ఘటిల్ల(జేయ(గా; పాంథుల్=తెరువరులు; మఱి=మిగు లను; కుందిరి= దుఃఖించిరి. అడవులయందు(గోకిలాలాపములు, నవపల్లవములు, కుసుమస్తోమకాంతియు(బాంథులకు దుస్సహములై ప్రియావియోగదుఃఖము నతిశయింప(జేసె ననుట.

తే. అలవసంతంబున రహించె(౦దిలక భాస
మాన హిందోళగీత ని౦స్స్వాన, మహిమ
దీప్త్యుదయకాల గాయికా౦తిలక గేయ,
మాన హిందోళగీత ని౦స్స్వానమహిమ. 41

టీక: అలవసంతంబునన్=ఆవసంతర్తువునందు; తిలకభాసమానహిందోళగీతనిస్స్వానము – తిలక=బొట్టుగులయందు, భాస మాన=ప్రకాశించుచున్న,హిందోళ=తే(టులయొక్క,గీత=పాటలయొక్క,నిస్స్వానము=ధ్వని; అహిమదీప్త్యుదయకాల గాయికాతిలక గేయమానహిందోళగీతనిస్స్వానమహిమన్ – అహిమదీప్తి = సూర్యునియొక్క, ఉదయకాల=ఉదయించు కాలమందు, గాయికాతిలక=మంచిపాట నేర్చిన స్త్రీలచేత, గేయమాన=పాడ(బడుచున్న, హిందోళ=హిందోళమను రాగ విశేషముయొక్క, ‘హిందోళౌ రాగ మధుపౌ’ అని విశ్వము, గీత=గానములసంబంధియగు, నిస్స్వాన=ఆలాపముయొక్క, మహిమన్ = అతిశయముచేత, రహించెన్=ఒప్పెను. ఈపద్యమున నిస్స్వానపదము పునరుక్తమైనను దోషంబు కాదు. ఇందులకు ‘యమకాది ష్వదుష్టం స్యాన్నిహతార్థ న్నిరర్థకమ్,నదుష్టః పునరుక్తశ్చ విశేషావగమో యది’ అని సాహిత్య చింతామణి చూడవలయు.

చ. నెలవున రాగసంపద వ౦నీరమ చారుపికారవంబునన్
దెలిసి వసంతురాక, సుమ౦నీర మహోర్మిక(దాన మూన్చి, పూ

ని లలితసుచ్ఛదాళి, నళి౦నీరమణీయసరంబు లూని, మేల్
నెలవునఁ బొల్చెఁ, గుంజభవ౦నీరమమాణశుకీసఖీవృతిన్. 42

టీక: వనీరమ=వనలక్ష్మి; చారుపికారవంబునన్– చారు=మనోజ్ఞమగు, పికారవంబునన్=కోకిలస్వనమువలన; వసంతురాక = వసంతుఁడను ప్రియునియొక్క రాకను; తెలిసి=తెలిసికొని; నెలవునన్=పరిచయముచేత; రాగసంపదన్=రక్తిమ యనెడు ననురాగముయొక్క సమృద్ధిచేత; సుమనీర మహోర్మికన్– సుమనీర=పుష్పరసముయొక్క,మహోర్మికన్=నదియందు; తానము ఊన్చి = స్నానముఁజేసి; లలితసుచ్ఛద=మంచియాకు లనెడు వస్త్రములయొక్క, ఆళిన్=పంక్తిని; పూని=ధరించి; అళినీరమణీయసరంబులు– అళినీ=ఆఁడుతుమ్మెదలనెడు, రమణీయ=అందమైన,సరంబులు=పేరులు; ఊని=ధరించి; కుంజభవనీ రమమాణ శుకీసఖీ వృతిన్– కుంజభవనీ=పొదరిండ్లయందు, రమమాణ=విహరించుచున్న, శుకీ=ఆఁడుచిల్క లనెడు, సఖీ=చెలియలయొక్క, వృతిన్=వ్యాప్తిచేత; మేల్ నెలవునన్=మంచినివాసస్థానమునందు; పొల్చెన్= ప్రకాశించెను.

ఇచట వనలక్ష్మి యనెడు స్త్రీ పికారవములచే వసంతుఁడను ప్రియునిరాక తెలిసికొని స్నానముఁ జేసి, శుభ్రవస్త్రములను, రమణీయమగు హారములను దాల్చి, సఖీజనముతోఁ గూడి, కేళీగృహమున విలసిల్లె నని చెప్పుటచేత వనలక్ష్మియందు వాసక సజ్జాధర్మము వ్యక్తం బగుచున్నది. 'ప్రియాగమనవేళాయాం మణ్డయన్తీ ముహుర్ముహుః, కేళీగృహం తథాత్మానం సా స్యా ద్వాసకసజ్జికా' అని వాసకసజ్జాలక్షణము.

సీ. రమ్యపున్నాగోర్వ౦రాజాతిసౌరభా,రూఢిపై నలమ మా౦రుతము నిగుడ,
రసఁ బల్లవరుచిధా౦రాజాతిసౌరభా,గారితవంజులా౦గములు దోఁపఁ,
బ్రబలు సంభ్రమ మెచ్చ ౦రాజాతిసౌరభా,వలినివాసి శుకౌఘ౦ములు నటింప,
రాజత్పికాబ్జక౦రాజాతిసౌరభా,నేహోర్పితారావ౦నియతి మెఱయ,
తే. నధ్వగులు గుంది రధికతా౦పార్చి పఱవఁ, గాననంబుల నపుడు చ౦క్కనిప్రియాళి
కాననంబులఁ గాంచు మో౦హంబు లాత్మ,కాన నంబుల మారుఁ డుద్ధతి నటింప. 43

టీక: రమ్యపున్నాగోర్వరాజాతిసౌరభారూఢి– రమ్య=మనోజ్ఞములగు,పున్నాగోర్వరాజ=పున్నాగవృక్షములయొక్క, 'ఉర్వరాజ' మనఁగా వృక్షమని యర్థము. 'ఉర్వరా సర్వసస్యాఢ్యా' అని యమరుఁడు. అందుచే, ఉర్వరా యనఁగా భూమి, ఉర్వరాజ మనఁగా భూమిజము = వృక్షమని యర్థము, అతిసౌరభ=అధికపరిమళముయొక్క, ఆరూఢి=అతిశయము; పైన్=మీఁదికి; అలమన్=కవియునట్లు; మారుతము = సమీరము; నిగుడన్=వీవఁగా,
రసన్ = భూమియందు, 'రసా విశ్వమ్భరా స్థిరా' అని యమరుఁడు; పల్లవ రుచిధారా జాతి సౌరభాగారిత వంజులాగములు– పల్లవ=చిగురులయొక్క, రుచిధారా=కాంతిపరంపరలయొక్క, జాతి=సామాన్యమనెడు, సౌర=సూర్యసంబంధి యైన, భా= కాంతికి, ఆగారిత=గృహమువలె నాచరించుచున్న, వంజులాగములు=వకుళవృక్షములు; తోఁపన్=చూపట్టఁగా, ప్రబలుసంభ్రమము=అధికమైనసంతోషము; ఎచ్చన్=అతిశయింపఁగా; రాజాతిసౌర భావలి నివాసి శుకౌఘములు– రాజ = రేలపూవులయొక్క, అతిసౌరభ=అధికపరిమళముయొక్క, ఆవలి=పంక్తియందు, నివాసి=నివసించుచున్న,శుకౌఘములు = చిలుకలగుంపులు; నటింపన్ = నాట్యముసేయఁగా;

రాజత్పికాబ్జకరాజాతి – రాజత్=ప్రకాశించుచున్న, పికాబ్జకరా=ఆఁడుకోకిలలయొక్క, జాతి=కులము; సౌరభానేహోర్పితా రావనియతి – సౌరభానేహ=వసంతకాలముచేత,అర్పిత=అర్పింపఁబడిన,ఆరావనియతిన్=ధ్వనినియమముచేత; మెఱయన్ = ప్రకాశింపఁగా,

అధ్వగులు =పాంథులు; అపుడు=ఆసమయమున; అధికతాపార్చి=ఎక్కుడుసంతాపజ్వాల; పఱవన్=వ్యాపింపఁగా; కాననంబులన్=అడవులందు; చక్కని ప్రియాళికాననంబులఁ గాంచు మోహంబులు – చక్కని=అందమైన, ప్రియాళికాననంబులన్ =ప్రియాసమూహములముఖములను, కాంచు మోహంబులు = చూడవలెనను కోరికలు; ఆత్మకున్ = మదికి; ఆనన్=నాటఁగా; మారుఁడు=మదనుఁడు; అంబులన్=బాణములచే; ఉద్ధతిన్=దర్పముచేత; నటింప = నటింపఁగా; కుందిరి=దుఃఖించిరి.

అనఁగా పున్నాగపుష్పరజములతోఁ గూడిన మందమారుతము, రక్తపల్లవములతోఁ గూడిన వకుళవృక్షములు, నటించుచున్న చిలుకగములు, కోకిలస్త్రీనాదములు పాంథులకుఁ గామోద్రేకజనకము లయ్యె ననుట.

చ. సరససమీరపోతములు ◊చక్కఁ జరింపఁగఁ జొచ్చె నప్డు సుం
దరవకుళాగకేసరల◊తాసుమనోరసవీచిఁ దేలుచున్
దరుణనమేరుకేసరల◊తాసుమనోనరజంబు లాగుచున్
దరముగ నాగకేసరల◊తాసుమనోరమగంధ మానుచున్. 44

టీక: సరససమీరపోతములు – సరస=శ్రేష్ఠములైన, సమీరపోతములు=మందమారుతములు; సుందర వకుళాగ కేసర లతా సుమనోరసవీచిన్—సుందర=అందమైన, వకుళాగ=పొగడవృక్షములయొక్కయు, కేసర=పొన్నలయొక్కయు, లతా=కొమ్మలయందలి, సుమనః=పుష్పములయొక్క, రస=మకరందముయొక్క, వీచిన్= తరంగములయందు, ఇది జాత్యేక వచనము; తేలుచున్ =తేలాడుచు; తరుణ నమేరు కేసర లతా సుమనోనరజంబులు – తరుణ=నూతనములైన, నమేరు=సురపొన్నలయొక్క, కేసర=కింజల్కములయొక్క, లతా=బండిగురివెందలయొక్క, 'లతాగోవిన్దినీ గున్ద్రా' అని యమరుఁడు, సుమ=పువ్వులయొక్క, నోన (న+ఊన) = అధికమైన, ఇచట నైకధేత్యాదులయందువలె నఞర్థముతో ఊనశబ్దమునకు 'సుప్సుపా' అని సమాసము, రజంబు=పుప్పొడులను; లాగుచున్=ఆకర్షించుచు; తరముగన్=క్రమముగ; నాగకేసరలతా సుమనోరమ గంధము – నాగకేసరలతా=నాగకేసరపుతీవలయొక్క, సుమనోరమ=మిక్కిలి మనోజ్ఞమైన, గంధము=పరిమళమును; ఆనుచున్=పానముఁ జేయుచు;అప్డు=ఆసమయమందు; చక్కన్=బాగుగా; చరింపఁగఁ జొచ్చెన్= సంచరింపసాగెను.

ఇట బాలపవనములు వకుళాదిపుష్పనీరమునఁ దేలుచు, సురపొన్నలు మున్నగువాని పుప్పొడి లాగుచు, నాగకేసరాది గంధము నానుచుఁ జరింపసాగె నని బాలవృత్తము సమీరపోతములందు వర్ణితం బయ్యె.

సీ. శ్యామోదయము కొంచి◊యము చేయ నేతెంచి, శ్యామోదయంబు హె◊చ్చగఁ దనర్చె,
సుమనోవిలాసంబు ◊చూఱపుచ్చఁగఁ జేరి, సుమనోవిలాసంబు ◊లమరఁ జేసెఁ,
దుంగకదంబాభ ◊దూల్పంగఁ బొడకట్టి, తుంగకదంబాభ ◊పొంగఁ దార్చె,
హైమజాలకరూఢి ◊నపహరింపఁగఁ బొల్చి, హైమజాలకరూఢి ◊యడర నూన్చె,
తే. శుచిపలాశాళిహృతిఁ గూర్ప ◊నచల వెలసి, శుచిపలాశాళివర్ధక◊స్ఫూర్తిఁ బొదలె,
నహహ కమలేశ్వరాత్మజా◊తైకమైత్త్రి,కతనఁ జైత్త్రుండు సమ్మదా◊కలన నొంది. 45

టీక: శ్యామోదయము =రాత్రియొక్క యావిర్భావమును; కొంచియము=అల్పమునుగా; చేయన్=చేయుటకు; ఏతెంచి= వచ్చి; శ్యామోదయంబు=ప్రేంకణవృక్షములయొక్కవృద్ధి; హెచ్చగన్=అధికమగునట్లుగా; తనర్చెన్=చేసెను. సుమనోవిలాసంబు=జాజులయొక్క విలాసమును; చూఱపుచ్చఁగన్=కొల్లవెట్టుటకు; చేరి=పొంది (వచ్చి), సుమనోవిలాసంబు = పువ్వులయొక్క యొప్పిదములను; అమరన్=అమరునట్లు (పొసగునట్లు); చేసెన్=ఒనరించెను.

తుంగకదంబాభ– తుంగ=ఉన్నతములగు,కదంబ= కడిమిచెట్లయొక్క, ఆభ=కాంతిని; తూల్పంగన్=తూల్చుటకు; పొడ కట్టి=ఆవిర్భవించి; తుంగకదంబాభ– తుంగ=పున్నాగములయొక్క, 'పున్నాగే పురుష స్తుంగః' అని యమరుఁడు, కదంబ =గుంపులయొక్క, ఆభ=కాంతిని; పొంగన్=అతిశయించునట్లు; తార్చెన్=చేసెను.

హైమజాలకరూఢిన్ = హిమసంబంధులగు బిందువులయొక్క రూఢిని; అపహరింపఁగన్=దోఁచుకొనుటకు; పొల్చి=ఉద యించి; హైమజాలకరూఢి = చంపకసంబంధులగు మొగ్గల రూఢిని; అడరన్=ఒప్పునట్లుగా; ఊన్చెన్=చేసెను.

శుచిపలాశాళిహృతిన్– శుచిపలాశ=కారాకులయొక్క, ఆళి=పరంపరలయొక్క, హృతిన్=హరణమును; కూర్పన్= చేయుటకు; అవలన్=భూమియందు; వెలసి=ప్రకాశించి; శుచిపలాశాళివర్ధకస్ఫూర్తిన్– శుచిపలాశ=నిర్మలములగు మోదు గులయొక్క, ఆళి=పంక్తియొక్క, వర్ధక=వృద్ధిఁజేయుటయందలి, స్ఫూర్తిన్=ప్రకాశముచేత; పొదలెన్=ఒప్పెను.

అహహ=ఆశ్చర్యము! కమలేశ్వరాత్మజాతైకమైత్రికతనన్– కమలేశ్వర=లక్ష్మీపతియైన విష్ణువుయొక్క, ఆత్మజాత=పుత్త్రుఁ డగు మన్మథునియొక్క, ఏక=ముఖ్యమగు, మైత్రికతనన్ =స్నేహమునుబట్టి; చైత్రుండు=వసంతుఁడు; సమ్మదాకలనన్ = సంతోషసంబంధమును; ఒంది =పొంది, పైఁ జెప్పిన విధముగఁ జేసె నని క్రింది కన్వయము.

వసంతము శ్యామోదయము కొంచెము సేయుటకు, సుమనోవికాసంబు చూరపుచ్చుటకు, తుంగకదంబాభ దూల్చుటకు, హైమజాలకరూఢి నపహరించుటకు, శుచిపలాశాళి హృతిఁ గూర్చుటకు పుడమిఁ జేరియు, తద్విరుద్ధములైన శ్యామోదయ మును హెచ్చు సేయుట, సుమనోవిలాసంబు లమరఁ జేయుట లోనగుకార్యము లొనరించుటవలన, 'శ్లో. అన్య త్కర్తు మ్ప్రవృ త్తస్య తద్విరుద్ధకృతి శ్చసా, గోత్రోద్ధారప్రవృత్తోపి గోత్రోద్భేద మ్పురా కరోః' ఇత్యాదులయందువలె, శ్లేషోత్థాపితాసంగత్యలం కారము. ఇట్లు శ్యామోదయ, సుమనోవిలాస, తుంగకదంబాభ ,హైమజాలకరూఢి, శుచిపలాశాళులకు విరోధము సేయ సమ కట్టి వసంతుఁడు తద్విపరీతవర్తనమునఁ జెలంగుట చిత్రము. ఇట్టి దుర్నయమందుఁ బ్రవర్తించిన వసంతుఁడు శ్రీమన్నారాయణ సూనుం డగు మీనకేతనుని సాంగత్యమహిమచే నది మానినాఁ డనుటవలన, 'సారూప్యమపి కార్యస్య కారణేన సమం విదుః' అను సమాలంకారభేదమును గలుగును. వసంతవాసరమందు రాత్రి తక్కువగుటయు, లతలు వృద్ధిఁబొందుటయు, జాజులు విలసిల్లకుండుటయు, పువ్వులు సమృద్ధ మగుటయు, కదంబములు పుష్పింపకుండుటయు, పొన్నలు ప్రకాశించుటయు, మంచుపిండు ముడుఁగుటయు, కొన్ని లోకప్రసిద్ధంబులు, కొన్ని కవిసమయసిద్ధములు. దీనిం గూర్చి కవికల్పలతయందు, 'అసతోపి నిబద్ధేనా నిబద్ధేన సతోపి చ। నియమేన చ జాత్యాదేః కవీనాం సమయ స్త్రిధా। అసతోపి నిబన్ధో యథా। రత్నాని యత్ర కుత్రాద్రౌ హంసా స్స్వల్పజలాశయే। జలేభాద్యన్నభో నద్యా మమ్భోజాద్య న్నదీష్వపి। తిమిరస్య తథా ముష్టిగ్రాహ్యత్వం సూచిభేద్యతా। అఞ్జలిగ్రాహ్యతా కుమ్భోపవాహ్యత్వం విధుత్విషః। శుక్లత్వం కీర్తిహాసాదౌ కార్ష్ణ్యంచాకీర్త్యఘాదిషు। ప్రతాపే రక్తతోష్ణత్వే రక్తత్వం క్రోధరాగయోః। విభావర్యాం భిన్నతయా వర్తనం చక్రవాకయోః। జ్యోత్స్నాపానం చకోరాణా ఞ్చతుష్క ఞ్చ పయోనిధేః। సతో ప్యనిబన్ధో యథా– వసన్తే మాలతీపుష్ప మ్ఫలపుష్పే చ చన్దనే। అశోకే చ ఫలం జ్యోత్స్నా ధ్వాన్తే కృష్ణాన్యపక్షయోః। కామిదన్తేషు కున్దానా ఙ్కుట్మలేషు చ రక్తతామ్। హరితత్వ న్దివా నీలోత్పలానా ఞ్చ వికాసితమ్। వర్ణయే న్న సదప్యేత న్నియమోఽథ ప్రకాశ్యతే। భూర్జత్వ గ్ఘిమవత్యేవ మలయేష్వేవ చన్దనమ్। రక్తత్వం రక్తబన్ధూకబిమ్బామ్భోజవివ

స్వతామ్। తథా వసన్త ఏవాన్యపుష్టానా ఙ్కలకూజితమ్। వర్షాస్వేవ మయూరాణాం రుత న్నృత్యంచ వర్ణయేత్। నియమస్య విశేషోథ పునః కశ్చి త్ప్రకాశ్యతే|' ఇత్యాదిగాఁ జెప్పఁబడినది. వసంతాదులను గూర్చియు నందె యిట్లున్నది. 'సురభే దోలా కోకిల మారుత సూర్యగతి తరుదలోద్భేదాః। జాతీతరపుష్పచయామ్రమఞ్జరీ భ్రమరఝఙ్కారాః। గ్రీష్మే పాటల మల్లీ తాపసరః పథిక శోషవాతోష్ణాః। సక్తుః ప్రపాచ తృష్ణా మృగతృష్ణామ్రాదిఫలపాకాః। వర్షాసు ఘన శిఖి సదనసమాగమాః పఙ్క కన్దలో ద్భేదౌ। జాతీ కదమ్బ కేతక ఝంఝానిల నిమ్నగా హలిప్రీతిః। శరదీన్దు రవిపటుత్వం జలాచ్ఛతాగస్త్య హంస వృషదర్పాః। సప్తచ్ఛద స్సితాభ్రం ధాన్యం శిఖిపక్షమదపాతాః।హేమన్తే దినలఘుతా శీత యవ స్తమ్బ మరువక హిమాని। శిశిరే కరీషధూమ మాః కున్దామ్బుజ దాహ హిమజలోత్కర్షాః।' ఇత్యాదిగా నున్నది. ఇందు వసంతమున సూర్యగతిమాంద్యమున రాత్రి కొంచె మగుటయు, జాజులు వికసిల్లకుండుటయు, కదంబములు వర్షర్తువునందే చెప్పఁదగిన వనుటచే నవి లేకుండుటయు, జాతీతర సర్వకుసుమము లని చెప్పుటచేఁ జంపకాదిపుష్పసమృద్ధి, తరుదలోద్భేదము చెప్పుటచేఁ గారాకులు రాలుటయు లోనగునవి తెలియవలయు.

చ. అలమధువేళఁ దీవ్రవిర౦హాగ్ని శిఖాపరితప్తగాత్రి యౌ
నలినవిరోధివంశజన౦నాయకపుత్త్రి దలంక సాగె న
త్యలఘుసువర్ణకాననవి౦హార్యసమాశుగకాండధారకున్
హలహలధారిదర్పపరి౦హార్యసమాశుగకాండధారకున్. 46

టీక: అలమధువేళన్=ఆవసంతసమయమందు; తీవ్రవిరహాగ్ని శిఖాపరితప్తగాత్రి– తీవ్ర=గాఢమైన, విరహాగ్ని=వియోగ మనెడు వహ్ని యొక్క, శిఖా=జ్వాలలచేత, పరితప్త=మిక్కిలి తపింపఁజేయఁబడిన, గాత్రి=దేహము గలది; ఔ నలినవిరోధి వంశజననాయకపుత్త్రి– ఔ=అగునట్టి, నలినవిరోధివంశజననాయకపుత్త్రి=చంద్రవంశరాజకుమారి యగు చంద్రిక; అత్యలఘు సువర్ణకానన విహార్యసమాశుగకాండ ధారకున్– అత్యలఘు=మిగులనధికమైన, సువర్ణకానన=సంపెంగతోఁటలయందు, విహారి=సంచరించుచున్న, అసమ=సాటిలేని, ఆశుగకాండ=మందమారుతసందోహముయొక్క, ధారకున్=పరంపరకు; హలహలధారి దర్ప పరిహార్యసమాశుగ కాండ ధారకున్– హలహలధారి=రుద్రునియొక్క, 'హాలాహలం హలహలం హలహాలం హలాహలం' అని ద్విరూపకోశము, దర్ప=గర్వమును, పరిహారి= అడఁగించినట్టి మన్మథునియొక్క, అసమ= సాటి లేని, ఆశుగ=బాణములయొక్క,కాండ=సంఘముయొక్క, ధారకున్=అంచునకు; తలంక సాగెన్ = వడఁకసాగెను.

తే. బాల యీలీల మదనరో౦పాలికల క
రాలవర్తనచే మనః౦పాలిఁ గలఁకఁ
జెంది కుందంగఁ దన్నేత్ర౦జితచకోరి,
చేరి యిట్లను సూక్తిరా౦జితచకోరి. 47

టీక: బాల = చంద్రిక; ఈలీలన్=ఈతీరున; మదనరోపాలికల కరాలవర్తనచేన్– మదన=మన్మథునియొక్క, రోపాలికల = శరపరంపరలయొక్క, 'పత్త్రి రోప ఇషు ర్ద్వయోః' అని యమరుఁడు, కరాలవర్తనచేన్=తీక్ష్ణవర్తనచేత; మనఃపాలిన్=హృదయ సీమయందు; కలఁకఁ జెంది = కలఁతపాటి; కుందంగన్=దుఃఖింపఁగా; తన్నేత్రజితచకోరిన్=కన్నులచే గెలువఁబడిన యాఁడు

చకోరములు గల యాచంద్రికను; సూక్తిరాజిత=సూక్తులచేత ప్రకాశించుచున్న;చకోరి=చకోరియనెడు ప్రియసఖి; చేరి=పొంది; ఇట్లనున్=వక్ష్యమాణప్రకారముగఁ బలికెను.

చ. తలఁకెదవేల కీరవని◊తాజనవృత్తికిఁ, దేఁటిరానెలం
తల, కెద వేల మీఱునిజ◊ధైర్యము పాయఁగఁ గుందె దేల, కో
యిలనవలాలసారరుతి, ◊కింతి, మనోజుఁడు సంఘటించుఁ బో
యిల నవలాలసాప్రచయ, ◊మీయెడఁ దన్భజియింప సత్కృపన్. 48

టీక: ఇంతి=చంద్రికా! కీరవనితాజనవృత్తికిన్=శుకాంగనాజనవర్తనమునకు; తేఁటిరానెలంతలకున్=మధుపరాజస్త్రీలకు; తలఁకెద వేల = భయపడెదవేల? కోయిలనవలాలసారరుతికిన్ =కోకిలస్త్రీలయొక్క శ్రేష్ఠమగు ధ్వనికి; ఎదన్=హృదయమునందు; వేల మీఱునిజధైర్యము = మితిమీఱిన నీధీరత్వము; పాయఁగన్=తొలఁగఁగా; కుందెదు ఏల = దుఃఖింతువేల? ఇలన్=భూమియందు; మనోజుఁడు=మన్మథుఁడు; ఈయెడన్=ఇపుడు; తన్=తన్ను; భజియింపన్=సేవింపఁగా; సత్కృపన్ =మంచిదయచేత; నవలాలసాప్రచయము – నవ=నూతనమైన, లాలసా=వేడుకయొక్క, ప్రచయము=ఉత్తరోత్తరాభివృద్ధిని; సంఘటించుఁబో = కూర్చునుబో.
అనఁగా మరుఁడు తన్నుఁ బూజించినవారికి ఉత్తరోత్తరాభివృద్ధిని ఘటిల్లఁజేయును గావున కుందఁ బని లేదని తాత్పర్యము.

తే. కాన నమ్ము నటద్భక్తి◊కలనమునఁ గ
రమ్ము నలినాశుగునిఁ గొల్వ ◊రమ్యకేళి
కాననమ్మున కోనీల◊కంజనయన!
రమ్ము నలి నాశుగతి యిప్డు ◊ప్రబల ననుచు. 49

టీక: కానన్=ఆహేతువువలన; నమ్ము=విశ్వసింపుము; నలినాశుగునిన్ = మన్మథుని; కరమ్ము=మిక్కిలి; నటద్భక్తికలనమునన్ = ప్రకాశించుచున్న భక్తియుక్తిచేత; కొల్వన్=సేవించుటకు; రమ్యకేళికాననమ్మునకున్=మనోజ్ఞమగు క్రీడావనమునకు; ఓనీలకంజనయన=ఓనీలోత్పలాక్షీ! నలిన్=మిక్కిలి; ఆశుగతి=శీఘ్రగమనము; ప్రబలన్=అతిశయింపఁగా; ఇప్డు=ఈసమయమున; రమ్ము; అనుచున్=అని పలుకుచు. దీనికి నుత్తరపద్యముతో నన్వయము.

మ. చెలి కేలందిన మాఱు పల్కక మన◊శ్చింతాకులస్ఫూర్తిఁ ద
త్కలకంఠీర వనంబుఁ జేర నరిగెన్ ◊దత్పద్మినీమౌళి స
త్కలకంఠీరవజాలకంబులు కడున్ ◊గాటంబులై యుజ్జ్వల
త్కలకంఠీరవకామినీనినదరే◊ఖం బల్వెఱన్ గూర్పఁగన్. 50

టీక: చెలి=సఖియగు చకోరి; కేలందినన్=చేయిఁ బట్టఁగా; మాఱు పల్కక=బదులు మాటాడక; మనశ్చింతాకులస్ఫూర్తిన్–మనశ్చింతా=మనోగతమైన ప్రియవిషయకధ్యానముచేత, ఆకులస్ఫూర్తిన్ = వ్యాకులత్వప్రకాశముచేత; తత్కలకంఠీరన్–తత్ = ఆ, కలకంఠీ=చకోరియొక్క, ఇరన్=వాక్యముచేత; తత్పద్మినీమౌళి = ఆపద్మినీజాతిస్త్రీరత్నమగు చంద్రిక; సత్కల

కంఠీరవజాలకంబులు – సత్=శ్రేష్ఠములైన, కలకంఠీ=కోకిలస్త్రీలయొక్క,రవజాలకంబులు = ధ్వనికదంబములు; కడున్= మిక్కిలి; గాటంబులై=దృఢములై; ఉజ్జ్వలత్=ప్రకాశించుచున్న,కల=కాంతిగల,కంఠీరవ=సింహములయొక్క, కామినీ=స్త్రీల యొక్క, నినదరేఖన్=ధ్వనిరీతిని; బల్వెఱన్=గొప్పభయమును; కూర్పఁగన్=ఘటిల్లఁజేయుచుండఁగా; వనంబు=ఉద్యాన వనమును; చేరన్=పొందునట్లుగా; అరిగెన్ =పోయెను. ఆచంద్రిక తననెచ్చిలియగు చకోరివాక్యమునకు మాఱు మాటాడక దానిచే యూఁతగాఁ గొని యుద్యానమునకు వెడలు చుండఁగా కోకిలస్త్రీస్వరములు సింహనాదములభంగిని భయము గలుగఁ జేసె ననుట. అవి యామె కు మిగుల రాగోద్దీపకము లాయె నని ఫలితము.

శా. భ్రాజద్భక్తి నెదుర్కొనంగ వనగోపస్త్రీజనం బాప్తనీ
రేజాస్యానికరంబు తన్ గొలువఁ జేరెన్ గేళికారామ మా
రాజీవాంబక శింజినీనికరగర్జల్ హంసి నేర్వ న్మహా
రాజీవాంబక శింజినీవిరుతిఁ బర్వన్ వేఁడి నిట్టూర్పులున్. 51

టీక: ఆ రాజీవాంబక =కమలనయన యగు నాచంద్రిక; వనగోపస్త్రీజనంబు – వనగోప=ఉద్యానవనపాలికలగు, స్త్రీజనంబు = స్త్రీలు; భ్రాజద్భక్తిన్=ఒప్పుచున్న భక్తిచేత; ఎదుర్కొనంగన్=ఎదురు రాఁగా; ఆప్తనీరేజాస్యానికరంబు – ఆప్త=హితలైన, నీరే జాస్యానికరంబు =స్త్రీసమూహము; తన్=తన్ను ; కొలువన్=సేవింపఁగా; శింజినీనికరగర్జల్ – శింజినీ=అందెలయొక్క, నికర = గుంపుయొక్క, గర్జల్=ధ్వనులను; హంసి=హంసస్త్రీ; నేర్వన్=అభ్యసింపఁగా; మహారాజీవాంబకశింజినీవిరుతిన్ – మహత్ = అధికమైన, రాజీవాంబక=మరునియొక్క, శింజినీ=అల్లెత్రాటియొక్క, తుమ్మెదబారుయొక్కయనుట, విరుతిన్= ఝుంకృతి చేత, ‘శింజినీ నూపురజ్యాయోః’ అని రత్నమాల; వేఁడి నిట్టూర్పులున్=ఉష్ణమైన దీర్ఘనిశ్వాసములు; పర్వన్= వ్యాపింపఁగా; కేళికారామము=క్రీడోద్యానమును; చేరెన్=పొందెను. అనఁగా నాచంద్రిక వనపాలికలు భక్తితో నెదుర్కొనఁగా సఖీవర్గము కొలుచుచుండఁగా హంసపలుకులంబోలు నందెలచప్పుడుతోఁ గూడి, తుమ్మెదఝుంకారములచేఁ గుంది, వేఁడి నిట్టూర్పులు విడుచుచుఁ గేళికావనముం జేరె ననుట.

క. కువలాస్త్రరుజాగతిఁ బొక్కు వలాహకకచకు వనికకొమ రయ్యెడఁ ద
త్కువలాంబకాళి సుధ తేఁకువ లార్చుశుభోక్తిఁ దెల్పెఁ గూరిమి పొదలన్. 52

టీక: అయ్యెడన్=ఆసమయమందు; కువలాస్త్రరుజాగతిన్=మదనజ్వరప్రాప్తిచేత; పొక్కు వలాహకకచకున్ = తపించుచున్న చంద్రికకు, వలాహక మనఁగా మేఘము. దానివంటి వెండ్రుకలు గలది వలాహకకచ; తత్కువలాంబకాళి – తత్=ఆ, కువలాంబ కాళి=స్త్రీసమూహము; సుధతేఁకువలు – సుధ=అమృతముయొక్క, తేఁకువలు=ధైర్యములను; ఆర్చుశుభోక్తిన్ = శమింపఁ జేయు శుభమైనవాక్యముచేత; వనికకొమరు=ఉద్యానముయొక్క యందమును; కూరిమి=ప్రేమము;పొదలన్ = వృద్ధిపొందు నట్లుగా; తెల్పెన్=తెలిపెను.
కామజ్వరముచే ప్రేఁగుచున్న చంద్రికతో నాస్త్రీలు సుధకన్న మధురమైన పల్కులతో నుద్యానవన సౌందర్యమును దెల్పి రనుట.

సీ. బాలాంబుజతమాలమాలాభినవజాల,జాలామృతోల్లోలషట్పదౌఘ,
రాగాదిపరమాగమాగాంతసుపరాగ,రాగావరణభాగరాళపవన,

కేళీగృహన్మౌళి౹మౌళిస్థితపికాళి,కాలీనరవలోలి౹తాధ్వగాత్మ,
రాజీవశరవాజి౹వాజీననిరతాజి,తాజీజనకరాజి౹తామ్రఫలిక,
తే. భవ్యఋతుకాంతకాంతతా౹త్పర్యసృష్ట,ఘనవిషమబాణబాణసం౹ఘాతకలిత
తిలకమధుగంధగంధసం౹చులుకితాశ,కనదచిరధామధామ యి౹వ్వనిక గంటె. 53

టీక: బాలాంబుజ తమాలమాలాభినవ జాలజా లామృ తోల్లోల షట్ప దౌఘ– బాల=లేఁతనైన, అంబుజ=తమ్ములయొక్క యు, తమాలమాలా=కానుగపంక్తులయొక్కయు, అభినవ=క్రొత్తనగు, జాలజాల=మొగ్గలగుంపుయొక్క, అమృత=పూఁదేనియయందు, ఉల్లోల=మిక్కిలి యాసక్తములైన, షట్పద=తుమ్మెదలయొక్క,ఓఘ=సమూహము గలది;
రాగాది పరమాగ మాగాంత సుపరాగ రాగావరణభా గరాళ పవన– రాగాది=దాడిమీవృక్షము మొదలుగాఁగల, పరమ=శ్రేష్ఠము లైన, అగమ=వృక్షములయొక్క, అగాంత=పుష్పములయొక్క,సుపరాగ=మంచిపుప్పొడియొక్క, రాగ=రక్తిమయొక్క, ఆవరణ=ఆచ్ఛాదనమును, భాక్=పొందిన, అరాళ=కుటిలములగు, పవన=వాయువులు గలది;
కేళీగృహ న్మౌళి మౌళి స్థిత పికాలికాలీన రవ లోలి తాధ్వగాత్మ – కేళీగృహత్=విహారగృహములగుచున్న, మౌళి=అశోకవృక్షములయొక్క, మౌళి=అగ్రములయందు, స్థిత=ఉండిన, పికాలికా=కోకిలపంక్తులయొక్క, ఆలీన=స్ఫుటమైన, రవ=ధ్వనిచేత, లోలిత=చలింపఁజేయఁబడిన, అధ్వగ=పాంథులయొక్క, ఆత్మ=మనములు గలది;
రాజీవశర వాజి వాజీన నిరతాజి తాజీ జనక రాజి తామ్రఫలిక – రాజీవశర=మన్మథునికి, వాజి=అశ్వములైన, వాజీన=పక్షిశ్రేష్ఠములయొక్క, నిరతాజిత = ఎల్లప్పుడు నోటువడని, ఆజీ=కలహములకు, జనక=హేతువైన, రాజిత=ఒప్పుచున్న, ఆమ్రఫలిక = మావిపండ్లు గలది;
భవ్య ఋతుకాంత కాంతతాత్పర్య సృష్ట ఘన విషమబాణబాణ సంఘాత కలిత తిలక మధు గంధ గంధ సంచులుకితాశ– భవ్య= మనోజ్ఞమైన, ఋతుకాంత=వసంతునిచేత, కాంతతాత్పర్య=మంచియాసక్తిచేత, సృష్ట=సృజింపఁబడిన, ఘన=అధికములైన, విషమబాణబాణ= మన్మథుని బాణములైన పుష్పములయొక్క, సంఘాత=సముదాయముతో, కలిత=కూడుకొన్న, తిలక= బొట్టుగుచెట్లయొక్క, మధు=మకరందముయొక్క,గంధ=పరిమళముయొక్క, గంధ=లేశముచేత, 'గన్ధో గన్ధక ఆమోదే లేశే సంబంధ గర్వయోః' అని విశ్వము, సంచులుకిత=పుడిసిలింపఁబడిన, ఆశ=దిక్కులు గలదియు నగు;
ఇవ్వనిక=ఈయుద్యానవనము; కనదచిరధామధామ– కనత్=ఒప్పుచున్న, అచిరధామధామ=మెఱుపువంటికాంతిగలదానా! కంటె=చూచితివా? నవాంభోజతమాలజాలకములపూఁదేనియయం దాసక్తము లగు తుమ్మెదలు గలదియు, దాడిమి మున్నగు మ్రాఁకుల పుష్పరేణువులచేత వ్యాప్తములగు తెమ్మెరలు గలదియు, బాటసారుల చిత్తమును జలింపఁజేయు నశోకవృక్షవాసి కోకిలల ధ్వనులు గలదియు, ఎల్లపుడు చిలుకలకు జగడము గలుగఁజేయు మావిపండ్లు గలదియు, వసంతోదయమున నుదయించిన బొట్టుగులపువ్వుల వాసనాలేశముచేఁ బుడిసిలింపఁబడిన దిక్కులు గలదియు నగు నీవనమును జూడు మనుట.

చ. తలిరుమెఱుంగుచాయ శుక౹దారరవస్తనితంబు లెచ్చ ని
స్తులతిలకాభ్రముల్ గురియఁ ౹జొచ్చెఁ బయోజదళాక్షి గాడ్పుచాల్
గలయ మరందదంభమున ౹గాటపువర్షము గంటె సాంద్రము
త్కల యమరం దదంభమున౹కై యళిచాతకకోటి పర్వఁగన్. 54

టీక: పయోజదళాక్షి=పద్మపత్రములఁబోలు కన్నులుగలదానా! నిస్తులతిలకాభ్రముల్= సాటిలేని తిలకవృక్షము లనెడు మేఘములు; తలిరుమెఱుంగుచాయ=చిగురులనెడు మెఱపుడాలు; శుకదారరవస్తనితంబులు– శుకదార=ఆఁడుచిల్కలయొక్క, రవ=ధ్వను లనెడు, స్తనితంబులు = ఉఱుములు; ఎచ్చన్=మించఁగా; గాడ్పుచాల్=వాయుపరంపర; కలయన్ = కూడఁగా; సాంద్రముత్కల = దట్టమైన సంతోషకళ; అమరన్=ఒప్పఁగా; తదంభమునకై = ఆమకరందమనెడు జలమునకై; అళిచాతకకోటి =తుమ్మెదలను చాతకములగుంపు; పర్వఁగన్=వ్యాపింపఁగా; మరందదంభమునన్ = మకరందవ్యాజముచేత; గాటపువర్షము=గాఢమైన వర్షమును; కురియన్ చొచ్చెన్=కురియసాగెను; కంటె=చూచితివా? రూపకకైతవాపహ్నుతులు.

చ. హితమహిలాలలామ వరి౦యింపఁగ నిప్డు నిరస్తహీరభా
తతికరదీ! పికాళివని౦తాశుభగీతి సువర్ణజాలసం
తతికరదీపికాళి వని ౦దార్కొన నామని రాఁగఁ దుంగసౌ
ధతలము లెక్కెఁ గన్గొన ము౦దంబునఁ జిల్కలరాణివాసముల్. 55

టీక: నిరస్తహీరభాతతికరదీ– నిరస్త=తిరస్కరింపఁబడిన, హీరభాతతిక=వజ్రకాంతిపరంపర గల్గిన, రదీ=దంతములు గలదానా! ఇది చంద్రికాసంబోధనము; పికాళివనితాశుభగీతిన్– పిక=కోకిలలయొక్కయు, అళి=తుమ్మెదలయొక్కయు, వనితా = స్త్రీలనెడు స్త్రీలయొక్క, శుభగీతిన్=మంగళమైన పాటతోను; సువర్ణజాలసంతతికరదీపికాళిన్– సువర్ణజాల=సంపెఁగమొగ్గలయొక్క, సంతతి=సమూహమనెడు, కరదీపికా=చేతిదీపములయొక్క, ఆళిన్ =పంక్తితోను; వని=వనమనెడు స్త్రీ; తార్కొనన్ = సమీపింపఁగా; ఆమని=వసంతము; హితమహిలాలలామన్– హిత=ఇష్టమైన, మహిలాలలామన్=ప్రేంకణమనెడు స్త్రీరత్నమును,'శ్యామా తు మహిలాహ్వయా' అని యమరుఁడు; వరియింపఁగన్=వరించుటకు; రాఁగన్=వచ్చుచుండఁగా; ఇప్డు = ఈసమయమందు; చిల్కలరాణివాసముల్ = శుకాంగన లనెడు రాజస్త్రీలు; ముదంబునన్=సంతసముచేత; తుంగసౌధతలములు = పొన్నలయు, మోరటిచెట్లగుంపులయు ప్రదేశము లనెడు ఉన్నతసౌధప్రదేశములను; కన్గొనన్=చూచుటకై; ఎక్కెన్= అధిష్ఠించెను. అనఁగా ఆఁడుకోయిలలయొక్కయు, తుమ్మెదలయొక్కయు పాటలతోడను, సంపెంగమొగ్గ లనెడు కరదీపికలతోడను, వని యెదుర్కొన మహోత్సవముగా వసంతుం డను నొకవరుండు ప్రేంకణ మనెడు స్త్రీరత్నమును వరించుటకై వచ్చిన యట్లున్నదనియు, వానిం గాంచ ముదంబున శుకాంగనలు తుంగసౌధము లెక్కిన యట్లున్నదనియు భావము.

చ. నలువుగ మొగ్గగుబ్బ లెద౦నాటఁగఁ గౌఁగిటఁ జేర్చి నేర్పుతో
మలయధరాధరానిలకు౦మారవిటుండు లతాప్రసూనకో
మలయధరాధరాసవము ౦మాటికి నానుచుఁ జొక్కె మోదముల్
మలయ ధరాధరాగ్రణికు౦మారిక! చూపటు నిల్వఁ జేయవే. 56

టీక: ధరాధరాగ్రణికుమారిక=రాజపుత్త్రికయగు చంద్రికా! మలయధరాధరానిలకుమారవిటుండు– మలయధరాధర = మలయపర్వతముయొక్క, అనిలకుమార=మందమారుతమనెడు, విటుండు=జారుఁడు; నలువుగన్=ఒప్పిదముగా; మొగ్గగుబ్బలు =మొగ్గలనెడు స్తనములు;ఎదన్=హృదయమునందు; నాటఁగన్=తాఁకునట్లు; కౌఁగిటన్=భుజాంతరమున; నేర్పుతోన్=చాతుర్యముతో; చేర్చి=కదియించి; లతాప్రసూనకోమలయధరాధరాసవము– లతా=లతయనెడు, ప్రసూనకోమల=స్త్రీయొక్క, అధరాధర=అధరోష్ఠస్థానీయమైన, ఆసవము=మద్యమును; మాటికిన్=సారెకు; ఆనుచున్=పానము చేయుచు;

మోదముల్=సంతసములు; మలయన్=వ్యాపింపఁగా; చొక్కెన్=సుఖపరవశుఁడయ్యెను; చూపు=దృష్టిని ; అటు=ఆవైపు; నిల్వన్ చేయవే = నిగిడింపవే. మలయమారుతము సేయు విటచరితంబు నాలోకింపు మనుట.

శా. స్ఫీతాళ్యావృతిభూర్యయోవలయలక్ష్మిం బూని పాంథాంగనా
జాతాసృక్పరిషిక్తరీతి నరుణచ్ఛాయల్ మనం బొల్చు నీ
శాతప్రాససమూహజాలకుల మెచ్చన్ జేసెఁ బో చిత్తభూ
శాతప్రాససమూహ జాలజవిభాసంజేతృవక్త్రేందుకా! 57

టీక: జాలజవిభాసంజేతృవక్త్రేందుకా—జాలజ=పద్మసంబంధిని యగు, విభా=కాంతిని, సంజేతృ=జయించిన,వక్త్రేందుకా = చంద్రునివంటి మోముగలదానా! స్ఫీతాళ్యావృతిభూర్యయోవలయలక్ష్మిన్– స్ఫీత=అధికమైన, అళి=తుమ్మెదలయొక్క, ఆవృతి=ఆవరణ మనెడు, భూరి=అధికమైన, అయోవలయ=ఇనుముతొడుపుయొక్క,లక్ష్మిన్=సంపదను;పూని=వహించి; పాంథాంగనాజాతాసృక్పరిషిక్తరీతిన్– పాంథాంగనా=విరహిస్త్రీలయొక్క, జాత=సమూహముయొక్క, అసృక్=రక్తము చేత, పరిషిక్తరీతిన్=తడుపఁబడినదాని రీతిచేత; అరుణచ్ఛాయల్=ఎఱ్ఱనికాంతులు; మనన్=కలుగఁగా; పొల్చు నీశాతప్రాస సమూహజాలకులము– పొల్చు=ఉదయించిన, ఈశాతప్రాస=ఈయెఱ్ఱగన్నెరుల సంబంధియైన, సమూహ=సముదాయము యొక్క, జాలకులము=మొగ్గలగుంపు; చిత్తభూశాతప్రాససమూహన్– చిత్తభూ=మన్మథునియొక్క, శాత=తీక్ష్ణమైన, ప్రాస = ప్రాసమను ఆయుధవిశేషము లనెడు; సమూహన్ = మంచియూహను; ఎచ్చన్ జేసెఁ బో =హెచ్చునట్లు చేసెనుగదా!

అనఁగా నెఱ్ఱగన్నేరుమొగ్గలకు తుమ్మెదలు చుట్టుకొని యుండఁగానవి యినుపతొడుపుతోఁ గూడి పాంథస్త్రీరక్తసిక్తమైన మన్మథుని తీక్ష్ణప్రాసాయుధములను బోలియుండె ననుట.

చ. వలదొర మెచ్చఁగా ఘనసువర్ణపలాశకవాసనాగతిన్
గలసి రజస్స్ఫులింగములు గ్రక్కుచు వీవలి వేగ చేరి రా
నలిని భయానఁ దాఱె నసియాడెడు నెమ్మది పూని కంటివే
నలి నిభయాన దా రెనసి నవ్వ లతల్ తెలిపూలచాలుచేన్. 58

టీక: వీవలి = వాయువు; వలదొర = మరుఁడు; మెచ్చఁగాన్=శ్లాఘింపఁగా; ఘనసువర్ణపలాశకవాసనాగతిన్—ఘన=అధిక మైన, సువర్ణ=చంపకములయొక్కయు, పలాశక=మోదుగులయొక్కయు, వాసనాగతిన్=సౌరభప్రాప్తిచేత; ఘన=మేఘము యొక్క, సువర్ణ=మంచిరంగువంటి రంగుగల, పలాశక=రక్కసులయొక్క, వాసనాగతిన్=సంస్కారప్రాప్తిచేత నని యర్థాంత రము; రెంటికి నభేదాధ్యవసాయముచేత, వాసనాప్రాప్తి యనెడు వాసనాప్రాప్తిచేత నని యర్థము; కలసి=కూడి; రజస్స్ఫులింగ ములు = పరాగము లనెడు మిణుఁగురులను; క్రక్కుచున్=వమనముఁ జేయుచు; వేగ =శీఘ్రముగా; చేరిరాన్=సమీపమునకు రాఁగా; అలిని=ఆఁడుతుమ్మెద, భీరువని తోఁచుచున్నది; లతల్=తీవలు;తారు=తాము; ఎనసి=కూడుకొని;నలిన్=మిగులను; తెలిపూలచాలుచేన్=తెల్లనిపూబంతిచేత; నవ్వన్=హసింపఁగా; అసియాడెడు నెమ్మదిన్ = కదలుచున్న నిండుమనస్సును; పూని =వహించి; తాఱెన్=దాఁగెను; ఇభయాన=ఓ గజగమనవైన చంద్రికా! కంటివే = చూచితివా?

అనఁగా వీవలి పలాశచంపకవాసనావాసితమై రజస్సనెడు మిఱుఁగుఱులను గ్రక్కుచు వచ్చుచున్న దనియు, దానివలన నాఁడుతుమ్మెద వెఱచి డాఁగిన దనియు, పూచినలతలు దానిం జూచి నవ్వునట్లున్న వనియు భావము. చంపకమునకు తుమ్మెద వెఱచుట ప్రసిద్ధము.

మ. అలరెం గొల్వయి కీరభూపతి రసాలాస్థానదేశంబునన్
లలితోఁ దాఱనిసొంపు మించ నళిబాలారత్నలాస్యైకలీ
ల లితోదారపికాళిగీతవిహృతుల్ రాజిల్లఁ గన్గొంటివే
లలితోదారనగప్రసూనరసజాలద్వేషిదంతాంశుకా! 59

టీక: లలితోదారనగప్రసూనరసజాలద్వేషిదంతాంశుకా – లలిత=మనోజ్ఞమైన, ఉదార=అధికమగు, నగ=వృక్షములయొక్క, ప్రసూనరస=పూఁదేనియయొక్క, జాల=రాశికి, ద్వేషి=పగయైన, దంతాంశుకా=పెదవిగలదానా! అనఁగాఁ దేనియ లొలుకు మోవిగలదానా యనుట; కీరభూపతి=చిలుకయను రాజు; రసాలాస్థానదేశంబునన్ – రసాలాస్థానదేశంబునన్=తియ్యమావి యను కొలువుకూటపు ప్రదేశమందు; కొల్వయి=కూర్చుండి యనుట; లలితోన్=ప్రీతితోడ; తాఱనిసొంపు = ఉడివోనిసొంపు; మించన్=అతిశయింపఁగా; అళిబాలారత్నలాస్యైకలీలలు – అళిబాలారత్న=భృంగబాలికారత్నములయొక్క, లాస్య=నాట్యమందలి, ఏక=ముఖ్యమైన, లీలలు=విలాసములు; ఇతోదారపికాళిగీతవిహృతుల్ – ఇత=పొందఁబడిన, ఉదార=అధికమైన, పికాళి=కోకిలల సమూహముయొక్క, గీత=గానముయొక్క, విహృతుల్=విహారములు; రాజిల్లన్=ప్రకాశింపఁగా; అలరెన్=ఒప్పెను; కన్గొంటివే =చూచితివా?

అనఁగా రసాలమందున్న కీరము సభామందిరమందుఁ గూర్చుండిన భూపతిని బోలి యున్నదనియు, తుమ్మెదలయాటలును, గోయిలలపాటలును వనితల లాస్యగానంబులవలె నుండిన వనియు భావము.

చ. అళినికరాందుకాప్తిఁ గిసలావళిరాంకవవస్త్రలబ్ధి ను
జ్జ్వలసుమపద్మయుక్తి మధుసాతిరసాప్లుతి నొప్పి చైత్రభూ
తలవరకుంజరాజితవిధానముఁ గైకొనెఁ గాంచు నీలకుం
తల! వరకుంజరాజి వెఱ దార్చుచుఁ బాంథజనాక్షివీథికిన్. 60

టీక: నీలకుంతల=ఓనీలవేణీ! వరకుంజరాజి – వర=శ్రేష్ఠమగు,కుంజ=పొదరిండ్లయొక్క,రాజి =చాలు;అళినికరాందుకాప్తిన్ – అళినికర=తుమ్మెదలగుంపనెడు,అందుక=నిగళములయొక్క, ఆప్తిన్=ప్రాప్తిచేత; కిసలావళి రాంకవవస్త్రలబ్ధిన్ – కిసలావళి=చిగురాకులగుంపనెడు, రాంకవ=మృగరోమసంబంధియైన,వస్త్ర=వస్త్రముయొక్క, లబ్ధిన్=ప్రాప్తిచేత; ఉజ్జ్వలసుమపద్మయుక్తిన్ – ఉజ్జ్వల=ప్రకాశించుచున్న, సుమ=పువ్వులనెడు, పద్మ=బిందువులయొక్క,'పద్మకం బిన్దుజాలకమ్' అని యమరుఁడు, యుక్తిన్=సంబంధముచేత; మధుసాతిరసాప్లుతిన్ – మధు=మకరందమనెడు, సాతిరస=దానోదకమందు, ఆప్లుతిన్=మునుకచేతను; ఒప్పి; పాంథజనాక్షివీథికిన్—పాంథజన=పథికులయొక్క, అక్షివీథికిన్= దృక్ప్రదేశమునకు; వెఱ= వెఱపును; తార్చుచున్=కలిగించుచు; చైత్రభూతల వరకుంజరాజితవిధానమున్ – చైత్ర=వసంతుఁడనెడు, భూతలవర=భూపతియొక్క, కుంజర=ఏనుఁగుయొక్క, అజిత=ఓటు వడని, విధానమున్=విధిని; కైకొనెన్=స్వీకరించెను; కాంచు =చూడుము.

అనఁగా నికుంజములు తుమ్మెదలను నిగళములతోను, చిగురాకులనెడు రాంకవములతోను, పువ్వులనెడు సిబ్బెపు బొట్టులతోను, పూఁదేనియ యనెడు మదోదకముతోను విలసిల్లి పాంథులచూపులకు వెఱపు గొల్పుచు వసంతుఁడను రాజు యొక్క గజములచాలువలె రాజిల్లె ననుట.

మ. సరసం గాంచవె, రూపదర్శనవిధా◊జాతాత్మవైచిత్ర్యవ

త్సుర! సారంగము లొందెఁ జెంత విగళ◊త్సూనాసవప్రోజ్జ్వల

త్సురసారంగము లధ్వగాంతరసరః◊క్షోభావహోద్వృత్తి భా

సురసారంగము లంగజానలశిఖా◊స్తోకాన్యధూమాకృతుల్. 61

టీక: రూపదర్శనవిధాజాతాత్మవైచిత్ర్యవత్సుర – రూప=సౌందర్యముయొక్క, దర్శనవిధా=దర్శనముయొక్క ప్రకారము వలన, జాత=పుట్టిన, ఆత్మ=చిత్తములయొక్క,వైచిత్ర్యవత్=ఆశ్చర్యము గల్గిన, సుర=దేవతలుగలదానా! సరసన్=చెంగట; అధ్వగాంతరసరఃక్షోభావహోద్వృత్తి భాసురసారంగములు – అధ్వగ=పాంథులయొక్క, అంతర=హృదయములనెడు, సరః =కొలఁకులకు, క్షోభావహ=క్షోభకరమైన, ఉత్=అధికమైన,వృత్తి=వ్యాపారముచేత, భాసుర=ప్రకాశించుచున్న, సారంగ ములు = గజములును; అంగజానలశిఖాస్తోకాన్యధూమాకృతుల్ – అంగజానల=మదనాగ్ని యొక్క,శిఖా=జ్వాలలయొక్క, స్తోకాన్య=అధికమైన, ధూమ=పొగలయొక్క, ఆకృతుల్=ఆకారములు గల్గినవి యగు; సారంగములు=తుమ్మెదలు; చెంతన్ = సమీపమందు; విగళత్సూనాసవప్రోజ్జ్వలత్సురసారంగములు – విగళత్=జాఱుచున్న, సూనాసవ=మకరందముచేత, ప్రో జ్జ్వలత్ = మిక్కిలి ప్రకాశించుచున్న, సురసా = సర్వాక్షితీవలయొక్క, రంగములు = స్థానములను; ఒందెన్ = పొందెను; కాంచవె=చూడుమా.

అనఁగా సర్వాక్షితీఁగలందుఁ బూఁదేనియ జాఱుచుండఁగా నందుఁ దుమ్మెదలు వసించిన వనియు, అవి పాంథుల యంత రంగంబు లనెడు కొలఁకులను క్షోభపెట్టుటయం దేనుఁగులుగాను కామాగ్ని శిఖలధూమంబులుగాను నున్న వనియు భావము.

క. అని వారణయానామణి

కనివారణ వాణిఁ దెలిపి ◊యవ్వనిసిరి యొ

య్యన సారసగంధివితతి

యనసారసుమప్రతాన◊హరణోత్సుకతన్. 62

టీక: అని = ఉక్తప్రకారముచేత;వారణయానామణికిన్ = గజగమనరత్నమగు చంద్రికకు; అనివారణ వాణిన్ = అడ్డములేని ఫణితిచేత; అవ్వనిసిరిన్=ఆవనసంపదను; తెలిపి=బోధించి; ఒయ్యనన్=తిన్నగా; సారసగంధివితతి = పద్మగంధులైన స్త్రీల సమూహము; అనసారసుమప్రతానహరణోత్సుకతన్ – అనసార=అసారముగాని, అనఁగా శ్రేష్ఠమైన, సుమప్రతాన=పుష్ప సంఘముయొక్క, హరణ=కోయుటయందు; ఉత్సుకతన్=కుతూహలముచేత. దీనికి ముందున్న రగడతో నన్వయము.

వృషభగతి రగడ.

చెలువ చెలువపుమొగ్గచాల్కొని ◊చేరు చేరుగఁ గూర్తు విచ్చట

నలిని నలినిభకుంతలామణి ◊నన్ను నన్నులు వేఁడ ముచ్చట

తిలకతిలకకులంబు గన్గొన ॥దివ్యదివ్యాగముల పోలిక
నలరు నలరుల నెనయు రోలం॥బాళి బాళి చిగుర్ప బాలిక
యింతి యింతిటఁ జేరఁ దగదె సు॥మేర మేరయె వకుళపాళిని
కాంతకాంతవశరము లల్లవె ॥కాంత కాంతమె చాల హాళిని
నారి నారికెడంబుచాయల ॥నవ్వ నవ్వలిపొన్న పూచెను
కోరకోరసిజ రతి నది నేఁ॥గోర గోరఁట లజ్జ నాఁచెను
రాగరాగపరాగ మిచ్చ న॥రంగురంగునఁ బొల్చె నెక్కవె
రాఁగ రాగతఁ బట్టుకొనఁ గల॥రవమురవములు దెరల దక్కవె
పొదలుపొదలును దఱిసి నెలఁతలు ॥బొగడఁ బొగడలమీఁద మాటికి
మదిర మది రహి మించ నుమిసిన ॥ మధురమధురస మెనపుఁ బోటికి
కొమ్మ కొమ్మలఁ గోసి విరులు చ॥కోరి కోరినపొదలు దూఱుచు
నిమ్మ నిమ్మదితగమి వేఁడిన ॥నీక నీకనకాళిఁ దాఱుచు
నాస నాసవ మాన నీలల॥నాళి నాళిక పిలుచుఁ బెంపున
వాసవాసమదీప్తి గల నన ॥ వనిత వని తగె గోఁగు సొంపునఁ
గేలి గేలి యొనర్ప నలకం॥కేలి కేలిడి యూఁచు హావళి
సాలసాలపనశుకపికమధు॥పాలిపాలిటి కూర్మికావళి
రామ రామవినీలవంజుల॥రాజి రాజిలు నంఘ్రి చేర్పవె
శ్యామ శ్యామల కోరకమ్ములను ॥సరసనరసముదయము గూర్పవె
యక్క యక్కనకమున మనె నీ॥యాన యానవకళిక యిత్తఱి
నిక్క నిక్కము ద్రుంచి యొసఁగుదు ॥నీవు నీవు లొసంగ బిత్తరి
ప్రమద ప్రమదతఁ గేల నంటఁగ ॥రమ్మ రమ్మరంగఁ జూతము
కొమరె కొమరె సఁగించు నవసుమ॥కులముకులముల భృంగజాతము
అప్ప యప్పల్లవకదంబక॥మాఁగు మా గురుజవము నెగడఁగ
నిప్ప నిప్పద్మాననావ్రజ ॥మించుమించుపలుకులఁ బొగడఁగ
నలమ నలమదిరాక్షి గౌరవిఘ॥లాలి లాలితమైన డాయుచు
కలికి కలికిఁ గడంగె సారస॥కాండకాండచయంబు మ్రోయుచు
వేఁడు వేడుక నిత్తు నీ కి॥వ్వేళ వే లతికాంతవారము

దాడి దాడిమగమికిఁ జేరఁగఁ ◊దగునె దగునెడ కరిగెఁ గీరము
తరుణి తరుణికఁ జేరు నెచ్చెలి ◊దరము దరమున నూర్చు వీవలి
పరువఁ బరువముఁ బొందె వావిలి ◊బాల బాలచ్ఛదసుమావళి
యీవ యీవరకిసలసంతతి ◊కేవ కేవలరయతఁ జేరకు
మావి మావిభు సూను సేనకు◊మహిమ మహి మనుటెంకి దూఱకు
లతిక లతికమనీయపక్వఫ◊లమ్ము లమ్మును మున్నె హెచ్చఁగ
రతిని రతినిభ పాటఁబాడఁగ◊రా ధరాధరకుచలు మెచ్చఁగ
యలసి యలసితపత్ర మెనసె ఘ◊నాత్మ నాత్మకు హితము చేకొన
నలికె నలి కెరలంగ వల దిభ◊యాన యానగమౌళిఁ బైకొన
నెలమి నెలమి న్నలము నెమ్మొగ◊మెత్త మెత్తనికుసుమజాలము
లలినిలలిని నడంచెఁ గనుమో ◊యతివ యతివరకనకసాలము
నలఁచె నలచెలి నతులకీరపి◊కాళికాళిధ్వనుల బలువగ
వలయు వలయుతిఁ జిత్రగతి దై◊వాఱువారుహబాణుఁ గొలువఁగ. 63

టీక: చెలువ =ఓకొమ్మ యని సంబోధనము; చెలువపుమొగ్గచాల్= అందమైన మొగ్గలచాలును; కొని=తీసికొని; చేరు=రమ్ము; ఇచ్చటన్=ఈప్రదేశమునందు; చేరుగన్=సరముగాను; కూర్తువు=గ్రథింతువు; నలినిన్=మిక్కిలి; అలినిభకుంతలామణి= తుమ్మెదలఁబోలు కురులుగల స్త్రీరత్నమా! అన్నులు=స్త్రీలు; వేఁడన్=ప్రార్థింపఁగా; ముచ్చటన్=అందముచేత; నన్నున్ = నను; చేరు అని వెనుక కన్వయము.

బాలిక = ఓచిన్నదానా! తిలకతిలకకులంబు = తిలకతరుశ్రేష్ఠములగుంపు; కన్గొనన్=చూడఁగా; దివ్యదివ్యాగముల పోలికన్– దివ్య=సుందరములైన,దివ్యాగముల =కల్పవృక్షములయొక్క, పోలికన్=సామ్యముచేత; అలరున్=ఒప్పును; రోలంబాళి = భృంగపంక్తి; అలరులన్=పువ్వులను; బాళి =ఆసక్తి; చిగుర్పన్=చిగిరించునట్లు; ఎనయున్=పొందును.

ఇంతి=ఓనారీ! ఇంత=ఇంచుక; ఇటన్=ఇచట; చేరఁన్ తగదె=చేరఁగూడదా? వకుళపాళిని = వకుళపుష్పములచాలునందు; సుమేర (సుమ+ఇర)=పుష్పరసమునకు, 'ఇరా భూ వాక్సురాప్సు స్యాత్' అని యమరుఁడు; మేరయె = అవధి కలదా?

కాంత=ఓయింతీ! కాంత=మనోజ్ఞములైన, కాంతవ=స్మరసంబంధులైన, 'కంతు' శబ్దముమీఁద అణ్ప్రత్యయము వచ్చి కాంతవ యని యైనది, శరములు = బాణములు, అనఁగా పువ్వు లనుట, అల్లవె = అవిగో; చాల హాళిని =అధికమగు ప్రీతితో; కాంతమె = చూతమా!

నారి = ఓచెలీ! నారికెడంబుచాయలన్=టెంకాయచెట్లవైపులను; నవ్వన్=నవ్వఁగా; అవ్వలిపొన్న=అటువైపు నున్న పున్నాగ వృక్షము; పూచెను=కుసుమించెను;

కోరకోరసిజ (కోరక+ఉరసిజ) = మొగ్గలవంటి చన్నులుగలదానా! అని సంబుద్ధి; రతిన్= ఆసక్తిచేత; నేన్=నేను; కోరన్= వాంఛింపఁగా; అది=ఆస్త్రీ; గోరఁటలు=కురవకములను; నాఁచెను=అపహరించెను; అజ్జ = ఆశ్చర్యము!

రాగరాగపరాగము=రాగప్రధానమైన దాడిమీపుష్పరజము; అరంగురంగునన్=వేదిసొబగున; పొల్చెన్=ఒప్పెను; ఇచ్చన్ = యథేచ్ఛగా; ఎక్కవె=అధిష్ఠింపుమా!

రాఁగన్=వచ్చుచుండఁగా; రాగతన్=అనురాగము గల్గుటచేత; పట్టుకొనన్=పట్టుకొనఁగా; కలరవము=కోకిల; రవములు తెరలదు= కూఁతల నుడుగదు; అక్కవె=స్త్రీనిగూర్చి యను ననునయవచనము;

పొదలుపొదలును = ఏపుమీఱిన నికుంజములను; తఱిసి=సమీపించి; నెలఁతలు=స్త్రీలు; పొగడన్=మెచ్చఁగా; పొగడలమీఁదన్ = పొగడచెట్లమీఁద; మాటికిన్=సారెకు; మదిరన్=మద్యమును; మదిన్=హృదయమందు; రహి=ప్రీతి; మించన్=అతిశయింపఁగా; ఉమిసినన్=నిష్ఠీవనము సేయఁగా; పోటికిన్=బదులుగా ననుట; మధురమధురసము=తీయనిమకరందరసమును; ఎనపున్=పొందించును; అనఁగాఁ బొగడలమీఁద స్త్రీలు మద్యము నుమియఁగా నవి పోటికి మధురసము నిచ్చు ననుట. పొగడలకు స్త్రీముఖశీధువు దోహదము గావున స్త్రీలు మద్యము నుమియఁగానే యవి పుష్పించి, పూఁదేనియ లొలికె నని భావము.

కొమ్మ=ఓ యింతీ! కొమ్మలన్=శాఖలందు; విరులు =పూవులు; కోసి; చకోరి=చంద్రికయొక్క చెలి; కోరినపొదలు = ఇష్టమైన నికుంజములను; తూఱుచున్=చొరఁబాఱుచు; ఇమ్ముగ్=నెలవును; ఇమ్ముదితగమి=ఈస్త్రీసంఘము; వేఁడినన్=ప్రార్థించినను; ఈకన్ = ఒసంగకయు; ఈకనకాళిన్=ఈసంపెంగచాలునందు; తాఱుచున్=దాఁచును.

ఆసన్=ఆశచేత; ఆసవము=మద్యమును; ఆనన్=పానముచేయుటకు; ఈలలనాళి=ఈస్త్రీసమూహము; ఆళికన్=చెలిని; పెంపునన్=అతిశయముచేత; పిలుచున్=ఆహ్వానము చేయును;

వనిత=ఓలలనా! వాసవాసమదీప్తి– వాసవ=రత్నసంబంధియగు,'వసూ రత్నే ధనే వసు' అని యమరుఁడు, అసమ=సాటి లేని, దీప్తి= కాంతి; కల=కలిగినట్టి; ననన్=చిగురుచేత; వని=వనము; గోఁగుసొంపునన్=గోఁగుచెట్టుయొక్క అందముచేత; తగెన్= ఒప్పెను.

కేలిన్=క్రీడయందు; గేలి యొనర్పన్=నవ్వులాడినందునకు; అలకంకేలిన్=ఆయశోకమునందు; కేలిడి=హస్తము నూని; ఊఁచు హావళి = ఊఁచునట్టి యుపద్రవము; సొలసొలపన (స+అలస+ఆలపన)=అలసమైన యాలాపములతోఁ గూడిన; శుకపికమధుపాళి పాలిటికి– శుక=చిలుకల యొక్క, పిక=కోకిలలయొక్క, మధుప=తుమ్మెదలయొక్క, ఆలి పాలిటికి = పంక్తిపాలిటికి; ఊర్మికావళి=షడూర్ములచాలు;

రామ=ఓనారీ! రామవినీలవంజులరాజిన్– రామ=ఒప్పుచున్న, వినీలవంజుల=నీలాశోకములయొక్క, రాజిన్=పంక్తియందు; రాజిలు నంఘ్రిన్ = ఒప్పుచున్న చరణమును; చేర్పవె = నిలుపవె.

శ్యామ = ఓచెలీ! శ్యామలకోరకమ్ములను =ప్రేంకణములయొక్క మొగ్గలచేత; సరస సర సముదయము– సరస=శ్రేష్ఠమైన, సర = దండలయొక్క, సముదయము = సమూహమును; కూర్పవె = రచింపవె.

అక్క=ఓతల్లీ! అక్కనకమునన్=ఆసంపెంగయందు; ఆనవకళిక = ఆక్రొత్తమొగ్గ; ఇత్తఱిన్=ఇపుడు; మనెన్=వర్ధిల్లెను; నీయాన = నీ ఒట్టు!

బిత్తరి=ఓకలికీ! నిక్కన్=నిక్కునట్లు; నీవు; నీవులు=మూలధనములను; ఒసంగన్=ఈయఁగా; త్రుంచి=కోసి; ఒసఁగుదున్ = ఇత్తును; నిక్కము = నిశ్చయము!

ప్రమద=ఓవనితా! ప్రమదతన్=సంతోషము గల్గుటచేత; కేలన్ అంటఁగన్=చేతఁ దాఁకుటకు; అరమ్ము=వేగము; అమరంగన్= అమరునట్లుగా; రమ్ము; చూతము = అవలోకింతము.

కొమరె=అమ్మాయీ! సంబుద్ధి; నవసుమకులముకులములన్ – నవ=క్రొత్తనైన, సుమకుల=పుష్పకులములయందు, ముకులములన్ =మొగ్గలయందు; భృంగజాతము=అళికులము; కొమరెసఁగించున్ (కొమరు+ఎసఁగించున్)=అందము నతిశయింపఁజేయును.

అప్ప=ఓవనితా! అప్పల్లవకదంబకము=ఆచివురుజొంపమును; ఇప్పన్=ఇప్పచెట్టునందు; గురుజవము =అధికమగు వేగము; నెగడఁగన్=వృద్ధిఁబొందఁగా; ఇప్పద్మాననావ్రజము=ఈస్త్రీలసమూహము; ఇంచున్= చెఱకును; మించుపలుకులన్ = అతిశయించిన వాక్కుల చేత; పొగడఁగన్=కొనియాడఁగా; ఆఁగుమా=నిలువుమా! అనియన్వయము.

కొరవిఫలాలి=కొరవిచెట్లయొక్క ఫలరాశి; లాలితము ఐనన్ = ఒప్పిదము కాఁగా; అలమదిరాక్షి=ఆస్త్రీ; డాయుచున్=సమీపించుచు; అలమన్=ఆక్రమింపఁగా; కలికి=ఓపడఁతీ! సారసకాండకాండచయంబు– సారసకాండ=మన్మథునియొక్క, కాండ= అశ్వములగు చిలుకలయొక్క, చయంబు= గుంపు; మ్రోయుచున్=రొదసేయుచు; కలికిన్=జగడమునకు; కడంగెన్=దొరకొనెను.

వేఁడు=ప్రార్థింపుము; వేడుకన్=సంతసముతో; నీకున్; ఇవ్వేళన్=ఇప్పుడు; వే=శీఘ్రముగా; లతికాంతవారము=పుష్పసమూహమును; ఇత్తున్ = ఒసంగుదును.

దాడి =ఉపద్రవము; దాడిమగమికిన్=దాడిమీసందోహమునకు; చేరఁగఁ దగునె= పొందఁదగదు; తగునెడకున్= యోగ్యమైన ప్రదేశమునకు; కీరము=చిలుక; అరిగెన్ =చనెను.

తరుణి=పడుచా! నెచ్చెలి =ప్రియసఖి - ఇది కర్త; తరుణికన్=పిన్నగోరంటను; దరముదరమునన్=కొంచెముభయముచేత; చేరున్=పొందును;

బాల=చిన్నదానా! ఊర్పు వీవలిన్=నిశ్వాసమారుతముచేత; వావిలి=వానీరము; బాలచ్ఛదసుమావళి=లేఁతయాకులయు, పుష్పములయొక్కయు గుంపు; పరువన్=వ్యాపింపఁగా; పరువమున్=ప్రాయమును; పొందెన్ = పొందెను.

ఈవ =నీవే; ఈవరకిసలసంతతికిన్= ఈశ్రేష్ఠములగు చిగురుటాకులగుంపునకు; ఏవ=రోఁత; కేవలరయతన్=అధికవేగము చేత; చేరకు=పొందకు;

మావి=ఆమ్రము; మావిభుసూనుసేనకున్—మావిభుసూను=లక్ష్మీపతియైన విష్ణువుయొక్క పుత్త్రుఁడైన మదనునియొక్క, సేనకున్=సేనయగు శుకాదులకు; మహిమన్=ఉత్కర్షచేత; మహిన్=భూమియందు; మనుబెంకి=బ్రతుకుచోటు; తూఱకు = చొరఁబడకు. చొరఁబాఱినచో నా శుకపికాదులకు బాధ కలుగు ననుట.

లతికలు=తీవలు; అతికమనీయపక్వఫలమ్ములు = మిగుల మనోజ్ఞములు, పండినవి యగు పండ్లను; మున్నె=పూర్వమె; హెచ్చఁగన్=మించఁగా; అమ్మున్= విక్రయించును, ఇచ్చు ననుట.

రతినిభ=రతీదేవితోఁదుల్యయగుదానా! రతిని =ఆసక్తిచేత; ధరాధరకుచలు=ఉన్నతస్తనులగు స్త్రీలు; మెచ్చఁగన్=శ్లాఘింపఁగ; పాటఁబాడఁగన్ = పాట పాడుటకు; రా =రమ్ము.

అలసితపత్రము = ఆహంసము, 'హంసాస్తు శ్వేతగరుతః' అని యమరుఁడు; అలి=తుమ్మెద; కెరలంగన్=రేఁగఁగా; ఘనాత్మన్ = మేఘమనెడు బుద్ధిచేత; అలసి=బడలి; ఆత్మకున్=మనమునకు; హితము=ఇష్టమును; చేకొనన్= గ్రహించుటకు; అలికెన్ = వెఱచెను. ఇభయాన=ఓగజగమనా! ఆనగమౌళిన్=ఆవృక్షశ్రేష్ఠమును; పైకొనన్; వలదు=కూడదు.

ఎలమిన్=సంతసముచేత; నెలమిన్న అలము నెమ్మొగము = చంద్రునియొక్క యుత్కర్షమును ఆక్రమించునట్టి (వహించునట్టి) అందమైన మోమును; ఎత్తన్=ఎత్తఁగా; మెత్తనికుసుమజాలములు= మృదువులైన కుసుమపుంజములు; అలిని లలినిన్ = ఆఁడు తుమ్మెదయొక్క వేడుకను; అడంచెన్ = అడఁగించెను; అతివరకనకసాలమున్=మిక్కిలి శ్రేష్ఠమగు సంపెంగవృక్షమును;

ఓయతివ= ఓపడఁతీ! కనుము=చూడుము. 'ముఖరాగేణ చమ్పకః' అను దోహదక్రియద్వారా అతివయొక్క ముఖవికాసము చేత సంపెంగ పుష్పించిన దనియు, సంపెఁగలకు తుమ్మెదలకు గల వైరముచే అట్టి సంపెంగపూలగములు తుమ్మెదల వేడుక నడఁగించె ననియు భావము.

అలచెలిన్=ఆచంద్రికను; అతులకీరపికాళికాళిధ్వనుల బలువగ– అతుల=అధికములగు, కీర=చిలుకలయొక్కయు, పిక= కోయిలలయొక్కయు, ఆళికా= సంఘములయొక్కయు, అళి= తుమ్మెదలయొక్కయు, ధ్వనుల=శబ్దములయొక్క, బలు వగ=అధికమైనయుందము; అలఁచెన్=శ్రమపఱిచెను; వలయుతిన్=బలయుతిన్=బలముతోడ; చిత్రగతిన్=ఆశ్చర్యవర్తన చేత; ద్వైవాఋవారురుహబాణున్ =ఒప్పుచున్న పద్మబాణుని; కొలువఁగన్ వలయు=సేవింపఁగా వలెను.

చ. అని వనకేళికల్ సలిపి ◊యమ్మహిళాతిలకాళిరాగపు
 ష్ట్యనువలితాత్మ చాల వెల◊య న్మహిళాతిలకాళి రాగపు
 ష్పనికర మప్డు గైకొనియెఁ ◊బద్మకరాప్తసుతాపహారిశో
 భనగతిఁ బూని మించ నల◊పద్మకరాప్తసుతార్హణేహచేన్. 64

టీక: అని = ఈప్రకారముగ; వనకేళికల్=వనవిహారములను; సలిపి=చేసి; అమ్మహిళాతిలకాళి = ఆస్త్రీరత్నములచాలు; రాగ పుష్ట్యనువలితాత్మ – రాగపుష్టి=అనురాగపూర్తితో, అనువలిత=కూడుకొన్న, ఆత్మ=చిత్తము; చాలన్=మిక్కిలి; వెలయన్ = ప్రకాశింపఁగా; పద్మకరాప్తసుతాపహారిశోభనగతిన్–పద్మకరా=పద్మములనుబోలు కరములుగల చంద్రికచేత, ఆప్త= పొందఁ బడిన, సుతాప=అధికసంతాపమును, హారి=హరించెడు, శోభనగతిన్=మంగళగతిని; పూని=వహించి; మించన్= అతిశయిం పఁగా; అలపద్మకరాప్తసుతార్హణేహచేన్– అలపద్మకరా=ఆలక్ష్మీదేవికి, ఆప్తసుత=కూర్మిపుత్త్రుఁడగు మన్మథునియొక్క, అర్హణ=పూజయందలి, ఈహచేన్ =వాంఛచేత; మహిళాతిలకాళి రాగపుష్పనికరము– మహిళా=ప్రేంకణములయొక్క, తిల కాళి=బొట్టుగుచాలుయొక్క, రాగ=దాడిమములయొక్క, పుష్పనికరము=పూలసమూహమును; అప్డు =ఆవేళ; కైకొనియెన్ =స్వీకరించెను. ఆస్త్రీనికరము వనవిహారానంతరము చంద్రికాసంతాపశాంతిని గోరి స్మరపూజనమునకై యనురాగముతోఁ బ్రేంకణతిలకాదిపుష్పచయాపచయమును జేసె ననుట.

సీ. తలిరాకు ద్రుంపరే ◊కలకంఠసమవాయ, దర్పంబు దఱుఁగనీ ◊తరుణులార,
 విరిదుమ్ము దూల్పరే ◊విస్ఫుటాసమవాయ,వీయాభ దెఱలనీ ◊వెలఁదులార,
 యలరులు దునుమరే ◊యళి విలాసమ వాయఁ, గలఁకచే బ్రమయనీ ◊చెలువలార,
 ఫలకాళి గోయరే ◊చిలుకచాల్ సమవాయ, గతిఁ జాల నడలనీ ◊యతివలార,
తే. యని మనోంబుజవీథిఁ బొ◊యని మదాప్తి, మారబలరాజ్యవష్టంభ◊మారకప్ర
 చార మూనుచు నపు డనీ◊చారలీల, రామ లందఱు వెడలి రా◊రామపదవి. 65

టీక: తరుణులార! కలకంఠసమవాయదర్పంబు– కలకంఠసమవాయ=కోయిలగుంపులయొక్క, దర్పంబు =గర్వము; తఱుఁగనీ =ఉడుగనీ; తలిరాకున్=చిగురాకును; త్రుంపరే=కోయరే. కోయిలలు చిగురాకులఁదినును గాన, నాచిగురాకులను గోసిన వానిదర్ప ముడుగు ననుట.

వెలఁదులార! విస్ఫుటాసమవాయవీయాభ– విస్ఫుట=మిగుల వ్యక్తమైన, అసమ=సాటిలేని, వాయవీయ=వాయుసంబంధియగు, వాయుశబ్దముమీఁద ఛప్రత్యయము, ఆభ=కాంతి; తెఱలనీ=తొలఁగనీ; విరిదుమ్ము=పుప్పొడి; తూల్పరే=రాల్పరె. విరిదుమ్ముచేతఁ గూడిన వాయువునకు తొల్లిటి విస్ఫుటాసమకాంతి తొలఁగు ననుట.

చెలువలార! అళి=తుమ్మెద; విలాసమ= తనయొక్క విలాసమె; పాయన్=పోఁగా; కలఁకచేన్=కలఁతచేత; బ్రమయనీ =భ్రమనొందనీ; అలరులు = పూవులు; తునుమరే=కోయరె. అళి పుష్పలిహము గావున నవి కోసినచో దాని విలాస ముడుగు ననుట.

అతివలార! చిలుకచాల్=చిలుకలబారు; సమవాయగతిన్ = నిత్యసంబంధప్రాప్తిచేత; చాలన్=మిక్కిలి; అడలనీ=దుఃఖింపనీ; ఫలకాళిన్=పండ్లచాలును; కోయరే =ఛేదింపరే. చిలుకలు ఫలములను భక్షించునవి గనుక నాఫలములను గోసినయెడల నవి దుఃఖించు ననుట.

అని=ఇట్లనుచు; మనోంబుజవీథిన్=హృదయపద్మప్రదేశమును; పాయని మదాప్తి=ఎడయని దర్పప్రాప్తిచేత; మారబలరాజ్యవష్టంభమారకప్రచారము– మార=మన్మథునియొక్క, బల=సైన్యములగు శుకపికాదులయొక్క, రాజి=పంక్తియొక్క, అవష్టంభ=గర్వమునకు, మారక=సంహారకమైన, ప్రచారము=వ్యాపారమును; ఊనుచున్=వహించుచు; అనీచారలీలన్– అనీచ=అధికమైన, అరలీలన్=వేగక్రియచేత; రామ లందఱు =స్త్రీలందఱు; ఆరామపదవిన్=ఉద్యానప్రదేశమందు; వెడలిరి=పైనుడివిన పనులు చేయుటకు బయలుదేఱిరి.

క. వరవనకేళీభవదు,స్తరఘనచూళీతనూతతశ్రమ ముడిపెన్
సరళలతాసరళలతా,విరళలతాంతాప్తపవనవిసరము లంతన్. 66

టీక: అంతన్=అటుపిమ్మట; సరళ లతా సరళ లతావిరళ లతాంతాప్త పవనవిసరము– సరళ=దేవదారువృక్షములయొక్క, లతా=కొమ్మలయొక్క, సరళ=ఋజువులైన, లతా=బండిగురివెందతీవలయొక్క, అవిరళ=సాంద్రములైన, లతాంత=పూవులను, ఆప్త=పొందినట్టి, పవనవిసరము=వాయుసమూహములు; వర వనకేళీ భవ దుస్తర ఘనచూళీ తనూ తత శ్రమము—వర= శ్రేష్ఠమైన, వనకేళీ=వనవిహారముచేత, భవ=ఉదయించిన,దుస్తర=తరింపరాని, ఈరెండు శ్రమమునకు విశేషణములు, ఘనచూళీ=మేఘములఁబోలు కచములు గల స్త్రీలయొక్క, తనూ=శరీరములయందు, తత=విస్తృతమైన,శ్రమము=ఆయాసమును; ఉడిపెన్=పోఁగొట్టెను.

ఉ. ఆరమణీలలామనివహంబు గనుంగొనెఁ జెంత నున్నమ
త్సారముదారసాభియుతజాలపదార్భకదోలదూర్మికా
సారము దారసావరణసారసశోభితతీర మొక్క కా
సార ముదారసారసనిశాపవృతాసితఫేనతారమున్. 67

టీక: ఆరమణీలలామనివహంబు=ఆస్త్రీరత్నములసమూహము; చెంతన్=సమీపమందు; ఉన్నమ త్సార ముదారసాభియుత జాలపదార్భక దోలదూర్మికాసారము– ఉన్నమత్=పెరుఁగుచున్న, సార=శ్రేష్ఠమైన, ముదారస=సంతోషరసముతో, అభియుత=కూడుకొన్న, జాలపదార్భక=హంసపోతములకు, దోలత్=ఉయ్యెల లగుచున్న, ఊర్మికా=తరఁగలయొక్క, ఆసారము = పరంపరలు గలది; దార సావరణ సారస శోభిత తీరము– దార=పెంటిపిట్టలచేత,సావరణ=ఆవరణముతోఁ గూడిన, సారస=బెగ్గురులచేత, శోభిత=ప్రకాశింపఁజేయఁబడిన, తీరము=ఒడ్డు గలదియు; ఉదార సారస నిశాప వృతాసిత ఫేన తార

మున్ – ఉదార=అధికములగు, సారస=కమలములనెడు, నిశాప=చంద్రుని, వృత=ఆవరించిన, అసితఫేన=మిగుల తెల్లనగు నురుఁగు లనెడు, తారమున్=రిక్కలు గలదియు నగు; ఒక్క కాసారము=ఒకసరస్సును; కనుంగొనెన్ =చూచెను.

వ. కనుంగొని యభంగపదాంగదనిస్వానభంగిం దాము వచ్చుతెఱం గెఱింగి యుప్పొంగుచుం దటకటక కాననదేవతాజనంబులు దార్చిన విడిఁదిపిండులవడువునం గమనీయకళికాముక్తావళికావితానంబులం గమ్రసమీరసమాగమ గళత్కంకేళిపాళికా ప్రసవధూళికా రింఛోళికా రాంకవాస్తరణవితానంబులం గనక కక్ష్యామార్గ భాసమాన పరిపక్వ ఫలాభిరామ రంభాపూగంబులం గనత్సుగంధ మరందరసగంధ తైల బంధుర బంధుజీవకోరకదీపకళికాపూగంబులం గనుపట్టుచు రంగుమీఱు కూలరంగ రంగత్కుడుంగంబు లంతరంగంబునకు వేడుక రంగలింప మరాళమందయానా ధవళవర్ణ పరిపూరితంబై యొప్పుమీఱు ప్రతీర శోభనభవనంబున నిస్తులస్థలపద్మవివాహపీఠికాసీమం గూర్చున్న బెగ్గురుపెండ్లికొడుకునకు సుంకులు చల్ల ఘనవేణికాసమాజంబు విరంజిత కింజల్కకలమపుంజ సంజిత దరవికసితశోణకంజోదూఖలంబునన్ దంచు ముసలంబుల సొంపునఁ దదంతరంబునం బతనోత్పనంబు సలుపు మత్తమధుపమాలికలు లోచ నానులాసంబు చాలం బొందింపఁ గాసారకళిందనందినీహ్రదప్రదేశంబు చయ్యనం జొరఁబాఱి కాలకమల లతాకాళియకాకోదరపర్యంకంబు మెట్టి తన్మృణాలభోగంబు వలఱెక్కకేలి సందునం బొందుపడ నిందీ వరపలాశఫణాముఖంబుల మరందవిషపరంపరలు వెడల న్నిజకృష్ణమూర్తిభావంబు సార్థకంబై వర్తిల్ల నర్తనంబు సలుపు కలహంసకులావతంసంబులు ప్రశంసనీయంబులై చూపట్టఁ జందనాచలపవమాన కందళీసముద్గత లోహితారవిందరజోవ్రజ సమావృతగగనభాగకల్పిత సంధ్యాసమయ ముకుళితపుండరీ కాంతరసంవస దమందహిందోలఝంకారంబు లుపాంగంబులుగా నఖిలజగజ్జయసముజ్జృంభితశంబ రారిబిరుదగద్యపద్యజిగాసా కలితమానస జలాధిదేవతాజనంబులు పూనిన పసిండికాయలదండియల దండిఁ దిర్యక్ప్రసారి తైకైకనాళకైకైకకోకరాజంబులు హర్షోత్కర్షంబు పచరింప మిత్రమండలసంయోజిత మహోత్సవంబు నవంబుగా నొంది యాత్మప్రియకామినీయుక్తంబై సారసచారులోచనాశుభగానంబు లనూనంబై తనరఁ గుశేశయనిజనివేశనూతనప్రవేశమంగళ మంగీకరింప నొయ్యనొయ్యన నరుదెంచు రథాంగవంశరత్నంబున కెత్తహల్లకినీపల్లవాధరామతల్లికలు పూనిన జాళువాకదలారతిపళ్లెరంబుల సొంపున హరిత్పరాగ హరిద్రాచూర్ణ సంవ్యాప్త తత్ప్రసవరసపూరాంతర దృశ్యమాన మానితకేసర భక్తాభిరామంబు లగు హల్లకస్తోమంబు లుల్లాసంబు పల్లవింపఁజేయ నిజాంతరంగఖేదకర నిరర్గళఘనా ఘనైకప్రకారం బెల్లకాలంబు నెనయకుండం గోరి కమలకాండభక్షణంబు సలుపుచుఁ గమలాసనాధీనమాన సంబునం గరంబు స్వకీయహంసత్వంబు ప్రసిద్ధిం బొందఁ దపంబుసలుపుపోలుపున నస్తోకకోకనదాశ్రమ మధ్యంబున నుదాత్తతత్పత్త్రవీతిహోత్రకీలంబులు చుట్టు వలగొన నఖండానందంబున నక్షియుగం బర

మోడ్చి యచలితస్ఫురణంబు వహించి రహించు రాయంచలు హృదయాంచలంబున కంచితాద్భుతంబు మించం గావింప నిజవిలోచనసౌందర్య సమాలోకనజనితత్రపాభరంబున ముడింగియున్న కుముదంబులం గాంచి యుబ్బునఁ దద్విలాసదిదృక్షాగరిమంబు పక్షీకరించి యక్షుద్రస్యదంబున నెగసి తద్విభవంబునకు వెఱచి మరలం దాఱుతీరున నుద్వర్తనాపవర్తంబులం బరంగు బేడిసమీల మిట్టిపాటు లతికౌతుకంబు పుట్టింప నతిసమీపసంచరచ్చిత్రభానుహేతిజాలంబులఁ బరితాపంబు నొంది మందపవనసందోహాందోళిత నవీనేందీవరబృందమధుబిందు సేచనంబు గోరి వారిజాతాంతరంబున లీనంబైన యంభోధరపథంబున రోధోదేశవలయిత మనోజ్ఞ మాలతీ మాధవీ మహిలా మల్లికా ముఖ్యవల్లికాకీర్ణ నీరంధ్రపలాశ పాండిత్యంబునం బ్రద్యోతనద్యోతప్రభావంబు పాయం గనుపట్టు తారకావారంబుల మురువున నరవిందమందిరాళిందనివాసి సానందమిళిందసుందరీ సుందరాపఘనఘనప్రభాక్రాంతజలంబులపయిం బొడకట్టు పాండుర డిండీరఖండమండలంబులు సంబరంబులు పొదలింప నమరియు నక్కొలంకు మహితాబ్జకామినీజాలపరిభ్రాజితంబు గావున నళిమిథునమీనకుళీరమకరాదిసంయుతంబై మంజులహర్యన్వితార్యమలసద్విహారభాసురంబు గావునఁ గమనీయ కాదంబసుమనోవికసనవిరాజితంబై మనోజ్ఞహంసకులాధిరాజరామాభిరామప్రస్థానవిశేషంబు గావున నకుంఠతరతరోవిజృంభమాణనానాప్లవగవీ రారాజత్కోలాహలలీలాచుళికితదిశాంతంబై యొప్పుమీఱి చెప్పరాని మోదంబు ముప్పిరిగొనఁజేయ నప్పడంతు లప్పద్మాలయజల విహారదోహదంబునఁ జిలుఁగుపుత్తడివలువలు సడల్చి పావడలు దాల్చి శృంగంబులు గైకొని యొయ్యనొయ్యన నొయ్యారంబు మించ డిగ్గి యపుడు. 68

టీక: కనుంగొని – దీనికి 'డిగ్గి' యను వచనాంతక్రియతో నన్వయము. అభంగపదాంగదనిస్వానభంగిన్ – అభంగ=కొట్టు పాటు లేని, పదాంగద=కాలియందెలయొక్క,నిస్వానభంగిన్ =ధ్వనిరీతిచేత; తాము; వచ్చుతెఱంగు=వచ్చువిధమును; ఎఱింగి = తెలిసికొని, దీనికి 'కాననదేవతాజనంబులు' కర్తలు; ఉప్పొంగుచున్=విజృంభించుచు; తట కటక కాననదేవతా జనంబులు – తట=తీరమనెడు, కటక=రాజధానియందలి, కాననదేవతాజనంబులు =వనదేవతాజనములు; తార్చిన విడిఁదిపిండులవడువునన్ – తార్చిన=ఒనరించినట్టి, విడిఁది= నివేశస్థానములయొక్క, పిండులవడువునన్=సమూహములవలె; కమనీయకళికా ముక్తావళికా వితానంబులన్ – కమనీయ =మనోజ్ఞములగు, కళికా=మొగ్గలనెడు, ముక్తావళికా =ముత్యపుచాలులయొక్క, వితానంబులన్=మేలుకట్లచేతను; కమ్ర సమీర సమాగమ గళత్కంకేళిపాళికా ప్రసవధూళికా రింఛోళికా రాంకవాస్తరణ వితా నంబులన్ – కమ్ర=ఇంపైన, సమీర= వాయువుయొక్క,సమాగమ=చక్కనిరాకచేత, గళత్= జాఱుచున్న, కంకేళిపాళికా = అశోకవృక్షముల పంక్తులయొక్క, ప్రసవ=పూవులయొక్క, ధూళికారింఛోళికా=పరాగపటలమనెడు, రాంకవాస్తరణ=రత్నకంబళములయొక్క, వితానంబులన్=సమూహములచేతను; కనకకక్ష్యా మార్గ భాసమాన పరిపక్వఫ లాభిరామ రంభా పూగంబులన్ – కనకకక్ష్యా=సంపెఁగలచాలనెడు బంగరుహర్మ్యప్రకోష్ఠములయొక్క, మార్గ= దారులందు, భాసమాన= ప్రకాశించుచున్న, పరిపక్వఫల=మాఁగినపండ్లచేత, అభిరామ=ఒప్పుచున్న, రంభా=అనఁటులచేతను, పూగంబులన్= పోక చెట్లచేతను; కన త్సుగంధ మరందరస గంధతైల బంధుర బంధుజీవకోరకదీపకళికా పూగంబులన్

– కనత్=ప్రకాశించుచున్న, సుగంధ=పరిమళగంధము గల్గిన, మరందరస=మకరందరసమనెడు, గంధతైల=గందపునూనె చేత, బంధుర=దట్టములైన, బంధుజీవకోరకదీపకళికా= దాసానమొగ్గలనెడు కలికలవంటి దీపములయొక్క, పూగంబులన్= సమూహములచేతను; కను పట్టుచు = చూపట్టుచు; రంగుమీఱు కూలరంగ రంగత్కుడుంగంబులు – రంగుమీఱు=అతిశ యించుచున్న, కూలరంగ= తీరప్రదేశమునందు, రంగత్ = ఒప్పుచున్న, కుడుంగంబులు =పొదరిండ్లు; అంతరంగంబునకున్ =చిత్తమునకు; వేడుకన్= ఉత్సవమును; రంగలింపన్ = కలయ మెదపఁగా ననుట; మరాళమందయానా ధవళవర్ణ పరిపూరి తంబై – మరాళమందయానా =హంసస్త్రీలనెడు స్త్రీలయొక్క , ధవళవర్ణ=శుభ్రకాంతి యనెడు ధవళమను గీతముల వర్ణముచేత, పరిపూరితంబై =నిండినదియై; ఒప్పుమీఱు ప్రతీర శోభనభవనంబునన్ – ఒప్పుమీఱు=ఒప్పిదముచేత మించునట్టి, ప్రతీరశోభన భవనంబునన్ =తీరమనెడు కల్యాణగృహమందు; నిస్తుల స్థలపద్మ వివాహపీఠికా సీమన్ – నిస్తుల=సాటిలేని, స్థలపద్మ=మెట్ట దామర యనెడు, వివాహపీఠికా=పెండ్లిపీఁటయొక్క, సీమన్=ప్రదేశమందు; కూర్చున్న బెగ్గురుపెండ్లికొడుకునకున్ = కూర్చుండిన బెగ్గురుపక్షియను పెండ్లికొడుకునకు; సుంకులు =వివాహకాలమందు వధూవరులపైఁ జల్లెడువడ్లు; చల్లన్=చల్లు టకు; ఘన వేణికాసమాజంబు – ఘనవేణికా=గొప్పకాల్వలనెడు స్త్రీలయొక్క, సమాజంబు = సంఘము; విరంజిత కింజల్క కలమపుంజ సంజిత దరవికసిత శోణకం జోదూఖలంబునన్ – విరంజిత=మిక్కిలి ప్రకాశించుచున్న, కింజల్క=కేసరము లనెడు, కలమ పుంజ=వడ్లరాశిచేత, సంజిత=కూడుకొన్న, దరవికసిత= కొంచెము విరిసిన, శోణకంజ=రక్తోత్పల మనెడు, ఉదూఖలంబునన్ =ఱోలునందు; దంచు ముసలంబుల సొంపునన్= దంచు నట్టి రోఁకళ్ల యందంబున; తదంతరంబునన్ = ఆకమలమధ్యమున; పతనోత్పనంబున్ = పడుట యెగయుటలను; సలుపు మత్తమధుపమాలికలు = చేయుచున్న మదించిన తుమ్మెదబారులు; లోచనానులాసంబు = నయనానందమును; చాలన్= మిక్కిలి; పొందింపన్=కూర్పఁగా; కాసార కళింద నందినీ హ్రదప్రదేశంబు – కాసార=సరస్సనెడు, కళిందనందినీ=యమునానదియొక్క, హ్రదప్రదేశంబు=అగాధజలప్రదేశ మును; చయ్యనన్=శీఘ్రము గా; చొరఁబాఱి = చొచ్చి; కాలకమల లతా కాళియకాకోదర పర్యంకంబు – కాలకమల=నీలో త్పలసంబంధియగు, లతా=తీవ యనెడు,కాళియకాకోదర=కాళియుఁడనెడు సర్పముయొక్క, పర్యంకంబు =చుట్టను; మెట్టి =త్రొక్కి; తన్మృణాలభోగంబు – తత్=ఆకాలకమలసంబంధియగు, మృణాల=తూఁడనెడు, భోగంబు=సర్పశరీర మును,'భోగ స్సుఖే స్త్ర్యాదిభృతావహేశ్చ ఫణకాయయోః' అని యమరుఁడు; వలతెక్కకేలి సందునన్ = కుడితెక్క యనెడు హస్తమధ్యమందు; పొందుపడన్=అమరు నట్లు; ఇందీవరపలాశఫణాముఖంబులన్ – ఇందీవర= నీలోత్పలములయొక్క, పలాశ=దళములనెడు, ఫణాముఖంబులన్= పడగలయొక్కయగ్రభాగములవలన; మరందవిషపరంపరలు=మకరంద మనెడు విషముయొక్కధారలు; వెడలన్=బయలు దేఱునట్లు; నిజకృష్ణమూర్తిభావంబు=తన నల్లని దేహము గలుగుట యనెడు శ్రీకృష్ణత్వము; సార్థకంబై=అర్థవంతమై; వర్తిల్లన్ =వర్తించునట్లు; నర్తనంబున్=నాట్యమును; సలుపు కలహంస కులావతంసంబులు =చేయుచున్న ధార్తరాష్ట్రశ్రేష్ఠంబు లనుట; ప్రశంసనీయంబులై=శ్లాఘింపఁదగినవై; చూపట్టన్ = అగ పడఁగా; చందనాచలపవమాన కందళీ సముద్గత లోహితారవింద రజోవ్రజ సమావృత గగనభాగ కల్పిత సంధ్యా సమయ ముకుళిత పుండరీకాంతర సంవస దమంద హిందోల ఝుంకారం బులు – చందనాచలపవమాన=మలయమారుతముయొక్క, కందళీ=మోసులచేత, సముద్గత=మీఁదికి వెడలిన, లోహితార వింద=ఎఱ్ఱదామరలయొక్క,రజోవ్రజ =పుప్పొడి మొత్తముచేత, సమావృత=వ్యాప్తమైన, గగనభాగ=ఆకాశప్రదేశముచేత, కల్పిత=కల్పింపఁబడిన, సంధ్యాసమయ =సాయంకాలముచేత, ముకుళిత=మోడ్పునొందిన, పుండరీక=తెల్లఁదామరల యొక్క, అంతర=మధ్యప్రదేశమందు, సంవసత్ =వసించిన, అమంద =అధికములగు, హిందోల=తుమ్మెదలయొక్క, ఝుం కారంబులు=మ్రోఁతలు; ఉపాంగంబులు కాన్ = సుతులు కాఁగా; అఖిల

జగజ్జయ సముజ్జృంభిత శంబరారి బిరుద గద్యపద్య జిగాసాకలిత మానస జలాధిదేవతాజనంబులు – అఖిల= సమస్తమగు, జగత్=లోకములయొక్క, జయ=గెలుపుచేత, సము జ్జృంభిత=మిగుల నుప్పొంగిన, శంబరారి= మన్మథునియొక్క, బిరుద =జయచిహ్నములతోఁగూడిన, గద్యపద్య=గద్య ములయొక్కయు పద్యములయొక్కయు, జిగాసా= గానేచ్ఛతోడ, ఆకలిత=మిగుల సంబంధించిన, మానస=చిత్తములు గల, జలాధిదేవతాజనంబులు = జలాదిష్ఠానదేవతలు; పూనిన పసిండి కాయల దండియలదండిన్ – పూనిన=వహించినట్టి, పసిండికాయల=బంగరుకాయలు గల, దండియల దండిన్= వీణా దండముల విధమున; తిర్యక్ప్రసారి తైకైకనాళకైకైక కోక రాజంబులు – తిర్యక్ప్రసారిత= అడ్డముగఁ జాపఁబడిన, ఏకైక నాళక=ఒక్కొకతామరతూఁడుగల, ఏకైకకోకరాజంబులు= ఒక్కొక చక్రవాకశ్రేష్ఠములు; హర్షోత్కర్షంబు = సంతసంబు నతిశ యమును; పచరింపన్=చేయఁగా; అనఁగా మలయమారు తాంకురములచే నెఱ్ఱదామరలపుప్పొడులు గగన భాగము నిండి సంధ్యాకాలమును దోఁపించుచున్నవనియు, అపుడు సంధ్యా సమయభ్రాంతిచేఁ దెల్లదామరలలోఁ జేరినతేఁటులు రొదసేయు చున్నవనియు, ఆరొదలు జక్కవ లొక్కొక్కటి యొక్కొక్క మృణాళమును బూని, మదనబిరుద గద్యపద్యములు గానము సేయు తలంపున జలాధిదేవతలు పూనిన పసిండిదండియలఁ బోలియుండఁగాఁ, దద్దేవతాగానంబులకు నుతులుగా నుండె ననియు భావము.

మిత్రమండలసంయోజిత మహోత్సవంబు – మిత్రమండల=సూర్యమండల మనెడు సుహృన్మండలముచేత, సంయోజిత = కూర్పఁబడిన, మహోత్సవంబు =ఎక్కుడైన వేడుక; నవంబుగాన్=అపూర్వమగు రీతిగా; ఒంది =పొంది; ఆత్మప్రియకామినీ యుక్తంబై – ఆత్మ=తనయొక్క,ప్రియకామినీ=ప్రియస్త్రీతోడ,యుక్తంబై=కూడుకొన్నదై, సారసచారులోచనాశుభగానంబులు – సారసచారులోచనా=ఆఁడుబెగ్గురులయొక్క, శుభగానంబులు=మంగళమైనపాటలు; అనూనంబై = అధికమై; తనరన్ = ఒప్పుచుండఁగా; కుశేశయ నిజనివేశ నూతనప్రవేశ మంగళము – కుశేశయ=శతపత్రమనెడు, నిజనివేశ=తనగృహమందు, నూతనప్రవేశ=క్రొత్తగాఁ బ్రవేశించుటయొక్క, మంగళము= శుభమును; అంగీకరింపన్=పొందుటకు; ఒయ్యనొయ్యనన్ = తిన్నతిన్నగా; అరుదెంచు రథాంగవంశరత్నంబునకున్ – అరుదెంచు =వచ్చుచున్న,రథాంగవంశరత్నంబునకున్=చక్రవాక కులశ్రేష్ఠమునకు; ఎత్తన్=ఆరతి నెత్తుటకు; హల్లకినీ పల్లవాధరామతల్లికలు – హల్లకినీ=చెంగల్వలతలనెడు, పల్లవాధరామత ల్లికలు= ప్రశస్తాంగనలు; పూనిన=వహించినట్టి; జాళువా=స్వర్ణమయములగు, కదలారతిపళ్లెరంబులసొంపున =ఒకవిధమైన యారతితట్టలయొక్క విధమున, వివాహాదిశుభసమయములందు వధూవరులు ప్రవేశించు నెడ హరిద్రాజలాదులతో నెత్తు నార తికి కదలారతి యని ప్రసిద్ధి; హరిత్పరాగ హరిద్రాచూర్ణ సంవ్యాప్త తత్ప్రసవరసపూ రాంతర దృశ్యమాన మానితకేసరభక్తాభి రామంబులు – హరిత్పరాగ=పచ్చనిపుప్పొడి యనెడు, హరిద్రాచూర్ణ=పసుపుపొడిచేత, సంవ్యాప్త=పొందఁబడిన, తత్ప్రసవ రసపూర=ఆచెంగల్వపూఁదేనియయొక్క వఱదయొక్క, అంతర=మధ్యభాగమందు, దృశ్యమాన=చూడఁబడుచున్న, మానిత=శ్రేష్ఠములగు, కేసర=కింజల్కము లనెడు, భక్త=ఓదనముచేత, అభిరామంబులు =ఒప్పుచున్నవి; అగు హల్లకస్తోమం బులు = అయినట్టి ఎఱ్ఱగలువలగుంపులు; ఉల్లాసంబు = సంతసమును; పల్లవింపఁజేయన్=చిగిరింపఁజేయగా; అనఁగా చక్ర వాకశ్రేష్ఠము నిజకామినీసమేతంబై సూర్యోదయపరికల్పితంబగు మహోత్సవంబున కుశేశయమును బ్రవేశించుచుండఁగా నూతనగృహప్రవేశమును మిత్రమండలకృతమహోత్సవం బెనసి చేయుచున్నట్లుండె ననియు, అపు డాఁడుబెగ్గురులు ధ్వని సేయుచుండఁగా స్త్రీలు పాట పాడుచున్నట్లుండె ననియు, చెంగల్వతీవెలు పచ్చనిపరాగముతోఁ గూడి మకరందభరితములై కేసరయుక్తంబు లగు చెంగల్వలతోఁ గూడి యుండఁగా నూతనగృహప్రవేశ మొనరించు రథాంగదంపతులకు మంగళస్త్రీలు గదలార తెత్తుటకు బంగరుపళ్లెరములు పూని వానిలోఁ బసుపునీరు, అన్నపుమెతుకులు వేసికొని యెదురుగ నిల్చినట్లుండె ననియు భావము.

నిజాంతరంగ ఖేదకర నిరర్గళ ఘనాఘ నైక ప్రకారంబులు – నిజాంతరంగ=తనచిత్తమునకు, ఖేదకర=దుఃఖకరమైన, నిరర్గళ = ఆటంకములేని, ఘనాఘన=మత్తగజము లనెడు ఘాతుకులయొక్క, ఏక=ముఖ్యమైన, ప్రకారంబులు=రీతులు; ఎల్ల కాలంబు = కలకాలము; ఎనయకుండన్=పొందకుండఁగా; కోరి =వాంఛించి; కమలకాండభక్షణంబు – కమలకాండ=బిసమనెడు నుదకపూరముయొక్క, భక్షణంబు=మెసవుటను; సలుపుచున్=చేయుచు; కమలాసనాధీనమానసంబునన్ – కమలాసన = పద్మాసన మనెడు బ్రహ్మకు, అధీన=వశంవదమైన, మానసంబునన్=మనసుచేత; కరంబు=మిక్కిలి; స్వకీయహంసత్వంబు = తన యంచతనమనెడు యతిత్వము; ప్రసిద్ధిన్ పొందన్=ఖ్యాతి గాంచునట్లు; తపంబుసలుపుపోలుపునన్= తప మొనరించు నట్లుగ; అస్తోకకోకనదాశ్రమమధ్యంబునన్ – అస్తోక=అధికమైన, కోకనద=రక్తోత్పలమనెడు, ఆశ్రమ=ఆశ్రమముయొక్క, మధ్యంబునన్ = మధ్యభాగమందు; ఉదాత్తతత్పత్ర వీతిహోత్రకీలంబులు – ఉదాత్త=ఉత్కృష్టములగు, తత్పత్ర=ఆకోకనద దళము లనెడు, వీతిహోత్రకీలంబులు = అగ్ని జ్వాలలు; చుట్టు వలగొనన్=చుట్టుకొనఁగా; అఖండానందంబునన్=అవిచ్ఛిన్నా నందముచేత; అక్షియుగంబు=నేత్రద్వయము; అర మోడ్చి=సగము మూసికొని; అచలితస్ఫురణంబు=కదలకుండుటను; వహించి = పూని; రహించు రాయంచలు = వర్తించుచున్న రాజహంసలు; హృదయాంచలంబునకున్ = మనోదేశమునకు; అంచితాద్భుతంబు =ఒప్పుచున్న యాశ్చర్యమును; మించన్=మించునట్లు; కావింపన్=చేయఁగా; అనఁగా నాకొలఁకునందు రాయంచలు రక్తోత్పలమధ్యమునఁ బద్మములపైఁ గూర్చుండి కమలకాండభక్షణము సేయుచుఁ గన్ను లరమోడ్చుకొని కదల కుండఁగా, మేఘము లనెడు దుష్టులవలనఁ దమకుఁ గలకాల మపాయము రాకుండుటకై కోకనద మను నాశ్రమమధ్యమున జల భక్షణము సేయుచు బ్రహ్మను గూర్చి తపం బొచరించుచు నానందమునఁ గన్ను లరమోడ్చి కదలకుండఁ దమహంసత్వముఁ బ్రసిద్ధినొందించుచున్న ట్లుండె ననియు, రక్తోత్పలదళములు చుట్టుముట్టి యుండఁగా నవి యగ్ని శిఖలను బోలి యాహంసలు పంచాగ్ని మధ్యమునఁ గూర్చుండినట్లు తోఁపించుచుండె ననియు భావము.

నిజవిలోచన సౌందర్య సమాలోకన జనిత త్రపాభరంబునన్ – నిజ=స్వకీయ మగు, ఈనిజపదము చంద్రికాసఖీగణపరము, విలోచన=కన్నులయొక్క, సౌందర్య=అందముయొక్క, సమాలోకన=సందర్శనముచేత,జనిత=కల్గిన, త్రపాభరంబునన్ = లజ్జాతిశయముచేత; ముడింగియున్న కుముదంబులన్ = ముకుళించియున్న కలువలను; కాంచి=చూచి; ఉబ్బునన్ = సంతోషముచేత; తద్విలాసదిదృక్షాగరిమంబు – తద్విలాస=ఆస్త్రీనయనవిలాసముయొక్క, దిదృక్షా=దర్శనేచ్ఛయొక్క, గరిమంబు = అతిశయమును; పక్షీకరించి =స్వీకరించి; అనఁగా నయనసౌందర్యము చూడవలె నని వాంఛాతిశయము నొంది యనుట; అక్షుద్రస్యదంబునన్=అతివేగముచేత,'రయ స్స్యదః' అని యమరుఁడు; ఎగసి =పైకెగిరి; తద్విభవంబునకున్=ఆ స్త్రీనయన విభవమునకు; వెఱచి=భయపడి; మరలన్; తాఱుతీరునన్=మఱుఁగుపడురీతిగా; ఉద్వర్తనాపవర్తంబులన్ = ఎగ యుట మఱ లుటలచేత; పరఁగు బేడిసమీల మిట్టిపాటులు = ఒప్పుచున్న మత్స్యవిశేషములయొక్క యెగిరిపడుటలు; అతి కౌతుకంబు = మిక్కిలిసంతోషమును; పుట్టింపన్=కలిగింపఁగా; అనఁగా నాకొలఁకునం గలువలు ముకుళించి మత్స్యము లెగిరి పడుచుండఁ గా ఆస్త్రీనయనసౌందర్యమును జూచి సిగ్గుచేతఁ గలువలు ముగిడినట్లుండె ననియు, మత్స్యము లా కుముదములను జూచి తామును దన్న యనసౌందర్యము గాంచఁ జెంగున నెగిరి తన్నేత్రసౌందర్యమునకు వెఱచి మఱలఁ దాఱుచున్నట్లుండె ననియు భావము;

అతిసమీప సంచర చ్చిత్రభాను హేతిజాలంబులన్ – అతిసమీప=మిక్కిలి సమీపదేశమునందు, సంచరత్=సంచరించుచున్న, చిత్రభాను=సూర్యునియొక్క, హేతిజాలంబులన్=కిరణసమూహమువలన; పరితాపంబున్=మిక్కిలి తాపమును; ఒంది = పొంది; మందపవన సందోహాందోళిత నవీనేందీవరబృంద మధుబిందు సేచనంబున్–మందపవన=మందమారుతముయొక్క, సందోహ=సమూహముచేత, ఆందోళిత=చలింపఁజేయఁబడిన, నవీన=క్రొత్తనైన, ఇందీవరబృంద=నల్లగలువలసమూహము

యొక్క, మధుబిందు = మకరందబిందువులచేత, సేచనంబున్=తడుపుటను; కోరి =ఇచ్ఛించి; వారిజాతాంతరంబునన్ = పద్మ మధ్యమందు; లీనంబైన యంభోధరపథంబునన్=దాఁగియున్న యాకాశమందు; రోధోదేశ వలయిత మనోజ్ఞ మాలతీ మాధవీ మహిలా మల్లికా ముఖ్య వల్లికా కీర్ణ నీరంధ్ర పలాశ పాండిత్యంబునన్ – రోధోదేశ=తీరప్రదేశమందు, వలయిత=చుట్టుకొన్న, మనోజ్ఞ = అందమైన, మాలతీ=జాజి, మాధవీ=బండిగురివెంద, మహిలా=ప్రేంకణము, మల్లికా=మల్లె, ముఖ్య=మొదలుగాఁ గల, వల్లికా=తీవలచేత, కీర్ణ=వ్యాప్తములైన, నీరంధ్ర=దట్టమైన, పలాశ=మోదుగులయొక్క, పాండిత్యంబునన్=అతిశయము చేత; ప్రద్యోతనద్యోతప్రభావంబు – ప్రద్యోతన=సూర్యునియొక్క, ద్యోత=ప్రకాశముయొక్క, ప్రభావంబు=మహిమ; పాయన్ = పోఁగా; కనుపట్టు తారకావారంబుల మురువునన్ – కనుపట్టు =అగపడునట్టి, తారకావారంబుల = నక్షత్రసంఘముయొక్క, మురువునన్=సౌందర్యముచేత, దీనికి 'పొడకట్టు' నను క్రియతో నన్వయము;అరవిందమందిరాళింద నివాసి సానంద మిళింద సుందరీ సుందరాపఘన ఘనప్రభాక్రాంత జలంబులపయిన్–అరవిందమందిర=పద్మము లనెడు గృహములయొక్క, అళింద =చత్వరములందు, నివాసి=నివసించి యున్న, సానంద=సంతసముతోఁ గూడిన, మిళిందసుందరీ=ఆఁడుతుమ్మెదలయొక్క, సుందరాపఘన=చక్కనిదేహములయొక్క, ఘనప్రభా=అధికకాంతిచేత, ఆక్రాంత=వ్యాప్తమైన, జలంబులపయిన్=నీటిపైని; పొడకట్టు పాండుర డిండీరఖండ మండలంబులు – పొడకట్టు =అగపడుచున్న, పాండుర=తెల్లనైన, డిండీరఖండ=ఫేనఖండ ములయొక్క, మండలంబులు=సమూహములు; సంబరంబులు=సంతోషములను; పొదలింపన్=వృద్ధిఁజేయఁగా; అనఁగా నాకొలఁకునందలిజలము తుమ్మెదలదేహకాంతిచేత తటద్రుమచ్ఛాయావృతమై నల్లనై యుండఁగా నందుండు ఫేనఖండములు, సూర్యుండు చెంత నుండుటం జేసి కలిగిన తాపాతిశయముచేత నాకసము నీలోత్పలమరందబిందుసేకముం గోరి కాసారమును జేరి తటద్రుమసందోహముచేత సూర్యప్రకాశము నెంతయు నొందకుండఁగా, నందుఁ జూపట్టు రిక్కలగుంపువలె నుండె ననుట; అమరియున్=ఒప్పియు; అక్కొలంకు=ఆకాసారము; మహితాబ్జకామినీజాలపరిభ్రాజితంబు – మహిత=ఒప్పుచున్న, అబ్జ కామినీ=చంద్రునిభార్యలగు నక్షత్రములయొక్క, జాల=సమూహముచేత, పరిభ్రాజితంబు =ప్రకాశించుచున్నది; కావునన్ = అగుటవలన; అళి మిథున మీన కుళీర మకరాది సంయుతంబై – అళి=వృశ్చికము, మిథున=మిథునము, మీన=మీనము, కుళీర =కర్కాటకము, మకర=మకరము, ఆది=మొదలగు రాసులతో, సంయుతంబై =కూడినదై, అనఁగా మహితములైన అబ్జము లనఁగా పద్మములు, కామిని యనఁగా నాఁడుజక్కవలు, వీనిసంఘములతోడఁ గూడి యళిమిథునములు, మత్స్య ములు, ఎండ్రకాయలు, మొసళ్ళు లోనగువానితోఁ గూడియున్నదని వాస్తవార్థము;

మంజుల హర్యన్వితార్యమ లసద్విహార భాసురంబు – మంజుల=మనోజ్ఞమగు, హరి=సింహరాశితో, అన్విత=కూడిన, అర్యమ=సూర్యునియొక్క, లసద్విహార=ప్రకాశించు విహారముచేత, భాసురంబు=ప్రకాశించునది; కావునన్=అగుటచేత; కమనీయ కాదంబసుమనో వికసన విరాజితంబై – కమనీయ = మనోజ్ఞమగు, కాదంబ=కదంబవృక్షసంబంధియైన, సుమనః= పువ్వులయొక్క, వికసన=విరియుటచేత, విరాజితంబై =ప్రకాశమానమై; అనఁగా సరస్సు, మంజు=మనోజ్ఞమగు, లహరీ= ప్రవాహమును, అన్విత=పొందినట్టి, అరి=జక్కవలయొక్క, అమల=నిర్మలమైన, సద్విహార=ప్రకాశించు విహారముచేత, భాసురంబు=ప్రకాశించునదై, కమనీయ = మనోజ్ఞమగు, కాదంబ =బెగ్గురులయొక్క,సు=లెస్సైన, మనః=మనస్సుయొక్క, వికసన=విరియుటచేత,విరాజితంబై =ప్రకాశమానమై అని వాస్తవార్థము;

మనోజ్ఞ హంసకులాధిరాజ రామాభిరామ ప్రస్థానవిశేషంబు – మనోజ్ఞ=మనోహరమైన, హంసకులాధిరాజ=సూర్యవంశ స్వామి యైన, రామ=రామునియొక్క, అభిరామ=హృద్యమగు, ప్రస్థానవిశేషంబు = యాత్రావిశేషము; కావునన్=కాఁబట్టి; అకుంఠతర తరో విజృంభమాణ నానా ప్లవగవీ రారాజ త్కోలాహల లీలా ముళికిత దిశాంతంబై – అకుంఠతర=మిగుల నడ్డములేని, తరః =వేగముచేత, విజృంభమాణ=విజృంభించుచున్న, నానా=అనేకప్రకారులగు, ప్లవగవీర=వానరవీరుల

యొక్క, ఆరాజత్= మిగుల నొప్పుచున్న, కోలాహల=కలకలధ్వనియొక్క, లీలా=విలాసముచేత, చులుకిత=పుడిసిలింపఁబడిన, దిశాంతంబై = దిగంతములు గలదై; అనఁగా నా కొలను, మనోజ్ఞమైన, హంసకులాధిరాజరామా=రాజహంసస్త్రీలచేత, అభిరామ=ఒప్పు చున్న, ప్రస్థానవిశేషంబు = ప్రకృష్టమైన స్థానవిశేషము గలది కావున, అకుంఠతరతరోవిజృంభమాణములైన నానా=అనేకప్రకారములైన, ప్లవ=తెప్పలయొక్క, గో=కాంతులచేత,'గోరతద్ధితలుకి' అని టచ్ ప్రత్యయము ఇోప్పు వచ్చిన పైని ప్లవగవీ యను రూపము సిద్ధించు చున్నది, రారాజత్=మిక్కిలి యొప్పుచున్న, కోలాహలములయొక్క లీలచేత చుళికిత దిశాంతంబైన దని వాస్తవార్థము;

ఒప్పుమీఱి=అతిశయించి; చెప్పరాని మోదంబు=చెప్ప నలవిగాని సంతోషము; ముప్పిరిగొనన్=మూఁడుమడుఁగులగునట్లు; చేయన్ = చేయఁగా; అప్పడంతులు=ఆస్త్రీలు; అప్పద్మాలయ జలవిహార దోహదంబునన్– అప్పద్మాలయ=ఆకొలనులోన, జలవిహార=జలక్రీడయందలి, దోహదంబునన్=వాంఛచేత, 'అథ దోహదమ్, ఇచ్ఛా కాంక్షా' అని యమరుఁడు; జిలుఁగు పుత్తడి వలువలు = సూక్ష్మములైన కనకాంబరములను; సడల్చి=విడిచి; పావడలు=పరికిణీలను; తాల్చి=ధరించి; శృంగంబులు = కొమ్ములను;కైకొని=స్వీకరించి; ఒయ్యనొయ్యనన్=తిన్నతిన్నఁగా; ఒయ్యారంబు =విలాసము; మించన్=అతిశయింపఁగా; డిగ్గి=కొలనియందుఁ బ్రవేశించి; అపుడు=ఆసమయమున. దీని కుత్తరపద్యమందున్న 'ఈఁదిరి' అను క్రియతో నన్వయము.

ఉ. తమ్ములఁ జేరి రోదరశ౹తమ్ములఁ గైకొని తావి భృంగపో
తమ్ముల కుంచి యౌవతయు౹తమ్ముల మత్తమరాళరాజజా
తమ్ముల మించి చిత్రచరి౹తమ్ముల నీఁదిరి కొమ్మ లెల్లఁ జి
త్తమ్ముల వారిదేవతలు ౹తమ్ము లలిన్ వినుతింప నయ్యెడన్. 69

టీక: అయ్యెడన్=ఆసమయమునందు; కొమ్మ లెల్లన్=స్త్రీలందఱు; తమ్ములన్=పద్మములను; చేరి=పొంది; రోదరశతమ్ములన్ = చక్రవాకశతములను;కైకొని=స్వీకరించి; తావిన్=పరిమళమును; భృంగపోతమ్ములకున్ =తుమ్మెదబిడ్డలకు; ఉంచి = నిల్పి; యౌవత=యువతీసమూహముతో; యుతమ్ములన్=కూడియుండినట్టి; మత్తమరాళరాజజాతమ్ములన్– మత్త=మదించిన, మరాళరాజ=రాజహంసశ్రేష్ఠములయొక్క, జాతమ్ములన్=సమూహములను; మించి=అతిశయించి; వారిదేవతలు =జలాధిదేవతలు; చిత్తమ్ములన్=మనస్సులయందు; తమ్మున్=తమను; లలిన్=ప్రేమతో; వినుతింపన్=కొనియాడఁగా; చిత్రచరితమ్ములన్ = ఆశ్చర్యకరమైన వ్యాపారములచేత; ఈఁదిరి=జలక్రీడ సల్పిరి.

అనఁగా నాస్త్రీలు కొలను ప్రవేశించి తమ్ము జలాధిదేవతలు కొనియాడునట్లు పైఁజెప్పిన విధముగ నీఁది రనుట.

మ. తరుణాంభోరుహపీఠిఁ బొల్చి సుమనో౹దంతుల్ నవాంభఃపరం
పర పైపైఁ గడుఁ జల్ల సారసము ప్రే౹మన్ గేలునన్ బట్టి క
ర్బురసంహారిసుగాత్రికాతిసమతా౹స్ఫూర్తిన్ గర మ్మొక్క క
ర్బురసంహారిసుగాత్రికాతిలక మిం౹పుల్ గూర్చెఁ ద న్గన్గొనన్. 70

టీక: ఒక్క కర్బురసంహారిసుగాత్రికాతిలకము— ఒకస్త్రీరత్నము, కర్బుర మనఁగా సువర్ణము. దానిని సంహరించెడు ననఁగా తిరస్కరించెడు దేహము గలవారు స్త్రీలు. అట్టివారిలో తిలకరూపయైన స్త్రీ యనుట; తరుణాంభోరుహపీఠిన్ = నవాంబుజమను పీఠమందు; పొల్చి=ఒప్పి; సుమనోదంతుల్=స్త్రీలనెడు దివ్యగజములు; నవాంభఃపరంపరన్=నూతనమైన జలధారలను;పై పైన్=మీఁదమీఁదను; కడున్=మిక్కిలి; చల్లన్=చల్లుచుండఁగా; సారసమున్=పద్మమును; ప్రేమన్=ప్రేమచేత; కేలునన్=చేతి చేత; పట్టి=ధరించి; కర్బురసంహారిసుగాత్రికాతిసమతాస్ఫూర్తిన్ – కర్బురసంహారి=రాక్షసాంతకుఁడైన విష్ణుమూర్తియొక్క, సుగాత్రికా=భార్య యైన లక్ష్మీదేవియొక్క, అతిసమతా=అత్యంతసామ్యముయొక్క, స్ఫూర్తిన్=ప్రకాశముచేత; తన్గన్గొనన్ = తన్నుఁ జూడఁగా; కరమ్ము=మిక్కిలి; ఇంపుల్ గూర్చెన్ = ఆనందముల నొందించెను. అనఁగా జలవిహారసమయమున నొక స్త్రీరత్నము తమ్మిపైఁ గూర్చుండి కేలఁ గమలమును దాల్చియుండఁగా ఇతరస్త్రీలు దానిపై జలపరంపరలు చల్లుచుండి రనియు, దానిం జూడఁగాఁ బద్మహస్తయై, పద్మాసనయై దేవదంతులచే జలాభిషేకము పొందు లక్ష్మీదేవిని బోలి యుండె ననియు భావము. పూర్ణోపమాలంకారము.

చ. అలరుమృణాళవల్లరి స్వ॥యంవరసూనసరాభ వ్రేలఁగా
నలనికటంబుఁ జేరఁగ జ॥నన్ రతిఁ గైకొనె నొక్క పుష్పకో
మల దమయంతికావనిత॥మాడ్కి మరాళనృపుల్ స్వచిత్తసీ
మలఁ దమయంతికావనిఁ గ్ర॥మంబున నొందిన సంభ్రమింపఁగాన్. 71

టీక: ఒక్క పుష్పకోమల=పుష్పములవలె మృదువైన దేహముగల యొక్క స్త్రీ; అలరు=ఒప్పారుచున్న; మృణాళవల్లరి =తీగవంటి తామరతూఁడు; స్వయంవరసూనసరాభన్=స్వయంవరార్థమైన పుష్పమాలికవలె; వ్రేలఁగాన్=వ్రేలాడఁగా; మరాళనృపుల్=రాజహంసలనెడు రాజులు; స్వచిత్తసీమలన్=తమమనఃప్రదేశములయందు; తమయంతికావనిన్= తమ సమీపప్రదేశమును; క్రమంబునన్=వరుసఁగా; ఒందినన్=పొందఁగా; సంభ్రమింపఁగాన్=సంతసము నొందఁగా, వేగిరపాటు నొందఁగా; దమయంతికావనితమాడ్కిన్ = దమయంతివలె; నలనికటంబున్=పద్మనికట మనెడు నలరాజుసమీపమును; చేరఁగన్ చనన్=చేరఁబోవుటకు; రతిన్=ప్రీతిని; కైకొనెన్=స్వీకరించెను, చేరె ననుట.

అనఁగా నొకస్త్రీ మృణాలవల్లరి చేతఁ బుచ్చుకొని పద్మమును గ్రహించుటకుఁ బోవుచుండఁగా దమయంతి నలుని వరించుటకుఁ బుష్పహారము తీసికొని పోవుచున్నట్లుండె ననియు, నపుడు మధ్యమార్గమున నున్న మరాళములు ఆస్త్రీ తమచెంతకు వచ్చె నని సంభ్రమించుట నలేతరరాజులు దమయంతి తమయంతికమునకు వచ్చె నని సంభ్రమించినట్లుండె ననియు భావము. రూపకసంకీర్ణోపమాలంకారము.

సీ. రతిఁ బట్టుకొనఁ జేరె ॥రాజీవరామాని,కరము సద్గుణజాల॥కలిత యొకతె.
రహి వ్రాల్చె నవదాత॥రాజీవరాజిత,రజము పావనవిహా॥రయుత యొకతె,
యడలించె వడిఁ బుష్క॥రాజీవరాజహం,సముల శంపాలోక॥సక్త యొకతె,
ప్రౌఢి నొంచె రథాంగ॥రాజీవరామోద,పటిమ సత్కాంతిసం॥భరిత యొకతె,
తే. వనజగృహవీథి నిట్టు లా॥వర్తనాభి,కాజనంబులు సముచితగతి నెసంగె
వారిదేవత లపుడు త॥ద్వర్తనాభి,దర్శనస్ఫూర్తి నవ్యహా॥ర్దంబు గాంచ. 72

టీక: సద్గుణజాలకలిత ఒకతె =శ్రేష్ఠమగు గుణగణములతోఁ గూడినట్టి ఒకస్త్రీ, మంచి సూత్రములు గల వలతోఁ గూడిన యొకస్త్రీ యని తోఁచుచున్నది; రాజీవరామానికరము=మత్స్యస్త్రీగణమును, 'రాజీవ శ్శకుల స్తిమిః' అని యమరుఁడు; రతిన్=ప్రీతిచేత; పట్టుకొనన్ = స్వీకరించుటకు; చేరెన్=సమీపమునకుఁ బోయెను. మంచిసూత్రములతోఁ (రజ్జువులతో) గూడిన వల గలది గావున మత్స్యములఁ బట్టుకొనఁబోవుట తగునని భావము.
పావనవిహారయుత ఒకతె = మంచిప్రచారముతోఁ గూడిన యొకస్త్రీ, పవనసంబంధిప్రచారముతోఁ గూడిన యొకస్త్రీ యని తోఁచుచున్నది; అవదాతరాజీవరాజితరజము – అవదాతరాజీవ=తెల్లదామరలయందు, రాజిత=ఒప్పుచున్న,రజము=పరాగమును; రహిన్=ప్రీతితో; వ్రాల్చెన్=తూల్చెను. పవనసంబంధిప్రచారముతోఁ గూడినది గావున పరాగమును వ్రాల్చుట తగునని భావము; శంపాలోకసక్త ఒకతె = మెఱుపులవంటి చూపులతోఁ గూడిన యొకస్త్రీ, తటిత్కాంతితోఁ గూడిన యొకస్త్రీ యని తోఁచుచున్నది; పుష్కరాజీవరాజహంసములన్ – పుష్కర=పద్మములు, ఆజీవ=జీవికగాఁగల, రాజహంసములన్ =రాజహంసలను; వడిన్ = వేగముచేత; అడలించెన్ = భయపెట్టెను. తటిత్కాంతియుత గావున పుష్కరాజీవము లగు రాజహంసల వెఱపించుట తగు నని భావము. తటిత్ప్రకాశములు గల వర్షాకాలమందుఁ గొలఁకులు నిండి పద్మములకుఁ గీడు గల్గును గాన నపుడు హంసలు ఎడలి పోవు నని కవిసమయము.
సత్కాంతిసంభరిత ఒకతె = మంచికాంతితో నింపఁబడిన యొకస్త్రీ, నక్షత్రములకాంతితోఁ గూడిన యొకస్త్రీ యని తోఁచుచున్నది; రథాంగరాజీవరామోదపటిమన్ – రథాంగరాజీ=చక్రవాకపంక్తియొక్క, వర=శ్రేష్ఠమైన,ఆమోదపటిమన్=సంతోషాతిశయమును; ప్రౌఢిన్=నేర్పుచేత; నొంచెన్=నొవ్వఁజేసెను. నక్షత్రకాంతిభరిత గావున రథాంగరాజిసంతోషపటిమ నొంచుట తగు నని భావము. నక్షత్రప్రకాశము గల రాత్రికాలమందు రథాంగదంపతు లెడఁబాసి ఖేదించు నని కవి సమయము.
ఇట్టులు=ఈప్రకారము; వనజగృహవీథిన్=కమలాకరమైన కాసారముయొక్క సీమయందు; ఆవర్తనాభికాజనంబులు = స్త్రీ జనములు, ఆవర్తనాభిక లనఁగా నీటిసుడినిబోలు పొక్కిలిగల స్త్రీలని యర్థము; అపుడు=ఆసమయమందు; వారిదేవతలు= జలాధిష్ఠాన దేవతలు; తద్వర్తనాభిదర్శనస్ఫూర్తిన్ – తద్వర్తన=ఆస్త్రీలవృత్తియొక్క, అభిదర్శనస్ఫూర్తిన్=చూచుటయందు; నవ్యహార్దంబు =నూతనప్రీతిని; కాంచన్=పొందఁగా; సముచితగతిన్=పైఁజెప్పినట్టు లుచితప్రకారముగ; ఎసంగెన్=ఒప్పెను. సద్గుణజాలకలితేత్యాదిసాభిప్రాయవిశేష్యములచేఁ బరికురాలంకారము.

చ. స్మరమదదంతి నా నొకమ౦సారసముల్లసితప్రవేణి త
త్సరమున నత్తఱిం బవన౦సారసముల్లలదూర్మిజాతముల్
సరగునఁ జొచ్చి పాదముల ౦సారసముల్ గర మించె మెట్టుచున్
సరసకలారవాకలన౦సారసముల్లహరిన్ హరించుచున్. 73

టీక: అత్తఱిన్=ఆసమయమందు; ఒకమసారసముల్లసితప్రవేణి =నీలములభంగి ప్రకాశించుచున్న జడగల యొకస్త్రీ; తత్సరమునన్ = ఆకొలంకునందు; పవనసారసముల్లలదూర్మిజాతముల్ – పవనసార=వాయుసామర్థ్యముచేత, సముల్లలత్= మిక్కిలి చలించుచున్న, ఊర్మిజాతముల్=తరంగతతులను; సరగునన్=వడిగా; చొచ్చి=ప్రవేశించి; పాదములన్=చరణములచేత; సారసముల్=పద్మములను; మెట్టుచున్ =త్రొక్కుచు; సరసకలారవాకలనన్ – సరస=శ్రేష్ఠమైన,కల=అవ్యక్తమధురమైన, గజపక్షమున, కర=తొండముయొక్క యని యర్థము, ఆరవ=ధ్వనియొక్క, ఆకలనన్=సంబంధముచేత; సారసముల్లహరిన్–

సారస=బెగ్గురులయొక్క, ముత్=సంతోషముయొక్క, లహరిన్=పరంపరను;హరించుచున్=పోఁగొట్టుచు; స్మరమదదంతి నాన్ = మన్మథుని మదపుటేనుఁగో యనునట్లు; కరము = మిక్కిలి; ఇంచెన్= ఇంపయ్యెను. అనఁగా నొకనీలవేణి యాకొలఁకు నందు వీవలివేగమునఁ జలించుచున్న తరఁగలఁ జొచ్చి, కమలములను బాదముల మెట్టుచు సరసకలస్వనములచేత బెగ్గురుల సంతసమును హరించుచు, మదనుని మదపుటేనుఁగో యనునట్లు భాసిల్లె నని భావము. గజము సరస్సులు సొచ్చి, కమలములు మెట్టుచు, బెగ్గురులు లోనగు జలపక్షులమోదము హరించుట ప్రసిద్ధము. ఉత్ప్రేక్షాలంకారము.

చ. అనుపమరాజహంసభర◊ణాదరణాత్మతఁ దత్సరోవరం
బున నలరాజహంససుత◊బోటులు మించిరి పూర్వవైరముల్
సన భృతరాజహంసత నె◊సంగుదివాక్షణదాధిదేవు లౌ
నని వనరాజహంసగమ◊నాళి మనంబున సన్నుతింపఁగన్. 74

టీక: అలరాజహంససుతబోటులు = రాజశ్రేష్ఠుఁడగు క్షణదోదయుని పుత్త్రికయగు చంద్రికయొక్క చెలులు; తత్సరోవరంబు నన్ = ఆసరస్సునందు; అనుపమరాజహంసభరణాదరణాత్మతన్ – అనుపమ=సాటిలేని, రాజహంస=పక్షివిశేషముయొక్క, 'రాజహంసాస్తు తే చఞ్చుచరణై ర్లోహితై స్సితాః' అని యమరుడు. అనఁగా ముక్కు, కాళ్లు ఎఱ్ఱగను, శరీరము తెల్ల గను నుండు హంసములకు రాజహంసము లని పేరు. రాజహంసశబ్దమునకు చంద్రసూర్యు లను నర్థాంతరము దోఁచును, భరణ= భరించుట యందు, ఆదరణ=ఆసక్తిగల, ఆత్మతన్=చిత్తము గల్గుటచేత; పూర్వవైరముల్=మునుపటి ద్వేషములు; చనన్= పోఁగా; భృత రాజహంసతన్ = భరింపఁబడిన చంద్రసూర్యులు గల్గుటచేత; ఎసంగు దివాక్షణదాధిదేవులు=ఒప్పుచున్న దిన రాత్ర్యధిదేవతలు; ఔన్=నిశ్చయము, అని=ఇట్లని; వనరాజహంసగమనాళి =వనమందలి స్త్రీలచాలు, వనపాలికామండలి యనుట; మనంబునన్ =చిత్తములందు; సన్నుతింపఁగన్ = కొనియాడఁగా; మించిరి =అతిశయించిరి. అనఁగాఁ జంద్రికాసఖీ జనము సరోవరమున రాజహంసభరణాదరణముతోఁ జెలఁగుచుండఁగా, దివారాత్ర్యధిదేవతలు తమ తొల్లిటివైరము మాని సూర్యచంద్రులను బట్టుకొని యుండినట్లు వనపాలికల మనంబులకుఁ దోఁచిన దనుట. శ్లిష్టరూపకోత్థాపితోత్ప్రేక్షాలంకారము.

సీ. వాసంతి యనఘాళి◊వరరసంబునఁ గప్పి,వాసంతి యన సము◊జ్జ్వలతఁ బొల్చె,
సారంగి యనపాయ◊జలజాంబుతతి నాని, సారంగి యనఁ జాల ◊సంభ్రమించె,
శశిలేఖ యనసార◊చక్రాళి నలయించి, శశిలేఖ యన శుభ◊చ్ఛాయఁ దోఁచె,
చక్రాంగి యనవద్య◊చారూర్మికల నూఁగి, చక్రాంగి యన హృద్య◊చర్య మసలె,
తే. చూతకళిక యనర్ఘ్యర◊జోవృతిఁ గని, చూతకళిక యనం గడుఁ ◊జూడ నొప్పె,
హరిణి యనరాళకమలైక◊పరిచితిఁ గని, హరిణి యన నవ్వనాస్థాని ◊నప్ప డలరె. 75

టీక: వాసంతి = వాసంతి యనుపేరుగల చెలి; అనఘాళిన్=అనఘుయైన చెలిని, ఒచ్చెము లేని తుమ్మెదను, శ్లిష్టరూపకము; వరరసంబునన్=శ్రేష్ఠమగు ప్రీతిచేత, శ్రేష్ఠమగు పుష్పరసముచేత; కప్పి;వాసంతి యనన్=బండిగురివెందలత యనఁగా, వాసంతినామము గలది యనఁగా; సముజ్జ్వలతన్=ప్రకాశముచేత; పొల్చెన్=ఒప్పెను. మాధవీలతవలె ననఘాళిని రసమునఁ గప్పుటం జేసి వాసంతీనామము దాని కమరిన దనుట.

సారంగి=సారంగి యను పడుచు; అనపాయజలజాంబుతతిన్ – అనపాయ=చ్యుతిలేనట్టి, జలజాంబు=పూఁదేనియయొక్క, తతిన్ =రాశిని; ఆని=త్రావి; సారంగియనన్=ఆఁడుతుమ్మెదయనఁగా, సారంగి యను నామము గలది యనఁగా; చాలన్ = మిక్కిలి; సంభ్రమించెన్ =సంతసించెను. భృంగివలెఁ బూఁదేనియ నానుటంజేసి సారంగి యను నామము దాని కొప్పె ననుట.
శశిలేఖ = శశిలేఖ యను కాంత; అనసారచక్రాళిన్ – అనసార-శ్రేష్ఠములైన, చక్రాళిన్=చక్రవాకములచాలును; అలయించి = అలఁతపెట్టి; శశిలేఖ యనన్ = చంద్రరేఖ యనఁగా, శశిలేఖ యను నామము గలదనఁగా; శుభచ్ఛాయన్=మంచికాంతిచేత; తోఁచెన్=పొల్చెను. చంద్రరేఖవలె జక్కవలచాలు నలయించుటంజేసి శశిలేఖ యను పేరు దాని కబ్బె ననుట.
చక్రాంగి = చక్రాంగి యను పేరుగల బోటి; అనవద్యచారూర్మికలన్ – అనవద్య=దూష్యములు గాని, చారు=మనోహరములైన, ఊర్మికలన్=తరంగములయందు; ఊఁగి; చక్రాంగి యనన్ = హంసస్త్రీ యనఁగా, చక్రాంగి యను నామము గలదనఁగా; హృద్యచర్యన్=మనోజ్ఞమైన వృత్తిచేత; మసలెన్=ఒప్పెను. హంసస్త్రీవలెఁ దరంగములయందు నూఁగుటం జేసి చక్రాంగి యను నామము దాని కొప్పె ననుట.
చూతకళిక = చూతకళిక యను పేరుగల నాతి; అనర్ఘ్యరజోవృతిన్ – అనర్ఘ్య=అమూల్యమైన, రజోవృతిన్=పరాగవ్యాప్తిని; కని = పొంది; చూతకళిక యనన్ = మావిమొగ్గ యనఁగా, చూతకళిక యనుపేరుగల దనఁగా; కడున్=మిక్కిలి; చూడన్ ఒప్పెన్ = చూచుటకు నందమయ్యెను. చూతకళికవలె రజోవృతిని గనుటంజేసి చూతకళికయను పేరు దాని కొదవె ననుట.
హరిణి = హరిణి యను పేరుగల వనిత; అనరాళకమలైకపరిచితిన్ – అనరాళ=ఋజువులైన, కమల=పద్మములయొక్క, ఏక =ముఖ్యమగు; పరిచితిన్=పరిచయమును; కని=పొంది; హరిణి యనన్ = మృగస్త్రీ యనఁగా, హరిణి యను పేరుగలదనఁగా; అవ్వనాస్థానిన్ = ఆసరోజలమను నాస్థానమందు; అప్పుడు; అలరెన్=ఒప్పెను. అనఁగా మృగస్త్రీవలెఁ గమలపరిచయముం గనుటంజేసి హరిణి యను నామము దాని కెసఁగె ననుట. శ్లిష్టరూపకము.

అనఁగా జలక్రీడకై కొలను సొచ్చిన వాసంతి, సారంగి, శశిలేఖ, చక్రాంగి, చూతకలిక, హరిణి యను నామములు గల స్త్రీలు పైఁజెప్పిన చర్యల నొనరించిరని భావము. రాజాస్థానికలయందు దాసీవర్గమునకు వాసంత్యాదినామము లుండుట ప్రసిద్ధము.

క. నలి నాకరజితకిసలల్
నలినాకరకేళి యిటు లొనర్చి జలార్ద్రాం
గలతాళులు హిమవృతకుం
దలతాభం దోఁప నపుడు దఱిసిరి తటమున్. 76

టీక: అపుడు=ఆసమయమందు; ఆకరజితకిసలల్= కరములచే గెలువఁబడిన పల్లవములు గల యా స్త్రీలు; నలిన్=మిక్కిలి; నలినాకరకేళి=జలక్రీడను; ఇటులు=పైవిధముగ; ఒనర్చి=చేసి;జలార్ద్రాంగలతాళులు – జల=నీటచే, ఆర్ద్ర=తడిసిన, అంగలతాళులు = లతలవంటి తనుపంక్తులు; హిమవృతకుందలతాభన్ = మంచుచే నావరింపఁబడిన మొల్లతీవలకాంతివంటి కాంతిచేత; తోఁపన్=ప్రకాశింపఁగా; తటమున్=తీరమును; దఱిసిరి=సమీపించిరి. అనఁగా నాస్త్రీలు జలక్రీడసలిపి యొడ్డుఁ జేరి నీటిచేఁ దడిసిన తనులతలతో మంచుచే నావరింపఁబడిన కుందలతలభంగి నొప్పి రనుట. కుందలతలకు, స్త్రీతనువులకు నుపమానోపమేయభావము. హిమమునకు జలమునకు బింబప్రతిబింబభావము.

చ. లలనలు వాఃప్లుతాంశుకము◊లన్ సడలించి తగం భరించి మేల్
చలువల నైకజాతిసుమ◊జాలసరంబులు వేణిఁ దాల్చి ని
చ్చలు వలనై కనంబడుల◊సన్మణిమాలిక లూని పూసి మై
చలువల నైకమత్యగతిఁ ◊జాలిన తావుల నొప్పు గంధముల్. 77

టీక: లలనలు=స్త్రీలు; వాఃప్లుతాంశుకములన్=నీటిచేఁ దడుపఁబడిన వస్త్రములను; సడలించి=విడిచి; మేల్ చలువలన్ = మంచి వస్త్రములను; తగన్= తగునట్లుగా; భరించి=ధరించి; నైకజాతిసుమజాలసరంబులు— నైకజాతి=నానాజాతులు గల, సుమ జాల= పుష్పసంఘములయొక్క, సరంబులు=దండలు; వేణిన్=జడయందు; తాల్చి=ధరించి; నిచ్చలున్=ఎల్లపుడు; వలనై = అనుకూలమై; కనంబడు=అగపడుచున్న; లసన్మణిమాలికలు=ప్రకాశించుచున్న మణిమయహారములను; ఊని=వహించి; మైచలువలన్=దేహములయొక్క చల్లదనములతో; ఐకమత్యగతిన్=ఐకమత్యముయొక్క పొందికచేతను; చాలిన తావులన్ = సమృద్ధమైన పరిమళములచేతను; జలక్రీడ లాడిన వారిదేహము లంతటి చల్లఁదనముతోను, అధికమైన పరిమళముతోను ననుట; ఒప్పు గంధముల్=ఒప్పుచున్న గంధములను; పూసి=లేపనము చేసి. దీనికి 'గందంబు వెట్టి' రను ముందరిపద్యముతో నన్వయము.

ముందు నాల్గుపద్యములకు నందె అన్వయము. ఆఱు పద్యములకు నిట నేకక్రియాన్వయము గదితంబయ్యె. దీనికిఁ గుళక మని కవిసంకేతము. 'ద్వాభ్యాం యుగ్మ మితి ప్రోక్తం త్రిభి శ్లోకై ర్విశేషకమ్| కలాపకం చతుర్భి స్స్యాత్, తదూర్ధ్వం కుళకం స్మృతమ్||' అని తల్లక్షణము.

క. అతిపావనచాతురి నా,క్షితిపాలకపుత్త్రిక గయి◊సేసి యలవనిన్
రతినాయకదేవార్చన,రతి నాయక లపుడు పూని ◊రమ్యోత్కలికన్. 78

టీక: అతిపావనచాతురిన్=మిగులఁ బ్రశస్తమగు నేర్పుచేత; ఆక్షితిపాలకపుత్త్రికన్ = రాకుమారియగు నాచంద్రికను; కయిసేసి =అలంకరించి; అలవనిన్=ఆయుద్యానమందు; రతినాయకదేవార్చనరతిన్=స్మరదేవపూజాసక్తిచేత; ఆయకలు=ఆస్త్రీలు; అపుడు=ఆసమయమున; రమ్యోత్కలికన్=రమ్యమైన యుత్కంఠను; పూని=వహించి. ఇది ముందు కన్వయించును.

సీ. మాకందములు మహి◊మాకందములు కొన్ని, యింపైన ఫలముల ◊నిచ్చుచోట,
సురసౌఘము లుదార◊సురసౌఘములు కొన్ని, యురుమకరందంబు ◊గురియుచోట,
సుమనంబు లభిరామ◊సుమనంబు లొకకొన్ని, క్రొన్ననల్ చాలఁ జే◊కూర్చుచోట,
రాగంబులు గళత్ప◊రాగంబు లొకకొన్ని, పుప్పొడిధూపముల్ ◊పూన్చుచోట,
తే. నెట్టన యశోకకిసలము ◊ల్మట్టుమీఱి, యుట్టిపడఁ గాయు లేయెండఁ ◊బుట్టి యెలసి
నట్టి చెలువునఁ జూపట్టు ◊మెట్టదమ్మి,తీవెగమి తమ్మియారతుల్ ◊దీర్చుచోట. 79

టీక: మహిమాకున్=భూలక్ష్మికి; అందములు=అందములైన; మాకందములు కొన్ని = కొన్నితియ్యమావులు; ఇంపైన = ఇష్టమైన; ఫలములన్=పండ్లను; ఇచ్చుచోటన్=ఒసంగుస్థలమునందు;

ఉదారసురసౌఘములు = అధికమై శ్రేష్ఠమైన మకరందసమూహము గల; సురసౌఘములు కొన్ని=కొన్నిసర్పాక్షితీవల యొక్కగుంపులు; ఉరుమకరందంబు = అధికమైన పూఁదేనియను; కురియుచోటన్ = వర్షించుచోట; అభిరామసుమనంబులు=ఒప్పుచున్న పువ్వులు గల్గిన; ఒకకొన్ని సుమనంబులు=కొన్ని జాజులు; చాలన్=మిక్కిలి; క్రొన్ననల్ =క్రొత్తపూవులను; చేకూర్చుచోటన్= ఘటిల్లఁజేయుచోట; గళత్పరాగంబులు=జాఱుచున్న పుప్పొడులు గల; ఒకకొన్ని రాగంబులు =కొన్ని దాడిమీవృక్షములు; పుప్పొడిధూపముల్ =పుష్పరజమనెడు ధూపములను; పూన్చుచోటన్=వహించు చోటను; నెట్టన=అనివార్యముగ; అశోకకిసలముల్= అశోకపల్లవములు; మట్టుమీఱి = మర్యాద నతిక్రమించి; ఉట్టిపడన్=అతిశయింపఁగా; కాయు లేయెండన్=కాయుచున్న తరుణాతపముచేత; పుట్టి=ఉదయించి; ఎలసినట్టి చెలువునన్ = ఉదయించినట్టి యందముచేత; చూపట్టు మెట్టదమ్మితీవెగమి = అగపడుచున్న స్థలపద్మినీలతలసముదాయము; తమ్మియారతుల్= పద్మము లను నారతులను; తీర్చుచోటన్= చక్కఁబఱచుచోటను. దీనికి దిగువ కన్వయము.

చ. అలఘుమరందవర్షమహిమాతిశయమ్మున సప్తలాద్యమం
దలతల మంచుపొన్నగమి దార్కొనుపందిరిక్రింద వేదికం
దలతల మంచు మించుసుమనవ్యరజంబులఁ దార్చి తారలం
దలతల మంచు నొప్పెడుకనత్కలికాతతి ముగ్గువెట్టుచున్. 80

టీక: అలఘుమరందవర్షమహిమాతిశయమ్మునన్– అలఘు=అధికమైన, మరందవర్ష=పూఁదేనియవానయొక్క, మహిమాతిశయమ్మునన్ =సామర్థ్యాతిశయమున; సప్తలాద్యమందలతలన్ = విరజాజి మున్నగు నుత్కృష్టలతలను, 'సప్తలా నవమాలికా' అని యమరుఁడు; మంచుపొన్నగమిన్ = పోషించుచున్న పొన్నలగుంపును; తార్కొనుపందిరిక్రిందన్ = సమీపించిన పందిరియొక్క దిగువను; వేదికన్=తిన్నెపైని; తలతల మంచున్=తళుక్కుతళుక్కు మనుచు; మించు సుమనవ్యరజంబులన్ = అతిశయించుచున్న నూతనమైన పుష్పపరాగములను; తార్చి=ఉంచి; తారలన్=నక్షత్రములను; తలతల మంచున్ = తొలఁగుతొలఁగుమనుచు; ఒప్పెడుకనత్కలికాతతిన్ = ఒప్పుచున్న ప్రకాశించు మొగ్గలగుంపుచేత; ముగ్గు వెట్టుచున్ = రంగవల్లిక యుంచుచు. దీనికి ముందు కన్వయము. అనఁగా విరజాజి మొదలగు తీవెలతోఁ జుట్టఁబడిన పొన్నచెట్టునొద్దఁ బందిరిక్రింద నొకతిన్నెమీఁదఁ బుప్పొడి చల్లి, నక్షత్రములవలెఁ బ్రకాశించు మొగ్గలతో ముగ్గువెట్టి యని తాత్పర్యము.

ఉ. జవ్వను లెల్ల సమ్మదము చాల రహింపఁగ నందు వెన్నెలం
జివ్వకుఁ బిల్చుపాండుపటిఁ జిక్కనికస్తురినీట రాణితో
నవ్వలరాజు నాశుగశరాసనయుక్తుని వ్రాసి నేర్పుతో
నవ్వల రాజు నాశుగసుమాకరముఖ్యుల నిల్పి యత్తఱిన్. 81

టీక: జవ్వను లెల్లన్=స్త్రీలందఱు; సమ్మదము = సంతోషము; చాలన్= మిగులను; రహింపఁగన్=ఒప్పఁగా; అందున్= ఆ వేదికయందు; వెన్నెలన్=జ్యోత్స్నను; చివ్వకున్=కలహమునకు; పిల్చుపాండుపటిన్= పిల్చునట్టి తెల్లనివస్త్రమందు; చిక్కనికస్తురినీటన్=చిక్కనైనకస్తూరీనీరముచేత; రాణితోన్=రతీదేవితోడ; అవ్వలరాజున్=ఆమన్మథుని; ఆశుగశరాసనయుక్తునిన్=బాణధనువులతోఁ గూడినవానిని; వ్రాసి=లిఖించి; నేర్పుతోన్=చాతుర్యముచేత; అవ్వలన్=ఆతర్వాత; రాజున్ =

చంద్రుని; ఆశుగసుమాకరముఖ్యులన్ = మందమారుతవసంతాదులను; అత్తఱిన్=ఆసమయమునందు; నిల్పి=స్థాపించి.పై పద్యముతో నన్వయము.

సీ. గందంబు వెట్టి రు॥త్కటనీలశరజాత,శరజాతహృతహర॥స్వాంతధృతికి,
విరిచాలు నించిరి ॥పరియోజితనయాన్య,తనయాన్యమితమోహ॥ధాతృమతికి,
ధూప మర్పించి ర॥ద్భుతసంపదబలాప,దబలాపహృతవిష్ణు॥దర్పగతికి,
దీప మెత్తిరి నైజ॥తేజోలహరిభావ,హరిభావయుక్తఘ॥స్రాధిపతికి,
తే. తళియ వట్టిరి నిత్యస॥త్కాంతమధుప,కాంతమధుపవనాద్యాప్త॥కాండవృతికి,
వినతి సల్పిరి శృంగార॥జనికి 'రతిప,తే నమో భవతే' యంచుఁ ॥దెఱవ లపుడు. 82

టీక: ఉత్కటనీలశరజాతశరజాతహృతహరస్వాంతధృతికిన్ – ఉత్కట=అధికమైన, నీలశరజాత=నీలోత్పలము లనెడు, శర =బాణములయొక్క, జాత=సమూహముచేత,హృత=హరింపఁబడిన, హర=శివునియొక్క, స్వాంత=చిత్తముయొక్క, ధృతికిన్=ధైర్యము గలవానికి; గందంబు వెట్టిరి = చందన మలందిరి.

పరియోజితనయాన్యతనయాన్యమితమోహధాతృమతికిన్ – పరియోజిత=కూర్పఁబడిన, నయాన్య=నీతివిరుద్ధమైన, ఇది మోహమునకు విశేషణము, తనయా=కూఁతునందలి,న్యమిత=అత్యధికమైన, మోహ=మోహము గల, ధాతృమతికిన్ = బ్రహ్మబుద్ధి గలవానికి; విరిచాలు=పుష్పపంక్తులను; నించిరి = నిండించిరి.

అద్భుతసంపదబలాపదపలాపహృతవిష్ణుదర్పగతికిన్ – అద్భుత=ఆశ్చర్యకరమగు, సంపదబలా=లక్ష్మి యనెడు, పద= పదము గల, పేరుగల యనుట, బల=సామర్థ్యముచేత, అపహృత=హరింపఁబడిన, విష్ణుదర్పగతికిన్=విష్ణుమూర్తియొక్క గర్వగతి గల వానికి; ధూప మర్పించిరి = ధూపమును సమర్పించిరి.

నైజతేజోలహరిభావహరిభావయుక్తఘస్రాధిపతికిన్ – నైజతేజోలహరిభావ=స్వీయమగు ప్రతాపప్రవాహసత్తచేత, హరిభావ =అశ్వత్వముతోడ, యుక్త=కూడిన, ఘస్రాధిపతికిన్=సూర్యుఁడు గలవానికి, ఛాయాదేవి సూర్యునివేఁడికిఁ దాళలేక రథము నుండి డిగ్గి యశ్వరూపయై పాఱిపోవుచుండఁగా సూర్యుఁడు కామార్తుఁడై తాను నశ్వరూపమును దాల్చి వెంబడి పరు గెత్తె నని పురాణప్రసిద్ధంబు, దీప మెత్తిరి= హారతి నెత్తిరి.

నిత్యసత్కాంతమధుపకాంతమధుపవనాద్యాప్తకాండవృతికిన్ – నిత్య=శాశ్వతమైన, సత్కాంత=చంద్రుఁడు, మధుపకాంత= అళిశ్రేష్ఠములు, మధు=వసంతుఁడు, పవన=వాయువు, ఆది=మొదలుగాఁ గల, ఆప్తకాండ=సుహృద్గణముయొక్క, వృతికిన్ = వ్యాప్తిగలవానికి;తళియ=బోజనపాత్రమును; పట్టిరి=ఉంచిరి.

శృంగారజనికిన్ = శృంగారరసమువలనఁ బుట్టుక గలవానికి; అపుడు; రతిపతే=రతీశుఁడా; భవతే=నీకొఱకు; నమః=నమ స్కారము; అంచున్=ఇట్లనుచు; తెఱవలు=స్త్రీలు; వినతి సల్పిరి = నమస్కరించిరి.

క. కమలాప్రియసుత, కరుణా
కమలాధిప, కలితకార్ము॥కత్కుసుమ, కన

తత్కమలాశుగ, యని భక్తిన్
గమలాక్షులు పొగడిరిట్లు కలరవఫణితిన్. 83

టీక: కమలాప్రియసుత=లక్ష్మికిఁ బ్రియకుమారుఁడా! కరుణాకమలాధిప =దయాసముద్రుఁడా! కలితకార్ముకతత్కుసుమ = ధరింపఁబడిన ధనువగుచున్న పుష్పముగలవాఁడా! కనత్కమలాశుగ =ఒప్పెడు తమ్ము లమ్ములుగాఁ గలవాఁడా; ఇట్లు=ఈ ప్రకారముగ; అని = అనుచు; కలరవఫణితిన్=అవ్యక్తమధురమగు ధ్వనిగల వాక్కుచేత; కమలాక్షులు =స్త్రీలు; భక్తిన్ =భక్తి తోడ; పొగడిరి = నుతించిరి.

చ. కరము మహాబలావళులు గాఢతరోవిచరద్ధరీశ్వరో
త్కరము మహాబలావృతవిఖండహితాళులు గొల్వ మించుచున్
సిరి గలసామికిం బొడమి చెన్నగు నీకు సుమంబు లూన్చుటల్
స్థిరకృప మాధవస్య తులసీదళ మంచు వహింపు మంగజా! 84

టీక: అంగజా=మన్మథుఁడా! కరము=మిక్కిలి; మహాబలావళులు=పూజ్యములైన వాయుపరంపర లనెడు గొప్ప సేనా వళులు; గాఢతరోవిచరద్ధరీశ్వరోత్కరము – గాఢ=దృఢమైన, తరః=వేగముచేత, విచరత్=సంచరించుచున్న, హరీశ్వరోత్కరము=శుకశ్రేష్ఠముల గుంపనెడు నశ్వశ్రేష్ఠములగుంపు; మహాబలావృతవిఖండహితాళులు – మహాబలా=అధికలైన స్త్రీల చేత, ఆవృత=కూడుకొన్న, విఖండ=అఖండములైన, హిత=ఇష్టములైన, అళులు= తుమ్మెద లనెడు మహాసామర్థ్యముతోఁ గూడుకొన్న యఖండాప్తసంఘములు; కొల్వన్=సేవించుచుండఁగా; మించుచున్=అతిశయించుచు; సిరి గలసామికిన్ = విష్ణుమూర్తికి; పొడమి =పుట్టి; చెన్నగు నీకున్ = ఒప్పుచున్న నీకు; సుమంబులు=పూవులను; ఊన్చుటల్=ఉంచుటలు; స్థిరకృప = శాశ్వతకరుణగలవాఁడా! మాధవస్య తులసీదళ మంచున్ = మాధవునకు తులసీపత్త్ర మని; వహింపుము = తాల్పుము. అనఁగా దొడ్డవానికడుపునఁ బుట్టి గొప్పస్థితిలో నుండి వెలయు నీ కిది మేము సేయు నుపచారము స్వల్పమైనది యైనను దయామతితోడ గ్రహింపు మనుట.

చ. కలరవమూన్చు నల్లపజ కప్పుక రా వెనువెంట రాజమం
డలి నడతేరఁ జైత్రబలనాథునిఁ గూడి నిలింపజాలకం
బలరుచు సన్నుతింప విషమాంబకమానసశోభిరాగతా
హళహళిఁ గూర్చి తౌర విషమాంబక మానసమాజవైఖరిన్. 85

టీక: విషమాంబక = పంచబాణుఁడా! కలరవము=అవ్యక్తమధురస్వనమును; ఊన్చు =చేయునట్టి; నల్లపజ=కోయిలల మూఁక యనుట; కప్పుక రాన్ =ఆవరించికొని రాఁగా; వెనువెంటన్=వెంబడిగ; రాజమండలి =చంద్రమండల మనెడు నృప మండలము; నడతేరన్ =నడచిరాఁగా; చైత్రబలనాథునిన్=వసంతుఁడనెడు పడవాలును; కూడి=చేరి; నిలింపజాలకంబు =దేవ బృందము; అలరుచున్=సంతసించుచు; సన్నుతింపన్=కొనియాడుచుండఁగా; విషమాంబకమానసశోభిరాగతాహళహళిన్ – విషమాంబక=విషమలోచనుఁడైన శివునియొక్క, మానస=చిత్తమందు, శోభి=ప్రకాశించు (వ్యక్తమగు) నట్టి, రాగతా= అను

రాగము గలుగుటయొక్క, హళహళిన్=సమ్మర్దమును, ఇది యనుకరణవచనము; మానసమాజవైఖరిన్ =గర్వసముదాయ విధానముచేత, అనఁగా గర్వాతిశయముచేత; కూర్చితి=ఘటిల్లఁజేసితివి; ఔర = ఆశ్చర్యము!

అట్లు ప్రసిద్ధుండగుమహేశ్వరునకుఁ గూడ రాగము గల్గించితివి గావున నీశక్తి యమేయ మనుట.

చ. దళమయి చిత్తవీథి సము◊దారరుషారస మెచ్చ నీ వయో
యలహరిదంబరాసహన◊మై తగు గేదఁగిఱేకువంకిచా
యల హరిదంబరావనుల ◊నన్నిటిఁ గప్పుక పర్వుతేరిమా
యల హరిదంబరాత్మజ మృ◊గాక్షుల నొంపఁదలంపు గాంతురే. 86

టీక: అయో=అయ్యో! హరిదంబరాత్మజ=పీతాంబరుఁడగు విష్ణువుయొక్క పుత్త్రుఁడా! దళమయి =దట్టమయి; చిత్తవీథిన్= మనోదేశమందు; సముదారరుషారసము=మిక్కిలి యధికమగు రౌద్రరసము; ఎచ్చన్=అతిశయింపఁగా; నీవు; అలహరిదంబ రాసహనము ఐ = ఆదిగంబరుఁడగు శివునకు సహింపరానిదై, శివవిరోధియై యనుట; తగు గేదఁగిఱేకువంకిచాయలన్ – తగు =ఒప్పునట్టి, గేదఁగిఱేకువంకి = పచ్చని కేతకిఱేకనెడు కత్తియొక్క; చాయలన్=కాంతు లనెడు చాయలచేత; అలహరిదంబ రావనులన్ = ఆ దిగాకాశభూములను; అన్నిటిన్ = ఎల్లను; కప్పుక = ఆవరించికొని; పర్వుతేరిమాయలన్ = వ్యాపించునట్టి వాయురూపరథముయొక్క మాయలచేత; మృగాక్షులన్=స్త్రీలను; నొంపన్ తలంపున్ = నొప్పించుటకు వాంఛను; కాంతురే = పొందుదురా, పొందుట తగునా యనుట;

అనఁగ, మన్మథా! నీవు రుద్రునంతటివాని జయించుట కుపయోగించినట్టి సాధనములచే స్త్రీలను బాధింపఁ దలఁచుట యుక్తము గాదని తాత్పర్యము.

క. కలికాకులకరకుచ కు
త్కలికాకుల మిమ్ము రాగ◊కలఁ గీరమణీ
కలగీరమణీయోన్నతి
కలగీరమణీలలామ ◊కలఁగు ననంగా. 87

టీక: అనంగా = మన్మథుఁడా! కలికాకులకరకుచకున్—కలికా=మొగ్గలను, ఆకులకర=వ్యాకులములుగాఁ జేయునట్టి, కుచకున్=స్తనములు గల చంద్రికకు; ఉత్కలికాకులము=సమ్మదసంఘమును; రాగకలన్ =అనురాగకలచేత; ఇమ్ము= ఒసంగుము; కీరమణీకలగీర మణీయోన్నతి – కీరమణీ=శుకశ్రేష్ఠముయొక్క, కల=అవ్యక్తమధురమగు, గీ=వాక్కుల యొక్క, రమణీయ=మనోజ్ఞమగు, ఉన్నతి=అతిశయమువంటి యతిశయము; కలగీరమణీలలామ = కలిగినట్టి సరస్వతి యను నుత్తమస్త్రీవంటి దగు చంద్రిక; కలఁగున్=కలఁత నొందును.

చ. అని వనజాతబాణుఁ గొని◊యాడి వధూమణు లాదరంబుతో
ననలసమానతీవ్రవిర◊హాఖ్యమహాజ్వరరేఖ మించ మే
న నలసమానసం బెనయు◊నాతికిఁ గంతున కూన్చినట్టి క్రొ
న్నన లసమానహార్దకల◊నంబులు దార్ప గ్రహించి రందఱున్. 88

టీక: అని=ఈప్రకారముగ; అందఱున్=ఎల్లరును; వనజాతబాణున్=మన్మథుని; కొనియాడి=స్తుతించి; వధూమణులు = స్త్రీ రత్నములు; ఆదరంబుతోన్=ప్రీతితోడ; అనలసమానతీవ్రవిరహాఖ్యమహాజ్వరరేఖ– అనలసమాన=అగ్నితో సాటియగు, తీవ్ర=గాఢమైన, విరహాఖ్య=విరహమను పేరు గల,మహాజ్వర=గొప్పజ్వరముయొక్క,రేఖ=పరంపర;మేనన్=దేహమందు; మించన్=అతిశయింపఁగా; అలసమానసంబు = బడలిన మనస్సును; ఎనయునాతికిన్ = పొందునట్టి చంద్రికకు; కంతునకున్ = మన్మథునకు; ఊన్చినట్టి క్రొన్ననలు = వహింపఁజేసినట్టి క్రొత్త పుష్పములను; అసమానహార్దకలనంబులు– అసమాన = సాటిలేని, హార్దకలనంబులు=స్నేహసంబంధములను; తార్పన్=కలిగించుటకు; గ్రహించిరి=తీసికొనిరి.

చ. చెలువ మెసంగినట్టి యల౦చిత్తభవార్పితసూనపాళికల్
బలుమరునారసా లనుచుఁ ౦బాయనినివ్వెఱ యాత్మ మించఁగన్
బలుమఱు నారసాధిపకు౦మారిక వింతలె దాల్పకుండుటల్
నలి నవి మారయుక్తి గని౦నన్ సుమనస్తతి యంటఁ బాత్రమే. 89

టీక: చెలువము=అందము; ఎసంగినట్టి యలచిత్తభవార్పితసూనపాళికల్– ఎసంగినట్టి =అతిశయించినట్టి, అలచిత్తభవ=ఆ మన్మథునికొఱకు; అర్పిత = సమర్పింపఁబడిన, సూనపాళికల్= కుసుమపరంపరలు; బలుమరునారసాలు– బలు = అధిక మగు, మరు=మన్మథునియొక్క, నారసాలు=నారాచములు; అనుచున్; పాయనినివ్వెఱ =తొలంగని యధికభయము; ఆత్మన్=చిత్తమందు; మించఁగన్ = అతిశయింపఁగా; పలుమఱున్=మాటిమాటికి; ఆరసాధిపకుమారిక=ఆరాజపుత్త్రిక యగు చంద్రిక; నలిన్=మిక్కిలి; అవి తాల్పకుండుటల్=ఆసూనపాళిని ధరింపకుండుటలు; వింతలె=ఆశ్చర్యమా? వింతలు గావ నుట; మారయుక్తిన్=హింసక సాంగత్యమును, మరునితోఁ గూడియుండుటను; కనినన్=పొందినమీఁద; సుమనస్తతి=పండి తులమండలి, కుసుమగణము; అంటన్=స్పృశించుటకు; పాత్రమే=యోగ్యమా? యోగ్యము కాదనుట.

అనఁగా మరునిప్రసాద మగు పువ్వులు చంద్రికకు బలిష్ఠమగు మన్మథబాణములుగాఁ దోఁచుటచే వానిని దాల్పకుండుట యరిదిగా దనుట. సుమనస్సులగువారు మారకసాంగత్యము నొందినచో ముట్టుటకు బాత్రులు గారని యర్థాంతరన్యాసము.

చ. నలినకరాలలామక మ౦నస్థభయంబు తలంగఁ జేసి వే
నలి నకరాలసత్ప్రియము౦నం జలజాస్త్రప్రసాద ముంచి చా
న లినకరాలఘుక్రమము౦నన్ దొవతీవియ నా స్మరాశుగా
వలులఁ దలంకుకొమ్మ గొని ౦వచ్చిరి కేళినిశాంతసీమకున్. 90

టీక: నలినకరాలలామకమనస్థభయంబు– నలినకరాలలామక=పద్మములవంటి కరములుగల స్త్రీలయందు శ్రేష్ఠురాలైన చంద్రిక యొక్క, మనస్థభయంబు=మనోగతమైనభీతి; తలంగన్ చేసి =తొలఁగునట్లు చేసి; వేనలిన్ =కొప్పునందు; అకరాలసత్ప్రియ మునన్ =అకుటిలమై శ్రేష్ఠమైన ప్రీతిచేత; జలజాస్త్రప్రసాదము=మన్మథుని ప్రసాదమును; ఉంచి = నిల్పి; చానలు=స్త్రీలు; ఇనక రాలఘుక్రమమునన్– ఇనకర=సూర్యకిరణములయొక్క, అలఘుక్రమమునన్=అధికప్రసరణముచేత; తొవతీవియ నాన్ = కలువతీవయో యనునట్లు; స్మరాశుగావలులన్= మదనబాణపరంపరలచేత; తలంకుకొమ్మన్=భయపడుచున్న చంద్రికను; కేళినిశాంతసీమకున్=కేళీగృహప్రదేశమునకు; కొనివచ్చిరి = తెచ్చిరి. అనఁగా నాస్త్రీలు చంద్రిక నూఱడించి, యామె మనోగత

భీతిని దొలంగఁజేసి, ప్రీతితోడ స్మరప్రసాదమును నామెతుఱుమునం దుఱిమి, తీవ్రసూర్యకిరణప్రసరణమునకుఁ గలువతీఁగెవోలె స్మరాస్త్రములకు భీతిల్లు నామెను కేళీగృహమునకుఁ దోడి తెచ్చి రనుట.

తే. వాసవోపలకచ కేళి॰వాస మెనసి
యంత విరిశయ్య మయిఁ జేర్చి ॰యంతరమున
నరతి రాజిల్లఁ గటువర్త॰న రతికామ
నుం డెడయ కుబ్బ విరహాప్తి ॰నుండె నపుడు. 91

టీక: వాసవోపలకచ = ఇంద్రనీలమణులఁ బోలు కురులుగల చంద్రిక; కేళివాసము=కేళీగృహమును; ఎనసి=పొంది; అంతన్ = అటుపిమ్మట; విరిశయ్యన్=పూలపాన్పునందు; మయిన్=దేహమును; చేర్చి=ఉంచి; అంతరమునన్=చిత్తమందు; అరతి = విషయనివృత్తి యను మన్మథావస్థ; రాజిల్లన్=ఒప్పుచుండఁగా; కటువర్తనన్=తీక్ష్ణవృత్తిని; రతికామనుండు=మన్మథుఁడు; ఎడయక = ఎడఁబాయక; ఉబ్బన్=విజృంభించుచుండఁగా; విరహాప్తిన్= విరహదుఃఖప్రాప్తిచేత; అపుడు; ఉండెన్.
ఆచంద్రిక కేళీగృహమును చేరి విరిపాన్పుపైఁ బవ్వళించి అరతి యను మన్మథావస్థచేఁ గుందుచుండె ననుట.

చ. జవగతి మిత్త్రుఁ డబ్ధిపతి॰సన్నిధిఁ జేరఁగ నేగె నత్తఱిన్
రవరవ సంతతత్వగతి ॰రాజిల మారుఁడు మారుతాళికీ
రవరవసంతముఖ్యబల॰రాజియుతిన్ దగి రిత్త యాకలా
రవరవ సంతతంబుఁ బ్రద॰రమ్ముల నేఁచఁగ గాంచ నోపమిన్. 92

టీక: మారుఁడు=మన్మథుఁడు; రవరవ=ఆగ్రహము; సంతతత్వగతిన్ = సాతత్యవర్తనచేత; రాజిలన్=ఒప్పఁగా; మారుతాళి కీరవర వసంత ముఖ్యబలరాజియుతిన్–మారుతాళి=మందమారుతపరంపరయొక్కయు,కీరవర=శుకశ్రేష్ఠములయొక్కయు, వసంతముఖ్య=వసంతుఁడు మొదలుగాఁ గల, బలరాజి=సైన్యసంఘముయొక్కయు, యుతిన్=సంబంధముచేత; తగి =ఒప్పి; రిత్త =వ్యర్థముగా; ఆకలారవరవన్=ఆకోకిలవాణి యగు చంద్రికను; సంతతంబున్=నిరంతరముగా; ప్రదరమ్ములన్ = సాయకములచే; ఏచఁగన్=బాధించుచుండఁగా; కాంచన్ ఓపమిన్ = చూడఁజాలమిచేత; అత్తఱిన్=అప్పుడు; జవగతిన్= శీఘ్రగమనముచేత; మిత్త్రుఁడు= సూర్యుఁడు, స్నేహితుఁ డనియుఁ దోఁచును; అబ్ధిపతిసన్నిధిన్=పశ్చిమసముద్రసమీపమునకు; చేరఁగన్ ఏగెన్ = చేరుటకుఁ బోయెను.

అనఁగా నాచంద్రికను మదనుం డాగ్రహముచే మందమారుత కీర వసంతాదులతోఁ జేరి వృథా బాధించుచుండఁగా, నామె దైన్యమును చూడఁజాలక సూర్యుఁడు పశ్చిమాంబురాశి చెంత కేగె నని భావము. మిత్త్రుఁడు స్వమిత్త్రునిహింసఁ జూడఁజాలక తొలఁగిపోవుట సహజ మని మిత్త్రశబ్దమును బట్టి యర్థాంతరము ధ్వనించుచున్నది. సూర్యుఁ డస్తంగతుఁ డాయె నని ఫలితార్థము. హేతూత్ప్రేక్షాలంకారము.

తే. అమితనిజధామగరిమ పా॰య వనజాత,హితుఁడు గాలైకగతిఁ దూల ॰నిల యనినత
నంద నభివృద్ధిచేఁ బొల్చి ॰యవనజాత,బలములో యన నీడచాల్ ॰ప్రబలె నపుడు. 93

టీక: అమితనిజధామగరిమ—అమిత=అధికమైన, నిజధామ=తనదీప్తి యనెడు ప్రతాపముయొక్క, గరిమ= అతిశయము; పాయన్=తొలఁగఁగా; వనజాతహితుఁడు=సూర్యుఁడు; కాలైకగతిన్=సంధ్యాకాలప్రాప్తి యనెడు దైవగతిచేత; తూలన్=పడ పోఁగా; ఇల=భూమి; అనినతన్=సూర్యుఁడను రాజులేని దగుటను; అందన్=పొందఁగా; అభివృద్ధిచేన్=అభ్యుదయముచేత; పొల్చు యవనజాత బలములోయనన్ =ఒప్పునట్టి యవనులగుంపులో యనునట్లు; నీడచాల్=ఛాయాపరంపర; అపుడు=ఆ సమయమున; ప్రబలెన్=అతిశయించెను. అనఁగా మిగుల ప్రతాపశాలి యైన యొకభూపతి కాలగతివలనఁ గడచి పోఁగా ప్రవృద్ధులై యవనులు వ్యాపించునట్లు మిగులఁ దేజశ్శాలి యగు సూర్యుండు సంధ్యాసమయప్రాప్తిచేతఁ దూలఁగా ఛాయాపరంపర మిగుల వృద్ధినొందుచు ప్రబలె ననుట. స్వరూపోత్ప్రేక్ష.

చ. ఉరుతిమిరేభభేదనచణోగ్రకనత్కరజాతశాలి యౌ
హరి యనివారితాస్తకుధరాధిపశృంగముఁ జేరి యత్తఱిన్
హరి యని వారితాత్మతనుహార్యనుబింబము గాంచి రాగవై
ఖరి వడి గుప్పునం దుముకుకైవడిఁ గ్రుంకెఁ బయోనిధిస్థలిన్. 94

టీక: ఉరుతిమిరేభభేదనచణోగ్రకనత్కరజాతశాలి– ఉరు=గొప్పదైన,తిమిరేభ=అంధకార మనెడు నేనుంగుయొక్క, భేదన = భేదించుటయందు, చణ=నేర్పరియైన, ఉగ్ర=భయంకరమగునట్లుగా, కనత్=ఒప్పుచున్న, కరజాత=కిరణసంఘ మనెడునఖములచేత, 'పునర్భవః కరరుహః' అని యమరుఁడు, శాలి=ఒప్పుచున్న వాఁడు; ఔ హరి=అగునట్టి సూర్యుఁడనెడు సింహము; అనివారితాస్తకుధరాధిపశృంగమున్– అనివారిత=నివారింపరాని,అస్తకుధరాధిప=అస్త మనెడు నగరాజుయొక్క,శృంగమున్ = శిఖరమును; చేరి=పొంది; అత్తఱిన్=ఆసమయమందు; వారితాత్మతనుహార్యనుబింబము– వాః=ఉదకమును, ఇత=పొందినట్టి, ఆత్మతను=తనశరీరముయొక్క, హారి=మనోహరమగు, అనుబింబము=ప్రతిబింబమును; కాంచి=చూచి; హరి యని = ప్రతిసింహమని;రాగవైఖరిన్=రక్తిమ యనెడు క్రోధముయొక్కరీతిచేత;వడిన్=వేగముగా; గుప్పునం దుముకుకైవడిన్= గుప్పున దుముకునట్లు; పయోనిధిస్థలిన్=సముద్రప్రదేశమందు; క్రుంకెన్=మునిఁగెను.

అనఁగా గజభేదనసమర్థము లైన నఖరములతో రాజిల్లు నొకసింహము పర్వతశిఖరమందుండి నీటిలోఁ బ్రతిఫలించిన తన యంగమును ప్రతిసింహముగా నెంచి కోపముచేత గుప్పున దుమికినట్లు తిమిరవిదారణచణములగు కిరణములతోఁ గూడిన సూర్యుండు చరమాద్రినుండి రక్తిమతోఁ గూడి పయోబ్ధిని గ్రుంకె ననుట. రూపకోపమాలంకారముల సంకరము.

సీ. భాస్వద్ధరిక్రమోపరిగతాంబుధితటో,జ్జ్వలరక్తకవనీరజము లనంగ,
నభ్రబింబితచరమాగపద్మాకరా,స్థానరోహితనీరజము లనంగ,
వనజిని కర్కవర్తన దెల్ప నెగసి బ,ల్వడి వచ్చు చక్రవాలము లనంగ,
రవి నక్రపదముఁ జేరఁగ శ్యామఁ బూన్చు ను,త్తమదీపచక్రవాలము లనంగ,
తే. తమి నినుఁడు చేర వరకలాపము లనంగ, సీమ వారుణి దాల్ప రాజిలు తదీయ
విమలమణికావిభాకలాపము లనంగ, నహహ నవసాంధ్యరాగమ్ము లపుడు పొలిచె. 95

టీక: అపుడు=సూర్యుఁడు గ్రుంకినసమయమందు; నవసాంధ్యరాగమ్ములు=నూతనములగు సంధ్యాకాలికారుణ్యములు; భాస్వద్ధరిక్రమోపరిగతాంబుధి తటోజ్జ్వల రక్తకవనీ రజములు – భాస్వత్=సూర్యునియొక్క, హరి=గుఱ్ఱములయొక్క, క్రమ = పాదవిక్షేపముచేత, ఉపరిగత=మిన్నందినట్టి, ఇది రజమునకు విశేషణము, అంబుధితటోజ్జ్వల=సముద్రతీరమున వెలయు, రక్తక=మంకెనలయొక్క, వనీ=వనములయొక్క, రజములు=పరాగములు; అనంగన్ = అనునట్లుగా;

అభ్రబింబిత చరమాగ పద్మాకరాస్థాన రోహితనీరజములు – అభ్ర=ఆకసమందు, బింబిత=ప్రతిబింబించిన, ఇది నీరజములకు విశేషణము, చరమాగ=అస్తాద్రియందలి, పద్మాకర=కొలనియందు, ఆస్థాన=స్థితిగల, రోహితనీరజములు=ఎఱ్ఱదామరలు; అనంగన్ = అనునట్లుగా;

వనజినికి=పద్మలతకు; అర్కవర్తను= సూర్యుని వృత్తాంతమును; తెల్పన్=తెలియఁజేయుటకు; ఎగసి =పైకెగసి, బల్వడిన్ = అతివేగముచే; వచ్చు చక్రవాలములు = వచ్చునట్టి జక్కవలగుంపులు, రేఫలకారముల కభేదముచే వాల మనుచో వారమని భావింపఁ బడియె; అనంగన్ = అనునట్లుగా;

రవి నక్రపదముఁ జేరఁగ శ్యామఁ బూన్చు నుత్తమదీపచక్రవాలములు – రవి=సూర్యుఁడు, నక్రపదమున్=సాగరమును; చేరఁగన్ =పొందఁగా, శ్యామ=రాత్రి యనెడు స్త్రీ, పూన్చు=ఉంచునట్టి, ఉత్తమ=శ్రేష్ఠములైన, దీప=దీపములయొక్క, చక్రవాలములు = మండలములు; అనంగన్ = అనునట్లుగా;

తమిన్=ఆసక్తిచేత; ఇనుఁడు =సూర్యుఁడను నాయకుఁడు; చేరన్=పొందఁగా; వరకలాపములు=చక్కనిసొమ్ములు; వారుణి = ప్రతీచి, స్త్రీత్వనిర్దేశముచేత నొక స్త్రీయని తోఁచుచున్నది; అంగసీమన్=దేహప్రదేశమందు; తాల్పన్=ధరింపఁగా; రాజిలు = ప్రకాశించుచున్న; తదీయవిమలమణికావిభాకలాపములు – తదీయ=ఆసొమ్ములకు సంబంధించిన, విమల=స్వచ్ఛములైన, మణికా =మణులయొక్క, విభా=కాంతులయొక్క, కలాపములు=సమూహములు; అనంగన్ = అనునట్లుగా; పొలిచెన్ = ప్రకాశించెను; అహహ= అద్భుతము! అనఁగా సాంధ్యరాగములు సూర్యాశ్వగతివలన గగనతలమంటిన సముద్రతీరపు మంకెనవనములందలి పుప్పొడులవలె నున్నవనియు, చరమాద్రియందలి కొలఁకులందుండి గగనతలమందుఁ బ్రతిఫలించిన యెఱ్ఱదామర లట్లున్నవనియు, సూర్యుఁ డస్తమించె నని పద్మినికిఁ జెప్ప గగనతలమున కెగసి వచ్చుచున్న చక్రవాకముల గుంపులవలె నున్నవనియు, సూర్యుం డస్త మింపఁగా రాత్రి యను స్త్రీయమర్చిన దీపమండలిని బోలి యున్న వనియు, సూర్యుఁ డను భర్తను జేరఁ బ్రతీచి యను కాంత తాల్చిన సొమ్ములయొక్క స్వచ్ఛమైన మణికాంతులభంగి నొప్పిన వనియు భావము. ఉత్ప్రేక్షాలంకారముల సంసృష్టి.

చ. ఘనకమలోదయం బెడయఁ ◊గాలగతి న్వన మందుచు న్రథాం
గ నలగవాధినేత సనఁ◊గాఁ గడుఁ దత్సతి యాత్మఁ జింత పొం
గ నలఁగ వారి కన్నుఁగవఁ ◊గ్రమ్మఁ దనూస్థలి తాపభోగిచేఁ
గనలఁగ వాడుచు న్నెమకెఁ ◊గాంతునిఁ గాననమండలంబునన్. 96

టీక: ఇందు జక్కవపరమైన యర్థము, నలచక్రవర్తిపరమైన యర్థము గలుగుచున్నవి. ఘనకమలోదయంబు – ఘన=అధికమగు, కమల=పద్మములయొక్క, లక్ష్మియొక్కయని యర్థాంతరము, ఉదయంబు=ఆవిర్భావము; కాలగతిన్=సంధ్యావశముచేత; కాల=కలిజన్యమైన,గతిన్=దశావిశేషముచేత నని యర్థాంతరము;ఎడయన్=పాయఁగా;వనము=నీటిని, అడవిని; అందుచున్ = పొందుచు; రథాంగనలగవాధినేత =చక్రవాక మనెడు నలరాజు; చనఁగాన్=పోఁగా; కడున్=మిక్కిలి; తత్సతి=

దానిపెంటి, దమయంతి యని యర్థాంతరము; ఆత్మన్=చిత్తమందు; చింత =ఆధ్యానము; పొంగన్=మించఁగా; నలఁగన్ = నలఁతనొందఁ గా; కన్నుఁగవన్=కనుదోయియందు; వారి =అశ్రులు; క్రమ్మన్=పైకుబుకఁగా; తనూస్థలి=దేహప్రదేశము; తాప భోగిచేన్ = సర్పమువంటి సంతాపముచేత; కనలఁగన్=మండుచుండఁగా; వాడుచున్=మ్లానమగుచు; కాననమండలంబునన్ =అరణ్యప్రదేశమునందు; కాంతునిన్=భర్తను; నెమకెన్=వెదకెను. నలార్థమందు, తనూస్థలి, తాపభోగిచేన్=సంతాపకరమగు సర్పముచేత, కనలఁగన్=మండఁగా, వాడుచున్=మ్లానుఁ డగుచు, నలగవాధినేత సనఁగ నని యోజింపవలెను. కానిచో దమ యంతియందుఁ దాపభోగిచేఁ గనలుట సంభవింపక యసంగత మగును.

ఉ. మక్కువ సారసాకరస॥మాజము చేరుచుఁ బట్టఁబూనుఁ బో
జక్కవనాతి మానితని॥జప్రతిబింబము గాంచి భర్తయం
చక్కట పిల్చుఁబో పతి వ॥నావళి కుంజచయంబు దూఱుచున్
జక్కవనాతి మానితత॥సమ్మదసంపద లెల్ల నత్తఱిన్. 97

టీక: జక్కవనాతి =చక్రవాకస్త్రీ; మక్కువన్=ప్రేమచేత; సారసాకరసమాజము=పద్మాకరసమూహము; చేరుచున్=పొందుచు; చక్కన్=బాగుగా; వనాతిమానితనిజప్రతిబింబము– వన=జలమందు, అతిమానిత=మిక్కిలి యొప్పుచున్న,నిజప్రతిబింబము = తనప్రతిబింబమును; కాంచి = చూచి;భర్తయంచున్=తనప్రియుఁ డనుచు; పట్టన్=పట్టుకొనుటకు; పూనుఁబో = యత్నించు జుమీ; అక్కట=ఖేదము (అయ్యో!); వనావళిన్=అరణ్యపంక్తియందు; కుంజచయంబు =పొదరిండ్లగుంపును;దూఱుచున్ = చొచ్చుచు; తతసమ్మదసంపద లెల్లన్—తత=విస్తృతములగు, సమ్మదసంపద లెల్లన్=సంతోషసమృద్ధులన్నింటిని; అత్తఱిన్ = అపుడు; మాని=త్యజించి; పతిన్=ప్రియుని; పిల్చుఁబో=ఆహ్వానము చేయును జుమా!

సూర్యాస్తానంతరమునఁ జక్రవాకస్త్రీ కాసారములచెంతకుఁ బోయి తన ప్రతిబింబమును జూచి భర్తయను తలంపునఁ బట్టఁ బూను ననియు, అరణ్యప్రదేశములయందు పొదలు దూఱుచు సంతోషమును మాని పతిని బిల్చుచుండు ననియు భావము.

సీ. చక్రభయాపాది॥సమయఘనాఘనా,లిసుతనూవ్యక్తమా॥లిన్య మనఁగ,
పరినటచ్ఛివకటీ॥భ్రష్టఘనాఘనా,త్మకదానవాజినాం॥శుక మనంగ,
ద్యుమణిరథాంగహ॥త్యుత్థఘనఘనా,శ్మమయాస్తగిరినితం॥బరజ మనఁగ,
నిశ్శేషబంధకీ॥నికరఘనాఘనా,శ రతీశసృష్టశాం॥బరిక యనఁగఁ,
తే. బ్రకటదివసాత్యయాఖ్యన॥భస్యకాల,కలితసాంద్రఘనాఘన॥కళిక యనఁగ,
నౌర యతినీలదీప్తిజా॥లానుపూర్తి, నమరె నవ్వేళ నిర్వేల॥తిమిరరాశి. 98

టీక: చక్రభయాపాది సమయ ఘనాఘనాలి సుతనూ వ్యక్త మాలిన్యము– చక్ర=చక్రవాక మనెడు రాష్ట్రమునకు, భయాపాది = భయసంపాదకమైన, సమయ=సంధ్యాకాల మనెడు, ఘనాఘనాలి=ఘాతుకపంక్తియొక్క, సుతనూ=దేహములయందు, వ్యక్త=బయలుపడిన, మాలిన్యము =మలినత; అనఁగన్ = అనునట్లుగా;

పరినట చ్ఛివకటీ భ్రష్టఘనాఘనాత్మకదాన వాజినాంశుకము – పరినటత్=మిక్కిలి నటించుచున్న, శివ=ఈశ్వరునియొక్క, కటీ = కటిప్రదేశమువలన, భ్రష్ట=జాఱిన, ఘనాఘనాత్మకదానవ=గజాసురునియొక్క, అజిన=చర్మ మనెడు, అంశుకము= వస్త్రము; అనంగన్ = అనునట్లుగా; శివుఁడు ప్రదోషసమయమునఁ దాండవము సల్పుట ప్రసిద్ధము.

ద్యుమణి రథాంగ హత్యుత్థ ఘనఘనాశ్మమ యాస్తగిరినితంబ రజము – ద్యుమణి=సూర్యునియొక్క, రథాంగ=రథచక్ర ములచేనైన, హతి=కొట్టుటచేత, ఉత్థ=పుట్టిన, ఇది రజమునకు విశేషణము, ఘనఘనాశ్మమయ=మిగుల గొప్పనైన పాషాణ ములచేత ప్రచురమగు, అస్తగిరినితంబ=అస్తాచలకటకముయొక్క, నితంబ మనఁగా పర్వతముపై వదునుగానుండు ప్రదేశము, 'కటకో స్త్రీ నితమ్బోద్రేః' అని యమరుఁడు, రజము =ధూళి; అనఁగన్ = అనునట్లుగా;

నిశ్శేషబంధకీ నికర ఘనాఘ నాశ రతీశసృష్ట శాంబరిక అనఁగన్– నిశ్శేషబంధకీ=అశేషజారిణులయొక్క, నికర=సమూ హముయొక్క, ఘన=అధికమైన, అఘ=పాపముయొక్క, నాశ=నాశముకొఱకు, రతీశసృష్ట=మరునిచే సృజింపఁబడిన, శాంబరిక =మాయ; అనఁగన్ =అనునట్లుగా;

ప్రకట దివసాత్యయాఖ్య నభస్యకాల కలిత సాంద్ర ఘనాఘన కళిక– ప్రకట=వ్యక్తమైన, దివసాత్యయాఖ్య=దివసావసాన మను పేరు గల, నభస్యకాల=భాద్రపదసమయమందు, వర్షర్తుసమయమం దనుట,కలిత=ఒప్పుచున్న, సాంద్ర=దట్టములగు, ఘనాఘన=వర్షుకాబ్దములయొక్క, కళిక=కాంతి; అనఁగన్ = అనునట్లుగా,'ఘనాఘనో ఘాతుకమత్తదన్తినోః నిరన్తరే దానవ వర్షుకాబ్దయోః' అని విశ్వము;

అవ్వేళన్=ఆసమయమునందు; నిర్వేలతిమిరరాశి =అడ్డము లేని చీఁకటిగుంపు; అతినీలదీప్తిజాలానుపూర్తిన్ = మిక్కిలినల్ల నగు కాంతిజాలముయొక్క పరిపూర్ణతచేత; అమరెన్=ఒప్పెను; ఔర=ఆశ్చర్యము!

అనఁగా నప్పుడు చీఁకటులగుంపు చక్రములకు భయముగలిగించునట్టి సంధ్యాకాలమనెడు ఘాతుకసమూహముయొక్క దేహనైల్యమో అనునట్లును, శివుఁడు ప్రదోషసమయమునఁ దాండవము సేయఁగా జాఱిన యతని గజచర్మోత్తరీయమో యను నట్లును, సూర్యరథచక్రంబుల తాఁకుడుచే నస్తాద్రిశిలలు పొడియై రేఁగిన ధూళిపుంజమో యనునట్లును, జారిణుల పాపము పాయుటకై మన్మథుఁడు కల్పించిన మాయయో యనునట్లును, సాయంకాల మనెడు వర్షాకాలమందుఁ దోఁచు మేఘశ్రేణియో యనునట్లును, వెలసె నని తాత్పర్యము.

చ. ఇనుఁ డతిదూరదేశమున నేఁగఁ దదాగమనంబుఁ గోరి పా
వనజలతాళితాంగపరివారితపంకనికాయయై తమిన్
వనజలతాళి గప్పుఁగలువన్ మధుసూదని నావహించి స
ద్వనజలతాళిగాత్రి కథ వల్కఁగ మోడ్చెఁ బయోజహస్తముల్. 99

టీక: వనజలతాళి=తామరతీవలగుంపు, స్త్రీత్వనిర్దేశమున నొకస్త్రీ యని తోఁచుచున్నది; ఇనుఁడు=సూర్యుం డనెడు భర్త; అతి దూరదేశమునకున్ = మిగుల దూరదేశమునకు; ఏగన్=పోఁగా; తదాగమనంబున్ = ఆ యినునియొక్క రాకను; కోరి = ఇచ్ఛించి; పావన జల తాళితాంగపరివారిత పంకనికాయయై– పావన=పవిత్రమగు, జల=నీటిచేత, తాళిత=తాడిత= కొట్టఁ బడినదై, ఇది పంకమునకు విశేషణము. లడల కభేదమును బట్టి తాళి తాడిత యను యర్థములో వాడఁబడినది, అంగపరివారిత = శరీరమునకుఁ బరివారమువలె నావరించుచున్న, పంకనికాయయై = కర్దమవయ మనెడుపాపసంఘము గలదై; తమిన్ = రాత్రియందు, ఆసక్తిచేత, శ్లిష్టరూపకము; కప్పుఁగలువన్=నల్లకలువయందు; మధుసూదనిన్=లక్ష్మీదేవిని; ఆవహించి =

ఆవాహనము చేసి; సద్వనజలతాళిగాత్రి– సత్=శ్రేష్ఠమైన, వనజలతా=వనమందుఁ బుట్టిన లతలయందలి, అళిగాత్రి =భృంగ మను గాయకురాలు; కథ పల్కఁగన్=కథఁ జెప్పఁగా; పయోజహస్తముల్=కమలము లనెడు హస్తములను, పయోజముల వంటి హస్తము లని ప్రోషితపతికాపరమైన యర్థము; మోడ్చెన్=ముకుళించెను.

అనఁగాఁ బ్రోషితభర్తృక దేశాంతరమున నుండు తనభర్తరాకను గోరి పుణ్యతీర్థస్నానముచే గతకల్మషయై, యాసక్తిచేత నొకపద్మమందు లక్ష్మీదేవి నావహించి పూజించి, యొక పుణ్యాంగన కథ చెప్పుచుండఁగాఁ గేలు మోడ్చియుండునట్లు తామర తీవ సూర్యుఁ డస్తమింపఁగా నిర్మలజలముచేఁ గర్దమచయము పోఁగొట్టికొనినదై, రాత్రియందు నల్లగలువయందు శ్రీ నావహించి, తుమ్మెదలు పాడుచుండఁగా పద్మములనెడు హస్తముల మోడ్చె ననుట. సూర్యుఁ డస్తమించినపిదపఁ గమలములు ముకుళించె ననియు, కలువలు సిరి యొప్పార రాజిల్లె ననియు, వానిచెంగట తుమ్మెదలు మ్రోయుచుండె ననియు ఫలితార్థము.

సీ. నటదీశమౌళి ది◊జ్ఞారులు చల్లు మం,గళసితాక్షతజాల◊కంబు లనఁగ,
నచలావపతనవే◊ళాభ్రలగ్నతమఃక,దంబాపగాజాల◊కంబు లనఁగ,
వనరాశి రవి మాధ◊వతఁ దోఁప నంబరా,గమునఁ బొల్చినజాల◊కంబు లనఁగఁ,
దఱి రా శుభము వేల్పు◊తెఱవచాల్ గన నాక,ఘనకుడ్యకృతజాల◊కంబు లనఁగ,
తే. గురుసరశ్శ్రేణిరాజీవ◊కులము నడఁచి, యంబరస్థలి నాఱ దీ◊ష్టాఖ్య మైని
కతతి పఱచిన వరజాల◊కంబు లనఁగఁ, జొక్క మగు మింటఁ గనుపట్టె ◊ రిక్క లపుడు. 100

టీక: నటదీశమౌళిన్– నటత్=నటించుచున్న,ఈశ=శివునియొక్క, మౌళిన్=శిరస్సునందు; దిజ్ఞారులు=దిక్కులనెడుస్త్రీలు; చల్లు మంగళ సితాక్షత జాలకంబులు– చల్లు=చల్లునట్టి, మంగళ=శుభకరములైన, సితాక్షత=తెల్లని యక్షతలయొక్క, జాల కంబులు=సంఘములు; అనఁగన్=అనునట్లుగా;

అచలావపతనవేళాభ్ర లగ్నతమఃకదంబాపగా జాలకంబులు– అచలా=భూమియందు, అవపతనవేళా=పడుటయొక్క సమయమందు, అభ్ర=ఆకసమునందు, లగ్న=సంబంధించిన, తమఃకదంబాపగా=తిమిరసంఘ మనెడు నదియొక్క, జాలకంబులు = బిందువులు; అనఁగన్=అనునట్లుగా;

వనరాశిన్=సముద్రమను నరణ్యకదంబమందు, రవి=సూర్యుఁడు, మాధవతన్=విష్ణుత్వ మనెడు వసంతభావముచే, సంధ్య యందు సూర్యుఁడు విష్ణురూపు డనుట యాగమప్రసిద్ధము; తోఁపన్=తోఁపఁగా; అంబరాగమునన్ = అంతరిక్షమనెడు వృక్ష మందు; పొల్చిన=ఉదయించిన, జాలకంబులు =మొగ్గలు; అనఁగన్=అనునట్లుగా;

తఱి =సంధ్యాసమయము; రాన్=రాఁగా; వేల్పుతెఱవచాల్=దేవతాస్త్రీసంఘము; శుభము =రాఁబోవు శుభమును; కనన్ = చూచుటకు; నాక ఘనకుడ్య కృత జాలకంబులు– నాక=అంతరిక్షమనెడు, ఘనకుడ్య=గొప్పగోడయందు, కృత=చేయఁ బడిన, జాలకంబులు=గవాక్షములు; అనఁగన్=అనునట్లుగా;

గురుసరశ్శ్రేణిన్=గొప్పలగు కాసారముల సంఘమందు; రాజీవకులమున్=పద్మసమూహమను చేపలగుంపును; అడఁచి= అడఁగించి; అంబరస్థలిన్=ఆకాశప్రదేశమందు; ఆఱన్=తడి యాఱుటకు; దిష్టాఖ్య మైనికతతి = కాలమను పేరుగల మత్స్య ఘాతుకులయొక్కగుంపు, మీనశబ్దముపై 'పక్షిమత్స్యమృగా న్హన్తి' అను సూత్రముచే ఠక్ప్రత్యయము వచ్చి మైనిక శబ్దమైనది; పఱచిన వరజాలకంబులు= పఱచినట్టి మేలైన వలలు; అనఁగన్=అనునట్లుగా; అపుడు=ఆసమయమున;చొక్కమగు మింటన్ = నిర్మలమగు నాకాశమునందు; రిక్కలు=నక్షత్రములు; కనుపట్టెన్=చూపట్టెను. అనఁగా నపుడు నక్షత్రము లుదయించినవై,

సంధ్యాకాలమున నాట్యము సేయుచుండు శివునిశిరమున దిగంగనలు చల్లిన తెల్లనియక్షత లనునట్లును, అంధకారమనెడు నది యాకసమునుండి దిగువఁ బడునపుడు గగనలగ్నములగు జలబిందువు లనునట్లును, వనరాశియందు సూర్యుఁడను వసంతుఁడు తోఁపఁగా గగన మను వృక్షమందుఁ బుట్టిన మొగ్గ లనునట్లును, దేవాం గనలు సంధ్యాసమయము రాఁగాఁ గలిగెడు శుభమును గన్గొనుటకు గగన మనుకుడ్యమందుఁ జేయఁబడిన గవాక్షము లను నట్లును, సంధ్యాకాల మనెడు మీనఘాతుకతతి సరస్సులయందు రాజీవము లనెడు మత్స్యములఁ బట్టి గగనమం దాఱవేసినవల యన్నట్లును భాసిల్లె నని భావము.

మ. శరజద్వేషి నిశావధూటివరణేచ్ఛన్ రాఁగ మున్మున్నె బల్
త్వరఁ గాలోపధికారు లూనునవచంద్రజ్యోతిరాళీలస
త్పరివర్ణ్యస్వకవర్ణనిర్ణిహతచంద్రజ్యోతిరాళీలస
ద్గరిమం బెంపయి దోఁచెఁ బ్రాచి నవదాతత్విట్కులం బయ్యెడన్. 101

టీక: శరజద్వేషి=పద్మవిరోధి యగు చంద్రుఁడు; నిశావధూటివరణేచ్ఛన్=రాత్రియను స్త్రీని వరించు కోర్కెచే; రాఁగన్=వచ్చుచుండఁగా; మున్మున్నె=ముందుముందే; బల్ త్వరన్=అతివేగముచేత; కాలోపధికారులు = కాలమనెడు నెపముగల శిల్పులు; ఊను నవ చంద్రజ్యోతిరాళీ లస త్పరివర్ణ్య స్వక వర్ణ నిర్ణిహత చంద్రజ్యోతిరాళీ లస ద్గరిమన్ – ఊను=వహించునట్టి, నవ=నూతనములైన, చంద్రజ్యోతిః=కర్పూరదీపములయొక్క, 'ఘనసార శ్చంద్రసంజ్ఞః' అని యమరుఁడు, ఆళీ=పంక్తులవలె, లసత్ = ప్రకాశించుచున్న, పరివర్ణ్య=వర్ణింపఁదగిన, స్వక=స్వకీయమైన, వర్ణ=కాంతిచేత, నిర్ణిహత=అఖండితమైన, చంద్రజ్యోతిరాళీ= పగలువత్తులపంక్తులయొక్క, లసత్=ఒప్పుచున్న, గరిమన్=అతిశయముచేత; అవదాతత్విట్కులంబు=శుభ్రకాంతిపుంజము; అయ్యెడన్=అపుడు; ప్రాచిన్=తూర్పున; పెంపయి=అధికమై; తోఁచెన్=అగపడెను.

అనఁగా చంద్రు డనునాయకుఁడు నిశ యను స్త్రీని వరింప వచ్చుచుండఁగా, ముందుముందే శిల్పకారులు పట్టినపగలువత్తులవలెఁ దూర్పునఁ దెల్లనికాంతిపుంజము దోఁచె ననుట. తూర్పునఁ జంద్రకిరణపుంజము గనిపించె నని ఫలితార్థము.

సీ. గగనబాలుం డూర్ధ్వగతరశ్మి దివియఁ బైఁ,జక్కఁ జేర్చుపసిండిచక్ర మనఁగఁ,
బాంథభీకరలీలఁ బ్రబలునిశాభూత,సతి గొన్న యాలాతచక్ర మనఁగ,
చీఁకటిపొలదిండిమూఁక గూల్పఁగఁ గాల,శౌరి చే నెత్తినచక్ర మనఁగ,
నినుఁడు వోయినదారిఁ గనఁ బూర్వగిరిశిఖా,స్థల మెక్కి నిల్చినచక్ర మనఁగఁ,
తే. బ్రాచి తెలిచాయ యనుమంచు ప్రబల భాస్వ,దంశుకవిహీన గానఁ దానందు కోర్వఁ
జాల కూన్చిననవకీలిచక్ర మనఁగ, నపుడు దొలికెంపుతో సారసారి వొలిచె. 102

టీక: గగనబాలుండు=ఆకసమను చిన్నవాఁడు; ఊర్ధ్వగతరశ్మిన్ – ఊర్ధ్వగత=ఉపరిగతమగు,రశ్మిన్ =కిరణమను త్రాటిని; తివియన్=ఆకర్షించుటకు; పైన్=ఉపరిభాగమందు; చక్కన్ =బాగుగా; చేర్చుపసిండిచక్రము=చేర్చునట్టి బంగరుచక్రము; అనఁగన్ = అనునట్లుగా;
పాంథభీకరలీలన్=పథికులకు భయము గొల్పు క్రియచేత; ప్రబలునిశాభూతసతి = ప్రబలుచున్నరాత్రియనెడు పిశాచాంగన; కొన్న యాలాతచక్రము – కొన్న=కొనినట్టి, ఆలాత=కొఱవిసంబంధియైన, చక్రము=భ్రమణము; అనఁగన్ = అనునట్లుగా;

చీఁకటిపాలదిండిమూఁకన్=అంధకారమనెడు రాక్షసులగుంపును; కూల్పఁగన్=కూల్చుటకు; కాలశౌరి=కాలమనెడు విష్ణుమూర్తి; చేన్=హస్తముచేత; ఎత్తినచక్రము=పైకెత్తిన చక్రాయుధము; అనఁగన్ = అనునట్లుగా; ఇనుఁడు=సూర్యుఁడు; పోయినదారిన్=పోయినట్టి మార్గమును; కనన్=చూచుటకు; పూర్వగిరిశిఖాస్థలము=ఉదయపర్వతాగ్రప్రదేశమును; ఎక్కి=అధిష్ఠించి; నిల్చిన=నిలిచియుండిన; చక్రము=చక్రవాకము; అనఁగన్ = అనునట్లుగా; ప్రాచి=తూర్పుదిక్కనెడు స్త్రీ; తెలిచాయ యనుమంచు = తెల్లనికాంతి యనెడు హిమము; ప్రబలన్=సమృద్ధము కాఁగా; భాస్వదంశుకవిహీన– భాస్వదంశుక=సూర్యకిరణములనెడు ప్రకాశించుచున్న వస్త్రముచేత, విహీన=హీనురాలు (లేనిది); కానన్= అగుటచేత; తాను; అందుకున్=ఆహిమమునకు; ఓర్వఁజాలక=సహింపఁజాలక; ఊన్చిన నవకీలిచక్రము= పూన్చినట్టి క్రొత్తనైన అగ్ని సమూహము; అనఁగన్ = అనునట్లుగా; అపుడు=ఆసమయమందు; సారసారి=పద్మవైరియైన చంద్రుఁడు; తొలి కెంపుతోన్ = తొలుతటియారుణ్యముతోడ; పొలిచెన్=ఉదయించెను.

అనఁగాఁ జంద్రబింబము, గగన మను బాలుఁ డుపరిగతమైన కిరణమను త్రాటి నాకర్షింపఁ జేర్చిన సువర్ణచక్రమును బోలియు, నిశ యను పిశాచాంగన పాంథులు భీతిల్లునట్లు త్రిప్పుచున్న కొఱివిని బోలియు, కాలమనెడు విష్ణుమూర్తి చీఁకటి యను రాక్షసులగుంపును సంహరింపఁ బైకెత్తిన చక్రాయుధమును బోలియు, సూర్యుఁడు పోయినదారిని గన నుదయగిరిశిఖరము నెక్కిన చక్రవాకమును బోలియు, తెలిచాయ యనెడు మంచు ప్రబలఁగా భాస్వదంశుకవిహీనయగు ప్రాగ్దిగంగన దానికోర్వఁజాలక పెట్టిన మంటను బోలియు, ప్రాథమికమైన యరుణకాంతితోఁ గూడి యుదయించె ననుట. చంద్రోదయ మయ్యె నని ఫలితార్థము. 'శ్లో. ప్రథమ మరుణచ్ఛాయ స్తావ త్తతః కనకప్రభ స్తదను విరహోత్తామ్యత్తన్వీకపోలతలద్యుతిః, ఉదయతి తతో ధ్వాంతధ్వంసక్షమః క్షణదాముఖే సరసబిసినీకందచ్ఛేదచ్ఛవి ర్మృగలాఞ్ఛనః' ఇత్యాదికవివ్యవహారములచే నుదయకాల మందుఁ జంద్రున కారుణ్యముండు నని తెలియవలయు.

చ. ఒనరఁగ రాజ వయ్యు నిర ◊నుంచితి తమ్ముల సాధుచక్రమో
దనహృదయంబు నంది తని ◊దార్కొన దుస్తరచింతనాధునిం
దనహృదయంబు నందితని◊తాంతబుధాత్మకలాకుఁ డాసుధా
జని కడు వెల్లఁబాఱె నను◊చాడ్పునఁ బాండిమ నొప్పె నయ్యెడన్. 103

టీక: నందితనితాంతబుధాత్మకలాకుఁడు– నందిత=సంతోషపెట్టఁబడిన, నితాంత=గాఢమైన, బుధాత్మ=దేవతలచిత్తము గల, కలాకుఁడు=కళలుగలవాఁడు, సంతోషపెట్టఁబడిన విద్వాంసులచిత్తములు గల విద్యలు గలవాఁడని యర్థాంతరము దోఁచును; ఆసుధాజని = ఆచంద్రుఁడు; ఒనరఁగన్=ఒప్పునట్లు; రాజ వయ్యున్=ప్రభువ వయ్యును, రాజనామము గలవాఁడ వయ్యును నని యర్థాంతరము; ఇరన్=జలమందు; తమ్ములన్=సోదరులను, పద్మములను; ఉంచితి=అడంచితివి; సాధుచక్రమోదనహృదయంబున్– సాధుచక్ర=సత్పురుషులసంఘముయొక్క, మంచిచక్రవాకములయొక్క, మోదన=సంతసమును, హృత్=హరించెడు, అయంబున్=శుభావహవిధిని; అందితి=పొందితివి; అని=అని తలఁచి– ఇచటఁ జంద్రుఁడు తన్నుఁదాను సంబోధించుకొనుచుఁ బలికెనని గ్రహింపవలయు; తనహృదయంబు =తనచిత్తము; దుస్తరచింతనాధునిన్=తరింపరానిచింతయనెడు నదిని; తార్కొనన్=ప్రవేశింపఁగా; కడున్=మిక్కిలి; వెల్లఁబాఱె ననుచాడ్పునన్ = వైవర్ణ్యమొందె నను రీతిచేత; పాండిమన్ = శుభ్రత్వముచేత; అయ్యెడన్=అప్పుడు; ఒప్పెన్=ఒప్పెను.

ఒకప్రాజ్ఞు(డైనవా(డు తాను రా జయ్యును దనసహోదరులను, సత్పురుషసంఘమోదమును హరించి వెనుక నాచింతచే సంతప్తహృదయు(డై వెలవెల(బొఋనట్లు కళానిధి యైనచంద్రు(డు తాను రాజశబ్దమును బొందియు(, దమ్ముల నొంచుటను, సాధుచక్రమోదమును హరించుటను దల(చి చింతాక్రాంతు(డై వెలవెల(బాఱెనా యనునట్లు పాండిమ నొందె ననుట. చంద్రు(డుద యించి ధావళ్యము నొందె ననియు, పద్మములు ముకుళించె ననియు(జక్రవాకములకు సంతోషము దొఱంగె ననియు ఫలితా ర్థము. ఉత్ప్రేక్షాలంకారము.

మ. మునుమున్ చంద్రఘటిన్ భరించి యమృత◊మ్ముల్ నించె వేళా ప్రపా
వనశాలాక్షి తిరోహితాన్యహితభావ◊శ్రీ మరుత్త్వద్దిశా
వనశాలాక్షి తిరోహితాంశుసురభి◊వ్యాపారముల్ దూల నూ
తనసంధ్యాతపశక్తి డప్పిగొను జ్యో◊త్స్నాపాయిపాంథాళికిన్. 104

టీక: వేళా ప్రపావనశాలాక్షి – వేళా=సమయమనెడు, ప్రపా=చలిపందిరియొక్క, అవన=రక్షించెడు, శాలాక్షి =మీననేత్ర, ‘రోహితో మద్గుర శ్శాలో రాజీవ శ్శకుల స్తిమిః’ అని యమరు(డు; తిరోహితాన్యహితభావశ్రీన్ – తిరోహితాన్య= అతిరోహిత మైన, అన(గా(దిరోహితము కానట్టి, అన(గా ప్రత్యక్షమైన, హితభావ=ఆప్తత్వముయొక్క, శ్రీన్=సంపదచేత; మరుత్త్వద్దిశా వనశాలాక్షి – మరుత్త్వద్దిశా=తూర్పుదిక్కనెడు, ‘ఇన్ద్రో మరుత్వాన్ మఘవః’ అని యమరు(డు, మరుత్త్వద్దిశ యన(గా ఇంద్రు(డు అధిపతిగా(గల దిశ -తూర్పుదిశ, వనశాలాక్షితిన్=అటవీగృహప్రదేశమునందు; రోహితాంశుసురభివ్యాపారముల్ – రోహితాంశు=సూర్యు(డనెడు, సురభి=వసంతముయొక్క, వ్యాపారముల్=క్రియలు;తూలన్=నశింప(గా; నూతనసంధ్యా తపశక్తిన్ – నూతన=క్రొత్తదైన, సంధ్యా=సంధ్యాకాల మనెడు, తప=గ్రీష్మర్తువుయొక్క, శక్తిన్=సామర్థ్యముచేత; డప్పి గొను జ్యోత్స్నాపాయిపాంథాళికిన్ – డప్పిగొను=తృష్ణగొను, జ్యోత్స్నాపాయి=వెన్నెలపుల్గులనెడు, పాంథాళికిన్=బాటసారుల గుంపునకు; మునుమున్= ముందుముందుగనె; చంద్రఘటిన్=చంద్రు(డనెడు ఘటమును; భరించి=పోషించి; అమృతమ్ముల్= సుధ యనెడు జలములను; నించెన్ =పూరించెను.

అన(గా వేళ యనెడు ప్రపాపాలిక సూర్యు(డను వసంత ముడి(గిపో(గా సంధ్యయను గ్రీష్మర్తువున తూర్పుదిక్కనెడు వనశాలాప్రదేశమునందు తృష్ణనొందిన చకోరము లనుపాంథగణముకొఱకు ముందుగనే చంద్రు(డను ఘటమం దమృత మను జలమును నించి యుంచె ననుట. అన(గా ప్రాగ్దిగంగన చకోరములకై నించి యుంచిన యమృతఘటమువలెఁ జంద్రు(డు రాజిల్లె నని భావము.

మ. తనరెన్ వెన్నెల దిష్టవిష్ణుకృప స◊ద్బాలోదయాసక్తమై
తనయాశాబలమెల్ల(జేకుఱ శశి◊స్థాలి న్మనోజ్ఞాదితీ
తనయాశాబల మెల్లమెల్లనె ముదా◊త్మం బొంగలి న్బెట్ట(జా
ల నవీనోదయరాగకీలధరకీ◊లం బొంగుదుగ్ధాళి నాన్. 105

టీక: మనోజ్ఞాదితీతనయాశాబల – మనోజ్ఞ=హృద్యమైన, అదితీతనయ=ఇంద్రునియొక్క, ఆశా=దిక్కనెడు, అబల=స్త్రీ; దిష్టవిష్ణుకృపన్=కాల మనెడు విష్ణుమూర్తియొక్క దయచేత; సద్బాలోదయాసక్తమై – సద్బాల=చుక్కలనెడు శ్రేష్ఠమగు శిశువులయొక్క, ఉదయ=ఆవిర్భావమందు, ఆసక్తమై=ఆసక్తికలదై; తనయాశాబలము=తనకోరికయొక్క సామర్థ్యము;

ఎల్లన్=అంతయు; చేకుఱన్=సిద్ధింపఁగా; శశిస్థాలిన్=చంద్రుఁడను పాత్రయందు; మెల్లమెల్లనె = తిన్నతిన్నగా; ముదాత్మన్ = సంతోషించిన మనస్సుచేత; పొంగలిన్=పొంగలిని; పెట్టన్=పెట్టఁగా; నవీనోదయరాగకీలధరకీలన్ – నవీన=నూతనమైన, ఉదయరాగ=చంద్రోదయకాలికారుణ్యమనెడు, కీలధర=అగ్నియొక్క, కీలన్=జ్వాలచేత; చాలన్=మిక్కిలి; పొంగు దుగ్ధాళి నాన్ = ఉప్పొంగు క్షీరపరంపరయో యనునట్లుగా; వెన్నెల=చంద్రిక; తనరెన్=ఒప్పెను.

అనఁగా తూర్పుదిక్కనెడు స్త్రీ కాలమనెడు విష్ణువుయొక్క ప్రసాదముచే సత్సంతానమును గోరి చుక్కలనెడు శిశువులు గలిగి, తనయిష్టము ఫలించె నని చంద్రుఁడను పాత్రయందు పొంగలి పెట్టఁగా నుదయరాగమనెడు నగ్నిజ్వాలచే పొంగలి వెలిఁబరవిన క్షీరపూరమువలె వెన్నెల విలసిల్లె ననుట. రూపకసంకీర్ణోత్ప్రేక్షాలంకారము.

సీ. మలినాన్యశిఖిహరిఁన్నలినాంచితాక్షీజ,ఘనసారసనహీరఁకాంతి నెగడి,
సుకరాశరాశాసిఁతకరాననోరోజ, ఘనసారహారయోఁగము భజించి,
వరవాయుకకుబంబుఁధరవాలికావక్త్ర, ఘనసారతిలకసఁఖ్యము వహించి,
యతికాంతశివదిశాఁలతికాతనూవేణి, ఘనసారసుమపాళిఁగౌఁగిలించి,
తే. మేదినీదేశపాటలాఁమోదినీభృ,తాతిఘనసారసావతంఁసాభఁ బెంచి
యపుడు పొడసూపెఁ బథికభఁయప్రదసుమ,హాదినేంద్రాతపంబు చంఁద్రాతపంబు. 106

టీక: మలినాన్య శిఖిహరి న్నలినాంచితాక్షీ జఘనసారసన హీరకాంతిన్—మలినాన్య= నిర్మలమగు, ఇది హీరకాంతికి విశేషణము, శిఖిహరిత్=అగ్నిదిక్కనెడు, నలినాంచితాక్షీ=స్త్రీయొక్క, జఘన=కటిప్రదేశమందలి, సారసన=మొలనూలియొక్క, హీర=వజ్రములయొక్క, కాంతిన్=ప్రభచేత; నెగడి=వృద్ధిఁబొంది;

సుకరాశరాశా సితకరాననోరోజ ఘనసార హార యోగమున్ – సుకర=మంచిప్రకాశము గల, ఇది హారమునకు విశేషణము, ఆశరాశా=నిరృతిదిశ యనెడు, సితకరాననా=స్త్రీయొక్క, ఉరోజఘన=తాళపుచిప్పలవంటి స్తనములయందలి, 'కాంస్యం తాలాదికం ఘనమ్' అని యమరుఁడు, సార=బలిష్ఠములగు, హార=ముత్యంపుపేరులయొక్క, 'హారో ముక్తావళీ' యని నామలిఙ్గానుశాసనము, యోగము=సంబంధమును, భజించి=పొంది;

వర వాయుకకుబంబుధరవాలికావక్త్రఘనసారతిలక సఖ్యమున్ – వర=శ్రేష్ఠమైన, వాయుకకుప్= వాయువుదిక్కనెడు, అంబుధరవాలికా = మేఘమునుబోలు కచములుగల స్త్రీయొక్క, వక్త్ర=ముఖమందలి, ఘనసారతిలక = కర్పూరతిలకముతోడి, సఖ్యమున్=మైత్రిని; వహించి=తాల్చి;

అతికాంత శివదిశా లతికాతనూ వేణిఘన సార సుమపాళి – అతికాంత=మిగుల మనోజ్ఞమైన, శివదిశా=ఈశానదిక్కనెడు, లతికాతనూ=స్త్రీయొక్క, వేణిఘన=మేఘమును బోలు జడయందలి, సార=శ్రేష్ఠములగు, సుమపాళి=కుసుమచయమును; కౌఁగిలించి=ఆలింగనముఁజేసి;

మేదినీదేశ పాటలామోదినీ భృతాతిఘన సారసావతంసాభన్ – మేదినీదేశ =భూస్థలియనెడు, పాటలామోదినీ=స్త్రీచేత, భృత =భరింపఁబడిన, అతిఘన=మిగుల నధికమగు, సారసావతంస=కుముదరూపమైన కర్ణాభరణముయొక్క, ఆభన్=కాంతిని; పెంచి=వృద్ధినొందించి;

పథిక భయప్రద సుమహాదినేంద్రాతపంబు – పథిక=తెరువరులకు, విరహుల కనుట, భయప్రద=భయము గొల్పెడు, సుమహత్ = అత్యధికమగు, దినేంద్రాతపంబు=సూర్యాతపరూపమైన; చంద్రాతపంబు =వెన్నెల; అపుడు; పొడసూపెన్=పొల్చెను.

అగ్నిదిగంగనాజఘన సారసనహీరకాంతిచేఁ బోషింపఁబడి, నిర్బృతిదిగంగనాస్తనతటమందలి ముక్తాహారముతోఁ గలసి, వాయవ్యదిగ్వనితయొక్క ముఖమందలి కర్పూరతిలకముతో మైత్రినొంది, యీశాన్యదిశాకాంత తుఱుమునం దుఱిమినట్టి పుష్పములను గౌఁగిటఁ జేర్చి, భూమి యనెడు స్త్రీచేత ధరింపఁబడిన సారసావతంసంబులం బోషించి, విరహులకు మహాత పమువలె భయము గలిగించుచు, వెన్నెల విలసిల్లె నని భావము. వెన్నెల సర్వదిక్కులు వ్యాపించి విలసిల్లె నని ఫలితము.

వ. వెండియు నాపండువెన్నెలదండం బఖండకాండజారిమండల మాయామౌక్తికమయ భద్రాసన సమాసీన నీలాంక లంకావరా హితపట్టాభిషేచనావరసమయ మహర్షిరాజాభిషిక్త గంగాదిపుణ్యతరంగిణీవిశద జలప్రవాహంబులపోలికం బ్రవహించుచు, నస్తాచలసంగతాహిమాంశుకిరణకూటతృణాంకురనికరంబుల నన్నింటి మేసి దర్పించి రథాంగజనంబులకు వైకల్యంబు చేకూర్చి సముజ్జృంభమాణ సత్ప్రభావాప్తిం జెలరేఁగు నిశానైచికిం బట్టి చకోరవత్సంబులు గుడువం జేఁపు తారాధవోధస్థల పరిదృశ్యమాన నవాంశుక స్తనంబుల ధరిత్రీపాత్రి దిష్టగోపాలకుండు పిదికిన నవీనపయఃపరంపరలదారిం జూపట్టుచు, దినాంత పర్యంతం బొక్కప్రొద్దుండి యతికాంత కాసారసోపానోపాంత శశికాంతసంతానమరీచికా వీచికావతీవీచికా జాతంబులం జొచ్చి యెడలి వికసితారుణశరజపీఠి వసించి కమలాహితధ్యానకలితాంతరంగంబున నున్న చకోరసువాసినీజనంబుల కవ్రతఘ్నంబు లగువిశదాపూపంబులు సమకూర్పఁ దత్ప్రియశ్యామా ప్రకాండంబు పూర్వదిశావదాతశోభాచ్ఛాదనంబుపైఁ జంద్రఘరట్టంబు వెట్టి యొయ్యనొయ్యనం దారాసుభద్రా పటలంబులు వైచి విసరం బ్రసరించు తదీయపిష్టఘట్టంబుల చందంబునం బెంపొందుచు, నెట్టుకొని గట్టు గములతటంబులం బొడకట్టు నెలచట్టులం గరంగి మట్టుమీరం గురియు పెన్నీటి బలురొద యభంగ తరంగనినాదంబును ముందుముందుగ మందగతిం దోఁతెంచు చందనాచలపవనకందళిం దరళితంబులై నిండార విరిసిన బొండుమల్లియవిరులపిండులు పాండురడిండీరఖండమండలంబులును మదిఁ గదురు ముదమునఁ దమతమసుదతుల గవఁగూడి యెదుర్కొను రేపులుఁగుకొలము లెదురెక్కు సమానవతీక మీనవితానంబులునుం గాఁగ ననూనపథికమానినీమానసాల మూలసమున్మూలనంబు సేయం బరఁగి దినాంతవిలయకాలమ్మున వేలాతిగం బైన పాలవెల్లిపొడవునం బొడసూపుచుఁ, గోకనదపరాగమహోదయరాగవిలసనంబునం గోరకితనీరజతారకాసమున్మేషంబునం గోమలశ్యామలేతర కుముదవలయ సుధాకరధామ విశేషంబునం గొమరొంది తద్రజనీసమయ భాసమాన పయోధరపథంబున కన్న మున్న మున్న కన్నులకు వెగ్గలంబై దొలంకుకొలంకుగమిం బాసి సన్నంపు వెన్నెలమిన్న చొరరాని లతానివాసంబుల దాఁగం బోవుచుఁ దదంతర సంఫుల్ల్యమాన మల్లికావల్లికామతల్లికా ప్రసవ ధవళద్యుతి ప్రకాండంబులు నిండి రేయెండ మెండు కొనఁజేయ దాఁగ వచ్చిన చోటన్ దలవరు లున్నతెఱం గొయ్యనఁ గని ఖేదించు రోదరతలోదరీవారమ్ముల నయనమ్ముల జాలుగా జాఱు ననావిలజలమాలికలతో మేలంబు లాడుచుఁ, దళతళమను నెలచలుపగిన్నెలయెడలం గలయ నించిన యతిబంధురసౌగంధిక సుగంధ

ధురంధర గంధోత్తమారసంబు దమతమరమణుల కెమ్మోవిపండు లుపదంశమ్ములుగా నాదారం గ్రోలి తదీయమాహాత్మ్య కల్పితమానసవిభ్రమంబునఁ దత్పాత్రల సరగ నెఱమించు నిగనిగల మఱలన్ సలిలంబు లూర మదిర నించి నారని గైకొని యవటం బ్రతిఫలించు పల్దెరవాసనకు నిడిన కెందలిరుటాకని దివిచియు విలోచనమాలికలువానితావికిం జేరు తుమ్మెద లని గదిమియు ముదంబునఁ బ్రియుల కందీయంబోవు మందగామినీబృందమ్ముల హస్తారవింద సందీపిత హీరకటక శోభాధట్టంబులం జెట్టవట్టుచు, ననూనపానశాలాచత్వరంబుల విమలాసవంబు లాలస మెచ్చం ద్రావి నిర్మితహర్మ్యరాజంబులఁ జేరం బోవు నెడఁ జంద్రికాహాలాపానలీలాగతి నంబరంబునం జరించుచుఁ దత్సమర్పిత మదఘూర్ణితంబులగు చకోరకోరకకుచా నిచయంబుల కటాక్షతారళ్యంబులు నెఱమించులై కోకనదకోటరకోటి లీనమధుకర ఝుంకారంబులు గర్జనంబులై నిగుడం బొడసూపు వెన్నెల జడివానగాఁ దలంచి యౌదలలఁ బయ్యెదలు గప్పి నెచ్చెలికేలు కైలాగుఁ బూని బుడిబుడి రయం బడర నడచు పడఁతిమిన్నల యున్నతస్తనాంతర విలంబమాన ముక్తా హార గౌరరుక్తతిం బునరుక్తం బగుచు, వెగ్గలమై నెమ్మదిఁ గ్రమ్ము సిగ్గు వెనుకకుఁ దివియ నగ్గలిక మరుండు వైచు మొగ్గములికిగములు ముంగలికి నూకం గరంబు మదంబున దూఁగి యాడు వలదొరపట్టంపుటేనుంగురంగునఁ జూపట్టుచు నెచ్చెలుల కుశలత్వంబున మందమందకలనంబునఁ గేళికామందిరంబులు చేరి యధిపుఁడు కరంబు పట్టి శయ్య నుంచి ముత్తియంపుపేరు లంటుపేరఁ జన్నులు ముట్టుచు మురిపెంపు నెమ్మోమున మడుపు నందిచ్చుదారిఁ గెమ్మోవి నొక్కుచు దమి రేఁచి బంధురబంధవిశేషసంబంధంబున ననవిల్తుకయ్యంబునఁ జొక్కించి చొక్కంపుఁగళల యిక్కువ లెఱింగి మిక్కిలి గలయ గ్రక్కున వెక్కసంబై తనువునఁ జెమటలు గ్రిక్కిఱిసిన మదనమాయావిలసనంబునం బొడమిన ప్రోడతనంబున నెంతగమ్మంబు గ్రమ్మెనని పతులకుఁ దెలియకుండం బలుకుచుఁ జేలచెఱంగున విసరికొను నవోఢానికరంబుల ధవళాంబరాంచల విభాతరంగంబులం బొంగి పొరలుచుఁ, దొలుతటి కల యికల మన మలరఁ గలసిన చెలువరతనంబులఁ దలఁపునం దలఁచుచు నలమరాని విరాళిం గొని నెల వొడుపు వెనుక నలరువాల్దొరకలికిఁ జెలరేఁగన్ దమి నేతెంచినపతు లపుడు తమయెడఁ బొడముమమత నిదుర గదియమిఁ గెంజిగిం గదురుకొను కనుతుదలును దనుతలమ్మునఁ దొలఁకు గురువిరహజ్వర భరంబున విరిపాన్పునం బొరలఁ జిక్కువడు మణిసరంబులును మరుని యిరువాఁడికైదువు పేరెదం జుఱుచుఱుక్కున నాటఁ దాళక నెఱపు నిట్టూర్పులునుం బరయువతితిలకసంపర్కప్రకారంబు తోరంబుగా నెఱింగింప నలివి యవలిమొగంబై శయనించి మాటిమాటికి బోటికత్తెలపలుకుల నిజప్రేమాతిశయజనిత వియోగవేదనాకార్యంబులుగాఁ దెలిసి యినుమడికూటముల నలమి రతిబడలిక వాయఁ గరం బురంబులఁ జల్లులాడు పువ్వుబోఁడుల శయకుశేశయసమాక్షిప్తఘనసారక్షోదంబులం బక్షీకరించుచు, నలరు

మల్లియవిరిసరులు దుఱిమి యమలమౌక్తికదామంబులు దాల్చి కపురంపుబొట్టులు దీర్చి కమనీయమల యజకర్దమం బలంది కలికి తెలిచలువ లూని వెన్నెలం దలవరులు గనకుండ సంకేతనికేతంబులకుఁ బోవు త్రోవం బొంచి కమలకలికాసంలగ్నమధుపనినాదవలయ ఘీంకారసంకలితమృణాళయష్టికరం బూని యడ్డమ్ము పఱతెంచువా రెవ్వ రెవ్వరనఁ దలంగు మనంబున ఘట్టకుటికం బ్రభాతంబగు దారియయ్యె నని మాఱు వలుక నేరక మూలమూలల నొదుఁగుచుఁ దలంకునెడఁ గిలకిల నవ్వుచుఁ దమ్మెఱుఁగఁ జేయ నొక్కింత చిగిరించు నలుక నభిసారికా జనంబులు ప్రియులపై రువ్వు మవ్వంపు విరిగుత్తులం జివ్వకుఁ బిలుచుచు, వన్నె గల వెన్నెలబయిట నెన్న రానివేడుక పన్నిదంబులు వన్ని సుహృన్నికరంబులతోఁ బెన్నేర్పున జూదంబు లాడుచున్నకతం బునఁ గొంతదడ వగుటఁ బటుతరమహానట మనస్తట నానటద్ధైర్య విపాటనాటోప సముత్కట శంబరప్రతిభట కృపీటజకోరక శరపటలధారా దోధూయమాన మానసంబుతో విచ్చలవిడిం బెచ్చుపెరుఁగుతాపంబున వెచ్చనూర్పుచు నెమ్మదిం గ్రమ్ముకొనిహెచ్చుమోహంబున నెచ్చెలిచేతికి నచ్చంపుగుఱుతిచ్చి మచ్చికల వల్లభుం దోడ్కొని రమ్మంచు నంచి యంచిత బహిరంగణ ప్రదేశంబుల నిలిచి పతిరాక కెదురుచూచునదియును నెయ్యంపుఁబొదలతూఁగుటుయ్యెలపై నొయ్యారం బునం గూర్చుండి ప్రియుండు పసిండిదండియ బూని సుతి మీట విభునిచెంత వసియించి చిన్నికిన్నెరం బూని పంచశరదేవతా విజయప్రపంచసమంచితంబు లగు నూతనగీతంబులు పలికించి చెలులఁ జొక్కించు నదియు నడుగు లొరయం గొనసాగ నల్లిన జడకుఁ జుట్టిన మొల్లవిరితావి యెల్లెడలకుం బరవ మంజుల చరణకంజ సంజిత కంజరాగ మంజీర శింజా రవంబులు కర్ణగ్లాని మాన్ప నొఱ దొఱపిన వలదొరపరు వంపుఁగ్రైదువుతెఱఁగున నిండార దువ్వలువ గప్పి కాంతునిశాంతంబునకుఁ బోటులవెంటం జనునదియును దనమనం బలరఁ గలసి కళలఁ దేలించి మేలుంచి యేలిననాయకునియెడ నెడయని ప్రియమ్మునఁ దఱిసి విరిసరులు దుఱిమి చలువ వెదచల్లుకలపం బలఁది యంతంతం బొడము మోహమ్ముల నలమి కెమ్మోవి నొక్కి పునారతులకు వేడుక రేఁచి పైకొనునదియును నై వెలయు వెలయువిదల గలితచందనచర్చాపాలి కలం గనత్తరదరహాసవిభారింఛోళికలం గర్ణావతంసితకైరవపత్త్రమంజరికావిభాళికలం గబరికాభివేష్టిత లతాంతమాలికలం గలసి మెలఁగుచు, మహోత్పలమండల త్రాణైకవిహారవిలాసితం బయ్యును మహో త్పలమండలహరణైకవిలాసాంచితంబై యసమకాండ చండప్రతాపనాశకనిజోదయంబయ్యును నసమ కాండచండ ప్రతాపసంవృద్ధికరనిజోదయంబై, దివ్యచక్రచిత్తానందసంధాయకం బయ్యును దివ్యచక్రచిత్తా నందభేదకం బై రాజిల్లుచు ద్రుహిణాండకరండంబునకు వెండి జలపోసనంబుదారిం బ్రకాశించె నయ్యవస రంబున. 107

టీక: వెండియున్=మఱియు; ఆపండువెన్నెలదండంబు = ఆనిండువెన్నెలయొక్క పరంపర; అఖండకాండజారిమండల మాయామౌక్తికమయ భద్రాసన సమాసీన నీలాంక లంకావరాహిత పట్టాభిషేచనావరసమయ మహర్షిరాజాభిషిక్త గంగాది పుణ్యతరంగిణీ విశదజలప్రవాహంబులపోలికన్ – అఖండ=అవిచ్ఛిన్నమగు, కాండజారిమండల=చంద్రమండలమనెడు, కాండ మనఁగా నీరు, కాండజ మనఁగా పద్మము, ఆ పద్మమునకు అరి=వైరి చంద్రుఁడని భావము, మాయా=నెపముగల, మౌక్తికమయ =ముత్యములవికారమైన, భద్రాసన=సింహాసనమందు, సమాసీన=కూర్చుండిన, నీలాంక =నల్లని కళంక మనెడు, లంకావరాహిత=రావణవైరి యైన శ్రీరామునియొక్క, పట్టాభిషేచనావరసమయ=పట్టాభిషేకముఖ్యసమయమందు, మహర్షిరాజ=ఋషిశ్రేష్ఠులచేత, అభిషిక్త=అభిషేకము చేయఁబడిన, గంగాదిపుణ్యతరంగిణీ =జాహ్నవి మున్నగు పవిత్రనదుల యొక్క, విశదజల=శుభ్రమగు నీటియొక్క, ప్రవాహంబులపోలికన్=వఱదలభంగిని; ప్రవహించుచున్=పాఱుచు; అనఁగాఁ జంద్రుఁడను మౌక్తికసింహాసనమందుఁ గళంకమనెడు శ్రీరామమూర్తి గూర్చుండి యుండఁగాఁ దత్పట్టాభిషేకమహోత్సవసమ యమున మహర్షులు తెచ్చి యభిషేకము చేయు గంగాదిపుణ్యనదీజలప్రవాహముభంగి నాపండువెన్నెలపిండు రాజిల్లె నని భావము;

అస్తాచల సంగతాహిమాంశుకిరణ కూట తృణాంకుర నికరంబులన్ – అస్తాచల=చరమాద్రిని, సంగత=సంబంధించినట్టి, అహిమాంశుకిరణ=సూర్యకిరణము లనెడు, కూట=కపటము గల, తృణాంకుర=లేఁగసవులయొక్క, నికరంబులన్= గుంపు లను; అన్నింటిన్; మేసి=భక్షించి; దర్పించి=గర్వించి; రథాంగజనంబులకున్ = చక్రవాకము లనెడి ప్రజలకు; వైకల్యంబు చేకూర్చి = వికలత్వము ఘటిల్లఁజేసి; సముజ్జృంభమాణ సత్ప్రభావాప్తిన్=మించినమంచిసామర్థ్యముయొక్క ప్రాప్తిచేత; సత్ = రిక్కలయొక్క, ప్రభా=కాంతియొక్క, అవాప్తిన్=ప్రాప్తిచేత అని స్వభావార్థము; చెల రేఁగు నిశానై చికిన్ =విజృంభించు రాత్రి యనెడు మంచియావును, 'ఉత్తమా గోషు నైచికీ' అని యమరుఁడు; పట్టి=బంధించి; చకోరవత్సంబులు=వెన్నెలపుల్గు లనెడు దూడలు; కుడువన్=చీకుటకు; చేఁపు తారాధవోధస్థల పరిదృశ్యమాన నవాంశుక స్తనంబులన్ – చేఁపు=పాలు ద్రవించుచున్న, తారాధవోధస్థల=చంద్రుఁడను పొదుఁగునందు, పరిదృశ్యమాన=చూడఁబడుచున్న, నవాంశుక స్తనంబులన్ = క్రొత్తకిరణంబు లనెడు చన్నులనుండి; ధరిత్రీపాత్రిన్ = భూమి యనెడు పాత్రమునందు; దిష్టగోపాలకుండు – దిష్ట=సమయమనెడు, గోపాల కుండు=ఆవులకాపరి; పిదికిన నవీనపయఃపరంపరలదారిన్=పిండినట్టి క్రొత్త క్షీరధారలవలె; చూపట్టుచున్ = అగపడుచు; అనఁగాఁ గాలమనెడు గోపాలుఁడు రాత్రియనెడు గోవు చరమాచలమందు సూర్యకిరణములనెడు కసవు మేసి, గర్వించి, చక్ర వాకములనెడు ప్రజకు వ్యాకులత గలుగఁజేయుచుండ దానిఁ బట్టి తెచ్చి, చకోరములనెడు దూడలు త్రాగుటకు చంద్రమండల మను పొదుఁగునందు కిరణములనెడు చన్నులనుండి పిదికిన క్షీరపూరమును బోలి వెన్నెల యున్న దని భావము.

దినాంతపర్యంతంబు=సంధ్యాకాలమువఱకు; ఒక్కప్రొద్దుండి =ఉపవసించి; అతికాంత కాసార సోపా నోపాంత శశికాంత సంతాన మరీచికా వీచికావతీ వీచికాజాతంబులన్ – అతికాంత =మిగులమనోజ్ఞమగు, కాసార=కొలఁకులయొక్క, సోపాన= మెట్లయొక్క, ఉపాంత=సమీపమందలి, శశికాంత =చంద్రకాంతమణులయొక్క, సంతాన=సమూహములయొక్క, మరీచికా =కాంతియనెడు, వీచికావతీ=నదియొక్క, వీచికాజాతంబులన్=అలలసమూహమును; చొచ్చి=ప్రవేశించి; అనఁగా నానదిలో స్నానము చేసి యనుట; ఎడలి=బయలుదేఱి; వికసితారుణశరజపీఠిన్ = వికసించిన యెఱ్ఱగలువయనెడు పీఠమునందు; వసించి = ఉండి; కమలాహిత ధ్యాన కలి తాంతరంగంబునన్ – కమలాహిత=చంద్రుఁడనెడు కమలకు హితుఁడైన విష్ణుమూర్తి యొక్క (చంద్రుని కి కమలా+అహిత అనియు, విష్ణువునకు కమలా+హిత అనియు అన్వయము), ధ్యాన=చింతతోడ, కలిత =కూడుకొన్నట్టి, అంతరంగంబునన్=చిత్తముచేత; ఉన్న=ఉన్నట్టి; చకోరసువాసినీజనంబులకున్ = చక్రవాకస్త్రీలకు; అవ్రత ఘ్నంబు=వ్రతదూషకములు గానట్టివి; అగు=ఐన; విశదాపూపంబులు = తెల్లనియపూపములను; సమకూర్పన్= చేకూర్చు

టకు; తత్ప్రియశ్యామాప్రకాండంబు = ఆచకోరసువాసినులకు హితలైన రాత్రు లనెడు స్త్రీల కదంబము; పూర్వదిశావదాతశోభాచ్ఛాదనంబుపైన్ =తూర్పుదిక్కనెడు తెల్లనివస్త్రముమీఁద; చంద్రఘరట్టంబు = చంద్రుం డనెడు తిరుగలిని; పెట్టి=ఉంచి; ఒయ్యన నొయ్యనన్=తిన్నతిన్నగా; తారాసుభద్రాపటలంబులు=నక్షత్రములనెడు గుమ్మడి విత్తులగుంపులను; వైచి=వేసి; విసరన్=త్రిప్పఁగా; ప్రసరించు తదీయపిష్టఘట్టంబుల చందంబునన్=ప్రసరించుచున్న ఆవిత్తుల యొక్క పిండియొక్కరాశి రీతిగా; పెంపొందుచున్=వృద్ధిఁబొందుచు; అనఁగాఁ జకోరస్త్రీప్రదోషమువఱకు నుపవాసముండి సూర్యాస్తానంతరము కొలఁకులసోపానముల నున్న చంద్రకాంతమణిమరీచి యనెడు నదియందు స్నానము చేసి యెఱ్ఱగలువ యను నాసనముపైఁ గూర్చుండియుండఁగా, నామె యుపవాసవ్రతమున కుచితమైన తెల్లనియాపూపములుసేయ రాత్రులనెడు తదీయప్రియస్త్రీజనంబు తూర్పనెడు తెల్లని వస్త్రముపైఁ జంద్రుఁడనెడుతిరుగలిని బెట్టి రిక్కలనెడు గుమ్మడివిత్తులు వోసి విసరఁగాఁ బ్రసరించు వానిపిండియొక్క రాశినిఁబోలి వెన్నెల యుల్లసిల్లె ననుట.

నెట్టుకొని=త్రోసికొని; గట్టుగములతటంబులన్=పర్వతసంఘములదరులయందు; పొడకట్టు నెలచట్టులన్ = చూపట్టుచున్న చంద్రకాంతములవలన; కరంగి=ద్రవించి; మట్టుమీఱన్=మితిమీఱునట్లుగా; కురియు పెన్నీటి బలురొద=కురియుచున్న అధికమగు జలముయొక్క బలిష్ఠమగుధ్వని; అభంగతరంగనినాదంబును =అధికమైనయలలధ్వనియు;ముందుముందుగన్=తొలుదొలుతనె; మందగతిన్=తిన్ననిగమనముచేత; తోఁతెంచు చందనాచలపవనకందళిన్=వీచు మలయమారుతాంకురమువల్ల; తరళితంబు లై =చలింపఁజేయఁబడినవై;నిండార విరిసిన బొండుమల్లియవిరులపిండులు– నిండార విరిసిన =బాగుగ వికసించిన, బొండుమల్లియవిరుల=బొండుమల్లెపూలయొక్క, పిండులు =గుంపులు; పాండురడిండీరఖండమండలంబులును = తెల్లని నురుఁగుతునుకలగుంపును; మదిన్=చిత్తమందు;కదురు ముదమునన్=కలుగునట్టి సంతసముచేత; తమతమసుదతులన్ = తమతమప్రియురాండ్రను; కవకూడి =జతగాఁ గలిసి; ఎదుర్కొను రేపులుఁగుకొలములు=ఎదురుగఁబోవు చకోరసంఘము; ఎదురెక్కు సమానవతీకమీనవితానంబులునున్= ఎదురెక్కుచున్నవియు, మానవతులతోఁ గూడినవియు నగు మీనముల గుంపులును; కాఁగన్=అగుచుండఁగా; అనూన పథికమానినీ మాన సాల మూలసమున్మూలనంబు– అనూన=అధిక మగు, పథికమానినీ=పథికస్త్రీలయొక్క, మాన=ఈర్ష్యయనెడు, సాల=చెట్లయొక్క, మూలసమున్మూలనంబు = మూలోచ్ఛేదనమును; చేయన్=చేయుటకు; పరఁగి=ఒప్పి; దినాంతవిలయకాలమ్మునన్=సాయంకాలమనెడు ప్రళయకాలమున; వేలాతిగంబైన పాలవెల్లిపొడవునన్ = వేలమీఱిన క్షీరసముద్రముభంగిని; పొడసూపుచున్=అగపడుచు; అనఁగా నావెన్నెల ప్రళయకాలమందు వేలమీఱి సాలసమున్మూలనము గావించుచు మించు క్షీరాంబురాశిని బోలి, సంధ్యాకాలమున మానినీమానస సమున్మూలనము గావించుచు మించినదనియు, దానియందు వెన్నెలవలనఁ బర్వతంబులనుండి గరఁగి పడు చంద్రకాంతజలప్రవాహము రొదలు తరంగధ్వనులుగా నుండెననియు, మలయమారుతాంకురమున నిండార విరిసిన బొండుమల్లెలపిండులు నురుఁగుతునియలను బోలియుండె ననియు, సంతసమునఁ దమతమప్రియురాండ్రతోఁ గూడి యెదురెక్కుచకోరములు జతగూడి యెదురెక్కు మీలఁ బోలియుండె ననియు భావము.

కోకనదపరాగ మహోదయరాగవిలసనంబునన్– కోకనదపరాగ=రక్తోత్పలములయొక్కపుప్పొడియనెడు, మహత్=అధికమైన, ఉదయరాగ=ఉదయకాలికారుణ్యముయొక్క,విలసనంబునన్=ప్రకాశముచేత; కోరకితనీరజతారకాసమున్మేషంబునన్– కోరకిత = ముగిడినట్టి, నీరజ=పద్మములనెడు, తారకా = నక్షత్రములయొక్క, సమున్మేషంబునన్ = ప్రకాశముచేత; కోమలశ్యామలేతర కుముదవలయ సుధాకర ధామవిశేషంబునన్– కోమల=మృదులమై, శ్యామలేతర=శుభ్రమగు, కుముదవలయ=కలువలగుంపనెడు, సుధాకర=చంద్రునియొక్క,ధామవిశేషంబునన్ =కాంతివిశేషము చేత; కొమరొంది=అందము గాంచి; తద్రజనీసమయ భాసమాన పయోధరపథంబున కన్నన్ =ఆరాత్రియందు విలసిల్లు నాకసముకన్నను; మున్ను మున్న=ముందు

ముందుగనె; కన్నులకున్; వెగ్గలంబై =మిక్కుటమై; తొలంకుకొలంకుగమిన్=చెలఁగునట్టి కాసారసంఘమును; పాసి=వదలి; సన్నంపు వెన్నెలమిన్న=లేఁతరేయెండమిన్న; చొరరానిలతానివాసంబులన్=చొరఁబొఱ నలవిగాని లతాగృహములయందు; దాఁగన్=దాఁగుటకు; పోవుచున్=ఏగుచు; తదంతరసంఫుల్ల్యమానమల్లికావల్లికామతల్లికా ప్రసవధవళద్యుతిప్రకాండంబులు— తదంతర=ఆలతాగృహములందు, సంఫుల్ల్యమాన=మిగుల వికసిల్లిన, మల్లికావల్లికామతల్లికా= ప్రశస్తమైన మల్లెతీవలయొక్క, ప్రసవ=పూవులయొక్క, ధవళద్యుతి=తెల్లనికాంతియొక్క, ప్రకాండంబులు =గుంపులు; నిండి=ఆవరించి; రేయెండ మెండు కొనన్ =చంద్రాతపము మిక్కుటమగునట్లు; చేయన్=చేయఁగా; దాఁగన్ వచ్చిన చోటన్ = దాఁచుకొనుటకై వచ్చినట్టి తావున; తలవరులు=తలారివాండ్లు; ఉన్న తెఱంగు=ఉన్న రీతిని; ఒయ్యనన్=తిన్నగా; కని = చూచి; ఖేదించు రోదరతతోదరీ వార మ్ముల నయనమ్ములన్– ఖేదించు=దుఃఖించుచున్న, రోదరతతోదరీ=చక్రవాకస్త్రీలయొక్క, వారమ్ముల=గుంపులయొక్క, నయనమ్ములన్=కనులయందు; జాలుగాన్=ప్రవాహముగా; జాఱు =కారుచున్నట్టి; అనావిల జలమాలికలతోన్= అకలుష మైన జలపరంపరలతోడ; మేలంబులు=పరిహాసములు; ఆడుచున్=సల్పుచు; అనఁగాఁ జక్రవాకస్త్రీలకు కొలఁకులు రక్తోత్పల రాగ మనెడు సంధ్యారాగముచేతను, పద్మముకుళము లనెడు రిక్కలచేతను, తెల్లగల్వపూలగమికాంతి యనెడు వెన్నెలపిండు చేతను వెలసి యట్లుదయరాగనక్షత్రచంద్రకాంతులతోఁ గూడిన యాకసమునకన్న మున్న కన్నులకు వెగ్గలంబులు గాఁగా, వానిం బాసి సన్న వెన్నెల చొరరాని లతానికుంజములకు నవి దాఁగం బోయిన వనియు, నందును మల్లికాకుసుమధవళద్యు తులు నిండి వెన్నెల మెండుకొన్నట్లు సేయఁగా, దాఁగఁబోయినచోట తలవరు లున్న రీతి నిట గూడ సుఖము లేకపోయెఁగదా యని ఖేదించు చున్న వనియు, నట్టి చక్రవాకస్త్రీలనిర్మలనయనాంబువులతో మేలములాడుచు వెన్నెల చెలంగిన దనియు భావము.

తళతళమను నెలచలుపగిన్నెలయెడలన్=ప్రకాశించుచున్న చంద్రకాంతపుగిన్నెలయందు; కలయన్=అంతటను; నించిన అతిబంధుర సౌగంధిక సుగంధధురంధర గంధోత్తమారసంబు– నించిన=పూరించినట్టి, అతిబంధుర=మిగులదట్టమయిన, సౌగంధిక సుగంధ=కల్హారముల మంచిగంధముయొక్క, ధురంధర=భారము వహించిన, తద్గంధము గలవి యనుట, గంధోత్త మారసంబు=మద్యముయొక్కరసమును; తమతమరమణుల కెమ్మోవిపండులు =తమతమప్రియులయధరము లనెడు పండ్లను; ఉపదంశమ్ములు గాన్=నంచుకొను భోజనసాధకవిశేషములు గాఁగా ననుట; నాదారన్=తనివితీరునట్లుగ; క్రోలి = పానముచేసి; తదీయమాహాత్మ్య కల్పితమానసవిభ్రమంబునన్– తదీయమాహాత్మ్య=ఆమద్యసంబంధియగు ప్రభావముచేత, కల్పిత=చేయఁబడిన,మానస= మనస్సంబంధియగు, విభ్రమంబునన్=భ్రాంతిచేత; తత్పాత్రలన్=ఆచంద్రకాంతపుగిన్నెలందు; సరగన్=వేగముగా; నెఱమించు నిగనిగలన్=మిగుల నతిశయించు ప్రకాశముచేత; మఱలన్; సలిలంబులు=జలంబులు; ఊరన్=ఊరఁగా; మదిరన్=మద్యమును; నించినారని=పూరించినారని; కైకొని =తీసికొని; అచటన్=ఆనీటియందు; ప్రతి ఫలించు పల్దెరన్=ప్రతిబింబించిన యధరమును; వాసనకున్=పరిమళమునకు; ఇడిన =ఉంచినట్టి; కెందలిరుటాకని = రక్త పల్లవమని; తివిచియున్=లాగియు; విలోచన మాలికలు=నయనపంక్తులు; వానితావికిన్=వానిపరిమళమునకు; చేరు తుమ్మెద లని =చేరుచున్న తుమ్మెదలని; గదిమియున్ =భర్త్సనము చేసియు; ముదంబునన్=సంతసముతోడ; ప్రియులకున్=భర్తలకు; అందీయన్=అందిచ్చుటకు; పోవు మందగామినీబృందమ్ముల హస్తారవింద సందీపిత హీరకటకశోభాధట్టంబులన్– పోవు= పోవుచున్న, మందగామినీబృందమ్ముల = స్త్రీసంఘములయొక్క, హస్తారవింద=కరకమలములయందు, సందీపిత=మిగులఁ బ్రకాశింపఁజేయఁబడిన, హీరకటక= వజ్రమయములగు కడియములయొక్క, శోభాధట్టంబులన్=కాంతిపుంజములను; చెట్ట వట్టుచున్=హస్తావలంబనము సేయుచు; అనఁగా నపుడు స్త్రీలు చంద్రకాంతమణిపాత్రలలో మద్యము పోసికొని వల్లభాధరము లుపదంశములుగా నాదారం గ్రోలి, తదనుగుణగణసాంగత్యమున విలసిల్లుచు వెన్నెల కాపాత్రలయం దూరుచున్న నీరు చూచి

మద్యమని భ్రమించి, మఱల(దత్పానమునకై వానిం గైకొని యందుఁ బ్రతిఫలించిన తమ యధరములను పల్లవము లనియు, నేత్రములను తుమ్మెద లనియు నెంచి, వానిని దివియుచు, నా మద్యమును తమప్రియుల కందీయ హస్తము లెత్తియుండఁగా నాహస్తములయం దున్న వజ్రమణిమయములగు వలయముల కాంతిసంతతిని వెన్నెల హస్తావలంబముగాఁ జేయునట్లు విల సిల్లె ననుట. వజ్రకటకకాంతి వెన్నెలకాంతితో ధావళ్యసామ్యమునఁ దెలియరాకుండఁ గలిసినదని ఫలితము.

అనూనపానశాలాచత్వరంబులన్– అనూన=అధికమగు, పానశాలా=ప్రపలయొక్క, చత్వరంబులన్=ముంగిటిభూముల యందు; విమలాసవంబు=ప్రశస్తమైన మద్యమును; లాలస మెచ్చన్=వాంఛావిశేష మతిశయింపఁగా; త్రావి=పానముచేసి; నిర్మిత హర్మ్యరాజంబులన్ = నిర్మింపఁబడిన ప్రాసాదములను; చేరన్=చేరుటకు; పోవునెడన్ = పోవునప్పుడు; చంద్రికాహాలా పాన లీలాగతిన్=వెన్నెలయను మద్యముయొక్క పానముచేనైన విలాసగమనముచేత;అంబరంబునన్=ఆకసమందు; చరించు చున్ =తిరుగుచు; తత్సమర్పిత మదఘూర్ణితంబులు– తత్సమర్పిత=ఆమద్యముచేతఁ జేయఁబడిన, మద=దర్పముచేత, ఘూర్ణితంబులు=త్రిప్పఁబడినవి; అగు చకోరకోరకకుచానిచయంబుల కటాక్షతారళ్యంబులు– అగు=అయినట్టి, చకోరకోరక కుచా =చకోరస్త్రీలయొక్క, నివయంబుల=గుంపులయొక్క, కటాక్ష=క్రేగంటిచూపులయొక్క, తారళ్యంబులు=చాంచల్య ములు; నెఱమించులై=అధికములగు మెఱపులై; కోకనదకోటరకోటిలీనమధుకరఝుంకారంబులు – కోకనదకోటరకోటి = ఎఱ్ఱగల్వల తొఱ్ఱగుంపులయందు, లీన=దాఁగియున్న, మధుకర=తుమ్మెదలయొక్క,ఝుంకారంబులు =నాదములు; గర్జనం బులై =ఉఱుములై; నిగుడన్=ఒప్పఁగా; పొడసూపు వెన్నెలన్= పొల్చునట్టి చంద్రికను; జడివానగాన్=జడివాన యని; తలంచి =భావించి; ఔదలలన్=తలలమీఁద; పయ్యెదలు=పైఁటవస్త్రములను; కప్పి=ఆచ్ఛాదించి; నెచ్చెలికేలు=సకియలహస్తము లను; కైలాగున్=ఆలంబనమునుగా; పూని=వహించి; బుడిబుడి రయంబు=అతిత్వరతోఁ గూడిన వేగము, బుడిబుడి యను నది నడకలోఁగల యనుకరణశబ్దము; అడరన్=ఒప్పఁగా; నడచు పడఁతిమిన్నల యున్నత స్తనాంతర విలంబమాన ముక్తా హార గౌరరుక్తతిన్– నడచు=గమనము సేయుచున్న, పడఁతిమిన్నల=స్త్రీరత్నములయొక్క, ఉన్నతస్తనాంతర =మిట్టలగు స్తనముల మధ్యభాగమందు, విలంబమాన=వ్రేలాడుచున్న, ముక్తాహార=ముత్యంపుపేరులయొక్క, గౌరరుక్తతిన్=శుభ్రకాంతి పుంజముచేత; పునరుక్తం బగుచున్ = ఇనుమడి యైన దగుచు; అనఁగా నపుడుత్తమస్త్రీలు పానశాలలచెంత విమలాసవమును గ్రోలి మేడలు చేరఁ బోవుచుండఁగా, వెన్నెల యను మద్యము ద్రావి గగనమందుఁ జరించు చకోరస్త్రీలకటాక్షతారళ్యములు మెఱ పులుగాను, ఎఱ్ఱగల్వలలో దాఁగిన తుమ్మెదలమ్రోఁత లుఱుములుగాను , వెన్నెల జడివానగాను వారలకుఁ దోఁచి పయ్యెదలు తలలపైఁ గప్పికొని చెలియలకైలాగుఁ బూని వడిగ బుడిబుడి బోవుచున్నా రనియు, వారల యున్నతస్తనాంతరముల నున్న ముత్తెపుపేరుల తెల్లనికాంతిసంతతితో వెన్నెల రెట్టించి వెలింగె ననియు భావము.

వెగ్గలమై=అధికమై; నెమ్మదిన్=నిండుమనస్సునందు; క్రమ్ము సిగ్గు=ఆవరించెడు లజ్జ; వెనుకకున్ తివియన్ = వెనుక కాకర్షిం పఁగా; అగ్గలికన్=శౌర్యముచేత; మరుండు=కాముఁడు; వైచు మొగ్గములికిగములు = ప్రయోగించు మొగ్గలనెడు బాణముల గుంపులు; ముంగలికిన్=ముందునకు; నూకన్ = త్రోయఁగా; కరంబు=మిక్కిలి; మదంబునన్=మదముచేత; తూఁగియాడు వలదొరపట్టంపుటేనుంగురంగునన్=తూఁగుచున్న మదనుని పట్టపుటేనుఁగుతీరున; చూపట్టుచున్=అగపడుచు; ఇది నవోఢా నికరంబులకు విశేషణము; నెచ్చెలుల కుశలత్వంబునన్ = ప్రియసఖీజనములయొక్క నేర్పుచేత; మందమందకలనంబునన్ = మెల్లమెల్లని క్రియలతో; కేళికామందిరంబులు =క్రీడామందిరంబులను;చేరి=పొంది;అధిపుఁడు=ప్రియుఁడు; కరంబుపట్టి= చేయి పట్టుకొని; శయ్యన్=పాన్పునందు; ఉంచి=ఉండఁజేసి; ముత్తియంపుపేరులు=మౌక్తికహారములను; అంటుపేరన్ =ముట్టు నెప మున; చన్నులు=స్తనములను; ముట్టుచున్=స్పృశించుచు; మురిపెంపు నెమ్మోమునన్=కులుకుమోమునందు; మడుపున్= విడెమును; అందిచ్చుదారిన్= అందియిచ్చు తీరున; కెమ్మోవి నొక్కుచున్= ఎఱ్ఱనిపెదవినిఁ గొఱుకుచు; తమి రేఁచి = రాగో

ద్రేకము గలిగించి; బంధురబంధవిశేషసంబంధంబునన్=దట్టమగు బంధభేదముల సంబంధముచేత; ననవిల్తుకయ్యంబునన్ = సురతమందు; చొక్కించి =సుఖపారవశ్యము నొందించి; చొక్కంపుఁగళల యిక్కువలు=మంచికళాస్థానములను; ఎఱింగి = తెలిసి; మిక్కిలి=అధికముగ; కలయన్=కూడఁగా; గ్రక్కునన్=వేగముగ; వెక్కసంబై=వెగటై; తనువునన్=శరీరమందు; చెమటలు=స్వేదములు; క్రిక్కిఱిసినన్=నిబిడము కాఁగా; మదనమాయావిలసనంబునన్ = మన్మథుని మాయాప్రకాశముచేత; పొడమిన ప్రోడతనంబునన్=ఉదయించిన ప్రౌఢత్వముచేత; ఎంత గమ్మంబు=ఎంత స్వేదము; క్రమ్మెన్ అని =కలిగెనని; పతులకున్ = ప్రియులకు; తెలియకుండన్=బయల్పడుకుండునట్లు; పలుకుచున్=వచించుచు; చేలచెఱంగునన్=వస్త్రాంచలముచేత; విసరికొను నవోఢానికరంబుల ధవళాంబరాంచల విభాతరంగంబులన్ – విసరికొను=విసరికొనుచున్న, నవోఢానికరంబుల = క్రొత్తపెండ్లికూఁతుల సమూహముయొక్క, ధవళ=శుభ్రమగు, అంబర=వస్త్రములయొక్క, అంచల=అగ్రములయొక్క, విభా= కాంతులయొక్క, తరంగంబులన్=పరంపరలచేత; పొంగి=ఉప్పొంగి; పొరలుచున్=వెలిపర్వుచు; అనఁగా నపుడు నవోఢలు తమతమప్రియులయొద్దకుఁ బోవుసమయమున లజ్జావశమున వెనుదీయుచు, కామవశమున ముందున కడుగిడుచుండఁగా, వారు వలదొరపట్టంపుటేనుఁగుచందంబున నుండి రనియు, నెచ్చెలులు తమనేర్పుచేతఁ దిన్నతిన్నగాఁ గేళిగృహమునకు గొనిపోఁగా నటకుఁ బోయి ప్రియులు తమ నేర్పున నొనరించు బాహ్యాంభ్యంతరరతులచేఁ జొక్కి కలాస్థానము లెఱింగి పతులు మిగులం గలయ మిక్కుటంబై తనువు నిండార స్వేదంబు వొడమ నెంత చెమ్మట గ్రమ్మె నని తిన్నగఁ బలుకుచు తెల్లని వస్త్రాంచలములచే విసరికొనుచుండి రనియు, అట్లు విసిరికొను వారి శుభ్రాంశుకప్రభాజాలంబులతోఁ బండువెన్నెలలు పొంగి పొరలిన ట్లుండె ననియు భావము. నవోఢలు ముగ్ధావాంతరభేదములోఁ జేరిన నాయికలు. దీనిం గూర్చి రసమంజరియందు,'తత్రాఙ్కురితయౌవనా ముగ్ధా సాచ ద్వివిధా జ్ఞాతయౌవనా అజ్ఞాతయౌవనా చేతి,సైవ క్రమశో లజ్జాభయపరాధీనరతి ర్నవోఢాసైవ సప్రశ్రయా విస్రబ్ధనవోఢా' యని వ్రాయఁబడినది.'ఆదౌ రతం బాహ్య మిహ ప్రయోజ్యం తత్రాపి చాలిఙ్గనపూర్వ మేవ' అని రతిరహస్యోక్తప్రకారమున నిటఁ దొలుత నాలింగనాధరచుంబనాది బాహ్యరతియు, వెనుక సురతరూపాభ్యంతరరతియు వర్ణితమైనది, స్తనసంస్పర్శనోక్తిచే నాలింగనమే చెప్పఁబడిన దని యెఱుంగవలెను.'అఙ్గుష్ఠే పదగుల్ఫజానుజఘనే నాభౌచ వక్షస్థలే కక్షే కంఠకపోల దన్తవసనే నేత్రాలకే మూర్ధని, శుక్లాశుక్లవిభాగతో మృగదృశా మఙ్గేష్వనఙ్గస్థితీ రూర్ధ్వాధో గమనేన వామవదనాః పక్షద్వయే లక్షయేత్' అని కళాస్థానములు రతిరహస్యముననె చెప్పఁబడినయవి.

తొలుతటికలయికలన్=ప్రథమసమాగమములయందు; మన మలరన్=మనస్సు సంతసించునట్లు; కలసిన చెలువరతనంబులన్ = కూడినట్టి స్త్రీరత్నములను; తలఁపునన్=అంతరంగమందు; తలఁచుచున్=స్మరించుచు; అలమరాని విరాళిన్ = ఆక్రమింపరాని విరహమును; కొని=వహించి; నెలపొడుపు వెనుకన్ = చంద్రోదయానంతరమున; అలరువాల్దొరకలికిన్ = రతికి; చెలరేఁగన్=విజృంభించుటకు; తమిన్=ఆసక్తిచేత; ఏతెంచినపతులు = వచ్చినట్టి ప్రియులు; అపుడు; తమయెడన్ = తమయందలి; పొడముమమతన్=ఉదయించిన యనురాగముచేత; నిదుర గదియమిన్=నిద్ర రాకపోవుటచేత; కెంజిగిన్ = అరుణకాంతిచేత; కదురుకొను కనుతుదలును = అతిశయించుచున్న నేత్రాంతములును; తనుతలమ్మునన్=శరీరప్రదేశమున; తొలఁకు గురువిరహజ్వరభరంబునన్ = నిండిన యధికమైన వియోగజ్వరాతిశయముచేత; విరిపాన్పునన్=పూపాన్పుపై; పొరలన్=పరివర్తనము సేయఁగా; చిక్కువడు మణిసరంబులును = చిక్కువడిన మణిహారములును; మరుని యిరువాఁడి కైదువు=మన్మథునియొక్క రెండుప్రక్కలను పదునుగల యాయుధము;పేరెదన్=విశాలవక్షమునందు;చుఱుకుచుఱుక్కునన్ =ఇట్టి ధ్వని కల్గునట్లుగా;నాటన్=గ్రుచ్చుకొనఁగా; తాళక=ఓర్వఁజాలక; నెఱపు నిట్టూర్పులునున్ =వ్యాపింపఁజేయు నిశ్వాసములును; పరయువతితిలకసంపర్కప్రకారంబు = ఇతరస్త్రీసాంగత్యభంగిని; తోరంబుగాన్=అధికముగా; ఎఱింగింపన్ =తెలు పఁగా; అలివి=కోపించి; అవలిమొగంబై=పెడమొగమై; శయనించి =పరుండి; మాటి మాటికిన్=సారెసారెకు; బోటికత్తెల

పలుకులన్=చెలికత్తెలమాటలచేత; నిజప్రేమాతిశయజనిత వియోగవేదనాకార్యంబులుగాన్ – నిజ=తమయందలి, ప్రేమాతిశయ=అనురాగాతిశయముచేత, జనిత=పుట్టినట్టి, వియోగవేదనా=విరహవేదనయొక్క, కార్యంబులుగాన్=కార్యములని; తెలిసి = తెలిసికొని; ఇనుమడికూటములన్=ద్విగుణితమగు సురతములచేత; అలమి=ఆక్రమించి; రతి బడలిక = రతివలనఁ గల్గిన శ్రమ, పాయన్=పోవుటకు; కరంబు=మిక్కిలి; ఉరంబులన్=ఱొమ్ములమీఁద; వల్లులాడు పువ్వుబోఁడుల శయకుశేశయ సమాక్షిప్తఘనసారక్షోదంబులన్ – వల్లులాడు=చల్లుచున్న, పువ్వుబోఁడుల=స్త్రీలయొక్క, శయకుశేశయ=పద్మములఁబోలు హస్తములచేత, 'పంచశాఖ శ్శయః పాణిః' అని యమరుఁడు, సమాక్షిప్త=వెదవల్లఁబడిన, ఘనసార=కర్పూరముయొక్క, క్షోదంబులన్=చూర్ణములను; పక్షీకరించుచున్ = ఆత్మీయముగాఁ జేసికొనుచు; అనఁగా నపుడు పురుషులు స్మరార్తులై నిద్రాభావమున నెఱ్ఱనికన్నులు, విరహజ్వరభరమున విరిశయ్యపైఁ బొరలుటచేఁ జిక్కువడిన మణిహారములు, స్మరవరాయుధాహతిచేఁ గల్గిన నిట్టూర్పులుగలవారై, స్త్రీలచెంతకుఁ బోఁగా వారు చూచి పరయువతిసాంగత్యము చేసి వచ్చినారని యలిగి యవ్వలి మొగములుగలవారై శయనించి యుండి, మాటిమాటికి బోటికత్తెలు చెప్పుటచేత స్వవిషయకానురాగముననె యట్లున్నారని నిశ్చయించి, యినుమడికూటముల నలమి రతిశ్రమాపనోదనమునకై వారిఱొమ్ములమీఁదఁ జల్లు కర్పూరచూర్ణముతోఁ బండు వెన్నెలదండము మెలఁగి విరాజిల్లె నని భావము.

అలరుమల్లియవిరిసరులు – అలరు=ప్రకాశించునట్టి, మల్లియవిరిసరులు=మల్లెపూదండలు; తుఱిమి=కొప్పులలోఁ దుఱిమికొని; అమలమౌక్తికదామంబులు =నిర్మలములైన ముత్యంపుపేరులను; తాల్చి=ధరించి; కపురంపుబొట్టులు=కర్పూరతిలకములను; తీర్చి =దిద్ది; కమనీయమలయజకర్దమంబు=మనోజ్ఞమగు శ్రీచందనపంకమును; అలంది=పూసికొని; కలికి తెలిచలువలు=అందమైన శుభ్రవస్త్రములను; ఊని=ధరించి; వెన్నెలన్=వెన్నెలయందు; తలవరులు=తలారులు; కనకుండన్=తమ్ము చూడకుండ; సంకేతనికేతంబులకున్=సంకేతస్థానములకు; పోవుత్రోవన్=పోవునట్టి మార్గమును; పొంచి=కనిపెట్టి; కమలకలికా సంలగ్న మధుపనినాద వలయఘీంకార సంకలిత మృణాళయష్టి– కమలకలికా=పద్మముకుళమునందు, సంలగ్న= సంబంధించినట్టి, మధుప=తుమ్మెదలయొక్క, నినాద=ధ్వనులనెడు, వలయఘీంకార=కడియములయొక్క ఘీం అను శబ్దములతోడ, సంకలిత=కూడుకొన్న, మృణాళయష్టి=తామరతూఁడనెడు దండమును; కరంబు=మిక్కిలి; ఊని=వహించి; అడ్డమ్ముపఱతెంచువారు = తమ కడ్డముగ వచ్చువారు; ఎవ్వ రెవ్వరనన్= మీ రెవ్వరెవ్వ రనఁగా; తలంకు మనంబునన్=చలించుచున్న మనస్సునందు; ఘట్టకుటికం బ్రభాతంబగు దారి =సుంకరకట్టయందు వేకువ యయ్యె నను రీతి, అనఁగా నొకసరకుఁ దెచ్చు వర్తకుండు సుంకరకట్ట దప్పించుకొని పోవలయునని రాత్రి పోవుచుండఁగా సుంకరకట్ట దగ్గఱకుఁ బోవువఱకె తెల్లవాఱినదని తదర్థము; అయ్యెన్ అని; మాఱు పలుకన్ నేరక = బదులుమాట చెప్పఁజాలక; మూలమూలల =ప్రతిమూలయందు; ఒదుఁగుచున్=చొచ్చుచు; తలంకునెడన్=భయపడు సమయమున; కిలకిల నవ్వుచున్=కిలకిలయనునట్లు నవ్వుచు; తమ్మెఱుఁగఁ జేయన్=తమ్ము తెలుపఁగా; ఒక్కింత చిగిరించు నలుకన్=కొంచెమంకురించుకోపముచేత; అభిసారికాజనంబులు=జ్యోత్స్నాభిసారకలు; ప్రియులపైన్=తమవల్లభులపైని; రువ్వు మవ్వంపు విరిగుత్తులన్= విసరివైచు మనోహరములైన పూగుత్తులను; చివ్వకున్=జగడమునకు; పిల్చుచున్=ఆహ్వానము చేయుచు; అనఁగా నపు డభిసారికలు జ్యోత్స్నానురూపములైన తెల్లని మల్లికామాల్య మౌక్తికదామ కర్పూరతిలక చందనచర్చికాదులు పూని తలవరుల కగపడఁగూడదని పోవుచుండఁగా ప్రియులు వారు పోవుదారిం గాచి కమలముకుళమున వసించిన తుమ్మెదనాదము లనెడు కడియములచప్పుడుతోఁ గూడిన మృణాళయష్టినిం బూని యడ్డముగావచ్చు వారెవ్వరని యడిగి, వారేమియుఁ జెప్పఁజాలక మూలమూల నొదుఁగుచు భయపడునెడఁ గిలకిల నవ్వఁగా నాస్త్రీలకుఁ గొంచెము కోప మంకురించి మవ్వంపువిరిగుత్తులు వారిపై రువ్వినా రనియు, నాగుత్తులఁ బండువెన్నెల జగడమునకు బిల్చిన దనఁగాఁ దత్తుల్యమై పొల్చె నని భావము.'మదనానలసంతప్తా యాభిసారయతి ప్రియమ్, జ్యోత్స్నీ తమ

స్విని యానయోగ్యాంబరవిభూషణా, స్వయం వాభిసరే ద్యాతు సా భవే దభిసారికా,కాన్తాభిసరణే స్వీయా లజ్జానాశా దిశఙ్క యా, వ్యాఘ్రహుఙ్కార సంత్రస్త మృగశాబవిలోచనా, నీలాదిరక్తవసనరచిఙ్గాగావగుణ్ఠనా, స్వాఙ్గే విలీనావయవా నిశ్శబ్ద పద చారిణీ, సుస్నిగ్ధైకసఖీమాత్రయుక్తాయాతి సముత్సుకా' అని యభిసారికాసామాన్యవిశేషలక్షణములు తెలియవలయు.
వన్నె గల వెన్నెలన్=ప్రకాశమానమగు వెన్నెలయందు; బయటన్=నిరావరణప్రదేశమున; ఎన్న రానివేడుక పన్నిదంబులు = అగణితంబులగు వేడుకపందెములను; పన్ని=చేసి; సుహృన్నికరంబులతోన్=మిత్రబృందములతోడ; పెన్నేర్పునన్=మిగుల చాతుర్యముచేత; జూదంబులు=ద్యూతములను; ఆడుచున్నకతంబునన్=ఆడుచున్నకారణమున; కొంతదడవగుటన్ =కొంత విలంబ మగుటవలన; పటుతర మహానట మనస్తట నానట ద్ధైర్య విపాటనాటోప సముత్కట శంబరప్రతిభట కృపీటజకోరకశర పటలధారా దోధూయమాన మానసంబుతోన్– పటుతర=సమర్థుఁడగు, మహానట=శివునియొక్క, మనస్తట=హృత్ప్రదేశ మందు, నానటత్=మిక్కిలి నటించుచున్న, ధైర్య=ధీరత్వముయొక్క, విపాటనాటోప=భేదనాతిశయముచేత, సముత్కట= మిగుల విజృంభించినట్టి, శంబరప్రతిభట=శంబరాసురవైరి యగు మన్మథునియొక్క, కృపీటజకోరకశర=తమ్మిమొగ్గలనెడు బాణములయొక్క, పటల=సమూహముయొక్క, ధారా=అంచులచేత, దోధూయమాన=మిగులఁగంపించునట్టి, మానసంబు తోన్=చిత్తముతోడ; విచ్చలవిడిన్=యథేచ్ఛముగా; పెచ్చుపెరుఁగుతాపంబునన్=అధికముగా వృద్ధిఁబొందు సంతాపముచేత; వెచ్చన్ = వేఁడిగా; ఊర్చుచున్=ఊర్పులు పుచ్చుచు; నెమ్మదిన్ =మంచిమనమునందు; క్రమ్ముకొని=దట్టమై; హెచ్చు మోహంబునన్ =అతిశయించు వలపుచేత; నెచ్చెలిచేతికిన్=ప్రియసఖీహస్తమునకు; అచ్చంపుగుఱుతు=మంచియానవాలును; ఇచ్చి; మచ్చికలన్=ప్రేమలచేత; వల్లభున్=ప్రియుని; తోడ్కొని రమ్ము అంచున్= తోడితెమ్మనుచు; అంచి=పంపి; అంచిత బహిరంగణప్రదేశంబులన్ =ఒప్పుచున్న ముంగలిభూములయందు; నిలిచి=ఉండి; పతిరాకకున్=ప్రియునిరాకకు; ఎదురు చూచునదియును =నిరీక్షించుచున్నదియును, ఇది వెలయువిదలకు విశేషణము; నెయ్యంపుఁబొదల తూఁగుటుయ్యెలపైన్ =మనోహరమగు నికుంజములందలి తూఁగుచున్న డోలికపై; ఒయ్యారంబునన్=శృంగారగర్వముచేత; కూర్చుండి; ప్రియుండు =వల్లభుఁడు; పసిండిదండియన్=బంగారువీణాదండమును; పూని=వహించి; సుతి మీటన్=సుతిచేయఁగా; విభునిచెంతన్=ప్రియునొద్ద; వసియించి=ఉండి; చిన్నికిన్నెరన్=చిన్నివీణియను; పూని=చేకొని; పంచశరదేవతా విజయ ప్రపంచ సమంచితంబులు– పంచశరదేవతా=అనంగునియొక్క, విజయ=గెలుపుయొక్క, ప్రపంచ=విస్తారముచేత, సమంచి తంబులు = ఒప్పుచున్నవి, అనఁగా శృంగారరసప్రతిపాదకము లగునవి; అగు నూతనగీతంబులు = ఐనట్టి క్రొత్తపాటలను; పలికించి=కిన్నెరపై వాయించి; చెలులన్= సకియలను; చొక్కించునదియును=సుఖపారవశ్యమునందించునదియును; అడుగు లొరయన్ = పాదములు దాఁకునట్లుగా; కొన సాగ=తుదిముట్టునట్లు; అల్లినజడకున్=అల్లినట్టి వేణికి; చుట్టిన మొల్ల విరితావి=పరివేష్టించిన మొల్లపూవులపరిమళము; ఎల్లెడలకున్=అంతటను; పరవన్=ప్రసరింపఁగా; మంజుల చరణకంజ సంజిత కంజరాగ మంజీర శింజారవంబులు—మంజుల= అందమగు, చరణకంజ = పాదపద్మములందు, సంజిత=కూర్పఁబడిన, కంజరాగ=పద్మరాగమణులయొక్క, మంజీర= అందెలయొక్క, శింజారవంబులు = గజ్జెలచప్పుడులు; కర్ణగ్లానిన్= చెవులయొక్కహర్షాభావమును; మాన్పన్=పోఁగొట్టఁగా, కర్ణసుఖసంపాదకములు కాఁగా ననుట; ఒఱ దొఱపిన వలదొర పరువంపుఁగైదువు తెఱఁగునన్– ఒఱ దొఱపిన = కోశమునందు దోఁపిన, వలదొర=మరునియొక్క, పరువంపు=తరుణమైన, కైదువుతెఱఁగునన్=ఆయుధమురీతిచేత; నిండారన్=నిండుగా; దువ్వలువన్=దుప్పడమును; కప్పి=కప్పికొని; కాంతునిశాంతంబునకున్=ప్రియునిగృహమునకు; బోటులవెంటన్= చెలియల వెంట; చనునదియును =పోవునదియును; తనమనంబు= తనచిత్తము; అలరన్=సంతసించునట్లు; కలసి=కూడి; కళలన్ =కామశాస్త్రప్రసిద్ధమగు ననంగకళలయందు; తేలించి=సుఖపెట్టి యనుట; మేలుంచి=శుభము కల్గించి; ఏలిననాయకుని యెడన్ =పోషించిన ప్రియునిమీఁద; ఎడయని=తొలగని; ప్రియమ్ము

నన్=ప్రీతిచేత; తఱిసి=సమీపించి; విరిసరులు=పుష్పహారములు; తుఱిమి=చెరివి; చలువన్=శైత్యమును; వెదచల్లుకలపంబు =వ్యాపింపఁజేయునట్టి గంధమును; అలంది=పూసి; అంతంతన్ = అంతకంతకు; పొడము మోహమ్ముల్ = ఉదయించు ననురాగములతోడ; అలమి=ఆక్రమించి; కెమ్మోవి=ఎఱ్ఱనిపెదవిని; నొక్కి= కొఱికి; పునారతులకున్=ద్వితీయసురతములకు, పునఃరతులు అనుచోట సంస్కృతసంధివశమున విసర్గలోపము, పునశ్శ బ్దాంతిమా కారమునకు దీర్ఘమును గలిగినది; వేడుక= ఉత్సాహమును; రేఁచి=అతిశయింపఁజేసి; పైకొనునదియును= ప్రియుని పైకిఁ గ్రమ్మునదియును; ఐ వెలయు వెలయువిదల గలితచందనచర్చాపాలికలన్ – ఐ=అయి, వెలయు=ఒప్పునట్టి, వెలయువిదల =వెలయాండ్రయొక్క, గలిత=పడిపోవు చున్న, చందనచర్చాపాలికలన్=గంధపుఁబూతల పరంపరలతోను; కనత్తర దరహాసవిభా రింఛోళికలన్=ఒప్పుచున్న మంద హాసముల కాంతిపుంజములతోను, కర్ణావతంసిత కైరవపత్త్ర మంజరికా విభాళికలన్= కర్ణభూషణములుగాఁ జేయఁబడిన కలువ ఱేకుల తేజఃపరంపరలతోను, కబరికాభివేష్టిత లతాంతమాలికలన్= కొప్పులందుఁ జుట్టిన పూలదండలతోను; కలసి=కూడి; మెలఁగుచున్=ఒప్పుచు; అనఁగా నపుడు వెలయాండ్రలో నొకతె తన ప్రియుఁడు వెన్నెల బయట మిత్త్రమండలితో జూదము లాడుచుఁ దడవుసేయఁగా మదనశరములచే బాధితయై నెచ్చెలిచేతి కచ్చంపునానవా లిచ్చి, ప్రియుని దోడితెమ్మని యంపి, ముంగిటఁ గూర్చుండి పతిరాక కెదురుచూచునదియు, నొకతె పొదరింటిలో దూఁగుటుయ్యేల పైఁ గూర్చుండి ప్రియుఁడు పసిండిదండియఁబూని సుతి మీటఁగా సంభోగసమయసముచితములైన క్రొత్తపాటలు పాడి చెలులఁ జొక్కించునదియు, నొకతె జాఱ విడిచిన జడ నల్లిన మొల్లలవాసన నలుదెసలఁ గ్రమ్మఁగా బద్మరాగ మణిమయము లగు కాలియందెలఁ బొందుపఱిచిన గజ్జెలచప్పుడులఁ గర్ణానందము లగుచుండఁగా నిండార దువ్వలువ గప్పి చెలియలఁ గూడి ప్రియుని నికేతనమునకుం బోవు నదియు, నొకతె తన్ను వివిధరత్నములతో సంతసింపఁ జేసిన నాయకు నొద్దఁ బ్రీతితోఁ జేరి పూదండలు కొప్పునం దుఱిమి మిగులఁ జలువ యైనకలపంబుఁబూసి యంతంత కుదయించు రాగమున మఱల రతమునకై పైకొనునదియు నై యుండఁగా, వారలు పూసికొన్న గంధపరంపరలతోను, వారి మందహాసకాంతిసంతతితోను, కర్ణాభరణముగా నుంచికొన్న తెలికలువఱే కుల తేజఃపుంజముతోను, కొప్పుల నొప్పుగ నుంచికొన్న కుసుమముల దీధితివితానముతోను కలసి మెలసి యా వెన్నెల చెన్నారె నని భావము. ఇందు వన్నెగలవెన్నెల యను తొలుతటివాక్యమున విరహోత్కం ఠితయు, రెండవదానియందు, నాల్గవదానియందును స్వాధీనపతికయు, మూఁడవదానియం దభిసారికయు నగును. 'అనాగసి ప్రియతమే చిరయత్యుత్సు కాతు యా, విరహోత్కంఠితా భావవేదిభి స్సముదాహృతా। ఆసన్నాయత్తరమణా హృష్టాస్వాధీన వల్లభా' అని విరహోత్కం ఠికా, స్వాధీనపతికల లక్షణములు. అభిసారికాలక్షణము వ్రాయఁబడినదె యైనను వేశ్యాభిసారికను గూర్చి విశేషము– 'వేశ్యాభిసారికా త్వేతి హృష్టా వైశికనాయకమ్। ఆవిర్భూత స్మితముఖీ మదఘూర్ణితలోచనా। అనులిప్తాఖిలాఙ్గీ చ విచిత్రాభర ణాన్వితా।స్నేహాఙ్కురితరోమాఞ్చ స్ఫుటీభూతమనోభవా। సంవేష్టితా పరిజనై ర్భోగోపకరణాన్వితైః। రశనారావమాధుర్య దీపితానఙ్గవైభవా। చరణామ్బుజసంలగ్న మఞ్జుమఞ్జీరమఞ్జులా॥' అని రసార్ణవసుధాకరమున లక్షణము వ్రాయఁబడినది. మహోత్పలమండలత్రాణైకవిహారవిలాసాంచితంబు అయ్యును– మహత్=అధికమగు, ఉత్పలమండల=కలువలగుంపు యొక్క, త్రాణ=రక్షణమందు, ఏక=ముఖ్యమైన, విహారవిలాస=విహరణప్రకాశముచేత,అంచితంబయ్యును = ఒప్పుచున్న దైనను; మహోత్పలమండలామోదహరణైక విలాసాంచితంబు ఐ– మహోత్పల=అరవిందములయొక్క,'అరవిన్దం మహో త్పలమ్' అని యమరుఁడు, మండల= సమూహముయొక్క,ఆమోద=సంతసముయొక్క,హరణ=హరించుటయొక్క, ఏక=ముఖ్యమగు, విలాసాంచితంబు ఐ = విలా సముచేత నొప్పుచున్నదై; రాత్రి కలువలు వికసించుటయుఁ బద్మములు ముడు గుటయుఁ బ్రసిద్ధము;

అసమకాండ చండప్రతాప నాశకనిజోదయంబయ్యును– అసమకాండ=సూర్యునియొక్క, చండప్రతాప=తీవ్రమగు వేఁడికి, నాశక=ధ్వంసముచేయునది యగు, నిజోదయంబు = తన యుదయము గలది, అయ్యును; అసమకాండచండప్రతాపసంవృద్ధికరనిజోదయంబై– అసమకాండ=మన్మథునియొక్క,చండప్రతాప=ఉగ్రప్రతాపముయొక్క,సంవృద్ధికర=రక్షకమగు, నిజోదయంబై=తన యావిర్భావము గలదై; వెన్నెల ఉదయించి నపుడు సూర్యతాప ముడిఁగి మదనతాపము మించు ననుట. దివ్యచక్రచిత్తానందసంధాయకం బయ్యును– దివ్యచక్ర=సురనికరముయొక్క, చిత్తానంద=మనస్సంతోషమునకు, సంధాయకం బయ్యును =జనకమయ్యును; దివ్యచక్రచిత్తానందభేదకంబై– దివ్యచక్రచిత్తానందభేదకంబై =సుందరములైన చక్రవాకముల మనోనందమునకు భేదకమై; సురలు సుధఁ గ్రోలువారు గాన వెన్నెల వారి కానందప్రదమగుటయు, చక్రవాకమోదభేదకమగుటయు ప్రసిద్ధము; రాజిల్లుచున్=పైఁజెప్పిన భంగి విలసిల్లుచు; ద్రుహిణాండకరండంబునకున్=బ్రహ్మాండమనెడుబరణికి; వెండి జలపోసనంబు దారిన్=వెండినీరుయొక్క పైపూఁతవలె; ప్రకాశించెన్=విలసిల్లెను; అయ్యవసరంబునన్–ఇది ముందు కన్వయము.

మ. అలపాంచాలకుమారి యేపఱి సువర్ణాంచత్పరాగాళికిన్
నెలవై రా నలకాండధామగతి కెంతేఁ దోఁచి పెల్లేఁచ వె
న్నెల వై రానలకాండధామనయనోన్మేషస్ఫురత్కోకిలా
బల మ్రోయన్ వెఱ నూని మున్ సితరుచిన్ బల్కెన్ విరోధోక్తులన్. 108

టీక: అలపాంచాలకుమారి=ఆచంద్రిక; సువర్ణాంచత్పరాగాళికిన్– సువర్ణ=సంపెంగపూవులయొక్క, అంచత్=ఒప్పుచున్న, పరాగాళికిన్=పుప్పొడిచాలునకు; ఏపఱి=ఏపు+అఱి=డస్సి; వెన్నెల=జ్యోత్స్న; ఎంతేన్=మిక్కిలి; తోఁచి=పొల్చి; నలకాండధామగతికిన్– నలకాండ=పద్మబాణుడగు మన్మథునియొక్క, ధామ=ప్రతాపముయొక్క, గతికిన్=వ్యాప్తికి; నెలవై = స్థానమై; పెల్లు=మిక్కిలి; ఏఁచన్=బాధించుటకు; రాన్=రాఁగా; వైర=విరోధమనెడు, అనలకాండ=అగ్నిపుంజమునకు, ధామ =ఆశ్రయమగుచున్న, నయనోన్మేష=నేత్రవికాసముచేత, స్ఫురత్=ప్రకాశించుచున్న,కోకిలాబల=ఆఁడుకోకిల, కోయిలకుఁ గన్ను లెఱ్ఱగ నుండుట స్వాభావికము; మ్రోయన్=కూయఁగా; వెఱన్=భయమును; ఊని=వహించి; మున్=తొలుత; సితరుచిన్=చంద్రునిగూర్చి; విరోధోక్తులన్=విరోధవాక్యములను; పల్కెన్=వచించును.
అనఁగా నట్లు వెన్నెల గాయుచుఁ జంద్రికను మిక్కిలి బాధించె ననియుఁ, గోకిలారవము మిక్కిలి దుస్సహమైన దనియు, దాని వలనఁ జంద్రిక చంద్రాదులను దూషింపఁ దొడంగె ననియు భావము.

చ. కమలక యౌర్వహేతితతి గాఢనవోదయరాగకీలిచేఁ
దెమలక రాహువక్త్రసముదీర్ణవిషాగ్ని నడంగ కున్నమ
త్కమలకరాళికాధికశిఖాహతిఁ దూలక పొల్చి తక్కటా
కమలకరాళికాధిగతకాలుషి నేమన వచ్చుజాబిలీ. 109

టీక: జాబిలీ=చంద్రుఁడా! ఔర్వహేతితతిన్=బడబాగ్ని జ్వాలాసమూహముచే; కమలక=కందక; గాఢనవోదయరాగకీలిచేన్– గాఢ=దట్టమైనట్టి, నవ=నూతనమైన, ఉదయరాగ=ఉదయకాలికారుణ్య మనెడు, కీలిచేన్=జ్వాలచేత; తెమలక=చలింపక; రాహువక్త్రసముదీర్ణవిషాగ్నిన్– రాహువక్త్ర=రాహువునోటియందలి, సముదీర్ణ=అత్యుత్కటమైన, విషాగ్నిన్=విష మనెడు

వహ్నిచేత; అడంగక=నశింపక; ఉన్నమత్కమలకరాళికాధికశిఖాహతిన్ – ఉన్నమత్=పైకెగయుచున్న, ఇది అగ్నికి విశేషణము, కమలకర=లేడిహస్తమునందుఁగల శివునియొక్క, అళిక=ఫాలమునందలి, అధిక=అధికమగు,శిఖా=జ్వాలయొక్క, హతిన్=కొట్టుటచేత; తూలక=పడిపోవక; పొల్చితి=ఉదయించితివి; అక్కటా=అయ్యో (ఖేదము), కమలకరాళికాధిగత కాలుషిన్ – కమలకరా=స్త్రీలయొక్క, ఆళికా=శ్రేణిచేత, అధిగత=పొందఁబడిన,కాలుషిన్=పాపమును; ఏమన వచ్చున్= ఏమియని చెప్పవచ్చును. అనఁగా బడబాగ్న్యుదయరాగాగ్ని, రాహువక్త్రవిషాగ్ని, హరఫాలనేత్రాగ్నిశిఖలచేతఁ జంద్రుఁడు నశింపక యుదయించుట స్త్రీలు చేసినపాపముచేతనే గాని వేఱు గా దనుట.

శా. స్వచ్ఛాయన్ వనితాళిఁ దూల్చుటలు, దీవ్యచ్చక్రమోదచ్ఛిదా
స్వచ్ఛందోహ! యనూనధామహృతచంచత్తావకోజోఖిల
స్వచ్ఛందోహయమాన మేఁచుటలొ యుష్మద్భేదనాఢ్యాంఘ్రిభా
స్వచ్ఛందోహయమాన మేఁచుటలొ నిచ్చల్ దల్పుమా హృత్థ్సలిన్. 110

టీక: దీవ్య చ్చక్ర మోద చ్ఛిదా స్వచ్ఛందోహ – దీవ్యత్=ఒప్పుచున్న, చక్ర=చక్రవాకములయొక్క, రాష్ట్రములయొక్క యని యర్థాంతరము దోఁచుచున్నది, మోద=సంతోషముయొక్క, ఛిదా=ఛేదనమందు,స్వచ్ఛంద=స్వాభీష్టమగు, ఊహ=తలఁపు గలవాఁడా! ఇది చంద్రసంబోధనము; స్వచ్ఛాయన్=నిజకాంతిచేత, వనితాళిన్=అబలాకదంబమును; తూల్చుటలు=తూలఁ జేయుటలు; అనూన ధామ హృత చంచ త్తావ కోజోఖిలస్వ చ్ఛందో హయ మానము – అనూన=అధికమగు, ధామ=ప్రతాపముచేత, హృత=హరింపఁబడిన, చంచత్=ఒప్పుచున్న, తావక=నీసంబంధియైన, ఓజః=తేజస్సనెడు, అఖిలస్వ=సకల ధనము గలవానియొక్క, అనఁగా సూర్యునియొక్క యని గాని, రాహువుయొక్క యని గాని భావము. ఈపదము నేయార్థమైనను 'యమకాది ష్వదుష్టం స్యా న్నిహతార్థం నిరర్థకం' ఇత్యాదిగా వెనుక వ్రాయఁబడిన ప్రమాణముచేఁ గావ్యదోషము ప్రసరింపదని తెలియవలయు, ఛందః=అభిప్రాయముయొక్క,హయ=వేగముయొక్క,మానము=మర్యాదను; ఏఁచుటలొ=భంగపఱచుటలొ; యుష్మ ద్భేదనాఢ్యాంఘ్రి భాస్వ చ్ఛందోహయమానము – యుష్మత్=నీయొక్క,నిందయందు బహువచనము, భేదన= భేదించుటయందు,ఆఢ్య=సమర్థమైన, అంఘ్రి=పాదములచేత, భాస్వత్=ఒప్పుచున్న,ఛందోహయ= శివుని యొక్క, మానము =గర్వము; ఏఁచుటలొ=భంగపఱచుటలో;నిచ్చల్=ఎల్లపుడు; హృత్థ్సలిన్=హృదయసీమయందు; తల్పుమా=చింతింపుమా.

అనఁగా నీసర్వస్వము హరించునట్టి సూర్యునిజోలికిఁ బోక నిన్నుఁ గాలితోఁ దన్నిన శివు నేమియుఁ జేయఁజాలక నీవు చక్రసంతోషమును బోఁగొట్టినవాఁడవు కావున యబలల బాధించుచున్నావు. ఇది నీకు యుక్తము గాదని తాత్పర్యము. శివుఁడు దక్షయాగధ్వంసమునఁ జంద్రుని కాలితోఁ దన్నినట్లు పురాణప్రసిద్ధము.

సీ. అనురక్తిపొదల దివ్యాచార్యునవలా ల,లితకంతుకేళికాగతిఁ దెమల్చి,
మాతంగసఖ్య మేమఱక గన్నవలాల,నేలు మారునిచెల్మి నెడయ మాని,
చక్రవిప్రవరతేజం బెల్ల నవలాల,సారూఢిఁ గరశక్తి నపహరించి,
పరమలింగాప్తిఁ జూపట్టు తా నవలాల,సద్దీప్తిఁ బాషండసరణిఁ దాల్చి,

తే. మలినతరకీర్తిజాతంబు\lilaల నలర్చి, ప్రోది గను నిన్నుఁ దిలకింప \రోహితాంక
పతి కడుపు మండకుండునే \బాడబాగ్ని,రూఢ కీలాపరంపర \రోహితాంక. 111

టీక: రోహితాంక =చంద్రుఁడా! దివ్యాచార్యునవలాన్ = అమానుషుఁడగు నుపాధ్యాయుని స్త్రీని, బృహస్పతిపత్ని నని వాస్తవార్థము, లలితకంతుకేళికాగతిన్ – లలిత=మనోజ్ఞమైన, కంతుకేళికా=కామక్రీడయొక్క, గతిన్=ప్రాప్తిచేత; అనురక్తి పొదలన్ = అనురాగ మొప్పునట్లు, తెమల్చి=చలింపఁజేసి;
మాతంగసఖ్యము=చండాలసాంగత్యము, గజసాంగత్య మని వాస్తవార్థము, ఏమఱక=పొరపడక; కన్న వలాలన్ = పొందినట్టి బలములను, తుమ్మెదల ననుట; తుమ్మెదలు కామసైన్యములోఁ జేరినవగుట ప్రసిద్ధము; ఏలు మారునిచెల్మిన్ =పోషించు ఘాతుకునియొక్క స్నేహమును, మరునియొక్క సఖ్యము నని వాస్తవార్థము; ఎడయ మాని =ఎడఁబాయకుండుట మానివైచి; చక్రవిప్రవరతేజంబు – చక్ర=రాష్ట్రములయందలి, విప్రవర=బ్రాహ్మణశ్రేష్ఠులయొక్క, చక్రవాకములనెడు పక్షిశ్రేష్ఠములయొక్క యని వాస్తవార్థము, తేజంబు=తేజస్సును; ఎల్లన్=అంతను; నవలాలసారూఢిన్ – నవ=నూతనమైన, లాలసారూఢిన్=ఔత్సుక్యాతిశయముచేత; కరశక్తిన్=హస్తసామర్థ్యముచేత, కిరణసామర్థ్యముచేత నని వాస్తవార్థము; అపహరించి=పోఁగొట్టి; పరమలింగాప్తిన్ – పరమ=ఉత్కృష్టమైన, లింగాప్తిన్= లింగధారణముచేత ననుట, ఉత్కృష్టమైన చిహ్నమును పొందుటచేత నని వాస్తవార్థము; చూపట్టు తానవ లాలస ద్దీప్తిన్ – చూపట్టు=అగపడుచున్న, తానవ=తనుసంబంధియైన, లాలసత్ = మిగులఁ బ్రకాశించుచున్న, దీప్తిన్=కాంతిచేత; పాషండసరణిన్=పాషండునిదారిని; తాల్చి=వహించి;
మలినతరకీర్తిజాతంబులు – మలినతరకీర్తి=అపకీర్తులయొక్క, జాతంబులు=సమూహములను, నల్లగల్వల నని వాస్తవార్థము. 'కీర్తి ర్యశసి కర్దమే' అని విశ్వము; ఇలన్=భూమియందు; అలర్చి=వికసింపఁజేసి; ప్రోది గను నిన్నున్ =వృద్ధినందెడు నిన్ను; తిలకింపన్=చూడఁగా; రోహితాంకపతికడుపు =సముద్రుని యుదరము;బాడబాగ్ని రూఢకీలాపరంపరన్=బడబాగ్నియొక్క యధికమైన జ్వాలా సంతతిచేత; మండకుండునే=ఎరియకుండునా?

అనఁగా రాగాతిశయముచేత గురుపత్నీగమనము చేసి, మాతంగసఖ్యము గన్న సైన్యము నేలు ఘాతుకునికి చెలివై, లింగ ధారణము చేసి పాషండుఁడవై, లోక మెల్ల నపకీర్తి నెఱిపిన నిన్నుఁ జూచి నీతండ్రి యగు సముద్రునకు బడబాగ్ని జ్వాలలచేతఁ గడుపు మండు ననుట. చంద్రుఁడు బృహస్పతిభార్యను పొందుట, గజములఁ బొందు తుమ్మెదల నేలుమారునిచెలి యగుట, తనదేహకాంతిచేత చక్రవాకమోద మపహరించుట, కళంకమును దాల్చుట, నల్లగలువల వికసింపఁజేయుట, సముద్రోదరము బడబానలమును గల్గియుండుట, స్వభావములు.

మ. అలరం గామవిమోహనైకవిహృతుల్ \ప్రాంచన్నలశ్రీగతుల్
దలఁగన్ రాజిలునీమహాభ్యుదయ మా\త్మం జూడఁగా విస్ఫుర
త్కలికాలాభ మనంగఁ జెందునె సుదృ\గ్వ్రాతంబు చాల న్నవో
త్కలికాలాభ మనంగశత్రునిటలో\గ్రజ్వాలితుల్యద్యుతీ! 112

టీక: అనంగశత్రు నిట లోగ్రజ్వాలి తుల్యద్యుతీ – అనంగశత్రు=శివునియొక్క, నిటల=ఫాలమునందున్న, ఉగ్రజ్వాలి= భయంకరమగు నగ్ని తోడను, తుల్యద్యుతీ=సమానమైన కాంతిగలవాఁడా! ఇది చంద్రునికి సంబోధనము; కామ విమోహనైక విహృతుల్ —కామ=మన్మథునియొక్క, విమోహన=మోహింపఁజేసెడు, ఏక=ముఖ్యమగు, విహృతుల్=విహారములు; కామ=

మిక్కిలి, వి=పక్షియొక్క, మోహన=మోహింపఁజేసెడు, ఏక=ముఖ్యమగు, విహృతుల్=విహారములుఅని యర్థాంతరము దోఁచును; అలరన్=ఒప్పఁగా; ప్రాంచ న్నల శ్రీగతుల్—ప్రాంచత్=ఒప్పుచున్న, నల=పద్మములయొక్క, నలరాజుయొక్క యని యర్థాంతరము, శ్రీగతుల్=కాంతిగతులు, సంపద్గతులు; తలఁగన్=తొలఁగిపోఁగా; రాజిలు నీమహాభ్యుదయము– రాజిలు=ప్రకాశించుచున్న, నీమహాభ్యుదయము=నీయొక్క గొప్పయావిర్భావము, సమృద్ధి; ఆత్మన్=చిత్తమందు; చూడఁగాన్ =భావింపఁగా; విస్ఫురత్కలికాలాభన్ – విస్ఫురత్=ప్రకాశించుచున్న, కలికాల=కలియుగముయొక్క, కలిపురుషుని యొక్క యనుట, ఆభన్=కాంతిచేత; మనంగన్=వృద్ధిఁ జెందఁగా; సుదృగ్వ్రాతంబు=స్త్రీచయము, పండితమండలి యని యర్థాంతరము; చాలన్= మిక్కిలి; నవోత్కలికాలాభము – నవ=నూతనమగు, ఉత్కలికా=వేడుకలయొక్క, లాభము= ప్రాప్తిని; చెందునె=పొందునా? అనఁగా కలిపురుషుఁడు పక్షియొక్క వ్యామోహవిహారములచే నలచక్రవర్తిసిరులు తొలఁగఁజేసి విరాజిల్లుచుండఁగా సజ్జనులు సంతసింపనట్లు, నీవు మరుని భ్రామకవిహారము లలరుచుండఁగాఁ, బద్మములసిరులు తొలఁగుచుండఁగా, రాజిల్లుటకు స్త్రీలు సంతసింప రనుట.

సీ. కల సూపి తొలుదొల్త ◊గాంచితో మేషవా,హలసమానార్చిశ్చ◊యస్ఫురణము,
వెనువెంటఁ జనుచుఁ జ◊య్యన లాగితో సదో,హలసమాన్యహయోత్క◊టాంశుమహిమ,
జడల నడుమనుండి ◊పడసితో కందర్ప,హలసమాతతనిట◊లాగ్నిశక్తి,
ననుజుండ ననుచుఁ బా◊లందితో ఘనహలా,హలసమాభీలకీ◊లాలిరూఢి,
తే. నకట చల్లనిరాజ వీ◊వట్టినీకుఁ,బొసఁగె నేదారి నీసర్వ◊భువనజాత
సుఖదతేజంబు సన నిట్లు ◊శుంభదౌర్వ,పుంజనిభధామ మవధూత◊భువనజాత. 113

టీక: అవధూతభువనజాత=తిరస్కరింపఁబడిన లోకసమూహము గలవాఁడా! తిరస్కరింపఁబడిన జలజాతములు గలవాఁడా యని వాస్తవార్థము; తొలుదొల్తన్=మొట్టమొదట; కల సూపి =విద్య మెఱయించి, కల నిచ్చి యని వాస్తవార్థము, 'ప్రథమాం పిబతే వహ్నిః' అని యాగమప్రసిద్ధము; మేషవాహ లసమా నార్చిశ్చయ స్ఫురణము – మేషవాహ=అగ్నియొక్క, లసమాన =ప్రకాశించుచున్న, అర్చిశ్చయ=తేజస్సమూహముయొక్క, స్ఫురణము=స్ఫూర్తిని; కాంచితో=పొందితివో,
వెనువెంటన్=వెంటవెంటనె; చనుచున్=పోవుచు; సదోహల సమాన్యహ యోత్కటాంశుమహిమన్ – సదోహల=ఉత్సాహముతోఁ గూడిన, సమాన్యహయ=సప్తాశ్వుఁడగు సూర్యునియొక్క, ఉత్కట=అధికములైన, అంశు=కిరణములయొక్క, మహిమన్=అతిశయమును;చయ్యనన్=శీఘ్రముగా, లాగితో=ఆకర్షించితివో,
జడలనడుమన్=జటామధ్యమునందు, ఉండి=వసించి; కందర్పహల సమాతత నిటలాగ్నిశక్తిన్ – కందర్పహల=శంకరుని యొక్క, రేఫలకారముల కభేదమునుబట్టి హలశబ్దమునకు హరశబ్దము గ్రాహ్యము, సమాతత=మిగుల నధికమైన, నిటలాగ్ని శక్తిన్=ఫాలాగ్నిసామర్థ్యమును; పడసితో=పొందితివో,
అనుజుండ ననుచున్=తమ్ముండ ననుచు; ఘన హలాహల సమాభీల కీలాలి రూఢిన్ – ఘన=అధికమైన, హలాహల=కాలకూటముయొక్క, సమాభీల=మిగుల భయంకరమగు,కీలాలి=జ్వాలాసమూహముయొక్క,రూఢిన్=అతిశయమునందు; పాలందితో=భాగమందితివో,
ఈవు=నీవు; చల్లనిరాజవు=చల్లనిదొరవు;అట్టి నీకున్=అటువంటివాఁడవైన నీకు; ఈసర్వభువనజాతసుఖదతేజంబు – ఈ సర్వ=ఈసమస్తమైన, భువనజాత=లోకసమూహమునకు, సుఖద=సుఖము నిచ్చెడు,తేజంబు=కాంతి; చనన్=పోఁగా;

ఇట్లు=ఈప్రకారముగ; శుంభ దౌర్వపుంజ నిభ ధామము– శుంభత్=ప్రకాశించుచున్న, ఔర్వపుంజ = బడబాగ్నికదంబము తోడ, నిభ = సదృశమైన,ధామము = తేజస్సు; ఏదారిన్=ఏరీతి; పొసఁగెన్=కలిగెను; అకట=ఆశ్చర్యము!

అనఁగా చల్లనిరాజ వగునీకు బడబాగ్నిపుంజసమాన మగు నిట్టి తేజస్సు, అగ్నికిఁ దొలుత కలఁ జూపి అతని తేజస్తతిని గాంచుట వల్లనా? సూర్యునివెంటఁ బోవుచు నాతని యుత్కటతేజోమహిమను లాగికొనుటవల్లనా? శివుని జటామధ్యమునుండి తన్నిట లాగ్నిశక్తిని బడయుటచేతనా? కాలకూటమున కనుజన్ముఁడవై దాని యాభీలకీలారూఢి పొలందుటచేతనా? వీనిలో దేనివల్లఁ గలిగె ననుట. ఇటఁ జంద్రతేజఃపుంజమునందు అగ్న్యాద్యన్యతమసంబంధిత్వప్రశ్నవ్యాజముచే తత్తాదాత్మ్యదృఢీకరణము వల్లను బూర్వావస్థకన్న నుత్కర్షాపకర్షములు చెప్పమివలనను 'చంద్రజ్యోత్స్నావిశదపులినేసైకతేస్మి న్సరయ్వాః' ఇత్యాదులందువలె ననుభయతాదాత్మ్యరూపకము. 'విషయ్యభేద తాద్రూప్యరఞ్జనం విషయస్య యత్, రూపకం తత్త్రిధాధిక్య న్యూనత్వానుభయోక్తిభిః' అని తల్లక్షణము.

క. ఈలీలఁ జంద్రు నని, ల
క్ష్మీలలనాతనయుఁ బలికెఁ గినుక మధుపరా
జాలక శరభవజాలక
జాలకశరభవదురంతసంతాపికయై. 114

టీక: ఈలీలన్=ఈప్రకారముగ; చంద్రున్=చంద్రునిగూర్చి; అని=పలికి; మధుపరాజాలక– మధుపరాజ=తుమ్మెదమిన్నలను బోలు, అలక=ముంగురులు గల చంద్రిక; శరభవ జాలక జాలక శరభవ దురంతసంతాపికయై–శరభవ=కమలములయొక్క, జాలక=మొగ్గలయొక్క, జాలక=సమూహములు, శర=బాణములుగాఁ గల మన్మథునివలన, భవ=పుట్టిన, దురంత=అపార మైన, సంతాపికయై=సంతాపము కలదై; కినుకన్=కోపముచేత; లక్ష్మీలలనాతనయున్=మన్మథునిగూర్చి; పలికెన్=అనెను.

చ. కలుగునె నీకు సద్యశ మఖండరుషాగతి నిస్వనద్గుణో
జ్జ్వలవిశిఖాసముక్తశితసాయకధారఁ గృపీటజాంబకా
వలిఁ గర మేఁచఁ ద్వద్బలనివారకసారకృపీటజాంబకా
తులితభుజాసహోమహిమఁ దూల్చినఁ గాక కృపీటజాంబకా! 115

టీక: కృపీటజాంబకా=ఓపద్మబాణుఁడవైన మదనా! త్వద్బల నివారక సార కృపీటజాంబ కాతులిత భుజాసహోమహిమన్– త్వత్=నీయొక్క, బల=సామర్థ్యమునకు, నివారక=వారించునది యైన, సార=శ్రేష్ఠమైన, కృపీటజాంబక=వహ్నినేత్రుఁడైన శివునియొక్క, అతులిత=సాటిలేని, భుజాసహః=బాహుబలముయొక్క, 'సహో బల శౌర్యాణి' అని యమరుఁడు,మహిమన్=అతిశయమును; తూల్చినన్ కాక=తూలఁజేసిననే కాని; అఖండరుషాగతిన్=అవిచ్ఛిన్నరోషప్రాప్తిచేత; నిస్వన ద్గుణోజ్జ్వల విశిఖాస ముక్త శితసాయక ధారన్– నిస్వనత్=మ్రోయుచున్న, గుణ=అల్లెత్రాటిచేత, ఉజ్జ్వల=ప్రకాశించుచున్న, విశిఖాస=ధనుస్సుచేత, ముక్త=విడువఁబడిన, శితసాయక=తీక్ష్ణమగు బాణములయొక్క, ధారన్=అంచుచేత; కృపీటజాంబకావలిన్– కృపీటజ=జలజములవంటి, అంబకా=నేత్రములు గల స్త్రీలయొక్క, ఆవలిన్=సమూహమును; కరము=మిక్కిలి; ఏఁచన్=బాధింపఁగా; నీకున్; సద్యశము = మంచిఖ్యాతి; కలుగునె=జనించునా?

నిన్ను దహించిన శివుని జయించిననే నీకు యశస్సు కల్గును గాని, యట్లుగాక, స్త్రీలను బాధించుచున్నచోఁగలుగ దనుట.

సీ. తరుణతురంగాయి◊తశుకాండజాతము,ల్పంజరకారలోఁ ◊బడక యున్న,
సతతనారాచిత◊సితకాండజాతముల్, కడు నిశాతత్వంబుఁ ◊గాంచి యున్న,
మది ఘనభయరేఖ ◊మధుకాండజాత ము,ల్లలితపత్రిబలంబు ◊ గలఁగ కున్నఁ,
జక్కఁ దేరైనపృ◊షత్కాండజాతముల్, పొదలుచాంచలి మూల ◊నొదుఁగ కున్న,
తే. సారకాంతాలసాయకా◊సన మఖండ,తాగతి భజించి యున్న నీ◊ధాత్రి నవమ
సారకాంతాలకాపాళి ◊ఘోరతావ,కీనధాటికి బ్రతుకునే ◊సూనబాణ! 116

టీక: సూనబాణ=ఓకుసుమాయుధుఁడా! తరుణతురంగాయితశుకాండజాతముల్ – తరుణ=నూతనములైన, తురంగాయిత =అశ్వములవలెనాచరించుచున్న, శుకాండజాతముల్=చిలుకలను పక్షులు; పంజరకారలోన్=పంజరమను కారాగృహము లో; పడక యున్నన్ = పడినవి కాకుండినయెడ, దీనికి గీతిలో నున్న 'బ్రతుకునే' యను క్రియతో నన్వయము. ముందుచరణ ములయందును నిట్లే తెలియవలయు.

సతతనారాచితసితకాండజాతముల్—సతత=ఎల్లపుడు, నారాచిత=బాణములుగాఁ జేయఁబడిన, సిత=తెల్లనయిన, కాండ జాతముల్=జలజములు, అనఁగాఁ బుండరీకములు; కడున్=మిక్కిలి; నిశాతత్వంబున్=తీక్ష్ణత్వమును, రాత్రియొక్క స్వరూ పము నని వాస్తవార్థము; కాంచి యున్నన్=పొందియున్న యెడ;

మధుకాండజాతముల్లలితపత్రిబలంబు – మధుకాండ=వసంతసమయమందు,జాత=ఉదయించిన,ముత్=ముదముచేత, లలిత =ఒప్పుచున్న, పత్రి=పక్షులనెడు, అనఁగా కోయిలలనెడు, బలంబు=సైన్యము; మదిన్=మనస్సునందు; ఘనభయరేఖన్ = అధికభయపరంపరచేత, మేఘమువలన నైన భీతిపరంపరచేత నని వాస్తవార్థము; కలఁగ కున్నన్= కలఁతపడకున్న యెడ; తేరైన పృషత్కాండజాతముల్=రథమైన వాయుసమూహములు; చక్కన్=బాగుగా; పొదలుచాంచలిన్=ఒప్పుచున్న చాంచ ల్యముచేత; మూలన్=గొందిని, విదిక్కునందని వాస్తవార్థము; ఒదుఁగ కున్నన్=దాఁగకున్న యెడ;

సారకాంతాలసాయకాసనము – సార=శ్రేష్ఠమైన, కాంతాల=చెఱకనెడు, రేఫలకారంబుల కభేదతనుబట్టి కాంతారశబ్దము గ్రహింపవలయు, సాయకాసనము=ధనుస్సు; అఖండతాగతిన్=అభంగత్వమును,ఖండములు కాకుండుటను; భజించి యున్నన్=పొందియున్న యెడల; ఈధాత్రిన్=ఈభూమియందు; నవమసారకాంతాలకాపాళి – నవ=క్రొత్తనైన, మసార=నీల మణులభంగి, కాంత=ఒప్పుచున్న, అలకా=ముంగురులుగలవారియొక్క,అనఁగా స్త్రీలయొక్క, పాళి=సమూహము; ఘోర= భయంకరమైన, తావకీన=నీయొక్క, ధాటికిన్=దాడికి; బ్రతుకునే = జీవించునా?

అనఁగా నీగుఱ్ఱములైన చిలుకలు పంజరము లను కారాగృహములందు బడకయుండి, నీబాణము లైన తెల్లదామరలు నిశాతత్వము గాంచియుండి, నీకోయిల లనుసైన్యములు చిత్తమందు ఘనభయమును బొందకుండి, నీరథమైన మందమారు తము ఒకమూల నొదుఁగకుండి, నీచెఱకువిల్లు తునియలు కాకుండినచో, లోకమందు స్త్రీజనము బ్రదుక దనుట. చిలుకలు పంజరబంధమును బొందుటయుఁ, దెల్లదామరలు రాత్రిత్వము నెఱుంగకుండుటయుఁ, గోయిలలు మేఘమువలన భీతిల్లు టయు, వాయువు చంచలమై వాయవ్యమూలయం దొదిఁగి యుండుటయు, నిక్షువు ఖండము లగుటయుఁ బ్రసిద్ధము.

క. మదనానాపికకలగతి, మదనాహతనాదరేఖ ౹మసల నిటులు మ
మ్మదనా యేఁచఁగ నీయెడ, మదనావిలవినుతి నలరి ౹మన్పవె మదనా! 117

టీక: మదనా=మన్మథుఁడ! మద నానాపిక కలగతిమ దనాహత నాదరేఖ – మద=మదప్రధానములగు, నానాపిక= అనేక విధము లైన కోకిలలయొక్క, కలగతిమత్=అవ్యక్తమధురప్రకారము గల, అనాహత=అప్రతిహతమగు, నాదరేఖ=ధ్వనిపరంపర; మసలన్=ఒప్పఁగా; ఇటులు=ఈప్రకారముగ; మమ్మున్ ఏఁచన్= మమ్ములను బొధించుటకు; అదనా=సమయమా? కాదని కాకువు; ఈయెడన్=ఇపుడు; మ దనావిల వినుతిన్—మత్=నాయొక్క, అనావిల=అకలుషమగు, వినుతిన్=స్తోత్రముచేత; అలరి =సంతసించి; మన్పవె = రక్షింపుమా!

సీ. పరమరుత్పరమారి౹పరమారిధర్తమై, కర్తమై వెలయు శ్రీ౹భర్తయుండఁ,
బరిణతాసురరాజ౹సురరాజపాళియై, శీలియై తగు తమ్మి౹మాలి యుండ,
సముదారశమనాత్మ౹శమనాత్మభారియై, హారియై మించు ద౹క్షారి యుండ,
దళితోగ్రబలమాన౹బలమానవాదియై, మోదియై మనుశైల౹భేది యుండ,
తే. నకటకట సత్కదంబవై౹రాప్తిఁ బొల్చి, చెలఁగుచైత్రికుతోఁ జెల్మి ౹నలరు టెల్ల
ధరణి నార్యాళిమథనవ౹ర్తనకుఁ గాదె, వారి నెవ్వారిఁ గానవే ౹వారిజాస్త్ర!

టీక: పర మరుత్పర మారి పరమారి ధర్తమై – పర=శత్రువులగు, మరుత్పర=దేవవిరోధులగు రాక్షసులకు, మారి=సంహరించెడు, పరమ=శ్రేష్ఠమగు, అరి=చక్రముయొక్క, ధర్తమై=ధారకుఁడై; కర్తమై=జగత్కర్తమై; వెలయు శ్రీభర్త=ఒప్పుచున్న నారాయణుఁడు; ఉండన్=ఉండఁగా;
పరిణ తాసుర రాజ సురరాజ పాళియై – పరిణత=మిగులనమ్రులైన, అసుర=రక్కసులు, రాజ=యక్షులు, సురరాజ=దేవశ్రేష్ఠులు, వీరియొక్క, పాళియై=పరంపరగలవాఁడై; శీలియై=సద్వృత్తము గలవాఁడై; తగు తమ్మిమాలి = ఒప్పునట్టి బ్రహ్మ; ఉండన్=ఉండఁగా;
సముదార శమనాత్మ శమ నాత్మ భారియై – సముదార=మిక్కిలి యధికమగు, శమన=యమునియొక్క,ఆత్మ=ధైర్యమునకు, ‘ఆత్మా దేహ మనో బ్రహ్మ స్వభావ ధృతి బుద్ధిషు’ అని విశ్వము, శమన=నాశకమగు,ఆత్మ=బుద్ధిని, భారియై=భరించుచున్న వాఁడై; హారియై=మనోహరుఁడై; మించు దక్షారి=అతిశయించునట్టి శివుఁడు; ఉండన్=ఉండఁగా;
దళి తోగ్ర బల మాన బలమానవాదియై – దళిత=నఱకఁబడిన, ఉగ్ర=తీక్ష్ణమగు, బల=సామర్థ్యమును, మాన=గర్వమును గల, బలమానవాదియై =బలాసురుఁడు గలవాఁడై; మోదియై=సంతసము గలవాఁడై; మనుశైలభేది=ఒప్పుచున్న ఇంద్రుఁడు; ఉండన్ =ఉండఁగా;
సత్కదంబ వైరాప్తిన్ – సత్కదంబ=మంచి కడిమిచెట్లనెడు సత్పురుషగణములయొక్క, వైరాప్తిన్=విరోధప్రాప్తిచేత; పొల్చి = ఉదయించి; చెలఁగు చైత్రికుతోన్ = ఒప్పుచున్న వసంతుఁడనెడు చిత్తరువువ్రాయువానితో; చెల్మిన్=సఖ్యముతోడ; అలరు టెల్లన్ = ఒప్పుటంతయు; ధరణిన్=భూమియందు; నార్యాళిమథనవర్తనకున్ – నార్యాళి = నార్యాళి, ఆర్యాళి యని రెండు విధములపదవిభాగము. ఆర్యాళి=ఆర్యుల సమూహముయొక్క, నార్యాళి=స్త్రీసమూహముయొక్క, మథనవర్తనకున్=మథించు వృత్తికయి; కాదె=కాదా! వారి నెవ్వారిఁ గానవే =వారి నెవరిని జూడవా? అకటకట=అయ్యో కష్టము! వారిజాస్త్ర=మన్మథుఁడా!

అనఁగా నసురసంహారి యగు విష్ణుమూర్తియు, సురాసురాదిసేవితుఁ డగు బ్రహ్మయు, కాలాంతకుఁడగు రుద్రుఁడును, బలవైరి యగునింద్రుఁడు నుండఁగా వారితో జెలిమిఁ గాంచక సత్కదంబవైరి యగు చైత్రికునితోఁ జెల్మి గాంచుట భూమియందు నార్యాళిమథనకే గద యనుట. సత్కులసంపన్నుఁడుగాని చిత్తరువుపనివానితోఁజెలిమి గాంచుట ఆర్యాళిమథనమునకే యని ధ్వని. వసంతమందు కదంబములు వికసిల్లమి వెనుక వ్రాయఁబడియె.

వ. అని యానారి శంబరారిం దూఱి యమ్మారున కెక్కుడై పైఁ జేరు సమీరు నిట్లనియె.

టీక: అని =ఇట్లని; ఆనారి=ఆచంద్రిక; శంబరారిన్=మన్మథుని; దూఱి=దూషించి; అమ్మారునకున్=ఆమన్మథునికి; ఎక్కుడై =వాహనమై; పైఁ జేరు సమీరున్=మీఁదికివచ్చు వాయువునుగుఱించి; ఇట్లనియెన్=వక్ష్యమాణప్రకారముగఁ బలికెను.

ఆ. మలయఁ జెంత నీవు ◊మహి నొప్పుపటుతరుల్, సారె వడఁక నెంత ◊భీరు లనఁగ
నలఁప రాఁగ వల ద◊నిల విజృంభితశోణ,నలపరాగవలద◊నలకణాళి. 120

టీక: అనిల=మారుతమా! నీవు; చెంతన్=సమీపమందు; మలయన్=తిరుగుచుండఁగా; మహిన్=భూమియందు; ఒప్పు పటు తరుల్=ఒప్పుచున్న వృక్షములనెడు మిక్కిలి సమర్థులు; సారెన్=మాటిమాటికి; వడఁకన్=కంపించుచుండఁగా; భీరులు = స్త్రీలనెడు భయస్థులు; అనఁగన్=అనఁగా; ఎంత=ఎంతటివారు? విజృంభిత శోణనల పరాగ వల దనలకణాళిన్– విజృంభిత= వికసించినట్టి, శోణనల=ఎఱ్ఱగలువలయొక్క, పరాగ=పుప్పొడి యనెడు, వలత్=తిరుగుచున్న, అనలకణాళిన్=స్ఫులింగ పరంపరలచేత; నలఁపన్=నలఁతపొందించుటకు; రాఁగన్ వలదు = రాఁగూడదు.

అనఁగా నీవు సమీపమున సంచరించుటచేత సమర్థులైనవారే వడఁకునపుడు మాబోఁటి భీరువు లెంతవారు? కావునఁ గోక నదపరాగ మనెడు నగ్నికణాళితో నలఁత పొందించుటకు రాఁగూడ దనుట. ఇట దైన్య మను సంచారిభావము వ్యజ్యమాన మగు చున్నది. ‘సత్త్వత్యాగా దనౌద్ధత్యం దైన్యం కార్పణ్య సంభవమ్’ అని తల్లక్షణము.

సీ. గురుకలకంఠికా◊పరిరక్తి మాధవా,శయము రాజిలుట గాం◊చంగ లేదొ,
విప్రయోగుల నొంచు◊విధ మూను మాధవా,పత్యహృద్రీతి చూ◊పట్ట లేదొ,
యనవద్యవసుహారి ◊యగుచు శ్యామాధవా,త్మ రహించుటల్ చాలఁ◊దలఁప లేదొ,
యఖిలభృంగాంతర◊వ్యాపృతి మాధవా,ధృతి నిచ్చ చెలరేఁగు◊టెఱుఁగ లేదొ,
తే. కటకటా యట్టివారితోఁ ◊గరము నంటు, గని మలినపంకజాతవా◊సన చిగుర్ప
ధర సుదృక్పాళి దూలింపఁ ◊దగవె పవన, కడు ననఘవృత్తిఁ దగుసదా◊గతికి నీకు. 121

టీక: పవన=ఓమారుతమా! మాధవాశయము=వసంతునిహృదయము; గురుకలకంఠికా పరిరక్తిన్– గురుకలకంఠికా = గురుపత్నియందలి, పరిరక్తిన్=ఆసక్తిచేత, అధికములగు కోకిలస్త్రీలయందలి అనురాగముచేత నని వాస్తవార్థము; రాజిలుట = ప్రకాశించుట; కాంచంగ లేదొ=చూడలేదో,
విప్రయోగులన్=బ్రాహ్మణతాపసులను, విరహిజనుల నని వాస్తవార్థము; నొంచువిధము =అడంచురీతిని; ఊను మాధవాపత్య హృద్రీతి– ఊను=వహించునట్టి, మాధవాపత్య=కామునియొక్క, హృద్రీతి=హృదయవైఖరి; చూపట్ట లేదొ=అగపడలేదో,

శ్యామాధవాత్మ—శ్యామాధవ=చంద్రునియొక్క, ఆత్మ=బుద్ధి, శరీరమని యర్థాంతరము; అనవద్యవసుహారి– అనవద్య=నిర్దుష్టమైన, వసు=సువర్ణమును, హారి=హరించునది, అనవద్యములైన కిరణములచేత మనోహరమైనదని శరీరపరమైన యర్థము; అగుచున్; చాలన్=మిక్కిలి; రహించుటల్=ఒప్పుటలు; తలఁప లేదొ=స్మరింప లేదో,

అఖిలభృంగాంతరవ్యాపృతి = సమస్తములైన తుమ్మెదలయొక్క హృదయవ్యాపారము; మాధవాదృతిన్– మాధవ=మద్య సంబంధియైన, ఆదృతిన్=ఆదరముచేత, పుష్పరససంబంధియైన యని వాస్తవార్థము, 'మధు మద్యే పుష్పరసే' అని యమరుఁడు; నిచ్చ=ఎల్లపుడు; చెలరేఁగుట=విజృంభించుట; ఎఱుఁగ లేదొ=తెలియ లేదో,

కటకటా=అయ్యో (కష్టము)! ఇట్టివారితోన్= ఇటువంటి వసంతాదులతో; అంటుగని=సంపర్కము గాంచి; మలినపంకజాత వాసన– మలినమైన పాపకదంబముయొక్క సంస్కారము, నీలోత్పలపరిమళ మని వాస్తవార్థము; చిగుర్పన్=పల్లవింపఁగా; ధరన్=భూమియందు; సుదృక్పాళిన్=పండితసంఘమును, స్త్రీకదంబము నని యర్థాంతరము; కరము=మిక్కిలి; తూలింపన్=తూలఁజేయఁగా; కడున్అనఘవృత్తిన్=మిక్కిలి పాపరహితవృత్తిచేత, మిక్కిలి నిర్మలవృత్తిచేత, వాయువు నిర్మలమగుట స్వభావము; తగు సదాగతికిన్=ఒప్పునట్టి సజ్జనగతి యగు,ఒప్పునట్టి సదాగమనము గలవానికి, వాయు వెల్లపుడు చరించునది యగుట ప్రసిద్ధము; నీకున్; తగునె=యుక్తమా?

అనఁగాఁ బాపరహితుఁడ వగునీకు గురుదారగమనము సేయువసంతుఁడు, బ్రహ్మహత్య చేయు మరుఁడు, స్వర్ణస్తేయి యగు చంద్రుఁడు, మద్యపాయి యగుభృంగము, వీరితో సహవాసమమంచిదికా దనుట. 'బ్రహ్మహత్యా సురాపానం స్తేయం గుర్వఙ్గనాగమః' అని చెప్పఁబడిన మహాపాతకములుగలవారితో సాంగత్యము చేసిన నీకు, 'తత్సంయోగీ చ పఞ్చమః' అని మహాపాతకులలోఁ జేరిక గలుగుఁ గానఁ దత్సహవాసము మాని సుదృక్పాళిని రక్షింపు మని హృదయము.

తే. అంతరమున నటించు పేరాస మీఱఁ, దోడ్త భజియింతు మాకు సంతోస మీర
సారెఁ బయిఁ గ్రమ్మి యిప్పు డేఁచకు సమీర,ణాంకురాభాంగ మింపుఁ బాయఁగ సమీర! 122

టీక: సమీర=ఓపవనా! అంతరమునన్=ఆత్మయందు; నటించు పేరాస=ఉప్పొంగుచున్న పెద్దయాశ; మీఱన్=మించఁగా; తోడ్తన్=వెంటనే; భజియింతున్=కొల్తును; మాకు సంతోసమీర= మాకు సంతస మిమ్ము రా; సారెన్=మాటికి; పయిన్ = మీఁదను; క్రమ్మి=ఆక్రమించి; సమీరణాంకురాభాంగము – సమీరణాంకుర=మరువపుమొలకయొక్క, ఆభ=కాంతివంటి కాంతిగల, అంగము=శరీరము; ఇంపున్ పాయఁగన్= సొంపు వీడునట్లు; ఇప్పుడు; ఏఁచకు=బాధింపకుము.
అనఁగా నా మనోరథసిద్ధి కాఁగానే నిను భజియించెద, నిపుడు మాత్రము బాధింప కనుట.

క. అని యాజలజేక్షణ యి,ట్లనిలాదులఁ జాల దూఱి యపుడు కిసలజీ
వనగోవిభుసూను మధుప,వనగోవిభుసూను మధుపవారము లేఁచన్. 123

టీక: అని=ఇట్లని; ఆజలజేక్షణ=ఆచంద్రిక; ఇట్లు=ఈప్రకారముగ; అనిలాదులన్=మలయపవనాదులను; చాలన్=మిక్కిలి; దూఱి=దూషించి; అపుడు; కిసలజీవన గోవిభుసూను మధు పవన గోవిభుసూను మధుపవారములు – కిసలజీవన=కోకిలలు, గోవిభుసూను=భూభర్తయైన విష్ణువుయొక్క పుత్త్రుఁడైన మన్మథుడు, మధు=వసంతుఁడు, పవన=మలయానిలము, గోవిభుసూను=సముద్రపుత్త్రుఁడైన చంద్రుఁడు, మధుపవారములు=తుమ్మెదలగుంపులు; ఏఁచన్=బాధింపఁగా. దీనికి ముందుపద్యము నందలి 'చొరఁబాఱు' లోనగు క్రియలతో నన్వయము.

సీ. వకులాగనవపల్ల◊వకులాలిఁ జొరఁబాఱు, గఱకుకైదువులపై ◊నుఱుకుపగిది,
సుమనోజ్ఞచాంపేయ◊సుమనోరజముఁ దూఱు, ఘోరాగ్నిమండలిఁ ◊జేరుపగిది,
మధుపాదపానూన◊మధుపాళిఁ దిలకించు, ఘనవిషోదక మానఁ ◊గాంచుపగిది,
లతికానికరగౌర◊లతికాంతతతి మున్గు, మించుపెన్నదిఁ బ్రవే◊శించుపగిది,
తే. దోడ్తఁ బలుమాఱు బలుమారు◊దోర్బలమున, నాత్మ వలవంత వలవంత◊మగుచు నిగుడఁ
జటులకలనాదకలనాద◊పటలి కలికి, బడలి యారామ యారామ◊పదవి నెనసి. 124

టీక: ఆరామ=ఆచంద్రిక; తోడ్తన్=వెంటనే; పలుమాఱు=సారెకు;బలుమారుదోర్బలమునన్=అధికమగు మదనుని భుజ బలముచేత; ఆత్మన్=హృదయమందు; వలవంత=దుఃఖము; వలవంత మగుచున్=బలవంతమగుచు, ఇట వబల కభేదము; నిగుడన్=అతిశయింపగా; చటుల కలనాద కల నాదపటలికిన్ – చటుల=చంచలమగు, కలనాద=కోకిలలయొక్క, కల = అవ్యక్తమధురమగు, నాదపటలికిన్=ధ్వనిపరంపరకు;అలికి=భయపడి; బడలి=అలసి; ఆరామపదవిన్=తానున్న కేళీమంది రమునుండి యుద్యానవనవీథిని; ఎనసి=చేరి;

వకులాగ నవ పల్లవకు లాలిన్ – వకులాగ=పొగడచెట్లయొక్క, నవ=నూతనమగు, పల్లవకుల=చిగురుజొంపములయొక్క, ఆలిన్=పంక్తిని; కఱకుకైదువులపైన్=తీక్ష్ణములగు శస్త్రములపైని; ఉఱుకుపగిది=ఉఱికెడుతీరున; చొరఁబాఱున్=ప్రవేశించును; సుమనోజ్ఞచాంపేయసుమనోరజమున్ –సు=మిక్కిలి, మనోజ్ఞ=మనోహరమగు,చాంపేయ=నాగకేసరములయొక్క, సుమనో రజమున్= పుప్పొడిని; ఘోరాగ్నిమండలిన్=భయంకరమైన నిప్పులకుప్పను; చేరుపగిదిన్=చొచ్చువిధమున; తూఱున్ = ప్రవేశించును;

మధుపాద పానూన మధు పాళిన్—మధుపాదప=ఇప్పచెట్లయొక్క, అనూన=అధికమగు, మధు=మకరందముయొక్క, పాళిన్=సమూహమును; ఘనవిషోదకము =అధికమైన విషజలమును; ఆనన్=త్రాగుటకు; కాంచుపగిదిన్=చూచునట్లు; తిలకించున్=వీక్షించును;

లతికానికర గౌర లతికాంతతతిన్ – లతికానికర=బండిగురివెందతీవెగుంపులయొక్క, గౌర=శుభ్రములగు,లతికాంతతతిన్ =పుష్పసమూహమునందు; మించుపెన్నదిన్=అతిశయించు పెద్దయేటిని; ప్రవేశించుపగిదిన్=చొచ్చురీతిగా; మున్గున్= మునుకవేయును.

అనఁగా నాచంద్రిక యట్లు విరహానలసంతప్తయై, మనోరథసిద్ధిగామిచే సంతాప మంతంతకు మిక్కుటము కాఁగాఁ దాళఁ జాలక తనశరీరమందు విసువు పుట్టి ప్రాణత్యాగమునకై యాయుధప్రాయముగఁ దోఁచు వకుళపల్లవాళిఁ బ్రవేశించుటయు, నిప్పులకుప్పగాఁదోఁచు నాగకేసరముల పుప్పొడితిప్పలు చేరుటయు, విషజలముగఁ దోఁచు నిప్పపూదేనియ నానఁ జూచు టయుఁ, బెన్నదిగాఁ దోఁచు బండిగురివెందలపూజొంపముల మున్గుటయు నొనరించె నని భావము. అపు డామె కవన్నియు ప్రాణాపాయము సేయఁగల్గు నన్నంత దుస్సహము లైనవని ఫలితార్థము. అవస్థాదశకములోని మరణావస్థ యిందు గదితం బయ్యె. తల్లక్షణతత్కార్యము లిట్లు. 'తైస్తైః కృతైః ప్రతీకారై ర్యది న స్యా త్సమాగమః। మరణ మ్మరణోద్యోగః కామాగ్నే స్తత్ర విక్రియాః। లీలాశుకచకోరాదిన్యాస స్స్నిగ్ధసఖీకరే। కలకణ్ఠకలాలాపశ్రుతి ర్మన్దానిలాశ్రయః। జ్యోత్స్నాప్రవేశమాకన్దమఞ్జరీ వీక్షణాదయః' – అని తెలియవలయు.

చ. లలన సమీరధార పొదలన్ బొదలన్ వడిఁ దూఱు శారికా
కులములు మ్రోయఁ జాలఁ గలఁగుం గలఁగుండువడన్ మనంబు గో
ర్కు లెడయ హా యటంచుఁ బలుకుం బలుకుందపుమొగ్గచిల్కుట
మ్ములు మరుఁ డేయఁ బూనుఁ దరముం దరముం జెలి చెంతఁ జేరినన్. 125

టీక: లలన=చంద్రిక; సమీరధార=మలయమారుతపరంపర; పొదలన్=ఏపుమీఱఁగా; పొదలన్=నికుంజములను; వడిన్ = వేగముగా; తూఱున్=చొచ్చును; శారికాకులములు=గోరువంకలగుంపులు; మ్రోయన్=కూయఁగా; మనంబు =మనస్సు; కలఁగుండువడన్=ఆకులతనొందఁగా; చాలన్=మిక్కిలి; కలఁగున్=కలఁతనొందును; కోర్కులు=మనోరథములు; ఎడయన్ =ఎడఁబాయఁగా; హా అటంచున్ పలుకున్ = హాయని వచించును; బలుకుందపుమొగ్గచిల్కుటమ్ములు— బలు=అధికము లగు, కుందపుమొగ్గ=మొల్లమొగ్గలను, చిల్కుటమ్ములు=అలుఁగుతోఁ గూడినబాణములు; మరుఁడు=మన్మథుఁడు; ఏయన్ = ప్రయోగింపఁగా; చెలి = సఖి; చెంతన్ చేరినన్=సమీపించినను; తరమున్=వేగిరపాటును; దరమున్=భయమును; పూనున్.

వ. ఇట్లు పంచబాణపంచకప్రపంచితవిరహసంతాపంబునం భ్రమించు నమ్మించుఁబోఁడిం దోడ్తెచ్చి మచ్చిక గ్రమ్ముకొన నెచ్చెలిచెలువపిండు లచ్చంపుఁజలువ వెదచల్లు మొల్లవిరిసజ్జ నుంచి ప్రియకథానులాపంబులం బ్రొద్దు గడుపు నవసరంబున. 126

టీక: ఇట్లు=ఈరీతిగ; పంచబాణపంచకప్రపంచితవిరహసంతాపంబునన్— పంచబాణపంచక=కామశరపంచకముచేత, ప్రపంచిత=విస్తరింపఁజేయఁ బడిన, విరహసంతాపంబునన్=వియోగవేదనచేత; భ్రమించు నమ్మించుఁబోఁడిన్= భ్రమనొందు నా మెఱపుతీఁగవంటి శరీరముగల చంద్రికను; తోడ్తెచ్చి=తీసికొనివచ్చి; మచ్చిక గ్రమ్ముకొనన్=ప్రేమమీఱునట్లుగా; నెచ్చెలిచెలువ పిండులు=ప్రియసఖీవర్గములు; అచ్చంపుఁజలువన్=మంచిచల్లఁదనమును; వెదచల్లు మొల్లవిరిసజ్జన్=వ్యాపింపఁజేయు మొల్ల పూవుల పాన్పునందు; ఉంచి; ప్రియకథానులాపంబులన్=ప్రీతికరమగు కథలను చెప్పుటవలన; ప్రొద్దు గడుపు నవసరంబున = ప్రొద్దుపుచ్చునపుడు. దీనికి ముందుపద్యముతో నన్వయము.

చ. కనికర మింతలే కసమకాండుఁడు శ్యామ నలంప వేడ్కఁ జ
క్కని కరహేతిధారఁ గలఁగన్ ఘటియింపఁగఁ బాడి గాదు మా
కని కర మాత్మఁ దత్పరత నందుచుఁ జయ్యన నేగె నప్డు లో
కనికరతాపహారి యుడుకాంతుఁడు వారిధినేతఁ జేరఁగన్. 127

టీక: అసమకాండుఁడు=మన్మథుఁ డనుసూర్యుఁడు; శ్యామన్=చంద్రిక యనురాత్రిని; కనికరము=దయ; ఇంతలేక=ఇంచుకైన లేక; వేడ్కన్=సంతసముచేత; అలంపన్=శ్రమపెట్టఁగా; చక్కనికరహేతిధారన్=మంచికిరణము లనెడుఖడ్గధారచేత; కలఁగన్ = కలఁతఁబొఱునట్లు; ఘటియింపఁగన్=చేయుటకు; మాకున్; పాడి గాదు = ధర్మము గాదు; అని = ఇట్లు తలంచి; కరము = మిక్కిలి; ఆత్మన్ = చిత్తమందు; తత్పరతన్=ఆసక్తిని; అందుచున్=పొందుచు; అప్డు=అప్పుడు; లోక నికర తాపహారి = లోక ములసమూహమునకు తాపము శమింపఁజేయునట్టి; ఉడుకాంతుఁడు=చంద్రుఁడు; వారిధినేతన్=సముద్రరాజును; చేరఁగన్= చేరుటకు; చయ్యనన్=శీఘ్రముగా; ఏగెన్=పోయెను.

సూర్యుఁడు రాత్రిని బాధించినట్లు మరుఁడు చంద్రికను బాధించుచుండఁగా మనమునైతము బాధించుట ధర్మము గాదని చంద్రుఁడు లోకతాపమును బోఁగొట్టువాఁడు గాన దయఁ దలఁచి పశ్చిమసముద్రమును జేరఁబోయె నని భావము. చంద్రుఁ డస్త మించె నని ఫలితము. గమ్యోత్ప్రేక్షాలంకారము.

క. ఆరామ కపుడు శుభవా,గ్ధారాగతిఁ దెలిపె నొక్క ◊తరుణి వరకళా
వారనిశాంత మితవు నలు,వార నిశాంతమితిరహిత◊హారివిభవమున్. 128

టీక: అపుడు; ఆరామకున్=ఆచంద్రికకు; వర కళా వార నిశాంతము – వర=శ్రేష్ఠములగు, కళా=విద్యలయొక్క, వార=సంఘమునకు, నిశాంతము=నెలవగు; ఒక్క తరుణి = ఒకస్త్రీ; ఇతవు=కూర్మి; నలువారన్=ఒప్పుఁగా; నిశాంత మితిరహిత హారివిభవమున్– నిశాంత=ప్రాతఃకాలముయొక్క, మితిరహిత=అమితమగు, హారివిభవమున్=మనోజ్ఞమగు సమృద్ధిని; శుభవాగ్ధారాగతిన్ = మంచిమాటలవరుసచేత; తెలిపెన్=చెప్పెను. ఇటనుండి సూర్యోదయవర్ణన మారంభింపఁబడుచున్నది.

సూర్యోదయవర్ణనము

చ. వెలసెఁ బదాయుధార్భటులు ◊వింటివె యోయధరానులిప్తనా
విలసిత పుష్కరారి పృథి◊వీపతి పాంథపరాళి గెల్చి తా
విలసితపుష్కరాధిపన◊వీనపురేశముఁ జేరఁగాఁ జనన్
దొలుత నుషోభటధ్వనిత◊దుస్తరకాహళికాధ్వనుల్ బలెన్. 129

టీక: ఓఅధరానులిప్తనావిలసిత=అధరమందుఁ బూయఁబడిన యకలుషమగు చక్కెర గల యోచంద్రికా! చక్కెరవంటిపెదవి గలదానా యనుట; పుష్కరారి పృథివీపతి =చంద్రుఁడనెడు రాజు; పాంథపరాళిన్=విరహు లనెడు శత్రువులపంక్తిని; గెల్చి = జయించి; తాన్; విలసితపుష్కరాధిపనవీనపురేశమున్– విలసిత=ప్రకాశించుచున్న, పుష్కరాధిప=సముద్రమనెడు, నవీన= నూతనమగు, పురేశమున్=నగరశ్రేష్ఠమును; చేరఁగాన్=పొందుటకు; చనన్=పోవుచుండఁగా; తొలుతన్=మొదల; ఉషోభట ధ్వనిత దుస్తర కాహళికాధ్వనుల్ బలెన్ —ఉషోభట=ప్రభాతమనెడు భటునిచేత, ధ్వనిత=మ్రోఁగింపఁబడిన, దుస్తర=అధికమైన, కాహళికాధ్వనుల్ బలెన్ =బూరగలధ్వనులవలె; పదాయుధార్భటులు =కుక్కుటధ్వనులు; వెలసెన్=విలసిల్లెను; వింటివె = ఆకర్ణించితవా? అనఁగా నొకరాజు శత్రువులను గెలిచి నూతనపురప్రవేశముఁ జేయుచుండఁగా భటులు సేయుకాహళీధ్వనులు వెలయు విధమునఁ, జంద్రుఁడు పాంథులను గుందించి పశ్చిమాంబురాశిఁ జేరఁబోవుచుండఁగాఁ గుక్కుటధ్వనులు వెలసె నని భావము. రూపకాలంకారము.

మ. స్ఫురదాజాండఘటి న్నిశాతపపయ◊స్సుల్ పేరఁ బూర్వావనీ
ధరగోపాలతనూజమౌళి గని దో◊ర్దం జంద్రమండంబు వా
పి రహిం దద్దధిఖండ మూనె నన నొ◊ప్పెం గంటివే ప్రాగ్దిశా
ధర గోపాలతనూజ వాసవహరి◊త్పద్మావిలాసాబ్జమై. 130

టీక: స్ఫురదాజాండఘటిన్ – స్ఫురత్=ప్రకాశించుచున్న, ఆజాండ=బ్రహ్మాండమనెడు, ఘటిన్=ఘటమందు; నిశాతప పయస్సుల్=వెన్నెల యనెడు పాలు; పేరన్=ఘనీభవింపఁగా; పూర్వావనీధరగోపాలతనూజమౌళి – పూర్వావనీధర= తూర్పుకొండ యనెడు, గోపాలతనూజమౌళి= శ్రీకృష్ణుండు; కని=చూచి; తోడ్తన్=వెంటనే; చంద్రమండంబు=చంద్రుఁడను మీఁగడను, 'మణ్డం దధిభవ మ్మస్తు' అని యమరుఁడు; పాపి=కాఁజేసి; రహిన్=ఆసక్తిచేత; తద్దధిఖండము=ఆపెరుగుగడ్డను; ఊఁనెన్ అనన్=వహించెనన్నట్లు; ప్రాగ్దిశాధర=పూర్వదిక్సీమ, కర్త్రి; వాసవహరిత్పద్మావిలాసాబ్జమై – వాసవహరిత్పద్మా= ప్రాచీలక్ష్మికి, విలాసాబ్జమై=లీలారవిందమై; ఒప్పెన్=ప్రకాశించెను; గోపాలతనూజ=రాజపుత్త్రివగు చంద్రికా! కంటివే?

అనఁగా బ్రహ్మాండ మనెడు ఘటమందు వెన్నెల యనుపాలు పేరి చంద్రుండు దానిపై మీఁగడవలె నుండఁగా నుదయశైల మనెడు శ్రీకృష్ణుండు చంద్రుఁడను నామీఁగడను మ్రింగి చేతఁ బుచ్చుకొన్న యాపేరినపెరుఁగుగడ్డను బోలియు, పూర్వదిక్క నెడు లక్ష్మికి విలాసార్థమైన పద్మమును బోలియుఁ, బ్రాగ్దిశావని విలసిల్లెనని భావము. తూర్పున సూర్యోదయసంబంధియైన తెలిచాయ తోఁచె నని ఫలితార్థము. రూపకసంకీర్ణస్వరూపోత్ప్రేక్షాలంకారము.

మ. ఘనమిత్త్రైకవసుప్రతానముల రాఁగశ్రీ గొనం గజ్జలా
భ నఘవ్రాతము చేర గేహకుముదాఁప్తగ్రావధామద్యుధా
మనదీపాళికఁ దాన మంద శుచితం బాటిల్లె నాఁ బాండిమల్
మన దీపాళిక దా నమందగుణసీమా మించె నీక్షింపవే. 131

టీక: అమందగుణసీమా=అధికములైన గుణములకు మేరయైనదానా! దీపాళిక=దీపములచాలు; ఘన మిత్త్రైక వసుప్రతాన ములన్ – ఘన=శ్రేష్ఠములగు, మిత్త్ర=సఖునియొక్క, సూర్యునియొక్క, ఏక=ముఖ్యమగు, వసుప్రతానములన్=ధనముల గుంపులను, కిరణసమూహముల నని యర్థాంతరము; రాగశ్రీన్=లోభసమృద్ధిచేత, శోణకాంతిచేత; కొనన్=హరింపఁగా; కజ్జలాభన్=కాటుక కాంతిచేత; అఘవ్రాతము=పాపసంఘము; చేరన్=పొందఁగా; గేహ కుముదాప్తగ్రావ ధామ ద్యుధామనదీ పాళికన్ – గేహ= గృహసంబంధులగు, కుముదాప్తగ్రావ=చంద్రకాంతమణులయొక్క, ధామ=కాంతియనెడు, ద్యుధామనదీ= స్వర్గంగయొక్క, పాళికన్=ప్రదేశమందు, 'పాళి స్త్ర్యశ్య్రజ్క పఙ్క్తియః' అని యమరుఁడు; తానము=అవగాహనము; అందన్ =పొందఁగా; శుచితన్=శుద్ధతచేత; పాటిల్లె నాన్=ఒప్పెననునట్లు; పాండిమల్=తెల్లఁదనములు; మనన్=వర్ధిల్లఁగా; తాన్; మించెన్=అతిశయించెను; ఈక్షింపవే=చూడుమా.

అనఁగా సూర్యుఁ డనుమిత్త్రునికిరణములనెడు ధనములను హరించినందున, మషీరూపముగాఁ దత్పాపము గలుగఁగా గృహచంద్రకాంతధామస్తోమ మనుగంగాప్రవాహములో దీపావళి స్నానము చేయఁగా గతకల్మషయై వర్తించి నట్లు తెల్లని కాంతులతో రాజిల్లె నని భావము. ప్రభాతమున దీపములు కాంతిహీనము లయ్యె నని ఫలితము. స్వర్ణస్తేయాదులు చేసినవారు గంగాస్నానము చేయఁగాఁ దత్పాపమోచన మగుట ప్రసిద్ధము. సూర్యుండు దనకాంతిని రాత్రి యగ్నియం దుంచి పోవు నని యాగమప్రసిద్ధము. 'రుచిధామ్ని భర్తరి భృశం విమలాః పరలోక మభ్యుపగతే వివిశుః।జ్వలనం త్విషః కథమి వేతరథా సుల భోఽన్యజన్మని స ఏవ పతిః' అని మాఘకావ్యమున వర్ణింపఁబడినది.

మ. తనుమధ్యా గను రోదసిం గముచుజ్యోఁత్స్నావల్లికల్ కల్యవా
తనికాయాహతిఁ దూలఁ ద్రెళ్లెఁ దొలుతం దారప్రసూనవ్రజం

బనవద్యామృతపూరపూరితనవోదారప్రసూనవ్రజం
బున డిందెన్ శశి పత్త్రిమండలరవంబుల్ గ్రమ్మె నల్దిక్కులన్. 132

టీక: తనుమధ్యా=సన్నని నడుముగల ఓ చంద్రికా! రోదసిన్=ద్యావాభూములయందు; కముచు జ్యోత్స్నావల్లికల్= క్రమ్మిన వెన్నెల యను తీవలు; కల్య వాత నికాయాహతిన్ – కల్య=ప్రభాతమందలి, వాత=వాయువులయొక్క, నికాయ=సంఘము యొక్క, ఆహతిన్=కొట్టుటచేత; తూలన్=నేల(బడ(గా; తొలుతన్=మొదలనే; తార ప్రసూనవ్రజంబు=నక్షత్రము లనెడుపూల గుంపులు; త్రెళ్లెన్=వ్రాలెను; శశి=చంద్రు(డు; అనవ ద్యామృత పూర పూరిత నవోదార ప్రసూనవ్రజంబు – అనవద్య=శ్రేష్ఠమగు, అమృత=సుధయొక్క,పూర=ప్రవాహముచేత,పూరిత=నింప(బడినట్టి,నవ=క్రొత్తనైన, ఉదార=ఉత్కృష్టమైన, ప్రసూన=ఫలములయొక్క, వ్రజంబు= సమూహము, 'ప్రసూనం పుష్ప ఫలయోః' అని నామలింగానుశాసనము; అనన్=అనునట్లుగా; డిందెన్=పడెను; పత్త్రిమండలరవంబుల్=పక్షిసంఘముల కూజితములు; నల్దిక్కులన్=చతుర్దిశలందు; క్రమ్మెన్=ఆవరించెను; కను =చూడుము. అన(గా వెన్నెల యను లతలు ప్రభాత మను వాతముచే(దూల(గా రిక్క లను పువ్వులు, చంద్రు(డను పండ్ల గుంపు వ్రాలి పోయె ననియు, ఖగకూజితములు నల్దెసల వ్యాపించె ననియు భావము. అపుడు వెన్నెలయు, రిక్కలును, చంద్రు(డును పోయె నని ఫలితము.

మ. అల పెన్వేగురు(జుక్కపేరియతి దీవ్యత్పాండుభాభూతి మై(
జెలువారంగ(దరోర్జితస్థితి వియత్సీమం జనం గంటివే
చెలువా రంగదరోర్జితస్థితిదినాస్యైకసంధ్యాంశుకూ
టలసచ్ఛాటిక తన్మనుస్ఫురణ వెంటన్ బర్వె(జిత్రంబుగన్. 133

టీక: చెలువా =చంద్రికా! అల పెన్వేగురు(జుక్కపేరియతి=ఆ పెద్దవేగు(జుక్క యనెడు సన్యాసి; దీవ్యత్పాండుభాభూతి = ప్రకాశించుచున్న తెల్లనికాంతి యనెడు భస్మము;మైన్=దేహమందు; చెలువారంగన్=ఒప్పు(గా; తరోర్జితస్థితిన్ – తరః=వేగముచేత, అర్జిత=ఆర్జింప(బడిన, స్థితిన్=సత్తచేత; వియత్సీమన్=గగనప్రదేశమందు; చనన్=పో(గా; తన్మనుస్ఫురణన్ – ఆయన మంత్ర సామర్థ్యముచేత; రంగ దరోర్జితస్థితి దినాస్యై యైక సంధ్యాంశు కూట లసచ్ఛాటిక–రంగత్ = ఒప్పుచున్న, అర = చెఱ(గుల యొక్క, అంచులయొక్క యనుట, ఊర్జితస్థితి=అధికస్థితిగల, ఇది శాటికయం దన్వయించును, దినాస్యీయ= దినాస్యమనగ ప్రభాతము, దినాస్యీయ మన(గా నాప్రభాతమునకు సంబంధించినదని యర్థము, ఏక=ముఖ్యమగు, సంధ్యాంశు=సంధ్యాకాంతు లనెడు, కూట=నెపముగల, లసత్=ఒప్పుచున్న, శాటిక=కాషాయవస్త్రము; చిత్రంబుగన్ =ఆశ్చర్యకరముగ; వెంటన్ = ఆ సన్యాసి వెంటనే; పర్వెన్ = వ్యాపించెను; కంటివే=చూచితివా?

అన(గా వేగు(జుక్క యనెడుయతి తెల్లనికాంతి యనెడు భస్మము పూసికొని, వేగముగ(బో(గా, నాయనమంత్రసామర్థ్యమున(దదీయశాటివలె నెఱ్ఱనికాంతిపుంజము ప్రసరించె నని భావము. సూర్యోదయమునకు ముందు వేగు(జుక్క పోయిన వెనుక నెఱ్ఱనికాంతి ప్రసరించె నని ఫలితము.

మ. ననుచున్ మోదము కోకవిప్రతతి చంద్రద్యోతరాజీవలో
కన మెల్లన్ జన జోడు గూడి నిలువం గంగొమ్ము రాజీవలో

కనికారేక్షణ నాళభూమివరసంఘాతంబు రాజీవలో
కనమౌకుళ్యము జాఱ మేలుకనియెన్ గాసారశయ్యాస్థలిన్. 134

టీక: రాజీవలోకనికారేక్షణ – రాజీవలోక=మత్స్యగణమును, నికార=తిరస్కరించు, ఈక్షణ=చూపులుగలదానా! కోకవిప్రతతి = చక్రవాకము లను బ్రాహ్మణులగుంపు; చంద్రద్యోతరాజీవలోకనము – చంద్రద్యోత=వెన్నెలయొక్క, రాజీ=పంక్తియొక్క, వలోకనము=దర్శనము;ఎల్లన్=అంతయు; చనన్=పోఁగా; జోడుగూడి=జతగూడి; నిలువన్=నిలిచియుండఁగా; నాళభూమి వరసంఘాతంబు =బిసము లను రాజులగుంపు; రాజీవలోకనమౌకుళ్యము =పద్మము లనెడు లోచనములయొక్క నిమీలనము; జాఱన్=పోఁగా; కాసారశయ్యాస్థలిన్=కొలఁ కనెడు పాన్పుపైని; మేలుకనియెన్=మేల్కాంచెను; కన్ గొమ్ము = కాంచుము; మోదము =సంతసమును; ననుచున్=వృద్ధిఁ బొందించును.

అనఁగా విప్రులు జతగూడి యెదుట నిలిచియుండఁగా రాజబృందము పాన్పుపై నిద్ర లేచి కన్నులు దెఱచినట్లు కొలఁకుల యందుఁ జక్రవాకములు జతగూడి యెదుట నుండఁగా బిసములు పద్మములను వికసింపఁ జేసె ననుట. అపుడు పద్మములు వికసిల్లె ననియు, వాని యెదుటఁ జక్రవాకమిథునము లుండె ననియు భావము. 'కన్యాగౌ ర్భేరి శఙ్ఖం దధి ఫల కుసుమం పావకం దీప్యమానం యానంవా విప్రయుగ్మమ్' అనుటచేత విప్రయుగ్మదర్శనము మంగళ మని రాజు లట్లొనరించుట ప్రసిద్ధము.

మ. అమలాంగీమణి కాంచు వేళ యనునైజాప్తాళి మేల్ నేర్పునం
గమలాగారముఁ దా రయాత్మ నలరంగావింపఁ గా నచ్చటం
గమలాగార ముదారసంబు మదిఁ బొంగం గొల్వు గూర్చుండె ను
త్తమభృంగీమిషగాయికావితతి గీతవ్రాతముల్ వాడఁగన్. 135

టీక: అమలాంగీమణి = స్వచ్ఛమైన తనువుగలవారిలో శ్రేష్ఠురాలవైన ఓచంద్రికా! కమలాగార=పద్మాలయ యగులక్ష్మీదేవి; వేళ యనునైజాప్తాళి–వేళ యను=ప్రభాతసమయ మను, నైజ=స్వీయమగు, ఆప్తాళి=సఖీవర్గము; మేల్ నేర్పునన్=మంచి చాతుర్యముచేత; కమలాగారమున్ = పద్మమను గృహమును; తాన్; రయాత్మన్=వేగిరపడు చిత్తముచేత; అలరన్=ఒప్పునట్లు; కావింపఁగాన్=చేయఁగా; అచ్చటన్=అచ్చోట; ఉత్తమభృంగీమిషగాయికావితతి = శ్రేష్ఠమగు నాఁడుతుమ్మెదలనెడు నెపము గల గానము చేయు స్త్రీసమూహము; గీతవ్రాతముల్= అనేకములగు పాటలను; పాడఁగన్ = పాడుచుండఁగా; ముదారసంబు = సంతోషరసము; మదిన్=మనమందు; పొంగన్=ఉప్పొంగఁగా;కొల్వుగూర్చుండెన్=కొలువై యుండెను; కాంచు=చూడుము.

అనఁగాఁ బ్రభాతవేళ యనెడు చెలియ కమలమనెడు గృహము నొప్పునట్లొనరింపఁగా నందు లక్ష్మీదేవి కొలువై యుండె ననియు, నచట నాఁడుతుమ్మెదలు మ్రోయుచుండఁగా గాయకస్త్రీలు గానము సేయునట్లుండె ననియు భావము. కమలములు వికసింపఁగానె యందు సిరి యొప్పారు ననుట తెల్లము.

చ. హరినిలయంబు తూర్పుదెసయై మనుటన్ సమయాఢ్యమౌళి వి
స్ఫురితతదంతికోచ్చతరపూర్వబలాహకకూట భూరిగో
పురమునఁ గైశ్యగుప్తసమపూర్వబలాహకకూటభూరిగో
వరమిషరీతి నిల్పె ననివార్యమణీకలశంబుఁ గాంచితే. 136

టీక: కైశ్యగుప్తసమపూర్వబలాహకకూట = కొప్పుచే రక్షింపఁబడిన క్రొత్తమబ్బుగమిగలదానా! మబ్బుకన్న మిన్నయగు నీలిమగల కొప్పుగలదానా యనుట; హరినిలయంబు = ఇంద్రనివాసస్థానమైన పురము; తూర్పుదెసయై=తూర్పుదిక్కయి; మనుటన్=వర్ధిల్లుటచేత; సమయాఢ్యమౌళి =ప్రాతఃకాలమనెడు ప్రధానశ్రేష్ఠుఁడు; విస్ఫురితతదంతికోచ్చతరపూర్వబలాహక కూట భూరిగోపురమునన్ – విస్ఫురిత=ప్రకాశించుచున్న, తదంతిక=ఆనగరసమీపమందలి, ఉచ్చతర=మిగుల గొప్పది యైన, పూర్వబలాహక=తూర్పుకొండయొక్క, కూట=శిఖరమనెడు, భూరి=స్వర్ణమయమగు,గోపురమునన్=ఊరివాకిటి యందు, 'పురద్వారంతు గోపురమ్' అని యమరుఁడు; భూరిగోవరమిషరీతిన్ – భూరి=అధికమగు, గోవర=సూర్యుఁడ నెడు, మిషరీతిన్=నెపముచొప్పున; అనివార్యమణికలశంబున్—అనివార్య=నివారింప నలవికాని, అధికమైన యనుట, మణి కలశంబున్=మణిమయమగు కలశమును; నిల్పెన్=ఉంచెను; కాంచితే=చూచితివా?

అనఁగా సూర్యుఁ డుదయించె ననియు, నతఁ డుదయగిరిశిఖరమున నుండినవాఁడై తూర్పున నున్న యింద్రపురిద్వారముపైఁ బ్రాతఃకాల మనెడుప్రధానునిచే నిలుపఁబడిన మణికలశమునుబోలి యుండె ననియు భావము.

తే. అనుచుఁ జెలి విన్నవింప న॰య్యంబుజాక్షి, చారుసుమశయ్య డిగ్గి త॰త్సమయకృత్య
మెల్లఁ గావించి, గురు భజి॰యించి రవికు,లోత్తము వరించుతఱిఁ గోరు॰చుండె నంత. 137

టీక: అనుచున్=ఇట్లనుచు; చెలి=సఖి; విన్నవింపన్=విజ్ఞాపింపఁగా; అయ్యంబుజాక్షి=ఆచంద్రిక; చారుసుమశయ్యన్ = మనోహరమగు విరిసెజ్జను; డిగ్గి=దిగి; తత్సమయకృత్యము=ఆప్రాతఃకాలోచితమగు కార్యమును; ఎల్లన్=అంతయును; కావించి=చేసి; గురున్ భజియించి = గురుసేవ చేసి; రవికులోత్తమున్=సూర్యవంశతిలకుఁడైన సుచంద్రుని; వరించుతఱిన్ =పెండ్లియాడుసమయమును; కోరుచున్ ఉండెన్= అది యెపుడు ఘటిల్లునో యని ప్రార్థించుచుండె ననుట; అంతన్ – దీనికి ముందరి కన్వయము.

ఆశ్వాసాంతపద్యములు

మ. సతతానందితనంద! నందనవనీ॰సంచారజాగ్రత్ప్రియో
ద్ధతకౌతూహలకంద! కందసుషమో॰దారాంగసాక్షాత్క్రియా
రతినందన్ముచికుంద! కుందరదనా॰రత్నాంఘ్రిలాక్షాంకగుం
భితవక్షస్స్ఫిడమంద! మందరధరా॰భృద్భూరిభారాంచితా! 138

టీక: సతతానందితనంద=ఎల్లప్పుడు సంతసింపఁజేయఁబడిన నందుఁడు గలవాఁడా! నందనవనీసంచారజాగ్రత్ప్రియోద్ధత కౌతూహలకంద – నందనవనీ=నందనవనముయొక్క, సంచార=సంచారముచేత, జాగ్రత్=నిస్తంద్రమైన, ప్రియా=సత్య భామయొక్క, ఉద్ధత=మిక్కుటమగు, కౌతూహల=సంతసమునకు, కంద=కారణమగువాఁడా! కందసుషమోదారాంగ సాక్షాత్క్రియారతినందన్ముచికుంద—కంద=మేఘముయొక్క, సుషమా=పరమశోభవంటి శోభచేత, ఉదార=ఉత్కృష్ట మగు, అంగ=శరీరముయొక్క, సాక్షాత్క్రియా=ప్రత్యక్షకరణమందలి, రతి=ఆసక్తిచేత, నందత్=సంతసించుచున్న, ముచి కుంద=ముచికుందుఁడను భక్తుఁడుగలవాఁడా! కుందరదనారత్నాంఘ్రిలాక్షాంకగుంభితవక్షస్స్ఫిడమంద – కుందరదనారత్న= స్త్రీరత్నమగు లక్ష్మీదేవియొక్క, అంఘ్రిలాక్షాంక=పాదములందలి లత్తుకగుర్తులచేత, గుంభిత=కూర్పఁబడిన, వక్షః=ఉరము

యొక్క, త్విట్=కాంతిచేత, అమంద=అధికుఁడయినవాఁడా! మందరధరాభృద్భూరిభారాంచితా– మందరధరాభృత్= మందరపర్వతముయొక్క, భూరి=అధికమైన, భార=భారముచేత, అంచితా=ఒప్పెడివాఁడా! ఈకృతిపతి సంబోధనములకు నుత్తరపద్యములందలి తత్సంబోధనములకు నాశ్వాసాంతగద్యముతో నన్వయము. ముక్తపదగ్రస్తాలంకారము.

క. చక్రప్రహరణ! రక్ష,శ్చక్రప్రహరణవిహార! ౹సారంగద్వి
ణ్ణక్రప్రమథన! జ్ఞానా,వక్రప్రమథనతశంభు౹వర్ణితవిభవా! 139

టీక: చక్రప్రహరణ=చక్రమే యాయుధముగాఁ గలవాఁడా! రక్షశ్చక్రప్రహరణవిహార = రాక్షసులసమూహముయొక్క సంహారమే విహారముగాఁ గలవాఁడా! సారంగద్విణ్ణక్రప్రమథన– సారంగద్విట్ = గజద్వేషి యగు, నక్ర= మొసలికి, ప్రమథన = సంహర్త యగువాఁడా! జ్ఞానావక్రప్రమథ నత శంభు వర్ణిత విభవా– జ్ఞాన=జ్ఞానముచేత, అవక్ర=సరళులగు, ప్రమథ=ప్రమథులచేత, నత = మ్రొక్కఁబడిన, శంభు=శివునిచేత, వర్ణిత=వర్ణింపఁబడిన, విభవా=వైభవముగలవాఁడా! శివుఁడు విష్ణువల్లభుఁడు గానఁ దద్విభవమును నుతించు ననుట.

ఉత్సాహ. వారణప్రభూతదంత౹వైరిదోర్విసారణా!
సారణాంకమౌనిరాజ౹చక్రతోషకారణా!
కారణప్రభాతిఘోర౹కంసమల్లమారణా!
మారణద్దనుప్రభూత౹మండలీనివారణా! 140

టీక: వారణ ప్రభూత దంత వైరి దోర్విసారణా—వారణ=కువలయాపీడ మను గజముయొక్క, ప్రభూత=గొప్పలగు, దంత = దంతములకు, వైరి=శత్రువులగు, దోర్విసారణా=భుజప్రసారణముగలవాఁడా! సార ణాంక మౌనిరాజచక్ర తోష కారణా– సార= శ్రేష్ఠమగు, ణ=జ్ఞానమే, అంక=చిహ్నముగాఁగల, మౌనిరాజచక్ర=మునిశ్రేష్ఠమండలియొక్క, తోష=సంతసమునకు, కారణా=హేతువైనవాఁడా! 'ణం సరోజదళే జ్ఞానే నేత్రేషు నిస్తలవస్తుని' అని రత్నమాల; కారణప్రభాతిఘోర కంసమల్ల మారణా –కారణ=కరణసంబంధియగు, ప్రభా=కాంతిచేత, అతిఘోర=మిగుల భయంకరుఁడగు, కంసమల్ల=చాణూరునకు, మారణా =సంహర్తయైనవాఁడా! మా రణ ద్దనుప్రభూత మండలీ నివారణా– మా=లక్ష్మిచేత, రణత్=ధ్వనించుచున్న, సంపత్సమృద్ధులైన యనుట, దనుప్రభూత=దనుజులయొక్క, మండలీ=గుంపునకు, నివారణా=నివారకుఁడా! పాదసంధియమకవిశేషము.

గద్యము: ఇది శ్రీమదనగోపాలప్రసాదసమాసాదితోభయభాషాకళాకళత్ర రేచర్లగోత్రపవిత్ర
సురభిమల్లక్షమాపాలసత్పుత్ర కవిజనవిధేయ మాధవరాయప్రణీతం బైన
చంద్రికాపరిణయంబను మహాప్రబంధంబునందుఁ జతుర్థాశ్వాసము.

గద్యము. ఇది శ్రీసతీరమణకరుణాసమాసాదితసర్వసౌభాగ్యభాగ్యనగరమహారాజ్యసంకలిత శ్రీజటప్రోలుసంస్థానప్రాజ్య
ప్రాజ్యసకలసామ్రాజ్య శ్రీ రేచర్లగోత్రపవిత్ర కవిజనగేయ శ్రీవేంకటజగన్నాథరాయసత్పుత్ర సత్సంప్రదాయ
శ్రీసురభి వేంకటలక్ష్మణరాయ పరిపోష్య సరసవైదుష్య తదాస్థానతలమండిత శేషసదాశివపండిత
విరచిత శరదాగమసమాఖ్యవ్యాఖ్యయందుఁ జతుర్థాశ్వాసము

శ్రియై నమః

శ్రీలక్ష్మీనరసింహాయ నమః

చంద్రికాపరిణయము-సవ్యాఖ్యానము

పంచమాశ్వాసము

క. సుభగంభావుకఘనకౌ
స్తుభ! సాధ్వవనసహకృత్వ◊దుర్దమచక్రా!
ప్రభవాసురసర్వంకష
విభవమ్మన్యప్రతాప◊వృత! గోపాలా! 1

టీక: సుభగంభావుకఘనకౌస్తుభ – సుభగంభావుక=మనోజ్ఞమగు, ఘనకౌస్తుభ=ఉత్కృష్టమగు కౌస్తుభమణిగలవాఁడా! సాధ్వవనసహకృత్వదుర్దమచక్రా – సాధు=సత్పురుషులగు మున్యాదులయొక్క, అవన=రక్షణమందు, సహకృత్వ=సహాయమగు, దుర్దమచక్రా=అడఁపరాని చక్రముగలవాఁడా! ప్రభవాసురసర్వంకష విభవమ్మన్యప్రతాపవృత – ప్రభవ = సమర్థులగు, అసుర=రాక్షసులకు, సర్వంకష=నాశకమగు, విభవమ్మన్య=విభవమునుగాఁ దన్నుఁ దలఁచెడి, ప్రతాప=పరాక్రమముచేత, వృత=కూడుకొన్నవాఁడా! గోపాలా= శ్రీమదనగోపాలస్వామీ!
ఈకృతిపతి సంబోధనమునకు 'చిత్త గింపు' మను నుత్తరపద్యస్థక్రియతో నన్వయము.

తే. చిత్తగింపుము శౌనకా◊ద్యుత్తమర్షి
సమితి కిట్లను రోమహ◊ర్షణతనూజుఁ
డువిద తద్రాజచంద్రైక◊వివరిషావి
ధానపాణింధమాత్మచేఁ ◊దనరునపుడు. 2

టీక: చిత్తగింపుము = ఆకర్ణింపుము; శౌనకాద్యుత్తమర్షిసమితికిన్ = శౌనకుఁడు మొదలగు శ్రేష్ఠులగు మునిసంఘమునకు; రోమహర్షణతనూజుఁడు = సూతుఁడు; ఇట్లనున్=వక్ష్యమాణప్రకారముగాఁ బలుకును; ఉవిద=చంద్రిక; తద్రాజచంద్రైకవివరిషావిధానపాణింధమాత్మచేన్–తద్రాజచంద్ర=ఆసుచంద్రునియొక్క, ఏక=ముఖ్యమగు, వివరిషా=వరియించు నిచ్ఛయొక్క, విధాన=ప్రకారమునకు, పాణింధమ=జ్ఞాపకమగు, 'ఉగ్రమ్పశ్యేరమ్మదపాణింధమాశ్చ' దీన నీరూపమగు, ఆత్మచేన్=మానసముచేత; తనరునపుడు = ఒప్పుసమయమునందు; దీని కుత్తరపద్యస్థక్రియతో నన్వయము.

మ. సుతతారుణ్యశుభోదయస్థితి తద◊స్తోకాశయాలంబితే
హితము న్బోటులచే నెఱింగి, తదమూ◊ల్యేష్టార్థసంసిద్ధికై
చతురత్వంబునఁ దత్స్వయంవరవిధిన్ ◊జాటింపఁ బంచెన్ భట
ప్రతతి న్వేక్షణదోదయేశ్వరుఁ డతి◊ప్రహ్లత్తిలిప్తాత్ముఁడై. 3

టీక: క్షణదోదయేశ్వరుఁడు=క్షణదోదయరాజు; అతిప్రహ్లత్తిలిప్తాత్ముఁడై=అత్యానందముచేఁ బూయఁబడిన చిత్తముగలవాఁడై, సుతతారుణ్యశుభోదయస్థితిన్—సుత=కొమార్తెయగు చంద్రికయొక్క, తారుణ్య=యౌవనముయొక్క, శుభోదయ=శుభ మగు నావిర్భావముయొక్క, స్థితిన్=ఉనికిని; తదస్తోకాశయాలంబితేహితమున్ – తత్=ఆచంద్రికయొక్క, అస్తోక=అధిక మగు, ఆశయ=అభిప్రాయమందు, 'అభిప్రాశ్ఛన్ద ఆశయః' అని యమరుఁడు,ఆలంబిత=లగ్నమగు, ఈహితమున్=కోరి కను; బోటులచేన్=స్త్రీలచేత; ఎఱింగి=తెలిసికొని; తదమూల్యేష్టార్థసంసిద్ధికై – తత్=ఆచంద్రికయొక్క, అమూల్య=వెలలేని, ఇష్టార్థ=మనోరథముయొక్క,సంసిద్ధికై=ప్రాప్తికొఱకు; చతురత్వంబునన్=నేర్పుతోడ; తత్స్వయంవరవిధిన్ – తత్= ఆ చంద్రికయొక్క, స్వయంవర=స్వయంవరముయొక్క, విధిన్= విధానమును; చాటింపన్=చాటించుటకై, వే=శీఘ్రముగా; భట=బంట్లయొక్క, ప్రతతిన్=సమూహమును; పంచెన్=ఆజ్ఞాపించెను.

క్షణదోదయరాజు తనకొమార్తె యగు చంద్రికయొక్క యిష్టార్థమును, ఆపెయౌవనావిర్భావమును, స్త్రీలవలనఁ దెలిసికొని స్వయంవరమునకై యత్నించి చాటింప భటులం బంచెనని భావము.

చ. ధరణీనాథభటచ్ఛటాముఖరితో౯ద్యచ్చంద్రికైకస్వయం
వరకర్ణేజపడిండిమాదికమహా౯వాదిత్రనాదంబు దు
స్తరమై యత్తఱిఁ బొల్చె నద్భుతగతి౯సప్తార్ణవీమధ్యభూ
వరకోటీపుటభేదనౌఘవిశిఖా౯వల్గుప్రఘాణంబులన్. 4

టీక: ధరణీనాథ భటచ్ఛటా ముఖరి తోద్య చ్చంద్రికైక స్వయంవర కర్ణేజప డిండిమాదిక మహావాదిత్ర నాదంబు – ధరణీనాథ= క్షణదోదయునియొక్క, భటచ్ఛటా=బంట్లగుంపుచే, ముఖరిత=మ్రోయింపఁబడినట్టియు, ఉద్యత్=ప్రకాశించుచున్నట్టియు, చంద్రికా=చంద్రికయొక్క, ఏక=ముఖ్యమగు, స్వయంవర=స్వయంవరోత్సవమునకు, కర్ణేజప=సూచకమగు, ఇచట 'స్తమ్బ కర్ణయోరమిజపోః' అని యచ్ప్రత్యయము, 'తత్పురుషే కృతి బహుళ' మని విభక్తిలోపము లేదు, డిండిమాదిక=డిండిమము మొదలుగాఁగల, మహావాదిత్ర=అధికమగు నాతోద్యముయొక్క, 'వాదిత్రాతోద్యనామక' మని యమరుఁడు, నాదంబు=ధ్వని; సప్తార్ణవీ మధ్య భూవర కోటీ పుటభేద నౌఘ విశిఖా వల్గు ప్రఘాణంబులన్ – సప్తార్ణవీ=ఏడుసముద్రములయొక్క, సప్తానా మర్ణ వానాం సమాహారః అను విగ్రహమునందు 'అకారాంతోత్తరపదోద్విగుస్త్రియా మిష్టః' అను వార్తికమువలన స్త్రీత్వము, టిడ్ఢాణ ఞిత్యాదిసూత్రమువలన స్త్రీప్రత్యయము వచ్చినదని యెఱుంగునది, మధ్య=మధ్యభాగమునందున్న, భూవర=రాజులయొక్క, కోటీ=సమూహముయొక్క, పుటభేదన=పట్టణములయొక్క, ఓఘ=సంఘముయొక్క, విశిఖా=రాజమార్గములందలి, వల్గు =సుందరమగు, ప్రఘాణంబులన్=అళిందములయందు; అద్భుతగతిన్=అత్యాశ్చర్యమగురీతిచేత; దుస్తరమై=అధికమైనదై; అత్తఱిన్=ఆసమయమందు; పొల్చెన్=ఒప్పెను.

క్షణదోదయరాజభటులచే మ్రోయింపఁబడిన స్వయంవరసూచకమగు డిండిమారవము సప్తసముద్రముల మధ్యమున నుండు భూపతుల ప్రఘాణములందు నొప్పె ననిభావము. రాజధానులయం దంతటను డిండిమములు మ్రోయించిరని ముఖ్యా శయము.

మ. శ్రవణాభ్యుత్సవపోషయిత్నుసముదం౯చద్భూరిభేరీసము
ద్భవభాంకారము లప్డు మేల్కొన నద౯భ్రప్రావృషేణ్యాంబుదా

రవభంగి న్సుమకాండకోదయసమ◊గ్రత్వంబు చాలం దలం
ప విచిత్రం బొకొ చిత్తవీథి నవనీ◊పశ్రేణికిం జేరుటల్. 5

టీక: శ్రవ ణాభ్యుత్సవ పోషయిత్ను సముదంచ ద్భూరి భేరీ సముద్భవ భాంకారములు – శ్రవణ=వీనులకు, అభ్యుత్సవ=ఆనందమును, పోషయిత్ను=పోషించునట్టి, సముదంచత్=మిక్కిలి యొప్పుచున్న, భూరి=విశాలమగు, భేరీ=దుందుభులవలన, సముద్భవ=పుట్టినట్టి, భాంకారములు =భాం అనెడు ధ్వనులు; అప్డు=ఆసమయమందు; మేల్కనన్=మేలుకొనఁగా; అదభ్ర ప్రావృషేణ్యాంబుదారవ భంగిన్ – అదభ్ర=అధికమగు, ప్రావృషేణ్య=వర్షాకాలమందుఁ బుట్టిన, 'ప్రావృష ఏణ్యః' అని ఏణ్య ప్రత్యయము, అంబుద=మేఘములయొక్క, ఆరవ=ధ్వనులయొక్క, భంగిన్=రీతిచేత; సుమకాండకోదయసమగ్రత్వంబు – సుమకాండక=పుష్పసముదాయముయొక్క, ఉదయ=ఆవిర్భావముయొక్క, సమగ్రత్వంబు=పరిపూర్ణత; నవనీపశ్రేణికిన్— నవ=క్రొత్తనగు, నీప=కడిమిచెట్లయొక్క, శ్రేణికిన్=పంక్తికి; చేరుటల్=పొందుటలు; చిత్తవీథిన్=హృదయమందు; తలంపన్=ఆలోచింపఁగ; చాలన్=మిక్కిలి; విచిత్రం బొకొ=విచిత్రమా? కాదనుట. ఇచట, అవనీపశ్రేణికిన్ – అవనీప=రాజులయొక్క, శ్రేణికిన్=సమూహమునకు; సుమకాండ కోదయ సమగ్రత్వంబు – సుమకాండక=పూఁదూపులుగల వలఱేనియొక్క, ఉదయ =ఆవిర్భావముయొక్క, సమగ్రత్వంబు=పరిపూర్ణత; చేరుటలు చిత్రము గాదని స్వభావార్థము.

అనఁగా వర్షాకాలిక మేఘగర్జితశ్రవణము కాఁగానే కడుములకుఁ గుసుమములు గలిగినట్లు స్వయంవరోత్సవసూచకమగు భేరీనినాదము చెవిసోఁకగానే భూపతులకు మన్మథావేశము గలిగె నని భావము.

చ. కమలశరుండు ప్రాప్తకట◊కాముఖవైఖరి నిక్షుచాపవ
ర్యము గొని కూర్చు భంభరగు◊ణారవ మెంతయు నాత్మనా ద్వితీ
య మయి యెసంగ దేశవసు◊ధాధిపముఖ్యపురీలలామబృం
దములఁ జెలంగెఁ దత్పటహ◊నవ్యగభీరనినాద మత్తఱిన్. 6

టీక: త త్పటహ నవ్య గభీర నినాదము – తత్=ఆస్వయంవరోత్సవసంబంధి యగు, పటహ= భేరియొక్క, నవ్య=నూతనమగు, గభీర=గంభీరమగు, నినాదము=ధ్వని; అత్తఱిన్=ఆసమయమందు; కమలశరుండు=మరుఁడు; ప్రాప్తకటకాముఖ వైఖరిన్ –ప్రాప్త=పొందఁబడిన, కటకాముఖ=నడిమివ్రేళ్లసందున బొటనవ్రేలు చొప్పించి యఱచేతిచాయ వ్రాల్చి యుంగరపు వ్రేలిని చిటికెనవ్రేలిని నించుకంతవంచి పొడవుగా పట్టిన హస్తవిశేషముయొక్క, వైఖరిన్=రీతిచేత; నిక్షుచాపవర్యము =మేలగు చెఱకువింటిని; కొని=గ్రహించి; కూర్చు భంభరగుణారవము=జతపఱచు తుమ్మెదయల్లెత్రాటి మ్రోఁత; ఎంతయున్=మిక్కిలి; ఆత్మనా ద్వితీయము అయి = తనచేత రెండవదై, 'ఆత్మనశ్చ పూరణే' అని తృతీయకు లుక్కు లేదు; ఎసంగన్= అతిశయింపఁగ; దేశ వసుధాధిప ముఖ్యపురీలలామ బృందములన్ – దేశ=దేశమునందలి, వసుధాధిప=రాజులయొక్క, ముఖ్యపురీ లలామ= రాజధానీశ్రేష్ఠములయొక్క, బృందములన్=సమూహములందు; చెలంగెన్=ఒప్పెను.

మ. మును తాతస్తతలోకవాగమృతసం◊భూతిం గడుం జంద్రికా
వనితామోహముఁ గాంచి మన్మథశర◊జ్వాలావళిం గుందు వి

శ్వనరాధీశ్వరకోటికిం ద్వర యిడె న్స్వాంతప్రియంభావుకా
తనుతద్ఘోషము తత్స్వయంవరముఁ జెందం బోవ నప్పట్టునన్. 7

టీక: మును=పూర్వమందు; తాతస్తతలోకవాగమృతసంభూతిన్ – తాతస్తత=అచ్చటచ్చటనుండి వచ్చిన, ఇచట 'తత ఆగతః' అని అణ్ ప్రత్యయము. 'అవ్యయానాం భమాత్రే టిలోపః' అని టిలోపము వచ్చినది, లోక=జనులయొక్క, వాగమృత=సుధ వంటి వచనమువలన, సంభూతిన్=పుట్టుకగల; కడున్=అధికమగు; చంద్రికావనితామోహమున్ – చంద్రికావానితా=చంద్రిక యనెడు స్త్రీయందలి, మోహమున్=వలపును; కాంచి=పొంది; మన్మథశరజ్వాలావళిన్ – మన్మథశర=మరుతూపులయొక్క, జ్వాలా=మంటలయొక్క, ఆవళిన్=పంక్తిచే; కుందు విశ్వ ధరాధీశ్వర కోటికిన్ – కుందు=పరితపించు, విశ్వ=ప్రపంచము నందలి, ధరాధీశ్వర=భూపతులయొక్క, కోటికిన్=సమూహమునకు; స్వాంత ప్రియంభావుకాతను తద్ఘోషము – స్వాంత= చిత్తములకు, ప్రియంభావుక=ప్రియమగు, అతను=అధికమగు, తద్ఘోషము=ఆస్వయంవరసూచకమగు భేరీనాదము; తత్స్వ యంవరమున్=ఆచంద్రికాస్వయంవరమును; చెందన్ పోవన్=చేరఁబోవుటకు; అప్పట్టునన్=ఆసమయమందున; త్వర = వేగిరపాటును; ఇడెన్=ఇచ్చెను. అనఁగా నచ్చటచ్చటనుండి వచ్చుచున్న జనులవలన క్షణదోదయరాజకుమారిక యగు చంద్రికయొక్క చక్కఁదన మును విని, వలపు చెందియుండిన రాజు లాచంద్రికాస్వయంవరమహోత్సవసూచకమగు భేరీనాద మును విని సంతసించి, యా స్వయంవరోత్సవమునకుఁ బోవ నుద్యమించి రని భావము.

మ. వరభంభాకులనిస్వనప్రతతి నవ్వామావతంసస్వయం
వరభద్రోన్నతి యెయ్యెడ న్దెలిసెనో వైళంబె యవ్వేళ న
వ్యరతిశ్రీగతి నేగఁగాఁ దొడఁగె విశ్వారాట్కులం బౌర యు
ర్వర నేమంచు నుతింపవచ్చు జలజాస్త్రస్ఫీతమాయావిధిన్. 8

టీక: వర భంభాకుల నిస్వన ప్రతతిన్ – వర=శ్రేష్ఠమగు, భంభాకుల=భంభ యను ధ్వనిచయముగల, నిస్వన=ధ్వనులయొక్క, ప్రతతిన్=సమూహముచేత; అవ్వామావతంస స్వయంవరభద్రోన్నతి – అవ్వామావతంస=నారీశ్రేష్ఠయగు నాచంద్రికయొక్క, స్వయంవరభద్ర=స్వయంవరమంగళముయొక్క, ఉన్నతి=అతిశయము; ఎయ్యెడన్=ఏవేళ; తెలిసెనో; వైళంబె=శీఘ్రముగ; అవ్వేళన్=ఆవేళయందే; నవ్య రతి శ్రీ గతిన్ – నవ్య=నూతనమగు, రతి=అనురాగముయొక్క, శ్రీ=సంపదయొక్క, అనఁగ ననురాగాతిశయముయొక్క యనుట, గతిన్=ప్రాప్తిచేత; విశ్వారాట్కులంబు=నరపతిసమూహము, 'విశ్వస్య వసురాటోః' అను సూత్రమువలన విశ్వశబ్దమునకు దీర్ఘమని తెలియునది; ఏగఁగాన్=పోవుటకు; తొడఁగెన్=ప్రయత్నించెను; ఔర=ఆశ్చ ర్యము; జలజాస్త్ర స్ఫీత మాయావిధిన్—జలజాస్త్ర=మన్మథునియొక్క, స్ఫీత=అధికమగు, మాయావిధిన్=మాయావిధాన మును; ఉర్వరన్=భూమియందు; ఏమంచున్=ఏమనుచు; నుతింపవచ్చున్= కొనియాడవచ్చును?

అనఁగా స్వయంవరోత్సవసూచకమగు భేరీనాదము వినినతోడనే నరపతిసంఘము చంద్రికయం దనురాగముఁ బూని యాయుత్సవమునకుఁ బోవ నుపక్రమించెను. అహహ! మన్మథునిమాయ నేమని కొనియాడవచ్చు నని భావము.

చ. నెలఁత వరించుఁ దమ్మిదియె నిక్కమటంచుఁ దలంచి వేడుక
న్గలసి పయోజబాణజయకారణరూపసహాయత న్విరా

జిలు సకలాంతరీపనృపశేఖరు లెల్లఁ బ్రయాతుకాములై
వెలలిరి దంతిచక్రపదవీతిపదాతిసమూహసంవృతిన్. 9

టీక: నెలఁత=చంద్రిక; తమ్మున్; వరించున్=కోరును; ఇదియె నిక్కము=ఇదియే నిశ్చయము; అటంచున్=అనుచు; తలంచి =ఎంచి; వేడుకన్=సంతసముచేత;పయోజబాణజయ కారణ రూప సహాయతన్ – పయోజబాణజయ=మన్మథజయము నకు, కారణ=హేతువగు, రూప=చెలువముయొక్క, సహాయతన్=తోడ్పాటుచేత; విరాజిలు సక లాంతరీపనృపశేఖరు లెల్లన్ –విరాజిలు =ప్రకాశించుచున్న, సకల=సమస్తమగు, అంతరీపనృపశేఖరులు=ద్వీపాంతరాధిపతులగు రాజశ్రేష్ఠులు, ఎల్లన్= అందఱును; ప్రయాతుకాములై = పోనిచ్ఛగల్గినవారై, 'తుం కామ మనసోరపి' అనుదానివలన తుమున్న కారమునకు లోపమని యెఱుఁగునది; దంతి చక్రపద వీతి పదాతి సమూహ సంవృతిన్ – దంతి=ఏనుఁగులయొక్క, చక్రపద=రథములయొక్క, వీతి= గుఱ్ఱములయొక్క, పదాతి=కాల్బ లముయొక్క, సమూహ=గుంపుయొక్క, సంవృతిన్=కూడికచేతను; కలసి=కూడి; వెల లిరి = బయలుదేఱిరి.

అనఁగా నీచంద్రిక తమనే వరించునని నమ్మి సంతసముతో మన్మథుని నిరసించు నందము గల సకలద్వీపాధిపతులగు రాజులు సేనలతోఁ గూడి వెడలి రని భావము.

మ. సకి యెవ్వాని వరించిన న్నిజశితాస్త్రవ్యాజవాతంధయా
శికిఁ దజ్జీవసమీరపానమును హాళి న్జేర్చి యాతామ్రకం
జకర న్గైకొని వత్తు మంచుఁ దలఁపెచ్చన్ గొంద ఱుర్వీశపు
త్త్రకు లేతెంచిరి లేఖవర్ణ్యపృతనావ్రాతంబు సేవింపఁగన్. 10

టీక: కొందఱు ఉర్వీశపుత్త్రకులు = కొంతమంది రాజకుమారులు; సకి=చంద్రిక; ఎవ్వానిన్=ఎవనిని; వరించినన్=కోరినను; నిజ శితాస్త్ర వ్యాజ వాతంధయాళికిన్ – నిజ=తమసంబంధులగు,శిత=తీక్ష్ణములైన, అస్త్ర=బాణము లనెడు, వ్యాజ=కపటము గల, వాతంధయ=సర్పములయొక్క, ఆళికిన్=సమూహమునకు; తజ్జీవసమీరపానమును – తత్=వారలయొక్క, జీవసమీర = ప్రాణవాయువుయొక్క, పానమును=త్రాఁగుటను; హాళిన్=ఆసక్తిచే; చేర్చి=కూర్చి; ఆతామ్రకంజకరన్ = ఎఱ్ఱదామరవంటి హస్తముగల యాచంద్రికను;కైకొని=తీసికొని;వత్తు మంచున్=వచ్చెద మని; తలఁపు=కోరిక; ఎచ్చన్=అతిశయింపఁగ; లేఖ వర్ణ్య పృతనా వ్రాతంబు – లేఖ=దేవతలచే, వర్ణ్య=పొగడఁదగిన, పృతనా=సేనయొక్క, 'పృతనానీకినీ చమూః' అని యమ రుఁడు, వ్రాతంబు=సమూహము;సేవింపఁగన్=కొలువఁగ; ఏతెంచిరి=వచ్చిరి. అనఁగఁ గొందఱు రాజపుత్త్రులు చంద్రిక యెవని వరించినను, వాని ప్రాణవాయువులను మాబాణము లను సర్పములకుఁ ద్రాగించి, యనఁగా వానిని హింసించి యైనను నామెను దీసికొని వత్తు మని స్వయంవరోత్సవమునకు ననేకసేనలతోఁ గూడి యేతెంచి రని భావము.

చ. సొగసు చెలంగ నష్ట శతశోమణిభూషణభూషితాంగులై
యగణితహస్తిరాజవృతి నంచితభద్రగజాధిరూఢులై
ద్విగుణితహర్షయుక్తి నరుదెంచిరి కొందఱు దేశవల్లభుల్
నగకుచ నన్యదీయఁగఁ దనర్పదు మద్రమ యంచు నెంచుచున్. 11

టీక: కొండఱు దేశవల్లభుల్ =కొందఱు దేశాధిపతులు; సొగసు=అందము; చెలంగన్=ప్రకాశింపఁగా; అప్డు=ఆసమయమందు; శతశో మణిభూషణ భూషితాంగులు ఐ– శతశః=అనేకప్రకారములగు, మణిభూషణ=రత్నభూషణములచేత, భూషిత = అలంకరింపఁబడిన, అంగులు ఐ =శరీరములు గలవారై; అగణితహస్తిరాజవృతిన్– అగణిత=లెక్కించుట కలవిగాని; హస్తి రాజ=గజశ్రేష్ఠములయొక్క, వృతిన్=ఆవృతిచేత; అంచిత భద్రగజాధిరూఢులై – అంచిత = ఒప్పుచున్న, భద్రగజ=ఏనుఁగు లను, అధిరూఢులై=ఎక్కినవారై; ద్విగుణిత హర్ష యుక్తిన్– ద్విగుణిత=రెట్టింపఁబడిన, హర్ష = ఆనందముయొక్క, యుక్తిన్ =సంబంధముచేత; నగకుచన్=గుబ్బలులవంటి పాలిండ్లుగల చంద్రికను; మద్రమ– మత్=నా యొక్క, రమ=సంపద; అన్య దీయఁగన్= ఇతరసంబంధినియైనదానినిఁగ; తనర్పదు=చేయదు; యంచున్=అనుచు;ఎంచుచున్ =తలంచుచు; అరుదెంచిరి = వచ్చిరి. అనఁగఁ గొందఱు దేశాధీశులు బహువిధభూషణాలంకృతులై, అనేకగజములతోఁ గూడి, భద్రగజముల నెక్కి, సంత సముతో మావిభవంబు చంద్రికను మఱియొకనిని గోర నియ్య దని తలంచుచు వచ్చి రని భావము.

మ. మఱియున్ వచ్చిరి దేశనాయకులు భా◊మామంగళస్ఫూర్తి న
త్తఱి వీక్షింప సురేంద్రనీలరథసం◊తానంబుపై నెక్కి శ్రీ
మెఱయ న్వారిధరాళిపైఁ దగుధరా◊మిత్రుల్ బలె న్వేడుకల్
దొఱయ న్సంగరపారదృశ్వబలసం◊దోహంబుతోఁ జయ్యనన్. 12

టీక: దేశనాయకులు=దేశాధిపతులు; సురేంద్రనీల రథ సంతానంబుపైన్– సురేంద్రనీల=ఇంద్రనీలమణిమయము లగు, రథ =స్యందనములయొక్క, సంతానంబుపైన్=సమూహముమీఁద; ఎక్కి=అధిష్ఠించి; శ్రీ=సంపద; మెఱయన్=ప్రకాశింపఁగ; వారిధరాళిపైన్– వారిధర=మేఘములయొక్క, ఆళిపైన్=బంతిమీఁద; తగుధరామిత్రుల్ బలెన్ = ఒప్పునట్టి పర్వతవైరు లైన యింద్రులవలెనె; వేడుకల్=సంతోషములు; దొఱయన్=కలుగఁగ; సంగర పారదృశ్వ బల సందోహంబుతోన్ – సంగర = యుద్ధముయొక్క,పారదృశ్వ=అంతమును గన్నవారియొక్క, రణపండితులయొక్క యనుట, బల=సేనలయొక్క, సందో హంబుతోన్ =సమూహముతోడ; చయ్యనన్=శీఘ్రముగ;అత్తఱిన్=ఆసమయమందు; భామా మంగళ స్ఫూర్తిన్– భామా= చంద్రికయొక్క, మంగళ=స్వయంవరరూపమగు మంగళముయొక్క, స్ఫూర్తిన్=అతిశయమును; వీక్షింపన్=చూచుటకు; మఱియున్ = ఇంకను;వచ్చిరి. అనఁగ మఱియుం గొందఱు నరపతులు ఇంద్రనీలమణిమయము లగురథముల నెక్కి, మేఘ పంక్తిపై నెక్కిన యింద్రులవలెఁ బ్రకాశించుచుఁ జంద్రికాస్వయంవరోత్సవమును జూచుటకై సేనాసమేతముగ వచ్చి రని భావము.

చ. మొనసినయెక్కు చక్కఁదన◊మున్ నెఱనీటును మించ మోదపూ
ర్తి నపుడు వచ్చురాజసుత◊బృందము గన్గొన నయ్యె మారు నొ
క్కనిఁ గని యుబ్బు లచ్చిపయి ◊గాటపుటీసు భజించి ధాత్రి నూ
తనవనజాస్త్రకోటుల ను◊దారమహాత్మతచే సృజించె నాన్. 13

టీక: ధాత్రి =భూమి; మారున్=మన్మథుని; ఒక్కనిన్=ఒకనిని; కని=ప్రసవించి; ఉబ్బు లచ్చిపయి = సంతసించు లక్ష్మీదేవిపై; గాటపుటీసు – గాటపు=గాఢమగు, ఈసు=అసూయను; భజించి=పొంది; నూతనవనజాస్త్రకోటులన్ = అభినవమన్మథకోటు లను; ఉదార మహాత్మతచేన్– ఉదార=ఉత్కృష్టమగు, మహాత్మతచేన్=మహిమచేత; సృజించెనాన్=సృష్టించెనో యనునట్లు;

మొనసినయెక్కుచక్కఁదనమున్ – మొనసిన=కల్గిన, ఎక్కుచక్కఁదనమున్=అధికమైన యందమును; నెఱనీటును =నిండిన మురిపెమును;మించన్=అతిశయింపఁగా; మోదపూర్తిన్—మోద=సంతోషముయొక్క, పూర్తిన్=పరిపూర్ణతచేత; వచ్చు రాజ సుతబృందము =వచ్చునట్టి రాట్కుమారులసమూహము; అపుడు; కన్గొనన్ =చూచుటకు;అయ్యెన్=ఆయెను.

కలిమిజవరా లొకపూవిలుకానిని గని విఱ్ఱవీఁగఁగాఁ బుడమి యాలచ్చిపై నీసున నెన్నికలేని క్రొత్తపూవిలుకాండ్రను గనెనో యను నట్లు చక్కఁదనమున మించు పెక్కురాకొమరు లేతెంచి రని భావము. ఇందు నుత్ప్రేక్షాలంకారము.

మ. జగతీమార్గము లెల్ల నిండి యిసుము◊ల్చల్లన్ ధరం జేర న
ట్టుగ నేతెంచిరి రాజపుత్త్రకులు నీ◊టు ల్మీఱ నప్పట్టునన్
జగదంధంకరణాఢ్యసైన్యవిధుత◊క్ష్మాధూళిమేఘాళికిన్
మిగులన్ గర్జలఁ గూర్ప మర్దళజధిం◊ధిమ్యార్భటీపేటికల్. 14

టీక: జగతీమార్గములు=భూమార్గములు; ఎల్లన్=అంతయు; నిండి=కప్పుకొని; ఇసుముల్=ఇసుకలు; చల్లన్=వెదచల్లఁగ; ధరన్=భూమిని; చేరనట్టుగన్ =పొందనట్లుగా; రాజపుత్త్రకులు=రాకొమరులు; అప్పట్టునన్=ఆసమయమందు; నీటుల్ మీఱన్ = మురిపెము లతిశయింపఁగా; జగ దంధంకర ణాఢ్య సైన్య విధుత క్ష్మాధూళి మేఘాళికిన్ – జగత్=లోకమునకు, అంధంకరణ= చీఁకటిని జేసెడి, ఆఢ్య=సంపన్నమగు, సైన్య=సేనలచేత, విధుత=ఎగురఁగొట్టఁబడిన, క్ష్మాధూళి=భూపరాగ మనెడు, మేఘాళికిన్=మబ్బులచాలునకు; మిగులన్=అధికముగా; మర్దళ జ ధింధిమ్యార్భటీ పేటికల్—మర్దళ=మద్దెలల వలన, జ=పుట్టిన, ధింధిమ్యార్భటీ=ధింధిమి యను ధ్వనులయొక్క,పేటికల్=బృందములు; గర్జలన్=గర్జాధ్వనులను; కూర్పన్=జతపఱుపఁగ; ఏతెంచిరి=వచ్చిరి. అనఁగ రాకొమరులు భూమార్గములెల్ల నిసుక చల్లినను గ్రిందఁబడనియటులు నిండుకొని వారలసైన్యపరాగ మను మేఘాళికి మద్దెలధ్వనులు గర్జారవము లగుచుండఁగా నేతెంచి రని భావము.

చ. వనితస్వయంవరోత్సవము ◊వాసిగఁ గన్గొన వచ్చు భూమికాం
తనికర మప్డు దోఁచెఁ గరి◊నాయకపాళులపై నిజైకతై
క్ష్ణ్యనియతి మాని చల్లఁదన◊మంది మహోదయశైలకోటులన్
దినముఖవేళఁ జూడఁ బడు◊దీధితిరాజసమూహవైఖరిన్. 15

టీక: వనితస్వయంవరోత్సవము =చంద్రికయొక్క స్వయంవరోత్సవమును; వాసిగన్=బాగుగ; కన్గొన వచ్చు భూమికాంత నికరము = చూడఁగా నేతెంచెడి రాజుల బృందము; అప్డు=ఆసమయమందు; కరినాయకపాళులపైన్ =గజేంద్రబృందముల మీఁద; ని జైక తైక్ష్ణ్య నియతిన్ – నిజ=తమయొక్క, ఏక=ముఖ్యమగు, తైక్ష్ణ్య=తీక్ష్ణభావముయొక్క,నియతిన్=నియమమును; మాని=విడిచి; చల్లఁదనము=శీతస్వభావమును; అంది=పొంది; మహోదయశైలకోటులన్=ఉదయగిరిశిఖరములందు; దిన ముఖవేళన్=ఉదయకాలమందు; చూడఁబడు దీధితిరాజసమూహవైఖరిన్ – చూడఁబడు =కనఁబడుచున్న, దీధితిరాజ= సూర్యులయొక్క, సమూహ=గుంపుయొక్క, వైఖరిన్=రీతిచేత; తోఁచెన్=కానిపించెను.

అనఁగా నాచంద్రిక స్వయంవరోత్సవమునకు నేనుఁగులపై నెక్కి యేతెంచు పుడమిఱేడు లపుడు తీక్ష్ణభావమును మాని, చల్లఁదనము వహించి పొడుపుకొండకొనలపైఁ జూపట్టు దినముఖసూర్యబింబంబుల పగదిఁ గాన్పించి రని భావము. గజబృంద

ముల నధిష్ఠించి యున్న రాజబృందములను ఉదయగిరిశిఖరగతభానుమూర్తులనుగా నుత్ప్రేక్షించుటచే వస్తూత్ప్రేక్షాలంకారము.

మ. నెఱి నంకాంచితమూర్తు లందఱు కళానీకైకరోచిష్ణు లం
దఱు సత్పాలనదక్షు లందఱు దగన్ శ్యామాభిరామాత్ము లం
దఱు గానం బఱతెంచురాసుతులు నేత్రప్రీతి చేకూర్చి ర
త్తఱి నౌనౌ నన విశ్వరూపగతిచేతం దోఁచుచంద్రస్థితిన్. 16

టీక: పఱతెంచురాసుతులు =వచ్చుచున్న రాకొమరులు; అందఱు=ఎల్లరును; నెఱిన్=క్రమముగా; అంకాంచితమూర్తులు – అంక=రాజచిహ్నములచేత, అంచిత=ఒప్పుచున్న, మూర్తులు=శరీరములుగలవారు, 'మూర్తిః కాఠిన్య కాయయోః' అని అమరుఁడు; అంకాంచితమూర్తులు— అంక=కళంకముచేత, అంచిత=ఒప్పుచున్న, మూర్తులు=దేహములు గలవారని చంద్ర పరమైన యర్థము; అందఱు=ఎల్లరును; కలానీకైక రోచిష్ణులు – కలానీక=విద్యాసమూహముచే, ఏక=ముఖ్యముగా, రోచిష్ణులు=ప్రకాశించువారు; కలానీకైకరోచిష్ణులు – కలానీక=షోడశకలాసమూహముచే, ఏక=ముఖ్యముగా,రోచిష్ణులు=ప్రకాశించువారని చంద్రపరమైన యర్థము; అందఱు=ఎల్లరును; సత్పాలనదక్షులు – సత్=సత్పురుషులయొక్క, పాలన= పరిపాలనమందు, దక్షులు=సమర్థులు; సత్పాలనదక్షులు – సత్=నక్షత్రములయొక్క, పాలన=పరిపాలనమందు, దక్షులు = సమర్థులు అని చంద్రపరమైన యర్థము;అందఱు=ఎల్లరును; తగన్=ఒప్పునట్లు; శ్యామాభిరామాత్ములు – శ్యామా=స్త్రీలకు, అభిరామ=మనోజ్ఞమగు, ఆత్ములు=దేహములుగలవారు; శ్యామాభిరామాత్ములు – శ్యామా=రాత్రులయందు, అభిరామ = ప్రకాశించుచున్న, ఆత్ములు=శరీరములుగలవారు అని చంద్రపరమైన యర్థము; అందఱు=ఎల్లరును; కానన్=అగుటవలన; అత్తఱిన్=అప్పుడు; విశ్వరూపగతిచేతన్=సమస్తరూపముల నొందుటచే; తోఁచుచంద్రస్థితిన్ – తోఁచు=కనిపించుచున్న, చంద్రస్థితిన్=చంద్రునియొక్క సత్తచేత; ఔనౌన్ అనన్ = ప్రశంసించునటులు; నేత్రప్రీతి=చక్షుఃప్రీతిని; చేకూర్చిరి=ఒనరించిరి.

అనఁగా స్వయంవరోత్సవమునకై వచ్చుచున్న రాసుతు లెల్లరు బహురూపములను దాల్చిన చంద్రునిరీతిఁ జూపఱకు నయనానందమును పొనరించిరని భావము.

చ. వనజశరు న్హసించుపరువంపువిలాసములేనివాఁడు నూ
తనవరరత్నభూషణవితానము దాల్పనివాఁ డుదారపా
వనబలయుక్తి రాజిలనివాఁ డొకఁడైన నయారె దోఁపఁ డ
య్యె నపుడు పన్నిదంబున కిళేశసుతావళిలోనఁ గన్గొనన్. 17

టీక: ఇళేశసుతావళిలోనన్ = రాసుతులగుంపునడుమ; అపుడు=ఆసమయమందు; వనజశరున్=మన్మథుని; హసించుపరువంపు విలాసము – హసించు=నవ్వుచున్న (పరిహసించుచున్న), పరువంపు=నూతనమగు, విలాసము=అందము; లేనివాఁడు =కలుగనియట్టివాఁడు; నూతన వరరత్న భూషణ వితానము – నూతన=క్రొత్తనగు, వరరత్న=శ్రేష్ఠమగు మణులయొక్క, భూషణ =సొమ్ములయొక్క, వితానము=సమూహము; తాల్పనివాఁ డు = ధరింపనివాఁడు; ఉదార పావన బల యుక్తిన్ – ఉదార = ఉత్కృష్టమగు, పావన=వాయుదేవునిసంబంధియగు, బల=సత్త్వముయొక్క, యుక్తిన్=యోగముచేత; రాజిలని

వా(డు=ప్రకాశింపనివా(డు, వాయువుతో సమానమైన బలములేనివా(డనుట; పన్నిదంబునకున్= పందెమునకైన; కన్గొనన్ = చూచుటకు; ఒక(డైనన్= ఒక్కడేనియు; తో(ప(డయ్యెన్=కన(బడడయ్యెను; అయారె=ఆశ్చర్యము!

అన(గా నాస్వయంవరోత్సవమునకు నేతెంచియున్న రాసుతులలో నొక(డైనను మన్మథుని నిరసించు నందము లేని వా(డును, మణిభూషణములను దాల్పనివా(డును, వాయువునకు దీటైన బలములేనివా(డును బందెమునకైన లే(డని భావము.

చ. శరజహితాన్వయేంద్రు(డు సు ◊చంద్రధరాధిపచంద్రు(డప్డు త
త్తరుణిస్వయంవరోత్సవవి◊ధానము దా విని త న్వరించు(బో
హరిమణివేణి యంచు ముద◊మాంతరవీథిక(గందళింప(గి
న్నరవిభు(డాత్మసఖ్యకల◊న న్వెను పాయక కొల్వ వే తగన్. 18

టీక: శరజహితాన్వయేంద్రు(డు – శరజహితాన్వయ=సూర్యవంశమునకు, ఇంద్రు(డు=అధిపతి యగు; సుచంద్రధరాధిప చంద్రు(డు = సుంద్రు(డను పేరుగల రాజచంద్రు(డు; అప్డు=ఆసమయమున; తత్తరుణి స్వయంవరోత్సవ విధానము – తత్తరుణి =ఆచంద్రికయొక్క, స్వయంవరోత్సవ=స్వయంవరపు వేడుకయొక్క, విధానము=ప్రకారమును; తాన్; విని=ఆకర్ణించి; తన్ = తనను; హరిమణివేణి = ఇంద్రనీలమణివంటి (దానివలె నల్లనైన) జడగల చంద్రిక; వరించున్ పో= నిజముగ కోరును; అంచున్ = అని తల(చుచు; ఆంతరవీథికన్=చిత్తప్రదేశమునందు; ముదము=సంతసము; కందళింపన్=అంకురింప(గా; కిన్నరవిభు(డు = కిన్నరశ్రేష్ఠు(డగు కుముదు(డు; ఆత్మసఖ్యకలనన్ – ఆత్మ=తనయొక్క, సఖ్య=స్నేహముయొక్క, కలనన్=ప్రాప్తిచేత; వే =శీఘ్రముగ; వెను పాయక =వెంబడించి ; కొల్వన్=సేవింప(గా; తగన్=ఒప్పునట్లు. దీని కుత్తరపద్యస్థక్రియతో నన్వయము.

మ. ద్విరదాధీశ్వరు నెక్కి పౌరవసుగా◊త్రీరత్నవారంబు క్రొ
వ్విరిసేసన్ బయి నింప విప్రతతి దీ◊వింప న్నవానేకపాం
డురపట్టాతపవారణావృతముఖుం◊డున్ జారుభూషావిభా
స్వరగాత్రుండును నై పురి న్వెడలి తే◊వ న్వచ్చె నప్పట్టునన్. 19

టీక: ద్విరదాధీశ్వరున్=గజశ్రేష్ఠమును; ఎక్కి=అధిష్ఠించి; పౌరవసుగాత్రీరత్నవారంబు =పురస్త్రీరత్నబృందము; క్రొవ్విరిసేసన్ =క్రొత్తపుష్పము లనెడు నక్షతలను; పయిన్=శరీరముమీ(ద; నింపన్=నిండింప(గా; విప్రతతి=బ్రాహ్మణులగుంపు; దీవింపన్ = ఆశీర్వదింప(గా; నవానేక పాండుర పట్టాతపవారణావృత ముఖుండున్ –నవ=క్రొత్తనగు, అనేక =పెక్కులగు, పాండుర=తెల్ల నైన, పట్టాతపవారణ=పట్టుగొడుగులచేత,ఆవృత=ఆవరింప(బడిన; ముఖుండున్=ముఖముగలవా(డును; చారుభూషావిభా స్వరగాత్రుండును – చారు=మనోజ్ఞములగు, భూషా=ఆభరణములచే, విభాస్వర=ప్రకాశించు, గాత్రుండును=శరీరముగల వా(డును; ఐ=అయినవా(డై; పురిన్=తనరాజధానినుండి; వెడలి=బైలుదేఱి; అప్పట్టునన్=ఆసమయమున; తేవన్=ఒప్పిద ముగను; వచ్చెన్=ఏతెంచెను. అన(గ సుచంద్రు(డు పురకాంతలు పుష్పాక్షతలు చల్లుచుండ(గ, విప్రులు దీవించుచుండ(గ, తెల్ల నగు పట్టుగొడుగులచే నావృతమైనముఖము గలవా(డై, భూషణభూషితాంగు(డై యేను(గు నెక్కి పురము వెడలె నని భావము.

చ. అసురవిదారి కాంచనశ◊తాంగరథాంగపరిభ్రమిప్రకా
రసముదితారవంబు లిభ◊రాట్పటలీఘనబృంహితంబు లు

ల్లసితమహాచమూకలకలంబు జగత్త్రితయంబు గప్ప సం
తసమున సర్వదేశజననాథులు గన్గొన వచ్చె నత్తఱిన్. 20

టీక: అసురవిదారి=దానవదళనుఁడైన సుచంద్రుఁడు; కాంచనశతాంగ రథాంగ పరిభ్రమి ప్రకార సముది తారవంబులు – కాంచన శతాంగ = సువర్ణమయరథములయొక్క, రథాంగ = చక్రములయొక్క, పరిభ్రమి = భ్రమణములయొక్క, ప్రకార=రీతిచేత, సముదిత=పుట్టిన, ఆరవంబులు=ధ్వనులు; ఇభరా ట్పటలీ ఘన బృంహితంబులు – ఇభరాట్=గజరాజులయొక్క, పటలీ= బృందముయొక్క, ఘన=అధికములగు, బృంహితంబులు=గర్జాధ్వనులు, 'బృంహితం కరిగర్జిత' మని యమరుఁడు; ఉల్ల సిత మహాచమూ కలకలంబు – ఉల్లసిత=ప్రకాశించుచున్న, మహాచమూ=గొప్పసేనలయొక్క, కలక లంబు =కోలాహల ధ్వని; జగత్త్రితయంబు=ముల్లోకములను; కప్పన్=ఆవరింపఁగా; సంతసమునన్=సంతోషముచేత; సర్వదేశజననాథులు = అన్నిదేశములరాజులు; కన్గొనన్=చూచుచుండఁగా; అత్తఱిన్=ఆసమయమున; వచ్చెన్=వచ్చెను.

అనఁగ సుచంద్రుఁడు రథనేమి ధ్వనులు, కరిగర్జితములు, సేనాకలకలంబును ముల్లోకములకు వ్యాపించుచుండఁగా, నరపతు లెల్లరుఁ గనుచుండఁగా స్వయంవరోత్సవమునకు వచ్చె నని భావము.

చ. ఘనకమలేశ్వరాత్మజవికస్వరదీప్తివిలాసహారిపా
వనరుచిజాలలబ్ధి దయివాఱుచుఁ దోఁచినయట్టిలోకబం
ధు నతని విస్మయంబునఁ గనుంగొని రయ్యెడ నప్డు చక్కఁ బ
ద్మిని తదధీనగాఁ దమమతిం దలఁ పుంచిరి రాజు లందఱున్. 21

టీక: ఘన కమలేశ్వరాత్మజ వికస్వర దీప్తి విలాస హారి పావనరుచి జాల లబ్ధిన్ – ఘన=అధికమగు, కమలేశ్వరాత్మజ=విష్ణు సుతుఁడైన మన్మథునియొక్క, వికస్వర=వికసించుచున్న,దీప్తి=కాంతియొక్క,విలాస=విలాసమును,హారి=హరించుచున్న, పావన=పరిశుద్ధమగు,రుచి=కాంతులయొక్క,జాల=పుంజములయొక్క,లబ్ధిన్=ప్రాప్తిచేత; దయివాఱుచున్=ప్రకాశించుచు; ఇట, ఘన=గొప్పనగు, కమలేశ్వరాత్మజ=చంద్రునియొక్క, వికస్వరమగు కాంతివిలాసమును, హారి=హరించు, పావనరుచి జాలప్రాప్తిచేత దైవాఱుచు నని సూర్యపరమైన యర్థము. సూర్యుఁడు తనకాంతులచే చంద్రునిరుచుల గ్రహించుటయును, నిచ్చు టయును ప్రసిద్ధము; తోఁచినయట్టిలోకబంధున్= కనిపించుచున్నట్టి లోకప్రియుఁడగు, కనిపించుచున్నట్టి సూర్యుని నని తోఁచు చున్నది; అతనిన్=ఆసుచంద్రుని, ఆసూర్యుని; ఎయ్యెడన్=ఎప్పుడైతే; విస్మయంబునన్= వింతచేత; కనుంగొనిరి=చూచిరో; అప్డు=అప్పుడే; చక్కన్=బాగుగా; పద్మినిన్=చంద్రికను, పద్మలత నని తోఁచును; తదధీనగాన్=ఆ సుచంద్రుని స్వాధీనమైన దానినిఁగ, సూర్యుని స్వాధీనమైనదానినిఁగ; రాజు లందఱున్ =నరపతు లెల్లరు; తమమతిన్ = తమచిత్తములందు; తలఁపు= అభిప్రాయమును; ఉంచిరి=ఉనిచిరి.

స్వయంవరోత్సవమునందుఁ జేరియున్నరాజు లందఱును మన్మథాతిశాయిసౌందర్యము గల యాసుచంద్రునికి చంద్రిక సూర్యునికి పద్మలతయుంబోలె నాయత్త మైనదానిఁగాఁ దలంచి రని భావము.

మ. అతులంబై యనవద్యమై కువలయోదారప్రమోదప్రదా
త్మత సంధించి కరంబు రాజిలు సుచంద్రప్రాజ్యతేజోవ్రజం

బతివేలం బగుచున్ వెలుంగఁగ ననంతా౦స్థాని నాక్షత్రసం
తతి చూపట్టె సముజ్ఝితస్వకమహా౦ధామాళిచే నయ్యెడన్. 22

టీక: అతులంబై=అధికమైనదై; అనవద్యమై=నిర్దుష్టమైనదై; కువల యోదార ప్రమోద ప్రదాత్మ తన్ – కువలయ=భూవలయమునకు, ఉదార=ఉత్కృష్టమగు, ప్రమోద=సంతసమును, ప్రద=ఇచ్చుచున్న, ఆత్మ తన్=స్వభావము గలవాఁడగుటను, సర్వదా భూమండలమును సంతసింపఁజేయు స్వభావముగలవాఁ డగుట ననుట; కువలయ=కలువలకు, ప్రమోదప్రదమగు స్వభా వము గలవాఁడగుట నని చంద్రపరమైన యర్థము; సంధించి=పొంది; కరంబు=మిక్కిలి; రాజిలు సుచంద్ర ప్రాజ్య తేజో వ్రజంబు – రాజిలు = ప్రకాశించు, సుచంద్ర=సుచంద్రమహారాజుయొక్క, మంచిచంద్రునియొక్క, ప్రాజ్య=అధికమగు, తేజో వ్రజంబు=కాంతిపుంజము, వెన్నెల; అతివేలం బగుచున్=అధికమైన దగుచు, ‘ అతివేల భృశాత్యర్థ’ అని యమరుఁడు; వెలుంగఁగన్ =ప్రకాశింపఁగా; అనంతాస్థానిన్ – అనంతా=భూమియనెడు, ఆస్థానిన్=సభయందు; నాక్షత్రసంతతి= రాజబృందము; అనంత=ఆకాశమనెడు, ఆస్థానిన్=సభయందు, నాక్షత్రసంతతి= నక్షత్రసంబంధి యగు గుంపు అని చంద్రపరమైన యర్థము; సముజ్ఝిత స్వక మహాధామాళిచేన్ – సముజ్ఝిత=విడువఁబడిన, స్వక=తమసంబంధియగు, మహత్=అధికమగు, ధామాళిచేన్ =కాంతిసమూహముచే; అయ్యెడన్= ఆసమయమందు; చూపట్టెన్=కనిపించెను.

అనఁగఁ జంద్రునికాంతిపుంజము సన్నిధిఁ దేజోవిహీన మగు రిక్కలగుంపుపగిది సుచంద్రునితేజము సన్నిధిని నితరరాజబృందము కళఁబాసి కనుపట్టె నని భావము.

తే. ఇట్టు లపు డేగుదెంచిన౦యట్టి సకల, మనుజకాంతులఁ బాంచాల౦జనవిభుండు
రహి నెదుర్కొని యభినవ్య౦రత్న మయమ,హోన్న తనివేశపాళుల౦నునిచె నంత. 23

టీక: ఇట్టులు=ఈరీతిగ; అపుడు=ఆసమయమందు; ఏగుదెంచినయట్టి సకలమనుజకాంతులన్ = వచ్చినట్టి సమస్తనరపతులను; పాంచాలజనవిభుండు =పాంచాలరాజైన క్షణదోదయుఁడు; రహిన్=ప్రీతితో; ఎదుర్కొని =ఎదురుగా నేగి; అభినవ్య రత్న మయ మహోన్నత నివేశపాళులన్ – అభినవ్య=నూతనమగు,రత్న మయ=మణిమయమగు, మహోన్నత=మిక్కిలి యెత్తుగా నున్న, నివేశపాళులన్=విడుదులపంక్తులయందు; ఉనిచెన్=ఉంచెను.

అనఁగాఁ బాంచాలరాజగు క్షణదోదయుఁడు స్వయంవరమునకై వచ్చిన రాజుల నెదుర్కొని సమ్మానించి వారిని మణిమయమైన యున్నతనివేశములయం దుంచె నని భావము.

చ. అవనితలేంద్రు లెల్లఁ బ్రమ౦దాతిశయంబునఁ దత్స్వయంవరో
త్సవదినవేళ దివ్యమణి౦జాతవినిర్మితమంచమండలిన్
బ్రవిమలచిత్తపద్మ లయి౦బాగుగఁ జేరి వసించి రంగనా
నివహము చామరల్ వలయ౦నిక్వణనంబులు మించ వీవఁగన్. 24

టీక: అవనితలేంద్రు లెల్లన్=రాజులందఱు; ప్రమదాతిశయంబునన్=సంతోషాతిశయముచేత; తత్స్వయంవరోత్సవదినవేళన్ – తత్=ఆచంద్రికయొక్క, స్వయంవరోత్సవ=స్వయంవరపువేడుకయొక్క, దినవేళన్=దివసమునందు; దివ్యమణిజాతవినిర్మితమంచమండలిన్—దివ్యమణి=శ్రేష్ఠమగు మణులయొక్క, జాత=గణముచేత, వినిర్మిత=రచియింపఁబడిన, మంచ=

మంచములయొక్క, మండలిన్=సమూహమందు; ప్రవిమలచిత్తపద్మలయి – ప్రవిమల=మిక్కిలిస్వచ్ఛమగు,చిత్తపద్మలయి =మనఃకమలములుగలవారై; బాగుగన్=రమణీయముగ; చేరి=సమీపించి; అంగనానివహము=స్త్రీసమూహము; వలయనిక్వణనంబులు – వలయ=కంకణములయొక్క, నిక్వణనంబులు=ధ్వనులు; మించన్=అతిశయింపఁగ; చామరల్ =వింజామరలను; వీవఁగన్=విసరుచుండఁగా; వసించిరి=కూర్చుండిరి. అనఁగ స్వయంవరోత్సవమునకు వచ్చిన రాజు లందఱు మణిమయమంచాసనములపై నువిదలు కంకణధ్వనులు చెలరేఁగ వీచోపులు వీచుచుండఁగ విమలచిత్తులై నివసించి రని భావము.

మ. అలవేళన్ హరిపుత్త్రహారకమహుం◊డై నిస్తులాహీనహా
రలతాశోభితమూర్తియై తగుసుచం◊ద్రక్ష్మాతలేంద్రుండు ని
ర్మలపాండుద్యుతిమన్మణీమయమహా◊మంచాగ్రభద్రాసన
స్థలిఁ దాఁ జేరి వసించె రూప్యగిరిఁ గా◊త్యాయన్యధీశుం డనన్. 25

టీక: అలవేళన్=ఆసమయమందు; హరిపుత్త్ర హారక మహుండు ఐ – హరిపుత్త్ర=జయంతుని, హారక=హరించిన, మహుండు ఐ =తేజస్సుగలవాఁడై; హరిపుత్త్ర=మన్మథుని, లేదా యముని, హారక=హరించిన, మహుండు ఐ =తేజస్సుగలవాఁడై అని శివపరమైన యర్థము; నిస్తులాహీన హారలతా శోభిత మూర్తియై – నిస్తుల=సాటిలేని,అహీన=శ్రేష్ఠమగు, శివపరముగ శేషుఁడనెడు, హారలతా=లతలవంటి హారములచే, శోభిత=ప్రకాశించుచున్న, మూర్తియై =తనువుగలవాఁడై; తగుసుచంద్రక్ష్మాతలేంద్రుండు – తగు=ఒప్పుచున్న, సుచంద్రక్ష్మాతలేంద్రుండు=సుచంద్రుఁడను రాజశ్రేష్ఠుఁడు; నిర్మల పాండుద్యుతిమ న్మణీమయ మహామంచాగ్ర భద్రాసనస్థలిన్ – నిర్మల=స్వచ్ఛమగు, పాండుద్యుతిమత్=తెల్లనికాంతిగల, మణీమయ=రత్నమయమగు, మహామంచాగ్ర =గొప్పపర్యంకాగ్ర మనెడు; భద్రాసనస్థలిన్=సింహాసనస్థలమందు; తాన్; చేరి=సమీపించి; రూప్యగిరిన్=వెండికొండయందు; కాత్యాయన్యధీశుండు = కాత్యాయినీ+అధీశుండు=పార్వతీశుఁడైన శివుఁడో; అనన్=అనునట్లుగా; వసించెన్=కూర్చుండెను.

తెల్లనిమణులతో రచియించి యున్న మంచముపైఁ గూర్చుండి యున్న యాసుచంద్రుఁడు వెండికొండపైఁ గూర్చుండి యున్న ముక్కంటిపగిది విలసిల్లె నని భావము. ఇచట సుచంద్రుని శివునిగా నుత్ప్రేక్షించుటచే నుత్ప్రేక్షాలంకారము.

మ. ఘనముక్తామణికాసనంబున సిరిం◊ గన్పట్టు నాదైత్యభే
దనుఁ డౌరౌర నుతింప నయ్యెఁ ఖరరు◊క్తైక్ష్ణ్యంబుచేత న్విక
ర్తనబింబమ్మున నుండుట న్సడలి శీ◊తచ్ఛాయబింబంబు చే
రిన వారాశిసుతామనోహరునిదా◊రిం బూని యప్పట్టునన్. 26

టీక: ఘనముక్తామణికాసనంబునన్ – ఘన=గొప్పలగు, ముక్తామణికా=ముత్తెములయొక్క, ఆసనంబునన్=సింహాసనమందు; సిరిన్= కాంతిచే; కన్పట్టు నాదైత్యభేదనుఁడు=కనిపించు నాసుచంద్రుఁడు;ఖరరుక్తైక్ష్ణ్యంబుచేతన్=తీక్ష్ణకిరణముల వేఁడిమిచేత; వికర్తనబింబమ్మునన్=సూర్యబింబమునందు;ఉండుటన్=ఉనికిని; సడలి=వదలి; శీతచ్ఛాయబింబంబు= చల్లనికాంతి గల చంద్రబింబమును; చేరిన వారాశిసుతామనోహరునిదారిన్ – చేరిన=పొందిన, వారాశిసుతామనోహరుని= లక్ష్మీభర్తయైన విష్ణువుయొక్క, దారిన్=విధమును; పూని=వహించి; అప్పట్టునన్=ఆసమయమందు; నుతింపనయ్యెన్= స్తుతిపాత్రుఁడయ్యెను; ఔ రౌర=ఆశ్చర్యము! అనఁగా ముక్తామయభద్రాసనంబునఁ గూడియున్న సుచంద్రుఁడు, మిక్కిలి

వేఁడిగల సూర్యబింబమును విడిచి, చల్లనిచంద్రబింబంబును జేరినవిష్ణుమూర్తియో యని పొగడఁబడె నని భావము. నారాయణమూర్తి సూర్యబింబమునం దుండుట ప్రసిద్ధము.

సీ. సురగణ్యలావణ్య◊గరిమ రాజులకుఁ బాం,చాలినిరాశ హె◊చ్చంగఁ జేయ,
మణిమంచబింబితా◊త్మచ్ఛాయ తనుఁ గొల్వఁ, దఱియుమన్మథుబుద్ధి◊దనరఁ జేయ,
హీరభూషణవిభా◊వారంబు వెన్నెల, వలగొన్న రేఁ ఱేనిఁ ◊దలఁపఁ జేయ,
వందికంఠధ్వనుల్ ◊వైభవశ్రీ నభ్ర, మెనసి చూచుసురాళి ◊కెఱుక చేయ,
తే. కంకణక్రేంకృతు ల్పర్వఁ ◊బంకజాస్య, లలరువింజామరలు వీవ ◊యక్షనేత
పార్శ్వమునఁ గొల్వ బుధపాళి◊ప్రస్తుతింప, మంచతటి నాసుచంద్రుండు ◊మించె నపుడు. 27

టీక: సురగణ్యలావణ్యగరిమ – సుర=దేవతలచే, గణ్య=పొగడఁదగిన, లావణ్య=అందముయొక్క, గరిమ=అతిశయము; రాజులకున్=ఇతరరాజులకు; పాంచాలినిరాశ =చంద్రికయందు ఆశయొక్క యభావమును;హెచ్చంగఁ జేయన్= మించునటులుచేయుచుండఁగ;

మణిమంచబింబితాత్మచ్ఛాయ – మణిమంచ=మణిమయమగు మంచమునందు, బింబిత=ప్రతిబింబించిన, ఆత్మచ్ఛాయ = తననీడ; తనుఁ గొల్వన్=తన్ను సేవించుటకు; తఱియు మన్మథుబుద్ధిన్ = సమీపించియున్న మన్మథుఁడనెడు తలంపును, తననీడ మన్మథునిభంగి నున్న దనుట; తనరఁ జేయన్=కలుగఁజేయుచుండఁగ;

హీరభూషణవిభావారంబు=వజ్రాల సొమ్ములయొక్క కాంతిపుంజము; వెన్నెల వలగొన్న రేఁ ఱేనిన్ = వెన్నెలచేఁ జుట్టఁబడిన చంద్రుని; తలఁపఁ జేయన్=స్మరించునట్లు చేయఁగ;

వందికంఠధ్వనుల్ – వంది=పొగడుచుండెడివారియొక్క, 'వన్దిన స్తుతిపాఠకాః' అని యమరుఁడు, కంఠధ్వనుల్=గళరవములు; వైభవశ్రీన్=విభవముయొక్క అతిశయమును; అభ్రమెనసి =మిన్నంది; చూచుసురాళికిన్=చూచుచున్న దేవతల బృందమునకు; ఎఱుక చేయన్=తెలియఁజేయుచుండఁగ;

కంకణక్రేంకృతుల్=కడియములయొక్క క్రేంకారధ్వనులు; పర్వన్=వ్యాపించునట్లు;పంకజాస్యలు=స్త్రీలు; అలరువింజామరలు=ప్రకాశించుచున్న చామరములను; వీవన్=విసరుచుండఁగ; యక్షనేత=కుముదుఁడను కిన్నరుఁడు; పార్శ్వమునన్= ప్రక్కన; కొల్వన్=సేవించుచుండఁగ; బుధపాళి = విద్వద్బృందము; ప్రస్తుతింపన్=పొగడుచుండఁగ; మంచతటిన్=మంచ ప్రదేశమందు; అపుడు; ఆసుచంద్రుండు=ఆసుచంద్రమహారాజు; మించెన్=అతిశయించెను. అనఁగ తనసౌందర్యాతిశయము ఇతరరాజులకు చంద్రికమీఁది యాశను పోగొట్టుచున్న దనియు, మణిమయపీఠమందు ప్రతిబింబించిన తననీడ మరుం డను జ్ఞానమును కలుగఁ జేయుచున్న దనియు, మగరాలసొమ్ముల కాంతులు వెన్నెల వల గొన్న కలువలదొరయో యను బుద్ధిని కలుగజేయుచున్న వనియు, స్తుతిపాఠకుల కంఠధ్వనులు తనవైభవమును మింటఁ జూచు వేల్పుల కెఱుకచేయుచున్న వనియు, ఇరుప్రక్కల స్త్రీలు వీచోపులు విసరుచుండ వారి కరకంకణధ్వనులు వ్యాపించు చున్నవనియు, కుముదుఁడు కొలుచు చుండఁగ, బుధులు నుతించు చుండఁగ, నట్టి సుచంద్రుఁడు మంచముమీఁదఁ బ్రకాశించుచుండె నని తాత్పర్యము.

క. నరనాయకకులమంచాం
తరముల వలిగాడ్పు మసలెఁ ◊దపనతనయమం

దిరకేళీవనపాళీ
సురసాళీవాసనాభిశోభితగతియై. 28

టీక: నరనాయకకులమంచాంతరములన్– నరనాయకకుల=నరపతిసంఘములయొక్క, మంచాంతరములన్=మంచముల యొక్క మధ్యములందు; వలిగాడ్పు=చల్లనిమందమారుతము; తపనతనయ మందిర కేళీవన పాళీ సురసాళీ వాసనాభిశోభిత గతి యై – తపనతనయ=యమునియొక్క, మందిర=గృహముయొక్క,కేళీవన=క్రీడావనములయొక్క, పాళీ=పంక్తులయం దున్న, సురసాళీ=సర్జాక్షిపుష్పపుంజములయొక్క,వాసనా=పరిమళముచే, అభిశోభిత=ప్రకాశించు, గతియై=గతి గలదై; మసలెన్=విసరెను.

వ. అంత ననంత కాంచన మంచాగ్ర సమంచిత సింహాసన సమాసీన మానవనాయక సేవా సమాగమి తత్త త్సేనాధిప సంఘ పరస్పర సంఘర్షణ సముత్థిష్ఠ చ్చిరత్న రత్నాంగద పరాగపూగ తామ్రపట్ట పటాస్తరణ విభ్రాజితంబును, నంతరీపకాంత శిరోవిభాసి తానంతచరనాథమణిమయ మకుటతట నరీనృత్యమాన వినీలకాంతి ప్రరోహ కుహనా ధూపధూమ పూరితంబును, శంబరాక్షీ కదంబక కరాంబుజ సముద్గచ్ఛదరు ణాంశుక శుభాడంబర కంకేళి కుసుమగుళుచ్ఛ రింఛోళికా వితాన విభూషితంబును నై యొప్పుమీఱు గగనా స్థానంబునఁ బాకారి పావక పద్మాప్తసుత పలాశ పయోధీశ పవమాన పౌలస్త్య పార్వతీపతి పరివృ తుండై తదుత్సవంబు వీక్షింప నిండుపేరోలగం బుండె. గాలవ శాండిల్య కౌశిక వసిష్ఠ ప్రముఖ మహర్షులు హర్షో త్కర్షంబునఁ జూడం దొడంగిరి. గరుడ కిన్నర గంధర్వ సిద్ధ సాధ్యముఖ్యు లంతంతం గాంచి సంతసిల్లిరి. అపుడు రాజసభాస్థలం బపరిమిత వేత్రధర సాహోనినాదవాచాలంబై, అభినవభూషణమరీచికావిహార వాటంబై, యతులితంబై యతిశయిల్లం గనుంగొని యాక్షణదోదయ క్షమాధ్యక్షుండు నెమ్మనంబున నీ స్వయంవరంబునకు వచ్చిన ధరాధిపతుల యన్వయగుణాదికంబులు పేర్కొని కుమారి కెఱింగింప నెవ్వరు చాలుదు రఖిలజగజ్జనని గిరిరాజతనుజ గాక యని తలంచి యప్పుడు. 30

టీక: అంతన్=అటుపిమ్మట; అనంత కాంచన మంచాగ్ర సమంచిత సింహాసన సమాసీన మానవనాయక సేవా సమాగమి తత్త త్సేనాధిప సంఘ పరస్పరసంఘర్షణ సముత్థిష్ఠ చ్చిరత్న రత్నాంగద పరాగపూగ తామ్ర పట్టప టాస్తరణ విభ్రాజితంబును – అనంత = అధికమగు, కాంచన=సువర్ణమయమైన, మంచాగ్ర=మంచాగ్రములయందు, సమంచిత=ఒప్పుచున్న, సింహాసన =భద్రాసనములందు, సమాసీన=కూర్చొన్న, మానవనాయక=నరపతులయొక్క, సేవా=కొలువునకై, సమాగమి=వచ్చు చున్న, తత్తత్సేనాధిప=వారివారి దళవాయులయొక్క, సంఘ=గుంపుయొక్క, పరస్పరసంఘర్షణ =ఒండొరులయొక్క యొరయికలవలన, సముత్థిష్ఠత్=మీఁది కెగయుచున్న, చిరత్న=పురాతనమగు,రత్నాంగద=రత్నమయములగు భుజ కీర్తులయొక్క, పరాగపూగ=రజఃపుంజ మనెడు, తామ్ర=ఎఱ్ఱనగు, పట్టపట=పట్టువస్త్రముయొక్క, ఆస్తరణ=పఱచుటచే, విభ్రాజితంబును = ప్రకాశించుచున్నదియును;
అంతరీపకాంత శిరో విభాసి తానంతచరనాథమణిమయ మకుటతట నరీనృత్యమాన వినీల కాంతి ప్రరోహ కుహనా ధూప ధూమ పూరితంబును– అంతరీపకాంత=ద్వీపాధిపతులయొక్క, శిరః=మస్తకములందు, విభాసిత=ప్రకాశించు, అనంతచర

నాథమణిమయ = ఇంద్రనీలమణిమయములగు, మకుటతట=కిరీటప్రదేశములందు, నరీనృత్యమాన=మిక్కిలి నాట్యము చేయుచున్న, వినీల= మిక్కిలి నల్లని, కాంతి=తేజములయొక్క, ప్రరోహ=అంకురమనెడు, కుహనా=కపటముగల, ధూప= ధూపముయొక్క, ధూప మనఁగా వాసనకై వేయు నగరువుమొదలగు పరిమళవస్తువులయొక్క పొగ, ధూమ=పొగచేత, పూరితంబును =నింపఁబడినదియును;

శంబరాక్షీకదంబక కరాంబుజ సముద్గచ్ఛ దరుణాంశుకశుభాడంబరకంకేళికుసుమగుళుచ్ఛరింఛోళికావితానవిభూషితంబును – శంబరాక్షీకదంబక=మృగాక్షీసమూహముయొక్క, కరాంబుజ=కేలుదామరలవలన, సముద్గచ్ఛత్=మీఁది కెగయుచున్న, అరుణాంశుక=ఎఱ్ఱనికాంతి యనెడు, శుభాడంబర=మంగళప్రదమగు విజృంభణము గల, కంకేళికుసుమ=అశోకపుష్పముల యొక్క, గుళుచ్ఛ=గుత్తులయొక్క, రింఛోళికా=సమూహములనెడు, వితాన=మేలుకట్లచేత,విభూషితంబును=అలంకరింపఁబడినదియును; ఐ=అయినదై;

ఒప్పుమీఱు గగనాస్థానంబునన్– ఒప్పు=అందముచేత, మీఱు=అతిశయించు, గగనాస్థానంబునన్=ఆకాశమను సభయందు; పాకారి=ఇంద్రుఁడు, పావక పద్మాప్తసుత పలాశ పయోధీశ పవమాన పౌలస్త్య పార్వతీపతి పరివృతుండై=అగ్ని యమ నిరృతి వరుణ వాయు కుబేర శంకరులతోఁ గూడినవాఁడై; తదుత్స వంబు=ఆస్వయంవరోత్సవమును; వీక్షింపన్=చూచుటకు; నిండు పేరోలగంబు =గొప్పకొలువుదీరి; ఉండెన్=ఉండెను.

గాలవ శాండిల్య కౌశిక వసిష్ఠ ప్రముఖ మహర్షులు = గాలవుఁడు, శాండిల్యుఁడు, విశ్వామిత్రుఁడు, వశిష్ఠుఁడు మున్నగు గొప్ప ఋషులు; హర్షోత్కర్షంబునన్=సంతోషాతిశయముచేత; చూడన్=వీక్షించుటకు; తొడంగిరి=ప్రయత్నించిరి.

గరుడ కిన్నర గంధర్వ సిద్ధ సాధ్య ముఖ్యులు = గరుడులు, కిన్నరులు, గంధర్వులు, సిద్ధులు, సాధ్యులు మున్నగు వారలు; అంతంతం గాంచి =అచ్చటచ్చటఁ జూచి; సంతసిల్లిరి=ఆనందించిరి. అపుడు =ఆసమయమందు; రాజసభాస్థలంబు=రాజసభ యొక్క ప్రదేశము; అపరిమిత వేత్రధర సాహోనినాద వాచాలంబై– అపరిమిత=మితిలేని, వేత్రధర=బెత్తపువారియొక్క, సాహో నినాద=సాహోయను హెచ్చరికమాటల ధ్వనులచేత, వాచాలంబై = ముఖరితమైనదై; అభినవ భూషణ మరీచికా విహార వాటంబై– అభినవ=నూతనమగు, భూషణ=ఆభరణములయొక్క, మరీచికా=కాంతులయొక్క, విహార=క్రీడయొక్క, వాటంబై= ప్రదేశమై, అతులితంబై=సాటిలేనిదై, అతిశయిల్లన్=విజృంభింపఁగ; కనుంగొని =చూచి; ఆక్షణదోదయక్షమాధ్యక్షుండు= ఆ క్షణదోదయుఁడను రాజు; నెమ్మనంబునన్=తన నిండుమనసున; ఈ స్వయంవరంబునకున్=ఈస్వయంవరోత్సవమునకు; వచ్చిన ధరాధిపతుల యన్వయగుణాదికంబులు = వచ్చినట్టి రాజుల గోత్రగుణవిశేషములు;పేర్కొని =నామములు గ్రహించి; కుమారికిన్=చంద్రికకు; ఎఱింగింపన్=తెలుపుటకు; అఖిల జగజ్జనని =సమస్తలోకములకు మాతయగు; గిరిరాజతనుజ గాక =పార్వతీదేవి తప్ప;ఎవ్వరు చాలుదురు=ఎవ్వరు సమర్థు లగుదురు? అని తలంచి=ఇట్లు స్మరించి; అప్పుడు=అక్కాలమున;

మ. పరిపూతాత్మసమన్వితుం డగుచుఁ దత్పాంచాలధాత్రీతలే
శ్వరచంద్రుండు కరాబ్జము ల్మొగిచి శశ్వద్భక్తివైపుల్య మాం
తరవీథిం దళుకొత్త నిల్చి వినయాత్మ న్సన్నుతించె న్మహీ
ధరసమ్రాట్సుత నిర్మలామృతధునీధారాళధారోక్తులన్. 30

టీక: తత్పాంచాలధాత్రీతలేశ్వరచంద్రుండు = పాంచాలరాజశ్రేష్ఠుఁడైన యాక్షణదోదయమహారాజు; పరిపూ తాత్మ సమన్వితుండు అగుచున్ – పరిపూత=పరిశుద్ధమగు, ఆత్మ=మనస్సుచేత, సమన్వితుండు=కూడుకొన్న వాఁడు, అగుచున్=అయిన

వాఁడై; కరాబ్జముల్=కేలుదామరలు; మొగిచి=మోడ్చి; శశ్వ దృక్తివైపుల్యము – శశ్వత్=ప్రకాశించుచున్న, భక్తి=భక్తియొక్క, వైపుల్యము =అతిశయము; ఆంతరవీథిన్=హృదయసీమయందు; తళుకొత్తన్=మిక్కిలి ప్రకాశింపఁగా; నిల్చి=నిలుచుకొని; వినయాత్మన్=వినయముతోఁ గూడుకొన్న మనస్సుచేత; నిర్మ లామృత ధునీ ధారాళ ధా రోక్తులన్ – నిర్మల=స్వచ్ఛమగు, అమృత=సుధయొక్క, ధునీ=ప్రవాహముయొక్క, ధారాళ=అడ్డములేని, ధారా=ఆసారములవంటి, ఉక్తులన్=వాక్యముల చేత; మహీధరసమ్రాట్సుతన్=హిమవంతుని కూఁతురగు పార్వతీదేవిని; సన్నుతించెన్=పొగడెను. అనఁగా క్షణదోదదయ రాజు భక్తిచేఁ గరములు మోడ్చి జగన్మాత యగు నాపార్వతీదేవి నమృతధారాసమంబు లగు నుక్తులచే నుతించె నని భావము.

దండకము. జయ జయ జగతీనాయికే, భక్తలోకేష్టసంధాయికే, నిత్యబిన్దుత్రికోణాష్టకోణాదికోణావళీవిస్ఫురచ్చక్ర సింహాసనోద్ద్యోతమానాత్మికే, సర్వమన్త్రాత్మికే, సద్వటానోకహోపాన్తసీమావసద్బోధముద్రాన్వితా శామ్బరస్వాన్తనిద్రాళుపఞ్చాశుగోన్మీలనాకారకాపాఙ్గసంచారభఙ్గీసముద్భూతసర్గాదికార్యత్రయీ సక్త వైధాణ్డభాణ్డప్రకాణ్డే, దయాత్త్రాతయోగిప్రకాణ్డే, వినీలాఙ్కరేఖావృతాబ్జారిబిమ్బోపమాసమ్మిళ త్కుణ్డలీభూత హీరోపలప్రోత కోదణ్డదణ్డోత్తమోద్వాన్త శైత్యప్రకారోజ్జ్వల ద్ద్రోనికాయోపభుక్తోగ్రధూమ్రాక్ష దర్పచ్ఛలధ్వాన్తికే, వార్షుకామ్భోదజిత్కాన్తికే, రోచమానాత్మభూమిత్రతారాహితీయుక్త చిత్రక్రియా సంచరన్మధ్వవష్టమ్భ విధ్వంసనోదార లక్ష్మీశనిద్రాపహార్యద్భుతక్రీడనాశాలి మాయాఘనప్రక్రమాభ్యఞ్చితే, సత్కులాళీనిరాకుఞ్చితే, మత్త దన్తీన్ద్రగర్జామృదఙ్గవ్రజధ్వాన దైత్యేన్ద్రసేనావళీ సింహనాదాఖ్య గానాభిరఙ్గన్మహాజన్యరఙ్గస్థలీ నృత్య దుగ్రాసివల్లీ నటీప్రాపితా ప్రత్నపుష్పాఞ్జలీభూతశుమ్భాదిక క్రవ్యభుఙ్మాలికా నిర్గళన్మౌక్తికశ్రేణికే, పుణ్య మర్త్యోత్కరారోహ్య సౌభాగ్య సౌధార్పితోదార కారుణ్యనిశ్రేణికే, శివగృహిణి నిజౌపమ్యలీలా నిశోజ్జృమ్భమాణేన్దుజాయా పరివ్యక్తజాగ్రత్కుధాఙ్కార శఙ్కాసమాపాది లాక్షారసోల్లిఙ్గితాంఘ్ర్యబ్జ దీవ్యన్నఖవ్రాత విభ్రాజితే, దేవతాపూజితే, నిత్యసత్కాన్త సంసేవ్యపాదామ్బుజాతాధరీభూత పద్మాకరోదయాఞ్చితామ్భోజహైన్యక్రియావాచి శిఞ్జారవోద్భాసిమఞ్జీరభూషానుషఙ్గే, కనఙ్ఘాజ్ఘికశ్రీజితోద్యన్మనోభూ నిషఙ్గే, మహాయౌవనాళీకమల్లాదిభూకేళికాస్తమ్భ సంవిత్ప్రదాత్రూరుకాణ్డే, సరోరాజసౌభాగ్యజిన్నాభికుణ్డే, వలగ్నస్థలీకార్శ్యజిజ్ఞాసుపుష్పేషుబద్ధస్ఫురన్ముష్టికాబన్ధన ప్రోత్థగమ్భీరనాభీగుహోన్నస్తటధ్వాన్త రేఖామనీషాప్రదశ్యామరోమాళికే, సారశృఙ్గారవారాశిభఙ్గప్రమాకృద్వళీపాళికే, చారుతారుణ్యమాయా మహాకుమ్భికుమ్భద్వయీద్వాపరద్వారవక్షోభవే, పాణిభాత్త్రాతపాథోభవే, సంతతాసక్తసర్వజ్ఞదృగ్జాత పాతక్రియాజాయమానాత్మలావణ్యకూలఙ్కషాబుద్బుదశ్రేణికారూపముక్తావళీభాసమానే, శుభామోదికాశ్మీరకస్తూరికాపఙ్కచర్చాపరిద్యోతమానే, మనోజ్ఞాస్యపద్మాహితార్చాపరామ్భోజబాణప్రతిష్ఠాపితామూల్యశఙ్ఖీభవత్కన్ధరే, పాణితప్రాణబన్ధూభవద్భవ్యవాగ్బన్ధురే, సలలితఖగచక్రాఙ్గకాణ్డద్విజావిక్షతాఙ్కాన్వితప్రస్ఫురత్పక్వబిమ్బప్రతీకాశరమ్యోష్ఠబిమ్బే, నవాదర్శసద్గర్వనిర్వాపణోద్వ్యక్త గణ్డద్వయాంచన్మరీచీకదమ్బే, స్వకశ్రీసమఙ్కూరిత త్రాసయోగాటవీ లీన కున్దోపరివ్యక్త నవ్యానుకమ్పా

రసోహాకరాశ్రాన్త వీటీరసవ్యాప్త దన్తాళికాద్వైతవా ద్యుజ్జ్వలద్దాడిమీబీజజాలే, సునాసాజితామూల్యసౌవర్ణ జాలే, లసత్కజ్జలాజ్కోపధిత్రోటికాయుక్తరమ్యాస్యలావణ్యకేళీవనీవీథికా సంచరత్ఖఞ్జరీటాయమానోల్లస ల్లోచనే, భ్రూలతాయుగ్మసంప్రాపితానఙ్గచాపత్విషామోచనే, భవ్యకాశ్మీరభూచిత్రకాకార ఫాలాన్తరభ్రాజ మానానిలాప్తేక్షణే, వక్త్రతేజఃపరిక్షీణపూర్ణక్షపానాథకాన్తిక్షణే, సంతతాభ్యర్ణసీమావసద్వేణికారాహుసంద ర్శనోద్విగ్న చేతస్క చూడామణీభూత శీతాంశురేఖా గళత్పాణ్డురస్వేదపాథః పృషన్మాలికా మోహదా నర్ఘ్యముక్తాలలన్తీలతాలంకృతే,రత్నతాటఙ్కయుగ్మాన్వితే, కాలకణ్ఠాన్తరఙ్గప్రమోదప్రదాప్రత్నచామ్పేయ దామాఖ్య సౌదామినీవల్లికాయుక్తవేణీపయోదాభిరామే, నతాగారిరామే, సతత మగజే త్వమే వాత్మమాతా శివే త్వాం భజే దేవదేవి త్వయా రక్షితోఽహం విశాలాక్షి తుభ్యం మనోభక్తి విత్తం దదా మ్యమ్బికే, నాశ్ర యామి త్వదన్యాం, మహాకాళి దాస్యం తవ ప్రాప యాబ్జావతంసే, త్వదీయే పదాబ్జ ద్వయే సంవసత్వస్మదీ యాశయో, గౌరి రక్షాద్యమాం, దేవి తుభ్యం నమో, యోగిమృగ్యోజ్జ్వలచ్చిత్కళాయై నమో, గోధిభాః కృత్తరాత్రిట్కలాయై నమో, శేషగీర్వాణనిత్యోత్సవాయై నమో, నిత్యపూతామిత ప్రాభవాయై నమో, హస్త సంబద్ధనీరేశయాయై నమో, దేవతారూపశయ్యాశయాయై నమస్తే, సఖీభూత పద్మాలయాయై నమస్తే, స్వభక్తాళిచిత్తాలయాయై నమస్తే, మృగాధీశవాహోత్తమాయై నమస్తే, పయో జాస్త్రశత్రూత్తమాయై నమః, కాన్తిమత్యై నమః, కాన్తమత్యై నమ, స్సర్వసూత్యై నమ, స్సౌమ్య భూత్యై నమ, శ్శర్మదాయై నమ,శ్శైల జాయై నమః, కామదాయై నమః, కాళికాయై నమస్తే, నమస్తే, నమః. 32

టీక: అథేదానీం కవిః ప్రకృతోపయోగిత్వేన సకలపురుషార్థసంపాదినీందేవీం 'జయ జయ జగతీ' త్యాదినా ప్రస్తౌతి.

జయజయ—నిరతిశయేనోత్కర్షేణ వర్తస్వ అత్ర నిత్యవీప్సయోరితి ద్విర్భావః; జగతీనాయికే— జగతః ప్రపంచస్య నాయికే ఈశ్వరి; భక్తలోకేష్టసంధాయికే— భక్తలోకస్య భక్తజనస్య, ఇష్టస్య పురుషార్థచతుష్టయస్య, సంధాయికే సంపాదయిత్రి; నిత్య బిన్దుత్రికోణాష్టకోణాది కోణావళీ విస్ఫుర చ్చక్రసింహాస నోద్ద్యోతమానాత్మికే— నిత్యం వినాశరహితం, చక్రవిశేషణ మేతత్ బిన్దు స్సుధాబిన్దు స్తత్పరిత స్త్రికోణ న్తదభితోఽష్టకోణ మేతదాదీనాం కోణా స్తత్తద్దేవతాధిష్ఠానరేఖాః తేషా మావళ్యా విస్ఫుర త్ప్రకాశ మానం చక్రం శ్రీచక్రం తదేవ సింహాసనం తత్రోద్ద్యోతమాన ఆత్మా స్వరూపం యస్యా స్సా తథోక్తా— శ్రీచక్రలక్షణంతు, 'బిన్దు త్రి కోణ వసుకోణ దశారయుగ్మ మన్వశ్ర నాగదళసంయుత షోడశారమ్। వృత్తత్రి భూపురయుతం పరిత శ్చతుర్ద్వా శ్రీచక్రమేత దుదితం పరదేవతాయాః' ఇతి; సర్వమన్త్రాత్మికే— సర్వమన్త్రాణ్యేవ ఆత్మా స్వరూపం యస్యా స్సా తథోక్తా.

అథ దేవ్యా మాహాత్మ్య మభివర్ణయతి సదిత్యాదినా -

సద్వటానోకహోపాన్తసీమా వస ద్బోధముద్రాన్వితాశామ్బర స్వాన్త నిద్రాళు పఞ్చాశుగోన్మీలనాకార కాపాఙ్గ సంచారభఙ్గీ సముద్భూత సర్గాదికార్యత్రయీ సక్తవైధాణ్డ భాణ్డ ప్రకాణ్డే— సతో వటానోకహస్య ఉపాన్తసీమాయాం సమీపభూమౌ వసన్ యోబోధముద్రయా అన్విత స్సంగత ఆశామ్బరో దక్షిణామూర్తి స్తస్య వటతరుమూలవసతి ర్జ్ఞానముద్రా చాగమప్రసిద్ధా, వట విటపిసమీపే బోధముద్రాం దధాన ఇతి , తస్య స్వాన్తే హృదయే నిద్రాళో రజాగ్రతః 'నిద్రాతేరాళుచ్' పఞ్చాశుగస్య కామస్య ఉన్మీలనాయాః వికసనస్య కారకస్య అపాఙ్గస్య కటాక్షస్య సంచారో వలనం తస్య భఙ్గీ ప్రకారః తయా సముద్భూతాని జాతాని

సర్గాదీని సృష్టిస్థితిప్రళయా స్తా న్యేవ కార్యాణి తేషాం త్రయీ త్రి తయం తయా సక్త స్సంగతః విధేరిమాని వైధాని తస్యేద మిత్యణ్ తానిచ తా న్యణ్డాని తాని భాణ్డా నీవ తేషాం ప్రకాణ్డ స్సంఘాతో యస్యా స్సా తథోక్తా, 'ప్రకాణ్డ ముద్ఘ తల్లజా' ఇత్యమరః.

వినీలాఙ్కరేఖా వృతాబ్జారి బిమ్బోపమా సమ్మిళ త్కుణ్డలీభూత హీరోపలప్రోత కోదణ్డదణ్డోత్త మోద్వాన్త శైత్యప్రకా రోజ్జ్వల ద్గోనికాయోపభు క్తోగ్రధూమ్రాక్ష దర్పచ్ఛల ధ్వాన్తికే – విశిష్టానీలా అన్తః ఖచిత నీలమణయో యస్య స తథోక్తః, కోదణ్డోత్తమ విశేషణ మేతత్, అఙ్కస్య కలఙ్కస్య రేఖయా వృత మాక్రాన్త మబ్జారిబిమ్బం చన్ద్రమణ్డలం తేనోపమా సామ్యం తయా సం మిళన్ సంగతః కుణ్డలీభూత శ్చక్రీభూతో హీరోపలైః ప్రోత స్స్యూతః కోదణ్డోత్తమ స్తేనోద్వాన్తై ర్నిర్గమితై శ్శైత్యస్య నిశితత్వస్య అన్యత్ర శీతలత్వస్య ప్రకారేణ విధయా ఉజ్జ్వలన్తో గోనికాయా శ్శరసంఘా అన్యత్ర కిరణనిచయా స్తై రుపభుక్తం భక్షితం వినా శిత మిత్యర్థః ఉగ్రస్య ధూమ్రాక్షస్య రక్షసో దర్పచ్ఛలం ధ్వాన్తం యస్యా స్సా తథోక్తా.

వార్షుకా మ్భోదజిత్కాన్తికే – వర్షతీతి వార్షుకః అభనతసదస్థాభూవృషేత్యాదినా ఉకఞ్ ప్రత్యయః తం అమ్భోదం మేఘం జయతీతి జిత్ కాన్తికే తాదృశీ కాన్తి ర్యస్యా స్సా తథోక్తా, దేవ్యాః కృష్ణవర్ణత్వ మాగమప్రసిద్ధమ్, తథాచ నవామ్బురుహలోచనా మభినవామ్బుదశ్యామలాం త్రియమ్బకకుటుమ్బినీం త్రిపురసున్దరీ మాశ్రయే.

రోచమానాత్మభూ మిత్రతారాహితీయుక్త చిత్రక్రియా సంచరన్మధ్వవష్టమ్భ విధ్వంసనోదార లక్ష్మీశనిద్రాపహా ర్యద్భుతక్రీడనా శాలి మాయాఘన ప్రక్రమాభ్యఞ్చితే – రోచమానః ప్రకాశమాన ఆత్మభువో బ్రహ్మణో మిత్రతా మైత్రీ తస్యా రాహితీ రాహిత్యం తయా యుక్తా సంగతా చిత్రక్రియా అద్భుతచేష్టా తాడనపీడనాదిః తయా సంచరన్ యో మధు ర్దానవ స్తస్య అవష్టమ్భో గర్వం తస్య విధ్వంసనే ఉదారా లక్ష్మీశనిద్రాయా అపహారిణీ నివారికా అద్భుతక్రీడనా తయా శాలత ఇతి తచ్ఛాలినీ యా మాయా తస్యా ఘనప్రక్రమ స్తేనాభ్యఞ్చితే.

సత్కలాళీనిరాకుఞ్చితే – సతీనాం కలానాం సౌరాదికలానా మాళీ పఙ్క్తిః తయా నిరాకుఞ్చితే అనల్పే.

మత్తదన్తీన్ద్రగర్జా మృదఙ్గవ్రజ ధ్వాన దైత్యేన్ద్రసేనావళీ సింహనాదాఖ్య గానాభిరఙ్గ న్మహాజన్యరఙ్గస్థలీ నృత్యదుగ్రాసివల్లీనటీ ప్రాపితా ప్రత్నపుష్పాఞ్జలీభూత శుమ్భాదిక క్రవ్యభుఙ్మాలికా నిర్గళన్మౌక్తికశ్రేణికే – మత్తాః మదవిశిష్టాః యే దన్తీన్ద్రాః గజశ్రేష్ఠా స్తేషాం గర్జా బృంహితాని తా ఏవ మృదఙ్గవ్రజధ్వానా మర్దలసంఘాతనినదా దైత్యేన్ద్రాణాం రక్షోవరాణాం యా సేనావళీ వాహినీపరంపరా తస్యా స్సింహనాదాః క్ష్వేడనాని తదాఖ్యాని గానాని తైశ్చ అభిరఙ్గత్ శోభమానం మహత్ అధికం జన్యం యుద్ధం తస్య రఙ్గః స్థానం స ఏవరఙ్గో నాట్యశాలా తస్య స్థలీ అకృత్రిమభూమిః, జానపదేత్యాదినాఙీష్, తత్ర నృత్యన్తీ ఉగ్రాయా అసివల్లీ సైవ నటీ నర్తకీ తయా ప్రాపితా అప్రత్నా పుష్పాఞ్జలిః రఙ్గప్రసాధనవిశేషః తద్భూతా శుమ్భ ఏవ ఆది ర్యేషాం తే శుమ్భాదికా స్స్వార్థే కః యే క్రవ్యభుజో రాక్షసా స్తేషాం మాలికా స్తాభ్యో నిర్గళన్తీ మౌక్తికశ్రేణిః యస్యా స్సా తథోక్తా.

పుణ్యమర్త్యోత్కరారోహ్యా సౌభాగ్య సౌధార్పితోదార కారుణ్యనిశ్రేణికే – పుణ్యాః పవిత్రా మర్త్యోత్కరా మానుషనివహా స్తై రారోహ్యా ఆరోఢుం శక్యా సౌభాగ్య మేవ సౌధ స్తత్ర అర్పితా ఉదారం గమ్భీరం కారుణ్యం కరుణా తదేవ నిశ్రేణికా అధిరోహిణీ యస్యా స్సా తథోక్తా. శివగృహిణి – శివభార్యే.

అథ భగవత్యా నఖాదికచాన్తానా మవయవానాం లోకాతిశాయి సౌన్దర్యం వర్ణయతి నిజేత్యాదినా.

నిజౌపమ్యలీలా నిశోజ్జృమ్భమాణేన్దుజాయా పరివ్యక్త జాగ్రత్క్రుధాఙ్కార శఙ్కాసమాపాది లాక్షారసోల్లిఙ్గితాంఘ్ర్యబ్జదీవ్య న్నఖవ్రాత విభ్రాజితే – నిజం స్వీయ మౌపమ్యం తస్య లీలా క్రియా తయా అనిశం సంతత ముజ్జృమ్భమాణా ఇన్దుజాయా స్తారకా స్తాభిః పరివ్యక్తం స్ఫుటం యథా జాగ్రత్ నిస్తంద్ర శ్చ యః క్రుధాఙ్కారో రోషప్రరోహ స్సఇతి శఙ్కా మాపాదయతీతి

తథోక్తః లాక్షారసో యావకద్రవ స్తేనోల్లిఙ్గితం చిహ్నిత మఙ్ఘ్రి రబ్జమివ అఙ్ఘ్ర్యబ్జం తత్ర దీవ్యన్తః ప్రకాశమానాశ్చ యే నఖాస్తేషాం వ్రాతేన సమూహేన విభ్రాజితే. దేవతాపూజితే.

నిత్యసత్కాన్త సంసేవ్యపాదామ్బుజా తాధరీభూతపద్మాకరోదఞ్చితామ్భోజహైన్యక్రియావాచి శిఞ్జారవోద్భాసిమఞ్జీర భూషానుషఙ్గే– నిత్యం యథాతథా సత్కాన్తైః సజ్జనశేఖరైః చన్ద్రేణేతిచ గమ్యతే సంసేవ్యే భజనీయే పాదా వమ్బుజే ఇవ పాదా మ్బుజాతే తాభ్యా మధరీభూతాని తిరస్కృతాని పద్మాకరోదఞ్చితామ్భోజాని తేషాంహైన్యక్రియాం వక్తీతి తద్వాచీ సచాసౌ శిఞ్జారవో ధ్వనివిశేషః, 'భూషణానాంతు శిఞ్జితే' మిత్యమరః, తేన ఉద్భాసితౌ యౌ మఞ్జీరౌ నూపురౌ తావేవ భూషే భూషణే తాభ్యా మనుషఙ్గ స్సంబన్ధో యస్యా స్సా తథోక్తా.

కనజ్జాఙ్ఘిక శ్రీజితోద్యన్మనోభూ నిషఙ్గే– కనన్తీ ప్రకాశమానా జాఙ్ఘికా జఙ్ఘామాశ్రిత్య స్థితా యా శ్రీః తయా జితా ఉద్యన్తౌ యౌ మనోభువో మదనస్య నిషఙ్గౌ తూణీరౌ యస్యా స్సా తథోక్తా.

మహాయౌవనాళీక మల్లాదిభూకేళికా స్తమ్భసంవి త్ప్రదాత్రూరుకాణ్డే– మహత్ పూర్ణం యౌవన మేవ అళీకమల్లాదిభూ ర్మిథ్యామల్లనాయక , 'అధిభూర్నా యకోనేతా' ఇత్యమరః , తస్య కేళికాస్తమ్భః క్రీడార్థదారువిశేషః స ఇతి సంవిదః జ్ఞానస్య ప్రదాతారౌ ఊరుకాణ్డౌ యస్యా స్సా తథోక్తా.

సరోరాజసౌభాగ్యజిన్నాభికుణ్డే– సరోరాజస్య కాసారశ్రేష్ఠస్య, 'రాజాహస్సఖిభ్యష్ట జితి టచ్ ప్రత్యయః', తస్య సౌభాగ్యం సుభగత్వం తజ్జయ తీతి తజ్జిత్ నాభిః కుణ్డ మివ నాభికుణ్డం యస్యా స్సా తథోక్తా.

వలగ్నస్థలీకార్శ్య జిజ్ఞాసుపుష్పేషు బద్ధస్ఫురన్ముష్టికా బన్ధనప్రోత్థగమ్భీరనాభీగుహాన్తస్తట ధ్వాన్తరేఖామనీషాప్రదశ్యామ రోమాళికే–వలగ్నస్థల్యా మధ్యదేశస్య యత్కార్శ్యం సూక్ష్మత్వం తజ్జిజ్ఞాసు ర్జాతుమిచ్ఛుః, 'జానాతే స్సన్నన్తా దుచ్ప్ర త్యయః', తేన పుష్పేషుణా స్మరేణ బద్ధం గ్రథితం యత్ స్ఫురన్త్యా ముష్టికాయా బన్ధనం నిపీడనం తేన ప్రోత్థా యద్వళీ ముఖేన ప్రసృతా ఇదం రేఖావిశేషణం గమ్భీరాయా అగాధాయా నాభిగుహాయా అన్తస్తట స్తస్య గర్భప్రదేశస్య యా ధ్వాన్త రేఖా తిమిరరాజిస్సేతి మనీషా ధీ స్తత్ప్రదా శ్యామా మేచకా రోమాళికా యస్యా స్సా తథోక్తా.

సారశృఙ్గారవారాశిభఙ్గప్రమాకృద్వళీపాళికే– సార శ్శ్రేష్ఠ శ్శృఙ్గార శ్శృఙ్గారరస ఏవ వారాశి రుదధి స్తస్య భఙ్గా స్తరఙ్గా ఇతి ప్రమాం బుద్ధిం కరోతీతి తత్కృత్ తాదృశీ వళీపాళికా యస్యా స్సా తథోక్తా.

చారుతారుణ్యమాయా మహాకుమ్భికుమ్భద్వయీద్వాపరద్వారవక్షోభవే– చారు ఉజ్జ్వలం యత్తారుణ్యం యౌవనం తదేవ మాయా మహాకుమ్భీ భద్రగజ స్తత్కుమ్భద్వయీ శిరఃకూటద్వయం సేతి ద్వాపర స్సందేహ స్తస్య ద్వారే నిర్గమనమార్గౌ కారణే ఇతి యావత్ తాదృశౌ వక్షోభవౌ యస్యా స్సా తథోక్తా.

పాణిభాత్రాతపాథోభవే– పాణ్యో ర్హస్తయో ర్భా కాన్తి స్తయా త్రాతాని రక్షితాని పాథోభవాని పద్మాని యస్యా స్సా తథోక్తా.

సంతతాసక్తసర్వజ్ఞ దృగ్జాతపాతక్రియా జాయమానాత్మలావణ్యకూలఙ్కషా బుద్బుదశ్రేణికారూప ముక్తావళీ భాసమానే– సంతతం నిరంతర మాసక్తస్య రతస్య సర్వజ్ఞస్య శివస్య దృశాం యజ్జాతం సంఘాత స్తస్య పాతక్రియయా పతనకర్మణా జాయమానా సముత్పద్యమానా శ్రేణికా విశేషణ మేతత్, ఆత్మన స్స్వస్య యల్లావణ్యం సౌన్దర్యం తదేవ కూలఙ్కషా తటినీ తస్యా బుద్బుదానాం శ్రేణికా తద్రూపా యా ముక్తావళీ తయా భాసమానే.

శుభామోది కాశ్మీరకస్తూరికా పఙ్కచర్చా పరిద్యోతమానే– శుభో మఙ్గళ ఆమోదః పరిమళః సోస్యాస్తీతి తథోక్తా, కాశ్మీరం కుఙ్కుమం కస్తూరికా మృగమద స్తయోః పఙ్కః యః కర్దమ స్తస్య చర్చా అనులేపనం తేన పరిద్యోతమానే.

మనోజ్ఞాస్యపద్మాహితార్చాప రామ్భోజబాణప్రతిష్ఠాపి తామూల్యశఙ్ఖీభవ త్కన్ధరే– మనోజ్ఞం సున్దర మాస్య మాననం తదేవ పద్మాహిత శ్చన్ద్రః విష్ణురితిచ వ్యజ్యతే తస్యార్చా పూజనం తత్ర పర ఆసక్తః అమ్భోజబాణో మదన స్తేన ప్రతిష్ఠాపితః

అమూల్యః అనర్ఘ శ్శఙ్ఖః కమ్బు రస స్సంపద్యమానః శఙ్ఖీభవన్, 'అభూతతద్భావేచ్విః చ్వౌ చేతి దీర్ఘః', తాదృశీ కన్ధరా శిరోధి ర్యస్యా స్సా తథోక్తా.

పాణితప్రాణబన్ధూభవద్భవ్యవాగ్బన్ధురే– పాణితస్య ఖణ్డశర్కరాయాః, 'మత్స్యండీ పాణితం ఖండ' ఇత్యమరః, ప్రాణబన్ధుః అతిసుహృత్ తత్త్వేన సంపద్యమానయా భవ్యయా మనోజ్ఞయా వాచా బన్ధురే.

సలలితఖగచక్రాఙ్గకాణ్డ ద్విజావిక్షతాఙ్కాన్వితప్రస్ఫుర త్పక్వబిమ్బప్రతీకాశరమ్యోష్ఠబిమ్బే– సలలిత స్సవిలాసః ఖగ స్తార్క్ష్య స్స ఏవ చక్రాఙ్గో రథో యస్య స విష్ణు రిత్యర్థః, స కాణ్డో బాణో యస్యేతి బహువ్రీహిః శివ ఇత్యర్థః, స ఏవ ద్విజ శ్శుక స్తేన ఆవిక్షతాని సమన్తా ద్విద్ధాని అఙ్కాని చిహ్నాని తై రన్వితః ప్రస్ఫురన్ పక్వబిమ్బో బిమ్బఫలం తేన ప్రతీకాశో నిభః రమ్యోష్ఠ బిమ్బో యస్యా స్సా తథోక్తా; అథవా, సలలితః ఖగో వాయు ర్మలయానిల ఇత్యర్థః, స ఏవ చక్రాఙ్గో రథో యస్య స మదన స్తస్య కాణ్డా అశ్వా శ్శుకా స్తైశ్చ తేద్విజాశ్చ తై రావిక్షతాని అఙ్కాని తైరన్వితః ప్రస్ఫురన్ పక్వబిమ్బ స్తస్యశుకముఖావిద్ధపక్వ బిమ్బఫలస్యేతి భావః ప్రతీకాశో రమ్యోష్ఠబిమ్బో యస్యా స్సా తథోక్తా.

నవాదర్శసద్దర్ప నిర్వాపణోద్యుక్త గణ్డద్వయాంచన్మరీచీ కదమ్బే– నవాదర్శస్య నూతనదర్పణస్య యో దర్ప స్తస్య సద్గ ర్వస్య నిర్వాపణే నాశనే ఉద్యుక్తం సన్నద్ధం గణ్డద్వయం తేన అఞ్చత్ మరీచీకదమ్బం యస్యా స్సా తథోక్తా.

స్వకశ్రీసమఙ్కారిత త్రాసయోగాటవీ లీన కున్దోపరివ్యక్త నవ్యానుకమ్పారసోహాకరా శ్రాన్త వీటీరసవ్యాప్త దన్తాళికాద్వైతవాద్యు జ్జ్వలద్దాడిమీబీజజాలే– స్వకశ్రియా స్వీయకాన్త్యా సమఙ్కారితో జాతో యస్త్రాసః భయం తస్య యోగాత్ సంబంధాత్ అటవ్యాం లీనాని కున్దాని మాఘ్యాని తేషా ముపరి వ్యక్తః పరిస్ఫుటో నవ్యో నూతనః అనుకమ్పారసో దయారస స్స ఇత్యూహాం బుద్ధిం కరోతీతి తత్కరః అశ్రాన్త వీటీరసః నిరన్తరతామ్బూలరస స్తేన వ్యాప్తా ఆక్రాన్తా దన్తాళికా తస్యా అద్వైతం వదతీతి తద్వాది యదుజ్జ్వల త్ప్రకాశమానం దాడిమ్యా బీజజాలం యస్యా స్సా తథోక్తా.

సునాసాజితామూల్యసౌవర్ణజాలే– సునాసయా జితా న్యమూల్యా న్యనర్ఘాణి సౌవర్ణాని చమ్పకసంబన్ధీని జాలాని ముకుళాని యస్యా స్సా తథోక్తా.

లసత్కజ్జలాఙ్కోపధి త్రోటికాయుక్త రమ్యాస్యలావణ్యకేళీవనీవీథికా సంచర త్ఖఞ్జరీటాయమానోల్లసల్లోచనే– లసతః కజ్జలస్య అఙ్కః చిహ్నం స ఇత్యుపధిః ఛద్మ యస్యా స్సా త్రోటికా చంచూ స్తయా యుక్తౌ ఖంజరీటవిశేషణ మేతత్, రమ్యస్య ఆస్యస్య లావణ్యం సౌన్దర్యం తదేవ కేళీవనం ప్రమదవనం తస్య వీథికా అత్ర సంచరన్తౌ ఖఞ్జరీటా వివాచరన్తీ, కర్తరిక్యజ్ ఖఞ్జరీటాయమానే, ఉల్లసల్లోచనే యస్యా స్సా తథోక్తా.

భ్రూలతాయుగ్మసంప్రాపితానఙ్గచాపత్విషామోచనే– భ్రువౌ లతేవ భ్రూలతే తయోర్ద్వంద్వేన ప్రాపితస్య అనఙ్గస్య చాపః ధను స్తస్య త్విషా కాన్తిః, హలంతలక్షణటాబంతోయం, తస్యా మోచనం నివృత్తి ర్యస్యా స్సా తథోక్తా.

భవ్యకాశ్మీరభూచిత్రకాకార ఫాలాన్తరభ్రాజమానానిలాప్తేక్షణే– భవ్యం మనోజ్ఞం కాశ్మీరభూచిత్రకం కుఙ్కుమతిలకం తస్య ఆకారో ఆకృతి ర్యస్య తత్ ఈక్షణవిశేషణ మేతత్, ఫాలాన్తరే భ్రాజమానం ప్రకాశమానం అనిలాప్తేక్షణం అగ్నినయనం యస్యా స్సా తథోక్తా.

వక్త్రతేజఃపరిక్షీణపూర్ణక్షపానాథకాన్తిక్షణే– వక్త్రతేజసా పరిక్షీణా పూర్ణక్షపానాథస్య పూర్ణచన్ద్రస్య కాన్తిః తస్యాః క్షణో యస్యా స్సా తథోక్తా.

సంత తాభ్యర్ణసీమా వస ద్వేణికారాహు సందర్శనోద్విగ్నచేతస్క చూడామణీభూత శీతాంశురేఖాగళ త్సాణ్డురస్వేదపాథః పృషన్మాలికామోహ దానర్ఘ్య ముక్తాలలన్తీ లతాలంకృతే– సంతత మనారత మభ్యర్ణసీమాయాం వసన్ వేణికైవ రాహుః తస్య సందర్శనేన ఉద్విగ్నం భీతం చేతః యస్యా స్సా,'ఉరః ప్రభృతిత్వాత్ కప్', తాదృశచేతస్క శ్చూడామణీభూత శ్శీతాంశుః

తస్య రేఖా శకలం తస్యా గళన్తీ ప్రసరన్తీ పాణ్డురస్వేదపాథః పృషతాం మాలికా పంక్తిస్సేతి మోహం దదాతీతి తథోక్తా తాదృశా నర్ఘ్యయా ముక్తాలలన్తికయా లతయేవ సీమంతాంతర లంబమానహారయష్ట్యా అలంకృతే.

రత్నతాటఙ్కయుగ్మాన్వితే– రత్నతాటఙ్కయో ర్యుగ్మం, తేనాన్వితే।.

కాలకణ్ఠాన్తరఙ్గ ప్రమోదప్ర దాప్రత్నచామ్పేయదామాఖ్య సౌదామినీవల్లికా యుక్తవేణీపయోదాభిరామే– కాలకణ్ఠస్య శివస్య అన్తరఙ్గం హృదయం తస్య ప్రమోదప్రదా సంతోషదాయినీ అప్రత్నా నూతనా చామ్పేయదామేతి చంపకమాలికేతి ఆఖ్యా ప్రసిద్ధిః యస్యా స్సా తాదృశీ సౌదామినీవల్లికా తటిల్లతా తయా యుక్తా వేణీ సైవ పయోదః కాలామ్బుదస్తేనాభిరామే.

నతాగారిరామే– నతా అగారిరామా శచీ యాం సా తథోక్తా; సతత మగజే– సంతతం నిరంతరం అగజే పార్వతి;

త్వమేవాత్మమాతా– త్వమేవ ఆత్మ ఆత్మనో మమ మాతా జననీ; శివే త్వాం భజే; దేవదేవి శివస్య పత్నీ త్వయా రక్షితః అహమ్; విశాలాక్షి తుభ్యం భవత్యై మనోభక్తి ర్భజనం తదేవ విత్తం ధనం దదామి అమ్బికే, తుభ్య మిత్యత్ర కర్మణేత్యాదినా సంప్రదానసంజ్ఞయా చతుర్థీ; నాశ్రయామి త్వదన్యాం– త్వత్ భవత్యా అన్యాం దేవతాంతరం అన్యారాదితి పంచమీ నాశ్రయామి; మహాకాళి దాస్యం తవ ప్రాపయాబ్జావతంసే– దాస్యం కింకరత్వం ప్రాపయ గమయ మామితి శేషః; తుభ్యం నమః– తుభ్యం భవత్యై నమః స్వస్తీతి చతుర్థీ; యోగిమృగ్యోజ్జ్వలచ్చిత్కళాయై– యోగిభిః సంయమిభిః మృగ్యా అన్వేషణీయా ఉజ్జ్వలన్తీ చిత్కళా సంవిత్ప్రకాశః తద్రూపాయై; గోధిభాః కృత్తరాత్రీట్కలాయై–గోధి ర్లలాటం,‘లలాట మలికం గోధీత్యమరః’, తస్య భాసా తేజసా కృత్తా ఖండితా రాత్రీశః చన్ద్రస్య కలా శకలం యయా సా; నిత్యపూతామితప్రాభవాయై– నిత్యం పూతం అమితం అవేలం ప్రాభవం సామర్థ్యం యస్యా స్సా; హస్తసంబద్ధనీరేశయాయై– హస్తే పాణౌ సంబద్ధం సంలగ్నం నీరేశయం కమలం యస్యా స్సా; దేవతారూపశయ్యాశయాయై– దేవతాః బ్రహ్మాదయో మంచతాం ప్రాప్తా ఇత్యాగమప్రసిద్ధిః; పయోజాస్త్రశత్రూత్తమాయై– పయోజాస్త్రశత్రు శ్శివ స్తస్యోత్తమా వరవర్ణినీ తస్యై; కాన్తిమత్యై– కలావత్యై; కాన్తమత్యై– కాన్తా మనోజ్ఞా మతి ర్బుద్ధి ర్యస్యా స్సా; సర్వసూత్యై– సర్వస్య ప్రపంచస్య సూత్యై జనన్యై; సౌమ్యభూత్యై– సౌమ్యా అకరాళా భూతి స్సంపత్ యస్యా స్తస్యై; శర్మదాయై– సుఖదాయై;శైలజాయై – అగజాయై;

‘విద్వాంసు లెల్లన్ హకారంబెకానీ సకారంబెకానీ నకారంబెకానీ వచింపం దగు న్మొందుగా నిందుఁ గాదేని నాదిం దకారంబుఁ గల్పించి యామీఁద నెల్లం దకారంబులే మెండుగా నిచ్చకు న్వచ్చునందాక నిర్మించి గుర్వంతముం జేసినం దండకం బండ్రు’ అని యప్పకవీయమున దండకలక్షణము.

సీ. ఔదలఁ దళుదళు◊క్కనురిక్కఱేనితోఁ, గూర్మి పైఁ గ్రమ్ముక◊న్గొనలతోడ,
నెమ్మోముతమ్మిపై ◊నిగుడులేనవ్వుతో, నుదుటిచూపున నొప్పు◊నుదుటితోడ,
పాలిండ్ల నొరయుము◊త్యాలసరాలతోఁ, బూలదండఁ దనర్చు◊కేలితోడ,
నడుగుల జీరుపు◊త్తడివలిపెమ్ముతోఁ, దావి గ్రమ్మెడు మేని◊తీవతోడ,
తే. నలరి వలిగట్టుపట్టి త◊న్గొలిచి వేల్పు,టింతితలమిన్న లేతేర ◊నెల్లవారు,
గాంచి యబ్రమ్ము మదిఁ జాల◊నుంచఁ బుడమి,సామిముంగల నపుడు సా◊క్షాత్కరించె. 32

టీక: ఔదలన్=శిరమునందు; తళుతళుక్కను = తళతళయని ప్రకాశించు; రిక్కఱేనితోన్=నక్షత్రేశుఁడైన చంద్రునితో; కూర్మి = కరుణ;పైన్ క్రమ్ముకన్గొనలతోడన్ = పైకొనునట్టి కటాక్షములతోడ;

నెమ్మోముతమ్మిపైన్ = సుందరమగు ముఖపద్మమునందు; నిగుడులేనవ్వుతోన్ = వ్యాపించు చిఱునగవుతోడ; నుదుటిచూపునన్ = లలాటలోచనముచేత; ఒప్పు నుదుటితోడన్ = ప్రకాశించు నొసటితోడ;

పాలిండ్లన్=కుచములను; ఒరయుముత్యాలసరాలతోన్ – ఒరయు = రాయుచున్న, ముత్యాలసరాలతోన్=ముక్తాహారములతోడ; పూలదండన్=పూసరముచే; తనర్చుకేలితోడన్ =ప్రకాశించుకరముచేత;

అడుగులన్=పాదములయందు; జీరుపుత్తడివలిపెమ్ము తోన్ = జీరాడు బంగరుమడుగువస్త్రముతోడ;తావి క్రమ్మెడు మేనితీవతోడన్ = వలపుకొనునట్టి తీవవలె నున్న శరీరముతోడ;

అలరి = సంతసించి; వలిగట్టుపట్టి = హిమవంతునకు కూఁతురగు పార్వతీదేవి; తన్గొలిచి = తన్ను సేవించి; వేల్పుటింతితలమిన్నలు = శ్రేష్ఠలగు దేవాంగనలు; ఏతేరన్ = వచ్చుచుండఁగా; ఎల్లవారు=సమస్తజనులు; కాంచి=చూచి; అబ్రమ్మున్=ఆశ్చర్యమును; మదిన్=మనమునందు; చాలన్=మిక్కిలి; ఉంచన్=ఉంచుచుండఁగా; పుడమిసామిముంగలన్=క్షణదోదయరాజునెదుట; అపుడు=ఆసమయమందు; సాక్షాత్కరించెన్ = ప్రత్యక్షమాయెను.

అనఁగా శిరమునందుఁ బ్రకాశించు చంద్రుఁడును, దయారసము నొలుకు కనుతుదలును, చిఱునగవును, ఫాలలోచనమును, చనుఁగవ నొరయు ముత్యపుసరులును, పూసరముచే నొప్పు కేల్దమ్మియును, బంగరువస్త్రమును, పరిమళించు నంగలతికయు నొప్పార నెల్లరు వింత నొంది చూచుచుండ గట్టురాపట్టి పుడమియొడయనియెదుటఁ బ్రత్యక్షమాయె నని భావము.

ఉ. ఇట్టు లపారతత్పరత ◊హెచ్చఁగ నాసెగకంటివేల్పురా
పట్టపుదేవి తద్ధరణి◊పాలకుముంగలఁ దోఁప వేడుక
ల్మట్టెగయ న్మహీశ్వరులు ◊మంచతలంబుల నిల్చి భక్తిఁ జే
పట్టి లలాటవీథిఁ గర◊పంకరుహాంజలు లుంచి రందఱున్. 33

టీక: ఇట్టులు=ఈవిధముగ; అపారతత్పరత = మిక్కుటమైన ఆసక్తి;హెచ్చఁగన్=అతిశయింపఁగ; ఆసెగకంటివేల్పురాపట్టపుదేవి = వీతిహోత్రుఁడు నేత్రముగాఁ గల దేవదేవునికిఁ బట్టపురాణియగు పార్వతి; తద్ధరణిపాలకుముంగలన్ = ఆపుడమిసామి యెదుట; తోఁపన్=కనుపట్టఁగా; వేడుకల్=వినోదములు; మట్టెగయన్=మితిమీఱఁగా; మహీశ్వరులు=రాజులు; మంచతలంబులన్=మంచప్రదేశములయందు; నిల్చి =నిలుచుకొని; భక్తిన్=భక్తిని; చేపట్టి=గ్రహించి; లలాటవీథిన్=నొసటిపట్టున; అందఱున్=ఎల్లరును; కరపంకరుహాంజలులు = కేలుదామరమోడ్పులను; ఉంచిరి=ఉనిచిరి. అనఁగా నాక్షణదోదయుని యెదుటఁ బార్వతి ప్రత్యక్షము కాఁగానే రాజులందఱు మంచములపై నిలుచుండి భక్తిచేఁ గేలు మోడ్చి రని భావము.

శ. ఆవేళన్ క్షణదోదయక్షితితలా◊ధ్యక్షుండు తత్పాదరా
జీవద్వంద్వము మౌళిఁ జేర్చి వినయ◊శ్రీ జంద్రికం దన్మహా
దేవప్రేయసి కప్పగింప నటఁ దో◊డ్తెప్పించె వేగ న్వయ
స్యావారంబుల నాత్మలోచనకృత◊వ్యాపారము ల్పంపఁగన్. 34

టీక: ఆవేళన్=ఆసమయమందు; క్షణదోదయక్షితితలాధ్యక్షుండు =క్షణదోదయరాజు; తత్పాదరాజీవద్వంద్వము – తత్ = ఆపార్వతీదేవియొక్క, పాదరాజీవద్వంద్వము = పదపద్మయుగమును; మౌళిన్=శిరమునందు; చేర్చి=కదియించి; వినయశ్రీన్=వినయసంపదతో; చంద్రికన్=చంద్రికను;తన్మహాదేవప్రేయసికిన్ =శంకరునికిఁ బ్రియురాలగు నాపార్వతికి; అప్పగింపన్

=ఒప్పగించుటకై; అటన్=అటు పిమ్మట; వయస్యావారంబులన్ =చెలికత్తెలగుంపులను; ఆత్మలోచనకృతవ్యాపారముల్ – ఆత్మ=తనయొక్క, లోచన=నేత్రములచేత, కృత=చేయఁబడిన, వ్యాపారముల్=పనులు; పంపఁగన్=ఆజ్ఞాపింపఁగ; వేగన్=శీఘ్రముగ; తోడ్తెప్పించెన్=తోడ్కొని రప్పించెను. అనఁగా క్షణదోదదయరాజు ప్రత్యక్షమైన యాపార్వతీదేవికి నమస్కరించి, వినయంబునఁ జంద్రిక నప్పగించుటకై కంటిసైగచేఁ జెలులం బనిచి, చంద్రికను బిలిపించె నని భావము.

సీ. నానావనీపాళి ◊నవ్యరాగోత్సవ,సంధాయకామూల్య◊చైత్రవేళ,
రతిసర్గవిలసనో◊దితచాతురీకనీ,రజసూతికల్పిత◊రత్నపుత్రి,
యద్రికన్యాబ్ధిము◊ఖ్యవిధావినిర్యాత,పాంచాలభూపాల◊భాగ్యలక్ష్మి,
దివ్యాళిపరివార◊దేవతాజనమధ్య,తలరోచమానకం◊దర్పవిద్య,
తే. తనువిభాద్విగుణీభూత◊ధాగధగ్య,సంగతానర్ఘమణిపరి◊ష్కారయుక్త
తన్మహారాజపుత్త్రిక ◊ధరణినాయ,కాజ్ఞ సొగ సెచ్చ నాస్థాని◊ కపుడు వచ్చె. 35

టీక: నానావనీపాళినవ్యరాగోత్సవసంధాయకామూల్యచైత్రవేళ – నానా=అనేకములగు, అవనీపాళి=రాజబృందమునకు, నవ్య=క్రొత్తనగు, రాగ=అనురాగమనెడు, ఉత్సవ=పండుగను,సంధాయక=ఘటిల్లఁజేయు,అమూల్య=వెలలేని, అనఁగ నుత్కృష్టమగు ననుట, చైత్రవేళ=వసంతకాలము; ఇచట నానా=అనేకవిధములగు, వనీపాళి=కాననబృందమునకు నను నర్థాంతరము దోఁచుచున్నది;

రతిసర్గవిలసనోదితచాతురీకనీరజసూతికల్పితరత్నపుత్రి– రతి=మన్మథుని భార్య యగు రతీదేవియొక్క, సర్గ=సృష్టిచేతనైన, విలసన=ప్రకాశముచేత, ఉదిత=పుట్టిన, చాతురీక=చాతుర్యముగల, ఇచట నద్యృరుతశ్చేతి కప్రత్యయము, నకపీతినిషేధముచే హ్రస్వము లేదు , నీరజసూతి=నలువచే, కల్పిత=రచియింపఁబడిన, రత్నపుత్రి=రతనంపుబొమ్మ;

అద్రికన్యాబ్ధిముఖ్యవిధావినిర్యాతపాంచాలభూపాలభాగ్యలక్ష్మి – అద్రికన్యా=పార్వతీదేవి యనెడు,అబ్ధిముఖ్య=పాలకడలియొక్క, విధా=ప్రకారమువలన, వినిర్యాత=వెల్వడిన, పాంచాలభూపాల=క్షణదోదయునియొక్క,భాగ్యలక్ష్మి=సుకృల్లక్ష్మి; చంద్రిక పార్వత్యనుగ్రహమువలన నీక్షణదోదయ రాజునకు జన్మించుటచే పార్వతియను పాలసముద్రమునుండి వెల్వడినదని చెప్పఁబడినది;

దివ్యాళిపరివారదేవతాజనమధ్యతలరోచమానకందర్పవిద్య – దివ్య=సుందరులగు, ఆళి=సఖులనెడు, పరివారదేవతాజన=అంగదేవతాజనములయొక్క, మధ్యతల=మధ్యప్రదేశమునందు, రోచమాన=ప్రకాశించుచున్న, కందర్పవిద్య=మన్మథవిద్య;

తనువిభాద్విగుణీభూతధాగధగ్యసంగతానర్ఘమణిపరిష్కారయుక్త– తనువిభా=దేహకాంతిచేత, ద్విగుణీభూత=రెట్టింపుగాఁ జేయఁబడిన, ధాగధగ్య=ధగధగయను ప్రకాశముతో, సంగత=కూడుకొన్న, అనర్ఘ=అమూల్యమగు, మణి=మణులయొక్క, పరిష్కార=అలంకారములతో, యుక్త=కూడుకొన్నదగు; తన్మహారాజపుత్త్రిక = క్షణదోదయరాజపుత్త్రిక యగు నాచంద్రిక; ధరణినాయకాజ్ఞన్ = ఆరాజుపంపున; సొగసు=అందము; ఎచ్చన్= అతిశయింపఁగా; ఆస్థానికిన్ = ఆస్థానమునకు; అపుడు= ఆసమయమందు; వచ్చెన్=వచ్చెను.

అనఁగా రాజు లనెడు వనపాళికి నామనివలె, రతిని జేసి జాణతనము నొందిననలువచేఁ గల్పితయగు మణిపుత్రికవలె, గట్టురాపట్టి యనుపాలమున్నీటివలన వెడలినట్టి క్షణదోదయసుకృతలక్ష్మివలె, అంగదేవతల నడుమ ననంగవిద్యవలె చెలి

కత్తెలనడుమం బ్రకాశించుచు, తనదేహకాంతిచే రెట్టింపఁబడియున్న కాంతిగల మణిభూషణంబులచే నొప్పు నాచంద్రిక రాజు నాజ్ఞచే నాస్థానమునకు వచ్చె నని భావము.

ఉ. వచ్చుసువర్ణగౌరి జన◊వర్యకుమారి విలోచనంబులం
గ్రచ్చుక పట్టి యచ్చటిధ◊రాపతిసూనునికాయ మయ్యెడ
న్మెచ్చి నుతించె నిశ్చలత ◊మేనులఁ గన్నుల సమ్మదాశ్రువు
ల్మచ్చిక లాత్మ నౌదలఁ జ◊లాచలభావము నివ్వటిల్లఁగన్. 36

టీక: వచ్చుసువర్ణగౌరిన్—వచ్చు=వచ్చుచున్న, సువర్ణగౌరిన్=పసిఁడివన్నె గల; జనవర్యకుమారిన్=రాజపుత్త్రియగు చంద్రికను; విలోచనంబులన్=కన్నులచే; క్రచ్చుక పట్టి = చుట్టి పట్టుకొని; మేనులఁన్=దేహములయందు; నిశ్చలత=మ్రానుపాటు; కన్నులన్= కనులందు; సమ్మదాశ్రువులు=ఆనందబాష్పములు; ఆత్మలన్=మనములందు; మచ్చికలు=మోహములు; ఔదలన్=శిరములందు; చలాచలభావము =చంచలత్వమును; నివ్వటిల్లఁగన్=అతిశయింపఁగ; అయ్యెడన్=ఆసమయమున; అచ్చటిధరాపతిసూనునికాయము = అచట నున్న రాట్కుమారుల సమూహము;మెచ్చి=మెచ్చుకొని; నుతించెన్=పొగడెను.

సీ. క్రొమ్మించుతీవయో ◊క్రొమ్మించుతీవకు, నిశ్చలాంగద్యుతి ◊నెగడు టెట్లు,
జాళువాబొమ్మయో ◊జాళువాబొమ్మకు, మేనఁ జల్లనితావి ◊మెలఁగు టెట్లు,
మందారవల్లియో ◊మందారవల్లికి, మందయానంబు పెం◊పొందు టెట్లు,
మరుఁ డెక్కుదంతియో ◊ మరుఁ డెక్కుదంతికిఁ, బలువాక్యనైపుణుల్ ◊గలుగు టెట్టు
తే. లౌర యీనారిచారుశృం◊గారభంగి, బళిరె యీచానసౌందర్య◊విలసనంబు,
లహహ యీబోటిబిబ్బోక◊హావగరిమ, మనుచు కొందఱు వర్ణించి ◊రనుపమోక్తి. 37

టీక: క్రొమ్మించుతీవయో=క్రొత్తమెఱపుతీవయా? క్రొమ్మించుతీవకున్=క్రొత్తమెఱపుతీవకు; నిశ్చలాంగద్యుతి– నిశ్చల= చలింపని, అంగ=శరీరముయొక్క,ద్యుతి=కాంతి, నెగడు టెట్లు =పెంపొందుటెట్లు? కనుక మెఱపుతీవ కాదని భావము; జాళువాబొమ్మయో=బంగరుబొమ్మయా? జాళువాబొమ్మకున్=బంగరుబొమ్మకు; మేనన్=శరీరమందు; చల్లనితావి = చల్లనివాసన; మెలఁగుట=కలిసియుండుట; ఎట్లు =ఏరీతి?
మందారవల్లియో=పారిజాతలతయో, మందారవల్లికిన్=పారిజాతలతకు;మందయానంబు=తిన్ననినడక; పెంపొందుట = వృద్ధిఁబొందుట; ఎట్లు=ఏవిధము?
మరుఁడు=మన్మథుఁడు; ఎక్కుదంతియో = ఎక్కునట్టి గజమో, మరుఁ డెక్కుదంతికిన్ = మన్మథుఁ డెక్కునట్టి గజమునకు; పలువాక్యనైపుణుల్=నానావిధములగు మాటలయందలి చాతుర్యములు; కలుగు టెట్టులు= చేకూరుట యేవిధము?
ఈనారిచారుశృంగారభంగి=ఈస్త్రీయొక్క మనోజ్ఞమగు నలంకారపురీతి; ఔర=ఆశ్చర్యము! ఈచానసౌందర్యవిలసనంబు– ఈచాన=ఈచంద్రికయొక్క, సౌందర్య=చక్కఁదనముయొక్క, విలసనంబు=ప్రకాశములు; బళిరె =బళా! ఈబోటిబిబ్బోక హావగరిమ – ఈబోటి=ఈచంద్రికయొక్క, బిబ్బోక=స్త్రీలకు నిష్టవస్తువులయందుఁ గల్గెడి యనాదరము, హావ=కటాక్షభ్రూ విక్షేపాదులచే నంగనలు దెలుపు మనోవికారము, గరిమము =పైరెంటియొక్క యతిశయములు; అహహ=ఆశ్చర్యము!

అనుచున్=ఇట్లనుచు; అనుపమోక్తిన్=నిస్సమానమగు మాటలచేత;కొందఱు =కొందఱురాసుతులు; వర్ణించిరి=నుతించిరి. 'ఇష్టే ప్యనాదరో గర్వా న్మానా ద్బిబ్బోక ఉచ్యతే। భావ ఈషత్ప్రకాశో య స్స హావ ఇతి కథ్యతే' అని బిబ్బోకహావలక్షణములు.

అనఁగాఁ గొందఱు రాకొమరులు చంద్రికను జూచి మెఱపుఁదీవయా యని సంశయించి మెఱపుఁదీవకుఁ జలింపనిదేహకాంతు లెక్కడి వనియు, కాదేని బంగరుబొమ్మయో యని దానికి శరీరమందుఁ జల్లనివలపు లెట్లుదయించుననియు, లేదా మందారలతయా యని, మందారలతకు తిన్ననినడక లెట్లు చేకూరు ననియు, మదనునిగజమా, మదనునిగజమునకు పలువిధములగు పలుకు లెట్లుండు ననియు నిట్లు నుతించి రని భావము. ఈ పద్యమునందు సందేహాలంకారము. 'స్యాత్స్మృతి భ్రాన్తి సందేహై స్తదఙ్కాలంకృతిత్రయమ్' అని దాని లక్షణము.

చ. పలుచనివారికిం బొడమి ◊భాసురపుణ్యజనాహితాత్మునిం
గలసి చెలంగ నొప్ప దని ◊కల్మిచెలంది దలంచి ధాత్రి ని
య్యలఘునకు న్జనించె సము◊దంచితపుణ్యజనాప్తు నొక్కరా
జు లలి వరింపఁగోరి యని ◊సొంపుగ నెంచిరి కొంద ఱాత్మలన్. 38

టీక: కల్మిచెలంది =లక్ష్మీదేవి;పలుచనివారికిన్=తక్కువవారికి; పొడమి=పుట్టి; భాసురపుణ్యజనాహితాత్మునిన్ – భాసుర =ప్రకాశించు, పుణ్యజన=సాధుజనమునకు, అహిత=అప్రియమగు, ఆత్మునిన్=మనసుగలవానిని; ఇచట పలుచనివారి కనఁగ పలుచనినీటి కనియు, పుణ్యజనాహితాత్ముని ననఁగా, పుణ్యజన=రాక్షసులకు,'యాతుధానః పుణ్యజనః' అని యమరుఁడు, అహిత=అప్రియమగు, ఆత్మునిన్= మనసుగలవాడైన విష్ణుమూర్తి నని స్వభావార్థము; కలసి=పెనఁగి; చెలంగన్=ఒప్పుట; ఒప్పదని=తగదని; తలంచి= భావించి; ధాత్రిన్=భూమియందు; ఇయ్యలఘునకున్=ఈగొప్పకులమందు బుట్టిన ఘనునికి; సముదంచితపుణ్యజనాప్తున్=మిక్కిలి యొప్పుచున్న సాధుజనహితుఁడగు, మిక్కిలి యొప్పుచున్న పుణ్యజనుఁ డనఁగా యక్షుఁడైన కుముదునకు హితుఁడగు నతఁడని తోఁచుచున్నది; ఒక్కరాజున్=ఒకరాజును; లలిన్=ఆసక్తిచేత; వరింపన్ కోరి = వరియింపఁ దలఁచి; జనించెన్ =పుట్టెను; అని=అనుచు; కొందఱు=కొందఱురాకుమారులు; సొంపుగన్=సంతోషముచేత; ఆత్మలన్=మనస్సులందు; ఎంచిరి=కొనియాడిరి. అనఁగా కొందఱు రాజులు ఈచంద్రికను జూచి లక్ష్మీదేవి తక్కువ యగు కులమువారికిఁ బుట్టి పుణ్యజనవిరోధి యగువానిని జెట్టవట్టి యుండుట కన్నఁ బుడమిలో సాధుజనహితుఁడగు నొకయొడయని పెండ్లియాడి యుండుట మంచి దని తలఁచి ఈఘనునికి జనించె నని నుతించి రని భావము. కుముదుఁ డను యక్షునకు హితుఁడైన సుచంద్రుని వరింపఁ గోరి పుట్టె నని ధ్వని.

సీ. అఖిలవర్ణితచర్య ◊యగునార్యఁ గర్కశా,కృతికి రాతికిఁ బుట్ట ◊నెనపినసడి,
యసమకళాజాల◊వసతికి రతి కనం,గవిలాససంలబ్ధి ◊గఱపు రట్టు,
ఘనరసోదయయుక్తిఁ ◊దనరునుర్వరఁ బంక,సంకులఁగాఁ దార్పఁ◊జాలు మాట,
సుమనోవనాఢ్యవృ◊త్తి మహేంద్రవనిత స్వ,శ్శ్రీయుక్తగాఁ ఘటిం◊చినకొఱంత,
తే. సత్కులోద్భవ వరవిలా◊సయుత ననఘ,మానితశ్రీవిరాజిత ◊నీనెలంతఁ
గోరి నిర్మించి వారించి◊కొనియె నలువ, యనుచు నెంచిరి కొంద ఱిం◊పెనయువేడ్క. 39

టీక: నలువ=బ్రహ్మదేవుఁడు; అఖిలవర్ణితచర్య – అఖిల=ఎల్లవారిచేత,వర్ణిత=నుతింపఁబడిన,చర్య=చరిత్రగలది; అగునార్యన్ =అగునట్టి పార్వతీదేవిని, పూజ్యురాలి నను నర్థము స్ఫురించుచున్నది; కర్కశాకృతికిన్=కఠినమగు నాకారముగల;రాతికిన్ =చట్టునకు; కర్కశాకృతి కిరాతికిన్= కఠినాకారముగల యొక కిరాతస్త్రీ కని యర్థము దోఁచుచున్నది; పుట్టన్= జనించునట్లు; ఎనపినసడిన్ = పొందించినట్టి యపకీర్తిని;

అసమకళాజాలవసతికిన్ – అసమ=సరిలేని, కళా=కాంతులయొక్క,జాల=సమూహములయొక్క,వసతికిన్=నివాసమైన; రతికిన్=రతీదేవికి; సాటిలేనివిద్యలకు నివాసమైన యువిద కను నర్థము దోఁచుచున్నది; అనంగవిలాససంలబ్ధిన్ – అనంగ= మన్మథునియొక్క, విలాస=లీలయొక్క, సంలబ్ధిన్=ప్రాప్తిని; అనంగవిలాస=అంగములు లేని విలాసములయొక్క యని యర్థము దోఁచుచున్నది; కఱపురట్టున్=అభ్యసింపఁజేయు నిందను;

ఘనరసోదయయుక్తిన్ – ఘన=అధికమగు, రస=శృంగారముయొక్క, ఉదయ=ఆవిర్భావముయొక్క,యుక్తిన్ =సంబంధముచేత; ఘనరస=జలముయొక్క, 'మేఘపుష్పం ఘనరసమ్' అని యమరుఁడు, ఉదయ=ఆవిర్భావముయొక్క,యుక్తిన్ =సంబంధముచేత నని స్వభావార్థము; తనరునుర్వరన్=ఒప్పుచున్న భూమిని, ఒకకాంత నని యర్థము దోఁచుచున్నది; పంక =పాపముచేత; సంకులఁగాన్=వ్యాకులమైనదానిఁగా, ఇచట, పంక=బురదచేత నని స్వభావార్థము; తార్పఁజాలుమాటన్ = చేయఁజాలునట్టి యపకీర్తిని;

సుమనోవనాఢ్యవృత్తిన్ – సుమనోవన=నందనవనముచేత, లేదా, దేవసంరక్షణముచేత, ఆఢ్య=సంపన్నమైన,వృత్తిన్ = వ్యాపారముగల; మహేంద్రవనితన్=శచీదేవిని; ఇచట, సుమనోవన=విద్వత్సంరక్షణమందు, ఆఢ్య=సంపన్నమైన,వృత్తిన్ = వృత్తిగల, మహేంద్రవనితన్= పరమైశ్వర్యముగల పురుషునియొక్క కాంత నను నర్థము దోఁచుచున్నది; స్వశ్శ్రీయుక్తగాన్ – సు=అధికమగు, అశ్రీ=అలక్ష్మితో, యుక్తఁగాన్=కూడినదానిగా; స్వశ్శ్రీ=స్వర్గసంపదతో,యుక్తగాన్ = కూడినదానిగా నని స్వభావార్థము; ఘటించినకొఱంతన్ = చేసినకొఱఁతను; గీతియందు క్రమముగా నీనాల్గుపాదములయందలి విషయమున కన్వయము దెలియవలయు;

సత్కులోద్భవన్=శ్రేష్ఠమగు కులమునందుఁ బుట్టినదియు; వరవిలాసయుతన్=శ్రేష్ఠమగు విలాసములు గలదియు; అనఘన్ = పాపరహితయు; మానితశ్రీవిరాజితన్ =పూజ్యమగు సంపదచేత ప్రకాశించునదియు నగు; ఈనెలంతన్ = ఈచంద్రికను; కోరి= అభిలషించి; నిర్మించి=చేసి; వారించికొనియెన్=పోగొట్టుకొనెను; అనుచు=ఈవిధముగాఁ దలఁచుచు; కొందఱు= కొందఱు రాకొమరులు; ఇంపెనయుపేడ్కన్ = అతిశయించిన సంతసముతో; ఎంచిరి=తలంచిరి.

అనఁగా లోకోత్తరయగు నార్యను కఠినమగు చట్టునకుఁ బుట్టునటులు చేసిన యపకీర్తిని, రతీదేవి కనంగవిలాసము కల్గించిన రట్టును, ఉర్వరను పంకమలినమైనదానినిగాఁ జేసిన యపవాదమును, శచీదేవిని సంపదలేనిదానినిఁగాఁ జేసిన కొఱంతను, నలువ చంద్రికను సత్కులప్రసూతత్వాదిగుణములుగలదానినిఁగాఁ జేసి వారించికొనియె నని భావము.

క. అని యీగతి నృపతతి తి,య్యనిపలుకులు వెలయఁ బొగడు ♦నయ్యెడ నాళీ
జనములు చెంతలఁ గొలువఁగఁ, గనకలతాగాత్రి జనకుఁ ♦గదిసె ముదమునన్. 40

టీక: అని ఈగతిన్=ఈరీతిగ; నృపతతి =రాజబృందము; తియ్యనిపలుకులు =మధురమగు మాటలు; వెలయన్=ప్రకాశించునట్లు; పొగడు అయ్యెడన్=నుతించు నాసమయమందు; ఆళీజనములు=సకియలు; చెంతలన్=ఇరుప్రక్కలయందు; కొలువఁగన్=సేవింపఁగ; కనకలతాగాత్రి = బంగరుతీఁగవంటి మేనుగల చంద్రిక; ముదమునన్=సంతసముతో; జనకున్=తండ్రిని; కదిసెన్ =చేరెను. ఇట్లు రాజులు నుతించుచుండఁగా, చెలులు చెంతల సేవించుచు రాఁగా, చంద్రిక జనకునిఁ జేరె నని భావము.

మ. తరుణీతల్లజ మిట్లు తన్నృపతిచెంఁతం జేరి యవ్వేళ భ
క్తి రహింపం దదనుజ్ఞఁ గంతురిపుపంఁకేజాక్షికి న్మ్రొక్కె ని
ర్భరవీక్షాగతి మారకాండపరిసఁర్గం బూన్చి యుర్వీశదు
ష్కరమానంబు హరించుమంతుఁ గని చఁక్కన్ బాపు మన్ పోలికన్. 41

టీక: తరుణీతల్లజము=వనితలలోఁ బ్రశస్తయగు చంద్రిక, 'మతల్లికా మచర్చికా ప్రకాణ్డ ముద్ఘ తల్లజౌ ప్రశస్తవాచకాన్యమూని' అని యమరుఁడు; ఇట్లు=ఈప్రకారము; తన్నృపతిచెంతన్ = ఆక్షణదోదయరాజుచెంగటను; చేరి=పొంది; అవ్వేళన్=ఆసమయమందు; భక్తి రహింపన్ = భక్తి యతిశయింపఁగా; తదనుజ్ఞన్=ఆరాజునాజ్ఞచేత; కంతురిపుపంకేజాక్షికిన్ – కంతురిపు= మదనవైరియైన శివునియొక్క, పంకేజాక్షికిన్= కాంతయగు పార్వతీదేవికి; నిర్భరవీక్షాగతిన్ – నిర్భర=పరిపూర్ణమగు, వీక్షా = కటాక్షములయొక్క, గతిన్=ప్రచారముచేత; మారకాండపరిసర్గంబు ఊన్చి – మార=మన్మథులయొక్క, కాండ=సమూహములయొక్క, పరిసర్గంబు=సృష్టిని, ఊన్చి=చేసి, మన్మథసమూహముయొక్క సృష్టినని భావము; ఉర్వీశదుష్కరమానంబు – ఉరు=అధికుఁడైన, ఈశ=శంకరునియొక్క, దుష్కర=అనివార్యమైన, మానంబు=మానమును; ఉర్వీశ=రాజుల యొక్క అనివార్యమైన మానము నని స్వభావార్థము; హరించుమంతున్ = అపహరించునట్టి యపరాధమును; కని = చూచి; చక్కన్=చక్కఁగ; పాపు మన్ పోలికన్ =పోఁగొట్టుమన్న రీతిగ; మ్రొక్కెన్=నమస్కరించెను.

అనఁగఁ జంద్రిక క్షణదోదయునియాజ్ఞచేఁ బార్వతీదేవిని స్వకటాక్షప్రచారములవలనఁ బెక్కండ్రు మన్మథుల సృజించి, ఉర్వీశమానమును హరించునట్టి యపరాధమును బోఁగొట్టుమనియో యన్నట్లు నమస్కరించె నని భావము.

తే. నతి యొనర్చిన చెలువ కఁన్న గతనూజ, యపు డభీష్టార్థసంసిద్ధిఁరస్తటంచు
హాళి దీవించి కౌఁగిట ఁనలమి కనక,మంగళాక్షతపాళికల్ఁమౌళిఁ దార్చె. 42

టీక: నతి=నమస్కారమును; ఒనర్చిన చెలువకున్=చేసినట్టిచంద్రికకు; అన్న గతనూజ=ఆపార్వతీదేవి; అపుడు=ఆసమయమందు; అభీష్టార్థసంసిద్ధిః – అభీష్ట=కోరఁబడిన, అర్థ=ప్రయోజనముయొక్క, 'అర్థోభిధేయే రై వస్తు ప్రయోజన నివృత్తిషు' అని యమరుఁడు, సంసిద్ధిః=ప్రాప్తి; అస్తు=అగుఁగాక; అటంచున్=అనుచు; హాళిన్=ప్రీతితో; దీవించి=ఆశీర్వదించి; కౌఁగిటన్ = కౌఁగిలియందు; అలమి=ఆక్రమించి; కనకమంగళాక్షతపాళికల్ =బంగరువర్ణముగల మంగళప్రదములైన యక్షతలయొక్క సమూహములను; మౌళిన్=శిరమునందు; తార్చెన్=ఉంచెను.

వ. అంతఁ జతురంతయానంబున నాకాంతాశిరోమణి నుండ నియోగించి, యంచిత మనోంచలనిరాకుంచితప్రమదసమాజయై, యాగిరిరాజతనూజ సఖీజనంబులు వెనువెంట నడువ నెచ్చెలిచెలు వూని తత్పార్శ్వంబున నడచుచు, రాజసభముఖంబుఁ జేరి, యభంగమేరుశృంగంబులం దోఁచుసింగంపుఁ గొదమలతెఱంగునఁ గాంచనమంచనికాయంబులం జూపట్టు సకలాంతరీపానంతాకాంతలతాంతసాయక సంతానంబులం జూపి క్రమంబున నొక్కొక్కని దేశాదికంబులు దేటపడఁ జాతుర్యంబున నిట్లనియె. 43

టీక: అంతన్=ఆపైని; చతురంతయానంబునన్=ఎనమండ్రు మోయు వాహనవిశేషమందు; ఆకాంతాశిరోమణిన్ = నారీచూడామణియగు నాచంద్రికను; ఉండన్=ఉండుటకు; నియోగించి=ఆజ్ఞాపించి; అంచిత మనోంచల నిరాకుంచిత ప్రమద సమాజయై

– అంచిత=ప్రకాశించుచున్న, మనోంచల=మనోవీథియందు, నిరాకుంచిత=వికసించిన, ప్రమద=సంతసములయొక్క, సమాజ మై = సమూహముగలదియై; ఆగిరిరాజతనూజ =గట్టురాపట్టి యగు నాపార్వతీదేవి; సఖీజనంబులు=సకియలు; వెనువెంట నడువన్=వెంబడి నడచుచుండఁగ; నెచ్చెలిచెలువు ఊని =ప్రియసఖివిధము వహించి;తత్పార్శ్వంబునన్=ఆచంద్రికప్రక్కను; నడచుచున్; రాజసభముఖంబుఁ జేరి = రాజసభయొక్క పూర్వభాగమును చేరి; అభంగమేరుశృంగంబులన్ – అభంగ= అప్రతిహతములగు, మేరుశృంగంబులన్ =సుమేరుశిఖరములయందు; తోఁచుసింగంపుఁగొదమలతెఱంగునన్ = కాన్పించు సింగంపుపిల్లలవలె; కాంచనమంచనికాయంబులన్= బంగరుమంచముల గుంపులమీఁద; చూపట్టు=కనుపించునట్టి; సకలాంత రీపానంతాకాంత లతాంతసాయక సంతానంబులన్ – సకల=ఎల్ల, అంతరీప=ద్వీపములయొక్క, అనంతాకాంతలతాంత సాయక = మన్మథులవంటి ద్వీపాధిపతులయొక్క, సంతానంబులన్=సమూహములను; చూపి=ప్రదర్శించి; క్రమంబునన్= వరుసగా; ఒక్కొక్కనిదేశాదికంబులు =ఒక్కొక్కరాజుయొక్క దేశము మొదలగువానిని; తేటపడన్=తెల్లమగునట్లు; చాతు ర్యంబునన్ = జాణతనముచేత; ఇట్లనియెన్= వక్ష్యమాణప్రకారముగఁ బలికెను.

మ. కనుఁగొంటే విరిగల్వకంటి మహితోఽత్కంఠాసముద్భూతి నీ
జననాథాగ్రణి నుజ్జ్వలాంఘ్రిసరసీఽజాతద్వయవ్యాప్తనూ
తనసామంతనృపచ్ఛటామకుటముఽక్తాకాంతిసూనోత్కరు
న్వినుతామర్త్యనికాయుఁ బుష్కరమహాఽద్వీపావనీపాలకున్. 44

టీక: విరిగల్వకంటి=విరిసిన కలువపూవులవంటికన్నులుగలచంద్రికా! ఉజ్జ్వ లాంఘ్రిసరసీజాత ద్వయ వ్యాప్త నూతన సామంత నృప చ్ఛటా మకుట ముక్తాకాంతి సూ నోత్కరున్– ఉజ్జ్వల=ప్రకాశించుచున్న, అంఘ్రిసరసీజాత=పాదకమలములయొక్క, ద్వయ=కవను, వ్యాప్త=ఆవరించిన, నూతన=క్రొత్తనగు, సామంతనృప=ఇరుగుపొరుగురాజులయొక్క, ఛటా=సమూహము యొక్క, మకుట=కిరీటములందున్న, ముక్తాకాంతి=ముత్యపుకాంతులయొక్క, సూన=పుష్పములయొక్క, ఉత్కరున్= సమూహము గలిగినవాఁడును; విను తామర్త్య నికాయున్ – వినుత=పొగడఁబడిన, అమర్త్య=దేవతలయొక్క, నికాయున్ = సమూహముగలవాఁడును; పుష్కరమహాద్వీపావనీపాలకున్=పుష్కరద్వీపము నేలువాఁడునగు; ఈ జననాథాగ్రణిన్= ఈ రాజశ్రేష్ఠుని; మహి తోత్కంఠా సముద్భూతిన్ – మహిత=అధికమగు, ఉత్కంఠా= 'సర్వేంద్రియ సుఖాస్వాదో యత్రాస్తీత్యభి మన్యతే తత్ప్రాప్తీచ్ఛాం ససంకల్పా ముత్కణ్ఠాం కవయో విదుః' ఇత్యుక్తలక్షణమగు నుత్కంఠయొక్క, సముద్భూతిన్=అతి శయముచేత; కనుఁగొంటే = చూచితివా?

అనఁగా సామంతరాజమకుటములం దున్న ముత్యములకాంతు లనెడు కుసుమసమూహముచేఁ గప్పఁబడిన పాదకమల ములు గలపుష్కరద్వీపాధిపతియగు నీరాజరత్నమును చూచితివా యని భావము.

మ. పరరాజప్రబలప్రభావహరణఽప్రౌఢస్థితిం బొల్చునీ
నరనాథోత్తమదోఃప్రతాపకుహనాఽనాళీకమిత్రుండు దా
ధర నిర్మించుఁ జమీ యమస్వస, మిళింఽదద్వేషిధమ్మిల్ల! త
త్పరమారాతివధూసకజ్జలదృగఽబ్జాతాంబుధారాగతిన్. 45

టీక: మిళిందద్వేషిధమ్మిల్ల =తుమ్మెదలకు శత్రువైన కొప్పుగల చంద్రికా! పరరాజ ప్రబల ప్రభావ హరణ ప్రౌఢస్థితిన్ – పర రాజ=శత్రురాజులయొక్క, ఉత్కృష్టుఁడగు చంద్రునియొక్క, ప్రబల=అధికమగు, ప్రభావ=ప్రతాపముయొక్క, హరణ= హరించుటయందు, ప్రౌఢస్థితిన్= సమర్థమైన స్థితిచే; పొల్చు నీనరనాథోత్తమ దోఃప్రతాప కుహనా నాళీకమిత్రుండు – పొల్చు =ఒప్పుచున్న, ఈనరనాథోత్తమ=ఈరాజశ్రేష్ఠునియొక్క, దోఃప్రతాప=భుజసంబంధియగు ప్రతాపమనెడు, కుహనా = కపటముగల, నాళీకమిత్రుండు=సూర్యుఁడు; త త్పరమారాతి వధూ సకజ్జల దృగబ్జాతాంబుధారా గతిన్ – తత్=ప్రసిద్ధులగు, పరమ=ఉత్కృష్టులగు, అరాతి=శత్రువులయొక్క, వధూ=స్త్రీలయొక్క,సకజ్జల=కాటుకతోఁ గూడియున్న, దృగబ్జాత=నేత్ర కమలములయొక్క, అంబుధార = బాష్పధారయొక్క, గతిన్=ప్రాప్తిచేత; తాన్; ధరన్=భూమియందు; యమస్వసన్= యమునానదిని; నిర్మించున్ = సృజించును; చుమీ =సత్యము!

అనఁగ పుష్కరద్వీపాధిపతి యగునీనరపతియొక్క ప్రతాప మనెడు సూర్యుఁడు శత్రురాజప్రతాపమును హరించి యుద్ధామస్థితిని పొంది, శత్రువనితలయొక్క కజ్జలసహితము లగు నేత్రజలములచేఁ బుడమి యమునానదిని నిర్మించు నని భావము.

మ. అతులాంభోరుహపీఠిఁ బొల్పెసఁగు స\ త్యస్వామి కీ వి య్యిలా
పతితోడ న్రహిఁ బెండ్లిమ్రొక్కు ఘటియిం\ పం జేర నీ కూన్చుఁ బో
యతఁ డాత్మేష్టఫలంబు లంతకయ ము \ న్నబ్జాక్షి యాత్రోవ నూ
ర్జితశాఖావళి సాఁచి వాని వటధా \ త్రీజాత మర్పింపఁగన్. 46

టీక: అబ్జాక్షి=చంద్రికా! అతులాంభోరుహపీఠిన్ – అతుల=అసమానమగు, అంభోరుహపీఠిన్=కమలాసనమునందు; పొల్పెసఁగు సత్యస్వామికిన్ – పొల్పెసఁగు=మిక్కిలి యొప్పుచున్న, సత్యస్వామికిన్=సత్యలోకాధిపతియగు నలువకు; ఈవు=నీవు; ఇయ్యిలాపతితోడన్ =ఈభూపతితోడ; రహిన్=ప్రీతితో; పెండ్లిమ్రొక్కు=వివాహదీక్షాంతమందుఁ జేయు నమస్కారమును; ఘటియింపన్=చేయుటకు; చేరన్=సమీపింపఁగా; నీకున్; అతఁడు=ఆనలువ; ఆత్మేష్టఫలంబులు – ఆత్మ= తనకు, ఇష్ట=అనుకూలమైన, ఫలంబులు=ఫలములను; ఊన్చున్ పో = ఈయఁగలఁడు; ఆత్రోవన్=ఆబ్రహ్మదేవాలయమార్గ మందు; అంతకయ మున్న=నలువ ఫలములీయకమునుపే; వానిన్=ఆఫలములను; వటధాత్రీజాతము = వటవృక్షము, ఈ పుష్కరద్వీపమునందు నలువస్థానము త్రోవయందు ఫలము లొసఁగు మఱ్ఱిచెట్టుండుట ప్రసిద్ధము; ఊర్జితశాఖావళిన్ – ఊర్జిత =దృఢమగు, శాఖా=కొమ్మలయొక్క, ఆవళిన్=పంక్తిని; చాఁచి=చాఁగించి; అర్పింపఁగన్ = ఇచ్చుచుండఁగ. దీని కూన్చు నను క్రియతోఁ బై కన్వయము. అనఁగ నీపుష్కరద్వీపాధిపతిని నీవు పెండ్లిచేసికొని యాద్వీపమందున్న నలువకుఁ బెండ్లి మ్రొక్కు లిడుటకై యేగుతఱి నాత్రోవ నున్న మఱ్ఱిచెట్టు నీవు కోరినఫలంబుల నలువకన్న ముందుగానే యొసంగునని భావము.

చ. సరసతపాగమంబున ని\ శాకరసోదరదాస్య! యీమహీ
శ్వరుఁ గవగూడి నీవు విల\ సజ్జలఖేల నొనర్పఁ జేరఁగా
వరసరసీభవద్విమల\ వారిపయోనిధివీచు లారతుల్
కరము ఘటించుఁ గా కరుణ\ కంజకరమ్ముల నాళి పాడఁగన్. 47

టీక: నిశాకరసోదరదాస్య – నిశాకర=చంద్రునకు, సోదరత్=తోబుట్టువువలె నాచరించుచున్న, ఆస్య=ముఖముగల చంద్రికా, చంద్రునిఁ బోలు ముఖముగల చంద్రికా యని తాత్పర్యము. ఇచట సోదరశబ్దము ఇవార్థకము. 'దేశీయ దేశ్య రిప్వాభ సోదరా ద్యా ఇవార్థకాః' అని కవికల్పలతయం దున్నది; సరసతపాగమంబునన్ – సరస=మనోజ్ఞమగు, తపాగమంబునన్=గ్రీష్మ కాలమునందు, 'నిదాఘ ఉష్ణోపగమ ఉష్ణ ఊష్మాగమ స్తపః' అని యమరుఁడు;ఈమహీశ్వరున్ =ఈపుష్కరద్వీపాధిపతిని; కవగూడి=జతగూడి; నీవు; విలసజ్జలఖేలన్ – విలసత్=ప్రకాశించుచున్న,జలఖేలన్=జలక్రీడను; ఒనర్పన్=చేయుటకు; చేరఁ గాన్=సమీపింపఁగ; వర సరసీభవ ద్విమల వారి పయోనిధి వీచులు – వర=శ్రేష్ఠమగు, సరసీభవత్=కొలనగుచున్న, విమల= స్వచ్ఛమగు, వారి=నీరుగల, పయోనిధి=సముద్రముయొక్క, వీచులు=తరఁగలు; ఇచట స్త్రీత్వనిర్దేశమువల్ల స్త్రీలని యర్థము దోఁచుచున్నది; అరుణకంజ కరమ్ములన్ – అరుణకంజ=ఎఱ్ఱదామరలనెడు, కరంబులన్=హస్తములచేత, ఆళి =అళిబృంద మనెడు చెలి; పాడఁగన్=పాటపాడుచుండఁగా;ఆరతుల్=ఆరతులను;కరము=మిక్కిలి;ఘటించుఁ గాక=ఒనగూర్చుఁగాక;

అనఁగ నీవు గ్రీష్మకాలమునందు నీపుష్కరద్వీపాధిపతిని గూడి స్వాదుసముద్రమందు జలక్రీడసేయంజనఁగా తరఁగలు కెందామర లనెడు హస్తములచేతఁ దుమ్మెదతండములు పాటలువాడుచుండఁగా నారతు లొసంగునని భావము.

తె. అని తెలిపి హైమవతి యాలఁతాంగి చిత్తసారసము తజ్జనాధీశచంద్రరక్తి
నలర లే కున్కి తెలిసియు నవ్వలఁ జనఁ,జేసె శిబికాధురంధర శ్రేణి నపుడు. 48

టీక:హైమవతి =పార్వతి; అని=పైవిధముగా; తెలిపి=తెలియఁజేసి; ఆలతాంగిచిత్తసారసము=తీఁగవంటిమేనుగల యాచంద్రిక యొక్క మనఃకమలము; తజ్జనాధీశచంద్రరక్తిన్ – తజ్జనాధీశచంద్ర=ఆరాజచంద్రునియొక్క, రక్తిన్=అనురాగముచేత;అలర లే కున్కిన్=వికసింపకయుండుటను; తెలిసియున్=గుర్తించియు; అపుడు=ఆసమయమున; శిబికాధురంధరశ్రేణిన్=పల్లకిని మోయుచున్నవారల గుంపును; అవ్వలన్=ఆవలకు; చనన్ చేసెన్= పోనిచ్చెను.

అనఁగా పార్వతీదేవి పుష్కరద్వీపాధిపతి యగు నారాజచంద్రునియందలి యనురాగముచేఁ జంద్రిక మనస్సారసము వికసింపకుండుటచేత, నాందోళికను మోయువారిని ముందు చన నియోగించె నని భావము. చంద్రునివల్ల సారసము ముకుళించును గాని వికసించుట లోకమం దప్రసిద్ధ మని సూచించుటకుఁ జంద్రసారసపదంబులఁ గవి యిటఁ బ్రయోగించెను.

వ. చెంత నొక్కమహీకాంతునిం జూపి యక్కంతువిరోధికాంత యాశకుంతరాజయాన కిట్లనియె. 49

టీక: ఆశకుంతరాజయానకున్ =హంసలవంటినడకగల యాచంద్రికకు; అక్కంతువిరోధికాంత =మన్మథవిరోధియగు శివుని యొక్క ప్రియురాలైన యాపార్వతి; చెంతన్=సమీపమందు; ఒక్కమహీకాంతునిన్ = ఒకరాజును; చూపి = కనఁబఱచి; ఇట్లు = వక్ష్యమాణప్రకారము; అనియెన్=పలికెను.

మ. జలజాతచ్ఛదదేశ్యనేత్ర! కనుమీ శాకాంతరీపేశు ను
జ్జ్వలధామౌఘవృతాశు నీఘను బుధస్వామివ్రజస్తుత్యుయై
యలరు న్వీనిసుకీర్తిశీతకిరణాస్యామౌళి వేధోండపం
క్తులు మేల్మేలిమి గుండ్లపేరుగతి కన్గో నొప్పు నెల్లప్పుడున్. 50

టీక: జలజాతచ్ఛదదేశ్యనేత్ర =తామరఱేకులవంటి కన్నులుగలదానా! ఇట నీషదసమాప్తియందు దేశ్యప్రత్యయము; ఉజ్జ్వల

ధామౌఘవృతాశున్ – ఉజ్జ్వల=ప్రకాశించుచున్న, ధామ=తేజస్సుయొక్క, ఓఘ=సమూహముచేత,వృత=ఆవరింపఁబడిన, ఆశున్=దిశలుగల; శాకాంతరీపేశున్=శాకద్వీపాధిపతియగు; ఈఘనున్=ఈగొప్పవానిని; కనుమీ =చూడుమీ; వీని సుకీర్తి శీతకిరణాస్యామౌళి = వీనియొక్క కీర్త్యంగన; వేధోండపంక్తులు =బ్రహ్మాండసమూహములు; మేల్మేలిమి గుండ్లపేరుగతిన్ = అతి శ్రేష్ఠమగు గుండ్లదండరీతిగ; ఎల్లప్పుడున్=ఎల్లకాలము; కన్గొ నొప్పన్= చూచుటకు నొప్పుచుండఁగ; బుధస్వామివ్రజ స్తుత్యమై– బుధస్వామి=దేవతాప్రముఖులయొక్క, వ్రజ=సంఘముచేత, స్తుత్యమై=పొగడఁదగినదై; అలరున్=ఒప్పును.

ఈశాకద్వీపాధిపతి కీర్తికాంతకు బ్రహ్మాండములు గుండ్లహారమువలె నొప్పునని తాత్పర్యము. అత్యుక్త్యలంకారము. 'అత్యుక్తి రద్భుతాతథ్య శౌర్యౌదార్యాదివర్ణనమ్' అని తల్లక్షణము.

చ. ధర నేతన్మహిపాలచంద్రకృతని।త్యస్పర్శనాంభపరం
పర లప్రత్న మహాంబురాశిగతిఁ దోఁ।పం గొమ్మ! నిచ్చల్ తదం
తరవీథి న్బడబాగ్నికీలతతి యం।దం బూని భర్మావనీ
ధరము న్మౌక్తికరీతిఁ దాల్చి యుడుసం।తానంబులుం జూ పడున్. 51

టీక: ధరన్=భూమియందు; ఏతన్మహిపాలచంద్ర కృత నిత్యస్పర్శనాంభ పరంపరలు – ఏతన్మహిపాలచంద్ర=ఈరాజ చంద్రునిచేత, కృత=చేయఁబడిన, నిత్యస్పర్శనాంభః = నిత్యదానోదకముయొక్క, పరంపరలు=సమూహములు; అప్రత్న మహాంబురాశి గతిన్ – అప్రత్న=నూతనమగు, మహాంబురాశిగతిన్=మున్నీటిపగిది; తోఁపన్=తోఁచుచుండఁగా; కొమ్మ= చంద్రికా! నిచ్చల్=ఎల్లపుడు; తదంతరవీథిన్=ఆమున్నీటిమధ్యమందు; భర్మావనీధరమున్=మేరుపర్వతమును; బడబాగ్ని కీలతతి యందంబు =బడబాగ్ని జ్వాలాసమూహమురీతిని; ఊని=పొంది; ఉడుసంతానంబులున్=నక్షత్రసమూహములును; మౌక్తికరీతిన్=ముత్యములయాకృతిని; తాల్చి=ధరించి; పడున్= పడును; చూ=చూడుము.

అనఁగ నీశాకద్వీపాధిపతియొక్క దానోదకములు నూతనసముద్రమువలె భాసిల్లుచుండ, నాసముద్రమధ్యమునం బడిన మేరుపర్వతము బడబాగ్నిగాను, నక్షత్రపుంజములు ముత్యములుగాను జూపట్టునని భావము. ఈరాజు దానోదకము పుడమిఁ గప్పుకొని మిన్నంటిన దని ముఖ్యాశయము.

సీ. పవనాహతోర్మికా।నవనాదయుతపయో,ర్ణవనాథఖేలనా।రమ్యగతులు,
కలశాబ్ధిసంశోభి।బిలశాయిపర్యంక,తలశాయిపురుషసం।దర్శనములు,
సరసాత్మహితసుమో।త్కరసారఫలదళా,కరసాలవల్లికా।పరివిహృతులు,
చరమాన్యనగవనీ।వరమార్గచారి కి,న్నరమానినీమణి।పరిచయములు,
తే. తావకపురాణపుణ్యసం।తానకలనఁ, బారిమాండల్యవన్మధ్య!।చేరు నీకు
మహితసుమదామకమున నీ।మానవాధి,కాంతపుంగవుకంఠంబు ।గట్టు మిపుడు. 52

టీక: పారిమాండల్యవన్మధ్య=పరమాణుపరిమాణముగల నడుముగలదానా! పారిమాండల్యశబ్దమునకు పరమాణు వని యర్థము, పరమాణు వనఁగా, 'జాలసూర్యమరీచిస్థం సూక్ష్మం యద్దృశ్యతే రజః, తస్య షష్ఠతమోభాగః పరమాణు స్స ఉచ్యతే' అని దాని లక్షణము. గవాక్షరంధ్రంబునఁ జొరఁబాఱు నెండలోఁ జూపట్టురజముయొక్క షష్ఠతమమగు ఖండము

పరమాణు వగునని దాని యర్థము; తావకపురాణపుణ్యసంతానకలనన్ – తావక=నీసంబంధియగు, పురాణపుణ్య= ప్రాచీన పుణ్యములయొక్క, పూర్వజన్మసంచితపుణ్యములయొక్క యనుట, సంతాన=సంచయముయొక్క, కలనన్=ప్రాప్తిచేత; నీకున్;

పవ నాహ తోర్మికా నవ నాద యుత పయోర్ణవనాథ ఖేలనా రమ్యగతులు – పవన=వాయువుచేత, ఆహత=కొట్టఁబడిన, ఊర్మికా=తరఁగలయొక్క, నవ=నూతనమగు, నాద=ధ్వనితోడ, యుత=కూడుకొన్న, పయోర్ణవనాథ=పాలకడలి యొక్క, ఖేలనా = విహారములయొక్క, రమ్యగతులు=మనోజ్ఞమగు రీతులు;

కలశాబ్ధి సంశోభి బిలశాయి పర్యంకతల శాయి పురుష సందర్శనములు – కలశాబ్ధి=పాలకడలియందు, సంశోభి=మిక్కిలి వెలయుచున్న, బిలశాయి=ఆదిశేషుఁడనెడు, పర్యంకతల=మంచమునందు, శాయి=పవళించిన, పురుష=పురాణపురుషుని యొక్క, సందర్శనములు=చూపులు;

సర సాత్మహిత సుమోత్కర సారఫల దళాకర సాల వల్లికా పరివిహృతులు – సరస=మకరందముతోఁ గూడిన, ఆత్మహిత= మనసునకు హితములగు, సుమోత్కర=పూతండములకు,సారఫల=శ్రేష్ఠమగు ఫలములకు, దళ=ఆకులకు, ఆకర=ఉనికి పట్టగు, సాల=వృక్షములయందు, వల్లికా=తీవలయందు, పరివిహృతులు=వహారములు, క్రీడ లనుట;

చరమాన్యనగ వనీవర మార్గ చారి కిన్నరమానినీమణి పరిచయములు – చరమాన్యనగ=పొడుపుకొండయొక్క, వనీవర=శ్రేష్ఠ మగు వనముయొక్క, మార్గ=త్రోవయందు, చారి=సంచరించు, కిన్నరమానినీమణి=కింపురుషస్త్రీరత్నములయొక్క, పరిచ యములు =స్నేహములు;

చేరున్=ఘటిల్లును; ఇపుడు=ఈసమయమందు; మహితసుమదామకమునన్ – మహిత=పూజ్యమగు, సుమదామకమునన్= పుష్పమాలికచేత; ఈమానవాధికాంతపుంగవుకంతంబు = శాకద్వీపాధిపతియైన నీరాజశ్రేష్ఠునియొక్క కంతమును; కట్టుము = బంధింపుము. అనఁగా నీశాకద్వీపాధిపతిని వరించితివేని పాలకడలియందలి క్రీడలును, అచట శయనించి యుండు శ్రీమహా విష్ణుమూర్తియొక్క దర్శనములును, ఫలపుష్పదళాదులచే నిండియుండు వనంబులయందలి విహారములును, పూర్వపర్వ తమునందుండు కిన్నరస్త్రీరత్నముల స్నేహములును నీకు ఘటిల్లు నని భావము.

మ. అని యాశాంకరి వల్కఁ ముంగలికి వేఁగారూఢిచే నేగున
వ్వనజాస్యామణి దృష్టి తన్నృపతినిర్వాంఛావిధిం దెల్పఁ జ
య్యనఁ దద్యానధురీణు లంద ఱొక గోత్రాధీశునిం జేర, న
య్యనఘుం జూపి యపర్ణ యిట్లనియె మత్స్యండీసమానోక్తులన్. 53

టీక: అని=ఈరీతిగా, ఆశాంకరి=ఆపార్వతి; పల్కన్=పలుకఁగా; ముంగలికిన్=ముందుకు; వేగారూఢిచేన్ =వేగిరపాటు యొక్క నిరూఢిచేత; ఏగునవ్వనజాస్యామణిదృష్టి – ఏగు=పోవుచున్న, అవ్వనజాస్యామణి=ఆచంద్రికయొక్క, దృష్టి= చూపు; తన్నృపతినిర్వాంఛావిధిన్ = ఆరాజునందుఁ గోరికలేమియొక్కరీతిని; తెల్పన్=తెలియఁజేయఁగా; చయ్యనన్ = త్వరగా; తద్యానధురీణు లందఱు = ఆవాహనమును మోచుశైబికులెల్లరు; ఒక గోత్రాధీశునిన్=ఒకభూపతిని; చేరన్= పొందఁగా; అయ్యనఘున్=ఆఘనుని; చూపి=ప్రదర్శించి; అపర్ణ =పార్వతి; మత్స్యండీసమానోక్తులన్ – మత్స్యండీ= శర్కరకు, సమాన=తుల్యమగు, ఉక్తులన్=వాక్యములచేత; ఇట్లు=వక్ష్యమాణప్రకారముగ; అనియెన్= పలికెను.

శా. పాంచాలాత్మజ! గాంచు వీని దధిరూ౦పక్ష్మాపటప్రావృత
క్రౌంచద్వీపధరాధురంధరుని నీ౦రాజన్యుదానాంబు ల
ర్పించున్ వాశ్చరపాళి కెంతయు మహ౦ర్ధిన్ వానిపై నీసుతో
మించన్ బోలె నమూల్యలావణి తదు౦న్మేషంబు గూల్చున్ గడున్. 54

టీక: పాంచాలాత్మజ =చంద్రికా! దధిరూపక్ష్మాపట ప్రావృత క్రౌంచద్వీప ధరాధురంధరునిన్ – దధిరూపక్ష్మాపట=పెరుఁగు మున్నీటిచే, ప్రావృత=ఆవరింపఁబడిన, క్రౌంచద్వీప= క్రౌంచద్వీపముయొక్క, ధరాధురంధరునిన్=భూభర్తయగు; వీనిన్ = ఇతనిని; కాంచు=చూడుము; ఈరాజన్యుదానాంబులు= ఈభూపతియొక్క దానోదకములు; వాశ్చరపాళికిన్=జలచరశ్రేణికి; ఎంతయున్=మిక్కిలి; మహర్ధిన్=అధికమగు వృద్ధిని; అర్పించున్=ఇచ్చును; వానిపైన్=ఆజలచరశ్రేణిపై; ఈసుతోన్=ఈర్ష్య తోడ; మించన్ బోలెన్=అతిశయించుటకువలెనె; అమూల్యలావణి=అధికమగు సౌందర్యము, ఇది కర్త; తదున్మేషంబు= ఆ వాశ్చరపాళియొక్క యభివృద్ధిని; కడున్=మిక్కిలి; కూల్చున్=పోఁగొట్టును. అనఁగ నీపద్యమందు నారాజుదానోదకములు వాశ్చరపాళి కభివృద్ధి నొనరించినను, వానికిఁ దత్సౌందర్యము మిక్కిలి యభివృద్ధిని బోఁగొట్టుట ఘటిల్లదు గావున వాశ్చర పాళి కనఁగ, వాశ్చర=మత్స్యము, పాళి=చిహ్నముగా గల మన్మథున, కున్మేషమును బోగొట్టు ననుట. 'పాళి స్త్ర్యశ్ర్యఙ్క పఙ్క్తిషు' అని యమరుఁడు. ఈక్రౌంచద్వీపాధిపతియొక్క దానోదకము జలచరముల కభివృద్ధిఁ జేయు ననియు, నితని సౌంద ర్యము మన్మథుని నిరసించు ననియు నభిప్రాయము.

చ. వరహరిజాత్యఖండరుచి౦వారము నొంచి మహాబ్జమండలి
న్ధరణి నడంగఁ ద్రొక్కి వని౦తామణి! యీవిభుసద్యశోవిభాం
కురహరుఁ డొప్పుఁ గుండలిత౦కుండలినేత పదాంగదంబునై
శరదపథంబు దంత్యసుర౦చర్మమునై చెలువార నెప్పుడున్. 55

టీక: వనితామణి=చంద్రికా! ఈవిభు సద్యశో విభాంకుర హరుఁడు – ఈవిభు=ఈరాజుయొక్క,సత్=శ్రేష్ఠమగు, యశః=కీర్తి యొక్క, విభా=కాంతియొక్క, అంకుర=మొలకయనెడు, హరుఁడు=ఈశ్వరుఁడు; కుండలిత కుండలినేత – కుండలిత= చుట్టుకొన్న, కుండలినేత=శేషుఁడు; పదాంగదంబునై =పాదమునకు నందియ యైనవాఁడై; శరదపథంబు=మిన్ను; దంత్య సురచర్మమునై = గజాసురునియొక్క చర్మమైనదై; చెలువారన్=ప్రకాశింపఁగ; ఎప్పుడున్=ఎల్లప్పుడు; వర హరిజాత్యఖండ రుచివారమున్ – వర=శ్రేష్ఠుఁడగు,హరిజ=మన్మథునియొక్క, అత్యఖండ=అఖండమైన,రుచివారమున్=కాంతిపుంజమును; నొంచి=నొప్పించి; వర=శ్రేష్ఠమగు, హరిజాతి=సింహజాతియొక్క, అఖండరుచివారము నొంచి యను నర్థము దోఁచుచున్నది; మహాబ్జమండలిన్ – మహత్=అధికమగు, అబ్జమండలిన్=చంద్రమండలమును, తెల్లదామరగుంపు ననియు దోఁచుచున్నది; ధరణిన్=భూమియందు; అడంగఁ ద్రొక్కి=అడఁగునటులు ద్రొక్కి; ఒప్పున్=ప్రకాశించును.

అనఁగా నీక్రౌంచద్వీపాధిపతియశోంకురము, ఆదిశేషుఁడు పాదకటకముగాను, ఆకాశము గజచర్మముగాను జెలంగఁగా, హరిజాతిరుచిని జయించి అబ్జమండలము ద్రొక్కి శివునివలెఁ బ్రకాశించునని భావము. శివుఁడుదక్షాధ్వరధ్వంసమునందుఁ జంద్రుని త్రొక్కినాఁడనుట పురాణప్రసిద్ధము. ఇతని యశస్సు బ్రహ్మాండ మంతయు వ్యాపించిన దనుట ముఖ్యాశయము.

మ. సరసీజోపమగంధి! సంతతము క్రౌం॰చద్వీపసంవాసి శం
కరపూజాగతి మించెనా నలరు ని॰క్కం బీనృపాలుండు శం
కరభావమ్మున సద్గణావృతియు రం॰గద్భూతియు న్విద్విష
త్పురసంభేదనవృత్తియు న్సమగుణ॰స్ఫూర్తి న్విజృంభింపఁగన్. 56

టీక: సరసీజోపమగంధి=పద్మగంధమువంటి మేనిగంధముగల చంద్రికా! ఈనృపాలుండు=ఈభూపతి;సంతతము=ఎల్లపుడు; క్రౌంచద్వీపసంవాసి శంకర పూజా గతిన్ – క్రౌంచద్వీపసంవాసి=క్రౌంచద్వీపమందు నివసించునట్టి, శంకర=శివునియొక్క, పూజా = అర్చనముయొక్క, గతిన్=ప్రాప్తిచేత; శంకరభావమ్మునన్=శివత్వముచేత, సుఖకరస్వరూపముచేత నని నరపతి పరమగు నర్థము; మించెనాన్=అతిశయించెనో యనునట్లు; సద్గణావృతియున్ – సత్=సత్పురుషులయొక్క,గణ= సమూహముచేత, ఆవృతియున్ = కూడికయును, ప్రమథగణములయొక్క కూడికయు నని శివపరమైన యర్థము; రంగద్భూతియున్ – రంగత్=ప్రకాశించుచున్న, భూతియున్=ఐశ్వర్యమును, ప్రకాశించుచున్న భస్మము నని శివపరమగు నర్థము, 'భూతి ర్భస్మని సంపది' అని యమరుఁడు; విద్విష త్పుర సంభేదనవృత్తియున్ – విద్విషత్=శత్రువులయొక్క, పుర=శరీరములయొక్క, సంభేదనవృత్తియున్=వ్రక్కలించునట్టి వ్యాపారమును; విద్విషత్=శత్రువులగుచున్న, పుర=త్రిపురములయొక్క, సంభేదనవృత్తియు నని శివపరమైన యర్థము; సమగుణస్ఫూర్తిన్ – సమ=సమానమగు, గుణ=గుణముయొక్క, స్ఫూర్తిన్ =అతిశయముచేత; విజృంభింపఁగన్=ప్రకాశింపఁగ; అలరున్=ప్రకాశించును; నిక్కంబు=సత్యము.

అనఁగ క్రౌంచద్వీపాధిపతి యగు నీనృపాలుఁడు శివపూజామహిమవలన శివభావము నొంది సద్గణావృతియు, భూతియు, విద్విషత్పురసంభేదనవృత్తియుఁ బొందెనో యనునట్లు ప్రకాశించు నని భావము.

చ. అవిరళరత్నకూటముల ॰హారిమహాసుమనోవితానవై
భవములఁ బొల్చు క్రౌంచగిరి ॰బంధురనూతనబంధుజీవబాం
ధవరదనాంశుకామణి! య॰నారత మింపగుఁగాక నీకుఁ బ్రో
త్సవకరకేళికాకనక॰సౌధవిధానముఁ దాల్చి యెంతయున్. 57

టీక: అవిరళరత్నకూటములన్ – అవిరళ=సందులేని, రత్న=మణిమయములగు, కూటములన్=శిఖరములచేత; హారిమహాసుమనోవితానవైభవములన్ – హారి=మనోహరమగు, మహత్=అధికమగు, సుమనోవితాన=పూగుంపులయొక్క, వైభవములన్=విభవములచేత; పొల్చు క్రౌంచగిరి = ఒప్పుచున్న క్రౌంచపర్వతము; బంధుర నూతన బంధుజీవ బాంధవ రదనాంశుకామణి – బంధుర=దట్టమగు, నూతన=నవీనమగు, బంధుజీవ=జపాకుసుమమునకు, బాంధవ=సమానమగు, బాంధవ సగోత్ర జ్ఞాతి బంధ్వాదిశబ్దములు ఇవార్థకములని చెప్పఁబడియున్నది, రదనాంశుకా= దంతచ్ఛదములుగల కాంతలలో, మణి=రత్నతుల్యవగు నోచంద్రికా! నీకున్; ప్రోత్సవకర కేళికా కనకసౌధ విధానము – ప్రోత్సవకర=వేడుకను చేయునట్టి, కేళికా=విలాసార్థమగు, కనకసౌధ=బంగరుమేడయొక్క, విధానము=రీతని; తాల్చి=ధరించి; ఎంతయున్=మిక్కిలి; అనారతము=ఎల్లపుడు; ఇంపగుఁగాక = ఆనందకరమగుఁగాక.

అనఁగ నీక్రౌంచద్వీపమునందుండు క్రౌంచపర్వతము రత్నమయకూటములచే, మనోహరపుష్పకదంబములచే నొప్పినదై నీకుఁ గ్రీడాసౌధమురీతిని ధరించి ప్రకాశించు నని భావము.

వ. అని యయ్యిందుధరసుందరి యెఱింగింప నన్నృపపురందరునిపై నక్కుందరదన డెందంబు పొందు పడ కున్కి తెలిసి, యానధుర్యు లమందరయంబున వేఱొక్క మహీశకందర్పుఁ జేరం జన నందు నతనిం జూపి యాగోత్రధరపుత్త్రి తన్మేచకశతపత్రసగోత్రనేత్ర కిట్లనియె. 58

టీక: అని=ఈప్రకారముగా; అయ్యిందుధరసుందరి= ఆచంద్రశేఖరుని (శివుని) పత్నియగు పార్వతి; ఎఱింగింపన్ =తెల్పఁగా; అన్నృపపురందరునిపైన్= ఆరాజేంద్రునిమీఁద; అక్కుందరదన డెందంబు=మొల్లలవంటి పలువరుస గల యాచంద్రికయొక్క చిత్తము; పొందు పడ కున్కి=పొందకయుండుటను; తెలిసి=తెలిసికొని; యానధుర్యులు=పల్లకిని మోయువారలు; అమంద రయంబునన్=అతివేగముచేత; వేఱొక్కమహీశకందర్పున్= వేఱొక రాజమన్మథుని; చేరన్ చనన్= చేరునట్లు పోఁగా; అందు = ఆస్థలమందు; అతనిం జూపి=ఆరాజును జూపెట్టి; ఆగోత్రధరపుత్త్రి=ఆహిమవంతుని కొమార్తెయగు పార్వతి; తన్మేచకశతపత్ర సగోత్రనేత్రకున్= నల్లదామరలవంటి కన్నులగల యాచంద్రికతో; ఇట్లనియెన్=వక్ష్యమాణప్రకారముగఁ బలికెను.

చ. నెలఁత! కుశాంతరీపధరణీరమణీంద్రుఁడు వీఁడు వీనియౌ
దలపయి నుంచు మీవు కరతామరసార్జితమౌక్తికాళి ని
య్యలఘుఁడు మారవీరవిశిఖౌఘవిలోడితచిత్తధైర్యుఁడై
దలఁచుఁ జుమీ నిరంతరము త్వత్కుచదుర్గము లాశ్రయింపఁగన్. 59

టీక: నెలఁత=చంద్రికా! వీఁడు =ఈరాజు; కుశాంతరీపధరణీరమణీంద్రుఁడు=కుశద్వీపము నేలు భూభర్త; వీనియౌదలపయిన్ = వీనిశిరముమీఁద; ఈవు=నీవు; కరతామర సార్జిత మౌక్తికాళిన్ – కరతామరస=కేలుదామరచే, ఆర్జిత=గ్రహింపఁబడిన, మౌక్తి కాళిన్=ముత్యములపేరును; ఉంచుము=ఉనుచుము; ఇయ్యలఘుఁడు=ఈఘనుఁడు;మారవీర విశిఖౌఘ విలోడిత చిత్తధైర్యుఁడై– మారవీర=మన్మథవీరునియొక్క, విశిఖౌఘ=బాణబృందముచేత, విలోడిత=కలఁపఁబడిన, చిత్త=హృదయముయొక్క, ధైర్యుఁడై=ధైర్యముగలవాఁడై; నిరంతరము=ఎల్లపుడు; త్వత్కుచదుర్గములు— త్వత్=నీయొక్క, కుచదుర్గములు= పాలిండ్ల నెడు కొండలను; ఆశ్రయింపఁగన్=చేరుటకు; తలఁచున్=స్మరించును; చుమీ =సత్యము.

అనఁగ చంద్రికా! వీఁడు కుశద్వీపమునకు రాజు. వీనిశిరమునందు నీకేల నుండు మౌక్తికహారము నుంచుము. ఈరాజు ఎల్లప్పుడును మన్మథబాణములచేఁ గుంది నీకుచములను పర్వతముల నాశ్రయింపఁగోరుచున్నాడు, నిజమని భావము.

చ. నిరుపమవిశ్రవస్తనయనిగ్రహకృద్ద్రవిణాఢ్యుఁడై మహా
హరిబలసంయుతుండయి బుధార్చితరామసమాఖ్య నొప్పు నీ
నరకులసార్వభౌముని మనం బలర న్వరియింప మేదినీ
వరసుత! నీకు నెంచ ననివార్యకుశోదయ మబ్బు టబ్రమే. 60

టీక: నిరుపమ విశ్రవస్తనయ నిగ్రహ కృద్ద్రవి ణాఢ్యుఁడు ఐ– నిరుపమ=సాటిలేని, విశ్రవస్తనయ=కుబేరునియొక్క, నిగ్రహ= నిరసనమును, కృత్=చేయుచున్న, ద్రవిణ=ధనముచేత, ఆఢ్యుఁడు ఐ =ధనికుఁడైనవాఁడై; నిరుపమ=సాటిలేని, విశ్రవస్తనయ =రావణాసురునియొక్క, నిగ్రహకృత్=నిరసనమును జేయు, ద్రవిణాఢ్యుఁడు ఐ = బలముగఁల్గిన వాఁడయి యని శ్రీరామపర మైన యర్థము,'ద్రవిణం కాంచనే విత్తే, ద్రవిణం చ పరాక్రమే' అని విశ్వము; మహా హరిబల సంయుతుండయి – మహత్=అధిక

మగు, హరిబల=సింహబలముతో, సంయుతుండయి=కూడుకొన్న వాఁడై; మహత్=అధికమైన, హరిబల=వానరసేనతో, సంయుతుండయి=కూడుకొన్న వాఁడై యని శ్రీరామపరమైన యర్థము; బుధార్చిత రామసమాఖ్యన్ – బుధ=విద్వాంసులచేత, అర్చిత=మన్నింపఁబడిన, రామ=మనోహరమగు, సమాఖ్యన్=కీర్తిచేత; బుధ=దేవతలచేత, అర్చిత=పూజింపఁబడిన, రామ సమాఖ్యన్= రాముఁడను నామముచేత నని శ్రీరామపరమైన యర్థము; ఒప్పు నీనరకులసార్వభౌమునిన్ = ప్రకాశించు నీమనుజ కులచక్రవర్తిని, శ్రీరాముని; మనంబు=మానసము; అలరన్=సంతసించునటులు; వరియింపన్=కోరఁగా; మేదినీవరసుత – మేదినీవర=భూభర్తయగు క్షణదోదయునియొక్క, సుత=కూఁతురవగు చంద్రికా! భూపుత్రియగు సీతాదేవి యను నర్థము దోఁచుచున్నది; నీకున్; ఎంచన్=విచారింపఁగా; అనివార్యకుశోదయము – అనివార్య=నివారించుటకశక్యమగు, కుశ= కుశ ద్వీపముయొక్క, ఉదయము=ఉన్నతి; అబ్బుట=లభించుట; అబ్రమే=ఆశ్చర్యమా? కాదనుట. అనివార్యమగు కుశ=కుశుఁ డను పుత్రునియొక్క, ఉదయము=ఆవిర్భావము అబ్బుట చిత్రముగాదని తోఁచుచున్నది.

అనఁగా కుబేరునికన్న నెక్కుడు ధనముగలవాఁడును, సింహబలుడును, పండితశ్లాఘ్యమైనకీర్తి గలవాఁడును నగు నీకుశ ద్వీపాధిపతిని వరియింతువేని నీకు కుశద్వీప మబ్బునని భావము. రావణునిఁ బరాక్రమముచే నిగ్రహించినవాఁడును, వానరసేన గలవాఁడును, రామనామముగలవాఁడును నగు దాశరథిని వరించిన సీతాదేవికిఁ గుశుఁడను పుత్రుఁడు గల్గెనని యర్థాంతరము.

మ. బలజూటీమణిదీప్తిదీపకులసంభారాప్తయౌ జన్యమం
గళగేహాంగణవీథి వీఁడు గుణటంకారాఖ్యమంత్రధ్వనుల్
సెలఁగ న్సాహసలక్ష్మిఁ గూడి కరనాళీకంబుల న్గూర్చుఁ బో
నలిమై నాకబలిన్ ద్విషత్కరిశిరోనర్ఘోరుముక్తాతతిన్. 61

టీక: వీఁడు = ఈకుశద్వీపాధిపతి; బల జూటీమణి దీప్తి దీప కుల సంభారాప్తయౌ జన్య మంగళగేహాంగణవీథిన్ – బల=సేనల యొక్క, జూటీమణి=శిరోమణులయొక్క, దీప్తి=కాంతులనెడు, దీప=దీవియలయొక్క, కుల=సమూహమనెడు, సంభార= పదార్థసంచయముచేత, ఆప్త=పొందబడినది, ఔ=అగునట్టి, జన్య=యుద్ధమనెడు, మంగళగేహ=కల్యాణగృహముయొక్క, అంగణవీథిన్=ముంగిటిభూమియందు; గుణ టంకా రాఖ్య మంత్రధ్వనుల్ – గుణ=అల్లెత్రాటియొక్క, టంకార=టంకారధ్వని యనెడు, ఆఖ్య=ప్రసిద్ధి గల, మంత్రధ్వనుల్=మంత్రముల రొదలు; చెలఁగన్=ఒప్పుచుండఁగా; సాహసలక్ష్మిన్=తెగువయనెడు లక్ష్మిని; కూడి=పొంది, వివాహమయి యనుట; నలిమైన్=యోగ్యముగా; ద్విషత్కరి శిరోనర్ఘోరు ముక్తాతతిన్ – ద్విషత్కరి= శత్రుగజములయొక్క, శిరః=తలలయందుండు, అనర్ఘ=అమూల్యములగు, ఉరు=గొప్పలగు, ముక్తా=ముత్యములయొక్క, తతిన్=సమూహముచేత;నాకబలిన్=వివాహాంగభూతమగు నాకబలి యను కృత్యమును; కరనాళీకంబులన్=కరకమలముల చేత, కరమందుండు బాణములచేత ననిగాని యర్థము; కూర్చున్=ఒనరించును; పో=సత్యము.

అనఁగ నీకుశద్వీపాధిపతి యగురాజు సైనికులయొక్క శిరోమణికాంతు లనెడు దీపములచే నలంకరింపఁబడియున్న యుద్ధభూమి యనెడు మంగళగృహమందు అనఁగా వివాహగృహమునందు అల్లెత్రాటిమ్రోత యనెడు మంత్రములు వెలయు చుండఁగ, సాహసలక్ష్మిం బెండ్లియై, శత్రుగజంబుల శిరములయం దుండు ముత్యములచే నాకబలిని జేయునని భావము.

మ. వరభోగాన్వితుఁ డీనృపాలకుఁడు ప్రోవన్ నిచ్చలు న్మించు స
ర్వరపాంపత్యభివేష్టితోర్వర ధరాభృద్భేదిసంత్రాతని

ర్జరపుర్యుత్తమలీల నిత్యసుఖవి(భ్రాజద్బుధశ్రేణికా
పరిషక్తిన్ హితదాయిరాజమణిసం(ప్రాప్తిం గురంగేక్షణా! 62

టీక: కురంగేక్షణా=లేడికన్నులవంటి కన్నులు గల చంద్రికా! వరభోగాన్వితుఁడు– వర=శ్రేష్ఠమగు, భోగ=గృహము, శయ్య, ఆభరణము, వస్త్రము, పుష్పము, స్త్రీ, గంధము,తాంబూలము అను నీయెనిమిదిభోగములతో, అన్వితుఁడు=కూడినవాఁడు; ఈ నృపాలకుఁడు = కుశద్వీపాధిపతి యగు నీరాజు; ప్రోవన్=రక్షింపఁగా; సర్పిరపాంపత్యభివేష్టితోర్వర– సర్పిరపాంపతి= ఘృతసముద్రముచేత, అభివేష్టిత=చుట్టఁబడిన, ఉర్వర=భూమి; ధరాభృద్భేదిసంత్రాతనిర్జరపుర్యుత్తమలీలన్– ధరాభృద్భేది =ఇంద్రునిచేత, సంత్రాత=రక్షింపఁబడిన, నిర్జరపురీ=అమరావతియొక్క, ఉత్తమలీలన్=శ్రేష్ఠమగు విలాసముచేత; నిత్య సుఖ విభ్రాజ ద్బుధ శ్రేణికా పరిషక్తిన్– నిత్య=శాశ్వతమగు, సుఖ=సుఖముచేత, విభ్రాజత్=ప్రకాశించుచున్న, బుధ=విద్వాంసుల యొక్క, దేవతలయొక్క, శ్రేణికా= పంక్తియొక్క, పరిషక్తిన్=సంబంధముచేత; హితదాయి రాజమణి సంప్రాప్తిన్– హితదాయి = హితము నొసఁగు, హితమగు దాని నొసఁగు, రాజమణి=రాజశ్రేష్ఠులయొక్క, చింతామణియొక్క, సంప్రాప్తిన్=ప్రాప్తిచేత; నిచ్చలున్=ఎల్లపుడు; మించున్=ప్రకాశించును.

అనఁగ నీకుశద్వీపాధిపతిచేఁ బోషింపఁబడుపుడమి యమరావతివలెఁ బ్రకాశించుచున్నదని భావము.

క. అని తెలుప మనం బచ్చట, మొనయమి శిబికాధరాళి (ముదిత నొకమహీ
శునిచెంతఁ జేర్ప శివ యి,ట్లను నావిభుఁ జూపి చెలువ (కమృతజిదుక్తిన్. 63

టీక: అని=ఈప్రకారము; తెలుపన్=తెలియఁజేయఁగ; మనంబు=డెందము; అచ్చటన్=ఆరాజునందు; మొనయమిన్=పూన కుండుటవలన; శిబికాధరాళి=పల్లకినిమోయువారి గుంపు; ముదితన్=చంద్రికను; ఒకమహీశునిచెంతన్=ఒకభూపాలుని సమీపమును; చేర్పన్=పొందింపఁగ; శివ=పార్వతి; ఆవిభున్=ఆరాజును; చూపి=చూపెట్టి; అమృతజిదుక్తిన్=సుధను జయించిన వచనముల చేత; చెలువకు=చంద్రికకు; ఇట్లు=వక్ష్యమాణప్రకారముగ; అనున్=పల్కెను.

శా. ఓపద్మానన! గాంచు మీనృపతి ర(మ్యోత్కంఠమై శాల్మలి
ద్వీపత్రాణచణుం డితం డితనివి(ద్విట్కాంతకుత్ప్రత్నకే
ళీపిచ్ఛందకవైఖరి న్వలయశై(లీయోరుకూటంబు లా
ళీపాళీగతి భిల్లరాడ్యువతిమౌ(ళిశ్రేణి పొల్చున్ గడున్. 64

టీక: ఓపద్మానన=ఓచంద్రికా! ఈనృపతిన్=ఈరాజును; రమ్యోత్కంఠమైన్=మనోహరమగు సంతసముచేత; కాంచుము= చూడుము; ఇతండు=ఈరాజు; శాల్మలిద్వీపత్రాణచణుండు=శాల్మలిద్వీపమును బాలించువాఁడు; ఇతనివిద్విట్కాంతకున్– ఈరాజుయొక్క శత్రుకాంతకు; వలయశైలీయోరుకూటంబులు – వలయశైలీయ=చక్రవాళపర్వతసంబంధులగు, ఉరు=అధి కములగు, కూటంబులు=శిఖరములు; ఉత్ప్రత్నకేళిపిచ్ఛందకవైఖరిన్– ఉత్=ఉన్నతమైన, ప్రత్న=పురాతనమగు, కేళీ పిచ్ఛందక=క్రీడాగృహముయొక్క, వైఖరిన్=రీతిని; భిల్లరాడ్యువతిమౌళిశ్రేణి =ఎఱుకుదొరలయొక్క స్త్రీసమూహము; ఆళీ పాళీగతిన్=సకియలగుంపురీతిని; కడున్=మిక్కిలి; పొల్చున్=ఒప్పును. అనఁగ నీశాల్మలీద్వీపాధిపతియొక్క శత్రుస్త్రీలకు మేడలు లోకాలోకపర్వతము లనియు, వారికి సకియలు ఎఱుకుస్త్రీలనియును భావము.

మ. కలుమున్నీ రనుపెన్కొలంకునడుమ న్గన్పట్టి వీఁ డేలు శా
ల్మలికాద్వీపము శ్రీయుతిం దనరుఁ గొమ్మా! తమ్మి నా మధ్యసం
స్థలి జ్యోతిర్లతికాఖ్యకేసరవృతోద్యత్కర్ణికాస్ఫూర్తి రా
జిల ద్రోణాద్రి తదగ్రగాభ్ర మళిరాజిస్థేమఁ జూపట్టఁగన్. 65

టీక: కొమ్మా=చంద్రికా! వీఁ డేలు శాల్మలికాద్వీపము =ఈరాజు పాలించు శాల్మలిద్వీపము; కలుమున్నీ రనుపెన్కొలంకు నడుమన్ = సురాసముద్రమనెడు పెద్దమడుఁగునడుమ; కన్పట్టి=కనిపించి; ద్రోణాద్రి=ద్రోణపర్వతము; మధ్యసంస్థలి జ్యోతిర్లతి కాఖ్య కేసర వృతోద్యత్కర్ణికా స్ఫూర్తిన్– మధ్యసంస్థలి=మధ్యప్రదేశమందలి, జ్యోతిర్లతికా=జ్యోతిర్లత లనెడు, ఆఖ్య=పేరు గల, కేసర=కింజల్కములచేత, వృత=ఆవరింపఁబడిన, ఉద్యత్=ప్రకాశించుచున్న, కర్ణికా=తామరదుద్దుయొక్క,స్ఫూర్తిన్ = అతిశయముచేత; రాజిలన్=ప్రకాశింపఁగ; తదగ్రగాభ్రము = దానిపై నున్నట్టిమబ్బు; అళిరాజిస్థేమన్=భృంగసమూహాకృతి చేత; చూపట్టఁగన్=కనిపింపఁగా; తమ్మి నాన్ = కమలమో యనునట్లు; శ్రీయుతిన్=కాంతితోఁ గూడుటచేతను, లక్ష్మితోఁ గూడుటచేత ననియుఁ దోఁచుచున్నది; తనరున్=ప్రకాశించును.

అనఁగా సురాసముద్ర మనెడుగొప్పకొలనునడుమఁ గాన్పించు నీశాల్మలీద్వీపమునడుమ జ్యోతిర్లతిక లనుకేసరములతోఁ జేరియున్న ద్రోణాద్రి తామరదుద్దువలె నుండఁగ, నాపర్వతముమీఁద నున్న మేఘము భృంగరాజివలె నుండఁగ, గొప్పమడుగు నందు భృంగరాజితోఁ జేరియున్న కమలమువలె నాద్వీపము ప్రకాశించు నని భావము. సముద్రమధ్యగతద్వీపమును హ్రద మధ్యగతకమలముగా నుత్ప్రేక్షించుటచే నుత్ప్రేక్షాలంకారము.

మ. తరుణీ! వీనియశోవదాతశుక ముద్యచ్ఛక్తి మిన్నొంది బం
ధురతారాకులగోస్తనీఫలములం దోడ్తో భుజింప న్విభా
వరి తద్దైన్యముఁ జెంద దేతదతిదీ వ్యజ్జైత్రభేరీరవో
త్కరఫక్కద్ద్రుహిణాండకర్పరగళద్బాహ్యాంబుబిందుచ్ఛటన్. 66

టీక: తరుణీ=చంద్రికా! వీనియశోవదాతశుకము = ఈశాల్మలీద్వీపాధిపతియొక్క యశస్సనెడు తెల్లని చిలుక; ఉద్యచ్ఛక్తిన్ =మీఁది కెగయుచున్న శక్తిచేత; మిన్నొంది=ఆకాశమును పొంది; బంధురతారాకులగోస్తనీఫలములన్– బంధుర=ఎడములేని, తారాకుల=రిక్కలగుంపనెడు, గోస్తనీఫలములన్=ద్రాక్షాఫలములను; తోడ్తోన్ =వెంటనె; భుజింపన్=తినఁగా; విభావరి=రాత్రి; ఏత దతిదీవ్య జ్జైత్రభేరీ రవోత్కర ఫక్క ద్ద్రుహిణాండ కర్పర గళ ద్బాహ్యాంబు బిందు చ్ఛటన్– ఏతత్=ఈశాల్మలీద్వీపాధిపతి యొక్క, అతిదీవ్యత్=మిక్కిలి ప్రకాశించుచున్న, జైత్రభేరీ=జయభేరియొక్క, రవోత్కర=శబ్దబృందముచేత, ఫక్కత్=పగి లిన, ద్రుహిణాండ=బ్రహ్మాండముయొక్క, కర్పర=పుఱ్ఱెవలననుండి, గళత్=జాఱుచున్న, బాహ్యాంబు=బ్రహ్మాండమునకు వెలుపలనుండు జలముయొక్క, బిందు=బిందువులయొక్క, ఛటన్=సమూహముచేత; తద్దైన్యము—తత్=ఆనక్షత్రముల యొక్క, హైన్యము=శూన్యతను; చెందదు=పొందదు.

అనఁగ నీశాల్మలీద్వీపాధిపతియొక్క యశ మనెడు తెల్లనిచిలుక మిన్నొంది నక్షత్రము లనెడి ద్రాక్షాఫలములను తినినను, రాత్రి వీని జయభేరీనినాదములవలన బ్రహ్మాండకర్పరము పగిలి స్రవించు జలబిందుసందోహముచే రిక్కలయొక్క లేమిని

జెందదని భావము. యశమును శుకమునుగా, రిక్కలను ద్రాక్షాఫలములనుగా, జలబిందువులను రిక్కలనుగా వర్ణించుటచేత రూపకాలంకారము.

ఉ. ఈవసుధేశుఁ గూడి హరి◊ణేక్షణ! నీవు ముదంబు నిక్క వే
లావనవాటికావిహృతు◊లం జరియించుచు మించువేళ నీ
మై వలగొన్న సంశ్రమస◊మాజము దూలఁగఁ బొల్పుఁ గాక హా
లావనరాశివాకణకు◊లస్థగితానిలపోతజాతముల్. 67

టీక: హరిణేక్షణ=లేడికన్నులవంటి కన్నులుగల యోచంద్రికా! ఈవసుధేశున్=ఈశాల్మలీద్వీపాధిపతిని; కూడి=కలసికొని; నీవు; ముదంబు=సంతసము; నిక్కన్=అతిశయింపఁగా; వేలా వన వాటికా విహృతులన్ – వేలా=చెలియలికట్టయొక్క, వన=అడవియొక్క, వాటికా=పంక్తులయందు, విహృతులన్=విహారములచేత; చరియించుచున్=క్రుమ్మరుచు; మించువేళన్=అతిశయించుసమయమందు; నీమైన్=నీశరీరమునందు;వలగొన్న సంశ్రమసమాజము – వలగొన్న=చుట్టుకొన్న, సంశ్రమ=శ్రమలయొక్క, సమాజము=సమూహము; తూలఁగన్=పోవునట్లు; హాలావనరాశి వాకణ కుల స్థగి తానిలపోత జాతముల్ – హాలావనరాశి=సురాసముద్రముయొక్క, వాకణ=నీటిబిందువులయొక్క, కుల=సమూహముచేత, స్థగిత=కప్పఁబడిన,అనిలపోత = మందమారుతములయొక్క, జాతముల్=సమూహములు; పొల్చుఁ గాక=ఒప్పుఁగాక.

ఓచంద్రికా! నీవు శాల్మలీద్వీపాధిపతిని గూడి వేలావనవిహారమును చేయుచుండుతఱి నీశరీరశ్రమను కలుమున్నీటి నీటి తుంపరలతోఁ గూడిన తెమ్మెరలు తొలఁగఁజేయునని భావము.

వ. అని యప్పంచాస్యపంచాస్యమధ్య యెఱింగించిన నాకాంచనాంగినేత్రాంచలం బతనిపైఁ బ్రవర్తింప దయ్యెఁ, నది యెఱింగి వేఱొక్క మహీశపుంగవుఁ జేర నియోగించి యారాజేంద్రుం జూపి యన్నెలఁత కన్నెలతాల్పువేల్పు పట్టపుదేవి యిట్లనియె. 68

టీక: అని=ఈప్రకారముగఁ బలికి; అప్పంచాస్యపంచాస్యమధ్య– పంచాస్య=ఈశ్వరునియొక్క,పంచాస్యమధ్య=సింహమువంటి నడుముగల కాంత, అనఁగా శివకాంతయైన సన్నినడుముగల పార్వతీదేవి; ఎఱింగించినన్=తెలియఁజేయఁగా; ఆకాంచనాంగినేత్రాంచలంబు= ఆచంద్రికయొక్క కటాక్షము; అతనిపైన్=ఆశాల్మలిద్వీపాధిపతిమీఁద; ప్రవర్తింప దయ్యెన్=ప్రసరింపదాయెను; అది యెఱింగి = అది తెలిసి; వేఱొక్క మహీశపుంగవున్=మఱొక రాజశ్రేష్ఠుని; చేరన్=సమీపించునటులు; నియోగించి=ఆజ్ఞాపించి; ఆరాజేంద్రుం జూపి; అన్నెలఁతకున్=ఆచంద్రికకు; అన్నెలతాల్పువేల్పు పట్టపుదేవి=చంద్రుని ధరించిన శివునకుఁ బట్టపుదేవి యగు నా పార్వతీదేవి; ఇట్లు=వక్ష్యమాణప్రకారము; అనియెన్=పలికెను.

మ. అరిజన్యాంబుధిసంభవజ్జయరమా◊హాసాంకురత్కీర్తి నీ
శరజాస్త్రోపమమూర్తిఁ గాంచు చెలి! ప్ల◊క్షద్వీపభూభర్త స
ప్తరసాభృద్ధరణీయమై పొదలు గో◊త్రం దాల్చు నీమేటి భా
స్వరదోర్యష్టిభుజాంగదాగ్రఖచితాం◊చచ్చక్రనీలోపధిన్. 69

టీక: చెలి=చంద్రికా!అరి జన్యాంబుధి సంభవ జ్జయరమా హాసాంకుర త్కీర్తిన్ – అరి=శత్రువులయొక్క, జన్య=యుద్ధమనెడు, అంబుధి=సముద్రమందు, సంభవత్=జన్మించిన, జయరమా=జయలక్ష్మియొక్క,హాసాంకురత్=చిఱునగవువలెనాచరించుచున్న, కీర్తిన్=యశముగల; ప్లక్షద్వీపభూభర్తన్=ప్లక్షద్వీపాధిపతియగు; ఈశరజాస్త్రోపమమూర్తిన్=జలజాస్త్రుఁడగు మరునికి సమానమగు దేహముగల వీనిని; కాంచు=చూడుము; ఈమేటి=ఈఘనుఁడు; సప్తరసాభృ ద్ధరణీయమై—సప్తరసాభృత్=సప్తకులాచలములచేత, ధరణీయమై=ధరింపఁదగినదియై; పొదలు గోత్రన్=వృద్ధిఁబొందుచున్న భూమిని; భాస్వర దోర్యష్టి భుజాంగ దాగ్ర ఖచితాంచ చ్ఛక్రనీలోపధిన్—భాస్వర=ప్రకాశించుచున్న, దోర్యష్టి=భుజదండములయొక్క, భుజాంగద=కేయూరములయొక్క, అగ్ర=చివరయందు,ఖచిత=చెక్కఁబడిన, అంచత్=ప్రకాశించుచున్న,శక్రనీల=ఇంద్రనీలమణియొక్క, ఉపధిన్= వ్యాజముచేత; తాల్చున్=ధరించును. అనఁగ నీప్లక్షద్వీపాధిపతి సప్తకులాచలములు మోయుచున్న భూమిని తన బాహుపురి యందలి చెక్కియున్న యింద్రనీలమణి యను వ్యాజముచే ధరించి యున్నాఁడని భావము. భూమి నల్లని దనుటకు విష్ణుమూర్తి వక్షమునందు ధరియించియున్న కస్తురిని లక్ష్మీదేవి సమీపమందు భూదేవిని బ్రీతితో నుంచెనా యనునటులు మను చరిత్రయం దుత్ప్రేక్షింపఁబడియున్నది.

మ. అనిశంబు న్బుధవర్ణ్యకల్పతరుదీ◊వ్యద్వాసనాలబ్ధిఁ జే
కొని యద్వైతరుచిం గరంబు మను నీ ◊క్షోణీస్థలాధీశవ
ర్యునికీర్తిప్రకరంబు మించ సకి! యో◊హో పూర్వపక్షావలం
బనత న్రాజిలు నట్టిధ్వాంతపరధా◊మం బెచ్చునే యెచ్చటన్. 70

టీక: అనిశంబున్=ఎల్లప్పుడు; బుధ వర్ణ్య కల్పతరు దీవ్య ద్వాసనా లబ్ధిన్ – బుధ=దేవతలచేత, వర్ణ్య=వర్ణింపఁదగిన, కల్పతరు= కల్పవృక్షములయొక్క, దీవ్యత్=ప్రకాశించుచున్న, వాసనా=వలపుయొక్క,లబ్ధిన్=ప్రాప్తిని; చేకొని=గ్రహించి; అద్వైతరుచిన్ =అద్వితీయమగుకాంతిచేత; కరంబు=మిక్కిలి; మను నీ క్షోణీస్థలాధీశవర్యునికీర్తిప్రకరంబు – మను=వృద్ధిఁబొందుచున్న, ఈ క్షోణీస్థలాధీశవర్యుని=ఈరాజశ్రేష్ఠునియొక్క, కీర్తిప్రకరంబు=కీర్తిపుంజము; మించన్=అతిశయింపఁగా; ఓహో సకి=ఓహో చంద్రికా! పూర్వపక్షావలంబనతన్=అపసిద్ధాంతము ఆశ్రయముగాఁ గల్గుటచేత; రాజిలు నట్టిధ్వాంతపరధామంబు – రాజిలునట్టి=ప్రకాశించునట్టి; ధ్వాంతపర=చంద్రునియొక్క, ధామంబు=తేజము; ఎచ్చటన్=ఏప్రదేశమునందైన, ఎచ్చునే=అతిశ యించునా? ఇచట, అనిశంబున్=ఎల్లప్పుడు; బుధ=విద్వాంసులచేత,వర్ణ్య=పొగడఁదగిన, కల్పతరు= కల్పతరువను వేదాంతగ్రంథముయొక్క, దీవ్యత్=ప్రకాశించుచున్న, వాసనా=అనుభూతస్మృతియొక్క,లబ్ధిన్=ప్రాప్తిని; చేకొని=గ్రహించి; అద్వైతరుచిన్ =బ్రహ్మాత్మైక్యమందలి యాసక్తిచేత; మను=అతిశయించు, కీర్తిప్రకరంబు, పుల్లింగస్వారస్యమువలన నొక పురుషుఁ డని తోఁచుచున్నది; మించన్=అతిశయింపఁగ, పూర్వపక్షావలంబనతన్ –పూర్వపక్ష=అపసిద్ధాంతము, అవలంబనతన్=ఆశ్రయముగాఁ గల్గుటచేతను; రాజిలు నట్టిధ్వాంతపరధామంబు – రాజిలునట్టి =ప్రకాశించునట్టి, ధ్వాంతపర ధామంబు = 'ధ్వః అన్తే యస్య సః ధ్వాన్తః' అనఁగా ధ్వశబ్ద మంతమందుఁగల మాధ్వశబ్ద మర్థము, తద్వాచ్యులు=ద్వైతులు, అట్టి ద్వైతులయొక్క, పరధామంబు=ముఖ్యమగు సిద్ధాంతము; ఎచ్చునే=అతిశయించునా? అతిశయింపదని భావము. ధ్వాంత=అజ్ఞానముయొక్క, ధామం బెచ్చునే అనియు చెప్పఁబడును.

అనఁగ నోచంద్రికా! ప్లక్షద్వీపాధిపతియొక్క కీర్తి పుంజము కల్పతరుకాంతితో నేకీభవించినకాంతి గలదై మించఁగ శుక్లపక్షమందుండు చంద్రునితేజము హెచ్చునా? హెచ్చదని భావము.

అద్వైతసిద్ధాంతపరులగు విద్వాంసులచేఁ బ్రశంసింపఁబడిన కల్పతరువను వేదాంతగ్రంథముయొక్క మననాదులచే నుదయించిన వాసనను చేకొని బ్రహ్మాత్మైక్యానుసంధానముచే విజృంభించు విద్వాంసుఁ డతిశయింపఁగ పూర్వపక్షమతము నవలంబించి యున్న మాధ్వసిద్ధాంతము హెచ్చదని ధ్వని.

చ. సరససితోపమాధర! ర(సాలపయోనిధిరాజవేష్టితో
ర్వర కధినేత నీపతి న(వారితవైభవశాలి నీమహీ
శ్వరు నవలాలసాతిలక(వల్లిక చయ్యనఁ బల్లవింప స
త్వరగతిఁ గాంచవే నయన(వారిరుహాంతమునం బ్రియంబునన్. 71

టీక: సరససితోపమాధర—సరస=మనోజ్ఞమగు, సిత=చక్కెరతో, ఉపమా=పోల్కిగల, అధర=ఓష్ఠముగల చంద్రికా! రసాలపయోనిధిరాజ వేష్టి తోర్వరకున్ – రసాలపయోనిధిరాజ=ఇక్షుసముద్రరాజుచేతను, వేష్టిత=వలగొనఁబడిన, ఉర్వరకున్ =భూమికి; అధినేతన్=ఒడయని; ఈపతిన్=ఈరాజును; అవారితవైభవశాలిన్ – అవారిత=అనివార్యమగు, వైభవ=విభవముచేత, శాలిన్=ప్రకాశించుచున్నవాని; ఈమహీశ్వరున్=ఈప్లక్షద్వీపాధిపతిని; నవ లాలసా తిలకవల్లిక – నవ=నూతనమైన, లాలసా=వేడుకయనెడు,తిలకవల్లిక=బొట్టుగుతీఁగ; చయ్యనన్=శీఘ్రముగా; పల్లవింపన్=చిగిరించునటులు; నయనవారిరుహాంతమునన్ – నయనవారిరుహాంతమునన్=కమలములవంటి నేత్రములయొక్క కొనలచేత, అనఁగాఁ దమ్ముల వంటి కన్నులయొక్క కడగంటిచూపులచేత; ప్రియంబునన్ =ప్రేమతో; సత్వరగతిన్=అతిశీఘ్రముగ; కాంచవే =చూడుమా!

ఓచంద్రికా! ఇక్షుసముద్రముచేఁ జుట్టఁబడియున్నట్టి పుడమి కధిపతి యగు నీరాజును వేడుకయను తిలకలత పల్లవించునటు లతివేగముగా నేత్రాంతముచే నవలోకింపుమని భావము. స్త్రీదృష్టిచే బొట్టుగు చిగిరించునని కవిసమయము.

వ. అని యిట్టు లాగట్టుదొరపట్టి వివరించిన నారాచపట్టి యాదిట్టపైవైరాగ్యంబు దెలుపు చిన్నినవ్వు నవ్వ, నవ్వనిత దరహాసచంద్రిక తదీయసంతాపకారణంబై ప్రవర్తిల్లె నంత యానావలంబకకదంబంబు జంబూద్వీపభూపాలలోకంబుఁ జేర్ప నన్నగాధిరాజకుమారి యోనారి నేరెడుదీవియరాజులు వీరు వీరిలో నొక్కరాజకుమారునిపైఁ జూపు నిలుపు మమ్మహాత్ముని గుణంబులు వర్ణించెద నని యానతిచ్చిన నాకాంత యఖిలదేశనాయకగుణశ్రవణకౌతూహలపూర్యమాణస్వాంతయై శాలీనతాభరంబున నూరకుండెనది యెఱింగి సర్వమంగళ యక్కురంగనేత్ర కందఱం దెలుపునదియై వారిలో నొక్కరాజుం జూపి యిట్లనియె.

టీక: అని యిట్టులు=ఈప్రకారముగ; ఆగట్టుదొరపట్టి=హిమవత్పుత్రికయగు నాపార్వతీదేవి; వివరించినన్=వక్కాణింపఁగ; ఆరాచపట్టి=ఆరాజపుత్రి(చంద్రిక); ఆదిట్టపైన్=ఆప్లక్షద్వీపాధిపతిమీఁద; వైరాగ్యంబు=అనురాగాభావమును; తెలుపు చిన్ని నవ్వున్= తెలియఁజేయు చిఱునగవును; నవ్వన్=నవ్వఁగా; అవ్వనిత దరహాసచంద్రిక – అవ్వనిత =ఆచంద్రికయొక్క, దరహాసచంద్రిక=చిఱునగవువెన్నెల; తదీయసంతాపకారణంబై – తదీయ=ఆప్లక్షద్వీపాధిపతియొక్క, సంతాప=పరితాపమునకు, కారణంబై=హేతువై; ప్రవర్తిల్లెన్=ప్రవర్తించెను; అంతన్=అటుమీఁద; యానావలంబకకదంబంబు=పల్లకిమోయువారియొక్కగుంపు; జంబూద్వీపభూపాలలోకంబున్= నేరెడుదీవియందుండు పుడమిఱేడులగుంపును; చేర్పన్=పొందింపఁగ; అన్నగాధిరాజకుమారి=హిమవంతునకు కూఁతురగు నాపార్వతీదేవి; ఓనారి=ఓచంద్రికా! వీరు నేరెడుదీవియరాజులు =వీరు

జంబూద్వీపమున నుండు రాజులు; వీరిలోన్=ఈరాజులలో; ఒక్క రాజకుమారునిపైన్= ఒకరాజపుత్త్రునిమీఁద; చూపు = దృష్టిని; నిలుపుము=ఉంచుము; అమ్మహాత్మునిగుణంబులు=ఆమహానుభావుని శౌర్యాదిగుణములను; వర్ణించెదను= నుతించెదను; అని=ఇట్లనుచు; ఆనతిచ్చినన్=సెలవీయఁగా; ఆకాంత=ఆచంద్రిక; అఖిలదేశనాయక గుణ శ్రవణ కౌతూహల పూర్యమాణ స్వాంతయై–అఖిలదేశనాయక=సమస్తదేశాధిపతులయొక్క,గుణ=శౌర్యాదిగుణములయొక్క,శ్రవణ=వినుటయందు ,కౌతూహల = సంతసముచేత, పూర్యమాణ=నింపఁబడిన, స్వాంత యై=చిత్తముగలదై; శాలీనతాభరంబునన్=లజ్జాభారముచేత; ఊరకుండెన్=ఏమనకయుండెను; అది యెఱింగి =అది తెలిసికొని; సర్వమంగళ=పార్వతీదేవి; అక్కురంగనేత్రకున్= ఆచంద్రికకు; అందఱం దెలుపునదియై=ఎల్లరను దెలియఁజేయునదియై; వారిలోన్=ఆరాజులలో; ఒక్కరాజున్=ఒకభూభర్తను; చూపి =ప్రదర్శించి; ఇట్లు = వక్ష్యమాణప్రకారముగ; అనియెన్=పలికెను.

చ. పొలఁతుక! గౌడదేశనర౦పుంగవుఁ డీతఁడు, వీనిఁ గాంచు, మి
యొ్యలఘుఁడు నిత్యసద్గుణచ౦యస్ఫురణన్ శుభకీర్తిపుత్రికా
వలి నటియింపఁ జేయుఁ గడు ౦వాగ్రమణాండము లెల్లఁ గంచుకుం
డలగతిఁ బాయ కూని భ్రమ౦ణక్రమణంబులు చక్కఁ జేకొనన్. 73

టీక: పొలఁతుక=చంద్రికా! ఈతఁడు=ఈరాజు; గౌడదేశనరపుంగవుఁడు=గౌడదేశాధిపతి; వీనిన్=ఈరాజును; కాంచుము= చూడుము; ఇయ్యలఘుఁడు =ఈఘనుఁడు; నిత్య సద్గుణ చయ స్ఫురణన్– నిత్య=ఎల్లపుడు, సద్గుణ=దానదాక్షిణ్యాది గుణములయొక్క, త్రాళ్లయొక్క యని యర్థాంతరము, చయ=సమూహముయొక్క, స్ఫురణన్=ప్రకాశముచేతను, చలనముచేత నని యర్థాంతరము; శుభ కీర్తిపుత్రికావలిన్—శుభ=సుందరములైన, కీర్తిపుత్రికా=కీర్తి యనెడు బొమ్మలయొక్క, ఆవలిన్=పంక్తిని; కడున్=మిక్కిలి; వాగ్రమణాండములు=బ్రహ్మాండములను; ఎల్లన్=అన్నిటిని; కంచుకుండలగతిన్= కంచుకుండలరీతిగా; పాయక= విడువక; ఊని=గ్రహించి; అనఁగ నాట్యోపయోగి ఘటములవలె బ్రహ్మాండములను గ్రహించి యని భావము; భ్రమణక్రమణంబులు—భ్రమణ=తిరుగుటవలననైన, క్రమణంబులు=పాదవిన్యాసములను;చక్కన్=చక్కఁగా; చేకొనన్=గ్రహించునటులు; నటియింపఁ జేయున్=నాట్యము నొనరింపఁజేయును.

అనఁగా నీగౌడదేశాధిపతి బ్రహ్మాండములు కంచుకుండలుగా గ్రహించి, తనమంచిగుణము లనెడు త్రాళ్లయొక్క చలనముచేత తనకీర్తులను బొమ్మలను భ్రమణక్రమణంబులు సేయునటులు నటింపఁజేయునని భావము. లోకములో నాట్యమందు ప్రవీణత గలవారు కుండలయందు నాట్య మొనరించుట ప్రసిద్ధము. ఈభూవిభునికీర్తి సమస్తబ్రహ్మాండములను వ్యాపించినదని వ్యంగ్యము. ఈపద్యమందు రూపకాలంకారము.

మ. సమిదుద్ద్యోతితహేతిభృద్దళనవి౦స్ఫారప్రభావాప్తిమై
క్షమఁ బెంపొంది యుదగ్రజిష్ణుయుతి ని౦చ్చల్ బల్ మొన ల్సాపు శం
బముపై ధాటికిఁ జయ్యన న్వెడల నీ౦క్ష్మాభర్తధామాగ్ని క
ర్యమబింబోపధి నారతిచ్చు నహర౦బ్జావాస యాత్రోవలన్. 74

టీక: సమి దుద్ద్యోతితహేతిభృ ద్దళన విస్ఫార ప్రభా వాప్తిమైన్ – సమిత్=యుద్ధమందు,ఉద్ద్యోతిత=ప్రకాశించుచున్నట్టి, హేతిభృత్ = ఖడ్గధారులయొక్క, దళన=బ్రద్దలుచేయుటచేత, విస్ఫార=అధికమగు, ప్రభావ=మహిమయొక్క, ఆప్తిమైన్= ప్రాప్తిచేతను; సమిత్=ఇంధనములచేత,ఉద్ద్యోతిత=జ్వలించునట్టి, హేతిభృత్= అగ్ని యొక్క, దళన=తిరస్కారముచేత, విస్ఫార= అధికమగు, ప్రభావ=మహిమయొక్క,ఆప్తిమైన్=ప్రాప్తి చేత, అని యర్థాంతరము; క్షమన్=భూమియందు; పెంపొంది=వృద్ధిఁ బొంది;ఉదగ్రజిష్ణుయుతిన్ – ఉదగ్ర=ఉత్కృష్టుఁడగు, జిష్ణుయుతిన్=ఇంద్రసంగతిచేతను; ఉత్కృష్టుఁడగు జయశీలునియొక్క సంబంధముచేత నని యర్థాంతరము; నిచ్చల్=ఎల్లపుడు; పల్ మొనల్=నూరంచులను, అనేకసైన్యములను; చూపు శంబము పైన్ = కనఁబఱచు వజ్రాయుధముమీఁదికి; ధాటికిన్=జైత్రయాత్రకు; చయ్యనన్=శీఘ్రముగా; వెడలన్=బయలుదేఱఁగా; ఈ క్ష్మాభర్తధామాగ్నికిన్=ఈగౌడదేశపురాజుయొక్క ప్రతాపాగ్నికి; అహరబ్జావాస=దినలక్ష్మి; ఆత్రోవలన్=ఆమార్గములందు; అర్యమబింబోపధిన్ = సూర్యబింబమను వ్యాజముచేత; ఆరతిన్=నీరాజనమును; ఇచ్చున్=చేయును.

ఈగౌడదేశాధిపతియొక్క ప్రతాపాగ్ని పుడమి శూరనిబర్హణముచే వృద్ధి నొంది, జయశీలుని గూడి అనేకసేనలను జూపు వజ్రాయుధముమీఁదికి యుద్ధమునకు వెడలఁగా, దినలక్ష్మి మార్గమందు ప్రతాపాగ్నికి సూర్యబింబమను నెప మిడి యారతిచ్చుచున్నదని భావము. సూర్యబింబము ప్రతాపాగ్నికి నీరాజనదీప మున్నటు లున్నదని పద్యమందు వ్యంగ్యము.

చ. వనజగృహంబుల న్విడిచి ◊వారిధిరాజకుమారి యీమహీ
శనయనపద్మసీమముల ◊సంతతము న్వసియింపఁ బాడుగై
కొనిన తదాలయాళి సుమ◊కోమల! బల్ రొద నివ్వటిల్లఁగా
ననిశము మొత్తు లాడు మలి◊నాత్మకబంభరదంభభూతముల్. 75

టీక: సుమకోమల =పూవువలె మృదువైనదానా! వారిధిరాజకుమారి =లక్ష్మీదేవి; వనజగృహంబులన్=పద్మగేహములను; విడిచి=వదలి; ఈమహీశనయనపద్మసీమములన్ = ఈదొరకనుదమ్ములకొనలయందు; సంతతమున్=ఎల్లపుడు; వసియింపన్=నివసింపఁగా; పాడు గైకొనిన తదాలయాళి = పాడుపడిన యాలక్ష్మీగృహములందు; బల్ రొద=అధికమగు కోలాహలధ్వని; నివ్వటిల్లఁగాన్=అతిశయింపఁగా; అనిశము =ఎల్లపుడు; మలినాత్మకబంభరదంభభూతముల్ – మలినాత్మక=నల్లనిదేహముగల, పాపభూయిష్ఠమగు మనముగల యను నర్థము దోఁచుచున్నది, బంభర=తుమ్మెదలను, దంభ= వ్యాజముగల, భూతముల్=పిశాచములు; మొత్తులాడున్=కొట్లాడును.

ఓచంద్రికా! లక్ష్మీదేవి తనగృహములను విడిచి యీరాజు నపాంగములయందు వసియింపఁగ నామెగృహములు పాడుపడి వానియందు ఘోరధ్వనులను జేయుచు నల్లనిశరీరములు గల తుమ్మెద లనుపిశాచము లెల్లప్పుడును గొట్లాడుచు పడియుండు ననిభావము. రాజులనేత్రాంతములయందు కలిమినెలంత యునికియు, కమలములు లక్ష్మీనివాసము లనుటయు, నందు భృంగము లుండుటయుఁ బ్రసిద్ధము.

తే. అనిన ద్వైతార్థమునకు వే◊దాంత మనఁగ
వనితస్వాంతం బలజనేంద్రు ◊నెనయ కున్కి
వేఱొకనిచెంతఁ జేర్చి య◊వ్వేలఁది కద్రి
తనయ యారాజుఁ జూపి యి◊ట్లనియె నపుడు. 76

టీక: అనినన్=ఇట్లు చెప్పఁగా; ద్వైతార్థమునకున్=జీవాత్మ పరమాత్మలకు భేదము గలదను నర్థమునకు;వేదాంత మనఁగన్ = అద్వైతార్థప్రతిపాదకము లగు నుపనిషత్తు లనునట్లు; వనితస్వాంతంబు=చంద్రికాచిత్తము; అలజనేంద్రున్=ఆనృపతిని; ఎనయ కున్కిన్=పొందకుండుటచేత; వేఱొకనిచెంతన్=ఇంకొకరాజు సమీపమును; చేర్చి=పొందించి; అవ్వెలఁదికిన్=ఆచంద్రికకు; అద్రితనయ =పార్వతీదేవి;ఆరాజున్=ఆమథురానగరపతిని; చూపి=ప్రదర్శించి; ఇట్లు=వక్ష్యమాణప్రకారము; అనియెన్ = పలికెను; అపుడు=ఆసమయమందు, దీని కుత్తరపద్యస్థక్రియతో నన్వయము.
అనఁగా ద్వైతార్థము అద్వైతార్థప్రతిపాదకము లగు నుపనిషత్తులయందు ఏరీతి సమన్వితము కాదో, ఆరీతిఁ జంద్రికాచిత్త మా రాజునందు లగ్నము కాలేదని భావము.

చ. రతి దళుకొత్తఁ గాంచు మథురానగరీపరిపాలనక్రియో
ర్జితమతి నీమహీపతి విశేషకలక్షణశోభితాస్య సం
భృతతపనీయమేఖలిక నీనరపాలకఖడ్గపుత్త్రి న
ద్భుతగతిఁ గాంచి శత్రుతతి పూను నని న్నవమోహ మాత్మలన్. 77

టీక: రతి=అనురాగము; తళుకొత్తన్=ప్రకాశించునట్లు; మథురానగరీ పరిపాలనక్రియోర్జితమతిన్–మథురానగరీ= మథురా పట్టణముయొక్క, పరిపాలనక్రియా=పాలనమనెడు వ్యాపారమునందు, ఊర్జితమతిన్=దృఢమగు బుద్ధిగల; ఈమహీపతిన్ =ఈరాజును; విశేషకలక్షణశోభితాస్యన్– విశేషక=విలక్షణమగు,లక్షణ=గుణిచేత, శోభిత=ప్రకాశించుచున్న, ఆస్యన్=వద నముగల; విశేషక=తిలకముచేతను,లక్షణ=శుభచిహ్నములచేతను, శోభిత=ప్రకాశించుచున్న, ఆస్యన్=ముఖముగల, యని యర్థాంతరము; సంభృత తపనీయ మేఖలికన్– సంభృత = భరింపఁబడిన, తపనీయ = బంగరుయొక్క, మేఖలికన్=ఖడ్గ బంధము గల, ఒడ్డాణము గల,'మేఖలా ఖడ్గబంధే స్యా త్కాంచీశైల నితమ్బయోః' అని విశ్వము; ఈనరపాలకఖడ్గపుత్రిన్– ఈ నరపాలక=ఈరాజుయొక్క, ఖడ్గపుత్రిన్=చూరకత్తిని; లేదా కత్తియనెడు సుతను; అనిన్=యుద్ధమునందు; శత్రుతతి=శత్రు వుల సమూహము; అద్భుతగతిన్=ఆశ్చర్యరీతిచేత; కాంచి=చూచి; ఆత్మలన్=మనములందు; నవమోహము–నవ=నూతన మగు, మోహము=మూర్ఛను, అనురాగమును; పూనున్=పొందును; కాంచు=అవలోకింపుము.
అనఁగా యుద్ధమం దీమథురాపురనరపతి ఖడ్గపుత్రిని జూచి శత్రుబృందము మోహమును బొందునని తాత్పర్యము.

సీ. మథురాపురీమణిమహనీయసౌవర్ణ,హర్మ్యసందోహవిహారములకు,
ననవద్యబృందావనాంతాంతలతికాంత,లతికాంతహరణఖేలాగతులకుఁ,
గలితసారసమిత్రకన్యకాకల్లోల,మాలికాపాలికాకేలికలకుఁ,
జారుగోవర్ధనాచలకందరామంది,రాళినిగూహనవ్యాపృతులకుఁ,
తే. దరుణచపలాయమానకైతకదళాప్త,కబరికాబంధ! యాకాంక్షగలిగె నేని,
నీధరాధీశకులమౌళి నెనయఁజేయు, మలఘులజ్జావలద్దృష్టివిలసనంబు. 78

టీక: తరుణచపలాయమానకైతకదళాప్తకబరికాబంధ– తరుణచపలాయమాన=క్రొక్కారుమెఱుపువలె నాచరించుచున్న, కైతకదళ=గేదఁగిఱేకుచేత,ఆప్త=పొందఁబడిన,కబరికాబంధ=కొప్పుగల చంద్రికా!

మథురాపురీమణిమహనీయసౌవర్ణహర్మ్యసందోహవిహారములకున్ – మథురాపురీ=మథురానగరముయొక్క, మణి=మణులతోఁగూడిన,మహనీయ=శ్లాఘ్యములగు, సౌవర్ణ=సువర్ణవికారములగు, హర్మ్య=మేడలయొక్క, సందోహ=సమూహమునందలి, విహారములకున్=క్రీడలకు;

అనవద్య బృందావనాంతాంత లతి కాంత లతికాంత హరణ ఖేలాగతులకున్ – అనవద్య=నిర్దుష్టములగు, బృందావనాంత=బృందావనమధ్యమందున్న, అంత=మనోహరములగు, లతికా=తీవలయొక్క, అంత=మనోహరములగు, లతికాంత=పుష్పములయొక్క, హరణ= కోయుటయందైన, ఖేలాగతులకున్=క్రీడావిధానములకు;

కలిత సారసమిత్రకన్యకా కల్లోల మాలికా పాలికాకేలికలకున్ – కలిత=ఒప్పుచున్న,సారసమిత్రకన్యకా=యమునానదియొక్క, కల్లోల=తరఁగలయొక్క,మాలికా=పంక్తులయొక్క,పాలికా=పరంపరలయందు, 'పాళి స్త్ర్యశ్ర్యఙ్కపఙ్క్తిషు' అని అమరుఁడు, కేలికలకున్=విహారములకు, జలక్రీడల కనుట;

చారు గోవర్ధనాచల కందరామందిరాళి నిగూహన వ్యాపృతులకున్ – చారు=సుందరములగు, గోవర్ధనాచల=గోవర్ధనపర్వతముయొక్క, కందరామందిరా=గృహములవంటి గుహలయొక్క, ఆళి=పంక్తులయందు, నిగూహన=దాఁగిలిమూఁతలనెడు, వ్యాపృతులకున్=వ్యాపారములకు;

ఆకాంక్ష=కోరిక;కలిగె నేని=పుట్టినచో;ఈధరాధీశకులమౌళిన్=ఈరాజశ్రేష్ఠుని; అలఘు లజ్జా వల ద్దృష్టి విలసనంబు – అలఘు=అధికమగు, లజ్జా=సిగ్గుచేత, వలత్=చలించుచున్న, దృష్టి=చూపులయొక్క,విలసనంబు=విలాసమును; ఎనయన్ చేయుము = కలయునటులు చేయుము. అనఁగ మథురాపురసౌవర్ణసౌధములయందుఁ గలుగు క్రీడలను, బృందావనపుష్పహరణములను, యమునానదీజలక్రీడలను, గోవర్ధనపర్వతగుహలయందు డాఁగిలిమూఁతలనెడు క్రీడలను కోరుదువేని నీరాజమౌళియందుఁగటాక్షముల నెఱపు మని తాత్పర్యము.

చ. కువలయసంభ్రమప్రదతఁకు న్నెలవై పరచక్రదర్పవై
భవహరణాఢ్యవర్తనకుఁ బాదయి యీవిభుదోర్మహంబు గో
త్ర వెలయఁ దత్తులావిరహితాజనితోరుమలీమసత్వ మో
యువతి వసద్రమేశతనుభోపధిఁ బర్వు దినేంద్రుమేనునన్. 79

టీక: ఓయువతి=ఓచంద్రికా! ఈవిభుదోర్మహంబు=ఈరాజు భుజప్రతాపము; కువలయ సంభ్రమప్రదతకున్ – కువలయ=కలువలకు, భూవలయమునకు, సంభ్రమప్రదతకున్=సంతసము నిచ్చుటకు, తొట్రుపాటు నిచ్చుటకు; నెలవై=నివాసస్థానమై; పరచక్రదర్పవైభవ హర ణాఢ్య వర్తనకున్ – పర=శ్రేష్ఠములగు, చక్ర=జక్కవలయొక్క,దర్పవైభవ=గర్వాతిశయముయొక్క, హరణ=పోఁగొట్టుటయందు, ఆఢ్య=పూర్ణమగు,వర్తనకున్=వ్యాపారమునకు; పాదయి=ఉనికిపట్టయి; పర=శత్రురాజులయొక్క, చక్ర=రాష్ట్రములయొక్క,దర్పవైభవ=గర్వాతిశయముయొక్క, హరణ=పోఁగొట్టుటయందు, ఆఢ్య=పూర్ణమగు, వర్తనకున్=వ్యాపారమునకు, పాదయి యని యర్థాంతరము; గోత్రన్=భూమియందు; వెలయన్= ప్రకాశింపఁగా; తత్తులా విరహితా జనితోరు మలీమసత్వము – తత్తులా=తత్సామ్యముయొక్క,విరహితా=రాహిత్యముచేత,జనిత=పుట్టింపఁబడిన, ఉరు=అధికమగు, మలీమసత్వము=మాలిన్యము, నైల్య మనుట; వసద్రమేశతనుభోపధిన్—వసత్=నివసించియున్న, రమేశ=నారాయణమూర్తియొక్క,తనుభా=దేహకాంతి యనెడు, ఉపధిన్=వ్యాజముచేత; దినేంద్రుమేనునన్=సూర్యశరీరమందు; పర్వున్=వ్యాపించును.

అనఁగ నీరాజు ప్రతాపము కువలయసంభ్రమప్రదమును, పరచక్రదర్పము నడఁగించునదియు నగుటచే, గువలయసంతోష మును బోఁగొట్టువాఁడును, బరచక్రదర్పమును నతిశయింపఁజేయువాఁడును నగు సూర్యుఁడు ఏతద్రాజప్రతాపసామ్యము పొందమి నుదయించు నైల్యమును, తనశరీరమందుండు నారాయణమూర్తియొక్క శరీరకాంతి యనెడు నెపముచే ధరించు నని తాత్పర్యము. వాస్తవికమగు సూర్యశరీరగతనారాయణమూర్తిదేహకాంతిని, ప్రచ్ఛాదించి సామ్యాభావప్రయుక్తలోపమువలన జన్మించు నైల్యమునుగాఁ జెప్పుటచేఁ గైతవాపహ్నవాలంకారము.

తే. అని యెఱింగింప నపుడు పక్ష్మాంచలములు, వ్రాల్ప శిబికాధరు ల్తద్విరక్తి నెఱిఁగి
వేఱొకనృపాలుఁ జేర్ప నావెలఁది కగజ, యమ్మహీశునిఁ జూపి యిట్లనుచుఁ బలికె. 80

టీక: అని=ఈప్రకారము; ఎఱింగింపన్=తెలుపఁగా; అపుడు; పక్ష్మాంచలములు – పక్ష్మ=ఱెప్పలయొక్క,అంచలములు=అగ్ర ములు; వ్రాల్పన్=వంపఁగా; శిబికాధరుల్=పల్లకిని మోయువారు; తద్విరక్తిన్—తత్=ఆరాజునందు, విరక్తిన్=విరాగమును; ఎఱిఁగి =తిలిసికొని; వేఱొకనృపాలున్=వేఱొకరాజును; చేర్పన్=పొందింపఁగా; ఆవెలఁదికిన్=ఆచంద్రికకు; అగజ=పార్వతీ దేవి; అమ్మహీశునిన్=ఆరాజును; చూపి=ప్రదర్శించి; ఇట్లు అనుచు=వక్ష్యమాణప్రకారముగ; పలికెన్=వచించెను.

మ. వలజాలోకలలామ గన్గొనవె యీవారాణసీరాజు ను
జ్జ్వలతేజోదినరాజు నిప్పతి భుజావష్టంభరేఖ న్ద్విష
ద్బలకోటి న్మథియించి నిల్పె విజయస్తంభంబు లాశాగజా
వలికి న్నిచ్చలు కట్టుఁగంబముల తేవ న్దోఁప దిగ్వీథులన్. 81

టీక: వలజాలోకలలామ=సుందరులగు స్త్రీలమండలములో శ్రేష్ఠురాలా! 'వలజా వల్గుదర్శనా' అని యమరుఁడు; ఉజ్జ్వలతేజో దినరాజు – ఉజ్జ్వల=ప్రకాశించుచున్న,తేజః=తేజమునందు, దినరాజు=సూర్యునితో సమానుఁడగు; ఈవారాణసీరాజున్=ఈ కాశీరాజును; కన్గొనవె=చూడుమా! ఇప్పతి=ఈకాశీరాజు, ఇది కర్తృపదము; భుజావష్టంభరేఖన్ – భుజావష్టంభ=భుజగర్వ ముయొక్క, రేఖన్=శ్రేణిచేత,'దర్పోవలేపోఽవష్టంభః' అని యమరుఁడు; ద్విషద్బలకోటిన్ – ద్విషద్బల=శత్రుసేనలయొక్క, కోటిన్= సమూహమును; మథియించి=సంహరించి; విజయస్తంభంబులు=జయస్తంభములను; దిగ్వీథులన్=దిక్ప్రదేశము లందు; ఆశాగజావలికి=దిగ్గజముల సమూహమునకు; నిచ్చలు=ఎల్లపుడు; కట్టుఁగంబముల తేవన్ = కట్టివేయు కంబముల యొక్క రీతిచే; తోఁపన్=కనిపించునట్లు; నిల్పెన్=నిలువఁబెట్టెను.

అనఁగ నోచంద్రికా! యీకాశీరాజును కనుఁగొనుము. ఈరాజు తనభుజవీర్యముచేతఁ బగతురఁ బరిమార్చి దిక్కులందు దిగ్గజములకు గట్టుకంబములవలెనున్న విజయస్తంభములనునిలిపినాఁ డని భావము.

మ. వరదానంబు ననల్పసౌకరియు శశ్వద్భోగసంపత్తి ని
బ్బరపుంగూటపుమేల్మి యీపతియెడం భాసిల్ల నశ్రాంత ము
ర్వర తాఁ జేరి పయోజలోచన! కరిస్వామిం గిరిస్వామి నా
హరిరాజు న్గిరిరాజు నెంచక ప్రమోదావాప్తి మించు న్గడున్. 82

టీక: పయోజలోచన =కమలములవంటి కన్నులుగల చంద్రికా! వరదానంబున్ – వర=శ్రేష్ఠమగు, దానంబున్= వితరణమును, మదోదకమును; అనల్పసౌకరియున్ – అనల్ప=అధిక మగు, సౌకరియున్=సుకరత్వమును, సూకరత్వమును; శశ్వద్భోగ సంపత్తి—శశ్వత్=ఎల్లపుడు, భోగసంపత్తి =ఉపభోగసంపద, పడగలయొక్క సంపద; నిబ్బరపుంగూటపుమేల్మి=అధికమగు బాణములయొక్క మేలిమి, శిఖరములయొక్క మేలిమి; ఈపతియెడన్=ఈరాజునొద్ద; భాసిల్లన్=ప్రకాశింపఁగా; అశ్రాంతము= ఎల్లపుడు; ఉర్వర =పుడమి;తాన్=తాను; చేరి =పొంది; కరిస్వామిన్=గజరాజును; కిరిస్వామిన్= ఆదివరాహమును; అహరి రాజున్=ఆయాదిశేషుని; గిరిరాజున్=కులాచలమును; ఎంచక=లెక్కపెట్టక; ప్రమోదావాప్తిన్=సంతోషప్రాప్తిచేత;కడున్= మిక్కిలి; మించున్=అతిశయించును.

అనఁగా భూదేవి, కరికిరిహరిగిరిస్వాములయందుండు దాన సౌకర్య భోగకూటములు ఈరాజునందుఁ బ్రకాశింపఁగ, వారిని గణింపక యీభూపతిని జేరె నని భావము. ఇచట కరిస్వామి, గిరిస్వామి, హరిరాజు, గిరి రాజు అని గికారప్రయోగముచే కరిస్వామి ప్రభృతులయందు అపకర్షము దోఁచుచున్నది.

మ. అవనీనాయకపద్మసాయకుని ది॰వ్యానందకాంతారవ
న్యవిహారాన్వితు వీని నీయురముఁ జెం॰దం జూడవే దృష్ట్యలే
హ్యావలగ్నామణి! నీకు గాంగజలఖే॰లాభోగముల్ హస్తిదా
నవవిద్వేషిపదాబ్జసేవనవిధా॰నం బబ్బు నశ్రాంతమున్. 83

టీక: దృష్ట్యలేహ్యావలగ్నామణి =దృష్టి కగోచరమైన మధ్యభాగముగల స్త్రీలయందు నుత్తమురాలవైన చంద్రికా! అవనీనాయక పద్మసాయకునిన్ – అవనీనాయక=రాజులయందు, పద్మసాయకునిన్=మన్మథునివంటివానిని; దివ్యానందకాంతారవన్య విహారాన్వితున్—దివ్య=ప్రశస్తమగు, ఆనందకాంతార=ఆనందవనమందలి, వన్యవిహార=వనవిహారముతోడ, అన్వితున్= కూడినట్టి; వీనిన్=ఈరాజును; నీయురమున్=నీవక్షమును; చెందన్=పొందునట్లు, ఆలింగనము చేసికొను నట్లనుట; చూడవే =చూడుమా! నీకున్; గాంగజలఖేలాభోగముల్=జాహ్నవీజలక్రీడలయొక్క పరిపూర్ణతలును; హస్తిదానవవిద్వేషి పదాబ్జ సేవన విధానంబు – హస్తిదానవవిద్వేషి=గజాసురవైరి యగు విశ్వేశ్వరునియొక్క,పదాబ్జ=పాదకమలములయొక్క, సేవన= పరిచర్యయొక్క,విధానంబు=ప్రకారము; అశ్రాంతమున్=ఎల్లపుడు; అబ్బున్=చేకూఱును.

అనఁగ నోచంద్రికా! ఈరాజును వరించితివేని నీకు గంగానదీజలవిహారములు గల్గుటయె గాక శ్రీవిశ్వేశ్వరస్వామి పాద కమలములసేవయు నెల్లపుడుఁ జేకూఱు నని భావము.

క. అని తెలుప వినియు నలజ,వ్వని విననటు లుండ యాన॰వహు లొక్క నృపా
లునిఁ జేర్ప గౌరి యావిభు, వనజాక్షికిఁ జూపి యిటులు ॰పల్కె న్వేడ్కన్. 84

టీక: అని =ఈప్రకారము;తెలుపన్=తెలియఁజేయఁగా; వినియున్=ఆకర్ణించియు; అలజవ్వని=ఆచంద్రిక; విననటులుండన్ = విననిదానివలె నుండఁగా; యానవహులు=పల్లికి మోయువారు; ఒక్క నృపాలునిన్=ఒకరాజును; చేర్పన్=చేర్పఁగా; గౌరి= పార్వతీదేవి; ఆవిభున్=ఆరాజును; వనజాక్షికిన్=చంద్రికకు; చూపి=ప్రదర్శించి; ఇటులు=ఈవిధముగా; వేడ్కన్=సంతసము చేత; పల్కెన్=వచించెను.

శా. కర్ణాటేశ్వరు(డీత(డిమ్మనుజలోకస్వామి వీక్షింపుమా
కర్ణాంతాయతనేత్ర! వీనిజయజాగ్రద్ఘర్మభంభాకులో
దీర్ణధ్వానము దిక్ప్రభిత్తిపరిభిత్తిస్ఫూర్తి(జేపట్ట(గా(
దూర్ణం బుర్వర(ద్రెళ్లు వైరినృపసందోహంబు చిత్రంబుగన్. 85

టీక: కర్ణాంతాయతనేత్ర =శ్రుత్యంతమువఱకు విశాలములగు నేత్రములుగల చంద్రికా! ఈత(డు=ఈరాజు;కర్ణాటేశ్వరు(డు = కర్ణాటభూపతి; ఇమ్మనుజలోకస్వామిన్=ఈనరపతిని; వీక్షింపుమా=చూడుమా! వీని=ఈరాజుయొక్క; జయజాగ్రద్ఘర్మ భంభాకులోదీర్ణ ధ్వానము – జయ=జయముచేత,జాగ్రత్=మేల్కొనిన, ఘర్మ=సువర్ణమయమగు, భంభాకుల=జయభేరీ బృందముయొక్క, ఉదీర్ణ=ఉత్కటమగు, ధ్వానము=శబ్దము; దిక్ప్రభిత్తిపరిభిత్తిస్ఫూర్తిన్ – దిక్ప్రభిత్తి=దిగ్భిత్తులయొక్క, పరిభిత్తి=భేదనముయొక్క, స్ఫూర్తిన్=అతిశయమును; చేపట్ట(గాన్=గ్రహింప(గా; వైరినృపసందోహంబు=శత్రురాజుల సమూహము; చిత్రంబుగన్=విచిత్రముగ; తూర్ణంబు=శీఘ్రముగ; ఉర్వరన్=భూమియందు; త్రెళ్లున్=పడును.

చంద్రికా! కర్ణాటభూమి కధినేత యగు నీరాజును చూడుము, వీని బంగరుజయభేరీనినాదము దిగ్భిత్తులను భేదింప(గానే వీని శత్రువులు భూమిపై(బడుదురని భావము. ఈపద్యమునం దతిశయోక్తిభేదము.

మ. బలభిన్నీలసహోదరచ్చికుర! యీపట్టాభిషిక్తేంద్రు హృ
త్థ్సలి వర్ణింప(దరంబె యిప్పతి తనుచ్ఛాయాగతిన్ మన్మథుం
గలనం గెల్చి తదంకమండలము(జక్కం గైకొనెం గానిచో(
దల(ప న్వీనికి(జెల్ల నేర్చునె సముద్యన్నక్రకేతుచ్ఛటల్. 86

టీక: బలభిన్నీలసహోదరచ్చికుర=ఇంద్రనీలములకు సమానములగు కురులుగల చంద్రికా! ఈపట్టాభిషిక్తేంద్రున్=ఈమూర్ధాభిషిక్తుని; హృత్థ్సలిన్=హృదయప్రదేశమునందు; వర్ణింపన్=నుతించుటకు; తరంబె=శక్యమా? ఇప్పతి=ఈభూనాథు(డు; తనుచ్ఛాయాగతిన్=దేహకాంతిరీతిచేత; కలనన్=యుద్ధమందు; మన్మథున్=మరుని;గెల్చి=జయించి; తదంకమండలమున్ – తత్= ఆమన్మథునియొక్క, అంక=చిహ్నములయొక్క, మండలమున్=సమూహమును; చక్కన్=చక్కగ;కైకొనెన్ = గ్రహించెను; కానిచోన్=అట్లు గ్రహింపనియెడల; తల(పన్=విచారింపగ; వీనికిన్=ఈరాజునకు; సముద్యన్నక్రకేతుచ్ఛటల్ – సముద్యత్=మీ(దికిలేచిన, నక్రకేతు=మకరధ్వజములయొక్క, ఛటల్=సమూహములు; చెల్ల నేర్చునె =చెల్లునా? చెల్లవనుట.

అన(గ నీరాజు తనసొబగుచే మరుని(బోరున గెలిచి, వానిమకరధ్వజముల గ్రహించెను. అట్లు కానిచో వీనికి మకరధ్వజములు చెల్లునా యని భావము.

చ. ఇనకులసత్యరాజపరమేశ్వరలక్షణశాలి యివ్విభుం
డనిశము చక్రహార్దదమహావసుదాన మొనర్ప నేర్చువాం
ఛ నెనయుచంద్రు(డౌ(జుము రసావలయాతపవారణంబు త
ద్ఘనజవజశ్రమాంబుకణికల్ సుము ముత్తెపుకుచ్చు లెంచ(గన్. 87

టీక: ఇనకులనుత్యరాజపరమేశ్వరలక్షణశాలి– ఇనకుల=నృపసమూహముచేత, నుత్య=పొగడఁదగిన, రాజపరమేశ్వర= రాజరాజులయొక్క, లక్షణ=లక్షణములచేత, అనఁగా భాగ్యచిహ్నములచేత, శాలి=ప్రకాశించుచున్న; ఇవ్విభుండు=ఈ రాజు; అనిశము=ఎల్లపుడు; చక్రహార్దదమహావసుదానము– చక్ర=జక్కవలకు, రాష్ట్రమునకు, హార్దద=ప్రేమము నిచ్చు, మహా వసు దానము=గొప్పకిరణములయొక్క, ధనముయొక్క, యిచ్చుటను; ఒనర్పన్=చేయఁగా; నేర్చువాంఛన్=అభ్యసించు నిచ్ఛ చేత; ఎనయుచంద్రుఁడు=పొందిన చంద్రుఁడే; రసావలయాతపవారణంబు=భూచక్రచ్ఛత్రము; ఔన్ చుము– ఔన్= అగును, చుము= సత్యము; ముత్తెపుకుచ్చులు=మౌక్తికగుచ్ఛములు; ఎంచఁగన్=విచారింపఁగా; తద్ఘనజవజశ్రమాంబు కణికల్–తత్= ఆచంద్రునియొక్క, ఘన=అధికమగు, జవజ=వేగముచేఁ బుట్టిన, శ్రమాంబుకణికల్=శ్రమోదకబిందువులు; చుము= సత్యము.

ఈరాజన్యుని భూచక్రాకారమగు గొడుగు గొడుగుగాదు, మఱి యేమనఁగా చక్రమునకు వసుదాన మీయనేర్చిన యీ నరపతిచెంగట, జక్కవలకు వసుదాన మీయనేరనివాఁడగుటచే చక్రమునకు వసుదాన మియ్య నేర్చుకొను వాంఛతోఁ జేరిన చంద్రుఁడే; ఈముత్యపుగుత్తులు అతివేగముతోఁ జేరినచంద్రునియొక్క వేగశ్రమోదితములైన చెమటబిందువలె యని భావము. ఈపద్యమందు అభేదరూపకాలంకారము.

మ. వరసామ్యంబు ఘటిల్లె నంచు నృపతుల్వర్ణింప రాజాధిరా
జు రవిద్యోతనరూపతేజు నితనిన్సోమాస్య! యుద్వాహమై
నిరతం బొప్పుము సర్వభూపహరిణీనేత్రాశిరోరత్నది
వ్యరుచుల్ త్వత్పదవీథి యావకరసాన్వాదేశముం బూనఁగన్. 88

టీక: వరసామ్యంబు=వరునియొక్క యనురూపత, అనురూపుఁడైన వరుఁడనుట; ఘటిల్లె నంచున్=చేకూఱె ననుచు; నృప తుల్ = రాజులు; వర్ణింపన్=నుతియింపఁగా; రాజాధిరాజున్=రాజులకు రాజయినట్టి; రవిద్యోతనరూపతేజున్– రవిద్యోతన రూప=సూర్యకాంతితుల్యమగు, తేజున్=కాంతిగల్గినట్టి; ఇతనిన్=ఈకర్ణాటభూపతిని; సోమాస్య(సోమ+ఆస్య)=చంద్రుని వంటి ముఖముగల చంద్రికా! ఉద్వాహమై =పెండ్లి చేసికొని; నిరతంబు=ఎల్లపుడు; సర్వభూపహరిణీనేత్రాశిరోరత్నదివ్య రుచుల్– సర్వభూపహరిణీనేత్రా=సమస్తరాజాంగనలయొక్క,శిరోరత్న=చూడామణులయొక్క,దివ్య=మనోహరము లగు, రుచుల్=కాంతులు; త్వత్పదవీథిన్= నీయొక్క పాదప్రదేశమందు; యావకరసాన్వాదేశమున్– యావకరస = లాక్షా రసమునకు, అన్వాదేశమున్=పౌనరుక్త్యమును, 'కించి త్కార్యం విధాతు ముపాత్తస్య కార్యాన్తరవిధానాయ పునరుపాదాన మన్వాదేశః' అని వైయాకరణసంకేతము, ఒకకార్యమును విధించినదానినే మఱలఁ గార్యాంతరమును విధించుటకై గ్రహించుట అన్వాదేశపదమున కర్థము గావున పౌనరుక్త్యము ఫలితార్థము; పూనఁగన్=వహింపఁగా; ఒప్పుము =ప్రకాశింపుము.

చంద్రికా! నీవితనిఁ బెండ్లియై యొప్పఁగా సమస్తరాజాంగనల చూడామణిమరీచులచే నలంకృతంబులగు నీపాదములకు లాక్షారసము పునరుక్తప్రాయమై యుండు నని భావము.

వ. అని తెలిపియాయుర్వీశుపై మనంబు పర్వ కునికి నాశర్వప్రేయసి సుపర్వరాజగర్వాపహవైభవ ధూర్వహుం డగు నొక్కరాజకులోద్వహుం జేర నియోగించి యాపర్వేందువదన కతనిం జూపి యిట్లనియె. 89

టీక: అని తెలిపి =ఈప్రకారము తెలియఁజేసి;ఆయుర్వీశుపైన్=ఆరాజుమీఁద; మనంబు=చిత్తము; పర్వకునికిన్=పొసఁగ కుండుటచేత; ఆశర్వప్రేయసి=ఆపార్వతీదేవి; సుపర్వరాజగర్వాపహవైభవధూర్వహుండు – సుపర్వరాజ=ఇంద్రునియొక్క, గర్వ=అహంకారమును, అపహ=పోఁగొట్టునట్టి, వైభవ=విభవముయొక్క, ధూర్వహుండు=భారమును వహించినవాఁడు; అగు నొక్కరాజకులోద్వహున్= ఐనట్టి ఒకానొక రాజశ్రేష్ఠుని; చేరన్=పొందునటులు; నియోగించి =ఆజ్ఞాపించి; ఆపర్వేందు వదనకున్=పున్నమచంద్రునివంటి ముఖముగల యాచంద్రికకు; అతనిం జూపి =ఆరాజును చూపెట్టి; ఇట్లనియెన్=వక్ష్యమాణ ప్రకారముగ వచించెను.

మ. వనితా! కన్గొను కాశరా జితఁడు దై◊వాఱు న్మహిన్ రాజరా
జన నార్యేశ్వరమైత్రి సద్ద్రవిణధు◊ర్యత్వంబు నాత్మాంఘ్రిసే
వనతాత్పర్యయుతాప్తపుణ్యజనశ◊శ్వత్సంపదాపాదకాం
చనధీవృత్తియు సార్వభౌమనిభృతా◊శాగుప్తియుం బూనుచున్. 90

టీక: వనితా=చంద్రికా! ఇతఁడు=ఈభూపతి; కాశరాజు=కాశదేశాధిపతి; మహిన్=భూమియందు; రాజరాజనన్ =కుబేరుఁ డనఁగ, రాజశ్రేష్ఠుఁ డనఁగ; ఆర్యేశ్వరమైత్రిన్—ఆర్యేశ్వర=పార్వతీపతియొక్క, సత్పురుషశ్రేష్ఠులయొక్క, మైత్రిన్=స్నేహ మును; సద్ద్రవిణ ధుర్యత్వంబున్ – సత్=శ్రేష్ఠమగు, ద్రవిణ=ధనముయొక్క,బలముయొక్క,ధుర్యత్వంబున్=ధురీణత్వ మును; ఆత్మాంఘ్రిసేవన తాత్పర్య యుతాప్త పుణ్యజన శశ్వ త్సంప దాపాద కాంచన ధీవృత్తియున్ – ఆత్మ=తనయొక్క, అంఘ్రిసేవన=పాదసేవనమందు, తాత్పర్య=తత్పరత్వముచేత, యుత=కూడుకొన్న, ఆప్త=ఇష్టులగు, పుణ్యజన=పుణ్య పురుషులకును, యక్షులకును, శశ్వత్ =ఎల్లకాలము, సంపదాపాదక=ఐశ్వర్యము నిచ్చునట్టి, అంచన=ప్రకాశించుచున్న, ధీవృత్తి యున్=చిత్తవృత్తిని; సార్వభౌమ నిభృతాశాగుప్తియున్ – సార్వభౌమ=చక్రవర్తిత్వముచేత, నిభృత=పోషింపఁబడిన, ఆశా= దిక్కులయొక్క, గుప్తియున్= పాలనమును; సార్వభౌమ= సార్వభౌమ మను దిగ్గజముచేత, నిభృత=భరింపఁబడిన, ఆశా= ఉత్తరదిక్కుయొక్క, గుప్తియున్= పాలనమును; పూనుచున్=గ్రహించుచు; దైవాఱున్=అతిశయించును; కన్గొను= చూడుము. అనఁగ నీరాజు కుబేరునిపగిది నార్యేశ్వరమైత్రి, సద్ద్రవిణధుర్యత్వమును, పుణ్యజనసంపదాపాదకత్వమును, సార్వభౌమనిభృతాశాగుప్తిని పొంది ప్రకాశించు చున్నాఁడని భావము.

సీ. గురుపద్మనీరాగ◊గుంభితస్వాంతంబుఁ, గని యొప్పుఁ జక్రప◊క్షప్రతాన,
మతివేల మధుపాళి◊కాప్తిచే నెవ్వేళ, నలరారుఁ బారిజా◊తాగమౌళి,
బాడబవర్ధన◊ప్రౌఢప్రచారంబు, భాసిల్లఁ గడుఁ బొంగుఁ ◊బాలకడలి,
సద్వసుహారియై ◊సంలబ్ధదోషాను,సృతిఁ బొల్చు వాసతే◊యీశ్వరుండు,
తే. తత్సమాసక్తిఁ బంకసం◊తతిఁ గరంబు,ను విరళశ్రీ వహించుఁ గై◊రవచయంబు
ననఘమై మించు నీమేటి◊యశముతోడ, సాటి యగు నెట్లు సారస◊జ్ఞాతినయన! 91

టీక: సారసజ్ఞాతినయన =కమలములవంటి నేత్రములు గల చంద్రికా! చక్రపక్ష ప్రతానము=హంసలగుంపు; గురుపద్మనీరాగ గుంభితస్వాంతంబున్ – గురుపద్మనీ=గురుభార్యయందు, రాగ=అనురాగముచేత,గుంభిత=పూరితమగు,స్వాంతంబున్ =

చిత్తమును; కని=పొంది; ఒప్పున్=ఒప్పును; గురు=అధికమగు, పద్మినీ=పద్మలతయందు,రాగ=అనురాగముచేత, గుంభిత = పూరితమైన, స్వాంతంబున్=చిత్తమును అని స్వాభావికార్థము;
పారిజాతాగమౌళి=కల్పవృక్షము;అతివేల మధుపాళికాప్తిచేన్ – అతివేల=అధికమగు, మధుపాళికా=మద్యపాయుల గుంపు యొక్క, ఆప్తిచేన్=ప్రాప్తిచేత; ఎవ్వేళన్=ఎల్లకాలము; అలరారున్ =ప్రకాశించును; మధుపాళికా=భృంగసంఘముయొక్క ప్రాప్తిచేత నని స్వభావార్థము;
పాలకడలి=పాలసముద్రము;బాడబ=బ్రాహ్మణులయొక్క, వర్ధన=ఛేదనమందలి, ప్రౌఢి=నేర్పుయొక్క,ప్రచారంబు=వ్యాపారము; భాసిల్లన్=ప్రకాశింపఁగ;కడున్=మిక్కిలి; పొంగున్=ఉబుకును; బాడబ=బడబాగ్నియొక్క, వర్ధన=వృద్ధిఁబొందించుట యందలి, ప్రౌఢి=నేర్పుయొక్క ప్రచారము నని స్వభావార్థము;
వాసతేయీశ్వరుండు =చంద్రుఁడు, 'వసతి ర్వాసతేయీచ శ్యామా రాత్రిశ్చ కథ్యతే' అని హలాయుధనిఘంటువు; సద్వసుహారియై=సత్పురుషుల ద్రవ్యము నపహరించినవాఁడై, సంలబ్ధదోషానుసృతిన్ – సంలబ్ధ=పొందఁబడిన, దోష=పాపము యొక్క, అనుసృతిన్=అనుసరణముచేత; పొల్చున్=ఒప్పును. సద్వసుహారియై=రిక్కలకాంతిని హరించినవాఁడై, సంలబ్ధ దోషానుసృతిన్=పొందబడిన రాత్రియొక్క, అనుసరణముచేత నని స్వభావార్థము.
కైరవచయంబు=తెల్లగలువల గుంపు; తత్సమాసక్తిన్ – తత్=ఆదోషాకరునియొక్క, సమాసక్తిన్=సంబంధముచేతను; పంకసంతతిన్=పాపచయముచేత; కరంబును=మిక్కిలి; విరళశ్రీన్=విరళకాంతిని; వహించున్=పొందును. తత్సమాసక్తిన్=చంద్ర సంబంధమును, పంకసంతతిన్= బురదగుంపును, విరళశ్రీన్=రాత్రియందుకాంతి, నని స్వభావార్థము.
అనఘుమై=పాపరహితమై; మించు=ప్రకాశించు; ఈమేటియశముతోడన్=ఈఘనుని కీర్తితోడను; సాటి=సమానము; ఎట్లు = ఏరీతిగ; అగున్? కాదనుట.

అనఁగ నోచంద్రికా! గురుపద్మినియం దనురాగము గలిగి రాగవర్తనచే నుండు హంసవితతి, మధుపాయులబృందముచే నావరింపఁబడి మించు వేల్పులమ్రాఁకు, బాడబవర్ధనప్రచారమున మించు పాల్కడలి, సద్వసువులను హరించి దోషాకరుఁడగు చంద్రుఁడు, దోషాకరసంబంధముచేతను, పంకసంకరముచేతను స్వల్పకాంతిని బొందియున్న కైరవచయము, నిర్దుష్టమై, పాప రహితమై, ఎల్లప్పుడును మించు నీఘనునికీర్తికి సాటి కా వని భావము.

చ. వలదొర మీఱురూపు దయి॰వాఱఁగ రాజిలు నిర్జరాధిపో
పలనిభనీలవర్ణు మహి॰పాలకశేఖరు వీనిఁ బెండ్లియై
నెలఁతుక యీమహాత్ము నెద ॰నిచ్చలుఁ బాయక యుండు మంజనా
చలతటభాసమాననవ॰చంపకవల్లి తెఱంగు పూనుమున్. 92

టీక: వలదొర మీఱురూపు – వలదొరన్=మన్మథుని, మీఱు=అతిశయించు, రూపు=చక్కదనమును; దయివాఱఁగన్ =అతిశయింపఁగా; రాజిలు నిర్జరాధిపోపలనిభనీలవర్ణున్ – రాజిలు=ఒప్పునట్టి, నిర్జరాధిపోపల=ఇంద్రనీలమణులకు,నిభ=సమానమైన, నీలవర్ణున్=నల్లనికాంతిగల; మహిపాలకశేఖరున్=రాజశ్రేష్ఠుఁడగు;వీనిన్=ఈరాజును; పెండ్లియై=వివాహమాడి; నెలతుఁక=చంద్రికా!అంజనాచలతటభాసమాననవచంపకవల్లి తెఱంగు – అంజనాచల=నీలాద్రియొక్క,తట=ప్రదేశమందు, భాసమాన=ప్రకాశించుచున్న, నవ=నూతనమైన,చంపకవల్లి=సంపెఁగతీవయొక్క, తెఱంగు=రీతిని; పూనుచున్=పొందుచు; ఈమహాత్మునెదన్=ఈరాజువక్షస్థలమునందు; నిచ్చలున్=ఎల్లకాలము; పాయక=వీడక; ఉండుము.

ఇంద్రనీలవర్ణము గలిగి మన్మథునిఁ దిరస్కరించు రూపముగల యీరాజును బెండ్లియాడి, వీని యురమునందు, అంజనాచలముమీఁద నున్న చంపకవల్లి తెఱంగునఁ బ్రకాశింపు మని భావము. ఉపమాలంకారము.

తే. అనఁగ నమ్మాట వినియును ◊నలర కున్కి,తెలిసి మఱియొక్క భూపాల◊తిలకుఁ జేరఁ
దార్చి శర్వాణి రాజనం◊దనను బలికెఁ, దద్గుణశ్రేణి యమృతజి◊ద్భవ్యవాణి. 93

టీక: శర్వాణి =పార్వతీదేవి; అనఁగన్=ఇట్లు పలుకఁగా; అమ్మాటన్=ఆవచనమును; వినియును=ఆకర్ణించియు; అలర కున్కి=సంతసింపకుండుటను;తెలిసి=ఎఱింగి; మఱియొక్క భూపాలతిలకున్=మఱియొక రాజశ్రేష్ఠుని; చేరన్=పొందునట్లు; తార్చి=చేసి; రాజనందనను =చంద్రికనుగూర్చి; అమృతజిద్భవ్యవాణిన్ =సుధను తిరస్కరించు మధురవచనముచేత; తద్గుణ శ్రేణిన్=ఆరాజుగుణముల పంక్తిని; పలికెన్=వచించెను.

మ. అనవద్యద్యుతి నంగభూమిపతి నో◊యబ్జాక్షి వీక్షింపు మొ
య్యన నేతన్నృపధాటికానవకథా◊వ్యాఖ్యాతృభేరీకుల
స్వనసంద్రావితనాథవద్రిపుపురీ◊జాతంబు కాంతారత
న్మనఁ జిత్రం బగుఁ గాదె గోత్రకవనీ◊నామంబు చేకూఱుటల్. 94

టీక: ఓయబ్జాక్షి =ఓచంద్రికా!అనవద్యద్యుతిన్—అనవద్య=నిర్దుష్టమగు, ద్యుతిన్=కాంతిగల; అంగభూమిపతిన్=అంగదేశాధిపతిని; ఒయ్యనన్=తిన్నగ; వీక్షింపుము=చూడుము; ఏతన్నృప ధాటికా నవ కథా వ్యాఖ్యాతృ భేరీకుల స్వన సంద్రావిత నాథవ ద్రిపుపురీ జాతంబు– ఏతన్నృప=ఈఅంగపతియొక్క, ధాటికా=జైత్రయాత్రయొక్క, నవ=నూతనమగు, కథా= ప్రబంధమును, వ్యాఖ్యాతృ=వ్యాఖ్యానముచేయుచున్న, భేరీకుల=రణభేరీబృందముయొక్క, స్వన=ధ్వనిచేత, సంద్రావిత=పాఱఁ గొట్టఁబడ్డ, నాథవత్=ప్రభువులుగల, రిపుపురీ=శత్రునగరములయొక్క,జాతంబు=బృందము; కాంతారతన్=అరణ్యత్వము చేత; మనన్ =వృద్ధిఁబొందఁగా; గోత్రకున్=భూమికి; అవనీనామంబు=అవని,అనగా అడవులు లేనిదనెడి పేరు (అవని యను నది భూమికి నామాంతరము); చేకూఱుటల్=సమకూడుటలు; చిత్రం బగుఁగాదె =ఆశ్చర్యకరమగునుగదా!

అనఁగ నంగభూపాలుని రణభేరీనాదమును విని శత్రురాజులు పాఱిపోవుటవలన వారి నగరములు వనమయమైపోయి నను భూమికి అవని (వనములు=అడవులు, లేనిది) అని పేరుండుట చిత్రంబని తాత్పర్యము. అనఁగ శత్రుపురములు అరణ్యప్రాయము లైనవని ముఖ్యాశయము.

సీ. అభ్రంబు రాయుపు◊ణ్యజనాలయంబులఁ, గమలించి తగుకీలి ◊నమరు శూలి,
సరసచక్రము లాత్మ◊సాధ్వసం బంద వి,షశ్రేణుల నొసంగు◊జలధరంబు,
కడు సదాళుల మోద◊గరిమఁ బెంప నెసంగు, నతనుశస్త్రము లూను◊నమరతరువు,
ఘనబుధద్యుమ్నంబు ◊గొని యజ్ఞహితభావ,మలర ధాత్రి రహించు◊ బలిసురారి,
తే. లలి గురుక్షేత్రము హరించి ◊ చెలఁగు రాజు, నితరరామలరసగతి ◊నెనయు నుదధి
యింతి మదిలో ననాతతా◊యిత వహించు, నివ్విభుని సాటి గా నీగి ◊నెన్నఁ దరమె. 95

టీక: అభ్రంబు రాయుపుణ్యజనాలయంబులన్ – అభ్రంబు రాయు=మిన్నొరయు, పుణ్యజన=పుణ్యాత్ములయొక్క, ఆలయంబులన్=గృహములను; కమలించి=కాల్చి; తగుకీలిన్ =ఒప్పుచున్న వహ్నిచేత; అమరు శూలి=ఒప్పుచున్న శంకరుఁడు; పుణ్యజన=రాక్షసులయొక్క, త్రిపురాసురులయొక్క, ఆలయంబులన్=త్రిపురములను, కాల్చిన యగ్నినేత్రముగలవాఁడని స్వభావార్థము;

సరసచక్రములు=రసికబృందములు; ఆత్మన్=మనమునందు;సాధ్వసంబు=భయమును; అందన్= పొందునట్లు;విషశ్రేణులన్ = గరళపంక్తులను; ఒసంగు=ఇచ్చుచున్న; జలధరంబు=మేఘము; శ్రేష్ఠములగు హంసలు మనమున భయమొందునట్లుగా జలధారల నొసంగు మేఘ మని స్వభావార్థము;

కడున్=మిక్కిలి;సదాళుల మోదగరిమన్ – సత్=సత్పురుషులయొక్క,ఆళుల=పంక్తులయొక్క,మోద=సంతసముయొక్క, గరిమన్=అతిశయమును; పెంపన్=ఖండించుటకు; ఎసంగు అతనుశస్త్రములు – ఎసంగు=విజృంభించుచున్న, అతను=అధికములగు, శస్త్రములు=ఆయుధములను; ఊను అమరతరువు=పొందినట్టి వేల్పులమ్రాఁకు; కడున్=మిక్కిలి, సదా=ఎల్లపుడు, అళుల=తుమ్మెదలయొక్క, మోదగరిమన్=సంతోషాతిశయమును, పెంపన్=వృద్ధిఁబొందించుటకు, ఎసంగు =ఒప్పుచున్న, అతనుశస్త్రములు=పుష్పములను, పొందినట్టి వేల్పులమ్రాఁకు,అని స్వభావార్థము.

ఘనబుధద్యుమ్నంబు – ఘన=అధికమగు, బుధ=విద్వాంసులయొక్క,ద్యుమ్నంబు=అర్థమును; కొని=గ్రహించి; అజ్ఞహితభావము – అజ్ఞ=మూఢులకు,హిత=అనుకూలమగు,భావము=అభిప్రాయము;అలరన్=ఒప్పునట్లు; ధాత్రిన్=భూమియందు; రహించు=ఒప్పుచున్న, బలిసురారి=బలిచక్రవర్తి; దేవతలయొక్క ద్రవ్యమును గొని జన్నమునకు హితమగు భావ మలర నొప్పుచున్నవాఁడని స్వభావార్థము.

లలిన్=ఆసక్తిచేత; గురుక్షేత్రము=ఆచార్యుని భూమిని; హరించి=అపహరించి; చెలఁగు రాజు=ప్రకాశించుచున్న చంద్రుఁడు; బృహస్పతిభార్యను హరించి యొప్పినవాఁడని స్వభావార్థము.

ఇతరరామలరసగతిన్ – ఇతరరామలన్=పరస్త్రీలను; రసగతిన్=అనురాగరీతిచేత; ఎనయు నుదధి – ఎనయు =పొందుచున్న సముద్రుఁడు; ఇత=పొందఁబడిన, రర=ధ్వనిగల, అమల=స్వచ్ఛమగు, రస=ఉదకముయొక్క, గతిన్=ప్రాప్తిని, పొందినట్టివాఁడని స్వభావార్థము.

ఇంతి=చంద్రికా! మదిలోన్=మనమునందు; అనాతతాయితన్=ఆతతాయు లనఁగా 'అగ్నిదో గరదశ్చైవ శస్త్రపాణి ర్ధనాపహః' ఇత్యాదివచనమందుఁ జెప్పఁబడినవారు. వీరు గానివాఁడు అనాతతాయి, వీనిధర్మము అనాతతాయిత, ఇట్టిధర్మమును; వహించు నివ్విభునిన్=వహించుచున్న యీరాజుకు, సాటిగా= సమానముగా, ఈగిన్=వితరణమందు; ఎన్నఁ దరమె = లెక్కపెట్టఁదరమా? కాదనుట.

అనఁగా త్యాగశీలుండై, యనాతతాయి యగు నీరాజుతో నీగియందు సజ్జనగృహములనుగాల్చిన శివుండును, సరసబృందమునకు విషంబిడిన జలధరుండును, అతనుశస్త్రము లూనిన పారిజాతతరువును, పరద్రవ్యమును హరించిన బలియు, గురుక్షేత్రము నపహరించిన చంద్రుఁడును, పరస్త్రీలపొందెనసిన సముద్రుండును ఆతతాయు లగుటచే సాటి గారని భావము.

మ. పరసత్యప్రియభావభావుకలసద్వర్ణాంచితశ్రీద్విజో
త్కరసంరక్షణదక్షిణాశయుని లోకస్వామి నిమ్మేటి నం
బురుహమ్మన్యముఖీమచర్చిక! జగంబుల్ మే లనం బెండ్లియై
సరసీజాసనుఁ బల్కుచాన యన నిచ్చల్ మించు ముత్కంతతోన్. 96

టీక: పర సత్య ప్రియ భావ భావుక లస ద్వర్ణాంచిత శ్రీ ద్విజోత్కర సంరక్షణ దక్షిణాశయునిన్ – పర=శ్రేష్ఠమగు, సత్య=నిజ మందు, ప్రియ=ప్రీతిగల, భావ=భావముచేత,భావుక=భవ్యమగు,లసత్=ప్రకాశించుచున్న, వర్ణ=యశముచేత, అంచిత=ఒప్పు చున్న, శ్రీ=సంపదయును, ద్విజ=బ్రాహ్మణులయొక్క, ఉత్కర=సమూహముయొక్క, సంరక్షణ=పాలించుటయందు, దక్షి ణాశయునిన్=ఉదారమగు నాశయము గలవానిని; శ్రేష్ఠమగు సత్యలోకమందు, ప్రియభావభావుకములై, సత్ వర్ణ=శుక్లవర్ణము చేత, అంచిత=ఒప్పుచున్న, శ్రీ=కాంతితోఁగూడిన,ద్విజోత్కర=హంసబృందముయొక్క,సంరక్షణ=పాలించుటయందు, దక్షి ణాశయుని నని నలువపరమైన యర్థము దోఁచుచున్నది; లోకస్వామిన్=నరపతిని, నలువను, 'హిరణ్యగర్భో లోకేశః' అని యమరుఁడు; ఇమ్మేటిన్=ఈఘనుని; అంబురుహమ్మన్యముఖీమచర్చిక = (అమ్బురుహ మాత్మానం మన్యత ఇతి అమ్బు రుహం మన్య ముఖం యస్యా స్సా అమ్బురుహమ్మన్యముఖీ) తన్ను కమలమువలెఁ దలఁచు ముఖముగల స్త్రీలలో ప్రశస్తవగు చంద్రికా! జగంబుల్=లోకములు; మేలనన్=బాగు,బాగనఁగా; సరసిజాసనున్ పల్కుచాన యనన్=నలువను సరస్వతి యను నట్లు; పెండ్లియై=వివాహమాడి; నిచ్చల్=ఎల్లపుడు; ఉత్కంఠతోన్=సంతోషముతో; మించుము=అతిశయించుము. నలువను సరస్వతి పెండ్లియై నిచ్చలు మించుపగిది నీవీలోకస్వామిని వివాహమై యుత్కంఠతో నుండు మని భావము.

వ. అని యెఱింగింప ననంగీకారభంగి నయ్యంగనయంతరంగం బెసంగిన నాచెంత నొక్క నరపుంగవుం
జూపి సారంగధారిసారంగయాన తరంగవళీమణిం గుఱించి యిట్లనియె. 97

టీక: అని=ఈప్రకారముగ; ఎఱింగింపన్=తెలియఁజేయఁగా; అనంగీకారభంగిన్=ఒప్పికొనమియొక్కరీతిచేత; అయ్యంగన యంతరంగంబు=ఆచంద్రికయొక్కచిత్తము; ఎసంగినన్=ఒప్పఁగా; ఆచెంతన్ = ఆ సమీపమున; ఒక్క నరపుంగవున్ =ఒక్క నరపతిని; చూపి=ప్రదర్శించి; సారంగధారిసారంగయాన – సారంగధారి=శివునియొక్క, సారంగయాన = పత్ని యగు పార్వతి; తరంగవళీమణిన్ గుఱించి = తరఁ గలవంటి వళులు గల చంద్రికనుగూర్చి; ఇట్లనియెన్=వక్ష్యమాణప్రకార ముగఁ బలికెను.

చ. ఇనకులమౌళి కేరళమహీపతి యీతఁడు గాంచు ప్రీతితో
మనఁగ నపారిజాతమహిమంబున రాజిలు నివ్విభుఁ డుర్వరన్
మను ననపారిజాతమహిమంబునఁ గుందరదాలలామ! పా
వనసుమనోహృదిష్టఫలవారవితీర్ణికలాచమత్కృతిన్. 98

టీక: కుందరదాలలామ =జాజిమొగ్గలవంటి దంతపంక్తిగల స్త్రీలలో శ్రేష్ఠురాలవైన చంద్రికా! ఈతఁడు=ఈరాజు; ఇనకులమౌళి =రాజశ్రేష్ఠుఁడగు; కేరళమహీపతి =కేరళదేశమునకు నధిపతి; ప్రీతితోన్=ప్రేమతో; కాంచు=చూడుము; అపారిజాతమహిమం బునన్ – అపారిజాత=పారిజాతాభావముయొక్క, మహిమంబునన్=సామర్థ్యముచేత;అపగతమైన శత్రుసంఘముయొక్క మహిమచేత నని స్వభావార్థము; మనఁగన్=వర్తించుటచేత; రాజిలు నివ్విభుఁడు = ప్రకాశించుచున్నట్టి యీరాజు; పావన సుమనో హృదిష్ట ఫల వార వితీర్ణి కలా చమత్కృతిన్ – పావన=పరిశుద్ధులైన, సుమనః=విద్వాంసులయొక్క, హృత్= మన మునకు, ఇష్ట=ప్రియములైన, ఫల=లాభ ములయొక్క, వార=సంఘముయొక్క, వితీర్ణి=ఇచ్చుట యనెడు, కలా=విద్య యొక్క, చమత్కృతిన్=చమత్కారముచేత; దేవతలయొక్క మనములకు నిష్టఫలముల నొసంగుట యనెడు విద్యయొక్క చమత్కృతి చేత నని వేల్పుమ్రాఁకు పరమైన యర్థము తోఁచెడి; ఉర్వరన్=భూమియందు; అనపారిజాతమహిమంబునన్ –

అనపారిజాత =అపారిజాతభావాభావము యొక్క, పారిజాతముయొక్క యనుట, మహిమంబునన్=మహిమచేత; మనున్= వర్తించును. ఈరాజు అపారిజాతుఁడైనను, దానశౌండతచే అనపారిజాతమహిమంబునఁ బ్రకాశించుచున్నాఁడని భావము.

మ. అనిశం బీఘనుకీర్తిధామయుగళంబన్యోన్యవైరాప్తినో
యన నం దొక్కటి ప్రోవ వేఱొకటి వజ్రారూఢిఁ గూల్చున్ విరో
చను వేఱొక్కటి యేఁచ నందొకటి మించం జేయు హంసోన్నతిన్
మును మున్నొక్కటి నొంప వేఱొకటి మన్నుం గొమ్మ! చిత్రంబుగన్. 99

టీక: కొమ్మ=చంద్రికా! అనిశంబు=ఎల్లపుడు; ఈఘను కీర్తిధామ యుగళంబు =ఈమేటియొక్క కీర్తిప్రతాపముల జంట; అన్యోన్యవైరాప్తినోయనన్ =పరస్పరవైరముచేతనో యనునట్లు; అందున్=కీర్తిప్రతాపములలో; ఒక్కటి=ఒకకీర్తి గాని, ప్రతాపము గాని; ప్రోవన్=పాలింపఁగా; వేఱొకటి=ఇంకొకటి;వజ్రారూఢిన్=వజ్రాయుధముయొక్క రూఢిచేత; కూల్చున్= చంపును; విరోచనున్=సూర్యుని; వేఱొక్కటి=వానిలో నొకటగు ప్రతాపము; ఏఁచన్=బాధింపఁగా; అందొకటి=దానిలో నొక టగు కీర్తి; విరోచనుని మించం జేయును, ఇచట విరోచనుఁ డనఁగా చంద్రుఁడను నర్థమును గ్రహించి విరోధపరిహారము చేయ వలెను, 'చంద్రాగ్న్యర్కా విరోచనాః' అని విశ్వము; హంసోన్నతిన్—హంస=సూర్యునియొక్క, ఉన్నతిన్=అతిశయమును; మునుమున్ను=మొట్టమొదట; ఒక్కటి=దానిలో నొకటియగు ప్రతాపము; నొంపన్=నొవ్వఁజేయఁగా; వేఱొకటి=మఱియొకటి యగు కీర్తి; హంసోన్నతిన్=సూర్యోన్నతిని; చిత్రంబుగన్=ఆశ్చర్యముగ; మన్పున్=పోషించును. ఇచట హంసశబ్దమునకు, రాజహంస యర్థము గావున రాజహంసల యున్నతిని, కీర్తి పోషించు నని భావము. అనఁగ నీరాజుకీర్తి చంద్రుని, హంసలను పోషించు ననియు, ప్రతాపము సూర్యునిఁ దిరస్కరించు ననియు భావము.

చ. సలలితచక్రసంభరణసక్తమహాశయు దేవవర్ణితో
జ్జ్వలదయుఁ బూరుషోత్తము నిశాచరసాధ్వసకృత్సమాఖ్యు ని
య్యలఘునిఁ జెట్టవట్టి హరి నంబుధిరాజతనూజ వోలె ని
చ్చ లురముఁ బాయ కింపున నెసంగుము వాసవనీలకుంతలా! 100

టీక: వాసవనీలకుంతలా =ఇంద్రనీలమణులవంటి కురులుగల చంద్రికా! సలలిత చక్ర సంభరణ సక్త మహాశయున్ – సలలిత= మనోజ్ఞమగు, చక్ర=దండుయొక్క, సంభరణ=భరించుటయందు, సక్త=ఆసక్తిగల, మహాశయున్=అధికమగు నభిప్రాయము గల; సలలిత= మనోజ్ఞమగు, చక్ర=సుదర్శనముయొక్క,సంభరణ=భరించుటయందు,సక్త=ఆసక్తిగల, మహత్=గొప్ప యగు, శయున్= హస్తముగలవాఁడని విష్ణుపరమైన యర్థము; దేవ వర్ణి తోజ్జ్వల దయున్=దేవతలచేఁ గొనియాడఁబడిన కృప గల; పూరుషోత్తమున్=పురుషశ్రేష్ఠుని, విష్ణుమూర్తిని; నిశాచరసాధ్వసకృ త్సమాఖ్యున్ –నిశాచర=రక్కసులకు, సాధ్వస కృత్=భయము గలుగఁజేయు, సమాఖ్యున్=ప్రసిద్ధిగల, నామము గల వానిని; ఇయ్యలఘునిన్=ఈఘనుని; చెట్టవట్టి= వివాహమాడి; హరిన్=విష్ణువును; అంబుధిరాజతనూజ వోలెన్=కలిమినెలంతవలె; నిచ్చలు=ఎల్లపుడు; ఉరముఁ బాయక = ఎదను వదలక; ఇంపునన్=సుఖముచేత; ఎసంగుము=ఒప్పుము. అనఁగ నోచంద్రికా! కరివేల్పు నురముఁ బాయ కెప్పుడు నివ సించి యుండు లచ్చినెలంతవోలె, నీ వీరాజును బెండ్లియై వీనియురముఁ బాయక సుఖముగ నుండు మని భావము.

ఉ. నా విని కొమ్మ యక్షివలనంబునఁ దన్నృపచంద్రనిస్పృహ
శ్రీవెలయింప ముంగలికిఁ జేర ఘటించె వయస్య యోర్తు దో
డ్తో వరయానధుర్యతతితో వివరించుచు నప్పు డొక్క పృ
థ్వీవిభుఁ జూపి గౌరి సుదతిం బలుకుం బ్రియవాక్యనైపుణిన్. 101

టీక: నాన్=అనఁగా; విని=ఆకర్ణించి; కొమ్మ=చంద్రిక; అక్షివలనంబునన్=నేత్రవలనముచేత; తన్నృపచంద్రనిస్పృహశ్రీన్ – తన్నృపచంద్ర=ఆరాజచంద్రునియందు, నిస్పృహశ్రీన్=నైరాశ్యరచనను; వెలయింపన్=ప్రకాశింపఁజేయఁగా; ముంగలికిన్ = పురోభాగమునకు; చేరన్=పొందునటులు; వయస్య యోర్తు=ఒకచెలికత్తె; ఘటించెన్=చేసెను; తోడ్తోన్=వెంటనే;వరయాన ధుర్యతతితోన్ – వర=శ్రేష్ఠములగు, యానధుర్య=పల్లకిమోయువారియొక్క,తతితోన్=సమూహముతో; వివరించుచున్ = విశదపఱుచుచు; అప్పుడు=ఆసమయమందు; ఒక్క పృథ్వీవిభున్=ఒకరాజును; చూపి=ప్రదర్శించి; గౌరి=పార్వతీదేవి; సుదతిన్=చంద్రికతో; ప్రియవాక్యనైపుణిన్—ప్రియవాక్య=ప్రియములగు పలుకులయొక్క, నైపుణిన్=జాణతనముచేత; పలుకున్=వచించెను.

క. నాళీకనయన! పార్థివ,మౌళిమణిఁ గాంచు దహళమహివిభు రతిరా
ట్కేళీనూత్నకళాసౌ,శీలిమన్మనుజలోకశేఖరు వీనిన్. 102

టీక: నాళీకనయన=పద్మములవంటి నేత్రములు గల చంద్రికా! పార్థివమౌళిమణిన్=రాజమౌళిరత్నమును; దహళమహివిభున్=దహళభూపాలుఁడును; రతిరాట్కేళీ నూత్నకళా సౌశీలిమ న్మనుజలోకశేఖరున్ – రతిరాట్కేళీ=మదనక్రీడల యొక్క, నూత్నకళా=నూతనవిద్యయును, సౌశీలిమత్=సచ్చరిత్రవత్తయుఁగల, మనుజలోకశేఖరున్=మనుష్యలోకము నందు శ్రేష్ఠుఁ డగు; వీనిన్=ఈరాజును; కాంచు=చూడుము.

చ. నెలఁత గభీరపుష్కరధునీపరిగాహనముల్ సురాగమం
డలఫలభక్షణంబులు కనత్సుమనోమహిళానికేతన
స్థలపరివాసముల్ సమతఁ దాల్చు భయాభయయుక్తిఁ బొల్చుని
య్యలఘునిశత్రుకోటి కచలావళిలేఖపురుల్ విచిత్రతన్. 103

టీక: నెలఁత=చంద్రికా! భయాభయయుక్తిన్—భయ=భయముయొక్క, అభయ=భయాభావముయొక్క, యుక్తిన్=సంబంధముచేత; పొల్చు =ఒప్పుచున్న, ఇయ్యలఘుని శత్రుకోటికిన్=ఈరాజుయొక్క శత్రుబృందమునకు; అచలావళిలేఖపురుల్ – అచలావళి=పర్వతబృందమును, లేఖపురుల్=అమరావతియును; విచిత్రతన్ =చమత్కృతిచేత; గభీరపుష్కరధునీపరిగాహనముల్ – గభీర=గంభీరమగు,పుష్కరధునీ=మిన్నేటియందు,పరిగాహనముల్=స్నానములను; పుష్కర=కమలములు గల, ధునీ=నదులయందు, పరిగాహనము లని రెండవయర్థము; సురాగమండలఫలభక్షణంబులు – సురాగ=వేల్పుమ్రాఁకుల యొక్క, మండల=గుంపుయొక్క,ఫల =పండ్లయొక్క, భక్షణంబులు = తినుటలు; సురాగ = ఈఁతచెట్లయొక్క, మండల = గుంపుయొక్క, ఫలభక్షణంబుల నని రెండవయర్థము; కనత్సుమనోమహిలానికేతనస్థలపరివాసముల్ – కనత్=ప్రకాశించు చున్న, సుమనోమహిళా=దేవాంగనలయొక్క, నికేతన=గృహములయొక్క,స్థల=ప్రదేశములందు,పరివాసముల్=నివాసము

లను; సుమనః=పుష్పములుగల, మహిళా=ప్రేంకణపుచెట్లయొక్క, గృహస్థలపరివాసము లని రెండవయర్థము;సమతన్ = సమత్వముచేత; తాల్చున్= ధరించును. అనఁగ నీరాజునకు భయపడిన శత్రువులు వననివాసముఁ జేసిరనియు, భయపడని శత్రువులు యుద్ధమునందు నిహతులై స్వర్గనివాసముఁ జేసి రనియు భావము.

సీ. దరిసించుచో నెల్లఁ దాఁటించుఁ దాప మీ,యవనీంద్రుచూపు చంద్రాతపంబొ,
ఎనసినచో నెల్ల మనుపు నామోద మీ,రారాజు చిత్తంబు సారసంబొ,
నెరసినచో నెల్ల దొరపు దేవత్వ మీ,యరిభేదిమాట నవ్యామృతంబొ,
యుంచినచో నెల్ల నించు నిష్టంబు లీ,ధీరునిపాణి మందారలతయొ,
తే. యనుచు సత్కవిలోకంబు లభినుతింప, నలరు నీదహళోర్వరాధ్యక్షరత్న
మతివ నీభాగధేయంబుకతన నిటకు, వచ్చె వరియింపు మితని భావము చిగుర్ప. 104

టీక: దరిసించుచోన్=చూచినచోట; ఎల్లన్=అంతట; తాపము=సంతాపమును; తాఁటించున్=పోఁగొట్టును; ఈయవనీంద్రు చూపు = ఈరాజేంద్రునియొక్క చూపు; చంద్రాతపంబొ=వెన్నెలయో?
ఎనసినచోన్=పొందినచోట; ఎల్లన్=అంతట; ఆమోదము=సంతసమును, పరిమళ మని తోఁచుచున్నది; మనుపున్=వృద్ధిఁ బొందించును; ఈరారాజు=ఈరాజరాజుయొక్క; చిత్తంబు=మనము; సారసంబొ=తమ్మియో?
నెరసినచోన్=వ్యాపించినచోట; ఎల్లన్=అంతట; దేవత్వము=రాజత్వమును, వేల్పుతనమును; దొరపున్=కలుగఁజేయును; ఈయరిభేదిమాట = శత్రుభేదకుఁడైన యీరాజుమాట; నవ్యామృతంబొ=నూతనమైన సుధయో?
ఉంచినచోన్=ఉనిచినచోట; ఎల్లన్=అంతట; ఇష్టంబులు=కోరికలను; నించున్=పూరించును; ఈధీరునిపాణి =ఈరాజు హస్తము; మందారలతయొ = కల్పలతయో?
అనుచున్=ఇట్లు వచించుచు; సత్కవిలోకంబులు=విద్వద్బృందములు; అభినుతింపన్=పొగడఁగ; అలరు=ఒప్పును; ఈ దహళోర్వరాధ్యక్షరత్నము=ఈదహళరాజశ్రేష్ఠుఁడు; అతివ=చంద్రికా! నీభాగధేయంబుకతనన్=నీయొక్క భాగ్యవశమున; ఇటకు=ఇచ్చోటికి; వచ్చెన్=వచ్చెను; ఇతనిన్=ఈతేని; భావము చిగుర్పన్=చిత్తము పల్లవింపఁగా; వరియింపు=వరింపుము.

ఈరాజు చూచెనాయనా సమస్తతాపములను బోఁగొట్టును గాన ఇతనిచూపు వెన్నె లయేమో, ఇతనిచిత్తము కలిసెనేని ఆమోదము నిచ్చునుగాన నది కమలమో యేమో, ఇతనిమాట నెరసినచో దేవత్వ మొసగునుగాన నది యమృత మేమో, ఇతని చే యుంచినచో నెల్లకోరికల నిచ్చునుగాన నది కల్పలతయో యేమో, యీరీతి సమస్తవిద్వజ్జనులు నితని నుతింతురు గాన నీరాజును వరింపు మని భావము. సందేహాలంకారము.

వ. అనిన నయ్యొప్పులకుప్ప యప్పతియెడం జిత్తం బొప్పింపకున్కి దెలిసి యాచాయ నొక్కనృపతిం జూపి నొసలిచూపువేల్పుజవరా లాచివురాకుఁబోఁడి కిట్లనియె. 105

టీక: అనినన్=ఈప్రకారము పలుకఁగా; అయ్యొప్పులకుప్ప=అందములకు ప్రోవైన యాచంద్రిక; అప్పతియెడన్=ఆరాజు నందు; చిత్తంబు= మనస్సు; ఒప్పింపకున్కిన్=ఈయకుండుటను; తెలిసి=ఎఱిఁగి; ఆచాయన్=ఆప్రదేశమందు; ఒక్కనృపతిన్ =మఱియొకరాజును; చూపి=ప్రదర్శించి; నొసలిచూపువేల్పుజవరాలు=ఫాలనేత్రుని పత్నియగు పార్వతీదేవి; ఆచివురాకుఁ బోఁడికిన్ = పల్లవగాత్రి యగు నాచంద్రికకు; ఇట్లనియెన్=వక్ష్యమాణప్రకారముగఁ బలికెను.

చ. కనుఁగొను బోటి! ఖోటనరకాంతశిఖామణి ధామధిక్కృతా
తనుఘృణి వీఁడు జన్యవసుధాస్థలి శింజిని కార్తిపొందు దా
ర్చిన నరి తద్భృతిం గనుఁ బరిస్ఫుటకాండనికాయముల్ నిగి
డ్చిన నవి తద్వధూటి నిగిడించుఁ గనుంగవ నద్భుతంబుగన్. 106

టీక: బోటి=చంద్రికా! ఖోటనరకాంతశిఖామణిన్=ఖోటదేశరాజశిఖామణిని; ధామధిక్కృతాతనుఘృణిన్ – ధామ=తేజస్సు చేత, ధిక్కృత=తిరస్కరింపఁబడిన, అతనుఘృణిన్=సహస్రకిరణుని; కనుఁగొను=చూడుము; వీఁడు=ఈరాజు; జన్యవసుధాస్థలిన్=యుద్ధభూమియందు; శింజినిన్=అల్లెత్రాటికి; ఆర్తిపొందు దార్చినన్=ధనుష్కోటిసంబంధమును జేయఁగా; అరి=శత్రువు; తద్భృతిన్ =ఆయార్తిభరణమును, పీడాభరణము ననుట; కనున్=పొందును; పరిస్ఫుటకాండనికాయముల్ – పరిస్ఫుట=వ్యక్తమగు, కాండ=బాణములయొక్క, నికాయముల్=సమూహములను; నిగిడ్చినన్=ఎక్కువెట్టఁగా; తద్వధూటి =ఆశత్రుకాంత; కనుంగవన్=కనుదోయియందు; అద్భుతంబుగన్=ఆశ్చర్యముగ; అవి= ఆకాండనికాయములను, నీళ్ల సమూహముల ననుట, బాష్పముల నని భావము; నిగిడించున్=నించును.

అనఁగ నీరాజు యుద్ధభూమియందు వింటికొప్పున నల్లెత్రాటిని జేర్చుతఱి శత్రుబృందము దుఃఖమును బొందుననియు, అల్లెత్రాటియందు బాణంబుల నిగిడ్చిన వారికాంతలు కనుగవ నీరుంతు రనియు భావము. ఈపద్యమందు శత్రుప్రాణవియోగ కారణం బగు శరసంధానమును తత్కార్యరూప మగుశత్రుకాంతానయనబాష్పముల నొక్కుమ్మడి హేతుకార్యముల వర్ణించుటచే నక్రమాతిశయోక్తి యను నలంకారము. 'అక్రమాతిశయోక్తిస్స్యా త్సహత్వే హేతుకార్యయోః' అని దానిలక్షణము.

చ. ఉరగమువక్రవృత్తి నచలోత్తముసత్పథరోధకోన్నతి
స్ఫురణఁ గిరీంద్రుపంకరతబుద్ధి ఢులీశుజడప్రచారమున్
కరిపతిదుర్మదక్రమము గన్గొని రోసి ధరిత్రి తద్గుణే
తరగుణశాలి నివ్విభునిఁ దన్వి వరించి చెలంగు నిచ్చలున్. 107

టీక: ఉరగమువక్రవృత్తిన్=శేషుని కుటిలస్వభావమును, శేషుఁడు సర్పము గానఁ గుటిలగతి సహజమని భావము; అచలోత్తముసత్పథరోధకోన్నతిస్ఫురణన్ – అచలోత్తము=కులాచలముయొక్క,సత్పథరోధక=సత్పురుషులమార్గమునకు నిరోధకమగు, ఉన్నతిస్ఫురణన్=ఔన్నత్యస్ఫురణమును; కులాచలమునకు,సత్పథ=ఆకాశమునకు రోధకమగు నున్నతస్ఫురణము సహజమని భావము; కిరీంద్రుపంకరతబుద్ధిన్ – కిరీంద్రు=ఆదివరాహముయొక్క, పంక=పాపమునందు,రత=ఆసక్తిగల, బుద్ధిన్=మతిని; పంక=బురదయందు, రతమగు బుద్ధి కరీంద్రునకు సహజమని భావము; ఢులీశుజడప్రచారమున్=ఆదికూర్మముయొక్క మూర్ఖులతోఁ గూడిన ప్రచారమును, ఇచట డలలకు భేదములేమి ఆదికూర్మమునకు జలమందు ప్రచారము సహజమని స్వభావార్థము; కరిపతిదుర్మదక్రమమున్—కరిపతి=గజపతియొక్క, దుర్మదక్రమమున్=దుర్గర్వక్రమమును, గజపతికి దుర్మదక్రమమనఁగ, మదోదకముతోఁ గూడి యుండుట సహజమని భావము; కన్గొని=చూచి; రోసి=విసిగి; ధరిత్రి=భూమి;తద్గుణేతరగుణశాలిన్ – తత్=ఆయురగాదులయొక్క,గుణేతర=గుణములకన్న భిన్నమైన, గుణ=మంచిగుణముల చేత, శాలిన్=ప్రకాశించుచున్న; ఇవ్విభునిన్=ఈరాజును; తన్వి=చంద్రికా! వరించి=కోరి; నిచ్చలున్=ఎల్లపుడు; చెలంగున్ = ఒప్పును. ఓచంద్రికా! యుర గాచల కిరి ఢులీ కరుల దుర్గుణములకుఁ బుడమి రోసి యీగుణశాలిని జేరె నని భావము.

ఉ. ఇన్నరనాథచంద్రు వరి◊యించి ముదంబున నేగుదెంచునిం
గన్నులపండువై యలరఁ ◊గన్గొని నీపయి నించుఁ గాక యే
తన్నగరీవధూమణివి◊తానము సౌధచయంబు లెక్కి యు
ద్యన్నవమౌక్తికాక్షతసు◊మావళికాకలికాకులంబులన్. 108

టీక: ఇన్నరనాథచంద్రున్=ఈరాజచంద్రుని;వరియించి=కోరి; ముదంబునన్=సంతసముచేత; ఏగుదెంచు నిన్ = వచ్చుచున్న నిన్ను; కన్నులపండువై=కనులకు విందై; అలరన్=ప్రకాశింపఁగ; కన్గొని=చూచి; నీపయిన్=నీమీఁద; ఏతన్నగరీవధూమణి వితానము = ఈతనిపురమునందలి స్త్రీరత్నసమూహము; సౌధచయంబు లెక్కి=మేడలపై నెక్కి; ఉద్యన్నవమౌక్తికాక్షతసుమావళికాకలికాకులంబులన్–ఉద్యత్=ఎత్తఁబడిన, నవ=నూతనమైన, మౌక్తికాక్షత=ముత్యములయక్షతలయొక్క, సుమావళికా = పుష్పబృందముయొక్క, కలికా=మొగ్గలయొక్క, కులంబులన్=సమూహములను; నించుఁగాక=నిండించునుగాక.

తే. అనఁగ తూష్ణీంస్థితి భజించె ◊నంబుజాక్షి, తన్మనోమోహదుర్విధ◊త్వంబు దెలిసి
యప్పు డాచెంత వేఱొక్క ◊యధిపుఁ జూపి, యింతి కమ్మేనకాపుత్రి ◊యిట్టు లనియె. 109

టీక: అనఁగన్=ఇట్లు పలుకఁగ; అంబుజాక్షి=పద్మనేత్ర యగు చంద్రిక; తూష్ణీంస్థితిన్=ఊరకుండుటను;భజించెన్=పొందెను; తన్మనోమోహదుర్విధత్వంబు – తత్=ఆచంద్రికయొక్క, మనః=మనమునందు, మోహ=మోహముయొక్క,దుర్విధత్వంబు = దారిద్ర్యమును; తెలిసి=తెలిసికొని; అప్పుడు=ఆసమయమందు;ఆచెంతన్=ఆసమీపమందు;వేఱొక్కయధిపున్= మఱియొక రాజును; చూపి; యింతికిన్=చంద్రికకు; అమ్మేనకాపుత్రి=ఆపార్వతీదేవి;ఇట్టులు=వక్ష్యమాణప్రకారము; అనియెన్= పలికెను.

మ. తులకింపం బ్రమదంబు కన్గొనుము సిం◊ధుస్వామి నీదంటఁ బ
క్ష్మలనేత్రామణి! పాండుకాండయుతశుం◊భద్వాహినీమద్రణ
స్థలకాశి న్రిపుకోటి చేరి కడు మిం◊చ న్దివ్యరామోపదే
శలసద్వృత్తి ఘటించు వీనియసియ◊జ్ఞధ్వంసి నిక్కంబుగన్. 110

టీక: పక్ష్మలనేత్రామణి=చంద్రికా! ప్రమదంబు=సంతసము; తులకింపన్=ప్రకాశింపఁగా; సింధుస్వామి=సింధుదేశాధిపతియగు; ఈదంటన్=ఈదిట్టతనముగలవానిని; కన్గొనుము=చూడుము; వీనియసియజ్ఞధ్వంసి = వీనియొక్క ఖడ్గమనెడు శంకరుఁడు; పాండుకాండయుతశుంభద్వాహినీమద్రణస్థలకాశిన్ – పాండు=తెల్లనగు,కాండ=గుఱ్ఱములతో, యుత=కూడుకొన్న,శుంభత్ = ప్రకాశించుచున్న, వాహినీమత్=సేనగల, రణస్థల=యుద్ధరంగమనెడు, కాశిన్=వారాణసిని; ఇచట, పాండు=తెల్లనగు, కాండ=జలముతో, యుత=కూడుకొన్న,శుంభత్ = ప్రకాశించుచున్న, వాహినీమత్=గంగగల యని, కాశీపరముగాఁ దోఁచుచున్నది; రిపుకోటి=శత్రుసంఘము; చేరి=పొంది; కడు మించన్=మిక్కిలి యొప్పారఁగా; దివ్యరామోపదేశలసద్వృత్తిన్– దివ్యరామా= దేవాంగనలయొక్క, ఉపదేశ=సమీపప్రదేశమునందు,లసత్=ప్రకాశించుచున్న, వృత్తిన్=వర్తనను, ఉనికి ననుట; ఇచట, దివ్య=అమోఘమైన, రామ=రామతారకముయొక్క, లేదా పరబ్రహ్మముయొక్క, ఉపదేశముచేత నని తోఁచుచున్నది; నిక్కంబుగన్= నిశ్చయముగ; ఘటించున్=ఘటిల్లఁజేయును.

అనఁగ నోచంద్రికా! ఈసింధుదేశాధిపతియొక్క యసియను శంకరుఁడు రణస్థలమను వారాణసియందుఁ జేరియున్న శత్రువులకు దివ్యరామోపదేశమును జేయునని భావము. పరంపరిత రూపకము.

చ. అలఘుశరౌఘవృత్తిమహి౧మాభిహతప్రతికూలు సంతతా
తులితగభీరభావభరి౧తు న్సుమనోజనమోదకారిని
ర్మలమణిదాత నియ్యవని౧రాజకులాజరరాజు నాత్మ నో
నెలఁతుక! సింధురా జనుచు౧నిచ్చ నుతింపఁగఁ జెల్లకుండునే. 111

టీక: అలఘుశరౌఘవృత్తిమహిమాభిహతప్రతికూలున్ – అలఘు=అధికమైన,శరౌఘ=బాణసంఘముయొక్క, వృత్తి=వర్తనమువలననైన, మహిమ=సామర్థ్యముచేత, అభిహత=కొట్టఁబడిన,ప్రతికూలున్=శత్రువులు గల; ఇచట, శరౌఘ=జలప్రవాహముయొక్క, మహిమాభిహతమగు, ప్రతికూలున్=ఎదురుదరిగల యను సముద్రపరమైన యర్థము దోఁచుచున్నది; సంతతాతులితగభీరభావభరితున్ – సంతత=ఎల్లపుడు, అతులిత=నిస్సమానమగు, గభీర=గంభీరమగు, భావ =అభిప్రాయముచే, భరితున్=పరిపూర్ణుఁడగు; ఇచట, సంతతము, అతులితమగు, గభీరభావ=లోతుచే పరిపూర్ణుఁడగు నని సముద్రపరమైన యర్థము; సుమనోజనమోదకారినిర్మలమణిదాతన్ – సుమనోజన=విద్వాంసులకు, మోదకారి=సంతసమును జేయు, నిర్మల = స్వచ్ఛమగు, మణి=మణులయొక్క, దాతన్=వదాన్యుఁడగు; దేవతలకు సంతసము నొసఁగు చింతామణి నిచ్చినవాఁడని సముద్రపరమైన యర్థము; రాజకులాజరరాజున్=రాజకులేంద్రుని; ఇయ్యవనిన్=ఈభూమియందు; ఆత్మన్=మనమునందు; ఓనెలఁతుక=ఓచంద్రికా! సింధురాజనుచున్=సింధుదేశపురాజనుచు, సముద్రుఁడనుచు ననితోఁచుచున్నది; నిచ్చన్=ఎల్లపుడు; నుతింపఁగన్=కొనియాడుటకు; చెల్లకుండునే=తగినట్టులుండదా? ఉండునని కాకువు.
ఈసింధురాజు బాణములచేఁ బ్రతికూలులను వధించువాఁడనియు, గంభీరభావమును వహించినవాఁడనియు, విద్వద్గణములకు పెక్కుమణుల నిచ్చినాఁ డనియు, గావున నితఁడు వరణీయుఁ డనియు భావము.

చ. సకి! రతివేళ నీవు గళ౧సంయుతనిస్వనబృంహితార్భటుల్
రకమయి మీఱఁ గంతుకరి౧రాజనిరూఢి విశృంఖలైకవృ
త్తికఁ దగ నీమహీతలప౧తిచ్ఛలయంత ఘటించుఁ గాక తా
వకకుచకుంభవీథి నని౧వార్యనఖాంకుశఘాతజాతముల్. 112

టీక: సకి=చంద్రికా! రతివేళన్=సురతసమయమందు; గళసంయుతనిస్వనబృంహితార్భటుల్—గళ=కంఠమందు, సంయుత = కూడుకొన్న, నిస్వన=రతికూజితము లనెడు, బృంహితార్భటుల్=గజధ్వనులు; రకమయి=శ్రేష్ఠమై(అధికమై); మీఱన్= మించఁగా; నీవు; కంతుకరిరాజనిరూఢిన్=మదనునిగజముపగిది; విశృంఖలైకవృత్తికన్—విశృంఖల=నిగళములు లేనట్టి, ఏక=ముఖ్యమగు, వృత్తికన్=వ్యాపారముచేత; తగన్=ఒప్పఁగా; ఈమహీతలపతిచ్ఛలయంత – ఈమహీతలపతి=ఈ భూపతియనెడు, ఛల=వ్యాజముగల, యంత=మావటివాఁడు; తావకకుచకుంభవీథిన్ – తావక=నీసంబంధియగు, కుచకుంభ= స్తనములనెడు కుంభములయొక్క, వీథిన్=ప్రదేశమునందు; అనివార్యనఖాంకుశఘాతజాతముల్—అనివార్య=నివారింపనలవిగాని, నఖ= గోళ్లనెడు, అంకుశ=అంకుశములయొక్క,ఘాత=పోట్లయొక్క,జాతముల్=సమూహములను; ఘటించుఁ

గాక = చేయును గాక. చంద్రికా! నీవు రతివేళ గళసంయుతములగు రతికూజితము లను బృంహితములు విపులముగాఁ జేయుచు విశృంఖల మదగజరాజమువలె నుండఁగా నపుడు నీమహీపతి యను మావటివాఁడు నీస్తనములనెడు కుంభస్థలము లందు గోరు లను నంకుశములచే ఘాతములఁ జేయు నని భావము.

(గమనిక: కొల్లాపురంవారి తొలిముద్రణలో ఈపద్యమునందలి రెండవచరణములో 'కరమయి' అని యున్నది. దీనికి కరమయి =అధికమయి అని వ్యాఖ్యాతలు అర్థమిచ్చినారు. 'క' ప్రాసాక్షరముగా గల ఈ పద్యమునకు 'కరమయి' అని యుండుటచే ప్రాసభంగము కల్గినది. కాని దీనినిగుఱించి వ్యాఖ్యాతలు ప్రస్తావించలేదు. కొల్లాపురంవారి రెండవముద్రణలో దీనిని 'రకమయి' అని మార్చి ప్రాసదోషమును సవరించిరి కాని, వ్యాఖ్యానములో కరమయి=అధికమై అను దాని నట్లే ఉంచినారు. కేశవపంతుల వారి మూలముద్రణములోను 'రకమయి' అను రూపమునే గ్రహించినారు. రకమయి అనుపదమునకు 'సుందరమయి', 'శ్రేష్ఠ మయి' అను రెండర్థములను సూర్యరాయాంధ్రనిఘంటు విచ్చుచున్నది. అందుచేత పై వ్యాఖ్యానములో రకమయి= శ్రేష్ఠ మయి అని ఉంచి, బ్రాకెట్లలో మునుపటి వ్యాఖ్యాతల అధికమయి అను అర్థమును గూడ ఉంచినాను - దేశికాచార్యుఁడు.)

తే. అనిన నెమ్మోము మరలిచె ౧వనజవదన, యది కనుంగొని గిరిజ య౧ప్పదవిఁ గుకురు
వరునిఁ జేచాయఁ జూపి య౧వ్వనిత కిట్టు, లనియె మహతీరవామిత్ర౧నినదకలన. 113

టీక: అనినన్=ఇట్లు పలుకఁగా; నెమ్మోము=సుందరమగు ముఖమును; వనజవదన =చంద్రిక; మరలిచెన్=త్రిప్పెను;అది కనుంగొని =అది చూచి; గిరిజ=పార్వతీదేవి; అప్పదవిన్=ఆదారియందు; కుకురువరునిన్=కుకురుదేశాధిపతిని; చేచాయన్ =చెయిజాడచే; చూపి=ప్రదర్శించి; అవ్వనితకున్=ఆచంద్రికకు; మహతీరవామిత్రనినదకలనన్ – మహతీ=నారదునివీణ యొక్క, రవ=స్వనమునకు, అమిత్ర=విరోధియగు,నినద=ధ్వనియొక్క,కలనన్=ప్రాప్తిచేత; ఇట్టులు=వక్ష్యమాణప్రకారము; అనియెన్=పలికెను.

చంద్రిక యానరపతిమీఁద మనంబు పొందకున్కి మోము ద్రిప్పఁగానె గౌరీదేవి యచటఁ గుకురుదేశరాజుం జూపి, నారదుని వీణారవమునకు సాటియగు సుందరవచనములచే వక్ష్యమాణప్రకారముగఁ బలికె నని తాత్పర్యము.

చ. చెలి! కుకురుక్షమారమణ౧శేఖరుఁ డీతఁడు వీనిఁ గాంచు మీ
జలజశరోపమాను నెఱ౧చక్కఁదనంబు జగంబు లెంచ ని
చ్చలు నెదఁ గుందఁజేయుఁ దొవ౧సామి వనావళిఁ దోలు నామనిన్
దలఁచుఁ దృణంబుగా నలజ౧నప్రభుఁ దా నెగఁబట్టు వాసవిన్. 114

టీక: చెలి=చంద్రికా! ఈతఁడు; కుకురుక్షమారమణశేఖరుఁడు=కుకురురాజశ్రేష్ఠుఁడు; వీనిన్=ఈరాజును; కాంచుము = చూడుము; ఈజలజశరోపమాను నెఱచక్కఁదనంబు=ఈ మన్మథతుల్యుఁడగు రాజుయొక్క నిండుసౌందర్యము; జగంబు లెంచన్= లోకములు నుతియింపఁగా; తొవసామిన్=కలువలరాయని; నిచ్చలు=ఎల్లప్పుడు; ఎదన్=హృదయమందు; కుందఁ జేయున్=దుఃఖించు నటులు చేయును, తగ్గునటులు చేయునని స్వభావార్థము, కృష్ణపక్షమందుఁ జంద్రుఁడు తగ్గుట సహజ మని భావము; ఆమనిన్=వసంతుని; వనావళిన్=వనపంక్తినిగూర్చి; తోలున్=పంపును, మిక్కిలి చక్కఁదనము గల వసంతుని నడవికిఁ బాఱిపోవునటులు చేయునని భావము, వసంతుఁడు వనావళియం దుండుట సహజ మని భావము; నలజనప్రభున్= నలచక్రవర్తిని; తృణంబుగాన్=గడ్డిపోవఁగా; తలచున్=ఎంచును, నలుని తిరస్కరించు ననుట, నలశబ్దమునకు తృణ మర్థము

గావున తృణముగాఁ దలచుట సహజ మని భావము; వాసవిన్=జయంతుని; తాన్=తాను;ఎగఁబట్టున్=ఎగఁజిమ్మును, తిరస్క రించు ననుట, ఆకాశగమనము జయంతునకు సహజమని భావము;

చ. సరసమహాత్మత న్భువనజన్మవినాశనహేతువైన యీ
నరపతికీర్తిదైవము గనం బ్రతికూలతచేఁ జరింప ని
ర్జరతరుపాళి కేపు తనచాయ పొసంగునె చుట్టమై కడున్
ఖరదనుజారికిం బగయ గాదొకొ కట్టిన కోఁక యెంచఁగన్. 115

టీక: సరసమహాత్మతన్ – సరస=శ్రేష్ఠమగు, మహాత్మతన్=ప్రభావముచేతను; భువనజన్మవినాశనహేతువైన – భువనజన్మ= జలజములయొక్క, వినాశన=నశింపఁజేయుటయందు, హేతువైన=కారణమైన; ఈనరపతికీర్తిదైవము =ఈరాజుయొక్క కీర్తి యనెడు దైవము; ఇచట, భువ=ప్రపంచముయొక్క, జన్మ=ఉత్పత్తికి, వినాశన=నాశమునకు, హేతువైన యని దైవపక్షమున కర్థము; కనన్=చూడఁగా; ప్రతికూలతచేన్=ప్రాతికూల్యముచేత; చరింపన్=వర్తింపఁగా; అనఁగా కీర్తిదైవము ప్రతికూలము కాఁ గానే యనుట; నిర్జరతరుపాళికిన్=కల్పతరుబృందమునకు; తనచాయ=తననీడ; కడున్=మిక్కిలి;చుట్టమై=బంధువై; ఏపున్ = విజృంభణమును; పొసంగునె=చేయునా? యని కాకువు, కీర్తి ప్రతికూలము కాఁగానే కల్పతరుపాళికి తననీడ యేపుఁజేయక యుండె ననుట, చెట్లు తెల్లనివైనను, నీడ నల్లనిదిగాన ననుకూలము గాకపోయెనని భావము, లోకమందు దైవము ప్రతికూలము కాగానె చుట్టమును ప్రతికూలించునని భావము; ఖరదనుజారికిన్=బలరామునికి; ఎంచఁగన్=విచారింపఁగ; కట్టినకోఁక =కట్టు వస్త్రము; పగయ గాదొకొ =శత్రువె గాదా యని కాకువు, బలరామునికి కట్టువస్త్రము నల్లనిదని భావము. ఏతత్కీర్తిదైవము ప్రతికూ లించుటచేఁ గట్టువస్త్రము సైతము బలరామునకుఁ బ్రతికూలించె ననుట.

క. అని పాంచాలక్షితివర, తనయామణి కద్రిరాజతనయ తెలుపఁగా
నెనయింప దయ్యె నపుడా, ఘనుపైఁ గలకంఠి చిత్తగతరాగంబున్. 116

టీక: అని=పూర్వోక్తప్రకారము; పాంచాలక్షితివర తనయామణికిన్=క్షణదోదయరాజపుత్రిక యగు చంద్రికకు; అద్రిరాజత నయ = పార్వతీదేవి;తెలుపఁగాన్=తెలియఁజేయఁగా; అపుడు; ఆఘనుపైన్=ఆరాజుమీఁద; కలకంఠి=చంద్రిక; చిత్తగతరా గంబున్=మనోగతమైన యనురాగమును;ఎనయింప దయ్యెన్=పొందింపదాయెను.

వ. అంత నయ్యనంతజూటనీలకుంతల యక్కాంత కిట్లు సకలదేశకాంతసంతానంబులం గ్రమక్రమంబునం దెలుపుచుం జని చని యారాజసభామధ్యంబున నక్షత్రనికరాంతరద్యోతమానరాకాసుధాకరుండునుం బోలె నమూల్యలక్షణలక్షితగాత్రుండును ననుపమానకలాపాలికాసమన్వితుండును జకోరలోచనానంద సంధాయకతేజస్సాంద్రుండును నగుచుఁ జూపట్టు సుచంద్రమనుజేంద్రుం జూపి తదీయచిత్తంబు తదాయత్తం బగుట దెలిసి యాకనకగౌరి కాగౌరి యిట్లనియె. 117

టీక. అంతన్=అటుపిమ్మట; అయ్యనంతజూటనీలకుంతల =వ్యోమకేశునికాంత యగు పార్వతీదేవి; అక్కాంతకున్=ఆ చంద్రి కకు; ఇట్లు=పూర్వోక్తప్రకారము; సకలదేశకాంతసంతానంబులన్ – సకలదేశకాంత=సమస్తదేశాధిపతులయొక్క, సంతానంబు లన్=సమూహములను; క్రమక్రమంబునన్=వరుసగా; తెలుపుచున్=తెలియఁజేయుచు; చని చని =అరిగియరిగి; ఆరాజసభా

మధ్యంబునన్=ఆరాజసభనడుమ; నక్షత్రనికరాంతరద్యోతమానరాకాసుధాకరుండునుంబోలెన్ – నక్షత్రనికర= రిక్కలగుంపు యొక్క, అంతర=మధ్యప్రదేశమందు, ద్యోతమాన=వెలుఁగుచున్న, రాకాసుధాకరుండునుంబోలెన్=పున్నమచందురునివలె; అమూల్యలక్షణలక్షితగాత్రుండును– అమూల్య=వెలలేని,లక్షణ=శుభచిహ్నములతో,లక్షిత=కూడుకొన్న, గాత్రుండును= శరీరముగలవాఁడును; అమూల్యమైన, లక్షణ=కలంకముచేత, నని చంద్రపరమైన యర్థము; అనుపమానకలాపాలికాసమన్వితుండును– అనుపమాన=సాటిలేని, కలా=విద్యలయొక్క, పాలికా= పంక్తితో, సమన్వితుండును=కూడినవాఁడును; అనుపమానమగు, కలాపాలికా=కాంతిపంక్తులతో, సమన్వితుండని చంద్రపరమైన యర్థము; చకోరలోచనానందసంధాయక తేజస్సాంద్రుండును– చకోరలోచనా =స్త్రీలకు, ఆనందసంధాయక=సంతసమును ఘటిల్లఁజేయు; తేజః =తేజస్సులచేత, సాంద్రుండును=నిండినవాఁడును; చకోర =వెన్నెలపుల్గులయొక్క,లోచనములకు, ఆనందసంధాయకమగు తేజముతోఁ గూడినవాఁడని చంద్రపరమైన యర్థము; అగుచున్= ఈప్రకార మయినవాఁడై; చూపట్టు సుచంద్రమనుజేంద్రున్ = కనిపించు సుచంద్రుండను రాజేంద్రుని; చూపి; తదీయచిత్తంబు =చంద్రికసంబంధియైన మనము; తదాయత్తంబు=ఆసుచంద్రు నధీనము; అగుటన్; తెలిసి =ఎఱిఁగి; ఆకనకగౌరికిన్=బంగరు వలె గౌరవర్ణము గల యాచంద్రికకు; ఆగౌరి=ఆపార్వతీదేవి; ఇట్లు=వక్ష్యమాణప్రకారము; అనియెన్=పలికెను.

మ. లలనా! కన్గొనుమీ రవిప్రభు విశాలారాజధానీప్రభు
న్లలిమై నీపతి యొప్పుఁగాక యెద ప్రేలం ద్వత్కరాంభోరుహ
స్థలి రాజిల్లుప్రసూనదామకము చంచద్వైజయంతీభృతిం
జెలువుం బూనురమావిభుం డన సురశ్రేణుల్ ప్రమోదింపఁగన్. 118

టీక: లలనా = చంద్రికా! ఈరవిప్రభున్ = ఈసూర్యకాంతిగల; విశాలారాజధానీప్రభున్= విశాలాపురపతిని; కన్గొనుము = చూడుము; లలిమైన్=ప్రేమచేత; ఈపతి=ఈరాజు; త్వత్కరాంభోరుహస్థలి రాజిల్లుప్రసూనదామకము– త్వత్=నీయొక్క, కరాంభోరుహస్థలిన్=కరకమలప్రదేశమునందు, రాజిల్లు=ప్రకాశించు, ప్రసూనదామకము=పూదండ; ఎదన్=వక్షమునందు; ప్రేలన్=ప్రేలాడఁగా; చంచద్వైజయంతీభృతిన్—చంచత్=ప్రకాశించుచున్న, వైజయంతీ=వనమాలయొక్క,భృతిన్=భరణము చేత; చెలువున్=అందమును; పూనురమావిభుం డనన్=పొందినట్టి నారాయణమూర్తి యనునట్లు; సురశ్రేణుల్=దేవసంఘములు; ప్రమోదింపఁగన్=సంతోషింపఁగా; ఒప్పుఁగాక=ప్రకాశించునుగాక.
చంద్రికా! వనమాలచే విష్ణువు ప్రకాశించునట్లు నీ చేతిపూదండను వక్షమున ధరించి యీవిశాలాపురాధిపతి ప్రకాశించుఁగాక యని భావము.

చ. నెలఁతుక! యీసుచంద్రధరణీపతి శాతశరచ్ఛటం బలా
ద్బలగళరక్త మర్ఘ్యముగఁ దత్కరికుంభమహామణు ల్సుమాం
జలిగఁ దదాతపత్రములు చక్కనియార్తులుగాఁ దనర్చుచున్
బలి రణచండి కూన్చె మునిపాళి నుతింపఁ దమిస్రదానవున్. 119

టీక: నెల(తుక=చంద్రికా! ఈసుచంద్రధరణీపతి=ఈసుచంద్రభూపాలు(డు; శాతశరచ్ఛటన్ – శాత=తీక్ష్ణమైన, శరచ్ఛటన్ = బాణసమూహముచేత; పలాద్బలగళరక్తము — పలాద్బల=రాక్షసబలముయొక్క, గళరక్తము =కంఠశోణితము; అర్ఘ్యము గన్ =పూజార్హమైన వస్తువుగా;తత్కరికుంభమహామణుల్ – తత్=ఆదానవులయొక్క, కరికుంభ=గజకుంభములయందున్న, మహామణుల్=అధికమైనమణులు; సుమాంజలిగన్=కుసుమాంజలిగ; తదాతపత్రములు=ఆరాక్షసుల గొడుగులు; చక్కని యార్తులుగాన్=సుందరమగు నారతులుగా; తనర్చుచున్=చేయుచు; రణచండికిన్=రణదుర్గకు; తమిస్రదానవున్=తమిస్రాసురుని; మునిపాళి నుతింపన్=మునిసంఘములు కొనియాడ(గ; బలిన్=బలిగా; ఊన్చెన్=చేసెను.

అన(గా నోచంద్రికా! ఈసుచంద్రు(డు రాక్షసులయొక్క కంఠరక్తము నర్ఘ్యముగాను, వారిగజకుంభములనుండి వెడలిన ముత్తెములను కుసుమాంజలిగాను, వారిగొడుగులను హారతులుగను జేయుచు అర్ఘ్యము మొదలగు పూజాద్రవ్యములను జత పఱచి రణదుర్గను పూజించి, తమిస్రాసురుని బలియిచ్చెనని భావము.

మ. అని నేతద్విభుసాయకాభిహతి మి౦న్నంటం బయిం బర్వి శ
త్రునృపాళీమకుటీవలక్షమణిపం౦క్తుల్ ద్రెళ్ళుటల్ పొల్చు వ
ర్ణన సేయం జెలినిర్భరానకరవ౦భ్రశ్యన్మహోడుస్థితిన్
ఘనలేఖోత్కరవర్షితాభ్రతరురం౦గత్కోరకవ్యాపృతిన్. 120

టీక: చెలి=చంద్రికా! అనిన్=యుద్ధమందు; ఏతద్విభుసాయకాభిహతిన్ – ఏతద్విభు=ఈసుచంద్రునియొక్క, సాయక= బాణములయొక్క, అభిహతిన్=కొట్టుటచేత;మిన్నంటన్=ఆకసము నంటునటులు; పయిన్=ఊర్ధ్వభాగమందు; పర్వి=వ్యాప్తమై; శత్రునృపాళీ మకుటీ వలక్షమణి పంక్తుల్ – శత్రునృప=శత్రురాజులయొక్క, ఆళీ=పంక్తులయొక్క, మకుటీ=కిరీటములందలి, వలక్షమణి= రవలయొక్క, పంక్తుల్=శ్రేణులు; త్రెళ్ళుటల్=పడుటలు; వర్ణన సేయన్=నుతియింప(గా; ఘన లే ఖోత్కర వర్షి తాభ్రతరు రంగ త్కోరక వ్యాపృతిన్ – ఘన=గొప్పవారైన, లేఖ=దేవతలయొక్క,ఉత్కర=సమూహముచేత, వర్షిత=వర్షింప(జేయ(బడిన, అభ్రతరు=కల్పవృక్షముయొక్క, రంగత్=ప్రకాశించుచున్న,కోరక=మొగ్గలయొక్క, వ్యాపృతిన్=మేళనముచేత; నిర్భ రానక రవ భ్రశ్య న్మహోడు స్థితిన్—నిర్భర=పరిపూర్ణమగు, ఆనక=పటహముయొక్క,రవ=ధ్వనిచేత, భ్రశ్యత్= జాఱుచున్న, మహోడు=గొప్పనక్షత్రములయొక్క,స్థితిన్=భంగిచే; పొల్చున్=ఒప్పును.

ఈసుచంద్రునియొక్క బాణహతిచే శత్రుమకుటతటఘటితమణులు మిన్నంటి యంతట వ్యాపించి, దేవతలు వర్షించుచున్నకల్పతరుకలికలతో(గూడి పుడమి వ్రాలుచు, రణభేరీరవమునకు(గూలు రిక్కలగుంపులవలె నొప్పిన వని భావము.

చ. జలజదళాక్షి! యీపతి సు౦చంద్రసమాహ్వయ మెట్లు పూనెనో
తెలియ(గ రాదు ధాత్రి(బర౦దేవమనఃప్రమదాపహారి ని
శ్చలకరకాండు(డై, భువన౦జాతనవోత్సవదాయకోదయో
జ్జ్వలు(డయి, సద్బుధాప్తు(డయి ౦సంతతము న్నలువారుచుండ(గన్. 121

టీక: జలజదళాక్షి=చంద్రికా! ధాత్రిన్=భూమియందు; పర దేవ మనఃప్రమ దాపహారి – పర=ఉత్కృష్టమగు, దేవ=దేవతలయొక్క, మనఃప్రమద=మనస్సంతోషమును, అపహారి=హరించువా(డును; పరదేవ=శత్రురాజులయొక్క,మనఃప్రమదాపహారి

అని స్వభావార్థము; నిశ్చలకరకాండుఁడై– నిశ్చల=చలింపని,కర=కిరణములయొక్క,కాండుఁడై=సమూహము గలవాఁడై; నిశ్చలమగు, కర=చేతియందున్న, కాండుఁడై=బాణములుగలవాఁడై యని స్వభావార్థము; భువనజాత నవోత్సవ దాయ కోదయోజ్జ్వలుఁ డయి– భువనజాత=కమలములకు, నవ = నూతనమగు, ఉత్సవ = వికాసరూపోత్సవమును, దాయక= ఇచ్చుచున్న, ఉదయ=ఆవిర్భావముచేత, ఉజ్జ్వలుఁడయి =ప్రకాశించుచున్నవాఁడై; భువనజాత=లోకబృందమునకు, నవోత్సవ=నూతనమగు నుత్సవమును, దాయక=ఇచ్చుచున్న, ఉదయ=అభివృద్ధిచేత, ఉజ్జ్వలుఁడయి అని స్వభావార్థము; సద్బుధాప్తుఁ డయి– సత్=రిక్కలకు, బుధ=బుధునికి,ఆప్తుఁడయి=ఇష్టుఁడయినవాఁడై; బుధునకు ప్రసిద్ధచంద్రుఁడు విరోధి యనుట బృహజ్జాతకమందు ప్రసిద్ధము. ‘శ్లో॥మిత్రే సౌరిసితౌ బుధస్య హిమగు శ్శత్రు స్సమా శ్చాపరే’ అని తత్ప్రమాణము; సత్=శ్రేష్ఠులైన, బుధ=విద్వాంసులకు, ఆప్తుఁడయి=ఇష్టుఁడయినవాఁడై యని స్వభావార్థము; సంతతమున్=ఎల్లపుడు; నలువారుచుండఁగన్=ఒప్పుచుండఁగ; ఈపతి=ఈరాజు; సుచంద్రసమాహ్వయము=సుచంద్రుఁడను పేరును; ఎట్లు పూనెనో ఏరీతిఁ బొందెనో; తెలియఁగ రాదు =తెలియదు. అనఁగ నీనరపతి పరదేవుల సంతసమును గూల్చియు, నిశ్చలకరకాండుఁడయ్యును, భువనజాతోత్సవప్రదుఁడయ్యును, సద్బుధాప్తుఁడయ్యును, సుచంద్రుఁడను పేరు నెట్లు పొందెనో తెలియ దని భావము.

ఉ. మానిని! యీనృపాలకర◊మాసుతు సుందరతాలవంబు దా
మానుగ నంది చంద్రుఁ డస◊మానమహస్థితి మిన్ను ముట్టఁగా
నౌనన కేలొకో మధు వ◊హంకృతిచే సుమనోవిరోధమున్
బూని ఘనుల్ గరంపఁ గర◊ము న్వని రూపఱుఁ బెంపు వాయఁగన్. 122

టీక:మానిని=చంద్రికా! ఈనృపాలకరమాసుతు సుందరతా లవంబున్– ఈనృపాలకరమాసుతు=ఈరాజమన్మథునియొక్క, సుందరతా=సౌందర్యముయొక్క, లవంబున్=లేశమును; చంద్రుఁడు=హిమాంశుఁడు; తాన్=తాను; మానుగన్=మనోజ్ఞముగ; అంది=పొంది; అసమానమహస్థితిన్– అసమాన=నిస్సమానమగు,మహస్థితిన్=తేజస్సుయొక్క స్థితిచేత; మిన్నుముట్టఁగాన్=విఱ్ఱవీగఁగా, ఆకాశము ముట్టఁగా నని స్వభావార్థము; మధువు=వసంతుఁడు; అహంకృతిచేన్=అహంకారముచేత; ఔననక= ఒప్పుకొనక; ఏలొకో=ఎందుకో; సుమనోవిరోధమున్=విద్వద్విరోధమును, సుమన మనఁగా జాజి, వసంతమందు జాతీపుష్పములు లేవనుట కవిసమయము. అందుచే వసంతుడు సుమనోవిరోధి యని స్వభావార్థము; పూని=పొంది; ఘనుల్=పెద్దలు, మేఘములు; కరంపన్ =అహంకారమును పోఁగొట్టఁగా; వర్షాకాలమందు మేఘము లుదయింపఁగానే వసంతకాలము పోవునని భావము; వనిన్=వనమందు; కరము=మిక్కిలి; పెంపు వాయఁగన్=అతిశయము వీడునట్లు;రూపఱున్=నశించును.

సీ. ఏలోకమిత్రుధా◊మాలోక మరిరాజ, సమ్మోదవర్ధన◊చ్ఛాయ వెలయు,
నేరాజు నెమ్మేని◊తోరంపుసిరి పద్మి,నుల మానగతి నెల్లఁ ◊దలఁగఁ జేయు,
నేసద్గుణాంభోధి◊భాసురదానవై,ఖరి బుధావళి మహో◊త్కంఠఁ గూర్చు,
నేధరోద్ధారువి◊శ్లేషణీయసమాఖ్య, భువనమాలిన్యంబు ◊పొడ వడంచు,
తే. నమ్మహాభావుఁ డీతఁ డో◊యబ్జపత్ర, బాంధవన్నేత్ర! సకలభూ◊భరణశాలి
వీనిపై నీమనం బిప్పు◊డూనఁ జేసి, యతనుసామ్రాజ్యసంలబ్ధి ◊నతిశయిలుము. 123

టీక: ఏలోకమిత్రుధామాలోకము – ఏలోకమిత్రు=జగన్మిత్రుఁడగు నే సుచంద్రునియొక్క, ధామాలోకము=ప్రతాపముయొక్క దీప్తి; అరిరాజసమ్మోదవర్ధనచ్ఛాయన్ – అరిరాజ=శత్రురాజులయొక్క,సమ్మోద=సంతసముయొక్క,వర్ధన=ఛేదనము యొక్క, ఛాయన్=రీతిచేత; వెలయున్=ప్రకాశించునో; ఏలోకమిత్రు=ఏ సూర్యునియొక్క, ధామాలోకము=తేజఃప్రకాశము, అరిరాజ=జక్కవలయొక్క,సమ్మోద=సంతసముయొక్క,వర్ధన=అభివృద్ధియొక్క, ఛాయన్=రీతిచేత; వెలయున్= ప్రకాశించునోయను నర్థము దోఁచుచున్నది;
ఏరాజు నెమ్మేనితోరంపుసిరి – ఏరాజు=ఏసుచంద్రునియొక్క, నెమ్మేని=సుందరమగు శరీరముయొక్క,తోరంపు=అధికమగు; సిరి=కాంతి; పద్మినుల మానగతిన్=పద్మినీజాతిస్త్రీలయొక్క యభిమానగతిని; ఎల్లన్=సర్వము; తలఁగఁ జేయున్=పోఁ గొట్టునో; చంద్రునియొక్క తోరంపుసిరి పద్మలతయొక్క గర్వాతిశయమును పోఁగొట్టు నను నర్థము దోఁచుచున్నది;
ఏసద్గుణాంభోధిభాసురదానవైఖరి – ఏసద్గుణాంభోధి=మంచిగుణములకు సముద్రుఁడగు నే సుచంద్రునియొక్క, భాసుర=ప్రకాశించుచున్న, దాన=త్యాగముయొక్క,వైఖరి=రీతి; బుధావళిమహోత్కంఠన్ – బుధావళి=విద్వద్బృందముయొక్క, మహోత్కంఠన్=అధికమైన సంతోషమును; కూర్చున్=కలుఁగఁజేయునో; భాయుక్తమై, అసుర=రక్కసులయొక్క, దాన=ఖండనముయొక్క, వైఖరి=రీతి, బుధావళి=దేవతాసమూహమునకు, మహోత్కంఠతను గూర్చు నని గాని ప్రథమార్థము; సద్గుణ =మంచిగుణములుగల, అంభోధి=సముద్రునియొక్క,భా=కాంతియుక్తమగు, సురదాన= అమృతదానముయొక్క,వైఖరి= రీతి, బుధావళి=దేవబృందమునకు, మహోత్కంఠను గూర్చు నను ద్వితీయార్థము స్ఫురించుచున్నది;
ఏధరోద్ధారువిశ్వైషణీయసమాఖ్య – ఏధరోద్ధారు=ఏరాజుయొక్క,విశ్వ=లోకమునకు, ఏషణీయ=కోరదగిన,సమాఖ్య= కీర్తి; భువనమాలిన్యంబు – భువన=లోకములయొక్క, మాలిన్యంబు=పాపమును, నైల్యమును; పొడవడంచున్=రూపుమాపునో; ఏధరోద్ధారు=ఏయాదికూర్మముయొక్క, విశ్వైషణీయసమాఖ్య, భువనమాలిన్యంబు=జలమాలిన్యమును, పొడవడంచు నను నర్థము దోఁచుచున్నది;
అమ్మహాభావుఁడు=అట్టి గొప్పమనసుగలవాఁడు; ఈతఁడు=ఈసుచంద్రుఁడు; ఓయబ్జపత్రబాంధవన్నేత్ర = ఓతామరపత్రములకు చుట్టమగు నేత్రములుగలదానా! కమలదళములకు సమానములగు నేత్రములుగలదానా యని తాత్పర్యము, సగోత్రజ్ఞాతిబాంధవాదిశబ్దములు ఇవార్థకము లని యిదివఱలో వ్రాయఁబడి యున్నది; సకలభూభరణశాలి – సకల=సమస్తమగు, భూ= భూమియొక్క, భరణ=భరించుటచేత,శాలి=ప్రకాశించువాఁడు; వీనిపైన్=ఈరాజునందు; నీమనంబు=నీయొక్క మనస్సును; ఇప్పుడు=ఈతఱి; ఊనఁ జేసి=పొందునటులు చేసి; అతనుసామ్రాజ్యసంలబ్ధిన్ – అతను=అధికమగు, సామ్రాజ్య=సమ్రాట్టుతనముయొక్క, సంలబ్ధిన్=ప్రాప్తిచేత; అతను=మన్మథునియొక్క, సామ్రాజ్యసంలబ్ధిచే నని యర్థము దోఁచుచున్నది; అతిశయిలుము = అత్యుత్కర్షముగా నుండుము.

ఏరాజుయొక్క ప్రతాపము శత్రురాజులయొక్క సంతసమును గూల్చుచున్నదో, ఏరాజుయొక్క సౌందర్యాతిశయము పద్మినీజాతిస్త్రీలయొక్క మానమును తొలఁగఁజేయునో, ఏరాజుయొక్క దానవైఖరి పండితులకు నుత్కంఠకరమగుచున్నదో, ఏరాజుకీర్తి జగన్మాలిన్యమును పోనాడునో అట్టి ప్రసిద్ధిని బొందినవాఁడు వీఁడే గాన వీని వరియించి, యతనుసామ్రాజ్యసుఖము నొందుము అని భావము.

తే. సకలనుత్యకళాశాలి ◊సౌరవంశ, మౌళి నిమ్మేటి వరియింపు ◊మామకోక్తి
నీమనఃపద్మ మామోద◊నిభృతి మీఱ, బింబవిమతోష్ఠి! యింక వి◊లంబ మేల. 124

టీక: సకలనుత్యకళాశాలిన్ – సకల=సమస్తజనులచేత,నుత్య=కొనియాడఁదగిన,కళా=విద్యలచేత,శాలిన్=ప్రకాశించువాఁడగు; సౌరవంశమౌళిన్ =సూర్యవంశశ్రేష్ఠుఁడగు, ఇమ్మేటిన్=ఈయధికుని; మామకోక్తిన్=నావచనముచేత;నీమనఃపద్మము = నీమనోంబుజము; ఆమోదనిభృతిన్=సంతసము వహించుటచే; మీఱన్=అతిశయించునట్లు; వరియింపు=కోరుము; బింబవిమతోష్ఠి=దొండపండునకు విరోధి యగు నధరముగలదానా! ఇంకన్=ఇంకను; విలంబ మేల= తడవేల?

వ. అని యాలోకజనని యానతిచ్చిన, నాచంద్రిక తత్సుచంద్రరాజచంద్ర సద్గుణగణశ్రవణసంజాయమాన కౌతూహలయును, దన్మహిపవర్య సౌందర్యలహరీపరివర్తమానలోచనమీనయును, దల్లోకరమణాలోక సముజ్జృంభమాణసాత్త్వికభావ సంభావితయును, దజ్జనేంద్రసమీపస్థితిప్రకార సంఫుల్ల్యమానలజ్జాంకుర యును, దన్మనోనాయక సంవరణసముద్వేగవలమానమానసయును నై, యమ్మహాదేవిముఖంబు గన్గొని తదనుజ్ఞాగౌరవంబున.

టీక: అని=పూర్వోక్తప్రకారముగ; ఆలోకజనని=జగన్మాత యగు నాపార్వతీదేవి; ఆనతిచ్చినన్=సెలవీయఁగా; ఆచంద్రిక; తత్సుచంద్రరాజచంద్ర సద్గుణగణ శ్రవణ సంజాయమాన కౌతూహలయును– తత్సుచంద్రరాజచంద్ర =రాజశ్రేష్ఠుఁడగు నా సుచంద్రునియొక్క, సద్గుణగణ=సుగుణబృందముయొక్క, శ్రవణ=వినుటవలన,సంజాయమాన=పుట్టిన, కౌతూహలయును =సంతసము గలదియు; తన్మహిపవర్య సౌందర్యలహరీ పరివర్తమాన లోచనమీనయును– తన్మహిపవర్య=ఆరాజశ్రేష్ఠుని యొక్క, సౌందర్యలహరీ=చక్కఁదనమను ప్రవాహమందు, పరివర్తమాన=తిరుగుచున్న, లోచనమీనయును=కన్నులను చేఁపలు గలదియును; తల్లోకరమ ణాలోక సముజ్జృంభమాణ సాత్త్వికభావ సంభావితయును– తల్లోకరమణ=ఆరాజుయొక్క, ఆలోక=దర్శనముచేత, సముజ్జృంభమాణ=ఉప్పొంగుచున్న,సాత్త్వికభావ=సాత్త్వికభావములచేత,సంభావితయును= సంభావింపఁబడినదియును, సాత్త్వికభావము లనఁగా నాయికానాయకులయొక్క పరస్పరదర్శన స్పర్శనాదులచే నుదయించు స్తంభాదులు, అవి, 'శ్లో. తే స్తమ్భ స్వేద రోమాఞ్చా స్స్వరభేద శ్చ వేపథుః।వైవర్ణ్య మశ్రు ప్రళయా వి త్యష్టౌ పరికీర్తితాః' అని సింగ భూపాలీయములోఁ జెప్పఁబడియున్నవి; తజ్జనేంద్ర సమీపస్థితి ప్రకార సంఫుల్ల్యమాన లజ్జాంకురయును– తజ్జనేంద్ర= ఆరాజేం ద్రునియొక్క, సమీపస్థితి=సమీపమునందుండుటయొక్క, ప్రకార=రీతిచేత, సంఫుల్ల్యమాన=వికసించిన, లజ్జాంకుర యును = సిగ్గుమొలకలు గలిగినదియును; తన్మనోనాయక సంవరణ సముద్వేగ వలమాన మానసయును– తన్మనోనాయక =ఆసుచం ద్రునియొక్క,సంవరణ=వరియించుటవలన నయిన, సముద్వేగ=అవ్యవస్థితచిత్తతచేత, వలమాన=కదలుచున్న, మానసయును=చిత్తము గలదియును; ఐ=అయినదియై; ఆమ్మహాదేవిముఖంబు=ఆపార్వతీదేవిముఖమును; కన్గొని=చూచి; తదనుజ్ఞాగౌరవంబునన్=ఆపార్వతీదేవియొక్క ఆజ్ఞాగౌరవముచేత, దీని కుత్తరపద్యముతో నన్వయము.

చ. కనకవిమాన మప్డు డిగి ◊కన్గొని సర్వనరేంద్రలోకము
లమనమున వేడ్క నిండఁ గయి◊లా గొసఁగం గిరిరాజకన్య యా
ఘననిభవేణి తన్మహిత◊కాంచనమంచక మెక్కి నిల్పె నా
మనుజకులేంద్రుకంఠమున ◊మంజులమంగళపుష్పదామమున్. 126

టీక: కనకవిమానము=సువర్ణవిమానమునుండి; అప్డు=ఆసమయమందు; డిగి =దిగి; సర్వనరేంద్రలోకము = సమస్తరాజులు;

కన్గొనన్=చూడఁగా; మనమునన్=హృదయమందు; వేడ్క=సంతసము; నిండన్=నిండఁగా; గిరిరాజకన్య=పార్వతీదేవి; కయిలా గొసఁగన్=కైదండ నొసఁగగా; ఆఘననిభవేణి =మేఘమువంటి జడగల యాచంద్రిక;తన్మహితకాంచనమంచకము– తత్=ఆసుచంద్రునియొక్క, మహిత=పూజితమగు, కాంచనమంచకము=బంగరుమంచమును;ఎక్కి=ఆరోహించి; ఆమనుజ కులేంద్రుకంఠమునన్=ఆరాజశ్రేష్ఠుని గళమునందు; మంజులమంగళపుష్పదామమున్—మంజుల=మనోజ్ఞమగు, మంగళ= శుభప్రదమగు, పుష్పదామమున్=పూదండను; నిల్పెన్=ఉంచెను.

అనఁగ చంద్రిక తనవిమానము దిగి రాజు లెల్లరు చూచుచుం డఁగ సుచంద్రునిమంచము నెక్కి యతనికంఠమందు మంగళప్రద మగు పూదండ నుంచె నని భావము.

ఉ. ఆవనజాక్షి యాతఱి న◊జాంగనయానతిఁ దత్సుచంద్రధా
త్రీవిభుని న్వరించి యల◊రె న్నలు భైమి యనంగ సమ్మద
శ్రీ వెలయంగఁ జిత్తముల ◊జిష్ణువిరోచనసూర్యసంతతీ
రావరు లెల్ల సమ్మతిఁ గ◊రంబు మనంబున సంతసిల్లఁగన్. 127

ఉ. ఆవనజాక్షి =ఆచంద్రిక;ఆతఱిన్=ఆసమయమందు; అజాంగనయానతిన్ – అజ=శంకరునికి, అంగన=కాంతయగు పార్వతీదేవియొక్క, ‘అజా విష్ణు హర చ్ఛాగాః’ అని యమరుఁడు,ఆనతిన్=ఆజ్ఞచేతను; తత్సుచంద్రధాత్రీవిభునిన్= ఆ సుచంద్రభూపతిని; నలున్=నలమహారాజును; భైమి యనంగన్=దమయంతి యన్నట్లు;వరించి; సమ్మదశ్రీవెలయంగన్– సమ్మద=సంతసముయొక్క,శ్రీ=అతిశయము, వెలయంగన్=ప్రకాశింపఁగా; చిత్తములన్=మనములందు; జిష్ణు విరోచన సూర్య సంతతీరావరు లెల్లన్ – జిష్ణు=జయశీలురగు,విరోచన=చంద్రునియొక్క,సూర్య=ఆదిత్యునియొక్క, సంతతి= కులముగల, ఇరావరులు=భూపతులు, ఎల్లన్=అందఱును; సమ్మతిన్=అంగీకారముచేత; కరంబు=మిక్కిలి;మనంబునన్ = మనసునందు; సంతసిల్లఁగన్=సంతోషింపఁగా; అలరెన్=ఒప్పెను.

ఆచంద్రిక పార్వతీదేవి యాజ్ఞవలన నలుని దమయంతి వరించినట్లు సుచంద్రుని వరియించి, సూర్యచంద్రవంశపురాజు లెల్ల సంతసింపఁగా నొప్పారె నని భావము.

ఉ. నించిరి వేలుపుల్ ప్రియము◊నిక్కఁగఁ గ్రొవ్విరిసోన చక్క దీ
వించిరి తాపసాధిపు ల◊వేలమృదంగరవాళి మించ సం
ధించిరి నాట్యవృత్తి సుర◊నీరజనేత్రలు చిత్తవీథి మో
దించిరి సర్వదేశజగ◊తీరమణుల్ నిరసూయ మెచ్చఁగన్. 128

టీక: వేలుపుల్=దేవతలు; ప్రియము నిక్కఁగన్=సంతసము పొంగఁగా; క్రొవ్విరిసోనన్=క్రొత్తపుష్పవర్షమును; నించిరి = పూరించిరి; తాపసాధిపులు=మునీశ్వరులు;చక్కన్=బాగుగా; దీవించిరి =ఆశీర్వదించిరి; సురనీరజనేత్రలు=దేవాంగనలు; అవేలమృదంగరవాళి మించన్ – అవేల=మేరలేని, మృదంగ=మురజములయొక్క, రవ=ధ్వనులయొక్క, ఆళి=నివహము, మించన్ =అతిశయింపఁగా; నాట్యవృత్తిన్=నాట్యముయొక్క వ్యాపారమును; సంధించిరి=చేసిరి; సర్వదేశజగతీరమణుల్= అన్నిదేశముల రాజులు; నిరసూయము=అసూయయొక్కఅభావము; ఎచ్చఁగన్=అతిశయింపఁగా; చిత్తవీథిన్=మనస్సు లందు; మోదించిరి =సంతసించిరి.

మ. తనుమధ్యామణి వైచినట్టి సుమనోదామంబు వక్షస్థలిన్
గనుపట్టం బొలిచె న్దినేంద్రకులభూకాంతేశుఁ డప్పట్టునన్
ఘనతారావళికాధరుం డయినరాకాయామినీకాముకుం
డన శ్యామానయనోత్పలోత్సవకరోదారప్రభాసంభృతిన్. 129

టీక: తనుమధ్యామణి=సన్న నినడుముగల స్త్రీలలో శ్రేష్ఠురాలైన చంద్రిక; వైచినట్టి=వేసినట్టి; సుమనోదామంబు=పూదండ; వక్షస్థలిన్=ఎదయందు; కనుపట్టన్=కానవచ్చుచుండఁగా; దినేంద్రకులభూకాంతేశుఁడు=సూర్యవంశరాజశ్రేష్ఠుఁడైన సుచంద్రుఁడు; అప్పట్టునన్=ఆసమయమందు;ఘనతారావళికాధరుండు – ఘన=గొప్పలైన, తారావళికా=నక్షత్రపంక్తులను, ధరుండు = ధరించినవాఁడు;అయిన=ఐనట్టి; రాకాయామినీకాముకుండు=పూర్ణచంద్రుఁడు; అనన్=అన్నట్లుగా; శ్యామానయనోత్పలోత్సవ కరోదారప్రభాసంభృతిన్ – శ్యామా=చంద్రికయొక్క, రాత్రియొక్క, నయనోత్పల=కలువలవంటికన్నులకు, కన్నులైన కలువల కని రాత్రిపరమైన యర్థము, ఉత్సవకర=అనందకరమగు, ఉదార=ఉత్కృష్టమగు, ప్రభా=కాంతియొక్క,సంభృతిన్ = భరణముచేతను; పొలిచెన్=ఒప్పెను. చంద్రిక వేసిన పూదండ వక్షస్థలమందుఁ బ్రకాశించుచుండఁగా, సుచంద్రుడు రిక్కల గుంపుతోఁ గూడిన పూర్ణచంద్రునివలె ప్రకాశించె నని తాత్పర్యము. ఉత్ప్రేక్షాలంకారము.

మ. వికసచ్చంద్రకలాపయుక్త యయి ఠీవి న్దేవయోషామణి
ప్రకరంబు ల్గొలువంగఁ జేరి యలగోత్రాభృత్కలాధీశక
న్యక తన్నప్డు వరింపఁ దత్కుసుమమాలాప్తి న్విరాజిల్లె సూ
ర్యకులోత్తంసము సద్గణోత్సవము లారఁ న్దక్షిణామూర్తి నాన్. 130

టీక: వికసచ్చంద్రకలాపయుక్తయయి – వికసత్=ప్రకాశించుచున్న, చంద్రకలాప=సువర్ణభూషణములతో,యుక్తయయి= కూడుకొన్నదై; ప్రకాశించుచున్న, చంద్రకలాప=చంద్రుఁడను భూషణముతో, యుక్తయయి అని పార్వతీపరమైన యర్థము; ఠీవిన్=వైభవముతో; దేవయోషామణిప్రకరంబుల్ – దేవయోషామణి=రాజస్త్రీలయొక్క,ప్రకరంబుల్=సమూహములు; దేవయోషామణి=దివ్యస్త్రీరత్నములయొక్క, ప్రకరంబుల్=సమూహము లని పార్వతీపరమైన యర్థము; కొలువంగన్=సేవించుచుండఁగా; చేరి=సమీపించి; అలగోత్రాభృత్కలాధీశకన్యక – అల=ఆ, గోత్రాభృత్కలాధీశ=భూపాలచంద్రుఁడైన క్షణదోదయునియొక్క, కన్యక=కూతురగు చంద్రిక; ఆప్రసిద్ధహిమవంతునికూఁతు రగు పార్వతీదేవి; తన్ను; అప్డు; వరింపన్=కోరఁగా; తత్కుసుమమాలాప్తిన్ – తత్కుసుమమాలా=ఆపూదండయొక్క, ఆప్తిన్=ప్రాప్తిచేత; సూర్యకులోత్తంసము =సూర్యవంశజులందు శ్రేష్ఠుఁడైన సుచంద్రుఁడు;సద్గణోత్సవము – సద్గణ=విద్వత్సంఘమునకు, ప్రమథగణమునకు, ఉత్సవములు=వేడుకలు; ఆరన్=అతిశయింపఁగా; దక్షిణామూర్తి నాన్=శివావతారవిశేషమో యనునట్లు; విరాజిల్లెన్=ప్రకాశించెను.

చంద్రుఁడు భూషణముగాఁ గల పార్వతీదేవిచే దివ్యస్త్రీలు సేవించుచుండఁగా వరియింపఁబడిన దక్షిణామూర్తియో యనునట్టు లీచంద్రికచే వరియింపఁబడిన సుచంద్రుఁడు ప్రకాశించె నని భావము. ఈపద్యమందు నుత్ప్రేక్షాలంకారము.

చ. మగువ దవిల్చినట్టి సుమమాలికతావికిఁ జేరు తేఁటిదం
టగమిరొద ల్సెలంగెఁ బొగడ న్మలినాత్మత మున్ను మన్మథా

నుగుణత నేఁచు మంతువు గ◊నుంగొనక కిష్టసుమార్పణంబుచేఁ
దగ మముఁ బ్రోవవే యనుచుఁ ◊దత్పతికై వివరించుపోలికన్. 131

టీక: మగువ దవిల్చినట్టి సుమమాలిక తావికిన్– మగువ=చంద్రిక; తవిల్చినట్టి=తగిలించినట్టి (వేసినట్టి), సుమమాలిక=పూదండయొక్క, తావికిన్=పరిమళమునకు; చేరు తేఁటిదంటగమిరొదల్ – చేరు=సమీపించిన, తేఁటిదంట=తుమ్మెదదంటల యొక్క, గమి=సమూహముయొక్క,రొదల్=ధ్వనులు; పొగడన్=పొగడఁగా; మలినాత్మతన్=కుటిలచిత్తముచేత, నల్లని దేహకాంతిచేత నని స్వభావార్థము; మున్ను=పూర్వమందు; మన్మథానుగుణతన్—మన్మథ=మదనునికి, అను=అనుసరించిన, గుణతన్=అల్లెత్రాడగుటచేత, మన్మథున కనుకూలము లగుటచేత నని స్వభావార్థము; ఏఁచు మంతువు =శ్రమపెట్టిన యపరాధమును; కనుంగొనక=చూడక, గణింపక యనుట; ఇష్టసుమార్పణంబుచేన్– ఇష్ట=అనుకూలమగు, సు=లెస్స యగు,మా=సంపదయొక్క, అర్పణంబుచేన్=సమర్పణముచేత, ఇష్టమగు ద్రవ్యమును కానుకగా నిచ్చుటచేత నని తాత్పర్యము; అనుకూల సుమార్పణచేత నని స్వభావార్థము;తగన్=తగునట్లుగ; మమున్=మమ్ము; ప్రోవవే యనుచున్=కాపాడవే యనుచు;తత్పతికై =ఆసుచంద్రునకై; వివరించుపోలికన్=చెప్పుచున్నట్లుగా; చెలంగెన్ = ప్రకాశించెను;

చంద్రిక సుచంద్రుని కంఠమందు వైచిన పూదండతావికిఁ జేరియున్న తుమ్మెదలగుంపులరొదలు, పూర్వము సుచంద్రుని విరహకాలమందు మలినాత్మతచే ననఁగఁ గుటిలచిత్తముచేత మన్మథానుగుణతచే బాధించిన యపరాధమును, కానుకగా సుమార్పణము చేసి మన్నింపు మని యానరపతిం బ్రార్థించుచున్నటు లొప్పె నని భావము.

చ. నరపతిదేహదీప్తి సుమ◊నస్సరవల్లరి శోణభాధురం
ధర యయి చూడ రాజిలె నె◊దం దను నేలఁ దలంచుచంద్రికా
తరుణికటాక్షభాస్వదమృ◊తచ్ఛట పర్వఁగ నిల్వ లేక దు
ష్కరమదనాస్త్రపావకశి◊ఖాలత వెల్వడుదారిఁ బూనుచున్. 132

టీక: నరపతిదేహదీప్తిన్—నరపతి=సుచంద్రునియొక్క, దేహదీప్తిన్=శరీరకాంతిచేత; సుమనస్సరవల్లరి=తీవవంటి పూదండ; శోణభాధురంధర యయి– శోణభా=ఎఱ్ఱనికాంతియొక్క,ధురంధర యయి =భారమును వహించినదై;చూడన్=చూడఁగా; ఎదన్=హృదయమందు; తనున్=తన్ను; ఏలన్=పోషింపను; తలంచుచంద్రికాతరుణికటాక్షభాస్వదమృతచ్ఛట– తలంచు = తలంచినట్టి, చంద్రికాతరుణి=చంద్రికయొక్క,కటాక్ష=అపాంగములనెడు,భాస్వత్=ప్రకాశించుచున్న,అమృతచ్ఛట = జలపుంజము;పర్వఁగన్=ప్రసరింపఁగా; నిల్వ లేక=ఉండలేక; దుష్కరమదనాస్త్రపావకశిఖాలత– దుష్కర=అసాధ్యమగు, మదన =స్మరునియొక్క, అస్త్రపావక=బాణాగ్నియొక్క,శిఖాలత=తీవవంటిజ్వాల; వెల్వడుదారిన్=వెళ్ళివచ్చినరీతిని; పూనుచున్ =ఊనుచు; రాజిలెన్=ప్రకాశించెను;

అనఁగా చంద్రిక సుచంద్రుని వక్షస్థలమం దుంచిన సుమనస్సరవల్లరి సుచంద్రుని దేహకాంతిచే నెఱ్ఱనయి , దానిం బోషించుటకై చంద్రికయొక్క కటాక్షము లనెడు జలపుంజములు పర్వఁగా , సుచంద్రుని హృదయమం దుండు మదనాగ్నియొక్క జ్వాల నిలువ లేక వెలువడినదో యనునటులు ప్రకాశించె నని భావము. సుచంద్రవక్షస్థలగతసుమమాలికను చంద్రికాకటాక్షజలసేకము చేత బహిర్గతమగుచున్న మదనాగ్నిశిఖాలతనుగా నుత్ప్రేక్షించుటచేత నిచ్చట వస్తూత్ప్రేక్షాలంకారము.

చ. జనవరసార్వభౌమునెద (సామ్యనుబింబితమై నెలంత యుం
చిన సుమదామకంబు గనఁ (జేర్చె ముదంబు తదంతరంబునం
దెనసి కలంచునట్టి కుసు(మేషుశరాళులఁ బట్టి తెత్తుఁ జ
య్యన నిఁక నిల్వఁ జేయుదు న(టంచు వడిం జొరఁబొఱుకైవడిన్. 133

టీక: జనవరసార్వభౌమునెదన్=సుచంద్రుని వక్షస్థలమునందు; సామ్యనుబింబితమై =అర్ధము ప్రతిఫలించినదై; నెలంత ఉంచిన సుమదామకంబు=చంద్రిక యుంచిన పూదండ; కనన్=చూడఁగా;తదంతరంబునన్=ఆసుచంద్రుని యెదలోపల;ఎనసి=పొంది; కలంచునట్టి కుసుమేషుశరాళులన్ = కలఁతపఱచుచున్న సుమశరునిబాణపంక్తులను; పట్టి తెత్తున్ =పట్టుకొని తేఁగలను; చయ్యనన్=శీఘ్రముగా; ఇఁకన్=ఈమీఁద; నిల్వఁ జేయుదును=నిల్చునట్లు చేయుదును; అటంచున్=ఈరీతిఁ బలుకుచు; వడిన్=వేగముతో; చొరఁబొఱుకైవడిన్=చొరఁబడురీతిగ; ముదంబు=సంతసమును; చేర్చెన్=చేసెను.

అనఁగ సుచంద్రుని వక్షస్థలమందు చంద్రిక వైచినపూసరము సగము ప్రతిఫలించినదై, అతనిహృదయమునందు కలంచు మన్మథబాణములను వెలికిఁ దీసికొని చయ్యన రాఁగలనని హృదయమునందుఁ జొరఁబడురీతిగ ప్రకాశించె నని భావము.

చ. పుడమిమగండుదాలిచిన(పువ్వులదండ తదంగకాంతిచేఁ
గడుఁ గనకప్రసూనసర(గౌరవ మూనఁగఁ దుమ్మెద ల్భయం
బడరఁగ జాఱ సాగె నచ(లాధిపకన్య వరించె నీశునిన్
గడిమికిఁ జేర కింక నని (కంతునకు న్వివరింపనో యనన్. 134

టీక: పుడమిమగండు=భూభర్త యగు సుచంద్రుఁడు; తాలిచినపువ్వులదండ =ధరించినపూదండ;తదంగకాంతిచేన్ = ఆ సుచంద్రునియొక్క దేహకాంతిచేత; కడున్=మిక్కిలి; కనకప్రసూనసరగౌరవము— కనకప్రసూన=సంపెఁగపూవులయొక్క, సర=దండయొక్క,గౌరవము=గొప్పతనమును, అనఁగఁ దత్సామ్యము ననుట; ఊనఁగన్=పొందఁగా; తుమ్మెదల్ = భృంగములు; భయంబు=భీతి; అడరఁగన్=అతిశయింపఁగా; అచలాధిపకన్య=రాజపుత్రియగు చంద్రిక, హిమాద్రిరాజపుత్రిక యగు పార్వతి యని తోఁచుచున్నది; ఈశునిన్=రాజగు సుచంద్రుని, శంకరుని నని తోఁచుచున్నది; వరించెన్=కోరెను;కడిమికిన్= పరాక్రమమునకు; చేరకు=పోవలదు; ఇంకన్=ఈమీఁద; అని=అనుచు; కంతునకున్=మన్మథునికి; వివరింపనో యనన్ = తెలియఁజేయుటకో యనునట్లు; జాఱసాగెన్=వీడెను. సుచంద్రుఁడు ధరించినపూదండ యతని దేహకాంతిచే సంపెంగపూల దండ యని భయపడి, తుమ్మెదలు జాఱుచుండఁగా నవి సుచంద్రునిఁ జంద్రిక వరియించెఁ గాన నీవు సుచంద్రునిఁ బొడువఁ బోఁ బనిలేదని మదనునకుఁ జెప్పుటకై పోవుచున్నటు లుండె నని భావము. ఈపద్యమందు నుత్ప్రేక్షాలంకారము.

మ. ఘనపంకేరుహరాగహారరుచిరే(ఖావ్యాప్తమై యింతి వై
చిన యాక్రొవ్విరిదండ భర్తయెదఁ బొ(ల్చెన్ దన్మృగాక్షీవినూ
తనరాగేందిర చేరి యద్ధరణినే(త న్గాఁగిటం దార్చి నం
తనె కన్గో నగుతద్భుజావసులతా(ద్వంద్వైకబంధం బనన్. 135

టీక: ఘన పంకేరుహరాగ హార రుచి రేఖా వ్యాప్తమై– ఘన=అధికమైన, పంకేరుహరాగ=పద్మరాగములయొక్క, హార= సరముయొక్క, రుచి=కాంతియొక్క,రేఖా=శ్రేణిచేత,వ్యాప్తమై=పొందఁబడినదై; ఇంతి వైచిన యాక్రొవ్విరిదండ = చంద్రిక వేసిన యా పూదండ; భర్తయెదన్=సుచంద్రునివక్షమందు; తన్మృగాక్షీవినూతనరాగేందిర – తన్మృగాక్షీ=ఆచంద్రికయొక్క, వినూతన=మిక్కిలి నూతనమగు, రాగేందిర=అనురాగలక్ష్మి; చేరి=పొంది; అద్ధరణినేతన్=ఆసుచంద్రుని; కౌఁగిటన్ = కౌఁగిలి యందు; తార్చినంతనె =చేర్చుకొనినమాత్రముచేతనే; కన్గోనగు తద్భుజావసులతా ద్వంద్వైక బంధంబు అనన్ – కన్గో నగు = కనిపించుచున్న, తత్=ఆరాగేందిరయొక్క, భుజావసులతా=బంగరుదీవలవంటి భుజములయొక్క, ద్వంద్వ=జంట యొక్క, ఏక=ముఖ్యమైన, బంధంబు=బంధమో, అనన్=అనునట్లు; పొల్చెన్=ప్రకాశించెను.

సుచంద్రునికంఠమునందుఁ జంద్రిక వైచినహారము, పద్మరాగమణిసరములకాంతిచే వ్యాప్తమై సుచంద్రునివక్షమునందు, నా చంద్రికరాగలక్ష్మి చేరి సువంద్రునిఁ గౌఁగిలింపఁగాఁ గానవచ్చు రాగేందిర బాహులతాయుగమో యనం బ్రకాశించెనని భావము. ఈపూసరమును సుచంద్రునిఁ గౌఁగిలించిన రాగేందిర భుజాద్వంద్వము నా నుత్ప్రేక్షించుటచే వస్తూత్ప్రేక్షాలంకారము.

చ. అలవిరిదండచాయ కర ◊మయ్యెడఁ బర్వఁగఁ దన్నృపాలహా
రలతలచాయ గాంచఁగ వి◊రాజిల దయ్యెఁ దలంప నౌ విని
ర్మలమహిరాట్సుతాంచితక◊రస్థితి మించుచుఁ జేరువారి మేల్
చెలువముచెంగటన్ ధరణిఁ ◊జిల్లరపేరులవన్నె హెచ్చునే. 136

టీక: అలవిరిదండచాయ=ఆపూదండకాంతి; కరము=మిక్కిలి; అయ్యెడన్=ఆసమయమందు; పర్వఁగన్=వ్యాపింపఁగ; తన్నృపాలహారలతలచాయ– తన్నృపాల=ఆసుచంద్రునియొక్క, హారలతలచాయ=లతలవంటి హారములయొక్క కాంతి; కాంచఁగన్=చూడఁగ; విరాజిల దయ్యెన్=ప్రకాశింపదాయెను; తలంపన్=విచారింపఁగా; ఔన్=యుక్తమే యగును, ప్రకాశింపక యుండ యుక్తమే యనుట, ఏలనన; వినిర్మలమహిరాట్సుతాంచితకరస్థితిన్– వినిర్మల=స్వచ్ఛమగు,మహి రాట్సుతా=చంద్రికయొక్క, అంచిత=ఒప్పుచున్న, కర=హస్తమందు, స్థితిన్=వాసముచేత; మించుచున్=అతిశయించుచు; చేరువారి మేల్ చెలువముచెంగటన్– చేరువారి = పొందినవారియొక్క, మేల్=శ్రేష్ఠమగు, చెలువము=కాంతియొక్క,చెంగటన్ =సమీపమందు; ధరణిన్=పుడమియందు; చిల్లరపేరులవన్నె= స్వల్పహారములయొక్క కాంతి;హెచ్చునే=అతిశయించు నా? గొప్పపేరుల చెంగట, చిల్లరపేరుల= చిల్లరనామములయొక్క, వన్నె=కాంతి, హెచ్చునా యని తోఁచుచున్నది.

చంద్రిక సుచంద్రునియం దుంచిన పూదండకాంతిముందర, నితరములగు సరములకాంతి ప్రకాశింపదు. అట్లు ప్రకాశింప కుండుట యుక్తమని ద్వితీయవాక్యముచే సమర్థించుచున్నాడు. ఎటులనఁగా చంద్రికకరమం దునికిచే మించుకాంతి గలవారి యొద్ద చిల్లరపేరులకాంతి యతిశయించునా? అతిశయింప దనుట. సామాన్యముచే విశేషసమర్థనరూపమగు నర్థాంతరన్యాసా లంకారము.

మ. హరిమధ్యార్పితసూనదాముఁడయి గో◊త్రాధీశ్వరుం డత్తఱిన్
జిరకాలేహితకాంక్ష యంతయును దం◊జేరం బ్రమోదాశ్రుసం
భరితాక్షిద్వయితో గళద్విరహతా◊పశ్రీకచిత్తంబుతో
నురురోమాంచపినద్ధవిగ్రహముతో ◊నొప్పూనెఁ జిత్రంబుగన్. 137

టీక: గోత్రాధీశ్వరుండు=సుచంద్రుఁడు;హరిమధ్యార్పితసూనదాముఁడయి– హరిమధ్యా=సింహమధ్యము గల చంద్రికచేత, అర్పిత=ఉంచఁబడిన,సూనదాముఁడయి=పూదండగలవాఁడయి; అత్తఱిన్=ఆసమయమందు; చిరకాలేహితకాంక్ష యంత యును– చిరకాల=బహుకాలమునుండి, ఈహిత=కోరఁబడిన,కాంక్ష=కోరిక, అంతయును=సమస్తమును; తన్=తనను; చేరన్=పొందఁగా; ప్రమోదాశ్రుసంభరితాక్షిద్వయితోన్=ఆనందబాష్పములతో నిండిన కనుదోయితో; గళద్విరహతాపశ్రీక చిత్తంబుతోన్– గళత్=జాఱినట్టి,విరహతాప=విరహాగ్ని తాపముయొక్క, శ్రీక=అతిశయముగల, చిత్తంబుతోన్=మనస్సుతో; ఉరురోమాంచపినద్ధవిగ్రహముతోన్– ఉరు=అధికమైన,రోమాంచ=గగుర్పాటుచేత,పినద్ధ=కప్పఁబడిన,విగ్రహముతోన్ = శరీరముతోడ; చిత్రంబుగన్=ఆశ్చర్యముగ; ఒప్పారెన్=ఒప్పిదమును పొందెను.

వ. అయ్యెడ నయ్యగరాజకుమారి యాసప్తసముద్రమధ్యరాజలోక వర్ణనాసమయోరరీకృత మానుషా కారంబు దూరంబు కావించి, యుదంచిత చంచరీకకులాకర్షణప్రకార భావసంమిళిత పరిమళమిళిత పారి జాతకుసుమమాలికాసంవేష్టితవేణీకలాపయును, జూడావలంబితచూడారత్నాయమానతారావరయును, భుజాచతుష్టయసంభృతపాశాంకుశరసాలశరాసనప్రసవరోపయును, నిజచరణసరసిజ భజనాపరాయణ సకలభువనజనోపబహిర్నిర్గతానురాగమోహద గౌరాంగరాగయును, ఆత్మోపఘన ఘనప్రభాలింగిత దివ్యమణిభూషణపూగయును, సముజ్జ్వలజ్జ్వలనమయనయనకలిత ఫాలభాగయును నగుచు జగద ద్భుతతేజోవిలసనంబున నమ్మహారాజేంద్రుముంగల నిలిచి, మంగళకరంబులగు ననేకవరంబు లొసంగి, వెండియును బావకవిబుధమహౌన్నత్యతంత్రం బగు నొక్కమంత్రంబు దెలుపం దలఁచి యానృపతి కిట్ల నియె. 138

టీక: అయ్యెడన్=ఆసమయమందు; అయ్యగరాజకుమారి=ఆపార్వతీదేవి; ఆసప్తసముద్రమధ్య రాజలోక వర్ణనాసమయోరరీ కృత మానుషాకారంబు– ఆసప్తసముద్రమధ్య=సప్తసముద్రములమధ్యమందున్న, రాజలోక=నృపులయొక్క,వర్ణనాసమయ =స్తుతిసమయమందు, ఉరరీకృత=అంగీకరింపఁబడిన, మానుషాకారంబు=మనుష్యాకృతిని; దూరంబు కావించి =సడలించి; ఉదంచిత చంచరీకకు లాకర్షణప్రకార భావ సంమిళిత పరిమళ మిళిత పారిజాతకుసుమ మాలికా సంవేష్టిత వేణీకలాపయును – ఉదంచిత=ఒప్పుచున్న, చంచరీకకుల=తుమ్మెదగుంపులయొక్క, ఆకర్షణప్రకార=ఆకర్షించురీతిగలదానియొక్క, భావ= ధర్మముచేత, సంమిళిత=కూడుకొన్న, పరిమళ=వలపుచేత,మిళిత=కూడుకొన్న, పారిజాతకుసుమ=పారిజాతపుష్పంబుల యొక్క, మాలికా=దండచేత, సంవేష్టిత=చుట్టఁబడిన, వేణీకలాపయును=వేణీభూషణముగలదియును,
చూడావలంబిత చూడారత్నాయమాన తారావరయును– చూడావలంబిత=కొప్పు నాశ్రయించిన, చూడారత్నాయమాన= చూడామణివలె నాచరించుచున్న, తారావరయును=చంద్రుఁడు గలదియును;
భుజాచతుష్టయ సంభృత పాశాంకుశ రసాలశరాసన ప్రసవరోపయును– భుజాచతుష్టయ=నలుభుజములచేత, సంభృత= భరింపఁబడిన, పాశ=పాశాయుధమును, అంకుశ=అంకుశమును,రసాలశరాసన=చెఱకువిల్లును, ప్రసవరోపయును=పుష్ప బాణములు గలదియును;
నిజ చరణసరసిజ భజనా పరాయణ సకలభువన జనోపబహి ర్నిర్గ తానురాగ మోహద గౌరాంగరాగయును– నిజ=స్వకీయ మగు, చరణసరసిజ=పాదకమలములయొక్క, భజనా=సేవయందు, పరాయణ=ఆసక్తులగు, సకలభువన=సమస్తలోకము

లందుండు, జన=జనులయొక్క, ఉపబహిః=బాహ్యోపకంఠమందు, నిర్గత=వెడలిన, అనురాగ=ప్రేమయొక్క, మోహద=భ్రాంతి నిచ్చుచున్న, గౌర=ఎఱ్ఱనైన, అంగరాగయును=అనులేపనము గలదియును;

ఆత్మోపఘన ఘనప్ర భాలింగిత దివ్య మణిభూషణ పూగయును– ఆత్మ=తనయొక్క, ఉపఘన=శరీరముయొక్క, ఘన ప్రభా =అధికకాంతిచేత, ఆలింగిత=కౌఁగిలింపఁబడిన, దివ్య=శ్రేష్ఠమగు, మణిభూషణ=రత్నమయములగు నాభరణముల యొక్క, పూగయును=సమూహముగలదియును;

సముజ్జ్వల జ్వలనమయ నయన కలిత ఫాలభాగయును– సముజ్జ్వలత్=మిక్కిలి ప్రకాశించుచున్న,జ్వలనమయ = అగ్ని మయమగు, నయన=నేత్రముచేత,కలిత=ఒప్పుచున్న,ఫాలభాగయును=ఫాలస్థలముగలదియును, అగుచున్=అయినదై; జగ దద్భుత తేజో విలసనంబునన్– జగత్=లోకములకు, అద్భుత=ఆశ్చర్యకరమగు,తేజః=తేజస్సుయొక్క, విలసనంబు నన్ =ప్రకాశము చేత; అమ్మహారాజేంద్రుముంగలన్=ఆసుచంద్రునియెదుట; నిలిచి=నిలుచుండి; మంగళకరంబులు= శుభ కరంబులు; అగు=అయినట్టి; అనేకవరంబులు=పెక్కువరములను; ఒసంగి=ఇచ్చి; వెండియును=మఱియును; పావకవిబుధ మహౌన్నత్య తంత్రంబు– పావక=పవిత్రమగు, విబుధ=దేవతలయొక్క, మహౌన్నత్య=గొప్ప యతిశయమునకు,తంత్రంబు =ముఖ్యకారణము; అగు=అయినట్టి; ఒక్కమంత్రంబు=ఒక మంత్రమును; తెలుపన్=ఉపదేశించుటకు; తలఁచి=సమకట్టి; ఆ నృపతికిన్=ఆరాజునకు (సుచంద్రునికి) ఇట్లనియె=వక్ష్యమాణప్రకారముగఁ బలికెను.

మ. నిరవద్యంబయి, నిష్కలంకమహమై, ॰నిర్వాపితాఘౌఘమై,
హరమాయాలవకాంచితాత్మమయి, ని॰త్యంబై, మహేంద్రాదిని
ర్జరసేవ్యంబయి, యిష్టదంబయి, యజ॰స్ర మ్మొక్కమంత్రం బిలన్
అరిసంభేదన మించుఁ జుమ్ము భువనే॰శ్యాఖ్యాసముజ్జృంభియై. 139

టీక: నిరవద్యంబయి=నిర్దుష్టమై, నిష్కలంకమహమై=పాపరహితమగు తేజముగలదై; నిర్వాపితాఘౌఘమై =పోగొట్టఁబడిన పాపబృందముగలదై; హరమాయాలవకాంచితాత్మమయి– హర=గగనముచేత,మాయా=శక్తిచేత,లవక=అంకుశముచేత, బీజత్రయముచేత ననుట, అంచిత=ఒప్పుచున్న,ఆత్మమయి=స్వరూపముగలదియై; నిత్యంబై=అవ్యయమైనదై; మహేంద్రాది నిర్జరసేవ్యంబయి =ఇంద్రుఁడు మొదలుగాఁగల దేవతలచేత సేవింపఁదగినదియై; అజస్రమ్ము=ఎల్లపుడు; ఇష్టదంబయి=కోరఁ బడినట్టిదాని నిచ్చునదియై; భువనేశ్యాఖ్యాసముజ్జృంభియై– భువనేశ్యాఖ్యా=భువనేశ్వరి యను పేరుచేత, సముజ్జృంభియై= అతిశయించినదియై; ఒక్కమంత్రంబు=ఒకమంత్రము; అరిసంభేదన =సుచంద్రుఁడా! ఇలన్=భూమియందు; మించున్=ఒప్పా రును; చుమ్ము=సత్యము.

ఉ. అమ్మహనీయమంత్రము ర॰సాధిప నీ కిపు డిత్తు దానిఁ గై
కొమ్ము త్వదీహితమ్ము లొన॰గూర్చుఁ బఠించినమాత్రఁ దత్ప్రకా
రమ్ములు సద్గురుప్రవర॰రమ్యవచోగతిచే నెఱింగి ని
త్యమ్ము జపింపుమీ దినక॰రాభ్యుదయావసరమ్ములన్ మదిన్. 140

టీక: రసాధిప =సుచంద్రుఁడా! అమ్మహనీయమంత్రము=పూజ్యమగు నామంత్రమును; నీకున్, ఇపుడు, ఇత్తున్=ఒసంగెదను; దానిన్=ఆమంత్రమును; కైకొమ్ము=గ్రహింపుము; త్వదీహితమ్ములు– త్వత్=నీయొక్క, ఈహితమ్ములు=ఇష్టార్థములను;

పఠించినమాత్రన్=చదివినమాత్రముననే; ఒనగూర్చున్=కలుఁగఁజేయును; తత్ప్రకారమ్ములు – తత్=ఆమంత్రముయొక్క, ప్రకారమ్ములు=రీతులు; సద్గురుప్రవరరమ్యవచోగతిచే నెఱింగి – సద్గురుప్రవర=సద్గురుశ్రేష్ఠునియొక్క,రమ్య=మనోజ్ఞమగు; వచోగతిచేన్=వాగ్రీతిచే,ఎఱింగి=తెలిసికొని; మదిన్=మనమునందు;నిత్యమ్ము=ప్రతిదినము; దినకరాభ్యుదయావసరమ్ములన్ – దినకర=సూర్యునియొక్క, అభ్యుదయావసరమ్ములన్=ఉదయకాలములందు;జపింపుమీ=జపింపుము. నే నుపదేశించు మంత్రమును, సద్గురువులవలన తద్విధిని జక్కగఁ దెలిసికొని ప్రతిదినమును సూర్యోదయసమయమందు జపింపుమని భావము.

చ. అని భువనేశి యామనుకు◊లాభరణమ్మున కున్న మత్కృప
న్మనుతిలకమ్ము నిచ్చి నృప◊మౌళి లలిన్ ఘటియించుమ్రొక్కు గై
కొని యలచంద్రికావనితఁ ◊గూడి హరిప్రమదాదిలేఖిక
ల్తను భజియింపఁగా నెనసెఁ ◊దత్పురరాజము సంతసంబునన్. 141

టీక: అని=ఈప్రకారము పలికి; భువనేశి=భువనేశ్వరి; ఆమనుకులాభరణమ్మునకున్=వైవస్వతమనుకులాలంకారుఁడగు నాసుచంద్రునికి; ఉన్న మత్కృపన్ – ఉన్న మత్=అతిశయించిన, కృపన్=దయచేత; మనుతిలకమ్మున్=మంత్రశ్రేష్ఠమును; ఇచ్చి =ప్రసాదించి;నృపమౌళి=సుచంద్రుఁడు; లలిన్=ప్రేమచేత; ఘటియించుమ్రొక్కున్=చేయునట్టి నమస్కృతిని;కైకొని= గ్రహించి; అలచంద్రికావనితన్=ఆచంద్రికను;కూడి=కలిసికొని; హరిప్రమదాదిలేఖికల్=హరిప్రియ యగు లక్ష్మీదేవి మున్నగు దేవాంగనలు;తనున్=తన్ను; భజియింపఁగాన్=సేవించుచుండఁగా; తత్పురరాజమున్ = ఆపట్టణశ్రేష్ఠమును; సంతసంబు నన్= కుతూహలముచేత;ఎనసెన్=పొందెను.

చ. అపుడు నిజాత్మలాలసిక ◊యంతయుఁ జేకుఱ నాసుచంద్రభూ
మిపతి నిజాప్తబంధునృప◊మిత్రజనంబులు చేరి రా సువ
ర్ణపటహరావ మెచ్చ శిబి◊రస్థలిఁ జేరె నెలంత లెల్ల న
చ్చపురతనాలయారతులు ◊చక్క నొసంగఁగ నాత్మ నుబ్బుచున్. 142

టీక: అపుడు=ఆసమయమందు; ఆసుచంద్రభూమిపతి=ఆసుచంద్రుఁడను ఱేడు; నిజాత్మలాలసిక – నిజ=తనయొక్క, ఆత్మ =మనసునందుండు, లాలసిక=అధికేచ్ఛ; అంతయున్=సర్వము; చేకుఱన్=సమకూరఁగా; నిజాప్తబంధునృపమిత్రజనంబులు – నిజ=తనసంబంధులగు, ఆప్త=ఇష్టులగు,బంధు=బాంధవులు, నృప=రాజులు,మిత్రజనంబులు=స్నేహితులు; చేరి = సమీపించి; రాన్=రాఁగా; సువర్ణపటహరావము=స్వర్ణమయమగు పటహముల ధ్వని; ఎచ్చన్=అతిశయింపఁగా; నెలంత లెల్లన్ = వనితలెల్లరును; అచ్చపురతనాలయారతులు=చొక్కమగు రత్నముల హారతులను;చక్కన్=బాగుగా; ఒసంగఁగన్=ఈయఁ గా; ఆత్మన్=మనమునందు; ఉబ్బుచున్=ఉబుకుచు,సంతసించుచు; శిబిరస్థలిన్=పటమండపప్రదేశమును; చేరెన్=పొందెను.

మ. సకలాంభోనిధిమధ్యదేశవసుధే◊శవ్రాత మవ్వేళఁ జం
ద్రిక యామేటి వరించుటల్ గరము ని◊ర్ణిద్రప్రమోదోర్మిదా
యకత న్మించఁ దదీయశోభనదిదృ◊క్షాయత్తచిత్తంబులన్
స్వకరాజచ్ఛిబిరాళిఁ జేరి నిలిచెన్ ◊సైన్యేశ్వరు ల్గొల్వఁగన్. 143

టీక: సక లాంభోనిధి మధ్య దేశ వసుధేశ వ్రాతము – సకల=సమస్తమగు, అంభోనిధి=సముద్రములయొక్క, మధ్య=మధ్య మండలి, దేశ=ప్రదేశములందున్న,వసుధేశ=రాజులయొక్క, వ్రాతము=సమూహము; అవ్వేళన్=ఆసమయమునందు; చంద్రిక; ఆమేటిన్=ఆసుచంద్రుని; వరించుటల్=కోరుటలు; కరము=మిక్కిలి; నిర్నిద్ర ప్రమోదోర్మిదాయకతన్—నిర్నిద్ర= మేల్కొన్న, ప్రమోద=సంతసముయొక్క, ఊర్మిదాయకతన్=తరంగముల నిచ్చుటచేత; మించన్=అతిశయింపఁగా; తదీయ శోభన దిదృక్షాయత్త చిత్తంబులన్ – తదీయ=ఆదంపతులసంబంధియగు,శోభన=శుభకరమగు వైవాహికాదులను, దిదృక్షా= చూచుటయందు, ఆయత్త=అధీనమగు,చిత్తంబులన్=హృదయములచేత; స్వక రాజ చ్ఛిబిరాళిన్—స్వక=తమ సంబంధి యగు, రాజత్=ప్రకాశించుచున్న, శిబిర=పటమండపములయొక్క, ఆళిన్=పంక్తిని; చేరి=పొంది; సైన్యేశ్వరుల్ = సేనాధి పతులు; కొల్వఁగన్=సేవించుచుండఁగా; నిలిచెన్ =వసించెను.

మ. జననాథేంద్రు సుచంద్రుఁ జంద్రిక వరింపన్నేఁడుగా మత్కృతా
తనుపుణ్యంబు ఫలించె నంచు ముద మాత్మన్గాంచి పాంచాలభూ
వనితావల్లభమౌళి వేగ మహిదేవశ్రేణి రావించి శో
భనలగ్నం బలరాత్రివేళ ఘటియింపం జేసె నప్పట్టునన్. 144

టీక: పాంచాలభూవనితావల్లభమౌళి =పాంచాలభూపతిశ్రేష్ఠుఁడగు నాక్షణదోదయుఁడు;జననాథేంద్రున్=రాజశ్రేష్ఠుఁడగు; సుచంద్రున్=సుచంద్రుని; చంద్రిక; వరింపన్=కోరఁగా; నేఁడుగా =ఈదినముగదా; మత్కృతాతనుపుణ్యంబు – మత్=నాచేత, కృత=చేయఁబడిన, అతను=అధికమగు, పుణ్యంబు=సుకృతము; ఫలించె నంచున్=పండె ననుచు; ముదము=సంతసమును; ఆత్మన్=హృదయమునందు; కాంచి=పొంది; వేగ=శీఘ్రముగ;మహిదేవశ్రేణిన్=బ్రాహ్మణబృందమును; రావించి=రప్పించి; శోభనలగ్నంబు=శుభలగ్నమును; అలరాత్రివేళన్=ఆరాత్రియందె; అప్పట్టునన్=ఆసమయమందు; ఘటియింపన్=ఏర్ప అచునట్లు; చేసెన్=ఒనరించెను.

ఆశ్వాసాంతపద్యములు

మ. తనుభానారద! నారదాదివినుతోద్దామాహవప్రక్రియా
ఘనతాశారద! శారదాపకృతజాగ్రద్గోపవత్సప్రగో
పనభాసారద! సారదానవభిదాప్రాంచద్యశోనిర్జితా
తనుసత్పారద! పారదాత్మచరితధ్వస్తాఖిలాఘోదయా! 145

టీక: తనుభానారద=దేహకాంతిచేత మేఘమువంటివాఁడా! నారదాది విను తోద్దా మాహవప్రక్రియాఘనతా శారద – నారదాది =నారదుఁడు మొదలుగాఁగలవారిచేత, వినుత=ప్రశంసింపఁబడిన,ఉద్దామ=మిక్కిలిగొప్పయగు,ఆహవ=యుద్ధముయొక్క, ప్రక్రియా=ప్రసంగమందు, ఘనతా=ఆధిక్యముచేత,శారద=నూతనమైనవాఁడా! 'శారదః పీతమన్దే నాప్రత్యగ్రేఽభినవే త్రిషు' అని రత్నమాల; పరులతో రణము సలుపుతఱి నితఁడు అపూర్వముగ నగపడునట్టివాఁడని తాత్పర్యము; శార దాపకృత జాగ్రద్గోప వత్స ప్రగోపన భా సార ద – శారదాప=నలువచేత,కృత=చేయఁబడిన,జాగ్రత్=నిస్తంద్రమగు,గోప=గొల్లలయొక్క, వత్స=

దూడలయొక్క, ప్రగోపన=దాఁచుటయొక్క,భా=సామర్థ్యముయొక్క,సార=సారమును, ద=ఖండించినవాఁడా! గోవులను, గోపులను దాఁచుటకుఁ బూనిన బ్రహ్మకు భంగము కల్గించినవాఁడని భావము; సార దానవ భిదా ప్రాంచ ద్యశోనిర్జి తాతను సత్పా రద– సార=బలిష్ఠులగు, దానవ=రక్కసులయొక్క,భిదా=భేదనమందు,ప్రాంచత్=ఒప్పుచున్న,యశః=కీర్తిచేత, నిర్జిత= జయింపఁబడిన, అతను=అధికమగు,సత్=శ్రేష్ఠమైన, పారద=పాదరసముగలవాఁడా! ఇతని యశము పాదరసముకన్నఁ దెల్లనై యున్నదని భావము; పార దాత్మ చరిత ధ్వస్తాఖి లాఘోదయా– పారద=తరింపఁజేయునట్టి,ఆత్మ=తనయొక్క, చరిత= చరిత్రముచేత, ధ్వస్త=పోఁగొట్టఁబడిన, అఖిల=సమస్తమైన,అఘ=పాపములయొక్క, ఉదయా=ఆవిర్భావము గల వాఁడా! ఇతని చరిత్రలు స్మరించినమాత్రన పాపముల నశింపఁజేయునని భావము. ఈకృతిపతి సంబోధనములకును, ఉత్తర పద్యములందలి తత్సంబోధనములకును, ఆశ్వాసాంతగద్యముతో నన్వయము. ముక్తపదగ్రస్తాలంకారము.

క. శరధీనశరధిఘనభా,స్వరధీవిషయా! నిబద్ధశరధీ! స్వరధీ
శరమావలంబ! శంబర,పరమాకరకరణభరణ!పరమాభరణా! 146

టీక: శరధీన శరధి ఘన భాస్వర ధీవిషయా– శరధీన=సముద్రుఁడె,శరధి=తూణీరముగాఁ గల శంకరునియొక్క, ఘన=అధిక మగు, భాస్వర=ప్రకాశించుచున్న,ధీ=బుద్ధికి,విషయా=లక్ష్యమైనవాఁడా! అనఁగా శివునకుఁగేశవుఁడు పత్నీభూతుఁడు గాన ఎల్లపుడు శంకరుని చిత్తమందు మెలఁగుచున్న వాఁడని భావము. 'ఏకాపి శక్తిః పరమేశ్వరస్య హ్యుపాధిభేదా దభవ చ్చతుర్ధా, భోగే భవానీ సమరేచ దుర్గా, కోపేచ కాళీ త్వవనేచ విష్ణుః' అను శ్రీభాగవతము ప్రమాణము; శరధీనశరధి=శివుఁడే, ఘనభాస్వర ధీవిషయా = అధికమై ప్రకాశించుచున్న బుద్ధికి విషయముగాఁగలవాఁడా; నిబద్ధశరధీ– నిబద్ధ=కట్టఁబడిన, శరధీ=సముద్రము గలవాఁడా! రామావతారమునందు బంధింపఁబడిన సముద్రము గలవాఁడని భావము; స్వరధీశ రమావలంబ– స్వరధీశ= స్వర్గా ధీశుఁడగు ఇంద్రునియొక్క, రమా=సంపదకు, అవలంబ=ఆధారమైనవాఁడా! శంబరపరమాకరకరణభరణ– శంబరపర= మన్మథునియొక్క,మా=సంపదకు, అనఁగా సౌందర్యమున కనుట, ఆకర=స్థానమగు, కరణ =దేహమును, 'కరణం సాధక తను క్షేత్ర గాత్రేన్ద్రియేష్వపి' అని యమరుఁడు, భరణ=వహించినవాఁడా! అనఁగా మన్మథునికి తుల్యమగు చక్కఁదనముగల దేహముగలవాఁడని భావము; పరమాభరణా=ఉత్కృష్టమైన యాభరణములుగలవాఁడా!

పంచచామరము: ధరాధరా! ధరారిమౌళిధామధామసత్పదా!
పరాపరా! పరాగపూతభామ! భామహోజ్జ్వల
చ్ఛరాశరాశరాజదస్త్రసార! సారభేదనా!
దరాదరా! దరాన్వితౌఘతార! తారకౌస్తుభా! 147

టీక: ధరాధరా=భూమిని ధరియించినవాఁడా! ధరారి మౌళి ధామ ధామ సత్పదా—ధరారి=ఇంద్రునియొక్క, మౌళి=కిరీటము యొక్క,ధామ=కాంతికి,ధామ=స్థానమగు,సత్పదా=మంచిచరణములుగలవాఁడా! పరాపరా=అవిద్యావ్యతిరిక్తుఁడగువాఁడా! పరాగ పూత భామ– పరాగ=చరణరేణువుచేత, పూత=పవిత్రమగు, భామ=అహల్యగలవాఁడా! భా మహోజ్జ్వల చ్ఛరాశరాశ రాజ దస్త్రసార– భా=కాంతిచేత, మహోజ్జ్వలత్=మిగులవెలుఁగుచున్న,శర=బాణములుగల, ఆశర=రక్కసులను, ఆశ= భక్షించునట్టి, రాజత్=ప్రకాశించుచున్న, అస్త్రసార=అస్త్రములయొక్క బలముగలవాఁడా! సారభేదనా—సాల=సాలవృక్షము

లను, ఇచట రలల కభేదమని తెలియవలయును, భేదనా=భేదించినవాఁడా! దరాదరా – దర=పాంచజన్యమునందు, ఆదరా = ఆదరముగలవాఁడా! దరాన్వితౌఘతార – దరాన్విత=భయముపొందినవారియొక్క, ఓఘ=సమూహములను, తార= తరియింపఁ జేయువాఁడా; తారకౌస్తుభా=ఉత్తమమైన కౌస్తుభరత్న ముగలవాఁడా! పంచచామరవృత్తమునకు అప్పకవి లక్షణము:

'జరజ్రజంబులుం గముం బొ॰సంగి తొమ్మిదింటిపై,
విరామ మొంది సత్కవు ల్స॰విస్తరంబు సేయఁగాఁ
బరాత్పరుండు మాధవుండు ॰బంచచామరంబునన్
బ్రరూఢగుంభనంబులందుఁ ॰బాడ నొప్పు ధాత్రిలోన్'

గద్యము: ఇది శ్రీమదనగోపాలప్రసాదసమాసాదితోభయభాషాకళాకళత్ర రేచర్లగోత్రపవిత్ర సురభిమల్లక్షమాపాలసత్పుత్ర కవిజనవిధేయ మాధవరాయప్రణీతం బైన చంద్రికాపరిణయంబను మహాప్రబంధంబునందుఁ బంచమాశ్వాసము.

గద్యము. ఇది శ్రీసతీరమణకరుణాసమాసాదితసర్వసౌభాగ్యభాగ్యనగరమహారాజ్యసంకలిత శ్రీజటప్రోలుసంస్థానప్రాజ్యసకలసామ్రాజ్య శ్రీ రేచర్లగోత్రపవిత్ర కవిజనగేయ శ్రీవేంకటజగన్నాథరాయసత్పుత్ర సత్సంప్రదాయ శ్రీసురభి వేంకటలక్ష్మణరాయ పరిపోష్య సరసవైదుష్య తదాస్థానతలమండిత శేషసదాశివపండిత విరచిత శరదాగమసమాఖ్యవ్యాఖ్యయందుఁ బంచమాశ్వాసము.

శ్రియై నమః

శ్రీలక్ష్మీనరసింహాయ నమః

చంద్రికాపరిణయము-సవ్యాఖ్యానము

షష్ఠాశ్వాసము

క. శ్రీమజ్జటప్రోలుపురీ
ధామ! సుధాధామతిగ్మ◊ధామస్ఫూర్జ
త్కోమలనయనద్వయ! యు
ద్దామగుణాభీల! శ్రీమ◊దనగోపాలా! 1

టీక: శ్రీమజ్జటప్రోలుపురీధామ—శ్రీమత్=సంపద్యుక్తమగు, జటప్రోలుపురీ=జటప్రో లనెడు నగరము, ధామ=నివాసముగాఁ గలవాఁడా! సుధాధామ తిగ్మధామ స్ఫూర్జ త్కోమల నయనద్వయ – సుధాధామ=చంద్రుఁడును, తిగ్మధామ=సూర్యుఁడును, స్ఫూర్జత్=ప్రకాశించుచున్న, కోమల=సుందరమైన, నయనద్వయ=కనుదోయిగాఁ గలవాఁడా!ఉద్దామగుణాభీల – ఉద్దామ=ప్రౌఢమైన, గుణ=శౌర్యాదిగుణములచేత, ఆభీల=భయంకరుఁడైనవాఁడా! శ్రీమదనగోపాలా= లక్ష్మీయుక్తుఁడవగు మదన గోపాలస్వామీ! ఈకృతిపతి సంబోధనమునకు ‘చిత్త గింపు’ మను నుత్తరపద్యస్థక్రియతో నన్వయము.

తే. చిత్తగింపుము శౌనకా◊ద్యుత్తమర్షి
సమితి కిట్లను రోమహ◊ర్షణతనూజుఁ
డలనృపతి రేయి శుభలగ్న◊మనువుపఱిచి
పురము గయిసేయ శిల్పికో◊త్కరముఁ బనుప. 2

టీక: చిత్తగింపుము = ఆకర్ణింపుము;శౌనకాద్యుత్తమర్షిసమితికిన్ = శౌనకుఁడు మొదలగు శ్రేష్ఠులగు మునిసంఘమునకు; రోమహర్షణతనూజుఁడు=సూతుఁడు; ఇట్లు=వక్ష్యమాణప్రకారముగా; అనున్= పలికెను; అలనృపతి=ఆక్షణదోదయుఁడు; రేయి =రాత్రియందు; శుభలగ్నము=శుభముహూర్తమును; అనువుపఱిచి=అనుకూలింపఁజేసి;పురము=నగరమును; కయిసేయన్ =అలంకరించుటకు;శిల్పికోత్కరమున్=శిల్పిసంఘమును; పనుపన్=ఆజ్ఞాపింపఁగా; దీని కుత్తరపద్యముతో నన్వయము. అనఁగా క్షణదోదయుఁ డారాత్రియందు శుభలగ్నము నిర్ణయించి, పురము నలంకరింప శిల్పుల కాజ్ఞాపించె నని తాత్పర్యము.

సీ. చంద్రవితానముల్ ◊చక్కఁగాఁ దార్చి రా,స్థానాజిరముల సౌ◊ధవ్రజముల,
రామాకృతిశ్రేణిఁ ◊బ్రబలఁ జిత్రించిరి, కురుఁజుల నవమణి◊కుడ్యతతుల,
హరిణకేతుచయంబు ◊వరుసఁ బొందించిరి, సాలాగ్రముల గృహ◊స్తంభతతులఁ,
దోడ్తో నమేరు ల◊ద్భుతముగా నిల్పిరి, రాజవీథికల ద్వా◊రప్రతతుల,

తే. విలసితచ్ఛదగుచ్ఛమం॰డలముఁ బూన్చి, రంగడులఁ దోరణస్రగ్ల॰తాంతరముల
నప్పురంబున సకలదే॰శాధిరాజ,శేఖరులు మెచ్చ నవ్వేళ ॰శిల్పివరులు. 3

టీక: అప్పురంబునన్=ఆనగరమందు; సకలదేశాధిరాజశేఖరులు=సమస్తదేశముల రాజశ్రేష్ఠులు; మెచ్చన్=మెచ్చునటులు; అవ్వేళన్=ఆసమయమందు; శిల్పివరులు=చిత్తరు వ్రాయువారు; చంద్రవితానముల్ – చంద్ర=కర్పూరముయొక్క, వితానముల్=సమూహములను; చంద్ర=బంగరుయొక్క,వితానముల్=మేలుకట్లను; వరుసన్=క్రమముగా; ఆస్థానాజిరములన్ = రాజసభలయొక్క చత్వరములందును; సౌధవ్రజములన్=మేడలగుంపులయందును; చక్కఁగాన్=సుందరముగా; తార్చిరి = పొందించిరి;

రామాకృతిశ్రేణిన్ – రామాకృతి=స్త్రీప్రతిమలయొక్క, శ్రేణిన్=బంతిని; రామాకృతి=శ్రీరాముని ప్రతిమలయొక్క, శ్రేణిన్= వరుసను; కురుఁజులన్=దూలములమీఁది గుజ్జులయందును; నవమణికుడ్యతటులన్=నవ్యమగు రతనాలగోడలయందును; ప్రబలన్= అతిశయించునటులు; చిత్రించిరి=వ్రాసిరి;

హరిణకేతువయంబు=చంద్రసమూహమును, తెల్లనిటెక్కెములను;వరుసన్=క్రమముగ;సాలాగ్రములన్ – సాల=ప్రాకారములయొక్క, అగ్రములన్=అగ్రభాగములందును; గృహస్తంభతతులన్ – గృహ=సదనములయొక్క, స్తంభతతులన్= కంబముల గుంపులయందును; పొందించిరి;

తోడ్తోన్=వెంటనె; నమేరులు=సురపొన్నలను; తోడ్తోన మేరువులు అనియు విభాగము, మేరువులు=శిఖరమణులను; రాజవీథికలన్=రాజమార్గములయందును; ద్వారప్రతతులన్=ద్వారములయొక్క సమూహములందును; అద్భుతముగాన్ = వింతగా; నిల్పిరి=ఉంచిరి;

విలసితచ్ఛదగుచ్ఛమండలమున్—విలసిత=ప్రకాశించుచున్న, ఛద=వస్త్రములయొక్క,గుచ్ఛ=గుత్తులయొక్క, మండలమున్=సమూహమును; వరుసన్=క్రమముగా; అంగడులన్=మళిగలయందు; తోరణస్రగ్లతాంతరములన్ – తోరణ= బహిర్ద్వారముయొక్క, స్రగ్లతా=తీవెలవంటిదండలయొక్క, అంతరములన్=మధ్యప్రదేశములయందు; పూన్చిరి= ఉంచిరి.

అనఁగా నాస్థానాజిరములయందు రంగవల్లీరూపముగా కర్పూరచూర్ణమును, సౌధములయందు బంగరుమేలుకట్లను ఉంచి రనియు, కురుఁజులయందు, కుడ్యములయందు స్త్రీప్రతిమలను, దాశరథిప్రతిమలను క్రమముగ వ్రాసిరనియు, కోటగోడలయందును, కంబములయందును చంద్రబింబములను, తెల్లనిటెక్కెములను క్రమముగ నుంచి రనియు, రాజవీథులయందు సురపొన్నలను, ద్వారములయందు మేరువులను నుంచి రనియు, మలిగలయందు వస్త్రములను, తోరణములయందు పర్ణగుచ్ఛములను గట్టి రనియుఁ, జూపఱులెల్ల మెచ్చునట్లు అలంకరించి రనియు భావము.

మ. అలఘుస్వర్ణసుచేలకాప్తి ఘనము॰క్తాళీసమాసక్తి ను
జ్జ్వలపద్మోద్ధృతి వైజయంత్యభియుతిన్ ॰సంధించి యప్పట్టునన్
బలునేర్పు ల్మన శిల్పిరాజి ఘటియిం॰పం బొల్చె నెంతేఁ గురుం
జులచా లచ్యుతరూపవైభవమునన్ ॰సొంపొంది తద్వీథులన్. 4

టీక: అప్పట్టునన్=ఆకాలమునందు; తద్వీథులన్=ఆనగరవీథులయందు; కురుంజులచాలు=గుజ్జులబంతి; శిల్పిరాజి = చిత్తరువు వ్రాయువారియొక్క శ్రేణి; అలఘుస్వర్ణసుచేలకాప్తిన్ – అలఘు=అధికములగు, స్వర్ణ=బంగరుయొక్క, సుచేలక=

సమీచీనమగు వలిపెములయొక్క, ఆప్తిన్=ప్రాప్తిచేత; పీతాంబరముయొక్క యని విష్ణుపరమైన యర్థము; ఘనముక్తావళీ సమాసక్తిన్–ఘన= గొప్పవయిన, ముక్తా=ముత్యములయొక్క, ఆళీ=శ్రేణియొక్క, సమాసక్తిన్=సంబంధముచేతను; గొప్పవారలగు ముక్తులయొక్క సమూహముయొక్క సంబంధముచేత నని విష్ణుపరమైన యర్థము; ఉజ్జ్వలపద్మో ద్ధృతిన్–ఉజ్జ్వలపద్మా=శృంగారలక్ష్మియొక్క, ఉద్ధృతిన్=ధారణముచేతను, ప్రసిద్ధశ్రీదేవీధారణముచేత నని విష్ణుపరమైన యర్థము; వైజయంత్యభియుతిన్ – వైజయంతీ=టెక్కె ములయొక్క, అభియుతిన్= సంబంధముచేతను; వైజయంతీ=వనమాలయొక్క, అభియుతిన్ = సంబంధముచేత నని విష్ణుపరమైన యర్థము; సంధించి=కలిగించి; పలునేర్పుల్ =పలువిధములైన జాణతనములు; మనన్= అతిశయిల్లునట్లు; ఘటియింపన్= నిర్మింపఁగా; అచ్యుతరూపవైభవమునన్–అచ్యుత=నాశములేని, రూప= శుక్లాదిరూపములయొక్క, వైభవమునన్=అతిశయము చేత; అచ్యుతరూప= విష్ణుమూర్తిస్వరూపముయొక్క, వైభవముచేత నని యర్థాంతరము; సొంపొంది=చెలువు వహించి; ఎంతేన్= మిక్కిలి; పొల్చెన్= ప్రకాశించెను.

అనఁగా నీకురుఁజులచాలు స్వర్ణసుచేలకాదులచే నచ్యుతునిరూపవైభవము నంది విలసిల్లె నని భావము.

చ. సరససుధాప్లుతంబు లగు చక్క నిగోడల శిల్పిరాజి భా
స్వరకనకద్రవప్రతతి వ్రాసినచిత్రపుబొమ్మ లొప్పెఁ ద
త్పరిణయరీతిఁ గాంచ వడిఁ బాటులఁ జేరి వధూటికాసము
త్కరశుభగీతిఁ జొక్కి సురకాంతలు నైశ్చలి నిల్చిరో యనన్. 5

టీక: శిల్పిరాజి =శిల్పకారసమూహము; సరససుధాప్లుతంబులు – సరస=శ్రేష్ఠమైన, సుధా=సున్నముచేత, ఆప్లుతంబులు = తడుపఁబడినవి; అగు చక్క నిగోడలన్=అయినట్టి సుందరములగు కుడ్యములయందు; భాస్వర కనకద్రవ ప్రతతిన్ – భాస్వర= ప్రకాశించుచున్న,కనకద్రవ=బంగరునీరుయొక్క,ప్రతతిన్=సమూహముచే; వ్రాసినచిత్రపుబొమ్మలు= లిఖించిన విచిత్రములగు బొమ్మలు; తత్పరిణయరీతిన్ – తత్=ఆచంద్రికాసుచంద్రులయొక్క, పరిణయరీతిన్=వివాహభంగిని; కాంచన్=చూచుటకు; వడిన్=వేగముచేత; పాటులన్=శ్రమములచే; చేరి=వచ్చి; వధూటికాసముత్కరశుభగీతిన్ – వధూటికా=స్త్రీలయొక్క, సముత్కర =సమూహముయొక్క, శుభగీతిన్=మంగళకరమగు గానముచేత; చొక్కి= పర వశించి; సురకాంతలు=దేవాంగనలు; నైశ్చలిన్ =నిశ్చలత్వముచేత; నిల్చిరో యనన్=నిలుచుండిరో యనునట్లు; ఒప్పెన్ =ప్రకాశించెను.

అనఁగా సున్నముఁ బూసి యున్నగోడలయందుఁ జిత్తరువు వ్రాయువారు బంగరునీటితో వ్రాసినబొమ్మలు, ఆవివాహ మహోత్సవమును జూచుటకై యతివేగముతోఁ జేరుటచే శ్రమనొంది, అచ్చటి యైదువల మంగళగానముచేఁ బరవశించి చలన రహితులై నిల్చియున్న దేవాంగనలో యన్నటులు ప్రకాశించె నని భావము. చిత్తరువునం దుండుబొమ్మలను సురకాంతలుగా నుత్ప్రేక్షించుటచే నుత్ప్రేక్షాలంకారము.

మ. తళుకుం బంగరుకుచ్చుడాలు నవసంధ్య న్నీలగుచ్ఛప్రభా
వళి యిర్లన్ సుమదామదీధితి యుడువ్రాతంబుల న్వజ్రకుం
భలసచ్ఛాయ సితాంశుదీప్తి నిగిడింప న్శిల్పికు ల్దార్చు మే
రులు ధాత్రిం గన నద్భుతంబె క్షణదారూఢి న్విజృంభించుటల్. 6

టీక: శిల్పికులు=శిల్పులు; తార్చుమేరులు–తార్చు=కదియించునట్టి, మేరులు=ద్వారములమీఁద నుండుకలశములు; ధాత్రిన్= భూమియందు; కనన్=చూడఁగా; తళుకుంబంగరుకుచ్చుడాలు=ప్రకాశించుచున్న బంగరుగుత్తులకాంతి; నవ సంధ్యన్– నవ= నూతనమగు, సంధ్యన్=సంజను; నీల గుచ్ఛ ప్రభావళి– నీల=ఇంద్రనీలమణులయొక్క, గుచ్ఛ= స్తబక ములయొక్క, ప్రభావళి= కాంతిశ్రేణి; ఇర్లన్=చీఁకట్లను; సుమదామదీధితి=పూసరములయొక్క కాంతి; ఉడువ్రాతంబులన్= రిక్కలగుంపులను; వజ్రకుంభ లసచ్ఛాయ– వజ్రకుంభ=రవలకుండలయొక్క,లసచ్ఛాయ=ప్రకాశించుకాంతి; సితాంశుదీప్తిన్ =చంద్రకాంతిని, వెన్నెల ననుట; నిగిడింపన్=విజృంభింపఁజేయఁగా; క్షణదారూఢిన్—క్షణ=ఉత్సవములను, ద= ఇచ్చునట్టి, ఆరూఢిన్= రూఢిచేత; రాత్రి యొక్క రూఢిచేత నని దోఁచుచున్నది; విజృంభించుటల్=అతిశయించుటలు; అద్భుతంబె= ఆశ్చర్యమా? కాదనుట. అనఁగా బంగరుగుచ్ఛములయొక్క ఎఱ్ఱనికాంతి సంధ్యాకాలమును జేయఁగా, ఇంద్రనీలమణికాంతి తిమిరకదంబమును జేయుచుండఁగా, పూదండలకాంతి నక్షత్రపుంజములను జేయుచుండఁగా, వజ్రకుంభకాంతి వెన్నెలను జేయుచుండఁగా, నీ శిల్పులు రచియించిన మేరులు క్షణదారూఢిచే విజృంభించుట చిత్రము గాదని తాత్పర్యము.

చ. కువలయరాజచక్రములకుం ◊బెనువేడుక సంఘటించుకాం
తివితతి మించ శిల్పికులు ◊దీర్చిన నూతనచంద్రసూర్యకో
టి వెలిఁగె ధూపకైతవప◊టిష్ఠతమస్తతి గాంచి యోర్వ మం
చవనికిఁ జేరు నైకవపు◊రాత్తతమీశదినేశులో యనన్. 7

టీక: కువలయరాజచక్రములకున్– కువలయ=భూవలయమందుండు, రాజచక్రములకున్=నృపసంఘములకు; కువలయ= కలువలకు, రాజ=ఒప్పుచున్న,చక్రములకున్=చక్రవాకములకు; పెనువేడుకన్=మిక్కిలి సంతసమును; సంఘటించు కాంతి వితతిన్– సంఘటించు=ఘటిల్లఁజేయునట్టి, కాంతివితతిన్=కాంతిపుంజముచేత; మించన్= అతిశయించునట్లు; శిల్పికులు = శిల్పకారులు; తీర్చిన నూతనచంద్రసూర్యకోటి– తీర్చిన=దిద్దిన, నూతన=నవీనమైన, చంద్రసూర్య=చంద్రసూర్యులయొక్క, కోటి=సమూహము; ధూపకైతవపటిష్ఠతమస్తతిన్– ధూప=అగరుధూపమనెడు,కైతవ =వ్యాజముగల, పటిష్ఠ=అధికమైన, తమస్తతిన్=చీఁకటిగుంపును; కాంచి=చూచి; ఓర్వ మంచున్=సహింప మనుచు; అవనికిన్=భూమికి; చేరు నైకవపు రాత్త తమీశ దినేశులో యనన్– చేరు=సమీపించిన, నైకవపుః=అనేకశరీరములను, ఇచట నశబ్దముతో సమాసము అని తెలియ వలెను, ఆత్త=పొందిన, తమీశ దినేశులో=చంద్రసూర్యులో యనునట్లు; వెలిఁగెన్ =ప్రకాశించెను.

శిల్పకారులు చిత్తరువందు వ్రాసిన చంద్రసూర్యులు, ఈపురమందు అగరుధూప మనెడి గాంఢాంధకారమును చూచి సహింపక పుడమిఁ జేరినట్టి ప్రసిద్ధచంద్రసూర్యులో యనునట్లు ప్రకాశించిరని భావము. చిత్రగతచంద్రసూర్యబింబములను ప్రసిద్ధచంద్ర సూర్యులనుగా నుత్ప్రేక్షించుటచే నుత్ప్రేక్షాలంకారము.

చ. ధరణిజనంబు మెచ్చఁగ ము◊దంబున శిల్పికులంబు చిత్రమై
ఖరిఁ గయిసేయ నప్డలరెఁ ◊గగ్గొన నంచితవైజయంతయై
పరిభృతచిత్రరేఖయయి ◊భవ్యమహాసుమనోవితానభా
స్వరయయి దృశ్యరంభయయి ◊చక్కఁగ నప్పురి వేల్పువీఁడనన్. 8

టీక: ధరణిన్=భూమియందు; జనంబు=లోకము; మెచ్చఁగన్=పొగడునటులు; ముదంబునన్=సంతసముచేత; శిల్పికులంబు = శిల్పకారుల బృందము; చిత్రవైఖరిన్=విచిత్రరీతిగా; కయిసేయన్=అలంకరింపఁగా; అప్డు=ఆసమయమందు; అప్పురి= ఆపత్తనము; అంచిత వైజయంత యై– అంచిత=ఒప్పుచున్న, వైజయంతయై=ఇంద్రునిమేడగలదై; ధ్వజములు గలదై యని స్వభావా ర్థము; పరిభృత చిత్రరేఖ యయి=భరింపఁబడిన చిత్రరేఖ యను దేవాంగన గలదియై, విచిత్రమగు గీఱలు గలదియై యని స్వభావార్థము; భవ్య మహా సుమనోవితాన భాస్వర యయి – భవ్య=మనోజ్ఞమగు, మహత్=అధిక మగు, సుమనో వితాన=దేవసంఘముచేత, భాస్వర యయి =ప్రకాశించినదియై; సుమనోవితాన=పుష్పసమూహముచేతఁ గాని, లేదా, విద్వ ద్బృందముచేతఁ గాని, అని స్వభావార్థము; దృశ్య రంభ యయి – దృశ్య=కనఁబడుచున్న, రంభ యయి = రంభయను దేవాంగన గలదియై, అనటులు గలదై యని స్వభావార్థము; కన్గొనన్=చూడఁగా; చక్కఁగన్= బాగుగా; వేల్పువీఁడనన్= స్వర్గపురియగు నమరావతియో యను నటులు; అలరెన్=ప్రకాశించెను. శిల్పు లలంకరింపఁగా నీపురము వైజయంతరంభా చిత్రరేఖాదులతోఁ గూడి యున్నందున నమరావతి యనునట్లు ప్రకాశించె నని భావము.

మ. ప్రసవస్రక్పరివీతయై పరికనత్పాటీరకాశ్మీరగం
ధసముల్లిప్తపయోధరాఢ్యయయి నూత్నస్వర్ణచేలాప్తయై
పొసఁగెం దన్నగరీలలామ యపు డొప్పు ల్మీఱఁ దన్గాంచుమా
త్ర సముత్థాతనుసంభ్రమస్ఫురణ గోత్రాలోకము ల్దోపఁగన్. 9

టీక: ప్రసవస్రక్పరివీతయై – ప్రసవస్రక్=పుష్పమాలికలచేత, పరివీతయై=చుట్టఁబడినదియై; పరికన త్పాటీర కాశ్మీర గంధ సముల్లిప్త పయోధ రాఢ్య యయి – పరికనత్=ప్రకాశించుచున్న,పాటీర=చందనముయొక్క, కాశ్మీర=కుంకుమముయొక్క, గంధ=పరిమళముచేత, సముల్లిప్త=పూయఁబడిన,పయోధరాఢ్యయయి=ఆకాశముగలదై, స్తనమార్గము గలది యై యని యర్థాంతరము; నూత్న స్వర్ణచే లాప్తయై – నూత్న=నవీనమైన, స్వర్ణచేల=బంగారువస్త్రమును, ఆప్తయై=కూడినదియై; తన్న గరీలలామ=ఆపురవరము, ఇందు స్త్రీత్వనిర్దేశముచేత నొకస్త్రీ యని తోఁచుచున్నది; అపుడు=ఆవేళయందు; ఒప్పుల్మీఱన్ = ఒప్పిదములు మీఱునటులు; తన్గాంచుమాత్రన్=తన్నుఁ జూచినంతమాత్రముననే; సము త్థాతను సంభ్రమ స్ఫురణన్ – సముత్థ= ఉదయించిన, అతను=అధికమైన,సంభ్రమ=సంతోషముయొక్క,స్ఫురణన్=ఆవిర్భావముచేత; అతను=మన్మథునియొక్క, సంభ్రమ=వేగముయొక్క,స్ఫురణన్=ఆవిర్భావముచేత అని తోఁచుచున్నది; గోత్రాలోకముల్=భూమియందలి జనులు; తోపఁగన్=తోఁచుచుండఁగా; పొసఁగెన్=ఒప్పెను. అనఁగా నగరీలలామ హారములచేఁ జుట్టఁబడినదనియు, పాటీరకాశ్మీరాది పరిమళద్రవ్యములయొక్క గంధముచేఁ బూయఁ బడిన గగనమార్గము గలదనియుఁ, దన్నుఁ జూచినమాత్రమున అధికసంభ్రమ మును గలిగించుచున్న దనియు భావము. పటీరాదు లచేఁ బూయఁబడిన స్తనమార్గముగలది యనియు, మన్మథసంభ్రమమును నుత్పాదించుచున్నదనియు స్త్రీపరమైనయర్థమందు భావము.

చ. తొడిఁబడి దిక్పరీతిరములఁ దూల్చుచు నద్రిబిలాంతరంబులన్
సుడిగొనుచున్ ధరిత్రిఁ గలచోటుల ముంచుచు నభ్రపద్ధతిం
దొడరి తరంగితం బగుచు దుస్తరవర్తనమై మెలంగె న
ప్పుడు పురి భద్రవాద్యకులభూరిరవౌఘము చిత్రవైఖరిన్. 10

టీక: అప్పుడు=ఆసమయమందు; పురిన్=నగరమందు; భద్రవాద్యకులభూరిరవౌఘము – భద్రవాద్య=మంగళవాద్యముల యొక్క, కుల=సమూహముయొక్క, భూరి=అధికమగు,రవౌఘము=ధ్వనిప్రవాహము; తొడఁబడి=తొట్రుబడి; దిక్ప్రతీరములన్=దిక్తటములను; తూల్చుచున్=తూలఁజేయుచు;అద్రిబిలాంతరంబులన్=పర్వతగుహామధ్యప్రదేశములయందు; సుడిగొనుచున్=తిరుగుడువడుచు; ధరిత్రిఁ గలచోటులన్=భూమియందుఁ గల ప్రదేశములను; ముంచుచున్=మునుఁగఁ జేయుచు; అభ్రపద్ధతిన్=ఆకాశమార్గమునందు;తొడరి=పూని;తరంగితం బగుచున్=సంజాతతరంగములుగలదై; దుస్తర వర్తనమై = దాఁట నలవిగాని వ్యాపారముగలదై; చిత్రవైఖరిన్=విచిత్రరీతిగా; మెలంగెన్=వర్తించెను.

అనఁగా భద్రవాద్యధ్వనులయొక్క సమూహములు దిక్తటములను భేదించుచుఁ, బర్వతగుహామధ్యప్రదేశములయందు సుడివడుచుఁ, బుడమి నెల్లఁ గప్పుకొని మిన్నంటి ప్రకాశించె నని వాద్యధ్వనుల పరమైన భావము. దిగంతములవఱకు విస్తరించి పర్వతగుహలను జలములచే నించుచు నావర్తములను గ్రహించుచు భూప్రదేశముల నించుచు తరంగములు గలదై జలప్రవాహ మొప్పు నని ప్రవాహపరమైన యర్థము. ప్రకృతాప్రకృతముల కౌపమ్యము గమ్యము.

మ. అనఘంబై సుమనోనికాయసముదా°రామోదసంవర్ధకం
బునునై శోభితనైకరాగయుతమై °ప్రోద్యత్సువర్ణాఢ్యమై
ఘనమధ్వభ్యుదయంబు దెల్పు గిరిజా°కల్యాణ మప్పట్టునన్
వినతాంగీనికరంబు పాడెఁ గలకం°ఠీకంఠనాదోపమన్. 11

టీక: అనఘంబై=శ్రావ్యమై, రమ్యమై యని ఆమనిపరమైన యర్థము; సుమనోనికాయ సముదా రామోద సంవర్ధకంబునునై– సుమనోనికాయ=విద్వద్బృందముయొక్క, సముదార=ఉత్కృష్టమగు, ఆమోద=సంతసమునకు, సంవర్ధకంబునునై = వృద్ధికరమైనదై; సుమనోనికాయ=పుష్పసమూహముయొక్క, సముదార=ఉత్కృష్టమగు, ఆమోద=పరిమళమునకు, సంవర్ధకంబునునై=వృద్ధికరమయి అని ఆమనిపరమైన యర్థము; శోభిత నైక రాగ యుతమై – శోభిత=ప్రకాశింపఁజేయఁబడిన, నైక= అనేకము లగు, ఇచట నశబ్దముతో సమాసమని యెఱుంగునది, రాగ=భైరవి, తోడి మొదలగు రాగములతో, యుతమై= కూడినదై; శోభిత= ప్రకాశింపఁజేయఁబడిన, నైక=అనేకములగు, రాగ=పల్లవాద్యారుణ్యములతో, యుతమై= కూడినదై, అని ఆమని పరమైన యర్థము; ప్రోద్య త్సువర్ణాఢ్యమై – ప్రోద్యత్=ప్రకాశించుచున్న, సువర్ణ=శ్రేష్ఠములగు తాన వర్ణచౌకవర్ణాదులచే, ఆఢ్యమై=ఒప్పిన దయి; సువర్ణ=సంపెఁగపూవులచేత, ఒప్పిదమై యని యామనిపరమైన యర్థము; ఘన మధ్వభ్యుదయంబు దెల్పు గిరిజా కల్యాణము – ఘన=అధికమగు, మధు=మాధుర్యముయొక్క, అభ్యుదయంబు = సమృద్ధిని, తెల్పు= తెలియఁ జేయుచున్న, గిరిజాకల్యాణము=గౌరీకల్యాణము; ఘన=అధికమగు, మధు=ఆమనియొక్క, అభ్యుదయంబు = సమృద్ధిని, తెల్పు=తెలియఁజేయు చున్న, గిరిజాకల్యాణ మని ఆమనిపరమైన యర్థము; అప్పట్టునన్ = ఆస్థలమందు; వినతాంగీనికరంబు=స్త్రీకదంబము; కలకంఠీ కంఠనాదోపమన్—కలకంఠీ=కోయిలలయొక్క, కంఠనాద= గళధ్వనితో, ఉపమన్= సామ్యముచేత; పాడెన్=పాడెను. అనఁగా నపస్వరాదిదోషములు లేక విద్వాంసులకు నానందజనకముగ ననేకవిధములగు రాగములతోను, అనేకవర్ణాదులతోనుం గూడి మధురమగు గౌరీకల్యాణమును స్త్రీలు పాడిరని భావము.

ఉ. ఆయెడ గౌరిపంపున సు°రాంబుజనేత్ర లఖండహార్దధా
రాయతి వెల్లి మీఱఁ దల°యంటఁగ మజ్జన మాచరింపఁ గై

సేయఁగఁ జంద్రికావనితఁ జేరిరి నవ్యఫలాక్షతాదికం
బాయతహేమపాత్రనిచయంబులఁ బూని రయంబు మీఱఁగన్. 12

టీక: ఆయెడన్=ఆసమయమందు; గౌరిపంపునన్=పార్వతీదేవియొక్క యాజ్ఞచేతను; సురాంబుజనేత్రలు=దేవాంగనలు; అఖండ హార్దధా రాయతి – అఖండ=ఎడతెగని,హార్దధారా=ప్రేమధారయొక్క, ఆయతి=అతిశయము; వెల్లి మీఱన్=మేర మీఱఁగా; తల యంటఁగన్=తలయంటుటకును; మజ్జన మాచరింపన్=స్నానముఁ జేయించుటకును;కైసేయఁగన్=అలంకరించుటకును; ఆయత హేమపాత్ర నిచయంబులన్ – ఆయత=విశాలమగు, హేమపాత్ర=సువర్ణపాత్రలయొక్క, నిచయంబులన్= సమూహములందు; నవ్యఫలాక్షతాదికంబు – నవ్య=నూతనమగు, ఫల=పండ్లు, అక్షత=అక్షతలు, ఆదికంబు= మొదలుగాఁగలవానిని; పూని= గ్రహించి; రయంబు మీఱఁగన్=వేగిరముగా; చంద్రికావనితన్=చంద్రికను; చేరిరి=పొందిరి.

పార్వతీదేవియానతిచేఁ గొందఱు దేవాంగనలు బంగరుపాత్రలయందు ఫలాక్షత లుంచుకొని తలయంటుటకు, తానము చేయించుటకు,అలంకరించుటకు, చంద్రికను జేరి రని భావము.

శా. ఆనారీమణు లంత శోభనవితర్ద్యగ్రస్థలిన్ స్యూతర
త్నానీకం బగుపెండ్లిపీఁట నిడి యందాభూపకన్యామణి
న్వ్యానమ్రాననచంద్ర నుంచి శిర సంటం జేరి రింపెచ్చ ‘ శో
భానేశోభనమే’ యటంచు విబుధాబ్జాతాననల్ పాడఁగన్. 13

టీక: అంతన్=అంతట; ఆనారీమణులు=ఆస్త్రీలు; శోభనవితర్ద్యగ్రస్థలిన్ –శోభనవితర్ది=మంగళకరమగు వివాహవేదికయొక్క, అగ్రస్థలిన్=పై భాగమునందు; స్యూతరత్నానీకంబు=చెక్కఁబడిన రత్నసమూహములు గలది; అగుపెండ్లి పీఁటన్ =అయినట్టి పెండ్లిపీఁటను; ఇడి= ఉంచి; అందున్=దానియందు; వ్యానమ్రాననచంద్రన్ – వ్యానమ్ర=వంగిన, ఆననచంద్రన్=చంద్రునివంటి ముఖముగల; ఆభూప కన్యామణిన్=ఆరాజపుత్త్రీరత్నమగు చంద్రికను; ఉంచి=కూర్చుండఁబెట్టి; శోభానేశోభనమే అటంచున్ = శోభానేశోభనమే యనుచు; విబుధాబ్జాతాననల్=దేవాంగనలు; పాడఁగన్=పాడుచుండఁగా; ఇంపెచ్చగన్=సొంపు అతిశయింపఁగ; శిరసంటన్ = తలయంటుటకు; చేరిరి=పొందిరి.

అనఁగా నామీఁద సురాంగనలు వివాహవేదికయందుఁ బెండ్లిపీఁట నుంచి, దానియందుఁ జంద్రికం గూర్చుండఁబెట్టి, శోభనగీతములు పాడుచుఁ దలయంట నుద్యమించి రని భావము.

సీ. సొగసెచ్చ నీధరేశునిపట్టి తలయంటఁ, దగు నీకళానిధిదంట యనుచు,
నీకంజకర కభిషేకంబు సవరింప, నీసుమనోదంతి యెఱుఁగు ననుచు,
నలువుగా నీకొమ్మ నలుఁగు గావింప నీ,సురభిచరిత్ర నేర్పరి యటంచు,
మహితాళి యివ్వేళ మసలఁగా నేటికే, యీశ్యామ సేవ కీవేగు మనుచు,
తే. సరసముగ నీగతులఁ బరస్పరము పలికి,కొనుచు నారార్తికంబు లొయ్యన నొసంగి
వీడియం బంజలి ఘటించి వేడ్కమీఱఁ, మదిరలోచన శిర సంటఁ గదిసి రపుడు. 14

టీక: సొగసెచ్చన్=అందమతిశయించునటులు; ఈధరేశునిపట్టి తలయంటన్ – ఈధరేశునిపట్టి=ఈక్షణదోదయుని కూఁతు రగు చంద్రికయొక్క, తలయంటన్=తలయంటుటకు;ఈకళానిధిదంట=విద్యానిధియగు నీకాంత;తగున్=ఒప్పును; అనుచున్=ఇట్లు పల్కుచు; ఇచట, ఈధరేశునిపట్టి తలయంటన్=ఈపార్వతితల యంటుటకు, ఈకలానిధి= ఈ చంద్రుఁడు దంట యను నర్థము దోఁచుచున్నది;

ఈకంజకరకున్=పద్మములవంటిచేతులుగల నీచంద్రికకు; అభిషేకంబు=స్నానమును; సవరింపన్=అనుకూలపఱచుటకు; ఈసుమనోదంతి=జాజిమొగ్గలవంటి దంతములుగల యీకాంత; ఎఱుఁగున్=తెలియును; అనుచున్=ఈరీతిగాఁ బల్కుచు; ఇచట, కంజకరకున్=లక్ష్మీదేవికి, అభిషేకంబు సవరింపన్, ఈసుమనోదంతి=ఈదేవగజము, ఎఱుఁగు నను నర్థము దోఁచు చున్నది;

నలువుగాన్=ఒప్పిదముగా; ఈకొమ్మ నలుఁగు గావింపన్=ఈచంద్రికకు నలుఁగుఁ బెట్టుటకు; ఈసురభిచరిత్ర=ఈపతివ్రత; నేర్పరి=జాణతనము గలది; అటంచున్=ఈరీతిగాఁ బలుకుచు; ఇచట, ఈకొమ్మ నలుఁగు గావింపన్=ఈశాఖకు నలుఁగుఁ బెట్టుటకు, ఈసురభిచరిత్ర=ఈవసంతచరితము, నేర్పరి యను నర్థము దోఁచుచున్నది;

మహితాళి=పూజ్యవగు చెలీ! ఈవు=నీవు; ఇవ్వేళన్=ఈసమయమందు; మసలఁగాన్=తడయఁగా; ఏటికే=ఎందుకే? తడవు సేయనేల యని తాత్పర్యము; ఈశ్యామ సేవకున్=ఈచంద్రికసేవకు; ఏగుము=పొమ్ము; అనుచున్=ఈప్రకారముగాఁ బలు కుచు; ఇచట, మహితాళి=మహితమగు తుమ్మెదా! మసలఁగా నేటికే, ఈవు=నీవు; ఇవ్వేళన్=ఈసమయమందు; ఈశ్యామ సేవకున్= ఈప్రేంకణపుతీవసేవకు; ఏగు మను నర్థము దోఁచుచున్నది;

ఈగతులన్=ఈరీతులచే; సరసముగన్=రసయుక్తమగునటులు; పరస్పరము=ఒండొరులనుగూర్చి; పలికికొనుచున్ = సంభాషించుకొనుచు; ఆరార్తికంబులు= ఆరతులను; ఒయ్యనన్=తిన్నగా; ఒసంగి=ఇచ్చి; అంజలిన్=దోసిలియందు; వీడియంబు=తాంబూలమును; ఘటించి=ఉంచి; వేడ్కమీఱన్=వేడుకమించునటులు; మదిరలోచన శిర సంటన్=చంద్రికతల యంటుటకు; అపుడు=ఆసమయమందు; కదిసిరి=దగ్గఱవచ్చిరి.

అనఁగా నీకాంత కలానిధి గాన ధరేశునిపట్టి తలయంటుటకుఁ దగు ననియు, నీచంద్రిక కంజకర గాన నీపెకు నభిషేక మొన రింప సుమనోదంతి తగు ననియు, ఈకొమ్మకు నలుఁగుఁ బెట్టుటకు నీసురభిచరిత్ర తగిన దనియు, మహితాళి గాన నిది శ్యామ యొక్క సేవకు సరియయిన దనియు, నొండొరులు సరసోక్తులాడుకొనుచు హారతు లిచ్చి, యంజలియందు తాంబూలము ఘటించి, చంద్రిక తలయంటఁ బోయి రని భావము.

చ. కురు లర వీడ దివ్యమణి౦కుండలరోచులు గండభాగభా
ఝరముల నోలలాడఁ గుచ౦శైలయుగంబున ఘర్మవాఃకణో
త్కరములు గూడ మధ్యమప౦థం బసియాడ ముదంబుతోడఁ జా
తురిఁ దగు నొక్కప్రోడ యల౦తొయ్యలికిన్ శిర సంటె నూనియన్. 15

టీక: కురులు=ముంగురులు; అర వీడన్=సగము జాఱఁగా; దివ్యమణికుండలరోచులు – దివ్య=మనోజ్ఞమగు, మణికుండల = మణిమయములగు కుండలములయొక్క, రోచులు = కాంతులు; గండభాగ భా ఝరములన్ – గండభాగ=గండస్థలముల యొక్క, భా=కాంతియనెడు,ఝరములన్=ప్రవాహములయందు; ఓలలాడన్=మునుఁగుచుండఁగా; కుచశైల యుగంబునన్ = పర్వతములవంటి పాలిండ్లయొక్క జంటయందు; ఘర్మవాఃకణోత్కరములు =చెమటబిందువుల బృందములు; కూడన్=

చేరఁగా; మధ్యమపథంబు=కౌను; అసియాడన్=చలింపఁగా; ముదంబుతోడన్=సంతోషముచేత; చాతురిన్=చాతుర్యముచేత; తగు=ఒప్పునట్టి; ఒక్కప్రోడ=ఒకప్రౌఢాంగన; అలతొయ్యలికిన్=ఆచంద్రికకు; నూనియన్=నూనెచేత;శిరసంటెన్=తల యంటెను.

ఉ. భాసురరక్తిమైఁ గలమశాలిక గుందెన నించి కంకణౌ
ఘాసమనిస్వనాళి వెలయంగ నయోగ్రము లూని 'సువ్విసు
వ్వీ సువి సువ్వి లాలి' యని వింతగఁ బాడుచు దంచి పుణ్యగో
త్రాసురకామినుల్ సతిశిరంబున సుంకులు చల్లి రత్తఱిన్. 16

టీక: అత్తఱిన్=ఆసమయమందు; పుణ్యగోత్రాసురకామినుల్ – పుణ్య=పవిత్రలగు, గోత్రాసురకామినుల్=భూసురకాంతలు; భాసురరక్తిమైన్—భాసుర=ప్రకాశించు, రక్తిమైన్=అనురాగముచేత; కుందెనన్=కుందెనయందు; కలమశాలికన్=వడ్లను; నించి=పూరించి; కంకణౌఘాసమనిస్వనాళి – కంకణ=కంకణములయొక్క, ఓఘ=బృందముయొక్క,అసమ=సాటిలేని, నిస్వన=ధ్వనులయొక్క, ఆళి=సమూహము; వెలయంగన్=ప్రకాశింపఁగా; అయోగ్రములు=రోకళ్ళను, 'అయోగ్రం ముసలో స్త్రీస్యాత్' అని యమరుఁడు; ఊని=గ్రహించి; సువ్విసువ్వీ సువి సువ్వి లాలి యని; వింతగన్=చిత్రముగ; పాడుచున్; దంచి; సతిశిరంబునన్=చంద్రికతలయందు; సుంకులు=సుంకువడ్లను; చల్లిరి=ఉంచిరి. అనఁగాఁ జంద్రికను గూర్చుండఁ బెట్టి విప్రస్త్రీలు కుందెనకు వడ్లు నించి, దంచి, చంద్రికయొక్క శిరమందు సుంకులు చెరిగి రని తాత్పర్యము.

క. బాలామణి యపు డొకచెలి,కైలా గొసఁగం దమీశకాంతామయపయ
శ్శాలాంతర మెనసె మరు,త్కాలాహికచాలలామకములు భజింపన్. 17

టీక: అపుడు=ఆసమయమునందు;బాలామణి=చంద్రిక; ఒకచెలి=ఒకసకియ;కైలా గొసఁగన్=హస్తావలంబము నీయఁగా; తమీశకాంతామయ పయశ్శా లాంతరము – తమీశకాంతామయ=చంద్రకాంతశిలామయమగు, పయశ్శాలా=నీళ్లయింటి యొక్క, అంతరము=మధ్యమును; మరుత్కాలాహికచాలలామకములు=ఉత్తమదేవాంగలు; భజింపన్=సేవించుచుండఁగా; ఎనసెన్=పొందెను;

చ. నెలజిగిభీతి నిర్లు ధరణీధరకందరఁ దజ్జయాప్తికై
బలుతప మూన్చికైశ్యగతి బాగుగఁ బుట్టఁగ జ్యోత్స్నకాదనా
కలనము నేర్ప వాని లలిఁ గైకొని మేపుపురాతపోరమా
కల యనఁ బెట్టె గంధ మొకకాంత వధూటిశిరోజపాళికన్. 18

టీక: ఇర్లు=చీఁకటులు; నెలజిగిభీతిన్ – నెల=చంద్రునియొక్క,జిగి=కాంతివలన, భీతిన్=భయముచేత; ధరణీధరకందరన్ – ధరణీధర=పర్వతముయొక్క, కందరఁన్=గుహయందు; తజ్జయాప్తికై – తత్=ఆచంద్రకాంతియొక్క, జయాప్తికై= జయము యొక్క ప్రాప్తికై; బలుతపము=అధికమగు తపమును; ఊన్చి=చేసి;కైశ్యగతిన్=కేశసమూహరూపముతో; బాగుగన్=ఒప్పిదముతో; పుట్టఁగన్=జన్మింపఁగా; జ్యోత్స్నకాదనాకలనము – జ్యోత్స్నకా=వెన్నెలయొక్క, అదనా= భక్షణమందలి, ఆకల

నము=అలవాటును; నేర్పన్=అభ్యసింపఁజేయుటకై; వానిన్=ఆవెన్నెలలను; లలిన్=ప్రేమతో; కైకొని=గ్రహించి; మేపు పురాతపో రమా కలయనన్ – మేపు=భుజింపఁజేయుచున్న, పురాతపోరమా=పూర్వతపోలక్ష్మియొక్క, కలయనన్= కలయును నట్లుగా; ఒకకాంత=ఒకయంగన; వధూటిశిరోజపాశికన్=చంద్రికయొక్క తలవెండ్రుకల సమూహమునందు; గంధము= గంధమును; పెట్టెన్=పెట్టెను.

చీఁకటులు చంద్రకాంతికి భయపడి దాని జయించుటకు పర్వతగుహలయందు తపం బొనరించి కైశ్యరూపమున జన్మింపఁగా, వాని కా వెన్నెలను తిన నేర్పుటకై యావెన్నెలలను చేతఁబట్టి నోటికిచ్చునట్టి పూర్వజన్మతపోలక్ష్మి నా నొకకాంత చంద్రికవెండ్రుకలయందు గందముఁ బూసె నని భావము.

తే. ఘనపయోధరపదవి న◊క్షత్రమాలి,కారుచులు పర్వ శ్యామ యొ◊క్కర్తు చంద్ర
కలశిఁ బూని నవామృత◊మ్ములఁ జకోర,చపలనయనకు వేలార్చె ◊సమ్మదమున. 19

టీక: శ్యామ యొక్కర్తు – శ్యామ=యౌవనమధ్యస్థయగు, ఒక్కర్తు=ఒకకాంత; చంద్రకలశిఁ బూని =స్వర్ణకలశము దీసికొని; నవామృతమ్ములన్—నవ=నూతనమగు, అమృతమ్ములన్=ఉదకములను; ఘనపయోధరపదవిన్ – ఘన =గొప్పలగు, పయోధరపదవిన్=స్తనప్రదేశమందు; నక్షత్రమాలికారుచులు – నక్షత్రమాలికా=ఇరువదియేడు మౌక్తికములు గల సరము యొక్క, రుచులు=కాంతులు; పర్వన్=వ్యాపింపఁగా; సమ్మదమునన్=సంతోషముతో; చకోరచపలనయనకున్ =చంద్రికకు; వేలార్చెన్ =కుమ్మరించెను; ఇచట, శ్యామ=రాత్రి, ఘనమగు, పయోధరపదవిన్ =ఆకాశమందు, నక్షత్రమాలికారుచులు = ఉడుపంక్తి కాంతులు, పర్వన్=వ్యాపింపఁగా, చంద్రకలశిన్=చంద్రుఁడను కలశమును, పూని=గ్రహించి, నవ మైన, అమృతమ్ములన్=సుధలను, వేలార్చె నను నర్థము స్ఫురించుచున్నది.

అనఁగా నొకకాంత సువర్ణకలశోదకములతోఁ జంద్రికకు స్నానముఁ జేయించె నని భావము. రాత్రి చంద్రకిరణామృతములచే చకోరములను తృప్తిపఱిచెనని యర్థాంతరమునకు భావము.

మ. కనకాంగీజన మారతు ల్పొనరుపం ◊గంజద్విషత్కాంత మ
జ్జనశాలాకలశాంబుధి న్వెడలి తే◊జం బెచ్చ నాపద్మపా
ణి నవీనచ్ఛదమండలీవృతి సము◊న్నిద్రాళి గేయాభిపూ
ర్తిని జూపట్టెడు పుష్కరాఖ్యగలవే◊దిం బొల్చె నప్పట్టునన్. 20

టీక: కనకాంగీజనము=స్త్రీజనము; ఆరతుల్=ఆరతులను; పొనరుపన్=ఈయఁగా; కంజద్విషత్కాంత మజ్జనశాలా కల శాంబుధిన్ – కంజద్విషత్కాంతమజ్జనశాలా=చంద్రకాంతమణులుగల స్నానాలయ మనెడి, కలశాంబుధిన్=పాలకడలినుండి; వెడలి = బయలుదేఱి; తేజంబు=కాంతి; ఎచ్చన్=అతిశయింపఁగా; ఆపద్మ పాణి=కమలములవంటి హస్తములు గల యా చంద్రిక; నవీన చ్ఛదమండలీవృతిన్ – నవీన=నూతనమగు, ఛద=వస్త్రములయొక్క, మండలీ=సమూహముయొక్క, వృతిన్ = ధారణము చేతను; సమున్నిద్రాళిగేయాభిపూర్తిని – సమున్నిద్ర=విజృంభించుచున్న, ఆళి=చెలియలయొక్క, గేయ= గానముయొక్క, అభి పూర్తిని=పరిపూర్తిచేత; చూపట్టెడు పుష్కరాఖ్యగలవేదిన్ – చూపట్టెడు=కాన్పించుచున్న, పుష్క రాఖ్యగల వేదిన్= పద్మాకృ తులు గల రంగవల్లియొక్క ప్రసిద్ధిగల వివాహవేదికయందు, ‘అలంకృతా స్వస్తిక పద్మ శఙ్ఖైః’

యను వసిష్ఠవచనము, రంగవల్లితో పద్మశంఖాకృతులు చేసి వివాహవేదిక నలంకరించుటకుఁ బ్రమాణము; అప్పట్టునన్= ఆసమయమందు; పొల్చెన్= ఒప్పెను. ఇచట, పద్మపాణి=లక్ష్మీదేవి, కలశాంబుధిన్=పాల్కడలినుండి, వెడలి = బయలు దేఱి, నవీన చ్ఛద మండలీ వృతి సమున్నిద్రాళి గేయాభిపూర్తిని-- నవీన=నూతనమగు, ఛద=దళములయొక్క,మండలీ= సమూహముయొక్క, వృతిన్= ఆవరణముచేత, సమున్నిద్ర=జాగరూకములగు, ఆళి=తుమ్మెదలయొక్క, గేయ=గానము యొక్క, అభిపూర్తిని= పరిపూర్తిని; చూపట్టెడు పుష్కరాఖ్యగల వేదిన్=కాన్పించెడు పద్మమను పేరుగల, వేదిన్=తిన్నె యందు; పొల్చెన్= ఒప్పె నను నర్థము దోఁచుచున్నది.

అనఁగా కాంతలు ఆరతు లియ్యఁగా స్నానాలయము వెడలి నూతనవస్త్రముల ధరించి సకులు పాటలు పాడుచుండఁగాఁ జంద్రిక పుష్కరమను పేరుగల వేదికయందుఁ బొల్చె నని భావము.

సీ. కనకదామముఁ జేర్చి వనితకు జడ యల్లె, నళిపాళికలఁ గేర నబల యొకతె,
వరచంద్రరేఖ సుందరినెమ్మొగంబునఁ, దీర్చెఁ దామర నొవ్వఁ దెఱవ యొకతె,
చలువగందంబు తొయ్యలిమేన నెనపెఁ జంపకవల్లిఁ గికురింపఁ బడఁతి యొకతె,
ఘనకంకణమ్ము లంగనకరమ్ముల నుంచెఁ, జిగురాకు నెగ్గింపఁ జెలువ యొకతె,
తే. చారుపత్రమ్ము లెడయ కొప్పార భూరి,వజ్రమాలిక నెలకొల్పె వనిత గబ్బి
గుబ్బకవ గుబ్బలులయుబ్బు కొంచెపఱుప, దంటతన మొప్ప విరిదమ్మికంటి యొకతె. 21

టీక: అబల యొకతె=ఒకకాంత; అళిపాళికలన్=తుమ్మెదబంతులను; కేరన్=పరిహసించుటకై; వనితకున్=చంద్రికకు; కనకదామమున్=సంపెఁగపూసరము; చేర్చి=జతపఱచి; జడ యల్లెన్=జడవేసెను. ఇచట, తుమ్మెదలబంతిని జడ స్వయమే కేరుచుండఁ జంపకసాహాయ్య మేల యను శంక నిరసించుటకై, కనకదామమునకు బంగరుత్రాడు, లేదా జడ బంగరు గాని యర్థము చేయవలయు;

తెఱవ యొకతె=ఒకస్త్రీ; తామర=తామరపువ్వు; నొవ్వన్=నొచ్చునట్టుగా; సుందరినెమ్మొగంబునన్=చంద్రికముఖమందు; వరచంద్రరేఖన్ – వర=శ్రేష్ఠమగు, చంద్రరేఖన్=చందమామబొట్టును; తీర్చెన్=దిద్దెను. ఇచట, చంద్రికముఖము స్వభావముగ తామరపూవును తిరస్కరించుచుండఁగ కమలవైరిసాహాయ్యమును గోరుటయేల యనుశంక నిరసించుటకై, వర చంద్రరేఖన్ – వర=కుంకుమముయొక్క,'కాశ్మీరజన్మాగ్నిశిఖం వరమ్' అని యమరుఁడు, చంద్ర=పచ్చకర్పూరముయొక్క రేఖను దీర్చెనను నర్థ మున్నదని గ్రహింపవలయును;

పడఁతి యొకతె=ఒకస్త్రీ; చంపకవల్లిన్=సంపెఁగతీవను; కికురింపన్=వంచించుటకు; చలువగందంబు=చల్లని గంధమును; తొయ్యలిమేనన్=చంద్రికయొక్కశరీరమునందు; ఎనపెన్=కలియఁబూసెను. ఇచట చంద్రికయంగలత తనంతనె చంపకలతను తిరస్కరించుచుండ, చలువగందము సాహాయ్య మేల యను శంక నిరసించుటకై, చలువగందం బనుచోట, చలువన్ =ఉదికిన వస్త్రమును, గందమును నెనపె నను నర్థ మున్నదని గ్రహింపవలయును;

చెలువ యొకతె=ఒకకాంత; చిగురాకున్=లేతయాకును; ఎగ్గింపన్=తిరస్కరించుటకు; అంగనకరమ్ములన్=చంద్రికయొక్క హస్తములందు; ఘనకంకణమ్ములు – ఘన=మేఘముయొక్క, కంకణమ్ములు=ఉదకబిందువులు; ఉంచెన్= ఉంచెను. ఇచట, చంద్రికకరములు స్వయమే చిగురుటాకులఁ దిరస్కరించుచుండఁగా, చిగురాకునకు విరోధులగు నుదకకణముల నుంచుట

యేల యని శంక నిరసించుటకై, ఘనకంకణమ్ములను చోట, ఘన=గొప్పనైన, కంకణంబులు=వలయముల ననునర్థము దో(చుచున్నది;

విరిదమ్మికంటి యొకతె=వికసించిన కమలములవంటి నేత్రములు గల యొకకాంత; గుబ్బలులయుబ్బు=పర్వతములయొక్క అతిశయమును; కొంచెపఱుపన్=తగ్గించుటకై; దంటతన మొప్పన్=ప్రౌఢత్వ మొప్పునట్లుగా; వనిత గబ్బిగుబ్బకవన్ – వనిత= చంద్రికయొక్క, గబ్బి=ఘనమైన,గుబ్బకవన్=చనుదోయియందు; చారుపత్రమ్ములు – చారు=సుందరమైన, పత్రమ్ములు= ఱెక్కలను; ఎడయక=ఎడ(బాయక; ఒప్పారన్=అతిశయించునట్లుగా; భూరివజ్రమాలికన్ – భూరి= అధికమగు, వజ్రమాలికన్ =వజ్రాయుధశ్రేణిని; నెలకొల్పెన్=నిలిపెను. ఇచట, పర్వతములను తిరస్కరించుటకై కుచములకు పక్షములను, భూరివజ్రమాలికలను నెలకొల్పుటవలన నాకుచములకు స్వసామర్థ్యము లేనట్లు దో(చుచున్నది గాన, పత్ర శబ్దమునకు మకరికాపత్రము లనియు, భూరివజ్రమాలికాశబ్దమునకు, భూరి=సువర్ణమయమగు, వజ్రమాలికన్=రవలసరమును, నెలకొల్పె నను నర్థమున్న దని గ్రహింప వలయును. ఈపద్యమందు భూషణములచే(జెలులు చంద్రిక నలంకరించి రని భావము.

మ. లలనామౌళి శివార్పితంబు లగుమే(ల్కట్టాణిముత్యంపుక
మ్మలు దాల్చె న్భవదాస్యదీప్తిగతి కా(త్మ న్గుందు రేఱేని ని
స్తులవీక్షామృతధారచే మనుపు మం(చున్ వేగ తచ్చంద్రమం
డలడింభంబులు భక్తి విన్నపము(బూ(న్పన్ జేరుదారిం దగన్. 22

టీక: లలనామౌళి=చంద్రిక; శివార్పితంబులు=పార్వతీదేవిచే నియ్య(బడినవి; అగు మేల్కట్టాణిముత్యంపుకమ్మలు – అగు= అయినట్టి, మేల్కట్టు=మంచిబంధనము గల, ఆణిముత్యంపుకమ్మలు=గుండ్రనిముత్యములు గల కర్ణభూషణములను; భవదాస్యదీప్తిగతికిన్—భవత్=నీయొక్క,ఆస్య=ముఖముయొక్క,దీప్తి=కాంతియొక్క,గతికిన్=రీతికి; ఆత్మన్=మనమునందు; కుందు రేఱేనిన్=వ్యసనపడుచున్న రేరాజును; నిస్తులవీక్షామృతధారచేన్ – సాటిలేని చూపులను నమృతధారలచే; మనుపుము =రక్షింపుము; అంచున్=ఇట్లనుచు; వేగ=శీఘ్రముగా; తచ్చంద్రమండలడింభంబులు = ఆచంద్రమండలమాణవకములు; భక్తి విన్నపమున్=భక్తియుతమగు విజ్ఞాపనమును; పూన్పన్=చేయుటకు; చేరుదారిన్ =సమీపించురీతిగా; తగన్=ఒప్పునట్లు; తాల్చెన్=ధరించెను. చంద్రిక పార్వతీదేవి యొసంగిన ముత్యపుకమ్మలు ధరించుట, నీముఖకాంతికి(గుందుచున్న చంద్రుని రక్షింపు మని యతని పిల్లలు విన్నవించుటకై చేరినవో యనునట్లుండె నని భావము. చంద్రికకమ్మలు చంద్రమండలశిశువుల యట్లున్న వని ముఖ్యాశయము.

ఉ. చక్క మఘోని యత్తఱి నొ(సంగిన సారమసారహారముల్
చక్కెరబొమ్మ చన్గవ(బొ(సంగె వధూమణి శ్యామ గావునం
జొక్కపుగుత్తు లన్మనము((జొన్ప(గ గుబ్బలు నిబ్బరంపు మేల్
మక్కువ నందు వ్రాలునళి(మాణవకప్రకరంబులో యనన్. 23

టీక: చక్కన్=సుందరముగా; మఘోని=శచీదేవి; అత్తఱిన్=ఆసమయమునందు; ఒసంగిన సారమసారహారముల్ –ఒసంగిన =ఇచ్చినట్టి, సార=శ్రేష్ఠమగు, మసార=ఇంద్రనీలములయొక్క, హారముల్=పేరులను; వధూమణి=చంద్రిక; శ్యామ కావునన్ = శ్యామయగుటవలన,‘ శీతకాలే సుఖోష్ణా యా,గ్రీష్మే తు సుఖశీతలా। తప్తకాఞ్చనసంకాశా సా శ్యామేతి చకథ్యతే’ అని

శ్యామాలక్షణము; ప్రేంకణపుతీవ యను నర్థము దోఁచుచున్నది, 'శ్యామాతు మహిలాహ్వయా' అని యమరుఁడు; గుబ్బలు= ఉరోజములు; చొక్కపుగుత్తు లన్మనమున్=స్వచ్ఛమైన గుత్తులను భావమును; చొన్పఁగన్=పొందఁజేయఁగా; అందున్=ఆ పూగుత్తులందు; నిబ్బరంపు మేల్మక్కువన్=గాఢమగు ప్రేమతో; వ్రాలు నళిమాణవకప్రకరంబులో అనన్–వ్రాలు =పడునట్టి, అళిమాణవక=తుమ్మెదపిల్లలయొక్క, ప్రకరంబులో=గుంపులో, అనన్=అనునట్లు; చక్కెరబొమ్మ చన్గవన్=చంద్రికయొక్క స్తనయుగ మందు; పొసంగెన్=ఒప్పెను.

అనఁగా శచీదేవి యొసంగిన యింద్రనీలమణులహారము,లతవలె నున్న చంద్రికయొక్క పాలిండ్లు పూగుత్తులను తలంపున వచ్చి వ్రాలినతుమ్మెదగుంపులో యనునట్లు చంద్రికాకుచయుగమునఁ బ్రకాశించె నని భావము.

ఉ. ఆయరవిందగంధి చర॥ణాంబురుహంబులఁ దాల్పఁ బొల్చె న
గ్నాయి యొసంగినట్టి యభి॥నవ్యవిదూరజనూపురంబు లౌ
రా యని హంసకత్వమున ॥రాజిలుటం బలె నిస్సమస్వర
శ్రీయుతి నొంది డాలెనసి ॥చెల్వముఁ బూనె నటంచు నెంచఁగన్. 24

టీక: అగ్నాయి=స్వాహాదేవి, పృషాకప్యగ్నీ తిసూత్రమువలన నైజాదేశజీప్పులు వచ్చిన వని తెలియవలెను; ఒసంగినట్టి యభినవ్య విదూరజ నూపురంబులు – ఒసంగినట్టి=ఇచ్చినట్టి, అభినవ్య=క్రొత్తనైన,విదూరజ=వైడూర్యములయొక్క,నూపురంబులు=అందెలు; ఆయరవిందగంధి=పద్మగంధియగు నాచంద్రిక; చరణాంబురుహంబులన్=అడుగుదమ్ములయందు; తాల్పన్=ధరింపఁగా; అవి=ఆయందెలు; హంసకత్వమునన్=పాదకటకభావముచేత, అంచతనముచేత, 'హంసకః పాదకటకః' అని యమరుఁడు; రాజిలుటం బలెన్ = ప్రకాశించుటచేతనో యన్నట్లు; నిస్సమ స్వర శ్రీ యుతిన్—నిస్సమ=సాటిలేని, స్వర=ధ్వనియొక్క,శ్రీ=సంపదతో, యుతిన్ = కూడుటను; ఒంది=పొంది; డాలు=కాంతిని; ఎనసి=పొంది; చెల్వమున్=అందమును; పూనెన్=వహించెను; ఔరా=బళీ! అటంచు నెంచఁగన్= అట్లని పొగడఁగా; పొల్చెన్=ఒప్పెను.

స్వాహాదేవి యొసంగిన వైడూర్యనూపురములు చంద్రిక యడుగు దమ్ములయందుఁ దమకుఁగల హంసకత్వము చేతనో యనునట్లు నిస్సమానమగు ధ్వనులతోఁ గూడి ప్రకాశించె నని భావము.

ఉ. అంగన యంతకీపరిస॥మర్పితరోహితకాండపాండుర
త్నాంగదముల్ వహించె శుభ॥హారమసారకదృష్టిడాలు రే
ఖం గన నుజ్జ్వలేందిర వి॥కస్వరపల్లవకోరకాళికా
సంగతిఁ దద్భుజాతిలక॥సాలలతల్ వడిఁ బూనుచాడ్పునన్. 25

టీక: అంగన=చంద్రిక; అంతకీ పరిసమర్పిత రోహితకాండ పాండురత్నాంగదముల్ – అంతకీ=యమభార్యచేత, పరిసమర్పిత =ఈయఁబడిన,రోహితకాండ=కెంపులగుంపుయొక్క,పాండురత్న=రవలయొక్క,అంగదముల్=భుజకీర్తులును; ఉజ్జ్వలేందిర=సౌందర్యలక్ష్మి;శుభ హార మసారక దృష్టి డాలు రేఖన్ – శుభ=మంగళకరమైన,హార=కంఠహారమందలి, మసారక= ఇంద్రనీలమణులనెడు, దృష్టి=చూపుయొక్క,డాలు=కాంతులయొక్క,రేఖన్=పంక్తితో; కనన్=చూడఁగా; వికస్వర పల్లవ కోర కాళికా సంగతిన్—వికస్వర=వికసించిన,పల్లవ=చిగుళ్లయొక్క, కోరక=మొగ్గలయొక్క, ఆళికా=శ్రేణి

యొక్క,సంగతిన్ =కూడికను;తద్భుజాతిలకసాలలతల్—తత్=ఆచంద్రికయొక్క, భుజా=భుజములనెడు, తిలకసాల=బొట్టుగుచెట్లయొక్క, లతల్=తీవెలు; వడిన్=వేగముతో; పూనుచాడ్పునన్=ధరించుతెఱంగున; వహించెన్.

అనఁగాఁ జంద్రిక, యమభార్య యొసంగిన కెంపులరవలతోఁ జేరి యున్న యంగదములు సౌందర్యలక్ష్మి హారగతము లగు నింద్రనీలమణులను వీక్షణములచేఁ జూడఁగా నాచంద్రిక భుజములనెడు బొట్టుగుతీవలు ఎఱ్ఱనిలేయాకులును, వెల్లమొగ్గలును పూనెనో యనునట్లు ధరించె నని భావము. స్త్రీవీక్షణములు బొట్టుగుచెట్లకు దోహద మని వ్రాయఁబడి యున్నది.

చ. సకియ తమీచరాబల యొ॑సంగినచొక్కపుముత్తియంపుబా
సికము ధరింపఁ బొల్చె నది ॑చిక్కనిడాలు నిశాప్తిఁ గాంచి బా
లిక యలికస్థలంబు స్వకు॑లీనత మించఁగఁ గాంచఁ జేరి చం
ద్రకళ ప్రియంబు మించఁ బరి॑రంభముఁ దార్చినదారిఁ బూనుచున్. 26

టీక: సకియ=చంద్రిక; తమీచరాబల=నిరృతిభార్య; ఒసంగిన చొక్కపు ముత్తియంపుబాసికము – ఒసంగిన=ఇచ్చినట్టి, చొక్కపు=స్వచ్ఛమైన, ముత్తియంపుబాసికము=ముత్యములబాసికము, లలామక మనుట; ధరింపన్=తాల్పఁగా; అది=ఆ బాసికము; బాలిక=చంద్రికయొక్క, అలికస్థలంబు=నొసటిప్రదేశము; నిశాప్తిన్ – నిశా=రాత్రియొక్క,పసుపుయొక్క, ఆప్తిన్ =ప్రాప్తిచేత;చిక్కనిడాలు=దట్టమగు కాంతిని; కాంచి=పొంది; స్వకులీనతన్=శ్రేష్ఠమగు తనకులధర్మముతో; మించఁగన్=అతిశయింపఁగా; చంద్రకళ=నెలవంక; కాంచన్ చేరి =చూడడగ్గఱి; ప్రియంబు=ఇంపు; మించన్=అతిశయింపఁగా; పరిరంభమున్=కౌగిలింతను; తార్చినదారిన్=చేయురీతిని; పూనుచున్=వహించుచు; పొల్చెన్=ప్రకాశించెను.

నిరృతిభార్య యొసంగిన ముక్తాలలామకము చంద్రిక ధరింపఁగా, నొసలు నిశాప్తి నెనసి వెలుంగుటయు, స్వీయవక్రత్వమును బొంది యుండుటయును మొదలగు తనకులధర్మము లుండుట గని ప్రియమొంది, చంద్రకళ డగ్గఱి కౌఁగిలించెనా యనునట్లు ప్రకాశించె నని భావము.

చ. నలిననిభాస్యమౌళి వరు॑ణానివితీర్ణము కెంపురాగమిం
దళతళ మంచు రాజిలు సు॑దర్శన మెంతయు నొప్పెఁ గందర
మ్ములఁ దప మాచరించి తమ॑ముల్ గవలీల జనించి భానుమం
డలి గ్రహియించెఁ జుమ్మనుమ॑నంబు సఖీతతి కొందఁ జేయఁగన్. 27

టీక: వరుణాని వితీర్ణము =వరుణదేవునిభార్యచే నీయఁబడినది; కెంపురాగమిం దళతళమంచు రాజిలు సుదర్శనము = పద్మరాగమణులగుంపుచేఁ దళతళమని ప్రకాశించు చక్రాకారభూషణము; నలిననిభాస్యమౌళిన్=చంద్రికశిరమునందు; తమముల్ =ఇర్లు; కందరమ్ములన్=గుహలయందు; తపము=తపస్సును; ఆచరించి=చేసి; కవలీలన్=వెండ్రుకలరూపముతో;జనించి = పుట్టి; భానుమండలిన్=సూర్యమండలమును; గ్రహియించెన్=పట్టికొనెను; చుమ్మ=సత్యము; అనుమనంబు=అనునట్టి బుద్ధి; తమములు సూర్యమండలమును గ్రహియించె నను బుద్ధి యనుట; సఖీతతికిన్=చెలులగుంపునకు; ఒందఁజేయఁగన్ = కలుఁగఁ జేయఁగా; ఎంతయున్=మిక్కిలి; ఒప్పెన్=ప్రకాశించెను.

అనఁగా వరుణునిభార్య యొసంగినచక్రాకారమగు భూషణము, అనఁగా రాకిణి, యిర్లు గుహలలోఁ దపం బొనరించి, చంద్రికాకచరూపమున జనించి, సూర్యమండలమును గ్రహించెనా యను సందేహమును చెలులకు గల్గఁజేయుచుఁ జంద్రిక శిరమునందుఁ బ్రకాశించె నని భావము.

మ. తరళాక్షీమణి యప్డు మారుతవధూదత్తంబు ముత్తెంపుముం
గర నాసన్ ధరియించి చెల్వెనసెఁ జక్కన్ వేగుఁజుక్క న్వహిం
చి రసం దోఁచుదినాస్యలక్ష్మి యన నక్షీణాంగరాగంబు ని
ర్భరసంధ్యారుచియై సురేంద్రమణిహారచ్ఛాయ లిర్లై తగన్. 28

టీక: తరళాక్షీమణి=స్త్రీరత్న మగు చంద్రిక; అప్డు=ఆసమయమందు; మారుతవధూదత్తంబు=వాయుకాంతచే నీయఁబడిన; ముత్తెంపుముంగర =ముక్తామయమగు నాసాభూషణము; నాసన్=ముక్కునందు;ధరియించి=తాల్చి; అక్షీణాంగరాగంబు =తఱుఁగని మైపూఁత; నిర్భరసంధ్యారుచియై=హెచ్చగుసంజవెలుఁగై; సురేంద్రమణిహారచ్ఛాయలు=ఇంద్రనీలమణిసర కాంతులు; ఇర్లై=చీఁకటులై; తగన్=ఒప్పుచుండఁగా; చక్కన్=సరిగా; వేగుఁజుక్కన్=శుక్రనక్షత్రమును; వహించి=పూని; రసన్ =పుడమియందు; తోఁచుదినాస్యలక్ష్మి యనన్=కనఁబడుచున్న దినముఖలక్ష్మియో యన్నట్లు; చెల్వెనసెన్=ప్రకాశించెను.

అనఁగాఁ దనయంగరాగము సంధ్యారాగమయి, ఇంద్రనీలమణికాంతులు చీఁకటులయి తోఁచుచుండఁగా, చంద్రిక వాయు దేవునిభార్యచే నీయఁబడిన నాసాభూషణమును ధరించి, వేగుజుక్కను వహించి ప్రకాశించునట్టి దినముఖలక్ష్మి యన్నటులు ప్రకాశించె నని భావము.

మ. నవలా యైలబిలీసమర్పితము నానారత్నసంయోజితం
బవు నొడ్డాణము దాల్ప నొప్పె నది తారాధ్వస్థలీరీతిఁ దొ
ల్త విమర్శించితి నిప్డు మధ్యపథలీలం గాంతుఁ బో యంచు మిం
చువడిం జేరు ననేకవర్ణపరిధిస్ఫూర్తి న్విజృంభించుచున్. 29

టీక: నవలా=చంద్రిక; ఐలబిలీసమర్పితము=కుబేరునిభార్యచే నీయఁబడినట్టి; నానారత్నసంయోజితంబు=అనేకరత్నఖచి తంబును; అవు నొడ్డాణము=అయినట్టిమేఖలను; తాల్పన్=ధరింపఁగా; అది=ఆయొడ్డాణము;తారాధ్వస్థలీరీతిన్=నక్షత్ర మార్గవిధానంబును; తొల్తన్=మొదట; విమర్శించితిన్=పరికించితిని; ఇప్డు=ఇప్పుడు; మధ్యపథలీలన్=భూలోకముయొక్క విలాసమును, మధ్యభాగమును; కాంతుఁ బో యంచున్=వీక్షింతునని; మించువడిన్=అతిశయించువేగముచే; చేరు ననేక వర్ణ పరిధిస్ఫూర్తిన్ – చేరు=ప్రవేశించుచున్న, అనేకవర్ణ=పెక్కువన్నెలుగల, పరిధి=పరివేషముయొక్క, 'పరివేషస్తు పరిధిః' అని యమరుఁడు, స్ఫూర్తిన్=ఆకృతితో; విజృంభించుచున్ =అతిశయించుచు; ఒప్పెన్=వెలసెను.అనఁగా మొదట నంతరిక్షపద మును పరీక్షించితి, నిపుడు మధ్యపథలీలను బరికింపవలె నని వన్నెలు గలపరివేషము చేరెనో యనునట్లు కుబేరునిభార్యచే నీయఁబడిన యొడ్డాణము నానారత్నములతోఁ గూడి చంద్రికవలగ్నమందుఁ బ్రకాశించె నని భావము.

మ. అలగోత్రాపతిపుత్రి యిట్లు గిరికన్యాముఖ్యదిగ్దేశరా
ణ్ణలినాస్యాజనతాసమర్పితమహానానామణీభూషణా

వళిశృంగారితగాత్రియై ద్విజసతీవారంబు దీవింపఁ దొ

య్యలు లారాత్రికముల్ ఘటింప నవమోదారూఢి మించెం గడున్. 30

టీక: అలగోత్రాపతిపుత్రి=క్షణదోదదయభూపతియొక్క కూఁతురగు నాచంద్రిక; ఇట్లు=పూర్వోక్తప్రకారము; గిరికన్యా ముఖ్య దిగ్దేశరాణ్ణలినాస్యా జనతా సమర్పిత మహా నానా మణీభూష ణావళి శృంగారిత గాత్రియై– గిరికన్యా=పార్వతీదేవి, ముఖ్య= ఆదిగాఁగల, దిగ్దేశరాట్=దిక్పతులయొక్క, నలినాస్యాజనతా=కాంతాజనసమూహముచే, సమర్పిత=ఈయఁబడిన, మహత్=అధికమైన, నానా=అనేకవిధములగు, మణిభూషణ=మణిమయాభరణములయొక్క, ఆవళి=పంక్తిచేత, శృంగారిత=అలంకరింపఁబడిన, గాత్రియై=శరీరముగలదై; ద్విజసతీవారంబు=బ్రాహ్మణస్త్రీసంఘము; దీవింపన్=ఆశీర్వదింపఁగా; తొయ్యలులు=స్త్రీలు; ఆరాత్రికముల్=హారతులను; ఘటింపన్=ఈయఁగా; నవమోదారూఢిన్—నవ=నూతన మగు, మోద= సంతసముయొక్క, ఆరూఢిన్=ప్రాప్తిచేత; కడున్=మిక్కిలి; మించెన్=అతిశయిల్లెను.

తే. అంతకయ మున్ను బంధువయస్యదండ,నాథముఖ్యులు తత్సుచంద్రక్షితీంద్రుఁ

బెండ్లికొడుకు నొనర్ప దర్పించువేడ్కఁ, గడఁగి శుభలీల నాళిసంఘములఁ బనుప. 31

టీక: అంతకయ మున్ను=చంద్రికాలంకారమునకన్న పూర్వమందు; బంధు వయస్య దండనాథ ముఖ్యులు – బంధు=చుట్టములు, వయస్య=చెలికాండ్రు, దండనాథ=సేనానాయకులు, ముఖ్యులు=మొదలుగాఁగలవారు; తత్సుచంద్రక్షితీంద్రున్ = ఆ సుచంద్రభూపతిని; పెండ్లికొడుకు నొనర్పన్=పెండ్లికుమారునిఁ జేయుటకు; దర్పించువేడ్కన్=మించు నుల్లాసముతో; కడఁగి =పూని; శుభలీలన్=మంగళకరమైన విధానముచేత; ఆళిసంఘములన్=చెలులగుంపులను; పనుపన్=పంపఁగా, దీని కుత్తర పద్యస్థక్రియతో నన్వయము.

చ. తరుణులు చేరి కాంచనవితర్దిక శోభనపీఠిఁ బెట్టి భూ

వరు వసియింపఁ జేసి ద్విజవారిజలోచన లెల్లఁ గోకిల

స్వరమునఁ బాట పాడ ననివారితమంగళవాద్యనిస్వనో

త్కరములు చాల బోరుకొన గ్రక్కున నారతు లెత్తి రయ్యెడన్. 32

టీక: తరుణులు=చేడెలు; చేరి=కూడి; కాంచనవితర్దికన్=బంగరువేదికయందు; శోభనపీఠిన్=పెండ్లిపీఁటను; పెట్టి=ఉంచి; భూవరున్=సుచంద్రుని; వసియింపఁ జేసి=కూర్చుండఁబెట్టి; ద్విజవారిజలోచనలు=బ్రాహ్మణస్త్రీలు; ఎల్లన్=అందఱును; కోకిలస్వరమునన్=కోయిలస్వరమువంటి స్వరముతో; పాటపాడన్=పాటఁ బాడఁగా; అనివారిత మంగళవాద్య నిస్వనోత్కరములు– అనివారిత=వారింపఁబడని, మంగళవాద్య=శుభవాద్యములయొక్క, నిస్వనోత్కరములు=ధ్వనికదంబములు; చాలన్=మిక్కిలి; బోరుకొనన్=మ్రోఁగఁగా; గ్రక్కునన్=శీఘ్రముగా; ఆరతు లెత్తిరి=హారతు లొసంగిరి; అయ్యెడన్ =ఆసమయమందు, దీని కుత్తర పద్యస్థక్రియతో నన్వయము.

సీ. అఱచందమామపై కుఱుకుచీఁకటిపిల్ల, లన ఫాలతటిఁ గుంతలాళిజాఱ,

మదిపేరిమరుమేడఁ బొదలుధూపము పర్వు, పోల్కిఁ గ్రొందావియూర్పులు జనింప,

నన నూఁగువేడ్కఁ జే◌కొని మ్రోయు తేఁటిచాల్,సరి నీలవలయముల్ ◌చాల మొఱయ,
లవలియాకులఁ గ్రమ్ము◌నవహైమకణముల, గతిఁ జెక్కుల శ్రమాంబు◌కణిక లుబ్బ,

తే. సరులు నటియింప, నునుఁగౌను ◌సంచలింప, గుబ్బకవ రాయిడింప, స◌కు ల్నుతింప,
చూపునెఱమించు మించుమే◌ల్సొగసు నింప, నమ్మహీపాలు శిర సంటెఁ◌గొమ్మ యొకతె. 33

టీక: అఱచందమామపైకిన్=అర్ధచంద్రునిమీఁదికి; ఉఱుకుచీఁకటిపిల్లలు అనన్=పరుగెత్తు నంధకారపుబిడ్డలో యన్నట్లు; ఫాలతటిన్=నుదుటిభాగమందు; కుంతలాళి=ముంగురులగుంపు; జాఱన్=ఒరగఁగా;
మదిపేరిమరుమేడన్=మనస్సను పేరుగల మన్మథునిసౌధమందు; పొదలుధూపము=వృద్ధిఁబొందునట్టి పొగ; పర్వు పోల్కిన్ = వ్యాపించువిధమున; క్రొందావియూర్పులు=క్రొత్తవాసనగల నిట్టూర్పువాయువులు; జనింపన్=పుట్టుచుండఁగా;
నన నూఁగువేడ్కన్=చిగురాకునం దుయ్యేల లూఁగువేడుకను; చేకొని=గ్రహించి; మ్రోయు=అఱచుచున్న; తేఁటిచాల్ సరి =తుమ్మెదలబంతితో సాటిగా; నీలవలయముల్=ఇంద్రనీలమయములగు కంకణములు; చాలన్=మిక్కిలి; మొఱయన్= మ్రోఁగుచుండఁగా;
లవలియాకులన్=ఏలకియాకులయందు; క్రమ్ము నవహైమకణముల గతిన్=చుట్టుకొను క్రొత్తమంచుబిందువులవలె; చెక్కులన్=చెంపలయందు; శ్రమాంబుకణికలు=చెమటనీటిబొట్టులు; ఉబ్బన్=అతిశయింపఁగా;
సరులు=దండలు; నటియింపన్=చలింపఁగా; నునుఁగౌను=అల్పమగు నడుము; సంచలింపన్=ఆడఁగా; గుబ్బకవ=చను దోయి; రాయిడింపన్=ఒరయఁగా; సకుల్=చెలులు; నుతింపన్=పొగడఁగా; చూపునెఱమించు=చూపుయొక్క అధికమైన ప్రకాశము; మించుమేల్సొగసున్=మెఱపుయొక్క మంచియందమును; నింపన్=నిండింపఁగా; అమ్మహీపాలు శిరసు=ఆ రాజుశిరమును; కొమ్మ యొకతె = ఒకపడఁతి; అంటెన్=అంటినదాయెను.

బాలచంద్రునిమీఁదికిఁ జిఱుచీఁకటు లుఱికినటులు ఫాలముమీఁద కురులు వ్రాలుచుండఁగా, మనసను పేరుగల మరుని మేడయందు వ్యాపించు పొగపగిది నూర్పులు చెలంగఁగా, చిగురాకునం దుయ్యేల లూఁగు తుమ్మెదచాలుపగిది కరముల నీలమణికంకణములు మొరయఁగా, ఏలకియాకులందుఁ బర్విన మంచుబొట్టులరీతిగ చెక్కిళ్లయందుఁ జెమటబిందువు లతి శయింపఁగా, దండలు గదలుచుండ, సన్ననినడుము కదలుచుండఁగా, కుచయుగ మొరయుచుండఁగా, సకియలు పొగడు చుండఁగా నొకచెలి సుచంద్రునకుఁ దలయంటె నని భావము.

తే. అంత నప్పురుషోత్తముఁ◌డంఘ్రియుగళి, నడరుమిన్కులపావాలు ◌దొడిగి కమల
హస్తకర మూని ఘనవేణి◌కాళికాభి,కలితపాథోగృహము మంద◌కలన నెనసి. 34

టీక: అంతన్=అటుపిమ్మట; అప్పురుషోత్తముఁడు=పురుషశ్రేష్ఠుఁడగు నాసుచంద్రుఁడు;అంఘ్రియుగళిన్=అడుగుదోయి యందు; అడరుమిన్కులపావాలు – అడరు=ఒప్పుచున్న, మిన్కులపావాలు=తళుకులుగల పాదుకలను; తొడిగి; కమల హస్తకరము=కమలమువంటి హస్తముగల చెలికేలును; ఊని=వహించి; ఘనవేణికాళికాభికలితపాథోగృహము – ఘనవేణికా =మబ్బువంటిజడగల చేడియలయొక్క, ఆళికా=శ్రేణిచేత, అభికలిత=పొందఁబడిన, పాథోగృహము=మజ్జనగృహమును; మందకలనన్=మెల్లనినడకతో; ఎనసి=పొంది, పైపద్యముతో నన్వయము; ఇచట, పురుషోత్తముఁడు=నారాయణమూర్తి, అంఘ్రియుగళమందు, మిన్కులపావాలు=వేదమయపాదుకలను, తొడిగి, కమలహస్తకరమూని= లక్ష్మీదేవియొక్క కేలును

బట్టుకొని, ఘనవేణికాళికాభికలితపాథోగృహము – ఘనవేణికా=గొప్పనదులయొక్క, ఆళికా=శ్రేణిచేత, అభికలిత=పొందఁ బడిన, పాథోగృహము=సముద్రమును, ఎనసి=పొంది, యను నర్థము దోఁచుచున్నది.

చ. అలినిభవేణి యోర్తు మహిపాగ్రణికైశికవీథిఁ జందనా
మలకము వెట్ట నొక్క సుకుమారలతాసమగాత్రి కోష్ణవాః
కులముల మజ్జనంబు సమకూర్చె మనోభవరాజ్య మందఁగాఁ
జెలువుగఁ గట్టఁ బట్ట మభిషేక మొనర్చినచాయ నయ్యెడన్. 35

టీక: అయ్యెడన్=అప్పుడు; అలినిభవేణి యోర్తు=తుమ్మెదలతో సమానమగు జడగల యొకకాంత; మహిపాగ్రణి కైశిక వీథిన్ – మహిపాగ్రణి=రాజశ్రేష్ఠుఁడగు సుచంద్రునియొక్క, కైశికవీథిన్=కేశసమూహముయొక్క ప్రదేశమందు; చందనామలకము =చందనమిశ్రితమైన యుసిరికపిండి; పెట్టన్=ఉంపఁగా; ఒక్క సుకుమారలతాసమగాత్రి =మెత్తనిలతతో సమమైన మేనుగల యొకకాంత; చెలువుగన్ = సొంపుగా; మనోభవరాజ్యము=మన్మథుని ప్రభుత్వము; అందఁగాన్=పొందుటకై; పట్టము=ముఖ పట్టమును; కట్టన్=కట్టుటకొఱకు; అభిషేక మొనర్చినచాయన్=స్నానము చేయించిన తెఱంగున; కోష్ణవాః కులములన్= గోరువెచ్చనయిన యుదకపూరముతో; మజ్జనంబు=స్నానమును; సమకూర్చెన్=చేయించెను.

చ. చెలువ యొకర్తు చెందిరికచేల మయిం దడి యొత్తి వైచి ని
స్తులవిశదాంబరం బొసఁగఁ దోడనె దాల్చి సదప్రియంబు మ
త్సులలితరోహితాంశుపటి సుమ్మని దాని సడల్చి వెన్నెలన్
వలనుగఁ బూని తోఁచు రవివైఖరి నప్పతి యొప్పె నంతటన్. 36

టీక: చెలువ యొకర్తు =ఒకచెలియ; చెందిరికచేలన్=చంద్రకావివస్త్రముతో; మయిన్=శరీరమందు; తడి యొత్తి వైచి = తడి దుడిచి; నిస్తులవిశదాంబరంబు – నిస్తుల=సాటిలేని; విశదాంబరంబు=తెల్లనివస్త్రమును; ఒసఁగన్=ఈయఁగా; అప్పతి=ఆ సుచంద్రుఁడు; తోడనె=వెంటనె; తాల్చి=ధరించి; మత్సులలిత రోహితాంశుపటి – మత్=నాయొక్క, సులలిత=మిక్కిలి మనోజ్ఞమైన, రోహిత=ఎఱ్ఱనగు, అంశు=కిరణము లనెడు, పటి=వస్త్రము; సదప్రియంబు =సజ్జనులకు ఇష్టముకానిది; సుమ్మ=సత్యము; రిక్కలకు నప్రియమని స్వభావార్థము; అని =ఇట్లని; దానిన్=ఆరోహితాంశుపటమును; సడల్చి=విడిచి; వెన్నెలన్=కౌముదిని; వలనుగన్=నేర్పుగా; పూని=ధరించి; తోఁచు రవివైఖరిన్=కనుపట్టు సూర్యునివిధమున; అంతటన్= అప్పుడు; ఒప్పెన్=అలరెను. అనఁగా నొకచెలి శుభ్రవస్త్రము నీయఁగా నారాజు శుభ్రవస్త్రమును ధరించి , సదప్రియంబని రోహి తాంశుపటమును సడల్చి, వెన్నెలను ధరించిన రవిపగిదిఁ బ్రకాశించెనని భావము.

చ. అలజలశాలిక న్వెడలి యాజననాయకుఁ డబ్జరాగవ
ద్వలభివిభాజటాయుతి నవారితమౌక్తికకుడ్యదీప్తి ని
ర్మలగగనాపగాప్తిఁ గడురాజిలు పూఁజవికె న్వసించెఁ గ
ల్వలదొర యబ్ధి వెల్వడి శివాపతియౌదలఁ జేరుపోలికన్. 37

టీక: ఆజననాయకుఁడు=ఆసుచంద్రుఁడు; అలజలశాలికన్=ఆస్నానగృహమునుండి; వెడలి=బయలుదేఱి; అబ్జరాగవద్వలభివిభాజటా యుతిన్ – అబ్జరాగవత్=పద్మరాగములుగల, వలభివిభా=చూరులకాంతులనెడు, జటా=జడలయొక్క, యుతిన్= కూడికచేత; అవారిత మౌక్తిక కుడ్య దీప్తి నిర్మల గగనాపగాప్తిన్ – అవారిత=నివారింప నలవిగాని, మౌక్తిక= ముక్తామయమైన, కుడ్య=గోడయొక్క, దీప్తి=వెలుంగనెడు, నిర్మల=స్వచ్ఛమైన, గగనాపగా=మిన్నేటియొక్క, ఆప్తిన్= ప్రాప్తిచేతను; కడున్ = మిక్కిలి; రాజిలు పూఁజవికెన్=వెలుఁగుచున్న పువ్వులమండపమందు; కల్వలదొర=చంద్రుఁడు; అబ్ధిన్=సముద్రమునుండి; వెల్వడి=బయలుదేఱి; శివాపతియౌదలన్=పార్వతీవల్లభునితలయందు; చేరుపోలికన్=కూడు తెఱంగున; వసించెన్= నివసించెను.

భూపాలుఁడు జలశాల వెడలి పద్మరాగమణిమయమగు చూరుపట్టె లనెడి జటాజూటముతో ముక్తామయకుడ్యకాంతి యనెడు మిన్నేటితోఁ గూడిన శంకరునిశిరముపగిదిఁ గానవచ్చుచున్న పూఁజవికెను, సముద్రమునుండి వెల్వడి చంద్రుఁడు శంకరునిశిరముఁ జేరినరీతిగాఁ జేరెనని భావము.

సీ. తడి యొత్తి నేర్పు గ◊న్పడ నఖాంకురపాళి, నెఱులు చిక్కెడలించె ◊నెలఁత యొకతె,
యింపు రెట్టింపఁ జొ◊క్కంపుసాంబ్రాణిధూ,పపుఁదావిఁ బొందించెఁ◊బడఁతి యొకతె,
తళుకుఁగుంచియఁ బూని ◊కలయ నెఱు ల్దువ్వి, సొగసుగా సిగ వైచె ◊మగువ యొకతె,
మొగలిఱేకులదంట ◊మొనసినబొండుమ,ల్లియపూసరులు చుట్టె ◊లేమ యొకతె,
తే. దివ్యతరరత్నజాలాప్తిఁ ◊దేజరిల్ల, నబ్ధికన్యామనోహరుం ◊డాత్మశక్తి
మహిమ సృజియించి యంచిన◊మంజుమకుటి, నప్పతి కలంకరించెఁ గం◊జాస్య యొకతె. 38

టీక: నెలఁత యొకతె=ఒకచెలియ; తడి యొత్తి=తేమనొత్తి; నేర్పు కన్పడన్=జాణతనము కానవచ్చునట్లు; నఖాంకురపాళిన్ – నఖాంకుర=మొలకలవంటిగోళ్లయొక్క, పాళిన్=బంతిచేత; నెఱులు=కురులను; చిక్కెడలించెన్=చిక్కుదీసెను;
పడఁతి యొకతె =ఒకవనిత; ఇంపు రెట్టింపన్=సొంపు ఇబ్బడింపఁగా; చొక్కంపుసాంబ్రాణిధూపపు తావిన్ – చొక్కంపు= మేలైన, సాంబ్రాణి=గంధద్రవ్యవిశేషముయొక్క, ధూపపుతావిన్=పొగవాసనను; పొందించెన్=అనువుపఱిచెను;
మగువ యొకతె=మఱియొకలేమ; తళుకుఁగుంచియన్=మెఱుగైనదువ్వెనను; పూని=చేపట్టి; కలయన్=కలియునట్లు; నెఱుల్ =వెండ్రుకలు; దువ్వి; సొగసుగాన్=అందముగా; సిగ=కొండె; వైచెన్=వేసెను;
లేమ యొకతె=ఒకమగువ; మొగలిఱేకులదంటన్=మొగలిపూవులయొక్క జంటతో; మొనసినబొండుమల్లియపూసరులు = కూడిన బొండుమల్లెల పూదండలను; చుట్టెన్=చుట్టెను;
కంజాస్య యొకతె =కమలముఖి యొకతె; దివ్యతరరత్నజాలాప్తిన్ – దివ్యతర=మిగుల మేలైనట్టి, రత్నజాల=మణిజాలములయొక్క, ఆప్తిన్=ప్రాప్తిచేత; తేజరిల్లన్=వెలయఁగా; అబ్ధికన్యామనోహరుండు=విష్ణుమూర్తి; ఆత్మశక్తిమహిమన్=తన సామర్థ్యముయొక్క మహిమచేత; సృజియించి=పుట్టించి; అంచిన మంజుమకుటిన్=పంపించిన అందమైనకిరీటమును; అప్పతికిన్ = ఆరాజునకు (సుచంద్రునకు); అలంకరించెన్=కైసేసెను.

ఒకకాంత సుచంద్రునకు కురులచిక్కుదీసె ననియు, నొకలేమ సాంబ్రాణిధూప మేసె ననియు, నొకపడఁతి కురులు దువ్వి సిగముడి వేసె ననియు, నొకచాన మొగలిపూఱేకులతోఁ జేరియున్న మల్లెపూసరములు సిగకుఁ జుట్టె ననియు, నొకకంజాస్య విష్ణుమూర్తి తనమహిమచే సృజించి పంపిన కిరీటమును సుచంద్రుని కలంకరించె ననియు భావము.

క. అలనృపమణి కస్తూరీ,తిలకము దాఁ దీర్చె నిరత౹దీప్తికళాసం
కలితమయి మించు మో మను, కలువలదొరయందుఁ జిన్నె౹కరణి వహింపన్. 39

టీక: అలనృపమణి=రాజరత్నమగు నాసుచంద్రుఁడు; నిరతదీప్తికళాసంకలితము – నిరత=సంతతము, దీప్తి=తేజోరూపమగు, కళా=షోడశకళలతోడ, సంకలితము=కూడుకొన్నది; అయి మించు మోము అనుకలువలదొరయందున్ –అయి మించు మోము = అయినదై యతిశయించు ముఖము, అనుకలువలదొరయందున్ =అనునట్టి చంద్రునియందు; చిన్నె కరణిన్ = కలంకవిధమును; వహింపన్=పూనునటులు; కస్తూరీతిలకమున్=కస్తురిబొట్టును; తాన్=తాను; తీర్చెన్= దిద్దెను. సుచంద్రుఁడు దీప్తిచేఁ బ్రకాశించుచున్న తనముఖ మనుచంద్రునియందుఁ గలంకముకైవడిఁ గస్తురిబొట్టు దీర్చె నని భావము.

క. జనపతివీనుల హరి యం,చిన ముత్తెపుటొంటు లలరెఁ౹జేరువ లగ్నం
బెనసె విలంబం బిఁక నే, లని దెలుపఁగఁ జేరు కవిసు౹రాచార్యు లనన్. 40

టీక: లగ్నంబు=మూరుతము; చేరువన్=సమీపంబును; ఎనసెన్=పొందెను; విలంబంబు=ఆలస్యము; ఇఁకన్ ఏలని = ఇంక నెందుకని; తెలుపఁగన్=ఎఱింగించుటకై; చేరు కవిసురాచార్యులనన్ – చేరు=డగ్గఱునట్టి, కవిసురాచార్యులు ==శుక్రబృహస్పతులు, అనన్=అన్నట్లు; హరి=ఇంద్రుఁడు; అంచిన ముత్తెపుటొంటులు=పంపిన ముత్యాలయంటుజోళ్లు; జనపతి వీనులన్ = రాజుచెవులందు; అలరెన్=ఒప్పెను. ఇంద్రుఁడు పంపిన ముత్యపుటొంటులు రాజుచెవులందు, లగ్నము సమీపించినది విలంబ మేల యని తెలియఁజేయు గురుశుక్రు లన్నట్లు ప్రకాశించెనని భావము. ఉత్ప్రేక్షాలంకారము.

క. వీవలిచెలి పనిచినము,క్తావళితో విభునివక్ష౹మలరారెన్ దా
రావిసరప్రతిఫలన, శ్రీవిలసితకనకధరణి౹భృత్తటిపోల్కిన్. 41

టీక: వీవలిచెలి=వాయుసఖుఁడగు నగ్ని; పనిచినముక్తావళితోన్=పంపినట్టి ముత్యములహారముతో; విభునివక్షము=తేని ఱొమ్ము; తారా విసర ప్రతిఫలనశ్రీ విలసిత కనకధరణిభృ త్తటిపోల్కిన్ – తారా=చుక్కలయొక్క, విసర=గుంపుయొక్క, ప్రతిఫలనశ్రీ=ప్రతిబింబకాంతిచే, విలసిత=ప్రకాశించుచున్న, కనకధరణిభృత్=మేరుపర్వతముయొక్క, తటి పోల్కిన్ = తటమువలె; అలరారెన్=ప్రకాశించెను. అగ్ని పంపిన ముక్తాహారముతో సుచంద్రునిఱొమ్ము ఆకసమం దున్నచుక్కలు ప్రతిఫలించిన మేరుపర్వతముయొక్కచఱియవలెఁ బ్రకాశించెనని భావము. ఇచట నుపమాలంకారము.

క. జముఁ డంచిన మణిహంసక, మమరెం బతియంఘ్రిఁ ద్వత్ప౹రాళికృతశ్వ
భ్రముఁ బాపుము ధామవిభౌ,ఘముచే నని యడుగునొందు౹కంజాప్తుక్రియన్. 42

టీక. జముఁడు=యమధర్మరాజు; అంచిన మణిహంసకము—అంచిన=పంపిన, మణిహంసకము=మణిమయమగు కాలి యందె; పతియంఘ్రిన్=తేనియడుగునందు; త్వత్పరాళికృతశ్వభ్రమున్ – త్వత్=నీయొక్క, పర=శత్రువులయొక్క, ఆళి =శ్రేణిచేత, కృత=చేయఁబడిన, శ్వభ్రమున్=రంధ్రమును; ధామవిభౌఘముచేన్—ధామ=ప్రతాపముయొక్క, విభా=కాంతుల యొక్క, ఓఘముచేన్=గుంపుచేత; పాపుము=పోఁగొట్టుము; అని =ఇట్లని; అడుగునొందుకంజాప్తుక్రియన్ – అడుగునొందు = పాదముల నొందునట్టి, కంజాప్తుక్రియన్=సూర్యునివలె; అమరెన్=ఒప్పారెను.

అనఁగా యమధర్మరాజుచేఁ బంపఁబడిన కాలియందె సుచంద్రునిపాదమందు, నీచే రణమందుఁ గూలిన శూరులు గావించిన నామండలముయొక్క రంధ్రమును నీప్రతాపకాంతిపుంజముచేఁ గప్పుమని యడుగులందు వ్రాలిన సూర్యబింబముకైవడిఁ బ్రకాశించె నని భావము. 'శ్లో. ద్వా విమౌ పురుషౌ లోకే సూర్యమణ్డలభేదినౌ, పరివ్రాడ్యోగయుక్తశ్చ, రణేచాభిముఖో హతః' అని యెదిరించి రణమందుఁ గూలినవారు సూర్యమండలమును భేదింతు రనుటకుఁ బ్రమాణము.

క. పలభుజుఁ డంచిన రతన,మ్ములపతకము నృపతి దాల్పఁ ◊బొసఁగెం జిత్త
స్థలచంద్రికానురాగా, వలి వెగ్గల మగుచుఁ బైకి ◊వడి వెడలెననన్. 43

టీక. పలభుజుఁడు=నిరృతి; అంచిన రతనమ్ములపతకము=పంపిన రత్నమయమగు పతకము; నృపతి=సుచంద్రుఁడు; తాల్పన్=ధరింపఁగా; చిత్తస్థలచంద్రికానురాగావలి – చిత్తస్థల=హృదయప్రదేశమందున్న, చంద్రికా=చంద్రికావిషయమగు, అనురాగ=అనురక్తియొక్క, ఆవలి=శ్రేణి; వెగ్గల మగుచున్=అతిశయితంబగుచు; పైకిన్=బయటికి;వడిన్=వేగముగా; వెడలెను అనన్ =వచ్చె నన్నట్లుగా; పొసఁగెన్=ఒప్పెను. ఈపద్యమునం దుత్ప్రేక్షాలంకారము.

నిరృతి పంపియున్న రత్నమయమగు పతకము సుచంద్రుఁడు వక్షమున ధరింపఁగా, చంద్రికావిషయమైన యనురాగము హృదయములోనుండి పైకుబికి పర్వె నన్నట్లు భాసిల్లె నని భావము. ఈపద్యమందు మకారపకారములకు యతి చెల్లక యుండినను, ముకారయతులలో పుఫుబుభులకు మాకొమ్ము చెల్లునని యప్పకవి యంగీకరించినందున ముకారమునకు పొ యను నక్షరమునకును యతి చేయఁబడియున్నది. 'క.హెచ్చరికను పుఫుబుభులకు, నచ్చపు మాకొమ్ము లే మ◊హాకవు లాదిన్, మెచ్చులుగ నిలిపి రచ్చట, నచ్చటను ముకారయతుల◊టంచును గృతులన్' – అని అప్పకవీయము.

క. శరధీశప్రేషితభా,స్వరమౌక్తికశుభికఁ దాల్చె ◊జనపతి 'శుభికే
శిర ఆరోహ' యటంచున్, ధరణీసురపాళి సుస్వ◊నంబునఁ బలుకన్. 44

టీక. జనపతి=సుచంద్రుఁడు; శరధీశప్రేషితభాస్వరమౌక్తికశుభికన్ – శరధీశ=వరుణునిచే, ప్రేషిత=పంపఁబడిన, భాస్వర=వెలుంగుచున్న, మౌక్తిక=ముత్తియములయొక్క,శుభికన్=బాసికమును; 'శుభికేశిర ఆరోహ' యటంచున్ – 'శుభికేశిర ఆరోహ' అను మంత్రము నుచ్చరించుచు; ధరణీసురపాళి=బ్రాహ్మణశ్రేణి; సుస్వనంబునన్=మేలైనధ్వనితో; పలుకన్ =వచించుచుండఁగా; తాల్చెన్=ధరించెను. అనఁగా వరుణుండు పంపిన ముత్తియంపుబాసికమును బ్రాహ్మణులు మంత్రములు చదువుచుండఁగా సుచంద్రుఁడు ధరించెనని భావము.

క. మరుదర్పితమణిముద్రిక, నరనాథుకరాంగుళికఁ ద◊నర్చెఁ బ్రవాళేం
దిర తనచెల్మికి రా భా,సురభద్రాసనము నిచ్చు◊సొంపు వహింపన్. 45

టీక. మరుదర్పితమణిముద్రిక – మరుత్=వాయువుచే, అర్పిత=ఈయఁబడిన, మణిముద్రిక=కెంపుటుంగరము; నరనాథుకరాంగుళికన్=సుచంద్రునివ్రేలియందు; ప్రవాళేందిర=పగడపుకాంతి యను లక్ష్మి; తనచెల్మికిన్=తననేస్తమునకు, అనఁగా రాజు కేలినేస్తమునకు; రాన్=రాఁగా; భాసురభద్రాసనము నిచ్చుసొంపు =మేలైనసింహాసనము నిచ్చునందమును; వహింపన్ =పూనునట్లు; తనర్చెన్=ఒప్పెను. అనఁగా వాయుదేవుఁడు పంపిన కెంపుటుంగరమును సుచంద్రుఁడు హస్తమున ధరింపఁగా

నది ప్రవాళలక్ష్మి సుచంద్రునికేలిచెలిమిఁ గోరి రాఁగా, బహూకరించుటకుఁగా కేలు దాని కిచ్చిన భద్రాసనమురీతిఁ జూపట్టుచు నొప్పె నని భావము.

క. పతి దాల్పఁ బొలిచె ధనదా, ర్పితహీరాంగదము తనధ౹రిత్రీభారో
ద్ధృతి కలరి భుజాభజనా,దృతిఁ గుండలితాహినేత ౹యెనసినపోల్కిన్. 46

టీక. ధనదార్పితహీరాంగదము=కుబేరునిచే నీయఁబడిన రవలబాహుపురి; పతి=సుచంద్రుఁడు; తాల్పన్=ధరింపఁగా; తన ధరిత్రీభారోద్ధృతికిన్=తాను మోయుచున్న భూభారముయొక్క యెత్తుటకు; అలరి=సంతసించి; భుజాభజనాదృతిన్- భుజా =భుజములయొక్క, భజన=కొలుచుటయందు, ఆదృతిన్=ఆదరముచేత; కుండలితాహినేత =వలయితమైన చిలువదొర; ఎనసినపోల్కిన్=పొందినరీతిగా; పొలిచెన్=ప్రకాశించెను.

అనఁగాఁ గుబేరుఁ డిచ్చిన హీరాంగదము సుచంద్రుఁడు భుజములందు ధరియింపఁగా నది తాను మోయు భారమును నీభుజములు మోయుచున్న వని యాదరించుటకయి చేరియున్న యాదిశేషునిపగిదిఁ గానవచ్చె నని భావము.

క. హరుఁడంచిన నవకనకాం,బర మయ్యెడఁ గప్పి నృపతి ౹భాసిల్లెను బం
ధురసాంధ్యరాగవృతుఁడై, ధరణిం గనుపట్టు శిశిర౹ధామునిచాయన్. 47

టీక. అయ్యెడన్=ఆసమయమందు; హరుఁడు=ఈశానుఁడు; అంచిన=పంపిన; నవకనకాంబరము=నూతనమగు బంగరు వస్త్రమును; కప్పి=కప్పుకొని; నృపతి=సుచంద్రుఁడు; బంధురసాంధ్యరాగవృతుఁడై =సొంపగు సంజకెంపువన్నెతోఁ గూడినవాఁడై; ధరణిన్=భూమియందు; కనుపట్టు శిశిరధామునిచాయన్= కనఁబడు చంద్రునివిధంబుగా; భాసిల్లెను=మెఱసెను.

ఈ సుచంద్రుఁడు, ఈశానుఁడు పంపిన కనకాంబరమును ధరియించి, సంధ్యారాగముతోఁ గూడుకొన్న వాఁడయి పుడమిఁ జేరిన చంద్రునివలెఁ బ్రకాశించె నని భావము.

వ. ఇవ్విధంబున సకలదిగ్రాజనియోజిత నానావిధదివ్యమణివిభూషణభూషితగాత్రుం డగుచు, నాసు చంద్రధరాకళత్రుండు నిశాముఖకృత్యంబులు నిర్వర్తించి మించినముదంబున వేల్పుదొర యంచిన చౌదంతి నెక్కి యుదయనగవజ్రశృంగాగ్రవిద్యోతమానుండగు నరుణభానుండో యన నఖిలచక్రలోచన సమ్మోదసంపాదకమహస్స్ఫురణంబునం బొలుపొందుచు, నభినవ్యశాతకుంభకుంభవారాంచిత పాండురాతపత్రసహస్రంబు చుట్టు వలగొన నరుణమణిగణ సంస్యూతఫణిరమణ ఫణాదశశతమధ్యస్థితుండగు నృసింహదేవుండునుంబోలె నపరిమితవిబుధమనఃపథ జరీజృభ్యమాణ మహాద్భుతసంవర్ధకవిగ్రహప్రకాశంబునం బొగడొందుచు, నాత్మోత్సవసందర్శనలాలసా నానంద్యమాన పౌరమానవతీజనంబులు చల్లు మల్లికామాఘ్యాదివల్లికాదికోరకవారంబులు చుట్టు నావరింప శీతశైలహిమాధిదేవతావికీర్యమాణమిహికాఘటికాపటల సంవృతమూర్తి యగుదక్షిణామూర్తి తెఱంగున దిగ్గళనకలనా వరీవృత్యమాన సద్గణకోలాహలంబుల కింపుఁబూనుచుఁ, బార్శ్వద్వయ పరిభ్రాజమాన గజాధిరాజాధిరోహి సామంతమహీకాంత

సంవీజ్యమాన ధవళవాలవ్యజనంబు లసమానపవమాన మందయానవైఖరిఁ జాంచల్యమాన నవీనకాశ మాలిక లన్మనంబుఁ బొదలింప మహీతలంబునం దోఁచిన శరద్దినదైవంబు తెఱంగున ననేకరాజహంస సంసేవ్యమానుండయి రాజిల్లుచు, నగణేయతపనీయభంభికాతుత్తుంభికా తమ్మటతమామికాప్రముఖ బహుముఖవాద్యనిస్వానంబుల నలరి తదేకమంగళం బవలోకింపఁ దివుర షడ్వయవిభాకరులు తమతమ ప్రియజనంబుల కరంబుల కొప్పగించి యంచిన నేతెంచి నిలుచు గురుసమాతత తేజోవిలాస లాలస్యమాన తత్కుమారశతశతంబులదారిం దైవాఱు పరిచారిక పాణిభృతగంధతైలధారా దేదీప్యమాన దీపికాసమూ హంబుల వీక్షాలక్ష్యంబులుగా నొనర్చుచు, నిరుగడల నెడయాక యడరునొయ్యారంబున నడచుగణికా గణంబులం గనుంగొని తొంగలించుమోహంబునఁ దదేకతానతం బొలుచు నభోవితర్దికాసీన నిర్జరస్తోమం బులపైఁ గంతుఁడు తత్సమయ సముచిత బహురూపంబు లంగీకరించి ప్రయోగించు నిర్వేలజ్వాలాకుల జాజ్వల్యమాన కలంబకదంబకంబులడంబున యంత్రకారవారంబు లొక్కమొత్తంబుగా ముట్టింపఁ బఱచు నాకాశబాణంబుల నవలోకించుచు, సర్వంసహాజన శ్రవణపర్వంబుగా నిజానవద్య పద్యగద్యంబులు చదు వుచుం బఱతెంచు యాచకకవీశలోకంబుల కాత్మీయ బంధుమిత్రదండనాథపురోహితముఖ్యులు దోయిళ్ల ముంచి వెదచల్లు నవరత్నసువర్ణజాలంబులతో వైమత్యం బూను కారునికరకరశృంగ సముత్పాత్యమాన చారుధమనికాశిఖి స్ఫులింగికానికాయంబులం గాంచి వేడుకఁ బూనుచు, నుత్తుంగమాతంగచక్రాంగ సం ఘాత సంఘటితజయపతాకాగ్రతట హాటకపటాంచల టేటిక్యమాన పవమానధారా నిర్ధూతంబై స్వాశ్రయ రూపజలదవ్రాతంబు దెసలకుం బాఱి చన నంబరాంతరంబున నిలువ నోపక దివిజరాజరాజధాని కారావ రుద్ధముదిరంబులఁ గదియం బఱచు శంపాలతావితానంబుల మేనులం గురియు తత్ప్రయాణ జంజన్య మాన స్వేదోదబిందు సందోహంబులయందంబున నక్షత్రమార్గాభియాయి నక్షత్రబాణగణ పాపట్యమాన గర్భస్థలీ సనీస్రస్యమాన పాండుజ్వలన గుళికాజాతంబులపైఁ జూపులు నిలుపుచు, నశేషజగజ్జనజేగీయ మాన చిత్రసృజనాపారీణ లోహకారకౌశికవారంబు లపరిమితంబుగా నిజచమత్కారంబునం బుట్టింపఁ బట్టఁ జాలమిం బగులు వేధోండభాండమండలంబువలన బలువడి వెడలి నలుదిక్కులకుఁ బఱచు నుజ్జ్వల జ్యోతిర్జాతంబులతీరున బంభజ్యమాన ఘటబాణపటలంబుల నిర్గమించు నానాళిబాణంబులం గాంచి మెచ్చుచుఁ, గబరికావిన్యస్తచాంపేయప్రసవ చరీచర్యమాణ పరాగపాళికావలయంబులుం గమనీయ ధూమప్రరోహాంతరాంతర బనీభ్రశ్యమాన తనుతరానలకణాలికావలయంబులుం బరస్పరంబు సతీర్థ్య త్వంబునం జూపట్టు నుదారభ్రమణయంత్రంబుల గుండ్రవరుసలు దిరుగు తెఱగంటికంటితో నద్వైతవాదం బులు సేయు ననల్పశిల్పికరయష్టికాగ్ర బంభ్రమ్యమాణ చక్రబాణచక్రంబులఁ జూపున నాక్రమించుచుఁ, దమోరిపుత్రీయ మహామహోనివహంబులు తృణీకరించి నిరర్గళనీరంధ్రపట్టాతపవారణచ్ఛాయా కపటం

బున౹ బుడమి నంతయు నాక్రమించు కటికచీ౹కటి గని భయంబు పుట్ట౹ బాతాళంబు౹ జొర౹బాఱి యనేక దేశాధినాయక చమూసహచరణన్యాసంబున నచ్చట నిలువ లేక యవారితవారవాణ సాహో నినాద పాఫల్యమాన ధరాభాగంబున నొక్క మొత్తంబుగా గ్రక్కునం బైకి వెడలు తైజసత్ర్యణుకపరంపరల పెంపున భ్రాంతి వుట్టింప నిగుడు బిఱుసులమిణుంగురుల వీక్షించుచు, నిరతసురతతి వర్ణ్యమాన వితీర్ణిచాతురీ పో పుష్యమాణంబు లగురారణ్యమాన మానితబిరుదశంఖధ్వానంబుల౹ దనశుభంబు దెలిసి యది తిలకింప నేతెంచిన సత్కీర్తిప్రవాహంబు పోలికం బ్రకాశించు నహర్వర్తికామరీచిధట్టంబుల దృగ్ధామంబులం గట్టుచు, నిర్వేలసూర్యజ్యోతిఃప్రభావసద్యోంతర్హితుం డగుట నన్నెలమిన్నం గన్నుల౹గానక తాతప్యమానాంతరం బున వియత్తలంబున నంబుజారిబింబసత్వం బైన౹ గనుంగొనుదుము గాక యని చయ్యన నెగసి యగణిత పారలోకసంఘ సంఘర్షణోత్పతద్భుజాంగదమణిచూర్ణపరంపర నిండార౹ గప్పిన నచ్చటం జూడనోపమి సంజాతమూర్ఛామహత్త్వంబున గ్రక్కునం ద్రెళ్లు నీలోత్పలకులంబుచెలువున వలు౹దకంబంబుల పయి నుండి జల్లున రాలు నీలోత్పలబాణకులంబులం గని యలరుచు, సుకరభ్రమరకప్రకరభాగ్యంబును, సురు చిరకైరవదళలోచనసమ్మదకృత్స్వరూపవైఖర్యంబును, సుందరకింజల్కమాంజుల్యంబును, శోభిల్ల నుల్ల సిల్లు సల్లకీపల్లవాధరామతల్లికల సరసకళాపాళికా రోచమాన కువలయేశసేవామనోరథంబున నేతెంచిన కుముదలతికలంగా౹ దల౹చి నభోంతరవావస్యమాన మరున్మానవతీపాతితసంతానలతాంత జాగళ్యమాన మరందబిందుసందోహకుహనా మహితహిమపృషద్వర్షంబుల కెట్టు లోర్చునని తన్మైత్రీగౌరవంబున నీడ౹ జేరిన చంద్రాతపమండలంబు బెడంగున౹ గురంగలోచనామణులపై నెత్తిన యుల్లాభంబుపై దృష్టి వెల్లివిరి యించుచు, నభంగుర మార్దంగిక మృదంగ ధిమిర్ధిమిధ్వానంబులు నతివేలతాళిక తాళ నిస్వానంబులు ననూన వాంశిక వంశికానేకరాగతానంబులు నసమాన గాయక మానంబులు నతిశయిల్ల నాత్మీయ తాం డవవిలాస ప్రతిమాన భావభావనా నరీనృత్యమాన సురమీనలోచనా జనంబుల మీ౹దికిం గుప్పించి తిరస్క రించి మరలం జేరు తీరున లా౹గులు వైచుచుం బఱతెంచు బిరుదుపాత్రల నేత్రంబు నానుచు, నసదృశం బును, నవాఙ్మనసగోచరంబును, నత్యద్భుతంబును, నభూతపూర్వంబును, ననితరలభ్యంబును నగు వైభవంబున౹ బాంచాలభూపాలమందిరంబు చేరం జనుసమయంబున. 48

టీక: ఇవ్విధంబునన్=ఇత్తెఱంగున; సకల దిగ్రాజ నియోజిత నానావిధ దివ్యమణివిభూషణ భూషిత గాత్రుండు– సకల= ఎల్ల, దిగ్రాజ=దిక్పాలకులచే, నియోజిత=పంప౹బడిన, నానావిధ=పలుతెఱంగులగు, దివ్యమణివిభూషణ=శ్రేష్ఠమగుమణిభూష ణములచే, భూషిత=అలంకరింప౹బడిన, గాత్రుండు=శరీరముకలవా౹డు; అగుచున్; ఆసుచంద్రధరాకళత్రుండు=ఆ సుచంద్ర భూపతి, ఈపదమునకు ‘చేరంజను సమయంబునన్’ అనువచనాంతముతో నన్వయము; నిశాముఖకృత్యంబులు=సాయం కాలమందు౹ జేయ౹దగినవి; నిర్వర్తించి = తీర్చి; మించినముదంబునన్ =హెచ్చిన సంతోషముతో; వేల్పుదొర = ఇంద్రు౹డు ; అంచిన చౌదంతిన్=పంపినయైరావతమును; ఎక్కి= ఆరోహించి; ఉదయనగవజ్రశృంగాగ్రవిద్యోతమానుండు– ఉదయనగ=

పొడుపుకొండయొక్క, వజ్రశృంగ=రవలశిఖరముయొక్క, అగ్ర=తుదియందు, విద్యోతమానుండు=వెలుఁగుచున్నవాఁడు; అగు అరుణభానుండోయనన్=అయిన సూర్యుఁడో యనఁగ; అఖిల చక్రలోచన సమ్మోద సంపాదక మహః స్ఫురణంబునన్– అఖిల=సమస్తమైన,చక్ర=చతురంగబలములయొక్కయు, జక్కవలయొక్కయు, లోచన=కన్నులకు, సమ్మోద=సంతసమును, సంపాదక=కూర్చుచున్న, మహః=ప్రతాపముయొక్క, తేజస్సుయొక్క, స్ఫురణంబునన్=వ్యాప్తిచే; పొలుపొందుచున్=ఇంపొందుచు; అభినవ్య శాతకుంభ కుంభ వారాంచిత పాండురాతపత్ర సహస్రంబు– అభినవ్య =మిగులక్రొత్తయగు, శాతకుంభ=బంగరుయొక్క, కుంభ=గుబ్బలయొక్క, వార=గుంపుచే, అంచిత=ఒప్పిన, పాండుర=తెల్లని, ఆతపత్ర=గొడుగులయొక్క, సహస్రంబు=వేయి; చుట్టు వలగొనన్=తనచుట్టును జుట్టుకొనియుండఁగా; అరుణమణి గణ సంస్యూత ఫణిరమణ ఫణాదశశత మధ్యస్థితుండు–అరుణమణి=కెంపులయొక్క,గణ=గుంపుచే, సంస్యూత =కూర్పఁబడ్డ, ఫణిరమణ= ఆదిశేషునియొక్క, ఫణా=పడగలయొక్క, దశశత=వేయింటియొక్క, మధ్యస్థితుండు=నడుమ నున్న వాఁడు; అగు నృసింహదేవుండునుంబోలెన్=అయిన నరసింహస్వామియువలె; అపరిమిత విబుధ మనఃపథ జరీజృభ్యమాణ మహాద్భుత సంవర్ధక విగ్రహ ప్రకాశంబునన్—అపరిమిత=మితిలేని, విబుధ=పండితులయొక్క,దేవతలయొక్క, మనః= చిత్తములయొక్క, పథ=మార్గమందు, జరీజృభ్యమాణ=మిక్కిలివిజృంభించుచున్న, మహాద్భుత=గొప్పయబ్బురమునకు, సంవర్ధక=పోషకమగు, విగ్రహ=యుద్ధముయొక్క, శరీరముయొక్క, ప్రకాశంబునన్=కాంతిచేత; పొగడొందుచున్=మెప్పు వడయుచు; ఆత్మోత్సవ సందర్శన లాలసా నానంద్యమాన పౌరమానవతీజనంబులు – ఆత్మ=తనయొక్క, ఉత్సవ=వేడుకయొక్క, సందర్శన=దర్శనమందు, లాలసా =ఔత్సుక్యముచేత, నానంద్యమాన=మిక్కిలిహర్షించుచున్న, పౌరమానవతీజనంబులు=పురస్త్రీలు; చల్లు మల్లికా మాఘ్యాది వల్లికా కోరక వారంబులు –చల్లు=వెదచల్లుచున్న, మల్లికా=మల్లెలు, మాఘ్యా =కుందములు, ఆది=మొదలుగాఁగల, వల్లికా= తీగెలయొక్క, కోరక=మొగ్గలయొక్క, వారంబులు= సమూహములు; చుట్టున్=అంతటను; ఆవరింపన్ = వలగొనఁగా; శీతశైల హిమాధిదేవతా వికీర్యమాణ మిహికా ఘటికా పటల సంవృతమూర్తియగుదక్షిణామూర్తి తెఱంగునన్– శీతశైల=హిమవత్పర్వతముయొక్క, హిమ=మంచునకు, అధిదేవతా=అధిష్ఠానదేవతచేత, వికీర్యమాణ=చల్లఁబడిన, మిహికా=మంచుయొక్క, ఘటికా=బలపములయొక్క, పటల= సమూహముచే, సంవృత= ఆవరింపఁబడిన, మూర్తి=శరీరముగల వాఁడు, అగు=అయినట్టి, దక్షిణామూర్తి తెఱంగునన్ = దక్షిణామూర్తిపగిది; దిగ్దళన కలనా వరీవృత్యమాన సద్గణ కోలాహలంబులకున్–దిక్=దెసలయొక్క, దళన=భేదనమను, కలనా =వ్యాపారముచే, వరీవృత్యమాన=మిక్కిలి వర్తించుచున్న, సద్గణ =విద్వద్గణముయొక్క, ప్రమథగణములయొక్క, కోలాహలంబులకున్= కలకలధ్వనులకు; ఇంపుఁబూనుచున్=సంతసించుచు; పార్శ్వద్వయ పరిభ్రాజమాన గజాధిరాజాధిరోహి సామంతమహీకాంత సంవీజ్యమాన ధవళవాల వ్యజనంబులు – పార్శ్వద్వయ=ఇరుప్రక్కలయందు, పరిభ్రాజమాన =మిక్కిలివెలుఁగుచున్న, గజాధిరాజ=గజరాజములను,అధిరోహి =ఎక్కిన, సామంతమహీకాంత=సమీపదేశాధిపతులచేత, సంవీజ్యమాన=లెస్సగా వీవఁబడిన, ధవళవాల=చామరములయొక్క, వ్యజనంబులు=వీచోపులు; అసమాన పవమానమందయాన వైఖరిన్– అసమాన=సాటిలేని, పవమాన=వాయువుయొక్క, మందయాన=తిన్ననినడకయొక్క, వైఖరిన్=రీతిచేత; చాంచల్యమాన నవీన కాశమాలికలు – చాంచల్యమాన=కదలుచున్న, నవీన=క్రొత్తలగు, కాశమాలికలు= ఱెల్లుపూవుల దండలు; అన్ మనంబు= అను భావమును; పొదలింపన్=అతిశయింపఁజేయఁగా, మనమునకు కాశమాలిక లని తోఁచునటులు చేయఁగా నని భావము; మహీతలంబునన్=భూతలమందు; తోఁచిన శరద్దినదైవంబు తెఱంగునన్ –తోఁచిన=కనుపడిన, శరద్దినదైవంబు=శరత్కాలాధిదేవతయొక్క, తెఱంగునన్=రీతి గా; అనేకరాజహంస సంసేవ్యమానుండు—అనేక=పెక్కులగు, రాజహంస=రాజశ్రేష్ఠులచేతను, రాయంచలచేతను, సంసేవ్యమానుండు=కొలువఁబడుచున్నవాఁడు; అయి విరాజిల్లుచు =అగుచు వెలుంగుచు;

అగణేయ తపనీయ ఢంఢికా తుత్తుంభికా తమ్మట తమామికా ప్రముఖ బహుముఖ వాద్యనిస్వానంబులన్ – అగణేయ=ఎన్న రాని, తపనీయ=సువర్ణమయమైన, ఢంఢికా=భేరులు, తుత్తుంభికా=తుతారాలు, తమ్మట=తప్పెటలు, తమామికా=డమార ములు, ప్రముఖ= మొదలుగాఁగల, బహుముఖ=అనేకవిధములైన, వాద్య=వాద్యములయొక్క, నిస్వానంబులన్=ధ్వనుల చేత, అలరి=సంతసించి; తదేకమంగళంబు – తత్=ప్రసిద్ధమైన, ఏక=ముఖ్యమైన, మంగళంబు=వివాహరూపమంగళమును; అవలోకింపన్=చూచుటకై; తివురన్=ప్రయత్నింపఁగా; షడ్ద్వయవిభాకరులు=పన్నిద్దఱుసూర్యులు; తమతమప్రియజనం బుల కరంబులకున్=తమతమ యిష్టజనులచేతులకు; ఒప్పగించి=స్వాధీనపఱచి; అంచినన్=పంపఁగా; ఏతెంచి = వచ్చి; నిలుచు గురు సమాతత తేజోవిలాస లాలస్యమాన తత్కుమార శతశతంబుల దారిన్ – నిలుచు=నిలుచుండినట్టియు, గురు =తండ్రులగు నాదిత్యులవలెనే, సమాతత=విశాలమగు, తేజః=కాంతులయొక్క,విలాస=విలాసముచేత, లాలస్యమాన = మిగుల వెలుఁగుచున్న, తత్=ఆద్వాదశాదిత్యులయొక్క,కుమార=పుత్రులయొక్క,శతశతంబులదారిన్=పదివేలవిధంబున; దైవాఱు పరిచారిక పాణి భృత గంధ తైల ధారా దేదీప్యమాన దీపికా సమూహంబులన్ – దైవాఱు=ఒప్పుచున్నట్టియు, పరిచా రిక=కొలువుకాండ్రయొక్క, పాణి =కరములందు, భృత=భరింపఁబడిన, గంధతైల=గందపునూనెయొక్క, ధారా=ఆసార ముచే, దేదీప్యమాన=మిగుల వెల్గుచున్న, దీపికా=దివిటీలయొక్క, సమూహంబులన్=గుంపులను; వీక్షాలక్ష్యంబులుగాన్ = దృగ్గోచరంబులనుగా; ఒనర్చుచున్=చేయుచు; ఇరుగడలన్=ఇరుప్రక్కలయందు; ఎడయాక=ఎడఁబాయక; ఆడరు= ఒప్పుచున్న; ఒయ్యారంబునన్= విలాసముచేత; నడచు గణికాగణంబులన్=నడచుచున్నట్టి నాగవాసములను; కనుంగొని =చూచి; తొంగలించు మోహంబునన్ =అతిశయించుమోహముచేత; తదేకతానతన్=తదేకాయత్తమైన చిత్తముచేత; పొలుచు నభోవితర్దికాసీన నిర్జరస్తోమంబులపైన్ – పొలుచు=ఒప్పుచున్న, నభోవితర్దికా=ఆకసమనునరుఁగునందు, ఆసీన=కూర్చున్న, నిర్జర=వేల్పులయొక్క, స్తోమంబులపైన్=గుంపులపై; కంతుఁడు=వలరాజు; తత్సమయ సముచిత బహురూపంబులు – తత్స మయ=ఆవేళకు, సముచిత=తగినట్టి, బహురూపంబులు=పలురీతులగు రూపములను; అంగీకరించి=కైకొని; ప్రయోగించు నిర్వేల జ్వాలాకుల జ్వాజ్వల్యమాన కలంబ కదంబకంబుల డంబునన్ – ప్రయోగించు=విడుచునట్టి, నిర్వేల=మేరలేని,జ్వాలా =మంటలయొక్క, కుల=సమూహముచేత, జాజ్వల్యమాన=మండుచున్న, కలంబ=బాణములయొక్క, 'కలమ్బ మార్గణ శరాః' అని యమరుఁడు, కదంబకంబుల=సమూహములయొక్క, డంబునన్=రీతిగా; యంత్రకారవారంబులు = బాణ యంత్రములుచేయువారియొక్కసమూహములు; ఒక్కమొత్తంబుగాన్=ఒక్కుమ్మడిగా; ముట్టింపన్=అంటింపఁగా; పఱచు నాకాశబాణంబులన్ – పఱచు=పాఱుచున్న, ఆకాశబాణంబులన్=ఆకాశచివ్వలను; అవలోకించుచున్=చూచుచు; సర్వంసహాజన శ్రవణపర్వంబుగాన్ – సర్వంసహా=ఎల్లపుడమియందుఁగల, జన=నరులయొక్క, శ్రవణపర్వంబుగాన్= వీనులకుపండుగుగా; నిజానవద్య పద్యగద్యంబులు – నిజ=తనసంబంధులైన, అనవద్య= నిర్దుష్టములైన, పద్యగద్యంబులు =పద్యములు గద్యములు; చదువుచున్=పఠించుచు; పఱతెంచు యాచక కవీశ లోకంబులకున్ – పఱతెంచు=వచ్చునట్టి, యాచక=అర్థులకును, కవీశ= కవీశ్వరులయొక్క, లోకంబులకున్=సమూహములకును; ఆత్మీయ బంధు మిత్ర దండనాథ పురోహిత ముఖ్యులు –ఆత్మీయ =తనసంబంధులగు, బంధు=బందుగులును, మిత్ర=స్నేహితులును, దండనాథ=సేనాధిపతు లును, పురోహిత=పురోహితులును, ముఖ్యులు=మున్నగువారు; దోయిళ్లన్= అంజలులయందు; ముంచి=నించి; వెదచల్లు నవరత్న సువర్ణజాలంబులతోన్ –వెదచల్లు=పాఱఁజల్లుచున్న, నవరత్న=నవరత్నములయొక్క, సువర్ణ=బంగరు నాణ్యె ములయొక్క, జాలంబులతోన్=సమూహములతో; వైమత్యంబు=విరోధమును; ఊను కారు నికర కర శృంగ సముత్పాత్య మాన చారు ధమనికా శిఖి స్ఫులింగికానికాయంబులన్ – ఊను=పొందుచున్న, ఇది స్ఫులింగనికాయములకు విశేషణము,

కారు=బాణములను జేయు శిల్పులయొక్క, నికర=సంఘములయొక్క, కర=హస్తమందున్న, శృంగ=కొమ్ములవలన, సముత్పాత్యమాన=ఎగయింపఁబడిన, చారు = సుందరమగు, ధమనికా=గొట్టములయొక్క,శిఖి=అగ్నియొక్క, స్ఫులింగికా=మిడుఁగుఱులయొక్క,నికాయంబులన్ =సమూహములను; కాంచి=చూచి; వేడుకఁ బూనుచున్=సంతసమును వహించుచు; ఉత్తుంగ మాతంగ చక్రాంగ సంఘాత సంఘటిత జయపతాకాగ్రతట హాటకపటాంచల టేటిక్యమాన పవమాన ధారా నిర్ధూతంబై– ఉత్తుంగ=ఉన్నతమగు, మాతంగ=గజములయొక్క, చక్రాంగ=రథములయొక్క, సంఘాత=సమూహమందు, సంఘటిత=చేర్పఁబడిన, జయపతాకా=విజయధ్వజములయొక్క, అగ్రతట=అగ్రభాగమందున్న, హాటకపట=బంగరువస్త్రముయొక్క, అంచల=పార్శ్వభాగములను, టేటిక్యమాన=పొందుచున్న, పవమాన=వాయువులయొక్క, ధారా =ఆసారముచేత, నిర్ధూతంబై=ఎగయింపఁబడినది యై; స్వాశ్రయరూపజలదవ్రాతంబు– స్వ=తమకు, ఆశ్రయరూప= ఉనికిపట్టగు, జలదవ్రాతంబు=మబ్బులగుంపు; దెసలకున్= దిక్కులకు; పాఱి=పఱచి; చనన్= పోఁగా; అంబరాంతరంబునన్ = ఆకసమునడుమ; నిలువ నోపక=నిలుచుండలేక; దివిజ రాజ రాజధాని కారావరుద్ధ ముదిరంబులన్–దివిజరాజ=ఇంద్రుని యొక్క, రాజధాని=రాచవీటియొక్క, కారావరుద్ధ=చెఱయం దుంపఁబడిన, ముదిరంబులన్=మబ్బులను, 'ఘన జీమూత ముదిరాః' అని యమరుఁడు; కదియన్=పొందుటకై; పఱచు శంపాలతావితానంబుల మేనులన్– పఱచు = పాఱుచున్న, శంపాలత=మెఱపుతీవలయొక్క, వితానంబుల=సమూహములయొక్క, మేనులన్= శరీరములయందు; కురియు తత్ప్రయాణ జంజన్యమాన స్వేదోదబిందు సందోహంబుల యందంబునన్– కురియు=వర్షించుచున్న, తత్=ఆమెఱపుతీవల యొక్క, ప్రయాణ=ప్రకృష్టగమనమువలన, జంజన్యమాన=మిక్కిలి పుట్టుచున్న, స్వేదోదబిందు= చెమటనీటిబిందుల యొక్క, సందోహంబుల=సమూహములయొక్క, అందంబునన్=సొంపుచేత; నక్షత్రమార్గాభియాయి నక్షత్రబాణగణ పాపట్యమాన గర్భస్థలీ సనీస్రస్యమాన పాండుజ్వలన గుళికాజాతంబులపైన్–నక్షత్రమార్గ=ఆకాశమార్గమును, అభియాయి =పొందుచున్న, నక్షత్రబాణ=నక్షత్రబాణములయొక్క, గణ=సమూహముయొక్క, పాపట్యమాన= పగులుచున్న, గర్భస్థలీ=కడుపుపట్టులనుండి, సనీస్రస్యమాన=బాగుగా జాఱుచున్న, పాండు=తెల్లనైన, జ్వలనగుళికా= అగ్గియుండలయొక్క, జాతంబులపైన్=సంఘములమీఁద; చూపులు=వీక్షణములను; నిలుపుచున్=ఉంచుచు; అశేష జగ జ్జన జేగీయమాన చిత్ర సృజనా పారీణ లోహకార కౌశికవారంబులు– అశేష=సమస్త మగు, జగత్=లోకములందుండు, జన=నరులచేత, జేగీయమాన=నుతింపఁబడిన, చిత్రసృజనా=విచిత్రములగు పదార్థముల సృష్టియందు, పారీణ=పారంగతులగు, లోహకార=లోహకారు లనెడు, కౌశికవారంబులు=విశ్వామిత్రుల సమూహములు; అపరిమితంబుగా=పరిమితి లేనట్లు; నిజచమత్కారంబునన్ —నిజ=స్వకీయమగు, చమత్కారంబునన్=చమత్కృతిచేత; పుట్టింపన్=సృష్టిచేయఁగా; పట్టఁజాలమిన్=ఇముడఁజాలకుండుటవలన; పగులు వేధోండభాండ మండలంబువలనన్– పగులు=చీలిన, వేధోండభాండ =బ్రహ్మాండభాండముయొక్క, మండలంబువలనన్=మండలాకారములవలన; బలువడిన్; వెడలి=వెలువడి; నలుదిక్కులకున్=నాల్గు దిశలకు; పఱచు నుజ్జ్వల జ్యోతిర్జాతంబులతీరునన్– పఱచు=పాఱుచున్న, ఉజ్జ్వలత్=ప్రకాశించుచున్న, జ్యోతిర్జాతంబుల = రిక్కలగుంపుల యొక్క, తీరునన్=తెఱఁగున; బంభజ్యమాన ఘటబాణ పటలంబులన్– బంభజ్యమాన =పగిలిన, ఘటబాణ= కుండబాణములయొక్క, పటలంబులన్=సమూహములవలననుండి; నిర్గమించు నానాళిబాణంబులన్– నిర్గమించు=వెడలుచున్న, నానా=అనేకవిధములగు, అళిబాణంబులన్=తుమ్మెదబాణములను, లేదా, తేలుబాణములను; కాంచి=చూచి; మెచ్చుచున్ =శ్లాఘించుచు; కబరికావిన్యస్త చాంపేయప్రసవ వరీచర్యమాణ పరాగపాళికా వలయంబులున్– కబరికా=ధమ్మిల్లమందు, విన్యస్త=ఉంచఁబడిన, చాంపేయప్రసవ=సంపెఁగపూలయందు, వరీచర్యమాణ=మిక్కిలి ప్రసరించుచున్న, పరాగపాళికా = పుప్పొడిబంతులయొక్క, వలయంబులున్=కడియములును, అనఁగ సంపెంగపుష్పములయొక్క వలయాకృతిఁ బూనిన

పరాగము లని భావము; కమనీయ ధూమ ప్రరోహాంతరాంతర బనీభ్రశ్యమాన తను తరానలకణాలికా వలయంబులున్ – కమనీయ=మనోహరమగు, ధూమ=పొగయొక్క, ప్రరోహ=అంకురముయొక్క, అంతరాంతర=నడుమనడుమ, బనీభ్రశ్యమాన=పడుచున్న, తనుతర=అతిసూక్ష్మమగు, అనలకణ=అగ్నికణములయొక్క, ఆలికా=శ్రేణులయొక్క, వలయంబులున్=కడియములును; పరస్పరంబు=అన్యోన్యము; సతీర్థ్యత్వంబునన్=ఏకగురుత్వముచేత, అనఁగా సామ్యముచేత ననుట; చూపట్టన్=చూపట్టుచుండఁగా, ఆపరాగపాళికావలయంబులును, అనలకణాలికావలయంబులును నొకటికొకటి సమానమై చూపట్టుచుండఁగ నని భావము;ఉదార భ్రమణయంత్రంబులన్ – ఉదార=ఉత్కృష్ట మగు, భ్రమణయంత్రంబులన్=తిరుగు యంత్రములయందు, మనుష్యులు విలాసార్థముగ నెక్కి గుండ్రముగఁ దిరుగు యంత్రవిశేషములం దనుట; గుండ్రవరుసలు=గుండ్రముగాఁ దిరుగు క్రమములను; తిరుగు తెఱగంటికంటితోన్=తిరుగుచున్న మత్స్యమువంటి నేత్రములుగల దేవాంగనతో; అద్వైతవాదంబులు=అభేదవాదములను; చేయు అనల్ప శిల్పి కర యష్టి కాగ్ర బంభ్రమ్యమాణ చక్రబాణ చక్రంబులన్ – చేయు=తనర్చుచున్న, అనల్ప =అధికమగు, శిల్పి=శిల్పకారులయొక్క,కర=హస్తమందున నుండు, యష్టికా=దండములయొక్క, అగ్ర=కొనలందు, బంభ్రమ్యమాణ=తిరుగుచున్న, చక్రబాణ=చక్రబాణములయొక్క, చక్రంబులన్=సంఘములను; చూపులన్=దృష్టులచేత; ఆక్రమించుచున్=అలముచు; తమోరి పుత్రీయ మహామహోనివహంబులు – తమః= అంధకారమునకు, అరి=శత్రుఁడగు సూర్యునియొక్క, పుత్రీయ=పుత్రుఁడగు యమునికి సంబంధించిన, లేదా, శనిగ్రహసంబంధియగు, మహత్=అధికమగు, మహః=కాంతులయొక్క, నివహంబులు=సమూహములను, అనఁగా నల్లనికాంతి సమూహములను; తృణీకరించి = తిరస్కరించి; నిరర్గళ నీరంధ్ర పట్టాతపవారణ చ్ఛాయా కపటంబునన్ – నిరర్గళ =అప్రతిహతమగు, నీరంధ్ర=దట్టమగు, పట్టాతపవారణ=పట్టుగొడుగులయొక్క, ఛాయా=నీడయొక్క,కపటంబునన్ = వ్యాజముచేత; పుడమి నంతయున్=నేలనెల్లను; ఆక్రమించు కటికచీఁకటిన్—ఆక్రమించు=అలముచున్న, కటికచీఁకటిన్= గాఢాంధకారమును; కని=వీక్షించి; భయంబు=వెఱపు; పుట్టన్=తోఁపఁగా; పాతాళంబు=పాతాళలోకమును; చొరఁబాఱి=ప్రవేశించి; అనేక దేశాధినాయక చమూ సహచరణ న్యాసంబునన్ – అనేక=అనేకులగు, దేశాధినాయక=దేశాధిపతులయొక్క, చమూ=సేనలయొక్క, సహచరణన్యాసంబునన్=యుగపచ్చరణవిన్యాసములచేత; అచ్చటన్=ఆయధోభువనమందు; నిలువ లేక=నిలుచుండ లేక; అవారిత వారవాణ సాహోనినాద పాఫల్యమాన ధరాభాగంబునన్ – అవారిత=నివారించుట కశక్యమగు, వారవాణ= కంచుకులయొక్క, 'కంచుకో వారవాణోస్త్రీ' అని యమరుఁడు, సాహోనినాద= 'పరాక్' అను ధ్వనులచేతను, పాఫల్యమాన=చీలిన, ధరాభాగంబునన్=భూదేశమందు; ఒక్క మొత్తంబుగాన్=ఒకసమూహముగా; గ్రక్కునన్= శీఘ్రముగ; పైకిన్=మీఁదికి; వెడలు తైజస త్ర్యణుక పరంపరల పెంపునన్ – వెడలు=బయలుదేఱుచున్న, తైజస=తేజస్సంబంధులగు, త్ర్యణుక=త్రసరేణువుల యొక్క, పరంపరల పెంపునన్=పరంపరలయొక్క యతిశయమో యనునట్లు; భ్రాంతి పుట్టింపన్=భ్రమ గలుఁగఁజేయునట్లు; నిగుడు బిఱుసులమిణుంగురులన్ – నిగుడు=వ్యాపించు, బిఱుసుల=బిఱుసులయొక్క, మిణుంగు రులన్ = మిడుఁగుఱులను; వీక్షించుచున్=చూచుచు; నిరత సురతతి వర్ణ్యమాన వితీర్ణి చాతురీ పోపుష్యమాణంబులు – నిరత= ఎల్లపుడు, సురతతి=వేల్పులగమిచేత, వర్ణ్యమాన=పొగడఁబడుచున్న, వితీర్ణి=దానముయొక్క, చాతురీ=చాతుర్యముచేత, పోపుష్యమాణంబులు=మిక్కిలి పోషింపఁబడినవి; అగు రారణ్యమాన మానితబిరుదశంఖధ్వానంబులన్ – అగు =అయిన, రారణ్యమాన=మిగుల మ్రోయుచున్న, మానిత=శ్రేష్ఠమగు, బిరుదశంఖ=సామర్థ్యచిహ్నములయొక్క, ధ్వానంబులన్ = ధ్వనులచేత; తనశుభంబు=తనయొక్క శుభమును; తెలిసి=గుర్తెఱింగి; అది తిలకింపన్=ఆమంగళమును చూచుటకై; ఏతెంచిన సత్కీర్తి ప్రవాహంబు పోలికన్ – ఏతెంచిన=చనుదెంచిన, సత్కీర్తి=మంచికీర్తియొక్క, ప్రవాహంబు పోలికన్= ప్రవాహముయొక్క రీతిచేత; ప్రకాశించు నహర్వర్తికామరీచిధట్టంబులన్ – ప్రకాశించు=వెలుఁగుచున్న, అహర్వర్తికా= పగలువత్తులయొక్క,

మరీచి=కాంతులయొక్క, ఘట్టంబులన్=సమూహములను; దృగ్ధామంబులన్—దృక్= దృష్టులయొక్క, ధామంబులన్= కాంతులచేత; కట్టుచున్=బంధించుచు; నిర్వేల సూర్యజ్యోతిః ప్రభావ సద్యోంతర్హితుం డగుటన్ – నిర్వేల= అధికమగు, సూర్యజ్యోతిః=బాణవిశేషములయొక్క, ప్రభావ=మహిమచేత, సద్యః=తత్కాలమందు, అంతర్హితుండగుటన్ =మఱుఁగుపడినవాఁడగుటచేత; అన్నెలమిన్నన్=ఆచంద్రుని; కన్నులంగానక=చూడక; తాతప్యమానాంతరంబునన్ – తాతప్యమాన= పరితపించుచున్న, అంతరంబునన్=మనస్సుచేత; వియత్తలంబునన్=ఆకసముపట్టున; అంబుజారిబింబ సత్వం బైనన్ – అంబుజారిబింబ=చంద్రబింబముయొక్క, సత్వం బైనన్=సత్త్వమైనను; కనుంగొనుదుము గాక యని=చూచెద మని; వయ్యనన్=శీఘ్రముగా; ఎగసి=పైకిలేచి; అగణిత పారలోకసంఘ సంఘర్షణోత్పత ద్భుజాంగద మణిచూర్ణ పరంపర – అగణిత=లెక్కింపనలవికాని, పారలోక=పరలోకమందలి నిర్జరాదులయొక్క, సంఘ=బృందముయొక్క, సంఘర్షణ= ఒరయుటచేత, ఉత్పతత్= ఎగయుచున్న, భుజ=బాహువులయొక్క, అంగద=కేయూరములయొక్క, మణి=మణులయొక్క, చూర్ణ=పొడియొక్క, పరంపర=సమూహము; నిండారన్=పరిపూర్ణముగ; కప్పినన్=కప్పఁగా; అచ్చటన్=ఆస్థలమందు; చూడనోపమిన్=కనఁజాలమివలన; సంజాత మూర్ఛా మహత్త్వంబునన్ – సంజాత =పుట్టినట్టి, మూర్ఛా= మూర్ఛయొక్క, మహత్త్వంబునన్= మహిమచే; గ్రక్కునన్=శీఘ్రముగ; త్రెళ్లు నీలోత్పలకులంబు చెలువునన్ – త్రెళ్లు= పడుచున్న, నీలోత్పల=నల్లగల్వలయొక్క, కులంబు చెలువునన్=గుంపుయొక్క అందముచేత; వలుఁద కంబంబుల పయిన్ –వలుఁద=స్థూలమగు, కంబంబులపయిన్= స్తంభములమీఁదనుండి; జల్లున రాలు నీలోత్పల బాణకులంబులన్– జల్లున రాలు=జల్లుమను శబ్దముతోఁబడుచున్న, నీలోత్పలబాణ=నల్లగలువబాణములయొక్క, కులంబులన్=సమూహములను; కని=చూచి; అలరుచున్=సంతసించుచు; సుకర భ్రమరక ప్రకర భాగ్యంబును – సుకర=సులభమగు, భ్రమరక=ముంగురులయొక్క, తుమ్మెదలయొక్క, ప్రకర=సంఘముయొక్క, భాగ్యంబును =అతిశయమును; సురుచిర కైరవదళలోచన సమ్మదకృ త్స్వరూప వైఖర్యంబును – సురుచిర= మిక్కిలి మనోహరమైన, కైరవదళలోచన=తొవతేకుల వంటి కన్నులచేత, తొవతేకులనెడు కన్నులచేత నని కుముదినీ పరమగు నర్థము, సమ్మదకృత్=సంతసమును జేయుచున్న, స్వరూప=అకృతియొక్క, వైఖర్యంబును= రీతియును; సుందర కింజల్క మాంజుల్యంబును – సుందర=మనోజ్ఞమగు, కింజల్క=అకరువుయొక్క, కేసరములయొక్క యని కుముదినీ పరమైన యర్థము, మాంజుల్యంబును=చక్కఁదనమును; శోభిల్లన్=ప్రకాశించునట్లు; ఉల్లసిల్లు సల్లకీపల్లవాధరామతల్లికలన్ – ఉల్లసిల్లు=ప్రకాశించు, సల్లకీపల్లవాధరామతల్లికలన్ = అందుగుచిగురాకువంటి మోవిగల ఉత్తమస్త్రీల యందు; సరస కళాపాళికారోచమాన కువలయేశ సేవా మనోరథంబునన్ – సరస= శ్రేష్ఠమగు, కళా=కాంతులయొక్క, పాళికా=శ్రేణిచేత, రోచమాన=ప్రకాశించు, కువలయేశ=చంద్రునియొక్క, సేవామనోరథంబునన్=సేవింపవలెనను కోరికచేతను; ఏతెంచిన కుముదలతికలంగాన్ – ఏతెంచిన=వచ్చిన, కుముదలతికలంగాన్=కలువతీవలనుగా; తలఁచి=భ్రమించి; కుముదలతికలను భ్రాంతిచేత నని భావము; నభోంతర వావస్యమాన మరున్మానవతీ పాతిత సంతానలతాంత జాగళ్యమాన మరందబిందు సందోహ కుహనా మహిత హిమపృష ద్వర్షంబులకున్ – నభోంతర=ఆకాశమధ్యమున, వావస్యమాన= నివసించియున్న, మరున్మానవతీ= దేవాంగనలచేత, పాతిత=పడవైవఁబడిన, సంతానలతాంత=కల్పతరుపుష్పములవలన, జాగళ్యమాన=మిక్కిలి స్రవించుచున్న, మరందబిందు=మకరందపుచినుకులయొక్క, సందోహ=నివహమనెడి, కుహనా= కపటముచే, మహిత=ఒప్పిన, హిమపృషత్=మంచుబొట్లయొక్క, వర్షంబులకున్=వానలకు; ఎట్టు లోర్చునని=ఎట్లు సహించునని; తన్మైత్రీగౌరవంబునన్ – తత్=ఆతొవతీవలయొక్క, మైత్రీ=మిత్రత్వమునందు, గౌరవంబునన్=ఆదరముచేత; నీడగాఁ జేరిన చంద్రాతపమండలంబు బెడంగునన్ – నీడగాన్=ఆచ్ఛాదనగా, చేరిన=పొందిన, చంద్రాతపమండలంబు బెడంగునన్=వెన్నెలమండలంబుపగిది;

కురంగలోచనామణులపైన్=స్త్రీలమీఁద; ఎత్తిన యుల్లాభంబులపైన్=ఎత్తిన మేల్కట్లు మీఁద; దృష్టి=చూపు; వెల్లి విరియించుచున్=ప్రవహింపఁజేయుచు; అభంగుర మార్దంగికమృదంగ ధిమిర్ధిమి ధ్వానంబులును— అభంగుర=అధికములగు, మార్దంగిక=మృదంగవాదకులయొక్క,మృదంగ=మృదంగసంబంధులగు, ధిమిర్ధిమిధ్వానంబులును= ధిమిర్ధిమిధ్వనులును; అతివేల తాళిక తాళనిస్వానంబులును— అతివేల=అధికమగు, తాళిక=తాళవాదకులయొక్క, తాళ=తాళములయొక్క, నిస్వానంబులును=ధ్వనులును; అనూన వాంశిక వంశి కానేక రాగతానంబులు— అనూన= అధికమగు, వాంశిక=వేణువును వాయించువారియొక్క, వంశికా=వేణువుయొక్క,అనేక=పెక్కులగు, రాగ= భైరవ్యాదిరాగములును, తానంబులు=త యను నక్షరమును జేర్చి పాడునట్టి పాటలును; అసమాన గాయక గానంబులును—అసమాన= సరిలేని, గాయక=పాటకులయొక్క, గానంబులును=గీతములును; అతిశయిల్లన్=అతిశయింపఁగా; ఆత్మీయ తాండవ విలాస ప్రతిమానభావ భావనా నరీనృత్యమాన సురమీనలోచనాజనంబుల మీఁదికిన్— ఆత్మీయ=తమసంబంధి యగు, తాండవ=నాట్యముయొక్క, విలాస=క్రీడతోటి, ప్రతిమానభావ=సాదృశ్యముయొక్క, భావనా=భావనచేత, నరీనృత్యమాన=మిగుల నర్తించుచున్న, సురమీనలోచనా జనంబుల మీఁదికిన్=వేల్పుమచ్చెకంటులమీఁదికి; కుప్పించి =ఎగసి; తిరస్కరించి =తెగడి; మరలం జేరు తీరునన్=మరల వచ్చు పగిది; లాఁగులు వైచుచున్=గంతులువైచుచు; పఱతెంచు బిరుదుపాత్రలన్=ఏతెంచునట్టి సామర్థ్యముగల వేశ్యలను; నేత్రంబులన్=కన్నులచేత; ఆనుచున్=క్రోలుచు, చూచుచు నని భావము; అసదృశంబును=సరిలేనిదియును; అవాఙ్మనసగోచరంబును=మనోవాక్కులకు గోచరముగానట్టిదియును; అత్యద్భుతంబును=అతివిస్మయకరంబును; అభూతపూర్వంబును= మున్నెన్నఁడును లేనిదియును; అనితరలభ్యంబును =ఒరులకుఁ బొందనలవి గానిదియును; అగు వైభవంబునన్=అయినట్టి విభవముచేత; పాంచాలభూపాలమందిరంబు= క్షణదోదయరాజగృహమును; చేరం జనుసమయంబునన్=చేరఁబోవు నపుడు. దీని కుత్తరపద్యస్థక్రియతో నన్వయము.

శా. ఛద్మాన్యాంకురితత్రపాభరయుతేఽక్షారీతి నాలేఖరా
ట్పద్మిం జక్కఁగ నెక్కి వచ్చుధరణీఽభర్తం గనం దత్పురీ
పద్మాస్యామణు లెల్ల సమ్మదము లొఽప్పం జేరి రంచు న్శిర
స్సద్మౌఘంబుల నూపురార్భటిక లోఽజం జాటె వేగస్థితిన్. 49

టీక: ఆలేఖరాట్పద్మిన్=ఆమైరావతమును; చక్కఁగన్=సుందరముగా; ఎక్కి=అధిష్ఠించి; వచ్చుధరణీభర్తన్ = వచ్చుచున్న సుచంద్రుని; ఛద్మాన్యాంకురితత్రపాభరయుతేక్షారీతిన్— ఛద్మాన్య=అకపటముగా, అంకురిత=పొడమిన, త్రపా=లజ్జయొక్క, భర=అతిశయముతో, యుత=కూడుకొన్న, ఈక్షారీతిన్=వీక్షణములయొక్క భంగిచేత; కనన్=చూచుటకు; తత్పురీపద్మాస్యామణు లెల్లన్ =ఆపురకాంతలెల్లరు; సమ్మదములు=సంతసములు; ఒప్పన్=అతిశయింపఁగా; శిర స్సద్మౌఘంబులన్— శిరస్సద్మ=మేడలయొక్క, ఓఘంబులన్=సమూహములందు; చేరి రంచున్=వచ్చిరనుచు; నూపురార్భటికలు – నూపుర=అందెలయొక్క, ఆర్భటికలు=కోలాహలములు; ఓజన్=క్రమముగా; వేగస్థితిన్=శీఘ్రముగ; చాటెన్=చాటించెను.

సుచంద్రుఁడు వేల్పుటేనుఁగు నెక్కి పురవీథియందు వచ్చుచుండఁగాఁ దత్పురకాంత లెల్లరు నారాజచంద్రుని సమ్మదమునఁ జూచుటకు మేడలెక్కిరని యాకాంతలనూపురార్భటి యెల్లరికిని దెలియఁజేయుటకై చాటి వినిచె నని భావము.

సీ. పుణ్యవాసన పొంగి॥పొరలె నాఁ జెమట పై,కొనఁ గప్పురపుపూఁత ॥గుమ్మురనఁగఁ,
బరువూనుబుద్ధి వెం॥బడిఁ బర్వురాగంబు, గతిఁ జలన్మణిహార॥కాంతి నిగుడఁ,
ద్వర నేగ దృక్ప్రేషి॥తవయస్య దెల్పుదా, రి వతంసితాబ్జాత॥భృంగి మ్రోయ,
మోమునభఃకాల॥మునఁ గైశ్యఘనసీమ,సౌరుమిం చనహైమ॥సరము వ్రాల,
తే. నలక లరవీడఁ దనుఁ జూచి ॥యలరి వాడ,సకులు గొనియాడ నంఘ్రుల॥జవము గూడఁ,
జొక్కమగుమేడ కేతెంచె ॥నొక్కప్రోడ, యింపు దొలఁకాడ గోత్రామ॥రేంద్రుఁ జూడ. 50

టీక: పుణ్యవాసన—పుణ్య=మనోజ్ఞమైన, వాసన=వలపు; పొంగి=ఉబికి; పొరలె నాన్=పొర్లెనో యనఁగ; చెమట=స్వేదము; పైకొనన్=కలియఁగా; కప్పురపుపూఁత=కర్పూరగంధము; గుమ్మురనఁగన్=గుమ్మని వాసనగొట్టఁగా; పరువూనుబుద్ధి వెంబడిన్=పరుగెత్తుచున్న మతివెంట; పర్వురాగంబు గతిన్=వ్యాపించునట్టి అనురాగముపగిది; చలన్మణి హారకాంతి=కదలుచున్న మణిసరములయొక్క కాంతి; నిగుడన్=వ్యాపింపఁగా; త్వరన్=త్వరచేత; ఏగన్= పోవుటకు; దృక్ప్రేషితవయస్య దెల్పుదారిన్=దృష్టిచేత పంపఁబడిన చెలియ దెలుపుపగిది; వతంసితాబ్జాతభృంగి– వతంసిత=అవతంసముగాఁ జేయఁబడిన, అబ్జాత=పద్మమందలి,భృంగి=ఆఁడుతుమ్మెద; మ్రోయన్ =మొరయఁగా; మోమునభఃకాలమునన్=ముఖమను వర్షాకాలమందు;కైశ్యఘనసీమన్=కేశసంఘమను మేఘమందు; సౌరుమించు అనన్ = మనోజ్ఞమగు మెఱపో యనునట్లు;హైమసరము=చంపకసరము; వ్రాలన్=ఒఱగుచుండఁగా; అలకలు=ముంగురులు; అరవీడన్=సగము వీడఁగా; తనున్=తన్ను; చూచి; అలరి=సంతసించి; వాడసకులు=పొరుగు చెలులు; కొనియాడన్=పొగడఁగా; అంఘ్రులన్=అడుగులయందు; జవము గూడన్=వేగము చేరఁగా; ఇంపు=సొంపు; తొలఁకాడన్=అతిశయింపఁగా; గోత్రామరేంద్రుఁ జూడన్=సుచంద్రుఁడను పేరుగల భూలోకదేవేంద్రుని చూచుటకై; ఒక్కప్రోడ = ఒక ప్రౌఢస్త్రీ; చొక్కమగుమేడకున్=చక్కనిసౌధమునకు; ఏతెంచెన్=వచ్చెను.

మంచిపరిమళము పొంగెనా యనఁ జెమటపైకొనఁ గర్పూరగంధపువాసన పరిమళించుచుండఁగా, పరుగెత్తుబుద్ధి వెంబడి ననురాగమువలెనె మణిహారకాంతి వ్యాపించుచుండఁగా (మణికాంతి బుద్ధివెంబడి పోవుచున్న అనురాగ మున్నటు లున్నదని హృదయము), త్వరగాఁ బోవుటకై దృష్టిచే పంపఁబడినచెలియ దెలుపుపగిది అలంకారార్థము ధరియించిన తామరలో నున్న తుమ్మెద రొదసేయుచుండఁగా, ముఖమను వర్షాకాలమందు కైశ్యమను మేఘమందు మెఱుపువలెఁ జంపకసరము వ్రేలాడఁగా, ముంగురులు వీడఁగా, పోవుచున్న తన్నుఁ జూచిపొరుగుచెలియ లందరు కొనియాడుచుండఁగా, నొక కాంత సుచంద్రునిఁ జూడ వచ్చె నని భావము.

చ. తిలకము దీర్చి దీర్పక స॥తీమణి యొక్కతె హీరదర్పణం
బలరఁ గరంబునం జనవ॥రాగ్రణిఁ గన్గొన వచ్చె ధామమం
డలి నిను లోకబాంధవు ఖ॥డాఖడి నేఁచినయట్టి చల్లమిం
చులదొరఁ బట్టి తెచ్చితిని ॥జుమ్మని చేరుదినాధిదేవినాన్. 51

టీక: సతీమణి యొక్కతె=స్త్రీరత్న మగు నొకకాంత; తిలకము దీర్చి దీర్పక=బొట్టు దిద్దిదిద్దకయె; హీరదర్పణంబు=వజ్రమయ మగు నద్దము; కరంబునన్=కేలున; అలరన్=ఒప్పుచుండఁగా; జనవరాగ్రణిన్=రాజశ్రేష్ఠుఁడగు సుచంద్రుని; కన్గొనన్=చూచుటకై; ధామమండలిన్ – ధామ=కాంతియొక్క, మండలిన్=సమూహముచేత, ప్రతాపపుంజముచేత నని దోఁచుచున్నది; లోకబాంధవున్=లోకప్రియుఁడవగు, సూర్యుఁడని తోఁచుచున్నది; నినున్=నిన్ను;ఖడాఖఢి=కఠినముగా; ఏఁచిన యట్టిచల్లమించులదొరన్ – ఏఁచిన=శ్రమపెట్టిన, అట్టిచల్లమించులదొరన్=అటువంటిచంద్రుని; పట్టి=పట్టికొని; తెచ్చితిని= తీసికొని వచ్చితిని; చుమ్మని=చూడు మనుచు; చేరుదినాధిదేవినాన్=సమీపించిన దినాధిదేవతయో యనునట్లు; వచ్చెన్= వచ్చెను.

ఒకకాంత రవలయద్దము కేలఁ బూని బొట్టు దిద్దిదిద్దకయె, నిన్నుఁ బూర్వము బాధించిన చంద్రుని బట్టితెచ్చితిని జాడు మని వచ్చు దినాధిదేవతయో యనునటులు, సుచంద్రునిఁ జూచుటకై వచ్చెనని భావము. ఈపద్యమం దుత్ప్రేక్షాలంకారము.

చ. తరుణి యొకర్తె వేగజని॥తశ్రమవాఃపరిపృక్తమానితాం
బరయయి పైఁట జాఱ నెదఁ॥బాణి ఘటించి మహిస్థలీపురం
దరుఁ గన నేగుదెంచెఁ గడు॥దక్కితి నీకని నిర్మలాత్మతో
నిరుపమచిత్తవాసగత॥నీరరుహాంబకు ముట్టుపోలికన్. 52

టీక: తరుణియొకర్తె=ఒకయువతి; వేగజనితశ్రమవాఃపరిపృక్తమానితాంబర యయి – వేగ=వేగముచేత, జనిత=పుట్టింపఁబడిన, శ్రమవాః=స్వేదోదకముచేత, పరిపృక్త=తడుపఁబడిన, మానిత=శ్రేష్ఠమగు, అంబర యయి=వస్త్రముగలదియై; పైఁట = పయ్యెద; జాఱన్=జాఱుచుండఁగా; ఎదన్=ఱొమ్మున; పాణిన్=హస్తమును; ఘటించి=ఉంచి; మహిస్థలీపురందరున్= భూలోకదేవేంద్రుని; కనన్=చూచుటకై; కడున్=మిక్కిలి; నీకు దక్కితిన్=నీకు స్వాధీనయయితిని; అని=ఇట్లనుచు; నిర్మలాత్మతోన్=నిర్మలమైన అంతఃకరణముతో; నిరుపమచిత్తవాసగతనీరరుహాంబకున్ – నిరుపమ=నిస్సమానమగు, చిత్త= హృదయమందు, వాస=వసతిని, గత=పొందిన, నీరరుహాంబకున్=కమలాక్షుని, కమలబాణములు గల మన్మథుని నని స్వభావార్థము; ముట్టుపోలికన్=స్పృశించుపగిది; ఏగుదెంచెన్=వచ్చెను.

ఒకకాంత సుచంద్రుని జూచుటకై అతివేగమువలన నైన చెమటచేఁ దడుపఁబడినవస్త్రముగలదై, పైఁటకొంగు వేగిరపాటుచే జాఱఁగా దాని సవరించుటకై ఎదఁ బాణిఁ జేర్చి వచ్చుచుండఁగా, హృదయగతనీరరుహాంబకుని స్పృశించి నిక్కముగ నీకు దక్కితి నని చెప్పినదానివలె నుండె నని భావము. అనఁగా నార్ద్రవస్త్రముతో భగవంతుని ముట్టి ప్రమాణము చేసి నిక్కముగ నీకు దక్కితినని చెప్పుచున్న దానిపగిది వచ్చెనని ముఖ్యాశయము.

మ. కనకాంగీతిలకం బొకర్తు పతి సిం॥గారించుచుం గేల నూ
తనముక్తావళి వ్రేల వచ్చె నలగో॥త్రాకాంతు వీక్షింపఁ జ
క్కనిక్రొమ్మొగ్గలపేరు పూని లలిమైఁ॥గందర్పసామ్రాజ్యల
క్ష్మి నవేహ న్వరియింపఁ జేరె నని నె॥మ్మిం జూపఱు ల్మెచ్చఁగన్. 53

టీక: కనకాంగీతిలకంబు=నారీతిలకమగు; ఒకర్తు=ఒకకాంత; పతిన్=పెనిమిటిని; సింగారించుచున్=అలంకరించుచు; కేలన్= హస్తమందు; నూతనముక్తావళి=క్రొత్తముత్యపుపేరు; వ్రేలన్=వ్రేలాడుచుండఁగా; అలగోత్రాకాంతున్=ఆసుచంద్రుని; వీక్షింపన్= చూచుటకై; చక్కనిక్రొమ్మొగ్గలపేరు=అందమగు క్రొత్తమొగ్గలసరమును; పూని=గ్రహించి; లలిమైన్=ప్రేమచేత; కందర్ప

సామ్రాజ్య లక్ష్మి – కందర్ప=మన్మథునియొక్క, సామ్రాజ్య=సమ్రాట్టుతనముయొక్క,లక్ష్మి=కమల; నవేహన్—నవ=నూతనమైన, ఈహన్=వాంఛచేత; వరియింపన్=కోరుటకు; చేరెన్=వచ్చెను; అని=అనుకొనుచు; నెమ్మిన్=ప్రేమతో; చూపఱుల్=చూచుచుండువారు; మెచ్చఁగన్=పొగడఁగా; వచ్చెన్=ఏతెంచెను. అనఁగా నొకనారీతిలకము తనపతి నలంకరించుచుఁ గరమందు ముక్తాసరమును గైకొని యీసుచంద్రునిఁ జూడ మదనసామ్రాజ్యలక్ష్మి యితనిని వరియించుటకు మొగ్గల దండఁ దీసికొని వచ్చెనని చూపఱులు మెచ్చునట్లు వచ్చెనని భావము.

చ. తరళితపారిజాతసుమ॥దామకవాసన పిక్కటిల్ల వి
స్ఫురదహిశత్రురత్నమయ॥భూషణదీధితి పర్వ నొక్కసుం
దరి నృపుఁ గాంచ వచ్చె వడిఁ ॥దద్విభవంబు సురేంద్రవైభవేం
దిర నెకసక్కెమాడ జగ॥తిం గన నొందు మఘోనితీరునన్. 54

టీక: తరళితపారిజాతసుమదామకవాసన – తరళిత=చలించిన, పారిజాతసుమదామక=పారిజాతపుష్పసరముయొక్క, వాసన =వలపు, వేల్పులమ్రాఁకుపువ్వులసరముయొక్కవలపని శచీపరమగు నర్థము; పిక్కటిల్లన్=అతిశయింపఁగా; విస్ఫురదహిశత్రురత్నమయ భూషణ దీధితి – విస్ఫురత్=ప్రకాశించుచున్న,అహిశత్రురత్నమయ= గరుడపచ్చల మయమైన, భూషణ=ఆభరణములయొక్క, దీధితి=కాంతి, ఇంద్రనీలమణిమయభూషణకాంతి యని శచీపరమైన యర్థము; పర్వన్=వ్యాపింపఁగా; ఒక్కసుందరి=ఒకకాంత; నృపున్=సుచంద్రుని; కాంచన్=చూచుటకై; వడిన్= వేగముతో; జగతిన్=భూమియందు; తద్విభవంబు=ఆసుచంద్రునిసంపద; సురేంద్రవైభవేందిరన్=ఇంద్రవిభవలక్ష్మిని; ఎకసక్కె మాడన్=పరిహసించుచుండఁగా; కనన్= చూచుటకై; ఒందు మఘోనితీరునన్=వచ్చుశచీదేవివలె; వచ్చెన్=వచ్చెను.

అనఁగా నొకకాంత పారిజాతసుమసరముయొక్కవాసన పర్వుచుండఁగా, అహిశత్రురత్నమయభూషణములకాంతి అతిశయింపఁగా నీసుచంద్రునిఁ జూచుటకు రాఁగా, నయ్యది బుడమి నింద్రసంపదను హసించు నీసుచంద్రుని సంపదను జూడ వచ్చిన శచీదేవివలె నొప్పె నని భావము.

మ. అనురాగంబునకన్న మున్ను హృదయం॥బాసన్మనోవీథిక
న్నను ము న్వీక్షణపంక్తి యంతకును ము॥న్పాదప్రవేగంబు చా
ల నహంపూర్వక నొంద వచ్చె నతిహే॥లావైభవశ్రీయుతిన్
ఘనవేణీతిలకం బొకర్తు ధరణీ॥కాంతాగ్రణిం గన్గొనన్. 55

టీక: ఘనవేణీతిలకంబు=కాంతాతిలకమగు; ఒకర్తు=ఒకస్త్రీ; ధరణీకాంతాగ్రణిన్=భూపతిశ్రేష్ఠుఁడగు సుచంద్రుని; కన్గొనన్ = చూచుటకై; అతిహేలావైభవశ్రీయుతిన్ – అతిహేలా=అతివిలాసముయొక్క, వైభవ=విభవముయొక్క,శ్రీ=కాంతియొక్క, యుతిన్=కూడికచేత; అనురాగంబునకన్నన్=అనురక్తికంటెను; మున్ను=ముందు; హృదయంబు=చిత్తము; ఆసన్మనోవీథి కన్నను=ఆమేలిహృదయప్రదేశమునకన్న; మున్=ముందు; వీక్షణపంక్తి=దృక్శ్రేణి;అంతకును మున్=అంతకంటెముందు; పాదప్రవేగంబు=అంఘ్రులజవము; చాలన్=మిక్కిలి; అహంపూర్వికన్=నేను ముందు, నేను ముందనుభావమును; ఒందన్ = పొందఁగా; వచ్చెన్=వచ్చెను.

ఒకకాంత మిక్కిలివిలాసముతో ననురాగహృదయ వీక్షణ పాద వేగములు అహంపూర్వక నొందునట్లు వచ్చెనని భావము.

మ. సకిచా లిట్లు శుభాప్తి వచ్చుపతిఁ గాంచం జేరి యవ్వేళ మౌ
క్తికజాలాక్షతపాళిఁ జల్లె నలధాత్రీనేతపై మల్లికా
ప్రకరంబు ల్మధుమాసలక్ష్మి వరియింపం బెంపుతో వచ్చుచై
త్రికుమీఁదన్ సుమజాలకేసరము లెంతే వైచుచందంబునన్. 56

టీక: సకిచాలు=సకియలయబంతి; ఇట్లు=వక్ష్యమాణప్రకారముగ; శుభాప్తిన్=శుభలక్షణప్రాప్తిచేత; వచ్చుపతిన్=వచ్చుచున్న సుచంద్రుని; కాంచన్=చూచుటకై; చేరి=పొంది; అవ్వేళన్=ఆసమయమందు; మౌక్తికజాలాక్షతపాళిన్ – మౌక్తికజాల=ముత్యములగుంపును, అక్షతపాళిన్=అక్షతశ్రేణిని; అలధాత్రీనేతపైన్=ఆసుచంద్రునిమీఁద; మధుమాసలక్ష్మి=వసంతలక్ష్మి; వరియింపన్=వరించుటకై; పెంపుతో వచ్చుచైత్రికుమీఁదన్=అతిశయముతోవచ్చు వసంతునిమీఁద; మల్లికాప్రకరంబుల్=మల్లికాకుసుమసమూహములను; సుమజాలకేసరములు=పుష్పజాలకింజల్కములను; ఎంతేన్=మిక్కిలి; వైచుచందంబునన్=చల్లువిధముగా; చల్లెన్=చల్లెను.
అనఁగా వసంతలక్ష్మి వరియించుటకై వచ్చుచైత్రునిమీఁద తెల్లనిమల్లికలను, పచ్చని కుసుమకేసరములను చల్లునట్లుగ నీ సుచంద్రునిపై చూడవచ్చినపురకాంతలు మౌక్తికములను,అక్షతలను చల్లి రని భావము.

మ. జలజాప్తాన్వయమౌళి యప్పు డలపాంచాలేంద్రచంచన్మణీ
నిలయాభ్యంతికసీమ లేఖవరదంతిం డిగ్గి యమ్మేటి యు
త్కలికాసంపదచే నెదుర్కొన లతాగాత్రీశిరోరత్నమం
డలి యారాత్రికముల్ ఘటింప బుధసంతానంబు దీవింపఁగన్. 57

టీక: జలజాప్తాన్వయమౌళి=సూర్యవంశశ్రేష్ఠుఁడగు సుచంద్రుఁడు; అప్పుడు=ఆసమయమందు; అలపాంచాలేంద్రచంచన్మణీనిలయాభ్యంతికసీమన్ – అలపాంచాలేంద్ర=ఆక్షణదోదయునియొక్క, చంచత్=ప్రకాశించుచున్న, మణీనిలయ=మణిమయగృహముయొక్క, అభ్యంతికసీమన్=సమీపప్రదేశమందు; లేఖవరదంతిన్—లేఖవర=ఇంద్రునియొక్క, దంతిన్= గజమగు నైరావతమును; డిగ్గి=దిగి; అమ్మేటి=ఆక్షణదోదయుఁడు; ఉత్కలికాసంపదచేన్=సంతోషాతిశయముచేత; ఎదుర్కొనన్ = ఎదురుకొనఁగా; లతాగాత్రీశిరోరత్నమండలి=నారీశిరోమణులసమూహము; ఆరాత్రికముల్=ఆరతులను; ఘటింపన్= ఘటిల్లఁజేయఁగా; బుధసంతానంబు=విద్వాంసులయొక్కసమూహము; దీవింపఁగన్=ఆశీర్వదింపఁగా, దీని కుత్తరపద్యస్థ క్రియతో నన్వయము.

చ. లలితసువర్ణవేత్రికకులంబు బరాబరి యూన్పఁ జెంతలం
గలసి నిజాప్తబంధుమహికాంతచయం బరుదేర నొక్కనె
చ్చెలికయిదండఁ జేకొని వచింపఁగరాని యొయారమెచ్చ ని
ర్మలినవివాహరత్నమయమండపరాజముఁ జేరె నయ్యెడన్. 58

టీక: లలితసువర్ణవేత్రికకులంబు – లలిత=మనోజ్ఞమైన,సువర్ణవేత్రిక=బంగరుబెత్తపువారలయొక్క,కులంబు=సమూహము; బరాబరి=హెచ్చరికను; ఊన్పన్=చేయుచుండఁగా; చెంతలన్=ఇరుప్రక్కలయందు;కలసి=కలిసికొని; నిజాప్తబంధుమహికాంతచయంబు –నిజ = స్వకీయులగు, ఆప్త = మిత్రులును, బంధు = బందుగులు, మహికాంత = రాజలు, చయంబు = వీరియొక్క సమూహము; అరుదేరన్=వచ్చుచుండఁగా; ఒక్కనెచ్చెలికయిదండన్=ఒకనేస్తకానిహస్తమును; చేకొని=గ్రహించి; వచింపఁగ రాని యొయారము=చెప్పనలవిగానివిలాసము;ఎచ్చన్=అతిశయింపఁగా; నిర్మలినవివాహరత్నమయమండపరాజమున్ – నిర్మలిన = పరిశుద్ధమగు, వివాహ = వివాహమునకైన, రత్నమయ = మణిమయమగు, మండపరాజమున్=మండపశ్రేష్ఠమును; అయ్యెడన్=ఆసమయమందు; చేరెన్=పొందెను. పైపద్యముతో నన్వయము.

క. నరపతి పాంచాలక్షితి,వరుపనుపునఁ గనకపీఠి ◊వసియించి యన
ర్ఘ్యరుచిఁ గనుపట్టెఁ బ్రాఙ్మహి,ధరవీథిం బొలుచు తుహిన◊ ధామునిచాయన్. 59

టీక: నరపతి=సుచంద్రుఁడు; పాంచాలక్షితివరుపనుపునన్=క్షణదోదయునియాజ్ఞచేత; కనకపీఠిన్=బంగరుపీఁటయందు; వసియించి=కూర్చుండి; అనర్ఘ్యరుచిన్ – అనర్ఘ్య=వెలలేని, రుచిన్=కాంతిచేత; ప్రాఙ్మహిధరవీథిన్=పొడుపుకొండపట్టున; పొలుచు తుహినధామునిచాయన్=కానవచ్చుచున్న చందమామపగిది; కనుపట్టెన్=చూపట్టెను. సుచంద్రుఁడు క్షణదోదయుని పంపున బంగరుపీఁటమీఁద గూర్చుండి, ఉదయనగమందుఁ గానవచ్చు చంద్రునివలెఁ జూపట్టె నని భావము. ఉపమాలంకారము.

చ. విమలబుధాంతరంగనవ◊విస్మయదంబు మహాసదృక్షరా
ట్ప్రమదకరంబు నై దనరు◊భవ్యమహంబునఁ బొల్చుపూరుషో
త్తముపద ముల్లసత్ప్రియవి◊ధానముతోఁ గడిగెం బ్రజేశుఁడా
త్మమహిళ నించుదివ్యజల◊ధారలఁ గాంచనపాత్రి నత్తఱిన్. 60

టీక: విమలబుధాంతరంగనవవిస్మయదంబు – విమల=స్వచ్ఛమైన,బుధ=విద్వాంసులయొక్క,అంతరంగ=మనములకు; నవవిస్మయదంబు=నూతనమగు నచ్చెరువు నిచ్చుచున్నదియు; మహాసదృక్షరాట్ప్రమదకరంబు నై – మహత్=అధికులగు, అసదృక్ష=సరిలేని, రాట్=రాజులకు, ప్రమదకరంబు నై = సంతసము నిచ్చుచున్నదియు నయి; తనరు భవ్య మహంబునన్ – తనరు=ఒప్పుచున్నదియు, భవ్య=మంగళకరమైన, మహంబునన్=తేజస్సుచేత; పొల్చుపూరుషోత్తముపదము=ప్రకాశించుచున్న పురుషోత్తముఁడగు సుచంద్రునిపాదమును; ఉల్లసత్ప్రియవిధానముతోన్—ఉల్లసత్=ప్రకాశించుచున్న, ప్రియ=ప్రియమగు, విధానముతోన్=విధిచే, శాస్త్రచోదితమార్గముచే ననుట; ప్రజేశుఁడు=క్షణదోదయరాజు; ఆత్మమహిళ=తనయొక్కకాంత; నించుదివ్యజలధారలన్ – నించు=పూరించుచున్న, దివ్య=మనోజ్ఞమగు,జలధారలన్=ఉదకధారలచేత; కాంచనపాత్రిన్= సువర్ణపాత్రయందు;కడిగెన్=కడిగెను.(ఇచట, విమలమగు, బుధ=దేవతలయొక్క,యంతరంగమునకు, నవవిస్మయంబును, మహత్=అధికుఁడగు, సత్=శ్రేష్ఠుఁడగు, ఋక్షరాట్=చంద్రునకు, ప్రమదకరంబును,అగు, పూరుషోత్తమపదము=విష్ణుపాదమును, ప్రజేశుఁడు=బ్రహ్మ, ఆత్మమహిళ=సరస్వతీదేవి, నించుజలధారచేతఁ గడిగె నను నర్థాంతరము దోఁచుచున్నది), అత్తఱిన్=ఆసమయమందు, దీని కుత్తరపద్యస్థక్రియతో నన్వయము.

చ. యువతులు పాటఁబాడఁగ నవోత్కలికన్ శుభమంత్రజాలకం
బవనిసురాళికల్ దెలుప నాక్షణదోదయరాజొసంగునిం
పవుమధుపర్క మన్నృపకులాగ్రణి కుత్సవ మూన్చెఁ జంద్రికా
ధవళవిలోచనాధరసుధారస మిట్టిదెయన్న కైవడిన్. 61

టీక: యువతులు=కాంతలు; పాటఁబాడఁగన్=పాటపాడుచుండఁగా; అవనిసురాళికల్=భూసురసంఘములు; నవోత్కలికన్ – నవ=నూతనమగు, ఉత్కలికన్=సంతసముచేత; శుభమంత్రజాలకంబు – శుభ=మంగళకరమగు, మంత్ర= మంత్రముల యొక్క, జాలకంబు=సమూహమును; తెలుపన్=తెలియఁజేయఁగా; ఆక్షణదోదయరాజు; ఒసంగు నింపవు మధుపర్కము – ఒసంగు =ఇచ్చినట్టి, ఇంపవు=మనోహరమగు, మధుపర్కము=పెరుగుతోఁ గలిపిన తేనె మొదలగునవి, వివాహమందు వరునికి కన్యాదాత మధుపర్కము నొసంగుట ప్రసిద్ధము; అన్నృపకులాగ్రణికిన్=ఆసుచంద్రునకు; ఉత్సవము=వేడుకను; చంద్రికాధవళవిలోచనాధరసుధారసము – చంద్రికాధవళవిలోనా=చంద్రికయను కాంతయొక్క, అధరసుధారసము=మోవియొక్క యమృతరసము; ఇట్టిదె=దీనికి సమమైనదే; అన్న కైవడిన్=అనినరీతిగా; ఊన్చెన్=చేసెను.

సుచంద్రునకు క్షణదోదయుఁ డొసఁగిన మధుపర్కము చంద్రికయొక్క మోవితేనె యిట్టిదే యని తెలిపినపగిది సంతసము గూర్చె నని భావము.

చ. కనకపుగద్దె నొప్పుమహికాంతునిముంగల నప్డు చక్కఁ దా
ర్చినబలుచెంద్రకావితెర జిష్ణుదిశాధరభాసమానసూ
ర్యనికటశోభిసాంధ్యరుచియందము గైకొనెఁ బద్మినీవిలో
చనకమలానుమోదరసజాతము మిక్కిలి హెచ్చఁ జేయుచున్. 62

టీక: అప్డు=ఆసమయమందు;కనకపుగద్దెన్=బంగరుపీఠమందు; ఒప్పుమహికాంతునిముంగలన్=ఒప్పుచున్న సుచంద్రుని యెదుట; చక్కన్=చక్కఁగా; తార్చిన బలుచెంద్రకావితెర=రచియించిన గొప్పచంద్రకావివన్నెగల కాండపటము; పద్మినీ విలోచన కమలానుమోద రస జాతము – పద్మినీ=పద్మినీజాతిస్త్రీలయొక్క, పద్మలతలయొక్క, విలోచనకమల=తామరల వంటి కన్నులకు, కన్నులవంటి తామరలకు, అనుమోదరస = సంతోషరసములయొక్క, జాతము = గుంపును; హెచ్చఁ జేయుచున్=అతిశయింపఁజేయుచు; తార్చన్=రచియింపఁగా; జిష్ణుదిశాధర భాసమాన సూర్య నికట శోభి సాంధ్య రుచి యందము – జిష్ణుదిశాధర=పొడుపుకొండయందు, భాసమాన=వెలుఁగుచున్న, సూర్య=సూర్యునియొక్క, నికట=సమీపమందు, శోభి=ప్రకాశించుచున్న,సాంధ్య=ఉదయసంధ్యాసంబంధియగు,రుచి=కాంతియొక్క, అందము=సౌందర్యమును; మిక్కిలి=అధికముగా;కైకొనెన్=గ్రహించెను. బంగరుపీఠమందుఁ గూర్చున్న సుచంద్రునియెదుటఁ జంద్రకావితెరఁ బట్టి యుండఁగా నయ్యది పొడుపుకొండపైఁ బొలుచు సూర్యునిముందర వెలుంగుచున్న యుదయరాగముపగదిఁ బద్మినీలోచన కమలములకు వికాసమును గల్గఁ జేయుచుఁ బ్రకాశించె నని భావము. ఇచట నుపమాలంకారము.

శా. ఆవేళన్ క్షణదోదయక్షితివరాభ్యర్ణస్థలిం జేర నా
శీవారంబుల కెచ్చరించి బలుహాళిం దత్పురోధుం డుమా

దేవీసన్నిధిఁ బొల్చుభూపసుతఁ దోడ్తెచ్చెన్ వరశ్రీ 'మమా
గ్నేవర్చోవిహవేషు' యంచు సరసోక్తిన్భూసురుల్పల్కఁగన్. 63

టీక: ఆవేళన్=ఆసమయమందు; క్షణదోదయక్షితివ రాభ్యర్ణస్థలిన్–క్షణదోదయక్షితివర= క్షణదోదయరాజుయొక్క, అభ్యర్ణస్థలిన్=సమీపప్రదేశమును; చేరన్=పొందుటకు; తత్పురోధుండు=ఆరాజుయొక్క పురోహితుఁడు; ఆళీవారంబులకున్=వయస్యాసమూహములకు; ఎచ్చరించి=ఎచ్చరికజేసి; బలుహాళిన్=అత్యాసక్తిచేత; ఉమాదేవీసన్నిధిన్ =పార్వతీదేవి సన్నిధానమునందు; పొల్చుభూపసుతన్=ఒప్పియున్న చంద్రికను; వరశ్రీన్=శ్రేష్ఠమగు శోభచేత; మమాగ్నేవర్చోవిహవేషు అంచున్= 'మమాగ్నేవర్చో విహవేషు' అనుమంత్రరూపమగు; సరసోక్తిన్=ఉత్తమవాక్యమును; భూసురుల్=బ్రాహ్మణులు; పల్కఁగన్=వచింపఁగా; తోడ్తెచ్చెన్=తోడ్కొని వచ్చెను.

సీ. నిఖిలాద్భుతముగ మున్నీటిమన్నీని వెల్వడి తోఁచులచ్చినెలంత యనఁగఁ,
దళతల మనుచుక్కచెలిచాలు వలగొనఁ, గనుపట్టు శీతాంశుకళ యనంగ,
నధికయత్నమున నొయ్యన నడతెంచు రతీశునిపట్టంపుటేనుఁ గనఁగ,
భువనైకమోహంబు పొదలాడ నలువయంతిక మొందుమోహినీదేవి యనఁగ,
తే. చారుకులదేవతానివాసమ్ము వెడలి, యజరవనితాళి చుట్టు రా నాళి యత్న
రీతి నొల్లన నడుచుచు నృపులు గాంచి, నిశ్చలత నిల్వ గురుఁ జేరె నెలఁత యపుడు. 64

టీక: నిఖిలాద్భుతముగన్—నిఖిల=సమస్తజనులకు, అద్భుతముగన్=ఆశ్చర్యకరముగా; మున్నీటిమన్నీనిన్=సముద్ర రాజగు పాలకడలిని; వెల్వడి=వెడలి; తోఁచులచ్చినెలంత యనఁగన్=కనఁబడు లక్ష్మీదేవి యన్నట్లుగా;
తళతల మనుచుక్కచెలిచాలు=తళతళయని ప్రకాశించు రిక్కలను కాంతలశ్రేణి; వలగొనన్=చుట్టుకొనఁగా; కనుపట్టు శీతాంశుకళ యనంగన్ = చూపట్టుచున్న చందమామకళ యన్నట్లుగా;
అధికయత్నమునన్=బహుప్రయత్నముచేత; ఒయ్యనన్=తిన్నగా; నడతెంచు రతీశునిపట్టంపుటేనుఁ గనఁగన్ = నడచుచు వచ్చుచున్నట్టి మన్మథుని పట్టపుగజమో యనునట్లుగా;
భువనైకమోహంబు – భువన=లోకములకు, ఏక=ముఖ్యమగు, మోహంబు=వలపు;పొదలాడన్=వర్ధిల్లునట్లు; నలువ యంతిక మొందు మోహినీదేవి యనఁగన్ – నలువయంతిక మొందు=బ్రహ్మదేవునిసమీపమును పొందుచున్న, మోహినీదేవి యనఁగన్ = మోహినీదేవియో యనునట్లుగా;
చారుకులదేవతానివాసమ్ము—చారు=సుందరమైన, కులదేవతా=కులదేవతయొక్క, నివాసమ్ము=ఉనికిపట్టునుండి; వెడలి = బైలుదేఱి; అజరవనితాళి=దేవాంగనాసంఘము; చుట్టు రాన్=చుట్టుకొని రాఁగా; ఆళి యత్నరీతిన్ – ఆళి=సకియలయొక్క, యత్న=ప్రయత్నముయొక్క, రీతిన్=భంగిచేత; ఒల్లనన్=తిన్నగా; నడుచుచున్; నృపులు=రాజులు; కాంచి=అవలోకించి; నిశ్చలతన్=అచంచలతచేత; నిల్వన్=నిలువఁగా; నెలఁత=చంద్రిక; అపుడు; గురున్=తండ్రిని; చేరెన్ = సమీపించెను.

అనఁగా నెల్లరకు నచ్చెరువును గలుఁగఁజేయుచుఁ, బాలకడలినుండి వెడలిన కలిమినెలంతవలె, రిక్కలు వలగొన్న చంద్రకళవలె, నతిప్రయత్నముతో నడతెంచు మరునిపట్టపుటేనుఁగువలె, నలువచేరువకుఁ బోవు మోహినీదేవివలె, నా చంద్రిక కులదేవతాస్థానమును విడిచి తండ్రిచెంతకుఁ జేరె నని భావము.

మ. కనకాంగీమణి యాత్మదృగ్రిపుమహాఽకంజావళి న్మెట్టుతీ
రునఁ ద్రొక్కమ్మగుమెట్టుఁబ్రాల్పుటిక నంఽఘ్రు ల్దార్చి యవ్వేళ నా
జననాథాగ్రణిముంగల న్నిలువ నోఽజ న్భూసురు ల్మంజుల
ధ్వనిఁ గన్యావరణంబుఁ జెప్పిరి ప్రమోఽదం బూన బంధు ల్మదిన్. 65

టీక: కనకాంగీమణి=కాంతారత్నమగు చంద్రిక; ఆత్మదృగ్రిపుమహాకంజావళిన్ – ఆత్మ=తనయొక్క, దృక్=నేత్రములకు; రిపు=శత్రువగు, మహత్=అధికమగు, కంజావళిన్=తామరపూబంతిని; మెట్టుతీరునన్=త్రొక్కురీతిగ; చొక్కమ్మగుమెట్టుఁ బ్రాల్పుటికన్—చొక్కమ్మగు=శ్రేష్ఠమగు, మెట్టుఁబ్రాల్పుటికన్=తలఁబ్రాలుపుటికయందు; అంఘ్రుల్=అడుగులను; తార్చి =ఉంచి; అవ్వేళన్=ఆసమయమందు; ఆజననాథాగ్రణిముంగలన్=ఆసుచంద్రునియెదుట; నిలువన్=నిలుచుండఁగా; ఓజన్ = క్రమముగ; భూసురుల్=బ్రాహ్మణులు; మంజులధ్వనిన్ – మంజుల=మనోజ్ఞమగు, ధ్వనిన్=ధ్వనిచేత; కన్యావరణంబున్ = కన్యావరణమును; బంధుల్=బంధుజనులు; మదిన్=మనమునందు; ప్రమోదంబు=సంతసము; ఊనన్=పూనునట్లుగా; చెప్పిరి=వచించిరి. అనఁగా చంద్రిక తననేత్రములకు శత్రువగు కమలశ్రేణిని పాదములతోఁ ద్రొక్కుచున్నదానివలెఁ, దలఁబ్రాలు పుటికయం దడుగు లిడి సుచంద్రునియెదుట నిలువఁగా బ్రాహ్మణులు కన్యావరణమును జెప్పిరని భావము.

మ. వనజాక్షు ల్ధవళంబుఁ బాడఁగ మహాఽవాదిత్రనాదంబు బో
ర్కొనఁ జారూక్తిఁ బురోహితుండు ‘స హరిః ఽకుర్యా త్సదామఙ్గళ’
మ్మని చిత్రంబుగ మంగళాష్టకము నెఽయ్యం బొప్పఁగాఁ జెప్పి శో
భనలగ్నం బదె చేరె నంచు వివరింఽపన్ సంభ్రమౌఘస్థితిన్. 66

టీక: వనజాక్షుల్=స్త్రీలు; ధవళంబున్=ధవళమను పాటను; పాడఁగన్=పాడఁగా, ముహూర్తకాలమునందు స్త్రీలు కొన్నిదేశము లలో ధవళమను పాటను బాడుట ప్రసిద్ధము. ‘పడఁతుల ధవళములు పెండ్లిఽపాటలు చెలఁగెన్’ అని ప్రాచీన గ్రంథములయందుఁ జెప్పఁబడియున్నది; మహావాదిత్రనాదంబు – మహత్=అధికమగు,వాదిత్ర= ఆనద్ధము, ఘనము, తతము, సుషిరము అను నీ వాద్యచతుష్టయముయొక్క, నాదంబు=ధ్వని; బోర్కొనన్=బోరని ధ్వనిచేయఁగా; చారూక్తిన్ – చారు=రమణీయమైన, ఉక్తిన్ =వచనముచేత; పురోహితుండు; స హరిఃకుర్యా త్సదామఙ్గళమ్మని = ‘స హరిఃకుర్యా త్సదామఙ్గళమ్’ అనుచు; చిత్రంబుగన్ = వింతగ; మంగళాష్టకము=మంగళముల నెనిమిదింటిని; నెయ్యంబు=ఇంపు; ఒప్పఁగాన్= ఒప్పునట్లు; చెప్పి=చదివి; శోభన లగ్నంబు=శుభలగ్నము; అదె చేరె నంచున్ = అదె సమీపించె ననుచు; సంభ్రమౌఘస్థితిన్=ప్రవాహమువంటి సంతసమం దునికి చేత, అతిసంతోషముచేత ననుట; వివరింపన్=విశదపఱుపఁగా, పైపద్యముతో నన్వయము.

మ. జలజాప్తాన్వయు దైత్యభేదిగఁ దనూఽజ న్వారిరుక్పాణిగాఁ
గలితైకాత్మఁ దలంచి యత్తఱి ‘నిమాం ఽకన్యాం ప్రదాస్యామి’ యం
చలపాంచాలుఁడు ధారఁబోసెఁ దనకఽన్యం దత్సుచంద్రావనీ
వలజానేతకు లేఖపాళి ప్రసవఽవ్రాతంబు వర్షింపఁగన్. 67

టీక: జలజాప్తాన్వయున్=సూర్యవంశజుఁడగు సుచంద్రుని; దైత్యభేదిగన్=నారాయణునిఁగాను; తనూజ=కూఁతురయినట్టి చంద్రికను; వారిరుక్పాణిగాన్=లక్ష్మీదేవిగాను; కలితైకాత్మన్=ఒప్పుచున్న ఏకచిత్తముతోఁ; తలంచి=ధ్యానించి; అత్తఱిన్ = ఆ సమయమందు; ఇమాం కన్యాం ప్రదాస్యామి యంచున్ = 'ఇమాం కన్యాం ప్రదాస్యామి' అను మంత్రము నుచ్చరించుచు; అల పాంచాలుఁడు=ఆక్షణదోదయరాజు; తనకన్యన్=తనకూఁతురిని; తత్సుచంద్రావనీవలజానేతకు=ఆసుచంద్రుఁడను పేరుగల భూపతికి; లేఖపాళి=సురసంఘము; ప్రసవవ్రాతంబు=పుష్పసంఘమును; వర్షింపఁగన్=కురియఁగాఁ; ధారఁబోసెన్= ఉదక ధారాపూర్వకముగఁ గన్యాదానము చేసెను. అనఁగా సుచంద్రుని నారాయణమూర్తినిగాను, చంద్రికను లక్ష్మీదేవిగాను ఏకచిత్త ముతోఁ దలంచి సుచంద్రునకుఁ జంద్రికను క్షణదోదయుం డుదకధారాపూర్వకముగ దానము చేసె నని భావము.

చ. ధరణిఁ బరస్పరోక్తి జవ◊దాఁటక యుండ ఘటింపఁ గర్త తో
యరుహాశరుండు గావునఁ ద◊దాత్మ నన న్సరిగా వధూవరు
ల్శిరముల నుంచి రప్డు గుడ◊జీరకము ల్పతి మున్ను దార్చె సుం
దరి యట మున్నె చేర్చె నని ◊తత్ప్రియబాంధవు లుగ్గడింపఁగన్. 68

టీక: ధరణిన్=పుడమియందు; పరస్పరోక్తిన్ – పరస్పర=ఒండొరులయొక్క, ఉక్తిన్=వచనమును; జవదాఁటక యుండన్ = మీఱకుండునటులు; ఘటింపన్=కలుఁగఁజేయుటకు; తోయరుహాశరుండు=పద్మాస్త్రుఁడగు మదనుఁడు; కర్త=స్వతంత్రుఁడు; కావునన్=ఆహేతువుచేత; తదాత్మన్ అనన్= ఆమదనునియత్నముచేతనోయనునట్లు; సరిగాన్=సమానముగా; వధూవరుల్ =చంద్రికాసుచంద్రులు; అప్డు=ఆసమయమందు; గుడజీరకముల్=బెల్లమును జిలకఱ్ఱను; శిరములన్=శిరస్సులందు; పతి = పెనిమిటియగు సుచంద్రుఁడు; మున్ను=పూర్వము; తార్చెన్=ఉంచెను; సుందరి=చంద్రిక; అట మున్నె= అంతకుముందరనే; చేర్చెన్=ఉంచెను; అని=అనుచు; తత్ప్రియబాంధవులు – తత్=ఆవధూవరులయొక్క, ప్రియబాంధవులు=ప్రియులగు బంధుగులు; ఉగ్గడింపఁగన్=వచించునట్లు; ఉంచిరి=ఉంచినవారలైరి.

అనఁగా మన్మథుఁడు వధూవరులను ప్రేమాతిశయమున నొండొరులమాట నతిక్రమింపకుండునటులు చేయువాఁడు గాన నామన్మథుని ప్రయత్నముచే నుంచిరా యనునట్లు బెల్లము జిలకఱ్ఱ యేకకాలమందు వధూవరు లొండొరుల శిరము లందుంచి రని భావము. పతి పత్నీశిరమున గుడజీరకములు ముందు చేర్చినఁ బతిమాటకు పత్ని జవదాఁటక యుండు ననియు, పత్ని పతిశిరమున గుడజీరకములు ముందు చేర్చినఁ బత్నిమాటకు పతి జవదాఁటక యుండు ననియు నొక వార్త గలదు గావున వారి ప్రియబాంధవులు పతి మున్ను చేర్చె ననియు పత్ని అంతకు మున్నె చేర్చె ననియు వచించి రని భావము.

క. అలమహిపతి మది సమ్మద,మలరన్ 'మాంగల్యతంతు◊నానేన' యటం
చెలమిఁ బురోధుఁడు దెలుపఁగఁ, గలకంఠికిఁ దాళిబొట్టు ◊గట్టెం జక్కన్. 69

టీక: అలమహిపతి=ఆసుచంద్రుఁడు; మదిన్=మనసునందు; సమ్మదము=సంతసము; అలరన్=ఒప్పఁగాఁ; మాంగల్యతంతు నానేన యటంచున్ = 'మాంగల్యతంతునానేన' యను మంత్రమును జెప్పుచు; ఎలమిన్=సంతోషముతోఁ; పురోధుఁడు= పురోహితుఁడు; తెలుపఁగన్=తెలియఁజేయఁగాఁ; కలకంఠికిన్=చంద్రికకు; తాళిబొట్టు=మంగళసూత్రమును; చక్కన్=చక్కగాఁ; కట్టెన్=కట్టెను.

మ. సకిపై నానృపమౌళి నింప నలకం◊జాతాక్షి గోత్రాధినా
యకుపై నింపఁగ సేసఁబ్రా ల్దనరె సా◊మ్యస్ఫూర్తి నవ్వేళఁ ద
త్సుకరాలంకృతినాదవాదములు దో◊డ్తో మించ సాహిత్యపో
షకుఁ డబ్జాస్త్రుఁడు దార్చునర్జునమణీ◊జాలాభిషేకం బనన్. 70

టీక: సకిపైన్=చంద్రికమీఁద; ఆనృపమౌళి=ఆసుచంద్రుఁడు; నింపన్=సేసలు నింపగా; అలకంజాతాక్షి=ఆచంద్రిక; గోత్రాధినాయకుపైన్=సుచంద్రునిమీఁద; నింపఁగన్=సేసలు నింపఁగా; సేసఁబ్రాల్=తలఁబ్రాలు; సామ్యస్ఫూర్తిన్=సమానస్ఫూర్తిచేత; అవ్వేళన్=ఆసమయమందు; తత్సుకరాలంకృతినాదవాదములు – తత్=ఆవధూవరులయొక్క, సు=శ్రేష్ఠమగు, కర=హస్తమందలి, అలంకృతి=కంకణాద్యలంకృతులయొక్క, నాద=ధ్వనులనెడు, వాదములు=వాగ్వివాదములు; తోడ్తోన్=వెంటనె; మించన్=అతిశయింపఁగా; సాహిత్యపోషకుఁడు – సాహిత్య=సాంగత్యమునకు, పోషకుఁడు=అభివృద్ధిపఱచునట్టివాఁడు; అబ్జాస్త్రుఁడు=మరుఁడు; ఇచట, తత్సుకరాలంకృతి నాదవాదములు – తత్=ప్రసిద్ధమగు, సుకర=మనోజ్ఞమగు, అలంకృతి =ఉపమాద్యలంకారములు, నాద=ధ్వనులను, వాదములు, సాహిత్యపోషకుఁడు=సాహిత్యవిద్యకుఁ బోషకుఁడను నర్థము దోఁచుచున్నది; తార్చునర్జునమణీజాలాభిషేకంబనన్ – తార్చు=చేయునట్టి, అర్జునమణీ=వజ్రములయొక్క, జాల =సమూహముయొక్క, అభిషేకంబనన్ = అభిషేకమో యనునట్లు; తనరెన్=ఒప్పెను.

చంద్రికాసుచంద్రు లొకరిపై నొకరు నించు సేసఁబ్రాలు సామ్యస్ఫూర్తిచేత నొండొరులకు నానుకూల్యమును పోషించు మన్మథుఁడు సేయు రవలరాశియొక్క యభిషేకమో యనునటు లొప్పె నని భావము. వస్తూత్ప్రేక్షాలంకారము.

మ. కపిలావాచనభద్రవేళఁ దగి రా◊కాంతావిభు ల్సేసము
త్తెపుచా ల్దార్కొనుమెట్టుఁబ్రాల్పుటిక లు◊ద్దీపించు పెన్కాఁడితోఁ
దపనీయాంశుకసూనుసంభృతతులా◊త్మం బూన లావణ్యభా
గ్యపటుశ్రీసమరీతిఁ దెల్ప సరి దూఁ◊గన్నిల్చుచందంబునన్. 71

టీక: కపిలావాచనభద్రవేళన్ – కపిలావాచన=వివాహాంగభూతమగు క్రియావిశేషముయొక్క, భద్రవేళన్=శుభవేళయందు; ఆకాంతావిభుల్=ఆవధూవరులు; సేసముత్తెపుచాల్=సేసముత్యములయొక్క శ్రేణిని; తార్కొనుమెట్టుఁబ్రాల్పుటికలు= కదిసిన తలఁబ్రాలుపుటికలు; ఉద్దీపించు=ప్రకాశించు; పెన్కాఁడితోన్=గొప్పకాఁడిమ్రాఁకుతో, యుగముతో ననుట; తపనీయాంశుకసూను సంభృత తులాత్మన్ – తపనీయాంశుకసూను=విష్ణుపుత్త్రుఁడగు మరునిచే, సంభృత=భరియింపఁబడిన, తులా=త్రాసుయొక్క, ఆత్మన్=స్వరూపమును; పూనన్=గ్రహింపఁగా; లావణ్యభాగ్యపటుశ్రీసమరీతిన్ – లావణ్య=చక్కఁదనముయొక్క, భాగ్య=భాగ్యముయొక్క,పటు=సమర్థమగు,శ్రీ=కాంతియొక్క, సమరీతిన్=సామ్యమును; తెల్పన్=తెలుపుటకొఱకు; సరి దూఁగన్=సరిగా తులఁదూఁగుటకు; నిల్చుచందంబునన్=నిలుచురీతిగా; తగిరి=ఒప్పిరి.

అనఁగా చంద్రికాసుచంద్రులు, మెట్టుఁబ్రాల్పుటికలు వధూవరులయొద్ద నుంచు కాఁడిమ్రాఁకుతో చూపఱకు మదనుఁడు దూఁచు త్రాసువలె నొప్పఁగా, అందు తమలావణ్యాదులను దెలుపుటకై సరిగాఁదూఁగినట్లు సమముగ నొప్పిరని భావము.

చ. అలయినసన్మహస్స్ఫురణ ◊నందుచు శ్యామయు నాకలాపినీ
కులతిలకోత్సవాకలనఁ ◊గూడుచు నాహరివంశనాయకుం
డలరి యజస్రము న్వెలయ ◊నయ్యెడ నంచితమంత్రశక్తిఁ ద
త్కలితకరాంబుజస్థలులఁ ◊గట్టిరి కంకణము ల్ధరామరుల్. 72

టీక: అలయినసన్మహస్స్ఫురణన్ – అలయిన=ఆసుచంద్రునియొక్క, సత్=శ్రేష్ఠమగు, మహః=ప్రతాపముయొక్క, స్ఫురణన్=ప్రకాశమును; అందుచున్=పొందుచు; శ్యామయున్=చంద్రికయును; ఇచట, అలయిన=ఆసూర్యునియొక్క, సత్=శ్రేష్ఠమగు, మహఃస్ఫురణన్=ప్రకాశాతిశయమును, అందుచున్=పొందుచు, శ్యామయున్=రాత్రియు నను విరోధార్థము దోఁచుచున్నది; ఆకలాపినీకులతిలకోత్సవాకలనన్ – ఆకలాపినీకులతిలక=ఆచంద్రికయొక్క, ఉత్సవ=వేడుకయొక్క, ఆకలనన్=ప్రాప్తిని; కూడుచున్=పొందుచు; ఆహరివంశనాయకుండు=ఆసూర్యవంశనాయకుఁడగు సుచంద్రుఁడు; ఇచట, ఆకలాపినీకులతిలక=ఆమయూరీశ్రేష్ఠముయొక్క, ఉత్సవ=వేడుకయొక్క,ఆకలనన్= ప్రాప్తిని; కూడుచున్=పొందుచు; ఆహరివంశనాయకుండు=ఆసర్పశ్రేష్ఠము అను విరోధార్థము దోఁచుచున్నది; అలరి=సంతసించి; అజస్రమున్=ఎల్లపుడు; వెలయన్=ప్రకాశించుటకై; అయ్యెడన్=ఆసమయమందు; అంచితమంత్రశక్తిన్ – అంచిత=ఒప్పుచున్న, మంత్రశక్తిన్=మంత్రసామర్థ్యముచేత; తత్కలితకరాంబుజస్థలులన్ – తత్=ఆవధూవరులయొక్క, కలిత=ఒప్పుచున్న, కరాంబుజస్థలులన్= కేలుదామరలయొక్క ప్రదేశములందు; ధరామరుల్=బ్రాహ్మణులు; కంకణముల్=కంకణములను, ప్రతిసరముల ననుట; కట్టిరి.

అనఁగా సూర్యస్ఫురణచే రాత్రి వెలయునట్లు మయూరీమహోత్సవమును గూడి సర్పశ్రేష్ఠము సంతసించునటులు మంత్రశక్తిచే బాపలు వధూవరులకరంబులయందుఁ గంకణములు గట్టిరని భావము. సూర్యవంశశ్రేష్ఠుఁడగు సుచంద్రుని ప్రతాపమునకు చంద్రిక సంతసించునటులు చంద్రికామహోత్సవమును గూడి సుచంద్రుఁ డెల్లపుడు సంతసించునటులు కంకణములఁ గట్టిరని స్వభావాభిప్రాయము.

చ. అలిచికురాసువర్ణవస◊నాంచలసంగ్రథితాంశుకాంతుఁడై
యలనరపాలమౌళి విమ◊లాంబుజరాగవివాహపీఠికా
స్థలి వసియించి లాజసము◊దాయమున న్శిఖిహోమ మూన్చె ను
త్కలిక చెలంగ భూసురవి◊తానము మంత్రము లుగ్గడింపఁగన్. 73

టీక: అలనరపాలమౌళి=ఆసుచంద్రుఁడు; అలిచికురాసువర్ణవసనాంచలసంగ్రథితాంశుకాంతుఁడై– అలిచికురా=భృంగములవంటి కుంతములుగల చంద్రికయొక్క, సువర్ణవసన=బంగరువస్త్రముయొక్క, అంచల=అంచుచేత, సంగ్రథిత=కట్టఁబడిన, అంశుకాంతుఁడై=వస్త్రముయొక్క అగ్రము గలవాడై; విమలాంబుజరాగవివాహపీఠికాస్థలిన్ – విమల=స్వచ్ఛమగు, అంబుజరాగ= పద్మరాగములయొక్క, వివాహపీఠికా=పెండ్లిపీఁటయొక్క, స్థలిన్=ప్రదేశమందు; వసియించి=కూర్చుండి; లాజసముదాయమునన్ – లాజ=పేలాలయొక్క, సముదాయమునన్=సమూహముచేతను; శిఖిన్=అగ్నియందు; హోమము=హవనమును; ఉత్కలిక=సంతసము; చెలంగన్=ఒప్పఁగా; భూసురవితానము=బ్రాహ్మణసంఘము; మంత్రములు=మంత్రములను; ఉగ్గడింపఁగన్=వచించుచుండఁగా; ఊన్చెన్=ఒనరించెను.

అనఁగా సుచంద్రుఁడు చంద్రికావస్త్రముతోఁ దనవస్త్రమునకు ముడి వేసికొని, పద్మరాగమణిమయపీఠమందు వసించి, బ్రాహ్మణులు మంత్రముల నుగ్గడించుచు నుండఁగ లాజహోమము నగ్ని యందుఁ జేసె నని భావము.

మ. సనెకల్ హత్తఁగఁ జేసె నంఘ్రి చెలి చంచత్కుడ్యచిత్రాత్మ ని
ల్చినకంతుండు పురాకృతాగము సనం జిత్తంబులో నిల్పి యం
చనరక్తిం దనుఁ బ్రోవు మంచుఁ దదనుచ్ఛాయోపధిం డాసి వం
దన మూన్పం గని ప్రోతు నం చభయపాదం బూన్చు చందంబునన్. 74

టీక: చంచత్కుడ్యచిత్రాత్మన్ – చంచత్=ప్రకాశించుచున్న, కుడ్య=గోడయందు, చిత్రాత్మన్=చిత్తరువురూపముతో; నిల్చిన కంతుండు=నిలుచుండిన మదనుఁడు; పురాకృతాగము=ముందుచేసిన యపరాధము; చనన్=పోవుటకు;చిత్తంబులో నిల్పి = హృదయమందుంచి; అంచనరక్తిన్ – అంచన=ఒప్పుచున్న, రక్తిన్=ప్రేమచేత; తనున్; ప్రోవు మంచున్=పాలింపు మనుచు; తదనుచ్ఛాయోపధిన్ – తత్=ఆసనెకంటియొక్క, అనుచ్ఛాయా=ప్రతిచ్ఛాయయొక్క, ఉపధిన్=వ్యాజముచేత; డాసి= డగ్గఱి; వందనము = నమస్కారమును; ఊన్పన్ = చేయఁగా; కని = చూచి; ప్రోతు నంచున్ = పాలింతు ననుచు; అభయ పాదంబు = అభయము నిచ్చు పాదమును; ఊన్చు చందంబునన్=ఉంచుతెఱంగున; చెలి =చంద్రిక; అంఘ్రి=పాదమును; సనెకల్=సనెకంటిని; హత్తఁగఁ జేసెన్=ఆక్రమించునట్లు చేసెను.

చంద్రిక, సప్తపదియందు నెదుట నుంచిన సనెకంటియందు గోడమీఁద వ్రాసియున్న మరుఁడు ప్రతిఫలించునెపంబునఁ దాను బూర్వమం దొనరించినట్టి యపరాధమును పోనాడుటకై నన్నుఁ జిత్తమం దుంచి రక్షింపు మని నమస్కరింపఁగా గాపాడుదు నని యొప్పుకొన్నదానివలె, పాదముచే సనెకంటిని స్పృశించె నని భావము.

చ. జనపతి మౌళి భూసురు లొసంగుశుభాక్షతపాళిఁ దాల్చి యం
గనలు ఘటించునారతులు గన్గొని యంత వధూకరాత్తహ
స్తనళినుఁడై ముదంబున లసత్కులదేవగృహంబుఁ జేర నొ
య్యనఁ జనియెన్ గలధ్వనుల నైదువు లింపుగఁ బాటఁ బాడఁగన్. 75

టీక: జనపతిమౌళి=రాజశ్రేష్ఠుఁడగు సుచంద్రుఁడు; భూసురులు=బ్రాహ్మణులు; ఒసంగుశుభాక్షతపాళిన్ – ఒసంగు= సమర్పించిన, శుభ=మంగళకరమైన, అక్షతపాళిన్=మంత్రాక్షతశ్రేణిని; తాల్చి=ధరించి; అంగనలు=కాంతలు; ఘటించు నారతులు = ఇచ్చునట్టి హారతులను; కన్గొని=చూచి; అంతన్=ఆమీఁద; వధూకరాత్తహస్తనళినుఁడై– వధూకర=చంద్రిక హస్తమును, ఆత్త= పొందిన, హస్తనళినుఁడై=కరకంజముగలవాఁడై; ముదంబునన్=సంతసముచేత; లసత్కులదేవగృహం బున్ – లసత్= ప్రకాశించుచున్న, కులదేవగృహంబున్=కులదేవతామందిరమును; చేరన్=పొందుటకై; ఒయ్యనన్=తిన్నగ; కలధ్వనులన్= అవ్యక్తమధురమగు ధ్వనులచేత; ఐదువులు=సువాసినులు; ఇంపుగన్=సొంపుగ; పాటఁ బాడఁగన్=పాటఁ బాడుచుండఁగా; చనియెన్=పోయెను.

ఉ. మ్రొక్కు ఘటింపఁ బెండ్లికొమరుం డబలాయుతి నేగుదేరఁగా
నక్కులదేవతాజనుల యంచున వే యెదు రేగుదెంచి మేల్

నిక్కఁగ నిల్చి తత్సఖులు ◌నీటున వారల నిల్పి రంగునన్
గ్రక్కునఁ దత్సమాఖ్యలఁ బ◌రస్పరవాణి వినంగ నయ్యెడన్. 76

టీక: పెండ్లికొమరుండు=సుచంద్రుఁడు; అబలాయుతిన్=చంద్రికయొక్క కూడికచేతను; మ్రొక్కు ఘటింపన్= నమస్కరించుటకై; ఏగుదేరఁగాన్=రాఁగా; అక్కులదేవతాజనులయంచునన్=ఆకులదేవతలవిధమున; తత్సఖులు=ఆవధూవరుల సకియలు; వే = శీఘ్రముగ; ఎదురేగుదెంచి=అభిముఖముగ వచ్చి; మేల్నిక్కఁగన్=శుభ మతిశయింపఁగ; నిల్చి; గ్రక్కునన్ = శీఘ్రముగ; తత్సమాఖ్యలన్=చంద్రికాసుచంద్రులనామములను; పరస్పరవాణిన్=ఒండొరులమాటలచేత; వినంగన్= వినుటకై; అయ్యెడన్=ఆసమయమందు; నీటునన్=మురిపెముచేత; వారలన్=ఆచంద్రికాసుచంద్రులను; అంగునన్=అందముగా; నిల్పిరి=నిలువఁ జేసిరి. చంద్రికను గూడి సుచంద్రుఁడు కులదేవతలకు నమస్కరించుటకై బైలుదేఱఁగా, నీవధూవరుల నామములు పరస్పరవచనంబుల వినఁ గోరి, తత్కులదేవతలవలె వారిసఖు లడ్డము వచ్చి, చంద్రికాసుచంద్రులను నిల్పి రని భావము.

చ. తెలుపుము చంద్రికాఖ్య జగ◌తీవర యన్న విభుండు నవ్వునం
దెలుపక తెల్పె లో నెఱిఁగి ◌నీరజలోచన యాళు లందఱుం
దెలుపు సుచంద్రనామము స◌తీ యన నెమ్మొగ మెత్తి దానిచేఁ
దెలిపె సకుల్ ధరన్ సహజ◌దీపితకౌశల లౌదురే కదా. 77

టీక: జగతీవర=ఓభూవరా(సుచంద్రుఁడా)! చంద్రికాఖ్యన్=చంద్రికానామమును; తెలుపుము=తెలియఁజేయుము; అన్నన్= అనఁగా; విభుండు=సుచంద్రుఁడు; నవ్వునన్=నగవుచేతనె; తెలుపక తెల్పన్=తెలుపకయే తెలుపఁగా, అనఁగా నానగవె చంద్రిక యని నోటఁజెప్పక నవ్వుచే చంద్రికనామమును ఎఱింగించె నని భావము, స్మితము చంద్రికారూప మనుట ప్రసిద్ధము; నీరజలోచన=చంద్రిక; లోన్=అంతరంగమునందు; ఎఱిఁగి=తెలిసికొని, చంద్రికనామమును వచింపుమనఁగా నానగవె చంద్రిక యని యుక్తితోఁ దెలిపిన కౌశల్యమును గుర్తెఱిఁగి యని భావము; ఆళు లందఱున్=చెలులెల్లరు; సుచంద్రనామము= సుచంద్రుని పేరును; సతీ=చంద్రికా! తెలుపు=తెలుపుము; అనన్= అనఁగా; నెమ్మొగము=సుందరమగు ముఖమును; ఎత్తి =ఎత్తినదై; దానిచేన్=ఆ ముఖము నెత్తుటచేతనె; తెలిపెన్=తెలియఁజేసెను, చంద్రునివలె ముఖ ముండుటచే నాముఖమే సుచంద్రుఁ డని యుక్తితోఁ దెల్పె నని భావము; సకుల్=స్త్రీలు; ధరన్=పుడమియందు; సహజదీపితకౌశలలు=స్వభావముచేఁ బ్రకాశించుచున్న జాణతనము గలవారు; ఔదురే కదా=ఔదురుగదా!

చ. చెలి సుముఖోక్తిఁ దెల్పు నృప◌శేఖరుపే రని డాసి వేడియుం
గలరవ లెల్ల వేఁడ, సుము◌ఖం బని నేర్పునఁ బల్కు, నీవు మున్
దెలిపినఁ దెల్పుఁ గొమ్మ పతి ◌దెల్పవె యోవనితాఖ్య కాంతవా
క్కలన నటన్నఁ, గాంత యనఁ◌గా మది మెచ్చిరి తద్వచోర్థముల్. 78

టీక: కలరవ లెల్లన్=కాంతలందఱు; వెండియున్=మఱియు; డాసి =సమీపించి; చెలి=చంద్రికా! సుముఖోక్తిన్– సు=సమీచీనమైన, ముఖోక్తిన్=ముఖవచనముచేత; నృపశేఖరుపేరు=సుచంద్రునినామమును; తెల్పు=తెలియఁజేయుము; అనివేఁడన్= ఈ ప్రకారము వేఁడుకొనఁగా; సుముఖంబు=సుముఖము; అని=అనుచు; నేర్పునన్=కౌశల్యముచేత; పల్కన్=పలికెను, సుచం

ద్రునినామము సుముఖమని తెల్పె ననఁగా సు అను శబ్దము ముఖమందున్నది గావున సుముఖ మని తాత్పర్యము; పతి =రాజా! నీవు మున్ దెలిపినన్=నీవు మొదట చంద్రికపేరు దెల్పఁగా; కొమ్మ=చంద్రిక; తెల్పున్=తెలుపును; ఈవనితాఖ్యన్ =ఈచంద్రిక నామమును; కాంతవాక్కలనన్—కాంత=మనోహరమైన, వాక్కలనన్=వాక్కుసంబంధముచేత; తెల్పవె అటన్నన్= తెలియఁ జేయుమా యనఁగ; కాంత యనఁగాన్=కాంతయని చెప్పఁగా, అనఁగా చంద్రికనామము కకారాంతమైనదని భావము; తద్వచో ర్థముల్ – తత్=ఆవధూవరులయొక్క, వచః=మాటలయొక్క, అర్థముల్=అర్థములను; మదిన్=మనమందు; మెచ్చిరి= బహూకరించిరి. ఈపద్యమందు శ్లేషచే నర్థాంతరకల్పన యుండుటం జేసి వక్రోక్త్యలంకారము.

ఉ. వెన్నెల కెద్ది పేరు పృథివీవర తెల్పఁ గదే య టన్న చో
నన్నృపమౌళి జ్యోత్స్న యను, నంగన యొప్పగురాజుపే రదే
మన్న సుశీతరశ్మి యను, నబ్రము చంద్రిక యంచు భర్త యా
కన్నె సుచంద్ర యంచుఁ బలుకన్ మది నాఁగిరి లజ్జపెంపునన్. 79

టీక: పృథివీవర=ఓభూవర (సుచంద్రుఁడా)! వెన్నెలకున్, ఎద్ది పేరు=పేరెయ్యది? తెల్పఁగదే యటన్నచోన్= తెల్పు మనఁ గా; అన్నృపమౌళి=ఆరాజశ్రేష్ఠుఁడు (సుచంద్రుఁడు); జ్యోత్స్న యనున్= జ్యోత్స్న యని చెప్పును; అంగన=ఓయింతీ (చంద్రికా)! ఒప్పగురాజుపేరు = సుందరుండగు చంద్రునిపేరు; అదేమన్నన్=అదియేమనఁగా; సుశీతరశ్మి యనున్= సుశీతరశ్మి యని చెప్పును; అబ్రము=ఆశ్చర్యము! భర్త=సుచంద్రుఁడు; చంద్రిక యంచున్=చంద్రిక యని; ఆకన్నె=ఆచంద్రిక; సుచంద్ర యంచున్ = సుచంద్రుఁడని; పలుకన్=వచించుటకు; మదిన్=చిత్తమునందు; లజ్జపెంపునన్=వ్రీడాతిశయముచే; ఆగిరి=మానిరి. అనఁగా చెలులు సుచంద్రునిఁ జంద్రికపేరు యుక్తిగఁ జెప్పించుటకై వెన్నెలపే రడిగిన, సుచంద్రుఁడు చంద్రిక యనక జ్యోత్స్న యనియు, చంద్రికను ఒప్పిదమగు రాజుపే రడిగిన నాపె సుచంద్రుఁ డనక సుశీతరశ్మి యనియు, చెప్పిరని భావము.

చ. మును హృదయాలయాభివృతమోహనిరూఢిఁ బరస్పరాఖ్య లిం
పున ననిశంబుఁ బిల్చునలభూపతియున్ సతియున్ బ్రియాళికా
జనములు దెల్పుమన్న నొకసారి వచింపఁగ నేర రౌర యే
మనఁ దగుఁ దత్త్రపాజలరుహాశుగశాంబరికావిలాసముల్. 80

టీక: మును=పూర్వమందు; హృదయాలయాభివృతమోహనిరూఢిన్ – హృదయాలయ=మనోవీథియందు; అభివృత= ఆవరింపఁబడిన, మోహ=వలపుయొక్క, నిరూఢిన్=రూఢిచేత; పరస్పరాఖ్యలు=ఒండొరులనామములను; ఇంపునన్= ఇష్టము చేత; అనిశంబు=ఎల్లపుడు; పిల్చు అలభూపతియున్ సతియున్ = పిలుచుచున్నట్టి యాసుచంద్రుఁడును చంద్రిక యును; బ్రియాళికాజనములు=సకియలు; తెల్పుమన్నన్=తెల్పుమని యడుగఁగా; ఒకసారి=ఒకమాఱును; వచింపఁగన్= చెప్పుటకు; నేరరు; ఔర=ఆశ్చర్యము! తత్త్రపాజలరుహాశుగశాంబరికావిలాసముల్—తత్త్రపా=ఆలజ్జయను, జలరహాశుగ= మరునియొక్క, శాంబరికా=మాయయొక్క,విలాసముల్=విలాసములను; ఏమనఁ దగున్=ఏమనవచ్చు?

అనఁగా పూర్వము చంద్రికాసుచంద్రులు పరస్పర మొకరినామ మొకరు పలుమఱు బల్కుచునుండియు, నిపుడు చెలులు పలుమఱు వేఁడినను ఒకసారియైన నొండొరులనామముల వచింపరు. ఈలజ్జయను మన్మథమాయ నేమన వచ్చు ననిభావము.

చ. అలతఱి నాళి యత్న గతి ◊నంచితమంథరవాజ్నిరూఢిఁ బే
రులు వచియించి భక్తి మదిఁ ◊గ్రుమ్మర దేవుల మ్రొక్కి బాసిక
మ్ములు సడలించి బంధువృతి ◊ముద్దుగ బువ్వము లారగించి తొ
య్యలియు విభుండు మించిరి ని◊రర్గళసంభ్రమ వైభవంబులన్. 81

టీక: అలతఱిన్=ఆసమయమందు; ఆళియత్న గతిన్—ఆళి=చెలికత్తెలయొక్క, యత్న=ప్రయత్నముయొక్క,గతిన్=రీతిచేత; అంచితమంథరవాజ్నిరూఢిన్ – అంచిత=ఒప్పుచున్న, మంథర=మెల్లనగు, వాజ్నిరూఢిన్=వచనరూఢిచేత; పేరులు=ఒండొరుల నామములను; వచియించి=చెప్పి; భక్తి=దేవతావిషయకమైనప్రేమ; మదిన్=మనమునందు; క్రుమ్మరన్=తిరుగఁగా; దేవులన్=కులదేవతలను; మ్రొక్కి=నమస్కరించి; బాసికమ్ములు=బాసికములను; సడలించి=విడిచి; బంధువృతిన్– బంధు= బందుగులయొక్క, వృతిన్=కూడికచేతను; ముద్దుగన్=మనోజ్ఞముగ; బువ్వము=బువ్వపుబంతి భోజనములను; ఆరగించి =భుజించి; తొయ్యలియున్=చంద్రికయు; విభుండున్=సుచంద్రుఁడును; నిరర్గళసంభ్రమ వైభవంబులన్ – నిరర్గళ =అడ్డము లేని, సంభ్రమ వైభవంబులన్=సంతోషవిభవములచేత; మించిరి=అతిశయించిరి.

అనఁగ నీవధూవరులు చెలికత్తెల నిర్బంధము చేత తిన్నగ నొండొరులనామములు చెప్పి, కులదేవతలకు నమస్కరించి, బాసికములు విడిచి, బువ్వపుబంతి భోజనముల నారగించి సంతోషముచే మించి రని భావము.

క. ఈలీల నశేషనిలిం,పాళీనుతతత్కరగ్ర◊హచతుర్థస్రీ
వేలాంచితవిభవము హే,రాళంబై వెలయ నాథ◊రాపతి యలరెన్. 82

టీక: ఈలీలన్=ఈరీతిగ; అశేష నిలింపాళీ నుత తత్కరగ్రహ చతుర్థస్రీ వేలాంచిత విభవము – అశేష=సమస్తమగు, నిలింపాళీ=సురశ్రేణిచేత, నుత=పొగడఁబడిన, తత్కరగ్రహ=ఆవివాహముయొక్క, చతుర్థస్రీ=నాల్గుదినములను, 'చతుర్ణాం ఘస్రాణాం సమూహ శ్చతుర్థస్రీ' అని విగ్రహము. ఇట, 'అకారాంతోత్తరపదో ద్విగుస్త్రియా మిష్టః' అని స్త్రీత్వము వచ్చినదని యెఱుంగునది, వేలా=మేరచేత, అంచిత=ఒప్పుచున్న, విభవము=ఉత్సవము; హేరాళంబై=అధికమై, వెలయన్= ప్రకాశింపఁగా; ఆథరాపతి = ఆసుచంద్రుఁడు; అలరెన్=సంతసించెను.

ఉ. వేదవిధానముం బుడమి◊వేల్పులు దెల్పఁగ నంత శేషహో
మాదికమంగళాచరణ◊లన్నియుఁ దీర్చి చెలంగునాథరి
త్రీదయితామరేంద్రునకు ◊దివ్యమహర్షికులాగ్రగణ్యు లా
మోదముతో నభీష్టకర◊ము ల్వరము ల్ఘటియించి రందఱున్. 83

టీక: పుడమివేల్పులు=భూసురులు; వేదవిధానమున్=వేదవిధిని; తెల్పఁగన్=తెలియఁజేయఁగా; అంతన్=అటుపిమ్మట; శేషహోమాదిక మంగ ళాచరణలు – శేషహోమాదిక=శేషహోమము మొదలుగాఁగల, మంగళ=శుభకార్యములయొక్క, ఆచరణలు=ఆచరించుటలు; అన్నియున్=అన్నిటిని; తీర్చి=సమాప్తి నొందించి; చెలంగునాథరిత్రీదయితామరేంద్రునకున్– చెలంగు = ప్రకాశించుచున్న, ఆథరిత్రీదయితామరేంద్రునకున్=ఆభూపతీంద్రుఁడైన సుచంద్రునకు; దివ్య మహర్షికులాగ్రగ

ణ్యులు–దివ్య =శ్రేష్ఠులగు, మహర్షికుల=ఋషిసంఘమందు, అగ్రగణ్యులు=పూజ్యులగు మునులు; అందఱున్=ఎల్లరును; ఆమోదముతోన్ =సంతోషముతో; అభీష్టకరముల్=కోరిన కోరికలఁ జేయునట్టి, వరముల్=వరములను; ఘటియించిరి= ఇచ్చిరి.

అనఁగా శేషహోమాది వివాహాంగక్రియలు నిర్వర్తించి మించి యున్న పుడమిఱేనికి నామహర్షిసంఘము లెల్లఁ గోరిన వరముల నిచ్చిరని భావము.

ఉ. వేఁడినకోరికల్ గురియు◊వింతగుమానికము ల్జగంబులం
జో డొకచోట లేని పలు◊సొమ్ములు హెచ్చగు పైఁడివల్వలు
న్వేడుక పొంగ వీడు చది◊వించిరి బంధులు సర్వదేశస
మ్రాడమరేంద్రులున్ హితులు◊మంత్రులు తన్మహినేత కయ్యెడన్. 84

టీక: తన్మహినేతకున్=ఆసుచంద్రునకు; అయ్యెడన్=ఆసమయమందు; బంధులు=చుట్టములు; సర్వదేశసమ్రాడమరేంద్రులున్—ఎల్లదేశములదొరలు, దేవశ్రేష్ఠులు; హితులు=నేస్తకాండ్రు; మంత్రులు=సచివులు; వేఁడినకోరికల్=అభీష్టవస్తువులను; కురియు వింతగుమానికముల్ – కురియు=వర్షించు; వింతగు=చిత్రమగు, మానికముల్=మణులను; జగంబులన్=లోకములందు; జోడు=జత; ఒకచోట లేని=ఒకచోటను లేనట్టి, జగదేకమైన యనుట; పలుసొమ్ములు=అనేకమగు ఆభరణములను; హెచ్చగు పైఁడివల్వలున్=అధికమగు బంగరువస్త్రములను; వేడుక=కుతూహలము; పొంగన్=అతిశయింపఁగ; వీడు=కట్నమును; చదివించిరి=ఇచ్చిరి. వివాహాంతమున సుచంద్రునకు బందుగులు, సర్వదేశములరాజులు, హితులు మొదలగువారు మణులు మొదలగు కట్నములను చదివించిరని భావము.

సీ. అహికి లోఁబడనిది◊వ్యగజంబు బృంహితా,ర్భటిఁ గేరు భద్రవా◊రణశతముల,
ననికి వేలుపుతేజి ◊నలరుకైజామోర, యల్లార్పుచేఁ జీరు◊హయకులముల,
వేగంటితేరికా◊విమెఱుంగు పడగవీ,వలిఁ బాయఁ జేయును◊జ్జ్వలరథములఁ,
దెఱగంటితెఱవల◊తీరెల్ల బెళుకుచూ,పులనె పోనాడు పూఁ◊బోఁడిగములఁ,
తే. దులకు జేజేలరతనంబు ◊దొడర సుగుణ,భారగతి నెగఁబట్టు ను◊దారమణుల,
నపుడు పాంచాలుఁ డొసఁగెఁ ద◊ద్విపులవిభవ, జనితహర్షాప్తమతికిఁ ద◊న్మనుజపతికి. 85

టీక: అహికి లోఁబడనిదివ్యగజంబున్ – అహికిన్=వృత్రాసురునకు, లోఁబడని=వశపడని, దివ్యగజంబున్=ఐరావతమును; బృంహితార్భటిన్—బృంహిత=కరిగర్జితములయొక్క, ఆర్భటిన్=మ్రోఁతచేతను; కేరు భద్రవారణశతములన్ – కేరు=పరిహసించు, భద్రవారణశతములన్=భద్రగజములయొక్క నూఱులను, భద్రగజసమూహముల ననుట; ఇంద్రశత్రువగు వృత్రాసురునకు వశముగాని యైరావతమును తమ ధ్వనులచేఁ బరిహసించుచున్న పెక్కుగజములను పాంచాలుఁడు సుచంద్రున కిచ్చె నని భావము;

అలరుకైజామోరయల్లార్పుచేన్ – అలరు=ఒప్పుచున్న,కైజా= కళ్ళెమునకుఁ గట్టఁబడిన త్రాటిచే బిగింపఁబడిన; మోర = ముఖముయొక్క,అల్లార్పుచేన్=కదలించుటచేత; వేలుపుతేజిన్=ఉచ్చైశ్రవమును; అనికిన్=యుద్ధమునకు; చీరు హయకుల

ములన్=పిలుచుచున్న గుఱ్ఱములగుంపులను; ముఖచలనముచే నింద్రహయములను యుద్ధమునకుఁ బిలుచు నుత్తమాశ్వము లను సమర్పించె నని భావము.
వేగంటితేరికావిమెఱుంగున్ – వేగంటితేరి=ఇంద్రునియొక్క రథములగు మేఘములయొక్క, కావిమెఱుంగున్=ఎఱ్ఱని కాంతిని; పడగపీవలిన్=ధ్వజమారుతముచేత; పాయఁజేయునుజ్జ్వలరథములన్=పోఁగొట్టుచున్న ప్రకాశించు తేరులను; తమ సిడెము యొక్క గాలిచేతనె మేఘములమెఱుఁగును బోగొట్టునట్టి రథముల నిచ్చె నని భావము;
తెఱగంటితెఱవలతీరెల్లన్=వేల్పుకన్నెలయొక్క చక్కఁదనము నంతయు; బెళుకుచూపులనె=తళతళమని ప్రకాశించు వీక్షణ ములచేతనె; పోనాడు పూఁబోఁడిగముల=పోఁగొట్టుచున్న స్త్రీబృందములను; దేవాంగనలతీరును తమనేత్రకాంతిచేతనె పోఁ గొట్టు వనితల నిచ్చెనని భావము;
తులకున్=త్రాసునకు; జేజేలరతనంబు=చింతామణి; తొడరన్=పూనఁగా; సుగుణభారగతిన్—సుగుణ=మంచిగుణముల యొక్క, భార=బరువుయొక్క, గతిన్=రీతిచేత; ఎగఁబట్టు ఉదారమణుల=ఎగయఁజేయునట్టి ఉత్కృష్టమైన మణులను; చింతామణి తమతోఁ దులదూఁగఁగా తమగుణములచే నట్టి చింతామణిని బరువునందు చులకఁ జేయు మణుల నిచ్చె ననుట; అపుడు=ఆసమయమందు; పాంచాలుఁడు=క్షణదోదయుఁడు; తద్విపులవిభవజనితహర్షాప్తమతికిన్ – తత్=ఆక్షణదోద యునియొక్క, విపుల=విశాలమగు, విభవ=సంపదచేత, జనిత=పుట్టింపఁబడిన,హర్ష=సంతసముచేత; ఆప్త=పొందఁబడిన, మతికిన్=మనముగల; తన్మనుజపతికిన్=ఆసుచంద్రునకు; ఒసఁగెన్=ఇచ్చెను.

సీ. సన్మణిచాప మొ◊సంగెఁ దన్గను నరి,మండలి కిది యార్తి ◊మన్పు ననుచు,
నాశుగౌఘ మొసంగె ◊నాశువర్తన నిది, పరవాహినుల భంగ◊పఱచు ననుచు,
శాతహేతి నొసంగె ◊సమిదుజ్జ్వలితవీర,తరులను నిది మాయఁ ◊దార్చు ననుచు,
ఘనవల్లి నొసఁగె వే◊గ మహాహితాళుల,కిది సుమనోయోగ ◊మెనపు ననుచు,
తే. మఱియు దివ్యాయుధంబు ల◊త్తఱి నొసంగె, నవ్యవిజయేందిరానిదా◊నమ్ము లనుచు,
హాళి దళుకొత్త నలకూకు◊దావతంస, మవ్విభున కిట్లు దెలుపుచు ◊నాదరమున. 86

టీక: సన్మణిచాపము—సత్=శ్రేష్ఠమగు, మణిచాపము=మణిమయమగు ధనుస్సును; తన్గను నరిమండలికిన్ – తన్=తన్ను, కను నరిమండలికిన్=చూచు శత్రుబృందమునకు; ఇది=ఈవిల్లు; ఆర్తిన్=పీడను; మన్పున్=వృద్ధినొందించును; అనుచు = ఇట్లనుచు; ఒసంగెన్=ఇచ్చెను. ఇచట, సన్మణిచాపము=ఇంద్రధనుస్సు, తన్గను నరిమండలికిన్=తన్నుఁ జూచు చక్రవాకగణ ములకు, ఆర్తి మన్పు నను నర్థము దోఁచుచున్నది.
యుద్ధమందు తనుఁ జూచినశత్రుమండలికి నీవిల్లు ఆర్తిని పెంపొందించు నని చెప్పుచు నామణిచాప మొసఁగె నని భావము;
ఆశువర్తనన్=అతిశీఘ్రవర్తనచే; ఇది=ఈబాణపుంజము; పరవాహినులన్—పర=శత్రువులయొక్క, వాహినులన్=సేనలను; భంగపఱచున్=భంగము చేయును; అనుచున్=ఇట్లనుచు; అశుగౌఘము=బాణసముదాయమును; ఒసంగెన్=ఇచ్చెను. ఇట, ఆశుగౌఘము=వాయుబృందము, పరవాహినులన్—పర=ఉత్కృష్టమగు, వాహినులన్=నదులను, భంగపఱచున్= అలలు గల వానిగాఁ జేయు నను నర్థము దోఁచుచున్నది; ఈబాణబృందము శత్రువులసేనలను భంగపఱచునట్టి సామర్థ్యము గలదని చెప్పి యిచ్చెనని భావము.

సమిదుజ్జ్వలిత వీరతరులనున్ – సమిత్=యుద్ధమందు, ఉజ్జ్వలిత=మిగుల వెలుఁగుచున్న, వీరతరులనున్=వీరశ్రేష్ఠులను; ఇది = ఈహేతి; మాయన్=నశించునట్లు; తార్చున్=చేయును; అనుచున్=ఇట్లని చెప్పుచు; శాత=వాఁడిగల,హేతిన్= ఖడ్గమును; ఒసంగెన్=ఇచ్చెను; ఇచట, సమిత్=సమిధలచే, ఉజ్జ్వలిత=మిక్కిలి ప్రకాశించు, వీరతరులన్=ఏఱుమద్దిచెట్లను, మాయన్=నశింపఁగా, తార్చున్=చేయును, అను నర్థము దోఁచుచున్నది. యుద్ధమునందు ప్రతివీరుల మాయఁజేయునట్టి సామర్థ్యము గలదని తెలిపి యొక ఖడ్గము నిచ్చె నని భావము;

మహాహితాళులకున్ – మహత్=అధికులగు, అహిత=శత్రువులయొక్క, ఆళులకున్=శ్రేణులకు; ఇది=ఈముద్గరము; వేగ=త్వరగా; సుమనోయోగము – సుమనః=దేవతలయొక్క, యోగము=సంబంధమును; ఎనపున్=పొందించును; అనుచున్ = ఇట్లు చెప్పుచు; ఘనవల్లిన్=తీఁగెవంటి ముద్గరమును; వేగ=వేగముగ; ఒసఁగెన్=ఇచ్చెను. ఇచట, మహాహితాళులకున్ – మహాహిత=మిక్కిలి హితములగు, అళులకున్=తుమ్మెదలకు, ఘనవల్లి=ఘనమగు తీఁగ; సుమనోయోగమును= పుష్పముల యొక్క సంబంధము నను నర్థము దోఁచుచున్నది; ఈముద్గరము యుద్ధమందు శత్రులఁ గూల్చి వారికి దేవత్వము నొసంగు నని చెప్పి యాముద్గరమును సుచంద్రున కిచ్చెనని భావము;

నవ్యవిజయేందిరానిదానమ్ములు – నవ్య=నూతనమగు, విజయేందిరా=విజయలక్ష్మికి, నిదానమ్ములు=ఆదికారణములు; అనుచున్=ఇట్లు వచించుచు; మఱియున్=వెండియు(ఇంకను);దివ్యాయుధంబులు—దివ్య=అప్రతిహతమగు, ఆయుధంబులు=ఆయుధములను; అత్తఱిన్=ఆసమయమందు; హాళి దళుకొత్తన్—హాళి=ఆసక్తి; తళుకొత్తన్=మిక్కిలి ప్రకాశింపఁగ; అలకూకుదావతంసము=కన్య నలంకరించి దానముఁజేసినవారిలో శ్రేష్ఠుఁడగు క్షణదోదయుఁడు, 'సత్కృత్యాలంకృతాం కన్యాం యో దదాతి స కూకుదః' అని యమరుఁడు; అవ్విభునకున్=ఆసుచంద్రునకు; ఇట్లు దెలుపుచున్=ఈరీతిగా వివరించుచు; ఆదరమునన్=ప్రేమచేత; ఒసంగెన్=ఇచ్చెను.

చ. అసమబుధప్రకాండయుతి ◊నాతతనిర్మలపుష్కరాపగా
ప్తి సరసపారిజాతజగ◊తీరుహశోభితసౌధయుక్తి ని
వ్వసుధ మరుత్పురస్ఫురణ ◊పాటిలుభవ్యపురీశతంబులం
బసుపున కిచ్చె నయ్యవని◊పాలుఁడు పుత్త్రికి సమ్మదంబునన్. 87

టీక: అసమబుధప్రకాండయుతిన్ – అసమ=సరిలేని, బుధప్రకాండ=విద్వద్బృందముయొక్క,యుతిన్=కూడికచేతను; అసమ=సరిలేని, బుధ ప్రకాండ=దేవబృందముయొక్క, యుతిన్=కూడికచేతను, అని స్వర్గపరమైన యర్థము; ఆతత నిర్మలపుష్కరాపగాప్తిన్ – ఆతత=విశాలమగు, నిర్మల=స్వచ్ఛమగు, పుష్కర=పద్మములుగల, ఆపగా=నదులయొక్క, ఆప్తిన్=ప్రాప్తిచేతను; ఆతత=విశాలమగు, నిర్మల=స్వచ్ఛమగు, పుష్కరాపగా=స్వర్గంగయొక్క, ఆప్తిన్=ప్రాప్తిచేతను, అని స్వర్గపరమైన యర్థము; సరసపారిజాతజగతీరుహశోభితసౌధయుక్తిన్ – సరస=శ్రేష్ఠమగు, పారిజాతజగతీరుహ= పారిజాతవృక్షములచేత, శోభిత=ప్రకాశించుచున్న, సౌధయుక్తిన్=మేడలయొక్క సంబంధముచేతను; సరస=శ్రేష్ఠమగు, పారిజాతజగతీరుహ= కల్పవృక్షములచేత, శోభిత=ప్రకాశించుచున్న, సౌధయుక్తిన్=మేడలయొక్క సంబంధముచేతను అని స్వర్గపరమైన యర్థము; ఇవ్వసుధన్=ఈభూమియందు; మరుత్పురస్ఫురణ – మరుత్పుర=స్వర్గముయొక్క, స్ఫురణ=ప్రకాశము; పాటిలు భవ్య పురీ శతంబులన్ – పాటిలు=కలుగుచున్నట్టి, భవ్య=మనోజ్ఞమగు, పురీశతంబులన్= పురశతములను; అయ్యవనిపాలుఁడు =ఆ క్షణదోదయుఁడు; పుత్త్రికిన్=కూఁతురగు చంద్రికకు; పసుపునకున్=పసుపుకుంకుమలకుఁ గాను; సమ్మదంబునన్=సంత

సము చేత; ఇచ్చెన్=ఒసంగెను. అనఁగా క్షణదోదయుఁడు తనపుత్రికయగు చంద్రికకు స్వర్గతుల్యములగు పురశతములను పసుపుకుంకుమలకుఁగా నిచ్చె నని భావము.

మ. ధరణిన్ మేల్ రతనాలసొమ్ములును జల్తారీచ్చీరలుం గ్రొత్తక
స్తురివీణెన్ ఘనసారసాంద్రధమనీస్తోమంబు లవ్వేళ ని
ర్భరచామీకరపేటికోత్కరములం బన్నించి దా వెండియున్
దరుణీమౌళి కొసంగె నయ్యవనికాంతాభర్త చిత్రంబుగన్. 88

టీక: ధరణిన్=భూమియందు; మేల్ రతనాలసొమ్ములును=శ్రేష్ఠమగు రత్నమయములైన నగలును; జల్తారీచ్చీరలున్ =సరిగంచుచీరలును; క్రొత్తకస్తురివీణెన్ =నూతనమగు కస్తురివీణెను; ఘనసారసాంద్రధమనీస్తోమంబులు– ఘనసార =పచ్చకర్పూరముచేత, సాంద్ర=నిండిన,ధమనీస్తోమంబులు=క్రోవులగుంపులు; అవ్వేళన్=ఆసమయమందు; నిర్భర చామీకరపేటికోత్కరములన్– నిర్భర=అధికమగు, చామీకర=బంగరుయొక్క, పేటికా=పెట్టెలయొక్క, ఉత్కరములన్ =సమూహములయందు; పన్నించి=ఉనిచి; తాన్=తాను; వెండియున్=మఱియును; తరుణీమౌళికిన్=చంద్రికకు; అయ్య వనికాంతాభర్త=ఆక్షణదోదయరాజు; చిత్రంబుగన్=వింతగ; ఒసంగెన్=ఇచ్చెను. అనఁగ నాక్షణదోదయుఁడు చంద్రికకు రత్నాభరణములను, సరిగంచువస్త్రములను, కస్తురివీణెను, పచ్చకప్పురపుక్రోవులను బంగరుపెట్టెల నించి యిచ్చె నని భావము.

చ. స్థిరతమభక్తి మ్రొక్కి తమచెంగట నిల్చినఁ గ్రొత్తపెండ్లికూఁ
తురు కడు బుజ్జగించి లలితో మునికామిను లెల్ల నాసువ
ర్ణరుచికిఁ జాల నైదువతనం బతిదీర్ఘతరాయురున్నతుల్
సరసతనూజలాభము నొసంగిరి తత్పరతాయుతాత్మచేన్. 89

టీక: క్రొత్తపెండ్లికూఁతురు=క్రొత్తగాపెండ్లియయిన చంద్రిక; స్థిరతమభక్తిన్=దృఢతరమగు భక్తిచేత; మ్రొక్కి=నమస్కరించి; తమచెంగట నిల్చినన్ =తమ సమీపమందు నిలుచుండఁగా; కడున్=మిక్కిలి; బుజ్జగించి=లాలనచేసి; లలితోన్=ప్రేమతో; మునికామిను లెల్లన్=మునిపత్నులందఱును; ఆసువర్ణరుచికిన్=బంగరురంగు గల యాచంద్రికకు; చాలన్=మిక్కిలి; ఐదువతనంబు =సువాసినీత్వమును; అతిదీర్ఘతరాయురున్నతుల్=మిక్కిలి యధికమగు ఆయుస్సుయొక్క అతిశయము లను; సరసతనూజలాభమున్–సరస=శ్రేష్ఠుఁడగు, తనూజ=పుత్రునియొక్క, లాభమున్=ప్రాప్తిని; తత్పరతాయుతాత్మచేన్– తత్పరతా= తత్పరత్వముతో, యుత=కూడుకొన్న, ఆత్మచేన్=బుద్ధిచేత; ఒసంగిరి=ఇచ్చిరి. అనఁగా మునిభామ లెల్లరు చంద్రికకు నాసక్తిచేత నైదువతనంబును, పుత్రప్రాప్తిని, పూర్ణమగు నాయుస్సు నిచ్చిరని భావము.

సీ. అలఘుభోగసమృద్ధి నర్పించెఁ బౌలోమి, యనుపమౌజశ్శ్రీల నెనపె ననలి,
ధర్మైకబుద్ధి నొందఁగఁజేసె యమభామ, యిష్టరమ్యోత్సవం బిచ్చె నసురి,
కమలాభ్యుదయముపొం దమరించెఁ బాశిని, సుస్పర్శనాసక్తిఁ జొన్పెఁ బవని,

రాజపూజ్యోన్నతిఁ బ్రబలించె ధనరాజ్ఞి, ఈశభక్తి ఘటించె మృడవధూటి,

తే. మఱియుఁ దక్కిననిర్జరీమణు లుదార, కలితసౌభాగ్యవిభవము గ్గలుగఁజేసి,
రపుడు పాణౌకరణమంగళానురచిత,కుతుకయై శ్రీ రహించు నాక్షితిపసుతకు. 90

టీక. పౌలోమి=శచీదేవి; అలఘుభోగసమృద్ధిన్ – అలఘు=అధికమైన, భోగ=అష్టభోగములయొక్క, సమృద్ధిన్=సంపదను; అర్పించెన్=ఒసంగెను, శచీదేవి యింద్రునిభార్య గాన తమకున్న భోగముల నిచ్చె నని భావము; అనలి=స్వాహాదేవి; అనుపమౌజశ్శ్రీలన్ – అనుపమ=సాటిలేని, ఔజశ్శ్రీలన్=తేజస్సంపదలను; ఎనపెన్=పొందించెను, అగ్నిభార్య గాన తేజస్సమృద్ధి నిచ్చె నని భావము.

యమభామ=యమునిభార్య; ధర్మైకబుద్ధిన్—ధర్మ=పుణ్యమందు; ఏక=ముఖ్యమగు, బుద్ధిన్=మతిని; ఒందఁగన్=పొందునటులు; చేసెన్=చేసెను. యమభార్య ధర్మబుద్ధి నిచ్చె నని భావము; అసురి=నిరృతిభార్య; ఇష్టరమ్యోత్సవంబు–ఇష్ట=అనుకూలమగు, రమ్య=మనోజ్ఞమగు, ఉత్సవంబు=వేడుకను; ఇచ్చెన్=ఒసంగెను. కామరూపముచేత నలభ్యోత్సవములను బొందుచున్న రాక్షసునిభార్య గాన నిష్టరమ్యోత్సవంబుల నిచ్చె నని భావము.

పాశిని=వరుణునిభార్య; కమలాభ్యుదయముపొందు – కమలా=సంపదయొక్క, అభ్యుదయము పొందు=ఆవిర్భావముయొక్క పొందికను; అమరించెన్=కలిగించెను. లక్ష్మి తమయింటఁ బుట్టినది గాన సులభముగా నిచ్చె నని భావము. వరుణుఁడు జలాధిష్ఠానదేవతగాన జలజంబుల నిచ్చె నను యర్థము దోఁచుచున్నది; పవని= వాయుదేవునిభార్య; సుస్పర్శనాసక్తిన్ – సు=సమీచీనమగు, స్పర్శన=దానమందు, ఆసక్తిన్=వాంఛను; చొప్పెన్=కల్గించెను. స్పర్శగుణము గల వాయుదేవునిభార్య గాన సుఖస్పర్శము నిచ్చె నని దోఁచుచున్నది. వాయుదేవునిభార్య దానమం దాసక్తిని కలిగించె నని భావము.

ధనరాజ్ఞి=కుబేరునిభార్య; రాజపూజ్యోన్నతిన్ – రాజ=రాజులచేత,పూజ్య=పూజింపఁదగిన, ఉన్నతిన్=అతిశయమును; ప్రబలించెన్=బలపఱచెను. ఈపె రాజరాజుభార్య గాన రాజపూజ్యోన్నతి నిచ్చె నని భావము; మృడవధూటి =పార్వతీదేవి; ఈశభక్తిన్—ఈశ=భర్తయందు, భక్తిన్=భక్తిని; ఘటించెన్=ఘటిల్లఁజేసెను. పార్వతీదేవి ఈశ్వరునిభార్య గాన స్వపురుషుని యందు భక్తిని ఘటిల్లఁజేసె నని భావము. శంకరునియందు భక్తి గలుగఁజేసె నని తోఁచుచున్నది.

మఱియున్=వెండియు; తక్కిననిర్జరీమణులు=తక్కినదేవాంగనలు; ఉదారకలితసౌభాగ్యవిభవముల్–ఉదార=అధికముగ, కలిత=కూడుకొన్న, సౌభాగ్య=సుభగత్వముయొక్క, విభవముల్=అతిశయములను; పాణౌకరణమంగళానురచితకుతుకయై – పాణౌకరణమంగళ=వివాహమంగళముచేత, అనురచిత=పుట్టింపఁబడిన, కుతుకయై=సంతోషముగలది యై; శ్రీన్= శోభచేత; రహించు నాక్షితిపసుతకున్= ఒప్పుచున్న క్షణదోదయునిపుత్రిక యగు నాచంద్రికకు; అపుడు=ఆసమయమందు; కలుగఁజేసిరి= సిద్ధించునటులు చేసిరి.

మ. మనుజాధీశసతుల్ నుతింప ననుకంపాలక్ష్మి నవ్వేళఁ గం
ధినిషంగప్రియభామ యాత్మమహిమ న్నిత్యాంగరాగంబు సే
యనిసింగారము వాడనట్టివిరి పాయ న్లేనితారుణ్యవ
ర్తనము న్వీడనిసొంపుపెంపు కలుగ న్దార్చె న్వరం బింతికిన్. 91

టీక: కంధినిషంగప్రియభామ=జలధి తూణీరముగాఁ గల యీశ్వరునిభార్య యగుపార్వతీదేవి; అవ్వేళన్=ఆసమయమందు; మనుజాధీశసతుల్=రాజపత్నులు; నుతింపన్=పొగడఁగా; ఆత్మమహిమన్–ఆత్మ=తనయొక్క, మహిమన్=సామర్థ్యము చేత; నిత్యాంగరాగంబు = అకృత్రిమమై సార్వకాలీనమగు నంగరాగమును, అనఁగా మైపూఁత ననుట; చేయని సింగారము= అకృత్రిమాలంకారమును; వాడనట్టివిరి=వాడని పుష్పమును; పాయన్లేనితారుణ్యవర్తనమున్=నివర్తింపని యౌవనమును; వీడనిసొంపుపెంపు=నశింపని సౌందర్యాతిశయమును; కలుగన్=కలుగునటులు; అనుకంపాలక్ష్మిన్= దయాసంపదతో; ఇంతికిన్=చంద్రికకు; వరంబు=వరమును; తార్చెన్=ఇచ్చెను. అనఁగాఁ బార్వతీదేవి దయతోఁ జంద్రిక కెల్లపుడు నిత్యాంగ రాగమును, చేయనిసింగారమును, వాడనట్టికుసుమంబు, పాయనితారుణ్యము, వీడనిసొంపునుం గలుగు నటులు వరం బిచ్చె నని భావము.

చ. పలుకులఁ దేనె లుట్టిపడ ◊భావిశుభంబులు దెల్పు నేర్పుమైఁ
బొలయలుక ల్మరల్పు చెలి◊పోలిక నీవిభు నిన్నుఁ గూర్చు ని
చ్చలు భవదిష్ట మంతయుఁ బొ◊సంగఁ దనర్పు నెఱుంగు నంచు ను
త్కలిక వచించి యొక్క చిలు◊కం గిరికన్య యొసంగెఁ గొమ్మకున్. 92

టీక: పలుకులన్=మాటలయందు; తేనెలు=మకరందములు; ఉట్టిపడన్=ఊడిపడునట్లు; భావిశుభంబులు – భావి=కాబోవు నట్టి, శుభంబులు=మంగళములను; నేర్పుమైన్=చాతుర్యముచేత; తెల్పున్=తెలియఁజేయును; పొలయలుకల్= ప్రణయ కలహములను; మరల్పు=త్రిప్పి; చెలిపోలికన్=సకియవలె; నీవిభున్=నీపెనిమిటిని; నిన్నున్=నిన్నును; కూర్చున్=కూడఁ బెట్టును; నిచ్చలు=ఎల్లప్పుడు; భవదిష్టమంతయున్=నీకోరికనంతయు; పొసంగన్=అనుకూలించునట్లు; తనర్పన్=చేయు టకు; ఎఱుంగు నంచున్=తెలియు ననుచు; ఉత్కలికన్=సంతసముచేత; వచించి=చెప్పి; ఒక్కచిలుకన్=ఒకశుకమును; గిరి కన్య=పార్వతీదేవి; కొమ్మకున్=చంద్రికకు; ఒసంగెన్=ఇచ్చెను. భవిష్యచ్ఛుభఫలములను దెలుపునదియు, దంపతులను ప్రణయకలహములు పోఁగొట్టి కూర్చునదియు, కోరినకోర్కెల నెఱవేర్చునదియు నగు నొకశుకంబును పార్వతీదేవి చంద్రిక కొసంగె నని భావము.

మ. సురభి న్పొన్నలతావి మల్లియలతే◊జు న్వేసవిన్ జాతివై
ఖరి వర్షాది శరద్దినాళి నసనౌ◊ఘస్ఫూర్తి సేమంతిడా
ల్వరహేమంతముఖంబున న్శిశిరవే◊ళ న్మొల్లచాల్పెంపు దా
ల్చి రహిం గూర్చు నటంచు నొక్క విరి ని◊చ్చె న్గౌరి యబ్జాక్షిన్ 93

టీక: సురభిన్=ఆమనియందు; పొన్నలతావిన్=పొన్నపూలపరిమళమును; వేసవిన్=గ్రీష్మర్తువునందు; మల్లియలతేజున్ = మల్లికాకుసుమములయొప్పును, అనఁగా వానిపరిమళముననుట; వర్షాదిన్=వర్షాకాలారంభమందు; జాతివైఖరిన్= మాలతీ పుష్పముయొక్కరీతిని, అనఁగా దానిపరిమళముననుట; శరద్దినాళిన్=శరత్కాలదినసమూహమందు; అసనౌఘస్ఫూర్తిన్ = సర్జకపుష్పములయొక్క అతిశయమును; వరహేమంతముఖంబునన్–వర=శ్రేష్ఠమైన, హేమంత=హేమంతర్తువుయొక్క, ముఖంబునన్=ప్రారంభమందు; సేమంతిడాల్=చేమంతిప్రకాశమును, దానిపరిమళము ననుట; శిశిరవేళన్=శిశిరకాలమున;

మొల్లచాల్పెంపున్=కుందసుమశ్రేణియొక్క యతిశయమును, దానిపరిమళము ననుట; తాల్చి=ధరించి; రహిన్=ఆనంద మును; కూర్చు నటంచున్=కలుఁగఁజేయు ననుచు; ఒక్కవిరిన్=ఒకపూవును; గౌరి=పార్వతీదేవి; అబ్జాక్షిన్=చంద్రికకు; ఇచ్చెన్=ఒసంగెను. అనఁగా వసంత, గ్రీష్మ, శరద్ధేమంత, శిశిరంబులందు వరుసగాఁ బున్నాగ, మల్లికా, మాలతీ, సర్జక, సేమంతికా, కుంద ప్రసూనంబులపరిమళంబు ధరించునట్టి యొకపుష్పంబును గౌరీదేవి చంద్రిక కిచ్చె నని భావము.

చ. తలచినకోరిక ల్గురియుఁదాని, మెఱుంగుమెఱుంగుమిన్నలం
దళతళమంచు మించుజిగిఁదాని, ధరించినమాత్ర దేవకాం
తలఁ గికురించుసొంపెసఁగుఁదాని, నొకానొకరత్నమాలికన్
జలరుహలోచనామణి కొసంగె గిరీంద్రకుమారి యత్తఱిన్. 94

టీక: తలచినకోరికల్=కోరినకోరికలను; కురియుదానిన్=వర్షించునట్టిదానిని, ఒసంగుచున్నదాని నని భావము; మెఱుంగు మెఱుంగుమిన్నలన్ = కాంతిగల శ్రేష్ఠములయిన మెఱపులను; తళతళమంచున్=తళతళమని మెఱయుచు; మించుజిగిదానిన్ =మీఱినకాంతిగలదానిని; ధరించినమాత్రన్=ఆ సరమును దాల్చినంతటనె; దేవకాంతలన్=దేవాంగనలను; కికురించు సొంపె సఁగుదానిన్=వంచించు నందముచేత నతిశయించుదానిని; ఒకానొకరత్నమాలికన్= ఒకానొకరత్నహారమును; గిరీంద్ర కుమారి=పార్వతీదేవి; అత్తఱిన్=ఆసమయమందు; జలరుహలోచనామణికిన్=నారీరత్నమగు చంద్రికకు; ఒసంగెన్= ఇచ్చెను. అనఁగా నిష్టార్థముల నిచ్చునదియు, మెఱపుతీవను దిరస్కరించుకాంతితోఁ గూడినదియు, ధరించినంతమాత్రమున దేవాంగనల కన్న నెక్కువయందము గల్గించునదియు నగు నొక రత్నహారమును పార్వతీదేవి చంద్రిక కిచ్చెనని భావము.

చ. మఱియు నమూల్యవాంఛితసమాజము లాదృతిచే ఘటించి యా
తెఱవఁ గవుంగిలించి నరదేవకుమారిక పోయి వత్తు ని
త్తఱి నని దెల్పి యాగిరిశతన్వి ముదంబున నేగె వేలుపుల్
తఱిగొని వెంట నొంద రజతక్షితిభృన్నిలయంబుఁ జేరఁగన్. 95

టీక: మఱియున్=వెండియు; అమూల్యవాంఛితసమాజములు—అమూల్య=వెలలేని, అనఁగా శ్రేష్ఠములయినట్టి యని భావము, వాంఛిత=ఇష్టార్థములయొక్క, సమాజములు=సమూహములను; ఆదృతిచేన్=ఆదరముతో; ఘటించి=ఇచ్చి; ఆతెఱవన్=ఆచంద్రికను; కవుంగిలించి=కౌఁగిలించి; నరదేవకుమారిక=చంద్రికా! ఇత్తఱిన్=ఇపుడు; పోయి వత్తున్=పోయి వచ్చెదను; అని తెల్పి=ఈప్రకారము తెలియఁజేసి; ఆగిరిశతన్వి=ఆశంభుసతి యగు పార్వతీదేవి; ముదంబునన్=సంత సముచేత; వేలుపుల్=దేవతలు; తఱిగొని=పూని; వెంటన్=వెంబడి; ఒందన్=పొందఁగా, దేవాంగనలు వెంట రాఁగా నని తాత్పర్యము; రజతక్షితిభృన్నిలయంబు=కైలాసగిరి యను గృహమును; చేరఁగన్=పొందుటకు; ఏగెన్=అరిగెను.

అనఁగా పార్వతీదేవి చంద్రికకుఁ గోరినకోరిక లెల్ల నొసంగి, కౌఁగిలించి, పోయివత్తు నని వచించి, దేవతలం గూడి కైలాస నిలయంబుఁజేరె నని తాత్పర్యము.

ఉ. అంత సుచంద్రమానవకులాగ్రణిచే క్షణదోదయక్షమా
కాంతునిచే బహూకృతులు గైకొని తత్సకలాంతరీపరా

ట్సంతతు లెల్ల నైజపుర◊జాతముఁ జేరఁగ నేగె మానసా
భ్యంతరసీమఁ దచ్ఛుభమ◊హావిభవోన్నతి సన్నుతించుచున్. 96

టీక: అంతన్=ఆపిమ్మట; సుచంద్రమానవకులాగ్రణిచేన్=మనువంశశ్రేష్ఠుండగు సుచంద్రునివలన; క్షణదోదయక్షమాకాంతునిచేన్=క్షణదోదయరాజువలన; బహూకృతులు=బహుమతులను; కైకొని=గ్రహించి; తత్సకలాంతరీపరాట్సంతతు లెల్లన్– తత్=ప్రసిద్ధులగు, సకల=ఎల్ల, అంతరీపరాట్= ద్వీపాధిపతులయొక్క, సంతతులు=సమూహములు, ఎల్లన్=సమస్తము; మానసాభ్యంతరసీమన్=చిత్తమధ్యప్రదేశమందు; తచ్ఛుభమహావిభవోన్నతిన్=ఆవివాహమహోత్సవముయొక్క యతిశయమును; సన్నుతించుచున్=పొగడుచు; నైజపురజాతమున్=నిజపత్తనబృందమును; చేరఁగన్ =పొందుటకు; ఏగెన్=చనెను.

అనఁగా వివాహమహోత్సవమునకై చనుదెంచి యున్న సకలదేశరాజులును సుచంద్రునివలన, క్షణదోదయునివలన బహుమతుల నొంది యావివాహమహోత్సవము నెన్నుచు స్వపురంబులను జేరఁబోయి రని భావము.

మ. అలపాంచాలవిభుండు పుత్త్రి కధికాం◊తావాసనూత్నప్రవే
శలసన్మంగళ మూన్పఁగాఁ దలఁచి త◊త్సారంగదేశీయకుం
తలఁ దాఁ గౌఁగిటఁ జేర్చి యంకవసతిం ◊దార్కొల్పి నవ్యాశ్రుసం
కులమై కన్గవ దోఁప నచ్చెలువఁ బ◊ల్కెం బ్రీతిచే నత్తఱిన్. 97

టీక: అలపాంచాలవిభుండు=ఆక్షణదోదయుఁడు; పుత్త్రికిన్=చంద్రికకు; అధికాంతావాసనూత్నప్రవేశలసన్మంగళము– అధికాంతావాస=భర్తృగృహమునకు, నూత్నప్రవేశ=నూతనప్రవేశరూపమగు, లసత్=ప్రకాశించుచున్న, మంగళము=కల్యాణమును; ఊన్పఁగాన్=చేయుటకు; తలఁచి=మనమునందు యత్నించి; తత్సారంగదేశీయకుంతలన్=అళులవంటి కురులు గల యాచంద్రికను, ఇచట నీషదసమాప్తియందు దేశీయర్ ప్రత్యయము; తాన్=క్షణదోదయుఁడు; కౌఁగిటఁజేర్చి=కౌఁగిలియందుఁ జేర్చుకొని; అంకవసతిన్=ఉత్సంగస్థానమును; తార్కొల్పి =పొందఁజేసి; కన్గవ=కన్దోయి; నవ్యాశ్రుసంకులమై – నవ్య=నూతనమగు, అశ్రు=కన్నీటిచేత, సంకులమై=వ్యాకులమైనదై; తోఁపన్=తోఁచుచుండఁగ; అచ్చెలువన్=ఆచంద్రికతో; అత్తఱిన్= ఆ సమయమందు; ప్రీతిచేన్=ప్రేమతో;పల్కెన్=పలికెను.

అనఁగా క్షణదోదయుఁడు చంద్రికకు భర్తృగృహప్రవేశముఁ జేయఁ దలఁచి, యాచంద్రికను దొడపై నిడుకొని కన్నీ రిడుచు చంద్రికతో నిట్లు (వక్ష్యమాణప్రకారముగ) పలికె నని భావము.

క. నిచ్చలు పుట్టినయింటికిఁ
జొచ్చినయింటికి నపూర్వ◊శుభకీర్తితతుల్
హెచ్చ మెలంగవె తల్లి భ
వచ్చరితము భువనపుణ్య◊వైఖరిఁ బొదలన్. 98

టీక: నిచ్చలు=ఎల్లప్పుడు; పుట్టినయింటికిన్=జనకగృహమునకు; చొచ్చినయింటికిన్=తాను ప్రవేశించిన యింటికి,అనఁగా భర్తృగృహమునకు; అపూర్వశుభకీర్తితతుల్—అపూర్వ=నూతనములగు, శుభ=మంగళకరమగు, కీర్తితతుల్=యశః పుంజములు; హెచ్చన్=అతిశయించునటులు; తల్లి =చంద్రికా! భవచ్చరితము – భవత్=నీయొక్క, చరితము=సచ్చరిత్రము; భువనపుణ్యవైఖరిన్ – భువన=ప్రపంచమందు, పుణ్యవైఖరిన్=పవిత్రమగు రీతిచే; పొదలన్=వృద్ధిఁబొందునటులు; మెలంగవె =వర్తింపుమా. అనఁగా జనకగృహమునకు,భర్తృగృహమునకు కీర్తి యతిశయించునటులు నీచరితము లోకములందు పవిత్ర మని పేర్కొనఁబడునటులు వర్తింపు మని భావము.

సీ. వంశధర్మనిరూఢి ◊వఱలించె నీనారి, మహితశాస్త్రాధిగ◊మంబుకలిమి,
గురుతరులకు వన్నె◊గూరిచె నీశ్యామ, ఘనసుమనోవిక◊సనముచేత,
నిను నుదయంబున ◊నెసఁగు నీపద్మిని, మంజులామోదసా◊మగ్రి మెఱయ,
ద్విజరాజిఁ బోషించి ◊దీపించు నీకొమ్మ, భాసురఫలదాన◊పటిమఁ బూని,
తే. యనుచు జగమెల్ల నుల్లాస ◊మతిశయిల్ల, సంతతము మెచ్చ మను మమ్మ ◊క్షమకు జన్మ
పద మనఁ దనర్చు నంభోజ◊పాణిజీవ,నమ్మ జీవన మని యెంచు◊మమ్మకొమ్మ. 99

టీక: ఈనారి=ఈచంద్రిక; మహితశాస్త్రాధిగమంబుకలిమిన్ – మహిత=అధికమగు, శాస్త్ర=ఆస్తికశాస్త్రము లాఱింటియొక్క, అధిగమంబు=ప్రాప్తియొక్క, కలిమిన్=సంపదచేత; వంశధర్మనిరూఢిన్ – వంశధర్మ=కులాచారధర్మముయొక్క, నిరూఢిన్= ప్రసిద్ధిని; వఱలించెన్=ప్రకాశింపఁజేసెను; అనఁగా నీకాంత సమస్తశాస్త్రములు చదివి కులాచారధర్మమునుచక్కఁగ నభివృద్ధి చేసె నని తాత్పర్యము; ఇచట, మహిత=అధికమగు, శాస్త్ర= బాణపుంజముయొక్క, అధిగమంబు=ప్రాప్తియొక్క, కలిమిన్=కలుగుటచేత; వంశధర్మనిరూఢిన్—వెదురుధనువుయొక్క నిరూఢిని, వఱలించె నని యర్థాంతరము తోఁచును; ఈశ్యామ=ఈచంద్రిక; ఘనసుమనోవికసనముచేతన్ – ఘన=గొప్పవారగు, సుమనః=విద్వాంసులయొక్క, వికసనము చేతన్=ఆనందముచేత; గురుతరులకు=తండ్రిమొదలగుపూజ్యులకు; వన్నెన్=అలంకారమును; కూరిచెన్=ఒనరించెను. అనఁగా నీచంద్రిక విద్వాంసులను సంతసింపఁ జేయుటచే తండ్రి మొదలగువారి కందఱికిని మిక్కిలి యలంకారమును గలుగఁ జేసెనని భావము; ఇచట, ఈశ్యామ=ఈప్రేంకణపుతీవ, ఘన=గొప్పవగు,సుమనః=పుష్పములయొక్క, వికసనముచేతన్= వికాసముచేత, గురుతరులకు=గొప్పవృక్షములకు; వన్నెన్=అలంకారమును; కూరిచెన్=ఒనరించెను, అను అర్థాంతరము తోఁచుచున్నది;
ఈపద్మిని=ఈచంద్రిక; ఇను నుదయంబునన్=పతియొక్క యుత్కర్షముచేత; మంజులామోదసామగ్రి—మంజుల=మనోజ్ఞమగు, ఆమోదసామగ్రి= సంతోషసామగ్రి; మెఱయన్=ప్రకాశించునటులు; ఎసఁగున్=ఒప్పును, లోకమందు పతి సంతోషించినచో పత్ని సంతోషించుటయు, వ్యసనపడినచో వ్యసనపడుటయు ముఖ్యపతివ్రతాధర్మము. అందుకు 'ఆర్తార్తే, ముదితే హృష్టా, ప్రోషితే మలినా కృశా' యని ప్రమాణము; ఇచట, పద్మిని=పద్మలత, ఇను నుదయంబునన్=సూర్యునియొక్క యుదయమునందు; మంజులామోదసామగ్రి—మంజుల=మనోజ్ఞమగు, ఆమోదసామగ్రి= పరిమళసామగ్రి; మెఱయన్= మెఱయునటులు; ఎసఁగున్=ఒప్పును, అను అర్థాంతరము తోఁచుచున్నది;
ఈకొమ్మ=ఈచంద్రిక; భాసురఫలదానపటిమన్ – భాసుర=ప్రకాశించుచున్న, ఫల=లాభములయొక్క, దాన=త్యాగము

యొక్క,పటిమన్=సామర్థ్యమును; పూని=పొంది; ద్విజరాజిన్=బ్రాహ్మణశ్రేణిని; పోషించి=కాపాడి; దీపించున్=ప్రకాశించును. అనఁగ నీచంద్రిక షోడశమహాదానంబు లిచ్చి ద్విజులఁ గాపాడుచు ప్రకాశించుచున్నదని భావము; ఇచట, ఈకొమ్మ=ఈవృక్షశాఖ, భాసురమగు, ఫల=పండ్లయొక్క, దాన= త్యాగముయొక్క,పటిమన్=సామర్థ్యమును, పూని =పొంది, ద్విజరాజిన్=పక్షిశ్రేణిని; పోషించి=కాపాడి, దీపించున్=ప్రకాశించును, అను అర్థాంతరము తోఁచుచున్నది;

అనుచున్=పూర్వోక్తప్రకారము వచించుచు; జగమెల్లన్=లోకమంతయు; ఉల్లాసము=సంతోషము; అతిశయిల్లన్=హెచ్చఁగా; సంతతము=ఎల్లపుడు; మెచ్చన్=శ్లాఘించునటులు; మనుమమ్మ=వర్తింపుమమ్మ; క్షమకున్=తాల్మికి; జన్మపదము=పుట్టుకపట్టు; అనన్=అనునట్లు; తనర్చు నంభోజ పాణిజీవనమ్మ – తనర్చు=ఒప్పుచున్న, అంభోజపాణి=స్త్రీయొక్క, జీవనమ్మ=బ్రతుకె; జీవన మని=బ్రతుకని; ఎంచుమమ్మ కొమ్మ=తలంపుమమ్మ చంద్రికా! ఇచట, క్షమకున్=భూమికి; జన్మపదము= జన్మస్థానము; అనన్=అనునట్లు; తనర్చు అంభోజ పాణిజీవనమ్మ – తనర్చు=ఒప్పుచున్న, అంభోజ=కమలములుగల, పాణి=ముత్యపునీరువంటి, జీవనమ్మ=జలమె; జీవన మని = జలమని, ఎంచుమమ్మ=తలంపుమమ్మ, అను నర్థాంతరము దోఁచుచున్నది. ఈకవి 'అద్భ్యః పృథివీ' యన్న శ్రుతి ననుసరించె నని యెఱుంగునది.

క. అట్టియెడ నశ్రు లక్షులఁ
దొట్టఁగ నవనమితవదన◊తోయజ యగు నా
పట్టిఁ దనయంకపాళిం
బట్టి నయం బొప్ప జనని ◊పలికె న్గరుణన్. 100

టీక: అట్టియెడన్=ఆసమయమందు; అక్షులన్=కనులందు; అశ్రులు=కన్నీళ్లు; తొట్టఁగన్=స్రవింపఁగా; అవనమితవదన తోయజ యగు నాపట్టిన్–అవనమిత=వంపఁబడిన, వదనతోయజ యగు=ముఖకమలముగల దగు, ఆపట్టిన్=ఆబిడ్డను; తనయంకపాళిన్=తనతొడమీఁద; పట్టి=ఇడుకొని; నయంబు=నీతి; ఒప్పన్=తగునటులు; జనని=తల్లి; కరుణన్=దయతో; పలికెన్=వక్ష్యమాణప్రకారముగాఁ బలికెను.

మ. అలశైలేంద్రతనూజ యంతసతి న◊ర్ధాంగీకృతం జేసె శీ
తలరోచిర్మకుటుండు గానఁ జెలులం ◊దత్తత్తదాత్వోచితో
జ్జ్వలకృత్యంబుల మెచ్చి మెచ్చరు ధరా◊చక్రంబునన్ భర్తలై
న లతాంగీమణి పూతధర్మసరణి ◊న్వర్తింప మే లెంతయున్. 101

టీక: శీతలరోచిర్మకుటుండు=చంద్రమౌళి యగు శంకరుఁడు; అలశైలేంద్రతనూజ యంతసతిన్ = ఆపార్వతీదేవియంత కాంతను, పార్వతీదేవి యంత పతివ్రత నని తోఁచుచున్నది; అర్ధాంగీకృతన్=సగమగునట్టు లంగీకరింపఁబడినదానినిగాను, అర్ధాంగిగాఁ జేయఁబడినదానినిగా నని తోఁచుచున్నది; చేసెన్=చేసెను; కానన్=ఆహేతువుచేత; చెలులన్=భార్యలను; తత్తత్తదాత్వోచితోజ్జ్వలకృత్యంబులన్ – తత్తత్=ఆయా, తదాత్వ=తత్కాలమందు, 'తత్కాలస్తు తదాత్వం స్యాత్' అని యమరుఁడు, ఉచిత=యోగ్యమగు, ఉజ్జ్వల=ప్రకాశించు,కృత్యంబులన్=పనులయందు; భర్తలు =పతులు; ధరాచక్రంబునన్=భూమియందు; మెచ్చి మెచ్చరు = శ్లాఘించి శ్లాఘింపరు; ఐనన్=అటులైనను; లతాంగీమణి=స్త్రీరత్నమగు చంద్రికా! పూత

ధర్మసరణిన్=పవిత్రమగు కులధర్మమార్గమున; వర్తింపన్=వర్తించుట; ఎంతయున్=మిక్కిలి; మేలు=శుభము. అనఁగ నో చంద్రికా! యీశ్వరుండును, పతివ్రతాశిరోమణి యగుపార్వతీదేవియంతదానిని అర్ధాంగీకృతను జేసె, లోక మందు తఱుచుగ పతులైనవారు తమకాంతలను ఆయాపనులయందు ఆయాసమయముల శ్లాఘింపరు. ఐనను కులకాంతలు ధర్మమార్గమున జరించుట మేలని భావము.

ఉ. కైరవకోటికూటములు ౦గావని చక్రమవక్రకౌతుకో
దారత మీఱ సద్వరవి౦తానము లెల్ల మహామహంబులన్
భూరివికాసవైఖరులఁ ౦బూనఁగఁ జేయుచు లోకచిత్రగం
భీరచరిత్రవై జగతిఁ ౦బెంపు వహింపఁ గదమ్మ చంద్రికా! 102

టీక: చంద్రికా=సంబుద్ధి, జ్యోత్స్న యని తోఁచుచున్నది; కైరవకోటికూటములు – కైరవ=పిశునులయొక్క, కోటికూటములు =అనేకబృందములు, 'కైరవం కుముదేపి స్యా త్కుటిలేతు పుమా నయమ్' అని యుత్పలము, కలువలయొక్క కోటికూటము లని యర్థాంతరము దోఁచుచున్నది; కావని = సరిగావని, అనఁగా నిరసించి యనుట. ప్రసిద్ధచంద్రిక కైరవకోటులఁ గాపాడునట్టి స్వభావము గలదనియు, నీచంద్రిక తద్వ్యతిరేకముగ కైరవకోటులఁ దిరస్కరించునది యనియు భావము; చక్రము=జక్కవ; అవక్రకౌతుకోదారతన్ – అవక్ర=అకుటిలమగు, కౌతుక=కుతుకముయొక్క, ఉదారతన్= ఔదార్యము చేత; మీఱన్=అతిశ యింపఁగ, అనఁగ ప్రసిద్ధచంద్రిక చక్రములకు కౌతుకమును బోఁగొట్టునదనియు, నీచంద్రిక చక్రము సంతసించునట్లు చేయునది యనియు వ్యతిరేకము, చక్రమనఁగ రాష్ట్రము సంతోషించునటులు వర్తించునదని నిసర్గతాత్పర్యము; సద్వరవితానములు – సత్=రిక్కలయొక్క, వర=శ్రేష్ఠములగు, వితానములు=సమూహములు; ఎల్లన్= అన్నియు; మహామహంబులన్=అధిక కాంతులచేత; భూరివికాసవైఖరులన్ – భూరి=అధికమగు, వికాస=వికసనముయొక్క, ప్రకాశముయొక్క యనుట, వైఖరు లన్=రీతులను; పూనఁగన్=పొందునట్లు; చేయుచున్=ఒనరించుచు; సద్వరవితానములు=సత్పురుషసంఘములు, మహా మహంబులన్=అధికోత్సవములచేత, భూరి=అధికమగు, వికాస=సంతసముయొక్క, వైఖరులన్=రీతులను, పూనఁగన్= పొందునట్లు, చేయుచున్ అని స్వభావార్థము; ప్రసిద్ధచంద్రిక సద్వరవితానమునకు వికాసము నడఁగఁజేయు ననియు, నీచంద్రిక యాసద్వరవితానమునకు వికాసమును జేయు ననియు వ్యతిరేకము; లోకచిత్రగంభీరచరిత్రవై – లోక=భువనములయందు, చిత్ర= ఆశ్చర్యకరమగు, గంభీర=గభీరమగు, చరిత్రవై=చరిత్రగల దానవై; జగతిన్=భూమియందు; పెంపున్=వృద్ధిని; వహింపఁగదమ్మ=వహింపుమా!

అనఁగ నోచంద్రికా! నీవు ప్రసిద్ధచంద్రికవలెఁ గాక కైరవపుంజముల నిరసించునవియు, చక్రమును సంతసింపఁజేయునవి యును, సద్వితానములఁ బ్రకాశింపఁజేయునవియును నగు విచిత్రగుణములు గలదానవై పుడమి వృద్ధిఁ బొందుమని భావము.

క. ఘనవేణి నిన్ను నీశుఁడు
దనమూర్తిగఁ దలఁచి మిగుల ౦దయచేసినచో
వినయంబ పూని విశ్వభు
వనపూజ్యత మెలఁగవమ్మ ౦వసుమతిలోనన్. 103

టీక: ఘనవేణి=మబ్బువంటి జడగల చంద్రికా! నిన్నున్; ఈశుఁడు=నీభర్త; తనమూర్తిగన్=తనశరీరముగ; తలఁచి=ఎంచి; మిగులన్=అధికముగ; దయచేసినచోన్=అనుగ్రహించినయెడ; వినయంబ=భక్తినే; పూని=గ్రహించి; వసుమతిలోనన్=భూమియందు;విశ్వభువనపూజ్యతన్–విశ్వ= సమస్తమైన, భువన=లోకములయందు, పూజ్యతన్=పూజ్యత్వముచేత; మెలఁగవమ్మ=వర్తింపుమా. ఇచట, ఘనవేణి=జాహ్నవి, నిన్నున్, ఈశుఁడు=శంకరుఁడు; తనమూర్తిగన్=అష్టమూర్తులలో నొకదానినిగ, తలఁచి=ఎంచి, మిగులన్=అధికముగ, దయచేసినచోన్=అనుగ్రహించిన యెడ; వినయంబ=నమ్రతనే, పూని=గ్రహించి, విశ్వభువనపూజ్యతన్–విశ్వ= సమస్తమైన, భువన=ఉదకములచేత, పూజ్యతన్=మాన్యతచే, మెలఁగ వమ్మ యను నర్థాంతరము దోఁచుచున్నది. అనఁగ నీభర్తమిగులఁ బ్రీతితో నిన్నుఁ దనమూర్తిగఁదలంచినను నీవు మిగుల వినయమునే పూని యెల్ల జగములలో పూజ్యతను వహింపు మని భావము.

సీ. కవఁగూడి సత్పతిఁ ◊గువలయంబు చెలంగ, నలరు శ్యామయె శ్యామ ◊యవని నెంచఁ,
బురుషరత్నముఁ జెంది ◊సురభివృత్తి, సుమనోగుణ మూనుకొమ్మయే ◊కొమ్మ తలఁప,
సర్వమంగళ యధీ◊శ్వరునకు సామేన, యనఁ దగు సతి సతి ◊యగు నుతింప,
నినపాదసేవనం◊బున ఘనామోదంబు, నెనయుపద్మినియె ప◊ద్మిని నుతింప,
తే. సుచిరముగ సుమనోవృత్తి ◊సొబగుఁ బూని, కలదినంబులు ప్రియుమదిఁ ◊గలసి మెలసి
నడచుకామిని కామిని ◊నళిననయన, తెలిసి నీవింకఁ బతిచెంత ◊మెలఁగు మమ్మ. 104

టీక: సత్పతిన్—సత్=సత్పురుషుఁడగు, పతిన్=భర్తను; కవఁగూడి=జతఁగూడి;కువలయంబు=భూవలయము; చెలంగన్=ఒప్పునటులు; అలరు శ్యామయె– అలరు= ఒప్పుచున్న, శ్యామయె=కాంతయె; అవనిన్=పుడమియందు; ఎంచన్= విచారింపఁగా; శ్యామ=ఉత్తమస్త్రీ; ఇచట, సత్=రిక్కలకు, పతిన్=భర్తయగు చంద్రుని; కవఁగూడి= జతఁగూడి; కువలయంబు=కలువ; చెలంగన్=వికసించునటులు; అలరు శ్యామయె– అలరు= ఒప్పుచున్న, శ్యామయె=రాత్రియె; అవనిన్=పుడమియందు; ఎంచన్= విచారింపఁగా; శ్యామ=ఉత్తమమగు రాత్రి, అను నర్థాంతరము దోఁచుచున్నది. అనఁగ నెట్లు చంద్రసహితమై కలువను వికసింపఁజేయు రాత్రి, ఉత్తమమైన రాత్రి యనఁబడునో యట్ల పతిఁగూడి జగము మెచ్చఁ జెలంగు కాంతయే ఉత్తమ కాంత యనఁబడునని భావము.

పురుషరత్నమున్=పురుషశ్రేష్ఠుని; చెంది=పొంది; సురభివృత్తిన్=పరిమళించువ్యాపారముచేత, శ్లాఘ్యసౌశీల్యాదివృత్తిచేత ననుట; సుమనోగుణము– సు=శ్రేష్ఠమగు, మనః= హృదయమందు, గుణము=గుణమును; ఊనుకొమ్మయే=పొందునట్టి కాంతయే; తలఁపన్=విచారింపఁగా; కొమ్మ=ఉత్తమకాంత; ఇచట, పురుషరత్నమున్=పున్నాగవృక్షమును; చెంది=కూడి; సురభివృత్తిన్=వసంతవర్తనచేత; సుమనోగుణము=పుష్పములగుణమును; ఊనుకొమ్మయే=పొందునట్టి శాఖయే; తలఁపన్=విచారింపఁగా; కొమ్మ= ఉత్తమశాఖ, అను నర్థము తోఁచుచున్నది. అనఁగ నామనియందుఁ బుష్పించి పున్నాగమును జేరిన కొమ్మయె కొమ్మ యనునట్లు పురుషశ్రేష్ఠునిగూడి సౌశీల్యాదిగుణములుగల కాంతయె కాంత యనఁబడు నని భావము.

సర్వమంగళ=సమస్తశుభములుగలదై; అధీశ్వరునకున్=తనపతికి; సామేనయనన్=అర్ధశరీరమే యనునటులు; తగుసతి = ఒప్పుచున్నకాంతయె; నుతింపన్=వర్ణింపఁగ; సతి = ఉత్తమకాంత; అగున్=అగును; ఇచట, సర్వమంగళ=సర్వమంగళ యను నామాంతరముగలదై; అధీశ్వరునకున్=శంకరునకు; సామేనయనన్=అర్ధశరీరమే యను నటులు; తగుసతి= ఒప్పు

చున్న పార్వతియె; నుతింపన్=వర్ణింపఁగ; సతి = పతివ్రత; అగున్=అగును, అను నర్థాంతరము దోఁచుచున్నది. అనఁగ నీశ్వరున కర్థాంగియైనట్టి పార్వతీదేవిపగిది తనపెనిమిటికి నర్ధాంగివలె నొప్పుచున్న వనితయె వనిత యనంబడు నని భావము.
ఇనపాదసేవనంబునన్ – ఇన=పెనిమిటియొక్క, పాదసేవనంబునన్=చరణసేవచేత; ఘనామోదంబున్ – ఘన=అధికమగు, ఆమోదంబున్=కుతూహలమును; ఎనయుపద్మినియె =చెందుచున్న పద్మినీజాతికాంతయె; నుతింపన్=వర్ణింపఁగ; పద్మిని =పద్మినీజాతికాంత. ఇచట, ఇనపాదసేవనంబునన్ – ఇన=సూర్యునియొక్క, పాదసేవనంబునన్= కిరణస్పర్శచేత; ఘనా మోదంబున్ – ఘన=అధికమైన, ఆమోదంబున్=పరిమళమును; ఎనయుపద్మినియె=పొందు పద్మలతయె; నుతింపన్= వర్ణింపఁగ; పద్మిని=పద్మలత, అను నర్థాంతరము దోఁచుచున్నది. అనఁగ, సూర్యకిరణస్పర్శముచే తామరతీవ ఘనామో దంబు చెందురీతిఁ దనపతిచరణసేవచే మిక్కిలి సంతసించు కాంతయె కాంత యనఁ బరఁగు నని భావము.
సుచిరముగన్=ఎల్లకాలము; సుమనోవృత్తిన్ – సు=సమీచీనమగు, మనోవృత్తిన్=మనోవ్యాపారముచేత; సొబగున్=అంద మును; పూని=గ్రహించి; కలదినంబులు=కలకాలము; ప్రియుమదిన్=పతిమనమును; కలసి మెలసి=కలసి వర్తించి; నడచు కామిని=వర్తించుచున్న కాంతయె; కామిని=కాంత; నళిననయన=చంద్రికా! నీవు; తెలిసి=గుర్తెఱిఁగి; ఇంకన్=ఈమీఁద; పతి చెంతన్=పెనిమిటియొద్ద; మెలఁగు మమ్మ=వర్తింపుమమ్మ.

మ. అని వా రంబుజనేత్ర నంప నటఁ ద౦త్ప్రాణేశ్వరీయుక్తుఁడై
జననాథేంద్రుఁడు కాంచనాంచితమణీ౦జ్వాజ్వల్యమానప్రభా
జనితక్ష్మాచరదైనబింబధిషణా౦సంస్థాన మౌస్యందనం
బున నాత్మీయపురీలలామకము నా౦మోదంబుమైఁ జేరఁగన్. 105

టీక: అని=పూర్వోక్తప్రకారముగఁ జంద్రికకు నీతిఁ గఱపి; వారు=తలిదండ్రులు; అంబుజనేత్రన్=చంద్రికను; అంపన్=పంపఁగా; అటన్=ఆమీఁద; తత్ప్రాణేశ్వరీయుక్తుఁడై= ఆప్రాణేశ్వరి యగుచంద్రికతోఁ గూడినవాఁడై; జననాథేంద్రుఁడు=సుచంద్రుఁడు; కాంచ నాంచిత మణీ జ్వాజ్వల్యమాన ప్రభా జనిత క్ష్మాచర దైనబింబ ధిషణా సంస్థానము – కాంచన=సువర్ణముచేత, అంచిత= ఒప్పుచున్న, మణీ=మణులయొక్క, జ్వాజ్వల్యమాన=మిక్కిలి వెలుంగుచున్న, ప్రభా=కాంతిచేత, జనిత= పుట్టింపఁబడిన, క్ష్మాచరత్=భూమియందు చరించుచున్న, ఐనబింబ=సూర్యబింబముయొక్క, ధిషణా=బుద్ధికి, సంస్థానము=నెలవైనది; ఔ స్యందనంబునన్=అగునట్టిరథముచేత; ఆత్మీయపురీలలామకమున్=తనరాజధానీశ్రేష్ఠమును; ఆమోదంబుమైన్=సంతసము చేత; చేరఁగన్=ప్రవేశింపఁగా, దీనికి పైపద్యముతో నన్వయము.

అనఁగఁ జంద్రికకుఁ దలిదండ్రులు నీతి బోధించి పంపఁగ సుచంద్రుఁడు మణికాంతులచేఁ బుడమిఁ జరించు నినబింబమో యను మతి నొసఁగురథంబునఁ జంద్రికం గూడి నిజపురంబుఁ బ్రవేశింపఁగ నని భావము.

సీ. వరవర్ణసంపత్తి౦నిరుపమశ్రీఁ బూను, సాంగనానాకళా౦చక్ర మనఁగ,
వసుకలాపవిభూతిఁ ౦బస మీఱుశ్రీవధూ,రమణీయతరతనూ౦రాజి యనఁగ,
స్ఫుటతరతారకా౦పటిమఁ గౌతుక మూన్పు, బహుకీర్తినవవప్ర౦పాళి యనఁగ,
ఘనజఘనోదార౦గరిమ నింపులు నింపు, వివిధభూమ్యవతార౦వితతి యనఁగ,

తే. పౌరవరవర్ణినీకోటి ౹బారు దీరె, భర్మమయహర్మ్యవీథుల౹ ౹బార్థివేంద్రు౹
డసమసుమపేశలాలాభ౹హర్షభార, వారకర్ణేజపానుభా౹వముల రా౹గ. 106

టీక. వరవర్ణసంపత్తిన్—వర=శ్రేష్ఠమగు, వర్ణ=కాంతియొక్క,అక్షరములయొక్క, సంపత్తిన్=సంపదచేత; నిరుపమశ్రీన్– నిరుపమ=సరిలేని, శ్రీన్= కాంతిని, శ్రీకారమును; పూను సాంగనానాకళాచక్ర మన౹గన్– పూను=వహించినట్టి, సాంగ= అంగ సహితమగు, నానాకళా=అనేకవిద్యలయొక్క,చక్ర మన౹గన్=సమూహమనునట్లు; అన౹గ శ్లాఘ్యమగువర్ణసంపత్తి గల పురాంగనాబృందము వర్ణసంపత్తితో౹ జేరియున్నకళాబృందమనునట్లు బారు దీరెనని భావము. ఇచట కళావక్రమునకు, కాంతా బృందమునకును కేవలశబ్దసాధర్మ్య మున్న దని తెలియవలెను.

వసుకలాపవిభూతిన్ – వసుకలాప=రత్నభూషణములయొక్క, ధననిచయముయొక్క, విభూతిన్=ఐశ్వర్యముచేత; పసమీఱు శ్రీవధూ రమణీయతర తనూరాజి యన౹గన్ – పసమీఱు=సమృద్ధిచే నతిశయించుచున్న, శ్రీవధూ=లక్ష్మీదేవి యొక్క, రమణీయతర=మిగుల మనోజ్ఞమగు, తనూరాజి యన౹గన్ = శరీరశ్రేణియో యనునట్లు; అన౹గ వసుకలాప విభూతిచేత లక్ష్మీదేవి వహించిన పెక్కుశరీరములా యనునట్లు బారుదీఱి రని భావము.

స్ఫుటతరతారకా పటిమన్ – స్ఫుటతరతారకా=స్త్రీలయొక్క, పటిమన్=సామర్థ్యముచేత, స్త్రీలరూపముచేత ననుట; కౌతుకము=సంతసమును; ఊన్ను బహుకీర్తి నవ వప్ర పాళి యన౹గన్ – ఊన్ను=చేయుచున్న, బహుకీర్తి=అధికమగు కీర్తి యొక్క, నవ=నూతనమగు, వప్ర=కోటలయొక్క, పాళి=గుంపు, అన౹గన్ = అనునట్లు; అన౹గా, స్ఫుటతరతారకారూప ముచే నొప్పు కీర్తులయొక్కకోట లనునట్లు పౌరకాంతలు బారు దీరి రని భావము.

ఘనజఘ నోదార గరిమన్ – ఘనజఘనా=అధికమగు కటిపురోభాగము గల స్త్రీలయొక్క, ఉదార=ఉత్కృష్టమగు, గరిమన్ =గొప్పతనముచేత, విపులజఘనముగల స్త్రీలరూపముచేత ననుట; ఇంపులు=ఆనందములను; నింపు వివిధ భూమ్యవతార వితతి యన౹గన్ – నింపు=పూరించుచున్న, వివిధ= నానావిధములగు, భూమి=పుడమియొక్క, అవతార =రూపాంతర ములయొక్క, వితతి యన౹గన్=సమూహమనునట్లు,అన౹గా, పుడమి యెత్తిన యనేకస్త్రీరూపములయొక్క సమూహ మను నట్లు పురకాంతలు బారుదీరి రని భావము.

పార్థివేంద్రు౹డు=సుచంద్రు౹డు; అసమ సుమపేశలా లాభ హర్ష భార వార కర్ణేజపానుభావములన్ – అసమ=సాటిలేని, సుమ పేశలా=చంద్రికయొక్క, లాభ=ప్రాప్తివలన నైన, హర్ష=సంతసముయొక్క, భార=అతిశయముయొక్క, వార= సమూహము నకు, కర్ణేజప=సూచకములగు, 'కర్ణేజప స్సూచక స్స్యాత్పిశునో దుర్జనః ఖలః' అని యమరు౹డు, అనుభావములన్=కటాక్షా దులచేత; రా౹గన్=వచ్చుచుండ౹గా; భర్మమయహర్మ్యవీథులన్ = బంగరుమేడలయొక్క ప్రదేశములందు; పౌరవరవర్ణినీ కోటి=పురకాంతలబృందము; బారు దీరెన్=వరుసదీరెను.

చ. సకలజగన్మనోహరు సు౹చంద్రుని౹ జంద్రిక౹ జూడ నిట్లు కౌ
తుకమున౹ జేరి పౌరనవ౹తోయదవేణిక లెల్ల నుల్లస
చ్చకచకతాసమానమణి౹సంకులకంకణరాజి గల్లన
న్వికసితమల్లికావితతి ౹నింపుచు నింపులు పెంపు మీఱ౹గన్. 107

టీక: పౌరనవతోయదవేణిక లెల్లన్ = పురకాంతలందఱు; సకలజగన్మనోహరున్ – సకల=సమస్తమగు, జగత్=జగమునకు, మనోహరున్=మనోజ్ఞుఁడగు; సుచంద్రునిన్= సుచంద్రభూపతిని; చంద్రికన్= చంద్రికను; చూడన్=చూచుటకై; ఇట్లు=ఈరీతి; కౌతుకమునన్=సంతసముచేత; చేరి=పొంది; ఉల్లస చ్చకచక తాసమాన మణి సంకుల కంకణ రాజి – ఉల్లసత్=ప్రకాశించు చున్న, చకచకతా=చకచకత్వముచేత, చకచకయని మెఱయుటచేత ననుట, అసమాన=తులలేని, మణి=రత్నములచేత, సంకుల=వ్యాప్తమగు, కంకణ=వలయములయొక్క, రాజి=శ్రేణి; గల్లనన్=గల్లుమని మ్రోయఁగ; వికసితమల్లికావితతిన్– వికసిత=వికసించిన, మల్లికా=మల్లికాపుష్పములయొక్క, వితతిన్=సమూహమును; నింపుచున్=పూరించుచు; ఇంపులు= ఆనందములు; పెంపు మీఱఁగన్=అతిశయింపఁగ. దీని కుత్తరపద్యస్థక్రియతో నన్వయము. అనఁగఁ బురకాంతలు సుచంద్ర చంద్రికలను జూచుటకై వచ్చి, వారిపై మణి కంకణములు గల్లుమని మ్రోయుచుండ మల్లికాపుష్పములను నించుచు, నానందము లతిశయించుచు నుండ, నని భావము.

సీ. చట్టుకూఁతు నొకర్తు ◊సర్వజ్ఞుఁ డగుమహే,శ్వరునితోఁ దార్చిన◊వామరచన,
ఖరపాదు రసవదం◊తర మైనపద్మిని, తోన గూర్చినపవ◊లైన చెయ్వు,
లలకుముద్వతి మనో◊హారి యౌసత్పతి, తో ఘటించిన యాప్ర◊దోషసృష్టి,
చిరపూరుషుని వసు◊స్ఫురితాంగి యగులక్ష్మి,తో నెనయించు న◊తుల్యసర్గ,
తే. మన్నియు జగంబు మఱవ న◊య్యబ్జజన్ముఁ,డతులధీచాకచక్యంబు ◊నసమరూప
మానుకూల్యంబు ననురూప◊యౌవనంబు, నమర నిద్దంపతులఁ జేసె ◊ననఘశక్తి. 108

టీక. చట్టుకూఁతు నొకర్తున్=వివేకశూన్యురాలైన నొకకాంతను; సర్వజ్ఞుఁడు=సర్వమును దెలిసినవాఁడు; అగు మహేశ్వరుని తోన్=అయినట్టిశంకరునితో; తార్చిన=కూర్చిన; వామరచన=వక్రరచన; చట్టుకూఁతు నొకర్తున్= హిమవత్పుత్రి యగు పార్వతీదేవిని; సర్వజ్ఞుఁడు=సర్వమును దెలిసినవాఁడు; అగు మహేశ్వరునితోన్=అయినట్టిశివునితో; తార్చిన=కూర్చిన; వామరచన=వామభాగమందురచన యని స్వభావార్థము.

ఖరపాదున్=గర్దభపాదములుగలవానిని; రసవదంతర – రసవత్=శృంగారరసయుక్తమగు, అంతర=హృదయము గలది; ఐనపద్మినితోన=ఐనట్టి పద్మినీజాతిస్త్రీతోడనే; కూర్చిన పవలైన చెయ్వులు=కూర్చినట్టి విరోధముగల పనులు; ఖరపాదున్= సూర్యుని; రసవదంతర =మకరందము గర్భ మందుఁ గలది; ఐనపద్మినితోన=ఐనట్టి పద్మలతతోడనే; కూర్చిన=జతపఱిచిన; పవలు=దినమందు; ఐన చెయ్వులు= అయినట్టిపను లని స్వభావార్థము.

అలకుముద్వతిన్ =అట్టి కుత్సితమగు సంతసముగలదానిని; మనోహారి=మనోహరుఁడు; ఔ సత్పతితోన్=అయినట్టి మంచి నాయకునితో; ఘటించిన =కూర్చిన; ఆప్రదోషసృష్టి =ప్రకృష్టమగు దోషములుగల యా నిర్మాణము; అలకుముద్వతిన్ = ఆకలువతీఁగెను; మనోహారి=మనోహరుఁడు; ఔ సత్పతితోన్=అయినట్టి చంద్రునితో; ఘటించిన =కూర్చిన; ఆప్రదోషసృష్టి =ప్రదోషకాలము నందలి యాసృష్టి, యని స్వభావార్థము.

చిరపూరుషునిన్=ముదుసలివానిని; వసుస్ఫురితాంగి – వసు=సువర్ణమువలె, స్ఫురిత=ప్రకాశించుచున్న, అంగి=శరీరము గలది; అగులక్ష్మితోన్ = అయినట్టి లక్ష్మి యనుపేరుగల కాంతతో; ఎనయించు=పొందించు; అతుల్యసర్గము=ఈడు గాని సృష్టి; చిరపూరుషునిన్=పురాణపురుషుఁడగు విష్ణుమూర్తిని; వసుస్ఫురితాంగి – వసు=ధనముతో, స్ఫురిత=ప్రకాశించు

చున్న, అంగి=శరీరముగలది, అనఁగా ధనస్వరూపిణి; అగులక్ష్మితోన్ = అయినట్టి లక్ష్మీదేవితో; ఎనయించు=పొందించు; అతుల్యసర్గము=అసమానమైన సృష్టి, యని స్వభావార్థము.
జగంబు=లోకము; అన్నియు మఱవన్=పూర్వోక్తవామరచనాదులన్నియు మఱచునట్లు; అయ్యబ్జజన్ముఁడు=ఆనలువ; అతులధీచాకచక్యంబున్— అతుల=సాటిలేని, ధీచాకచక్యంబున్=బుద్ధిచాతుర్యమును; అసమరూపము=సాటిలేని రూపమును; ఆనుకూల్యంబున్=అనుకూలతయు; అనురూపయౌవనంబున్=అనుగుణమగు యౌవనమును; అమరన్=పొందునటులు; అనఘశక్తిన్—అనఘ=నిర్దుష్టమగు, శక్తిన్=సామర్థ్యముచేత; ఇద్దంపతులన్=ఈ చంద్రికాసుచంద్రదంపతులను; చేసెన్=సృజించెను. అనఁగ వివేకశూన్యురాలైన దానిని సర్వజ్ఞుఁడగు శంకరునికి ఘటించిన వక్రరచనను, ఖరపాదుని పద్మినితోఁ గూర్చిన విపరీతసృష్టిని, కుముద్వతిని సత్పతితోఁ దార్చిన ప్రదోషసృష్టిని, వసుస్ఫురితాంగి యగులక్ష్మిని ముదుసలివానితోఁ గూర్చినట్టి యతుల్యసర్గమును, వీని నన్నింటిని లోకము మఱచునటులు ఈనలువ జాణతనముచేత నసమరూపాది గుణంబులు కలుగునటులు ఈచంద్రికాసుచంద్రుల సృజించె నని భావము.

చ. క్షమ నొకకిన్నరాగ్రసరుఁసఖ్యముఁ బూని మహానటుండు నా
నమరి తపస్విరాజవనిఁతాళి వ్రతంబులు దూల్చినట్టి యా
కమలకరున్ వరించుగిరిఁకన్యక నవ్వఁగఁ జాలుఁ జంద్రికా
కమలదళాక్షి సద్గుణనిఁకాయపయోధి సుచంద్రుఁ జేరుటన్. 109

టీక: క్షమన్=పుడమియందు; ఒకకిన్నరాగ్రసరుసఖ్యము=ఒకానొక కుత్సితపురుషుని నేస్తమును; పూని=గ్రహించి, కుబేరునిసఖ్యమును బూని యని స్వభావార్థము; మహానటుండు నాన్=దొడ్డనట్టువుండనునట్లు, మహానటుండని యీశ్వరునికి నామాంతరమని స్వభావార్థము; అమరి=ఒప్పి; తపస్వి రాజవనితాళివ్రతంబులు ఔ—తపస్విరాజ=మునిరాజులయొక్క, వనితా=కాంతలయొక్క, ఆళి=శ్రేణియొక్క, వ్రతంబులు=నియమములను, పతివ్రతాధర్మముల ననుట; తూల్చినట్టి= పోఁగొట్టినట్టి; ఆకమలకరున్=లేడికరమందుఁగల యాశంకరుని, శంకరుఁడు దారుకావనమందు దిగంబరుఁడై చరియించుచుండఁగా మునికాంతలు చూచి మోహించుటయు, నామునులు శంకరునిశేఫము పుడమిం దెగిపడునటులు శపింప నాశేష మట్లె పడఁగా దాని సర్వలోకములు వహింపలేకయున్నంజూచి విష్ణువు యోనిరూపము ధరించి దానింగైకొనె నని పురాణప్రసిద్ధము; వరించుగిరికన్యకన్=కోరినట్టి పార్వతీదేవిని; చంద్రికాకమలదళాక్షి =చంద్రిక యను పేరుగల కమలలోచన; సద్గుణనికాయపయోధిన్=శ్రేష్ఠగుణపుంజమునకు రత్నాకరుఁడగు; సుచంద్రున్ =సుచంద్రుని; చేరుటన్=చేరుటవలన; నవ్వఁగన్ =పరిహసించుటకు; చాలున్=ఓపును.

అనఁగ కిన్నరసఖ్యమును బూని మహానటుండనఁ బరఁగి మునికాంతలకు వ్రతభంగమును జేసిన శివుని వరించియున్న పార్వతీదేవిని, చంద్రిక గుణనిధి యగు సుచంద్రుని వరించుటచే పరిహసింపఁ జాలు నని భావము.

మ. కమలావాప్తి మలీమసాంతరమున ఁగ్గనప్పట్టు మిన్నందు దు
ర్గమవృత్తిం జరియించుఁ దద్వ్యయమున ఁగ్గాంచు న్విరూపంబు మే
ఘము తద్వ్యక్తిఁ బొసంగె నా కచిరరుఁక్త్వం బంచు నామించు తాఁ
గమలాలోకనయై యుదారగుణవఁత్కాంతాప్తిఁ బొల్చెన్ ధరన్. 110

టీక: కమలావాప్తిన్=సంపద కల్గుటచేత; మలీమసాంతరమునన్—మలీమస=మలినమగు, అంతరమునన్=హృదయము చేత; ఉదకప్రాప్తిచేత, నల్లని యంతరముచేత నని మేఘపరమగు నర్థము; కన్పట్టు=కానవచ్చును; మిన్నందున్=ఉప్పొంగును, ఆకసమంటునని మేఘపరమైన యర్థము; దుర్గమవృత్తిన్=పొందరాని నడవడిచేతను, గిరిశిఖరాదులయందు వర్తనముచేత నని మేఘపరమైన యర్థము; చరియించున్=నడచును; తద్వ్యయమునన్ – తత్=ఆసంపదయొక్క, ఆజలముయొక్క, వ్యయమునన్=నాశముచేతను; విరూపంబు=వైవర్ణ్యమును, తెల్లఁబోవుటను, మేఘము పుల్లింగసారస్యమువలన నొక పురుషుండని తోఁచుచున్నది; కాంచున్=పొందును; తద్యుక్తిన్–తత్=ఆపురుషునియొక్క, యుక్తిన్=సంబంధముచేత; తత్=ఆమేఘముయొక్క, యుక్తిన్=సంబంధముచేత; నాకున్; అచిరరుక్త్వంబు=నిలువనికాంతి గల్గుట, తటిద్భావము; పొసంగెన్=కల్గెను; అంచున్ = ఈ రీతిగాఁ ననుచు; ఆమించు=ఆమెఱపు; తాన్=తాను; ధరన్=భూమియందు; కమలాలోకనయై=చంద్రికయై, అనఁగఁ జంద్రికాకృతితోఁ బుట్టి యనుట; ఉదారగుణవత్కాంతాప్తిన్ – ఉదార=ఉత్కృష్టమగు, గుణవత్=మంచిగుణములు గల, కాంత=ప్రియునియొక్క, ఆప్తిన్=ప్రాప్తిచేత; పొల్చెన్ = ఒప్పెను.

అనఁగా లోకమం దొకపురుషుఁడు సంపద రాఁగానె విఱ్ఱవీఁగుచు నాసంపద నశింప వెలవెలఁబోవుచు, దుర్గమవృత్తిచేఁ జరించునటులు ఈమేఘము జలప్రాప్తి, తదభావములవలన మలీమసత్వమును, తెల్లనగుటయు పొంది దుర్గమవృత్తి గలిగి యుండుటచే దీనిసంబంధమువలన నా కచిరరుక్త్వంబు పొసంగె నని మెఱపుఁదీఁగ భూమియందుఁ జంద్రికారూపముతో జనించి ఉత్కృష్టగుణములు గల సుచంద్రునిఁ జేరి యొప్పె నని భావము.

వ. అను నప్పౌరకామినీ కలాపాలాప ప్రపంచంబున కుదంచితం బగుమనోంచలంబునం దట్టం బగు మోదంబు రెట్టింప, నొకశుభముహూర్తంబున భగవదనంగవిద్య యగునయ్యనవద్యాంగియుం దాను ననేక రంభా సంభ్రమ విజృంభితంబు, నగణ్య మఘవదలంకృతంబు, నపరిమిత సుమనో వితాన విద్యోతితంబు, నసంఖ్య కవిజన విభ్రాజితంబు, ననుపమ గురుసమాజ సంకులంబు, నకలంక కలానిధి ధురంధరంబు, నపార శుచిధర్మ పుణ్యజన రసాధీశ మండితంబు, నచంచల సదాగతి ధనద మహేశ్వర రాజి విరాజితంబు నై, యమంద విభవ జిత పురందర మందిరం బగు నాత్మీయ నివేశనంబు ప్రవేశించి, యా సుచంద్ర ధరణీచంద్రుండు, పక్షపాత పరాఙ్ముఖ ప్రచారుండయి, మహనీయ వసు కలాపంబున నభిరూప చక్రంబున కవక్ర ప్రమోదంబు గూర్చుచు, సద్గణంబుల కహీన ద్యుమ్నంబు లొసంగుచుఁ, బద్మినీ సముదయంబున కభ్యుదయంబు ఘటించుచు, నపూర్వ వితరణ పాండితీ ధురంధరుండై, కువలయంబునకుఁ బోలె దుర్వార శార్వర వ్రాతంబున కామోద వర్ధనంబుం జేయుచు, నభంగ మంగళ తరంగితం బగు నొక్క సమయంబున. 111

టీక: అను నప్పౌరకామినీ కలాపాలాప ప్రపంచంబునకున్ – అను =పూర్వోక్తప్రకారముగఁ బల్కుచున్న, అప్పౌరకామినీ కలాప=శ్రేష్ఠలగు నాపురకాంతలయొక్క, ఆలాప=సల్లాపములయొక్క, ప్రపంచంబునకున్=అతిశయమునకు; ఉదంచితంబు =మిక్కిలి యొప్పుచున్నది, అగుమనోంచలంబునన్=అగునట్టి హృదయప్రదేశమందు; దట్టంబు=సాంద్రము; అగు మోదంబు =అగునట్టి సంతసము; రెట్టింపన్=ఇనుమడింపఁగ; ఒకశుభముహూర్తంబునన్=ఒకమంగళముహూర్తమందు; భగవదనంగ విద్య =మహిమ గల మన్మథవిద్య; అగు అయ్యనవద్యాంగియున్=అగునట్టి యాచంద్రికయును; తానును =సుచంద్రుఁడును;

అనేక రంభా సంభ్రమ విజృంభితంబును – ఇది మొదలుకొని యచంచలసదాగతి యనువఱకు నీవిశేషణములచే నుపమాన భూతపురందరమందిరంబునకన్న వ్యతిరేకమును జూపుచున్నాఁడు – అనేక=పలువురగు, రంభా =స్వర్వేశ్యలవలన నైన, సంభ్రమ=సంతసముచేత, విజృంభితంబును=ప్రకాశించునదియును, అనేకకదళీవృక్షములచేతఁ బ్రకాశించునది యని స్వభావార్థము; అగణ్య మఘవదలంకృతంబును – అగణ్య=లెక్కిడరాని, మఘవత్=ఇంద్రులచేత, ఈమఘవచ్ఛబ్దము మతుబంతము, 'హవి ర్జక్షతి నిశ్శంకో మఖేషు మఘవా నసౌ, తత్రైకో మఘవా నముత్ర బహవః' అని ఇట్లు మతుబంతమునకుఁ బెక్కు ప్రామాణికప్రయోగములు గలవు, అలంకృతంబును=అలంకరింపఁబడినదియును; పెక్కండ్రగు జన్నముచేసినవారిచే నలంకృతమైన దని స్వభావార్థము, స్వర్గమం దొకరంభయు, నొకయింద్రుఁడును నుండ నిచట ననేకు లున్నారని భావము; అపరిమిత సుమనోవితాన విద్యోతితంబును – అపరిమిత=మితిలేని, సుమనోవితాన = దేవసంఘములచేత, విద్యోతితంబును=ప్రకాశించుచున్నదియును, మితిలేని పూఁజప్పరములచేఁ బ్రకాశించుచున్నదని స్వభావార్థము. స్వర్గమందు ముప్పదిమూఁడుకోట్ల సుమస్సులు (దేవతలు) ఉన్నారనియు, నిచట మితిలేని సుమనోబృంద మున్నదనియు భావము; అసంఖ్య కవిజన విభ్రాజితంబును – అసంఖ్య=అనేకులగు, కవిజన =శుక్రులచే, విభ్రా జితంబును =ప్రకాశించుచున్నదియును, అసంఖ్యులగు విద్వజ్జనులచేఁ బ్రకాశించుచున్నదని స్వభావార్థము. స్వర్గమం దొకకవి యున్నాఁ డనియు, నిచట ననేకకవు లున్నారనియు భావము; అనుపమ గురుసమాజ సంకులంబును – అనుపమ =సాటిలేని, గురు=బృహస్పతులయొక్క, సమాజ= గణముచేత, సంకులంబును= వ్యాప్తమైనదియును, గురు=పిత్రాదులగు పెద్దలచేత వ్యాప్తమైనదని స్వభావార్థము. అనఁగ స్వర్గమం దొకగురు వున్నాఁడనియు, నిచట ననేకగురువు లున్నా రనియు భావము; అకలంక కలానిధి ధురంధరంబును – అకలంక=కలంకరహితులగు, కలానిధి=చంద్రులయొక్క, ధురంధరంబును=భారమును వహించినదియును; అకలంక=కలంకరహితులగు, కలానిధి= విద్యలకు స్థానభూతులగు పండితులయొక్క, ధురంధరంబును=భారమును వహించినదియును అని స్వభావార్థము; అనఁగ స్వర్గమం దొకఁడయ్యును సకలంకుఁడగు కలానిధి యున్నాఁడనియు, నిచట నిష్కలంకులైన బహుకలానిధులు గల రనియు భావము; అపార శుచిధర్మ పుణ్య జన రసాధీశ మండితంబును – అపార=అంతములేని,శుచి=అగ్నులచేతను, ధర్మ=యమధర్మరాజులచేతను, పుణ్యజన=నిర్‌ృతులచేతను, రసాధీశ=వరుణులచేతను, మండితంబును=అలంకరింపఁబడినదియును; అపార=అధికమగు, శుచి =పరిశుద్ధమగు, ధర్మ=న్యాయముచేత, పుణ్య=మనోజ్ఞులగు, జన=నరులచేతను, రసాధీశ= రాజులచేతను, మండితంబును నని స్వభావార్థము; స్వర్గమం దగ్ని మొదలగువా రొకరొకరే యున్నా రనియు, నిచట ననేకులు గల రని భావము; అచంచల సదాగతి ధనద మహేశ్వర రాజి విరాజితంబు నై – అచంచల=స్థిరుఁలగు, సదాగతి=వాయువులయొక్క, ధనద=కుబేరులయొక్క, మహేశ్వర=శంకరులయొక్క, రాజి=శ్రేణిచేత, విరాజితంబు నై = ప్రకాశించునదియు నై; అచంచల=చలింపని, సత్=శ్రేష్ఠమగు, ఆగతి=ఆదాయము గల, ధనదమహేశ్వర=వదాన్యశ్రేష్ఠులయొక్క, రాజి=శ్రేణిచేత, విరాజితంబు నయి యని స్వభావార్థము; స్వర్గమందు కుబేరాదు లొకరొకరే యున్నా రనియు, నిచట ననేకు లున్నారనియు భావము; అమంద విభవ జిత పురందర మందిరంబు – అమంద=అధికమగు, విభవ=సంపదచేత, జిత=జయింపఁబడిన, పురందరమందిరంబు = స్వర్గము గలది; అగు నాత్మీయ నివేశనంబు =అగునట్టి స్వగృహమును; ప్రవేశించి=చొచ్చి; ఆసుచంద్ర ధరణీచంద్రుండు=ఆసుచంద్రమహారాజు; ఇటుపైని కవి ప్రసిద్ధచంద్రునికన్న నీసుచంద్రునియందు గుణోత్కృష్టతను చెప్పుచున్నాఁడు. పక్షపాత పరాఙ్ముఖ ప్రచారుండయి = సుచంద్రుఁడు నిష్పక్షపాతప్రచారము గలవాఁ డనియు, ప్రసిద్ధచంద్రుఁడు శుక్లపక్షమందుఁ బక్షపాతము గలవాఁ డని యర్థము, పక్ష=కృష్ణపక్షమందు, పాత=పడుటచేత, పరాఙ్ముఖ=అభిముఖము గాని, ప్రచారము గలవాఁ డని స్వభావార్థము, చంద్రుఁడు కృష్ణపక్షమందు క్షీణించుటచేఁ బరాఙ్ముఖుఁడని తాత్పర్యము; మహనీయ వసు కలాపంబునన్ – మహనీయ=ఉత్కృష్టమగు, వసు=కిరణములయొక్క, కలాపంబునన్=సమూహముచేత;

అభిరూప చక్రంబునకున్ – అభిరూప=మనోజ్ఞమగు, చక్రంబునకున్=చక్రవాకమునకు; అవక్రప్రమోదంబున్ – అవక్ర= అకుటిలమగు, ప్రమోదంబున్=సంతసమును; కూర్చుచున్=చేయుచు; మహనీయ వసు కలాపంబునన్=అధికమగు ధన రాశిచేత; అభిరూప చక్రంబునకున్=విద్వద్బృందమునకు, అవక్రప్రమోదమును గూర్చువాఁ డని స్వభావార్థము; ప్రసిద్ధ చంద్రుఁడు వసుకలాపముచేత అభిరూపచక్రమునకుఁ గీడొనరించువాఁ డనియు, నీరాజు వానికి సంతసము జేయువాఁ డనియు భావము; సద్గణంబులకున్=రిక్కలగుంపునకు; అహీన ద్యుమ్నంబులు=ఉత్కృష్టమగు కాంతులను; ఒసంగుచున్ = ఇచ్చుచు; సద్గణంబులకున్=సత్పురుషసంఘమునకు; అహీన ద్యుమ్నంబులు=తక్కువగాని ధనములను, ఒసంగుచు నని స్వభావార్థము, 'ద్యుమ్న మర్థరై విభవా అపి' అని యమరుఁడు; ప్రసిద్ధచంద్రుఁడు సద్గణంబులకు కాంతిని పోగొట్టువాఁ డనియు, నీరాజు అహీనద్యుమ్నంబు లిచ్చువాఁ డనియు తాత్పర్యము; పద్మినీ సముదయంబునకున్ = తామరతీవగుంపునకు; అభ్యుదయంబున్=అధికమగు వృద్ధిని; ఘటించుచున్=చేయుచు; పద్మినీ సముదయంబునకున్= పద్మినీజాతిస్త్రీసంఘమునకు, నభ్యుదయమును చేయువాఁడని స్వభావార్థము; ప్రసిద్ధచంద్రుఁడు పద్మినీసముదయంబున కభ్యుదయంబు చేయనివా డనియు, నీరాజు చేయువాఁ డనియు భావము; అపూర్వ వితరణ పాండితీ ధురంధరుండై– అపూర్వ=మున్నెన్నడును లేని, వితరణ=త్యాగముయొక్క, పాండితీ=పాండిత్యముయొక్క, ధురంధరుండై=భారము వహించినవాఁడై; కువలయంబునకున్ పోలెన్=కలువకువలెనె; దుర్వార శార్వర వ్రాతంబునకున్ – దుర్వార=నివారింపరాని, శార్వర=చీఁకటులయొక్క, వ్రాతంబునకున్=సంఘమునకు; కువలయంబునకున్ పోలెన్=భూవలయంబునకువలెనె, దుర్వార=నివారింప రాని, శార్వర= దుష్టులయొక్క, వ్రాతంబునకున్=సమూహమునకు; ఆమోద=పరిమళమునకు, సంతసమునకు, వర్ధనంబు=అభివృద్ధిని, ఛేదనమును; చేయుచున్=ఒనర్చుచు; అనఁగా ప్రసిద్ధచంద్రుండు కువలయంబునకు నెటు లామోదవర్ధనముఁ జేయునో యారీతి నీసుచంద్రుఁడును కువలయ మనఁగా భూవలయమునకు నామోదవృద్ధి ననఁగా సంతోషాభివృద్ధిని జేయు ననియు, ప్రసిద్ధ చంద్రుఁడు శార్వరవ్రాతంబునకు, అనఁగా చీఁకటులగుంపునకు, ఆమోదవర్ధనమును, సంతోషచ్ఛేదమును జేయునట్లు సుచంద్రుఁడు శార్వరవ్రాతంబునకు, అనఁగా దుర్మార్గులసమూహమునకు, ఆమోదవర్ధనమును, అనఁగా, సంతోషవిచ్ఛేదమును జేయుచున్నాఁడని భావము; అభంగ మంగళ తరంగితంబు=అప్రతిహతమగు శుభపరంపరతోఁ గూడినది; అగు నొక్క సమయంబునన్ = అయినట్టి యొకకాలమందు. పైపద్యముతో నన్వయము.

సీ. తెఱగంటిరారాలఁ దీర్చినకంబాల,జతఁ గూడి యున్న వజ్రంపుబోది
యల నంటఁ దార్చినఁ దలుకు లీనెడుజాతి, గుజరాతికెంపురాకులుకుతమ్మి
మొగడలలోయంత్రముల జాఱుపన్నీటి, పలుచనితుంపురుల్ పడఁగ మీఱు
జాళువాబొమ్మలకేల నుండెడువట్టి,వేరులసురటీలవీజనంబు
తే. విరళవిరళంబులై దెసల్పరిమళింపఁ,జేయ గారుత్మతగవాక్షసీమసంఘ
టితభరణినాఁ గళద్ధూపవితతిచేత, గమ్మనువిహారగేహప్రఘాణమందు. 112

టీక: తెఱగంటిరారాలన్=ఇంద్రనీలమణులచేత; తీర్చినకంబాలజతన్=చేసిన కంబములజంటయందు; కూడి యున్న వజ్రంపుబోదియలన్=చేరియున్నట్టి రవలబోదెలయందు; అంటన్=తగులునట్లు; తార్చినన్=కదియింపఁగా ననుట; తలుకులు=మిక్కిలి ప్రకాశములను; ఈనెడు జాతి గుజరాతికెంపురా కులుకు తమ్మిమొగడల లోయంత్రములన్– ఈనెడు =ప్రసవించుచున్న, జాతి=ఉత్తమజాతి గల, గుజరాతి కెంపురా=గుజరాతిదేశమందుఁ బుట్టిన కెంపులయొక్క, గుజరాతిదేశ

మున నుత్తమజాతి కెంపులు బుట్టుట ప్రసిద్ధము, 'గుజరాతి కెంపులు గోమేధికంబులు' అని ప్రాచీనకవులును ప్రయోగించి యున్నారు, కులుకు= సుందరమగు, తమ్మిమొగడల=తామరమొగ్గలయొక్క, లోయంత్రములన్=లోపలనుండుయంత్ర ములవలననుండి; జాఱుపన్నీటి పలుచని తుంపురుల్ – జాఱు=స్రవించుచున్న, పన్నీటి=పన్నీరుయొక్క, పలుచని తుంపు రుల్=సూక్ష్మశీకరములు; పడఁగన్=పడుచుండఁగా; మీఱు జాళువాబొమ్మలకేలన్ – మీఱు=అతిశయించుచున్న, జాళువా బొమ్మల=బంగరుబొమ్మలయొక్క, కేలన్=కరములందు; ఉండెడు వట్టివేరులసురటీల వీజనంబు – ఉండెడు=ఉన్నట్టి; వట్టి వేరుల=వట్టివేళ్లయొక్క, సురటీల=విసనకఱ్ఱలయొక్క, వీజనంబు=విసరుట; విరళవిరళంబులై=పలుచనైనవై; దెసల్= దిక్కులు; పరిమళింపన్=పరిమళించునట్లు; చేయన్=చేయఁగా; గారుత్మత గవాక్ష సీమ సంఘటిత భరణినాన్ – గారుత్మత =మరకతమణులయొక్క, 'గారుత్మతం మరకత మశ్మగర్భో హరిన్మణిః' అని యమరుఁడు, గవాక్ష సీమ=వాతాయనప్రదేశ ములతో, సంఘటిత=కూడుకొన్న, భరణినాన్=కరండమో యనునట్లు; గళద్ధూపవితతిచేతన్ – గళత్= జాఱుచున్న, ధూప =ధూపముయొక్క, ధూప మనఁగా కేశసంస్కారమునకై పరిమళించునటులు చేయు నగరుమొదలగుదాని పొగ, వితతిచేతన్= సమూహముచేత; గమ్మను విహారగేహ ప్రఘాణమందున్ – గమ్మను=పరిమళించుచున్న, విహారగేహ=క్రీడామందిరము యొక్క, ప్రఘాణమందున్=అళిందమునందు. పైపద్యముతో నన్వయము.

అనఁగా నింద్రనీలమణులతోఁ జేసి యున్న స్తంభములమీఁద నున్న రవలబోదెలయందుఁ గదియించిన కెంపుతామర మొగ్గల కుక్షియం దమర్చిన పన్నీటియంత్రములనుండి జాఱుచున్న పన్నీటితుంపురులు మీఁదఁ బడుచుండ నచట నిల్పి యున్న బంగరుబొమ్మలకరములందున్న వట్టివేరుల సురటీలు విసరుట దిక్కులఁ బరిమళింపఁ జేయ ధూపవితతిచే నొప్పి నదై మరకతమణిమయగవాక్షులు గల బరిణయో యనునటు లుండు క్రీడాగృహప్రఘాణమునం దని భావము. ఇచట క్రీడా గృహాళిందమును కరండముగా నుత్ప్రేక్షించుటచే నుత్ప్రేక్షాలంకారము.

సీ. రతిరహస్యాధిదే ◊వత తదాశ్రయ మంది,శృంగారకళ బయల్ ◊చేసె ననఁగ,
మరురాజ్యరమ నిన్న ◊మరగి డాసితి నంచు, మచ్చికమైఁ గరం◊బిచ్చె ననఁగ,
మధులక్ష్మి ప్రాచీన◊మంతువు మఱపింప, వెసఁ బరిచర్య గా◊వించె ననఁగ,
రతి భర్తకభయంబు ◊మతిఁ గోరి తద్ధేమ, నిశితశస్త్రినెదుట◊నిలిపె ననఁగ,
తే. లీల నలువంక వేర్వేఱఁ ◊గీలుబొమ్మ, లగరుధూపంబు లిడ తెల◊నాకుమడుపు
నొసఁగఁ బువ్వుల సురటిచే◊విసర రత్న, దీపిక గ్రహింప నెమ్మది ◊ధృతి రహింప. 113

టీక: రతిరహస్యాధిదేవత – రతిరహస్య=సురతరహస్యముయొక్క, అధిదేవత=అధిష్ఠానదేవత; తదాశ్రయము – తత్= ఆసుచంద్రునియొక్క, ఆశ్రయము=గృహమును; అంది=పొంది;శృంగారకళన్– శృంగార=శృంగారరసముయొక్క, కళన్=కాంతిని; బయల్ చేసె ననఁగన్=ప్రకటింపఁజేసెనో యనునటులు;
మరురాజ్యరమ=మన్మథరాజ్యలక్ష్మి; నిన్న=నిన్నె; మరగి=ఆశపడి; డాసితిన్=సమీపించితిని; అంచున్=అనుచు; మచ్చికమైన్=మోహముచేత; కరంబు=హస్తమును; ఇచ్చె ననఁగన్=ఒసంగెనో యనునట్లు;
మధులక్ష్మి=వసంతలక్ష్మి; ప్రాచీనమంతువు=పూర్వము చేసిన యపరాధమును; మఱపింపన్=మఱచునట్లు చేయుటకై; వెసన్=వేగముగ; పరిచర్యన్=సేవను; కావించె ననఁగన్=చేసె ననునట్లు;

రతి=రతీదేవి; భర్తకున్=పెనిమిటి యగుమరునకు; అభయంబు=భయములేమిని; మతిన్=మనమునందు; కోరి=కాంక్షించి; తద్ధేమనిశితశస్త్రిన్–తత్=ఆమరునియొక్క, హేమ=బంగరుమయమగు, లేదా, సంపెఁగపువ్వనెడు, నిశిత=వాఁడిగల, శస్త్రిన్ =శస్త్రమును; ఎదుటన్=ముందర; నిలిపె ననఁగన్=నిలువఁబెట్టెనో యనునట్లు; లోకములో యుద్ధమం దభయము గోరినవాఁడు తనకత్తిని ప్రతివీరుని యెదుట నుంచుట ప్రసిద్ధము;

లీలన్=విలాసముచేత; నలువంకన్=నల్దిక్కులయందు; వేర్వేఱన్=ప్రత్యేకముగ; కీలుబొమ్మలు=కీళ్లతోఁ జేసిన బొమ్మలు; అగరుధూపంబులు=అగరుపొగలను; ఇడన్=ఇచ్చుచుండఁగా; తెలనాకుమడుపున్=సన్నని తమలపాకులమడుపును; ఒసఁగన్=ఇయ్యఁగ; పువ్వుల సురటిచేన్=పూలవిసనకఱ్ఱచేత; విసరన్=వీచుచుండఁగ; రత్నదీపికన్=రత్నప్రదీపమును; గ్రహింపన్=తీసికొనఁగ; అగరుధూపము మొదలగునవి నాలుగింటికి పైచరణములందు క్రమముగ నన్వయం బెఱుంగునది; నెమ్మదిన్=మనమునందు; ధృతి=ధైర్యము; రహింపన్=ఒప్పఁగా. దీని కుత్తరపద్యస్థక్రియతో నన్వయము.

అనఁగా రతిరహస్యాధిదేవత సుచంద్రునిగృహము నొంది శృంగారకళను బ్రకటింపఁ జేసెనో యనునటు లొకబొమ్మ యగరుధూపంబు నిడె ననియు, మదనలక్ష్మి నిన్నే మరగితి నని మోహముచేత తనకరంబు సుచంద్రుని కొసంగెనా యను నటు లొకబొమ్మ యాకుమడుపు లిచ్చె ననియు, వసంతలక్ష్మి తాను పూర్వమందు సుచంద్రునికిఁ జేసిన యపకారమును మఱపింపఁ బరిచర్య చేసెనో యన నొకబొమ్మ సురటిచే విసరె ననియు, రతి తనపతి యగు మరునకు సుచంద్రునివలన నభయంబు గోరి యామదనుని కాంచనబాణమును నెదుట నుంచెనా యనునటు లొకబొమ్మ రత్నదీపమును గ్రహించె ననియు భావము.

చ. ప్రకటితచిత్తభూబిరుద◊పద్యములంబలె వింతఱంతులన్
సకినము లుగ్గడించు నెర◊చాయలఁ బాయని కెంపుకోళ్ళతోఁ
జికిలి చొకాటపున్మెఱుఁగు◊చిక్కని పెందెరతో విధూతవృం
తకుసుమతల్పమై సిరులఁ◊దార్కొనుశయ్య వసించినంతటన్. 114

టీక: ప్రకటిత చిత్తభూ బిరుదపద్యములం బలెన్ – ప్రకటిత=వెల్లడిచేయఁబడిన, చిత్తభూ=మరునియొక్క, బిరుద=జయ చిహ్నములగు, పద్యములంబలెన్=శ్లోకములవలెనె; వింతఱంతులన్=ఆశ్చర్యకరమగు కలకలధ్వనులచేత;సకినములు =శుభసూచకమగు వాక్కులను; ఉగ్గడించు=వచించునట్టి; నెరచాయలన్=శ్రేష్ఠమగు కాంతులను; పాయని కెంపుకోళ్ళతోన్ =వీడని కెంపుకోళ్ళచేత; చికిలిచొకాటపు న్మెఱుఁగుచిక్కనిపెందెరతోన్–చికిలి=తుడిచివైచిన, చొకాటపు=శ్రేష్ఠమగు,మెఱుఁగు = తళతళయను కాంతిగల, చిక్కని పెందెరతోన్=దట్టమగు గొప్పతెరతోడను; విధూతవృంతకుసుమతల్పమై – విధూత= పోఁగొట్టఁబడిన, వృంత=తొడిమగల, కుసుమ=పుష్పములయొక్క, తల్పమై=తల్పముగలదై; సిరులన్=కాంతులను; తార్కొను శయ్యన్=కదియునట్టి శయ్యను; వసించినంతటన్=నివసించినంతట. పైపద్యముతో నన్వయము.

అనఁగా శ్రేష్ఠములగు కాంతులు గల కెంపుకోళ్ళు మరునిబిరుదపద్యంబులపగిది వినంబడు ధ్వనులచే శుభశకునములఁ దెలుపుచుండఁగా, చికిలిచేసినమంచితెరతో, తొడిమలు దీసిన పుష్పములు పఱచియున్న తల్పముతో నమరి యున్న పఱపు పైఁ గూర్చుండినంతలో నని భావము.

క. చిత్తప్రభూతకలహా, యత్తతఁ గడుఁ దత్తఱించు◊నాత్మన్ వ్రీడో
ద్వృత్తి నడంచుచుఁ దగున, బ్బిత్తరిఁ గని వల్కె రపుడు◊ప్రియసఖు లెల్లన్. 115

టీక: చిత్తప్రభూతకలహాయత్తతన్=సురతాయత్తతచేత; కడున్=మిక్కిలి; తత్తఱించు నాత్మన్ =త్వరపడు హృదయమును; వ్రీడోద్వృత్తిన్ = లజ్జాతిశయముచేత; అడంచుచున్=అడఁచుచు; తగునబ్బిత్తరిన్=ఒప్పుచున్న యాచంద్రికను; కని=చూచి; అపుడు=ఆసమయమందు; ప్రియసఖు లెల్లన్=సకియలందఱు; పల్కిరి=వక్ష్యమాణప్రకారము వచించిరి.

తే. పురుషమణిఁ గూడి యామోద॰గరిమఁ బూను,నట్టి లతకూన సౌమన॰స్యంబుఁ బొగడ
నౌనె యాకల్పకం బైనఁ ॰ గానఁ దరుణి, తాల్పు మాకల్పకస్ఫూర్తి ॰ధవునిఁ గదియ. 116

టీక: పురుషమణిన్=శ్రేష్ఠమగు పున్నాగవృక్షమును, పురుషశ్రేష్ఠుని; కూడి=కలసికొని; ఆమోదగరిమన్=పరిమళముయొక్క అతిశయమును, సంతోషాతిశయమును; పూనునట్టి లతకూన సౌమనస్యంబున్=పొందునట్టి బాలలతయొక్క కుసుమవాసనను, పొందునట్టి కాంతయొక్క మంచిమనసు గల్గుటను; పొగడన్=నుతించుటకు; ఆకల్పకం బైనన్=కల్పపర్యంతమైనను, ఔనె=అగునా యని కాకువు; కానన్=అందువలన; తరుణీ=చంద్రికా! ధవునిఁ గదియన్=భర్తను చేరుటకు; ఆకల్పకస్ఫూర్తిన్ = అలంకారస్ఫూర్తిని; తాల్పుము=ధరింపుము. అనఁగాఁ బున్నాగవృక్షమును జేరి పరిమళాతిశయమును బూనియున్న బాలలతయొక్క పరిమళమును కల్పపర్యంతమైనను బొగడనలవి గాదు కనుక నీవును పున్నాగవృక్షమును గలసికొనిన బాలలత పగిది ప్రియునిఁ గదియ నలంకారమును ధరియింపు మని భావము.

తే. అని చెలులు ఘనమణికలా॰పాళి భాస్వ
దంశుకంబున నలరించి ॰యద్భుతముగఁ
జంద్రిక నృపాంబుకాబ్జముల్ ॰సంతసిల్ల
నతనిఁ జేర్పంగఁ దలఁచి దీ॰వ్యన్నవోక్తి. 117

టీక: చెలులు=చెలికత్తెలు; అని=పూర్వోక్తప్రకారముగఁ బలికి; చంద్రికన్=చంద్రికను, జ్యోత్స్నను; నృపాంబుకాబ్జముల్ =సుచంద్రుని నేత్రకమలములు; సంతసిల్లన్=సంతోషించునట్లు; అద్భుతముగన్=చిత్రంబుగ;ఘనమణికలాపాళిన్– ఘన= శ్రేష్ఠమగు,మణికలాప=మణిభూషణములయొక్క, ఆళిన్=పంక్తిచేత; భాస్వదంశుకంబునన్=ప్రకాశించు వస్త్రముచేత; భాస్వత్=సూర్యునియొక్క, అంశుకంబునన్=కిరణముచేత; అలరించి=అలంకరించి; అతనిన్=సుచంద్రుని; చేర్పంగన్ =చేర్చుటకు; తలఁచి=యత్నించి; దీవ్యన్నవోక్తిన్ – దీవ్యత్=ప్రకాశించుచున్న,నవోక్తిన్=నూతనవచనముచేత. దీని కుత్తర పద్యస్థక్రియతో నన్వయము. అనఁగా చెలికత్తెలు చంద్రికను మేఘపంక్తిచేతను సూర్యకిరణములచేతను సుచంద్రుని నేత్రములు సంతసించునట్లు అలంకరించి రని భావము. చంద్రికకు విరోధులగు మేఘపంక్తి, సూర్యకిరణములచే నలంకరించుటయు, నా చంద్రికను నృపాంబకాబ్జములు సంతసించునటు లలంకరించుటయు చిత్రమని భావము. మణిభూషణములచేఁ బ్రకాశించు వస్త్రములచే చంద్రిక నలంకరించి రని స్వభావతాత్పర్యము.

చ. చనుదము లెమ్ము శ్యామ యిఁక ॰క్ష్మాధరచంద్రుని డాయఁగా వలెన్
మన మలరంగఁ దత్కరవి॰మర్దము దక్కినఁ దెల్పి దక్కునే
యని నయ మొప్పఁ దచ్ఛయము ॰నంటి తెమల్చిన లజ్జపెంపునన్
వనజదళాక్షి నమ్రముఖ॰వారిజయై నిలఁ బూన వెండియున్. 118

టీక: శ్యామ=చంద్రికా!మన మలరంగన్=హృదయము సంతసించునట్లు; ఇఁకన్=ఈమీఁద; క్ష్మాధరచంద్రునిన్=రాజచంద్రుఁడగు సుచంద్రుని; డాయన్ కావలెన్=సమీపింపవలయును, అనఁగ సుచంద్రునిఁ జేరవలయు ననుట; చనుదము లెమ్ము = పోదము లెమ్ము; తత్కరవిమర్దము – తత్=ఆసుచంద్రునియొక్క,కర=హస్తముయొక్క, విమర్దము=సమ్మర్దము; తక్కినన్ =విడువఁగా; తెల్వి దక్కునే=తెల్వి కల్గునా? కల్గ దనుట. అనఁగ పురుషకరసమ్మర్దము కాంతలకు మిగుల శోభావహమని భావము. ‘సురతమృదితా బాలవనితా, తనిమ్నా శోభన్తే గళితవిభవా శ్చార్థిషు నృపాః’ అని ప్రాచీనవచనము; అని=ఈప్రకారము పల్కి; నయమొప్పన్=నీతి యొప్పునటులు; తచ్ఛయము నంటి =ఆచంద్రిక కరమును బట్టుకొని; తెమల్చినన్= లాగఁగా; లజ్జపెంపునన్=వ్రీడాతిశయముచేత; వనజదళాక్షి=చంద్రిక; నమ్రముఖవారిజయై–నమ్ర=వంగిన,ముఖవారిజయై =ముఖకమలముగలదై; నిలన్=నిల్చుటకు; పూనన్=ప్రయత్నింపఁగ; వెండియున్=మరల. దీని కుత్తరపద్యస్థక్రియతో నన్వయము. శ్యామ=రాత్రి; క్ష్మాధరచంద్రునిన్=పొడుపుకొండమీఁదిచంద్రుని; డాయఁగావలెన్=సమీపింపవలెను; తత్కరవిమర్దము తక్కినన్=ఆచంద్రకిరణసంపర్కము లేనియెడ; తెల్వి దక్కునె=ప్రకాశము కల్గునా యను నర్థము ధ్వనించుచున్నది.
అనఁగ శ్యామా! నీవు సుచంద్రుని గలసికొనుము, తత్సంపర్కము నీకు మిగుల శోభావహము అని చెలులు పలికి చంద్రికకరముఁ బట్టి లాగఁగా లజ్జాతిశయముచే చంద్రిక ముఖము వంచుకొని నిలువఁగ మఱియు వక్ష్యమాణప్రకారముగఁ బలికి రని భావము.

సీ. తొయ్యలి నీచన్ను◊దోయి చక్రము గెల్చు,నదియె రాజపరిగ్ర◊హంబు లేక,
వెలఁది నీకటిసీమ ◊విషమగోత్రము నొంచు,నదియె దేవేశలీ◊లాప్తి లేక,
కాంత నీకనుఁగవ ◊కైరవావళి మీఱు,నదియె యినాలోక ◊మొదవ కున్నఁ,
గలికి నీమయికాంతి ◊కైతకంబులమించు,నదియె యీశ్వరయుతిఁ ◊బొదల కున్నఁ,
తే. గాన నీవింత హిత మాత్మఁ ◊గాంచ లేక, గోలవయి యేల యీవేళఁ ◊గోమలాంగి
మొక్కలము చేసె దని పల్కి◊ముదిత లెల్ల, తోడితేఁ గాంత పడకిల్లు ◊దొరయ వచ్చె. 119

టీక: తొయ్యలి=చంద్రికా! నీచన్నుదోయి=నీచన్గవ; రాజపరిగ్రహంబు లేక=సుచంద్రుఁడను చంద్రుని యనుగ్రహము లేక; చక్రమున్=చక్రవాకమును; గెల్చునదియె? గెలువ దనుట. ఇచట, రాజపరిగ్రహంబు లేక=రాజుయొక్క గ్రహణము లేక; చక్రమున్=రాష్ట్రమును; గెల్చునా యను నర్థము దోఁచుచున్నది. లోకములో రాజును బట్టుకొనినఁగాని తద్రాష్ట్రము వశపడ దని భావము. చంద్రసాహాయ్య మున్నం గాని చక్రవాకములు వశపడవని తాత్పర్యము.
వెలఁది=చంద్రికా! నీకటిసీమ=నీకటిప్రదేశము; విషమగోత్రమును=దుష్టకులమును; దేవేశలీలాప్తి లేక–దేవేశ=సుచంద్రుని యొక్క, లీలాప్తి లేక=విలాసప్రాప్తి లేక; నొంచు నదియె=నొప్పించునా? నొప్పింపఁజాల దనుట. అనఁగ సుచంద్రలీలాప్తి గలిగెనేని దుష్టకులముల నడంపవచ్చునని భావము. విషమగోత్రమును=విషమపర్వతమును; దేవేశలీలాప్తి లేక=ఇంద్రలీలాప్రాప్తి లేక; నొంచు నదియె యను నర్థము దోఁచుచున్నది.
కాంత=చంద్రికా! నీకనుఁగవ=నీకనుదోయి; ఇనాలోకము=సుచంద్రదర్శనము; ఒదవకున్నన్=కలుగకున్న;కైరవావళిన్= పిశునసమూహమును; మీఱునదియె=అతిక్రమించునదియా? కాదనుట. అనఁగ నీకనుదోయి సుచంద్రదర్శనముఁ జేయకున్నఁ బిశునుల జయింపఁజాలదని భావము. నీకనుదోయి, ఇనాలోకము=సూర్యదర్శనము, కలుగకున్న,కైరవావళిన్= తొవబంతిని, మీఱునదియె యను నర్థము దోఁచుచున్నది.

కలికి=చంద్రికా! నీమయికాంతి=నీదేహకాంతి; ఈశ్వరయుతిన్=సుచంద్రసంబంధముచేత; పొదలకున్నన్=అతిశయింప కున్నచో; కైతకంబులన్=ఌద్రశత్రువులను,'ఌద్ర ద్విషిచకైతకౌ'మ్మని హలాయుధుఁడు;మించునదియె =అతిశయించునా? అతిశయింప దనుట. అనఁగ నీదేహకాంతి సుచంద్రయుతిచేఁ బొదలకున్న ఌద్రులఁ దిరస్కరింపఁజాల దని భావము; నీదేహ కాంతి, ఈశ్వరయుతిన్=శంకరునిసంబంధముచేత; పొదలకున్నన్=అతిశయింపకున్నచో;కైతకంబులన్=కేతకీపుష్పము లను, మించునా యను నర్థము దోఁచుచున్నది.

కానన్=అందువలన; నీవు; ఇంత హితము=ఇంతమాత్రము హితమును; ఆత్మన్=మనమునందు; కాంచ లేక=చూడక; గోల వయి=మూఢురాలవై; ఏల=ఎందుకు? ఈవేళన్=ఈసమయమందు; కోమలాంగి=చంద్రికా! మొక్కలము=ముష్కరత్వ మును; చేసెదు=చేయుచున్నావు? అని పల్కి=ఇట్లు వచించి; ముదిత లెల్లన్=కాంత లందఱు; తోడితేన్=తోడ్కొని రాఁగ; కాంత=చంద్రిక; పడకిల్లు దొరయన్=పాన్పుటిల్లు ప్రవేశించుటకు; వచ్చెన్=వచ్చెను.

మ. అమరేశాశ్మవిజేతృకుంతల వయ◊స్యాయత్నయుక్తి న్విహా
రమహాగేహము సొచ్చి, యచ్చట మసా◊రస్తంభపార్శ్వంబునం
దు మొగి న్నిల్వఁగ రాగయుక్తి నది దో◊డ్తోఁ దెల్పె భూభర్తకు
న్రమణి న్నిత్యమహాశుచిప్రకృతికి ◊న్నైజంబు పోఁబోవునే? 120

టీక: అమరేశాశ్మవిజేతృకుంతల = ఇంద్రనీలమణుల జయించిన కుంతలములు గల చంద్రిక; వయస్యాయత్నయుక్తిన్– వయస్యా=సకియలయొక్క, యత్న=ప్రయత్నముయొక్క, యుక్తిన్=సంబంధముచేతను; విహారమహాగేహము = క్రీడా గృహమును; చొచ్చి=ప్రవేశించి; అచ్చటన్=ఆగృహమందు; మసారస్తంభపార్శ్వంబునందున్ – మసారస్తంభ=ఇంద్రనీల మణిస్తంభముయొక్క, పార్శ్వంబునందున్=ప్రక్కయందు; మొగిన్=పూనికచేత; నిల్వఁగన్=నిలుచుండఁగా; అది=ఆ కంబము; రాగయుక్తిన్– రాగ=చంద్రికాంగసంగతారుణ్యముయొక్క, యుక్తిన్=సంబంధముచేత, క్రోధసంబంధముచేత నని యర్థాంతరము; రమణిన్=చంద్రికను; భూభర్తకున్=సుచంద్రునకు;తోడ్తోన్=వెంటనె; తెల్పెన్=తెలియఁజేసెను;నిత్య మహా శుచి ప్రకృతికిన్ –నిత్య=నిరంతరము, మహాశుచి=అత్యంతాపరిశుద్ధమగు, ప్రకృతికిన్=స్వభావము గలవారికి; నిత్య=నిరం తరము,మహత్ అశుచి=అత్యంతము నల్లనిదగు, ప్రకృతికిన్=స్వభావము గలదానికని స్వభావార్థము; నైజంబు = స్వభా వము; పోఁబోవునే=పోఁగలదా? పోవ దనుట.

చంద్రిక సకియలప్రయత్నముచేఁ గ్రీడాగృహము సొచ్చి, యచట నుండు నింద్రనీలస్తంభముయొక్క పార్శ్వమందు నిలుచుండఁగా, నాస్తంభము రాగముచే నివటఁ జంద్రిక వచ్చి నిలుచున్నదని సుచంద్రునకుఁ దెలిపెను. లోకమందు నిత్యమహా శుచిప్రకృతి గలవారు వారి స్వభావమును విడువ రని భావము. చంద్రిక యింద్రనీలమణుల జయించిన కుంతలములు గలది గాన ద్వేషముచే నామెను (రమణిని) రాజునకుఁ దెలిపినదని ముఖ్యాశయము. అర్థాంతరన్యాసాలంకారము.

ఉ. అత్తఱిఁ దత్సఖీజన మ◊నావిలధీయుతి హత్తి మీర లి
ప్పుత్తడిబొమ్మ రాజమణి◊పుత్రికలార భజించుచుండుఁడీ
చిత్తము వొంగ నం చొకవి◊శేషవిధానము నెంచి వంచనా
యత్తత నేగె దాని జల◊జాక్షి యథార్థమ కా గణింపఁగన్. 121

టీక: అత్తఱిన్=ఆసమయమందు; తత్సఖీజనము – తత్=ఆచంద్రికయొక్క,సఖీజనము=సకురాండ్రు; అనావిలధీయుతిన్– అనావిల=అకలుషమగు, ధీయుతిన్=బుద్ధియోగమును; హత్తి=కూడి; రాజమణిపుత్రికలార =రాజశ్రేష్ఠతనూజలార, చంద్ర కాంతపుబొమ్మలార యని యర్థాంతరము; మీరలు=మీరు; ఇప్పుత్తడిబొమ్మన్=ఈబంగరుబొమ్మను, చంద్రిక ననుట; చిత్తము=మనస్సు; పొంగన్=ఉబుకునటులు; భజించుచుండుఁడీ=సేవించుచుండుఁడీ; అంచున్=ఈప్రకారము పలుకుచు; ఒకవిశేషవిధానమున్=ఒకవిశేషకార్యమును; ఎంచి=గణించి; వంచనాయత్తతన్=మోసముచేత; దానిన్=ఆమాటను; జలజాక్షి = చంద్రిక; యథార్థమ=సత్యమే; కాన్=అగునటులు; గణింపఁగన్=ఎంచఁగా; ఏగెన్=పోయెను. దీని కుత్తరపద్యస్థక్రియతో నన్వయము. అనఁగాఁ జంద్రికను బడకింటిలో విడిచి యచట నున్న రాజమణిపుత్రికలకు మీరు చంద్రికను సేవించు మండిఁడీ యని వచించి వంచనచేఁ దత్సఖీజనము సనియె నని భావము.

సీ. సుమశరప్రావృడా॥గమశక్తి నంబుద,శ్రేణిఁ గన్పడు తటి॥ద్రేఖ యనఁగఁ,
బతిపూన్కి గ్రహియింప ॥భావజుండు పునర్గ్ర,హణ మూన్చు సుమచాప॥యష్టి యనఁగ,
సాహిణి రా నిగ్గ ॥సాధించు నావల,రాజుక్రొత్తచిలుక॥తేజి యనఁగ,
వనపాలుదోటినే॥ర్పున వచ్చు శృంగార,ధరణిజభూరిమం॥జరిక యనఁగ,
తే. నపుడు నృపుకన్నుఁగవ నాంగి ॥కాభ నలమి, యతఁడు దివియంగ వెనుదీసి ॥యంత రాక
గబ్బి యయి నిల్చి తత్కరా॥కర్షణమునఁ, గదిసె నక్కాంత తల్ప మ॥క్కంబ మెడసి. 122

టీక: సుమశరప్రావృడాగమశక్తిన్ – సుమశర=మన్మథుఁడనెడు, ప్రావృడాగమ=వర్షాకాలప్రాప్తియొక్క, శక్తిన్=సామర్థ్యము చేత; అంబుదశ్రేణిన్=మేఘపంక్తియందు; కన్పడు తటిద్రేఖ యనఁగన్=కాన్పించు మెఱపుతీవయో యనునట్లు; పతి=భర్తయగు సుచంద్రుఁడు; పూన్కిన్=ప్రయత్నమును; గ్రహియింపన్=పొందుటకై; భావజుండు=మరుఁడు; పునర్గ్రహ ణము=పునస్స్వీకారమును; ఊన్చు సుమచాపయష్టి యనఁగన్ = చేయుచున్న పూవింటియొక్క దండమో యనునట్లు; సాహిణి =గుఱ్ఱపువాఁడు; రాన్=వచ్చుటకై; ఇగ్గన్=ఆకర్షింపఁగ; సాధించు నావలరాజుక్రొత్తచిలుకతేజి యనఁగన్– సాధించు=ఎదిరించు, ఆవలరాజు=ఆమరునియొక్క, క్రొత్తచిలుకతేజి యనఁగన్=నూతనమగు శుకాశ్వమో యనునట్లు; వనపాలుదోటినేర్పునన్– వనపాలు=వనపాలకునియొక్క, దోటినేర్పునన్=దోటియొక్క జాణతనముచేత, దోటి యనఁగాఁ జేతి కందని తరులతాదిఫలపుష్పంబుల నాకర్షించు దండవిశేషము; వచ్చు=వచ్చునట్టి; శృంగారధరణిజభూరిమంజరిక యనఁగన్– శృంగారధరణిజ=శృంగారవృక్షముయొక్క, భూరి=అధికమగు, మంజరిక యనఁగన్=గుచ్ఛమో యనునట్లు; అపుడు=ఆసమయమందు; ఇచట పైచరణములయందు క్రమముగ నన్వయింపవలెను; నృపుకన్నుఁగవన్=సుచంద్రుని కనుదోయిని; ఆంగికాభన్=దేహసంబంధి యగు కాంతిచేత; అలమి=ఆక్రమించి, అనఁగా మరుఁడను వర్షాకాలప్రాప్తిచేత మేఘములందుఁ జూపట్టుచున్న మెఱపుతీవయో యనునట్లు సుచంద్రునికనుదోయిం దన దేహకాంతిచే నలమి యని భావము; అతఁడు=సుచంద్రుఁడు; తివియంగన్=ఆకర్షింపఁగా; వెనుదీసి=వెనుకకు మరలి, అనఁగా మరుఁడు మరల సుచంద్రునిపై నాకర్షించిన పూవింటిదండమో యనునట్లు వెనుకకు వంగినదని భావము;
అంతన్=ఆమీఁద; రాక=రానిదై; గబ్బి యయి=గర్వముగలదై; నిల్చి=నిలుచుండి, గుఱ్ఱపువాఁడిగ్గఁగ సాధించుచున్న మరునిక్రొత్తచిలుకగుఱ్ఱమో యను నట్లు రాక, గబ్బి యయి నల్చిన దని భావము;

తత్కరాకర్షణమునన్ – తత్=ఆసుచంద్రునియొక్క, కర=హస్తముయొక్క, ఆకర్షణమునన్=ఆకర్షణముచేత;అక్కాంత= ఆచంద్రిక; అక్కంబ మెడసి=ఆస్తంభమును విడిచి; తల్పము=శయ్యను; కదిసెన్=పొందెను. అనఁగ వనపాలుఁడు దోటితోఁ దీసిన వచ్చినట్టి శృంగారభూజ పుష్పగుచ్ఛమో యనునట్లు సుచంద్రుని కరాకర్షణముచేత నాచంద్రిక స్తంభమును వదలి తల్పమును జేరె నని భావము.

మ. సదనాధారసమగ్రవాసననొ తఀత్స్వాధ్వీవతంసంబు తా
నుదితస్తంభతఁ గాంచెఁ దత్కలన నఀయ్యుర్వీశరత్నంబు తా
నదియే తాల్చెఁ దదాత్వమం దగుఁ గదా ఀశ్యామాతిభూమప్రభా
స్పదమూర్తిన్ భజియించి తద్గుణతతిన్ ఀసంధింప రెవ్వా రిలన్. 123

టీక: సదనాధారసమగ్రవాసననొ – సదనాధార=స్తంభముయొక్క, సమగ్ర=పరిపూర్ణమగు,వాసననొ=అనుభూతార్థస్మృతి చేతనో; తత్స్వాధ్వీవతంసంబు=ఆచంద్రిక; తాన్=తాను; ఉదితస్తంభతన్ – ఉదిత=ఉదయించిన, స్తంభతన్=స్తంభము గల్గు టను, నిశ్చేష్టత ననుట; కాంచెన్=పొందెను; తత్కలనన్ – తత్=ఆచంద్రికయొక్క, కలనన్=సంబంధముచేత; అయ్యుర్వీశ రత్నంబు=ఆసుచంద్రుఁడు; తాన్=తానును; తదాత్వమందున్=ఆసమయమందు; అదియే=ఆనిశ్చేష్టతనె; తాల్చెన్=ధరిం చెను; అగుఁ గదా=అవును కదా! సత్యము కదా యనుట; శ్యామాతిభూమప్రభాస్పదమూర్తిన్ – శ్యామ=మలినమైన, అతి భూమ=అధికమగు, ప్రభా=కాంతికి, ఆస్పద=స్థానభూతమగు, మూర్తిన్=శరీరముగలవారిని, నల్లనికాంతి గల యింద్రనీల మణిస్తంభము నని భావము; శ్యామా=స్త్రీలయొక్క, అతిభూమ=అధికమగు, ప్రభా=కాంతికి, ఆస్పద=స్థానభూతగుణ మగు, మూర్తి నని యర్థాంతరము; భజియించి=సేవించి; తద్గుణతతిన్—తత్=ఆమలినవస్తువుయొక్క, ఆస్త్రీలయొక్క, గుణతతిన్= గుణకదంబమును; ఇలన్=భూమియందు; ఎవ్వారు; సంధింపరు=పొందరు? సమస్తజనులు పొందుదు రనుట.

అనఁగా చంద్రిక యింద్రనీలమణిస్తంభముయొక్క వాసనచేతనో యనునట్లు తాను ఉదితస్తంభతను దాల్చె ననియు, నా సుచంద్రుఁడును అపుడు చంద్రిక సంబంధముచేత తానును ఉదితస్తంభతను దాల్చె ననియు భావము. ఈయర్థమునె దృష్టాం తముతో దృఢపఱచుచున్నాడు. లోకమందు శ్యామాతిభూమప్రభాస్పదమూర్తిని సేవించి తద్గుణములను ఎవరు పొందరు? అందఱును పొందుదు రని భావము. ఇచట నర్థాంతరన్యాసాలంకారము.

చ. జలరుహనేత్రగాత్రమహి ఀసాంద్రమహాంకురపాళి యంటఁ ద
త్కలితమనస్తటాకమును ఀగాఢశరాళి నగల్చి చిత్తజుం
డలరు మహారసోత్కరము ఀనచ్చుటఁ దారిచె నాఁగ నత్తఱిం
బులకిత మైనమైఁ బొరలి ఀపొంగె నవోదితఘర్మవాశ్ఛటల్. 124

టీక: జలరుహనేత్ర గాత్రమహిన్ – జలరుహనేత్ర=చంద్రికయొక్క, గాత్రమహిన్=శరీరమను భూమియందు; సాంద్ర మహాం కుర పాళి – సాంద్ర=దట్టమగు, మహత్=అధికమగు, అంకుర=మొలకలయొక్క, పులకలయొక్క యని యర్థాంతరము, పాళి=శ్రేణి; అంటన్=సంబంధింపఁగా; తత్కలితమనస్తటాకమును – తత్=ఆచంద్రికయొక్క, కలిత=ఒప్పుచున్న, మనస్తటా కమును=హృదయ మను చెఱువును; గాఢశరాళిన్ – గాఢ=దృఢమగు, శర=బాణములయొక్క, వాయువులయొక్క, ఆళిన్

=శ్రేణిచేత; చిత్తజుండు=మరుఁడు; అగల్చి=భేదించి; అలరు మహారసోత్కరమున్ – అలరు=ఒప్పుచున్న, మహారస =గొప్ప యనురాగమను నుదకముయొక్క, ఉత్కరమున్=సమూహమును; అచ్చటన్=ఆగాత్రమను భూమియందు; తారిచె నాఁగన్ =ఉంచెనో యనునట్లు; అత్తఱిన్=ఆసమయమందు; పులకితము=సంజాతపులకములు గలది; ఐనమైన్ = అయినట్టి శరీర మందు; నవోదితఘర్మవాశ్ఛటల్ – నవ=నూతనమగునట్లు, ఉదిత=పుట్టిన, ఘర్మవాః=స్వేదోదకముల యొక్క, ఛటల్ = సమూహములు; పొరలి=పొర్లి; పొంగెన్=ఉబికెను. అనఁగా చంద్రికశరీరమనుభూమియందు సాంద్రమగుమొలక లుద యింపఁగానె యాచంద్రికయొక్క హృదయ మను తటాకమును శరాళిచే భేదించి మరుఁడు మహారసోత్కరమును జార్చెనో యనునట్లు పులకలతోఁ గూడి యున్న శరీరము నందు స్వేదోదకము పొరలిపొంగె నని భావము.

చ. చెలి చెలు లందఱుం జనిన ◊సిగ్గది పోవక యున్న దేమి తాఁ
జలమున నంచు నెంచి యతి◊సాంద్రరుషాయుతిఁబోలె ఘర్మవాః
కలికలఁ దోఁగి శోణరుచి ◊గన్పడ నొయ్యన జాఱి తద్వధూ
కులమణిసమ్ముఖం బెడసెఁ ◊గుంకుమబొట్టురసంబు చయ్యనన్. 125

టీక: చెలి=చంద్రికయొక్క; చెలు లందఱున్=చెలికత్తె లందఱును; చనినన్=పోయినను; సిగ్గు అది=ఆవ్రీడ; తాన్=తాను; చలమునన్=మాత్సర్యముచేత; పోవక యున్నది=చనక ఉన్నది; ఏమి=ఏమి కారణము? అంచున్=అనుచు; ఎంచి=గణించి; అతిసాంద్రరుషాయుతిఁబోలెన్—అతిసాంద్ర=మిక్కిలి గాఢమగు, రుషాయుతిఁబోలెన్=క్రోధముతోఁగూడికచేతవలెనె; ఘర్మ వాఃకలికలన్=ఘర్మోదబిందువులయందు; తోఁగి=మునిఁగి; శోణరుచి కన్పడన్=ఎఱ్ఱనికాంతి చూపట్టుచుండఁగా; ఒయ్యనన్ =తిన్నఁగా; జాఱి=స్రవించి; తద్వధూకులమణిసమ్ముఖంబు – తద్వధూకులమణి=ఆచంద్రికయొక్క, సమ్ముఖంబు=ముఖము సన్నిధిని అని తోఁచుచున్నది; కుంకుమబొట్టురసంబు=కుంకుమతిలకముయొక్క జలము; చయ్యనన్=శీఘ్రముగ; ఎడసెన్= ఎడబాసెను. అనఁగా చంద్రిక సకురాండ్రు చనినను ఈసిగ్గు ఏల పోవక యున్నది యని రోషముతోఁ గూడి యున్నదానివలెనె స్వేదోదబిందువులయందు మునిఁగి ఎఱ్ఱనికాంతితో కుంకుమబొట్టురసంబు చంద్రికసమ్ముఖంబు నెడఁబాసె నని భావము.

చ. జలజశరాశుగప్రచుర◊చంక్రమణంబు లమందతం గనన్
గలికి తమిన్ ద్రపాంబుదము ◊గప్పిన నాననచంద్రదర్శనం
బలవడ కున్కి నత్తఱి ని◊జాక్షిచకోరకయుగ్మ మాఁకటం
దలఁకుచు నుండ నద్ధరణి◊నాథుఁడు పల్కు రసోత్తరంబుగన్. 126

టీక: జలజశరాశుగప్రచురచంక్రమణంబు – జలజశర=మరునియొక్క, ఆశుగ=బాణములను వాయువులయొక్క, ప్రచుర =అధికమగు, చంక్రమణంబులు=సంచారములు; అమందతన్=అతిశయమును; కనన్=పొందఁగా; కలికితమిన్ – కలికి= చంద్రికయొక్క, తమిన్=ఆసక్తి యనెడు రాత్రిని; త్రపాంబుదము=సిగ్గనుమబ్బు; కప్పినన్=ఆచ్ఛాదింపఁగ; ఆననచంద్ర దర్శనంబు=ముఖచంద్రునియొక్కదర్శనము; అలవడ కున్కి=పొసఁగకుండుటచేత; అత్తఱిన్=ఆసమయమందు; నిజాక్షి చకోరకయుగ్మము – నిజ=తనసంబంధియగు, అక్షిచకోరక=నేత్రములను చకోరములయొక్క, యుగ్మము= జంట; ఆఁకటన్=క్షుత్తుచేత; తలఁకుచు నుండన్=చలించుచుండఁగా; అద్ధరణినాథుఁడు=ఆసుచంద్రుఁడు; రసోత్తరంబుగన్= అనురాగాతిశయముచేత; పల్కున్=పలికెను. అనఁగ సుచంద్రుఁడు, మన్మథాశుగసంచారము లతిశయింపఁగానె చంద్రిక

యొక్క యాసక్తి యనెడు రాత్రిని లజ్జయను మేఘము కప్పఁగా, ముఖచంద్రుఁడు గనిపింపని యాసమయమునందుఁ దన యక్షిచకోరములు ఆఁకలితోఁ చలించుచుండఁగా ననురాగమునఁ జంద్రికతోఁ బలికె నని భావము.

సీ. వరశంఖపూగసంపద గళస్థము నీకు, సతి! పోఁకముడి సుంత సడల రాదె,
కువలయశ్రీ నేలుకొను నేత్రరుచి నీకుఁ, దొయ్యలి! రెం డూరు లియ్య రాదె,
ఘనకుందవిభవంబు గను దంతములు నీకు, బిసబాహ యొకరేఖ యొసఁగ రాదె,
బహుదివ్యఫలలక్ష్మిఁ బరఁగువాతెఱ నీకు, నింతి! మంజులకుచం బిడఁగ రాదె,
తే. రాజవిజయంబు చేసె నీరమ్యముఖము, లేమ! యవనతవృత్తి చాలింప రాదె
నిరుపమరుచిమణికి నీకరయఁ దగునె, వరపటలరీతి చే విడువఁగను రాదె. 127

టీక: వరశంఖపూగసంపద – వర=శ్రేష్ఠమగు, శంఖపూగసంపద=శంఖములయొక్క పూగములయొక్క సంపదయనెడు శంఖసంఖ్యగల పోఁకలసమృద్ధి; నీకున్; గళస్థము=గలమందున్నది, కలస్థ మనియు విభాగము, రేఫలకారంబుల కభేద మునుబట్టి కరస్థ మనుకొనవలయు; పోఁకముడి=నీవియనెడు పోఁకలమూటను; సుంత=ఇంచుకంత; సతీ=చంద్రికా! సడల రాదె=వదలరాదా? అనఁగ శంఖసంఖ్యాకమగు పూగసమృద్ధిగలవా రించుకపోఁకముడి సడలుట తగు నని భావము. నీవీ గ్రంథిని సడలింపుమని ప్రకృతాభిప్రాయము. 'ద్వ్యర్థైః పదైః పిశునయేచ్చ రహస్యవస్తు' అను కామశాస్త్రమర్యాద ననుసరించి కవి ప్రార్థనీయరహస్యవస్తువును శ్లిష్టపదములతో సూచించి యున్నాఁడు. ఇట్లితరచరణములయందును గ్రహింపవలయు.
తొయ్యలి=చంద్రికా! నీకున్; కువలయశ్రీన్=కుముదసంపద యనెడు భూవలయసంపదను; ఏలుకొను నేత్రరుచి =పాలించెడు నయనకాంతి; కలదు. రెం డూరులు=రెండు తొడలనెడు రెండుగ్రామములను; ఇయ్య రాదె=ఒసంగరాదా? భూవలయము నేలువారు రెండుగ్రామముల నిచ్చుట తగునని భావము. ఊరువుల నొసంగుమని ప్రకృతాభిప్రాయము.
బిసబాహ=తారతూఁడువంటి బాహువులుగలదానా! నీకున్; ఘనకుందవిభవంబున్ – ఘన=అధికమగు,కుందవిభవంబున్ = మొల్లమొగ్గలవిభవ మనెడు నిధివిశేషముయొక్క విభవమును,'మహాపద్మశ్చ పద్మశ్చ శంఖో మకర కచ్ఛపౌ, ముకున్ద కున్ద నీలాశ్చ వరశ్చ నిధయో నవ' అని యమరుఁడు; కను దంతములు =పొందునట్టి దశనములు; కలవు. ఒకరేఖ=ఒకక్షత మనెడు స్వల్పద్రవ్యమును;ఒసఁగ రాదె=ఈయరాదా? కుందవిభవముగలవారు స్వల్పద్రవ్యము నొసంగుట యుక్తమని భావము. దంతక్షతి నీయుమని ప్రకృతాభిప్రాయము.
ఇంతి=చంద్రికా! నీకున్; బహుదివ్యఫలలక్ష్మిన్ – బహు=అనేకములై, దివ్య=మనోజ్ఞములగు, ఫల=లాభము లనెడు పండ్ల యొక్క, లక్ష్మిన్=లక్ష్మిచేత; పరఁగువాతెఱ=ఒప్పునట్టి మోవి; కలదు; మంజులకుచంబు= అందమైన కుచము (మంజుల కుచము) అనెడు నందమైన లకుచమును (మంజు లకుచమును), అనఁగా గజనిమ్మపండును, 'మనోజ్ఞం మంజు మంజులమ్' అని యమరుఁడు; ఇడఁగ రాదె =ఈయరాదా? అనేకఫలంబులు గలవారు ఒక్క ఫలము నిచ్చుటయుక్తమని భావము. కుచము నిమ్మని ప్రకృతాభిప్రాయము.
లేమ=చంద్రికా! నీరమ్యముఖము=నీసుందరవదనము; రాజవిజయంబున్=చంద్రుఁడనెడు భూపాలునియొక్క గెలుపును; చేసెన్=ఒనర్చెను; అవనతవృత్తిన్=నమ్రభావమును; చాలింప రాదె=మానరాదా? లోకమందు రాజును జయించినవారు తల యెత్తి యుండుట యుక్తమని భావము. లజ్జ విడిచి తలయెత్తు మని ప్రకృతాభిప్రాయము.

నిరుపమరుచిమణికిన్ = అసమానమై, రుచిరమైన మణివంటిదానవగు; నీకున్; వరపటలరీతి – వర=శ్రేష్ఠమగు, పటలరీతి =వస్త్రాకర్షణముచేయుదానిరీతి యనెడు పటలాఖ్యమణిదోషరీతి; అరయన్=విచారింపఁగా; తగునె=యుక్తమా? శ్రేష్ఠమగు మణులకు పటలదోషము యుక్తము గాదని భావము. వస్త్రమును గ్రహింపకు మని ప్రకృతాభిప్రాయము. చే విడువఁగనురాదె = కరము వస్త్రమునుండి విడువు మనుట.

క. అనునయపూర్వకముగ న,వ్వనజానన నిటులు పలికి\వసుధాపతి త
ద్ఘనరమ్యాంగకసంస్ప,ర్శనలాలసవృత్తి యగుట\సంభ్రమ మెసఁగన్. 128

టీక: వసుధాపతి=సుచంద్రుఁడు; అవ్వనజాననన్=ఆచంద్రికనుగూర్చి; ఇటులు=ఇట్లు; అనునయపూర్వకముగన్=ఉప లాలనపురస్సరముగ; పలికి=వచించి; తద్ఘన రమ్యాంగక సంస్పర్శన లాలస వృత్తి– తత్=ఆచంద్రికయొక్క, ఘన = బిగువైన, రమ్య=మనోజ్ఞములగు, అంగక=అవయవములయొక్క, సంస్పర్శన=తాఁకుటయందు, లాలస=అధికతృష్ణగల, వృత్తి =వ్యాపారముగలవాఁడు; అగుటన్=ఐనహేతువుచేత; సంభ్రమము=తొట్రుపాటు; ఎసఁగన్=అతిశయించునటులు. దీని కుత్తర పద్యస్థక్రియతో నన్వయము.

చ. నృపతిమహాబలోత్కరము \నేర్పున వళ్యధిరోహిణిన్ సమ
గ్రపటిమ లగ్గ కెక్కుతఱిఁ \గంపమునొందు సతీకుచాద్రి దు
ర్గపదవి నాక్రమించి యట \రంజిలు నాయకరత్నముం గ్రహిం
చి పరమకౌతుకం బతని \చిత్తమునన్ ఘటియించె నత్తఱిన్. 129

టీక: నృపతిమహాబలోత్కరము – నృపతి=సుచంద్రునియొక్క, మహత్=అధికమగు, బల=బలముచేత, ఉత్=ఎత్తఁబడిన, కరము=హస్తము; నృపతియొక్క, మహాబల=అధికసేనలయొక్క, ఉత్కరము=సమూహము; నేర్పునన్=జాణతనముచేత; వళ్యధిరోహిణిన్–వళి=త్రివళి యనెడు, అధిరోహిణిన్=నిచ్చనచేత; సమగ్రపటిమన్–సమగ్ర=పరిపూర్ణమగు, పటిమన్= సామర్థ్యముచేత; లగ్గ కెక్కుతఱిన్=ముట్టడించుటకై, కోటనెక్కుసమయమందు; కంపమున్=కళవళమును, భయమును; ఒందు సతీకుచాద్రి దుర్గపదవిన్– ఒందు=పొందుచున్న, సతీ=చంద్రికయొక్క, కుచాద్రి=పర్వతములవంటి స్తనము లనెడు, దుర్గ=కోటయొక్క, పదవిన్=స్థానమును;ఆక్రమించి=ఆవరించి; అటన్=అచ్చట; రంజిలు నాయకరత్నమున్=ప్రకాశించు ప్రభుశ్రేష్ఠుని, ప్రకాశించు హారమధ్యమణిని; గ్రహించి=పట్టుకొని; పరమకౌతుకంబు—పరమ=ఉత్కృష్టమగు,కౌతుకంబు= సంతసమును; అతని చిత్తమునన్=ఆసుచంద్రునిహృదయమందు; అత్తఱిన్=ఆసమయమందు; ఘటియించెన్=ఘటిల్లఁ జేసెను. అనఁగా సుచంద్రునియొక్క మహాబలముగలకర మనెడు బలోత్కరము, అనఁగ సేనాబృందము, జాణతనముతో త్రివళి యను నిచ్చెనచేత నెక్కి ముట్టడించుతఱి కళవళ మందు చంద్రికాకుచములను దుర్గమును ఆవరించి, యందున్న నాయక మణిని పట్టుకొని సుచంద్రునిచిత్తమునకు అత్యానందము కలిగించె నని భావము. సుచంద్రునికరము దొలుతఁ ద్రివళిని దాఁకి, పిదపఁ గుచముల నాక్రమించి, యచ్చట నున్న నాయకరత్నమును స్పృశించి యత్యానందముఁ జెందె నని ప్రకృతభావము.

తే. అటులు నేత్రాహరణయుక్తి \నతిశయిల్లు
రాజమౌళికి నీవి క \రస్థమయ్యె,

నైన పిమ్మట దానె తదంగసీమ
యతనిఁ బొదివి సుఖించె సాంద్రానురక్తి. 130

టీక: అటులు=పూర్వోక్తప్రకారముగాను; నేత్రాహరణయుక్తి న్ – నేత్ర=వస్త్రముయొక్క, ఆహరణ=ఆకర్షణముయొక్క, యుక్తిన్=యోగముచేత; నేత్రాహరణ=నాయకాకర్షణముయొక్క, యుక్తిన్=సంబంధముచేత అని రాజపరమైన అర్థము; అతిశయిల్లు రాజమౌళికిన్ =అతిశయించుచున్న సుచంద్రునకు, రాజశ్రేష్ఠునకు; నీవి=పోఁకముడి, మూలధనము, 'నీవీ పరిపణం మూలధన' మ్మని యమరుఁడు; కరస్థమయ్యెన్=హస్తగతమయ్యెను; ఐన పిమ్మటన్ =ఐన వెనుక; తానె =తనంతటనె; తదంగసీమ – తత్=ఆచంద్రికయొక్క, అంగసీమ=శరీరప్రదేశము, ఆరాజుయొక్క అంగ దేశమని యర్థాంతరము; అతనిన్=ఆసుచంద్రుని, ఆరాజును; పొదివి=పొంది, కలసి యనుట; సాంద్రానురక్తిన్ – సాంద్ర= దట్టమగు, అనురక్తిన్=అనురాగముచేత; సుఖించెన్=సుఖపడెను.

అనఁగ రాజును బట్టుకొని అతిశయించుచున్న రాజశ్రేష్ఠునకు మూలధనము కరస్థమైన పిదపఁ, దనంతటన ఆరాజు నంగదేశము అతనిఁ బొంది సుఖించె నని భావము. వస్త్రాకర్షణముచేత నతిశయిల్లు సుచంద్రునకు పోఁకముడి కరగతమైన పిదపఁ జంద్రిక యంగప్రదేశము సుచంద్రునిఁ జెంది సుఖించె నని ప్రకృతాభిప్రాయము.

తే. అపు డతర్కితసంప్రాప్తమగు పరస్ప
రాంగ సాంగత్యసౌఖ్యంబు ననుభవించు
జంపతుల కెన్నఁ దత్త్రపసదృశ యైన
యాళి యగుఁ గాదె మఱి జగత్త్పాళియందు. 131

తే. అపుడు=ఆసమయమందు; అతర్కితసంప్రాప్తము=ఊహింపకయె వచ్చినది; అగు పరస్పరాంగసాంగత్యసౌఖ్యంబున్ – అగు=అగునట్టి, పరస్పరాంగసాంగత్య=ఒండొరుల శరీరములసంబంధమువలననైన, సౌఖ్యంబున్=సుఖమును; అనుభవించు జంపతులకున్=ఉపభోగించు జాయాపతులకు; ఎన్నన్=పరికింపఁగా; తత్త్రప=ఆచంద్రికయొక్కలజ్జ; మఱి=మఱియు; జగత్పాళియందున్=జగత్సమూహమునందు; సదృశ యైన ఆళి =అనుకూలయైన చెలికత్తె; అగుఁ గాదె=అగును గదా!

అనఁగ లజ్జవలన నతర్కితసంప్రాప్తమగు నంగసాంగత్యసుఖంబు ననుభవించు నీదంపతులకు నాలజ్జ అనుకూల యగు చెలికత్తె యగునుగదా యని భావము.

మ. జలజాతాప్తకులావతంస మటఁ దత్సారంగనేత్రాధర
చ్ఛలబింబీఫలచుంబనంబువలనన్ సద్యస్సముద్భూతపి
చ్ఛిలమోహుం డయి చన్ను లంటి తగ నాశ్లేషంబు నూన్పం గన
త్పులకంబై యది చేసెఁ గంచుకభిద న్భూయస్త్రపాయుక్తిగన్. 132

టీక: జలజాతాప్తకులావతంసము=సూర్యవంశావతంసమగు సుచంద్రుఁడు; అటన్=అటు పిమ్మట; తత్సారంగనేత్రాధర చ్ఛల బింబీఫల చుంబనంబువలనన్—తత్సారంగనేత్రా=ఆచంద్రికయొక్క, అధర=ఓష్ఠ మనెడు, ఛల=వ్యాజము గల, బింబీఫల=

దొండపండుయొక్క, చుంబనంబువలనన్=చుంబనమువలన; సద్య స్సముద్భూత పిచ్ఛిల మోహుండయి – సద్యః=తత్కాలమందు, సముద్భూత=ఉదయించిన, పిచ్ఛిల=దట్టమైన, మోహుండయి=మోహము గలవాఁడై; చన్నులు=కుచములను; అంటి=స్పృశించి; తగన్=అనుకూలముగ; ఆశ్లేషంబు=కౌఁగిలింతను;ఊన్పన్=చేయుఁగ; కనత్పులకంబై– కనత్=ప్రకాశించుచున్న, పులకంబై=పులకలు గలదై; అది=ఆకౌఁగిలింత; గంచుకభిదన్ – కంచుక=ఱవికయొక్క, భిదన్= భేదమును; భూయస్త్రపాయుక్తిగన్ = మరల లజ్జ గలుగునటులు; చేసెన్=చేసెను.

అనఁగ సుచంద్రుఁడు చంద్రికాధరచుంబనంబున గాఢ మగుమోహము గలవాఁడై పాలిండ్లఁ బట్టి కౌఁగిలింపఁగ నాకౌఁగిలింత పులకలు గలిగించి మరల లజ్జ వచ్చునటులు కంచుకమును భేదించె నని భావము.

చ. క్రమమున రాజమౌళి యెడ◊గానని ధౌతపటంబు దీయఁ ద
త్కమలదళాక్షి బెగ్గడిలి ◊క్రమ్మఱ రాఁ గొను సారెసారెకున్
విమలపయస్తరంగతతి ◊వేమరు నేగుచు నాఁగుచుండఁగా
నమరెడు గాంగసైకతము◊నందమునన్ జఘనంబు మీఱఁగన్. 133

టీక: క్రమమున్=క్రమముగా; రాజమౌళి=సుచంద్రుఁడు; ఎడగానని ధౌతపటంబున్=ఎడఁబాయని ధౌతవస్త్రమును; తీయన్=ఆకర్షింపఁగా; తత్కమలదళాక్షి=ఆచంద్రిక; బెగ్గడిలి=భయపడి; క్రమ్మఱన్=మరల; సారెసారెకున్=మాటిమాటికి; విమలపయస్తరంగతతి–విమల=స్వచ్ఛమగు, పయః=ఉదకముయొక్క, తరంగ=తరఁగలయొక్క, తతి=సమూహము; వేమరున్=మాటిమాటికిని; ఏగుచున్=పోవుచు; ఆఁగుచుండఁగాన్=అణఁగుచుండఁగా; అమరెడు గాంగసైకతము నందమునన్=ఒప్పుచున్న జాహ్నవీపులినముయొక్క సౌందర్యముచేత; జఘనంబు=కటిపురోభాగము; మీఱఁగన్=అతిశయింపఁగా; రాఁగొనున్=ఆకర్షించును. అనఁగ సుచంద్రుఁడు చంద్రికయొక్క యెడఁబాయని వస్త్రమును దీయఁగా చంద్రిక భయపడి మాటిమాటికి వస్త్రము నాకర్షించుకొనఁగా, తజ్జఘనము, నిర్మలజలతరంగములు కప్పుచు నణఁగుచుండఁగా ప్రకాశించు గంగాపులినమువలెఁ బ్రకాశించె నని భావము.

సీ. చానచెక్కిలిపేరి ◊చంద్రఖండమున భా,స్వత్కరజక్షతి ◊వఱల నీక,
జలజాక్షిగుబ్బగు◊బ్బలులు సద్వజ్రశ,యోన్నతసమ్మర్ద ◊మొంద నీక,
సతిరదనాంశుక◊చ్ఛలసుమాసవమున, నలరుద్విజావళి ◊నాన నీక,
నెలఁతతనూపద్మి◊ని విగాఢదోషాను,బంధనిర్బంధంబుఁ ◊బడయ నీక,
తే. తార్చెఁ బర్వంబు, పక్షపా◊తంబుఁ గూర్చె, నుంచె నామోద, మొసఁగెఁ బ◊ద్మోదయంబు
నంత సుమశస్త్రశాస్త్రర◊హస్యతత్త్వ,మదనభుండు సుచంద్రక్ష◊మావిభుండు. 134

టీక: అంతన్=అటుపిమ్మట; సుమశస్త్రశాస్త్రరహస్యతత్త్వమదనభుండు – సుమశస్త్రశాస్త్ర=కామశాస్త్రముయొక్క, రహస్య=రహస్యముయొక్క, తత్త్వ=యథార్థమునందు, మదనభుండు=మన్మథుని సామర్థ్యమువంటి సామర్థ్యము గల; సుచంద్రక్షమావిభుండు=సుచంద్రభూపతి; చానచెక్కిలిపేరి చంద్రఖండమునన్=చంద్రికయొక్క గండస్థలమను పేరుగల చంద్రఖండమందు; భాస్వత్కరజక్షతిన్ – భాస్వత్=సూర్యునియొక్క, కరజ=కిరణములవలనఁ గలుగు, క్షతిన్=ఉపద్రవమును;

భాస్వత్ =ప్రకాశించునట్టి, కరజ=నఖములయొక్క, క్షతిన్=ప్రహారముల నని స్వభావార్థము; వఱల నీక=ప్రకాశింప నీయక; సూర్యకిరణప్రసారము గల్గినయెడఁ జంద్రఖండమునకు క్షయము గల్గునని చెక్కిలి యను చంద్రఖండమునకు భాస్వత్కరజక్షతి కలుగనీయఁ డయ్యె నని భావము.

జలజాక్షిగుబ్బగుబ్బలులన్=చంద్రిక స్తనము లనెడు పర్వతములయందు; సద్వజ్రశయోన్నతసమ్మర్దము – సత్=శ్రేష్ఠమైన, వజ్రశయ=ఇంద్రునియొక్క, ఉన్నత=ఎత్తైన,సమ్మర్దము=రాయిడిని; సత్=శ్రేష్ఠమైన, వజ్ర=వజ్రరేఖగల, శయ= హస్తము యొక్క, ఉన్నత=ఎత్తైన, సమ్మర్దము=రాయిడిని అని స్వభావార్థము; ఒంద నీక=పొందనీయక; పర్వతములకు ఇంద్రుని రాయిడి తగిలినచో నాశము గలుగును గావున గుబ్బగుబ్బలులకు వజ్రశయసమ్మర్దము గలుగనీయఁడయ్యె నని భావము.

సతిరదనాంశుక చ్ఛలసుమాసవమునన్ – సతి=చంద్రికయొక్క, రదనాంశుక=అధరమను, ఛల=వ్యాజముగల, సుమాసవ మునన్=పూఁదేనియయందు; అలరుద్విజావళిన్=ఒప్పుచున్న భృంగపంక్తిని, ఒప్పుచున్న దంతపంక్తి నని స్వభావార్థము; ఆన నీక=త్రాగ నీయక, తగుల నీయక యని స్వభావాభిప్రాయము; పూఁదేనియ భృంగము లానినచోఁ దఱిఁగిపోవు నని రదనాంశుక సుమాసవమున ద్విజావళి నాననీయఁడయ్యె నని భావము.

నెలఁతతనూపద్మినిన్ =చంద్రికయొక్క దేహ మను పద్మలతను; విగాఢదోషానుబంధనిర్బంధంబున్ – విగాఢ=అధికమగు, దోషా=రాత్రియొక్క, అనుబంధ=సంబంధముచేతఁ గల్గు, నిర్బంధంబున్=కష్టమును; విగాఢ=అధికమగు,దోషా=బాహు వులయొక్క, అనుబంధ=సంబంధముచేఁ గల్గు, నిర్బంధంబున్=కష్టము నని స్వభావార్థము; పడయనీక=పొందనీయక; రాత్రిసంబంధము కల్గినయెడలఁ దామరతీఁగ కాంతిహీన మగునని చంద్రికాశరీరపద్మలతకు దోషానుబంధనిర్బంధము గలి గింపఁడయ్యె నని భావము. ఈసీసము నాల్గుచరణములకును పైగీతమునందలి వాక్యములకును యథాసంఖ్యముగ నన్వయము.

పర్వంబు=పున్నమను,ఉత్సవమును; తార్చెన్=కలిగించెను; చెక్కిలిచంద్రఖండము పూర్ణముగాఁ బ్రకాశించునట్లు పున్నమ కల్గించె నని భావము.

పక్షపాతంబున్=ఱెక్కలు పడుటను, ప్రీతిని; కూర్చెన్=కలిగించెను. గుబ్బగుబ్బలులకు సుఖముగాఁ బక్షపాతమును కలిగించె నని భావము. చంద్రిక కుత్సవమును గలిగించె నని స్వభావాభిప్రాయము.

ఆమోదము=పరిమళమును, సంతోషమును; ఉంచెన్=కలిగించెను; అధరసుమాసవమున కామోదము కలిగించె నని భావము; చంద్రికకు సంతోషమును కలిగించె నని స్వభావాభిప్రాయము.

పద్మోదయంబు=కమలములయొక్క యావిర్భావమును, కాంతియొక్క యతిశయమును; ఒసఁగెన్=ఇచ్చెను. చంద్రికా శరీరమునందుఁ బద్మోదయము నిచ్చె ననఁగా, చంద్రికమేని కధికకాంతి కలుగునట్లు గావించె నని స్వభావాభిప్రాయము.

సుచంద్రుఁడు సుకుమారాంగియగుచంద్రికకు శ్రమయని తోఁపనీయక, చతురుండు కావునఁ రతులఁ జొక్కించె నని భావము.

తే. అతనుశాస్త్రవిభేదంబు ◊నాదిఁ గాంచి
యంత నద్వయభావనా◊యత్తవృత్తి
నలరి తత్ప్రియసాయుజ్య ◊మంది పొందె
నసదృశానందమయత న◊బ్జాక్షి యపుడు. 135

టీక:అతనుశాస్త్రవిభేదంబు – అతను=మరునియొక్క, శాస్త్ర=శస్త్రసంఘమువలన, విభేదంబు=భేదమును; ఆదిన్=మొదట;

కాంచి=చూచి; అతను=అధికమగు, శాస్త్రవిభేదంబు=శాస్త్రములయొక్క సర్వభేదప్రకారము నని యర్థాంతరము దోఁచుచు న్నది; అంతన్=ఆపిమ్మట; అద్వయభావనాయత్తవృత్తిన్ – అద్వయభావనా=అభేదభావనయందు, ఆయత్త=స్వాధీన మగు, వృత్తిన్ = వ్యాపారముచేత; అలరి = సంతసించి; తత్ప్రియసాయుజ్యము – తత్ప్రియ = ఆప్రియుఁడగు సుచంద్రునియొక్క, సాయుజ్యము=సాంగత్యమును; అంది=పొంది; తత్ప్రియ= ఆయద్వితీయబ్రహ్మయొక్క, సాయుజ్యము= ఐక్యమును, అంది=పొంది, యని యర్థాంతరము; ఇచట 'అస్తి భాతి ప్రియం రూపం నామ చేత్యంశపఞ్చకమ్, ఆద్యత్రయం బ్రహ్మరూపం మాయారూప మతోద్వయమ్' అనెడి వార్తికముచేత ప్రియశబ్దవాచ్యము పరబ్రహ్మము; అపుడు=ఆసమయమందు; అబ్జాక్షి= చంద్రిక; అసదృశానందమయతన్ – అసదృశ=సరిలేని, ఆనందమయతన్=సంతోషప్రాచుర్యమును; పొందెన్=పొందెను.

అనఁగ నాచంద్రిక మొదట మదనబాణప్రహారములను పొంది, పిదప నభేదభావనాయత్తవృత్తిచే నాశ్రయించి, పిమ్మట ప్రియసాయుజ్యము నొంది బ్రహ్మనందతుల్యమగు నానందమును పొందె నని భావము. అర్థాంతరమునకు భావము స్పష్టము.

చ. తొలుత దృశావిలాసములు, ◊తోరపుటాననవిభ్రమంబు ల
వ్వల, నటుమీఁద నావయవ◊వైఖరులుం గనుపట్ట నాన యన్
బలుతెర నారతిస్మరులు ◊పట్టి సడల్పఁ, గ్రమంబున న్వధూ
తిలకము రాజమౌళికి మ◊ది న్ముద మూనిచె నర్తకీగతిన్. 136

టీక: తొలుతన్=మొదట; దృశావిలాసములు=దృగ్విలాసములు; అవ్వలన్=ఆమీఁద; తోరపుటాననవిభ్రమంబులు=అధిక మగు ముఖవిలాసములును; అటుమీఁదన్=అటుపైని; ఆవయవవైఖరులున్=అవయవసంబంధిరీతులును, అంగాభినయము లని యర్థాంతరము; కనుపట్టన్=చూపట్టుచుండఁగ; నాన అన్=సిగ్గనెడు; బలుతెరన్=అధికమగు కాండపటమును; ఆ రతి స్మరులు = ఆరతిమన్మథులు; పట్టి సడల్పన్=పట్టి విడువఁగ; క్రమంబునన్=క్రమముగ; వధూతిలకము=చంద్రిక; రాజమౌళి కిన్=సుచంద్రునకు; నర్తకీగతిన్=నటివలె; మదిన్=మనమందు; ముదము=సంతసమును; ఊనిచెన్=ఒనరించెను.

క. కంతుకలాపారగ మగు, స్వాంతమునం దిటులు రాగ◊వల్లిక మెఱయన్
గాంతుఁడు కాంతామౌళికి, నెంతయు సంతసము నూన్చె ◊హితనవరతులన్. 137

టీక: కంతుకలాపారగము – కంతుకలా=మన్మథవిద్యయొక్క, పారగము=అంతము నొందినది; అగు స్వాంతమునందున్ =అగునట్టి మనమునందు; ఇటులు=ఈప్రకారముగ; రాగవల్లిక=అనురాగ మను తీవ; మెఱయన్=ప్రకాశింపఁగ; కాంతుఁడు =సుచంద్రుఁడు; కాంతామౌళికి=స్త్రీరత్న మగు చంద్రికకు; ఎంతయున్=మిక్కిలి; హితనవరతులన్=హితమగు నూతన సుర తములచే; సంతసమున్=కుతూహలమును; ఊన్చెన్=చేసెను.

సీ. మంజులాహీనహ◊ర్మ్యప్రదేశంబున, శుచిగరుత్మల్లీలఁ ◊జూచికొనుచుఁ,
గలధౌతమయశైల◊కందరాస్థలుల మ,హానందిహరిలీల ◊లరసికొనుచు,
సుమనోనివాసభా◊సురనగాగ్రములందు, దివ్యసారంగాభ ◊దెలిసికొనుచుఁ,
బుష్కరవీథులఁ ◊బొలుపొందు నేకచ,క్రరథవిస్ఫూర్తిని ◊గాంచికొనుచుఁ,

తే. గమల దైత్యారి శర్వాణి ◊కమలవైరి,ధారి పౌలోమి యుర్వరా◊ధరవిదారి
ఛాయ హరి యన నలరిరి ◊సకలకాల,సముచితాఖేలనంబుల ◊సతియుఁ బతియు. 138

టీక: మంజులాహీనహర్మ్యప్రదేశంబునన్– మంజుల=మనోజ్ఞమగు, అహీన=శేషుఁడనెడి, హర్మ్యప్రదేశంబునన్=మేడ యొక్క ప్రదేశమునందు; శుచిగరుత్మల్లీలన్ – శుచి=పరిశుద్ధమగు, గరుత్మత్=గరుడునియొక్క, లీలన్=విలాసమును; మంజుల=మనోజ్ఞమగు, అహీన=అధికమగు, హర్మ్యప్రదేశంబునన్=మేడయొక్క ప్రదేశమునందు,శుచి=శుభ్రమగు, గరుత్మత్=కపోతాదిపక్షులయొక్క, లీల నని ప్రకృతార్థము; చూచికొనుచున్=అవలోకించుచు;
కలధౌతమయశైలకందరాస్థలులన్ – కలధౌతమయశైల=కైలాసముయొక్క,'కలధౌతం రూప్య హేమ్నోః' అని యమరుఁడు, కందరాస్థలులన్=గుహలయందు; మహానందిహరిలీలలు –మహానంది=అధికమగు వృషభమనెడి, హరి= ఆశ్వముయొక్క, లీలలు=చేష్టలను; అరసికొనుచున్=విచారించుకొనుచు; కలధౌతమయశైల=బంగరుకొండయొక్క, కందరాస్థలులన్= గుహలయందు, మహానందిహరిలీలలు=మిగులనానందము గల చిలుకలయొక్క విలాసము లని ప్రకృతార్థము;
సుమనోనివాసభాసురనగాగ్రములందున్ = దేవతాస్థానమగు ప్రకాశమానమగు మేరువుయొక్క అగ్రములందు; దివ్యసారంగాభ– దివ్యసారంగ=ఐరావతముయొక్క, ఆభ=కాంతిని; తెలిసికొనుచున్=తెలియుచు; పుష్పములకు నివాసమై, భాసురమైన, పర్వతాగ్రములందు, మనోహరమగు, సారంగాభన్=తుమ్మెదకాంతిని, తెలిసికొనుచు నని ప్రకృతార్థము.
పుష్కరవీథులన్=ఆకాశమార్గములయందు; పొలుపొందు ఏకచక్రరథవిస్ఫూర్తిని– పొలుపొందు=ఒప్పుచున్న, ఏకచక్రరథ =ఒంటికంటి రథముయొక్క, విస్ఫూర్తిని=ప్రకాశమును; కాంచికొనుచున్=చూచుచు; పుష్కరవీథులన్= జలమార్గములయందు; పొలుపొందు ఏకచక్రరథవిస్ఫూర్తిని– పొలుపొందు=ఒప్పుచున్న, ఏక=ముఖ్యమగు, చక్ర=జక్కవలయొక్క,రథ =శరీరములయొక్క, విస్ఫూర్తిని=ప్రకాశమును; కాంచికొనుచున్=చూచుచు, అని ప్రకృతార్థము;
కమలదైత్యారి =లక్ష్మీనారాయణుఁడు; శర్వాణికమలవైరిధారి=రుద్రాణీరుద్రుఁడు; పౌలోమి ఉర్వరాధరవిదారి=ఇంద్రాణీ ఇంద్రుఁడు; ఛాయ హరి=ఛాయాదేవి సూర్యుఁడు; అనన్=అనునటులు; సతియున్ పతియున్=చంద్రికయు సుచంద్రుఁడును; సకలకాలసముచితాఖేలనంబులన్ – సకలకాల=సమస్తకాలములకు, సముచిత=అనుకూలమగు, ఆఖేలనంబులన్=విహారములచేత; అలరిరి=సంతసించిరి.
అనఁగ నీచంద్రికాసుచంద్రులు లక్ష్మీనారాయణులో యనునట్లు అహీనహర్మ్యప్రదేశములయందు గరుత్మల్లీల నవలోకించుచు, రుద్రాణీరుద్రులో యనునట్లు కలధౌతశైలకందరములయందు మహానందిహరిలీలలు చూచుచు, ఇంద్రాణీంద్రులో యనునట్లు సుమనోనివాసభాసురనగాగ్రములయందు సారంగాభలఁ దెలిసికొనుచు, ఛాయాదేవీసూర్యులో యనునట్లు పుష్కరవీథులయందు ఏకచక్రరథవిస్ఫూర్తిని గాంచికొనుచు, సర్వకాలముల కనుకూలములగు విహారములచే సంతసించి రని భావము.

సీ. ఆధరాధిపు యశో◊హరి జగత్తటి వ్రాల, నుడిగె ఘనఘనా◊భ్యుదయలీల,
లామహీభృతుధామ◊ధామనిధిస్ఫూర్తి, ధరఁ దూలె శార్వర◊పరవిభూతి,
యారాజువితరణ◊భూరిభూరిజలాళిఁ, జనె దుర్గదుర్గతి◊శాదపటిమ,
మారసాపతితర◊వారివారిదరేఖ, నడఁగె శాత్రవహంస◊హంసపాళి,

తే. యాసుచంద్రుఁడు ధర్మంబు ◊నాశ్రయించి, నీతి దయివాఱఁ గాంచి య◊నీతి నొంచి
యరిది జగమెల్లఁ బాలించు ◊నపుడు సకల, జనులు శుభసమ్మదస్ఫూర్తి ◊మనిరి వేడ్కఁ. 139

టీక: ఆధరాధిపు యశోహరి = ఆసుచంద్రునియొక్క యశస్సనెడు సింగము; జగత్తటిన్=జగమను కొండచఱియందు; వ్రాలన్=పడఁగ; ఘనఘనాభ్యుదయలీల– ఘనాఘన=ఘాతుకులను మత్తగజములయొక్క, 'ఘనాఘనౌ ఘాతుక మత్త దన్తినౌ' అని విశ్వము, అభ్యుదయ=అభివృద్ధియొక్క, లీలలు=విలాసములు; ఉడిగెన్=ఉపశమించెను; సుచంద్రునియొక్క యశము జగత్తును గప్పుకొనఁగ దుర్మార్గులు నశించి రని భావము.

ఆమహీభృతుధామధామనిధిస్ఫూర్తిన్– ఆమహీభృతు=ఆసుచంద్రునియొక్క, ధామ=ప్రతాపమనెడు, ధామనిధి=సూర్యుని యొక్క, స్ఫూర్తిన్=ప్రకాశముచేత;ధరన్=పుడమియందు; శార్వరపరవిభూతి– శార్వర=అంధతమస మనెడు ఘాతుకుల యొక్క, పర=ఉత్కృష్టమగు, విభూతి=సంపద; తూలెన్=పడెను. 'శార్వరం త్వంధతమసి ఘాతుకేతు పుమానయం' అని హలాయుధుఁడు. సుచంద్రుని ప్రతాపమనెడు రవిప్రకాశముచేత దుష్టులను చీఁకటులు దూలె నని భావము.

ఆరాజు వితరణ భూరి భూరి జలాళిన్– ఆరాజు=ఆసుచంద్రునియొక్క, వితరణ=త్యాగముయొక్క, భూరి=అధికమగు, భూరి=సువర్ణమనెడు, జల =ఉదకముయొక్క, ఆళిన్=శ్రేణిచేత; దుర్గ దుర్గతి శాద పటిమ ము– దుర్గ=పోనలవిగాని, దుర్గతి = దారిద్ర్య మనెడు, శాద=బురదయొక్క, 'పంకోస్త్రీ శాద కర్దమౌ' అని యమరుఁడు, పటిమము=సామర్థ్యము;చనెన్=పోయెను. ఆసుచంద్రుని త్యాగసంబంధియగు సువర్ణమనెడు జలముచేత దారిద్ర్య మనెడు బురద నివర్తిల్లె నని భావము.

ఆరసాపతి తరవారి వారిద రేఖన్– ఆరసాపతి=ఆసుచంద్రునియొక్క, తరవారి=కత్తియనెడు, వారిదరేఖన్=మేఘపంక్తిచేత; శాత్రవహంస హంసపాళి–శాత్రవహంస=శత్రుశ్రేష్ఠులనెడు, హంసపాళి=అంచలగుంపు; అడఁగెన్=ఉపశమించెను. సుచంద్రుని యొక్క కత్తి యనెడు మేఘపంక్తిచే శత్రులను హంస లడంగె నని భావము.

ఆసుచంద్రుఁడు; ధర్మంబున్=ధర్మమును; ఆశ్రయించి=పొంది; నీతి=రాజనీతిమొదలగు నీతి; దయివాఱన్=అతిశయించు నటులు; కాంచి=పొంది; అనీతిన్=దుర్నీతిని; నొంచి=పోఁగొట్టి; అరిది=చిత్రముగ; జగ మెల్లన్=లోకమంతయు; పాలించు నపుడు=రక్షించునపుడు; సకలజనులు=సమస్తనరులు; శుభసమ్మదస్ఫూర్తిన్=మంగళప్రయుక్తమగు సంతోషాతిశయము చేత; వేడ్కన్=వేడుకచేత; మనిరి=వర్తించిరి.

సుచంద్రుఁడు ధర్మనిష్ఠుఁడై నీతితో జగంబును పాలించుచుండఁగ శుభసంతోషములతో నెల్లపుడు జనులు వర్తించిరని భావము.

క. అని రోమహర్షణాత్మజుఁ, డనఘ మఖండైకచరిత ◊మంతయుఁ దెలుపన్
విని శౌనకాదిమునిచం ,ద్రనికాయము గాంచె నధిక◊తరహర్షంబున్. 140

టీక: అని=పూర్వోక్తప్రకారముగాను; రోమహర్షణాత్మజుఁడు=సూతుఁడు; అనఘము=పాపరహితమై, అఖండైకచరితము– అఖండ=విచ్ఛిత్తిలేనట్టి, ఏక=ముఖ్యమగు, చరితము=సుచంద్రచరితమును; అంతయున్=పూర్ణముగ; తెలుపన్=తెలియఁ జేయఁగ; శౌనకాదిమునిచంద్రనికాయము=శౌనకాదిమునిశ్రేష్ఠులయొక్క సమూహము; విని=విన్నదై; అధికతరహర్షంబున్ =అధికమగు సంతోషమును; కాంచెన్=పొందెను.

అనఁగ సూతుండు శౌనకాదిమునుల కెల్ల సుచంద్రచరితంబు వివరింపఁగ నామునులు విని మిక్కిలి సంతసించి రని భావము.

ఆశ్వాసాంతపద్యములు

మ. పరవిద్రావణ! రావణప్రబలహృ◊త్పత్త్రీశ! పత్త్రీశభా
స్వరయానక్రమ! నక్రమర్దనవిధా◊సచ్చక్ర! సచ్చక్రసం
భరణశ్రీధర! శ్రీధరప్రభుమహా◊పర్యంక! పర్యంకదు
స్తరసాశ్వాదన! వాదనప్రమదవ◊త్సత్యాత్మ! సత్యాత్మకా! 141

టీక: పరవిద్రావణ=శత్రువులను పాఱఁదోలెడివాఁడా! రావణప్రబలహృత్పత్త్రీశ– రావణ=రావణాసురునియొక్క, ప్రబల=సామర్థ్యమును, హృత్=హరించిన, పత్త్రీశ=బాణశ్రేష్ఠములుగలవాఁడా! పత్త్రీశభాస్వరయానక్రమ– పత్త్రీశ=గరుత్మంతుఁడను, భాస్వర=ప్రకాశించుచున్న, యాన=వాహనముచేత, క్రమ=సంచారముగలవాఁడా! నక్రమర్దనవిధాసచ్చక్ర– నక్ర=మొసలియొక్క, మర్దనవిధా=ఖండనవిధియందు, సత్=శ్రేష్ఠమగు, చక్ర=సుదర్శనమను చక్రము గలవాఁడా! సచ్చక్రసంభరణ శ్రీధర– సచ్చక్ర=సత్పురుషసంఘముయొక్క, సంభరణ=పోషించుటయొక్క, శ్రీ=సిరిని, ధర=ధరించినవాఁడా! శ్రీధరప్రభుమహాపర్యంక– శ్రీధరప్రభు=శేషుఁడె, మహాపర్యంక=గొప్పశయ్యగాఁ గలవాఁడా! పర్యంకదుస్తరసాశ్వాదన– పర్యంక=యుద్ధమందు, దుస్తర=దుస్తరుఁడగు, సాళ్వ=సాళ్వరాజునకు, అదన=అంతకుఁడగువాఁడా! వాదనప్రమదవత్సత్యాత్మ – వాదన=వచనముచేతఁ గలిగిన, ప్రమదవత్=సంతసముగల, సత్యాత్మ=సత్యభామయొక్కహృదయముగల వాఁడా! సత్యాత్మకా=సత్యస్వరూపుఁడా!

క. గణనాతిగాప్తరక్షణ!
క్షణదాంబుజినీకళత్ర◊సారసవైరీ
క్షణ! వృజినకూటతక్షణ!
క్షణఖండితనిర్జరారి◊ఘనసైన్యగణా! 142

టీక: గణనాతిగాప్తరక్షణ– గణనాతిగ=లెక్కకుమీఱిన, ఆప్త=ఇష్టులను, భక్తుల ననుట, రక్షణ=రక్షించువాఁడా! క్షణదాంబుజినీకళత్రసారసవైరీక్షణ– క్షణద=ఉత్సవము నిచ్చెడి, అంబుజినీకళత్ర=సూర్యుఁడు, సారసవైరి=చంద్రుఁడు, ఈక్షణ=నేత్రములుగాఁ గలవాఁడా! వృజినకూటతక్షణ– వృజినకూట=పాపసమూహములను, తక్షణ=ఖండించువాఁడా! క్షణఖండితనిర్జరారిఘనసైన్యగణా– క్షణ=క్షణమాత్రమందు, ఖండిత=నఱకఁబడిన, నిర్జరారి=రాక్షసులయొక్క, ఘన=అధికమగు, సైన్యగణా=సైన్యవ్యూహముగలవాఁడా!

మాలిని: శకటదనుజభీమా! ◊క్షాళితాఘౌఘనామా!
వికటబకవిరామా! ◊విశ్వసంపూర్ణధామా!
స్వకపరినుతసోమా! ◊శక్రకోటీరధామా!
వికలచరణసీమా! ◊విద్విషద్ధ్వాంతభామా! 143

టీక: శకటదనుజభీమా=శకటాసురునకు భయంకరుఁడగువాఁడా! క్షాళితాఘౌఘనామా– క్షాళిత=పోఁగొట్టఁబడిన, అఘౌఘ= పాపసంఘములుగల, నామా=పేరుగలవాఁడా! వికటబకవిరామా– వికట=దుష్టుఁడగు, బక=బకాసురుని, విరామా=అంతమునొందించినవాఁడా! విశ్వసంపూర్ణధామా– విశ్వ=ప్రపంచమునందు, సంపూర్ణ=నిండిన, ధామా= తేజస్సుగలవాఁడా! స్వకపరినుతసోమా– స్వక=తనచేత, పరినుత=స్తుతింపఁబడిన, సోమా=శంకరుఁడు గలవాడా, లేదా తన్ను స్తుతించిన శంకరుఁడు గలవాఁడా! శక్రకోటీర ధామావికల చరణసీమా– శక్ర=ఇంద్రునియొక్క, కోటీర=కిరీటము యొక్క, ధామా=కాంతిచేత, అవికల=ఎడఁబాయని, చరణసీమా=పాదప్రదేశము గలవాఁడా! విద్విష ద్ధ్వాంత భామా– విద్విషత్=శత్రువు లనెడు, ధ్వాంత=చీఁకటులకు, భామా=సూర్యునివంటివాఁడా!

గద్యము: ఇది శ్రీమదనగోపాలప్రసాదసమాసాదితోభయభాషాకవిత్వకళాకళత్ర రేచర్లగోత్రపవిత్ర
సురభిమల్లక్షమాపాలసత్పుత్ర కవిజనవిధేయ మాధవరాయప్రణీతం బైన
చంద్రికాపరిణయంబను మహాప్రబంధంబునందు
సర్వంబును షష్ఠాశ్వాసము.

గద్యము. ఇది శ్రీసతీరమణకరుణాసమాసాదితసర్వసౌభాగ్యభాగ్యనగరమహారాజ్యసంకలిత శ్రీజటప్రోలుసంస్థాన
ప్రాజ్యసకలసామ్రాజ్య శ్రీ రేచర్లగోత్రపవిత్ర కవిజనగేయ శ్రీవేంకటజగన్నాథరాయసత్పుత్ర
సత్సంప్రదాయ శ్రీసురభి వేంకటలక్ష్మణరాయ పరిపోష్య సరసవైదుష్య
తదాస్థానతలమండిత శేషసదాశివపండిత విరచిత
శరదాగమసమాఖ్యవ్యాఖ్యయందు
సర్వంబును షష్ఠాశ్వాసము.